కోట్లాది ప్రజలు ఎదురుచూసిన అంతిమ దైవసందేశహరుని
సమగ్ర జీవితచరిత్ర (The Ideal Life Of Muhammad-P)

# మహనీయ ముహమ్మద్(స)

# ఆదర్శ జీవితం

సంకలనం
అబుల్ ఇర్ఫాన్

ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, ఫ్లాట్ నెం.106,
సహారాకాంప్లెక్స్, పత్తర్‌గట్టి, హైదరాబాద్-2,
✆ 040-66710795, 91-9441515414

వెల.......................................................................రూ. 240/-లు



Name of the Title: Mahaneeya Muhammad Adarsya Jeevitham
Telugu
(Ideal life of Muhammad(P) The great)

Translation and Compilation: **ABUL IRFAN**

All Rights Reserved with: Islamic Resource Centre

First Edition: January, 2004
Second Edition April, 2005
Third Edition Febrauary, 2008
Fourth Revised Edition October, 2011

Copies: 1000

Price: Rs. 240/-

Published by: Islamic Resource Centre
Sahara Complex-106, Pathargatti,
Hyderabad-2, Ph: 9441515414

Type set by: Alifain, I.R.C. Graphics
Sahara Complex-106, Pathargatti,
Hyderabad-2, Ph: 040-66710795

Printed at : H.S. Offset Printers
714, Chandni Mahal, Daryaganj
New Delhi-2, Ph: 011-23244240

**IRC ప్రచురణల ప్రత్యేకత**

1) తేట తెలుగులో భావ స్పష్టీకరణ
2) సులభ శైలిలో సాహిత్య మాధుర్యం
3) సంక్షిప్త వాక్యాల్లో సమగ్ర సమాచారం
4) 12 గ్రంథాల్లోనే ఇస్లాం పూర్తిస్వరూపం

**కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం**

# తొలిపలుకులు

అంతిమ దైవగ్రంథమైన ఖుర్ఆన్‌ని పూర్తిగా అర్థం చేసుకోవడానికి ముహమ్మద్ ప్రవక్త (స) జీవితచరిత్రను గురించి కూడా తెలుసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. కారణం దివ్యఖుర్ఆన్ ఆ మహనీయుని హృదయఫలకంపై అవతరించడమే.

ఖుర్ఆన్ అవతరణకు పూర్వం (నలభై ఏళ్ళ వయస్సు వచ్చేవరకు) దైవగ్రంథం అంటే ఏమిటో, 'విశ్వాసం' (Faith) అంటే ఏమిటో ఆయనకు ఏమాత్రమూ తెలియదు. పైగా హిరా గుహలో దైవదూత జిబ్రీల్ (అలైహి) ప్రత్యక్షమయి మొట్టమొదటి దైవసందేశం అందజేసే వరకు, తాను సృష్టికర్త చేత దైవప్రవక్తగా నియమించబడతానన్న ఆశ కూడా ఆయన హృదయంలో జనించలేదు. ఈ విషయాలను ఖుర్ఆన్ కూడా వెల్లడిస్తోంది.

అంతేకాదు, ఆయన చదవడం, వ్రాయడం రాని నిరక్షరాసి కూడా. ఇహలోకం వీడిపోయేదాకా ఆయన నిరక్షరాసిగానే ఉన్నారు. అలాంటి వ్యక్తి నోట మహా మహా కవులు, సాహిత్యవేత్తలు సయితం విస్తుబోయేలా అసాధారణ శైలిలో హఠాత్తుగా దైవవాణి వెలువడ నారంభించిందంటే ఆయన దైవదౌత్యాని (Prophethood)కి అంతకంటే గొప్ప నిదర్శనం మరొకటి ఉండదు.

ముహమ్మద్ మహనీయుని (సల్లం) దైవదౌత్యానికి ఖుర్ఆన్ శైలి ఒక ప్రబల నిదర్శనం అయితే, కారుచీకటిలో కాంతిరేఖలాంటి ఆయన సుగుణసంపత్తి, సంప్రదాయాలు మరొక ప్రబల నిదర్శనంగా పేర్కొనవచ్చు. అనేక చెడుగులలో కూరుకుపోయిన ఆనాటి అరబ్బు సమాజంలో ఆయన సత్యసంధుడు (సాదిఖ్)గా, నిజాయితీపరుడు (అమీన్)గా వేనోళ్ళ కీర్తించబడ్డారు. వేరొకవైపు ముహమ్మద్ (సల్లం) జీవనశైలిని, నడవడిని గమనించిన అనేకమంది పండితులు, ధర్మవేత్తలు, రుషులు, మహాపురుషులు ఆయన అంతిమ దైవప్రవక్తగా ప్రభవించ నున్నారని భవిష్యత్ ప్రకటనలు కూడా చేశారు.

అలాంటి మహామనీషి జీవిత విశేషాలను వీలైనంత సమగ్రంగా తెలియజేయడానికి జరిగిన ప్రయత్నమే మీ ముందున్న ఈ గ్రంథం.

ముహమ్మద్ (సల్లం) జీవిత విశేషాలు, సంప్రదాయాలు, ప్రవచనాలను హదీసులు అంటారు. ఆ మహనీయుని జీవితకాలంలోనే ఈ హదీసులను ఆయన సహాబీలు (ప్రత్యక్ష సహచరులు) కంఠస్థం చేసి లేదా వ్రాసుకొని భద్రపరిచారు. వాటిని ఈ సహాబీలు తమ తరువాయి తరాలకు అందజేశారు. ఆ తరువాత వచ్చిన హదీసు గ్రంథకర్తలు వారి నుండి ఈ హదీసులను సేకరించి వివిధ శీర్షికల క్రింద క్రోడీకరించి గ్రంథాల రూపంలో భద్రపరిచారు. అంతేకాదు, హదీసు గ్రంథకర్తలు తాము ఎవరెవరి నుండి హదీసులను సేకరించారో వారి గుణగణాలను, జీవిత విశేషాలను కూడా గ్రంథస్తం చేశారు. ఇలాంటి గ్రంథాలన్నీ వందల సంఖ్యలో ఉన్నాయి.



ఆ తరువాత ప్రత్యేకంగా ప్రవక్త జీవిత చరిత్రను వివరంగా రాయడానికి పూనుకున్న సీరత్ గ్రంథకర్తలు హదీసుగ్రంథాల నుండి, చరిత్రగ్రంథాల నుండి విషయాలను సేకరించి సమగ్రమైన సీరత్ గ్రంథాలు రాశారు. ఇవన్నీ అరబీ భాషలో ఉన్నాయి. వారి తరువాత వచ్చిన వారు వాటిని ఫార్సీ, ఉర్దూ, ఆంగ్లం తదితర భాషలలో అనువదించారు.

నేను వివిధ ఉర్దూగ్రంథాల నుండి విషయాలను సేకరించి సామాన్య పాఠకుల సౌకర్యం కోసం నవలా రూపంలో ఈగ్రంథాన్ని సంకలనం చేశాను. దీనికి పూర్వం ప్రవక్త జీవిత చరిత్రకు సంబంధించిన తొలి ఘట్టాన్ని "శుభోదయం" పేరుతో ఓ చిరు పుస్తకంలో రాసి వెలువరించిన సంగతి తెలిసిందే. దైవానుగ్రహం వల్ల ఇప్పుడా ఘట్టంతో పాటు సంపూర్ణ జీవిత చరిత్రను వెలువరించే మహాభాగ్యం లభించింది.

ఈ గ్రంథంలో భాషా శైలి, వాడి, వురవడి అన్నీ 'శుభోదయం' పుస్తకంలోని వంటివే. అందువల్ల 'శుభోదయం' పుస్తకం చదివి ఆదరించిన పాఠకులు ఈ గ్రంథాన్ని కూడా చదివి ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

## రచనకు ఆధారాలు

1) ఆఫ్తాబె ఆలం............................మౌలానా ముహమ్మద్ సాదిఖ్ హుసైన్ సిద్దీఖీ

2) దుర్రె యతీం..............................మౌలానా మాహిరుల్ ఖాద్రి

3) ముహమ్మదె అరబ్బి..................మౌలానా ఇనాయతుల్లా సుభాని

4) జల్వయే ఫారాన్.......................మౌలానా ఇనాయతుల్లా సుభాని.

5) తారీఖె ఇస్లాం...........................మౌలానా అక్బర్ షాహ్ ఖాన్ నజీబాబాది

6) హయాతె సర్వరె కాయెనాత్......అబూబకర్ సిరాజుద్దీన్ (మార్టిన్ లింగ్స్)

7) హజ్రత్ ముహమ్మద్.................మౌలానా అలి అజ్గర్ చౌధరీ

8) నబియ్యె రహ్మత్.......................మౌలానా సయ్యిద్ అబుల్ హసన్ అలి నద్వి.

9)సయ్యదె ఇన్సానియత్...............మౌలానా నయీమ్ సిద్దీఖీ.

భవదీయుడు
**అబుల్ ఇర్ఫాన్**
అనువాదకుడు

*కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం*

# మహనీయ ముహమ్మద్(స) ఆదర్శజీవితం

**పండువెన్నెల**లో ఇసుకతిన్నెలు వెండికొండల్లా మెరిసిపోతున్నాయి. ధవళ వస్త్రం కప్పుకున్న ధరిత్రిమాత పూర్ణచంద్రుడితో పోటీపడుతూ ధగధగలాడి పోతోంది.

ఎటుచూసినా ఇసుకమయం. సర్వత్రా శ్వేతమయం. కనుచూపు మేరలో ఒక చెట్టయినా కానరాని ఆ మహా ఇసుక సముద్రంలో ఎడారిఓడలు ఒకదాని వెనుక మరొకటి వ్యాపార సామగ్రితో భారంగా నడుస్తున్నాయి.

ప్రకృతి శోభాయమానంగా ఉంది. అప్పుడప్పుడు చల్లటి పిల్ల తెమ్మెరలు వీస్తూ హృదయాన్ని ఉల్లాస పరుస్తున్నాయి.

నింగిలో చలువరేడు మేఘమాలికల మధ్య దాగుడు మూతలాడుతుంటే, నేలపై పడుతున్న వెలుగునీడల జిలుగువెలుగుల్లో వర్తక బిడారాలు హుషారుగా ముందుకు సాగుతున్నాయి. ఒంటెల మెడలకు కట్టిన గంటలు లయబద్ధంగా మోగుతుంటే, వాటి మీద కూర్చున్న వణిజులు నిద్రనిరోధానికి విఫల యత్నం చేస్తూ జోగుతున్నారు.

చీకటి తెరలు మెలమెల్లగా విడిపోతున్నాయి. తారలు క్రమక్రమంగా కనుమరుగయి పోతున్నాయి. సుధాకరుడు సంయమనం కోల్పోయి పడమటి కొండల వెనక్కి పారి పోతున్నాడు. చూస్తుండగానే తూర్పుదిక్కు నభోమండలం అరుణ కాంతులీనడం మొద లెట్టింది. ఆ తరువాత కాస్సేపటికే దినకరుడు దేదీప్యమానంగా వెలిగిపోతూ అవని అంచుల నుండి బిరబిరా పాకుతూ పైకొచ్చాడు. దూరాన కొండలు, గుట్టలు, వాటి మధ్య అక్కడక్కడ పచ్చటి ఖర్జూరపు తోటలు అస్పష్టంగా కన్పించసాగాయి.

## మూలవిరాట్టు-(1)

“అదిగో! మదీనా వచ్చేసింది!!” అన్నాడు ముందు నడుస్తున్న ఒక వ్యక్తి.

సిరియా నుంచి వ్యాపార సరుకులతో తిరిగొస్తున్న ఈ వాణిజ్య బృందం మదీనా సమీపించి పట్నం వెలుపల విడిది చేసింది. వర్తకులు ఒంటెలపై కట్టిన వ్యాపార సామగ్రిని క్రిందికి దించి వాటిని విశ్రాంతి కోసం వదలిపెట్టారు. కొందరు ఒంటెలకు నీరు, మేత పెట్టడంలో, మరికొందరు భోజనం చేయడంలో నిమగ్నులయ్యారు. ఇంకొందరు బాగా అలసిపోయి ఉన్నారేమో చెట్ల కింద నడుం వాల్చారు.

కాబా ధర్మకర్త, ఖురైష్‌తెగ నాయకుడు హాషిం కూడా విశ్రాంతికోసం ఓచోట నడుం వాల్చాడు. ఈ వాణిజ్య బృందంలో ఎక్కువ మంది మక్కా పట్నానికి చెందినవారే ఉన్నారు. కొందరు మదీనావర్తకులు కూడా ఉన్నారు. సిరియానుంచి మక్కా వెళ్ళే దారిలోనే మదీనా ఉండటం వల్ల వర్తకులు ఒక్కోసారి మదీనాలో ఒకటి రెండు రోజులు విడిది చేస్తుంటారు.



సిరియా నుండి వ్యాపారబృందం తిరిగొచ్చిందని తెలియగానే అందమైన ఒక యువతి తన సేవకులతో కలసి అక్కడికి చేరుకుంది. రాగానే ఆమె తాను మదీనా నుంచి పంపిన వర్తకుల్ని కలసి “ఈ సంవత్సరం అమ్మకాలు ఎలా ఉన్నాయి, ఎంత లాభం వచ్చింది, సిరియాలో ఏఏ సామగ్రి కొన్నారు?” మొదలైన విషయాలు అడగడం ప్రారంభించింది.

ఆ యువతికి కొద్ది దూరంలో నిల్చున్న హాషిం చెవిన ఆమె మాటలు పడగానే అతని దృష్టి అప్రయత్నంగా అటువైపు మళ్ళింది. ఆమె రూపురేఖల్లో హుందాతనం ఉట్టిపడుతోంది. మాటల్లో అపార వ్యాపారానుభవం తొంగిచూస్తోంది. ఆమె ముఖ వర్చస్సులో సచ్ఛీలం తొణికిసలాడుతోంది.

కొన్ని క్షణాల్లోనే ఆమె వ్యక్తిత్వం హాషింని ఎంతగానో ఆకట్టుకుంది. అతనామెను సంభ్రమాశ్చర్యాలతో చూస్తూ “ఎవరీమె?” అని అడిగాడు తోటి వర్తకులతో.

“ఈమె ఖజ్రజ్ తెగలోని బనీ నజ్జార్ వంశానికి చెందిన స్త్రీ. పేరు సల్మా. ఈమె తండ్రి పేరు అమ్ర్” చెప్పారు సహవర్తకులు.

“ఈమెకు పెళ్ళయిందా?” అడిగాడు హాషిం మళ్ళీ.

“కాలేదు. మదీనాలో ఈమె గొప్పింటి బిడ్డ. ఎంతో ఆత్మాభిమానం, స్వతంత్ర భావాలు కల యువతి. తన ఆత్మాభిమానం, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు భంగం కలిగించని యువకు డెవరైనా లభిస్తే అలాంటి యువకుడ్ని చేసుకోవాలని భావిస్తోందీమె” అన్నారు వారు.

“అయితే నన్ను చేసుకోవడం ఇష్టమేమో అడిగి చూడండి” అన్నాడు హాషిం.

వర్తకులు వెళ్ళి ఈ సంగతి ఆమెకు తెలియజేశారు. హాషిం గురించి, అతని కుటుంబ గౌరవం గురించి సల్మా ఇదివరకే విని ఉండటం వల్ల వెంటనే తన అంగీకారం తెలిపింది.

మరునాడు పెద్దల సమక్షంలో హాషిం, సల్మాల పెళ్ళి నిరాడంబరంగా జరిగింది. ఆ తర్వాత హాషిం నూతన వధువుని తీసుకొని తోటి వర్తకులతో మక్కా తిరిగొచ్చాడు.

సల్మా, హాషింల దాంపత్య జీవితం సుఖంగా గడచిపోతోంది. ఎండలు క్రమంగా తీవ్రం కాసాగాయి. వేసవికాలం తిరిగి సమీపించడంతో మక్కాప్రజలలో వ్యాపార పర్యటన గురించిన ఆలోచనలు మొలయ్యాయి. వర్తకులు ఎగుమతి సరుకుల సమీకరణలో నిమగ్నులయి పోయారు. కొన్ని రోజుల్లోనే వర్తకబిడారాలు సిద్ధమయ్యాయి.

హాషిం కూడా వ్యాపారసామగ్రి తీసుకొని, తోటి వర్తకులతో కలసి సిరియా బయలు దేరాడు. ఈసారి అతను సల్మాను వెంటబెట్టుకొని ప్రయాణమయ్యాడు. మెట్టింటికి వచ్చిన తర్వాత సల్మా శరీరంలో అనిర్వచనీయమైన మార్పు వచ్చింది. పచ్చపచ్చగా కానరాసాగింది. అది గమనించిన హాషిం ఓరగా చూసినప్పుడల్లా ఆమె సిగ్గుతో కుంచించుకు పోతుండేది.

దారిలో మదీనా వచ్చింది. సల్మా సంతోషంతో పొంగిపోయింది. హాషిం పట్నంలో ప్రవేశించాడు. ఆమెను ఆమె పుట్టింటిలో దించి తిరిగి వెళ్ళిపోవడానికి ఉపక్రమించాడు. సల్మా అతని వైపు బాధగా చూసింది. హాషిం కూడా ఆమెవైపు బాధగా చూస్తూ బలవంతంగా ఓ చిరునవ్వు నవ్వాడు. ఆ తరువాత ఒంటె ఎక్కి చరచరా వెళ్ళి పోయాడు.

వాణిజ్య బృందం సిరియా చేరుకుంది. ఈయేడు పాలస్తీనాలోని గజ్జా పట్నం వారి వ్యాపారానికి కేంద్రమయ్యింది. వర్తకులు తమ తమ సరుకులు దించుకున్నారు. అమ్మకం, కొనుగోళ్ళు ప్రారంభమయ్యాయి.

అయితే హాషిం గజ్జా పట్నానికి వచ్చిన కొన్నాళ్ళకే జబ్బుపడ్డాడు. ఎన్నివిధాల చికిత్స చేసినా కోలుకోలేక పోయాడు. చివరికి ఈ లోకాన్నే శాశ్వతంగా వీడిపోయాడు.

## మదీనా నుండి మక్కాకు-(2)

అటు మదీనాలో సల్మా పండంటి పిల్లవాడ్ని కన్నది. ఆ పిల్లోడికి ఆమె పుట్టింటివారు 'షైబా' అని పేరు పెట్టారు. కాలం గడచిపోతోంది. సల్మా భర్త కోసం ఎదురుచూసి చూసి నిరాశ చెందింది. షైబా శుక్లపక్షం చంద్రుడిలా దినదిన ప్రవర్ధమానమవుతున్నాడు. క్రమంగా మాటల నుండి చేతలకు ఎదిగాడు.

మక్కాలో వాణిజ్య బృందం ద్వారా హాషిం చనిపోయిన సంగతి తెలిసిపోయింది. అప్పుడు అతని తమ్ముడు ముత్తలిబ్ ఖురైష్ తెగకు అగ్రనాయకుడయి, కాబా మందిరం నిర్వహణ బాధ్యతలు చేపట్టాడు. అయితే పదేళ్ళు గడచిన తరువాత హాషింకు కొడుకు పుట్టాడని, అతను మదీనాలో తల్లి దగ్గర పెరుగుతున్నాడని తెలుసుకొని ముత్తలిబ్ మదీనా బయలుదేరాడు.

ముత్తలిబ్ వదిన గారింటికి చేరుకొని షైబాను గుండెలకు హత్తుకున్నాడు. కుశల ప్రశ్నలైన తరువాత అసలు విషయానికి వచ్చాడు.

"వదినా! హాషిం అన్నయ్యలేని లోటు మక్కాలో కొట్టవచ్చినట్లు కన్పిస్తోంది. అందుకే నేనిప్పుడు షైబాను మక్కా తీసికెళ్దామని వచ్చాను. కుటుంబ గౌరవం, వంశ మర్యాదల రీత్యా మేము ఖురైష్ తెగలో అగ్రశ్రేణికి చెందిన వారమన్న సంగతి నీకు తెలుసు. షైబా మక్కాలో ఎంతో గౌరవప్రదంగా ఉంటాడు" అన్నాడు ముత్తలిబ్.

"కాని షైబాయే నాకిప్పుడు పంచప్రాణాలు. వీడ్ని వదలి నేను ఒక్కరోజు కూడా బ్రతకలేను. అలా అని నేను వీడ్ని వీడి పెద్దలకు, వంశమర్యాదలకు దూరంగా కూడా ఉంచాలనుకోవడం లేదు. కాని నా బాబును, నా చిట్టితండ్రిని నేనెలా పంపను?" అన్నది సల్మా పెల్లుబుకుతున్న మాతృమమకారంతో.

"వదీనా! విచారించకు. నేను మన షైబాను కన్నకొడుకులా చూసుకుంటాను. పెద్దవాడయ్యాక ఇతనికి కాబానిర్వహణ బాధ్యత ఇవ్వాలనుకుంటున్నాను" అన్నాడు ముత్తలిబ్.

"సరే, షైబాను అడిగి చూడు. వాడు వస్తానంటే నాకభ్యంతరం లేదు."

"బాబూ! విన్నావు కదా మీ అమ్మ చెప్పిన మాట. మరి నీ అభిప్రాయం ఏమిటీ?"

"మా అమ్మ అనుమతించనంత వరకు నేను మదీనా వదలి ఎక్కడికీ రాలేను" అన్నాడు షైబా అమ్మ వైపు చూస్తూ.



వినయవతుడయిన కొడుకుని చూసుకొని సల్మా ఎంతో మురిసిపోయింది. ఆమె షైబాకు మక్కా వెళ్ళిపోవడానికి అనుమతించింది. ముత్తలిబ్ మదీనాలో మూడు రోజులు ఉండి నాల్గవ రోజు షైబాను తీసుకొని మక్కా బయలుదేరాడు.

ఒంటె మీద ముత్తలిబ్ ముందు కూర్చున్నాడు. షైబా అతని వెనుక కూర్చున్నాడు. ఈవిధంగా వీరిద్దరు మక్కా చేరుకున్నారు. ఆ స్థితిలో వారిద్దరిని చూసిన ప్రజలు "ఈ అబ్బాయి ముత్తలిబ్ బానిసై ఉంటాడు. ఎక్కడ్నుంచో తీసుకొస్తున్నాడు" అని భావించారు.

భావించడమే కాదు, "అదిగో ముత్తలిబ్! ఎక్కడ్నుంచో బానిసను తెచ్చుకుంటున్నాడు, చూడండి. ముత్తలిబ్ బానిస (అబ్దుల్ ముత్తలిబ్)" అని చెప్పుకున్నారు కూడా.

ముత్తలిబ్ ఈ మాటలు విని "ఖురైషీయులారా! ఈ అబ్బాయి నా బానిస కాదు, ఇతను నా అన్న హాషిం కొడుకు. మదీనా నుండి పిలుచుకొస్తున్నాను" అన్నాడు వారి అపోహను దూరంచేస్తూ.

కాని జనంనోట అప్రయత్నంగా వెలువడిన ఈ కొత్తపేరే ఆ అబ్బాయికి స్థిరపడి అసలు పేరు మరుగునపడిపోయింది. అబ్దుల్ముత్తలిబ్ పేరుతోనే అతను పిలువబడనారంభించాడు.

అబ్దుల్ ముత్తలిబ్ (షైబా) ముత్తలిబ్ సంరక్షణలో ఏ లోటూ లేకుండా పెరగసాగాడు. పదేళ్ళు ఇట్టే గడచిపోయాయి. అయితే ముత్తలిబ్ వ్యాపార నిమిత్తం యమన్కు పోయి హఠాత్తుగా అనారోగ్యానికి గురయ్యాడు. దాంతో యమన్లో అంతిమశ్వాస వదిలాడు.

ముత్తలిబ్ చనిపోయిన తర్వాత అబ్దుల్ ముత్తలిబ్ ఖురైష్ తెగకు అగ్రనాయకుడయి కాబా నిర్వహణ బాధ్యత స్వీకరించాడు.

అబ్దుల్ ముత్తలిబ్ ఇంకా పాతికేండ్లయినా నిండని నవయువకుడు. అంతగా పేరు పలుకుబడులులేని పసివాడు. అందువల్ల అతని పెదనాన్న నౌఫల్ ఓరోజు అతని ఇంటి ప్రాంగణాన్ని బలవంతంగా ఆక్రమించాడు. అబ్దుల్ ముత్తలిబ్ కొందరు ఖురైష్ నాయకుల్ని కలుసుకొని, నౌఫల్కు వ్యతిరేకంగా తనకు సహాయం చేయవలసిందిగా అభ్యర్థించాడు. కాని ఖురైష్నాయకులు ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవడానికి వెనుకంజ వేశారు.

అప్పుడు అబ్దుల్ముత్తలిబ్ తన అసహాయ స్థితిని తెలుపుకుంటూ మదీనాలో ఉన్న తన మేనమామల దగ్గరికి కొన్ని కవితలు రాసి పంపాడు. ఈ కవితలు మేనమామలలో ఆగ్రహజ్వాలలు రేకెత్తించాయి. అబూసాద్ బిన్ అద్దీ అనే ఓ మేనమామ యాభైమంది అశ్వరూఢుల్ని తీసుకొని మక్కా పట్నానికి బయలుదేరాడు.

అతను మక్కా సమీపానికి చేరుకొని 'అబ్తహ్' అనే ప్రదేశంలో దిగాడు. సహాయం కోసం ఎదురుచూస్తున్న అబ్దుల్ముత్తలిబ్ సాయుధబలగంతో వచ్చిన మేనమామను చూసి సంతోషించాడు.

"మామయ్యా! ముందు మనం ఇంటికి వెళ్దాం పద. అక్కడ కాస్సేపు విశ్రాంతి తీసుకొని తరువాత కర్తవ్యాన్ని గురించి ఆలోచిద్దాం" అన్నాడు అబ్దుల్ ముత్తలిబ్.

"కాదు, దైవసాక్షిగా చెబుతున్నాను. నేను సరాసరి నౌఫల్ దగ్గరికెళ్ళి తాడో పేడో తేల్చుకునే దాకా మరేపనీ చేపట్టను" అన్నాడు అబూసాద్.

ఆ తర్వాత అతను అశ్వరూఢుల్ని తీసుకొని కాబాలయానికి చేరుకున్నాడు. అక్కడ నౌఫల్ ఖురైష్ పెద్దలతో కబుర్లాడుతూ కూర్చున్నాడు. అబూసాద్ అతని దగ్గరికెళ్ళి వరలో నుంచి కత్తి దూస్తూ "కాబా ప్రభువు సాక్షి! నీవు గనక నా మేనల్లుడి స్థలాన్ని తిరిగిచ్చి వేయకపోతే, ఈ ఖడ్గం నీ తలను ఎగరగొడ్తుంది" అన్నాడు.

నౌఫల్ పరిస్థితి గమనించి "ఆగు, నేనా స్థలాన్ని ఇప్పుడే ఇచ్చేస్తా" అన్నాడు కాస్తంత తొట్రు పడుతూ.

"ఖురైష్ పెద్దలారా! మీరే దీనికి సాక్షులు" అన్నాడు అబూసాద్.

ఆ తరువాత అతను మేనల్లుడి వెంట అతనింటికి వెళ్ళిపోయాడు. అబ్దుల్ ముత్తలిబ్ తన మేనమామకు కృతజ్ఞతలు చెప్పుకొని అతనికి, అతని సహచరులకు తన ఇంట మూడు రోజులు ఆతిథ్యమిచ్చాడు. నాల్గవరోజు ఉదయాన్నే అబూసాద్ తన సహచరుల్ని తీసుకొని తిరిగి మదీనాకు బయలుదేరి వెళ్ళాడు.

## జమ్‌జమ్ జలనిధి-(3)

అబ్దుల్ ముత్తలిబ్ కాబా నిర్వహణ బాధ్యత చేపట్టగానే మొదట కాబా యాత్రికుల సమస్యల్ని గురించి ఆలోచించాడు. వాటిలో అతనికి మంచినీటి కొరత పెద్ద సమస్యగా గోచరించింది.

మక్కా ప్రజలకు పట్నం వెలుపల శివార్లలో ఉన్న కొన్ని బావుల్లో నుంచి మాత్రమే కొంత నీరు లభిస్తున్నది. అంతదూరం నుంచి పట్నంలోకి యాత్రికుల కోసం నీరు మోసుకు రావడం కూడా పెద్ద సమస్యగానే ఉంది.

ఈ సమస్యే అబ్దుల్ ముత్తలిబ్‌ని నిరంతరం బాధిస్తూ ఉంది. జమ్‌జమ్ బావినీరు ఎంతో మధురంగా ఉంటుంది. ఎంత తోడినా తరగని అపార జలనిధి. అదీగాక నీరు ఎంతో పైకి ఉండేది. సులభంగా తోడుకోవచ్చు. అలాంటి బావి కనపడకుండా పోయింది. దాన్ని ఎవరు పూడ్చి నాశనం చేశారో!

అబ్దుల్‌ముత్తలిబ్ ఓరోజు ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ జమ్‌జమ్ బావిని ఎవరు పూడ్చారు? ఎందుకు పూడ్చవలసి వచ్చింది?" అనడిగాడు కొందరు వృద్ధ ఖురైషీయుల్ని.

"మొదట్లో ఇక్కడ జుర్హుమ్ తెగవాళ్ళు పరిపాలన చేస్తుండేవారు. అయితే కొంత కాలానికి ఆ తెగవాళ్ళలో నీతినియమాలు సన్నగిల్లడం ప్రారంభమయింది. అవినీతి, అక్రమాలు ఎక్కువై పోయాయి. దాంతో బనూ ఖుజాఅ తెగవాళ్ళు వారిమీద తిరగబడ్డారు. జుర్హుమ్ తెగవారికి, వారి రాజు ముజాజ్ జుర్హుమికి వ్యతిరేకంగా యుద్ధం ప్రారంభించారు. ఈ యుద్ధంలో జుర్హుం తెగవాళ్ళు చిత్తుగా ఓడిపోయారు. అప్పుడు ముజాజ్ జుర్హుమి మక్కా నుండి పారిపోతూ ప్రతీకారంగా కాబా మందిరంలోని కానుకల్ని జమ్‌జమ్ బావిలో విసిరేసి, దాన్ని పూడ్చి వెళ్ళాడు" చెప్పారు వృద్ధ ఖురైషీయులు.



"అట్లాగానా! ఎంత దుర్మార్గానికి పాల్పడ్డారు!! సరే..... ఏమైనప్పటికీ జమ్‌జమ్ బావిని వెతికి తీసి, దాని నీటిని ప్రజలు వాడుకునేలా చేసే వరకు నాకు మనశ్శాంతి ఉండదు" అన్నాడు అబ్దుల్ ముత్తలిబ్.

అలా అన్నాడేకాని, చాలా కాలందాకా అతనికి ప్రత్యామ్నాయ మార్గం కన్పించలేదు.

కాలం మరికొన్నేండ్లు ముందుకు సాగింది. అబ్దుల్ ముత్తలిబ్‌కు వివాహమయి అనేక సంవత్సరాలు గడచినా ఒక్క కొడుకు మాత్రమే పుట్టాడు. అతను పెరిగి పెద్దవాడయి తండ్రికి కుడిభుజంలా మసలుకుంటున్నాడు. ఆ తరువాత ఓరోజు.......

కళ్ళు చించుకున్నా కానరాని కటిక చీకటిలో మక్కా పట్నం పూర్తిగా సద్దు మణిగింది. చీమ చిటుక్కుమన్నా విన్పించేటంతటి గంభీరమైన నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. కాకపోతే అక్కడక్కడ కొన్ని ఇండ్ల నుండి గురకలు మాత్రం లయబద్ధంగా విన్పిస్తున్నాయి. అలాగే పశువుల మెడ గంటలు కూడా అప్పుడప్పుడు టింగుటింగుమని చప్పుడు చేస్తున్నాయి.

పొద్దస్తమానం కష్టపడిన శ్రమజీవులు మేనుమరచి గాఢంగా నిద్రపోతున్నారు. అబ్దుల్ ముత్తలిబ్ కూడా ఓ పక్కకు తిరిగి ప్రశాంతంగా నిద్రపోతున్నాడు.

"అబ్దుల్ ముత్తలిబ్! లే. లేచి జమ్‌జమ్ బావిని వెలికి తియ్యి".

అబ్దుల్ ముత్తలిబ్ ఉలిక్కిపడి లేచాడు. చూస్తే పడక గదిలో ఎవరూ కన్పించలేదు. అదేదో తన భ్రమ అనుకొని మళ్ళీ నిద్రకు ఉపక్రమించాడు.

తెల్లవారింది. అబ్దుల్ ముత్తలిబ్ ఆ విషయం అంతటితో మరచిపోయి దైనందిన కార్యకలాపాలలో నిమగ్నుడయి పోయాడు.

సూర్యాస్తమయం కాగానే చీకటిరక్కసి మళ్ళీ జడలు విప్పింది. జనం తలుపులు మూసుకొని పడకలపైకి చేరారు. నడిరేయి సమయంలో మళ్ళీ అదే విచిత్రధ్వని!

"అబ్దుల్ ముత్తలిబ్! లే. లేచి జమ్‌జమ్ బావిని వెలికి తియ్యి."

అబ్దుల్ ముత్తలిబ్ మళ్ళీ ఉలిక్కిపడిలేచి, చుట్టూ కలియజూశాడు. కాని ఎవరూ కన్పించలేదు. "ఏమిటీ వింత శబ్దం! ఎవరు తనను పిలుస్తున్నది?" ఇలా ఆలోచిస్తూ తిరిగి నిద్రలోకి జారుకున్నాడు.

కాని ఉదయం లేవగానే ఆ విషయం గురించిన ఆలోచనలు ముసురుకున్నాయి. అయినా ఎలాంటి నిర్ణయానికి రాలేకపోయాడు. మరచిపోవాలన్నా మరవలేక పోతున్నాడు.

మూడవ రోజు కూటడా నడిరేయి సమయంలో అదే కంఠస్వరం విన్పించింది. కలలో ఎవరో పుణ్యపురుషుడు ఈ మాటలు చెబుతూ అబ్దుల్ ముత్తలిబ్‌ని కాబా మంది రానికి తీసికెళ్ళాడు. అక్కడ జమ్‌జమ్ బావి ఉన్న ప్రదేశాన్ని కూడా చూపించాడు.

ఆ తర్వాత ఆ వ్యక్తి అదృశ్యమై పోయాడు. కల చెదరిపోయింది. అబ్దుల్ ముత్తలిబ్ తృళ్ళిపడి లేచాడు. ఇది నిజంగా కాబా ప్రభువు నుండి వచ్చిన ఆదేశమయి ఉంటుందని భావించాడు. ఈ ఆలోచనతో ఆయనకు ఆ తర్వాత నిద్రపట్ట లేదు.

తెల్లవారాక కొడుకు హారిస్‌ని పిలిచి కలలో తనకు అందిన ఆజ్ఞ గురించి తెలియ జేశాడు. ఆ తర్వాత హారిస్‌ని వెంటబెట్టుకొని కాబా మందిరానికి వెళ్ళాడు. అక్కడ ఖురైష్ నాయకుల్ని పిలిపించి వారిక్కూడా ఈ విషయం తెలియజేస్తూ ఇలా అన్నాడు:

"సోదరులారా! గత మూడు రాత్రులు కలలో నా కిలాంటి ఆజ్ఞలు లభించాయి. కలలో తెలియజేయబడినట్లు ఈ ప్రదేశంలోనే జమ్‌జమ్ బావి ఉంటుందని నాకు గట్టి నమ్మకం ఉంది. కాని ఇక్కడ త్రవ్వకం జరిపి జమ్‌జమ్‌ను వెలికితీయడం ఎంతో శ్రమతో కూడిన పని. మీరు కూడా నాతో సహకరిస్తే ఈ పని సులభమవుతుంది".

ఖురైష్ నాయకులు ఈ మాటలు విని ఒకరి ముఖాలు ఒకరు చూసుకోసాగారు. ఒకతను ముందుకొచ్చి "ఇదంతా మీ భ్రమ. కలలోని మాటలు నిజమవుతాయనుకోవడం కన్నా మించిన వెర్రితనం మరొకటిలేదు. జమ్‌జమ్‌ను వెతికితీయడం సాధ్యమయ్యే పని కాదు" అన్నాడు నిర్లక్ష్యంగా.

"ఈ ప్రదేశంలో మనం త్రవ్వకం ఎలా జరపగలం? దీనికిరు వైపులా మన దేవతా విగ్రహాలున్నాయి. ఇక్కడ త్రవ్వితే పాపం మూట కట్టుకున్నట్లే" అన్నాడు మరొకడు.

"విగ్రహాలు పెద్ద సమస్య కాదు. వీటిని ఇక్కడ్నుంచి తీసి వేరే చోటికి తరలించ వచ్చు" అన్నాడు అబ్దుల్ ముత్తలిబ్.

"ఎంతమాత్రం వీల్లేదు. వీటిని ఇక్కడే ఉండనివ్వాలి. ఎన్నో ఏండ్లుగా ఇక్కడ వుంటున్న ఈ విగ్రహాల్ని తొలగించడమంటే దేవతల ఆగ్రహాన్ని మనం చేజేతులా కొని తెచ్చు కోవడమే. మేమీ పనిలో మీతో సహకరించలేం" అన్నాడు వేరొక వ్యక్తి.

"ఔను, మేము మీతో ఏమాత్రం సహకరించలేం" అంటూ మరో నలుగురు అతనితో గొంతు కలిపారు.

"సరే, మీరు సహకరించినా సహకరించకపోయినా, నేను మాత్రం ఈ పని చేసి తీరుతాను" అన్నాడు అబ్దుల్ ముత్తలిబ్ ఎంతో ఆత్మవిశ్వాసంతో.

"సరే మీ ఇష్టం...."

"ఈయన గారికేదో కీడు మూడింది. అందుకే ఈ దుస్సాహసానికి పాల్పడుతున్నాడు".

"పర్యవసానం ముందుకు వస్తేగాని వాస్తవం అర్థం కాదు".

ఇలా చెప్పుకుంటూ వారు అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

ఆ తరువాత అబ్దుల్ ముత్తలిబ్ కొడుకు హారిస్ సహాయంతో 'జమ్‌జమ్' చోటునుండి విగ్రహాలను వేరే చోటుకు తరలించి త్రవ్వకం మొదలుపెట్టాడు. చివరికి ఆయన శ్రమ ఫలించింది. జమ్‌జమ్ జలం చూసి ఆయన పరమానందభరితుడయ్యాడు.

జమ్‌జమ్ బావిలో జుర్హుమీ తెగ నాయకుడు ముజాజ్‌కు చెందిన అనేక ఖడ్గాలు, డాళ్ళు, కవచాలు దొరికాయి. ప్రజలు దేవతలకు సమర్పించుకున్న కానుకలు కూడా లభించాయి. ఆ కానుకలలో రెండు బంగారుజింకలు కూడాఉన్నాయి. ఖురైష్ నాయకులు



ఇదంతా చూసి సిగ్గుపడిపోయారు. ఈ పవిత్రకార్యంలో తాము పాలుపంచుకోలేక పోయామే అని తెగ బాధపడిపోయారు.

"మేము అబ్దుల్ ముత్తలిబ్‌కు ఏదో పిచ్చి పట్టిందని అనుకున్నాం. కాని ఆయన తాననుకున్న కార్యం సాధించితీరే దృఢ మనస్కుడని ఇప్పుడర్థమయింది" అని చెప్పుకున్నారు వారు తమ సహాయనిరాకరణకు సిగ్గుపడుతూ. వారు అబ్దుల్ ముత్తలిబ్ ముందు తమ విచారం వ్యక్తపరచుకున్నారు. తరువాత వారు అబ్దుల్ ముత్తలిబ్‌ని ఎంతగానో అభినందించారు.

జమ్‌జమ్ బావి బయటపడిందని, ఇకనుంచి ఎడతెగకుండా లభించే దాని మధుర మైన నీటిని హాయిగా త్రాగవచ్చని తెలియగానే జనం గుంపులు గుంపులుగా వచ్చి చూడసాగారు. అబ్దుల్ ముత్తలిబ్‌ని వారు ప్రశంసలతో ముంచెత్తనారంభించారు.

అబ్దుల్ ముత్తలిబ్ జమ్‌జమ్ బావిలో లభించిన ఖడ్గాలు, డాళ్ళు, కవచాలతో కాబా గర్భగుడికి దృఢమైన తలుపులు తయారుచేయించాడు. బంగారు జింకలను వాటి ద్వారాలకు రెండు వైపులా అమర్చాడు. దానివల్ల కాబాకు కొత్త శోభ చేకూరింది.

# బలిదానం-(4)

జమ్‌జమ్ బావి త్రవ్వకం పూర్తి అయ్యేటప్పటికి అబ్దుల్ ముత్తలిబ్ బాగా అలసిపోయాడు. వళ్ళు పచ్చిపుండయి పోయింది. "ఇలాంటి సందర్భాల్లో తనకూ ఆరేడుగురు కొడుకులుండి ఉంటే ఎంత బాగుండేది" అన్న ఆలోచన అతని మనసులో అప్రయత్నంగా కలిగింది.

"దేవా! నాకు పదిమంది కొడుకులు ప్రసాదించు. నా జీవితంలోనే వారు పెరిగి పెద్దవాళ్ళయి నాకు చేదోడువాదోడుగా తయారైతే వారిలో ఒకడ్ని నీకు బలి సమర్పించు కుంటాను నేను" అని ఆయన మొక్కుబడి కూడా చేసుకున్నాడు.

దేవుడు అతని మొరాలకించి పదిమంది కొడుకుల్ని ప్రసాదించాడు. వారు పెరిగి పెద్దవాళ్ళయిపోవడం కూడా జరిగింది. కాని అబ్దుల్‌ముత్తలిబ్ దైనందిన కార్యకలాపాల్లో తలమునకలైపోయి మొక్కుబడి సంగతి మరచిపోయాడు. అయితే ఓ రోజు.......

నడిరేయి చీకటిలో నగరం జోగుతోంది. అప్పుడప్పుడు వీస్తున్న పవన వీచికలు హృదయాల్ని గిలిగింతలు పెడ్తున్నాయి. అక్కడక్కడ కిటికీల గుండా కన్పిస్తున్న గుడ్డి దీపాలు మిణుగురు పురుగుల్ని తలపింప జేస్తున్నాయి.

"అబ్దుల్ ముత్తలిబ్! లే... లేచి నీ మొక్కుబడి తీర్చుకో."

అబ్దుల్ ముత్తలిబ్ ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచాడు. చూస్తే ఎవరూ కన్పించలేదు. అయితే మొక్కుబడి మాట వినగానే గతం గుర్తుకొచ్చింది. ఏమైనా కల కలే కదా అనుకొని నడుంవాల్చి తిరిగి నిద్రపోవడానికి ఉపక్రమించాడు. కాస్సేపటికి కళ్ళు మూతలు పడ్డాయి.

"అబ్దుల్ ముత్తలిబ్! లే.... లేచి నీ మొక్కుబడి తీర్చుకో."

అబ్దుల్ ముత్తలిబ్ మళ్ళీ తృళ్ళిపడి లేచాడు. "కలలో ఎవరో మహనీయుడు కన్పించి తన మొక్కుబడి సంగతి గుర్తుచేశాడు. మొక్కుబడి తీర్చుకోవలసిన సమయం ఆసన్న మయ్యింది" అనుకున్నాడు అతను మనసులో.

రాత్రి ఇంకాచాలా మిగిలివుంది. పడుకుందామంటే నిద్ర రావడంలేదు. గత విష యాల గురించిన ఆలోచనలు ముసురుకున్నాయి. ఆ ఆలోచనలతోనే రాత్రి గడచింది.

పొద్దుపొడిచి బారెడు పైకెక్కిన తరువాత అబ్దుల్ ముత్తలిబ్ కొడుకుల్ని పిలిపించాడు. వారికి విషయం తెలియజేస్తూ ఇలా అన్నాడు:

"నాయనలారా! దేవుడు నాకు పదిమంది కొడుకులు ప్రసాదించి, వారంతా నా కళ్ళెదుట పెరిగి పెద్దవాళ్ళయితే నేను వారిలో ఒకడ్ని ఆయనకు బలిస్తానని మొక్కు కున్నాను. ఆ ప్రభువు దయ వల్ల నాకు పదిమంది కొడుకులు పుట్టి పెద్దవాళ్ళయ్యారు. ఇప్పుడు నా మొక్కుబడి నెరవేర్చుకునే సమయం వచ్చింది. ఈ విషయంలో మీ అభిప్రాయం ఏమిటో చెప్పండి."

ఈ మాట విని కొడుకులు ఏమాత్రం కంగారుపడలేదు. పైగా వారు ఉత్సాహంతో ఒకరి తరువాత మరొకరు తమ అంగీకారం తెలుపుతూ ఇలా అన్నారు:

"నాన్నా! మేమిందుకు సిద్ధంగా ఉన్నాం. మా పూర్వీకులైన తాత ఇస్మాయీల్ (అలైహి) తమ తండ్రి ఇబ్రాహీం (అలైహి) ఇచ్చిన ఆజ్ఞ ముందు తలవంచారు బలి పీఠమ్మీద. అలాగే మేము కూడా మా ప్రాణాలర్పించి మమ్మల్ని బలిచ్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. మేము దీన్ని మా అదృష్టంగా భావిస్తున్నాం."

ఈ మాటలు విని అబ్దుల్ ముత్తలిబ్ ఎంతో సంతోషించాడు. వినయవిధేయతలు కలిగిన కొడుకుల్ని ప్రసాదించినందుకు అతను దేవునికి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

"సరే, మీలో ఎవరిని బలివ్వాలో చెప్పండి" అడిగాడు అతను మళ్ళీ.

"మీరు ఎవరిని ఆజ్ఞాపిస్తే అతను సిద్ధం" అన్నారు కొడుకులు ముక్తకంఠంతో.

"నేను ప్రత్యేకంగా ఎవరి పేరూ సూచించను. పూజారి ద్వారా పాచికలు వేసి చూద్దాం. అందులో ఎవరి పేరు వస్తే అతడ్ని బలిస్తాను."

అబ్దుల్ ముత్తలిబ్ ఈ మాట చెప్పి కొడుకుల్ని కాబా మందిరానికి తీసికెళ్ళాడు. అక్కడ ఒక పూజారికి విషయం తెలియజేశాడు. అతను పది బాణాలు తీసుకొని వాటిలో ఒక్కొక్క దానిపై ఒక్కొక్క కొడుకు పేరు వ్రాయించాడు. తరువాత ఆ బాణాలు హుబల్ దేవత ముందుంచి ఓ ప్రత్యేక తీరులో వాటిని తిప్పాడు. అప్పుడు అందరిలో కెల్లా ఎంతో ప్రియమైన కొడుకు 'అబ్దుల్లా' పేరు వచ్చింది. దాంతో అబ్దుల్లానే బలివ్వడానికి నిర్ణయించుకున్నాడు అబ్దుల్ ముత్తలిబ్.

ఈ నిర్ణయం సంగతి అబ్దుల్లా తల్లి వైపు బంధువులకు తెలిసి వారు తీవ్ర ఆందోళన చెందారు. అబ్దుల్లాను బలివ్వకుండా అతని తండ్రిని వారించడానికి ప్రయత్నించారు. అతనికి శతవిధాల నచ్చజెప్పి చూశారు. కాని అబ్దుల్ ముత్తలిబ్ వారి మాటలు త్రోసిపుచ్చి



తన నిర్ణయాన్ని అమలుపరచక తప్పదని అన్నాడు. బంధువులు కూడా తమ పట్టును ఏమాత్రం సడలించుకోలేదు.

చీకటి పడింది. నింగిలోని నక్షత్రాలు నేలవైపు చూస్తూ ఫక్కున నవ్వుకున్నాయి. సమస్య ఓ కొలిక్కి రాకముందే అందరూ తమతమ ఇండ్లకు వెళ్ళిపోయారు......

ప్రభాతకాంతులతో నలుపు వీడి నిర్మలంగా ముస్తాబై నీలాంబరంపై హఠాత్తుగా అరుణ రేఖలు ప్రత్యక్షమయ్యాయి.

ఆ వెనువెంటనే బాలభాస్కరుడు బంగారు కిరణాలు విరజిమ్ముతూ ప్రాక్దిగ్మండలం నుంచి బరబరా పైకి రాసాగాడు.

అప్పటికే మక్కా పట్నం మేల్కొన్నది. ప్రజలు కాలకృత్యాలు తీర్చుకొని తమతమ దైనందిన కార్యకలాపాలలో లీనమైపోయారు.

పక్షుల కలకలరావం, ఒంటెల గంటల సవ్వడి, మేకల మ్యామ్యా అరుపులు, కోడిపుంజుల కూతలు, పిల్లల కేరింతలతో వీధులు ఎంతో సందడిగా ఉన్నాయి.

అయితే బనూహాషిం ఇంటి ముందు గోడకానుకొని కంబళిపై కూర్చున్న వ్యక్తికి ఇవేవీ పట్టనట్లు ఉంది. అతను ఎటో చూస్తూ తీవ్రమైన ఆలోచనల్లో నిమగ్నుడై వున్నాడు.

అతని ముఖ కవళికలు క్షణక్షణానికి మారుతున్నాయి. ఒక్కొక్కప్పుడు అతని కళ్ళలో ఏదో కాంతి కిరణం కన్పించినట్లే కన్పించి అంతలోనే అదృశ్యమై పోతున్నది.

కొంచెం దూరంలో అతని కుటుంబసభ్యులు కూడా ఏదో ఆలోచిస్తూ నిలబడ్డారు. అతని ముందు మాట్లాడే ధైర్యంలేక వారు మౌనంగా ఓ పక్కన నిల్చున్నారు.

సూర్యుడు మరికాస్త పైకి వచ్చాడు. అబ్దుల్‌ముత్తలిబ్ మధ్యమధ్యలో మాటిమాటికి పిడికిళ్లు బిగించి వదిలేస్తూ ఉన్నాడు. కాస్సేపటికి నుదుటి మీది చెమట తుడుచుకొని ఏదో నిర్ణయానికి వచ్చినవాడిలా తల పైకెత్తాడు.

"ఏడి అబ్దుల్లా? ఎక్కడికి పోయాడు? అతడ్ని కాబా దగ్గరికి పిలుచుకురండి. ఈరోజు అతడ్ని హుబల్ దేవతకు బలిచ్చి మొక్కుబడి తీర్చుకోవాలి" అన్నాడతను దిగ్గున పైకిలేస్తూ.

అతని దృఢ నిర్ణయం విని అతని కుటుంబీకులు తీవ్రంగా ఆందోళన చెందారు. ఏమీ పాలుపోక ఒకరి ముఖాలు ఒకరు చూసుకోసాగారు.

ఆ ఇంట్లో గోడకున్న ఓ గూటిలో రకరకాల తాళ్ళు, కత్తులు, ఖాళీగోతాలు, విరిగిన కవచాలు, పాతవస్తువులు చిందరవందరగా పడివున్నాయి. ఆ వ్యక్తి ఇంట్లోకెళ్ళి గూట్లో ఉన్న ఆ వస్తువుల్లో ఓ కత్తి తీసుకున్నాడు. తర్వాత సరాసరి కాబా మందిరానికెళ్లాడు.

కాస్సేపటికి అతని కుటుంబసభ్యులు కూడా అతని వెనకాలే కాబా వైపు నడిచారు.

వారిలో కొందరు ఆ వ్యక్తికి నచ్చజెప్పడానికి ఎంతగానో ప్రయత్నించారు. కాని వారి మాటలు ఖాతరుచేయకుండా అతను విరిగిపోయిన ఓ ఉక్కు కవచంపై కత్తికి పదును పెట్టనారంభించాడు.

అంటే అతని నిర్ణయానికి తిరుగులేదన్నమాట! అబ్దుల్లాను బలివ్వక తప్పదన్నమాట!!

అంతే, ఈమాట క్షణాల్లో దావానలంలా పట్టణమంతా వ్యాపించిపోయింది. జనం తండోపతండలుగా వచ్చి కాబా మందిరం దగ్గర గుమిగూడటం మొదలెట్టారు.

సర్వత్రా దుఃఖచ్ఛాయలు అలుముకున్నాయి. జనంలో అబ్దుల్లా మీద అమితమైన సానుభూతి పెల్లుబికింది. ఏ నోట విన్నా ఒకటే మాట---

"వద్దు వద్దు. అబ్దుల్లాను బలివ్వకండి అతనికి బదులు పరిహారంగా ఏదైనా ఇవ్వండి. ఎన్ని ఒంటెలు బలివ్వడానికైనా లేదా ఎంత డబ్బు కానుకగా సమర్పించుకోవడానికైనా సరే మేము సిద్ధంగా ఉన్నాం" అన్నారు ప్రజలు.

కానీ ఆ మొండిమనిషి ఎవరి మాటా వినేలా లేడు. అబ్దుల్లా తల్లి తరపు బంధువులు ఎలాగైనా ఈ పని నుండి అతణ్ణి వారించాలని మరోసారి ప్రయత్నించారు.

"అబ్దుల్ ముత్తలిబ్! ఆపండి. అబ్దుల్లాను బలివ్వడానికి ఎంతమాత్రం వీల్లేదు. కావాలంటే ముందు మా మెడలపై కత్తి పెట్టండి. ఆ తరువాతే అబ్దుల్లా జోలికి పోండి" అన్నారు వారు ఈసారి గట్టిగానే.

"లోకం తల్లకిందులైనా సరే నా నిర్ణయం మారదు" అన్నాడు అబ్దుల్ ముత్తలిబ్ గంభీరంగా కత్తికి మరింత సానబెడ్తూ.

బంధువులు కూడా గట్టి పట్టుబట్టారు. ఉభయుల్లో ఏ ఒక్కరూ వెనక్కి తగ్గడానికి సిద్ధంగా లేరు. మరోవైపు ప్రజలు కూడా అబ్దుల్లాను బలివ్వ వద్దని వత్తిడి చేస్తున్నారు.

అబ్దుల్ ముత్తలిబ్ ఇప్పుడు సందిగ్ధంలో పడిపోయాడు. అతను ఓసారి గతంలోకి తొంగి చూశాడు....

తనకు ఒకేఒక సంతానం ఉన్నప్పుడు దేవుడు తనకు పదిమంది కొడుకులు ప్రసాదించాడు. దేవుని దయవల్ల అందరూ పెరిగి పెద్దవారై తనకు తోడ్పడుతున్నారు. కనుక తాను చేసుకున్న మొక్కుబడి ప్రకారం ఇప్పుడు వారిలో ఒకణ్ణి దేవునికి సమర్పించుకోక తప్పదు. హుబల్ దేవతకు అందరిలో చిన్నవాడైన అబ్దుల్లా ఇష్టమయ్యాడు. అందుకే మొక్కుబడి రీత్యా అబ్దుల్లానే హుబల్ దేవుడికి అర్పించాలి.

కాని ప్రజలంతా అబ్దుల్లాను బలివ్వ వద్దని వారిస్తున్నారే! ఇప్పుడెలా? అంతలో.....

"ఖురైష్ నాయకా! ఓ మాట చెబుతా వింటావా?" అన్నాడు ఓ వృద్ధుడు నడుం కట్టు వదులు చేసుకుంటూ.

"నేనిప్పుడు ఎటువంటి మాటా ఇవ్వలేను. నువ్వు చెప్పదలచుకున్నదేమిటో చెప్పు వింటాను" అన్నాడు అబ్దుల్ ముత్తలిబ్.

"బనూఆమిర్ వాడలో ఉంటున్న మంత్రగత్తె తెలుసుకదా?" అడిగాడు వృద్ధుడు.

"తెలియకేమి! పట్టణ ప్రజలందరికీ తెలుసు. యమన్, నజద్ ప్రాంతాల నుంచి కూడా జనం ఆమె దగ్గరకు వస్తుంటారు జ్యోతిష్యం చెప్పించుకోవడానికి."



"అంతేకాదు గస్సాన్, సైమానీ రాజులు కూడా ఆమెకు కానుకలు పంపిస్తుంటారు."

"అయితే ఏం చేద్దామంటావు?" అడిగాడు అబ్దుల్ ముత్తలిబ్ అసహనంగా.

"ఆమె దగ్గరికెళ్ళి ఈ సమస్యకు పరిష్కారం అడుగుదాం. ఆమె ఎలాంటి భయప్రలోభాలకు లోనయ్యే మనిషి కాదు. ఆమె చెప్పిందానికి తిరుగుండదు" అన్నాడు వృద్ధుడు.

అబ్దుల్ ముత్తలిబ్ మెత్తబడ్డాడు. మంత్రగత్తె దగ్గరకు వెళ్ళేందుకు అంగీకరించాడు. దాంతో జనం చల్లగా ఊపిరి పీల్చుకున్నారు. కాని అతని చేతిలో కత్తి ఇంకా అలాగే ఉంది.

"ఇక ఆ కత్తి తీసి ఇంట్లో పెట్టేయండి" అన్నాడు ఓ బంధువు.

"మంత్రగత్తె పరిష్కారం చూపేదాకా ఈ కత్తి వదలి పెట్టేదిలేదు. ప్రతి విషయంలో నాపై వత్తిడి తేకండి" అన్నాడు అబ్దుల్ ముత్తలిబ్ కాస్త చిరుకోపంతో.

మొత్తం మీద ఎలాగో ప్రజలు అతణ్ణి మంత్రగత్తె దగ్గరికి తీసికెళ్ళారు.

భక్తులు, అభిమానుల మధ్య తైలసంస్కారంలేని జుట్టు విరబోసుకొని కూర్చున్నది మాంత్రికురాలు. ఆమె ముఖం దుమ్ము కొట్టుకొనిఉంది. శరీరంపై బట్టలు నామమాత్రంగా ఉన్నాయి. మెడలో ఓ పొడుగాటి ఎముకల దండ ఉంది. కాళ్లకు, చేతులకు పెద్దపెద్ద ఇనుప కడియాలున్నాయి. చేతిలో నల్లటి పట్టుకర్ర ఉంది. ముడివడిన భృకుటి, నిప్పు కణాల్లాంటి ఎర్రటికళ్ళు, నల్లటిపెదాలతో ఆమె ఎంతో భయానకంగా ఉంది.

అబ్దుల్ ముత్తలిబ్ రాగానే కూర్చోమన్నట్లు కర్రతో సైగచేసింది. అబ్దుల్ ముత్తలిబ్ కత్తిని నేలపై గుచ్చి ఓ పక్కన కూర్చున్నాడు.

ఆయన బంధువుల్లో ఒకతను ముందుకొచ్చి విషయం పూర్తిగా విన్పించాడు.

మాంత్రికురాలు అంతా విని ఓ క్షణంపాటు కళ్ళు మూసుకున్నది. అంతా నిశ్శబ్దం!

ఆమె కళ్ళు తెరవగానే ఓ వ్యక్తి నిశ్శబ్దాన్ని చీల్చుతూ అన్నాడు:

"ఎలాగైనా సరే అబ్దుల్లాను కాపాడి...."

"వీరి మాటలేవీ పట్టించుకోకండి. మీ జ్ఞానం, అంతరాత్మ ఏది చెబుతాయో అదే చెప్పండి" అన్నాడు అబ్దుల్ ముత్తలిబ్ అతని మాటలకు అడ్డు తగులుతూ.

మంత్రగత్తె ఓ భయంకరమైన నవ్వు నవ్వింది.

"మొక్కుబడి మరోవిధంగా కూడా తీర్చుకోవచ్చు" అన్నది ఆమె.

"ఏమిటది?"

"అబ్దుల్లా పేరుకు, పది ఒంటెలకు పాచికలు వేసి చూడండి. అందులో ఒంటె పేరు వస్తే సరి. దానికి బదులు అబ్దుల్లా పేరు వస్తే మరో పది ఒంటెల్ని ఎక్కువ చేయండి. అప్పటికీ అబ్దుల్లా పేరే వస్తే ఇంకో పది పెంచండి. ఇలా మీ దేవత ప్రసన్నమయ్యే వరకూ పదేసి చొప్పున ఒంటెల్ని పెంచుతూ పాచికలు వేయండి. అప్పుడు అబ్దుల్లాకు బదులు ఆ ఒంటెల్ని బలివ్వండి" అన్నది మాంత్రికురాలు.

ఆమె చెప్పినట్లే పాచికలు వేశారు. అందులో ఒంటెల సంఖ్య వందకు చేరిన తరువాత అబ్దుల్లా పేరుకు బదులు ఒంటెల పేరు వచ్చింది. దాంతో జనం సంతోషంతో గంతులేశారు.

అబ్దుల్ ముత్తలిబ్ కూడా తన ముద్దులకొడుకు దక్కినందుకు చాలా సంతోషించాడు. ఆ తరువాత అతను వెంటనే హుబల్ దేవతకు నూరు ఒంటెలు బలిచ్చాడు.

ఈ సంఘటనతో అబ్దుల్లా పేరు పట్నంలో మార్మోగి పోయింది. ఏ ఇంట్లో విన్నా అబ్దుల్లా గురించిన చర్చలే. నలుగులు అమ్మలక్కలు గుమికూడిన చోటల్లా ఆయన్ని గురించిన గుసగుసలే.

యువతుల సంగతయితే చెప్పనవసరం లేదు. ఇరవై నాలుగు వసంతాలు నిండి నవయౌవనంతో మిసమిసలాడుతున్న అబ్దుల్లాకోసం వారి హృదయాలు తహతహ లాడ సాగాయి. ఆయన సౌందర్యం, శరీర సౌష్ఠవాలు యువతుల్ని అమితంగా ఆకట్టుకున్నాయి.

మరి ఈ అందాల రేడు ఏ అదృష్టతారకు దక్కుతాడో!!

## ఆనంద కుసుమాలు-(5)

కొడుక్కు సంబంధం కోసం అబ్దుల్ ముత్తలిబ్ అన్వేషణ ప్రారంభించారు. చివరికి బనీజహ్రా నాయకుని ఇంటిపై ఆయన దృష్టి పోయింది. వెంటనే అతనికి కబురు పంపారు.

ఆరోజు.... బనీజహ్రా ఇంటికి వేట మాంసం వచ్చింది. ఓ వృద్ధమహిళ మాంసం కడిగి పొయ్యి మీద పెట్టి ఉడకబెట్టడం ప్రారంభించింది. ఇంట్లో వాళ్ళంతా భోజనం కోసం ఎదురుచూడ సాగారు. ఈలోగా పెద్దవాళ్ళు కబుర్లలోకి దిగారు.

“ఇంతకూ మీరు అబ్దుల్ ముత్తలిబ్‌కు ఏం సమాధానం పంపారు?” ఓ నడికారు వ్యక్తి అడిగాడు తల మీది వస్త్రం సరిచేసుకుంటూ.

“ఈ సంబంధం నాకిష్టమే. ఒకటి రెండు రోజుల్లో మా బాబాయి వస్తాడు. ఆయనతో కూడా సంప్రదిద్దామని ఉంది. పెద్దలమాట చద్దిమూట కదా?” అన్నాడు మరొక వ్యక్తి.

“శుభకార్యం విషయంలో ఆలస్యం చేయడం మంచిది కాదు. అబ్దుల్ ముత్తలిబ్ కొడుకు అబ్దుల్లా కోసం మక్కాలో అమ్మాయిలకు కొదవ లేదు. అబ్దుల్లాలాంటి అబ్బాయి అరేబియాలో కాగడా పెట్టి వెతికినా కన్పించడు. పైగా అతను గొప్పింటి బిడ్డ. అతని తండ్రి మొత్తం ఖురైష్‌జాతికే అగ్రనాయకుడు. అంచేత ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే మన ఆమినాను అబ్దుల్లాకిచ్చి పెళ్ళి చేసెయ్యి” అన్నాడు నడికారు వ్యక్తి.

ఈ సలహా ఆమినా తండ్రికి నచ్చింది. ఆయన తక్షణమే ఈ సంబంధం తమకు సమ్మతమేనని అబ్దుల్ ముత్తలిబ్‌కు సమాధానం పంపాడు. ఈవిధంగా ఆమినా సంబంధం ఖాయమయింది.

అబ్దుల్లాకు ఆమినాయే అన్నివిధాల ఈడైన జోడు. ఆమినా అందంలో అపరంజి బొమ్మ. శీలంలో సుగుణాల రాసి. మానమర్యాదల్లో మహిళా లోకానికే మణిపూస.



ఈ ప్రత్యేకతల కారణంగానే ఆమినా కుటుంబ సభ్యులు ఆమెను ఎంతగానో అభిమానించేవారు. ఆమెకు అమితమైన గౌరవం కూడా ఇస్తుండేవారు. ఇప్పుడు అబ్దుల్లా లాంటి యువకునితో సంబంధం ఖాయమయినందున వారు ఆమినా అదృష్టానికి పరమ సంతోషంతో పొంగిపోయారు.

పెళ్ళి ముహూర్తం సమీపించింది. అబ్దుల్ ముత్తలిబ్ బంధుమిత్ర సపరివారంగా మక్కా నుండి పెళ్ళికూతురింటికి తరలి వచ్చారు.

మేళతాళాలు మొదలయ్యాయి. బాలికలు పాటలు పాడి సభికులకు వీనుల విందు చేశారు. అరబ్ సంప్రదాయం ప్రకారం వివాహం అతి నిరాడంబరంగా జరిగిపోయింది.

పెళ్ళయిన మూడు రోజుల తరువాత నూతన వధూవరులకు వీడ్కోలు చెప్పారు. ఆమినా అత్తవారింట్లో అడుగుపెట్టింది. అత్తవారి తరఫు బంధువులు కొత్త కోడలికి ప్రేమ పూర్వకమైన స్వాగతం చెప్పారు.

ఆ తరువాత కొన్నాళ్ళకు అబ్దుల్లా వ్యాపారం నిమిత్తం ఒక వాణిజ్య బృందంతో కలసి పరదేశానికి పోవాల్సి వచ్చింది. వర్తక బిడారాలు సిద్ధమయ్యాయి. బంధుమిత్రులు అబ్దుల్లాకు వీడ్కోలు చెప్పడానికి వచ్చారు.

అబ్దుల్ ముత్తలిబ్ కొడుకును గాఢంగా కౌగలించుకున్నారు. క్షేమంగా తిరిగి రప్పించమని దైవాన్ని వేడుకున్నారు.

అబ్దుల్లా ఒంటె ఎక్కారు. అన్నయ్య అబ్బాస్ ఒంటె పగ్గం పట్టుకున్నాడు. తమ్ముడు హమ్జా కూడా ఆయన్ని అనుసరించాడు.

ఆమినా నిలబడి మౌనంగా చూస్తుండి పోయారు.

పెళ్ళయి ముచ్చటగా మూణ్ణెల్లయినా కాలేదు. అంతలోనే ఈ ఎడబాటు! ఆమె నయనాలు అప్రయత్నంగా అశ్రుపూరితాలయ్యాయి.

ఏదో చెప్పాలనుకున్నా చుట్టుముట్టిన సిగ్గుదొంతరలు ఆమె పెదవుల్ని బంధించి వేశాయి. అనిర్వచనీయమైన ఆవేదన ఏదో ఆమె హృదయాన్ని కలచివేయసాగింది.

“ఆమినా! ఎందుకంత బాధపడి పోతావు? నీ భర్త యుద్ధానికైతే పోవడం లేదుకదా! వ్యాపారం కోసం సిరియా వెళ్తున్నాడు. అంతేగా! ఇలా ప్రతియేడూ ఖురైషీయులు వ్యాపారం కోసం విదేశాలకు వెళుతూనే ఉంటారు. అబ్దుల్లా కూడా అంతే. ఆ మాత్రానికే కంటతడి పెట్టుకోవాల్నా? చూడు, ఆయన క్షేమంగా, లాభంగా, నీ కోసం బోలెడు కానుకలతో తిరిగి వస్తారు. కాకపోతే ఓ అయిదారు నెలలు ఓపిక పట్టాలి. అంతేగా! ఈ అయిదారు నెలలు పెద్ద విషయం కాదు. మనస్సు దిటవు చేసుకుంటే చాలు, కాలం ఇట్టే అయిదారు రోజుల్లో చకచకా గడిచిపోతుంది. ఆ తరువాత మళ్ళీ నీ ముంగిట ఆనంద కుసుమాలే!!” ఆమినా మనస్సు ధైర్యం చెప్పింది.

“అప్పటి సంగతి తర్వాత ఆలోచిద్దువుగాని, ఇప్పుడు నీ భర్త నీనుంచి కనుమరుగై పోతున్నాడు. ఓసారి ఆయన్ని ఆపాదమస్తకం చూసుకో. మళ్ళీ చూసే భాగ్యం లభిస్తుందో

లేదో ఇప్పుడే బాగా చూసుకో! మళ్ళీ మళ్ళీ చూసుకో!! తనివితీరా చూసుకో!!!" ఎవరో చెవి దగ్గరకొచ్చి చెప్పినట్లనిపించింది ఆమినాకు.

తన హృదయేశ్వరుడు వెళ్ళిపోతున్నాడు. తన సమస్త జగత్తే వెళ్ళిపోతోంది. అశ్రుధారలు కట్టలు తెంచుకొని చెక్కిళ్ళపై జాలువారాయి.

అబ్దుల్లా కూడా అర్థాంగి వైపు మూగబాధతో కడసారి చూసి కదలి వెళ్ళారు.

తోటి వర్తకులతో పాటు అబ్దుల్లా పట్నం వీధుల గుండా ఒంటె మీద వెళ్తుంటే ఒక చోట కొందరు యువతులు నిల్చొని గుసగుసలాడుకోసాగారు:

"చూశావటే! ఆమిర్ ముద్దుల కొడుకు ఒంటెల్ని తీసుకొని వ్యాపారానికి వెళ్తున్నాడు!!" అన్నది ఒక యువతి

"ఆమిర్ ఏమిటే! అతని తండ్రి పేరు అబ్దుల్ ముత్తలిబ్ అయితేను?"

"ఇక చాల్లే ఊరుకో. పొద్దస్తమానం పాటలు పాడుకోవడం, బొమ్మలతో ఆడుకోవడం తప్పించి ఇంకేం తెలుసు నీకు! అబ్దుల్ ముత్తలిబ్ అసలు పేరు ఆమిరే, ఆమిర్. అతనికి షైబా అని కూడా మరో పేరుంది".

"ఓ... అలాగానా! పెద్ద విశేషమే చెప్పావే రోజు"

"అంతేకాదే పిచ్చిమొహమా! మరో విషయం గమనించావా?"

"ఏమిటదీ?"

"పెళ్ళవక ముందు అబ్దుల్లా నుదుటిపై ఓ కాంతికిరణం మెరుస్తుండేది, చూశావా?"

"ఆ... ఔనౌను చూశాను. కాని అదిప్పుడు కన్పించడం లేదేమిటీ?"

"అదేనే విశేషం! తెలుసుకోవాల్సిన అసలు విషయం!! పెళ్ళయిన తరువాత ఆ కాంతికిరణం అదృశ్యమయింది."

"ఏమయి ఉంటుందబ్బా....."

"నువ్వుత్త అమాయకురాలివిలా ఉన్నావు. లోకజ్ఞానం బొత్తిగా లేదు. ఓసారి ఆమినా ముఖం చూసిరా, తెలుస్తుంది."

ఈ గుసగుసలు విని విననట్లు అబ్దుల్లా ముందుకు సాగాడు.

ఆమినా మేడ మీదెక్కి ఒంటెల పంక్తిని కనుమరుగయ్యే దాకా చూసి ఆ తరువాత బరువెక్కిన హృదయంతో భారంగా అడుగులు వేస్తూ క్రిందికి దిగి యథాప్రకారం తన దైనందిన కార్యకలాపాల్లో లీనమయి పోయారు.

# గజరాజు గారడి-(6)

మక్కా పట్నం కాలచక్రంతోపాటు ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా చరిత్ర పుటలు దాటుకుంటూ నిశ్చింతగా ముందుకు సాగిపోతోంది. చిన్న చిన్న సంఘటనలు మినహా భావితరాలు చెప్పుకోదగ్గ ప్రత్యేక ఉదంతాలేవీ సంభవించడం లేదు. అందువల్ల పట్టణ ప్రజలు ప్రశాంతజీవితం గడుపుతున్నారు. కాని ఈ ప్రశాంత పరిస్థితి ఎంతో కాలం సాగలేదు. ఉన్నట్లుండి ఓరోజు పిడుగు లాంటి వార్త విన్పించింది!



"యమన్ రాజు అబ్రహా మక్కాపై దాడి చేయడానికి వస్తున్నాడట!!"

ఈ వార్త క్షణాల్లో పట్నమంతా కార్చిచ్చులా వ్యాపించిపోయింది. జనం తీవ్రమైన ఆందోళనకు గురయ్యారు. వారి గుండెల్లో గుర్రాలు పరుగెత్తడం మొదలయింది.

కాబా మందిరం కారణంగా మక్కా పట్టణం గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా, వాణిజ్య కేంద్రంగా భాసిల్లుతూ పట్టణ ప్రజలకు యావత్తు అరేబియాలో మంచి పేరు ప్రతిష్ఠలతో పాటు, ఆర్థిక ప్రయోజనాలు కూడా చేకూర్చుతోంది. దీంతో అసూయ చెందిన అబ్రహా తన రాజధాని నగరంలో కాబాను పోలిన ఓ మందిరం నిర్మించి అరబ్బుల్ని దానివైపు తిప్పుకోవడానికి ప్రయత్నించాడు.

అదీగాక అరబ్బుల మతభావాలను రెచ్చగొడ్తూ నూతన మందిర నిర్మాణం గురించి ఓ బహిరంగ ప్రకటన కూడా చేయించాడు. దాంతో కొందరు అరబ్బు యువకులు రెచ్చిపోయి ఆ చర్చికి నిప్పంటించారు. అంతే, అబ్రహా ఆగ్రహోదగ్రుడయి పోయాడు. తీవ్రమైన ప్రతీకారంతో మక్కా ప్రజలపై మండిపడుతూ పెద్ద ఎత్తున సైన్యాన్ని సమాయత్తపరిచాడు.

అరవై వేలమంది నీగ్రో యోధులతో కూడిన ఈ సైనిక వాహిని నురుగులు కక్కుతూ ముందుకు సాగింది. కాల్బలం, అశ్వబలం, గజబలాలతో కాలనాగులా బుసలు కొడుతూ మక్కా దిశగా దూసుకొస్తోంది. సంఖ్యాబలంతో బలుపెక్కిన యమన్‌రాజు దారిలో కనపడిన ఒంటెలన్నిటినీ దోచుకుంటూ మక్కా శివార్లలోకి వచ్చి విడిది చేశాడు.

ఆ ప్రాంతం సైనిక కోలాహలంతో మార్మోగిపోయింది. అక్కడ వందలాది గుడారాలు వెలిశాయి. అబ్రహా తనకోసం వేసిన ప్రత్యేక శిబిరంలో కూర్చొని ఆజ్ఞలు జారీచేయ సాగాడు. అతను కష్టపడకుండా తన సైనికుల రక్తం చిందకుండా ఖురైషీయులను మాటలతో బెదిరించి వారి కాబామందిరాన్ని కూలగొట్టడానికి నిర్ణయించుకున్నాడు. అది ఫలించకపోతే యుద్ధజ్వాలలు రగిలించి మక్కాను మట్టుపెడదామని భావించాడు. వెంటనే అతను హనాతా హుమైరీ అనే ఓ దండనాయకుడ్ని పిలిచి ఇలా చెప్పాడు:

"హుమైరీ! నువ్వు తక్షణమే మా ప్రత్యేక దూతగా మక్కా వెళ్ళి అక్కడి ప్రధాన నాయకుడ్ని కలుసుకో. అతనితో మా మాటలుగా ఇలా చెప్పు: 'మేము మీ కాబా మందిరం పడగొట్టడానికి వచ్చాం. మమ్మల్ని మీరు ఎట్టి పరిస్థితిలోనూ ఎదుర్కోలేరు. మీ దగ్గర అంతటి సైనికశక్తి లేదు. ఒకవేళ మా మాటలు పెడచెవిన పెట్టి దుస్సాహసానికి ఒడిగడ్తే మీరు సర్వనాశనమవుతారు. మా ఉద్దేశ్యం కాబాను పడగొట్టడం మాత్రమే. మీరు మా దారికి అడ్డురాకపోతే మేము మక్కా ప్రజల ధన మాన ప్రాణాలకు ఎలాంటి హాని కలిగించమని హామీ ఇస్తున్నాం."

హుమైరీ ఈ ఉత్తర్వు తీసుకొని మక్కా బయలుదేరాడు.

మక్కా ప్రజలు అబ్రహా సైన్యం వచ్చిందని విని ఇంతకు ముందునుంచే ఆందోళన చెందుతూ ఉన్నారు. ఇప్పుడు హుమైరీ పట్నంలో ప్రవేశించడం చూసి వారు మరింత

ఆందోళన పడసాగారు. హుమైరీ మక్కా నాయకుడి నివాసం ఎక్కడుందో ప్రజలను అడిగి నేరుగా అక్కడికి చేరుకున్నాడు. అతను అబ్దుల్ ముత్తలిబ్‌ని కలుసుకొని తాను యమన్ రాజు అబ్రహా ప్రత్యేక దూతగా వచ్చానని తెలియజేశాడు.

“రండి, కూర్చోండి” అన్నారు అబ్దుల్ ముత్తలిబ్ అతడ్ని సాదరంగా ఆహ్వానిస్తూ.

“నేను మా రాజుగారి నుండి ఒక సందేశం తెచ్చాను” అన్నాడు హుమైరీ.

“చెప్పండి ఏమిటో ఆ సందేశం.”

“మా రాజుగారు కాబా మందిరం పడగొట్టడానికి అరవై వేలమంది సైనికులతో వచ్చారు. మీరీ సైన్యాన్ని ఎట్టి పరిస్థితిలోనూ ఎదుర్కోలేరు. మక్కా ప్రజల పట్ల మా రాజుకు ఎలాంటి ద్వేషం, విరోధం లేవు. కాబాను కూలగొట్టడమే ఆయన లక్ష్యం. అంచేత మీరు ఆయన దారికి అడ్డురాకండి. మా దారికి అడ్డురామని మీరు మాటిస్తే మక్కా ప్రజల ధన మాన ప్రాణాలకు నేను హామీ ఇవ్వగల్గుతాను” అన్నాడు రాజదూత.

“మాకు మీ రాజును ఎదుర్కొనే శక్తి లేదు. ఎదుర్కోవడానికి ప్రయత్నించం కూడా. కానీ కాబా దేవుని ఆలయం. ఆయనే తలచుకుంటే తన ఆలయాన్ని కాపాడుకుంటాడు” అన్నారు అబ్దుల్ ముత్తలిబ్ నిర్భయంగా.

“సరే, మీరు మా రాజుగారి దగ్గరికి రండి. మీరు చెప్పదలచుకున్నదేమిటో ఆయన ముందు చెప్పుకోండి” అన్నాడు రాజదూత.

అబ్దుల్ ముత్తలిబ్ తన సహచరులతో సంప్రదించి హుమైరీ వెంట బయలుదేరారు. అబ్రహారాజు ఆయన ముఖ వర్చస్సు, ఠీవి, దర్పం, హుందాతనాలు చూసి ఎంతో ప్రభావితు డయ్యాడు. వెంటనే ఆసనం మీద నుండి లేచి ఎదురెళ్ళి స్వాగతం చెప్పాడు. అంతేకాదు, ఆయన్ని తన పక్కన కూర్చోబెట్టుకున్నాడు.

“చెప్పండి. మా నుండి మీరేం కోరుతున్నారు?” అడిగాడు అబ్రహా.

“ఏముంది చెప్పడానికి ప్రత్యేకంగా. మీరు పట్టుకున్న నా ఒంటెలు తిరిగి ఇప్పించండి చాలు” అన్నారు అబ్దుల్ ముత్తలిబ్ నిర్లక్ష్యంగా.

ఈ మాట విని అబ్రహా నిర్ఘాంతపోయాడు. అతని ముఖకవళికలు మారిపోయాయి.

“ఏమిటీ! ఒంటెల్ని ఇవ్వాలా!! మిమ్మల్ని గురించి నేను ఏదేదో అనుకున్నాను. మీ రూపురేఖలు చూసి ప్రభావితుడై మీరెంతో గొప్ప నాయకుడని భావించాను. కాని మీరిప్పుడు ఒంటెలు అడిగి నాదృష్టిపథం నుండి దిగజారిపోయారు. మీ తాతముత్తాతల ఆరాధనా కేంద్రం, శాంతినిలయమైన కాబా గురించి ఒక్కమాటా ప్రస్తావించలేదు. మీ ఒంటెల్ని తిరిగిచ్చెయ్యమని మాత్రం అడుగుతున్నారు!” అన్నాడు అబ్రహా ముఖం చిట్లించుకొని.

“నేను నాఒంటెలకు మాత్రమే యజమానిని. అంచేత వీటిని గురించే నేను మిమ్మల్ని అభ్యరిస్తున్నాను. ఇక కాబా సంగతంటారా? దానికి దాని యజమాని, ప్రభువు అయిన దేవుడు ఉన్నాడు. ఆయనే దాన్ని కాపాడుకుంటాడు” అన్నారు అబ్దుల్ ముత్తలిబ్.



“ఊ...ఆ దేవుడు కూడా కాబాను నా పట్టు నుండి కాపాడలేడు” అన్నాడు అబ్రహా హుంకరిస్తూ. “ఆ సంగతి మీకూ, ఆయనకే తెలియాలి. మధ్యలో నాకెందుకీ గొడవ” అన్నారు అబ్దుల్ ముత్తలిబ్.

అబ్రహా ఓ సైనికుడ్ని పిలిచి ఆయన ఒంటెల్ని ఆయనకు ఇచ్చేయమని ఆజ్ఞాపించాడు. అబ్దుల్ ముత్తలిబ్ ఒంటెల్ని తోలుకొని అక్కడ్నుంచి పట్నానికి బయలుదేరారు.

పట్నంలో ప్రజలు ఊపిరి బిగబట్టి ఆయన రాకకోసం వేయి కళ్ళతో ఎదురుచూడసాగారు. ఆఖరి క్షణంలోనైనా ఏదైనా మహత్యం జరిగి యుద్ధనివారణ కృషి ఫలిస్తుందేమోనని కూడా కొందరు ఆశలు పెట్టుకున్నారు. అయినా వారి గుండెలు ఎందుకో కీడెంచుతూ దడదడా కొట్టుకోసాగాయి.

అబ్దుల్ ముత్తలిబ్ ఇంటికి తిరిగొచ్చారు. ఆయన తన సహచరులకు విషయం తెలియజేసి తరువాతి కార్యక్రమం గురించి వారితో చర్చించారు. ఆ తరువాత పట్నంలోని వారంతా తక్షణమే తమ తమ భార్యాపిల్లల్ని తీసుకొని కొండగుహల్లోకి పారిపోయి దాక్కోవాలని ఓ బహిరంగ ప్రకటన గావించారు.

ఈ ప్రకటన వినగానే ప్రజలు భీతావహులయి ఇళ్ళూ, వాకిళ్ళూ వదిలేసి కట్టుబట్టలతో కొండ గుహల్లోకి పారిపోయారు. అబ్దుల్ ముత్తలిబ్, కొందరు ఛోటా నాయకులతో కలిసి కాబా మందిరంలో ప్రవేశించారు.

మందిరంలో వందలాది దేవతా విగ్రహాలు భక్తుల నుండి పూజలు అందుకోవడానికి తహతహలాడుతున్నట్లు కన్పిస్తున్నాయి. కాని పూజారులు కూడా ప్రాణం మీది తీపుతో కొండల్లోకి పారిపోయారు. అందువల్ల నిత్యం ధూపదీపాలతో కళకళలాడే ఈ దేవతలు ఆరోజు ఏ నైవేద్యానికి నోచుకోలేక వెలవెలపోయాయి.

మందిరంలో మొత్తం మూడు వందల అరవై విగ్రహాలున్నాయి. వాటిలో ఇబ్రాహీం (అలైహి), ఇస్మాయీల్ (అలైహి), ఈసా (అలైహి) విగ్రహాలు కూడా ఉన్నాయి. ఈసా మాతృమూర్తి హజ్రత్ మర్యం (అలైహి) విగ్రహం కూడా ఉంది. గర్భగుడి కప్పుపై హుబల్ దేవతా విగ్రహం ఉంది. ఇది అన్నిటికంటే పెద్ద విగ్రహం. దీని ఎడమ చేయి విరిగిపోతే ఆ స్థానంలో బంగారపు చేయి చేయించి తగిలించారు. జమ్‌జమ్ బావిఒడ్డు మీద ఇరుపక్కలా రెండు విగ్రహాలున్నాయి. ఒకటి పురుష విగ్రహం, మరొకటి స్త్రీ విగ్రహం. ఇవిగాక జంతువుల ఆకారాలు గల విగ్రహాలు కూడా ఎన్నో ఉన్నాయి.

అబ్దుల్ ముత్తలిబ్, ఆయన సహచరులు ఈ విగ్రహాలన్నిటిని వదిలేసి గర్భగుడిపై కప్పిన గలేబుని పట్టుకొని నిల్చున్నారు. వారికి తాము రోజూ పూజిస్తున్న విగ్రహాలు, ఇతర మిథ్యా దైవాలు గాకుండా అందర్నీ సృష్టించిన నిజ దేవుడు గుర్తుకొచ్చాడు. అబ్దుల్ ముత్తలిబ్ కాబా గలేబు పట్టుకొని ఇలా ప్రార్థించారు:

“దేవా! నీ దాసుడు తనగృహాన్ని కాపాడుకుంటాడు. నీవు కూడా నీగృహాన్ని కాపాడుకో. రేపు నీగృహాన్ని నీశత్రువులు నాశనం చేయడానికి వస్తున్నారు. వారి ప్రయత్నాల్ని వమ్ము చేయి. ఒకవేళ నీవు వాళ్ళను, ఇటు మా జాతిప్రజల్ని ఎవరి మానాన వారిని వదిలేయ

దలచుకుంటే నీఅభీష్టానికి అడ్డుపడేవారుండరు. దేవా! నేను నిన్నే నమ్ముకున్నా. శత్రువుల నుండి కాబాను రక్షించు. మాపట్టణం నాశనం కానివ్వకుండా వాళ్ళను అడ్డుకో.”

ఇలా ప్రార్థించి ఆయన కూడ తన సహచరులతో కొండగుహల్లోకి వెళ్ళి దాక్కున్నారు.

మరుసటి రోజు ఉదయాన్నే అబ్రహా రాజు సైన్యాన్ని తీసుకొని మదపుటేనుగుపై అట్టహాసంగా ముందుకు సాగాడు. అలా ముజ్దలిఫా దాటి మహస్సిర్ లోయలో ప్రవేశించ గానే అబ్రహా కూర్చున్న ఏనుగు హఠాత్తుగా ఆగి చతికిలబడింది. దాన్ని లేపి కాబా దిశగా నడపడానికి ప్రయత్నిస్తే అటువైపు ఒక్క అడుగు కూడా వేయనని మొరాయించింది. కాబా ఉన్న దిశకు గాకుండా మరో దిక్కుకు మళ్ళించి అదిలించగానే అది లేచి హుషారుగా పరుగెత్త సాగింది. తిరిగి కాబా వైపు మళ్ళించగానే కూలబడి పోయేది.

అంతలో ఎటునుంచో ఓ పెద్ద పక్షులగుంపు వచ్చిపడింది. ఆ మరుక్షణమే సైన్యం మీద పక్షుల కాళ్ళు, ముక్కుల నుండి కంకర్రాళ్ళు పడనారంభించాయి. ఆ చిన్న రాళ్ళతోనే సైనికుల శరీరాలు తూట్లు పడసాగాయి. దాంతో వారు బెంబేలెత్తిపోయి పెడబొబ్బలు పెడుతూ ఎటుబడితే అటు పారిపోవడానికి ప్రయత్నించారు.

కొన్ని క్షణాల్లోనే ఏనుగుల ఘీంకారాలతో, గుఱ్ఱాల సకిలింపులతో, సైనికుల హాహా కారాలతో సర్వత్రా భీతావహ వాతావరణం నెలకొంది. తీవ్రమైన తొక్కిసలాట ఏర్పడింది. శవాలు గుట్టలు గుట్టలుగా పడసాగాయి.

ఈ పరిస్థితి చూసి అబ్రహా గగ్గోలుపెట్టాడు. అతను కూడా కంకర్రాళ్ళ దెబ్బలతో రక్తసిక్తుడై పారిపోయాడు. కాని దారిలోనే అతని వళ్ళు హూనమైపోయింది. అతని చేతివ్రేళ్ళు తోటకూర కాడల్లా వ్రేలాడపడ్డాయి. రాజధాని చేరుకునేటప్పటికి మొండి చేతులు, మొండి కాళ్ళయి పోయాయి. రొమ్ముమీది మాంసంతో సహా చర్మం ఊడిపోయి గుండెకాయ బయటికి వచ్చింది. దాంతో అతను దభేలున నేలమీద పడి ఊపిరి విడిచాడు.

“నీ ప్రభువు ఏనుగుల వాళ్ళను ఏం చేశాడో తెలియదా? ఆయన వారి (దుష్ట) యత్నాలను వమ్ముచేయలేదా? వారి మీదికి ఆయన పక్షుల్ని గుంపులు గుంపులుగా పంపాడు. అవి వారి మీద కంకర్రాళ్ళు విసరి పడేశాయి. దాంతో వారు పశువులు తిని ఆగం చేసిన మేతలా (సర్వనాశనం) అయ్యారు.” (ఖుర్‌ఆన్–105:1–5)

కొండగుహల్లో దాక్కొని ఇదంతా గమనిస్తూ ఉండిన మక్కాపౌరులు చల్లగా ఊపిరి పీల్చుకొని తమ తమ ఇండ్లకు తిరిగొచ్చారు.

అటు అబ్రహా చనిపోగానే సైఫ్ బిన్ జీయజన్ అనే అతను యమన్ రాజ్యాన్ని హస్తగతం చేసుకున్నాడు. ఈ వార్త అందగానే అబ్దుల్ ముత్తలిబ్ అతణ్ణి అభినందించడానికి కొందరు పెద్దలను వెంటబెట్టుకొని యమన్ రాజధాని ‘సనా’ చేరుకున్నారు.

యమన్ కొత్తరాజు ఖురైష్ నాయకులకు ఘనంగా స్వాగతం చెప్పి సత్కరించాడు. ఆ సందర్భంలో అతను మాట్లాడుతూ “యావత్తు అరేబియా ప్రజలతోపాటు అనేక జాతులు ఎదురుచూస్తున్న అంతిమ దైవప్రవక్త మీ సంతతిలో ఉద్భవిస్తాడ”ని తెలియజేశాడు.



సైఫ్ క్రైస్తవ, యూద మతాలను బాగా అధ్యయనం చేసిన గొప్ప పండితుడు కూడా. అందువల్ల ఈ శుభవార్త విని ఖురైష్ నాయకులు ఎంతో సంతోషించారు.

యూదపండితులు, ధర్మవేత్తలు, క్రైస్తవ తత్వవేత్తలతోపాటు అనేకమంది జ్యోతిష్కులు త్వరలోనే అరేబియాలో అంతిమ దైవప్రవక్త ప్రభవించబోతున్నాడని ప్రకటించారు. ఈ భవిష్యత్ ప్రకటనల మధ్య కాలచక్రం ముందుకు సాగుతూ తన విధినిర్వహణలో యాభైరోజులు దాటింది.

# శుభోదయం-(7)

ఆ తరువాత ఓరోజు రాత్రి మిలమిల మెరిసే నక్షత్రాల విశేష కాంతిపుంజాలతో మక్కా పట్నం మెరిసిపోవడం ప్రారంభించింది.

ఆ రాత్రి అనంతకోటి కాంతులతో అందాల జాబిలి ఎవరి కోసమో స్వాగత గీతిక పాడుతూ పరవశించిపోతోంది. మరో వైపు కొండగుహల నుండి వీస్తున్న వింత వాయువులు మధుర ధ్వనులతో మనసుల్ని రంజింపజేస్తున్నాయి.

ఎంతో ఆహ్లాదకరమైన ఆ వాతావరణంలో మక్కా పట్నం తియ్యటి స్వప్న జగత్తులో మైమరచి పోయింది. అలా చీకటి తెరల కింద అంతా సద్దుమణిగినప్పటికీ అక్కడక్కడ కొందరు స్త్రీలు ఆదరాబాదరాగా లేచి అబ్దుల్ ముత్తలిబ్ ఇంటికి చేరుకుంటున్నారు.

ఆ రాత్రి అబ్దుల్ ముత్తలిబ్ స్వగృహం నలువైపులా కాంతి కిరణాలు విరజిమ్ముతూ మనోహర సౌందర్యంతో వెలిగిపోతూ మానవాళికేదో మూగ సందేశం ఇస్తోంది. లోపల అనేక మంది ఆడవాళ్ళు ఆమినా చుట్టూ గుమికూడారు.

ఆ ఇంటిపై దివ్యకాంతులు క్షణక్షణానికి తేజోవంతమై పోతున్నాయి.

ఏమిటీ ఈ తేజస్సు? ఎక్కడ్నుంచీ ఈ కాంతిపుంజాలు??

అదిగో! దైవగృహంపై కూడా అచ్చం అదే తేజస్సు!! అవే కాంతిపుంజాలు!!!

ఆశ్చర్యం! అత్యంతాశ్చర్యం!! కాబామందిరం నుంచి అబ్దుల్ ముత్తలిబ్ ఇంటిదాకా రత్నాలు వెదజల్లిన రహదారిలా ఏమిటీ ఈ వింత వెలుగు? దివి నుండి దేవదూతలు, దేవతా కన్యలేమైనా దిగి వస్తున్నారా??

ఆ తేజస్సు ముందు పండువెన్నెల కూడా పటాపంచలై పోయింది. మిలమిల మెరిసే నక్షత్రాలు కూడా వెలవెల పోయాయి.

కనువిందు చేస్తున్న ఆ కాంతులేమిటో అర్థంగాక మక్కా ప్రజలు మంత్ర ముగ్ధులై చూడసాగారు. ఘడియలు, గంటలు గడచిపోతున్నాయి. ఉషఃకాంతులతో నక్షత్రాలు క్రమంగా పల్చబడుతున్నాయి. చూస్తుండగానే ప్రాక్దిగ్మండలంలో అత్యంత ప్రకాశవంతమైన నక్షత్రం వెలిసింది.

అసాధారణమైన నక్షత్రం అది. నిన్నటిదాకా లేని ఈ నవతార నేడెక్కడ్నుంచి వచ్చింది? ఏ శుభసందేశం అందజేయడానికి వచ్చిందో?!

కోడి కూతలతో కొందరు మేల్కొన్నారు. దైనందిన కార్యకలాపాలు ప్రారంభించడానికి ముందు వారు తమ ఇష్టదైవాలను పూజించుకోవడానికి సమాయత్తమయ్యారు. కాని పూజాగదుల్లోకి వెళ్ళి చూస్తే విగ్రహాలు బోర్లాపడి ఉన్నాయి.

బహుశా ఏదో గాలిదుమారం వచ్చి పడేసి ఉంటుందని తలచి వారు ఎంతో భక్తి శ్రద్ధలతో వాటిని లేపి నిలబెట్టేందుకు ప్రయత్నించారు. కాని అదేమిటోగాని, ఎంత ప్రయత్నించినా అవి నిలబడమని మొండికేశాయి.

"ఏమయింది ఈరోజు నా దేవత కింద పడిపోతోంది? నిద్రొస్తోంది కాబోలు! కాని విగ్రహాలు నిద్రపోవడం ఏమిటీ నా మతిమండ! కొంపదీసి నా మీద కోపమేమైనా రాలేదు కదా! పోనీ మరోసారి నిలబెడతా" అంటూ ఓ వృద్ధుడు విగ్రహాన్ని గోడకానిచ్చి నిలబెట్టాడు.

తరువాత అతను దానికెదురుగా సాగిలబడి సాష్టాంగ ప్రణామం చేశాడు. కాని లేచి చూస్తే ఆ విగ్రహం మళ్ళీ కిందపడి ఉంది.

అంతలో అక్కడికి ఓయువతి వచ్చి "తాతా! చూశావా ఎంత ప్రయత్నించినా ఆ విగ్రహాలు నిలబడటంలేదు. నువ్వే చూద్దువుగాని రా" అన్నది ఆమె అతని చేయి పట్టుకుంటూ.

అంతకుముందే విసిగిపోయి ఉన్న ఆ ముసలోడు చిరాగ్గా చేయి విదిలించి "కన్పడ్డం లా ఇక్కడి పరిస్థితి? వీటినే నిలబెట్టలేక నేనిక్కడ చస్తున్నా" అన్నాడు.

అబ్దుల్ ముత్తలిబ్ ఇంట్లో ఆమినా చిత్రవిచిత్ర అనుభూతులకు లోనవుతూ ఉంది. అంతలో ఆమె కర్ణపుటాలకు అకస్మాత్తుగా కొన్ని మృదువచనాలు తాకాయి:

"ఆమినా! ఇదిగో ఈమె ఇస్మాయీల్ జబీవుల్లా తల్లి హాజిరా (రజి)."

"ఈమె ఈసా రూహుల్లా మాతృమూర్తి మర్యం (అలైహి)."

కాస్సేపటికి భళ్ళున తెల్లవారింది. ఆరోజు దినకరుడు కూడా చల్లని కాంతి కిరణాలతో ప్రత్యక్షమయ్యాడు చిరునవ్వులు చిందిస్తూ.

వాతావరణం హృదయాల్ని ఉల్లాసపరుస్తోంది. మలయ మారుతం మందహాసం చేస్తోంది. చిగురుటాకులపై పడిన మంచుబిందువులు ముత్యాల్లా మెరిసిపోతున్నాయి.

ఎటునుంచో చల్లని పవనవీచికలు వీస్తూ ఎదలను గిలిగింతలు పెడ్తున్నాయి.

ఏవో అవ్యక్త మంజుల మధురభావనలు శూన్యజగతిని చైతన్యవంతం చేస్తున్నాయి. ఆ చైతన్య స్రవంతిలో కుసుమకన్యలు తేలియాడుతూ, తన్మయత్వం చెందుతూ సుగంధ పరిమళాలు వెదజల్లుతున్నాయి.

అంతటా ఆనందమయం! సర్వత్రా శోభాయమానం!! దివి అంతా ఏకంగా భువికే దిగి వచ్చినట్లుంది. అలాంటి శుభతరుణంలో ఉన్నట్లుండి అబ్దుల్ ముత్తలిబ్ ఇంట్లో ఒక్కసారిగా ఆనంద కుసుమాలు వెల్లివిరిశాయి. పట్టలేని సంతోషంతో ఓ పడతి లోపల్నుంచి బయటికి పరుగెత్తుకొచ్చింది.



"అబ్దుల్ ముత్తలిబ్‌కు శుభవార్త చెప్పండి. ఆయనకు మనమడు పుట్టాడు" అని చెప్పి ఆమె మళ్ళీ తుర్రున లోపలికి పరుగెత్తింది.

ఈ శుభవార్త వినగానే అబ్దుల్ ముత్తలిబ్ సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయారు. ఆ సంతోషంతో ఆయన ఒక్క ఊపులో వచ్చి ఇంట్లో వాలారు. మనవడ్ని వెయ్యి కళ్ళతో చూసుకొని ఎంతో మురిసిపోయారు.

ఆమినా ఒడిలో అనిర్వచనీయమయిన కాంతులు వెదజల్లుతున్న ఆ అందాల బాలచంద్రుడ్ని చూసి ఆనందించని వారే లేరు. స్త్రీలయితే సంతోషాతిశయంతో పాటలు పాడటం ప్రారంభించారు.

ఆ తరువాత నామకరణం కోసం ఆ నారీమణులలో గుసగుసలు బయలుదేరాయి.

ఆ సంగతి గ్రహించిన అబ్దుల్‌ముత్తలిబ్ "నా ముద్దుల మనవడికి ఏంపేరు పెడతారో అని ఆలోచిస్తున్నారా? మా యీ రతనాలమూటకు ఎప్పుడో పేరు పెట్టేశాం" అన్నారు.

"ఏం పేరు పెట్టారు?"

"అహ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)."

"అహ్మద్....! ఎంత చక్కని పేరు!!"

"ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా. భువి పైనేకాదు, దివిపై కూడా నా మనవడి పేరు వెలిగిపోవాలి మరి."

ఈ పేరు వినగానే ఆమినా పెదవులపై చిరునవ్వు తొణికిసలాడింది. తన మనసులోని మాటే మామయ్య నోట వెలువడినట్లు ఆమె మనసులోనే సంబరపడి పోయారు.

ఈపేరు గురించి జనం చోద్యంగా చెప్పుకోసాగారు. "అబ్దుల్లాకు కొడుకు పుట్టాడట. పేరు చాలా విచిత్రంగా ఉంది." ఎవరి నోట విన్నా ఇవే మాటలు. బంధువులు, మిత్రులు, అభిమానులు జట్లుజట్లుగా వచ్చి అబ్దుల్‌ముత్తలిబ్‌ని అభినందనల్లో ముంచెత్తసాగారు.

ఈ శుభవార్త విన్న సౌబియా అనే బానిసమహిళ పరుగు పరుగున వెళ్ళి దాన్ని తన యజమాని అబూలహబ్‌కు తెలియజేసింది.

అబులహబ్ సంతోషిస్తూ "సౌబియా! నా తమ్ముడు అబ్దుల్లాకు కొడుకు పుట్టాడని శుభవార్త విన్పించావు నాకు. దీనికి ప్రతిఫలంగా నేను నిన్ను బానిసత్వం నుంచి విముక్తం చేస్తున్నా" అన్నాడు.

"ఏవిటీ తమరు నాకు సేచ్ఛ ప్రసాదించారా! ధన్యురాలిని. నేను మీ రుణం ఎలా తీర్చుకోవాలో అర్థంకాడం లేదు" అన్నది సౌబియా సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ.

అయితే ఆమినా తన కొడుక్కు ఆయాను పెట్టుకునే వరకు అతనికి నువ్వు పాలిస్తూ ఉండు" అన్నాడు అబూలహబ్.

"మహాప్రసాదం. దానికోసరం ఇప్పుడే వెళ్తున్నా" అంటూ వెళ్ళిపోయింది సౌబియా.

ఈవార్త మక్కా శివార్లలోని ఓ లోయలో ఉంటున్న అయిస్ అనే ఓ క్రైస్తవ సన్యాసి చెవుల్లో కూడా పడింది. అతను ఆ లోయలో సర్వసంగ పరిత్యాగి అయి నిరంతరం దైవ ధ్యానంలో గడుపుతున్న గొప్ప మతపండితుడు కూడా.

అంచేత జనం తరచుగా అతని దగ్గరకెళ్ళి భక్తితో కానుకలు సమర్పించుకుంటారు. అబ్దుల్ ముత్తలిబ్ కూడా అతని దగ్గరకు పోయి వస్తుంటారు. మనవడు పుట్టగానే ఈ శుభవార్త చెప్పడానికి ఆయన అయిస్ దగ్గరకు వెళ్ళారు.

క్రైస్తవసాధువు ఆయన్ని చూడగానే "ఏమిటీ విశేషం, ఈరోజు మీరు చాలా ఉత్సాహం గా ఉన్నారు?" అని అడిగాడు చిరునవ్వుతో.

"విశేషమే మరి. ఓ శుభవార్త తెచ్చాను. మీరేమో భార్యాపిల్లల బాదరాబందీ లేకుండా ఇక్కడ ఒంటరిగా కూర్చుంటే సంగతులెలా తెలుస్తాయి?" అన్నారు అబ్దుల్ ముత్తలిబ్.

"సరే చెప్పండి ఆ శుభవార్త ఏమిటో?"

"ఈరోజు మా అబ్దుల్లాకు కొడుకు పుట్టాడు. ఎంతో అందమైన పిల్లాడు. ఈ బాలుడి సౌందర్యం యావత్తు మక్కాపట్నంలో సంచలనం సృష్టించింది. ప్రజల అభినందనలు స్వీకరించలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నానంటే నమ్మండి."

"ఇంతకూ అబ్బాయి పేరు ఏం పెట్టారు?"

"ముహమ్మద్ (సల్లం)" గర్వంగా చెప్పారు అబ్దుల్ ముత్తలిబ్.

"శుభం శుభం" ఈ పిల్లవాడ్ని గురించే నేను మీకు ఇంతకాలం నుంచి చెబుతూ వచ్చాను. మూడు కారణాలతో నేనీ బాలుడ్ని గుర్తించాను."

"ఏమిటా మూడు కారణాలు?"

"ఒకటి, ఇదివరకెన్నడూ చూడని ఒక నక్షత్రం రాత్రి ఉదయించింది. రెండు, పిల్లవాడు పుట్టిన రోజు సోమవారం. మూడు, అతని పేరు ముహమ్మద్ అని పెట్టారు. అబ్దుల్ ముత్తలిబ్! మీరు ఎంతో అదృష్టవంతులు. చరిత్ర మీవంశాన్ని ఎన్నటికీ మరచిపోదు" అన్నాడు క్రైస్తవసాధువు, అబ్దుల్ ముత్తలిబ్‌ని అభినందిస్తూ.

అబ్దుల్ ముత్తలిబ్ అమితమయిన సంతోషంతో తన్మయత్వం చెందుతూ ఇంటికి తిరిగొచ్చారు. అసాధారణ వంశాంకురం, అపురూప సౌందర్యవంతుడయిన మనుమడు పుట్టిన తరువాత ఆయన కోడలు ఆమినాను మరింత అభిమానించసాగారు.

# విషాద సాగరం-(8)

అసామాన్య తేజస్సుతో వెలిగిపోతున్న బాలుడ్ని చూసుకొని ఆమినా అమితానందంతో పొంగిపోయారు. ఈ సమయంలో భర్త కూడా వుంటే ఎంత బాగుండేది!

బాబు ముఖంలో ఆమెకు, ఒంటెక్కి తన వైపు కడసారిగా చూస్తున్న భర్త ఛాయలు కన్పించాయి. "కొడుకును చూసుకొని ఎంత మురిసిపోతారో ఆయన!"



"ఆయన సిరియా నుంచి ఎప్పుడు తిరిగొస్తారు? అసలు వ్యాపారం కోసం పోతే సిరియాలో ఆయన ఎన్నాళ్ళు ఉంటారో!"

"ఆయన్ని చూట్టానికి తానే సిరియా బయలుదేరితే.......? వడిగా నడిచే ఒంటెక్కి వెళ్తే మక్కా నుంచి ప్రయాణం ఎన్ని రోజులు పడ్తుంది.....?"

ఇలా ఆమినా, మనసులో పరిపరి విధాలా ఆలోచించుకుంటూ భర్త రాక కోసం వేయి కళ్ళతో ఎదురు చూడసాగారు. భర్త గురించి సిరియా నుంచి వచ్చే ప్రతి వాణిజ్య బృందాన్ని ఆమె అడగడం ప్రారంభించారు.

"ఎవరు అబ్దుల్ ముత్తలిబ్ కొడుకు అబ్దుల్లానా? అతడ్ని ఫలానా కొండ ప్రాంతం గుండా తోటి వర్తకులతో కలసి పోతుంటే చూశాం".......''ఫలానా చోట విడిది చేసి ఒంటెలకు మేత వేస్తుంటే చూశాం"......"ఆయన్ని ఫలానా ఊళ్లో ఒంటె మీదెక్కి పోతుంటే చూశాం...."

"అంతేనా! సిరియా నుంచి తిరిగొస్తుంటే ఎవరూ చూడలేదా?" ఆమినా కాస్తంత నిరుత్సాహ పడ్డారు.

"ఏమయినప్పటికీ తన హృదయేశ్వరుడు ఈపాటికి సిరియా నుంచి బయలుదేరి ఉండవచ్చు. ఎరుపు ఒంటెపై రాజదర్పంతో ఠీవిగా కూర్చొని భుజానికి తన స్వహస్తాలతో కట్టిచ్చిన నీటి తిత్తితో ఆయన ఎప్పుడో అకస్మాత్తుగా వస్తారు."

"ఔనౌను, ఆయన అకస్మాత్తుగా వచ్చి తనను ఆశ్చర్యంలో ముంచెత్తుతారు. ఖర్జూరపు చెట్ల మధ్య నుంచి పున్నమి చంద్రుడిలా ప్రకాశిస్తూ ప్రత్యక్షమవుతారు. బంధు మిత్రులు ఎదురెళ్ళి ఆయనకు ఘనంగా స్వాగతం చెప్తారు."

"అప్పుడు తాను.....తాను సిగ్గుతో తల వంచుకొని....." ఆమినా ఆలోచనా స్రవంతిలో రోజులు, వారాలు, నెలలు గడచిపోతున్నాయి.

కొడుకు రాక విషయమై అబ్దుల్ ముత్తలిబ్ కూడా కొంచెం ఆందోళన పడసాగారు. ఓరోజు సాయంత్రం మదీనా నుంచి వాణిజ్యబృందం వచ్చిందని తెలిసింది.

వర్తకులు సుదీర్ఘ ప్రయాణం వల్ల బాగా అలసిపోయారు. అంచేత తెల్లవారగానే వచ్చి అబ్దుల్ ముత్తలిబ్‌కు కొడుకు గురించి సమాచారం అందజేస్తారు.

కాని అబ్దుల్ ముత్తలిబ్‌కు అప్పటిదాకా ఆగే ఓపిక లేదు. స్వయంగా తానే వాళ్ళను కలుసుకొని కనుక్కుందామని వెంటనే ఇంటి నుంచి బయలుదేరారు.

వర్తకులు అబ్దుల్ ముత్తలిబ్‌ని చూడగానే ఆయన ఉద్దేశం గ్రహించారు. మాటామంతీ అయింది. విషయం తెలియజేశారు.

అబ్దుల్లా సిరియానుంచి మదీనా వచ్చి ఆగాడట. తాము మదీనా నుంచి బయలుదేరి నప్పుడు అతను జ్వరంతో ఉన్నారని వారు తెలియజేశారు.

ఈమాట విని అబ్దుల్‌ముత్తలిబ్ మరింత ఆందోళనచెందారు. కోడలీ సంగతి వింటే దిగులేసుకుంటుందని ఆయన విచారం పైకి కనబడనీకుండా లోలోన అణచివుంచారు.

"అమ్మాయ్! మన అబ్దుల్లా సిరియా నుంచి మదీనా వచ్చి ఉన్నాడటమ్మా! వంట్లో కాస్త నలతగా ఉందట" అన్నారు ఆయన మెల్లిగా.

"ఏమిటీ, వంట్లో నలతగా ఉందా?" తడబడుతూ అడిగారు ఆమినా.

"ఆందోళన పడాల్సినంత నలతేమీ లేదు. సుదీర్ఘ ప్రయాణం కదా, వళ్ళు కదలి కాస్త జ్వరం వచ్చి ఉంటుంది. మన బంధువుల ఇంట్లో బస చేశాడట. వాళ్ళు అన్ని విధాలా అతనికి సేవలు చేస్తూ ఉండవచ్చు. రేపే నేను మదీనాకు హారిస్‌ని పంపిస్తాను. అతను పోయి అబ్దుల్లాను తీసుకొస్తాడు" అన్నారు అబ్దుల్ ముత్తలిబ్.

"శ్రీవారికి జ్వరం వచ్చిందా! మదీనాలో ఆగిపోయారా!! ఓహ్ దైవమా! ఏమిటీ ఈ అగ్ని పరీక్ష!" ఆమె హృదయం బాధగా మూల్గింది.

ఆమినా చుట్టూ విచారమేఘాలు ఆవరించాయి. మనసు కకావికలమై పోయింది. ఒక్కోసారి ఉండి, ఉండి భయంకరమైన ఆలోచనలు వచ్చేవి. అంతలోనే అనిర్వచనీయమైన ఆశాకిరణంతో ఆమె కళ్ళు మెరిసిపోయేవి.

కాని ఆ మెరుపు ఎంతోసేపు ఉండేదికాదు. మేఘమాలికల మధ్య కలువరేడు పరుగిడుతున్నప్పుడు కన్పించే జిలుగువెలుగుల్లా మారిపోయేది వాతావరణం. ఆమె ఆశావనంలో వెలుగునీడలు, ఒకదాన్నిమరొకటి తరుముతున్నాయన్నట్లు తిరుగుతున్నాయి.

"అమ్మగోరూ! తమరీ స్థితిలో అంత విచారంగా ఉండకూడదు. మీ ఆరోగ్యం దెబ్బ తింటది". ఆమినా ఆందోళన గమనించి, సేవకురాలు సలహా ఇచ్చింది.

"కాని.....కాని ఆయన అనారోగ్యంగా ఉన్నారు. పైగా పరదేశంలో......?"

"అయితే ఏమవుద్దీ అంటా?" అన్నది సేవకురాలు మధ్యలోనే మాట తుంచివేస్తూ.

"అసలు ఆరోగ్యమంతులకే గదమ్మగోరూ! రోగాలు వచ్చేది. అందులో అంతబాద పడాల్సిన ఇశేషం ఏముంది? భయపడకండమ్మా! ఈ ఊళ్లో మా అన్న ఒకడున్నాడు. ఆడికి రోగం పోగొట్టే మంత్రం తెల్సు. ఇప్పుడే ఆడి దగ్గర్కి వెళ్తా. ఆడు ఇక్కడ మక్కాలో కూకొని మంత్రం ఊదాడంటే, అమ్మగోరూ! ఇక సూస్కోండి..... అయ్యగారి జరం గిరం దెబ్బకు పారిపోతది" అన్నది ఆమె ఆమినాకు ఊరట కలిగిస్తూ.

అబ్దుల్ ముత్తలిబ్ ఏదో పనుండి బయటికి వెళ్ళిపోయారు. పనిగత్తె వంటపనిలో లీనమైపోయింది. ఇంట్లోని ఇతర స్త్రీలు కూడా తమతమ పనుల్లో మునిగిపోయారు. కాని ఆమినా మనసు మదీనాలోనే ఉండిపోయింది. మాటిమాటికి అవే ఆలోచనలు!

కళ్ళముందు గాలికి రెపరెపలాడుతున్న ఆశాదీపం!!

"అదిగో! ఆయన వచ్చేశారు. ఎన్నెన్నో అనురాగ కుసుమాలు తెచ్చారు. విచారవర్షం వెలసిన తన మానసాకాశంలో ఆనందోత్సాహాల హరివిల్లు సంధించారు......."

"అబ్బ! కొడుకు మీద ఎంత ప్రేమో!! ఆయన బాబును తనివి తీరా చూసుకొని మనసారా నుదుటిని ముద్దాడారు...."



"ఆమినా! బాబుకు ఏం పేరు పెట్టారు?" అడిగారు ఆయన.

"అహ్మద్.....ముహమ్మద్" తను చెప్పింది సిగ్గుతెరల నుంచి తేరుకొని.

కొత్తపేరు విని ఆయన ఎంతో సంతోషించారు. ఇద్దరి మధ్య కొన్ని క్షణాలు మౌనంగా ఆనంద కెరటాలు పరవళ్ళు తొక్కాయి.

"తోటివర్తకులు సిరియా నుంచి ఎప్పుడో తిరిగొచ్చారు. కాని మీరు మాత్రం ప్రయాణంలో చాలా రోజులు గడిపారు" అన్నది తాను చిరుకోపం వెలిబుచ్చుతూ.

"ఏం చెయ్యను ఆమినా! మదీనా దాకా వచ్చానో లేదో జ్వరం వచ్చిపడింది. మీ బంధువుల ఇంట్లోనే గడిపాను. జ్వరం తగ్గిపోగానే బయలుదేరి నీ దగ్గర వాలాను."

"మీ ఆరోగ్యం గురించి విని నేనెంత ఆందోళన పడ్డాననుకున్నారు! రెక్కలు గనక ఉంటే ఎగిరొచ్చి మీ దగ్గర వాలుదామా అన్పించింది అప్పుడు. కాని హాషిం వంశపు స్త్రీలు ఒంటరిగా ప్రయాణం చేయకూడదు కదా! లేకపోతే నేను వడివడిగా నడిచే ఒంటెక్కి అయినా తొందరగా మదీనా చేరుకునేదాన్ని."

.....ఇంట్లో ఏదో అలికిడి అయింది. దాంతో ఆమినా ఆలోచనాచయని తెగిపోయింది.

ఒక్కసారిగా మళ్ళీ అంధకారం అలుముకుంది. వికసించిన పూలన్నీ ముడుచుకుపోయాయి. తన ముందు ఆయన లేరు. ఆయన నీడ కూడా లేదు.

ఆమినా మనస్సు మరోసారి మూగగా రోదించింది. శరీరం ఢీలా పడిపోయింది. ఊహలు నీరుగారిపోయాయి.

అయినా ఆమె ఆశాజీవి. ఆ ఆశతోనే ఆమె కళ్ళు అలసిపోకుండా అబ్దుల్లా కోసం అనుక్షణం నిరీక్షిస్తూనే ఉన్నాయి.

"ఆయన వస్తారు. తప్పక వస్తారు. బహుశా పట్టణ శివార్లలోకి వచ్చేసి ఉంటారు."

"అమ్మా ఆమినా.....!" ఈ పిలుపుతో ఆమినా వెనక్కి తిరిగిచూశారు ఏమిటీ అన్నట్లు.

"మదీనా నుంచి వర్తక బిడారం వచ్చిందట. మీ మామగారు వర్తకుల్ని కలుసుకొని వస్తున్నారు" అన్నది ఓ నడికారు మహిళ.

ఆమినా గుండెలు క్షణం పాటు దడదడలాడాయి.

అంతలో అబ్దుల్ ముత్తలిబ్ కాళ్ళీడ్చుకుంటూ ఇంట్లో ప్రవేశించారు.

ఆయన ముఖం బాగా వాడిపోయింది. నుదుటి నుంచి చెమట చుక్కలు రాలుతున్నాయి. తలవెంట్రుకలు చిందరవందరగా పడివున్నాయి. తలపాగ సగం జారి మెడ మీద వేలాడుతోంది.

"అమ్మా... ఆమినా......!" ఆ తరువాత ఆయన ఇక చెప్పలేక పోయారు.

"ఏమిటి మామయ్యా! ఏమయింది? ఆయనేరి??" ఆమినా గుండెలు అతివేగంగా కొట్టుకో సాగాయి.

"ఆమినా....! అబ్దుల్లా మనకిక లేడమ్మా....!! ముహమ్మద్ అనాథ అయ్యాడు తల్లీ...!!!" అంటూ అబ్దుల్ ముత్తలిబ్ భోరున విలపిస్తూ రెండు చేతుల్లో ముఖం దాచుకున్నారు కోడలికి తన ముఖం చూపించలేక.

అంతే....ఆమినా కాళ్ళ కింద భూమి చీలిపోయింది! అగ్ని పర్వతం బద్దలైపోయింది!! ఒక్కసారిగా ప్రపంచమంతా అంధకారమయింది! ఆకాశం ఫెళఫెళా విరిగిపడింది!!

అయిపోయింది.....అంతా అయిపోయింది.......మనసే ముక్కచెక్కలయి పోయింది ..... మనుగడకే అర్థం లేకుండా పోయింది.

ఆమినా చంటిపిల్లలా హృదయవిదారకంగా విలపించారు. ఆమె కళ్ళు సెలయేరులై పారసాగాయి.

ఇరుగుపొరుగు మహిళలు వచ్చి ఆమెను ఓదార్చడానికి వృథా ప్రయాసపడసాగారు. కొందరైతే ఆమెను ఓదార్చడానికి వచ్చి, స్వయంగా తామే కంటతడి పెట్టుకున్నారు.

ఆ శోకమూర్తిని చూసి ఆమె స్నేహితురాళ్ళు మరింత చలించిపోయారు.

"అబ్దుల్లా! ఆమినాను ఒంటరిదాన్ని చేసి పోయావా! నీ ముసలి తండ్రిని చూడు ఎలా కన్నీరు మున్నీరుగా దుఃఖిస్తున్నాడో!!"

"అబ్దుల్లా! ఇక కాబా యాత్రికులకు నీలాగా ఎవరు ఆతిథ్యమిస్తారయ్యా!!"

"అయ్యయ్యో! ముద్దుల మూటకట్టే కొడుకునైనా చూసుకోలేక పోయావే!!"

......ఏడ్పులు, ఎక్కిళ్ళతో ఇల్లు ప్రతిధ్వనించసాగింది.

మక్కా చంద్రుడు మదీనాలో అస్తమించాడు. ఆమినా హృదయవీణ శాశ్వతంగా మూగబోయింది. ఆమె అనురాగ నందనవనం మాడి బీడుగా మారిపోయింది.

భయంకరమైన ఈ విషాద సాగరంలో నుంచి నావికుడు వీడిన ఆమె జీవిత నౌక ఇక ఏ తీరానికి ఎప్పుడు చేరుతుందో!

## హలీమా ఇంట శుభాల పంట-(9)

భావిప్రపంచానికి రాచబాట నిర్మించే 'అందాల నెలవంక' అమాయకపు చూపులతో మూగ సందేశమిస్తూ దినదిన ప్రవర్ధమానమవుతోంది!! బాల ముహమ్మద్ (స) ఆకాశంలోని చంద్రకళలతో ఆడుకుంటూ అనిర్వచనీయమైన భాషలో పాడుకుంటున్నారు.

ఈ ఆటపాటల మధ్య కాలచక్రం గతి తప్పకుండా ముందుకు సాగుతూనే ఉంది. బాల ముహమ్మద్ (సల్లం)కు దాసి సౌబియా ఏడు రోజులు పాలు తాగించింది. కన్నతల్లి నుంచి పాలతల్లి ఒడిలోకి పోయే సమయం ఆసన్నమయింది.

పల్లెల నుంచి పాలతల్లులు (ఆయాలు) గంపెడు ఆశతో పట్నానికి బయలుదేరారు నిప్పులు కురిసే ఎండలో.



పైగా అది ఎడారి మార్గం. దానికి తోడు బహుదూర ప్రయాణం. చాలినంత మేత లేక బక్కచిక్కిన ఒంటె మీద నత్తనడకలా ఈ ప్రయాణం ఇంకెంత దూరమో! తోటి ప్రయాణీకులు కనుచూపు మేర కూడా దాటిపోయారే!!

"ఏమండీ! తొందరగా పోనియ్యండి. ఈ ఏడన్నా మనం గట్టెక్కుతామంటారా?" ఆశా నిరాశల మధ్య ఊగిసలాడింది హలీమా కంఠం.

"పిచ్చిదానా! మన బతుకు ఎప్పుడూ ఇలాగే ఉంటుందని ఎందుకనుకుంటావు? దేవుడు దయామయుడు. ఆయన తలుచుకుంటే ఏం కాదూ? చీకటి వెలుగుల్ని సృష్టించిన దేవుడు ఎప్పుడో ఓరోజు మనల్ని తప్పక కనికరిస్తాడు. అదిగో మన తోటోళ్ళు. పట్నం దగ్గర్కి వచ్చింది" హలీమాను ఊరడిస్తూ ఒంటెను తోల్తున్నాడు ఆమె భర్త హారిస్.

పట్నంలో ప్రవేశించగానే చంటిపిల్లల పోషణ కోసం వచ్చిన స్త్రీలు ధనికుల పిల్లల కోసం గాలింపు మొదలుపెట్టారు.

ఖురైష్ వంశంలో గొప్పింటి మహిళలు తమ చంటి పిల్లలకు స్వయంగా పాలివ్వరు. పట్నం చుట్టుపక్కలున్న పల్లెల నుంచి పిల్లల పోషణభారం వహించే స్త్రీలు (ఆయాలు) వస్తుంటారు. వారు ఈ పిల్లల్ని తీసికెళ్ళి పల్లె వాతావరణంలో పెంచుతారు.

రెండేళ్ళ తరువాత ఆ పిల్లలను తిరిగి పట్నం తీసుకొచ్చి వారివారి తల్లులకు అప్పగిస్తారు. ఇదీ ఇక్కడి ఆచారం.

ఇప్పుడు వచ్చిన స్త్రీలు కూడా పిల్లలను బాగా పోషిస్తామని ఎంతో నమ్మకం కలిగిస్తున్నారు. తల్లులంతా తమకు నచ్చిన ఆయాలను ఎన్నుకుంటున్నారు.

కాని హలీమా ఎవరి దృష్టినీ తన వైపుకు తిప్పుకోలేక పోయింది. తను అందరికన్నా బలహీనంగా ఉంది. పేదరికం తాండవమాడే తన ఎముకల గూడుకు పిల్లలను అప్పగించేందుకు ఎవరు ముందుకొస్తారు?

అక్కడ ఓ పిల్లవాడున్నాడు. పుట్టకముందే తండ్రి నీడ కోల్పోయిన అనాథ. ఆయాలు ఈ పిల్లవాడ్ని కూడా చూశారు. కాని అనాథను పెంచడమంటే పేదరికాన్ని కొని తెచ్చుకోవడమే. పైగా ఆ బిడ్డ తాత దారినపోయే దానయ్యలందరికీ దానంచేసి చేసి దారిద్ర్యం తెచ్చుకున్నాడు. అలాంటి మనిషి మనకు ఏమిస్తాడు! తల్లి నుండి కూడా ఏమీ ఆశించలేం.

అందరూ పెదవి విరిచారు. చివరికి పాలతల్లి దొరకని పసివాడు ఆ అనాథ బాలు డొక్కడే. ఆయాలంతా తమకు అప్పగించబడిన పసిపిల్లలను చూసుకొని మురిసిపోతూ తిరుగుప్రయాణానికి సిద్ధమయ్యారు. కాని హలీమాకు ఎవరూ బిడ్డల్ని ఇవ్వలేదు.

"నా స్నేహితురాళ్ళంతా వళ్ళో చంటిపిల్లలతో సంతోషంగా వెళ్ళి పోతున్నారు. వట్టి చేతులతో మన ఊరికి పోవాలంటే నాకు సిగ్గేస్తోంది. ఆ అనాథ పిల్లోడ్నే తెచ్చుకుంటా. వట్టిగా వెళ్ళటం కన్నా అనాథ బిడ్డణ్ణయినా తీసికెళ్ళడం మంచిది కదా?" అన్నది హలీమా.

"సరే అలాగే తీసుకురా. అనాథ పిల్లోడ్ని పెంచితే తప్పేముంది? మన అదృష్టం బాగుంటే ఆ అనాథ పిల్లోడి వల్లే దేవుడు మన కష్టాలు కడతేరుస్తాడు" అన్నాడు హారిస్.

హలీమా ఆనందంగా పరుగు వేగంతో బయలుదేరింది.

ఆమినా తన బాబును తీసుకోవడానికి ఎవరూ రాకపోవడం చూసి నిరుత్సాహ పడ్డారు. "తన బిడ్డ తండ్రి కోల్పోయిన నిర్భాగ్యుడు. అందుకే ఆయాలెవరూ రాలేదు. ఇరుగుపొరుగు స్త్రీల పిల్లలందరినీ తీసికెళ్ళారు, తన బాబు ఒక్కడే మిగిలిపోయాడు."

ఇలా ఆలోచిస్తూ ఆవేదన చెందుతున్న ఆ తల్లికి హలీమా రావడం కనిపించింది. మోడువారిన ఆశలు మళ్ళీ చిగురించసాగాయి.

"అమ్మగారూ! నేను మీ బాబును తీసికెళ్తానమ్మా!" అన్నది హలీమా.

ఈమాట వినగానే ఆమినా సంతోషంతో పొంగిపోయారు. మనసులో పిల్లవాడ్ని ఆయాకు అప్పగించడానికి ఇష్టం లేకపోయినా తరతరాల నుంచి వస్తున్న సంప్రదాయాన్ని పాటించక తప్పదు. అనిర్వచనీయమైన కాంతులీనుతూ, అమాయకమయిన బోసి నవ్వులు చిందిస్తున్న బాలముహమ్మద్ (సల్లం)ను ఆమె రెండు క్షణాలపాటు తనివితీరా చూసుకొని ప్రగాఢంగా గుండెలకు హత్తుకున్నారు. అమితమైన మమతానురాగాలతో ముద్దాడారు. ఆ తరువాత హలీమా చేతుల్లో పెట్టారు. హలీమా పిల్లవాడ్ని తీసుకొని ముసిముసి నవ్వులతో వెళ్ళిపోయింది.

భార్యాభర్తలిద్దరూ స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. బక్కచిక్కిన ఒంటె ఈసారి హుషారుగా నడవసాగింది. అది చూసి భార్యాభర్తలు ఆశ్చర్యపోయారు. వారు ఆశ్చర్యం నుంచి తేరుకోకముందే ఊరు వచ్చేసింది.

బాబును చూసుకొని హలీమా పరమ సంతోషంతో పరవశించిపోయింది. గుండెలకు హత్తుకుంది. పాలులేక కృశించిపోయిన స్తనాన్ని బాధగా నిట్టూరుస్తూ నోటికి అందించింది.

కాని ఆశ్చర్యం...! హఠాత్తుగా స్తనాలు పాలతో నిండినట్లు అనుభూతికలిగింది. పిల్లవాడు ఏకధాటిగా పాలు తాగాడు. హలీమా కళ్ళు ఆనందాశ్రువులతో నిండిపోయాయి.

కొత్తబాబు కడుపునిండా పాలు తాగాడు. తర్వాత హలీమా కూతురు షీమా కూడా తనివితీరా పాలు తాగింది. అంతకు ముందైతే ఆ పాపకే ఈపాలు సరిపోయేవి కావు.

హలీమా ఇంట శుభాలపంట పండింది. పట్టుకున్నదల్లా బంగారమై పోతోంది.

చిక్కి శల్యమయిన వారి ఒంటె చలాకిగా తయారయింది. దాని పాలిండ్ల నుంచి చూస్తుండగానే పాలు కారసాగాయి. భార్యాభర్తలు సంభ్రమాశ్చర్యాలతో ఆ వింత చూడసాగారు. వెంటనే హలీమా భర్త పాలుపితికి తాను కడుపునిండా తాగి భార్యక్కూడా ఇచ్చాడు. ఆ రాత్రి భార్యాభర్తలు పిల్లలిద్దర్ని తమ మధ్యలో పడకోబెట్టుకొని ఎప్పుడూ ఎరగనంత హాయిగా నిద్రపోయారు.

"హలీమా! మనమెంత అదృష్టమంతులం! ఈ పిల్లోడ్ని అనాథ అనుకున్నాం గాని, ఇప్పుడు సూడు మనింట బంగారు గనే అయ్యాడు" అన్నాడు హలీమా భర్త తెల్లవారాక.

"ఔనండీ! ఈపిల్లోడు దొరకటం నిజంగా మన అదృష్టమే" అన్నది హలీమా బాలుడ్ని ముద్దాడుతూ. పిల్లల ఆటపాటల్లో, పెద్దల సంపాదనాపోషణల్లో రెండేళ్ళు గడిచాయి.



ఓరోజు హలీమా బాలముహమ్మద్ (స)ను ఒళ్ళో పెట్టుకొని కూర్చున్నది. ఆ సమయంలో అబిసీనియా క్రైస్తవులు కొందరు అటుగా రావడం జరిగింది. దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న ఆ పిల్లవాడు కంటపడగానే వారు టక్కున ఆగి తేరిపార చూడసాగారు.

"ఈ పిల్లవాడు ఎవరు? ఇతని పేరేమిటీ?" అని అడిగారు వారు కుతూహలంగా.

హలీమా ఆ అపరిచిత వ్యక్తుల వైపు ఆశ్చర్యంగా చూడసాగింది బిత్తర చూపులతో.

ఆమె నుంచి సమాధానం రాకముందే వారు పరస్పరం సైగలు చేసుకుంటూ గుసగుసలు చెప్పుకున్నారు.

"చూశారుగదా పిల్లవాడ్ని. ఇతను మహాపురుషుడవుతాడు. పెద్దవాడయ్యాక ఇతను ఏమవుతాడో మనకు తెలుసు. అంచేత ఈ అబ్బాయిని మన ఊరికి తీసికెళ్దాం."

హలీమా వారి సైగలు గ్రహించింది. వారి ఉద్దేశాలేమిటో కూడా పసిగట్టింది. దాంతో ఆమె క్షణంపాటు నిలువెల్లా కంపించి పోయింది.

"వీరు నిజంగా పిల్లవాడ్ని ఎత్తుకుపోవచ్చు." ఈ ఆలోచన కలగ్గానే ఆమె అక్కడ్నుంచి మెల్లగా జారుకుంది అదురుతున్న గుండెలతో పిల్లవాడ్ని ఎత్తుకొని.

"ఇక లాభం లేదు. పిల్లోడ్ని వీలైనంత తొందరగా తీసికెళ్ళి అతని తల్లికి అప్పగించాలి" అనుకున్నది.

"కాని తమఇంట దిగిన ఈ శుభాలపంటను ఇంతతొందర్లో వదలుకోడమా? తప్పదు. శత్రువుల బారి పడకుండా ఉండాలంటే పిల్లోడ్ని వెంటనే తల్లి దగ్గరికి చేర్చాలి."

మరుసటి రోజు హలీమా పిల్లవాడ్ని పట్నం తీసికెళ్ళి ఆమినాకు అప్పగించింది. అప్పటికి గాని ఆమె మనసు కుదుటపడలేదు.

అయితే పిల్లవాడు పట్నం వచ్చిన కొన్నాళ్ళకే మరో ఆపద వచ్చిపడింది. పట్నంలో అంటువ్యాధి ప్రబలి అనేకమంది చనిపోతున్నారు. సర్వత్రా భయాందోళనలు అలుము కున్నాయి. ఎప్పుడు ఏ ఇంటిపై మృత్యుదూత వాల్తాడో తెలియని పరిస్థితి ఏర్పడింది.

అలాంటి భయానకస్థితిలో ఆమినా తన కొడుకును పట్నంలో ఉంచడం శ్రేయస్కరం కాదని భావించారు. అంచేత పిల్లవాడ్ని మళ్ళీ ఆయా హలీమా దగ్గరికి పంపివేశారు.

హలీమా ఇంట్లో తిరిగి శుభాల పరంపర ప్రారంభమయింది. హలీమా కూతురు షీమా కూడా పసిపిల్లే. ఆ పాప, ఈ బాబు కలిసి అల్లరి చేస్తూ ఆడుకుంటుంటే హలీమా, ఆమె భర్త సంతోషంతో పొంగిపోయేవారు. వారికి అబ్దుల్లా అనే ఓ కొడుకు కూడా ఉన్నాడు. ఆ బాలుడు కూడా ఆట పాటల్లో చిన్నారి ముహమ్మద్ (సల్లం)కు తోడయ్యాడు.

వారింట్లో ఒంటెతో పాటు ఒక మేక కూడా ఉంది. హలీమా ఆమేక పాలును చిన్నారి ముహమ్మద్ (స)కు తాగిస్తుంటుంది. కాని అదేమి చిత్రమో గాని, పిల్లవాడు ఒక్క పొదుగును మాత్రమే నోట్లో పెట్టుకొని పాలు తాగేవాడు. రెండో పొదుగుని కనీసం ముట్టనైనా ముట్టుకునేవాడు కాదు.

ఔను మరి. పాలన్నీ తానే తాగితే అక్కయ్యకు ఎలా? అందుకే రెండో పొదుగు తాకకుండా అక్క కోసం వదలిపెట్టేవాడు.

“ఓయబ్బో, పసితనంలోనే ఇంత గొప్ప న్యాయశీలుడయ్యాడే ఈ పిల్లోడు! పెద్ద వాడయ్యాక ఇంకెంత గొప్పవాడయి ప్రపంచాన్ని నీతి, న్యాయాలతో ఏలుతాడో!!” ఈమాటే హలీమా, ఆమె పెనిమిటి తరచుగా చెప్పుకునేవారు ఎంతో చోద్యంగా.

## శస్త్రచికిత్సతో చిత్తశుద్ధి-(10)

ఇలా ముచ్చటగా మరో మూడేళ్ళు గడచిపోయాయి. బాలముహమ్మద్ (సల్లం) క్షీరసంబంధ సోదరుడు అబ్దుల్లాతో కలసి మేకలు కాయడం ప్రారంభించారు. ఓరోజు యధాప్రకారం వారిద్దరూ మేకలను ఊరి బయటికి తోలుకెళ్ళారు. వాటిని మేయడానికి వదలి ఆడుకోవడం మొదలెట్టారు. వారికి మరికొందరు పిల్లలు కూడా తోడయ్యారు.

అంతలో ఇద్దరు అపరిచిత వ్యక్తులు వారి దగ్గరకు వచ్చారు. వారిలో ఒకతను చిన్నారి ముహమ్మద్ (సల్లం)ని వడిసి పట్టుకున్నాడు. వెంటనే రెండో వ్యక్తి ఆయన రొమ్మును కత్తితో చీల్చి గుండెకాయను బయటికి తీశాడు.

ఈ భయంకర దృశ్యం చూసి అబ్దుల్లాతో పాటు పిల్లలంతా “వామ్మో!” అంటూ పరుగు లంకించుకున్నారు. “అమ్మా! అమ్మా!! మరేమో... మన ముహమ్మద్‌ని ఎవరో చంపేశారే” అన్నాడు అబ్దుల్లా రొప్పుతూ రోజుతూ.

ఈమాట విని హలీమా, ఆమె భర్త అదిరిపడ్డారు. ఇద్దరూ కంగారుపడుతూ ఊరి వెలుపల మేకలు మేస్తున్న చోటికి పరుగుతీశారు. చూస్తే బాల ముహమ్మద్ (సల్లం) నిక్షేపంగానే ఉన్నారు. కాకపోతే ఢీలాపడిపోయి బిత్తర చూపులు చూస్తూ కన్పించారు.

హలీమా రాగానే “ఏమయింది బాబూ!” అంటూ చిన్నారి ముహమ్మద్ (సల్లం)ని గుండెలకు హత్తుకుంది. “అసలేం జరిగింది బాబూ, చెప్పు” అన్నాడు ఆమె భర్త హారిస్.

“మరేమో మేం ఆడుకుంటుంటే మాదగ్గరికి ఎవరో ఇద్దరు మనుషులు వచ్చారమ్మా! వారిలో ఒకాయన నన్ను పట్టుకొని నేలమీద పడుకోబెట్టాడు. రెండోఆయన కత్తితో నా రొమ్ము చీల్చి గుండెకాయ బయటికి తీశాడు. దాన్ని నీళ్ళతో శుభ్రంగా కడిగాడు. తర్వాత దాన్ని మళ్ళీ నాశరీరంలో పెట్టేసి కుట్టేశారమ్మా! దానివల్ల నాకేమీ కాలేదు. అసలు నాకు బాధే అన్పించలేదమ్మా!” అన్నారు బాలముహమ్మద్ (స) అమాయకంగా.

ఈ విచిత్ర మాటలు విని హలీమా ఆశ్చర్యపోయింది. హారిస్ అయోమయంగా చూడసాగాడు. ఆ తర్వాత వారిద్దరూ చిన్నారి ముహమ్మద్ (సల్లం)ని తీసుకొని, మేకల్ని తోలుకుంటూ ఇంటికి తిరిగొచ్చారు.

“హలీమా! బాబుకు ఏదో పిశాచం ఆవహించి ఉంటుందని నాకు అనుమానంగా ఉంది. అంచేత ఇతడ్ని ఎంత తొందరగా అతని తల్లి దగ్గరికి చేరిస్తే అంత మంచిది. ఆలస్యం చేస్తే మరేదైనా ఆపద వచ్చిపడొచ్చు” అన్నాడు హారిస్.



“అలాగే చేద్దాం. కాని ఈ పిల్లోడ్ని అంత తొందరగా పంపడానికి నాకు మనసొప్పడం లేదు. అయినా తప్పదుకదా! రేపే బయల్దేరుదాం” అన్నది హలీమా లోలోన బాధపడుతూ.

చిన్నారి ముహమ్మద్ (సల్లం)ని పట్నం పంపవలసిన సమయం వచ్చింది. ఈసారి పోతే ఇక రానేరాడు. ఈ ఆలోచన కలగ్గానే హలీమాకు ఏడ్పు ముంచుకొచ్చింది.

కాని తప్పదుకదా! మరుసటిరోజు ఆమె కళ్ళలోని నీళ్ళు కళ్ళలోనే కుక్కుకుంటూ భర్తతో కలసి భారమైన హృదయంతో బాల ముహమ్మద్ (సల్లం)ని పట్నం తీసికెళ్ళింది.

## అమ్మకూడా పోయిందా!-(11)

బాల ముహమ్మద్ (స) మళ్ళీ మాతృ వడిలోకి వచ్చారు. పూరిపాక నుంచి లంకంత ఇంట్లో అడుగుపెట్టారు. పల్లె పరిసరాల నుంచి పట్టణ వాతావరణంలోకి తిరిగొచ్చారు.

అంతా మళ్ళీ కొత్తకొత్తగా ఉంది. అమ్మా, తాతయ్య, బాబాయి, పెదనాన్నలు, పెద్దమ్మలు, వాళ్ళ పిల్లలతో ఇల్లు ఎంతో సందడిగా ఉంది. అయితే అందరి దృష్టి మాటిమాటికి ఆ పసివాడి మీదికే పోతోంది. అందరికీ ఆ పసిడి బుడతే కేంద్ర బిందువై పోయాడు. అన్నిటికీ మించి అమ్మ మమకారం, తాతయ్య అనురాగం ఆ పసిహృదయంలో అపార ఆనంద కుసుమాలు వికసింపజేశాయి.

హజ్రత్ ఆమినాకు ఇప్పుడు కొడుకే సర్వస్వం. బాలచంద్రుడిలా ఆ పసిబాలుడు దినదిన ప్రవర్ధమానమవుతూ, ముద్దుముద్దు మాటలతో మమతల వెలుగురవ్వలు వెద జల్లుతుంటే ఆ మాతృహృదయం అమితానందంతో పరవశించిపోయేది.

అయితే అప్పుడప్పుడు ఆమె కళ్ళు అప్రయత్నంగా అశ్రుపూరితాలు కూడా అయ్యేవి. గత స్మృతులు ఆమె హృదయానికయిన గాయాన్ని కెలుకుతూ అశాంతి తుఫాన్‌ని సృష్టించేవి. ఈ తుఫాన్‌ని ఎదుర్కోవడం ఎలా?

ఓరోజు ఆమినాకు మెరుపులాంటి ఆలోచన వచ్చింది. మదీనాలో ఆమె తల్లి వైపు బంధువులున్నారు. వాళ్ళను చూసి చాలా కాలమయింది. మదీనాలో కొన్నాళ్ళు గడిపితే ఆ కొత్త వాతావరణంలో కాస్తయినా మనశ్శాంతి లభిస్తుంది. అదీగాక మదీనా సమీపంలో అబ్వా అనేచోట శ్రీవారి సమాధి ఉంది. దాన్ని కూడా దర్శించుకోవచ్చు.

ఈ ఆలోచన రాగానే ఆమినా మదీనా పట్టణానికి ప్రయాణమయ్యారు. ఆమె వెంట సేవకురాలు బర్కా, ముద్దుల కొడుకు ముహమ్మద్ (సల్లం) కూడా ఉన్నారు.

ఆమినా మదీనా చేరుకున్నారు. ఎన్నో ఏళ్ళ తర్వాత వచ్చిన తమ ఆడపడుచుకు బంధువులు ఘనస్వాగతం చెప్పారు. గొప్ప అతిథి మర్యాదలు చేశారు. వృద్ధ మహిళలు ఆమెను గుండెలకు హత్తుకున్నారు. ఆమె అనాథ కొడుకును ప్రేమగా తల నిమిరారు.

బంధువులు యోగక్షేమాలు అడిగినప్పుడు ఆమినా గతాన్ని ఏకరువుపెడ్తూ అప్రయత్నంగా వెక్కివెక్కి ఏడ్వడం మొదలెట్టారు. ఆమె విషాదగాథ విని స్త్రీలంతా కంటతడి పెట్టుకున్నారు.

భర్త కోల్పోయిన స్త్రీ జీవితం ఎంత భయానకంగా, బాధాకరంగా ఉంటుందో తలచుకుంటేనే తనువు జలదరిస్తుంది. అందుకే కొందరు స్త్రీలు ఆమినాను ఓదార్చుతూ తాము కూడా కన్నీరు కార్చారు.

అయితే కాస్సేపటికి చిన్నారి ముహమ్మద్‌పై వారి దృష్టి పడగానే వాతావరణ స్వరూపమే మారిపోయింది. వాడిన పూలన్నీ ప్రభాకరుడి తేజస్సుతో వికసించినట్లు అందరూ ఒక్కసారిగా ఆనంద భరితులయ్యారు. ముడుచుకుపోయిన ముఖాలు విప్పారాయి. బరువెక్కిన హృదయాలు సంతోషంతో తేలికైపోయాయి.

మక్కా నుంచి బనూహాషిం వంశాంకురం వచ్చాడని, అతని నుదుటిపై అదృష్ట జ్యోతి ప్రకాశిస్తోందని మదీనా వాసులు వింతగా చెప్పుకోవడం ప్రారంభించారు. అమృతం వర్షించే అతని చిలక పలుకులు జనాన్ని విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి.

మదీనా పిల్లలు సాధారణంగా సభ్యతాసంస్కారాలు లేని పిల్లలు. అసభ్యకరంగా మాట్లాడేవారు. పరస్పరం కీచులాడుకునేవారు. ఒకరిపైనొకరు దుమ్ము విసురుకునేవారు కాని బాల ముహమ్మద్ (సల్లం) వారి ఛాయలక్కూడా పోయేవారు కాదు.

అయితే ఎవరైనా విలువిద్య అభ్యాసం చేస్తుంటే వాళ్ళ దగ్గరికెళ్ళి అందులో ఆసక్తిగా పాల్గొనేవారు. అప్పుడప్పుడు బనూఅదీవారి కోనేటికి పోయి ఈత కూడా నేర్చుకునేవారు.

ఆమినా మదీనాలో నెలరోజులు గడిపిన తర్వాత తిరిగి మక్కా బయలుదేరారు.

దారిలో 'అబ్వా' ప్రదేశం వచ్చింది. అక్కడే అబ్దుల్లా సమాధి ఉంది. ప్రేమ, విచారాలతో నిండిన భావోద్రేకాలు ఆమె కాళ్ళకు సంకెళ్ళు వేశాయి.

"ఆమినా! నీ భర్త సమాధిని ఓసారి తనివితీరా చూసుకొని వెళ్ళు. మళ్ళీ నీకు ఇక్కడకు వచ్చే అవకాశం లభిస్తుందో లేదో." ఎవరో ఆమినా చెవి దగ్గరకొచ్చి చెప్పినట్లు అన్పించింది. ఆమినా అప్రయత్నంగా భర్త సమాధి దగ్గరికెళ్ళారు. దాన్ని చూడగానే ఆమె సుకుమార హృదయం మరోసారి బాధగా విలపించింది. కన్నీళ్ళు కట్టలు తెంచుకున్నాయి.

మానుతున్న మనోగాయం మళ్ళీ పచ్చి పుండయిపోయింది. తన వాడనుకున్న వాడే పోతే ఇక ఆమె మూగబాధను ఆలకించే నాధుడెవరుంటారు? ముంచుకొచ్చిన దుఃఖాన్ని బలవంతంగా దిగమింగి లోలోనే కుమిలిపోయారామె.

బాధాగ్రస్తహృదయం తెచ్చే భౌతికప్రభావం బాధితులకే బాగాతెలుసు. ఆ మనోవేదనకు ప్రయాణ బడలిక, పరిసరాల ప్రభావం తోడయ్యాయి. దాంతో ఆమినా జబ్బుపడ్డారు.

చూస్తూవుండగానే ఆమెకు తీవ్రమైన జ్వరం వచ్చిపడింది. దరిదాపుల్లో వైద్యులు కూడా లేరు. ఆమె ఆరోగ్యం క్రమేణా క్షీణిస్తూపోయింది. పరదేశంలో, పైగా నిర్జన ప్రదేశంలో ఆమెను ఓదార్చి సపర్యలు చేసే వారెవరుంటారు?

ఆమినా దగ్గర ఆమె సేవకురాలు ఉమ్మె ఈమన్ (బర్కా) మాత్రమే ఉంది. ఆ సేవకురాలే ఆమె బాధలు పంచుకున్నది. ఆమె ఆమినాను ఓదార్చుతూ శక్తివంచన లేకుండా సేవించడంలో నిమగ్నురాలయింది.



ప్రతి వ్యాధీ ప్రారంభంలో మామూలుగానే ఉంటుంది. కాని కాలం గడిచిన కొద్దీ ఏ వ్యాధి ఏ చిక్కులు తెచ్చిపెడ్తుందో ఎవరికి తెలుసు?

అయితే మానవుడు ఆశాజీవి. అంతిమ శ్వాస వరకూ నిరాశ చెందడు. దాంతోపాటు అప్పుడప్పుడు అతడ్ని భయం కూడా ఆవరిస్తుంది. ఇది చచ్చిపోతానన్న భయం కాదు. తన తదనంతరం తన ఆప్తుల గతి ఏమవుతుందోనన్న భయమే అతడ్ని ఎక్కువగా పీడిస్తుంది.

అలాంటి భయమే ఆమినాకు పట్టుకుంది. తాను చనిపోతే తన బాబును ఎవరు ఆదరిస్తారు? తన కంటిపాపకు ఎవరు నీడిస్తారు?? పుట్టక ముందే తండ్రి నీడ కోల్పోయాడు. కాస్త తెలివచ్చిన తర్వాత ఇప్పుడు తల్లిని కూడా మృత్యువు కబళించడానికి సిద్ధమైంది.

నిజానికి ప్రపంచంలో ప్రతి పిల్లవాడికీ అతని తల్లిదండ్రులే అసలైన నీడ. వారి వాత్సల్యఛాయలోనే పిల్లలు బాగా ఎదుగుతారు. ఇతర బంధువులు, సన్నిహితులు ఎంత సానుభూతి చూపినా తల్లిదండ్రులు అందించే ప్రేమామృతం ఎక్కడ్నుంచి వస్తుంది? ఈ విచారమే ఆమినా గుండెల్ని కలచివేస్తోంది.

"విచారపడకండమ్మా! జబ్బుపడ్డ మనిషి మరీ అంత దిగులేసుకోకూడదు. అసలు మంచిగా ఉన్నోళ్ళకే గదమ్మగోరూ జబ్బులొచ్చేది? జబ్బులొచ్చినోళ్ళు బాగయిపోతారు కూడా" అన్నది దాసి ధైర్యం చెబుతూ.

"కాని....కాని..ఈ జబ్బు తగ్గిపోయేలా కనపడటం లేదు."

"లేదమ్మగారూ! నే సెబ్తున్నాగా. ఈయాది మీకేమీ సెయ్యదు. కొత్త పర్‌దేశం, కొత్త నీళ్ళుకదా! వంటికి పడక ఉడుకు చేసింది. అంతే మరేం పర్వాలేదు. చూడండి, నే సెబ్తున్నా. మీ ముఖంలో ఇప్పుడు కొత్తకళ అగుపిస్తోంది. రెండు రోజుల్లోనే జరం గిరం పరార్!"

నిజంగానే అప్పుడు ఆమినా ముఖం కాస్త ప్రకాశవంతంగానే కన్పించింది. కాని ఆరిపోయే దీపం కూడా ఇలాగే కాంతిమంతంగా ఉంటుంది. చివరికి పరిస్థితి ఎలా పరిణ మిస్తుందో ఆ పరాత్పరుడికే తెలియాలి.

ఆమినా పరిస్థితి క్షణక్షణానికి దిగజారిపోతోంది. ముఖంలో కాంతి క్రమక్రమంగా తగ్గిపోతోంది. బాల ముహమ్మద్ (సల్లం) తల్లి వైపు కంగారుపడుతూ అమాయకంగా చూడసాగారు. ఆమినా చేయి అప్రయత్నంగా కొడుకు తల మీదికి పోయింది.

ఆమె ఏదో చెప్పాలనుకున్నారు. కాని పెదవులు విచ్చుకోలేదు. కళ్ళు కూడా క్రమేణా మూతలు పడుతున్నాయి. దీంతో బాలముహమ్మద్ (స) తత్తరపడుతూ బిత్తరచూపులతో అమ్మను చూస్తూ మరెంతో ఆందోళనకు గురయ్యారు. కాని ఆ తర్వాత కాస్సేపటికే ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసలు అతి కష్టమైపోయాయి. శరీరం మీద వేడి తగ్గిపోయి చెమట పట్టింది. ఆ తరువాత ఓ సుదీర్ఘ శ్వాస వదలి చలనరహితంగా ఉండిపోయారు.

"అమ్మా....! అమ్మా.....!!" బాల ముహమ్మద్ (సల్లం) భోరున విలపించారు. తల్లి తనువు మీద పడి తల్లడిల్లి పోయారు.

యావత్తు భూమి కంపించిపోయింది. ఒక్కసారిగా సర్వత్రా చీకట్లు ఆవరించాయి.

అమ్మ పోయింది. దూరంగా.... చాలా దూరంగా వెళ్ళిపోయింది. తన కంటికి కన్పించనంత దూరంగా.... తిరిగి రానంత సుదూర తీరాలకు వెళ్ళిపోయింది అమ్మ.

“అయ్యయ్యో....! అమ్మ కూడా నిన్ను వీడిపోయిందే! రెండవ నీడన్నా ఉందనుకుంటే అది కూడా లేకుండా పోయిందే!! ముహమ్మద్! దిక్కులేని అనాథవయి పోయావా బాబూ!! అమ్మా అని పిలిచే అదృష్టాన్ని కూడా కోల్పోయావా తండ్రీ!!!” ప్రకృతి సయితం అనాథ ముహమ్మద్ (సల్లం)ని చూసి ఆవేదన చెందింది.

గుండెలను పిండే ఈ విషాదఘటన ఏ మహాకార్యానికి నాందీ వాచకమో! ఏమైనా, విధి నిర్ణయాన్ని ఎవరు అడ్డుకోగల్గుతారు?

హజ్రత్ ఆమినా భౌతిక కాయం ఆ ప్రదేశంలోనే ఆమె భర్త సమాధి పక్కన ఖననం చేయడం జరిగింది. స్వయంగా సేవకురాలే సమీప గ్రామస్థుల సహాయంతో ఆమెను ఖననం చేసింది. నిజంగా భర్త ప్రేమే ఆమినాను మక్కా నుంచి ఇక్కడికి లాక్కొచ్చింది.

ఏడేళ్ళ ముహమ్ముద్ (సల్లం) తన జీవితంలో మొదటిసారిగా మృత్యువంటే ఏమిటో కళ్ళారా చూశారు. అదీ తన తల్లిపై విరుచుపడిన భయంకర విపత్తు! రాతిగుండెల్ని సైతం కరిగించే అత్యంత విషాద సంఘటన!! పైగా పరదేశంలో దిక్కులేని చావు!!!

బాల ముహమ్మద్ (స) తల్లిని తలచుకొని కన్నీరుమున్నీరుగా విలపించారు. వెక్కి వెక్కి ఏడ్వసాగారు. సేవకురాలు బాబును ఓదార్చడానికి శతవిధాల ప్రయత్నించింది.

కాని అమ్మ పోతే అమ్మ ఇచ్చేటటువంటి ప్రేమామృతం ఇంకెవరు ఇవ్వగల్గుతారు? అమ్మలాగా తియ్యటి పాటలు పాడుతూ తనను ఎవరు లాలిస్తారు? అమ్మలా వడిలోకి ఎత్తుకొని చందమామను చూపిస్తూ గోరుముద్దలు ఎవరు తినిపిస్తారు? ఈ ఆలోచన రాగానే బాల ముహమ్మద్ (స) మరింత బాధగా, హృదయవిదారకంగా విలపించారు.

తల్లిమరణం ఆ పసిహృదయంలో ఎంతతుఫాను రేపిందో ఊహిస్తేనే ఉల్లం ఝల్లుమంటుంది. ఏడ్చిఏడ్చి కంఠం రుద్ధమైపోయింది. పాలబుగ్గలపై కన్నీటిచారలు ఏర్పడ్డాయి.

పరిచారిక బర్కా బాబును దగ్గరకు తీసుకొని గుండెలకు హత్తుకుంది. పయిట చెంగుతో అతని కన్నీటి ముఖాన్ని తుడిచి ముద్దాడింది. తరువాత బాబును తీసుకొని అక్కడ్నుంచి బరువెక్కిన హృదయంతో మక్కా బయలుదేరింది.

ఇద్దరూ కొన్నాళ్ళపాటు ప్రయాణంచేసి మక్కా పట్నం చేరుకున్నారు.

కోడలు, మనుమడి కోసం తీవ్రంగా ఎదురుచూస్తున్న అబ్దుల్ ముత్తలిబ్ మనుమడితో పాటు అతని తల్లి కన్పించకపోవడంతో హతాశుడయ్యారు.

హాషిం కుటుంబంపై మరోసారి విషాద ఛాయలు అలుముకున్నాయి. ఒక్క హాషిం కుటుంబం ఏమిటి, ఆరోజు మొత్తం మక్కా పట్టణాన్నే కారుమేఘాలు కమ్మివేశాయి.

“అయ్‌గారూ! మన ముహమ్మద్ (సల్లం)కు ఇక తమరు తప్ప ఇంకెవరూ లేరు” అన్నది సేవకురాలు బర్కా.



“బర్కా! అబ్దుల్లా-ఆమినాల ఈ ముద్దుల మూటను నేను పట్టించుకోకుండా ఇలాగే వదిలేస్తాననుకుంటున్నావా? ముహమ్మద్ (సల్లం) నాప్రాణం, నా కంటిపాప. ఈ హమ్జా, ఆఖిల్, అబూతాలిబ్, అబూలహబ్, అబ్బాస్‌లు నా కొడుకులు. కాని కాబా ప్రభువు సాక్షిగా చెబుతున్నాను విను. వీరందరిలో నాకు ముహమ్మదే ఎక్కువ ప్రియమైనవాడు” అన్నారు అబ్దుల్ ముత్తలిబ్.

తల్లిదండ్రులు లేని బాల ముహమ్మద్ (సల్లం)ను ఇక ఎవరు అంతగా ఆదరిస్తారని దాసి ఆందోళన చెందింది. అయితే అబ్దుల్ ముత్తలిబ్, మనుమడిపై తనకు ఎంత ప్రేముందో హృదయం చీల్చి ఆమె ముందుంచినట్లు సమాధానమిచ్చారు.

తాను పలికిన ఈ పలుకులు, చేసిన ఈ వాగ్దానం ఆచరణలో ఆయన అక్షరాలా నిరూపించుకున్నారు. బాల ముహమ్మద్ (సల్లం)ని కంటికి రెప్పలా కాపాడుకున్నారు. ఇది వరకటి కంటే మిన్నగా అభిమానించసాగారు. బాబుకు కాలిలో ఓ చిన్న ముల్లు గుచ్చుకున్నా ఆయన కంగారు పడిపోయేవారు.

బాల ముహమ్మద్ (సల్లం) విషాదం నుంచి కోలుకొని దైనందిన జీవితం గడపసాగారు. అప్పుడప్పుడు తన లేత హృదయంలో అమ్మ జ్ఞాపకం వచ్చి మనస్సు బరువెక్కిపోయేది. అయితే తాతయ్య అందిస్తున్న ప్రేమానురాగాలు, ముద్దుముచ్చట్ల వల్ల గతం నుంచి వెంటనే వర్తమానంలోకి వచ్చి సంతోషంగా గడిపేవారు.

అబ్దుల్ ముత్తలిబ్ అనుక్షణం మనుమడ్ని కనిపెట్టుకొని ఉంటూ ఎలాంటి లోటు రానిచ్చేవారు కాదు. ఆయన సంరక్షణలో ఇట్టే ముహమ్మద్ (సల్లం) జీవితం ఆటపాటల్లో, సుఖసంతోషాల్లో సాఫీగా సాగిపోతోంది.

## తాతయ్యా! చివరికి నువ్వు కూడా....(12)

అయితే విధి ఒక మనిషిని గొప్పవాడిగా చేయదలచుకున్నప్పుడు అతడ్ని అనేక కఠిన పరీక్షలకు గురిచేస్తుంది. స్వర్ణకారుడు కల్తీ బంగారం నుంచి మేలిమి బంగారం తీయడానికి దాన్ని కొలిమిలో కాల్చినట్లు విధి అతనిపై చిన్నతనం నుంచే కడగండ్ల వడగళ్ళను కురిపిస్తుంది. సుఖభోగాలకు దూరంగా ఉంచుతుంది. ముహమ్మద్ (సల్లం) విషయంలో కూడా ఇలాగే జరుగుతోంది.

పుట్టక ముందే తండ్రి చనిపోయాడు. కాస్త స్పృహ వస్తుండగా ఏడేళ్ళ వయస్సులో తల్లి కూడా ఇహలోకం వీడిపోయింది.

ఈ విధంగా పసితనంలోనే మహనీయ ముహమ్మద్ (సల్లం) అమ్మా, నాన్నల ప్రేమను కోల్పోయి అనాథగా మారారు. ఆ లోటును ఎలాగో కొంతవరకు తాతయ్య తీర్చగలుగుతున్నాడని అనుకుంటుంటే విధి ఈ అనాథ బాలుడ్ని మరో అగ్నిపరీక్షకు గురిచేసింది.

అబ్దుల్ ముత్తలిబ్ మనవడ్ని తన సంరక్షణలోకి తీసుకొని ఒక సంవత్సరం గడిచిందో లేదో వ్యాధిగ్రస్తులయ్యారు. దాంతో మనుమడిపై మరో విపత్తు వచ్చిపడింది.

సాధారణంగా వృద్ధాప్యంలో వచ్చిన వ్యాధి ఓ పట్టాన వదలిపెట్టదు. ఒక్కోసారి అది ముదిరి పోవడం కూడా జరుగుతుంది.

అబ్దుల్ ముత్తలిబ్ మంచానపడి కోలుకోలేక పోయారు. ఆయన ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తూపోయింది. దానికి తోడు మనుమడి సంరక్షణ విషయం ఆయన్ని పీడించసాగింది.

"అయ్యయ్యో! నా మనవడిపై మళ్ళీ ఆపద వచ్చిపడిందే!! నా తదనంతరం నా ముహమ్మద్‌ని ఎవరు ఆదరిస్తారు?" అంటూ అబ్దుల్‌ముత్తలిబ్ ఆందోళన పడసాగారు.

ఈ దిగులుతో ఆయన ఆరోగ్యం మరికాస్త క్షీణించింది. చికిత్స కోసం చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. చివరికి ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టమైపోయింది.

బంధువులు, ఇరుగుపొరుగు వాళ్ళు గుమిగూడారు. కొడుకులు, కోడళ్ళు ఆయన చుట్టూ మూగారు. బాల ముహమ్మద్ (సల్లం) కూడా వచ్చి అదురుతున్న గుండెలతో ఆందోళనపడుతూ అమాయకంగా చూడసాగారు. ఆ తరువాత కాస్సేపటికి అబ్దుల్ ముత్తలిబ్ ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

"తాతయ్యా....! తాతయ్యా....!! చివరికి నువ్వు కూడా నన్నొదలి పోయావా?" బాల ముహమ్మద్ (స) మరొకసారి భోరున విలపించారు. రెక్కలువిరిగిన పక్షిలా విలవిల్లాడి పోయారు.

ఖురైష్‌తెగ అగ్రనాయకుడు, కాబా ధర్మకర్త అబ్దుల్‌ముత్తలిబ్ ఇక లేరు. విధి నిర్దేశించిన విధిని నిర్వహించి ఆయన ఇహలోకం నుంచి శాశ్వతంగా కనుమరుగైపోయారు. మక్కా పట్టణంపై మరోసారి విషాదఛాయలు అలుముకున్నాయి.

"ఏమండీ! అబ్దుల్ ముత్తలిబ్ గారు చనిపోయారటగా?"

"ఔనండీ! నేనక్కడ్నుంచే వస్తున్నా. ప్రాణం పోయి కాస్సేపయింది. ముహమ్మద్ (సల్లం) పరిస్థితి చూస్తుంటే నా గుండెలు తరుక్కుపోతున్నాయి".

"అయ్యో! ఇక ఆ పిల్లోడి బాగోగులు ఎవరు చూస్తారు?"

"పాపం నాన్న లేడు, అమ్మా లేదు. అల్లారు ముద్దుగా పెంచే తాతయ్య కూడా పోయాడు. ఇక ఈ అనాథ పిల్లోడికి దిక్కెవరూ?"

ఇలా చెప్పుకుంటూ జనం బాల ముహమ్మద్ (స)పై ఎంతో సానుభూతి వెలిబుచ్చుతున్నారు. కొందరు 'దిక్కులేనివారికి దేవుడే దిక్క'ని సమాధానం చెప్పుకున్నారు.

నిజమే. దేవుడు అబ్దుల్ ముత్తలిబ్ మరణం తరువాత కూడా బాల ముహమ్మద్ (సల్లం)కు సంరక్షణ ఏర్పాటు చేశాడు. పెదనాన్న అబూతాలిబ్ వెంటనే ముహమ్మద్ (సల్లం)ని తన సంరక్షణలోకి తీసుకున్నారు.

"ఎంత దగ్గరి బంధువులయినా అనాథ పిల్లలను లోకుల మెప్పు కోసమే ప్రేమిస్తారు. నిజానికి సహజసిద్ధమైన ప్రేమ, సానుభూతులు వారి హృదయాల్లో ఎక్కడ్నుంచి వస్తాయి?" అని చెప్పుకోసాగారు మరికొందరు ప్రజలు.



కాని అబూతాలిబ్ వారి అనుమానాలు తప్పని త్వరలోనే నిరూపించారు. ఆయన ముహమ్మద్ (సల్లం)ని అమితమైన ప్రేమాభిమానాలతో ఆదరించారు. కన్న కొడుకుల కన్నా మిన్నగా చూసుకోసాగారు. పెద్దమ్మ ఫాతిమా కూడా బాబుకు మాతృ మమకారం అందిస్తూ ఏలోటూ రాకుండా చూసుకోసాగింది.

ఇలా బాల ముహమ్మద్ (సల్లం) తాతయ్య పోయిన కొన్ని రోజుల్లోనే దుఃఖం నుండి తేరుకొని, పెదనాన్న, పెద్దమ్మల సంరక్షణలో ఎలాంటి చీకూ చింతా లేకుండా ప్రశాంత జీవనం గడపనారంభించారు.

## మండుటెండలో కుండపోత వర్షం-(13)

ఎండలు మండిపోతున్నాయి. భూములు బీటలు వారుతున్నాయి. జలనిధులు తరిగిపోతున్నాయి. చెట్లు ఎండిపోతున్నాయి. మేత దొరక్క పశువులు నకనకలాడుతున్నాయి. పాలులేక పసిపిల్లలు చిక్కిపోతున్నారు. దారిద్ర్యంతో పేదల కడుపులు పీక్కుపోతున్నాయి. వ్యాపారలావాదేవీలు మందగించి పోతున్నాయి. వీధులు నిర్మానుష్యమవుతున్నాయి. కరువురక్కసి కరాళనృత్యం చేస్తోంది. ప్రజలు హాహాకారాలు చేస్తున్నారు.

నానాటికీ విషమిస్తున్న పరిస్థితి పట్ల ఖురైష్ నాయకులు తీవ్ర ఆందోళన చెందసాగారు. ఓరోజు వారు సమావేశమయి సమస్యపరిష్కారం గురించి చర్చించారు. చివరికి ఓ నిర్ణయానికి వచ్చి అబూతాలిబ్ ఇంటికి వెళ్ళారు.

"అధినాయకా! ఎంతోకాలం నుంచి వానలు లేక పరిస్థితి రోజురోజుకు ఘోరమవుతున్న సంగతి మీకూ తెలుసు. జనం కరువు రక్కసి కోరల్లో చిక్కుకొని సతమతమవుతున్నారు. పశువులు మేతలేక బక్కచిక్కి పోతున్నాయి. కరువు నివారణకు మేము చేయవలసిన ప్రయత్నాలన్నీ చేశాము. చివరికి మీ దగ్గరికొచ్చాం పరిష్కారం కోసం. మేము మీ నుండి కేవలం ప్రార్థన మాత్రమే కోరుతున్నాం. మీరు వర్షం కోసం దైవాన్ని ప్రార్థించండి" అన్నాడు వారిలో ఒకతను.

"మన దేవతలకు మన మీద దయ కలగడం లేదు. మేము సమర్పించుకున్న కానుకల్ని వారు తిరస్కరించారు. మా మొక్కుబడులన్నీ నిష్ఫలమై పోయాయి. మేము పాపాత్ములం. మా దేవతలు మమ్మల్ని కనికరించడం లేదు. ఇక మీరే ఏదయినా చెయ్యాలి. మీరు పుణ్యాత్ములు, కాబా ధర్మకర్తలు. అందుకని మీరు మా కోసం వర్షం కురిపించమని దేవుడ్ని ప్రార్థించండి" అన్నాడు మరొకడు దీనంగా.

అబూతాలిబ్ ఈమాట విని తల వంచుకొని రెండు క్షణాలు ఆలోచించారు. తర్వాత ఏమాటా చెప్పకుండా లోపలగదిలోకి వెళ్ళిపోయారు. కాస్సేపటి బయటికి వచ్చారు. ఆయనతో పాటు పదేళ్ళ బాలముహమ్మద్ (స) కూడా ఉన్నారు. రాగానే "పదండి కాబాలయానికి" అన్నారు ముహమ్మద్ (స)ని తీసుకొని బయటికి అడుగేస్తూ.

ఖురైష్ నాయకులంతా ఆయన వెంట బయలుదేరారు. వారి వెనుక జనసామాన్యం కూడా ఓ పెద్ద గుంపుగా బయలుదేరింది. అబూతాలిబ్ కాబా మందిరానికి చేరుకున్నారు.

బాల ముహమ్మద్ (స)ని కాబా గోడకు ఆనిచ్చి కూర్చోబెట్టి, “బాబూ! వర్షం కురిపించమని దేవుణ్ణి ప్రార్థించు. ఆయన నీ ప్రార్థన ఆలకించి వర్షం కురిపిస్తాడని నాకు గట్టి నమ్మకం ఉంది” అన్నారు ఆయన.

ప్రజలు వారి చుట్టూమూగి, ఏం జరుగుతుందో చూద్దామని ఆసక్తిగా నిల్చున్నారు.

బాల ముహమ్మద్ (స) తలపెకెత్తి నిర్మలంగా ఉన్న నీలాంబరం వైపు దృష్టి సారించారు. పెదవుల నుండి ప్రార్థనా పదాలేమిటో నిశ్శబ్దంగా వెలువడి విశ్వాంతరాళంలోకి దూసుకుపోయాయి. దాంతోపాటు ఆయన తన కుడిచేయి చూపుడు వ్రేలిని పైకెత్తారు.

జనం ఊపిరిబిగబట్టి ముహమ్మద్ (స) వైపు, ఆకాశం వైపే తదేకంగా చూడసాగారు. ఆకాశం ఎటు చూసినా నిర్మలంగా ఉంది. మచ్చుకు ఓచిన్న మబ్బు తునకైనా లేదు. ఎండ పెటపెట లాడిపోతోంది.

కాని కొన్నిక్షణాల్లోనే వాతావరణం మారిపోయింది. ఎటునుంచో మేఘాలు ఉరుకులు పరుగులు పెడ్తూ వచ్చేశాయి. సూర్యుడు గబగబా పారిపోయి కనుమరుగయిపోయాడు. చూస్తూ ఉండగానే ఆకాశం దట్టమైన కారుమేఘాలతో నిండిపోయింది. రివ్వున గాలి వీచింది. ఆ వెనువెంటనే చిటపట చినుకులు ప్రారంభమయ్యాయి.

అబూతాలిబ్ చిన్నారి ముహమ్మద్ (సల్లం)ని తీసుకొని ఇంటికి బయలుదేరారు. జనం కూడా క్రమేణా తమ తమ ఇండ్లకు వెళ్ళిపోసాగారు.

ఉరుములతో ఆకాశం దద్దరిల్లింది. మెరుపులతో వర్షం ఉధృతమయింది. చాలా సేపటిదాకా వాన కుండపోతగా కురిసి క్రమంగా వెలిసింది. వీధులు ఏరులై పారాయి. కుంటలు, బావులు నిండిపోయాయి. మోడువారిన చెట్లు చిగురించాయి. బీటలువారిన నేల పచ్చికతో నిండిపోయింది. జనంలో ఉత్సాహం పెల్లుబికింది. ఎక్కడచూసినా బాల ముహమ్మద్ (స) గురించిన చర్చలే. ఏనోట విన్నా ఆచిన్నారి మహిమ గురించిన మాటలే.

# మేకలకాపరికి తీరికలేని చింతన-(14)

అరబ్బులు నిరాడంబర జీవులు. వారికి సభ్యతా సంస్కారాలంటే ఏమిటో తెలియదు. గొప్పింటి పిల్లలు కూడా అడవులకు వెళ్ళి పశువులు కాస్తుంటారు. అందువల్ల ముహమ్మద్ (సల్లం) కూడా మక్కా అడవుల్లో మేకలు కాయడం మొదలెట్టారు.

యథాప్రకారం ఆయన ఓరోజు మేకలు తోలుకుంటూ అడవికి బయలుదేరారు. దారిలో మరో ఇద్దరు బాల కాపరులు తోడయ్యారు. వీరు ముగ్గురు తమ తమ మేకలను చెట్లు, పొదల మధ్య మేత మేయడానికి వదిలేసి, ఓ చట్టుబండ మీదికి చేరి కబుర్లాడుకోవడం మొదలెట్టారు. కాని ముహమ్మద్ (సల్లం)కు ఈ కబుర్లు నచ్చలేదు. ఆయన ఓ అయిదు నిమిషాలు విని విసిగెత్తి లేచి నిల్చున్నారు.

“ఏమిటీ లేచావు? ఎక్కడికెళ్తున్నావు?” అన్నాడు ఒక బాలుడు.

“నా మేకలు దూరంగా వెళ్ళి మేస్తున్నాయి, నేను వాటికి దగ్గరగా వెళ్ళి కూర్చుంటా” చెప్పారు బాల ముహమ్మద్ (సల్లం).



“మేకల్ని గురించి కంగారుపడకు. మనం ఒక్క కేక వేస్తే చాలు, మన కేక విని వాటంతటవే మన దగ్గరకు వచ్చేస్తాయి. రా, ఆడుకుందాం” అన్నాడు రెండో అబ్బాయి.

“మీరాడుకోండి, నేను అటెళ్ళి కూర్చుంటా మేకల్ని చూసుకుంటూ” అంటూ ముహమ్మద్ (సల్లం) అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

“ఏమిటీ ఈయన తత్వం! ఆటలంటే ఇష్టం లేదేమో ఇతనికి!!” అన్నాడు ఒకడు.

“ఈయనగారికి ఒంటరిగా ఉండటమంటే మహాఇష్టం” అన్నాడు అతని స్నేహితుడు.

“నిజమే. ఇతనెప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉంటాడు.”

“ఆలోచించుకోని. మనం అటెళ్ళి ఆడుకుందాం, రా.”

ముహమ్మద్ (సల్లం) ఆ పిల్లలకు చాలా దూరంగా వెళ్ళి ఓ చెట్టు కింద కూర్చున్నారు. ఆయనకు దగ్గర్లోనే ఓ వైపున మేకలు ఆకులు, అలములు మేయసాగాయి.

ముహమ్మద్ (స) తన చుట్టుపక్కలున్న ప్రకృతి దృశ్యాలు పరికించి చూడసాగారు.

“కొండలు... ఇసుక తిన్నెలు... చెట్లు... పొదలు... పైన సహస్ర కిరణాలతో ప్రకాశిస్తున్న సూర్యుడు... నీలాకాశంలో అక్కడక్కడ కొన్ని మబ్బు తునకలు... ఈ మబ్బు తునకలే కాబోలు కారు మేఘాలయి కడవలకొద్దీ వర్షం కురిపిస్తాయి. ఆ వర్షానికి చెట్లు, చామలు మొలకెత్తుతాయి. ఏమిటీ విచిత్రం! అసలు వీటన్నిటినీ సృష్టించిన ఆ ప్రభువు ఎంత గొప్పవాడో!! ఆయనే మనుషుల్ని కూడా సృష్టించిన మహా మేధావి.”

“మరి ఈ దేవతలు, విగ్రహాలు ఏమిటీ? జనం వాటికి కానుకలు, జంతుబలులు సమర్పించుకోవడం ఏమిటీ? వాటి ముందు సాగిలబడి మొరపెట్టుకోవడం ఏమిటీ? ఈ మనుషులు స్వయంగా తయారుచేసుకున్న ఈ విగ్రహాలు వీరికేమైనా తిండి పెడ్తున్నాయా? వర్షం కురిపిస్తున్నాయా? ఆహారమిచ్చే, వర్షం కురిపించే సృష్టికర్తను వదలి, ఉలుకు పలుకూ లేని విగ్రహాలను పూజిస్తున్న ఈ జనం ఎంత మూర్ఖులు.....!”

“ముహమ్మద్! ఏమిటీ ఆలోచిస్తున్నావు?” అన్నారు స్నేహితులు దగ్గరకు వస్తూ.

“ఆ... ఆలోచిస్తున్నాను. ఈ చెట్లు, కొండలు ఎక్కడ్నుంచి వచ్చాయి, వీటిని ఎవరు సృష్టించారూ అని ఆలోచిస్తున్నాను” అన్నారు ముహమ్మద్ (స) కాస్తంత తొట్రుపడుతూ.

“వీటన్నిటిని మన దేవతలు సృష్టించారు.”

“కాని, నా అంతరాత్మ ఈ విషయాన్ని ఒప్పుకోవడం లేదు.”

“తప్పు, అలా అనకు. మన దేవతలకు కోపం వచ్చి మనల్ని శపిస్తారు.”

“మాట్లాడటమేరాని ఈ విగ్రహాలు శపించడమేమిటీ? మీరు కూడా కాస్త ఆలోచించండి. నాకు మాత్రం వీటిమీద ఏమాత్రం నమ్మకం లేదు.”

“అది సరేగాని, ముహమ్మద్! ఈరాత్రి బనూకనాన వాడలో బ్రహ్మాండమైన పాటకచేరి ఉందట. మేమెల్తున్నాం. నువ్వుకూడా విందువుగాని వచ్చేయి. డప్పులు, పాటలు, నాట్య కత్తెలు... అబ్బో, ఒకటేమిటీ..... భలే ఉంటుందిలే....” ఓ మిత్రుడు చెప్పుకుపోతున్నాడు.

“నాకు ఇలాంటివి చూడాలని లేదు. మీరు వెళ్ళండి” అన్నారు ముహమ్మద్ (స).

“అసలు నువ్ ఓసారి చూస్తే వదలిపెట్టవ్. ఆ పాటలు, నాట్యం, ఆ మేళతాళాలు... అబ్బ్బ... ప్రతి ఒక్కరూ చూసి తీరాల్సిన కార్యక్రమం. ఎప్పుడూ మేకల మధ్యుంటే జీవితంలో ఏం మజా ఉంటుంది? అప్పుడప్పుడు ఇలాంటి పాట కచేరీలు కూడా వినాలి. అంతెందుకు, ఓసారి పోయిరా నీకే తెలుస్తుంది” అంటూ ఉసిగొల్పాడు రెండోవాడు.

“ఊ...సరే వస్తాన్లే” అన్నారు బాల ముహమ్మద్ (స) మనసులో ఇష్టం లేకపోయినా.

సాయంత్రం పొద్దువాలగానే మిత్రులు ముగ్గురూ మేకలు తోలుకొని ఇండ్లకు తిరిగొచ్చారు. ఆ రాత్రి బనూకనాన వాడలో......

మద్దెల మోతలు... డప్పుల ఢకఢకలు... సన్నాయి నొక్కులు... హృద్యంగ రాగాలు... కర్ణపేయంగా మార్మోగుతున్నాయి. గాయకురాళ్ళు, నాట్యకత్తెలు ఉరకలు వేసే ఉత్సాహంతో తమ ప్రతిభాపాటవాలు ప్రదర్శిస్తున్నారు. మాటిమాటికి మధుపాత్రలు మగువుల నుంచి మగరాయళ్ళ చేతులకు మారుతున్నాయి.... రంగరంగ వైభవంతో శ్రోతలు ఉర్రూత లూగుతున్నారు... మధురమైన పాటలు వింటూ మైమరచిపోతున్నారు.

బాల ముహమ్మద్ (సల్లం) ఇంటి నుంచి అయిష్టంగానే బయలుదేరారు. మనస్సు ససేమిరా అంటున్నా కాళ్ళు మాత్రం కదంబ కార్యక్రమం వైపు లాక్కెళ్తున్నాయి. కాని దారిలో ఒకచోట ఓఇంటి నుంచి మధురమైన గానమేదో చెవిన పడింది. బాల ముహమ్మద్ (సల్లం) అదేమిటో విందామని అక్కడికెళ్ళి కూర్చున్నారు. అంతే, కాస్సేపటికి నిద్ర ముంచుకొచ్చింది. తరువాత లేచి చూస్తే భళ్ళున తెల్లారిపోయింది.

పొద్దెక్కిన తరువాత బాల ముహమ్మద్ (సల్లం) యథాప్రకారం మేకల్ని తోలుకొని అడవికి బయలుదేరారు. దారిలో మిత్రులు కలిశారు.

“ముహమ్మద్! రాత్రి నువ్ పాటకచేరికి రాలేదా? మేము నిన్ను చాలా సేపు వెతికాం. కాని నువ్ ఎక్కడా కనపడలేదు” అన్నారు మిత్రులు.

“నేను పాటకచేరికి వెళ్దామనే బయలుదేరాను. కాని దారిలో ఒక ఇంట్లో నుంచి ఏదో పాట విన్పిస్తుంటే అక్కడికి వెళ్ళికూర్చున్నా. అదేం పాటోగాని, ఒక చరణం విన్నానో లేదో నిద్ర ముంచుకొచ్చింది. లేచిచూస్తే తెల్లారిపోయింది” చెప్పారు ముహమ్మద్ (స).

“అరె, మంచికార్యక్రమం పోగొట్టుకున్నావు. సరే ఈ రోజురాత్రి కూడా ఉంది. వెళ్ళి చూడు. ఈ అవకాశం పోతే ఇంతట్లో రాదు మళ్ళీ. ఈ రాత్రి ఎలాగైనా చూడు” అన్నారు స్నేహితులు మళ్ళీ పురమాయిస్తూ.

సాయంత్రం ఇంటికి తిరిగొచ్చాక భోంచేసి మళ్ళీ బయలుదేరారు బాల ముహమ్మద్ (స) పాటకచేరికి. కాని అదేమి చిత్రమో, కొంచెందూరం పోగానే మళ్ళీ ఓఇంటి నుండి పాట విన్పించడం, అక్కడికెళ్ళి కూర్చుంటే వెంటనే నిద్రరావడం జరిగిపోయాయి.

ముహమ్మద్ (స) బాల్యంలో సైతం పాటకచేరీలు, పుక్కిటి పురాణాలు వినడాన్ని విధి అంగీకరించలేదు. అందుకే ఆయనకు రెండోసారి కూడా దారిలోనే నిద్ర వచ్చేసింది.



# వింత ప్రవర్తన, విచిత్ర మాటలు-(15)

సభ్యతా సంస్కారాలు లేని అరబ్ సమాజంలో మూఢ నమ్మకాలు, మూఢాచారాలు, మద్యసేవనం, మగువ లోలత్వం మాత్రం మస్తుగా ఉండేవి. వీటికి తోడు అరబ్బులు తెగ విద్వేషం, జాతీయ దురభిమానాలతో చీటికిమాటికి పరస్పరం కత్తులు దూసుకుంటూ సంవత్సరాల తరబడి యుద్ధాలు చేసుకునేవారు.

ఇలాంటి సమాజంలో పిల్లలక్కూడా పెద్దల బుద్ధులే రావడం సహజం. కాని బాల ముహమ్మద్(స)పై ఈ చెడుసమాజం ప్రభావం పడకుండా విధి ఆయన్ని ఏకాంత ప్రదేశాల్లో నోరులేని జీవాల మధ్య ప్రకృతిదృశ్యాల చాటున సుశిక్షణ ఇవ్వసాగింది.

ఆ మాటకు వస్తే స్వయంగా ముహమ్మద్ (స)కు కూడా అరబ్బుల జీవన విధానం నచ్చ లేదు. ఆయనకు ఆటపాటలు కూడా నచ్చేవి కాదు. కాలక్షేపం కథలు, పనికిమాలిన కబుర్లు, వ్యర్థమైన పనులకు ఆమడ దూరంలో ఉంటారు. ఆయనసలు తోటి పిల్లలతో ఎక్కువగా స్నేహం చేసేవారు కూడా కాదు. వారి ఆకతాయి చేష్టల్ని అసహ్యించుకునేవారు. నిరంతరం ఏదో ఆలోచిస్తూ ఉండటం ఆయన ప్రవృత్తిలో వేరుగొనిపోయింది. ముఖ్యంగా ప్రకృతిని అవలోకిస్తూ ఆధ్యాత్మిక చింతనలో ఆయన కాలం గడుపుతుంటారు.

అంచేత బాల ముహమ్మద్ (స) వింతప్రవర్తన జనంలో పెద్ద చర్చనీయాంశమైపోయింది. “అబ్దుల్లా కొడుకు దైవదూతలా ఉన్నాడే! నేనింతవరకు అతను తోటిపిల్లలతో పోట్లాడుతూ, దుర్భాషలాడుతూ ఉండటం చూడలేదు” అన్నాడు ఒకడు.

“మీరు పోట్లాట గురించి చెబుతున్నారుగాని, నేనా పిల్లోడ్ని నోరువిప్పి గట్టిగా నవ్వడం కూడా చూడలేదు. చిరునవ్వు మాత్రమే అప్పుడప్పుడు అతని పెదాలపై కాస్తంత తొణికిసలాడుతుంది. అల్లరి చేష్టల వైపు కన్నెత్తి కూడా చూడడు” అన్నాడు మరొకడు.

“అసలు మీరు ముహమ్మద్ (స) అంటే ఏమనుకున్నారు? ఈ అబ్బాయి భవిష్యత్తులో మహాపురుషుడవుతాడని ఇతని ప్రవర్తనే చెబుతోంది. ఈరాన్, ఈజిప్టు జాతులు ఈర్ష్య పడేలా ఇతని ద్వారా మన అరబ్బుల గౌరవం పెరుగుతుందన్నా ఆశ్చర్యం లేదు.”

“అది సరేగాని మరోసంగతి విన్నారా? విలువిద్యలో, గుర్రపుస్వారీలో ఈ అబ్బాయి మక్కా పిల్లల్ని మించిపోయాడు. ఇతను వదిలే బాణం ఒక్కటీ గురి తప్పదు.”

“నేనయితే ఇంతకంటే విచిత్ర విషయమే విన్నాను” అన్నాడు ఒక వృద్ధుడు.

“ఏమిటదీ?” అక్కడ గుమిగూడిన వారంతా ఒకేసారి ఎంతో ఆత్రంగా అడిగారు.

“ఆ అబ్బాయి ఏదైనా చెట్టు పక్కగా నడిస్తే, ఆ చెట్టుకొమ్మలు అతని వైపు కిందికి వంగుతాయట! రాళ్ళ నుంచి అతనికి సలాం చెబుతున్నట్లు ధ్వనులు కూడా వస్తాయట!!”

ఈ విశేషాలు విని అందరూ అత్యంతాశ్చర్యంతో ముక్కుమీద వేలేసుకున్నారు.

ఇలా మక్కాలో ఎవరినోట విన్నా ముహమ్మద్ (స) గురించిన చర్చలే. ఏ సమావేశంలో విన్నా ఆ చిన్నారి వింత ప్రవర్తన గురించిన ప్రస్తావనలే.

అంతేకాదు, బాల ముహమ్మద్ (స) మహా బిడియస్థుడు. ఆయన ఈడు పిల్లలు కొందరు ఒక్కోసారి దిశమొలలతోనే వీధుల్లో తిరుగుతుంటారు. పిల్లలేమిటీ, హజ్ కాలం వచ్చిందంటే కొందరు పెద్దలు సైతం స్త్రీపురుష విచక్షణ లేకుండా కాబా చుట్టూ దిశమొలల తోనే ప్రదక్షిణం చేస్తారు. కాని బాల ముహమ్మద్ (సల్లం) మాత్రం మొలమీద బట్ట కాస్తయినా తొలగనిచ్చేవారు కాదు.

ఒకసారి కాబా వరదముంపుకు గురయి గోడలు బీటలు వారితే, వాటి మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. అందులో పెద్దలతో పాటు పిల్లలు కూడా పాల్గొన్నారు. పిల్లలు తమతమ మొలబట్టలు తీసి భుజాలపై వేసుకొని రాళ్ళు మోయసాగారు. కాని చిన్నారి ముహమ్మద్ (స) అలా చేయకుండా రాళ్ళు మోయడానికి ఉపక్రమించారు.

అయితే చిన్నాయన అబ్బాస్ ఆయన్ని వారిస్తూ "తోటి పిల్లల్ని చూడు, మొలబట్టలు తీసి భుజాలపై వేసుకొని ఎలా మోస్తున్నారో రాళ్ళు. నువ్వు కూడా అలా చెయ్యి, భుజం నొప్పెట్టకుండా ఉంటుంది" అని చెప్పాడు.

కాని ముహమ్మద్ (సల్లం) అలా చేయడానికి తటపటాయించారు. చివరికి ఆయన చిన్నాయనే మొలబట్ట లాగి ఊడదీశారు. అంతే, చిన్నారి ముహమ్మద్ (సల్లం) అమితమైన సిగ్గుతో స్పృహతప్పి పడిపోయారు. తిరిగి లేచి నాలుంగీ, నాలుంగీ అంటూ అరిచారు. వెంటనే అబ్బాస్ ఆయనకు మొలబట్ట మళ్ళీ చుట్టబెట్టారు. అప్పటిగ్గాని బాల ముహమ్మద్ (సల్లం)కు మనస్సు స్థిమిత పడలేదు.

## విదేశీ పర్యటనలో వింతానుభవాలు-(16)

అబూతాలిబ్ వ్యాపార నిమిత్తం ఏడాది కొకసారి సిరియా వెళ్తుంటారు. యథాప్రకారం ఓరోజు ఆయన ప్రయాణ ఏర్పాట్లు చేసుకుంటుంటే, చిన్నారి ముహమ్మద్ (స) ఆయన వైపు తదేకంగా చూడసాగారు.

ముహమ్మద్ (సల్లం)పై అబూతాలిబ్‌కు అమితమయిన వాత్సల్యం ఉన్నప్పటికీ ఈ ప్రయాణంలో ఆయన్ని వెంట తీసుకుపోవడానికి భయపడ్డారు. వయస్సు చూస్తే పన్నెండేళ్ళు మాత్రమే. ప్రయాణమా, బహు కష్టంతో కూడుకున్నది.

సిరియా ప్రయాణమంటే మాటలు కాదు. అది భయంకరమైన ఎడారి మార్గం. పచ్చనిచెట్లుగాని, గలగలపారే సెలయేర్లుగాని కనుచూపు మేరలో మచ్చుకైనా కన్పించవు. ఎటు చూసినా అనేక మైళ్ళదాకా ఎత్తయిన ఇసుకతిన్నెలే కన్పిస్తాయి. అంచేత ముహమ్మద్ (స)ను మక్కాలో వదలివెళ్ళడమే మంచిదని భావించారు అబూతాలిబ్.

అయితే ఆయన ఇంటి నుండి బయలుదేరగాలనే ముహమ్మద్ (స) తానూ వస్తానని ఏడుస్తూవచ్చి ఆయన్ని పెనవేసుకున్నారు. పెదనాన్న హృదయంలో పితృవాత్సల్యం పెల్లు బికింది. చివరికి ఆయన ఈ బాలప్రయాణీకుడ్ని వెంటతీసుకొని బయలుదేరారు.

వాణిజ్యబృందం అనేక మజిలీలు దాటుకుంటూ ప్రయాణం సాగిస్తోంది. ప్రయాణం లో ఈ పిల్లోడు ఎక్కడ అలసి ఢీలాపడిపోయి తనకు భారంగా పరిణమిస్తాడోనని అను



కున్నారు అబూతాలిబ్. కాని ప్రయాణంలో ముహమ్మద్ (సల్లం) మరింత ఉత్సాహంతో కన్పిస్తూ పెదనాన్నకు చేదోడు వాదోడుగా కూడా నిలిచారు. చివరికి ఈ వర్తకబృందం సిరియా చేరుకొని బస్రా పట్నం వెలుపల విడిది చేసింది.

ఆరోజు బస్రా పట్నం వెలుపల బహీరా మఠానికి దరిదాపుల్లో ఉన్న ఓ నీడపట్టు ఈ వర్తకబృందంతో సందడిగా మారింది. ప్రయాణబడలిక వల్ల వర్తకులు సేద తీర్చు కోవడానికి అక్కడ విడిది చేశారు.

ఒంటెలపై నుంచి సామగ్రి దించి గుడారాలు వేసుకున్నాక అందరూ తమతమ పనుల్లో నిమగ్నులయ్యారు. ఒకడు విశ్రాంతి కోసం నడుం వాలిస్తే, మరొకడు ఆకలితో ఆవురావురు మంటూ అన్నంగిన్నెల మీద ఎగబడ్డాడు. ఒకడు ఒంటెలకు మేత వేస్తుంటే వేరొకడు వ్యాపార సరుకులు సర్దడంలో మునిగిపోయాడు. అంతలో ఒక వార్త వచ్చింది.

"మీ అందర్నీ మా మఠాధిపతి తన ఇంట్లో విందు ఏర్పాటుచేసి పిలుస్తున్నాడు, రండి" అన్నాడు ఒక వార్తాహరుడు అక్కడికొచ్చి.

అసాధారణమైన ఈ ఆహ్వానం విని వర్తకులంతా ఆశ్చర్యంతో ఒకరి ముఖాలు మరొకరు చూసుకోసాగారు.

"ఏమిటీ, ఎప్పుడూలేని ఆహ్వానం! ఈఏడు ఇంత దయ ఎందుకో మనమీద!! సరే, తప్పేదేముంది పదండి" అంటూ వార్తాహరుని వెంట అందరూ బహీరా ఇంటికి వెళ్ళారు.

బస్రా పట్టణంలో బహీరా పేరుమోసిన క్రైస్తవ సన్యాసి, సర్వసంగ పరిత్యాగి. పట్నం వెలుపల దైవధ్యానంలో ఏకాంత జీవితం గడుపుతున్నాడు. అతను విందుకు వచ్చిన అరబ్బు వర్తకులందర్నీ సాదరంగా ఆహ్వానించాడు.

"మిత్రులారా! ఈరోజు మీరంతా నాతోపాటు భోజనం చేయాలని నాకోరిక. కనుక మీలో ఏ ఒక్కరూ విడిది ప్రదేశంలో మిగిలి ఉండకూడదు. మరి అందరూ వచ్చేసినట్లేనా?" అన్నాడు బహీరా.

"అంతా వచ్చేశాం. కాకపోతే ఓ పన్నెండేళ్ళ అబ్బాయిని మాత్రం సామాను దగ్గర వదలి వచ్చాం" అన్నారు వర్తకులు.

"కాదు కాదు. అతడ్ని కూడా పిలుచుకురండి. ఆ అబ్బాయి కూడా మనతో పాటే ఇక్కడ భోజనం చేస్తాడు" అన్నాడు బహీరా.

ఈసారి అరబ్బు వర్తకులకు మరింత ఆశ్చర్యం వేసింది. ఎప్పుడూ రాని ఆహ్వానం! అందునా ఒక్కరూ మిగలకుండా అందరూ రావాలన్న షరతు!!

"బహీరా! ఏమిటీ విశేషం? ఇంతకు ముందెన్నడూ నువ్వు మమ్మల్ని విందుకు పిలవలేదే?" అడిగారు వర్తకులు.

"విశేషమేమీ లేదు. మీరు మా అతిథులు. మా పొరుగున వచ్చి బసచేశారు. మీకు ఆతిథ్యం ఇవ్వడం నా విధి కదా! అంతకుమించి మరేముంటుంది?" అన్నాడు బహీరా.

"కాదు, ఇందులో ఏదో విశేషమే ఉండాలి" అనుకున్నారు వర్తకులు మనసులో.

అంతలో బహీరా సేవకుడు వర్తకులు విడిదిచేసిన గుడారాలకు వెళ్ళి ముహమ్మద్ (సల్లం)ని కూడా పిలుచుకు వచ్చాడు.

బహీరా వాలకం చూస్తుంటే ఆ బాలుడి కోసమే ఎదురుచూస్తున్నట్లు ఉంది. బాలుడు లోపలికి ప్రవేశించగానే బహీరా క్షణం పాటు ఆయన్నే రెప్పవాల్చకుండా చూశాడు.

భోజనాలయ్యాక వర్తకుల్లో కొంతమంది ఆటపాటల్లో మునిగిపోయారు. మరికొంత మంది కబుర్లలోకి దిగారు. కొందరయితే బహీరా మఠం చుట్టూ తిరిగి చూడసాగారు. అప్పుడు బహీరా మెల్లగా బాల ముహమ్మద్ (సల్లం) దగ్గరికి వచ్చాడు.

"చూడు బాబూ! లాత్, ఉజ్జాల మీద ఒట్టువేసి కొన్ని ప్రశ్నలు అడుగుతున్నాను. వాటికి సమాధానం చెబుతావా?" అని అడిగాడు అతను.

"చెప్తాగాని, దయచేసి లాత్, ఉజ్జాల మీద ఒట్టు వేయకండి" అన్నారు ముహమ్మద్ (స) మృదువుగా.

"సరే బాబూ! దైవసాక్షిగా అడుగుతున్నాను. నేనడిగేది దాచకుండా చెప్పాలి"

"అలాగే చెప్తాను, అడగండి ఏం అడగదలచుకున్నారో."

అప్పుడు బహీరా బాలుడి గుణగణాలను గురించి, స్వభావాన్ని గురించి, అలవాట్లను గురించి, మరికొన్ని ఇతర విషయాలను గురించి ఏమేమో అడిగాడు. బాల ముహమ్మద్ (సల్లం) అన్నిటికీ సమాధానమిచ్చారు.

అంతలో అబూతాలిబ్ వచ్చారు పిల్లవాడ్ని తీసికెళ్ళడానికి. బహీరా ఆయన్ని చూసి....

"ఈ పిల్లవాడు మీకేమవుతాడు?" అనడిగాడు.

"నా కుమారుడు" చెప్పారు అబూతాలిబ్.

"ఏమిటీ, ఈ అబ్బాయి మీకుమారుడా! కాదు. నిజం చెప్పండి. ఇతని తండ్రి బతికే వున్నాడా? ఇదెలా సాధ్యం?" అన్నాడు బహీరా.

బహీరా మాటలకు అబూతాలిబ్ ఆశ్చర్యపోయారు. ఇక నిజం చెప్పక తప్పలేదు.

"ఈ అబ్బాయి నా తమ్ముడి కొడుకు."

"మరి ఇతని తండ్రి...?"

"ఇతని తండ్రి ఇతను తల్లి కడుపులో ఉండగానే చనిపోయాడు."

"ఇప్పుడు మీరు నిజం చెప్పారు. ఇక తీసికెళ్ళండి మీ అబ్బాయిని. చూడండి, యూదుల బారినుండి ఈ అబ్బాయిని కాపాడుకోవాలి. నేనెలా గుర్తించానో అలాగే గుర్తించ గలిగితే వారు తప్పక ఈ బాలుడి వెంటపడతారు. అంతేకాదు, ఆ దుర్మార్గులు ఇతని ప్రాణం తీయడానికైనా వెనకాడరు. అంచేత బాబుని జాగ్రత్తగా కాపాడుకోండి. ఈ పిల్లవాడు భవిష్యత్తులో మహాపురుషుడవుతాడు" అంటూ హెచ్చరించి మరీ చెప్పాడు.

అబూతాలిబ్ బాల ముహమ్మద్ (స)ని తీసుకొని విడిది ప్రదేశానికి వెళ్ళిపోయారు.



ఆరోజు బహీరా ముఖం ఇదివరకెన్నడూలేని విధంగా ఆనందాతిశయంతో కళ కళలాడిపోయింది. "ఔను, నేననుకున్నది నిజమయింది" అని మనసులో అనుకుంటూ మఠం లోపలికెళ్ళి ధ్యానంలో లీనమయిపోయాడు.

బహీరా ప్రఖ్యాత క్రైస్తవ సాధువు. తౌరాత్, ఇంజీల్ తదితర మతగ్రంథాలు కాచి వడపోసిన గొప్ప తత్వవేత్త. ఈ గ్రంథాల్లో అంతిమ దైవప్రవక్త రాక గురించి అనేక భవిష్యత్ ప్రకటనలు ఉన్నాయి. వాటిని చదివి ఉండటంవల్ల బహీరా పిల్లవాడ్ని చూడగానే రాబోయే అంతిమ దైవప్రవక్త అతనేనని ఊహించాడు.

బాలుడి బాహ్య స్వరూపమైతే భవిష్యత్ ప్రకటనల ప్రకారమే ఉంది. మరి అంతర్ స్వరూపం, అంటే పుట్టుక, గుణగణాలు, అలవాట్ల సంగతేమిటి? వీటిని ధృవపరచుకోవడా నికే అతను బాలుడ్ని, బాలుడి సంరక్షకుడ్ని విడివిడిగా కలుసుకొని మాట్లాడాడు.

ఆ తర్వాత బహీరా ఈ బాలుడే రాబోయే అంతిమ దైవప్రవక్తని వెంటనే గ్రహించాడు. ఇలా తన ఊహ నిజమైనందుకు అతను పరమానందభరితుడయ్యాడు.

వర్తకబృందం బస్రాలో నెలరోజులుంది. వర్తకులు మక్కా నుంచి తెచ్చిన సరుకులు బస్రాలో అమ్మారు. బస్రాలో లభించే, మక్కాలో దొరకని సరుకులు కొన్నింటిని కొన్నారు.

ఆతర్వాత ఈ వర్తకబృందం బస్రా నుంచి మక్కాకు తిరుగు ప్రయాణమయింది.

బాల ముహమ్మద్ (సల్లం) దారిలో తారసపడుతున్న చిత్రవిచిత్ర ప్రకృతి దృశ్యాలు పరికిస్తూ, సహప్రయాణీకులు చెప్పుకుంటున్న విశేషాలు వింటూ, వివిధ ప్రాంతాల ప్రజల విశ్వాసాలు, ఆచార వ్యవహారాలు, ఆరాధనా పద్ధతులు, సభ్యతా సంస్కృతులు జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు.

అంతేకాకుండా దారిలో ఆయన విగ్రహాలను ఆరాధించేవారిని, ప్రకృతి శక్తుల్ని పూజించేవారిని, రకరకాల దురాచారాలు, మూఢనమ్మకాలు పాటించేవారిని, దైవగ్రంథాల్ని తారుమారుచేసి జనానికి కల్పిత విశ్వాసాలు నూరిపోసే మతాధికారులను కూడా ఎంతో మందిని చూశారు.

కాని ఈ ఆరాధనా రీతులు, ఆచార వ్యవహారాలు ఏవీ తనకు నచ్చినట్లు లేదు. లోకం యావత్తు అజ్ఞానం, అపమార్గాల్లో పడి కొట్టుమిట్టాడుతున్నట్లు కన్పించింది. ప్రపంచ మంతా అంధకారం అలుముకున్నట్లు అన్పించింది.

విశ్వప్రభువును చేరుకునేందుకు వీటన్నింటికీ అతీతమయిన, విభిన్నమైన రుజు మార్గం ఒకటి ఉండవచ్చని, అదే ఇహపరలోకాల్లో మానవ శ్రేయానికి దోహదకారి అవుతుం దని ఆయన అంతరాత్మ ఘోషించింది.

కాని ఆ మార్గం ఏది? ఎలా ఉంటుంది? ఎక్కడ లభిస్తుంది?

పట్టుమని పన్నెండేళ్ళయినా నిండని ఆ బాలుని మనస్సులో ఇలా ఎన్నెన్నో ప్రశ్నలు తలెత్తసాగాయి. ఎలాగైనా సత్యాన్ని కనుగొనాలన్న పట్టుదల, వాస్తవాన్ని బట్టబయలు చేయాలన్న ఆరాటం, అంధకారంలో తచ్చాడుతూ ఎన్నో చెడులు, కీడులకు బలైపోతున్న

మానవాళికి జ్ఞానకాంతి చూపాలన్న ఆకాంక్ష, అశాంతి అరాచకాలతో సతమతమౌతున్న ప్రజలకు సంతృప్తి, సుఖశాంతులు కలిగించాలన్న బలీయమైన కోరిక ఆయన నరనరాల్లో వ్యాపించాయి.

వర్తకబృందం మక్కా చేరుకుంది. అబూతాలిబ్ రకరకాల సరుకులతో ఇంటికి తిరిగివచ్చారు. అబూతాలిబ్ వచ్చారని తెలియగానే ఎందరో బంధుమిత్రులు ఆయన్ని కలుసుకోవడానికి వచ్చారు. అనేక ప్రశ్నలతో ప్రయాణ విశేషాలను గురించి అడిగారు. అబూతాలిబ్ అన్నిటికీ ఓపిగ్గా సమాధానాలు చెబుతూపోయారు.

అయితే బాల ముహమ్మద్ (స)కు ఇవేవీ పట్టలేదు. ఇంటికి తిరిగొచ్చినా ఆయనది ఒకే ఆలోచన, ఒకే పట్టుదల... నైతికంగా, ఆధ్యాత్మికంగా అణగారిన ఈ సమాజాన్ని ఉద్ధరించడం ఎలా? ఏం చెయ్యాలి??

## ఫుజ్జార్‌లో పడగవిప్పిన ప్రతీకారం-(17)

ప్రతి ఏటా జీఖాదా, జిల్‌హజ్జా, ముహర్రం, రజబ్ మాసాలను అరబ్బులు పవిత్ర మాసాలుగా పరిగణిస్తారు. అంటే ఆ నాలుగు నెలల్లో జగడాలు, యుద్ధాలు, రక్తపాతాలు జరపడం నిషిద్ధం. మక్కాలో ఈ నాలుగు నెలలు పెద్ద జాతర జరుగుతుంది.

అరేబియా నలుమూలల నుండి, మరెన్నో ఇతరదేశాల నుండి వేలాదిమంది ప్రజలు ఇక్కడికి చేరుకుంటారు. వారు తెచ్చిన రకరకాల వస్తువులు ఈ జాతరలో కన్పిస్తాయి. పాటకచేరీలు, కవిసమ్మేళనలు, ఉపన్యాసవేదికలు కూడా పెద్దఎత్తున వెలుస్తాయి. ప్రతి మనిషీ ఆ మాసాలలో తన మతవిశ్వాసాలు, భావాలను నిర్భయంగా వెల్లడిస్తాడు.

ఇలా విభిన్నవిశ్వాసాలు, ఆచారాలు, సంస్కృతులు కలిగిన రకరకాల భక్తులు, యాత్రికులు, కవులు, వర్తకులతో ఈజాతర ఆ నాల్గు నెలలు కళకళలాడుతూ ఉంటుంది.

ఆధ్యాత్మిక ఆలోచనలతో సత్యాన్వేషణ కోసం రేయింబవళ్ళూ పరితపిస్తున్న బాల ముహమ్మద్ (సల్లం)కు జాతరకు వచ్చే విభిన్న వ్యక్తుల్ని కలుసుకొని వారి విశ్వాసాలు, భావాలు తెలుసుకోవడానికి మంచి అవకాశం లభించేది. అక్కడి విశేషాలను ఆయన జాగ్రత్తగా పరిశీలిస్తూ మనస్సులో భద్రపరచుకునేవారు. ఆ తరువాత ఏకాంత సమయంలో వాటి వాస్తవికతను గురించి నిశితంగా ఆలోచించేవారు.

మక్కా నుండి కొన్ని మైళ్ళ దూరంలో ఉన్న 'ఉకాజ్' ప్రాంతం ఈ నాలుగు పవిత్ర మాసాల్లో గొప్ప వాణిజ్యకేంద్రంగా వెలిగిపోతూ ఉంటుంది. అమ్మకం, కొనుగోళ్ళు విపరీతంగా జరుగుతాయి. జాతరకు వచ్చే జనం తమకు కావలసిన వస్తువులు ఎగబడి కొంటారు. వర్తకులు అపార లాభాలు గడిస్తారు. ఇరాఖ్ రాజధాని 'హీరా' నుంచి కూడా పెద్ద ఎత్తున వ్యాపార సరుకులు ఇక్కడకు చేరుకుంటాయి.

ఆ యేడు కూడా ఇరాఖ్‌రాజు నోమాన్ బిన్ మంజర్ ఒంటెలపై సరుకులు ఎక్కించి 'ఉకాజ్' మార్కెట్‌కు పంపడానికి సిద్ధంగా ఉంచాడు. అయితే హీరా నుంచి ఉకాజ్‌కు



చేరుకోవడానికి రక్షణ ఏర్పాట్లు కూడా ఎంతో అవసరం. దాన్ని గురించి మాట్లాడటానికి నోమాన్ దర్బారుకు బనూకనాన, బనూహవాజన్ తెగల నాయకులు వచ్చారు.

"వర్తకబిడారాలు సిద్ధంగా ఉన్నాయి. నేను వీటిని మీ రక్షణలో ఇవ్వాలనుకుంటున్నా. మీ ఇద్దరిలో ఈ బాధ్యత ఎవరు తీసుకుంటారో చెప్పండి" అన్నాడు ఇరాఖ్ రాజు.

"నేను మీ వర్తక బిడారాలకు బనూకనాన తెగవారి బారినుండి రక్షణ కల్పిస్తాను. కాని నా వర్తక బిడారాలను నజద్, తిహామా తెగల బారినుండి రక్షణ కల్పించే వ్యక్తి కోసం అన్వేషిస్తున్నాను" అన్నాడు బనూకనాన తెగ నాయకుడు బరాజ్.

"అయితే ఉర్వా! నీ అభిప్రాయం ఏమిటి ఈ విషయంలో?" నోమాన్ ప్రశ్నించాడు.

"మహారాజా! ఇతను తన జాతిచేత తిరస్కరించబడిన కుక్క. ఇతనా మీ వర్తక బిడారాలకు రక్షణ కల్పించేవాడు! ఇది మాలాంటి నాయకుల పని. మీరు నామీద నమ్మకం ఉంచండి. నేను నజద్, తిహామా తెగల బారినుండి రక్షణ కల్పిస్తాను" అన్నాడు బనూహవాజన్ తెగ నాయకుడు ఉర్వా రుహాల్ మీసాలు మెలేస్తూ.

అవమానకరమైన ఈ మాటలు విని బరాజ్ ఆగ్రహంతో పళ్ళు పటపట నూరాడు.

"మరి నీవు బనూకనాన తెగవారి బారినుండి రక్షణ కల్పించగలవా?" అని అడిగాడతను ఉర్వా వైపు ఉరిమిచూస్తూ.

"ఒక్క బనూకనానా తెగవారేమిటీ, యావత్తు అరబ్ తెగల బారి నుంచి రక్షణ కల్పించగలను" అన్నాడు ఉర్వా రుహాల్ ఫీంకరిస్తూ.

బరాజ్ హోదా అంతస్తులో, బలపరాక్రమాలలో ఉర్వా అంతటివాడు కాదు. అంచేత పట్టరాని కోపాన్ని బలవంతంగా పంటి కిందనొక్కి రాజుఆస్థానం నుండి బయటికి వెళ్ళి పోయాడు. కాని అతని హృదయంలో ప్రతికార జ్వాలలు తీవ్రంగా చెలరేగుతున్నాయి.

ఉర్వా రాజుగారి వర్తక బిడారాలను తన రక్షణలోకి తీసుకొని హీరా నుండి బయలు దేరాడు. బరాజ్ తనంతటి బలాఢ్యుడు కాకపోయినా నిలువెల్లా విషంతో నిండిన జిత్తుల మారి నక్కని ఉర్వాకు తెలుసు. ఐనా అతనికి అంతగా ప్రాముఖ్యం ఇవ్వదలచుకోలేదు.

బరాజ్ అవకాశం కోసం ఎదురుచూస్తూ ఉర్వాని నీడలా వెన్నాడసాగాడు. వ్యాపార సామగ్రితో ఎడారి ఓడలు రేయింబవళ్ళు నడుస్తూ ఉకాజ్ దిశగా ప్రయాణిస్తున్నాయి. ఉర్వా తన సాయుధ సహచరులతో వర్తక బిడారం వెన్నంటే ఉన్నాడు. ఎత్తయిన ఇసుక తిన్నెల మధ్య వంకరటింకర దారిలో అర్ధరాత్రి కటికచీకటి బరాజ్‌కు సువర్ణవకాశం ఇచ్చింది. కాస్సేపట్లోనే బరాజ్ కత్తివాటుకు ఉర్వా గిలగిల కొట్టుకుంటూ ఊపిరి విడిచాడు.

ఈ సంఘటన హవాజన్ తెగలో పెద్ద చిచ్చురేపింది. వారంతా ఆగ్రహోదగ్రులై పోయారు. ప్రతీకారేచ్ఛ పడగవిప్పి బుసలు కొట్టసాగింది. వారు తాడో పేడో తేల్చుకోవడానికి సిద్ధమయ్యారు. బనూకనాన తెగలోని ఖురైష్ వంశస్థులు యుద్ధంవల్ల సంభవించే ఘోర రక్తపాతాన్ని నివారించడానికి రాయబారం పంపారు. రక్తపరిహారంగా మీరు బరాజ్‌ని హతమార్చవచ్చుని, తమకు ఎలాంటి అభ్యంతరం లేదని వారు తెలియజేశారు.

కాని హవాజన్ తెగవాళ్ళు ఈ ప్రతిపాదనను త్రోసిపుచ్చుతూ "బరాజ్ కుక్క కన్నా అధముడు. అతను ఉర్వాకు సమానమైనవాడు కాడు. ఉర్వా మా నాయకుడు. అతని హత్యకు ప్రతీకారంగా మేము ఖురైష్ వంశంలోని ఒక నాయకుడ్ని హతమార్చుతాం" అని సమాధానమిచ్చారు తమ రాయబారి ద్వారా.

ఖురైష్ నాయకులు మరో ప్రతినిధిని పంపుతూ "హత్యకు బదులు సంబంధిత హంతకుడ్ని హతమార్చడమే. అతనికి బదులు మేము మరెవరినీ మీకు ఇవ్వలేము. ఇదే మా తుదినిర్ణయం" అని చెప్పారు.

హవాజన్ తెగవాళ్ళు ఖురైషీయుల రెండవ ప్రతిపాదనన కూడా తిరస్కరిస్తూ "మేము రణరంగంలోకి దిగి మీ నాయకులందర్నీ హతమారుస్తాం" అని హెచ్చరించారు.

ఇలా రాయబారం విఫలమై ఇరుపక్షాల మధ్య యుద్ధజ్వాలలు ప్రజ్వరిల్లాయి. వరల్లో నుంచి ఖడ్గాలు చుర్రున బయటికి వచ్చాయి. కత్తులు, కఠారులు పైకి లేచాయి.

రణరంగం వేడెక్కింది. ఇరుపక్షాల మధ్య యుద్ధం హోరాహోరీగా సాగుతోంది. 'పవిత్రమాసాల'లో రక్తపాతం నిషిద్ధమని తరతరాల నుంచి వస్తున్న సంప్రదాయం నేడు దారుణంగా కాలరాయబడుతోంది. కరవాలాలు కదం తొక్కుతున్నాయి. బాణాలు దూసుకు పోతున్నాయి. శరీరాలు తూట్లు పడుతున్నాయి. అవయవాలు తెగిపడుతున్నాయి.

నెలలు, సంవత్సరాలు గడచిపోతున్నా సమరజ్వాలలు సమసిపోయే సూచనలు కానరావడంలేదు. పైగా ప్రతికారజ్వాలలు మరింత పెచ్చరిల్లుతూనే పోతున్నాయి. యుద్ధరంగం అత్యంత భీకరంగా మారిపోయింది.

ఈ చివరి ఘట్టంలో నూనూగు మీసాల ముహమ్మద్ (సల్లం) కూడా పాల్గొనడం విశేషం. అయితే ఆయన కత్తి పట్టి కదనరంగంలోకి దూకలేదు. శత్రువుల మీదికి విరుచుకు పడి ఈటెలు విసరడం లేదు. ప్రతీకారంతో ఊగిపోతూ బాణాలు వదలడం లేదు. ఆయన ఓగుట్ట చాటున నిల్చుని, శత్రుసైనికుల నుండి వచ్చిపడుతున్న బాణాలను సేకరించి విల్లంబులతో పోరాడుతున్న తన చిన్నాన్న, పెదనాన్నలకు అందిస్తున్నారు.

లోకకల్యాణమే తన జీవిత పరమావధిగా భావిస్తూ, సదా ఆధ్యాత్మిక చింతనలో కాలం గడుపుతున్న ముహమ్మద్ (స) హృదయంలో మూఢ ప్రజల పట్ల పగ ప్రతీకారాలు ఎలా జనిస్తాయి? దుర్భర నరమేధకు కారణమవుతున్న ఈ భీకరపోరు త్వరగా సమసిపోయి సర్వత్రా శాంతి నెలకొనాలని మాత్రమే ఆయన కోరుకుంటున్నారు.

కాని పోరు పరాకాష్ఠకు చేరుకుంది. రణరక్కసి వికృత రూపం దాల్చి విలయతాండవం చేయసాగింది. తలలు తెంపులేకుండా తెగిపడుతున్నాయి. రక్తం యేరులయి పారుతోంది. ఉభయ శిబిరాలలో హాహాకారాలు మిన్ను ముడ్తున్నాయి.

ఈ పరిస్థితి చూసి ఇరుపక్షాల నాయకులు ఆందోళనచెందసాగారు. తాము ఆర్థికంగా కూడా బాగా చితికిపోవడం గమనించారు. దాంతోపాటు గొప్ప గొప్ప బలాఢ్యులు, పేరు మోసిన పరాక్రమశాలురు సైతం విసిగిపోయి ఢీలాపడి పోయారు. అందరిలోనూ యుద్ధం కొనసాగించే శక్తి ఉడిగిపోయింది. ధైర్య స్థయిర్యాలు సన్నగిల్లి పోయాయి.



చివరికి ఉభయ శిబిరాల నుంచి ఏకకాలంలో రాజీఒప్పందం కోసం ప్రయత్నాలు మొదలయ్యాయి. రెండుమూడు రోజుల్లోనే ఆ ప్రయత్నాలు ఫలించాయి. బేషరతుగా యుద్ధం విరమించి, ప్రతీకారచర్యలకు శాశ్వతంగా తెరదించాలని ఒప్పందం కుదిరింది.

ఈ ఒప్పందం పట్ల ముహమ్మద్(స) అందరికంటే ఎక్కువగా సంతోషం వెలిబుచ్చారు. విశ్వప్రభువు ఆయన కోరికను మన్నించి యుద్ధాన్ని నిలుపుదల చేయించాడు.

సర్వత్రా శాంతి నెలకొన్నది. ప్రజలలో ఆనందోత్సహాలు వెల్లివిరిశాయి. బహిరంగ రాకపోకలు మొదలయ్యాయి. వ్యాపారలావాదేవీలు తిరిగి ప్రారంభమయ్యాయి. ఇళ్ళు, వీధులు కళకళలాడసాగాయి. జూదగృహాలు, గానకచేరీలు, నర్తనశాలలు మళ్ళీ ఊపందు కున్నాయి. పుక్కిటి పురాణాలు, కాలక్షేపం కథలు తిరిగి జీవం పోసుకున్నాయి.

అయితే సత్యసంథుడు, వాగ్దానపాలకుడయిన ముహమ్మద్ (సల్లం) మాత్రం మునుపటిలాగే యధాప్రకారం ప్రకృతిఅనుశీలన, పరమార్థచింతన, పరోపకార పరాయణ త్వాలతో పవిత్రజీవితం గడుపుతున్నారు. హంగామా, అలజడుల నుంచి వేరయి జన బాహుళ్యానికి దూరంగా మూగజీవాలైన మేకల మధ్య ఏకాంతంలో ఏకేశ్వరచింతనే ఆయన దైనందిన కార్యకలాపమయి పోయింది.

## రక్షణ ఒప్పందం (హిల్ఫుల్ ఫుజూల్)-(18)

ఓరోజు జుబైద్ పట్నం నుంచి ఒకవ్యాపారి ఒంటెమీద సరుకులు తీసుకొని మక్కా నగరానికి వచ్చాడు. మక్కా మార్కెట్‌లో ఒకచోట అతను సరుకులు దించుకొని వ్యాపారం ప్రారంభించాడు. అప్పుడు ఆస్ బిన్ వాయిల్ అనే నగరవాసి ఒకతను వచ్చి ఆ సరుకుల్ని కొనుగోలు చేశాడు. అయితే పైకం ఎల్లుండి ఇస్తానని చెప్పాడు.

"పర్వాలేదు. అలాగే ఇవ్వండి. కాని మాట తప్పకూడదు సుమా!" అన్నాడు వ్యాపారి.

"మాట తప్పడం మా జాతిలోనే లేదు. మీరు నిశ్చింతగా ఉండండి. పైకం మొత్తం ఎల్లుండి సాయంత్రానికల్లా మీ చేతుల్లో పెడ్తాను" అన్నాడు ఆస్ బిన్ వాయిల్.

కాని మూడోరోజు నిర్ణీతసమయం దాటిపోయినా, అతను మార్కెట్ వైపు తిరిగి చూడలేదు. దాంతో వ్యాపారి ఆస్‌బిన్‌వాయిల్ ఇంటికి వెళ్ళి పైకం అడిగాడు.

"పైకం కొంచెం తక్కువ పడింది. రెండు రోజుల్లో మీ పైకం మొత్తం సర్దేస్తాను. మీరేమీ కంగారుపడకండి" అన్నాడు ఆస్ బిన్ వాయిల్. వ్యాపారి రెండు రోజుల తరువాత మళ్ళీ అతనింటికి వెళ్ళి అడిగాడు.

"ఏమిటీ, నీకు నేను డబ్బివ్వాలా! ఎందుకూ?" అన్నాడు ఆస్ నిర్లక్ష్యంగా.

"ఎందుకేమిటీ, మీరు నా దగ్గర సరుకులు కొని రెండు రోజుల తరువాత డబ్బిస్తానని చెప్పి ఇప్పుడిలా అంటారేమిటీ?" అన్నాడు వ్యాపారి నిర్ఘాంతపోయి చూస్తూ.

"భలేవాడివిలే, వెళ్ళు వెళ్ళు. నేను నీ దగ్గర ఎలాంటి సరుకు కొనలేదు."

"అయ్యో! ఏమిటీ ఈ అన్యాయం?"

"అన్యాయం లేదు గిన్యాయం లేదు వెళ్ళవయ్యా! అసలు నువ్వెవరో నాకు తెలియదు, వెళ్ళు" అన్నాడు ఆస్ దబాయింపు ధోరణిలో.

"అయ్యా! మీ వాగ్దానం ఏమైంది? పరదేశిని, పేద వ్యాపారిని దోచుకోవడం మీకు భావ్యమేనా?" అన్నాడు వ్యాపారి ఏడ్పు ముఖంతో.

"తక్షణమే ఇక్కడ్నుంచి వెళ్ళిపో. లేదంటావా, రక్తపు మడుగులో పడి గిలగిల కొట్టుకుంటావు" అన్నాడు ఆస్ ఉరిమి చూస్తూ.

పాపం వ్యాపారి నోరుమూసుకొని వెళ్ళిపోయాడు బిక్కమొహం వేసుకొని.

"ఇప్పుడు నా గతేమిటీ? ఎక్కడికి పోవాలి? ఎవరు సహాయం చేస్తారు?" అనుకుంటూ అతను కొందరు ఖురైష్ నాయకుల దగ్గరికెళ్ళి తన గోడు వెళ్ళబోసుకున్నాడు. కాని వారిలో ఒక్కడూ అతనికి సహాయం చేయడానికి ముందుకు రాలేదు.

విదేశస్థుడయిన పేద వ్యాపారి పూర్తిగా నిరాశచెందాడు. అమ్ముకోవడానికి తెచ్చుకున్న సరుకును ఆస్ దోచుకున్నాడు. నగరనాయకులకు తన అసహాయ స్థితి పట్ల చీమ కుట్టినట్లు కూడా లేదు. ఇప్పుడు తన గతేమిటీ? ఇలా విచారిస్తూ అతను మక్కాలోని ఓ కొండగుట్టపై ఎక్కి అరబ్‌సంప్రదాయం ప్రకారం చొక్కా చించుకొని గావుకేకలు పెట్ట నారంభించాడు.

"ఖురైషీయులారా! బనూహాషిం వంశస్థులాలా!! అబ్దుల్ ముత్తలిబ్ సంతానమా!! నాకు అన్యాయం జరిగింది. ఆస్ బిన్ వాయిల్ నా వ్యాపారసామగ్రి దోచుకున్నాడు. ఈ అన్యాయం అరికట్టండి. నాకు సహాయం చేయండి."

ఖురైషీయులు ఈకేకలు విని అటువైపు చూశారు. కాని ఆస్ పేరు వినగానే అతనికి వ్యతిరేకంగా చర్య తీసుకోవడానికి వెనుకంజ వేశారు. ఆ పీడితుడ్ని ఆదుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు.

"ఖురైష్ నాయకులారా! కాబా ధర్మకర్తలారా!! మీ న్యాయ దృక్పథం ఏమయింది? మీ పౌరుషం ఎక్కడ మంట కలిసిపోయింది? ఆస్ లాగా మీరు కూడా దగాకోరులై పోయారా?" అంటూ వ్యాపారి మరోసారి ఎలుగెత్తి అరిచాడు.

ఈ కేకలు కాబా మందిరంలో కూర్చొని మాట్లాడుకుంటున్న కొందరు ఖురైష్ నాయకుల చెవుల్లో కూడా పడ్డాయి. వారిలో అబ్దుల్ ముత్తలిబ్ కొడుకు జుబైర్ ఈ మాటలు వినగానే అదిరిపడ్డాడు. అతనిలో పౌరుషం పురివిప్పింది.

"మనం పౌరుషంలేని వాళ్ళంకాము. పీడితుడ్ని ఆదుకోవడం మన విధి. అన్యాయాన్ని అరికట్టడం మన ధర్మం. పదండి అతనికి సహాయపడదాం" అంటూ జుబైర్ లేచి నిలబడ్డాడు. అతని స్నేహితులు కూడా అతడ్ని అనుసరించారు.

వారందరూ జుబైదీ వ్యాపారి దగ్గరికెళ్ళి, అతనికి జరిగిన అన్యాయం గురించి వివరంగా తెలుసుకున్నారు. వారిలో జుబైర్ తన సానుభూతి వ్యక్తపరుస్తూ ఇలా అన్నాడు:

"విచారించకు. నీకు అన్యాయం జరిగింది. నీవు మా పౌరుషం రెచ్చగొట్టావు. అంచేత మేము నీఫిర్యాదు త్రోసిపుచ్చలేము. ఎట్టి పరిస్థితిలోనూ నీకు మాఅండదండలుంటాయి.



పద నావెంట. నీకు నష్టపరిహారం దొరికేదాకా నీవు మాఇంట్లో అతిథిగా ఉండు."

జుబైదీ వ్యాపారి ఈ మాటలు విని సంతోషించాడు. అతని ఆశ చిగురించింది. జుబైర్ వెంట అతని ఇంటికి బయలుదేరాడు.

మరుసటి రోజు జుబైర్ ప్రోద్బలంతో అబ్దుల్లా బిన్ జుదాన్ ఇంట్లో ఖురైష్ అగ్ర నాయకులు సమావేశమయ్యారు.

జుబైదీ వ్యాపారికి గనక మనం న్యాయం చేకూర్చకపోతే మన వ్యాపారానికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఫుజ్జార్ యుద్ధం తిరిగి చెలరేగే ప్రమాదం కూడా లేకపోలేదు" అన్నాడు ఒక నాయకుడు.

"నీవు చెబుతున్నది నిజమే. అంచేత ఆ ప్రమాదం తలెత్తక ముందే అతనికి జరిగిన నష్టానికి పరిహారం ఇప్పించడమే సర్వవిధాల శ్రేయస్కరం" అన్నాడు మరొకడు.

"మీరు మన తెగలో ఎంతో గౌరవనీయులు, వ్యవహారదక్షతగలవారు. మీలాంటి వారు అన్యాయాన్ని ఎదుర్కోవడానికి ముందుకు రాకపోతే జుబైదీ వ్యాపారికి మద్దతుగా మరెవరు గళం విప్పుతారు? అతను మన పౌరుషం రెచ్చగొట్టాడు" అన్నాడు జుబైర్.

"ఔను. ఇది మన పౌరుషానికి సంబంధించిన సమస్య. మనమీ వ్యాపారి కోసం అవసరమైతే కత్తి దూయడానికైనా వెనుకంజ వేయకూడదు. ఇలాంటి అన్యాయాలు, అక్రమాలు భవిష్యత్తులో జరగకుండా శాశ్వత చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే దీనికోసం మన అభిప్రాయాలతో ఏకీభవించేవారు మరికొందరు కావాలి. అప్పుడే మనం ఏదైనా చర్య తీసుకోగల్గుతాం" అన్నాడు వేరొక నాయకుడు.

"సోదరులారా! మన పట్నంలోనే అనేక సంవత్సరాల క్రితం జరిగిన 'హిల్ఫుల్ ఫుజూల్' ఒప్పందాన్ని మీరు మరచినట్లున్నారు. హిల్ఫుల్ ఫుజూల్ ఒప్పందానికి ఆద్యులైన ఫజల్ బిన్ హారిస్, ఫజల్ బిన్ వదా, ఫజల్ బిన్ ఫుజాలా ప్రముఖులు ఈనాడు మన మధ్య లేకపోవచ్చు. కాని వారి కృషిని జ్ఞప్తికి తెచ్చే ఆ ఒప్పందం ఇప్పటికీ సజీవంగా ఉంది. దాన్నే మనం పునరుద్ధరించి అమలుపరిస్తే బాగుంటుందేమో ఆలోచించండి" అన్నాడు వారందరిలో వయోవృద్ధుడు, అనుభవశాలి అయిన అబ్దుల్లా బిన్ జుదాన్.

"మీరు బాగా గుర్తుచేశారు. ఇంతకంటే మంచి ప్రతిపాదన మరేముంటుంది? ఈ ప్రతిపాదన నాకిష్టమే" అన్నాడు జుబైర్ సంతోషం వెలిబుచ్చుతూ.

"ఈ ప్రతిపాదన మాక్కూడా నచ్చింది. హిల్ఫుల్ ఫుజూల్‌ని పునరుద్ధరించుదాం" అన్నారు ఇతరులు కూడా జుబైర్‌తో ఏకీభవిస్తూ.

ఆ తర్వాత సరికొత్త ఒప్పందం రాశారు. అందులో షరతులు ఇలా పేర్కొన్నారు:

1. మనలో ఏ ఒక్కడూ ఇతరుల హక్కును కొల్లగొట్టడు.

2. మనం బలవంతుడి నుండి బలహీనుడి హక్కు, స్థానికుడి నుండి బాటసారి హక్కును ఇప్పిస్తాము.

3. దౌర్జన్యపరుడికి వ్యతిరేకంగా పీడితునికి సహాయపడటం జరుగుతుంది.

ఒడంబడిక పత్రం మీద చర్చల్లో పాల్గొన్న నాయకులంతా సాక్షులుగా సంతకాలు పెట్టారు. ఒప్పందాన్ని తు.చ. తప్పకుండా అమలుపరుస్తామని ప్రమాణాలు కూడా చేశారు.

జుబైర్ తన కృషి ఫలించినందుకు సంతోషం వెలిబుచ్చుతూ "దేవుని దయ వల్ల అనుకున్న పని నెరవేరింది. ఇక ఆస్ దగ్గరికి వెళ్దాం పదండి" అన్నాడు లేచి నిలబడుతూ.

"అప్పుడే పని పూర్తి కాలేదు, కూర్చో. మనం ఈ ఒప్పందంలో చేర్చుకోవాల్సిన అతి ముఖ్యమైన సాక్షిని మరచిపోయాం. అతని సాక్ష్యం లేకుండా ఒప్పందానికి పరిపూర్ణత రాదు" అన్నాడు అబ్దుల్లా బిన్ జుదాన్.

"ఎవరా సాక్షి? బనూహాషిం వంశనాయకులంతా ఒప్పందంలో పాల్గొన్నారు కదా! ఇంకెవరు మిగిలారూ?" అన్నాడు జుబైర్ ఆశ్చర్యచకితుడయిపోతూ.

"నీ తమ్ముడి కొడుకు ముహమ్మద్ (స). వయస్సులో చిన్నవాడైనా, బుద్ధీ వివేచనల్లో మనందర్నీ మించినవాడు. మనం వయసుమళ్ళిన వాళ్ళం. ఎప్పుడు ఇహలోకం నుంచి ప్రయాణం కడ్తామో తెలియదు. ముహమ్మద్ (స) నవయువకుడు. అతని సాక్ష్యం వల్ల ఒప్పందం సుదీర్ఘకాలం మనగలిగే అవకాశం ఉంటుంది" అన్నాడు అబ్దుల్లా బిన్ జుదాన్.

"ఔనౌను. ముహమ్మద్ (సల్లం) చాలా మంచి అబ్బాయి. ఎంతో వివేచనాపరుడు కూడా. పిలిపించండి అతడ్ని" అన్నాడు ఒకడు అబ్దుల్లాను సమర్థిస్తూ.

కాస్సేపటికి ఆ సభలో నవయౌవనంలో అడుగుపెట్టిన పదహారేళ్ళ ముహమ్మద్ (సల్లం) ప్రత్యక్షమయి క్షణకాలంలో సభికుల చూపుల్ని ఆకట్టుకున్నారు. ఆయన అక్కడి పెద్దలందరికీ సలాం చేసి పెదనాన్న జుబైర్ పక్కన చాప మీద కూర్చున్నారు.

"ముహమ్మద్! మేమంతా శాంతి స్థాపన కోసం హిల్ఫుల్ ఫుజూల్ ఒప్పందాన్ని పునరుద్ధరించాం. ఇందులో సాక్షిగా నీవు కూడా చేరాలి. ఏమంటావ్?" అన్నాడు అబ్దుల్లా బిన్ జుదాన్ యువ ముహమ్మద్ (సల్లం) వైపు చూస్తూ.

"అంతకంటే మహాభాగ్యం మరేం కావాలి నాకు. శాంతిస్థాపన కోసం నేను ఎల్లప్పుడూ సిద్ధమే" అన్నారు యువ ముహమ్మద్ (సల్లం) మందహాసంతో.

"నా తమ్ముడి కొడుకు శాంతిదూత. శాంతిప్రియత్వం ఇతని స్వభావంలోనే ఉంది. హాషిం వంశానికే వన్నెతెచ్చిన సౌశీల్యమూర్తి ఇతను" అన్నాడు జుబైర్ సంతోషంతో ముహమ్మద్ (సల్లం)ని వెన్నుతడ్తూ.

అబ్దుల్లా బిన్ జుదాన్ ఒడంబడిక పత్రంలో ముహమ్మద్ (సల్లం) సాక్ష్యాన్ని చేర్చి, ఆయన చేత కూడా ప్రమాణం చేయించాడు. ఆ తర్వాత అందరూ కలసి ఆస్ బిన్ వాయిల్ ఇంటికెళ్ళి తలుపు తట్టారు. ఆస్ తలుపు తెరచి ఒక్కసారిగా అంతమంది తన ఇంటి మీదికి రావడం చూసి నిర్ఘాంతపోయాడు.

"ఆస్! నీవు జుబైదీ వ్యాపారికి ఇవ్వాల్సిన బాకీ డబ్బు వెంటనే ఈ క్షణమే ఇచ్చెయ్యి. లేదంటావా, మేమంతా కలసి నీకు వ్యతిరేకంగా తీవ్రమైన చర్యలు తీసుకుంటాం. రక్తపాతానికైనా వెనకాడం" అన్నాడు జుబైర్ చివరి పలుకులు వత్తి పలుకుతూ.



ఆస్ బిన్ వాయిల్ ఓసారి వారందర్నీ పరికించి చూసి, పరిస్థితి తనకు అనుకూలంగా లేదని గ్రహించాడు. వెంటనే లోపలికెళ్ళి డబ్బు తీసుకొచ్చి జుబైర్ చేతిలో పెట్టాడు. జుబైర్ దాన్ని జుబైదీ వ్యాపారికి అందించాడు. తర్వాత అందరూ సంతోషంతో తమతమ ఇండ్లకు వెళ్ళిపోయారు.

## ఉకాజ్ మార్కెట్‌లో నిజాయితీ పరిమళం-(19)

యువ ముహమ్మద్ (స) మేకలకాపరి నుంచి వర్తకుని స్థాయికి ఎదిగారు. ఇరవై యేళ్ళు నిండిన ఆ యువకుని హృదయంలో ఆధ్యాత్మికచింతనతో పాటు ఇప్పుడు పేద జనోద్ధరణ భావన కూడా పరవళ్ళు తొక్కసాగింది. ఈ సమస్యను సంపాదన కొంతవరకైనా పరిష్కరిస్తుందన్న ఆశతో ఆయన హజ్ సీజన్ కోసం ఎదురుచూడసాగారు.

ఆ సీజన్ రానేవచ్చింది. ఉకాజ్ ప్రాంతం రకరకాల దుకాణాలతో కళకళలాడసాగింది. దేశం నలుమూలల నుండి వచ్చిన విభిన్న వస్తువులు, సరుకులతో దుకాణాలు కిటకిటలాడిపోయాయి. అమ్మకం, కొనుగోళ్ళు ఊపందుకున్నాయి. వ్యాపారలావాదేవీలతో పాటు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ప్రారంభమయ్యాయి. స్త్రీలు, పురుషులు, పిల్లలతో ఆ ప్రాంతం కోలాహలంగా ఉంది. జాతరకు వచ్చిన జనం సాంస్కృతిక కార్యక్రమాలు చూసిన తరువాత దుకాణాల వైపు మరలుతున్నారు.

వర్తకులు తమ దుకాణాలను బాగా అలంకరించి కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్నారు. కొందరు తమ హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తూ జేబులు నింపుకుంటున్నారు. మరికొందరు అప్పుగా సరుకులమ్మి అసలుతో పాటు వడ్డీ కూడా గుంజుతున్నారు.

అయితే ఒక వర్తకుడు మాత్రం తన దుకాణానికి వస్తున్న కొనుగోలుదారులకు సరుకులోని నాణ్యత, నాసిదనాలను గురించి చెబుతూ వాటి ప్రకారమే ధరలు నిర్ణయించి అమ్ముతున్నాడు. అతని నిజాయితీ చూసిన జనం అతని దుకాణంలోని వస్తువులు ఎగబడి కొనసాగారు. అధిక లాభాల కన్నా కొనుగోలుదారుల క్షేమాన్నే లక్ష్యంగా పెట్టుకున్న ఆ వ్యాపారి అనతికాలంలోనే వాణిజ్యరంగంలో సత్యసంధుడు (సాదిఖ్)గా, నిజాయితీపరుడు (అమీన్)గా ఖ్యాతి గాంచాడు.

అంతేకాకుండా ప్రజల నడ్డివిరిచే వడ్డీ అంటే అతను అసహ్యించుకునేవాడు. వెంటనే డబ్బు చెల్లించలేని పేద కొనుగోలుదారులకు అతను వడ్డీ లేకుండానే సరుకులు అప్పుగా ఇచ్చేవాడు. అసలు చెల్లించలేనివారిని అతను మాఫీకూడా చేసేవాడు. అంచేత ఆ వ్యాపారి ఉకాజ్ మార్కెట్‌లో పేదల పాలిట పెన్నిధి అని కూడా పేరు సంపాదించాడు.

అంచేత అతని వ్యాపారం మూడుపువ్వులు, ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది. కాని ఎక్కువమంది కొనుగోలుదారులతో సరుకు త్వరగా అమ్ముడుపోతున్నా లాభాలు మాత్రం అంతంత మాత్రమే ఉంటున్నాయి. పెట్టుబడి కూడా ఏమంత పెరగడం లేదు. తోటి వర్తకులు లక్షాధికారులై పోతుంటే ఇతను మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉండిపోతున్నాడు.

ఎంత తక్కువ లాభాలతో అమ్మినా కొనుగోలుదారులు అధికమైనప్పుడు ఆ వ్యాపారి ఎప్పుడో ఓరోజు తప్పకుండా లక్షాధికారి అవుతాడు. కాని ఈ వింతవ్యాపారి సంగతే తోటి వర్తకులకు అంతుబట్టడం లేదు. సంపాదించిన డబ్బంతా ఏం చేస్తున్నట్లు? ఈ ఆలోచనతో ఉత్‌బా అనే ఓ బడావర్తకుడు ఆ వింతవ్యాపారిపై ఓ కన్నేసి ఉంచాడు. ఓరోజు రాత్రి అతను వింతవ్యాపారి దుకాణం మూసి వెళ్ళిపోగానే రహస్యంగా అతని వెనకాల నడిచాడు.

వింతవ్యాపారి ధాన్యంమూటల్ని, డబ్బుసంచుల్ని భుజాన వేసుకొని వెళ్ళి ఒక ఇంటి తలుపు తట్టాడు. ఆ ఇంట్లోనుంచి ఓ పండుముసలి బయటికి వచ్చింది వింతవ్యాపారి వణుకుతున్న ఆమె చేతులకు ఒక సంచి అందించి మౌనంగా ముందుకు నడిచాడు. అతను వీధిమలుపు దాటి మరో ఇంటికెళ్ళి తలుపుతట్టాడు. ఆ ఇంట్లోనుంచి అంగవికలుడైన ఒక వృద్ధుడు కుంటుకుంటూ బయటికి వచ్చాడు. అతని కళ్ళు లోపలికి పీక్కుపోయి ఉన్నాయి. పక్కటెముకలు బయటికొచ్చి అస్తిపంజరంలా ఉన్నాడు. వింతవ్యాపారి అతని చేతులకు ధాన్యం మూటనొకదాన్ని అందించి ముందుకు సాగాడు.

రహస్యంగా వెనకాల నడుస్తున్న ఉత్‌బా ఆ వ్యాపారి దానశీలతను, దయార్ద్ర హృదయాన్ని చూసి ఎంతో ఆశ్చర్యపోయాడు. "ఇతను లక్షాధికారి కాకపోవడానికి కారణం ఇదన్నమాట!" అనుకున్నాడు మనసులో.

ఆ వింతవ్యాపారి రెండు వీధులు దాటి ఓచోట దారి పక్కవున్న మైదానంలోకి వెళ్ళాడు. అక్కడ చిరిగిన చొక్కాలతో, చాలీచాలని ఉడుపులతో ఉన్న కొందరు పేద పిల్లలు ఆడుకుంటున్నారు. వారా మనిషిని చూడగానే "అదిగో ఆయన వచ్చేశాడు.... ముహమ్మద్ (సల్లం) బాబాయి వచ్చేశాడు" అన్నారు మహా సంబరపడిపోతూ.

మహనీయ ముహమ్మద్ (సల్లం) దగ్గరకు రాగానే ఆ పిల్లలు పరుగెత్తుకెళ్ళి ఆయన్ని చుట్టేసుకున్నారు. యువ ముహమ్మద్ (సల్లం) వాత్సల్యపూరితంగా చూస్తూ, తన దగ్గర మిగిలివున్న మూటలు, సంచులన్నిటినీ ఆ పిల్లలకు తలా ఒకటి చొప్పున పంచిచ్చారు. పిల్లలు "ముహమ్మద్ బాబాయి, మహమంచి బాబాయి!" అని చెప్పుకుంటూ, సంతోషంతో గెంతుకుంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.....

ఉకాజ్ మండిలో ముహమ్మద్ (సల్లం) దుకాణం ప్రతిరోజూ సాయంత్రం దాకా కొనుగోలుదారులతో సందడే సందడి. అదేమి చిత్రమోగాని, ఆ దుకాణం సమీపం నుండి వెళ్ళే ప్రతి వ్యక్తినీ అది సూదంటురాయిలా ఆకర్షించసాగింది.

అబ్దుల్లా బిన్ అబుల్ హమ్సానీని కూడా ఆ దుకాణం ఆకట్టుకుంది. దుకాణదారుని నిజాయితీ గుణగణాలు గురించి ఇదివరకే వినిఉండటం వల్ల అతను పెద్దగా బేరం చేయకుండానే సంతోషంగా సరుకులు కొన్నాడు. కాని అతను సరుకు అక్కడే ఉంచి "మీరు ఇక్కడే ఉండండి, నేనిప్పుడే కాస్సేపట్లో వచ్చేస్తాను" అంటూ వెళ్ళిపోయాడు.

అయితే అలా వెళ్ళినవాడు చీకటిపడినా రాలేదు. మరునాడు కూడా జాడ లేదు. ఇప్పుడే వస్తానని వెళ్ళిన మనిషి ఎక్కడికి పోయాడో, ఏమయ్యాడోగాని అతని కోసం కళ్ళలో వత్తులువేసుకొని ఎదురుచూస్తూ అక్కడే ఉండిపోయారు ముహమ్మద్ (స).



మూడోరోజు ఆ మనిషి తలవంచుకొని వచ్చాడు. అతడ్ని చూసి ముహమ్మద్ (స) మండిపడ్డారా? లేదు. ఎంతమాత్రం లేదు. పోనీ ముఖం చిట్లించుకున్నారా? ఉహూ... మరి...? మందహాసంతో అతడ్ని స్వాగతించారు.

"ముహమ్మద్! నేను అనుకున్న సమయానికి రాలేకపోయాను. నేనిందుకు ఎంతో విచారిస్తున్నాను. నేనసలు ఈ విషయాన్నే మరచిపోయాను. నన్ను క్షమించు" అన్నాడు అబ్దుల్లా బిన్ అబుల్ హమ్సాని సిగ్గుపడుతూ.

"ముహమ్మద్! నువ్వెంత మంచివాడివి!! జనం చెప్పుకుంటున్నట్లు నువ్వు నిజంగా నిజాయితీపరుడవు, సత్యసంధుడవు. ఇందులో ఏమాత్రం సందేహం లేదు" అన్నాడు అబ్దుల్లా ఆయన చేతిని తన రెండు చేతుల్లోకి తీసుకొని మృదువుగా వత్తుతూ.

ఓరోజు యువ ముహమ్మద్ (సల్లం) ఖబీస్ కొండమీద కూర్చొని కాబా మందిరం వైపు చూడసాగారు. అప్పుడు ప్రజలు కాబా ప్రదక్షిణ చేస్తున్నారు. కొందరు చాలీచాలని బట్టలు ధరించి అర్ధనగ్నంగా ప్రదక్షిణ చేస్తుంటే, మరికొందరు నగ్నంగానే ప్రదక్షిణ చేస్తున్నారు. స్త్రీలలో కూడా కొందరు సిగ్గువిడిచి నగ్నంగా ప్రదక్షిణ చేస్తున్నారు. కొందరు విగ్రహాల ముందు సాష్టాంగపడుతూ మిథ్యాదైవాలను వేడుకుంటున్నారు. పూజారులు భక్తుల నుండి కానుకలు స్వీకరిస్తూ వాళ్ళను ఆశీర్వదిస్తున్నారు.

మహనీయ ముహమ్మద్ (స) వాళ్ళ దురాచారాలు-మూఢనమ్మకాలు చూసి ఎంతో బాధపడిపోయారు. కాస్సేపటికి ఆయన కొండ దిగివచ్చి కాబాప్రదక్షిణ చేయడం ప్రారంభించారు. అంతలో ఒక వృద్ధుడు "ఖురైషీయులారా! ఈనాడు మనలో నేను తప్ప (దైవప్రవక్త) ఇబ్రాహీం (అలైహి) ధర్మాన్ని అంటిపెట్టుకొని ఉన్నవారెవరూ లేరు" అన్నాడు.

యువ ముహమ్మద్ (స) ఈ మాటలు విని ఉలిక్కిపడ్డారు. "నిజమే. ఇబ్రాహీం ధర్మమే మానవాళికి మోక్షం ఇచ్చే ఏకైక సన్మార్గం" అనుకుంటూ ఆయన ఆ వృద్ధుడి దగ్గరికెళ్ళారు. "తాతా! ఇబ్రాహీం ధర్మం గురించి నీకు తెలుసా?" అని అడిగారు.

"ఆ... ఇబ్రాహీం ధర్మం అంటే విగ్రహాలు, మిథ్యాదైవాలను పూజించడం కాదు. సృష్టికర్త, కాబా ప్రభువయిన ఏకేశ్వరుడ్ని ఆరాధించడమే ఇబ్రాహీం ధర్మం. కాని ఈ ధర్మంలో ఆరాధనా విధానం ఏమిటో నాకు బొత్తిగా తెలియదు. కాబా ప్రభువా! నిన్ను ఆరాధించే విధానం ఏమిటో తెలిస్తే బాగుండు. జనం నిజధర్మం ఏమిటో తెలియక విగ్రహాలను పూజిస్తున్నారు" అన్నాడు ఆ వృద్ధుడు విచారం వెలిబుచ్చుతూ.

వృద్ధుని మాటలు విని యువ ముహమ్మద్ (స) లోలోన ఎంతో సంతోషించారు.

"నేను లాత్, ఉజ్జా, హుబల్ వగైరా మిథ్యాదైవాలను వదిలేసి ఒక్క అల్లాహ్‌ను మాత్రమే నా ఆరాధ్యదైవంగా స్వీకరించాను. నువ్వు కూడా ఆ ప్రభువునే ఆరాధిస్తూ ఉండు నాయనా! అల్లాహ్‌ను ఆరాధించేవాడు ఎన్నటికీ నష్టపోడు" అన్నాడు వృద్ధుడు.

ఆ వృద్ధుని పేరు జైద్ బిన్ అమ్ర్. అతనొక్కడే గాకుండా ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) ధర్మంలో స్థిరంగా ఉన్నవారు మరోముగ్గురు కూడా ఉన్నారు. వారు- వరఖా బిన్ నౌఫల్,

ఉస్మాన్ బిన్ హారిస్, ఉబైద్ బిన్ హజష్. వీరు నలుగురు అప్పుడప్పుడు కలుసుకుంటూ ఏకేశ్వరత్వాన్ని గురించి మాట్లాడుకుంటారు. సత్యాన్వేషణలో కొంతకాలానికి వరఖాబిన్ నౌఫల్, ఉస్మాన్ బిన్ హారిస్, ఉబైద్ బిన్ హజష్ క్రైస్తవులుగా మారిపోయారు. జైద్ బిన్ అమ్ర్ మాత్రం ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) ధర్మంలోనే స్థిరంగా ఉండి సత్యాన్వేషణలో తన జీవితం గడుపుతున్నాడు.

## సిరియాపర్యటన, శ్రీమంతురాలితో వివాహం-(20)

మహనీయ ముహమ్మద్ (సల్లం) వ్యాపారంలో నిజాయితీపరుడు (అమీన్)గా పేరుమోసినా, ఆయన తన గుణగణాలతో కొనుగోలుదారులను ఎంత ఆకట్టుకుంటున్నా, ఆర్థిక పరిస్థితి మాత్రం ఎలాంటి ఎదుగూబొదుగూ లేకుండా ఉండిపోయింది. పెదనాన్న అబూతాలిబ్ ప్రేమాభిమానాలు తనపై యదాతథంగా కొనసాగుతున్నాయి.

కాని ఇంటి ఆర్థిక పరిస్థితి క్షీణించసాగింది. మగవాళ్ళంతా పనిచేస్తే గాని అందరికీ కడుపు నిండని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి చూసి అబూతాలిబ్ ఆందోళన చెందారు. ఓరోజు ఆయన ముహమ్మద్ (స)ని పిలిచి ఇంటి దుస్థితి ఏకరవుపెడ్తూ ఇలా అన్నారు:

“నాయనా ముహమ్మద్! మన ఆర్థికస్థితి రోజురోజుకు దిగజారిపోతున్న సంగతి నీకూ తెలుసు. కుటుంబపోషణకు అందరం కృషి చేయకపోతే మనం గడచి గట్టెక్కలేము. ఖదీజా తన వ్యాపారసరుకులు ఇతరులకిచ్చి వర్తకం చేయిస్తున్నదట. నువ్వొప్పుకుంటే ఆమె వ్యాపారంలో నిన్ను కూడా కుదుర్చుతాను. ఏమంటావ్ బాబూ?”

అప్పటికి ముహమ్మద్ (సల్లం)కు ఇరవై నాలుగు వసంతాలు నిండాయి. పెదనాన్న సలహాను వెంటనే అంగీకరిస్తూ “అలాగే కానివ్వు పెదనాన్నా!” అన్నారు ఆయన.

ఆ మరునాడే అబూతాలిబ్ ఖదీజా దగ్గరకు పోయి మాట్లాడారు.

ఖదీజా మక్కా పట్నంలో గొప్ప శ్రీమంతురాలు. బానిసలు, పరిచారికలతో ఆమె ఇల్లు ఎప్పుడూ కళకళలాడుతూ ఉంటుంది. ఆమె వ్యాపారం యమన్, యస్రిబ్, సిరియా, పాలస్తీనా మొదలైన దేశాల దాకా విస్తరించింది. ఆమె వివాహం మొదట అతీఖ్ బిన్ ఆయాజ్‌తో జరిగింది. కాని అతీఖ్ కొన్నాళ్ళకే చనిపోవడం వల్ల ఆమె మళ్ళీ అబూహాలా బిన్ జిరాదాను వివాహమాడారు. అతని ద్వారా ఆమెకు హాలా, హారిస్, హింద్ అనే ముగ్గురు మగపిల్లలు పుట్టారు.

అయితే అబూహాలా కూడా కొంత కాలానికి మరణించాడు. హజ్రత్ ఖదీజా మళ్ళీ విషాదసాగరంలో మునిగిపోయారు. మరికొన్నాళ్ళకు తండ్రి ఖువైలిద్ కూడా చనిపోయాడు. ఇలా కష్టాల మీద కష్టాలు వచ్చిపడటం వల్ల ఆమెకు వైవాహిక జీవితంపై విరక్తి కలిగింది. ఇప్పుడామె వ్యాపారంలో వస్తున్న ఆదాయంలో అత్యధిక భాగం నిరుపేదలు, అనాథలు, వితంతువుల కోసం వెచ్చిస్తూ ప్రజాసేవలో ప్రశాంత జీవితం గడపసాగారు.

ఆమె ముహమ్మద్ మహనీయుని సత్యసంధత, నిజాయతీలను గురించి అప్పుడప్పుడు ప్రజలనోట వింటుండేవారు. అందువల్ల ఆ యువకుడ్ని తన వ్యాపారంలో పెట్టుకుంటే బాగుంటుందని భావించారు. వెతకబోయే తీగ కాళ్ళకే చుట్టుకున్నట్లు ఇప్పుడా అవకాశం కూడా వచ్చింది. అబూతాలిబ్ వచ్చి మాట్లాడగానే ఆమె వివరాల్లోకి పోకుండా ముహమ్మద్ (స)ని తన వ్యాపారంలో పెట్టుకోవడానికి వెంటనే అంగీకరించారు.



ఆ తరువాత కొన్నాళ్ళకు ఒక వాణిజ్య బృందం సిరియా పోవడానికి సిద్ధమయింది. అందులో యువముహమ్మద్ (సల్లం) కూడా ఉన్నారు. ఆయనకు సహాయకారిగా ఖదీజా నమ్మినబంటు మైసరా కూడా ఉన్నాడు.

ఈ వాణిజ్యబృందం సిరియా దేశం పోయి బస్రాపట్టణం సమీపంలో విడిదిచేసింది. అక్కడ యువ ముహమ్మద్ (సల్లం) ఎంతో అనుభవశాలిలా వ్యాపారం చేశారు. కొనుగోలు వర్తకులతో ఎంతో నేర్పుగా, నిజాయితీగా, ఉదాత్తమయిన వైఖరితో, సత్ప్రవర్తనతో వ్యవహరించారు. వ్యాపారంలో తలమునకలై ఉన్నప్పుడు కూడా ఆయన తన సహజ ధోరణి విడనాడలేదు. ఏకాంతసమయం చిక్కినప్పుడల్లా దైవచింతన, అక్కడి ప్రజల్లో వున్న విభిన్న విశ్వాసాలు, ఆచారాలను గురించే ఆలోచించేవారు.

వర్తకబిడారాలు విడిదిచేసిన చోట మోడుబారిన ఓ చెట్టుంది. ఒకరోజు ముహమ్మద్ (సల్లం) ఆ చెట్టు కింద కూర్చున్నారు. ఆ తరువాత కాస్సేపటికే ఆ చెట్టు చకచకా చిగురించి పచ్చని ఆకులతో, రెమ్మలతో అలరారిపోయింది. అప్పుడు మైసరా ఏదో పనిలో నిమగ్నుడయి ఉన్నాడు. దగ్గర్లోనే ఒక క్రైస్తవమఠం కూడా ఉంది. అందులో ఉంటున్న నస్తూర్ అనే సాధువు మైసరాను కలుసుకోవడానికి వచ్చాడు. మైసరా ప్రతి ఏడూ వర్తకానికి వచ్చి ఇక్కడ విడిది చేస్తుండటం వల్ల నస్తూర్ సాధువుతో అతనికి బాగా పరిచయం ఏర్పడింది.

నస్తూర్ కొత్తగా వచ్చిన ముహమ్మద్ (స)ని చూసి “నీ వెంట వచ్చిన ఈ యువకుడెవరు?” అని అడిగాడు మైసరాని.

“ఇతను ఖురైష్ వంశస్థుడు” చెప్పాడు మైసరా.

“ఇతని గుణగణాలేమిటీ? ఎలాంటి వాడు?”

“మంచి గుణవంతుడు. నిజాయితీపరుడు. ఆడినమాట తప్పనివాడు. పవిత్రుడు. సృష్టి విచిత్రాలను పరిశీలిస్తూ, ప్రజల జీవనవ్యవహారాలను గమనిస్తూ ఎప్పుడూ దైవ చింతనలో ఉంటాడు.”

“అతని కళ్ళు ఎలా ఉంటాయి?” నస్తూర్ కుతూహలంతో అడిగాడు.

“నల్లగా, విశాలంగా ఉంటాయి. తెల్లగుడ్డు మీద ఒక సన్నటి ఎర్రచార కూడా ఉంది. కనుబొమలు నల్లగా, సన్నగా ఉంటాయి” వివరించాడు మైసరా.

“అయితే మైసరా! నీవు వర్ణించిన ఈ సుగుణాలు, గుర్తులు కలిగివుండి ఈ చెట్టు కింద ఆగిన వ్యక్తి గొప్ప దైవప్రవక్త కాగలుగుతాడు” అన్నాడు క్రైస్తవ సాధువు.

తర్వాత అతను చెట్టు కింద కూర్చున్న ముహమ్మద్ (స) దగ్గరకు వచ్చి అరబ్బు జాతిలోని ఆచారాలు, విశ్వాసాలను గురించి ప్రశ్నించాడు. దానికాయన అన్ని విషయాలు

చెప్పారు. తర్వాత వాటిని గురించి నీ అభిప్రాయం ఏమిటని అడిగాడు నస్తూర్. ఆయన తన జాతిలో కొనసాగుతున్న దురాచారాలను ఖండిస్తూ తన అయిష్టత వెలిబుచ్చారు.

చివరికి ఆ సాధువు క్రైస్తవ మతాన్ని గురించి అడిగాడు. దానికి ముహమ్మద్ (స) ఎలాంటి సంకోచం లేకుండా ఆ మతంలో ఉన్న మంచి విషయాలతో పాటు చెడు విషయాలను గురించి కూడా వివరంగా తన అభిప్రాయాలు చెప్పారు.

అప్పుడా సాధువు తృప్తిగా ఊపిరి పీలుస్తూ "ఈ యువకుడు భవిష్యత్తులో మహా పురుషుడు, మహాప్రవక్త అవుతాడ" ని మనస్సులో తలపోస్తూ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

కొన్నాళ్ళకు వర్తకబిడారాలు సిరియా దేశం నుంచి మక్కా పట్టణానికి తిరుగు ప్రయాణమయ్యాయి. ఆ ఏడు వ్యాపారంలో ఇది వరకెన్నడూ లేనంత ఎక్కువ లాభాలు వచ్చాయి. దాంతో మైసరా ఎంతో సంతోషించాడు. అతనికి యువ ముహమ్మద్ (సల్లం)పై అమితమయిన గౌరవభావం ఏర్పడింది.

వర్తక బిడారాలు మక్కా సమీపంలోని జహ్రాన్ అనే ప్రదేశానికి చేరుకున్నాయి. మైసరా ఎంతో సంబరపడుతూ "ముహమ్మద్! తొందరగా ఖదీజా దగ్గరికెళ్ళి ఆమెకు వ్యాపార శుభవార్త విన్పించు" అన్నాడు. అప్పుడు ముహమ్మద్ (సల్లం) వర్తక బిడారాలకు ముందుగా ఒంటెపై ఎక్కి బయలుదేరారు.

మధ్యాహ్నం ఎండ పెటపెటలాడుతోంది. సూర్యుడు ఆకాశం మధ్యకు వచ్చి తన వాడి కిరణాలను మరింత తీక్షణం చేశాడు.

హజ్రత్ ఖదీజా చల్లటిగాలి కోసం మేడ మీదికెళ్ళి పచార్లు చేయసాగారు. ఏదో తీయని తెలియని భావాలతో, తను వ్యాపార నిమిత్తం పంపిన యువ ముహమ్మద్ (స) కోసం ఎదురుచూస్తున్నారు. ఆయన గుణగణాలను గురించి ఇంతకుముందే ఎన్నో విషయాలు విని ఉన్నందున ఆమాటలే మరీమరీ గుర్తుకొస్తున్నాయి. అంతలో అకస్మాత్తుగా దూరాన కన్పించిన దృశ్యంతో ఆమె ఆలోచనలకు అంతరాయం కలిగింది.

ఒక వర్తకబిడారం పట్టణంలో ప్రవేశిస్తోంది. ఖదీజా ఎంతో ఆదుర్దాగా అటువైపే కళ్ళప్పగించి చూడసాగారు. అది మరికాస్త దగ్గరగా వచ్చింది. ఖదీజా సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అయ్యారు. తన మనోవీధిలో మెదులుతున్న యువ ముహమ్మద్ (సల్లం) ఒంటె మీద వడివడిగా వస్తున్నారు. ఆమె గబగబా మేడ మీద నుంచి కిందికి దిగారు. అటు ముహమ్మద్ (సల్లం) ఒంటె దిగి నడుచుకుంటూ వస్తున్నారు.

ఆమె పట్టరాని సంతోషంతో ప్రధాన ద్వారం దగ్గరికెళ్ళి ఆయనకు స్వాగతం చెప్పారు. క్షేమంగా తిరిగి వచ్చినందుకు సంతోషం వ్యక్తపరిచారు. ఆ తరువాత లోపలికి తీసికెళ్ళి సాదరంగా కూర్చోబెట్టారు. ఆమె మనసులో ఒక్కసారిగా అనేక ప్రశ్నలు ఉదయించాయి. అవి ఆమె నోట వెలువడక ముందే ముహమ్మద్ (సల్లం) తన ప్రయాణ అనుభూతి, వ్యాపార విషయాలు అన్నీ వివరంగా చెప్పడం ప్రారంభించారు.

బస్రాలో తాను ఏఏ సరుకులు అమ్మిందీ, ఏఏ వస్తువులు కొన్నదీ, ఎంత లాభం వచ్చిందీ మొదలైన విషయాలు పూసగుచ్చినట్లు చెబుతుంటే ఖదీజా ఎంతో ఆసక్తికరంగా,



కుతూహలంతో వినసాగారు. వ్యాపారంలో ఇది వరకెన్నడూ రానంత లాభాలు రావడంతో ఆమె ముహమ్మద్ (సల్లం) పట్ల మరింత ప్రభావితురాలయ్యారు.

ఈలోగా భారీ వస్తుసామగ్రితో మైసరా కూడా వచ్చేశాడు. వచ్చీరాగానే ఖదీజాను కలుసుకొని, వ్యాపారంలో ముహమ్మద్ (సల్లం) ప్రదర్శించిన నైపుణ్యం, తెలివితేటలను గురించి విశేషంగా వర్ణించి చెప్పాడు. అంతేగాకుండా ఆయన్ని గురించి క్రైస్తవ సాధువు నస్తూర్ చెప్పిన శుభవార్త కూడా విన్పించాడు. తిరుగు ప్రయాణంలో దారిలో జరిగిన ఒక విచిత్ర సంఘటన గురించి ఇలా తెలియజేశాడు:

"బస్రా నుంచి బయలుదేరి వస్తుంటే దారిలో మన ఒంటెలు బాగా అలసిపోయి నడవలేని స్థితికి వచ్చాయి. అప్పటికే తోటివర్తకులు చాలా దూరం పోయారు. ప్రయాణం ఇలాగే సాగితే నేను వెనుకబడిపోయి ఒంటరివాణ్ణయి పోతానేమోనని భయమేసింది. కాస్త తొందరగా ముందుకు నడిచి, ముహమ్మద్ (సల్లం) దగ్గరకు చేరుకొని విషయం చెప్పాను. అతను మన ఒంటెల్ని పండబెట్టి ముకుతాళ్ళు లాగి వదలి అదిలించాడు. అంతే, అవి ఒక్కసారిగా లేచి అసలేమీ జరగనట్లు వడివడిగా పరుగెత్తసాగాయి."

"అయితే ఆయనలో చాలా అద్భుత విశేషాలే ఉన్నాయి!" అన్నారామె ఆశ్చర్యపోతూ.

ఆరోజు నుంచి ఖదీజా మనస్సు అప్రయత్నంగా ముహమ్మద్ (స)పై లగ్నమయింది.

అబూహాలా చనిపోయాక ఆమె పునర్వివాహ ప్రసక్తినే అసహ్యించుకునేవారు. ఆమె తన దృష్టినంతటినీ వ్యాపారంపై, ప్రజాసేవపై మాత్రమే కేంద్రీకరించి ప్రశాంతజీవితం గడపసాగారు. అంచేత ఆమె భావావేశాలపై గాంభీర్యతా మంచుపొర దట్టంగా పేరుకున్నది.

కాని ఇప్పుడు తన వ్యాపారంలో ముహమ్మద్ (స) ప్రవేశించడంతో ఈ మంచుపొర క్రమంగా కరిగిపోతూ, దానికింద పడి వాడిపోయిన ప్రేమ కుసుమాలు మెల్లగా వికసించ సాగాయి. ఆమె హృదయంలో ముహమ్మద్ (స) నిలువుచిత్రం రూపుదిద్దుకోసాగింది.

అందువల్ల ఆమె ఇప్పుడు అహర్నిశలూ ఆయన్ని గురించే ఆలోచిస్తూ ఉండసాగారు. ఎవరితో కలిసి ఏది మాట్లాడినా చివరికి ఆమె ముహమ్మద్ (సల్లం) ప్రస్తావనే తెచ్చి ఆయన గుణగణాల్ని ఎంతో కొనియాడేవారు. ఎలాగైనాసరే ఆ యువకుడ్ని తన జీవిత భాగస్వామిగా చేసుకోవాలని ఆమె నిర్ణయానికి వచ్చారు.

ఒకప్పుడు ఖురైష్ వంశంలోని గొప్పగొప్ప శ్రీమంతులే వివాహమాడగోరితే ఆమె నిర్లక్ష్యంగా సమాధానమిచ్చి నిరాకరించారు. మరి ఈ యువకునిలో ఉన్న ఆకర్షణ ఏమిటో గాని ఆమె హృదయం అదుపు తప్పింది.

ఖదీజా తనలో తలెత్తిన భావాలను రహస్యంగా ఉంచలేక పోయారు. ఓరోజు ఆమె తన సన్నిహిత స్త్రీల ముందు ఈ విషయం ప్రస్తావించారు. వారిలో నఫీసా అనే మహిళ ఆమె కోరికను తెలుసుకొని ఇలా అన్నది:

"ఖదీజా! సత్యసంధుడు (అమీన్)గా పేరుపొందిన ఆ యువకుడ్ని వివాహమాడటంలో ఇక అభ్యంతరం ఏమిటీ?"

"అభ్యంతరం ఏమీ లేదనుకో. కాని అందుకు మార్గం కావాలి కదా!" అంటూ ఖదీజా ప్రశ్నార్థకంగా నఫీసా వంక చూశారు.

"ఆ సంగతి నేను చూసుకుంటాగా. నువ్వు నిశ్చింతగా ఉండు" అని చెప్పి నఫీసా అక్కడ్నుంచి బయలుదేరి ముహమ్మద్ (సల్లం) దగ్గరికి పోయింది.

"అమీన్! పెళ్ళి చేసుకోకుండా ఇలా ఎంతకాలం ఉంటావు?" అడిగింది ఆమె.

"చేసుకోవడానికి మీ దృష్టిలో ఎవరైనా ఉన్నారేమిటీ?" అన్నారు ముహమ్మద్ (స) కుతూహలంతో.

నఫీసా విషయం చెప్పింది. ఖదీజాపేరు వినగానే ముహమ్మద్ (స) ఒకింత ఆశ్చర్య పోయారు. అంత గొప్ప ధనికురాలితో తన వివాహం సాధ్యమా అన్నట్లు.

ఖదీజా సౌశీల్యం, సంస్కారం గురించి ఆయన ఇదివరకే వినివున్నారు. విన్నది విన్నట్లు ఆమెలో ఆ లక్షణాలన్నీ ప్రత్యక్షంగా తను చూడటం కూడా జరిగింది. కాని ఆమెతో తన వివాహం కలలో కూడా తలచ లేదే! గొప్పగొప్ప వాళ్ళే ఆమె కోసం ఎంతగానో ప్రయత్నించి విఫలమయ్యారు.

"కాని ఖదీజాతో నాపెళ్ళి ఎలా సాధ్యమవుతుంది?" అన్నారు ఆయన అనుమానిస్తూ.

"ఆ సంగతి నేను చూసుకుంటగా. ఆ బాధ్యత నాకు వదిలెయ్యి" అని చెప్పి నఫీసా వెళ్ళిపోయింది అక్కడ్నుంచి.

ఆ తరువాత యువ ముహమ్మద్ (సల్లం) తన పెదనాన్న అబూతాలిబ్ దగ్గరకు పోయి జరిగిన వృత్తాంతం తెలిపారు.

అబూతాలిబ్ ఈ సంగతి విని ఆశ్చర్యపోయారు. ముహమ్మద్ (సల్లం) ఇంతవరకు అబద్ధమాడినట్లుగాని, పరిహాసంగా మాట్లాడినట్లుగాని తాను వినలేదు. అంచేత ఆయన ఈ సంబంధం కాదనలేక వివాహానికి అంగీకరించారు.

తరువాత ఆయన ఖదీజా పినతండ్రి అమ్ర్ బిన్ అసద్, ఆమె అన్న అమ్ర్ బిన్ ఖువైలిద్ దగ్గరకు పోయి పెళ్ళివిషయం మాట్లాడారు. వాళ్ళిద్దరూ సంతోషంగా ఒప్పు కున్నారు. ముహూర్తం కూడా నిశ్చయమైపోయింది.

పెళ్ళిరోజు బంధువులతో ఖదీజాఇల్లు నిండిపోయింది. ఖురైష్ వంశంలోని గొప్ప వాళ్ళంతా వచ్చారు. అబూతాలిబ్ దైవస్తుతితో పెళ్ళి ప్రసంగం ఇలా ప్రారంభించారు:

"ఈ యువకుడు నా తమ్ముడు అబ్దుల్లా కుమారుడు. ఇతని సత్యసంధత, నిజా యితీలు అందరికీ తెలిసినవే. ఈ విషయంలో ఇతనికి సరితూగేవాళ్ళు యావత్తు ఖురైష్ వంశంలోనే లేరంటే అతిశయోక్తి లేదు. వధుకట్నంగా మేము ఇరవై ఒంటెలు ఇస్తున్నాం. వీరిద్దరి భావిజీవితం కలకాలం సుఖంగా గడుస్తుందని ఆశిస్తున్నాను."

ఈ విధంగా ఖదీజాతో ముహమ్మద్ (సల్లం) వివాహం వైభవంగా జరిగింది. అప్పటికి ముహమ్మద్ (సల్లం) వయస్సు 25 సంవత్సరాలయితే, ఖదీజా వయస్సు 40 సంవత్సరాలు.



ఖదీజా అందం, సిరిసంపదలు గల స్త్రీయే కాదు; ఎంతో విజ్ఞత, వివేచన, దూరదృష్టి, తెలివితేటలు గల మహిళ కూడా. అందుకే ఆమె అందర్నీ కాదని సత్యసంధత, సచ్ఛీలం గల ముహమ్మద్ (సల్లం)ని తన జీవిత భాగస్వామిగా ఎన్నుకున్నారు.

ముహమ్మద్ (స) కూడా ఆస్తిని, అందచందాల్ని కాకుండా ఆమె గుణగణాలు, నీతినడవడికల్ని చూసే వివాహమాడారు. అలాంటి దాంపత్యవనంలో ఎన్ని ఆనంద కుసు మాలు వెల్లివిరుస్తాయో, అవి ఎందరు మానవులకు ప్రయోజనం చేకూర్చుతాయో!

వివాహమైన తర్వాత ముహమ్మద్ (స) ఖదీజా ఇంట్లో ఉండసాగారు. ఆ ఇంట్లోనే ఆయన మేనత్త సఫియా కూడా ఉంటున్నారు. కారణం సఫియాను ఖదీజా అన్నయ్య అవామ్ వివాహమాడి ఉండటమే. ఇలా ముహమ్మద్ (స) జీవితం సవ్యంగా సాగిపోతోంది.

పెళ్ళయిన రెండేళ్ళకు ఆయనకు పండంటి కొడుకు పుట్టాడు. పేరు ఖాసిం అని పెట్టారు. ఆ పేరుతోనే ముహమ్మద్ (స) అబుల్ ఖాసిం అని పిలువబడసాగారు. దినదిన ప్రవర్ధమానమవుతూ ఈ బాలచంద్రుడు ఆ ఇంట్లో ఆనందకిరణాలు ప్రసరింపజేస్తున్నాడు. కాని ఈ ఆనందం ఎంతోకాలం నిలువలేదు. చిన్నారి ఖాసిం పుట్టిన ఆర్నెల్లకే ఇహలోకం నుండి శాశ్వతంగా నిష్క్రమించి ఇంటిల్లిపాదిని శోకసముద్రంలో ముంచాడు.

ఆ తరువాత రెండున్నర సంవత్సరాలకు ఓ పాప పుట్టింది. ఆమెకు జైనబ్ అని పేరు పెట్టారు. జైనబ్ పుట్టుక ముహమ్మద్ (స) దంపతులకు కొంత ఊరట కలిగించింది. ఆ తరువాత రుఖియా, ఉమ్మెకుల్సూమ్ అనే మరో ఇద్దరు బాలికలు జన్మించి వారి ఆనందాన్ని ద్విగుణీకృతం చేశారు.

## కుమారుడిగా మారిన బానిసబాలుడు-(21)

ముప్ఫయి రెండేళ్ళ ముహమ్మద్ (సల్లం) ఆలోచనా సరళి క్రమక్రమంగా ఒక ప్రస్ఫుట రూపు దిద్దుకోసాగింది. సృష్టి రహస్యాలను అర్థం చేసుకోవడానికి, తన చుట్టూ ప్రబలివున్న వికృత ప్రపంచాన్ని తీర్చిదిద్దడానికి నిరంతరం ఆలోచిస్తూనే ఉన్నారు.

మక్కాకు ఆరు మైళ్ళ దూరంలో ఉన్న 'హిరా' కొండగుహను తన తాత్వికచింతనకు అనువైన ప్రదేశంగా ఎన్నుకున్నారు. ఒక్కొక్కసారి రేయింబవళ్ళు అక్కడే దైవధ్యానంలో గడుపుతూ సత్యాన్వేషణలో నిమగ్నులై ఉండేవారు. పట్టణానికి తిరిగిరాగానే కాబా ప్రదక్షిణ చేసి ఆ తర్వాతే ఇంటికి పోయి భార్యాపిల్లల దగ్గర గడిపేవారు.

ఒకరోజు మహనీయ ముహమ్మద్ (సల్లం) తన చిన్నారికూతురు జైనబ్‌తో కబుర్లు చెబుతూ కూర్చొనివుంటే, బయటికి పోయిన తన అర్థాంగి అందమైన ఓ బాలుడ్ని వెంట బెట్టుకొని వచ్చారు.

ముహమ్మద్ (స) బాలుని వంక చూస్తూ "ఎవరీ అబ్బాయి?" అని అడిగారు.

"ఇతను బానిస బాలుడు. నా మేనల్లుడు హకీం సిరియా నుంచి కొంతమంది బానిసలను తెచ్చాడు. నాక్కూడా ఒక బానిసను ఇచ్చాడు" చెప్పారు ఖదీజా.

“కాని ఈ పిల్లవాడి ముఖంలో మంచితనం ఉట్టిపడుతోంది. తెలివితేటల చిహ్నాలు కూడా కన్పిస్తున్నాయి” అన్నారు బాలుని వైపు ప్రేమగా చూస్తూ---

“బాబూ! నీ పేరేమిటీ?” అని అడిగారు ముహమ్మద్ (సల్లం).

“నా పేరు జైద్' చెప్పాడు బాలుడు.

“మీ వంశావళి సంగతి ఏమైనా తెలుసా నీకు?”

“మా నాన్న పేరు హారిసా. మా తాత పేరు షురహబీల్, ముత్తాత పేరు కాబ్. మా అమ్మ పేరు సౌదా. ఆమె సాలబా కుమార్తె” జైద్ తన వంశావళిని గురించి చెప్పాడు.

అప్పుడు ముహమ్మద్ (సల్లం), అర్ధాంగి వైపు తిరిగి “ఇప్పుడీ బానిస బాలుడు నావాడు కాదా?” అని అన్నారు.

“తప్పకుండా. ఇతను మీ బానిసే. ఇతడ్ని మీకే అప్పగిస్తున్నాను” ఖదీజా సంతోషంగా బానిస బాలుడ్ని శ్రీవారికి సమర్పించారు.

మహనీయ ముహమ్మద్ (స) అప్పటికప్పుడు బాలుడ్ని బానిసత్వం నుంచి విముక్తి కలిగించి తన కుమారునిగా చేసుకున్నారు. తరువాత జైద్ తన వద్ద క్షేమంగా ఉన్నాడని అతని తల్లి దండ్రులకు ఒక మనిషి ద్వారా సమాచారం అందజేశారు.

జైద్ తండ్రి, పినతండ్రి ఈ సంగతి విని పిల్లవాడ్ని తీసుకుపోవడానికి మక్కా వచ్చారు.

“మీరెంత ధర అడిగినా ఇవ్వడానికి మేము సిద్ధంగా ఉన్నాం. మా పిల్లవాడ్ని మాత్రం వదిలిపెట్టండి” అంటూ ప్రాధేయపడ్డారు వారిద్దరూ.

“మరో మార్గం చెప్పనా?” అన్నారు ముహమ్మద్ (సల్లం).

“చెప్పండి ఏమిటో అది.”

“ఈ విషయం జైద్ ఇష్టాయిష్టాల మీద వదిలేద్దాం. ఇతను మీ వెంట రావడానికి ఇష్టపడితే నిరభ్యంతరంగా తీసికెళ్ళండి. అందుకు మీరు నాకేమీ ఇవ్వనక్కర్లేదు. ఒకవేళ ఇతను నాదగ్గరే ఉండిపోతానంటే మాత్రం నేనితడ్ని మీ కప్పగించలేను. నన్ను వదలిపెట్టని వాడ్ని వదిలెయ్యడం నా పద్ధతి కాదు” అన్నారు ముహమ్మద్ (సల్లం).

“మహాభాగ్యం. అలాగే కానివ్వండి” అన్నారు వారు సంతోషంగా.

ముహమ్మద్ (సల్లం) అప్పుడు జైద్‌ని దగ్గరకు పిలిచి “చూడు బాబూ! వీళ్ళు మన అతిథులుగా వచ్చారు. మరి వీళ్ళను నీవు గుర్తుపట్టగలవా?” అని అడిగారు.

“వీళ్ళు మా నాన్న, మా బాబాయి” అన్నాడు జైద్ వచ్చినవాళ్ళని చూస్తూ.

“అయితే వీళ్ళిప్పుడు నిన్ను తీసికెళ్ళడానికి వచ్చారు. నీ ఇష్టం. వీళ్ళ వెంట నీవు వెళ్ళిపో దలచుకుంటే వెళ్ళిపోవచ్చు. నాకెలాంటి అభ్యంతరంలేదు. లేదా నా దగ్గరే ఉండిపోవాలనుకుంటే సంతోషంగా ఉండిపోవచ్చు. అంతా నీ ఇష్టాయిష్టాల మీద ఆధారపడి ఉంది” అన్నారు ముహమ్మద్ (సల్లం).



జైద్ వెంటనే ముహమ్మద్ (సల్లం)ని చుట్టేసుకొని “వద్దు వద్దు. మిమ్మల్ని వదలి నేనెక్కడికీ పోలేను. మీ దగ్గరే ఉండిపోతాను” అన్నాడు ఏడుస్తూ.

ఈ మాటలు విని తండ్రికి పట్టరాని కోపం వచ్చింది.

“ఒరే జైద్! అమ్మా, నాన్నా, చుట్టాలు, సొంతూరు అందర్నీ వదిలిపెట్టి ఇక్కడ వెట్టిచాకిరి చేస్తూ బానిసబతుకు బతుకుతావట్రా వెధవా!!” అంటూ గర్జించాడు.

ఇక్కడ నేనేం బానిసగా బతకడంలేదు. మంచిగానే నన్ను చూసుకుంటున్నారు. ఈయనగారి మంచితనం నన్ను కట్టిపడేసింది. నేను మీవెంట రాలేను” అన్నాడు జైద్.

“విన్నారు కదా! ఇక ఈ పిల్లవాడు నావాడు” అన్నారు ముహమ్మద్ (సల్లం).

ఆ తరువాత వెంటనే ఆయన జైద్ చేయి పట్టుకొని కాబా మందిరంలో ఖురైష్ పెద్దల దగ్గరికి వెళ్ళారు. “ఖురైష్ పెద్దలారా! వినండి. ఈరోజు నుంచి ఈ బాలుడు నా కొడుకు. ఇతను నా వారసుడు. నేనితని వారసుడ్ని. దీనికి మీరే సాక్ష్యం” అని ప్రకటించారు ఆయన అందరి సమక్షంలో.

హారిసా ఇది చూసి సంతోషంతో పొంగిపోయాడు. కొడుకుని మక్కాలోనే ముహమ్మద్ మహనీయుని (సల్లం) దగ్గర వదలి వెళ్ళిపోయాడు.

## అందరికీ ఆమోదయోగ్యమైన అమీన్ తీర్పు-(22)

ఒక రోజు నిర్మలంగా ఉన్న ఆకాశం క్రమంగా మేఘావృతమయింది. ఉన్నట్లుండి రివ్వున గాలి వీచింది. ఆ వెనువెంటనే పెళపెళమంటూ పిడుగు పడినంత భీకర గర్జన. ఆ తర్వాత కాస్సేపటికే చల్లటిగాలులతో చిటపట చినుకులు మొదలయ్యాయి. చూస్తుండ గానే అది కాస్తా ఉధృతమై భారీవర్షం కురవసాగింది.

చెవులు చిల్లులు పడే ఉరుములు! కళ్ళు మిరుమిట్లు గొలిపే మెరుపులు!! సూదుల్లా గుచ్చుకునే వర్షపు ధారలు!!!

ఏకధాటిగా వర్షం కురుస్తోంది! ఎడాపెడా జల్లులతో ఎడతెరిపి లేకుండా కురుస్తోంది!! వీధులు కాలువలై ప్రవహిస్తున్నాయి!!!

వర్షం! వర్షం!! వర్షం ఇంకా కురుస్తూనే ఉంది. ఆకాశం ఎక్కడికక్కడ చిల్లులు పడినట్లు కుండపోతగా కురుస్తూనే ఉంది!!!

ఘడియలు, గంటలు దొర్లిపోతున్నాయి. పూటలు, రోజులు కూడా గడచి పోతున్నాయి. కాని వర్షం వెలిసే సూచనలు కానరావడం లేదు. మక్కా ప్రజలు ఎవరి ఇళ్ళలో వారు నిర్బంధంగా ఉండిపోయి నింగికేసి వింతగా చూడసాగారు.

ఈ ముసురులో సూర్యుడు ఎప్పుడు ఉదయిస్తున్నాడో, ఎప్పుడు అస్తమిస్తున్నాడో తెలియడంలేదు. వర్షం! వర్షం!! ఒకటే వర్షం!!! కష్టజీవులకు కష్టపడకుండానే కష్టం అనుభవించే పరిస్థితి ఏర్పడింది.

ఎడ తెరిపి లేకుండా భోరున వర్షం కురుస్తూనే ఉంది. ఒంటెలు, మేకలు అల్లాడి పోతున్నాయి. వర్షపు నీటికి గుంటలు, గోతులు నిండి పొర్లుతున్నాయి. వీధుల్లో వరద నీళ్ళు పరవళ్ళు తొక్కుతున్నాయి. నానిన గోడలు నేలబారుగా పడిపోతున్నాయి. కారుతున్న ఇండ్ల కప్పులు కుప్పకూలి పోతున్నాయి. ప్రజలు భయాందోళనలతో తమ ఇష్ట దేవతలను వేడుకుంటున్నారు. అయినా వర్షం తగ్గలేదు.

సరికదా, ప్రకృతి మరింత ప్రకోపించింది. గుండెలు పగిలిపోయే ఉరుములతో వర్షం వీరప్రతాపం ప్రదర్శిస్తోంది.

అలా ఎలా ఎన్ని రోజులు గడిచాయో కాని, వర్షం వెలిసేటప్పటికి మక్కా పట్టణం ఓ పెద్ద చెరువులో తేలుతున్నట్లు కన్పించింది. రెండు మూడు రోజుల తరువాత వరదనీరు క్రమంగా తగ్గిపోయింది. ప్రజలు బయటికి వచ్చి చూస్తే పడిపోయిన ఇళ్ళతో, గోతులు పడ్డ వీధులతో పట్టణం బీభత్సంగా తయారయి ఉంది.

ఈ వరద తాకిడికి కాబామందిరం కూడా గురయింది. దాని గోడలు బీటలు వారాయి. కొన్ని గోడలు పూర్తిగా పడిపోయాయి. 'హజ్రె అస్వద్ (నల్లరాయి)' కూడా గోడలో నుంచి జారి కింద పడిపోయింది. కాబా దుస్థితి చూసి మక్కావాసులు తల్లడిల్లి పోయారు. కాబా వారి సర్వస్వం. వారికి ముఖ్యమైన ఆరాధనాలయం.

కాబాదర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి కూడా ప్రజలు వస్తుంటారు. దానివల్ల మక్కావాసులకు వ్యాపారాభివృద్ధి కలుగుతుంది. అదీగాక కాబా వల్ల యావత్తు అరేబియాలో వారికి అమితమయిన గౌరవ ప్రతిష్ఠలు కూడా లభిస్తుంటాయి. అందుకే వారు కాబా మందిరం వరద తాకిడికి శిథిలమైపోవడం చూసి ఎంతో ఆందోళన చెందారు.

ఓరోజు పట్టణ ప్రముఖులంతా సమావేశమయి పరిస్థితి సమీక్షించారు. చివరికి దైవగృహాన్ని పునర్నిర్మించాలని అందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు.

అయితే పునర్నిర్మాణానికి ముందు పాత కట్టడాన్ని పడగొట్టాలి. అమ్మో! దైవగృహాన్ని పడగొట్టడమే!! అంతా కంపించిపోయారు. గునపం తగిలితే ఏ పాపం చుట్టుకుంటుందో నని అందరూ భయపడిపోయారు. పైగా గతంలో ఓసారి అబ్రహా రాజు కాబాను నేలమట్టం చేయడానికి వస్తే దైవశిక్ష విరుచుకుపడి సర్వనాశనమయ్యాడు. అంచేత దైవగృహాన్ని కూలగొడ్తే ఏ ఆపద వచ్చి పడుతుందోనని అందరూ భయపడసాగారు.

కాని కాబాగోడలు పూర్తిగా బీటలు వారాయి. ఏ క్షణంలోనైనా అది సమూలంగా కూలిపోవచ్చు. అందుకని ఎలాగైనా దాన్ని పడగొట్టి పునర్నిర్మించాలనే నిర్ణయానికి వచ్చారు. కొత్త పునాదులతో సరికొత్త కట్టడం నిర్మించాలి. మరి అనుభవశాలురైన మేస్త్రీలు, నిర్మాణ నిపుణులు కావద్దూ? కప్పు వేయాలంటే సామగ్రి కూడా కావాలాయె. ఎలా?

విధివశాత్తు ఆ రోజుల్లోనే నిర్మాణ సామగ్రి మోసుకెళ్తున్న ఓడ ఒకటి ఈజిప్టు నుండి అబిసీనియాకు బయలుదేరింది. అది జిద్దా వద్ద రేవుకు ఢీకొని బాగా దెబ్బతిన్నది. ఓడలోని వ్యాపార సామానంతా రేవుకు చేర్చి మరో ఓడ వస్తే తిరిగి ప్రయాణమవుదామని భావించి ఎదురు చూస్తున్నాడు యజమాని.



మక్కావారికి ఈ సమాచారం అందింది. వెంటనే వారు జిద్దా పోయి కాబా నిర్మాణం గురించి అతనికి తెలిపారు. అదృష్టవశాత్తు ఓడ యజమాని భవననిర్మాణ నైపుణ్యం కూడా కలిగివున్నవాడు. కాబానిర్మాణం అనగానే అతను సంతోషంతో సామగ్రిని అమ్మడమే గాక, స్వయంగా తాను నిర్మాణకార్యంలో సహకరించడానికి కూడా సమ్మతించాడు.

ఇక కాబాగోడలు పడగొట్టే సమయం వచ్చింది. ఈ ఆలోచనతో అందరూ మరోసారి భయపడ్డారు. తీవ్రసందిగ్ధంలో పడిపోయారు. తమ సంకల్పం కట్టడాన్ని పునర్నిర్మించాల న్నదే గాని, నాశనం చేయాలన్నది కాదు. ఈ ఆలోచన వారికి కొంత ధైర్యాన్నిచ్చింది.

అందువల్ల పాత కట్టడం పడగొట్టడానికి ముందుగా వారు పూజలు చేశారు. కానుకలు సమర్పించుకున్నారు. జంతుబలులు చేశారు. ఆ తరువాత వలీద్ అనే ఒకతను ముందుకు వచ్చాడు. వణుకుతున్న చేతులతో గడ్డపార తీసుకున్నాడు. గుండె దిటవు చేసుకొని, నరాలు బిగబట్టి గడ్డపారతో ఒక స్తంభాన్ని పడగొట్టాడు.

ఇక చూడండి. అతనిపై ఏ ఆపద విరుచుకు పడుతుందోనని జనం భయపడుతూ ఊపిరి బిగబట్టి ఎదురుచూడసాగారు. అంతా నిశ్శబ్దం. కొన్ని క్షణాలు గడచిపోయాయి. ఊహు, ఏమీ కాలేదు.

ఆ రాత్రి గడిచింది. ఉదయభానుడు యథాప్రకారం మక్కా గగనతలంపైకి వచ్చాడు. కాని వలీద్ నిక్షేపంగానే ఉన్నాడు. దాంతో ప్రజల మనస్సులు కుదుటపడ్డాయి. ఇక అందరూ కలసి కాబా గోడలు పడగొట్టడం ప్రారంభించారు.

పాత గోడలు పడగొట్టడం పూర్తయ్యాక పునాదుల త్రవ్వకం మొదలయింది. పని చకచకా సాగిపోతోంది. పునర్నిర్మాణ పనిలో ముహమ్మద్ (స), అబూతాలిబ్‌లు కూడా పాల్గొన్నారు. ప్రజలు దగ్గర్లో వున్న గుట్టల నుండి రాళ్ళు మోసుకొచ్చారు. చూస్తూ ఉండగానే కాబా గోడలు నిటారుగా లేచి నిల్చున్నాయి.

ఆ తర్వాత కాబాగోడల్లో తూర్పువైపున 'నల్లరాయి'ని అమర్చే సమయం వచ్చింది. ఈ రాయికి అరబ్బులు ఎంతో ప్రాముఖ్యం ఇస్తారు. హజ్ ఆచారాల సందర్భంలో దీన్ని వారు ముద్దాడుతారు. కాబా ప్రదక్షిణం ఈ రాయి దగ్గర్నుంచే ప్రారంభమవుతుంది.

అందువల్ల ఈ రాయిని ఎవరు గోడలో అమర్చాలి; ఈఘనత ఎవరికి దక్కాలి అనే సమస్య వచ్చిపడింది. ప్రతిఒక్కరూ తనకే దాని పుణ్యం లభించాలని ఆశిస్తున్నారు. ప్రతి తెగా ఈ పుణ్యకార్యం చేసే హక్కు తనకే ఉందని భావిస్తోంది.

దీనిపై పెద్ద వివాదం చెలరేగింది. అది చిలికి చిలికి గాలివానలా తయారయింది.

ఎట్టి పరిస్థితిలోనూ ఆ అదృష్టాన్ని తానే దక్కించుకోవాలని ప్రతి వర్గం పట్టుబట్టింది. వాగ్వివాదాలు జరిగాయి. అదిలింపులు, బెదిరింపులు అయ్యాయి. పరిస్థితి అంతకంతకూ విషమిస్తూ పోయింది. ఏ ఒక్కరూ వెనక్కి తగ్గే సూచనలు కన్పించడం లేదు.

అయిదు రోజులు గడచిపోయినా సమస్య ఓ కొలిక్కి రాలేదు. దానిపై పెద్ద రభస జరిగింది. చివరికి కొందరు చెయ్యడమో, చావడమో తేల్చుకోవడానికి సిద్ధమయ్యారు.

ప్రత్యర్థులు కూడా అందుకు నడుం బిగించారు. పరస్పరం సవాళ్ళు విసురుకున్నారు. పళ్ళు నూరారు. పిడికిళ్ళు బిగించారు. బుసలు కొట్టారు. కత్తులు దూశారు. అంతలో.....

"నాయనలారా! ఆగండి. గౌరవమర్యాదలు, నాయకత్వాలలో మీరందరూ సమానులే. అనవసరంగా ఆవేశపడి కొట్లాడుకోకండి. కాస్త నామాట వినండి" అన్నాడు అబూఉమయ్య అనే ఓ వృద్ధుడు.

అబూఉమయ్యాని అన్ని తెగలవారూ ఎంతో గౌరవిస్తారు. అతని మాటను సాధారణంగా ఏ ఒక్కరూ తీసిపారేయరు. అందువల్ల అందరూ 'సరే వింటాం చెప్పు' అంటూ అతని దగ్గరకు వచ్చారు.

"ఈ సమస్యకు ఒక్కటే పరిష్కారం. సఫా ద్వారం నుంచి మొట్టమొదట ఎవరైతే లోనికి ప్రవేశిస్తారో అతడ్ని మధ్యవర్తిగా స్వీకరించాలి. అతను ఎలా చెబితే అలా నడచుకోవాలి" అన్నాడు అబూఉమయ్య.

ఈ సలహా అందరికీ నచ్చింది. సరేనంటూ ఆ వ్యక్తి కోసం వారు తీవ్రంగా ఎదురు చూడసాగారు. కాబా మందిరం చుట్టూ ఉన్న నాలుగు ప్రహరీ గోడలకు నాలుగు ముఖద్వారాలు ఉన్నాయి. అందులో సఫా ద్వారం పట్నం వైపు గాకుండా దానికి అభిముఖంగా కొండల వైపు ఉంది. అందువల్ల అందరి దృష్టి సఫా ద్వారం వైపు కేంద్రీకృతమయింది.

కొంతసేపయ్యాక ఆ ద్వారం గుండా ఓ అందమైన యువకుడు లోనికి ప్రవేశించాడు. అతడ్ని చూడగానే అందరూ సంతోషంతో ఒక్కసారిగా ఎలుగెత్తి అరిచారు:

"అమీన్! అమీన్!! ముహమ్మద్ అమీన్ చెప్పే తీర్పు మాకందరికీ సమ్మతమే."

సత్యసంధుడైన ముహమ్మద్ (స) పట్ల జనానికి ఎంత నమ్మకం! ఆయన లోపలికి వచ్చి విషయం ఏమిటో తెలియక ప్రజల వైపు ప్రశ్నార్థకంగా చూడసాగారు.

ఖురైష్ నాయకులు సమస్యను ఆయన ముందు ప్రస్తావించారు. మహనీయ ముహమ్మద్ (స) అంతా విని ఒక దుప్పటి తెప్పించారు. దాన్ని నేల మీద పరచి మధ్యలో 'హజ్రెఅస్వద్' (నల్లరాయి)ని ఎత్తిపెట్టారు. దుప్పటి అంచుల్ని అన్ని వర్గాల నాయకులు పట్టుకొని ఆ శిల పెట్టవలసిన చోటికి ఎత్తి పట్టుకు రమ్మని చెప్పారు. అలా అందరూ కలసి తీసుకొచ్చిన తర్వాత ముహమ్మద్ (స) తన స్వహస్తాలతో ఆ రాయిని ఎత్తి దాని స్థానంలో అమర్చారు.

ఈ న్యాయనిర్ణయం, సమయస్ఫూర్తి చూసి అందరూ ఎంతో అబ్బురపడ్డారు. ఆయన్ని ఎంతగానో ప్రశంసించారు. గంట క్రితం ఘోర రక్తపాతానికి దారి తీస్తుందనుకున్న సమస్య ఇలా ప్రశాంతంగా పరిష్కారమయింది. అమీన్ చూపిన ఉపాయం వల్ల అంతః కలహం ఆరంభంలోనే అంతరించినందుకు అందరూ ఎంతో ఆనందించారు.

ఆ తరువాత కాబా పునర్నిర్మాణం కొద్ది రోజుల్లోనే ముగిసింది. అప్పటికి అమీన్ జీవితంలో ముప్ఫయి అయిదు వసంతాలు గడచిపోయాయి.



# కరువుకాలంలో కుటుంబం-(23)

కాలం గప్‌చిప్‌గా సాగిపోతోంది. మహనీయ ముహమ్మద్ (స) ముప్ఫయి ఏడవ ఏట అడుగుపెట్టారు. వేసవి తాపంతో జనం సతమతమవుతున్నారు. పచ్చనిచెట్లు మలమల మాడిపోతున్నాయి. కుంటలు, చెరువులు ఎండిపోతున్నాయి. దైనందిన వ్యాపార లావాదేవీలు కుంటుపడి పోతున్నాయి. కరువురక్కసి కరాళనృత్యం చేస్తోంది.

గంపెడు పిల్లలతో ముందే సంసారం ఈదలేక సతమతమవుతున్న అబూతాలిబ్‌ని ఈ కరువు మరింత క్రుంగదీసింది. ముహమ్మద్ (స) తన పెదనాన్న పడుతున్న కష్టాలు చూసి తల్లడిల్లిపోయారు. ఆయన ఓరోజు పినతండ్రి అబ్బాస్‌ని కలుసుకొని ఇలా అన్నారు:

"బాబాయ్! అబూతాలిబ్ పెదనాన్న సంసారం రోజురోజుకు చితికిపోతోంది. మనం చూస్తూ ఎలా ఉండగలం? మనిద్దరం ఆయన సంతానంలో ఇద్దరు పిల్లల్ని మన సంరక్షణలోకి తీసుకుంటే బాగుంటుంది. దానివల్ల ఆయనకు కొంతైనా భారం తగ్గిపోతుంది."

"సరే, అలాగే తీసుకుందాం. ఇలాంటి పరిస్థితిలో మనం గాకపోతే మరెవరు ఆయన్ని ఆదుకుంటారు? తప్పకుండా తీసుకుందాం" అన్నాడు అబ్బాస్.

ఆ తర్వాత వారిద్దరూ అబూతాలిబ్ దగ్గరకు పోయి ఈ విషయం ఆయనకు చెప్పారు. అబూతాలిబ్ సంతోషంతో "మీరు కోరుకున్న వాళ్ళను తీసికెళ్ళండి" అన్నారు. అప్పుడు అబ్బాస్, జాఫర్‌ని తన సంరక్షణలోకి తీసుకున్నాడు. ముహమ్మద్ మహనీయుని (సల్లం) సంరక్షణలోకి అయిదేళ్ళ అలి వచ్చాడు.

ఇప్పుడు ముహమ్మద్ (స) దంపతులు అలి, జైద్‌లకు కూడా తల్లిదండ్రులయిపోయారు. ముహమ్మద్ (స) జీవితంలో మరో రెండేళ్ళు గడచిపోయాయి. ఆ కాలంలో అబ్దుల్లా అనే ఓ బాబు పుట్టాడు. కాని కొన్నాళ్ళకే ఆ బాబు కూడా చనిపోయాడు. ఆ పిల్లవాడికి తయ్యిబ్, తాహిర్ అనే పేర్లు కూడా ఉన్నాయి. ఆ తర్వాత కొన్నాళ్ళకు ఓ పాప పుట్టి, తల్లిదండ్రులకు అబ్దుల్లా మిగిల్చిపోయిన దుఃఖాన్ని దూరంచేసింది. ఆ పాపకు ఫాతిమా అని పేరుపెట్టారు. ఫాతిమా అంటే ముహమ్మద్ (స)కు ఎనలేని ప్రేమ.

రోజులు, నెలలు గడచిపోతున్నాయి. ముహమ్మద్ (స) నలభయ్యో పడిలో పడ్డారు. ఆయన ఎప్పటిలాగే అనాథలకు ఆశ్రయమిస్తూ, తోటి మనుషుల కష్టాలలో పాలుపంచుకుంటూ, లోకకల్యాణం, మానవమోక్షాల కోసం అహోరాత్రులు ఆలోచిస్తూ పవిత్ర జీవితం గడుపుతున్నారు. సత్యాన్వేషణలో ఆయన తరచుగా హిరాకొండ గుహకెళ్ళి దైవధ్యానంలో నిమగ్నులయ్యేవారు. అప్పుడప్పుడు భార్యాపిల్లలు వచ్చి ఆయన్ను చూసి పోయేవారు. వారు ఆయన కోసం అన్నం, నీళ్ళు తెచ్చిపెట్టి వెళ్ళిపోయేవారు.

హజ్రత్ ఖదీజా ఇల్లు నలుగురు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు అలి, జైద్‌లతో పాటు బానిసలు, దాసీలతో కళకళలాడుతోంది. అప్పుడప్పుడు బంధువులు వచ్చి పోతుంటారు. ఓరోజు ఖదీజా చెల్లెలు హాలా వచ్చి పిల్లలకు పెళ్ళిళ్ళు చేసే విషయమయి ప్రస్తావించింది. అరబ్ సంప్రదాయం ప్రకారం ఆడపిల్లలకు లేతవయస్సులోనే పెళ్ళిళ్ళు

చేస్తారు. దాని ప్రకారం జైనబ్ తొమ్మిదేళ్ళ పిల్లే అయినప్పటికీ ఆమెను తన కొడుక్కు ఇచ్చి పెళ్ళి చేయమని హాలా అడిగింది. ఖదీజా శ్రీవారిని సంప్రదించి జైనబ్‌ని హాలా కొడుకు అబుల్ ఆస్ బిన్ ఉమయ్యాకు ఇవ్వడానికి సిద్ధమయ్యారు.

ఈవిధంగా జైనబ్, అబుల్ఆస్‌ల వివాహం జరిగింది. వలీమా విందులో రుఖియా, ఉమ్మెకుల్సూమ్‌ల ప్రస్తావన కూడా వచ్చింది. ముహమ్మద్ (సల్లం) పెదనాన్న అబూలహబ్ ఆ ఇద్దరు బాలికల్ని తన కొడుకులు ఉత్బా, ఉతైబాలకు ఇవ్వమని అడిగాడు. ఇలా జైనబ్ పెళ్ళయిన కొన్నాళ్ళకే ఏడెనిమిదేండ్ల ఉమ్మెకుల్సూమ్, రుఖియాల పెళ్ళిళ్ళు జరిగి పోయాయి. ఇప్పుడు ఖదీజాఇంట్లో చిన్నారి ఫాతిమా మాత్రమే ఆమె సంతానంగా మిగిలి వుంది. ఆ పాపతో పాటు పదేళ్ళ అలి, నవయువకుడైన జైద్ కూడా ఉన్నారు.

మహనీయ ముహమ్మద్ (సల్లం) ఏ సత్యం కోసం ఏండ్ల తరబడి నిరీక్షిస్తున్నారో ఆ సత్యం సమీపించింది. నలభై సంవత్సరాలు నిండిన ఆయన జీవితంలో అదొక మైలురాయి. చీకటి మబ్బులు మెల్లమెల్లగా విడిపోతున్నాయి.

అందమైన ఈ ప్రపంచం మూన్నాళ్ళ ముచ్చటని, ఇక్కడి భోగభాగ్యాలు క్షణభంగురా లని ఆయన అప్పుడప్పుడు కంటున్న కలలు సూచిస్తున్నాయి. సకల చరాచరాలను, యావత్తు ప్రాణికోటిని సృష్టించిన అసామాన్య శక్తిస్వరూపుడు మాత్రమే మానవులకు ఆరాధ్యదైవమని ఆయన అంతరంగంలో అనుక్షణం మెదులుతున్న ఆలోచనలు నిజరూపం ధరించే సమయం ఆసన్నమయింది.

## మిథ్యాదైవాలకు దుశ్శకునం-(24)

అటు పట్నంలో ఆబాలగోపాలం పండుగ సంబరాలతో పరవశమయిపోతోంది. ప్రజలు మేళతాళాలతో, పండ్లుఫలహారాలతో కాబాలయానికి వెళ్తున్నారు. అప్పటికే భక్తజనంతో  కాబామందిరం నిండిపోయింది. పూజారులు భక్తుల నుండి కానుకలు స్వీకరించి దేవతలకు నైవేద్యం పెడ్తున్నారు. కొందరు తమతమ ఇష్టదేవతల ముందు సాష్టాంగపడి పోయారు. మరికొందరు వీరభక్తులు భక్తిపారవశ్యంతో ఊగిపోతున్నారు.

బారెడు పైకొచ్చిన సూర్యుడు ఆరోజు ఎందుకో ఢీలా పడినట్లు కన్పిస్తున్నాడు. వాడి, వేడి క్రమంగా తగ్గిపోతోంది. క్షణక్షణానికి కాంతి మందగిస్తోంది. అంతలో రివ్వున గాలులు వీచడం మొదలైంది. అనుకోని ఈ పరిణామానికి భక్తులు బిత్తరపోయి ఆకాశంకేసి చూశారు. ఆకాశం క్రమేణా ఎర్రబారసాగింది. చూస్తుండగానే అది మరింత ఎర్రగా రక్తంలా మారిపోయింది. దాంతో జనం అదిరిపోయారు. మరికాస్సేపటికి ఆకాశం ఎరుపురంగు నుంచి నలుపురంగులోకి మారిపోవడం జరిగింది. దాంతోపాటు నలుదిక్కుల నుంచి చీకట్లు కమ్ముకోసాగాయి. సూర్యుడు పూర్తిగా కనుమరుగై పోయాడు. కొన్ని క్షణాల్లోనే ఆకాశం దట్టమైన పొగచూరినట్లు నల్లగా మారిపోయింది.

వాతావరణం అంతకంతకూ భయానకంగా తయారవుతోంది. ఈ దృశ్యం చూసి ప్రజలు తీవ్రంగా భయపడిపోయారు. పూజారులు కూడా పరిస్థితి అర్థంగాక మంత్రోచ్చారణ



చేస్తూ దేవతల్ని శాంతింపజేయడానికి ప్రయత్నించసాగారు. కాని వాతావరణం మారకపోగా మరింత ఉగ్రరూపం దాల్చింది. ఈ ఆపద నుంచి గట్టెక్కించమని దేవతలను దీనంగా విలపిస్తూ వేడుకోవాలని పూజారులు భక్తులను ఆదేశించారు. దాంతో భక్తులు కన్నీరు మున్నీరుగా రోదిస్తూ దేవతలను మొరపెట్టుకోవడం మొదలుపెట్టారు. మరికొందరు గుండెలు బాదుకుంటూ హృదయవిదారకంగా విలపించసాగారు. కాని తుఫాను గాలి ఏమాత్రం దగ్గలేదు. సరికదా మరింత ఉధృతమయింది.

ప్రజల్లో తీవ్రమయిన భీతావహం నెలకొన్నది. అరుపులు కేకలతో కాబా గృహం ప్రతిధ్వనిస్తోంది. ఉధృతమైన గాలి వేగానికి నేలమీద పాదాలు నిలపడం కష్టమయి పోయింది. కొందరు గాలివాటుకు ఎగిరి కింద పడిపోతున్నారు. ఆలయంలోని స్తంభాలు, దూలాలు సైతం ఊగిపోతున్నాయి. నలువైపులా కారుచీకట్లు అలుముకున్నాయి. ఎవరెక్కడున్నారో కళ్ళు చించుకున్నా కానరావడం లేదు. గాలిహోరులో ఎవరేం మాట్లాడు తున్నారో కూడా సరిగా విన్పించడం లేదు.

తుఫాను ఘడియ ఘడియకు ఉధృతమవుతూ ఇళ్ళను, గుళ్ళను ఊపేస్తోంది. ఇసుక దుమారం సుడులు తిరుగుతూ జనం మీద వచ్చి పడుతోంది. గర్భగుడిపై నుంచి కొందరు కిందపడిపోయి గావుకేకలు పెడ్తున్నారు. పట్టణమంతా గాఢాంధకారం అలుము కుంది. స్త్రీలు, పిల్లలు ఏడ్పులు, పెడబొబ్బలు పెడ్తున్నారు. చాలామంది తమతమ ఇష్టదేవతల ముందు సాగిలబడి దీనాతిదీనంగా విలపిస్తూ మొరపెట్టుకుంటున్నారు. కాని ఆ దేవతలు వారి మొరలు ఆలకించే సూచనలు కన్పించడం లేదు. జనం భయాందోళనలతో వణికిపోతూ ప్రళయం వచ్చిపడిందని చెప్పుకోసాగారు.

ఈ ఆలోచన రాగానే జనం ప్రాణాలు అరచేత పట్టుకొని అటూఇటూ పరుగెత్త సాగారు. కొందరు దడదడలాడుతున్న గుండెలతో విగ్రహాలను చుట్టుకొని విలపిస్తున్నారు. మరికొందరు దిక్కుతోచని స్థితిలో పడి హృదయవిదారకంగా పెడబొబ్బలు పెడ్తున్నారు.

చివరికి ప్రజల దీనావస్థ పట్ల విశ్వప్రభువుకు దయ కలిగింది కాబోలు, కాస్సేపటికి తుఫాను ఉధృతం తగ్గుముఖం పట్టింది. చీకటి తెరలు మెల్లమెల్లగా విడిపోసాగాయి. మరి కాస్సేపటికి ప్రకృతి పూర్తిగా శాంతించింది. ఆకాశంలో కారుమేఘాలు తొలగిపో నారంభించాయి. సూర్యుడు మబ్బుల చాటు నుండి బయటపడి మళ్ళీ ప్రకాశించడం ప్రారంభించాడు. అది చూసి జనం చల్లగా ఊపిరి పీల్చుకున్నారు.

అయితే వాతావరణం ఇంకా మసక మసగ్గానే ఉంది. జనం తుఫాను దెబ్బ నుండి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నారు. అంతలో పడమటి దిక్కున తళుక్కుమని ఓ మెరుపు మెరిసింది. ఆ మెరుపు చూసి ప్రజలు నిర్ఘాంతపోయారు. ఇదివరకెప్పుడూ వారు అలాంటి మెరుపు చూడలేదు. అందుకే వారు మరోసారి ఆశ్చర్యంతో పాటు ఆందోళన వెలిబుచ్చారు.

ఆ ఆశ్చర్యం నుంచి భక్తులు తేరుకోకముందే బిగ్గరగా ఓ కంఠస్వరం విన్పించింది:

"అరబ్బులారా! ఇప్పుడు మీరొక మెరుపుని చూశారు కదా? రండి, ఆ మెరుపుకు కారణం ఏమిటో చెప్తాను" అన్నాడొక డెబ్బయి అయిదేళ్ళ వృద్ధుడు.

ఈ మాటలు వినగానే జనం అతని దగ్గరకు చేరుకున్నారు. అబూతాలిబ్, అతని సోదరులు, కొడుకులు కూడా అక్కడికి వచ్చి నిల్చున్నారు.

ఆ వృద్ధుని రూపురేఖలు విచిత్రంగా ఉన్నాయి. పొడవయిన ముఖంతో బుగ్గలు సొట్టబోయి, దవడలు పైకి ఉబికి వున్నాయి. లోపలికి పీక్కుపోయివున్న నిప్పుకణాల్లాంటి ఎర్రటి చిన్నకళ్ళు. తైల సంస్కారంలేని, ముగ్గుబుట్టలాంటి అతని తల వెంట్రుకలు ఉంగరాలు చుట్టుకొని ఎదురొమ్ముపై చిందరవందరగా పడివున్నాయి. జనపనారలాంటి తెల్లగడ్డం నాభివరకు పొడుగ్గా ఉంది. శుష్కించిపోయిన నల్లటి పెదాలు గడ్డం, మీసాల మధ్య నుంచి బలవంతంగా తొంగిచూస్తున్నాయి. మెడలో పొడవైన ఎముకల దండతో పాటు, ఎడమచేతిలో మానవకపాలం, కుడిచేతిలో చేతిఎముక కూడా ఉన్నాయి. అతని పేరు అబ్రష్. అతను యావత్ అరేబియాలో పేరుమోసిన గొప్ప మాంత్రికుడు.

"అందరూ నిశ్శబ్దంగా ఉండి నేను చెప్పే మాటలు జాగ్రత్తగా వినండి" అన్నాడతను.

ప్రజలు గుసగుసలు మానేసి నిశ్శబ్దంగా ఉండి, మాంత్రికుడు చెప్పే మాటలు వినడానికి ఊపిరి బిగబట్టి ఎదురుచూడసాగారు.

"చూడండి. నా ఎడమచేతిలో మనిషి పుర్రె ఉంది. కుడిచేతిలో మణికట్టు ఎముక ఉంది. నాకీ రెండూ బనూబకర్, బనూసాల్ తెగల మధ్య నలభై ఏళ్ళపాటు నిరంతరాయంగా భీకరయుద్ధం జరిగిన ప్రదేశంలో దొరికాయి. లోకం దీన్ని అజ్ఞానంవల్ల జరిగిన యుద్ధమని భావించవచ్చు. కాని ఈ యుద్ధం అజ్ఞానం, అనాగరికతల పర్యవసానం కాదని; ఆత్మాభిమానం, గౌరవప్రతిష్ఠల కోసం జరిగిన పోరాటమని అరబ్బులకు బాగా తెలుసు. ఆత్మాభిమానం మంటకలసి పోవడాన్ని ఏ అరబ్బయినా సహించగలడా? నా దృష్టిలో మాత్రం ఆత్మాభిమానం లేనివాడు అసలు మనిషే కాదు.

"కనుక అరబ్బులారా! వినండి. ఈ పుర్రె నాకు భవిష్యత్తులో జరిగే విషయాలు తెలియజేసింది. అతి త్వరలో ప్రపంచంలో ఓ గొప్ప విప్లవం రాబోతున్నది. చిల్లర దేవుళ్ళంతా చిత్తయిపోతారు. ఘోరమైన అపచారం జరగబోతోంది. అలాంటి పరిస్థితిలో మీ కర్తవ్యం ఏమిటి? మీరు మీ దేవుళ్ళకు ఏదైనా అపచారం జరిగితే సహించగలరా?" అన్నాడు అబ్రష్ ప్రజల పౌరుషాన్ని రెచ్చగొడ్తూ.

"సహించం. ఏమాత్రం సహించం" అన్నారు జనం ముక్త కంఠంతో బిగ్గరగా.

"ఎవడు మా దేవుళ్ళకు అపచారం తలపెట్టేవాడు? మేము వాడి తల చితగ్గొట్టేస్తాం. మేము ప్రాణాలైనా విడుస్తాం గాని, మా దేవుళ్ళ పట్ల అపచారం మటుకు ఎన్నటికీ సహించం" అంటూ గాండ్రించాడు అబూతాలిబ్ తమ్ముడు అబూలహబ్.

"పౌరుషం గల అరబ్బులంటే ఇలాగే ఉంటారు. మనం మన తాతముత్తాలు పూజిస్తూ వస్తున్న ఈ దేవతలకు అపచారం జరిగితే, ఆ అపచారాన్ని సహించేటంత నీచులమా మనం? కాదు. ఎన్నటికీ కాదు. కనుక అభిమానంగల అరబ్బులారా! వినండి. ఈరోజు కన్పించినట్లే నలభై ఏళ్ళ కిందట కూడా ఆకాశంలో ఓ మెరుపు కన్పించింది. అదొక భయంకరమైన కాళరాత్రి. ఆరాత్రి మన మహాదేవుడు హుబల్ బోర్లాపడిపోయాడు.



మనమంతా ఆ విగ్రహాన్ని లేపి నిలబెట్టడానికి ఎంత ప్రయత్నించినా అది నిలబడలేక పోయింది. ఆ సంఘటన మీకు గుర్తుండే ఉంటుంది" అన్నాడు అబ్రష్.

"ఆ... గుర్తుంది, గుర్తుంది. ఇప్పటికీ ఆ దృశ్యం నా కళ్ళ ముందు మెదలుతోంది. ఆరోజు రాత్రి ఎన్నడూ లేని విధంగా ఎన్నో నక్షత్రాలు రాలిపడ్డాయి. కళ్ళు మిరుమిట్లు గొలిపే కాంతి కన్పించింది. ఆ రాత్రి మన హుబల్ దేవుడు బోర్లాపడిపోయాడు. మనం ఎన్ని సార్లు లేపి నిలబెట్టినా కింద పడిపోయేవాడు" అన్నాడు అబూలహబ్.

"అయితే వినండి. సరిగా ఆ రోజు ఉదయం మన దేవతలకు అపచారం తలపెట్టే మనిషి మన పట్నంలో పుట్టాడు. ఈరోజు అతని వయస్సు పూర్తిగా నలభై ఏళ్ళు అయ్యాయి. నిన్నటిదాకా అతను పేరూ, ఊరూ లేనివాడిలా మౌనంగా ఉన్నాడు. ఈ రోజు నుంచి అతను ప్రజల ముందుకు వస్తాడు. విగ్రహాలకు వ్యతిరేకంగా మాట్లాడటం ప్రారంభిస్తాడు. ఏకేశ్వరుడయిన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలని ప్రచారం చేస్తాడు. అతను మనల్నుండి మన దేవతలను దూరం చేస్తాడు. కన్పించని దేవుణ్ణి ఆరాధించాలని చెబుతాడు. చివరికి యావత్తు అరబ్బులు అతని ప్రచారజాలంలో పడిపోతారు.

"ఈ విషయాలన్నీ నాచేతిలో వున్న ఈ పుర్రే చెబుతోంది. అయ్యయ్యో! మనకు ఎలాంటి వినాశకాలం దాపురించ బోతోంది!!" అంటూ అబ్రష్ కంటతడి పెట్టాడు.

అతణ్ని చూసి జనం కూడా కంటతడి పెట్టుకున్నారు. అందరిపై ఒక విధమైన భయం ఆవరించింది.

"హుబల్ సాక్షి! కన్పించని దేవుని ముందు సాష్టాంగపడే ప్రతివాడ్నీ నేను హతమార్చి వేస్తాను" అబులహబ్ అసహనంతో అరిచాడు.

"మీరలా చేయగల్గితే బాగానే ఉంటుంది. కాని మీరలా చేయలేరని ఈ కపాలం చెబుతోంది. మీరు మన దేవతలకు కలిగే అపచారాన్ని మీ కళ్ళారా చూడవలసి వస్తుంది."

"అయితే ఈ బెడద దూరమయ్యే దారిలేదా?" అడిగాడు హమ్జా.

"లేకేమి, ఉంది. కాని ముందుగా మన తెగలన్నీ పరస్పర తగాదాలు, విరోధాలు మానేసి ఏకం కావాలి. అ తరువాత ఏకేశ్వరుణ్ణి ఆరాధించే మనిషి ఎలాంటి వాడయినా, ఏ తెగకు చెందినవాడైనా సరే, అతణ్ని గట్టిగా వ్యతిరేకిస్తామని, ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తామని, అవసరమైతే అతణ్ని చంపడానికైనా వెనకాడమని మీరంతా ప్రతిజ్ఞ చేయాలి" అన్నాడు అబ్రష్.

ఈ మాటలు వినగానే జనంలో రక్తం ఉడికిపోయింది. అందరూ తమతమ దేవతల పేర్లు ఉచ్చరించి, వాటిని అవమానపరిచేవాడు ఏ తెగకు చెందినవాడైనా సరే, చంపితీరుతామని ప్రతిజ్ఞ చేశారు మూకుమ్మడిగా.

"మాంత్రిక మహాశయా! మన దేవతలకు అపచారం తలపెట్టేవాడు బహుశా బనీహాషిం తెగలో ఉన్నాడని మీ ఉద్దేశ్యం కాబోలు. నిజంగా అతను మా తెగలో గనక ఉంటే, అందరి కన్నా ముందు నా ఖడ్గమే అతణ్ని చీరేస్తుంది" అన్నాడు అబూలహబ్.

"అది నా అభిప్రాయం కాదు. మన దేవతలకు అపచారం తలపెట్టేవాడు బనీహాషిం తెగలో ఉన్నాడని ఈ కపాలమే నాకు తెలియజేసింది. కావాలంటే అతని పేరు కూడా చూడండి" అంటూ అబ్రష్ చుట్టూ తిరిగి పుర్రెను అందరికీ చూపించాడు.

పుర్రె మీద నల్లగా మాడిన రంగులో, స్పష్టమైన అక్షరాల్లో "ముహమ్మద్ (సల్లం)" అనే పేరు ప్రత్యక్షమయి ఉంది. అది చూసి అందరూ ఆశ్చర్యచకితులైపోయారు. కాని కపాలం మీద ప్రత్యక్షమైన ఈ విచిత్ర రాత చూసిన అబూతాలిబ్ క్షణంపాటు ఖంగుతిన్నారు. ఆయన ముఖం వివర్ణమైపోయింది. భృకుటి ముడివడింది.

"అబ్రష్! నువ్వు నా తమ్ముడి కొడుకు మీద నిందమోపి ఏదైనా గొడవ లేవదీయా లనుకుంటున్నావా? అలా ఎన్నటికీ చేయకు. నేను దాన్ని ఎంతమాత్రం సహించను" అన్నారు ఆయన కఠినంగా మాట్లాడుతూ.

"ప్రభూ! నేను మన పవిత్ర దేవత హుబల్ సాక్షిగా చెప్తున్నాను. నా అంతట నేనేదీ చెప్పడం లేదు. నాకున్న జ్యోతిష్ జ్ఞానం, ఈ పుర్రె ద్వారా నాకు తెలుస్తున్న విషయాలనే నేను చెప్తున్నాను" అన్నాడు అబ్రష్ కాస్తంత భయపడుతూ.

"నువ్వొట్టి అబద్ధాలమారివి. మా కుటుంబం పట్ల నీకేదో ద్వేషం ఉంది. మా మీద ఎందుకో కక్ష పెంచుకున్నావు. ఆ కక్షను నువ్విలా జ్యోతిష్యం చాటున తీర్చుకోజూస్తున్నావు" అంటూ అబూతాలిబ్ గర్జించారు.

"మహాప్రభో! మన్నించండి. తమరిలాంటి గౌరవనీయమయిన ఉన్నత కుటుంబంపై నిందమోపే దుస్సాహసానికి పాల్పడగలడా ఈ అల్పుడు? పాల్పడి బతికి బయటపడ గలడా? ప్రభూ! నేను మీ ఉప్పు తిని మీ చెప్పు కింద అణగిమణగి ఉండే అల్పజీవిని. అలాంటి నేను మీ కుటుంబం మీద కక్ష గట్టడమా! దేవ దేవ! అటువంటి పాడు ఆలోచన నా మనస్సులోకే రాదు. దయచేసి కాస్త ఓపిక పట్టండి. ఈ కపాలం ఏం చెబుతుందో మీరే చూద్దురుగాని" అన్నాడు అబ్రష్ దీనంగా.

ఆ తరువాత అబ్రష్ ఏదో మంత్రం పఠిస్తూ కపాలం మీద మణికట్టు ఎముకను అయిదు సార్లు తిప్పాడు. తరువాత కపాలాన్ని నేల మీద ఉంచాడు. అది వెంటనే గిరగిర తిరగడం మొదలెట్టింది. కాస్సేపటికి దాని మీదున్న వృత్తాకారం పరిధి క్రమంగా కుంచించుకు పోతూ ఒక చిన్న బిందువుగా మారింది. ఆ తరువాత కపాలం తిరగడం ఆగిపోయింది. జనం ఈ వింతను సంభ్రమాశ్చర్యాలతో చూస్తున్నారు.

"చూశారా పుర్రె మీద ఈ వృత్తం ఎలా బిందువుగా మారిందో? ఇది మన దేవతల్ని అవమానపరిచే వ్యక్తి పేరు తెలుపుతుంది. అది కూడా చూడండి" అన్నాడు అబ్రష్.

కపాలం మళ్ళీ తిరగడం మొదలెట్టింది. బిందువు క్రమేణా విస్తరిస్తూ అక్షర రూపం దాల్చింది. ఆ తరువాత కపాలం తిరగడం ఆగిపోయింది. దాని మీద పెద్దక్షరాల్లో స్పష్టంగా "ముహమ్మద్" అనే పదం ప్రత్యక్షమయి ఉంది తళతళ మెరుస్తూ.

"చూడండి. మీ దేవతలకు అపచారం తలపెట్టేవాని పేరును బాగా చూసుకోండి. ఇది తంత్రమూ కాదూ, కనికట్టూ కాదు. పేరు స్పష్టంగా కన్పిస్తోంది" అన్నాడు అబ్రష్.



కపాలం మీద ప్రత్యక్షమయిన పేరును జనం చాలా దగ్గరగా పోయి చూశారు. అదే పేరు. అందులో ఇక ఏమాత్రం సందేహం లేదు. అది చూశాక అబూతాలిబ్ కూడా ఇక ఏమీ మాట్లాడలేక పోయారు.

"పేరును మీరంతా చూశారుగదా! ఇక వినండి. మీరు గనక మీ దేవతలను ప్రసన్నం చేసుకుంటే జరగబోయే ఈ కీడు తప్పుతుంది" అన్నాడు అబ్రష్.

"అయితే దేవతలను ఏ విధంగా ప్రసన్నం చేసుకోవాలి?" అబులహబ్ అడిగాడు.

"ఆ సంగతి కూడా కపాలమే చెబుతుంది, చూడండి" అంటూ అబ్రష్ కపాలం మీద మణికట్టు ఎముకతో మూడుసార్లు తిప్పాడు. కపాలం మళ్ళీ తిరగడం మొదలెట్టింది. దానిమీదున్న అక్షరాలు క్రమంగా కుంచించుకుపోతూ చివరికి అక్కడ ఓ చిన్న బిందువు ఏర్పడింది. ఆ బిందువు తిరిగి మెల్లగా విస్తరిస్తూ పోయింది. కాస్సేపటికి కపాలం తిరగడం ఆగిపోయింది. అప్పుడు దాని మీద పెద్ద పెద్ద అక్షరాలతో "బలి" అనే పదం ప్రత్యక్షమై వుంది. జనం సంభ్రమాశ్చర్యాలతో దానివైపు చూడసాగారు.

"చూశారుకదా! ఇక బలిచ్చి మీ దేవతలను ప్రసన్నం చేసుకోండి" అన్నాడు అబ్రష్.

"ఏం బలివ్వాలి?" ఒకతను అడిగాడు.

"ఆ సంగతి కూడా ఈ కపాలమే చెబుతుంది, చూడండి" అంటూ అబ్రష్ మంత్రం పఠిస్తూ దానిమీద మూడు సార్లు ఎముకతో తిప్పాడు.

కపాలం మళ్ళీ తిరగడం ప్రారంభించింది. తిరిగి తిరిగి ఆగిపోయింది. అప్పుడు దానిమీద బలి అనే అక్షరాలు పోయి ఓ చిన్న బిందువు ఏర్పడింది. కపాలం మళ్ళీ తిరిగి తిరిగి కాస్సేపటికి ఆగిపోయింది. అప్పుడు దానిమీద "అందమైన పదేళ్ళ బాలిక" అనే అక్షర సముదాయం ప్రత్యక్షమై ఉంది. జనం దగ్గరగా వచ్చి ఆశ్చర్యచకితులయి చూడసాగారు. కొందరు అబ్రష్ గొప్పతనాన్ని గురించి చెప్పుకోసాగారు.

"మీ ప్రశ్నకు సమాధానం లభించింది కదా! మీ కళ్ళతోనే దాన్ని చూసుకున్నారు. ఇక ఈ కపాలం తన పని ముగిస్తోంది" అన్నాడు అబ్రష్.

ఆ తరువాత కపాలం మళ్ళీ తిరిగసాగింది. అలా తిరిగి తిరిగి కాస్సేపటికి ఆగి పోయింది. దాంతో దాని మీదున్న అక్షరాలు కూడా అదృశ్యమయి పోయాయి. వెంటనే అబ్రష్ దాన్ని చేత్తో పైకెత్తి ముద్దెట్టుకున్నాడు ముసిముసి నవ్వులతో. ఆ తరువాత కపాలాన్ని సంచిలో వేసుకొని జనం వైపు ఓసారి విజయగర్వంతో చూశాడు.

## తొలి దివ్యావిష్కృతి-(25)

అది రమజాన్ మాసం. దైవకారుణ్యం ధరిత్రిపై వర్షించే పవిత్ర మాసం. హిరా గుహలో సమస్త విషయాల నుండి దృష్టి మళ్ళించి పూర్తిగా దైవచింతనలో లీనమైపోయిన ముహమ్మద్ మహనీయుని (స) హృదయంలో రుజుమార్గం రోజురోజుకు కాంతిమంతం కాసాగింది. ఒక సుప్రభాతం వేళ హిరాగుహలో హఠాత్తుగా ఓ అద్భుత దృశ్యం ప్రత్యక్ష

మయింది. ఎంతో అందమైన ముఖవర్చస్సుతో కూడిన అసాధారణమైన ఓ మానవాకారం ఆయన ముందుకు వచ్చి నిలబడింది.

వచ్చీరాగానే "చదువు" అన్నాడా వ్యక్తి.

"నాకు చదవడం రాదే!" అన్నారు ముహమ్మద్ (స) తొట్రుపడి బెదురుచూపులతో.

అప్పుడతను ముహమ్మద్ (స)ని గట్టిగా అదిమివదిలేస్తూ 'చదువు' అన్నాడు మళ్ళీ.

"నాకు చదవడం రాదు" తిరిగి అదే జవాబు.

మళ్ళీ ఆ వ్యక్తి ఆయన్ని గట్టిగా అదిమి వదిలేస్తూ 'చదువు' అన్నాడు.

ఈసారి ముహమ్మద్ (స) తనను ఆ వ్యక్తి మరింత గట్టిగా అదిమి గొంతు నులిమేస్తాడేమోనన్న భయంతో "ఏం చదవాలి?" అని అడిగారు.

"చదువు సృష్టికర్త అయిన (నీ) ప్రభువు పేరు స్మరించి. ఆయనే మానవుడ్ని గడ్డ కట్టిన రక్తంతో సృజించాడు. చదువు, నీ ప్రభువు మహోన్నతుడు, ఎంతో ఉదారుడు. ఆయనే మానవునికి కలం ద్వారా అతను ఎరగని జ్ఞానం నేర్పాడు" అన్నాడు ఆ విచిత్ర వ్యక్తి. (దివ్య ఖుర్ఆన్. 96:1-5)

ముహమ్మద్ (స) అలాగే చదివి విన్పించారు. తరువాత ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిన తరువాత ముహమ్మద్ (స) గుహలోనే కొన్ని క్షణాలు భీతావహులై నిల్చున్నారు. ఓసారి చుట్టూ కలియజూసి కలవరపడ్డారు.

"ఇప్పుడెవరు తనతో మాట్లాడింది? తనను చదవమని బలవంతం చేసిందెవరు?" మనసులో పరిపరివిధాల ఆలోచనలు, అనుమానాలు రేకెత్తాయి.

గుహనుండి చరచరా బయటికి వచ్చారు. తనకేదో పిశాచం ఆవహించిందని భ్రమపడి గబగబా గుట్టలు, మిట్టలు దాటుకుంటూ ఇంటిదారి పట్టారు.

ఇంటికి చేరుకోగానే పడకమీద వాలిపోయి "దుప్పటి కప్పు, దుప్పటి కప్పు" అన్నారు గజగజ వణికిపోతూ.

ఖదీజా భర్త పరిస్థితి చూసి కంగారు పడ్డారు. ఆమె వెంటనే దుప్పటి తెచ్చి కప్పారు. ఈ అసాధారణ పరిస్థితికి కారణం అడగడానికి ఆమె సాహసించలేకపోయారు.

"ఏమిటీ, ఈయన ఆరోగ్యం బాగా లేదా? ఏదైనా వ్యాధి సోకిందా? లేక మరేదైనా ఆపద వచ్చిపడిందా?"

కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడచిపోయాయి. పరిస్థితి కొంచెం కుదుటపడింది. భయం దూరమయింది. వణుకు కూడా తగ్గిపోయింది. దాంతో ముహమ్మద్ (సల్లం) దుప్పటి తొలగించి లేచి కూర్చున్నారు.

అప్పుడు హజ్రత్ ఖదీజాకు కొంచెం ధైర్యం వచ్చింది.

"ఏమండీ, ఏం జరిగింది? ఒంట్లో బాగా లేదా? ఇప్పటిదాకా మీరు ఎక్కడున్నారు?"



"ఏమని చెప్పను ఖదీజా! ఎప్పుడూ జరగని ఓ వింత సంఘటన జరిగింది. నేను హిరా గుహలో కూర్చొని ఉంటే తెల్లటి వస్త్రాలు ధరించిన ఒక అందమైన వ్యక్తి వచ్చాడు నా దగ్గరికి. వచ్చిరాగానే చదవమని నన్నాజ్ఞాపించాడు. ఇలా మూడుసార్లు జరిగింది. చివరికి నేను అతను చెప్పినట్లు ఎలాగో చదివాను. ఆ తరువాత అతను వెళ్ళిపోయాడు.

నాకు భయమేసి గుహ నుండి గబగబా నడిచి ఇంటికొచ్చాను.

ఖదీజా! ఏమయింది నాకు? ఇదంతా చూస్తుంటే నాకేదో ప్రాణాపాయం కలుగుతుందని భయంగా ఉంది" అంటూ ముహమ్మద్ (సల్లం) జరిగిన వృత్తాంతమంతా భార్యకు తెలియజేశారు.

ఖదీజా చాలా తెలివైన మహిళ. ఈ సంఘటన విని ఆమె భయపడలేదు. దాని వెనుకున్న మర్మాన్ని గ్రహించి భర్త వైపు ఎంతో గౌరవంగా చూస్తూ ఇలా అన్నారు:

"భయపడకండి. శుభఘడియ వచ్చింది, సంతోషించండి. నన్ను సృజించిన దేవుని సాక్షి! మీరు సత్యసంధులు, దయార్ద్రహృదయులు, నిజాయితీపరులు, పేదల పాలిట పెన్నిధి. మీరు అతిథులను సత్కరిస్తారు, మంచి పనులలో ప్రజలతో సహకరిస్తారు. అటువంటి వారైన మీకు దేవుడు ఎన్నటికీ ప్రాణాపాయం కలిగించడు."

అర్ధాంగి మాటలతో ముహమ్మద్ (సల్లం)కు కొంచెం ధైర్యం వచ్చింది. కలవరపాటు చాలావరకు తగ్గిపోయింది. వాడిన ముఖపద్మం వికసించింది. ఆయన క్షణంపాటు శ్రీమతి వైపు కృతజ్ఞతా భావంతో చూశారు.

తన భర్త దైవప్రవక్త కాబోతున్నాడని గ్రహించిన ఖదీజా పరమ సంతోషంతో పొంగిపోయారు. ఏమైనప్పటికీ ఈ విషయాన్ని ధృవపరచుకోవడానికి అన్నయ్య వరఖా దగ్గరికెళ్ళి అడుగుదాం అనుకున్నారు ఆమె మనసులో.

ఈ విషయాన్నే ఆమె శ్రీవారికి చెప్పి ఆయన్ని తీసుకొని వరఖా దగ్గరకు వెళ్ళారు.

వరఖా బిన్ నౌఫల్ హజ్రత్ ఖదీజా పెద్దనాన్న కుమారుడు. వరసకు అన్నవుతాడు. వయసు బాగా పైబడిన పండుముసలి. అయితే అతను గొప్ప తత్వవేత్త. వివిధ మతాలను కాచి వడబోసిన ప్రముఖ మతపండితుడు. ప్రతి విషయాన్నీ సునిశితంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకునే మనస్తత్వం కలవాడు.

ఈయన మొదట యూదమతం వైపు మొగ్గాడు. ఆ తరువాత క్రైస్తవ మతం స్వీకరించాడు. బైబిల్‌ని ఏండ్ల తరబడి అధ్యయనం చేసి, అందులోని లోతుపాతులు తెలుసుకున్న ప్రముఖ పరిశోధకుడు. అరబీ భాషలో దాన్ని అనువదించే పని కూడా ప్రారంభించాడు.

హజ్రత్ ఖదీజా అతని ముందు ముహమ్మద్ (సల్లం)కు ఎదురైన అపూర్వ సంఘటన గురించి ప్రస్తావిస్తూ "ఈయన చెప్పేది కూడా కాస్త విను అన్నయ్యా!" అన్నారు.

వరఖా బిన్ నౌఫల్ "బాబూ! ఇంతకూ నువ్వు హిరా గుహలో ఏం చూశావు?" అని అడిగాడు ఎంతో కుతూహలంతో.

ముహమ్మద్ (స) జరిగిన వృత్తాంతం వివరించారు. అది విని వరఖా ఇలా అన్నాడు:

“అయితే నాప్రాణం ఎవరి అధీనంలో వుందో ఆ దేవుని సాక్షిగా చెబుతున్నాను. నీవు వర్ణించిన ఆ అద్భుతశక్తి ఎవరో కాదు. గతంలో మూసా ప్రవక్త (అలైహి) దగ్గరకు దైవసందేశం తెస్తూవుండిన జిబ్రీల్‌దూతే ఆయన. దేవుడు నిన్ను తనప్రవక్తగా ఎన్నుకున్నాడు. నీవిప్పుడు దైవప్రవక్తవు. తౌరాత్, ఇంజీల్ గ్రంథాలలో నీ దౌత్యం గురించి భవిష్యత్ ప్రకటనలున్నాయి. నీ అనుచర సమాజం యావత్ ప్రపంచంలో వ్యాపిస్తుంది.

కాని ముహమ్మద్! నీవు దైవప్రవక్త అయినట్లు ప్రకటించావంటే లోకులు నిన్ను తిరస్కరిస్తారు. స్వస్థలం నుంచి వెళ్ళగొడ్తారు. చివరకు నీతో యుద్ధం చేయడానికైనా వెనుదీయరు ఈ ప్రజలు. అప్పటిదాకా నేను బ్రతికుంటే ఎంత బాగుండు!”

“ఏమిటీ, ప్రజలు నన్ను ఇక్కడ్నుంచి వెళ్ళగొడ్తారా?” ముహమ్మద్ (సల్లం) ఆశ్చర్యం వెలిబుచ్చుతూ అడిగారు.

“ఔను నాయనా! గతంలో దైవప్రవక్తలు వచ్చినప్పుడల్లా వారి జాతిప్రజలు ఇలాగే ప్రవర్తించారు. నాకా రోజులు చూసే భాగ్యముంటే నా సర్వశక్తులు వొడ్డి నిన్ను ఆదుకుంటాను” అంటూ వరఖా ప్రేమతో దైవప్రవక్త (స) నుదుటిని చుంబించాడు.

ఆ తరువాత మహనీయ ముహమ్మద్ (స) శ్రీమతితో పాటు అక్కడ్నుంచి లేచి భారంగా అడుగులేస్తూ ఇంటికి చేరుకున్నారు.

## దౌత్యభారంతో దైవప్రవక్త (సల్లం)-(26)

ఇప్పుడు ఆయన మెదడును అనేక ఆలోచనలు చుట్టుముట్టి తొలచివేయ సాగాయి.

“నా బలహీన భుజాలపై దౌత్యభారం వచ్చిపడింది. దీని పర్యవసానం ఏమవుతుందో! నేను ప్రజలను దేవునివైపు ఎలా పిలవాలి? రుజుమార్గం వైపు ఎలా మళ్ళించాలి వీరిని? వీరు సన్మార్గం తప్పి విగ్రహారాధనలో మునిగితేలుతున్నారే! నైతికంగా కూడా ఎంతో దిగజారిపోయారు. ఇలాంటి మూర్ఖజనాన్ని దారికి ఎలా తేవాలి?”

ఇలాంటి ఆలోచనలతో ముహమ్మద్ (స) తదుపరి కర్తవ్యం గురించి జిబ్రీల్ దూత (అలై) కోసం ఎదురుచూడసాగారు. కాని ఏడి ఆయన? మళ్ళీ ఎప్పుడు కన్పిస్తాడు??

“ఎన్ని రోజులీ నిరీక్షణ? తనను గురించి దైవప్రవక్తని చెప్పిన ఆ దైవదూత ఎప్పుడొస్తాడు? వరఖా తనకు దైవసందేశవాహకుడని చెప్పిన ఆ దైవదూత మళ్ళీ ఎందుకు రాలేదు తన దగ్గరకు? ఖదీజా కూడా ఎంతో నమ్మకంతో ఆయన దైవదూతే అయివుంటాడని చెప్పిందే! మరి అలాంటి దైవదూత మరలా ఎందుకు రానట్టు? ఇప్పుడేం చేయాలి? దేవుని వైపు ప్రజల్ని ఎలా పిలవాలి? ఈ విషయం చెప్పడానికైనా ఎందుకు రాలేదు?”

ముహమ్మద్ (స) హృదయంలో తుఫాను హోరు మొదలైంది. ఎప్పుడూ చిరునవ్వు తొణికిసలాడే ఆయన ముఖపద్మం విచారగ్రస్తమయింది. హజ్రత్ ఖదీజా కూడా లోలోన బాధపడసాగారు. ఆమె దుఃఖాన్ని తమాయించుకొని భర్తకు ధైర్యం చెప్పేవారు.



ముహమ్మద్ (సల్లం) యథాప్రకారం మళ్ళీ హిరా గుహకు వెళ్ళడం ప్రారంభించారు. రేయింబవళ్ళు అక్కడే దైవధ్యానంలో గడపసాగారు. శోకతప్త హృదయంతో విశ్వప్రభువును దీనంగా మొరపెట్టుకునేవారు.

“ప్రభూ! నీవు నన్ను ప్రవక్త నయితే చేశావు.... కాని ఇదేమిటీ ఇలా అయింది....?” దుఃఖం ముంచుకొచ్చింది.

ఒక రోజు ఆయన ఏమీతోచక గుహ నుంచి బయటికొచ్చి కొండల మీద ఒంటరిగా తిరగసాగారు. కాని దైవదూత జాడేలేదు. చివరికి ఆయన ఓ కొండచరియ ఎక్కి కిందికి దూకి ఆత్మహత్య చేసుకుందామనుకున్నారు. అంతలో జిబ్రీల్ (అలైహి) ప్రత్యక్షమయ్యారు.

“ముహమ్మద్! నీవు నిస్సందేహంగా దైవప్రవక్తవే” అని చెప్పి ఓదార్చి వెళ్ళిపోయారు.

దాంతో దైవప్రవక్త (సల్లం)కు మనశ్శాంతి కలిగింది. ఆయన సంతోషంతో తిరిగి ఇంటికి వెళ్ళిపోయారు.

కాని కొన్నాళ్ళకు తిరిగి అదే పరిస్థితి! ఎన్ని రోజులు గడచినా దైవదూత జాడలేదు. ముహమ్మద్(స) మళ్ళీ కొండచరియపైకెళ్ళి జీవితం చాలిద్దామని ప్రయత్నించారు. అదే సమయంలో దైవదూత మళ్ళీ ప్రత్యక్షమవడం, ఆయన్ని ఓదార్చడం జరిగిపోయాయి.

ఆ తరువాత మామూలే! దైవసందేశం చాలా రోజులదాకా రాలేదు. ఈ విధంగా తొలి దివ్యావిష్కృతి తరువాత ఆర్నెల్లు గడచిపోయాయి. దైవసందేశం ఒకసారి వచ్చి ఆగిపోవడం ఎంత బాధాకరమైన విషయం!

ఒకరోజు ఆయన ఎక్కడికో పోతుంటే హఠాత్తుగా ఆకాశం నుంచి వింత శబ్దంతో మాటలు విన్పించాయి. తలపైకెత్తి చూశారు. ఆశ్చర్యం! జిబ్రీల్ దూత ప్రత్యక్షమయ్యాడు. ఈసారి ఆయన తన అసలు స్వరూపంతో భూమ్యాకాశాల మధ్య శూన్యంలో ఓ కుర్చీ మీద కూర్చొని ఉన్నాడు.

“దేవా! ఈ దీనుడి మీద నువ్వెంత దయజూపావు!” మనస్సు కృతజ్ఞతాభావంతో నిండిపోయింది. కళ్ళలో ఆనందభాష్పాలు వెలిశాయి.

కాని మరుక్షణంలోనే దైవదూత అసలు స్వరూపం చూసి ముహమ్మద్ (సల్లం) భయంతో కంపించిపోయారు. ఏవో చెప్పలేని భయాందోళనలు చుట్టుముట్టాయి. అదే స్థితిలో పరుగు వేగంతో నడచి ఇంటికి చేరుకున్నారు.

“ఖదీజా! నాకు దుప్పటి కప్పు, త్వరగా దుప్పటి కప్పు” అన్నారు వణికిపోతూ.

విషయం గ్రహించిన ఖదీజా వెంటనే వెచ్చని దుప్పటి తెచ్చి కప్పారు. ఆ తరువాత కాస్సేపటికే దైవదూత ప్రత్యక్షమయి ఇలా దైవసందేశం విన్పించాడు:

“దుప్పటి కప్పుకొని పడుకున్నవాడా! లే, లేచి (ప్రజలను) హెచ్చరించు. నీ ప్రభువు ఔన్నత్యాన్ని చాటిచెప్పు. నీ దుస్తులు పరిశుభ్రంగా ఉంచుకో. అపవిత్రత, అపరిశుభ్రతలకు దూరంగా మసలుకో. ఏ మేలయినా సరే ప్రాపంచిక ప్రయోజనాలు ఆశించి చేయకు. (కష్టమొచ్చినప్పుడు) నీ ప్రభువు (ప్రసన్నత) కోసం సహనం వహించు”. (74:1–7)

ఇప్పుడు దైవప్రవక్త(స) మనస్సు కుదుటపడింది. అనుమానాలన్నీ దూరమయ్యాయి. ఇక ఖదీజా ఆనందమయితే అవధులు దాటింది. దైవసందేశం తిరిగి అవతరించిందని వినగానే ఆమె ఎంతో సంబర పడిపోయారు.

“చూశారా! వరఖా అన్నయ్య నిజమే చెప్పాడు. ఆయన అన్నట్లే మీపై మళ్ళీ దైవ సందేశం అవతరించింది” అన్నారు ఆమె సంతోషంతో.

“కాని ఖదీజా! దైవసందేశాన్ని ప్రజలకు చేరవేసేదెలా? వారు నా మాటలు వినరేమో నని నాకు భయంగా ఉంది” అన్నారు దైవప్రవక్త (సల్లం) మళ్ళీ విచారవదనంతో.

“నిజమే. కాని ప్రజలు వినరని భయపడి దైవాజ్ఞను పాటించకుండా ఉంటారా?”

“అలా ఎన్నటికీ జరగదు. దేవుడు అవతరింపజేసే విషయాలను నేను తప్పకుండా ప్రజలకు అందజేస్తాను.”

“ఆయన అన్నట్లే చేస్తారు. ఆ తరువాత పరిస్థితి ఎలా ఉంటుంది? ప్రజలు ఆయన్ని తిరస్కరించవచ్చు. ఆయనపై కడగండ్ల కొండలు వచ్చిపడతాయి”. ఈ ఆలోచనతో ఖదీజా కూడా మనసులో భయపడిపోయారు. చాలా సేపటివరకు ఆలోచిస్తూ కూర్చున్నారు.

## ముహమ్మద్ (సల్లం) ముందు బైబిల్-(27)

ఆ తర్వాత ఆమె లేచి దుప్పటి కప్పుకొని బయటికి వెళ్ళారు. రెండు మూడు వీధులు దాటాక ఒక ఇంటి ముందు ఆగి తలుపు తట్టారు. లోపల నుంచి తల, గడ్డం నెరిసిన ఒక వృద్ధుడు బయటికి వచ్చాడు. చూస్తే క్రైస్తవ సాధువులా ఉన్నాడు.

“ఎవరమ్మా! ఖదీజా, నువ్వా!! రామ్మా, లోపలికి రా” అతను సాదరంగా పిలిచాడు.

హజ్రత్ ఖదీజా లోపలికి ప్రవేశించి ఒక చాప మీద కూర్చున్నారు.

“ఏమిటమ్మా! ఇంత ఎండలో వచ్చావు!! ఏమిటీ విశేషం?” అడిగాడు వృద్ధుడు.

“అద్దాస్! నేనొక విషయం తెలుసుకోవడానికి మీ దగ్గరకొచ్చాను.”

“చెప్పమ్మా! ఏమిటా విషయం?”

“జిబ్రీల్ ఎవరో కాస్త చెప్పండి.”

జిబ్రీల్ (అలై) పేరు వినగానే అద్దాస్ గౌరవసూచకంగా ఓ క్షణం తలవంచుకున్నాడు.

తర్వాత తలపైకెత్తి “జిబ్రీల్ పేరు నువ్వు ఎవరినోట విన్నావమ్మా? విగ్రహారాధకులైన మీ జాతిప్రజలకు జిబ్రీల్ పేరు తెలియదే, నీకెలా తెలిసింది?” అనడిగాడు ఆశ్చర్యపోతూ.

“ముందు నాకు జిబ్రీల్ ఎవరో చెప్పండి. తరువాత నేను మీకన్నీ తెలియజేస్తాను” అన్నారు హజ్రత్ ఖదీజా.

“జిబ్రీల్ దైవసందేశం తీసుకొని ప్రవక్తలపై అవతరించే ప్రముఖ దైవదూత.”

“అతని అవతరణ వల్ల శ్రేయోశుభాలు ఉంటాయా?”



“తప్పకుండా. ఆ దైవదూత అవతరించిన ప్రతిచోటా శుభాలే శుభాలు. అందులో సందేహం ఏముంది?”

“సరే, మీరు రహస్యంగా ఉంచుతానంటే నేనొక మాట చెబుతాను.”

“అలాగేనమ్మా! నేను ఎవరి ముందూ ప్రస్తావించనులే, చెప్పు” అన్నాడు అద్దాస్ ఎంతో కుతూహలంతో.

“మీకు నా భర్త ముహమ్మద్ తెలుసుకదా?”

“ముహమ్మద్ నాకు తెలియకపోవడం ఏమిటమ్మా! చిన్నప్పట్నుంచీ తెలుసు.”

“ఆయన ఎలాంటి వారనుకుంటున్నారు మీరు?”

“మొత్తం అరబ్బు తెగల్లోనే బనూహాషిం తెగ ఎంతో గౌరవప్రదమైన తెగ. బనూహాషిం తెగలో అందరికన్నా ముహమ్మద్ ఎక్కువ గౌరవనీయుడు, నీతిమంతుడు.”

“అయితే వినండి! ముహమ్మద్ (సల్లం) తనపై జిబ్రీల్ అవతరిస్తున్నాడని చెబుతున్నారు” అన్నారు హజ్రత్ ఖదీజా.

ఈ మాటలు వినగానే అద్దాస్ సంభ్రమాశ్చర్యాలతో చూడసాగాడు.

“చాలా వింతగా ఉందే! త్వరలో ఒక ప్రవక్త ఉద్భవిస్తాడని నాకు తెలుసు. కాని ఆ ప్రవక్త ముహమ్మద్ కాదేమో!”

“ఈనాటి వరకు ముహమ్మద్ అబద్ధమాడి ఎరగరు” అన్నారు ఖదీజా.

“నిజమే. ఆయన అబద్ధమాడే మనిషి కాదు. కాని ఆయనకేదైనా భూతం పట్టిఉండ వచ్చు. ఇదిగో, ఈ బైబిల్ తీసికెళ్ళి చూపించు. ఆయనకు భూతం పట్టివుంటే ఈ పరిశుద్ధ గ్రంథం చూడగానే కంగారు పడిపోతాడు. ఒకవేళ ఆయనపై నిజంగా జిబ్రీల్ అవతరిస్తుంటే ఆయనపై ఈ గ్రంథం ఎలాంటి ప్రభావం చూపదు. అప్పుడు ఆయన తప్పకుండా దైవ ప్రవక్తేనని చెప్పవచ్చు” అంటూ అద్దాస్ తన దగ్గరున్న బైబిల్‌ని ఖదీజాకు అందించాడు.

“సరే, మీరు చెప్పినట్లే చేస్తాను” అన్నారు ఆమె బైబిల్ తీసుకొని దుప్పటి కింద దాచి పెట్టుకుంటూ.

ఆ తరువాత హజ్రత్ ఖదీజా (రజి) అద్దాస్ దగ్గర సెలవు తీసుకొని ఇంటికి తిరిగొచ్చారు. రాగానే దుప్పటి తీసేసి, బైబిల్‌ని చేతిలో పట్టుకొని మెల్లిగా దైవప్రవక్త (స) ముందుకు వెళ్ళారు.

దైవప్రవక్త (సల్లం) దాన్ని పరికించి చూడసాగారు. అప్పుడు ఖదీజా ఆయన ముఖ కవళికలను గమనించారు. కాని ఆయన ముఖంలో ఎలాంటి మార్పు కన్పించలేదు.

“ఏం పుస్తకం అది?” అన్నారు ఆయన తన సహజ ధోరణిలో.

“ఇది పరిశుద్ధ గ్రంథం, బైబిల్.”

“దీన్ని నువ్వు ఎక్కడ్నుంచి తెచ్చావు? ఎందుకు తెచ్చావు?”

హజ్రత్ ఖదీజా బైబిల్‌ని ఓ పక్కన పెట్టి తనకు, అద్దాస్‌కు మధ్య జరిగిన సంభాషణంతా వివరించారు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) చిరునవ్వుతో "ఏమిటీ, నాకేదైనా దయ్యం పట్టిందని అనుమానిస్తున్నావా నువ్వు?" అని అడిగారు.

"ఇప్పుడు నాకు పూర్తిగా నమ్మకం కుదిరింది. మీపై జిబ్రీల్ అవతరిస్తున్నారు. మీరు నిజంగా దైవప్రవక్తే" అన్నారు హజ్రత్ ఖదీజా.

దైవప్రవక్త (సల్లం) పెదాలపై మరోసారి చిరునవ్వు తొణికిసలాడింది.

## ప్రప్రథమ విశ్వాసులు-(28)

ఒకరోజు ముహమ్మద్ (సల్లం) మక్కా శివార్లలో దైవదూత కోసం నిరీక్షిస్తూ పచార్లు చేయసాగారు. మనస్సులో భవిష్యత్ కార్యక్రమాన్ని గురించి ఒకటే ఆలోచనలు!

"దైవాన్ని ప్రార్థించే పద్ధతి ఏమిటీ? ప్రవక్త కాక ముందైతే మనస్సుకు తోచిన విధంగా దైవధ్యానం చేసేవాడు. కాని ఇప్పుడు దేవుడు తనను ప్రవక్తగా నియమించి మార్గదర్శక ఆదేశాలు పంపుతున్నాడు. అందువల్ల దైవారాధన విధానం కూడా ఆయన బోధించే తీరులోనే ఉండాలి మరి" అనుకున్నారు ఆయన.

ఈ విషయాలు తెలియజేయడానికే జిబ్రీల్ (అలైహి) ప్రత్యక్షమయ్యారు. ఆయన ఓ గుట్ట మీద గరికనేలను కాలితో తన్నగానే అక్కడ ఒక ఊట ఉబికొచ్చింది. ఆ నీటితో ఆయన ఉజూ చేసి, నమాజ్ చేయడానికి ముందు ఇలా పరిశుభ్రం కావాలని చెప్పారు.

అది చూసి దైవప్రవక్త (స) అలాగే ఉజూ చేశారు. తరువాత జిబ్రీల్ (అలై) నమాజు చేసి చూపారు. అది చూసి దైవప్రవక్త (స) కూడా ఆయన చేసినట్లే నమాజు చేశారు.

ఆ తరువాత ఆయన ఇంటికొచ్చి అర్ధాంగి ఖదీజా (రజి) ఎదుట ఉజూ చేసి చూపారు. హజ్రత్ ఖదీజా (రజి) అదేవిధంగా ఉజూ చేశారు. తరువాత దైవప్రవక్త (సల్లం) నమాజు చేయగా ఆమె ఆయన్ని అనుసరించారు.

దైవప్రవక్త (సల్లం), ఆయన శ్రీమతి చేసే ఈ కొత్త ఆరాధనా పద్ధతి చూస్తుంటే వారింట్లో ఉండే అలీకి ఎంతో విచిత్రంగా తోచింది. ఆ బాలుడు ఇంతకు ముందెప్పుడూ ఈవిధంగా వారిద్దరు ప్రార్థన చేయడం చూడలేదు. అందువల్ల అదేమిటో తెలుకోవాలన్న ఆలోచన కలిగింది. ప్రార్థన పూర్తికాగానే "ఏమిటిదీ, ఇలా చేస్తున్నారు మీరు?" అని అడిగాడు పదేళ్ళ అలి కుతూహలంతో.

"ఇది దేవుడు మానవుల కోసం పంపిన ధర్మం బాబూ! దీన్ని ఇస్లాం అంటారు. గత దైవప్రవక్తలంతా లోకానికి ఇస్లాం ధర్మాన్నే బోధించారు" అన్నారు దైవప్రవక్త (స).

"అలాగా! మరి ఈ రుకూ, సజ్దాలేమిటీ?" అలి మరింత ఆశ్చర్యంతో అడిగాడు.

"దేవుడు నన్ను ప్రవక్తగా నియమించాడు బాబూ! మార్గం తప్పిన ప్రజలకు సన్మార్గం చూపి వారికి మంచిమంచి విషయాలు తెలియజేయడానికి, దైవారాధన కోసం వారిని



ప్రేరేపించడానికి ఆయన నాపై తన వాణిని అవతరింపజేస్తున్నాడు. మనం చేసే రుకూ, సజ్దాలు ఆ దైవం కోసమే" వివరించారు దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం).

"అయితే చాలా మంచి విషయమే. మరి మీరు నమ్ముతున్న ధర్మాన్ని నేనూ నమ్మవచ్చా? మీతో పాటు నేను కూడా ప్రార్థన చేయవచ్చా?" అడిగాడు బాలుడు.

"తప్పకుండా తమ్ముడూ! అలాగే చెయ్యి. యావత్తు ప్రపంచానికి దేవుడు ఒక్కడే ఆయనకు మరెవరూ సాటి లేరు. ఆయనే ఆరాధనకు అర్హుడు. నువ్వు కూడా ఆయన్నే ఆరాధించు. విగ్రహాలను వదలి ఆ దేవుడ్నే నమ్ముకో బాబూ!" అన్నారు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం).

"అయితే నేను మా నాన్నగారిని అడిగి చెప్తా" అన్నాడు అలి.

అలా అన్నాడేగాని, ఆ రాత్రి అతనికి నిద్ర పట్టలేదు. దైవప్రవక్త (సల్లం) బోధించిన మాటలే మాటిమాటికి మననం చేసుకుంటూ తీవ్రంగా ఆలోచించాడు. తెల్లవారిన తరువాత దైవప్రవక్త (సల్లం) దగ్గరకు పోయి ఇలా అన్నాడు:

"నేను మిమ్మల్ని విశ్వసిస్తున్నాను. మిమ్మల్ని అనుసరించడానికి నిర్ణయించుకున్నాను. దీనికోసం నాకు మా నాన్నను అడగాల్సిన పనిలేదు. ఎలా ప్రార్థన చేయాలో చెప్పండి."

ఈ మాటలు విని దైవప్రవక్త (సల్లం) ఎంతో సంతోషించారు. అలీని ప్రేమగా కౌగిలించుకొని అతనికి నమాజు చేసే పద్ధతి నేర్పారు.

అలి (రజి)తో పాటు ప్రవక్త పెంపుడు కొడుకు జైద్ కూడా దైవప్రవక్త (స) ఇంట్లో ఉంటున్నాడు. వారిద్దరు కలసి మెలసి ఉండేవాళ్ళు. ఏది చేసినా ఇద్దరూ కలిసే చేసేవారు. అలి కొత్తధర్మం స్వీకరించిన సంగతి వినగానే జైద్ కూడా దైవప్రవక్త (స)పై విశ్వాసం ప్రకటించి ఇస్లాం పరిధిలోకి వచ్చాడు.

వాళ్ళిద్దరూ దైవప్రవక్త (స)ను ఎంతగానో గౌరవించేవారు. ఆయన ఆజ్ఞను అంగుళం కూడా జవదాటేవారు కాదు. దైవప్రవక్త (స) కూడా వాళ్ళను అమితంగా ప్రేమించేవారు.

దైవప్రవక్త (స) ఓరోజు భావి కార్యక్రమం గురించి ఆలోచిస్తుంటే ఆయన స్నేహితుడు అబూబకర్ వచ్చాడు. మిత్రులిద్దరూ కాస్సేపు అదీఇదీ మాట్లాడుకున్నారు.

తరువాత దైవప్రవక్త (సల్లం) విషయం మార్చుతూ "అబూబకర్! నీవు నన్ను ఎలాంటి వాడని భావిస్తున్నావు?" అని అడిగారు.

"ఏమిటి, ఈరోజు కొత్తగా మాట్లాడుతున్నావు!! నీ సంగతి నాకు తెలియనిదేముంది? నువ్వు ఎంతో మంచివాడవు, సత్యవంతుడవు, నిజాయితీపరుడవు" అన్నాడు అబూబకర్.

"సరే, ఒకవేళ నేను దైవప్రవక్తనని, నాపై దైవసందేశం అవతరిస్తోందని అంటే నువ్వు నమ్ముతావా?" అడిగారు దైవప్రవక్త (సల్లం) మళ్ళీ.

"తప్పకుండా నమ్ముతాను. నీవు అబద్ధమాడినట్లు, తప్పుడు మాటలు పలికినట్లు నేనింత వరకు వినలేదు" అన్నాడు అబూబకర్.

"అయితే విను. నేనిప్పుడు దేవుని తరఫున ప్రవక్తగా నియమించబడ్డాను. నాపై దైవసందేశం అవతరిస్తున్నది. దాని ప్రకారం నీవు కూడా దైవేతర శక్తులన్నింటిని వదలిపెట్టి ఒక్క దేవుణ్ని మాత్రమే ఆరాధించు. ఆయనే సర్వసృష్టికర్త. జీవన్మరణాలు ఆయన చేతిలోనే ఉన్నాయి" అన్నారు దైవప్రవక్త (స)

"నిస్సందేహంగా నీవు దైవప్రవక్తవే. నేను సర్వసృష్టికర్త అయిన ఏకేశ్వరుణ్ని విశ్వ సిస్తున్నాను" అన్నారు అబూబకర్ (రజి).

ఈ మాటలు విని దైవప్రవక్త (స) పరమానందభరితులయ్యారు. ఆరోజు నుండి ఆయన తన దగ్గరకొచ్చేవారికి కొత్తధర్మం గురించి హితోపదేశం చేయడం ప్రారంభించారు.

ఈవిధంగా దైవప్రవక్త (సల్లం) తన దగ్గరకు వచ్చే ప్రతి వ్యక్తి ముందూ తాను దైవ ప్రవక్తనని ప్రకటించి, హితోపదేశం చేస్తూ రహస్యంగా ధర్మప్రచారం చేయసాగారు. అదేవిధంగా హజ్రత్ అబూబకర్ (రజి) కూడా ప్రచారం ప్రారంభించారు. ఆయన తన దగ్గరకు వచ్చిన అబ్దుల్ అమ్ర్ బిన్ ఔఫ్ అనే వ్యక్తికి దైవసందేశం విన్పించి ఇస్లాం స్వీకరించ మని అన్నారు. అబ్దుల్అమ్ర్ తక్షణమే ఇస్లాం స్వీకరించారు.

ఆ తరువాత ఓ రోజు ఉదయాన్నే ఖాలిద్ బిన్ సయీద్ అనే యువకుడు ఆందోళన పడుతూ వచ్చాడు. వచ్చిరాగానే విషయం చెప్పనారంభించాడు:

"రాత్రి నేనొక కలగన్నాను. దాని భావం ఏమిటో ఎంత ఆలోచించినా అర్థం కావడం లేదు. ఇందులో తప్పకుండా ఏదో గూఢార్థం ఉంటుందని భావిస్తున్నాను. ఆ గూఢార్థం మీరు చెబుతారని వచ్చాను" అన్నాడా యువకుడు ఆశతో అబూబకర్ వైపు చూస్తూ.

"ఇంతకూ నువ్వు ఏం కలగన్నావో చెప్పు" అన్నారు హజ్రత్ అబూబకర్ (రజి).

మక్కాలో హజ్రత్ అబూబకర్ (రజి)కు నిజాయితీగల పెద్ద మనిషిగా, మంచి వ్యాపారవేత్తగా పేరు పలుకుబడులు ఉండటంతో పాటు, ఆయన కలల గూఢార్థం చెబుతారని కూడా ప్రతీతి ఉంది.

"నేను రాత్రి భయంకరమయిన ఓ కల గన్నాను. ఆ కలలో నేనొక అగ్నిగుండం అంచున నిలబడి ఉన్నాను. దాని మంటలు తీవ్రంగా ప్రజ్వరిల్లుతున్నాయి. కాస్సేపటికి మానాన్న వచ్చి నన్ను ఆ అగ్నిగుండంలోకి నెట్టడానికి ప్రయత్నించాడు. నేను ఆయన పట్టు నుండి విడిపించుకోవడానికి ప్రయత్నిస్తున్నాను. మా నాన్న నన్ను అగ్నిగుండం లోకి త్రోసెయ్యడానికి మళ్ళీ ప్రయత్నించాడు. ఇలా మేమిద్దరం పెనుగులాడుతుంటే హఠాత్తుగా ఎవరో వచ్చి రెండు చేతులతో నా నడుం గట్టిగా పట్టుకొని నన్ను అగ్ని గుండంలో పడనీయకుండా మా నాన్న చెరనుండి లాగి విడిపించాడు. తర్వాత నేను వెనక్కి తిరిగి చూస్తే ముహమ్మద్ బిన్ అబ్దుల్లా కన్పించారు. అంతలో నాకు మెలుకువ వచ్చింది" అన్నాడు యువకుడు.

"ఖాలిద్! నువ్వు ఎంతో అదృష్టవంతుడివి. నేను నిన్ను అభినందిస్తున్నాను. కలలో నిన్ను రక్షించిన మనిషి ఇప్పుడు దైవప్రవక్త అయ్యారు. నువ్వు ఆయనకు విధేయుడయి



ఇస్లాం ధర్మం స్వీకరించు. దాని ద్వారానే నువ్వు నరకాగ్ని నుండి రక్షించబడతావు" అన్నారు హజ్రత్ అబూబకర్ (రజి).

ఖాలిద్ ఈ మాట విని నేరుగా దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వెళ్ళాడు. ఆయనకు తన కల గురించి తెలియజేసి ఇస్లాం స్వీకరించాడు.

ఆ రోజుల్లోనే ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ అనే ఓ ధనికుడు వ్యాపార నిమిత్తం సిరియా పోయి మక్కా తిరిగొస్తున్నాడు. దారిలో ఓ చోట రాత్రివేళ విడిదిచేసి నిద్రపోతుంటే "పడుకున్న వాడా! మేలుకో మక్కాలో అహ్మద్ బయల్పడ్డాడు" అని దిక్కులు పిక్కటిల్లేలా ధ్వని విన్పించింది. దాంతో ఉస్మాన్ చివాలున లేచి కూర్చున్నాడు. చూస్తే ఎవరూ కన్పించ లేదు. కాని ఆ పలుకులు మాత్రం అతని చెవుల్లో మాటిమాటికి ప్రతిధ్వనించసాగాయి.

ఉస్మాన్ వ్యాపారసామగ్రితో అక్కడ్నుంచి కదలి మళ్ళీ ప్రయాణం సాగించాడు. మక్కా ఇంకా కొన్నిమైళ్ళ దూరం ఉండగా ఆయన్ని తల్హా బిన్ ఉబైదుల్లా అనే మిత్రుడు కలిశాడు. అతను తన బస్రా పర్యటన విశేషాలు తెలియజేస్తూ ఇలా చెప్పాడు:

"నేను బస్రా గుండా వస్తుంటే ఒక సాధువు ఎదురై 'మక్కా ప్రజలలో అహ్మద్ అవ తరించాడా' అని అడిగాడు. నేను అహ్మద్ ఎవరన్నాను. దానికా సాధువు 'అబ్దుల్లా బిన్ అబ్దుల్‌ముత్తలిబ్ కొడుకు. ఆయన అంతిమదైవప్రవక్త' అని సమాధానమిచ్చాడు."

అప్పుడు ఉస్మాన్ ఎడారిలో అర్థరాత్రి తనకు ఎదురైన అనుభవం గురించి చెప్పాడు. ఆ తరువాత వారిద్దరు మక్కా చేరుకొని హజ్రత్ అబూబకర్ (రజి) దగ్గరకు వెళ్ళారు. ఆయన ముందు తమ అనుభవాల్ని గురించి చెప్పుకున్నారు. హజ్రత్ అబూబకర్ (రజి) వెంటనే వారిద్దర్నీ దైవప్రవక్త (సల్లం) సన్నిధికి పిలిచికెళ్ళారు. అక్కడ తల్హా, ఉస్మాన్‌లు దైవప్రవక్త (సల్లం) హితోక్తులు విని ఇస్లాం స్వీకరించారు.

ఇలా ఉస్మాన్ బిన్అఫ్ఫాన్, తల్హా బిన్ ఉబైదుల్లా, జుబైర్ బిన్అవ్వామ్, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, సాద్ బిన్ అబీవఖ్ఖాస్ తదితరులు ఇస్లాం స్వీకరించారు. ఆ తర్వాత వీరంతా దైవప్రవక్త (స) సూచన ప్రకారం ఇస్లాం ప్రచారం రహస్యంగా చేయడం ప్రారంభించారు.

అయితే ఇస్లాం ప్రచారం గురించి క్రమంగా బయటి ప్రజలక్కూడా తెలిసిపోయింది. దాంతో జనంలో కలకలం బయలుదేరింది. కొందరు దైవప్రవక్త (స)ను వింతగా చూడటం మొదలెట్టారు. మరికొందరు ముక్కుపుటాలు ఎగరేశారు. ఇంకొందరు హేళనచేశారు.

హజ్రత్ జిబ్రీల్ (అలైహి) తరచుగా వస్తూ ప్రవక్త (సల్లం)కు దైవసందేశం అందజేసి పోతుండేవారు. దైవప్రవక్త (సల్లం) దాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు విన్పిస్తుండేవారు.

అయితే కొన్నాళ్ళకు మరలా దైవసందేశం రావడం ఆగిపోయింది. ఇలా దైవసందేశం మధ్యలో ఆగిపోవడంతో విరోధులకు దెప్పిపొడవడానికి అవకాశం లభించింది.

"దైవప్రవక్తట! భలే దైవప్రవక్త!! దైవదూత తన దగ్గరకు వస్తున్నాడని, ఆకాశం నుంచి దైవసందేశం తెస్తున్నాడని చెబుతున్నాడు. రెండుమూడు సార్లు అలా జరిగిందేమో, ఇప్పు డంతా పోయింది! దైవదూత లేడు, దైవసందేశమూ లేదు" అని చెప్పుకోసాగారు జనం.

"ముహమ్మద్! నీ ప్రభువుకు నీమీద కోపం వచ్చి నిన్నొదిలేశాడు. అందుకే ఇన్నాళ్ళు గడచినా ఆయన నిన్ను పలకరించలేదు" అని హేళన చేయడం మొదలెట్టారు కొందరు.

దైవసందేశం ఆగిపోయిందని ముందే చింతిస్తున్న తనకు అవిశ్వాసుల ఎత్తిపొడుపులు పుండు మీద కారం చల్లినట్లయింది ఆందోళన అంతకంతకు ఎక్కువకాసాగింది.

"నా ప్రభువు నన్ను నిజంగానే విడిచిపెట్టాడా?"

ఈ ఆలోచన రాగానే దుఃఖం పొర్లుకొచ్చింది. అయితే అది కట్టలు తెగి ప్రవహించక ముందే జిబ్రీల్ (అలైహి) దైవసందేశంతో ప్రత్యక్షమయ్యారు:

"ఎండకాసే పగటి సాక్షి! చీకటి ఆవరించే రాత్రి సాక్షి! (ప్రవక్తా!) నీ ప్రభువు నిన్ను వదలిపెట్టలేదు. నీపై కినుక కూడా వహించలేదు. నీకోసం ప్రారంభకాలం కంటే ఆ తర్వాతి కాలం నిస్సందేహంగా ఎంతో మేలయినదిగా ఉంటుంది. త్వరలోనే నీ ప్రభువు నీకు (గొప్ప వరాలు) అనుగ్రహిస్తాడు. వాటిపట్ల నీవు సంతోషిస్తావు. నీవు అనాథగా ఉన్నప్పుడు ఆయన నీకు ఆశ్రయం కల్పించలేదా? నీవు మార్గవిహీనుడవై ఉండగా ఆయన నీకు మార్గం చూపలేదా? నీవు నిరుపేదగా ఉండటం చూసి ఆయన నిన్ను ధనవంతుడ్ని చేయలేదా? కనుక అనాథల పట్ల కఠినంగా ప్రవర్తించకు. యాచకుడ్ని కసరికొట్టకు. నీప్రభువు అనుగ్రహాలను (గురించి) చాటుతూ ఉండు." (ఖుర్ఆన్. 93:1-11)

ఎంత శుభసందేశం! ఎంత దయామయుడు తన ప్రభువు!! తనను విడనాడలేదు. పైగా అపార అనుగ్రహాలలో తేలియాడే అవకాశం కల్పించాడు.

ఈ సందేశం వల్ల వచ్చిన ధైర్యంతో ముహమ్మద్ (స) ధర్మప్రచారం తిరిగి ప్రారంభించారు. దాంతో ఒక్కొక్కరే ఇస్లాంపరిధిలోకి రాసాగారు. ఇలా మూడవసారి అబూఉబైదా బిన్ జిరాహ్, అర్ఖం, అబూసల్మా అబ్దుల్ అసద్ బిన్ హిలాల్, ఉస్మాన్ బిన్ మజ్ఊన్, ఖదామా బిన్ మజ్ఊన్, సయీద్ బిన్ జైద్, ఫాతిమా బిన్త్ ఖత్తాబ్, అబ్దుల్లా బిన్ మస్ఊద్, జాఫర్ బిన్ అబూతాలిబ్, మొదలైనవారు ఇస్లాం స్వీకరించారు.

అయితే దైవదౌత్య భారం అంతటితో తీరేది కాదు. అది వెన్ను విరిచే బాధ్యతాభారం. అంచేత దైవప్రవక్త (స) అనుక్షణం ఈ బాధ్యతను గురించే ఆలోచిస్తూ ఉండేవారు.

"మేమీ ఖుర్ఆన్ని ఏదయినా పర్వతం మీద అవతరింపజేస్తే, దాని పరిస్థితి ఎలా ఉంటుందో నీవు చూస్తావు. అది దైవభీతితో కంపించి క్రుంగిపోతూ పగిలిపోతుంది." (దివ్యఖుర్ఆన్-59:21)

ఈ భావనే ముహమ్మద్ (స)ను కూడా వణికింపజేస్తోంది. ఆయన ఓ రోజు దుప్పటి కప్పుకొని పడుకున్నారు. కాని దైవదౌత్య బాధ్యత ఆయన్ని ఓ పట్టాన నిద్ర పోనివ్వలేదు.

"దుప్పటి కప్పుకొని నిద్రించేవాడా! రాత్రివేళ (నమాజుకోసం) లేచి నిలబడు. అయితే రేయంతా కాదు, అర్ధరాత్రిదాకా. లేదా అంతకంటే కొంచెం తక్కువ చేసుకో. లేదా అంతకంటే కొంచెం ఎక్కువ చేసుకో. ఖుర్ఆన్ని ఆగి ఆగి నిదానంగా పఠించు. మేము నీమీద (ఎంతో బాధ్యతతో కూడిన) ఓ బరువైన వాణిని అవతరింపజేయ బోతున్నాము.



మనస్సును అదుపులో ఉంచడానికి రాత్రి జాగరణ ఎంతో ప్రయోజనకరమైనది. పైగా ప్రశాంతంగా ఖుర్ఆన్ పఠించడానికి కూడా అది చాలా సమంజసమైన వేళ. (అదీగాక) నీకు పగటిపూట (ఇతరత్రా) అనేక పనులుంటాయి.

(సదా) నీప్రభువు నామం స్మరిస్తూ ఉండు. అన్నిటినీ వదలి ఆయనకే అంకితమైపో. ఆయన తూర్పుపడమరలకు ప్రభువు. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. కనుక నీవు ఆయన్నే నీ రక్షకుడిగా చేసుకో. ఆయన మీదే భారం వెయ్యి.

జనం కల్పించి చెప్పుకునే మాటలు నీవు పట్టించుకోకు. సహనంతో వ్యవహరించు. సత్పురుషుడిలా వారికి దూరంగా ఉండు. సత్యాన్ని ధిక్కరిస్తున్న ధనికుల సంగతి నాకు వదిలెయ్యి. నేను వారి భరతం పడ్తాను. వారిని కొంతకాలం అదే స్థితిలో ఉండని." (73:1-11)

## బంధువర్గంలో ప్రచారభేరి-(29)

ఇలా ఇస్లాం పరిధి క్రమంగా విస్తరిస్తూ పోతోంది. దాంతోపాటే ప్రజల్లో వ్యతిరేక పవనాలు ఉధృతం కాసాగాయి. ముస్లింలు తమ ఇండ్లలో సయితం రహస్యంగా నమాజు చేయడం కష్టమైపోయింది. వారు దైవప్రవక్త (సల్లం) ఇంటిని కేంద్రంగా చేసుకొని నమాజు చేద్దామంటే అక్కడ ఇరుగు పొరుగువాళ్ళ పోరు ఎక్కువైపోయింది. అందువల్ల వారు కొండల్లో, కోనల్లో రహస్యంగా నమాజు చేయడం ప్రారంభించారు.

ఇలా ముస్లింలు పట్నం వెలపల ఓ కొండ ప్రదేశంలో నమాజు చేస్తుంటే, ఓ సారి అబూతాలిబ్ అటుగా రావడం జరిగింది. అప్పుడక్కడ దైవప్రవక్త (స)తో పాటు అలి (రజి) కూడా ఉన్నారు. అబూతాలిబ్ వారిద్దర్ని చూసి "మీరు అవలంబించిన ఈ ధర్మం ఏమిటీ?" అని అడిగారు.

"ఇది మన పితామహుడు ఇబ్రాహీం (అలైహి) అనుసరించిన ధర్మమే. దీన్ని ఇస్లాం అంటారు. ఇందులోని అంశమే ఈ నమాజు" అన్నారు మహనీయ ముహమ్మద్ (స).

"కాని నీ ముందు దేవతావిగ్రహం ఏదీ లేదుకదా?" అడిగారు అబూతాలిబ్.

"నేను విగ్రహాలను ముందు పెట్టుకొని ప్రార్థన చేయను."

"మరి ఎవరి కోసం ఈ ప్రార్థన?"

"యావత్తు విశ్వవ్యవస్థను, అందులోని సమస్త చరాచరాలను సృజించిన సృష్టికర్త కోసం. ఆయన గోచర, అగోచరాలన్నీ ఎరిగినవాడు."

"ఈ ప్రార్థన పద్ధతి ఎవరు నేర్పారు నీకు?"

"దైవదూత జిబ్రీల్ నేర్పాడు. పెదనాన్నా! క్రైస్తవసాధువు బహీరా నా గురించి చెప్పిన భవిష్యత్ వాణి మీకు గుర్తుందనుకుంటాను."

"ఆ.... గుర్తుంది." అన్నారు అబూతాలిబ్ ముప్ఫయి యేళ్ళ క్రితంనాటి సంఘటన జ్ఞాపకం చేసుకుంటూ.

"దేవుడు నన్ను తన ప్రవక్తగా నియమించాడు. నేనిప్పుడు దైవప్రవక్తను. నాపై దైవ సందేశం అవతరిస్తోంది" చెప్పారు దైవప్రవక్త (స).

"నీపై అవతరించిన దైవసందేశం ఏమిటీ?" అడిగారు అబూతాలిబ్.

అప్పుడు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఖుర్ఆన్‌లోని కొన్ని సూక్తులు పఠించారు. ఈ సూక్తులు అబూతాలిబ్‌ని ప్రభావితం చేశాయి. కాని ఆయన హృదయకవాటాలు పూర్తిగా తెరచుకోలేదు.

"ఈ సూక్తులు చాలా బాగున్నాయి. నీ ప్రార్థనాపద్ధతి కూడా బాగుంది. మన వంశంలో ఒక దైవప్రవక్త జన్మించినందుకు నాకెంతో గర్వంగా ఉంది" అన్నారు ఆయన.

"పెదనాన్నా! మీరు కూడా ఇస్లాం స్వీకరిస్తే బాగుంటుంది" అన్నారు దైవప్రవక్త (సల్లం) కాస్తంత ధైర్యం తెచ్చుకొని.

"బాబూ! ఈ ధర్మం అవలంబించాలని నాకూ ఉంది. కాని తాతముత్తాలనాటి సాంప్రదాయక మతం వదలిపెట్టాలంటే నాకెందుకో సిగ్గుగా ఉంది. జనం నా గురించి, నీవు తమ్ముడికొడుకు మాట విని అతని ధర్మం స్వీకరించావా అనడిగితే నేనేం సమాధానం ఇవ్వాలి? నా ఆత్మాభిమానం, వంశమర్యాదలు ఏమయి పోవాలి? అంచేత నేను మటుకు ఈ ధర్మాన్ని అనుసరించలేను. నీవు నిరభ్యంతరంగా దీన్ని అనుసరించవచ్చు. నేను బ్రతికున్నంత కాలం నిన్నెవరూ ప్రతిఘటించలేరు" అన్నారు అబుతాలిబ్.

తరువాత ఆయన కొడుకు అలి (రజి) వైపు తిరిగి "బాబూ అలీ! నీవు అవలంబించిన ధర్మం చాలా బాగుంది. జీవితాంతం దాన్నే అంటిపెట్టుకొని ఉండాలి. అలాగే ముహమ్మద్ (సల్లం)ని ఎన్నటికీ వదలిపెట్టకు" అని చెప్పి వెళ్ళిపోయారు.

అబూతాలిబ్ ఇస్లాం స్వీకరించలేదు కాని, ఆయన మాటలు దైవప్రవక్త (సల్లం)కు కొండంత ధైర్యాన్నిచ్చాయి. ఆయన లోలోన ఎంతో సంతోషించారు.

కొన్నాళ్ళకు హజ్రత్ అర్ఖం (రజి) ముస్లింల సామూహిక నమాజు కోసం తన ఇంటిని కేటాయించారు. ఆ ఇల్లు సఫాకొండకు దిగువభాగంలో ఉంది. జనం రాకపోకలు అటు వైపు అంతగా ఉండవు. అక్కడ్నుంచి కాబాగృహం కూడా స్పష్టంగా కన్పిస్తుంది. అన్నివిధాలా సురక్షితమైన చోటది. ఆరోజు నుండి ముస్లింలు అర్ఖం (రజి) ఇంట్లో నిశ్చింతగా సామూహిక నమాజు చేయనారంభించారు.

ధర్మప్రచారం కూడా రహస్యంగానే సాగుతోంది. ఇలా మూడేండ్ల పాటు రహస్య ప్రచారం జరిగింది. ఆ తరువాత ధర్మప్రచార పరిధి విస్తృతం చేయడం గురించి ఇలా దైవసందేశం అవతరించింది:

"నీ దగ్గరి బంధువుల్ని (దైవశిక్ష గురించి) భయపెట్టు. నిన్ను అనుసరిస్తున్న విశ్వాసుల పట్ల దయార్ద్ర హృదయంతో మసలుకో. అయితే వారు గనక నీకు అవిధేయులై పోతే 'మీరు చేసే పనులకు నేను బాధ్యుడ్ని కాన'ని చెప్పు. మహా శక్తిమంతుడు, అపార దయాళువు అయిన దేవుడ్ని మాత్రమే నమ్ముకొని ఉండు. నీవు (తహజ్జుద్ నమాజ్ కోసం) లేచి సిద్ధమవుతున్నప్పుడు, నమాజు చేసేవారి మధ్య తిరుగుతున్నప్పుడు ఆయన నిన్ను చూస్తూనే ఉన్నాడు. ఆయన సమస్తం వినేవాడు, ఎరిగినవాడు." (26: 214-220)



దైవప్రవక్త (సల్లం) ఈ ఆదేశం ప్రకారం బంధువుల్ని సమావేశపరచి విషయం బోధించడానికి నిర్ణయించుకున్నారు. కాని ఎలా సమావేశపరచాలి? ఈ విషయాన్ని గురించి తీవ్రంగా ఆలోచించారు. చివరికి విందుభోజనానికి పిలిచి వారి ముందు దైవసందేశం ఉంచుదామని అనుకున్నారు.

కొత్త ధర్మం గురించి దైవప్రవక్త (సల్లం) బంధువులకు, స్నేహితులకు, సన్నిహితులకు అందరికీ తెలిసిపోయింది. ఏ నోట విన్నా కొత్త ధర్మం గురించిన చర్చలే. ప్రవక్త మేనత్తలు విని భయపడ్డారు. "దురదృష్టవశాత్తు ముహమ్మద్ (సల్లం)కు మతి భ్రమించలేదు కదా! అతను ఏదయినా ఆపదలో చిక్కుకోబోవడం లేదుకదా!!" అనుకున్నారు వారు. ఓరోజు మేనత్తలు దైవప్రవక్త (సల్లం) ఇంటికొచ్చి విచారించారు.

మహనీయ ముహమ్మద్ (సల్లం) వారితో దైవదౌత్యం గురించి తన వంశంవారిని, జాతివారిని, చివరికి ప్రపంచ ప్రజలందరినీ ఎలా సంస్కరించాలో, ఎలా సత్యధర్మం వైపు మరలించాలో అనే విషయాల్ని గురించి ఆవేదన వెలిబుచ్చారు. ఈ సందర్భంలో ఒక విందు ఏర్పాటు చేయాలన్న తన నిర్ణయాన్ని కూడా తెలిపారు.

"అలాగే విందుకు ఆహ్వానించు. కాని అబూలహబ్ పెదనాన్నను మాత్రం పిలవద్దు. అతను చచ్చినా నీమాట వినడు" అంటూ ఒక మేనత్త సలహా ఇచ్చింది.

కాని దైవప్రవక్త(స) బంధువులందర్నీ పిలిచారు. మేనత్త వద్దన్నా వినకుండా అందరితో పాటు అబూలహబ్‌ని కూడా ఆహ్వానించారు. అతను తొలిరోజు నుండే దైవప్రవక్త (స)కు, కొత్త ధర్మానికి బద్ధశత్రువైపోయాడు. కాని దైవదౌత్యబాధ్యత అతడ్ని విడిచిపెట్టలేదు.

నిర్ణీత దినాన దైవప్రవక్త (సల్లం) ఇల్లు బంధువర్గంతో నిండిపోయింది. పెదనాన్నలు, పినతండ్రులు, సోదరులు, మేనత్తలు, ఇతర బంధువులు విందు భోజనానికి వచ్చారు. కాని ఈ విందుకు కారణం ఏమిటో ఎవరికీ అర్థంకాలేదు. అందరూ భోజనాలు ముగించిన తర్వాత ముహమ్మద్ (స) ఈ విందుకు కారణం ఏం చెబుతారో విందామని కుతూహలంతో ఎదురుచూడసాగారు. కొన్ని క్షణాల తరువాత దైవప్రవక్త (స) విషయం చెపుదామని లేచి నిలబడ్డారు. అంతలో అబూలహబ్ దిగ్గునలేచి ఇలా అందుకున్నాడు:

"ముహమ్మద్ (స)! వీళ్ళంతా నీ బంధువులు. నీ శ్రేయస్సు కోరేవారే. కాని వీరంతా అనుసరిస్తున్న తాతముత్తాతల కాలం నుంచీ వస్తున్న మతం సరైనది కాదని అంటున్నావు. కొత్తమతం ఏదో కనిపెట్టి నీ సోదరులపై పెద్దఆపద తెచ్చిపెట్టావు. నీ ధోరణి ఏమీ బాగా లేదు. ఒక విషయం గుర్తుంచుకో. అరబ్ తెగలన్నీ ఏకమై పోరుకు వస్తే మన తెగవాళ్ళు నీకు సాయపడరు. నీ వైఖరి మార్చుకోకపోతే మేము నిన్ను కారాగారంలో పడవేస్తాం. అంతేగాని ఖురైషీయులు, ఇతర తెగలు కలిసి నిన్ను పట్టుకోవడం మాత్రం మన తెగవాళ్ళు ఏమాత్రం సహించరు."

దైవప్రవక్త (సల్లం) సభికులకు కొత్త ధర్మం గురించి పరిచయం చేద్దామని, వారిలో ఉన్న చెడులు ఎత్తిచూపి వారిలో దైవభీతి కలిగిద్దామని తహతహలాడారు. కాని అబూలహబ్ అవకాశం ఇస్తే కదా! అతను ఆహ్వానితుల్ని రెచ్చగొడ్తూ మళ్ళీ ఇలా అన్నాడు:

“చూశారా! ముహమ్మద్ ఒక్కమాటకూ జవాబివ్వలేదు. అసలితనికి మన సలహాలు అంటేనే లెక్క లేదు. ఎంత అవమానం మనకు! బంధువులారా! మీరు ముహమ్మద్ (సల్లం)ని ఇప్పుడే, ఈ క్షణంలోనే పట్టుకోండి. ఊ... చూస్తారేమిటీ? ఇతరులు పట్టుకొని బంధించేదాకా మనం ఎదురుచూడటం ఎందుకు? అలా జరిగితే మాత్రం మీరు చాలా ప్రమాదంలో పడిపోతారు. ముహమ్మద్‌ని ఇతరులకు అప్పగిస్తే మీరు అభాసుపాలవుతారు. మీ పేరుప్రతిష్ఠలు మంటకలుస్తాయి. ఒకవేళ ఇతనికి మద్దతిస్తే మీపై దుర్భర దౌర్జన్య కాండ విరుచుకుపడుతుంది, ఆలోచించండి.”

విందులో దైవప్రవక్త (సల్లం) మేనత్త సఫియా కూడా ఉంది. ఆమె ఈ మాటలు సహించలేక పోయింది.

“అన్నయ్యా! నీకు కాస్తయినా సిగ్గుందా! తమ్ముడి కొడుకునే వ్యతిరేకిస్తున్నావా? ముత్తలిబ్ వంశంలో ఒక దైవప్రవక్త పుడ్తాడని కొంతకాలం నుంచి అనేకమంది సాధువులు, తాత్వికులు చెబుతూ వస్తున్న సంగతి నీకూ తెలుసు. ఆ ప్రవక్త ఈయనే...” అన్నది.

సఫియా మాటలకు అబూలహబ్ వికటాట్టహాసం చేశాడు.

“సఫియా! నీకేం హాయిగా (గాజులు తొడుక్కొని) ఇంట్లో కూర్చుంటావు. ఖురైషీయులు శత్రువులుగా మారి మనపై పోరుకుపాల్పడితే, ఇంకా ఇతరతెగలు కూడా వారి పక్షమే వహిస్తే... అప్పుడు మన గతేమవుతుందో తెలుసా? చీమల్లా నలిగిపోతాం.”

అప్పటిదాకా మౌనంగా వింటున్న అబూతాలిబ్ కూడా అబూలహబ్ వైఖరి సహించలేకపోయారు.

“అలా ఎన్నటికీ జరగదు. మా బొందిలో ప్రాణం ఉన్నంత వరకూ మేమంతా ముహమ్మద్‌కు మద్దతిస్తాం.” ఆయన తన తిరుగులేని నిర్ణయాన్ని ప్రకటించారు.

“సోదరులారా! ఇక ఇక్కడుండటం మనకు మంచిదికాదు, పదండి అంటూ చరచరా వెళ్ళిపోయాడు. ఆ తర్వాత ఇతరులు కూడా ఒక్కక్కరే లేచి వెళ్ళిపోయారు.

ఎన్నో విషయాలు చెప్పాలనుకున్న దైవప్రవక్త (స) ఏమీ చెప్పలేక నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయారు. కాని ఏనాటికైనా బంధువులు తన సందేశం విని సన్మార్గం అవలంబిస్తారన్న ఆశతో ఆయన సహనం వహించారు.

కొన్నాళ్ళ తరువాత దైవప్రవక్త (సల్లం) మళ్ళీ విందు ఏర్పాటుచేసి బంధువుల్ని పిలిచారు. బంధువులంతా వచ్చి భోజనాలకు కూర్చున్నారు. భోజనాలు ముగిసిన వెంటనే దైవప్రవక్త (స) లేచి ఇలా మాట్లాడారు:

“అబ్బాస్ బాబాయీ! ప్రవక్త మేనత్త సఫియా! ముహమ్మద్ కూతురు ఫాతిమా! పెదనాన్న అబూతాలిబ్! మీరంతా నరకాగ్ని నుండి తప్పించుకునే విషయం గురించి



ఆలోచించండి. నేను మిమ్మల్ని దేవుని పట్టు నుండి ఏ విధంగానూ కాపాడలేను. కావాలంటే నా ఆస్తి నుండి మీరు కోరినవాటిని అడిగి తీసుకోవచ్చు. నేను మీకు అంతవరకే సహాయం చేయగలను. పరలోకంలో మాత్రం నేను మీకు ఎలాంటి సహాయం చేయలేను.”

అబూతాలిబ్ ఈ మాటలు విని “నేను తరతరాల నుంచి వస్తున్న మన పెద్దల మతాన్ని వదలిపెట్టలేను. అయితే నీవు దేవుడు ఆదేశించినదాన్ని నిరభ్యంతరంగా కొనసాగించు. నీకు నా మద్దతు పూర్తిగా ఉంటుంది” అన్నారు.

అబూతాలిబ్ మాటలు విని అబూలహబ్ వస్తున్న కోపాన్ని మింగలేక, కక్కలేక విలవిల్లాడి పోయాడు. ఈ విందు సందర్భంగా బంధువుల్లో కొత్తగా ఎవరూ ఇస్లాం స్వీకరించక పోయినా అబూతాలిబ్ మాట దైవప్రవక్త (స)కు కొంత ఊరడింపు ఇచ్చింది.

ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఇలా అన్నారు:

“నా ప్రియ బంధువులారా! నాగురించి నా బాల్యం నుండీ మీకందరికీ తెలుసు. నేను ఎలాంటి పరిస్థితిలోనూ అబద్ధమాడనని కూడా మీకు తెలుసు. ఇప్పుడు కూడా నేను నిజమే చెబుతున్నాను. దైవసాక్షిగా చెబుతున్నాను. నేను దేవుని ప్రవక్తను. దేవుడు నన్ను తన ప్రవక్తగా నియమించి మీ దగ్గరకు పంపాడు. నేను మీ దగ్గరకు సత్యధర్మం తీసుకొచ్చాను. మీ కోసం ఇంతకంటే గొప్పసందేశం పూర్వం అరేబియాలో ఎవరూ తీసుకు రాలేదు. నేను మీ దగ్గరకు ఉభయ లోకాల శ్రేయస్సు తెచ్చాను. దేవుడు మిమ్మల్ని తన మార్గం వైపు పిలవమని నన్నాదేశించాడు. నేను మీ సహకారం కోరుతున్నాను. మరి ఈ మహాకార్యంలో నాకు తోడ్పడే వాళ్ళు మీలో ఎవరైనా ఉన్నారా? నా తదనంతరం కూడా ఈ పనిని నిర్విఘ్నంగా కొనసాగించే వాళ్ళు మీలో ఎవరైనా ఉన్నారా?”

దైవప్రవక్త (సల్లం) ఇలా మాట్లాడిన తరువాత ఓసారి అందరినీ కలియజూశారు. ఎవరి అంతరాత్మ విశ్వాసం వైపు మొగ్గుతుందో, ఎవరి హృదయకవాటాలు ఇస్లాం జ్యోతి కోసం తెరుచుకుంటాయో, ఎవరు ధర్మసంస్థాపన కోసం నడుంబిగించి ముందుకొస్తారో అని ఆయన ఎదురుచూడసాగారు. కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడిచాయి.

కాని ఏ ఒక్కరూ పెదవి విప్పలేదు. అందరూ బెల్లం కొట్టిన రాళ్ళలా కళ్ళప్పగించి చూడసాగారు. కొందరు ఇవేవో పిచ్చివాడి పలుకులు అనుకొని ఆయన వైపు తెగ ఆశ్చర్యపోతూ చూడసాగారు. మరికొందరు అయిష్టంగా ముఖం తిప్పుకొని లేచి వెళ్ళిపోవడానికి సిద్ధమయ్యారు.

అంతలో ఒక బాలుడు లేచి నిలబడ్డాడు. ఆ బాలుడికి మహాఉంటే పన్నెండేళ్ళు ఉంటాయేమో! పొట్టిగా, బక్కచిక్కిన దేహంతో పీలగా ఉన్నాడు. అయితేనేం, పిడుగు!

“దైవప్రవక్తా! నేను మీకు తోడ్పడతాను. మీరు తలపెట్టే ఈ మహాకార్యంలో సహాయం చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను” అన్నాడా అబ్బాయి.

ఈ మాటలు వినగానే సభికులంతా ఒక్కసారిగా బాలుని వైపు సంభ్రమాశ్చర్యాలతో చూడసాగారు. కొంతమంది హేళనగా వికటాట్టహాసం చేశారు.

"నిన్నగాక మొన్న కళ్ళు తెరచిన ఈ కుఱ్ఱకుంక ముహమ్మద్‌కు తోడ్పడతాడట!" నవ్వులతో ఇల్లు ప్రతిధ్వనించింది.

"అబూతాలిబ్! ఇప్పుడు నీవు నీతమ్ముడు కొడుకుని అనుసరిస్తావా లేక నీ సొంత కొడుకు (అలీ)ని అనుసరిస్తావా?" అంటూ కొందరు అబూతాలిబ్‌ని చూసి హేళన చేస్తూ లేచి వెళ్ళిపోయారు. ఆ తర్వాత మిగిలినవాళ్ళు కూడా ఒక్కొక్కరే మెల్లిగా జారుకున్నారు.

దైవప్రవక్త (సల్లం) బంధువుల మూర్ఖత్వం, వ్యతిరేకతలను చూసి నిరాశచెందలేదు. బాలుడైనా అలి మాటలు ఆయనకు కొండంత ధైర్యం కలిగించాయి.

ఇలా దైవసందేశాన్ని బంధువులకు అందజేసే బాధ్యత ఎలాగో నెరవేరింది. ఇక దాన్ని బయటి జనానికి కూడా అందజేయవలసిన పని మిగిలిఉంది. దాని కోసం ఏం చెయ్యాలి, ఎలా అందజేయాలి? దైవప్రవక్త (స) ఇలా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చారు.

## సఫాకొండ పైనుండి దైవప్రవక్త పిలుపు-(30)

మరునాడు యథాప్రకారం ఉదయ కాంతులతో మక్కా పట్నం మేల్కొన్నది. పట్నం వెలుపల సఫా కొండలు సూర్యుని సువర్ణ రేఖలతో వింత శోభ వెదజల్లుతున్నాయి. ప్రజలు దైనందిన కార్యకలాపాలలో తిరిగి నిమగ్నులవుతున్నారు. అంతలో.....

సఫా కొండల వైపు నుంచి హృదయాన్ని కలచివేసే ధ్వనితో "ఖురైషీయులారా! ఖురైషీయులారా!!" అనే ఓ పొలికేక విన్పించింది.

ఈ కేక విని జనం ఉలిక్కిపడ్డారు. ఏదో ఆపద ముంచుకొస్తోందని భయపడ్డారు. యుద్ధం తదితర ఆపదలకు సూచనగా కొండెక్కి గావుకేకలు పెట్టడం అక్కడి పురాతన ఆచారం. అందువల్ల ఈ కేకలు విని ప్రజలు ఆందోళన చెందారు.

"ఇదేదో అపశకునంలా ఉంది" అన్నారు కొందరు.

"ఎవరిదీ కంఠం?" ఒకతను అడిగాడు.

"ఇది ముహమ్మద్ (సల్లం) కంఠస్వరం. ఏదో ప్రమాదం వచ్చిపడి ఉంటుంది. పదండి, ఏమిటో అది తెలుసుకుందాం" అన్నాడు మరొకతను.

ఆ తరువాత కొన్ని క్షణాల్లోనే అనేకమంది సఫాకొండ దగ్గరకు చేరుకున్నారు.

"ఏవిటీ ముహమ్మద్! ఏమిటీ విశేషం?" అడిగాడు ఒకతను గుంపులో నుంచి.

"ముందు నాకీ సంగతి చెప్పండి. ఈకొండ వెనుక నుంచి శత్రుసైన్యం మక్కాపై దాడిచేయడానికి వస్తోందని నేనంటే మీరు నమ్ముతారా?" అన్నారు ముహమ్మద్ (స).

"ఎందుకు నమ్మం, తప్పక నమ్ముతాం. నువ్వెప్పుడూ అబద్ధమాడినట్లు మేము విన లేదు. పైగా నీవు కొండమీద నిలబడి దాని వెనుక వైపున్న దృశ్యం కూడా చూడగలుగు తున్నావు. మేము కొండ ముందు దిగువభాగాన నిల్చున్నాం. చెప్పు ఏమిటో ఆ విషయం." అన్నారు ప్రజలు.



"అయితే ఆత్మీయులారా! నేను అతి భయంకరమైన ఒక శిక్ష గురించి మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను. అది ముంచుకొస్తోంది. నేనిప్పుడు ఈ కొండకు ఆవల ఉన్నదంతా ఎలా చూస్తున్నానో అలాగే ఈ ప్రమాదాన్ని కూడా చూస్తున్నాను. సోదరులారా! దేవుని ఆగ్రహం నుండి తప్పించుకోండి. భయంకరమైన నరకాగ్ని నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోండి. ప్రళయం రోజు దేవుడు ఆగ్రహించి మిమ్మల్ని నరకాగ్నిలో పడవేయదలిస్తే నేను మిమ్మల్ని ఏమాత్రం రక్షించలేను. నరకాగ్ని నుండి తప్పించుకోవాలంటే ఒకే ఒక మార్గం ఉంది. మీరంతా దేవుడు ఒక్కడే అని విశ్వసించండి. నన్ను ఆయన ప్రవక్తగా అంగీకరించండి" అంటూ దైవప్రవక్త (సల్లం) జనానికి హితోపదేశం చేశారు.

కాని ఈ మాటలు వినగానే అబులహబ్ కోపంతో కస్సుమన్నాడు. "నీ పాడుగాను, ఇందుకా నువ్వు మమ్మల్ని పిలిచింది!" అంటూ నానా మాటలతో అక్కసు వెళ్ళ బోసుకొని, విసవిస లాడుతూ వెళ్ళిపోయాడు.

ఆ తరువాత ప్రజలు కూడా తలా ఒకవిధంగా వ్యాఖ్యానించుకుంటూ ఒక్కొక్కరే అక్కడ్నుంచి మెల్లిగా జారుకున్నారు. చివరికి దైవప్రవక్త (స) ఒక్కరే ఏకాకి అయి కొండమీద నిల్చుండిపోయారు.

దైవమార్గంలో ఇలాంటి అవరోధాలు సహజమే. అంచేత ఆయన అధైర్యం చెందలేదు. ఆశయసాధనలో ఒక్కొక్క అడుగేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. దానివల్ల విరోధుల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది.

ఇస్లాం యథాప్రకారం తన ఉద్యమ కిరణాలను సమాజం మీద ప్రసరింపజేస్తూ పోతోంది. దైవప్రవక్త (సల్లం) ధర్మప్రచారం చేయడంతో పాటు, కొత్తగా ఇస్లాం స్వీకరిం చినవారికి శిక్షణ కూడా ఇస్తున్నారు. దీనికోసం ఆయన సహచరుల్ని తన ఇంటికో, లేదా అర్ఖం ఇంటికో తీసికెళ్తారు. అక్కడ ఆయన వారికి ఖుర్‌ఆన్ సూక్తులు విన్పిస్తారు. చదవడం, రాయడం వచ్చినవారు వెంటనే ఖుర్‌ఆన్ సూక్తులు రాసుకునేవారు. తరువాత వాటిని కంఠస్థం చేసుకొని తమ భార్యాపిల్లలకు, బంధువులకు కొత్తగా ఇస్లాంలో చేరిన ముస్లిం లకు బోధించేవారు.

ఈ విధంగా ముస్లింల సంఖ్య క్రమక్రమంగా పెరిగిపోతోంది. కాని బహుదైవా రాధకులు ఇస్లాం ధర్మాన్ని ఇంకా వింతగానే చూస్తున్నారు. పైగా దాన్ని నవ్వులాటగా, వేళాకోళంగా చేసి కొట్టి పారేస్తున్నారు. బహుదైవారాధనకు వ్యతిరేకంగా ఎలాంటి మాటా వినడానికి సిద్ధంగా లేరు. కొందరయితే "ఇతనో పిచ్చివాడు, ఈ పిచ్చివాడితో ఎందుకొచ్చిన చిక్కు" అనుకుంటూ వెళ్ళిపోయేవారు. బహుదైవారాధకులు ప్రవక్త అనుచరుల్ని కూడా పిచ్చివాళ్ళుగా, తాత్కాలిక ఆవేశానికి లోనైనవాళ్ళుగా భావించసాగారు.

"వీళ్ళు ముహమ్మద్ (స)ని పట్టుకొని పిచ్చివాళ్ళుగా తిరుగుతున్నారు. అదే పిచ్చిలో పడి తమ పురాతన మతాన్ని వదులుకున్నారు. కాని ఈ మైకం ఎంతకాలం ఉంటుంది? మూన్నాళ్ళ ముచ్చటే. ఉద్రేకం కాస్తా చల్లారితే మళ్ళీ మామూలే. తిరిగి తాతముత్తాతల మతాన్నే ఆశ్రయించక తప్పదు." ఇవీ బహుదైవారాధకుల అభిప్రాయాలు!

# అవిశ్వాసుల ఆగడాలు-(31)

కాబా గృహం కేవలం ఏకేశ్వరారాధన కోసం ఇబ్రాహీం ప్రవక్త (అలైహి), ఆయన కుమారుడు ఇస్మాయీల్ (అలైహి) కలసి నిర్మించిన దేవాలయం. కాని ప్రజలు ఈ వాస్తవాన్ని విస్మరించి అక్కడ విగ్రహాలు ప్రతిష్ఠించి పూజించసాగారు. ఇప్పుడు అంతిమ దైవప్రవక్తగా మహనీయ ముహమ్మద్ (స) దాన్ని ఏకేశ్వరాలయంగా పునరుద్ధరించడానికి నడుం బిగించారు. దాని కోసం ఆయన నమాజు వేళల్లో కాబాలయానికి వెళ్ళి నమాజ్ చేయడం ప్రారంభించారు. నమాజు ముగిసిన తరువాత అవకాశం లభిస్తే ప్రజలకు దైవసందేశం విన్పించడానికి కూడా ప్రయత్నించేవారు.

అయితే బహుదైవారాధకులు దాన్ని సహించేవారు కాదు. దైవప్రవక్త (సల్లం)ను అసహ్యించుకునేవారు. కొందరు దూషణలకు కూడా పాల్పడేవారు. చివరికి ఓరోజు వారు ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించి "అవకాశం లభించినప్పుడల్లా ముహమ్మద్ (సల్లం)ని, ఆయన అనుచరుల్ని వేధించాలి" అని ఏకగ్రీవంగా తీర్మానించారు. మరుసటి రోజు నుంచే ఆ తీర్మానాన్ని అమలు పరచడం ప్రారంభించారు.

ఒకరోజు దైవప్రవక్త (సల్లం) విశ్వప్రభువు నిర్దేశించిన పద్ధతి ప్రకారం కాబాలయంలో ప్రార్థన (నమాజ్) చేయసాగారు. ఖురైషీయులు ఈ పద్ధతి చూసి ముఖం చిట్లించు కున్నారు. అబుజహల్ అయితే భగ్గుమన్నాడు.

అతను దిగ్గున లేచి "ముహమ్మద్ గనక ఇలా ప్రార్థన చేయడం చూస్తే నేనతని మెడ మీద కాలుపెట్టి తొక్కుతానని ప్రమాణం చేశాను. చూడండి నా తడాఖా!" అన్నాడు.

అనడం ఏమిటీ, ఒక్క ఉదుటన ముందుకు పోయాడు. మరో రెండు అంగలు వేసి ఎందుకో ఠక్కున ఆగిపోయాడు. మరుక్షణం ముఖానికి చేతులు అడ్డం పెట్టుకొని వెనక్కి జరగసాగాడు. ఆ తరువాత రొప్పుతూ వెనక్కి తిరిగి సహచరుల దగ్గరికి వచ్చాడు. సహచరులు అతని వాలకం చూసి నిర్ఘాంతపోయారు.

"అబూజహల్! ఏమయింది తిరిగొచ్చావు? పెద్ద కోతలు కోశావే ఏదో చేస్తానని" అన్నారు వారు అతడ్ని హేళనచేస్తూ.

"చేసేవాడ్ని. కాని ముహమ్మద్‌కు, నాకు మధ్య అకస్మాత్తుగా పెద్ద అగ్నిగుండం ఏర్పడింది. రెక్కలతో కూడిన ఓ భయంకరమైన ఆకారం కూడా కన్పించింది" అన్నాడు అబూజహల్ చెమట తుడుచుకుంటూ.

ఈ సంఘటన గురించి దైవప్రవక్త (సల్లం) ఆ తరువాత తన అనుచరుల ముందు ప్రస్తావిస్తూ "అబూజహల్ గనక ఇంకాస్త ముందుకు వచ్చివుంటే దైవదూతలు అతడ్ని ముక్కలు ముక్కలుగా చీల్చి చెండాడేవారు" అని చెప్పారు.

దైవప్రవక్త (స) మరోసారి కాబాలో నమాజ్ చేస్తుంటే అబూజహల్ మండిపడ్డాడు.

"ముహమ్మద్! ఈ విధంగా ప్రార్థన చేయవద్దని నేను నీకు ఎన్ని సార్లు చెప్పాను?" అన్నాడతను ఉరిమిచూస్తూ.



"నువ్వేంటి చెప్పేది నాకు? నేను నా ప్రభువాజ్ఞ శిరసావహిస్తున్నాను" అన్నారు దైవప్రవక్త (సల్లం) విదిలించి మాట్లాడుతూ.

"ఎంత ధైర్యం! ఎవరి అండ చూసుకొని ఇలా మాట్లాడుతున్నావు? దైవసాక్షి! ఈ పట్టణంలో అందరికంటే నాకే ఎక్కువ మద్దతుదారులున్నారు, తెలుసా?" అన్నాడు అబూజహల్ తన అంగబలం చూసుకొని విర్రవీగుతూ.

అప్పుడు ఈవిధంగా దైవసందేశం అవతరించింది:

"ఒక దాసుడు ప్రార్థన చేస్తుంటే అతడ్ని నిరోధిస్తున్నవాడ్ని నీవు చూశావా? (ఆ దాసుడు) సన్మార్గంలో ఉంటే లేదా దైవభీతి విషయమయి (ప్రజలకు) ఉపదేశిస్తుంటే, దాన్ని గురించి నీ అభిప్రాయం ఏమిటీ? (అతడ్ని నిరోధిస్తున్న వ్యక్తి) సత్యాన్ని నిరాకరించి ముఖం తిప్పుకుంటే, దాన్ని గురించి నీ అభిప్రాయం ఏమిటీ? దేవుడు (ఇదంతా) గమనిస్తున్నాడని అతనికి తెలియదా? (అతను ఎంత బెదిరించినా ఆ దాసునికి నష్టంకలిగించే శక్తి అతనికి) ఏమాత్రం లేదు. ఆ పాపాత్ముడు పచ్చి అబద్ధాలకోరు. (ఈ చేష్టలు) మానుకోకపోతే మేమతని ముంగురులు పట్టి ఈడుస్తాము. అతను తన మద్దతుదారుల మూకను పిలుచుకోమను. మేము కూడా మా నరక దూతలను పిలుస్తాము. వద్దు. అతని మాట వినవద్దు. సాష్టాంగపడి నీ ప్రభువు సాన్నిధ్యం కోసం కృషి చెయ్యి." (ఖుర్‌ఆన్. 96:9-19)

ఖురైష్ నాయకులు కాబాలో సమావేశమయి దైవప్రవక్త (సల్లం)కు వ్యతిరేకంగా మంతనాలు జరపడంలో నిమగ్నులైపోయారు.

"ముహమ్మద్ వ్యవహారంలో ఇప్పటిదాకా మనం ఎంతో సహనం వహించాము. అతను మనల్ని వాజమ్మల కింద జమకట్టాడు. మన తాతముత్తాల్ని సైతం తూలనాడు తున్నాడు. మన మతాన్ని, మన దేవతల్ని మాటిమాటికి విమర్శిస్తున్నాడు. అలాంటివాడ్ని మనం చూస్తూ ఊరుకోవడమేనా?" అన్నాడు ఒక నాయకుడు.

కాస్సేపటికి దైవప్రవక్త (సల్లం) కాబాలో ప్రవేశించారు. ఆయన కాబా ప్రదక్షిణ చేసిన తరువాత విగ్రహపూజ, బహుదైవారాధనల్లోని చెడుల్ని ఎత్తిచూపుతూ ఏకేశ్వరోపాసన గురించి వివరించడం ప్రారంభించారు.

ప్రాపంచిక ప్రయోజనాలే పరమావధిగా పెట్టుకున్న బహుదైవారాధకులు ఏకేశ్వర వాదాన్ని ఎలా సహిస్తారు? వారాయన్ని ఉరిమి చూస్తూ పిడికిళ్ళు బిగించారు. ఉఖ్బా బిన్ అబీ అయితే తోకతొక్కిన పాములా కస్సున లేచి ఒక్క ఉదుటున దైవప్రవక్త (స)ను సమీపించాడు. ఆ మహనీయుని మెడలో తుండుగుడ్డ వేసి లాగుతూ గొంతు నులమడా నికి ప్రయత్నించాడు.

అదే సమయంలో హజ్రత్ అబూబకర్ (రజి) యాదృచ్ఛికంగా అక్కడికొచ్చారు. ఆయన ఈ దృశ్యం చూసి మెరుపువేగంతో ఉఖ్బా మీద లంఘించారు. అతడ్ని ఒక్క తోపుతో పక్కకు నెట్టివేశారు. ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) మెడలోని తుండుగుడ్డను తీసేస్తూ "ఏమిటి ఈ అన్యాయం? మీరు నా ప్రభువు అల్లాహ్ అన్నంత మాత్రానికే ఒక మనిషిని చంపడానికి ఒడిగట్టారా!" అన్నారు ఎంతో బాధాతప్త హృదయంతో.

అప్పుడు ఖురైషీయులు పళ్ళు పటపట నూరుతూ ఒక్కసారిగా అబూబకర్ (రజి) మీద విరుచుకుపడ్డారు. ఈ రభస చూసి కాబాలోని ఇతరులు కూడా గుమికూడారు. హజ్రత్ అబూబకర్ (రజి) అంతమంది ఖురైషీయుల్ని ఎలా ఎదుర్కోగలరు? ఆయన కాస్సేపు పెనుగులాడారు. అంతలో జనసమూహంలోని కొందరు పుణ్యాత్ములు కలగ జేసుకొని ఎలాగో ఆయన్ని విడిపించారు.

కాని మక్కా ఖురైషీయులు అవకాశం లభించినప్పుడల్లా దైవప్రవక్త (సల్లం)ను ఏదో విధంగా వేధిస్తూనే ఉన్నారు. ఓ రోజు ఖురైష్ నాయకులు అబుజహల్ ఇంట్లో సమావేశమయి ఈ విషయాన్ని గురించే మాట్లాడుకుంటున్నారు.

కాస్సేపటికి ఓ పిల్లవాడు వచ్చాడు. చినిగిన దుస్తులతో, తైలసంస్కారంలేని జుట్టుతో, బక్కచిక్కిన శరీరంతో ఉన్న ఆ అబ్బాయి పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. అతను పరమ కర్కోటకుడైన అబూజహల్ సంరక్షణలో పెరుగుతున్న అనాథబాలుడు.

అతను అబూజహల్ దగ్గరకొచ్చి తన తండ్రి వదలిపోయిన ఆస్తిలో కొంత తనకివ్వ మని ప్రాధేయపడ్డాడు. కాని ఆ దుర్మార్గుడు ఆ పిల్లవాడి వైపు కన్నెత్తి కూడా చూడలేదు. పిల్లవాడు చాలాసేపు నిలబడి నిరాశానిస్పృహలతో అక్కడ్నుంచి వెనుతిరిగాడు.

అప్పుడా సమావేశంలో కూర్చున్న ఖురైష్‌నాయకుల్లో కొందరు "నీవు ముహమ్మద్ (సల్లం) దగ్గరికెళ్ళి ఫిర్యాదు చెయ్యి; అతను సిఫారసు చేసి అబూజహల్ నుంచి నీ ధనం ఇప్పిస్తాడు" అని చెప్పారు ఆ బాలుడితో.

ఈ మాటలు విని ఆ అబ్బాయి అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు. అతనలా బయటికి వెళ్ళగానే సమావేశంలో కూర్చున్న ఖురైష్ నాయకులు పకపక నవ్వుకుంటూ, ఇక చూడండి తమాషా! అని చెప్పుకున్నారు పరస్పరం.

ఆ పిల్లవాడు నేరుగా దైవప్రవక్త (సల్లం) దగ్గరికెళ్ళి తన గోడు చెప్పుకొని, సహాయం చేయమని బ్రతిమాలాడు. దైవప్రవక్త అప్పటికప్పుడు లేచి ఆ బాలుడ్ని వెంటబెట్టుకొని అబూజహల్ ఇంటికి వెళ్ళారు.

దైవప్రవక్త (సల్లం) వెళ్ళి తలుపు తట్టగానే అబుజహల్ లేచి తలుపు తీశాడు. కాని గుమ్మం ముందు దైవప్రవక్త (సల్లం)ను చూడగానే క్షణంపాటు నివ్వెరపోయాడు.

"అబూల్ హకమ్! ఈ అబ్బాయికి రావలసిన హక్కు తక్షణమే ఇచ్చెయ్యి" అన్నారు దైవప్రవక్త (సల్లం) గంభీర స్వరంతో.

అబూజహల్ కిక్కురుమనకుండా వెంటనే మంత్రముగ్ధుడిలా లోపలికెళ్ళి ఆ బాలుడి పైకం తీసుకొచ్చి అతనికిచ్చి వేశాడు.

ఏదో పెద్ద రభస జరుగుతుందనుకున్న ఖురైష్ నాయకులు ఈ విచిత్ర వ్యవహారం చూసి ఆశ్చర్యపోయారు.

"చివరికి నువ్వు కూడా నీ ధర్మాన్ని వదిలిపెట్టావన్న మాట!" అని అన్నారు వారు అబూజహల్‌ని ఎత్తిపొడుస్తూ.



"దైవసాక్షి! నేను నా ధర్మం వదలిపెట్టలేదు. కాని ముహమ్మద్ (సల్లం)ని చూడగానే ఆయన కుడిఎడమల వైపు ఏవో రెండు భయంకరమైన ఆయుధాలు ఉన్నట్లు, నేనతని అభిమతానికి వ్యతిరేకంగా ఏమాత్రం ప్రవర్తించినా అవి నా దేహంలో దిగబడిపోతాయన్నట్లు అన్పించింది నాకప్పుడు" అన్నాడు అబూజహల్ చెమట తుడుచుకుంటూ.

++++++++

మక్కా నుండి కొన్ని మైళ్ళ దూరంలో ఉన్న ఒక విశాలమైన మైదానం వేలాది జనంతో నిండిపోయింది. వందలాది దుకాణాలు వివిధ సరుకులతో ప్రజల్ని ఆకట్టు కుంటున్నాయి. కొన్ని చోట్ల గానకచేరీలు, కవిసమ్మేళనాలు జరుగుతున్నాయి. అక్కడ శ్రోతలు సంగీత మాధుర్యం, కవితాఝురులతో పరవశించిపోతున్నారు. గుర్రప్పందాలు, కుస్తీపోటీలు కూడా జోరుగా సాగుతున్నాయి. పోయే జనం పోతుంటే, వచ్చే జనం తెంపులేకుండా వస్తున్నారు.

ఆ జనం మధ్య మహాప్రవక్త ముహమ్మద్ (స) "సోదరులారా! అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యదైవం లేడని చెప్పండి, మీకు మోక్షం లభిస్తుంది" అంటూ బిగ్గరగా చాటుతున్నారు.

ఈ కొత్త నినాదం వినగానే అనేకమంది ప్రజలు ఆయన చుట్టూ గుమిగూడారు.

ఆ గుంపు నుంచే ఒకతను ముందుకు దూసుకొచ్చి "ప్రజలారా! ఇతని మాటలు వినకండి. ఇతను అబద్ధాలరాయుడు. అనాదిగా వస్తున్న తాతముత్తాల మతం వదలేసి భ్రష్టుడైపోయాడు" అన్నాడు.

అతని మాటలు వినగానే మరొకతను ముందుకొచ్చి "ముహమ్మద్! నీ గురించి నీ పెదనాన్నే ఇలా చెబుతుంటే, మేము నీమాటలు ఎలా నమ్మాలి? అదీగాక మీ పెద్దనాన్న అబూలహబ్ ఖురైష్‌నాయకుల్లో గొప్పవాడు. వయసులో నీకంటే పెద్దవాడు, అనుభవజ్ఞుడు కూడా. అలాంటి పెద్దమనిషి చెప్పే మాటలే నిజంకావచ్చు" అన్నాడు.

ఈ మాటలు వినగానే జనం ఒక్కొక్కరే జారుకున్నారు. దైవప్రవక్త (సల్లం) వెళ్తున్న జనం వైపు చూస్తూ ఒంటరిగా నిల్చున్నారు.

దైవప్రవక్త (సల్లం) అక్కడ్నుంచి మరోచోటికి పోయి "ప్రజలారా! నేను మీకు సన్మార్గం చూపడానికి దేవుని తరపున నియమించబడిన ప్రవక్తను. కనుక మీరు ఒక్క దేవుడ్ని మాత్రమే ఆరాధించండి. ఆయన దైవత్వంలో మరెవరికీ సాటి కల్పించకండి. ధర్మస్థాపన కృషిలో నాకు చేయూత ఇవ్వండి" అన్నారు బిగ్గరగా.

"సోదరులారా! ఇతని మాటలు నమ్మకండి. లాత్, ఉజ్జా దేవతల్ని వదిలేసి మనల్ని అపమార్గంలో పడవేయజూస్తున్నాడు" అన్నాడు అబూలహబ్ తక్షణమే రాక్షసుడిలా దైవప్రవక్త (సల్లం) వెంటబడి.

ఆ తర్వాత అతను వెనుక నుంచి రాళ్ళు విసరడం కూడా మొదలెట్టాడు. కొన్ని రాళ్ళు తగిలి దైవప్రవక్త (సల్లం) కాళ్ళు రక్తసిక్తం అయ్యాయి. ఈ వ్యవహారం చూసి జనం మనకెందుకులే ఈ గొడవ అనుకుంటూ వెళ్ళిపోతున్నారు.

దైవప్రవక్త (సల్లం) అక్కడ్నుంచి మౌనంగా నడుచుకుంటూ మరోచోటికి వెళ్తున్నారు.

"అదిగో చూడండి, ముహమ్మద్ వెళ్తున్నాడు. దేవుడు అతడ్ని ప్రవక్తగా నియమించి పంపాడట!! ఆకాశం నుండి దైవదూతలు దిగివచ్చి ఈయనగారికి దైవసందేశం అంద జేస్తున్నారట!!!" అన్నాడు ఒకతను ఓ చిన్న గుంపులో కూర్చొని.

"మరి అతని సమావేశంలో మీకెప్పుడైనా ఒక్క దైవదూతయినా కన్పించాడా?"

"అతని పక్కన ఒక్క దైవదూత కన్పడ్డా చాలు, నేను వెంటనే అతను ప్రచారం చేస్తున్న ధర్మం స్వీకరిస్తాను."

"నేను మాత్రం స్వయంగా దేవుడు దిగివచ్చి 'ఉత్‌బా! ఇతను నా ప్రవక్త, ఇతని మాటలు విను' అని నాకు చెప్పనంతవరకు నేను ఇతడ్నిససేమిరా నమ్మను" అన్నాడు ఉతబా విర్రవీగుతూ.

"మీరిద్దరికీ అసలు ఏమీ తెలీదు. ఇతను పెద్ద మాంత్రికుడు. తన మంత్రవిద్యతో మీకు దైవదూతల్ని చూపించినా ఆశ్చర్యం లేదు" అన్నాడు ఉమయ్యా బిన్ ఖల్ఫ్.

"అతను నిజంగా దైవప్రవక్త అయితే అతని ముందూ వెనుకా, కుడిఎడమల వైపు సాయుధ భటులుండాలి కదా! ఏరీ? పోనీ ఇంట్లో వెండిబంగారాలు, బయట పొలాలు, తోటలయినా ఉండాలి కదా! అవీ లేవు. ప్చ్!"

"అవేమీ లేవు గనకనే అతని చుట్టూ బానిసలు, తుచ్ఛులు, కూటికి గతిలేని వాళ్ళు మాత్రమే చేరారు. చూశారుగా?" అన్నాడు ఉఖ్బా.

ఆ వెనువెంటనే మిగిలినవారంతా విరగబడి నవ్వారు.

"ప్రవక్తా! ఒకవేళ మేము కాగితాలపై రాసిన గ్రంథాన్ని నీపై అవతరింపజేసినా, దాన్ని ఈ తిరస్కారులు చేత్తో తాకిచూసి కూడా విశ్వసించరు. పైగా వారు ఇదంతా ఏదో మంత్ర జాలం తప్ప మరేమీ కాదని వాదిస్తారు. అంతేకాదు, ఈ ప్రవక్తతోపాటు (అతని ప్రవక్తృత్వాన్ని ధృవపరిచేందుకు) ఒక దైవదూతను ఎందుకు దించలేదు? అని కూడా అంటారు.

ఒకవేళ మేము దైవదూతల్ని దించివుంటే ఈపాటికి ఎప్పుడో (వారి) వ్యవహారం తేలి పోయిఉండేది. వారికి ఎలాంటి అవకాశమిచ్చేవారం కాము. మేము దైవదూతను అవతరింప జేయవలసివస్తే అతడ్ని మానవాకారంలోనే అవతరింపజేస్తాము. వారిప్పుడు ఎలా అను మానంలో పడిఉన్నారో అప్పుడు కూడా అనుమానంలోనే పడిపోతారు. ప్రవక్తా! నీకు పూర్వం కూడా (ఈ లోకం) అనేకమంది ప్రవక్తలను ఎగతాళి చేసింది. అయితే చివరికి వారు ఎగతాళిచేసిన విషయమే వారిని ముంచేసింది. వారిని కాస్త ప్రపంచంలో పర్యటించి చూడమని చెప్పు, సత్యతిరస్కారులకు ఏం గతిపట్టిందో." (ఖుర్‌ఆన్-6:7-11)

# దైవమార్గంలో తొలి ప్రాణత్యాగం-(32)

ఒకసారి మక్కా బహుదైవారాధకులు కాబాలో విగ్రహాల ముందు సాష్టాంగపడుతూ వేడుకుంటున్నారు. అదే సమయంలో దైవప్రవక్త (స) అటుగా రావడం జరిగింది. ఆయన



ఈదృశ్యం చూసి సహించలేకపోయారు. వారిని చూస్తుంటే ఆయనకు జాలి కూడా కలిగింది. అమాయకులైన ఈ బహుదైవారాధకులను ఎలాగైనా విగ్రహపూజ దౌష్ట్యం నుండి కాపాడా లని, అవమానకరమైన ఈచేష్టల నుండి వారిని రక్షించాలని అనుకున్నారు. ఆ తర్వాత ఆయన ఆవేదనాపూరిత కంఠంతో హృదయాల్ని కదిలించేలా ఇలా ఉపదేశించారు:

"ఖురైష్ ప్రజలారా! మీరు మన తాత ఇబ్రాహీం (అలైహి) ధర్మాన్ని వదిలేసి ఎందుకూ పనికిరాని, ఎలాంటి సహాయం చేయలేని విగ్రహాలను పూజిస్తున్నారా? ఎంత శోచనీయం! యావత్తు సృష్టిలోనే మహోత్కృష్టుడయిన మానవుడికి ఈ సృష్టిపూజ ఎంత అవమానకరం!! సృష్టికర్త, సర్వేశ్వరుడైన అల్లాహ్‌కు ఈ చేష్టలు ఎంత అయిష్టమో ఆలోచించండి."

సత్యశీలుడు, నిజాయతీపరుడయిన ముహమ్మద్ (స) బోధించిన హితవాక్యాలు వారికి ఏమాత్రం చెవికెక్క లేదు. పైగావారు తమ కాల్పనిక పూజాపురస్కారాలకు, కల్పిత మతాచారాలకు హేతువులు చూపసాగారు.

"మేము విగ్రహాలను లాంఛనప్రాయంగా మాత్రమే పూజిస్తున్నాం. నిజానికి మా ఆరాధన, అభిమానాల కేంద్రం అల్లాహ్ మాత్రమే. ఈ విగ్రహాలు ఆయన ప్రసన్నత, సాన్నిధ్యాలు పొందడానికి ఏర్పాటు చేసుకున్న సాధనాలు మాత్రమే" అన్నారు వారు. "మీకు నిజంగా సర్వేశ్వరుడైన అల్లాహ్ మీద భక్తి ప్రేమలుంటే నామాట విని నన్ను అనుసరించండి, నేను మీకు సన్మార్గం చూపుతాను. అల్లాహ్ కూడా మిమ్మల్ని ప్రేమిస్తాడు" అంటూ దైవప్రవక్త (సల్లం) మరోసారి వాళ్ళను ఇస్లాం వైపు పిలిచారు.

కాని ఆయన పలుకులు విని బహుదైవారాధకులు ఈసడించుకున్నారు. పైగా వారు మరింత రెచ్చిపోయి విరోధులయి పోయారు.

"ముహమ్మద్ (స) మాటలు వినీవినీ చెవులు దిమ్మెక్కిపోయాయి. ఇలా ఎన్నాళ్ళు మనమితని చర్యల్ని సహించి ఊరుకుంటాం? ఇంతకాలం ఉపేక్షించడం వల్లే ముహమ్మద్ కథ ఇంతవరకొచ్చింది. ఇప్పుడతను మన బుర్రలనే మార్చడానికి ప్రయత్నిస్తున్నాడు. మనం సన్మార్గం తప్పామట! మన తాతముత్తాతలు కూడా సన్మార్గం తప్పినవాళ్లేనని అంటున్నాడు. ఇక ఎంతమాత్రం మనం ఊరుకోకూడదు" అన్నారు వారు.

సత్యసందేశాన్ని ప్రజలకు అందజేయాలన్న దైవాజ్ఞ ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (స) ఓరోజు కాబాలో నిలబడి 'అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దేవుడు లేడ'ని బహిరంగంగా ప్రకటించారు. దాంతో బహుదైవారాధకులు ఆగ్రహోదగ్రులై పోయారు. 'అపచారం! అపచారం' అంటూ పెద్ద రభసచేస్తూ ఆయన్ని చుట్టుముట్టారు.

అంతలో హజ్రత్ ఖదీజా (రజి) మాజీభర్త అబూహాలా ద్వారా జన్మించిన హారిస్ (రజి) ఈ గొడవ విని పరుగెత్తుకొచ్చారు. ఆయన జనసమూహాన్ని చీల్చుకుంటూ దైవప్రవక్త (సల్లం)ను రక్షించడానికి వచ్చారు. దాంతో బహుదైవారాధకులు మరింత రెచ్చిపోయి దైవప్రవక్త (సల్లం)ను వదలి హారిస్ (రజి) మీద విరుచుకుపడ్డారు. చూస్తుండగానే నలువైపుల నుంచి ఖడ్గాలు ఆయన మీద పడి రక్తసిక్తం చేశాయి. కాస్సేపటికే హజ్రత్ హారిస్ (రజి) రక్తపు మడుగులో పడి శాశ్వతంగా కన్నుమూశారు.

ధర్మరక్షణ కోసం జరిగిన కృషిలో ఇది మొట్టమొదటి ప్రాణత్యాగం. దైవమార్గంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల్లో హజ్రత్ హారిస్ బిన్ అబూహాలా (రజి) తొట్టతొలి అమరవీరునిగా చరిత్రలో నిలిచారు.

## ఉత్‌బా ప్రతిపాదన-(33)

ఖురైష్ నాయకులు తరువాత రూపొందించవలసిన పథకం గురించి సమాలోచనలు జరపడానికి కాబాలయంలో సమావేశమయ్యారు. ముందుగా ఒక నాయకుడు లేచి పరిస్థితి సమీక్షిస్తూ ఇలా ప్రసంగించాడు:

"ఇస్లాంను విశ్వసించేవారి సంఖ్య నానాటికి పెరిగిపోతోంది. వేగంతో విస్తరిస్తున్న ఇస్లాం ఉద్యమాన్ని ఎలా అరికట్టాలి? మనకు తలనొప్పిగా తయారైన ముహమ్మద్‌ను వదిలించుకునే మార్గం ఏమిటీ? అతని ప్రచారాన్ని కొనసాగనిస్తే ముమ్ముందు మనం నలుగురిలో తలెత్తుకొని తిరగలేం. కనుక ఇప్పుడు మన కర్తవ్యం ఏమిటో ఆలోచించండి."

ప్రసంగం ముగిసింది. అందరూ తరువాత చేయవలసిన పనిని గురించి ఆలోచనలో పడ్డారు. కాని ఏం చెయ్యాలో అర్థంకాక అందరూ తలలు పట్టుకున్నారు. ఇలా రెండు క్షణాలు సభలో నిశ్శబ్దం రాజ్యమేలింది. అంతలో ఉత్‌బా బిన్ రబియ్యా లేచి నిలబడ్డాడు. సభికులంతా ఒక్కసారిగా ఉత్‌బా వైపు దృష్టి సారించారు. ఈ సమస్యకు అతనేదయినా పరిష్కారం చూపిస్తాడన్న ఆశ చిగురించింది వారిలో.

"మిత్రులారా! మీరు ఒప్పుకుంటే నేను ముహమ్మద్‌తో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం ప్రయత్నించడానికి సిద్ధంగాఉన్నాను. అతని ముందు కొన్ని విషయాలు ఉంచుతాను. వాటిలో అతను ఏదో ఒకదాన్ని అంగీకరించవచ్చు. అప్పుడు ఈ బెడద శాశ్వతంగా తొలిగి పోతుంది ఏమంటారు?" అన్నాడు ఉతబా.

"ఆ... తప్పకుండా. అలాగే పోయి ఎలాగైనా నచ్చజెప్పి ఈ పీడ విరగడజెయ్యి" అన్నారు అందరూ ముక్త కంఠంతో.

ఉత్బా హుషారుగా లేచి కొంచెం దూరంలో కూర్చున్న ప్రవక్త (స) దగ్గరకు వెళ్ళాడు.

నాయనా ముహమ్మద్! నీవు ఎంత గొప్పవంశానికి చెందినవాడవో నీకు తెలుసు. నీపట్ల మాకున్న గౌరవాభిమానాలు కూడా నీకు తెలుసు. కాని నువ్వేమో మన జాతిపైకి పెద్ద ఆపద తెచ్చిపెట్టావు. సంఘాన్ని చీల్చి గందరగోళం సృష్టించావు. మొత్తం జాతినే మూర్ఖుల క్రింద జమకట్టావు. వాళ్ళ మతాన్ని, దేవతలను తూలనాడుతున్నావు. చనిపోయిన వారి తాతముత్తాల్ని మతభ్రష్టులుగా చేశావు. అంచేత నామాట విను. నేను నీ ముందు కొన్ని విషయాలు ఉంచుతాను. వాటిలో ఏదైనా నీకు నచ్చవచ్చు. దాంతో నీవు చేసే ఈ పని మానేస్తే అందరూ సంతోషిస్తారు" అన్నాడతను ఎంతో వాత్సల్యం ఉట్టిపడేలా!

"చెప్పండి మీరు చెప్పదలచుకున్నదేమిటో, వింటాను" అన్నారు దైవప్రవక్త (స).

"మన జాతిని విచ్ఛిన్నం చేయడం వల్ల నీకు ఒరిగేదేమీ లేదు. నీకు ధనం కావాలంటే చెప్పు. ఇప్పుడే నీ ముందు ధనరాసులు తెచ్చి నీవు మాఅందరికంటే గొప్ప ధనికుడయ్యేలా



చేస్తాం. లేక నీవు మాఅందరికీ నాయకుడు కాదలిస్తే, మేమంతా నిన్ను మా నాయకునిగా ఎన్నుకుంటాం. పోనీ, చక్రవర్తి కావాలనిఉందా? దానికీ మేము సిద్ధంగా ఉన్నాం. అప్పుడు నీ ప్రమేయం లేకుండా మేము ఏ నిర్ణయమూ తీసుకోము. నీ వాక్కునే మేము శాసనంగా పరిగణిస్తాం. ఒకవేళ నీకేదైనా పిశాచం పట్టి పీడిస్తుందేమో చెప్పు. పేరు మోసిన భూత వైద్యుల్ని రప్పించి దాని పీడ వదిలిస్తాం. నీక్షేమం కోసం, నీకు పూర్తిగా ఆరోగ్యం చేకూరే వరకు మేము ఎంత పైకం అయినా ఖర్చుపెడ్తాం" ఉత్బా ఏకధాటిగా చెప్పి ఊరుకున్నాడు, దైవప్రవక్త (సల్లం) సమాధానం కోసం ఎదురుచూస్తూ.

"అబూ వలీద్! అయిందా మీరు చెప్పటం? ఇంకేమయినా ఉందా?"

"లేదు, నేను చెప్పడం అయిపోయింది."

"ఇక నేను చెప్పేది కూడా కాస్త వినండి" అంటూ దైవప్రవక్త (సల్లం) ఖుర్‌ఆన్‌లోని హామీమ్ సూరా పఠించడం మొదలెట్టారు.

### కరుణామయుడు, కృపాసాగరుడైన దేవుని పేరుతో ప్రారంభం

"హామీమ్. ఇది కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని దగ్గర నుండి అవతరించిన దివ్యావిష్కృతి. విషయాలను స్పష్టంగా విడమరచి చెప్పే సూక్తులు గల గ్రంథం. ఇది (ఇంగిత)జ్ఞానం కలవారి కోసం వచ్చింది. ఇది అరబీ భాషలో ప్రోక్తమయిన ఖుర్‌ఆన్ (పాఠ్యగ్రంథం). (స్వర్గ)శుభవార్త అందజేసే, (దుష్పర్యవసానం గురించి) హెచ్చరించే మహోన్నత గ్రంథం ఇది.

కాని వారిలో చాలామంది దీనికి విముఖులయి పోతున్నారు. వినడానికి (కూడా) ముందుకు రావడం లేదు. పైగా "నీవు మమ్మల్ని ఏ విషయం వైపు పిలుస్తున్నావో దాని కోసం (మేము సిద్ధంగా లేము.) మా హృదయకవాటాలు మూసుకుపోయాయి; మా చెవులకు చెవుడొచ్చింది. మాకూ నీకూ మధ్య ఒక తెర అడ్డుపడింది. (అందువల్ల) నీవు నీ పనేదో చేసుకుపో, మేము మా పని చేసుకుపోతాం" అని అంటున్నారు. (1-5)

ప్రవక్తా! చెప్పు: "నేను మీలాంటి మానవుణ్ణే. కాకపోతే నాకు దివ్యావిష్కృతి ద్వారా మీ దేవుడు ఒక్కడేనని తెలియజేయబడుతోంది. కనుక మీరు ఆయన వైపుకే ఏకోన్ముఖులై ఉండండి. ఆయన్నే క్షమాపణ కోరుకోండి. పరలోకాన్ని తిరస్కరించి జకాత్ నెరవేర్చని బహు దైవారాధకులకు వినాశం (రాసిపెట్టి) ఉంది. దీనికి భిన్నంగా సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నులయిన వారికి ఎన్నటికీ తరగని గొప్ప ప్రతిఫలం లభిస్తుంది". (6-8)

ప్రవక్తా! వారికీ సంగతి కూడా చెప్పు: "కేవలం రెండు రోజుల్లో భూమిని సృష్టించిన దేవుడ్ని మీరు తిరస్కరిస్తున్నారా? ఆయనకు ఇతరులను సాటి కల్పిస్తున్నారా? సకల లోకాలకు ఆయనే కదా ప్రభువు! ఆయనే భూమి (దొర్లిపోకుండా దాని) మీద పర్వతాలు పాతిపెట్టాడు. అందులో అనేక శుభాలు ఉంచాడు. అంతేకాదు, ఆహారం అర్థించే సమస్త ప్రాణికోటికి అవసరమైన మేరకు లెక్క ప్రకారం దానిపై ఆహారసామగ్రి కూడా ఏర్పాటు చేశాడు. ఈ పనులన్నీ నాలుగు రోజుల్లో పూర్తయ్యాయి. (9,10)

తిరిగి దేవుడు ఆకాశం వైపు దృష్టి సారించాడు. అప్పుడు ఆకాశం పూర్తిగా పొగ రూపంలో ఉండేది. ఆయన భూమ్యాకాశాల్ని ఉద్దేశించి "మీకు ఇష్టమున్నా లేకపోయినా ఉనికిలోకి రండి" అన్నాడు. దానికి అవి "మేము వినమ్రులై వచ్చేశాం" అన్నాయి. (11)

అప్పుడు ఆయన రెండు రోజుల్లో ఏడు ఆకాశాలు నిర్మించాడు. ప్రతి ఆకాశానికి తత్సంబంధిత నియమావళి నిర్దేశించాడు. భూలోక సమీపంలోని ఆకాశాన్ని మేము (నక్షత్ర) దీపాలతో అలంకరించాము. దాన్ని అన్ని విధాలా సురక్షితంగా ఉంచాము. ఇదంతా మహా శక్తిమంతుడు, అపార వివేకవంతుడయిన దేవుడు రూపొందించిన పథకం. (12)

అయినా వీరు ముఖం తిప్పుకుంటే వారికిలా చెప్పు: "(పూర్వం) ఆద్, సమూద్ జాతులపై హఠాత్తుగా (దైవ)శిక్ష విరుచుపడింది. అలాంటి హఠాత్ శిక్ష గురించి నేను మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను. వారి దగ్గరకు దైవప్రవక్తలు ముందూ వెనుకా నలువైపుల నుంచి వచ్చి 'దేవుణ్ణి తప్ప మరెవరినీ ఆరాధించకండి' అని (పరిపరివిధాల) బోధించారు. కాని వారు (తిరస్కారభావంతో) 'మా ప్రభువు పంపాలనుకుంటే (ఈ పనికోసం) దైవదూతల్ని పంపేవాడు. కనుక నీవు తెచ్చిన విషయాన్ని మేము నమ్మము' అని అన్నారు". (13,14)

ఆద్ (జాతినాయకులు) న్యాయం, ధర్మం ఏదీలేకుండా దేశంలో పెద్ద మొనగాళ్ళయిపోయారు. పైగా (అహంకారంతో) "మాకంటే బలవంతులెవరున్నారు?" అని పలకసాగారు. వారిని సృష్టించిన దేవుడు వారికంటే బలాఢ్యుడన్న సంగతి వారికి కాస్తయినా తట్టలేదా? వారు మా సూక్తులు, సూచనలు తిరస్కరిస్తూనే పోయారు. చివరికి మేము ఓ దుర్దినాన వారిపైకి భయంకరమైన తుఫాన్‌ని పంపాము. ఇహలోకజీవితంలో వారికి అవమానకరమైన శిక్ష చవి చూపించడానికే ఇలా చేశాము. పరలోక శిక్ష ఇంతకంటే ఎంతో అవమానకరంగా ఉంటుంది. వారికక్కడ ఎవరూ సహాయం చేయరు. (15,16)

ఇక సమూద్‌జాతి ముందు మేము సన్మార్గం ఉంచాము. కాని వారు సన్మార్గం చూడటానికి బదులు అంధులయి ఉండటానికే ఇష్టపడ్డారు. చివరికి వారి దుష్కర్మల కారణంగా వారిపై అవమానకరమైన శిక్ష వచ్చిపడింది. అయితే సత్యాన్ని విశ్వసించి భయభక్తుల వైఖరి అవలంబించినవారిని మాత్రం మేము రక్షించాము. (17,18)....." (ఖుర్ఆన్. 41:1-38)

ఉత్బా చేతులు వెనుక వైపు నేలమీద ఆనిచ్చి ఎంతో శ్రద్ధగా వినసాగాడు. ఆ సూరా పఠిస్తున్నప్పుడు కొన్ని చోట్ల విని హడలిపోయాడు. దైవప్రవక్త (సల్లం) 38వ సూక్తి వరకు పఠించి సజ్దా చేశారు. ఆ తరువాత-

"అబూవలీద్! నా సమాధానం విన్నారుగా! ఇక మీఇష్టం. మీరేం చేయాలో నిర్ణయించుకోండి" అన్నారు.

ఉత్బా మారు మాట్లాడకుండా లేచి ఖురైషీయుల దగ్గరకెళ్ళాడు. అతని హృదయంలో ఏండ్ల తరబడి పేరుకుపోయిన మూఢ విశ్వాసపు జడత్వం ఈరోజు వదలిపోయింది.

కొంచెం దూరంలో ఉండగానే మిత్రులు అతని వాలకం చూసి పసికట్టారు. "ఏమైంది ఇతనికి! ఈ ముఖం ఇక్కడ్నుంచి పోయినప్పటి ముఖం కాదే!!" అనుకున్నారు వారు.



"అబూవలీద్! ఏం జరిగింది? త్వరగా చెప్పు" అన్నారు ఆత్రంగా అందరూ.

"దైవసాక్షిగా చెబుతున్నాను. నేను గొప్పగొప్ప కవుల కవితలు విన్నాను. మహా మాంత్రికులు చెప్పే మాటలు కూడా విన్నాను. కాని ముహమ్మద్ నోట వెలువడే వాణి వీటన్నిటికీ భిన్నంగా ఉంది. అలాంటి వాణి నేనింతవరకు వినలేదు. కాబట్టి సోదరులారా! నామాట వినండి. అతను చేస్తున్న పనిని చేసుకోనివ్వండి. అతని జోలికి పోకండి. ప్రజల మధ్య అతణ్ణి వదిలేయండి. ప్రజలు అతనిపై విజయం సాధిస్తే మీ ఉద్దేశ్యం నెరవేరుతుంది. తోటిసోదరుని రక్తంతో చేతులు మలినం చేసుకునే పని మీకు తప్పుతుంది. ఒకవేళ అతనే వారిపై విజయం సాధిస్తే, అతని బలమే మీబలం; అతని గౌరవమే మీ గౌరవం. అంతకంటే మీకు కావాల్సిందేమిటీ?" అన్నాడు ఉత్బా అబూవలీద్.

"అబూవలీద్! చివరికి నువ్వు కూడా ముహమ్మద్ పన్నిన వలలో పడిపోయావా?" అన్నారు ఖురైషీయులు నిరాశానిస్పృహలతో.

"నాకు తెలిసింది, అర్థమయింది చెప్పాను. ఆపై మీ ఇష్టం ఏమయినా చేసుకోండి" అన్నాడు ఉత్బా నిర్మోహమాటంగా.

ఖురైషీయులు ఈ మాటలు విని మండిపడుతూ లేచి వెళ్ళిపోయారు. ఉత్బా మీద వారు పెట్టుకున్న ఆశలన్నీ అడియాశలయి కథ మళ్ళీ మొదటికే వచ్చింది.

ప్రవక్త ప్రచారోద్యమానికి ప్రభావితులవుతున్నవారిలో అత్యధిక మంది సాధారణ పౌరులే. ఉన్నతవంశానికి చెందిన ప్రముఖులు, మేధావులు ఎవరూ ఇస్లాం స్వీకరించడానికి ముందుకు రావడంలేదు. ఈ విషయం దైవప్రవక్త (స)ను బాధిస్తోంది. అబుజహల్ పినతండ్రి వలీద్ మఖ్జూమ్‌తెగ నాయకుడే గాక, ఖురైష్ అగ్రనాయకుల్లో గొప్ప నాయకుడు. అంచేత అతను ఇస్లాం స్వీకరిస్తే ఎంతో బాగుంటుందని తలిచేవారు దైవప్రవక్త (స).

ఓరోజు యాదృచ్ఛికంగా దైవప్రవక్త (సల్లం)కు వలీద్‌ని కలుసుకొని మాట్లాడే అవకాశం లభించింది. వలీద్‌తో పాటు మరికొందరు ఖురైషీయులు కూడా ఉన్నారు. కాని అదే సమయంలో ఇబ్నె ఉమ్మెమక్తూమ్ (రజి) అనే ఓ అంధ నవముస్లిం వచ్చి తనకు ఖుర్ఆన్ సూక్తులు ఏవైనా విన్పించమని మనవిచేశారు. దైవప్రవక్త (స) పురప్రముఖులతో చర్చలు జరపడంలో నిమగ్నులయి ఉన్నందున కొంచెం ఆగమని చెప్పారు.

కాని హజ్రత్ ఇబ్నె ఉమ్మెమక్తూమ్ (రజి) మళ్ళీ అదే విధంగా విన్నవించుకున్నారు. ఈ వైఖరి దైవప్రవక్త (సల్లం)కు నచ్చలేదు. ఆయన ముఖం చిట్లించుకొని ఇబ్నె ఉమ్మెమక్తూమ్ (రజి) నుండి ఖురైషీయుల వైపు దృష్టి మరల్చుకున్నారు. దాంతో హజ్రత్ ఇబ్నె ఉమ్మెమఖ్తూమ్ (రజి) నిరాశచెంది అక్కడ్నుంచి వెళ్ళిపోయారు. అటు దైవప్రవక్త (సల్లం) ఖురైషీయులతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. కాగా అంధ నవముస్లిం పట్ల దైవప్రవక్త (సల్లం) వ్యక్తపరచిన తీరు గురించి దైవసందేశం అవతరించింది:

"అతను తన దగ్గరకు అంధుడొచ్చాడని భృకుటి ముడిచి ముఖం తిప్పుకున్నాడు. నీకేం తెలుసు? ఆ అంధుడు తనను తాను సంస్కరించుకుంటాడేమో; లేదా హితోపదేశాన్ని శ్రద్ధగా ఆలకిస్తాడేమో; హితోపదేశం అతనికి ప్రయోజనం కలిగిస్తుందేమో!

(సత్యాన్ని) ఖాతరు చేయనివాడి పట్ల నీవంతగా ఆసక్తి చూపుతున్నావా? అతను దారికి రాకపోతే అందులో నీ దోషం ఏముంటుందని? (దేవునికి) భయపడుతూ నీ దగ్గరకు పరుగెత్తుకొచ్చినవాడ్ని చూసి నీవు ముఖం తిప్పుకుంటున్నావు.

(అలా) ఎంతమాత్రం (చేయ)కూడదు. ఇది హితోపదేశం. ఇష్టమైనవాడు దీన్ని స్వీకరిస్తాడు. ఇది మహోన్నతమయిన, ప్రతిష్ఠాత్మకమయిన, పవిత్రమయిన పుటలలో లిఖించబడి ఉంది. అవి గౌరవనీయులయిన పరిశుద్ధ లేఖకుల హస్తాలలో ఉంటాయి.” (ఖుర్ఆన్. 80;1-16)

# భయ ప్రలోభాలు-(34)

అదొక సమావేశం. ఖురైష్ నాయకులంతా తీవ్రమైన ఆలోచనల్లో మునిగివున్నారు. సభ నిశ్శబ్దంగా ఉంది. కాస్సేపటికి నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ ఒకతను లేచి ఇలా అన్నాడు:

“సోదరులారా! మీకందరికీ తెలుసు. ముహమ్మద్ (స) మన దేవతావిగ్రహాలను అవమానపరచడంలో మితిమీరుతున్నాడు. దీనికి నివారణోపాయం ఏమిటో ఆలోచిం చండి. అతను మన మతం వెంటపడ్డాడు. మనం ఎలాగైనా అతని పీడ వదిలించుకోవాలి.”

“ఔను, ముహమ్మద్ (స) మన దేవతలకు అపచారం తలపెట్టాడు. మన పూర్వీకుల నుంచి వస్తున్న ఆరాధ్యదైవాలను మనం కాపాడుకోవాలి” అన్నాడు మరోనాయకుడు.

“దేవతా విగ్రహాలను వదలుకోవడానికి మనమంతా మూర్ఖులమనుకున్నాడా? ఈ దేవతల కోసం అరేబియా నలుమూలల నుండి వచ్చి పూజలు జరిపి ప్రదక్షిణలు చేసి మొక్కు బడులు తీర్చుకునే వేలాది భక్తుల్ని చూడటం లేదా? ఇలాంటి దేవతల పూజలను మాన్పించి మనల్ని మతభ్రష్టులుగా చేయాలనుకుంటున్నాడా?” అన్నాడు ఇంకొకడు.

“అసలతని ఉద్దేశ్యం ఏమిటీ? యావత్తు అరబ్బుతెగల ముందు మనల్ని కించపరచా లనుకుంటున్నాడా? వారంతా మనల్ని బహిష్కరించి వారు మన దగ్గరకు రాకుండా చేయాలని భావిస్తున్నాడా? మన వ్యాపారం పూర్తిగా దెబ్బతిని మనం ఆకలితో మాడి చావాలనా అతని అభిప్రాయం?” అన్నాడు వేరొక నాయకుడు ఉద్రేకంతో.

ఇలా వారు చాలా సేపటిదాకా చర్చించుకొని ఎలాగయినా ముహమ్మద్ (సల్లం)ను వదిలించుకోవాలని తీర్మానించుకున్నారు. వారిలో ఒక నాయకుడు ఇలా అన్నాడు:

“మనలో కొందరు అబూతాలిబ్ దగ్గరకు పోయి ముహమ్మద్ (సల్లం)పై ఫిర్యాదు చేద్దాం. ఆయనతో ముహమ్మద్ మమ్మల్ని, మా దేవతల్ని విమర్శించడం మానేస్తే మేము ఆయన మతం జోలికి పోము, అతను మా మతం జోలికి రాకూడదని చెబుదాం.”

ఈ అభిప్రాయంతో మిగిలిన వారంతా ఏకీభవించారు.

అప్పుడు ఖురైష్ నాయకుల్లో అబూసుఫ్యాన్, అబూజహల్ వగైరా ప్రముఖులు కొందరు అబూతాలిబ్ దగ్గరకు వెళ్ళారు. పోగానే వారు ముహమ్మద్ (సల్లం)పై ఎన్నో ఫిర్యాదులు చేశారు. ఎలాగైనా అతడ్ని ఈ పని నుండి వారించమని చెప్పారు. అబూతాలిబ్



ఆ నాయకుల్ని అమిత గౌరవమర్యాదలతో సత్కరించారు. అలాగే వారిస్తానంటూ తియ్యటి మాటలతో నచ్చజెప్పి వారిని ఎలాగో పంపివేశారు.

అవిశ్వాసుల దురుద్దేశం నెరవేర లేదు. రోజులు గడచిపోతున్నాయి. దైవప్రవక్త (స) మిథ్యాదైవారాధనను ఖండిస్తూ ఏకేశ్వరోపాసన గురించి ప్రచారం చేస్తూనే ఉన్నారు. దాంతో అనేకమంది ముస్లింలయి పోతున్నారు. ఇలా క్రమేణా పెరుగుతున్న ముస్లింల సంఖ్య చూసి మక్కా బహుదైవారాధకులు మరింత ఆందోళన చెందారు.

“ఒకవేళ ముహమ్మద్ తన లక్ష్యంలో విజయం సాధిస్తే..... అతని మతం సర్వత్రా వ్యాపించి విజయఢంకా మోగిస్తే.... అమ్మో! ఇంకేమైనా ఉందా!! అప్పుడు మనకు అవసాన కాలమే. మనవ్యాపారం కుప్పకూలిపోతుంది. మనం సర్వనాశనం అవుతాం. ఇక ఏమాత్రం కాలం వృథా చేయకూడదు. ఏదో ఒకటి చేయాలి. ఈసారి మనం గట్టి చర్య తీసుకోవాలి.”

ఈ విధంగా ఆలోచించి ఖురైష్ నాయకులు మళ్ళీ అబూతాలిబ్ దగ్గరకు పోయారు.

“అబూతాలిబ్ మహాశయా! మీరు మాపెద్దలు. మీపట్ల మా హృదయాల్లో ఎంత గౌరవం ఉందో మీకు తెలుసు. మీ ముహమ్మద్ (స) విషయంలో మాకు న్యాయం చేకూర్చండి. అతడ్ని కొంచెం మందలించండి. మా మతాన్ని తప్పు పట్టవద్దని, మా ఆచారా లను విమర్శించవద్దని చెప్పండి. మా బుద్ధిని, మా ఆలోచనాసరళిని మార్చటానికి ప్రయత్నించ వద్దని, మా పూర్వీకుల్ని మతభ్రష్టులుగా చిత్రించే భాషణలు చెయ్యవద్దని నచ్చజెప్పండి. మీరలా చేయలేకపోతే మాదారి నుండి తప్పుకోండి. స్వయంగా మేమే అతనికి బుద్ధి చెబుతాం. మీరు కూడా ముహమ్మద్ (స) వింతమాటలతో విసుగెత్తిపోయారు. మా ప్రయత్నమేదో మేము చేసుకుంటే దానివల్ల మీకూ మనశ్శాంతి లభిస్తుంది.”

ఈ మాటలు విని అబూతాలిబ్ ఆలోచనలో పడ్డారు. ఇదివరకు ఎలాగో నచ్చజెప్ప గలిగారు. ఇప్పుడలా చెప్పినా ప్రయోజనం కన్పించడం లేదు. మార్గాంతరం లేక ఆయన ముహమ్మద్ (సల్లం)ని పిలిపించారు.

“నాయనా ముహమ్మద్! వీరు మన జాతి అగ్రనాయకులు, శ్రీమంతులు కూడా. నీ మీద ఫిర్యాదు చేస్తున్నారు. నీవు వారి మతాన్ని విమర్శించవద్దని, వారి ఆచారాలను తూలనాడ వద్దని అడుగుతున్నారు” అన్నారు ఆయన బాధగా.

“పెదనాన్నా! ఏ విషయాల్లో వారి శ్రేయస్సు, సంక్షేమాలున్నాయో వాటి వైపు వారిని పిలవడం మానేయమంటున్నారా మీరు?” దైవప్రవక్త (సల్లం) సూటిగా ప్రశ్నించారు.

“అదేమిటి? ఎందులో ఉంది వారి శ్రేయస్సు?” అడిగారు ఆశ్చర్యపోతూ అబూతాలిబ్.

“ఒక్క సద్వచనం. దీన్ని గనక వారు ఆమోదిస్తే యావత్తు అరేబియా వారికి దాసోహం అంటుంది. మొత్తం ప్రపంచమే వారి పాదాక్రాంతమవుతుంది” అన్నారు దైవప్రవక్త (స).

ఈ మాటలు విని అబూజహల్ ఉత్సాహంతో ముందుకొచ్చి “ముహమ్మద్! నీవు విశ్వసించే ఆ దేవుని సాక్షి! ఆ మాటేమిటో చెప్పు, ఇప్పుడే అలాంటివి పాతిక మాటలు పలకడానికి మేము సిద్ధంగా ఉన్నాం” అన్నాడు కుతూహలంగా.

“కేవలం అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యదైవం లేడని చెప్పండి, చాలు” అన్నారు దైవప్రవక్త (సల్లం) అవిశ్వాసుల వైపు ఆశగా చూస్తూ.

దైవప్రవక్త (స) నోట ఈమాట వినగానే వారి ముఖాలు ఒక్కసారిగా కందగడ్డలా మారాయి. వారు కోపోద్రేకాలతో ఊగిపోతూ “చూడు, నీగతి ఏమవుతుందో” అంటూ లేచి చరచరా వెళ్ళిపోయారు.

దైవప్రవక్త (స) వారి బెదిరింపులకు ఏమాత్రం చలించలేదు. ఆ తరువాత ఆయన అబూతాలిబ్ దగ్గర సెలవు తీసుకొని మౌనంగా ఇంటి ముఖం పట్టారు.

సత్యం ఎల్లప్పుడూ అసత్యవాదుల పాలిట పచ్చి వెలక్కాయగానే పరిణమిస్తుంది. అందువల్లనే ఇస్లామీయఉద్యమం ఉధృతం అయ్యేకొద్దీ అవిశ్వాసుల మనోవ్యాధి కూడా ఎక్కువ కాసాగింది. వారు నోటికొచ్చినట్లు దుర్భాషలాడుతున్నారు. అపనిందలు మోపుతున్నారు. కుట్రలు పన్నుతున్నారు. గూండాలను ఉసిగొల్పుతున్నారు. అయినా సమాజంలోని సద్వర్తనులు దైవప్రవక్త (స)కు చేరువవుతూనే ఉన్నారు. నానాటికి అధిక మవుతున్న ప్రవక్తఅనుచరుల సంఖ్య చూసి అవిశ్వాసులు మరింత కలవరపడసాగారు.

ఒక రోజు కాబాలో కొందరు అవిశ్వాసులు గుమికూడి ముహమ్మద్ (స)ని గురించి వింతగా చెప్పుకుంటున్నారు.

“విన్నారు కదా ముహమ్మద్ (సల్లం) చెప్పే వింతమాటలు! మనం చచ్చి పోయాక మళ్ళీ బ్రతికించబడతామట! ఇక్కడ చేసిన కర్మల్ని గురించి ప్రశ్నించడం జరుగుతుందట!! సత్కర్మలకు సత్ఫలం, దుష్కర్మలకు దుష్ఫలం లభిస్తుందట!!! అయ్యో! ఎప్పుడైనా విన్నామా మనం ఇలాంటి మాటలు? ఆ పైన స్వర్గనరకాలు కూడా ఉంటాయట! ప్చ్!!” ముక్కు మీద వేలేసుకున్నాడు ఓ ప్రబుద్ధుడు.

“ఇదంతా ఎందుకు? ముహమ్మద్‌నే పిలవండి, అతను చెప్పింది నిజమే అయితే రుజువు చూపమని అడుగుదాం. అబద్ధమయితే అతడ్ని హింసించడానికి మనకు సాకు దొరుకుతుంది. అప్పుడు మన చర్యలకు పల్లెత్తి మాట్లాడే వాడుండడు” అన్నాడు మరొకడు.

“ఔనౌను, భలే విషయం చెప్పావు” అన్నారు వారిలో కొందరు. “అయితే ఇప్పుడే పోయి ముహమ్మద్‌ని పిలుచుకొస్తాను” అంటూ ఒకతను బయలు దేరాడు.

ఖురైషీయులు పిలిచారని వినగానే మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) మనసులో కొత్త ఆశలు చిగురించాయి.

“ఇప్పుడు వారిముందు సత్యధర్మం గురించి వివరంగా వెల్లడించవచ్చు. బహుశా వారు దాన్ని విశ్వసించనూ వచ్చు” ఇలా తలచుకుంటూ ఆయన వారి దగ్గరకు పోయారు. కాని అక్కడ జరిగింది మరొకటి.

“ముహమ్మద్! సొంతజాతికే ఎసరుపెట్టే నీలాంటి వాడ్ని మేము ఇదివరకెన్నడూ చూడలేదు. అనాదిగా వస్తున్న మామతంలో తప్పులు పడ్తున్నావు. మా దేవతల్ని నిందిస్తున్నావు. మా తాతముత్తాతలను తెలివిమాలినవారిగా జమకట్టావు. ఇంతకంటే ఘోరం



మరొకటుందా? ముహమ్మద్! ఇప్పుడైనా మించిపోయిందేమీ లేదు. మామాట విన్నావంటే మేము నిన్ను గుండెలకు హత్తుకోవడానికి సిద్ధంగా ఉన్నాం” అన్నాడు ఒక నాయకుడు.

“ముందు చెప్పండి విషయం ఏమిటో” అన్నారు దైవప్రవక్త (సల్లం).

“నీవు మా దేవతల్ని విమర్శించడం మానేస్తే మేము నీకు మా అందరిలోకెల్లా గొప్ప ధనికుడయ్యేటంత ధనం సేకరించి ఇస్తాం. నీవు కోరిన స్త్రీని తెచ్చి నీకు పెళ్ళి చేస్తాం. మేము నీ వెనకాలే నడుస్తాం. నీకీ మాట నచ్చకపోతే మరొక ప్రతిపాదన ఉంది.”

“ఏమిటా ప్రతిపాదన?”

“ఒక సంవత్సరం నీవు మా దేవతలు లాత్, ఉజ్జాలను ఆరాధించు. ఒక సంవత్సరం మేము నీ దేవుడ్ని ఆరాధిస్తాం.” ఈ మాట విని దైవప్రవక్త (సల్లం) తలవంచుకున్నారు. ఆయనపై దివ్యావిష్కృతి అవతరించసాగింది-

వారికిలా చెప్పు: “అవిశ్వాసులారా! మీరు ఆరాధిస్తున్న వాటిని నేను ఆరాధించను. నేను ఆరాధిస్తున్న దైవాన్ని మీరు ఆరాధించరు. మీరు ఆరాధిస్తున్న వాటిని నేను ఆరాధించే మనిషిని కాను. నేను ఆరాధించే దైవాన్ని మీరు ఆరాధించే రకం కాదు. (కనుక) మీ ధర్మం మీకే, నా ధర్మం నాకే.” (ఖుర్ఆన్,109:1–6)

దైవప్రవక్త (స) ఈ సందేశం విన్పించగానే ఖురైషీయులు ముక్కుపుటాలు ఎగరేశారు. ఆయన వైపు కొరకొర చూస్తూ పిడికిళ్ళు బిగించారు.

“నిజంగా నీవు దైవప్రవక్త వయితే మేము అడిగేవి చేసి చూపించు. అప్పుడు నిన్ను నమ్మి నీ మాటలు వింటాం” అన్నాడు ఓ నాయకుడు.

“ఔనౌను. జమ్‌జమ్ కంటే మధురంగా ఉండే సెలయేటిని ఇక్కడ సృష్టించమని నీ ప్రభువుని అడుగు. పోనీ సిరియా, ఇరాఖ్ దేశాలో ప్రవహించే నదుల వంటివి అయినా ఇక్కడ ప్రవహింపజేయమను” అన్నాడు మరొకడు వెంటనే.

“నీవు దైవప్రవక్త వయితే నీ ప్రభువుని అడుగు, ఆనందంగా గడపడానికి నీకో ఉద్యానవనం గల రాజమహల్ సృష్టించి, వెండిబంగారాలు, వజ్రవైఢూర్యాలు తెప్పించమను. నీవేం ప్రవక్తవయ్యా! మాలాగే పొట్టకోసం కాళ్ళరిగేలా తిరిగి చెమట కార్చేవాడివి. నీవు కూడా ప్రవక్తవేనా?” మరొక నాయకుడు అన్నాడు వెటకారంగా.

“యమామాలో ఉండే రహ్మాన్ అనేవాడే కదూ నీకిదంతా నేర్పుతున్నది? అయితే బాగా విను. మేమా రహ్మాన్‌ని ససేమిరా నమ్మం. మా కళ్ళముందు నీవు ఆకాశం మీదికి ఎక్కిపోయి నీ ప్రవక్త నియామకం గురించి స్వయంగా దేవుని చేత వ్రాయించి తీసుకురా. దాన్ని చదివితే గాని మేము నిన్ను నమ్మం” అన్నాడు మరొకతను ఎత్తిపొడుస్తూ.

“మేము కొలిచే దైవకన్యలు దేవుని కుమార్తెలు. కాదంటే దేవుడ్నే సరాసరి మా ముందుకు రప్పించు. లేకపోతే మిన్ను విరిగి మా నెత్తిమీద పడేలా చెయ్యి, చూద్దాం. నువ్వేదో దైవశిక్ష వచ్చిపడుతుందని మమ్మల్ని బెదిరిస్తున్నావుగా! ఆ శిక్షేదో ఇప్పుడే రప్పించు, మేము ఓసారి కళ్ళారా చూస్తాం అదెలా ఉంటుందో” అన్నాడు వారిలో వేరొక మూర్ఖుడు.

“నా ప్రభువు పవిత్రుడు. నేను ఆయన ఆదేశించినట్లు నడచుకునే ప్రవక్తను మాత్రమే. అల్లాహ్ అందరికంటే గొప్పవాడు. ఆయన తలచుకుంటే మీరడిగే వస్తువుల కంటే విలువైనవి కూడా నాకు అనుగ్రహిస్తాడు. పరవళ్ళుతొక్కుతూ ప్రవహించే తియ్యటి సెలయేరులుగల నిత్యనూతన శోభతో అలరారే ఉద్యానవనాలు, ఆ ఉద్యానవనాలలో అందమైన మేడలు కూడా ప్రసాదిస్తాడు” చెప్పారు దైవప్రవక్త (స) ప్రశాంతహృదయంతో.

“ముహమ్మద్! మేము నీముందు ఎన్నో విషయాలు ఉంచాం. కాని నీవు ఒక్కటీ వినలేదు. అన్నిటినీ త్రోసిపుచ్చావు. ఇక కాచుకో నిన్నూ, నీ శిష్యుల్ని ఏం చేస్తామో చూడు. నిన్ను కాపాడటానికి ఎవరడ్డుపడతారో చూస్తాం” అన్నారు అవిశ్వాసులు బెదిరిస్తూ.

## అవిశ్వాసుల అల్టిమేటం-(35)

ఆ తరువాత కొన్నాళ్ళకు వారు మళ్ళీ కాబా మందిరంలో సమావేశమయ్యారు.

“ఇక లాభం లేదు. ముహమ్మద్ మన మౌలిక విశ్వాసాలకే ఎసరుపెట్టాడు. మనల్ని, మన పూర్వీకుల్ని మూఢుల కింద జమకట్టాడు. అలాంటివాడ్ని ఇక ఏమాత్రం ఉపేక్షించ కూడదు. పదండి అతని అంతు తేల్చుకుందాం. అతడ్ని శాశ్వతంగా కడతేర్చితే గాని మనకు సంఘంలో మర్యాద దక్కదు” అన్నాడు ఒక నాయకుడు.

“నిజమే. అతడ్ని మన దారినుండి తొలిగించడం తప్ప మరోమార్గం లేదు” మరొకతను ఏకీభవిస్తూ అన్నాడు.

“ఆగండి. ముహమ్మద్ (సల్లం)ని చంపుతారు బాగానే ఉంది. కాని అతని పెదనాన్న అబూతాలిబ్ గురించి ఏమైనా ఆలోచించారా?” వేరొకడు సందేహం వెలిబుచ్చాడు.

“ఔను. ముహమ్మద్‌ని వధిస్తే అబూతాలిబ్ ఊరుకుంటాడా? అతను ఎదురుతిరిగితే, అతని వంశమంతా ఏకమయి మనపై విజృంభిస్తుంది. అసలు వాళ్ళేకదా ఖురైష్ జాతికి అగ్రనాయకులు. వద్దు. ఇది చాలా ప్రమాదకరమైన నిర్ణయం.”

ఈ మాట విని అందరూ ఢీలాపడిపోయారు. పునరాలోచనలో పడిపోయారు. ఆరోజు సమావేశం అంతటితో ముగిసింది.

ఆ తరువాత వారు కాబాలో తిరిగి సమావేశమయ్యారు. వేడివేడి చర్చలు జరిగాయి. ఈసారి అటోఇటో తేల్చుకోవాలని నిర్ణయించుకున్నారు. తీవ్రంగా ఆలోచించారు. పరస్పరం సంప్రదించుకున్నారు. చివరికి ఓ బుర్రకు తట్టిన ఆలోచనతో అందరూ ఏకీభవించారు. వెంటనే అందరూ కార్యరంగంలోకి దూకారు. వలీద్ బిన్ ఉమారా అనే ఓ నవయువకుడ్ని వెంటబెట్టుకొని అబూతాలిబ్ దగ్గరకు పోయారు. ముహమ్మద్ (స) మీద ఎన్నో అభాండాలు వేసి తమ కష్టాలు ఏకరవుపెట్టుకుంటూ ఇలా అన్నారు:

“అబూతాలిబ్! ఈ యువకుడు ఉమారా కుమారరత్నం. పేరు వలీద్. ఖురైషీయులలో గొప్ప పరాక్రమశాలి, చూసినవారు చూసినట్టే ముగ్ధులయ్యే సౌందర్యవంతుడు. ఈరోజు నుంచి ఇతను మీ కొడుకు. ప్రతి విషయంలోనూ మీకు మంచి సలహాలిస్తూ మీకు చేదోడుగా ఉంటాడు. కనుక ఇతడ్ని మీదగ్గర ఉంచుకోండి. ఇతనికి బదులు



ముహమ్మద్ (సల్లం)ని మాకు అప్పగించండి. శాశ్వతంగా అతని ఆట కట్టిస్తాం. లేనిపోని అలజడి సృష్టించి జాతిని కకావికలం చేశాడు. మీక్కూడా అతని చేష్టలు ఇష్టం లేదుకదా? అదీగాక మీకు ముహమ్మద్ కంటే కూడా ఎక్కువ యోగ్యుడు లభిస్తున్నాడు.”

“సంఘంలో పెద్దమనుషులుగా చెలామణిఅవుతున్న వీరేనా ఈ మాటలు అంటున్నది? ఛీ! ఏం మనుషులు వీరు!! ఎంత అమానుషానికి పాల్పడుతున్నారు!!!” అనుకున్నారు అబూతాలిబ్ వారి మాటలు విని.

“ఇక చాలించండి. ఏమిటీ మీరనేది? ఈ యువకుడ్ని తీసుకొని అతనికి బదులు నా కొడుకుని ఇవ్వాల్నా మీకు? మీముద్దుల తనయుడ్ని నాదగ్గర ఉంచుకొని మేపుతుంటే, మావాడ్ని మీరు చిత్రహింసలు పెట్టి నామరూపాల్లేకుండా చేయడానికి మీకు అప్పగించాల్నా? ఎంత అన్యాయం! దైవసాక్షి! ఇది ఎన్నటికీ జరగని పని” అన్నారు ఆయన కటువుగా.

“అబూతాలిబ్! మేము న్యాయమే చేస్తున్నాం. శతవిధాలా ప్రయత్నించాం. కాని ఒక్కటీ ఫలించ లేదు. మేము మీతో ఎన్నో సార్లు మొరపెట్టుకున్నాం. మీరు ఒక్కసారీ ఆలకించలేదు. ఒక్కటీ ఒప్పుకోవడానికి సిద్ధపడలేదు” అన్నాడు మతీమ్ అనే వ్యక్తి.

“మీరు నాకు ఏమాత్రం న్యాయం చేయడం లేదు. మీరసలు నన్ను అగౌరవపరచడానికి నిర్ణయించుకున్నారు” అన్నారు అబూతాలిబ్ బాధగా.

“మీకు మేము అన్యాయం చేయడంలేదు. ముహమ్మద్‌కు ఎలాగో నచ్చజెప్పి అతని ఆటలు కట్టించమని మీకు పదే పదే విన్నవించుకున్నాం. కాని మీరు మా మాటలు ఖాతరు చేయలేదు. వినండి. ఇక నుండి ముహమ్మద్ (స) మా దేవతల్ని, మా పూర్వీకుల్ని ఏదైనా అన్నా లేక మమ్మల్ని అవివేకులని విమర్శించినా మేము సహించేది లేదు. మీరు ఏదోవిధంగా నచ్చజెప్పి ముహమ్మద్ (స) నోరు కట్టివేయండి. లేదంటారా మీతో, మీ ముహమ్మద్ (స)తో మేము యుద్ధం చేయడానికైనా వెనుదీయము. ఆలోచించి ఏదోఒకటి తేల్చుకోండి” అంటూ అవిశ్వాసులు హెచ్చరించి వెళ్ళిపోయారు.

అబూతాలిబ్ తీవ్రమైన ఆలోచనలో పడిపోయారు.

“వ్యవహారం బెడిసికొట్టింది. ఇప్పుడేమిటి కర్తవ్యం? ఖురైషీయులతో విరోధం పెట్టుకుంటే కొరివితో తలగోక్కున్నట్లే. పోనీ ముహమ్మద్ (స)ని వదులుకుంటే.... అమ్మో! నా ముహమ్మద్‌ని వదలుకోవడమే!! నా తమ్ముడుకొడుకు ముహమ్మద్ (స)ని ఆ దుర్మార్గులకు అప్పగించడమా? కాదు కాదు...మరేం చెయ్యాలి?” తల పట్టుకున్నారు ఆయన పాలుపోక.

“ఏమైనాసరే ముహమ్మద్‌ని పిలిపించి ఇస్లాం ప్రచారం అపమని చెబుదాం. ఎన్నాళ్ళని ఈ ఖురైషీయులతో ఈ పేచీ? అదీగాక ఈ ప్రచారం వల్లనే ఖురైషీయుల ఐక్యతకు భంగం కల్గింది.” ఇలా ఆలోచించి ఆయన ఒక నిర్ణయానికొచ్చారు.

దాని ప్రకారం ముహమ్మద్ (స)ని పిలిపించారు. ఆయన ప్రారంభించిన ఉద్యమం వల్ల ఖురైషీయులు ఎన్ని ఇబ్బందులకు గురికావలసి వస్తుందో, ఇకనైనా దీన్ని ఆపకపోతే మున్ముందు మరెన్ని దుష్పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందో వివరించారు.

"ముహమ్మద్! నీ పెదనాన్నను చూసి అయినా జాలి పడవయ్యా! నేను మోయలేని భారం నాపై మోపకు బాబూ!" అన్నారు ఆయన ఆవేదనా భరిత కంఠంతో.

ధర్మపథంలో ఒకదాని వెంట మరొకటి చొప్పున అనేక సమస్యలు ముంచుకొస్తున్నాయి. వీటన్నిటిని అధికమించి మహనీయ ముహమ్మద్ (స) తన ఉద్యమాన్ని ముందుకు నడుపుతారా? లేక పెదనాన్న ముఖం చూసి సత్యతిరస్కారులకు లొంగిపోతారా? ప్రపంచం విశ్వాసకాంతితో ప్రకాశవంతమవుతుందా లేక అవిశ్వాస తిమిరంలోనే పడిఉండి పతనమై పోతుందా? కాలం స్తంభించిపోయి ఉత్కంఠతతో నిర్ణయం కోసం ఎదురుచూస్తోంది.

"పెద నాన్నా! దైవసాక్షి! వీరు నా కుడిచేతిలో సూర్యుడ్ని, ఎడమచేతిలో చంద్రుడ్ని తెచ్చిపెట్టి ఈ మహాకార్యం మానుకోమన్నా అది జరిగే పని కాదు. వినండి, ఈ మహాకార్యం పూర్తయినా పూర్తికావాలి. లేదా ఈ మార్గంలో నా ప్రాణమైనా పోవాలి" అన్నారు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) దృఢసంకల్పంతో.

అబూతాలిబ్ ఆశ్చర్యంగా చూడసాగారు. ముహమ్మద్ (సల్లం)లోని వజ్రసంకల్పం, అకుంఠిత కార్యదీక్ష ఆయన హృదయాన్ని కదిలించి వేశాయి.

"ఈ మార్గంలో ఇంకా ఎన్నెన్ని కష్టాలు సహించవలసి ఉంటుందో? కాని అవేమీ ఖాతరు లేదు! ప్రజలు ఇతని పట్ల ఎలా ప్రవర్తిస్తారో అది కూడా లెక్క లేదు!! ఎంత ధైర్యం! ఎంత మనోనిబ్బరం!!" అనుకున్నారు ఆయన.

ముహమ్మద్ (సల్లం) లేచి బయటికి నడిచారు. కళ్ళలో నీళ్ళు సుడులు తిరిగాయి. "నిత్యం నీడగా నిలచిన పెదనాన్న కష్టాల్లో తనను ఏకాకిగా వదిలేసే పరిస్థితి ఏర్పడింది."

"నాయనా ముహమ్మద్!" పెదనాన్న పిలుపుతో దైవప్రవక్త (స) వెనక్కి తిరిగారు.

"అబ్బాయి! నీవు ప్రచారం చేయదలచుకుంది నిర్భయంగా ప్రచారం చేసుకో. నా బొందిలో ప్రాణం ఉన్నంతవరకు నేను నీతోనే ఉంటాను."

పెదనాన్న మాటలు విని ప్రవక్త ముఖారవిందం వికసించింది. కొంగ్రొత్త ఉత్సాహంతో హృదయం ఉప్పొంగి పోయింది.

## పురి విప్పిన పౌరుషం-(36)

సూర్యాస్తమయం అవుతున్న సమయం. క్రమక్రమంగా రేజీకట్లు ముసురుకుంటున్న వేళ. పక్షులు తమతమ గూళ్ళకు చేరుకుంటున్నాయి. బనూహాషిం, బనూముత్తలిబ్ వంశస్థులు అనేకమంది అబూతాలిబ్ ఇంట్లో సమావేశమయ్యారు. సమావేశానికి కారణం తెలియక సభ్యులు పరస్పరం గుసగుస లాడుకుంటున్నారు. అంతలో అబూతాలిబ్ లేచి నిలబడ్డారు. గుసగుసలు ఆగిపోయాయి. నిశ్శబ్దం ఆవరించింది.

"సోదరులారా! నేను మిమ్మల్ని పిలిపించడానికి కారణం ఏమిటంటే, మక్కాలోని ఖురైష్ తెగలన్నీ మన ముహమ్మద్ (స)కు వ్యతిరేకమైపోయాయి. వారు నన్ను మాటిమాటికి బెదిరిస్తున్నారు. ఇప్పుడు పరిస్థితి బెదిరింపుల నుండి జగడానికి చేరుకుంది. నిన్ననే



వారందరూ నా దగ్గరకొచ్చి, ముహమ్మద్ (స)ని తమకు అప్పగించాలని, లేదా యుద్ధానికి సిద్ధపడాలని హెచ్చరించి పోయారు. ఇది ముహమ్మద్‌కు సంబంధించిన వ్యవహారం మాత్రమే కాదు. మన వంశస్థులందరి జీవన్మరణాలకు సంబంధించిన వ్యవహారం.

వారికి ముహమ్మద్ (స) ప్రచారంచేసే ధర్మంపట్ల అంతగా ద్వేషం ఉంటే, దాన్ని వారు తిరస్కరించవచ్చు. అంతేగాని ముహమ్మద్ (స)ని చంపడానికి తమకు అప్పగించమని అడిగే అధికారం వారికి ఎంతమాత్రం లేదు. వారు ఇంత దూరం వచ్చారంటే బలాబలాలు తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్న మాట. యావత్తు బనూహాషిం సంతతికే ధృవతారయిన ముహమ్మద్ (స)ని మనం వారికి అప్పగించేంతటి పిరికిపందలం కాము. ఇది మన పౌరుషం, ఆత్మాభిమానాలకే పెద్ద సవాలు. దీన్ని మనమంతా ఎదుర్కోవాల్సిన సమయం వచ్చింది. అందుకే నేను మిమ్మల్ని పిలిపించాను. మీ అభిప్రాయం ఏమిటో చెప్పండి" అన్నారు అబూతాలిబ్.

"నాయకా! మేమంతా మీ వెంట ఉన్నాం. మీరిచ్చే ప్రతి ఆజ్ఞను శిరసావహించడానికి సిద్ధంగా ఉన్నాం. ముహమ్మద్ (స)ని ఏకాకిగా వదలిపెట్టం. ఇప్పటిదాకా మనం సహించి ఊరుకున్నాం. ఇకముందు ఎంతమాత్రం సహించేది లేదు. మేము దెబ్బకు దెబ్బతీసే సమరయోధులం" అన్నారు సభికులందరూ దృఢసంకల్పంతో.

అబూతాలిబ్ ఈ మాటలు విని ఎంతో సంతోషించారు.

మరుసటిరోజు అబూతాలిబ్, ఇతర కుటుంబసభ్యులు ఈ నిర్ణయం దైవప్రవక్త (సల్లం)కు తెలియజేయడానికి ఆయన ఇంటికి వెళ్ళారు. కాని ఆయన కన్పించలేదు. ఇంట్లో ఉన్నవారు ఆయన ఎక్కడికి పోయారో తమకు తెలియదని చెప్పారు. అబూతాలిబ్ తీవ్ర ఆందోళనచెందారు. దుష్టులు ముహమ్మద్ (స)ని చంపేశారేమో అని ఆయన భయపడ్డారు. వెంటనే ఆయన ఇంటికెళ్ళి బనూహాషిం, బనూఅబ్దుల్ ముత్తలిబ్‌లకు చెందిన యువకులందర్నీ పిలుచుకొని రమ్మని అనుచరుల్ని పురమాయించారు.

అబూతాలిబ్ పిలుపునివ్వడమే తడవు యువకులంతా ఆయన ఇంటికి తొందర తొందరగా చేరుకున్నారు. అప్పుడు అబూతాలిబ్ ఇలా అన్నారు:

"మీరంతా ఒక్కొక్క ఖడ్గం వరలో పెట్టుకొని మీమీ చొక్కాల క్రింద దాచుకోండి. నేను ముందు నడుస్తుంటాను. మీరు నా వెనకాలే నడవండి. నేను కాబా మందిరంలో ప్రవేశించి ఇబ్నుల్ హన్జల (అబూజహల్) ఏ సమావేశంలో కూర్చున్నాడో చూస్తాను. ఆ సమావేశంలోని వారే మన ముహమ్మద్ (సల్లం)ని చంపివుంటారు. కనుక వారిలో మనం ఒక్కడ్నీ వదలి పెట్టకూడదు."

ఆ తర్వాత వారంతా ఆయుధాలు దుస్తుల క్రింద దాచుకొని అబూతాలిబ్ వెంటనే కాబాగృహానికి బయలుదేరారు. దారిలో ప్రవక్త పెంపుడుకొడుకు హజ్రత్ జైద్ బిన్ హారిసా (రజి) ఎదురయ్యారు. ఒకేసారి అంతమంది బనూహాషిం యువకులు కాబాగృహం వైపు పోతుండటం పట్ల ఆయన ఆశ్చర్యపోతూ "నాయకా! ఏమిటీ విశేషం!! ఇంతమంది బనూహాషిం యువకుల్ని తీసుకొని మీరెక్కడికి వెళ్తున్నారు?" అని అడిగారు.

"ముహమ్మద్ (సల్లం) హంతకుల నుండి ప్రతీకారం తీర్చుకోవడానికి."

ఈసారి జైద్ (రజి) మరింత ఆశ్చర్యపోతూ "ఏమిటీ ప్రతీకారమా! ఏమయింది ఆయనకు? ఆయన బాగానే ఉన్నారుగా! నేనిప్పుడే ఆయన దగ్గర్నుంచి వస్తున్నా."

ఈ మాటలు విని అబూతాలిబ్ చల్లగా ఊపిరి పీల్చుకున్నారు.

"క్షేమంగానే ఉన్నారా? సరే, పదండి ఆయన దగ్గరకు వెళ్దాం. ముహమ్మద్ (సల్లం)ని కళ్ళారా చూసుకుంటేగాని శాంతి ఉండదు" అంటూ అబూతాలిబ్ ముందుకుసాగారు.

వారు కాబాలో ప్రవేశిస్తుంటే, కాబాలో కూర్చున్న అవిశ్వాసులు నిర్ఘాంతపోయి "ఏమైంది, ఒకేసారి ఇంతమంది బనూహాషిం వంశస్థులు వస్తున్నారు!" అని చెప్పుకున్నారు.

అంతలో అబూతాలిబ్ వారి ముందుకు వెళ్ళి "నేనిక్కడికి ఏ ఉద్దేశ్యంతో వచ్చానో మీకేమైనా తెలుసా?" అని అడిగారు.

"దైవసాక్షి! మాకేమీ తెలియదు" అన్నారు వారంతా ముక్తకంఠంతో.

అప్పుడు అబూతాలిబ్ విషయం వివరంగా తెలియజేసి, యువకుల్ని తమ తమ చొక్కాల క్రింద దాచుకున్న ఖడ్గాలు బయటికి తీసి చూపమని అన్నారు.

యువకులు తమ ఖడ్గాలన్నీ బయటికి తీసి ప్రదర్శించారు. వాటిని చూసి సత్య తిరస్కారుల గుండెలు క్షణం పాటు దడదడలాడి పోయాయి.

"దైవసాక్షిగా చెబుతున్నాను. ఒకవేళ మీరే గనక ముహమ్మద్ (స)ని చంపివుంటే నేను మీలో ఎవరినీ సజీవంగా వదలిపెట్టేవాడ్ని కాను. చివరికి మా ప్రాణాలు పోయినాసరే, మేము చివరి రక్తపుబొట్టు వరకు మీతో పోరాడేవాళ్ళం"అన్నారు అబూతాలిబ్.

అవిశ్వాసులు బిత్తరబోయి ఒకరి ముఖాలు మరొకరు చూసుకుంటూ చివరికి అబూజహల్ మీదికి దృష్టిసారించారు. పాపం! అబూజహల్ ఏకధాటిగా కారుతున్న చెమటను తుడుచుకుంటున్నాడు!

## బంధువులు కాదు, రాబందులు-(37)

అవిశ్వాసులు ఈసారి మరో ఎత్తుగడ వేశారు. దైవప్రవక్త (స) కుమార్తెలను వారి భర్తల నుండి శాశ్వతంగా వేరుచేసి కసి తీర్చుకోవాలని నిర్ణయించుకున్నారు. ఓరోజు వారు దైవప్రవక్త (స) పెద్దల్లుడు అబుల్ఆస్ చుట్టు చేరి జైనబ్ (రజి)కు విడాకులివ్వమని వత్తిడి చేశారు. కాని అబుల్ఆస్ నిరాకరిస్తూ ఇలా అన్నాడు:

"ఇది మా భార్యాభర్తల వ్యవహారం. మీరు అనవసరంగా నా మీద వత్తిడి తీసుకు రాకండి. జైనబ్ (రజి) తన తండ్రి ధర్మం అవలంబించిందని నాకు తెలుసు. దానివల్ల ఏమవుతుంది? ఆమె నా భార్య. నేనామెను విడిచి ఒక్కక్షణం కూడా ఉండలేను."

అవిశ్వాసులు తమపట్టు విడువకుండా "నీవు జైనబ్‌కు విడాకులిస్తే, మేము నువ్వు కోరుకున్న యువతితో నీ పెళ్ళి చేస్తాం" అన్నారు.



"దైవసాక్షిగా చెబుతున్నాను. జైనబ్ నాకెంతో ప్రియమైన భార్య. నేనామెను ఎలాంటి పరిస్థితిలోనూ వదలిపెట్టను" అన్నాడు అబుల్ ఆస్ కరాఖండిగా.

అవిశ్వాసులు ఈ మాటలు విని అతడ్ని దూషిస్తూ వెళ్ళిపోయారు. వారు అబూలహబ్ దగ్గరకు పోయి అతని కోడళ్ళకు విడాకులిప్పించి పంపేయమని చెప్పారు.

అబూలహబ్ దైవప్రవక్త (సల్లం)కు స్వయాన పెదనాన్న అయినప్పటికీ ఇస్లాం ధర్మాన్ని తిరస్కరించి ఆయనపై కక్ష పెంచుకున్నాడు. అందువల్ల అవిశ్వాసుల ప్రతిపాదన వినగానే అతను తన కొడుకులు ఉత్బా, ఉతైబాలకు చెప్పి, రుఖియా, ఉమ్మెకుల్సూమ్‌లకు విడాకులు ఇప్పించాడు.

అంతటితో ఊరుకోకుండా వీలు చిక్కినప్పుడల్లా దైవప్రవక్త (సల్లం)ను వేధించడం మొదలెట్టాడు. అతని భార్య ఉమ్మెజమీల్ కూడా భర్తకు ఏమాత్రం తీసిపోలేదు. ఆమె దైవప్రవక్త (సల్లం) ఇంటి ముంగిట కసువు, ఇతర మాలిన్యాలను పోసేది. అప్పుడప్పుడు దైవప్రవక్త (సల్లం) నడిచే బాటలో ముండ్లకంప కూడా పడవేసేది.

దైవప్రవక్త (సల్లం) నివశిస్తున్న ఇంటికి పొరుగునే అబూలహబ్ ఇల్లు ఉంది. ఆ రెండిళ్ళను వేరుచేస్తూ మధ్యలో ఒక పిట్టగోడ ఉంది. అందువల్ల అబూలహబ్, అతని భార్య ఉమ్మెజమీల్ వీలు చిక్కినప్పుడల్లా ఆయన్ని వేధించడానికి ప్రయత్నించేవారు.

ఒకరోజు అబూలహబ్ ఇంటికి వస్తూ దారిపక్క పడివున్న మేక పేగులు తీసుకొని వచ్చాడు. దాన్ని ఉమ్మెజమీల్ కిచ్చాడు. ఉమ్మెజమీల్ అవకాశం చూసి ఆ ప్రేగుల్ని పిట్టగోడ మీద ఉంచి నక్కి చూడసాగింది. అప్పుడు దైవప్రవక్త (సల్లం) తమ ఇంటి ముంగిట నమాజ్ చేస్తున్నారు. ఆయన సజ్దాలోకి పోగానే ఉమ్మెజమీల్ ఆ మేక ప్రేగుల్ని ఆయన మీదికి విసిరి పడేసింది. దాంతో ఆ ప్రేగుల్లోని మలినమంతా దైవప్రవక్త (సల్లం) శిరస్సు, బట్టలపై పడి దుర్వాసన వెలువడింది.

దైవప్రవక్త (సల్లం) సజ్దా నుండి తల పైకెత్తి చూశారు. ఉమ్మెజమీల్, ఆమె భర్త అబూలహబ్ విరగబడి నవ్వుతూ నిల్చున్నారు. అంతలో హజ్రత్ ఖదీజా (రజి) లోపలి గది నుంచి బయటికి వచ్చారు. దైవప్రవక్త (సల్లం)పై పడిన ప్రేగులు, మలినం చూసి ఎంతో బాధపడ్డారు. వెంటనే వాటిని తుడిచి నీళ్ళతో కడిగారు.

అవిశ్వాసులు ఎన్నెన్ని అకృత్యాలకు పాల్పడినా దైవప్రవక్త (స) చూస్తూ సహించడం తప్ప పల్లెత్తుమాట అనేవారుకాదు. కాకపోతే మితిమీరిన దౌర్జన్యాలతో విసుగెత్తి "ముత్తలిబ్ వంశీయులారా! మీ పొరుగువారి పట్ల ప్రవర్తించే తీరు ఇదేనా!" అని మాత్రం అనేవారు.

అరబ్బుల్లో తెగ, వంశ పరమయిన పౌరుషం, వీరాభిమానాలు అత్యధికంగా ఉండేవి. విశ్వాసాలు, సిద్ధాంతాలు ఏవయినా తమ తెగ లేక వంశానికి చెందిన మనిషిని ఇతర తెగల, వంశాలకు చెందినవారు దౌర్జన్యం చేస్తే, వారంతా ఏకమయి దౌర్జన్యపరులకు వ్యతిరేకంగా ప్రాణాలకయినా తెగించి పోరాడుతారు. అయితే నూతనధర్మం విషయంలో అబూలహబ్ సాంప్రదాయక అభిమానం, పౌరుషాలకు భిన్నంగా ఇతర వంశస్థులతో

చేతులు కలిపి సొంత తమ్ముడి కొడుకు ముహమ్మద్ (సల్లం) పైనే కత్తికట్టాడు. అందువల్ల అలాంటి కిరాతకుడ్ని గురించి అతని పేరుతో సహా ఇలా దైవవాణి అవతరించింది:

“అబూలహబ్ చేతులు విరిగిపోవు గాక! అతడు సర్వనాశనమై పోవుగాక! అతని సంతానం, సిరిసంపదలేవీ అతనికి ఏమాత్రం పనికిరాకుండా పోతాయి. అతను తప్పకుండా భగభగ మండే (నరకా)అగ్నిలో విసరివేయబడతాడు. అతనితోపాటు తగవులు పెట్టి తమాషా చూసే అతని భార్య కూడా. (మరణానంతరం) ఆమె మెడలో బాగా పేనిన గట్టి తాడొకటి (కంఠపాశంగా) ఉంటుంది.” (ఖుర్ఆన్-111)

ఉమ్మెజమీల్ తనను గురించి ఇలాంటి సూక్తులు అవతరించాయని తెలిసి కోపోద్రేకాలతో ఊగిపోయింది. అప్పటికప్పుడు ఆమె చేతిలో ఓ పెద్ద రాయి తీసుకొని సరాసరి కాబా మందిరానికి వెళ్ళింది.

కాబాగృహంలో ఓ మూలన దైవప్రవక్త (సల్లం)తో పాటు కూర్చున్న హజ్రత్ అబూబకర్ (రజి) కంగారుపడుతూ “దైవప్రవక్తా! ఉమ్మెజమీల్ వస్తోంది. ఆవిడ మీకేదయినా కీడు తలపెడ్తుందేమోనని నాకు అనుమానంగా ఉంది” అన్నారు. దానికి దైవప్రవక్త (స) “కంగారు పడకు. ఆమె నన్ను చూడలేదు” అన్నారు.

ఉమ్మెజమీల్‌కు నిజంగానే దైవప్రవక్త (సల్లం) కన్పించ లేదు. అప్పుడామె అబూబకర్ (రజి)ని ఉద్దేశించి “మీ మనిషి నాకు వ్యతిరేకంగా ఏవో కారుకూతలు కూశాడని విన్నాను నిజమేనా?” అని అడిగింది. దానికి ఆయన “లేదే, ఆయన నీకు వ్యతిరేకంగా ఏదీ అన లేదే” అన్నారు. ఈమాట విని ఆమె అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

అబూలహబ్ లాగానే అబూజహల్ అనే మరో కర్కోటకుడు ఉన్నాడు. ఆ పేరు (అజ్ఞాన పిత)ను బట్టే అతనికి ఏమాత్రం బుద్ధి లేదని తెలుస్తోంది. అతను దైవప్రవక్త (సల్లం)కు దగ్గరి బంధువు కాకపోయినా, వరసకు పెదనాన్న అవుతాడు. అతను కూడా దైవప్రవక్త (సల్లం)కు బద్ధవిరోధి అయ్యాడు. అతనిలో జాలి, కరుణ అనేవి ఏ కోశానా లేవు. నీతి నియమాలు అంతకన్నా లేవు.

అతను దైవప్రవక్త (స)ను ఎప్పుడూ ఏదో విధంగా వేధించడం, అల్లరి చేయడమే పనిగా పెట్టుకున్న పరమదుర్మార్గుడు. ఆయనపై దుష్ప్రచారం చేసి ఇతరుల్ని కూడా ఉసిగొల్పుతాడు. నమాజ్ చేస్తుంటే గలాభాచేస్తాడు. దైవసందేశ ప్రచారం చేస్తుంటే రౌడీలను, అల్లరిమూకలను పిలిచి నానారభస చేయిస్తాడు. “ముహమ్మద్‌ని నామరూపాలు లేకుండా చేయండి, అప్పుడే మీకు శాంతి ఉంటుంది” అని జనంతో చెబుతుంటాడు.

అబూజహల్ ఓరోజు బాగా ఆలోచించి తన మిత్రమూకతో ఇలా అన్నాడు:

“మిత్రులారా! దైవసాక్షిగా చెబుతున్నా, వినండి. రేపు ఓ పెద్ద బండరాయి తీసుకొని కాబా దగ్గర కూర్చుంటాను. ముహమ్మద్ నమాజ్ చేయడానికి వస్తాడు కదా! అతను సజ్దాలోకి పోగానే బండరాయి ఎత్తి అతనిపై పడేస్తాను. ఒకేఒక దెబ్బకు అతని తలకాయ చితికిపోతుంది. మీరు సహకరించినా సహకరించకపోయినా నేనీ పని చేసితీరుతా. ఆపైన ఏమవుతుందో చూస్తా. మునాఫ తెగవాళ్ళు ఏం చేస్తారో అదీ చూద్దాం.”



“మిత్రమా! మేము నీతో సహకరించకపోవటమనేది ఎన్నటికీ జరగదు. నీవు అనుకున్న పని నిర్భయంగా చేసెయ్యి. నీకు మా మద్దతు పూర్తిగా ఉంటుంది” అన్నారు అతని సహచరులు అతడ్ని మరింత ఉసిగొల్పుతూ.

మరునాడు ఉదయం అబూజహల్ పథకం ప్రకారం పెద్ద బండరాయి తీసుకొని కాబా దగ్గర దైవప్రవక్త (స) రాక కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు. కాస్సేపటికి దైవప్రవక్త (సల్లం) వచ్చి నమాజులో నిమగ్నులయి పోయారు. ఆయన సజ్దాలోకి పోగానే అబూజహల్ బండరాయి ఎత్తుకొని ముందుకు నడిచాడు.

కొంచెం దూరంలో కూర్చున్న అతని అనుచరులు జరగబోయే తమాషా కోసం ఊపిరి బిగబట్టి చూడసాగారు. అబూజహల్ మరో రెండడుగులు ముందుకు నడిచి ఎందుకో అకస్మాత్తుగా ఆగిపోయాడు. ఆ తరువాత ఒక్క అడుగ్గూడా ముందుకు వేయలేక ముచ్చెమటలతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. గుడ్లు తేలవేశాడు. చేతుల్లో బండరాయి అలాగే పట్టుకొని గజగజ వణికిపోతూ నిల్చున్నాడు.

అతని స్నేహితులు అది చూసి మ్రాన్పడిపోయారు. దగ్గరకు వెళ్ళి “అబూజహల్! ఏమయింది, అలా వణికిపోతున్నావు?” అని అడిగారు.

“గుడ్డి వెధవల్లారా! మీకు కన్పించడం లేదా? నా ముందు అగ్నిగుండం ఎలా భగభగ మండుతుందో చూడండి. ఇక ఏమాత్రం అడుగు ముందుకేసినా కాలి బూడిదయిపోతాను” అన్నాడు అబూజహల్ రొప్పుతూ.

ఈ మాటలు విని వాళ్ళు మరింత ఆశ్చర్యపోయారు.

“అగ్నిగుండమా! ఏది, ఎక్కడ? కాదు, ఇదంతా నాటకం. ఇతనీ పని చేయడానికి భయపడుతున్నాడు. తప్పించుకోవడానికి ఇదో ఎత్తుగడ” అనుకున్నారు వారు.

అయితే వారిలో ఒకడు ఆవేశంతో అబూజహల్ చేతిలోని రాయి తీసుకొని, దైవప్రవక్త (సల్లం)ను సమీపించబోయాడు. అంతే, అతను కూడా తక్కున ఆగిపోయాడు. ముందుకు అడుగు వేయలేక జావగారిన ముఖంతో వెనక్కి మరలాడు.

కాని ఆ దుర్మార్గుడు అంతటితో తన ఆగడాలు మానుకోలేదు. మరొకరోజు దైవప్రవక్త (సల్లం)ను వేధించే ఉద్దేశ్యంతో కాబాలయానికి వెళ్ళాడు. అక్కడ దైవప్రవక్త (సల్లం) ఓచోట నమాజులో నిమగ్నులయి ఉండటం చూశాడు.

“ఫలానా వీధిలో ఒంటె ప్రేగులు పడివున్నాయి. మీలో ఎవరైనా వాటిని తీసుకొస్తారా, ముహమ్మద్‌పై పడవేద్దాం?” అన్నాడు అబూజహల్.

“నేను వెళ్ళి తీసుకొస్తాను, ఉండండి” అంటూ ఉఖ్బా బిన్ అబీ ముయీత్ బయలుదేరాడు. కాస్సేపటికి అతను ఒంటె ప్రేగులు తీసుకొని వచ్చాడు.

దైవప్రవక్త (సల్లం) సాష్టాంగపడి దైవధ్యానంలో లీనమైఉన్నారు. అబూజహల్ మలినంతో కూడిన ఒంటె ప్రేగుల్ని ఎత్తి దైవప్రవక్త (సల్లం) మెడ మీద పెట్టాడు. ఆ తరువాత అతను, అతని మిత్రమూక విరగబడి నవ్వడం మొదలెట్టారు.

దైవప్రవక్త (స) ధ్యానంలో పూర్తిగా లీనమయి ఉండవల్ల ఈ గొడవ సంగతే ఆయన గమనించడంలేదు. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి) కూడా అక్కడ ఉన్నారు. కాని ఆయన అవిశ్వాసుల గుంపు చూసి ప్రేగుల్ని తొలగించడానికి భయపడ్డారు.

అంతలో చిన్నారి ఫాతిమా (రజి) యాదృచ్ఛికంగా అక్కడికి వచ్చారు. తండ్రి వీపు మీద ఒంటె ప్రేగులు చూసి తల్లడిల్లి పోయారు. వెంటనే ఆమె వాటిని తొలగించారు. ఆ తరువాత ఈ అకృత్యానికి పాల్పడిన అవిశ్వాసుల్ని నానామాటలు అని వెళ్లిపోయారు.

## విశ్వాసులపై విరుచుకుపడిన కష్టాలు-(38)

అవిశ్వాసులు ఇస్లాం ప్రచారం నుండి దైవప్రవక్త (స)ను అడ్డుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. కాని అవేమీ ఫలించకపోవడంతో ఆయన అనుచరులపై దాడి చేయడానికి పూనుకున్నారు. ఈపని కోసం వారు ఇతరతెగలను కూడా కలుపుకున్నారు.

దాంతో ముస్లింలపై గొప్ప విపత్తు వచ్చిపడింది. ముఖ్యంగా పేద ముస్లింలు దుర్భర దౌర్జన్యకాండకు గురయ్యారు. కొందరు అవిశ్వాసులు వారిని కొరడాలతో కొట్టి హింసించసాగారు. మరికొందరు వారి శరీరాల మీద వాతలు పెడ్తున్నారు. ఇంకా కొంత మంది వారిని నీళ్ళలో ముంచి ఊపిరాడకుండా చేస్తున్నారు. ఇక బానిసలుగా ఉన్న ముస్లింలపై జరుగుతున్న అఘాయిత్యాలయితే చెప్పనలవి కావు. గుక్కెడు మంచినీళ్ళు కూడా ఇవ్వకుండా చీకటి కొట్లలో బంధించి, ఆ తరువాత మండుటెండలో కాలే ఇసుక తిన్నెల మీద పడేసి ఈడుస్తూ వారిని రకరకాలుగా హింసిస్తున్నారు.

భూమ్యాకాశాలు రోదిస్తున్నా, మానవత్వం నెత్తీ నోరు కొట్టుకున్నా ఈ కిరాతకుల రాతిగుండెల్లో కనికరం కాస్తయినా కలగడం లేదు. ఈ హింసాదౌర్జాన్యాలు చూసి కొందరు ముస్లింలు తమ విశ్వాసాన్ని లోలోపలే దాచుకుంటున్నారు. అయితే సత్యధర్మాన్ని నమ్మి దాని ప్రకారం నడచుకునే దృఢమనస్కులు సహన స్థయిర్యాలతో శత్రువుల దౌర్జాన్యాలను తట్టుకుంటూ ఇస్లామీయ ఉద్యమంలో పురోగమిస్తున్నారు.

అటువంటి సాహసవంతులలో యాసిర్ (రజి), ఆయన అర్ధాంగి సుమయ్యా (రజి), తనయుడు అమ్మార్ (రజి) కూడా ఉన్నారు. నూతన ధర్మం విశ్వసించిన కారణంగా వారి బంధువులే వారికి పరమ శత్రువులుగా మారారు. వారు హజ్రత్ యాసిర్ (రజి)ను మిట్ట మధ్యాహ్నపు మండుటెండలో ఇసుక నేల మీద నగ్నంగా పడేసి కొరడాలతో వళ్ళు హూనం చేసేవారు. నిప్పుతో వాతలు పెట్టేవారు. మరొకప్పుడు ఆయన్ని నీళ్ళలో ముంచి ఊపిరాడకుండా అదిమి ఉంచేవారు.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఆయన దయనీయ స్థితి చూసి "ఓర్చుకో యాసిర్! సకల సౌఖ్యాలిచ్చే నీ శాశ్వతస్థానం స్వర్గంలో ఉంది" అని ఓదార్చారు. చివరికి హజ్రత్ యాసిర్ (రజి) అవిశ్వాసులు పెడ్తున్న బాధలు అనుభవిస్తూ ప్రాణం విడిచారు.

ఆయన సతీమణి హజ్రత్ సుమయ్యా (రజి) గాథ కూడా దయనీయమైనదే. పరమ దుర్మార్గుడైన అబూజహల్ ఇంట్లో ఆమె బానిసగా ఉన్నారు. కేవలం ఇస్లాం



స్వీకరించిన కారణంగా ఆ సాధ్వీమణిని అతను బాధించడం మొదలెట్టాడు. ఒకరోజు పట్టరాని కోపంతో ఊగిపోతూ అనరాని మాటలు అన్నాడు. అంతటితో ఊరుకోకుండా ఆ దుర్మార్గుడు చేతిలో వున్న ఈటెను ఎత్తి హజ్రత్ సుమయ్యా (రజి) మీదికి బలంగా విసిరాడు. ఆ దెబ్బకు ఆమె విలవిల్లాడుతూ నేలకొరిగారు. సత్యధర్మ పథంలో ప్రప్రథంగా రక్తం ధారపోసి అమరగతినొందిన అదృష్టం స్త్రీలలో ఆ ధీరవనితకే దక్కింది.

హజ్రత్ అమ్మార్ (రజి)ను కూడా అవిశ్వాసులు ఘోరాతిఘోరంగా హింసించారు. వారాయనకు ఇనుప కవచం తొడిగించి నిప్పులు చెరిగే ఎండలో చాలాసేపు నిలబెట్టేవారు. మండుతున్న ఇసుకనేల మీద పడేసి స్పృహ తప్పేవరకు కొట్టేవారు. ఈవిధంగా ఆ దుర్మార్గులు హజ్రత్ అమ్మార్ (రజి)ని హింసిస్తూ, తాము చెప్పినట్లు ముహమ్మద్ (స)ని దూషించి తమ దేవతలను పొగడవలసిందిగా బలవంతం చేశారు. చివరికి హజ్రత్ అమ్మార్ (రజి) ఈ బాధలకు తాళలేక వారు పలకమన్న మాటలన్నీ పలికారు.

ఆ తరువాత ఆయన రోదిస్తూ దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి "దైవప్రవక్తా! నేను మిమ్మల్ని గురించి చెడుగా, వారి దేవతలను గురించి మంచిగా పలకనంతవరకు వారు నన్ను వదలిపెట్ట లేదు" అని చెప్పారు.

దైవప్రవక్త (స) ఈమాట విని "అప్పుడు నీ హృదయ పరిస్థితి ఎలా ఉండింది?" అని అడిగారు. "నేనప్పుడు పూర్తి విశ్వాస (ఈమాన్) స్థితిలోనే ఉన్నాను."

"అయితే వారు మరెప్పుడైనా దౌర్జన్యంచేస్తే నీవు మళ్ళీ అలాంటి మాటలే పలుకు" అన్నారు దైవప్రవక్త (స).

అలాంటి సాహసవంతులలో హజ్రత్ ఖబ్బాబ్ (రజి) కూడా ఉన్నారు. ఈయన ఉమ్మె అన్మార్ బానిస. ఉమ్మెఅన్మార్ ఇనుప కడ్డీ కాల్చి తరచుగా ఖబ్బాబ్ (రజి) తల మీద వాతలు పెట్టి బాధిస్తుండేది. ఒకసారి ఆమె బొగ్గులు కాల్చి వాటిపై ఖబ్బాబ్ (రజి)ని వెల్లకిలా పండబెట్టింది. ఆ వేడికి ఖబ్బాబ్ (రజి) శరీరం కాలి చిట్లిపోయింది. చివరికి చిట్లిన దేహం నుండి కారిన ద్రవంతోనే నిప్పులు చల్లారాయి.

ఈబాధలు భరించలేక ఆయన ఒక రోజు దైవప్రవక్త (స)తో తన కష్టాలు చెప్పుకోవడానికి కాబా వెళ్ళారు. అప్పుడు దైవప్రవక్త (స) కాబాగోడకు ఆనుకొని కూర్చొనిఉన్నారు.

"దైవప్రవక్తా! మా కోసం దైవాన్ని ప్రార్థించరూ?" అన్నారు హజ్రత్ ఖబ్బాబ్ (రజి).

ఈ మాట వినగానే దైవప్రవక్త (సల్లం) ముఖం కోపంతో జేవురించింది. ఒక్కసారిగా ఆయన కదలి నిటారుగా కూర్చున్నారు.

"ఏమిటీ! మీపై కష్టాలు వచ్చిపడ్డాయా? గత కాలంలోని విశ్వాసులపై మీకంటే ఘోరమైన కష్టాలు వచ్చిపడ్డాయి. వారిలో ఒకడ్ని నేలలో గుంట తవ్వి అందులో కూర్చోబెట్టి అతని తల మీద రంపం పెట్టి చీల్చివేయడం జరిగింది. మరొకడ్ని ఇస్లాం నుండి మరల్చడానికి అతని కీళ్ళలోకి ఇనుప దువ్వెనలు గుచ్చి లాగివేయడం జరిగింది. దైవసాక్షి! ఈ పని ఎట్టి పరిస్థితిలోనూ నెరవేరుతుంది. చివరికి ఒక స్త్రీ విలువైన నగలు ధరించి సనా

నుండి హజ్రెమౌత్ వరకు నిర్భయంగా ప్రయాణం చేస్తుంది. అప్పుడామె మనసులో దైవభయం తప్ప మరెవరి భయమూ ఉండదు'' అన్నారు ఆయన.

ఆ తరువాత ఆయన ''ప్రభూ! ఖబ్బాబ్‌ని కాపాడు'' అని దైవాన్ని ప్రార్థించారు.

ఈ ప్రార్థన ఫలితానిచ్చింది. ఉమ్మెఅన్మార్ తలలో ఏదో రోగం పుట్టి ఆమెను తీవ్రంగా బాధించడం మొదలెట్టింది. వైద్యులు ఆమెను పరీక్షించి, ఇనుప చువ్వ ఎర్రగా కాల్చి తల మీద వాతపెడ్తే రోగం నయమవుతుందని చెప్పారు. శిరోబాధ భరించలేని ఉమ్మెఅన్మార్ అలాగే చేయించుకుంది. దాంతో ఉమ్మెఅన్మార్ హజ్రత్ ఖబ్బాబ్ (రజి)కు పెట్టిన బాధలకు విరుగుడయి, ఆమె శాశ్వతంగా మృత్యుకోరల్లోకి పోయింది.

ఇస్లాం ధర్మాన్ని విశ్వసించి అత్యంత కఠిన పరీక్షలలో నెగ్గిన అదృష్టవంతులలో హజ్రత్ బిలాల్ (రజి) కూడా ఒకరు. ఈయన ఉమయ్యా దగ్గర బానిసగా ఉంటున్నారు. కేవలం ఇస్లాంని విశ్వసించినందువల్ల ఆయన్ని ఉమయ్యా రకరకాలుగా హింసించ సాగాడు. అప్పుడప్పుడు కూడూనీళ్ళూ ఇవ్వకుండా కడుపు మాడ్చేవాడు.

ఓరోజు మధ్యాహ్నం ఆ కిరాతకుడు హజ్రత్ బిలాల్ (రజి)ని కాళ్ళుచేతులు కట్టి మండుటెండలో ఇసుక మీద పండబెట్టించాడు. అక్కడే నిల్చున్న ఉమయ్యా స్నేహితులు బిలాల్(రజి) బాధపడుతుంటే వెకిలిగా నవ్వసాగారు. ఉమయ్యా అంతటితో కసితీరక ఓ బండరాయిని రొప్పుతూ తీసుకొచ్చి బిలాల్ (రజి) ఛాతీ మీద పెట్టి ఇలా అన్నాడు:

''ఇప్పటికైనా మించిపోయిందిలేదు. ఇస్లాం విడిచిపెట్టి లాత్, ఉజ్జా విగ్రహాలను పూజించు. లేకపోతే నీ గతి ఇంతే. చచ్చేవరకు నిన్ను వదలిపెట్టను.''

హజ్రత్ బిలాల్ (రజి) వీపు కింద ఇసుక ఆయన దేహాన్ని చురచురా కాలుస్తోంది. పైగా పుండుమీద కారం చల్లినట్లు ఎద మీదున్న బండరాయి బరువుకు ఆయన ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఆ బాధలోనే ఊపిరి బిగబట్టి 'అహద్! అహద్!!' (దేవుడొక్కడే, దేవుడొక్కడే) అని అన్నారు ఏమాత్రం సడలని విశ్వాసంతో.

ఓరోజు దైవప్రవక్త (స) అటుగా రావడం జరిగింది. విషాదకరమైన ఈ దృశ్యం చూసి ఆయన చలించిపోయారు. ఆవేదనాపూరిత హృదయంతో ''బిలాల్! ఓర్చుకో. కరుణామయుడైన అల్లాహ్ నీకు త్వరలోనే విముక్తి కలిగిస్తాడు'' అన్నారు ఆయన.

హజ్రత్ అబూబకర్ (రజి) కూడా బిలాల్ (రజి) పడుతున్న బాధలు చూడలేక పోయారు. ఒకరోజు ఆయన ఉమయ్యా ఆటవిక చర్యలు చూసి ''ఉమయ్యా! నీకు కాస్తయినా దైవభీతి లేదా? ఆ అమాయకుడ్ని అలా బాధిస్తున్నావు, నువ్వెంత నిర్దయుడవయ్యా!'' అన్నారు.

''అసలు నువ్వే ఇతడ్ని నాశనం చేశావు. ఎందుకూ పనికిరాని ఇలాంటి వాడ్ని పెట్టుకొని నేనేం చేసుకోను?''

''అలాగయితే నా దగ్గర విగ్రహారాధకుడయిన బానిస ఉన్నాడు. నువ్వతడ్ని తీసుకొని బిలాల్ (రజి)ని నాకివ్వు.''



''సరే, నీ బానిసను నాకిచ్చేసి ఇతడ్ని తీసికెళ్ళు'' అన్నాడు ఉమయ్యా తనకు మంచి బానిస లభించబోతున్నాడనే సంతోషంతో.

హజ్రత్ అబూబకర్ (రజి) తన బానిసను ఉమయ్యాకు ఇస్తారు. అతని దగ్గర్నుంచి హజ్రత్ బిలాల్ (రజి)ని తీసుకుంటారు. ఆ తరువాత వెంటనే బిలాల్ (రజి)ని శాశ్వతంగా బానిసత్వం నుంచి విముక్తం చేస్తారు.

## అబిసీనియాకు (హిజ్రత్) వలస-(39)

సత్యతిరస్కారులు ఇస్లాంవ్యతిరేక కార్యకలాపాలు ఉధృతం చేశారు. ముఖ్యంగా ప్రవక్త అనుచరులపై వారి దౌర్జన్యాలు మితిమీరిపోయాయి. దైవప్రవక్త (స) ఈ పరిస్థితి చూసి తీవ్రంగా ఆందోళన చెందారు. ఇక ఈ దేశంలో ఇస్లాం పట్ల పరిపూర్ణ విశ్వాసంతో ప్రశాంతంగా మనుగడ సాగించడం సాధ్యం కాదని భావించారు.

''దేవుని భూమి విశాలంగా ఉంది. మీరు దుర్మార్గులకు దూరంగా మరో ప్రాంతానికి వెళ్ళిపోండి'' అని చెప్పారు ఆయన తన అనుచరులకు సలహా ఇస్తూ.

''దైవప్రవక్తా! ఎక్కడికి వెళ్ళమంటారు? అదీ మీరే చెప్పండి'' అన్నారు అనుచరులు.

''అబిసీనియా వెళ్ళండి. అక్కడి రాజు నజాషీ (నీగస్) క్రైస్తవ మతస్థుడు, చాలా ధర్మాత్ముడు. మీకు ఏలోటూ రానివ్వడు'' అన్నారు దైవప్రవక్త (సల్లం).

మహనీయ ముహమ్మద్ (సల్లం) దైవదౌత్య బాధ్యత చేపట్టి నాలుగేళ్ళు దాటి అయిదవ సంవత్సరం రజబ్ నెల జరుగుతోంది. ప్రవక్త అనుమతి లభించగానే ముందుగా పదకొండు మంది పురుషులు, నలుగురు స్త్రీలు మక్కా నుండి బయలుదేరారు. వారిలో ఉస్మాన్ బిన్ అప్ఫాన్, ఆయన భార్య రుఖియా, హుజైఫా బిన్ ఉఖ్బా, ఉస్మాన్ బిన్ మజ్‌వూన్, అబ్దుల్లా బిన్ మసూద్, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, జుబైర్ బిన్అవ్వామ్, ముస్అబ్ బిన్ ఉమైర్, ఆమిర్ బిన్ రబియా, సుహైల్ బిన్ బైజా (రజి) ముఖ్యులు.

వారందరూ మక్కా నుండి జిద్దా వెళ్ళి అక్కడ్నుంచి ఓడలో అబిసీనియా చేరుకున్నారు. ఈ సంగతి తెలియగానే ఖురైషీయులు వారిని పట్టుకోవడానికి జిద్దా రేవుకు పరుగెత్తారు. కాని అప్పటికే ఓడ జిద్దానుండి వెళ్ళిపోయిందని తెలుసుకొని వారు హతాశులయ్యారు.

ముస్లింలు ఆ తరువాత కూడా రహస్యంగా జట్లుజట్లుగా బయలుదేరి అబిసీనియా చేరుకున్నారు. ఒక జట్టుతో కలసి హజ్రత్ జాఫర్ బిన్ అబూతాలిబ్ (రజి) కూడా అబిసీనియా చేరుకున్నారు. ఈ విధంగా మొత్తం ఎనభై మందికిపైగా ముస్లింలు చేరుకొని అబిసీని యాలో ప్రశాంతజీవితం గడపసాగారు.

మక్కాలో అవిశ్వాసులు మిగిలిన ముస్లింలను వేధిస్తూనే ఉన్నారు. అది రమజాన్ నెల. కాబా మందిరంలో ఓరోజు ఖురైషీయులతో పాటు సామాన్య ప్రజలు కూడా అనేక మంది వచ్చి కూర్చున్నారు. అందరూ కబుర్లు చెప్పుకోవడంలో, నూతన ధర్మం గురించి ముచ్చటించు కోవడంలో మునిగిపోయారు.

కాస్సేపటికి దైవప్రవక్త (సల్లం), ఆయన అనుచరులు కాబాలో ప్రవేశించారు. దైవప్రవక్త (సల్లం) ఆరోజు ప్రజలు ఎక్కువగా ఉండటం గమనించి వారికి దైవసందేశం విన్పించే ఉద్దేశ్యంతో ఖుర్ఆన్ పఠనం ప్రారంభించారు:

“అస్తమిస్తున్న నక్షత్రం సాక్షి! మీ సహచరుడు (పొరపాటున కూడా) దారితప్ప లేదు, (కావాలని కూడా) పెడదారి పట్టలేదు. అతను తన మనోవాంఛలకు తలయొగ్గి మాట్లాడడు. ఇది అతని (హృదయఫలకం)పై అవతరింపజేయబడిన దివ్యావిష్కృతి. ఎంతో వివేకవంతుడైన ఓ మహాశక్తిమంతుడు (జిబ్రీల్) అతనికీ విషయాలు నేర్పుతున్నాడు.

అతను తూర్పుదిక్కున ఎగువ దిగ్మండలంపై ఉన్నప్పుడు ఇతను అతనికి ఎదురుగా నిలబడ్డాడు. తరువాత మరికాస్త దగ్గరగా వచ్చి శూన్యంలో నిల్చున్నాడు. ఈవిధంగా అతను రెండు ధనస్సులంత దూరాన లేక అంతకంటే కొంచెం తక్కువ దూరాన (వచ్చి) నిలబడ్డాడు. అప్పుడతను దైవదాసునికి అందజేయవలసిన దివ్యసందేశం అందజేశాడు. కళ్ళు చూసిన దానిలో హృదయం అసత్యాన్ని మిళితం చేయలేదు. ఇలా చర్మచక్షువులతో చూసిన దాని విషయంలో మీరు ఇతనితో వాదిస్తున్నారా?

ఇతను మరోసారి కూడా అతడ్ని (సప్తమాకాశంలో) ‘సిద్రతుల్ ముస్తహా’ అనే దివ్య వృక్షరాజం దగ్గర చూశాడు. దాని దరిదాపులోనే నివాసయోగ్యమైన స్వర్గధామం ఉంది. ఆ సమయంలో ఆ వృక్షరాజంపై అనిర్వచనీయమైన అద్భుతమేదో ఆవరిస్తూ ఉండింది. అతని చూపులు వేరే వైపు మరలడంగాని, హద్దుమీరి ముందుకు పోవడంగాని జరగలేదు. (ఇలా) అతను తన ప్రభువు(ప్రతిభ)కు సంబంధించిన గొప్ప నిదర్శనాలలో కొన్నిటిని చూశాడు.

ఇక మీరే చెప్పండి, ఎప్పుడైనా మీరు (మీ మిథ్యాదైవాలైన) లాత్, ఉజ్జా, మరో (దేవతా) విగ్రహమైన మనాత్‌లను గురించి (ప్రశాంత మనస్సుతో) ఆలోచించారా? మీకు కొడుకులు, దేవునికైతే కూతుళ్ళా? ఇది చాలా దారుణమైన అక్రమ విభజన!

నిజానికి ఇవి మీరు, మీ పూర్వీకులు పెట్టుకున్న కొన్ని పేర్లు తప్ప మరేమీ కాదు. వీటిని గురించి దేవుడు ఎలాంటి ప్రమాణం పంపలేదు. జనం కేవలం ఊహాజనిత విషయాల్ని అనుసరిస్తూ మనోవాంఛలకు బానిసలయిపోయారు. వారి దగ్గరకు వారి ప్రభువు నుండి చక్కని హితోపదేశం వచ్చింది. (అయినా వారు అంధులయి అపమార్గంలో పడి కొట్టు మిట్టాడు తున్నారు.) మానవుడు తాను కోరుకున్నదే తనపాలిట సత్యం (ధర్మం) అవుతుందా? ఇహపర లోకాలు (అన్నీ) దేవుని అధీనంలోనే ఉన్నాయి. (ఖుర్ఆన్. 53:1-25)............”

దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఖుర్ఆన్ పఠిస్తున్నంతసేపూ ముస్లింలతో పాటు బహుదైవారాధకులు కూడా ఎంతో శ్రద్ధగా దాన్ని విన్నారు. దైవప్రవక్త (సల్లం) ఈ అధ్యాయం పఠించి సజ్దా (సాష్టాంగప్రమాణం) చేశారు. ఆయనతో పాటు ముస్లింలు, వారితో పాటు బహుదైవారాధకులు కూడా సజ్దా చేశారు. అవిశ్వాసులు సజ్దా చేయడం చూసి ముస్లింలు ఆశ్చర్యపోయారు.

అవిశ్వాసులు ఆ తర్వాత తమవల్ల జరిగిన పొరపాటు గ్రహించి నాలుక కరచు కున్నారు. ఖుర్ఆన్ వినకూడదని ప్రజల్ని వారించే ఖురైష్‌నాయకులకు ఈరోజు ఏమైంది?



ఈరోజు ఖుర్ఆన్‌ని శ్రద్ధగా వినడమేగాక, దైవప్రవక్త (స)తోపాటు సజ్దా కూడా చేశారే! ప్రజల నుండి వస్తున్న ఈ విమర్శలకు సమాధానంగా వారు పసలేని సాకులు చెప్పుకుంటూ తమ పరువు దక్కించుకోవడానికి కొన్నాళ్ళు వృథా ప్రయాసపడ్డారు.

ఈ వార్త అబిసీనియాకు కూడా చేరింది. అయితే అది మరికొన్ని మాటలతో కలసి వదంతిగా మారి ముస్లింలకు చేరింది. దాంతో ముస్లింలు మక్కాలో ఖురైషీయులతో పాటు అవిశ్వాసులంతా ముస్లింలయి పోయారని భావించి సంబరపడిపోతూ అబిసీనియా నుండి మక్కాకు తిరిగొచ్చారు.

కాని మక్కాలో ప్రవేశించగానే ఆ వార్త నిజం కాదని, ఖురైషీయులు యధాప్రకారం ముస్లింలను వేధిస్తూనే ఉన్నారని తెలిసింది. దాంతో అబిసీనియా నుండి వచ్చిన ముస్లింలు పట్నం వెలుపల నుండే మళ్ళీ అబిసీనియా వెళ్ళిపోయారు. మరికొందరు ముస్లింలు సహృదయులైన బహుదైవారాధకుల సహాయంతో మక్కాలోనే ఆశ్రయం పొందారు. ఆ తర్వాత వారు మరికొందరు ముస్లింలతో కలసి అబిసీనియా వెళ్ళిపోయారు.

మక్కా అవిశ్వాసులకు ముస్లింలు అబిసీనియాకు పోయిన సంగతి తెలిసిపోయింది. దాంతో వారు బుసలు కొట్టారు. వెంటనే వారు కాబాలో సమావేశమై ఒక నిర్ణయానికి వచ్చారు. దాని ప్రకారం వారు ఇద్దరు ప్రతినిధుల్ని నజాషీ దగ్గరకు పంపారు.

వారిద్దరు అబిసీనియా వెళ్ళి ముందుగా క్రైస్తవ పాదరీలను కలుసుకున్నారు. క్రైస్తవ మతపెద్దల్ని తమ వైపు తిప్పుకొని పని గడుపుకునేందుకు వారికి విలువైన కానుకలిచ్చారు. తరువాత వారు రాజు నజాషీ దగ్గరకెళ్ళి అతనికి కూడా విలువైన కానుకలు సమర్పించు కొని ఇలా విన్నవించుకున్నారు:

“మహారాజావారికి ప్రణామములు. మా దేశం నుండి కొందరు నేరస్థులు పారిపోయి వచ్చి తమరి దగ్గర తలదాచుకున్నారని తెలిసింది. వారు మా సాంప్రదాయక మతం వదలి మతభ్రష్టులై పోయారు. మహారాజావారి మతమైన క్రైస్తవాన్ని కూడా వారు స్వీకరించ లేదు. మనకెవరికీ తెలియని ఓ కొత్తమతం లేవదీసి జాతి వినాశానికి పాల్పడ్డారు. అంచేత మా నాయకులు వీళ్ళను తీసుకు రమ్మని మమ్మల్ని పంపారు. వీరి గుణగణాల ఎలాంటివో మా నేతలకు బాగా తెలుసు. ఇలాంటి మతభ్రష్టుల్ని, జాతివిద్రోహుల్ని ఇక్కడ మీ దేశంలో ఉంచుకోవడం మంచిది కాదు. దయచేసి వీళ్ళను మాకు అప్పగించండి.”

ముందే కానుకలు స్వీకరించిన క్రైస్తవ మతనాయకులు మక్కా అవిశ్వాసులకు వంతపాడుతూ ఇలా అన్నారు: “మహారాజా! వీరు చెప్పేది నిజమే. ఇటీవల అరేబియా నుంచి కొందరు నేరస్థులు పారిపోయి వచ్చి ఇక్కడ నివసించసాగారు. ఆ నేరస్థుల్ని వీరికి అప్పగించడమే మనకు అన్ని విధాలా శ్రేయస్కరంగా ఉంటుంది.”

రాజదర్బారు నిశ్శబ్దంగా ఉంది. సభికులంతా రాజుగారి వైపే దృష్టిసారించి ఏం ఆజ్ఞాపిస్తారోనని ఎదురు చూడసాగారు. రాజుగారి భృకుటి ముడివడింది.

“వీల్లేదు. వారు మాఆశ్రయం కోరి, మాదగ్గర ఉండటానికి ఇష్టపడ్డారు. వాస్తవం ఏమిటో వారి నోటనే విందాం. వెంటనే వాళ్ళను మా సమక్షంలో ప్రవేశపెట్టండి.”

ఈ మాటలు వినగానే ఖురైష్ ప్రతినిధుల గుండెలు వేగంగా కొట్టుకోవడం ప్రారంభించాయి. కాస్సేపటికి రాజభటులు వలసవచ్చిన ముస్లింలను నజాషీ రాజు దర్బారులో ప్రవేశపెట్టారు.

"మీరు మీ సాంప్రదాయక మతం వదిలేసి, ఇటు క్రైస్తవమతం కూడా కాదని ఏదో కొత్తమతం అవలంబించారని విన్నాం. ఏమిటా కొత్తమతం?" అడిగాడు రాజు.

అక్కడ వలస వచ్చిన ముస్లింలలో అబూతాలిబ్ కొడుకు హజ్రత్ జాఫర్ (రజి) కూడా ఉన్నారు. ఆయన ముస్లింల తరపున ఇలా సమాధానమిచ్చారు:

"మహారాజా! మేము పూర్వం అజ్ఞానులుగా ఉండి విగ్రహాలను పూజించేవాళ్ళం. చచ్చిన జీవాలను తినేవాళ్ళం. అశ్లీలతాఊబిలో దిగబడిఉన్నాం. నిరంతరం అంతఃకలహాలతో సతమతమై ఉండేవాళ్ళం. అలాంటి పరిస్థితిలో కరుణామయుడైన అల్లాహ్ మాలో ఒక ప్రవక్తను ప్రభవింపజేశాడు. ఆయన ఎంతో గౌరవప్రదమయిన వంశంలో జన్మించాడు. ఆయన సత్యసంధత, నిజాయితీలు మాకు మొదటి నుండీ తెలుసు. ఆయన మాకు సత్యధర్మం వైపు పిలిచి దేవుని సందేశం బోధించాడు. 'మనమంతా ఏకైక దేవుణ్ని మాత్రమే ఆరాధించాలి. జీవంలేని విగ్రహాలను వదలిపెట్టాలి. ఎల్లప్పుడూ సత్యమే పలకాలి. జాలి, దయ, సానుభూతి కలిగివుండాలి. తోటిమానవుల కష్టాలలో పాలుపంచుకోవాలి. అశ్లీలతకు దూరంగా ఉండాలి. అనాథల సొమ్ము తినకూడదు. శీలవతులపై అపనిందలు మోపరాదు. నమాజ్, దానధర్మాలు చేస్తుండాలి' అని బోధించాడు ఆయన.

రాజా! మేము ఆయన్ని సత్యప్రవక్తగా విశ్వసించాం. దైవసందేశం ద్వారా ఆయన తెలిపిన ప్రతి విషయాన్నీ మేము మనసారా స్వీకరించాం. ఈ కారణంగానే మా జాతి ఆగ్రహించి మమ్మల్ని నిర్దాక్షిణ్యంగా హింసిస్తోంది. మేము స్వీకరించిన సత్యధర్మం వదలి పాతమతంలోకి తిరిగొచ్చి వారిలా అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడమని ఒత్తిడితెచ్చి మా జీవితాలను దుర్భరం చేసింది. చివరకు మేము వారి దౌర్జన్యాలు భరించలేక ఇక్కడైనా కాస్త స్వేచ్ఛగా గడపవచ్చని మీ దేశానికి వచ్చి తలదాచుకున్నాం."

నజాషీ ఈ మాటలు విని "సరే, ఆయనపై అవతరించిన దైవవాణి మీ దగ్గర ఏమైనా ఉందా? ఉంటే పఠించండి, నేను వింటాను" అన్నాడు.

హజ్రత్ జాఫర్ (రజి) 'మర్యం' అధ్యాయంలోని కొన్ని సూక్తులు పఠించారు. ఖుర్ఆన్ వాణి విని నజాషీ ఎంతో ప్రభావితుడై కంట తడిపెట్టాడు. పాదరీల కళ్ళు కూడా అప్రయత్నంగా అశ్రుపూరితాలయ్యాయి.

"దైవసాక్షి! ఈ వాణిలో సత్యతా పరిమళం తొంగిచూస్తోంది, ఈ వాణి, మూసా (అలైహి)పై అవతరించిన తౌరాత్‌వాణి ఒకే చెట్టుకొమ్మలుగా, ఒకే జ్యోతి కిరణాలుగా గోచరిస్తున్నాయి" అన్నాడు నజాషీ కళ్ళు తుడుచుకుంటూ.

"మహారాజా! అక్కడే ఉంది కిటుకంతా. వీరు ముహమ్మద్ (సల్లం) రాసిచ్చిన ఈ వాణి పఠిస్తుంటే, శ్రోతలు ఎంతో ప్రభావితులయిపోతారు. అసలిది దైవవాణి కాదు. ముహమ్మద్ (సల్లం) సొంతవాణి" అన్నారు ఖురైష్ ప్రతినిధులు.



ఈ మాట వినగానే హజ్రత్ జాఫర్ (రజి) వారి వైపు ఉరిమిచూశారు.

"అమ్ర్! నిజం చెప్పు. ముహమ్మద్ (సల్లం) చదవడం, వ్రాయడం రాని నిరక్షరాసి అని నీకు తెలియదా?" అన్నారు ఆయన.

"ఆయన వేరేవాళ్ళ చేత రాయిస్తారు" అన్నాడు అమ్ర్ బిన్ ఆస్.

"అంటే నీవు మొదట అబద్ధమాడావన్న మాట. ఆయన చదవడం,వ్రాయడం రానివాడని నీవు అంగీకరిస్తుంటే, అలాంటి నిరక్షరాసినోట ఇంతటి అద్భుతమైన వాణి వెలువడుతుందా? ద్వేషం, దురభిమానాలు నిన్ను అంధుడిగా చేశాయి" అన్నాడు రాజునజాషీ.

ఈమాట వినగానే అమ్ర్ భయపడిపోయాడు. ఇక తమను ఆయన దర్బారు నుంచి గెంటివేయిస్తాడని భావించాడు. కొంచెం ధైర్యం తెచ్చుకొని చివరి అస్త్రం సంధించాడు.

"మహారాజా! ఈ ముస్లింలు ఏసుక్రీస్తును గురించి చాలా చెడ్డగా మాట్లాడుతారు. ఆ మహనీయుణ్ని వీరు దేవుని కుమారుడిగా ఒప్పుకోరు."

"నిజమే ప్రభూ! ఈ కొత్త మతస్థులు ఏసుప్రభువుని గురించి చెడుగా మాట్లాడుతారు" అంటూ ఒక పాదరీ ఖురైషీయులకు వంత పలికాడు.

నజాషీ రాజు హజ్రత్ జాఫర్ వైపు తిరిగి "ఏమిటీ ఇది నిజమా?" అని అడిగాడు.

"కాదు. వీళ్ళు అబద్ధం చెబుతున్నారు. ఖుర్ఆన్ ప్రకారం 'ఈసా (అలైహి) దేవుని దాసుడు, ఆయన ప్రవక్త మాత్రమే. కాకాపోతే ఆయన మర్యం దగ్గరకు దేవుడు పంపిన ఒక ఆజ్ఞ, దేవుని దగ్గర్నుండి (మర్యంకు) పంపబడిన ఒక ఆత్మ" (4:171). ఇదే మా విశ్వాసం" అన్నారు హజ్రత్ జాఫర్ (రజి) ఏమాత్రం సంకోచించకుండా.

"మీ విశ్వాసం సరయినదే. ఇంజీల్‌లో కూడా ఈ భావమే ఉంది" అంటూ నజాషీ క్రిందికి వంగి నేల మీదున్న ఓ చిన్న పుడక చేతిలోకి తీసుకున్నాడు.

"దైవసాక్షి! మీరు పేర్కొన్న దానికంటే ఈసా (అలైహి) ఈ పుడకంత కూడా అధికంగా లేరు" అన్నాడు నజాషీ చేతిలోని పుడకను చూపిస్తూ.

ఈ మాటలు విని ముస్లింలు సంతోషించారు. ఖురైష్ ప్రతినిధులు మాత్రం నోళ్ళు మూసుకొని తలలు వంచుకున్నారు.

ఆ తరువాత నజాషీ ఖురైష్ ప్రతినిధుల వైపు తిరిగి "వీళ్ళను మీవెంట పంపించే ప్రసక్తి లేదు. ఇక మీరు వచ్చిన దారే వెళ్ళిపోవచ్చు" అన్నాడు.

దాంతో ఖురైష్ ప్రతినిధులు బిక్కమొహం వేసుకొని నజాషీ దర్బారు నుండి బయటికి వచ్చి చక్కా మక్కా దారి పట్టారు.

మక్కాలో ఖురైష్ నాయకులు తమ ప్రతినిధులు ముస్లింలను బంధించి తెస్తారని గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. తీరా ప్రతినిధులు వాడిన ముఖాలతో వట్టి చేతులు ఊపుకుంటూ రావడం చూసి నీరుగారి పోయారు.

"మేము చేయవలసిందంతా చేశాం. దర్బారీలకు, పాదరీలకు కూడా కానుకలు ముట్టజెప్పాం. కాని లాభం లేకపోయింది. జాఫర్ విన్పించిన ఖుర్‌ఆన్ వాణితో నజాషీ ప్రభావితుడై కంట తడిపెట్టాడు. అదేమి చోద్యమోగాని ఈ ముస్లింలు ఎక్కడికి పోయినా జనం వారి బుట్టలో పడిపోతున్నారు. వీళ్ళను గట్టిగా అణచివేయకపోతే ఒక్క అరేబియా మాత్రమే కాదు, యావత్తు ప్రపంచమే వారికి వశమయి పోతుంది" అన్నారు ప్రతినిధులు.

## క్రైస్తవుల ఇస్లాం స్వీకరణ-(40)

మహనీయ ముహమ్మద్ (స) ప్రచారం చేస్తున్న నూతనధర్మం గురించి అరేబియా అంతటా తెలిసిపోయింది. అబిసీనియాకు వలసపోయిన ముస్లింల ద్వారా అక్కడి క్రైస్తవులకు తెలియగానే నిజానిజాలు నిర్ధారించుకోవడానికి వారొక ప్రతినిధివర్గాన్ని మక్కా పంపించారు. ఆ ప్రతినిధులు మక్కా చేరుకొని దైవప్రవక్త (స)ను కలుసుకున్నారు.

దైవప్రవక్త (స) వాళ్ళను సాదరంగా ఆహ్వానించి కొన్ని ఖురాన్ సూక్తులు విన్పించారు. దివ్యవాణి వినగానే వారి హృదయాలు దైవభీతితో ద్రవించిపోయాయి. నేత్రాలు అశ్రుపూరితాలయ్యాయి. వెంటనే వారు సత్యధర్మం స్వీకరించారు. అనిర్వచనీయమైన ఆనందానుభూతితో తిరుగు ప్రయాణమయ్యారు.

ఈ సంగతి తెలుసుకున్న ఖురైష్ నాయకుడు అబూజహల్, అతని సహచరులు దారిలో వాళ్ళను అటకాయించి అనరాని మాటలు అన్నారు. అబూజహల్ అయితే మరింత పెట్రేగిపోయాడు.

"దేవుడు మిమ్మల్ని నాశనంచేయ! మీ జాతి ప్రజలు మిమ్మల్ని నిజానిజాలు తెలుసుకొని రమ్మని పంపితే, మీరు విషయం ఏమిటో పూర్తిగా తెలుసుకోకుండానే ముహమ్మద్ వలలో పడిపోయారా? మీ సాంప్రదాయక మతాన్ని వదలిపెట్టి మతభ్రష్టులయ్యారా?" అన్నాడతను.

కాని ప్రతినిధివర్గం సభ్యులు ఖురైషీయుల దూషణలను ఏమాత్రం పట్టించుకోలేదు.

"సోదరులారా! మీకు సలాం. మేము మీతో వాదించలేము. యదార్థం తెలిసి కూడా మేము శ్రేయోభాగ్యాలను వదలుకోలేము. మమ్మల్ని మా పద్ధతి ప్రకారం నడవనివ్వండి. మీరు మీ పద్ధతి ప్రకారం నడుస్తూ ఉండండి" అన్నారు వారు.

"పూర్వం మేము గ్రంథం ఇచ్చినవారు ఈ గ్రంథాన్నీ విశ్వసిస్తున్నారు. దీన్ని విన్పించినప్పుడు "మేము దీన్ని విశ్వసిస్తున్నాం. నిజంగా ఇది మా ప్రభువు నుండి వచ్చిన సత్యం. మేము పూర్వం నుండే విధేయులై (ముస్లిములై) ఉన్నాం" అంటారు వారు.

(సత్యంపై) స్థిరంగా ఉన్నందుకు వారికి రెట్టింపు ప్రతిఫలం లభిస్తుంది. వారు సత్కార్యాల ద్వారా చెడుల్ని దూరం చేస్తారు. మేము ప్రసాదించిన సంపద నుండి (మా మార్గంలోనూ) ఖర్చుచేస్తారు. ఏదైనా పనికిమాలిన విషయం వింటే వారు (వాదనకు దిగక) "మీకర్మలు మీకు, మాకర్మలు మాకు. మీకో దండం. మేము మూర్ఖుల వైఖరి అవలంబించలేము" అంటూ అక్కడ్నుంచి తప్పుకుంటారు. (ఖుర్‌ఆన్. 28:52-55)



## హమ్జా ఇస్లాం వడిలో-(41)

అబూజహల్ దైవప్రవక్త (సల్లం)ను వేధించడం మానలేదు. అతను ఎల్లప్పుడూ దైవప్రవక్త (సల్లం)ను వెన్నాడుతూ అవకాశం చిక్కినప్పుడల్లా ఆయన్ని బాధించేవాడు.

ఓరోజు దైవప్రవక్త (స) దారిన వెళ్తున్నారు. దారిలో అబూజహల్ ఎదురయి దైవప్రవక్త (స)ను చూడగానే మండిపడుతూ అకారణంగా దూషించడం మొదలుపెట్టాడు. అనరాని మాటలు అని మనసులోని అక్కసంతా వెళ్ళబోసుకున్నాడు. కారుణ్యమూర్తి (స) మటుకు పల్లెత్తి మాట అనలేదు. అసలతని వైపు కన్నెత్తి కూడా చూడలేదు.

అయితే దైవప్రవక్త (సల్లం) సమాధానమైనా ఇవ్వకపోవడంతో అబూజహల్ మరింత రెచ్చిపోయాడు. కోపోద్రేకాలతో చిందులు తొక్కాడు. దారి పక్కనే ఉన్న కంకర్రాళ్ళు తీసుకొని ఆయన మీదికి విసిరి కొట్టాడు. అయినా మహాప్రవక్త (సల్లం) అతని దౌర్జన్యానికి ఏమాత్రం బాధపడలేదు. ప్రతిక్రియ కోసం అసలే పూనుకోలేదు. ఆయన సహనంతో అతడ్ని నుంచి మెల్లిగా తప్పించుకొని మౌనంగా వెళ్ళిపోయారు.

వీళ్ళిద్దరికి కొంచెం దూరంలో ఇదంతా ఓ దాసి గమనిస్తూ నిల్చుంది. సత్యసంధుడు, నిజాయితీపరుడైన దైవప్రవక్త (సల్లం) పట్ల అబూజహల్ ప్రవర్తించిన తీరు చూసి ఆమె హృదయం ద్రవించిపోయింది.

ఆమె ఇదివరకే ఇస్లాంను విశ్వసించింది. ఆమెకు దైవప్రవక్త (సల్లం) పట్ల అపారమైన అభిమానం ఉంది. ఈ విషయం ఆమె ఇంకా బయట పెట్టలేదు. తన యజమానికి తెలిస్తే అతను తనను చిత్రహింసలు పెట్టి చంపుతాడు. అందువల్ల ఆమె ఇస్లాం పట్ల తన విశ్వాసాన్ని కొంతకాలంపాటు రహస్యంగానే ఉంచవలసి వచ్చింది.

దైవప్రవక్త (స)పై అకారణంగా అబూజహల్ చేసిన దౌర్జన్యం చూడగానే ఆ దాసిలోని విశ్వాసం ఉరకలు వేసింది. ఎలాగైనా ఆ దుర్మార్గుడి ఆట కట్టించాలని అనుకున్నది. ఆరోజు సాయంత్రం పట్నం వెలుపల కొండల వైపు దారి తీసింది.

అలా ఆమె ఓ కొండ పక్కగా నడుస్తుంటే ఎదురుగా అబ్దుల్ ముత్తలిబ్ కొడుకు హమ్జా రావడం కన్పించింది. అతని నడుముకు కరవాలం వ్రేలాడుతోంది. భుజానికి విల్లు, వీపు వెనుక అంబులపొది కూడా ఉన్నాయి. బంధుత్వం రీత్యా దైవప్రవక్త (సల్లం)కు పినతల్లి కుమారుడు అవుతాడు. పైగా ఇద్దరూ ఒకే స్త్రీ పాలు తాగి ఉన్నందున దైవప్రవక్త (సల్లం)కు స్తన్యసంబంధ సోదరుడు కూడా అవుతాడు.

హమ్జా వేటకు పోయివస్తున్నాడు. వేటనుంచి రాగానే అతను మొదట కాబా ప్రదక్షిణ చేస్తాడు. ఆ తర్వాత అక్కడున్న ఖురైష్ నాయకులతో కాస్సేపు ముచ్చటించి ఇంటికి చేరుకుంటాడు. ఇది అతని దినచర్య. దాసీ హమ్జాను చూడగానే ఇలా అన్నది:

"అబూఉమారా (హమ్జా)! మీలో ఆత్మాభిమానం మచ్చుకైనా లేదా? బనీమఖ్జూమ్ గూండాలు ముహమ్మద్ (సల్లం)ను విచ్చలవిడిగా హింసిస్తుంటే మీరు ఏమీ పట్టనట్లు ఉంటారేమిటీ?"

నడుస్తున్న హమ్జా ఠక్కున ఆగి "అబ్దుల్లా దాసీ! ఏమిటీ నువ్వంటున్నది?" అని అడిగాడు అర్థంగాక ఆశ్చర్యంగా చూస్తూ.

"ఏమని చెప్పను? ఈరోజు మీ ముహమ్మద్‌కు ఏమైందో తెలుసా? ఆయన ఉదయం ఏదో పనిమీద వెళ్తుంటే, అబూజహల్ ఎక్కడ్నుంచో ఊడిపడ్డాడు. వచ్చిరాగానే నోటికొచ్చినట్లు నానాతిట్లు తిట్టాడు. నేను సహించలేక పోయాను. సరే అంతటితో ఊరుకున్నాడా? పిడికెడు కంకర్రాళ్ళు తీసుకొని ఆయన ముఖం మీదికి విసిరికొట్టాడు."

"ఏమిటీ! నిజమా!! నువ్వు చూశావా?" అడిగాడు హమ్జా ఆశ్చర్యాగ్రహాలతో.

"ఔను. నేను నా కళ్ళారా చూశాను. చెవులారా విన్నాను" అన్నది దాసీ.

"అయితే ఉండు, ఇప్పుడే ఆ దుర్మార్గుడి సంగతి తేల్చుకుంటాను." నిప్పులు కక్కుతూ, పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ కాబా మందిరం వైపు నడిచాడు హమ్జా.

కాబా మందిరంలో ఓ మూల ఖురైష్ నాయకులు గుమికూడి ఇస్లాంకు వ్యతిరేకంగా మంతనాలు జరుపుతున్నారు. వారిలో అబూజహల్ కూడా ఉన్నాడు.

హమ్జా కోపంతో ఊగిపోతూ నేరుగా కాబాలయంలోకి ప్రవేశించి ఓసారి చుట్టూ కలియ జూశాడు. ఖురైష్ నాయకుల మధ్య కూర్చున్న అబూజహల్ మీద దృష్టి పడగానే పళ్ళు పటపట కొరికాడు. నాలుగైదు అంగల్లో అబూజహల్ దగ్గరికి దూసుకుపోయాడు. భుజానికి ఉన్న ధనుస్సు చేతిలోకి తీసుకొని అతని మీద బలంగా కొట్టాడు.

అంతే, అబూజహల్ తల పగిలిపోయింది. రక్తం చిల్లిపడిన కుండలా బొటబొట కారసాగింది. మొహమంతా రక్తసిక్తమయింది. క్షణంపాటు కళ్ళు బైర్లు కమ్మాయి. తరువాత తేరుకొని హమ్జా వైపు చూశాడు. హమ్జా కళ్ళ నుంచి అగ్నికణాలు రాలుతున్నాయి.

"దుర్మార్గుడా! ముహమ్మద్ ఎవరనుకున్నావ్? ఆయన నా అన్నకొడుకు. నువ్వు అనాథ అని చులకనగా భావించినవాడు, నీ తిట్లు దెబ్బలు తిన్నవాడు నా సొంత అన్న కొడుకని తెలియదా?" అన్నాడు హమ్జా సింహంలా గర్జిస్తూ.

హమ్జా ఠీవి, దర్పం గల మనిషి. అతనికి కోపం వస్తే అందరూ వణికిపోతారు. ఏదైనా వ్యవహారం బెడిస్తే అతని ముందు పెదవి విప్పడానికి కూడా ఎవరూ సాహసించలేరు. అందువల్ల అబూజహల్ పరిస్థితి గ్రహించి నెమ్మదిగా నోరు విప్పాడు:

"హమ్జా! ముహమ్మద్ మనల్ని మూర్ఖుల కింద జమకట్టాడు. మన బుర్రలనే మరమ్మత్తు చేయడానికి ప్రయత్నిస్తున్నాడు. మన తాతముత్తాతల ఆచారాల మీద దాడి చేస్తున్నాడు. పైగా మన దేవతలను కూడా విమర్శి స్తున్నాడు. బానిసల్ని రెచ్చగొట్టి మత భ్రష్టుల్ని చేస్తున్నాడు" అన్నాడు ముఖం మీది రక్తం తుడుచుకుంటూ.

"మూర్ఖుడా! అల్లాహ్‌ను కాదని విగ్రహాలను పూజిస్తున్నావు కదూ! బాగా విను. నేను మా ముహమ్మద్ పక్షం వాడినే. ఆయనకే నా పూర్తి మద్దతు. ఇకనుంచి నేను ఇస్లాం కోసమే జీవిస్తాను; ఇస్లాం కోసమే మరణిస్తాను" అన్నాడు హమ్జా.



ఈ మాటలు విని అబూజహల్‌తో పాటు అక్కడున్నవారంతా విస్తుబోయారు. వాళ్ళలో అబూజహల్‌కు చెందిన బనీమఖ్జూమ్ తెగవాళ్ళు కూడ ఉన్నారు. వాళ్ళంతా ఒకరి ముఖాలు ఒకరు చూసుకొని అబూజహల్‌కు సహాయం చేయడానికి సిద్ధమయ్యారు.

"హమ్జా! నీవాలకం చూస్తుంటే నువ్వు మన పూర్వీకుల మతం వదలి ఇతరుల వలలో పడినట్లు అన్పిస్తోంది" అన్నారు వారు.

"ఔను. ఇస్లాం సత్యధర్మం అని తెలిసినప్పుడు దాన్ని నేనెందుకు స్వీకరించను? ముహమ్మద్ చెప్పే విషయం పరమ సత్యం. అందులో నాకెలాంటి అనుమానం లేదు. దైవసాక్షి! ఆ సత్యాన్ని నేనూ స్వీకరిస్తాను. చేతనైతే నన్ను ఎదిరించండి" అని చెప్పి హమ్జా అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

సత్యతిరస్కారులు ఏమీ చేయలేక జావగారిన ముఖాలతో గుడ్లప్పగించి హమ్జా వెళ్తున్న వైపు చూస్తూ ఉండిపోయారు.

హమ్జా కాబా మందిరం నుండి ఇంటికి వచ్చాడు. పరమ కిరాతకుడైన అబూజహల్ మదం అణగినందుకు ఆయనకిప్పుడు తృప్తిగా ఉంది. కాని నూతన ధర్మం విషయంలో మటుకు ఆయన మనస్సు పరిపరి విధాల ఆలోచనలకు పోతోంది.

"ఇంతకూ తానన్న మాట సరయినదేనా? కొంపతీసి తాను ఉద్రేకపు ఉరవడిలో పడి పొరపాటు చేయలేదుకదా? ఏమో, ఆ దేవుడే కాపాడాలి. దేవా! నాకు సన్మార్గం చూపు" అంటూ దైవాన్ని ప్రార్థించాడు హమ్జా.

ఆ రాత్రి హమ్జాకు నిద్ర పట్టలేదు. మనసులో దేవుడ్ని ప్రార్థిస్తూ గడిపాడు. రాత్రి చివరి ఘడియల్లో కాస్తంత కునుకు పట్టింది. అంతలో భళ్ళున తెల్లారింది. కళ్ళుతెరచి చూస్తే ప్రకృతి శోభాయమానంగా కన్పించింది. మనసు తేలిక పడినట్లు అన్పించింది. ఆంతర్యం విశ్వాస జ్యోతితో ప్రకాశవంతమైనట్లు అనుభూతి కలిగింది.

దాంతో ఆయన నూతనోత్సాహంతో లేచారు. గబగబా కాలకృత్యాలు ముగించుకొని, దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళారు. మొదట తాను అబూజహల్ గర్వాన్ని అణచిన సంగతి చెప్పి దైవప్రవక్త (సల్లం)ను సంతోషపరుద్దామనుకున్నాడు.

"నా సోదరకుమారా! నువ్వీ సంగతి వింటే చాలా సంతోషిస్తావు. నేను నీ తరపున అబూజహల్ మీద ప్రతీకారం తీర్చుకున్నాను" అన్నాడు హమ్జా.

"బాబాయ్! ఇలాంటి మాటలు నాకు సంతోషం కలిగించవు. మీరు ఇస్లాం స్వీకరిస్తే మాత్రం నాకెంతో సంతోషంగా ఉంటుంది" అన్నారు మహాప్రవక్త (సల్లం).

ఈ విషయం గురించి హమ్జా రాత్రంతా తీవ్రంగా ఆలోచించి ఒక నిర్ణయానికి రావడం వల్ల వెంటనే ఆయన ఇస్లాం స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు.

"దైవప్రవక్తా! ఇకనుండి నేను అంతిమశ్వాస వరకు సత్యధర్మం కోసం ప్రాణాలకు తెగించి పోరాడుతూ ఉంటాను" అన్నారు ఆయన అమితోత్సాహంతో.

ఈ మాటలు వినగానే దైవప్రవక్త (స) ముఖారవిందం విప్పారి పున్నమి చంద్రునిలా వెలిగిపోయింది. అంతరంగం ఆనందంతో ఉప్పొంగింది. “దేవా! హమ్జాను సత్యధర్మంలో స్థిరంగా ఉంచు” అన్నారు ఆయన అప్రయత్నంగా.

హజ్రత్ హమ్జా (రజి) ఇస్లాం స్వీకరించడంతో అవిశ్వాసులు ఓ గొప్ప సాహసవంతుడ్ని, మహాయోధుడ్ని కోల్పోయారు. ఈ వార్త ముస్లింలను మాత్రం ఎంతో ఉత్తేజపరిచింది.

ఔను మరి, హమ్జా (రజి) సామాన్య వ్యక్తి కాదు. కాకలు తీరిన యోధుడు. ఆయన పరాక్రమ గాథలు దేశం నలుమూలలా విస్తరించి ఉన్నాయి. అలాంటి హమ్జా (రజి) ముస్లిం అయ్యాడంటే ఇస్లామీయ ఉద్యమం గొప్ప మలుపు తిరిగిందన్న మాట.

# స్నేహితుడయిన శత్రువు-(42)

అరబ్బులు స్వేచ్ఛా జీవులు. అక్కడ ఓ ప్రత్యేక శాసనమంటూ, సిద్ధాంతమంటూ ఏదీ లేదు. మనస్సుకు నచ్చింది ఆచరిస్తారు. అంచేత దేశమంతటా త్రాగుడు, జూదం, వ్యభిచారం, కొట్లాటలతో కలుషితమయి పోయింది. దైవప్రవక్త సందేశం ఈ చెడులన్నిటికీ వ్యతిరేకంగా ఓ అద్భుత నినాదం.

అంతేకాదు, బహుదైవారాధకులకు మక్కా పట్టణం గొప్ప సాంస్కృతిక, వాణిజ్య, మతపరమైన కేంద్రం కాబట్టి సుదూరప్రాంతాల నుంచి కూడా అనేకమంది యాత్రికులు ఇక్కడకు వస్తారు. ఖురైషీయులే కాబానిర్వాహకులు, ధర్మకర్తలై నందున వారికి యాత్రికుల నుండి అనేక రకాల కానుకలు, నైవేద్యాల రూపంలో అపార సిరిసంపదలు లభిస్తాయి. సమాజంలో గౌరవం, పలుకుబడులు కూడా వారికే బాగా ఉన్నాయి.

ఇస్లాం వ్యాప్తి వారి మతవ్యాపారానికి, దుర్నడత దుర్వ్యసనాలకు పెద్ద గొడ్డలిపెట్టు. అందువల్ల అది రోజురోజుకు బలం పుంజుకుంటూ, నేల నాలుగు చెరగులా విస్తరిస్తూ పోతుంటే వారు చూస్తూ ఎలా ఊరుకుంటారు?

దుష్ప్రచార పథకం బెడిసికొట్టడంతో ఖురైషీయులు చిందులు తొక్కుతూ ముస్లింలపై విరుచుకుపడ్డారు. అవిశ్వాసుల్లో ఉమర్ బిన్ ఖత్తాబ్ కూడా ఉన్నాడు. ముస్లింలు మక్కా వదలి అబిసీనియా వెళ్ళిపోయారని విని అతను కూడా ఆగ్రహోదగ్రుడై పోయాడు.

“దీనికంతటికీ మూలకారకుడైన ముహమ్మద్ అంతం చూస్తాను. జనాన్ని తప్పుదారి పట్టిస్తూ దేశంలో అశాంతి, అనైక్యతలు సృష్టిస్తున్నాడు. అలాంటివాడ్ని ఇక ఏమాత్రం సహించకూడదు. ఇప్పుడే పోయి అతని శిరస్సు ఖండిస్తాను”కారాలు మిరియాలు నూరుతూ కరవాలం తీసుకొని బయలుదేరాడు ఉమర్.

“ఈరోజుతో ముహమ్మద్ కథ సమాప్తం”కోపంతో ఊగుతూ వడివడిగా నడుస్తున్నాడు.

“ఉమర్! ఎక్కడికి మహా ఆర్భాటంగా పోతున్నావు?” నయీమ్ బిన్ అబ్దుల్లా (రజి) దారిలో ఎదురయి అడిగారు.

నయీమ్ (రజి) ఇదివరకే ఇస్లాం స్వీకరించారు. అయితే ముస్లింలపై జరుగుతున్న దారుణాలు చూసి ఆయన తన విశ్వాసాన్ని ఇంకా ప్రజల ముందు బహిర్గతం చేయలేదు.



కళ్ళలో నిప్పుసెగలు, నడుముకు ఖడ్గంతో వెళ్తున్న ఉమర్‌ని చూసి, ఇతను ఇస్లాంకు ఏదో కీడు తలపెట్టబోతున్నాడని ఆయన శంకించారు.

“అదే, ఆ మతభ్రష్టుడి దగ్గరికి. మన దేవతలకు అపచారం తలపెట్టి సామాజిక వ్యవస్థను సర్వనాశనం చేస్తున్న ముహమ్మద్ దగ్గరికి వెళ్తున్నా. ఈరోజు అతని రక్తం కళ్ళ చూడదలిచాను” అన్నాడు ఉమర్ పిడికిలి బిగిస్తూ.

ఉమర్ కోపం నయీమ్ (రజి)కు తెలియనిది కాదు. అతను తలచుకుంటే అంతపని చేస్తాడని భావించి, ఎలాగైనా అతడ్ని దారి మళ్ళించాలనుకున్నారు ఆయన.

“ఏమిటీ ముహమ్మద్‌ని చంపడానికి పోతున్నావా? బాగా ఆలోచించే నిర్ణయానికి వచ్చావా? అలాగైతే అబ్దెమునాఫ్ తెగవాళ్ళు నిన్ను సజీవంగా వదులుతారనుకున్నావా? సరే, ముహమ్మద్ సంగతి తర్వాత చూద్దువుగాని ముందు నీ బావ, చెల్లెళ్ల సంగతి కనుక్కో” అన్నారు ఆయన.

“ఏమంటున్నావ్!?” అడిగాడు ఉమర్ ఆశ్చర్యాగ్రహాలతో.

“నీ చెల్లెలు, బావ ఈ మధ్యనే ముహమ్మద్ మతాన్ని స్వీకరించారు. మొదట వాళ్ళ సంగతి తేల్చుకో; తర్వాత ముహమ్మద్‌ని గురించి ఆలోచించవచ్చు.”

ఈ సంగతి విని ఉమర్ అదిరిపడ్డాడు. “ఆ... నా కుటుంబ సభ్యులే అంతగా బరితెగించారా! అయితే ఇప్పుడే పోయి వారి ఆట కట్టిస్తానుండు.” పళ్ళు పటపట కొరుకుతూ ఉమర్ అక్కడ్నుంచి వెనక్కి తిరిగి సరాసరి చెల్లెలి ఇంటికి దారితీశాడు.

అక్కడికి వెళ్ళి తలుపులు దబదబా తట్టాడు. తలుపులు విరిగిపోయేటట్లు బాదుతున్న శబ్దానికి ఇంట్లో వాళ్ళు భయపడ్డారు. “ఎవరండీ!” లోపలి నుంచే అడిగారు.

“ఉమర్ బిన్ ఖత్తాబ్” బయటి నుంచి సమాధానం వచ్చింది సింహగర్జనలా.

ఉమర్ పేరు వినగానే ఇంట్లోవారి గుండెలు గుభిల్లుమన్నాయి. ఖుర్‌ఆన్ విన్పిస్తున్న ఖబ్బాబ్ (రజి) వెంటనే పుస్తకం మూసేసి నిలబడ్డారు. ఆయనకు ఎదురుగా కూర్చొని ఖుర్‌ఆన్ వింటున్న ఉమర్ చెల్లెలు ఫాతిమా (రజి), ఆమె భర్త సయీద్ (రజి) కంగారు పడుతూ లేచి ఏదో మూల దాక్కోవడానికి ప్రయత్నించారు.

బయట తలుపు తడ్తున్న శబ్దం మరింత అధికమయింది. హజ్రత్ ఖబ్బాబ్ (రజి) ఖుర్‌ఆన్‌ని అక్కడే వదిలేసి ఒక్క అంగలో పోయి లోపల గదిలో ఓ మూల దాక్కున్నారు.

హజ్రత్ ఫాతిమా (రజి) పుస్తకం తీసి కన్పించకుండా తన వీపు వెనుక చేతిలో పట్టుకొని తలుపు వైపే చూడసాగారు భయం భయంగా.

హజ్రత్ సయీద్ (రజి) అదురుతున్న గుండెను చేత పట్టుకొని మెల్లిగా తలుపు తెరిచారు. అంతే, ఆకలిగొన్న పులిలా లోపలికి దూసుకొచ్చాడు ఉమర్. లోపల నలు మూలలా పరికించి చూశాడు. తన బావా, చెల్లెలు తప్ప మరెవరూ కన్పించ లేదు.

“ఇప్పుడు నేను విన్న కంఠం ఎక్కడ్నుంచి వచ్చింది?” గర్జించాడు ఉమర్.

"అబ్బే... ఇక్కడ అలాంటిదేమీ లేదే!" నసిగారు వారిద్దరు భయపడుతూ.

"దాచి పెట్టకండి. మీరు ఇస్లాం స్వీకరించిన సంగతి నాకు తెలియదనుకున్నారా?" అంటూనే సయీద్ (రజి) మీదికి లంఘించాడు ఉమర్. పిడిగుద్దులతో ఆయన వళ్ళు హూనం చేయడం ప్రారంభించాడు.

ఫాతిమా (రజి) సహించలేక భర్తను విడిపించుకోవడానికి అడ్డం వచ్చారు. దాంతో ఉమర్ మరింత రెచ్చిపోయి బావను వదలి చెల్లెలిపై చెయ్యెత్తాడు. ఆ చెంప ఈ చెంప ఎడా పెడా వాయించసాగాడు.

పాపం ఫాతిమా చెంపలు కందిపోయాయి. తల నుంచి రక్తం కారసాగింది. ఉమర్ ఇక తమను ప్రాణాలతో వదలిపెట్టడని భావించారు ఆమె. దాంతో ఆమె హృదయంలోని విశ్వాస తరంగాలు పరవళ్ళు తొక్కాయి. అంతలో ఆమె దెబ్బ తిన్న చిరుతపులిలా ఉరిమి చూస్తూ అన్నకు ఎదురు తిరిగారు.

"అన్నయ్యా! ఆగు. నువ్వు ఖత్తాబ్ కొడుకువయితే నేను ఖత్తాబ్ కూతుర్ని. నేను నీకేమీ తీసిపోను. ఔను, మేము ఇస్లాం స్వీకరించాం. ఇక మేము ఇస్లాం నుంచి ఒక్క అంగుళమైనా వెనక్కి తగ్గే ప్రసక్తి లేదు. నీ ఇష్టమొచ్చినట్లు చేసుకో" అన్నారు అమె ఉద్రేకంతో ఊగిపోతూ.

ఆమె వాలకం చూడగానే ఉమర్ చేయి అప్రయత్నంగా ఆగిపోయింది. చెల్లెలి పలుకులు అతని హృదయాన్ని కదిలించాయి. ఆమె చెంపల మీదుగా కారుతున్న రక్తం అతని మనస్సును క్షణంలో మైనంలా కరిగించివేసింది. అంతలో అతని దృష్టి చెల్లెలి చేతిలో ఉన్న పుస్తకంపై పడింది.

"ఇదేనా మీరు చదువుతున్నది? ఏది ఓసారి ఇటివ్వు, నేనూ చూస్తాను" అన్నాడు ఉమర్ ప్రశాంతంగా.

"ఇది నీ చేతికిస్తే మళ్ళీ మాకు లభిస్తుందో లేదో!" అన్నారు ఫాతిమా (రజి) భయమూ, అనుమానం మేళవించి చూస్తూ.

"భయపడకు, తప్పకుండా తిరిగిస్తాను."

"అయితే ముందు నువ్వు స్నానం చేసి రా."

ఉమర్ లోపలికి వెళ్ళి స్నానంచేసి వచ్చాడు. ఫాతిమా (రజి) తడబడుతున్న చేతులతో ఖుర్ఆన్ని అతని చేతికి అందించారు.

ఉమర్ దాన్ని తెరచి జాగ్రత్తగా చదవడం ప్రారంభించాడు. కొన్ని క్షణాల తరువాత అతని వాలకంలో మార్పు రాసాగింది. చేతులు వణికి పోతున్నాయి.

"ఎంత మంచి విషయాలు! ఎంత పవిత్రమైన వాణి ఇది!!" ఉమర్ నోట అప్రయత్నంగా వెలువడ్డాయీ మాటలు.

లోపల దాక్కున్న ఖబ్బాబ్ (రజి) ఈ మాటలు వినగానే బయటికి వచ్చారు.



"ఉమర్! దైవప్రవక్త (సల్లం) నిన్నుగాని, అబూజహల్నిగాని ఇస్లాం ఆశ్రయంలోకి వచ్చేటట్లు చేయమని దైవాన్ని ప్రార్థించారు. ఆ ప్రార్థన బహుశా నీ విషయంలోనే దైవం అంగీకరించి ఉండవచ్చు. ఇక ఇస్లాం ధర్మాన్ని వదలిపెట్టకు ఉమర్!" అన్నారు ఆయన.

"నేను ఇస్లాం స్వీకరించదలిచాను. నన్ను ముహమ్మద్ దగ్గరకు తీసికెళ్ళండి."

హఠాత్తుగా ఉమర్లో వచ్చిన ఈమార్పు చూసి ఖబ్బాబ్ (రజి) పరమానంద భరితులయ్యారు. ఇక ఫాతిమా, సయీద్ (రజి)ల ఆనందానికైతే అవధుల్లేకుండా పోయాయి.

అర్ఖమ్ ఇంట్లో మహాప్రవక్త (సల్లం) తమ అనుచరులకు ఖుర్ఆన్ బోధిస్తూ భావి కార్యక్రమం గురించి వివరిస్తున్నారు. హమ్జా, అబూబకర్, బిలాల్, అలి (రజి) ప్రభృతులు శ్రద్ధాసక్తులతో వింటున్నారు. అంతలో బయట తలుపుతట్టిన చప్పుడు విన్పించింది.

"ఎవరూ?" హజ్రత్ బిలాల్ (రజి) అడిగారు లోపలి నుంచే.

"నేను, ఉమర్ బిన్ ఖత్తాబ్ని" బయట నుంచి సమాధానం వచ్చింది.

ఉమర్ పేరు వినగానే ప్రవక్త అనుచరులు కంగారుపడ్డారు.

"దైవప్రవక్తా! ఉమర్ వచ్చాడు. తలుపు తెరిస్తే వచ్చి రభస చేస్తాడేమోనని భయంగా ఉంది" అన్నారు హజ్రత్ బిలాల్ (రజి) అనుమానిస్తూ.

"రానియ్. అతని ఉద్దేశ్యం మంచిదయితే, అంతకంటే కావాల్సిందేమిటీ?" అన్నారు దైవప్రవక్త (స).

"ఒకవేళ దురుద్దేశంతో వచ్చినా భయపడాల్సిన పనిలేదు. అతడ్ని మట్టి కరిపించడం నా ఎడమచేతి పని" అన్నారు హజ్రత్ హమ్జా (రజి) ధైర్యంతో.

ఆ తర్వాత బిలాల్(రజి) తలుపు తీయడానికి వెళ్ళారు. హమ్జా(రజి) కూడా వెళ్ళారు. బిలాల్ తలుపు తెరిచారు. ఉమర్ లోపలికి అడుగుపెట్టాడు. హమ్జా, బిలాల్ ఒకేసారి ఒక్కఊపులో ముందుకు లంఘించి ఉమర్ రెక్కలు చెరోపక్క గట్టిగా పట్టుకున్నారు.

ఉమర్ని చూడగానే దైవప్రవక్త (సల్లం) "దేవా! చీకటి అలుముకొనివున్న ఉమర్ హృదయంలో విశ్వాస జ్యోతి వెలిగించు" అని ప్రార్థించారు. ఆ తర్వాత "హమ్జా! బిలాల్! ఉమర్ చేతులు వదిలేయండ"ని ఆదేశించారు.

హమ్జా, బిలాల్ (రజి) ఉమర్ చేతులు వదిలేసి పక్కకు తప్పుకున్నారు. ఉమర్ దైవప్రవక్త (సల్లం) ముందు చేతులు కట్టుకొని తలవంచి మౌనంగా నిలబడ్డాడు.

"ఉమర్! భయంకర శిక్ష సమీపించేదాకా నీ వైఖరి మారదా? ఏమిటీ నీ ఉద్దేశ్యం? నీ రాకకు కారణం ఏమిటీ?" అన్నారు దైవప్రవక్త (సల్లం).

"ఇస్లాం ధర్మం స్వీకరించడానికి వచ్చాను."

ఉమర్ సమాధానం విని ప్రవక్త అనుయాయులు ఆనందాతిశయంతో 'అల్లాహు అక్బర్!' అంటూ బిగ్గరగా అరిచారు. ఈ నినాదంతో అర్ఖమ్ ఇంటిగోడలు ప్రకంపించాయి; మక్కా కొండలు మార్మోగిపోయాయి.

దైవప్రవక్త (సల్లం) దేవునికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ "దేవా! ఉమర్‌కు సన్మార్గం అనుగ్రహించు, అతనికి స్థయిర్యం ప్రసాదించు"అని ప్రార్థించారు.

ఉమర్ (రజి) ఇప్పుడు జ్యోతిర్మయ హృదయంతో ముస్లింలలోకి వచ్చికూర్చున్నారు. కూర్చోవడమే కాదు, మిత్రులతో ఇస్లాం గురించి ముచ్చట కూడా మొదలెట్టారు.

"దైవప్రవక్తా! చచ్చినా బ్రతికినా సత్యం మన పక్షానే ఉందికదూ?" అడిగారు ఉమర్.

"ఎవరి అధీనంలో నాప్రాణం ఉందో ఆ దేవుని సాక్షి! నిస్సందేహంగా సత్యం మన వైపే ఉంది. ఉమర్! చావు బ్రతుకులతో ఏమవుతుంది?" అన్నారు దైవప్రవక్త (స).

"అయితే మనం ఇలా దాక్కోవడం ఎందుకూ?" అడిగారు ఉమర్ (రజి).

"మనం ఇప్పుడు తక్కువ సంఖ్యలో ఉన్నాం. శత్రువులు అధిక సంఖ్యలో ఉన్నారు" సమాధానమిచ్చారు దైవప్రవక్త (సల్లం).

"దైవారాధన దాక్కొని చెయ్యడమా! వీల్లేదు. మిమ్మల్ని సత్యధర్మం ఇచ్చిపంపిన దేవుని సాక్షి! ఇప్పటిదాకా నేను ఎక్కడక్కడ అవిశ్వాస గానాలు ఆలపించానో ఇకనుంచి అక్కడ ఇస్లాం నినాదాలు చేస్తాను" అన్నారు ఉమర్ (రజి) దృఢ సంకల్పంతో.

దైవప్రవక్త (స) అనుచరుల్ని ఉమర్ (రజి), హమ్జా (రజి)ల నాయకత్వంలో రెండు జట్లుగా విభజించి కాబా పంపించారు. వీరంతా కాబా వెళ్ళి నమాజ్ చేసి దిక్కులు పిక్కటిల్లేలా 'లాఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్రసూలుల్లాహ్' అని నినదించారు.

ఆరోజు ముస్లింలలో వెల్లివిరిసిన ఆనందోత్సాహాలు వర్ణనాతీతం. ఇస్లామీయ ఉద్యమంలో అదొక మైలురాయి. ఆ రాత్రే ఉమర్ (రజి) మక్కా వీధులన్నీ తిరిగి తన విశ్వాసాన్ని ప్రకటిస్తూ అనేకమందిని ఇస్లాం వైపు పిలిచారు.

ఆ తరువాత ఆయన సరాసరి మేనమామ అబూజహల్ ఇంటికెళ్ళి తలుపు తట్టారు. అబూజహల్ తలుపు తీసి ఎంతో ప్రేమాభిమానాలతో ఉమర్‌ని లోపలికి తీసికెళ్ళాడు.

"బాగున్నావా ఉమర్! ఏమిటీ విశేషం ఇలా వచ్చావు వేళకాని వేళలో."

"నేను అల్లాను, ఆయన ప్రవక్తను విశ్వసించాను. ఈసంగతి చెప్పడానికే వచ్చాను."

అబూజహల్‌కు నెత్తి మీద పిడుగు పడినట్లయింది. అతను అసహ్యంగా అరుస్తూ "దేవుడు నిన్ను నాశనం చెయ్య, నువ్వు కూడా మతభ్రష్టుడయ్యావా!" అన్నాడు.

ఉమర్ (రజి) ముస్లిం అయిన వార్త నగరంలో కార్చిచ్చులా వ్యాపించింది. ఖురైష్ నేతలు వెంటనే కూడబలుక్కొని ఇస్లాం నినాదం చేస్తూ వస్తున్న ఉమర్ (రజి) మీదికి దాడి చేశారు. నాలుగు వైపులా చుట్టుముట్టి పరమనీచంగా దూషించారు. ఉమర్(రజి) రెండు క్షణాలు పెనుగులాడి వర నుంచి కత్తిదూసి ఝుళిపించారు.

"అల్లాహ్ తప్ప ఆరాధ్యదైవం లేడని, ముహమ్మద్ (సల్లం) ఆయన ప్రవక్తని నేను సాక్ష్యమిస్తున్నాను. ఎవరైనా సరే ముందుకు అడుగు వేశాడా, తల ఎగిరిపోతుంది." సింహంలా గర్జించారు ఉమర్ (రజి) కళ్ళలో నుంచి నిప్పులు చెరుగుతూ.



దాంతో ఖురైషీయులు భయపడి అక్కడ్నుంచి మెల్లిగా జారుకున్నారు.

హజ్రత్ ఉమర్ (రజి) దైవప్రవక్త (సల్లం) సన్నిధికి తిరిగొచ్చారు. దైవప్రవక్త (సల్లం) ఆయన్ని పరమ సంతోషంతో కౌగిలించుకున్నారు. అదీగాక, ఆయన చూపిన ధైర్యసాహసాల్ని గురించి విని ఆయనకు 'ఫారూఖ్' అనే బిరుదు కూడా ప్రదానం చేశారు.

## కటిక చీకటిలో మూడు మానవాకారాలు-(43)

ఒక రోజు అర్థరాత్రి సమయం. కన్ను పొడుచుకున్నా కానరాని కటికచీకటి. మక్కా పట్నం నిశ్శబ్దంగా నిద్రలో జోగుతోంది. ఇస్లాం అంటేనే ఈసడించుకునే అబూజహల్, ఇంటి నుండి బయలుదేరి ఓ వీధిలోకి వచ్చాడు. ఆ వీధిలోని ఒక ఇంటి నుంచి ఖుర్‌ఆన్ వాణి కర్ణపేయంగా విన్పిస్తోంది. అది ముహమ్మద్ (స) ఇల్లు. అబూజహల్ కాళ్ళ చప్పుడు రానీయకుండా మెల్లిగా నడిచి, ఆ ఇంటి చూరు కిందికెళ్ళి నక్కి కూర్చున్నాడు.

"ఇక్కడ నేనుతప్ప మరెవ్వరూ లేరు. ఇంటియజమాని కూడా నన్ను చూసే అవకాశం లేదు. దైవవాణి అట! అదేమిటో విందాం" అనుకున్నాడు మనసులో అతను.

కాస్సేపు విన్న తరువాత అబూజహల్ అక్కడ్నుంచి మెల్లగా బయలుదేరాడు. ఓసారి అటూ ఇటూ చూసి, తననెవరూ చూడటం లేదని నిర్ధారణకు వచ్చిన తరువాత వడివడిగా నడక సాగించాడు. అంతలో వెనుక నుంచి తనను ఎవరో వెంబడిస్తున్నట్లు చప్పుడు విన్పించింది. వెనక్కి తిరిగి చూస్తే ఓ మానవాకారం తన దగ్గరకు వచ్చి ఆగింది. ఇద్దరూ పరస్పరం గుర్తించుకునే లోగా మరోఆకారం కూడా ప్రవక్త ఇంటి వైపునుంచే బయలుదేరి వాళ్ళిద్దరి దగ్గరకు వచ్చింది.

"అబూజహల్! నువ్వా!!" అన్నాడు అబూసుఫ్యాన్.

"అరె మీరా!?" అన్నాడు అఖ్నస్ ఆశ్చర్యపోతూ.

"ఈ పరిస్థితిలో మనల్ని ఎవరైనా చూస్తే ఎంత సిగ్గుచేటు! నలుగురిలో మనం తలెత్తుకొని తిరగ్గలమా?" అన్నాడు అబూసుఫ్యాన్.

"నిజమే. ఒకర్నొకరు తెలియకుండా ఇక ఎప్పుడూ మనం ఇలా ఖుర్‌ఆన్ వినడానికి రాకూడదు. పదండి, తెల్లవారొచ్చింది" అన్నాడు అబూజహల్.

ముగ్గురూ సిగ్గుతో తలలు దించుకొని తొందరగా ఎవరి ఇండ్లకు వారెళ్ళి పోయారు. మహాకవుల కవిత్వాన్నే మరపింపజేసే దైవవాణిని, మాంత్రికులు ఇంద్రజాలికుల్నే కలవరపరచే దివ్యవాణిని వినాలని దాని బద్ధవిరోధులకు సైతం ఎంత తపన! అసత్యం అనేదే ఎరగని ముహమ్మద్ (స) నోట వెలువడే అమృతవాణి వినాలని ఎంత ఆరాటం!!

మరుసటి రోజు రాత్రివేళ అబూజహల్ మళ్ళీ పోయి దైవప్రవక్త (సల్లం) ఇంటి చూరు కింద నక్కి కూర్చున్నాడు. దైవప్రవక్త (సల్లం) నమాజ్‌లో సుమధుర కంఠస్వరంతో ఖుర్‌ఆన్ పఠిస్తున్నారు. అబూజహల్ వింటూ "ఈరాత్రి వారిద్దరు రారు. ఇక తననెవరూ అనుమానించరు" అనుకున్నాడు మనసులో.

అయితే కొన్ని క్షణాల తర్వాత అబూసుఫ్యాన్ కూడా వచ్చి చూరు కింద ఓ మూల ఒదికి కూర్చున్నాడు. అతను కూడా తానొక్కడ్నే వచ్చానని, తననెవరూ చూడటంలేదని భావించాడు. ఆ తరువాత కాస్సేపటికి అఖ్నస్ కూడా వచ్చి మరో మూల నక్కి కూర్చొని దైవవాణి వినసాగాడు. అతను కూడా ఈరాత్రి వాళ్ళిద్దరు రారని భావించాడు.

ఖుర్ఆన్‌పఠనం ముగిసింది. ముగ్గురూ మూడు వైపుల నుంచి వీధిలోకి వచ్చారు ఒకేసారి. ఆ చీకటిలో ఒకర్నొకరు గుర్తించి మళ్ళీ సిగ్గుపడిపోయారు. ఇంకెప్పుడూ ఇలాంటి పని చేయకూడదని ఒట్టుపెట్టుకొని మరీ ఎవరి ఇండ్లకు వారు వెళ్ళిపోయారు.

కాని మూడోరోజు రాత్రి కూడా అబూజహల్ ఖుర్ఆన్ వినడానికి ప్రవక్త ఇంటికి వచ్చాడు. "ఇప్పటికి రెండు సార్లు పట్టుబడ్డాం. ఈసారి వాళ్ళిద్దరు రావడానికి ఎంతమాత్రం ఆస్కారం లేదు. రెండవసారి పట్టుబడినప్పుడే ఒట్టేసుకున్నాం" అనుకున్నాడతను.

అదే విధంగా మిగతా ఇద్దరు కూడా అనుకొని ఒకొరికొకరు తెలియకుండా దైవవాణి వినడానికి వచ్చారు. కాని దైవవాణి విని తిరిగొస్తుంటే పరస్పరం తారసపడి సిగ్గుపడి పోయారు. ఇక ఎన్నటికీ ఇలా ప్రవర్తించకూడదని ఈసారి గట్టిగానే ఒట్లు వేసుకున్నారు.

తెల్లవారిన తరువాత అఖ్నస్ కాలకృత్యాలు తీర్చుకొని అబూసుఫ్యాన్ ఇంటికెళ్ళాడు. అతనితో మాట్లాడుతూ "అబూసుఫ్యాన్! ముహమ్మద్ పఠించిన వాణి విన్నావ్ కదా! దాన్ని గురించి నీ అభిప్రాయం ఏమిటి?" అన్నాడు.

"కొన్నిమాటల ఉద్దేశ్యం ఏవిటో అర్థమవుతూనే ఉంది. కొన్నిమాటలు అర్థం కావటం లేదు. వాటి అంతరార్థం నాకు ఇప్పటికీ అంతుపట్టడం లేదు" అన్నాడు అబూసుఫ్యాన్.

"నిజమే, నా అభిప్రాయం కూడా ఇదే" అన్నాడు అఖ్నస్. ఆతర్వాత అతను అబూ జహల్ దగ్గరకు కూడా వెళ్ళి అలాగే అడిగాడు. అప్పుడు అబూజహల్ ఇలా అన్నాడు:

"నీకు తెలుసుకదా! మనము, అబ్దుల్ మునాఫ్ తెగవాళ్ళు పేరుప్రతిష్ఠల్లో ఎల్లప్పుడూ సమఉజ్జీలుగా ఉన్నాం. ఏ విషయంలోనూ మనం వారికి తీసిపోలేదు. ప్రతి రంగంలో మనం ఆ తెగకు సమాన ప్రతిపక్షంగానే ఉన్నాం. ఈనాడు వారు తమలో ఒక దైవప్రవక్త ఉన్నాడని, అతనికి దివి నుండి దైవసందేశం అవతరిస్తోందని చెబుతున్నారు. ఈ విషయం లో వాళ్ళను మనం ఎలా అధిగమించడం? నువ్వే చెప్పు. అంచేత దైవసాక్షిగా చెబుతున్నా. మనం అతడ్ని ప్రళయందాకా విశ్వసించకూడదు. అతని మాట ఒక్కటీ వినకూడదు."

ఎంత ద్వేషం! ఎంత అసూయ!! ముహమ్మద్ నోట వెలువడుతున్న వాణి దివి నుండి అవతరిస్తున్న దైవవాణని తెలిసి కూడా జాతిదురభిమానం వెల్లువలో కొట్టుకు పోతున్నాడు మానవుడు. వలీద్ బిన్ ముగైరా దీన్ని గురించి బహిరంగంగానే ఇలా అన్నాడు:

"నేను ఖురైష్‌తెగలో అగ్రనాయకుడ్ని. పిన్నలు, పెద్దలు అందరూ నన్ను ఎంతో గౌరవిస్తున్నారు. యావత్తు అరేబియాలో నాకెంత పలుకుబడి ఉందో అందరికీ తెలుసు. అలాంటి వాడ్ని నేనుండగా ముహమ్మద్‌పై దైవవాణి అవతరించడమా! సరే నా సంగతి కాకపోయినా అబూమస్‌వూద్, సఖీఫ్ లాంటి అగ్రనాయకుల్ని కూడా వదలేయడమే!"



ఇదీ దైవవాణి పట్ల ఆ గర్వాంధకారుల వైఖరి! దేవుడు తాను కోరుకున్న వారిపై తన అనుగ్రహాన్ని అవతరింపజేస్తాడు. ఆయన నిరపేక్షాపరుడు. సమస్తం తెలిసినవాడు.

## నజ్ర్ బిన్ హారిస్ అకృత్యాలు-(44)

ఖురైషీయులలో నజ్ర్ బిన్ హారిస్ అనే పరమ దుర్మార్గుడు ఒకడున్నాడు. అతను "నేను ఎల్లప్పుడూ ముహమ్మద్‌కు ప్రత్యర్థిగా ఉంటూ, అతనికి వ్యతిరేకంగా జనాన్ని పురిగొల్పుతూ ఉంటాను" అని శపథం కూడా చేశాడు.

అతను గతంలో ఈరాన్ వెళ్ళి అక్కడి పార్శీ వైభవానికి సంబంధించిన అనేక గాథలు, పార్శీ ప్రజల ఆరాధనాపద్ధతుల్ని గురించి విన్నాడు. గొప్పగొప్ప విద్వాంసులు, తత్వవేత్తల సహచర్యంలో కూడా కొంత కాలం గడిపాడు. అతను ఎల్లప్పుడూ దైవప్రవక్త (సల్లం)ను నీడలా వెంటాడేవాడు. దైవప్రవక్త (సల్లం) ప్రజలకు దైవవాణి అందజేసే ప్రతి సందర్భంలోనూ అతను అక్కడికి చేరుకుంటాడు. దైవప్రవక్త (సల్లం) అక్కడ్నుంచి వెళ్ళిపోగానే ఈ దుర్మార్గుడు ప్రజలతో "సోదరులారా! నేను ముహమ్మద్ చెప్పినవాటి కంటే మంచి విషయాలు చెబుతాను వినండి" అని ఈరాన్ సంఘటనలు, అక్కడి రాజుల గాథలు, మతస్థాపకుల జీవిత చరిత్రలు చెప్పడం మొదలెడతాడు. అంతేకాకుండా ఉన్నవీ, లేనివీ కలిపి అద్భుతంగా వర్ణించి చెబుతాడు.

ఇలా అన్ని విషయాలు చెప్పి చివరకు "నేను విన్పించినట్లు ముహమ్మద్ కూడా పురాతన గాథలే కదా విన్పిస్తుంది! నేను చెప్పిన విషయాలకంటే అతను విన్పించే మాటలు ఎలా మధురమైనవి అవుతాయి?" అనంటాడు.

ఈ మాటలు విని అమాయక ప్రజలు సందిగ్ధావస్థలో పడిపోతారు. ఇద్దరిలో ఎవరు సత్యవంతులో, ఎవరు అసత్యవాదులో, ఎవరు తమ శ్రేయోభిలాషో, ఎవరు మోసకారో తేల్చుకోలేక పెద్ద ఇరకాటంలో పడిపోతారు.

ఆ సందర్భంలో దేవుడు ఈ సూక్తులు అవతరింపజేశాడు:

"మానవుల్లో మనసును మభ్యపెట్టే వ్యర్థ వస్తువుని కొనితెచ్చేవాడు కూడా ఒకతను ఉన్నాడు. అతను (సరైన) జ్ఞానం లేకుండా ప్రజల్ని దైవమార్గంనుండి తప్పించి, ఆ ప్రచారాన్ని పరిహసించడానికే ఇలాంటి చేష్టలకు పాల్పడ్డాడు. ఇటువంటివారికి అవమానకరమైన శిక్ష కాచుకొని ఉంది. మా సూక్తులు విన్పించినప్పుడు అతను అహంకారంతో విర్రవీగుతూ, తాను చెవిటివాడన్నట్లు, తానసలు దాన్ని వినే లేదన్నట్లు ఎటో ముఖం తిప్పుకుంటాడు. సరే, అతని కోసం వ్యధాభరితమైన యాతన ఎదురు చూస్తోందని శుభవార్త విన్పించు!

సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నులైనవారికి మాత్రం భోగభాగ్యాలతో నిండిన స్వర్గసీమ ఉంది. వారక్కడ కలకాలం (హాయిగా) ఉంటారు. ఇది దేవుడు చేస్తున్న తిరుగులేని వాగ్దానం. ఆయన అపార శక్తిమంతుడు, అసాధారణ వివేకవంతుడు." (31:6-9)

ఇలా నజ్ర్ చేష్టలు నానాటికి మితిమీరి పోతున్నాయి. ఒకసారి అతని మిత్రులు "అబూముఐత్ కొడుకు ఉఖ్బాను తీసుకొని మదీనా వెళ్ళు. అక్కడ యూదపండితుల్ని

కలుసుకో. వారికి ముహమ్మద్ సంగతి తెలిపి, అతని గురించి వారి అభిప్రాయం అడిగి తెలుసుకో. గ్రంథప్రజలకు దైవప్రవక్తల్ని గురించి బాగా తెలుసు'' అని సలహా ఇచ్చారు.

నజ్ర్ మిత్రుల సలహా ప్రకారం ఉఖ్బాను వెంటబెట్టుకొని మదీనా వెళ్ళాడు. అక్కడ యూదపండితుల్ని కలుసుకొని మాట్లాడాడు. వారీ విషయం విని ఇలా చెప్పారు:

''పూర్వ కాలంలో కొందరు యువకులుండేవారు. వారి కథ చాలా విచిత్రంగా ఉంటుంది. అంచేత వారిని గురించి ముహమ్మద్‌ని అడుగు. అలాగే పూర్వం అసాధారణ శక్తిగల ఓరాజు ఉండేవాడు. అతను ప్రపంచం నలుమూలలా పాలించాడు. ఆయన్ని గురించి కూడా వివరాలు అడుగు. ఇంకా ఖిజర్ అనే ఓ విచిత్ర వ్యక్తి ఉండేవాడు. అతడ్ని గురించి కూడా ముహమ్మద్‌ని అడుగు. ఈ మూడు ప్రశ్నలకు సరైన సమాధానాలు చెబితే ఆయన నిజంగా దైవప్రవక్తే. చెప్పలేకపోతే ఆయన అసత్యప్రవక్తని భావించండి. అప్పుడు మీరు అతనిపట్ల ఇష్టమొచ్చినట్లు వ్యవహరించవచ్చు.''

నజ్ర్ ఈ మూడు ప్రశ్నలు తీసుకొని మక్కా తిరిగొచ్చాడు. నజ్ర్ రాక కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్న ఖురైషీయులు అతను వచ్చిరాగానే ''ఏమయింది మిత్రమా పోయిన పని?'' అని అడిగారు ఎంతో కుతూహలంగా.

నజ్ర్ తాను విన్న విషయాలన్నీ చెప్పాడు. ఉఖ్బా వాటిని ధృవీకరించాడు. తక్షణమే ఖురైషీయులు కొంతమందిని దైవప్రవక్త (సల్లం) దగ్గరకు పంపించారు. వారు ఈ మూడు ప్రశ్నలు అడిగారు ఆయన్ని. ఆయన కొంత వ్యవధి అడిగారు.

ఆ తరువాత దేవుడు దివ్యావిష్కృతి ద్వారా తన ప్రవక్త (సల్లం)కు అవిశ్వాసులు అడిగిన మూడు ప్రశ్నలకు సమాధానాలు తెలియజేశాడు. యువకుల్ని గురించిన విచిత్ర గాథ దివ్య ఖుర్ఆన్‌లోని కహఫ్ (మహాబిలం) అనే అధ్యాయంలో వివరంగా ఉంది. ప్రపంచం నలు మూలలా పర్యటించిన సాహస యాత్రికుడు జుల్ఖర్నైన్ చరిత్ర, విచిత్ర వ్యక్తి ఖిజర్ వృత్తాంతం కూడా అదే అధ్యాయంలో ఉన్నాయి.

దైవప్రవక్త (స) ఈ విషయాలు తీసుకొని బహుదైవారాధకుల దగ్గరకు వెళ్ళారు. వారడిగిన మూడు ప్రశ్నలకు సమాధానాలిస్తే ఈసారయినా తన దౌత్యాన్ని విశ్వసిస్తారేమో నన్న ఆశతో వాటిని విన్పించారు. కాని వారి పాషాణహృదయాలు దైవసూక్తులు విని ఏమాత్రం ద్రవించలేదు. పైపెచ్చు వారు మరింత మంకుతనం వహించారు.

ఎన్నో ఆశలు పెట్టుకొని వచ్చిన దైవప్రవక్త (స) వారి మొండివైఖరి, తలబిరుసుత నాలు చూసి విచారిస్తూ అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

అవిశ్వాసులు దైవసూక్తుల్ని తిరస్కరించడమే గాకుండా వాటిని కించపరచడానకి కూడా ప్రయత్నించారు. ''అసలీ ఖుర్ఆన్‌ని మనం విననే వినకూడదు. ఇవి వట్టి పైత్యపు మాటలు. సాధ్యమైనంతవరకు మనం ముహమ్మద్‌ను ఎగతాళిచేసి ఆడిద్దాం. ఆవిధంగా నైనా అతను మన దారికి రావచ్చు'' అన్నాడు వారిలో ఒకడు.

''మీరు విన్నారా? మనం నరకానికి పోతామట! అక్కడ పంధొమ్మిది మంది దైవదూతలు పకడ్బందీగా కాపలాకాస్తూ మనల్ని బయటికి పోనివ్వరట!! అంతపెద్ద నరకానికి



పంధొమ్మిది మంది దైవదూతలేనా! మనం వేలసంఖ్యలో ఉన్నాం. ఈ పంధొమ్మిది మంది మనల్నేం చేస్తారు? మనలో పదేసిమంది ఒక్కొక్క దైవదూతను అవలీలగా ఎదుర్కొంటారు'' అన్నాడు అబూజహల్.

''నేనొక్కడ్నే పదిహేడుమంది దైవదూతల్ని మట్టి కరిపిస్తాను. మిగతా ఇద్దర్ని మీరంతా కలసి చూసుకోండి'' అన్నాడు వారిలో ఒక మల్లయోధుడు గుండెలు విరుచుకుంటూ.

''మేము నరక పాలకులుగా దైవదూతల్ని నియమించాము. వారి సంఖ్యను అవిశ్వాసులకు పరీక్షగా చేశాము. గ్రంథప్రజలకు నమ్మకం కుదరడానికి, విశ్వాసుల విశ్వాసం మరింత దృఢం కావడానికి ఇలా చేశాము. కనుక గ్రంథప్రజలు, విశ్వాసులు ఎలాంటి అనుమానంలో పడిపోకూడదు. హృదయంలో (కాపట్య) రోగమున్నవారు, అవిశ్వాసులు (దీన్ని విమర్శిస్తూ) "దేవుడు చెప్పిన ఈ వింతమాటలోని అంతరార్థం ఏమిటో!" అంటారు.

ఇలా దేవుడు తాను తలచిన విధంగా కొందరిని దారి తప్పిస్తాడు; మరికొందరికి దారి చూపుతాడు. నీ ప్రభువు సైన్యాల్ని గురించి ఆయనకు తప్ప మరెవరికీ తెలియదు. ప్రజలకు హితోపదేశం చేయడానికే ఈ (నరకదూతల) ప్రస్తావన తెచ్చాము.

(మీరనుకుంటున్నట్లు ఇదేదో ఆషామాషీ విషయం) కాదు. చంద్రుడి సాక్షి! గడచి పోతున్న రాత్రి సాక్షి!! తెల్లారుతున్న ఉదయం సాక్షి!!! ఈ నరకం గొప్ప విషయాలలో ఒకటి.

నరకం మానవుల పాలిట భయంకరమయిన విషయం. మీలో (సత్యాన్ని స్వీకరించ డానికి) ముందుకు రాదలిచే, లేక వెనకుండి పోగోరే ప్రతివ్యక్తి పాలిటా ఇది భయంకరమైన విషయమే. (ఖుర్ఆన్. 74:31-37)

## యాత్రికుల్లో దుష్ప్రచారం, చంద్రఖండన-(45)

హజ్ సీజన్ వచ్చిందంటే చాలు, ఖురైష్ నాయకులకు కంపరమెత్తి పోతుంది. కారణం ముహమ్మద్ (సల్లం) బయట నుంచి వచ్చే వేలాది యాత్రికుల్ని కలుసుకొని వారికి నూతన ధర్మాన్ని నూరి పోస్తారని భయపడటమే. అందువల్ల ఓరోజు వారు వలీద్ బిన్ ముగైరా అధ్యక్షతన రహస్యంగా సమావేశమయ్యారు. అందులో అతిరథ మహా రథులంతా పాల్గొన్నారు. వలీద్ సభికుల్ని ఓమారు కలియజూసి ఇలా ప్రసంగించాడు:

''సోదరులారా! ముహమ్మద్ ప్రచారంతో అతని అనుచరుల సంఖ్య రోజురోజుకు పెరిగి పోతోంది. అతడ్ని గట్టిగా ప్రతిఘటించకపోతే త్వరలోనే మనం సమాజంలో అప్రతిష్ఠ పాలుకావలసి వస్తుంది. అంచేత వెంటనే అతని మీద తగిన చర్య తీసుకోవాలి. హజ్ దినాలు వస్తున్నాయి. బయట నుంచి అనేకమంది యాత్రికులు వస్తారు. మనమంతా తక్షణమే ఒక నిర్ణయానికి రావాలి. ఆ తరువాత మనలో ఏ ఒక్కరూ విరుద్ధ ప్రకటనలు చేయకూడదు. అలా చేస్తే మన పథకమంతా పాడైపోయి మన నిజస్వరూపాలు బయటపడతాయి. చెప్పండి ఏం చేద్దాం?''

''ముహమ్మద్ జోస్యం చెప్పేవాడని ప్రచారం చేద్దాం'' అన్నారు కొందరు.

"వద్దు, మనం ఎంతో మంది జోస్యగాళ్ళను చూశాం. వారి మాటలకు, ముహమ్మద్ చెప్పే సూక్తులకు పోలికే లేదు" అన్నాడు వలీద్.

"అయితే పిచ్చివాడు అందాం" మరికొందరి సలహా.

"కాదు. పిచ్చివాడి మాటలు ఎలా ఉంటాయో అందరికీ తెలుసు. ఇతనిలో పిచ్చివాడి చేష్టలు మచ్చుకైనా లేవు" అన్నాడు వలీద్.

"పోనీ కవి అందామా?"

"అతను కవి కూడా కాదు. నేను కవితా జగత్తును అమూలాగ్రంగా వడపోశాను. అతని వాక్కులో కవిత్వం ఏమాత్రం గోచరించదు. మరేదయినా ఆలోచించండి."

"సరే, ముహమ్మద్ గొప్ప ఇంద్రజాలికుడంటేనో?" మరో సలహా.

"ముహమ్మద్‌ని ఇంద్రజాలికుడని కూడా అనలేం. మనం ఎంతమంది ఇద్రజాలికుల్ని చూడలేదూ? కాని ఒక్కడైనా ముహమ్మద్ సూక్తి లాంటి మంత్రం చెప్పగలడా?"

"అయితే మరి ఏమని ప్రచారం చేద్దాం అతడ్ని గురించి?" అడిగారు కొందరు.

"దైవసాక్షి! అతని వాక్కులో అనిర్వచనీయమైన మాధుర్యం ఉంది. అది సుమధుర ఫలాలతో నిండి బలంగా, లోతుగా వేళ్ళూనిన మహావృక్షం లాంటిది. అందువల్ల మనం ఏది బొంకినా అందరికీ నమ్మకం కలిగించేదిగా ఉండాలి. ఇదో, ఇతను గొప్ప మాంత్రికుడు. ప్రతి ఒక్కరినీ ఇట్టే మంత్రముగ్ధుల్ని చేసే అద్భుతవాణి తెచ్చాడు. దాని ప్రభావంతో అతను తండ్రీకొడుకుల్లో, అన్నాచెల్లెళ్లో, భార్యాభర్తల్లో, ఒక కుటుంబానికి మరో కుటుంబానికి మధ్య విభేదాలు సృష్టిస్తాడు అని ప్రచారం చేద్దాం" అన్నాడు వలీద్.

ఈ మాటలు విని అందరూ సరే అంటే సరే అన్నారు. సమావేశం ముగిసింది. తరువాత అందరూ అవకాశం కోసం ఎదురుచూడసాగారు.

కాబాయాత్ర శుభతరుణం రానేవచ్చింది. దేశం నలుమూలల నుండి వేలాది మంది యాత్రికులు వచ్చారు. సమయం కోసం కాచుకొని ఉన్న ఖురైషీయులు అనుకున్న ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (స)పై దుష్ప్రచారం ప్రారంభించారు:

"ముహమ్మద్ సంగతి మీకు తెలియదేమో! అతను పెద్ద ఇంద్రజాలికుడు. అతని మాటలు ప్రతి ఒక్కర్నీ ఇట్టే ఆకట్టుకొని మంత్రముగ్ధుల్ని చేస్తాయి. దాంతో తండ్రీకొడుకుల్లో, భార్యాభర్తల్లో పొరపొచ్చాలు; అన్నా చెల్లెల్లో పోట్లాటలు వస్తాయి. జాగ్రత్త సుమా! అతని మాయదారి మాటల్లో పడకండి" అన్నాడు వలీద్.

"నేను ఒంటరిగా పుట్టించినవాడ్ని నాకు వదిలెయ్యి. (నేను చూసుకుంటానతని సంగతి.) నేనతనికి అపార సిరిసంపదలు ప్రసాదించాను. అతడ్ని ఎల్లప్పుడూ వెన్నంటి ఉండే కొడుకుల్ని ఇచ్చాను. సుఖసంతోషాలకు అవసరమైన జీవన సామగ్రినంతా ప్రసాదించాను. అయినా నేను తనకు మరింత అనుగ్రహిస్తానని పేరాశతో ఉన్నాడు.

అలా ఎన్నటికీ జరగదు. అతను మా సూక్తుల పట్ల ద్వేషం పెంచుకున్నాడు. త్వరలోనే నేనతడ్ని కఠినమైన (నరక) శిఖరం ఎక్కిస్తాను. అతను ఎంతో ఆలోచించి (మాకు వ్యతిరేకంగా)



పన్నాగం పన్నడానికి ప్రయత్నించాడు. వాడు నాశనం గాను! ఎలాంటి దుష్ట యత్నానికి ఒడిగట్టాడు!! వాడు పాడుగాను! ఎలాంటి దారుణానికి పాల్పడ్డాడు!!

తరువాత అతను (జనం వైపు) చూశాడు. ఆ తరువాత భృకుటిముడిచి, మూతి విరుచుకున్నాడు. ఆపై వెనక్కి తిరిగి హూంకరించాడు. చివరికతను "ఇది పూర్వం నుంచీ వస్తున్న మంత్రజాలం తప్ప మరేమీకాదు. ఇది మానవవాక్కు మాత్రమే" అన్నాడు.

"త్వరలోనే నేనతడ్ని నరకంలో విసిరేస్తాను. నరకం ఏమిటో నీకేం తెలుసు? అది మిగల్చదూ, వదలిపెట్టదు. పైగా చర్మాన్ని నిలువుగా మాడ్చివేస్తుంది." (ఖు:74:1-27)

ఈ ప్రచారం యాత్రికుల్లో కార్చిచ్చులా వ్యాపించింది. అంచేత కొందరు ముహమ్మద్ (స)ను కలుసుకోవడానికే భయపడ్డారు. మరికొందరు ఎందుకొచ్చిందిలే మనకు అనుకొని యాత్రానంతరం కిమ్మనకుండా వెళ్ళిపోయారు. చాలామంది కాబాయాత్ర తర్వాత స్వస్థలం చేరుకొని తమ బంధుమిత్రులకు వింతగా చెప్పుకున్నారు.

ఇలా దైవప్రవక్త (స) పేరు అనతికాలంలోనే దేశమంతా వ్యాపించిపోయింది. శత్రు దుష్ప్రచారం వల్ల ఒక్కోసారి ఇస్లామీయ ఉద్యమానికి ప్రయోజనం కూడా చేకూరుతుంది. దైవప్రవక్త (సల్లం)కు వ్యతిరేకంగా ఖురైష్ బహుదైవారాధకులు ప్రారంభించిన ఈకొత్త ప్రచారం విని నిజానిజాలేమిటో తెలుసుకోవాలనే కుతూహలంతో ఇతర ఊళ్ళ నుంచి కొందరు మక్కా పట్నానికి బయలుదేరారు. అలా మక్కా వచ్చినవారిలో అనేకమంది ఇస్లాం స్వీకరించి దైవప్రవక్త (సల్లం)కు అనుచరులుగా మారారు.

అవిశ్వాసుల కుట్ర బెడిసికొట్టింది. ఇస్లాంను తుడిచిపెట్టాలని ప్రయత్నిస్తే అది మరింత విస్తృతం కాసాగింది. దాంతో వారు జరిగిన పొరపాటు గ్రహించి తల బాదుకున్నారు.

దైవప్రవక్త (స) ఓరోజు ధర్మ ప్రచారం కోసం పట్నం వెలుపల బాటసారుల్ని కలుసుకోవడానికి వెళ్ళారు. వెంట కొందరు అనుచరులు కూడా ఉన్నారు. అది పున్నమిరాత్రి. చంద్రుడు హిరాకొండ మీదికొచ్చి చల్లటి కిరణాలు వెదజల్లుతున్నాడు. అప్పుడు కొందరు అవిశ్వాసులు వచ్చి "నువ్వు నిజంగా దైవప్రవక్త వయితే చంద్రుడ్ని రెండు ఖండాలుగా చీల్చి చూపు" అన్నారు.

ఈ మాట విని దైవప్రవక్త (సల్లం) నింగి వైపు దృష్టి సారించారు. మిగిలినవాళ్ళు కూడా తలలు పైకెత్తి చంద్రుడి వైపు తదేకంగా చూడసాగారు. ఆశ్చర్యం! అత్యంతాశ్చర్యం!! హఠాత్తుగా చంద్రుడు రెండు ఖండాలుగా చీలిపోయాడు. చీలిన రెండవ ఖండం దూరంగా జరిగి ఆగింది. ఇలా కొండకు ఇరు వైపులా రెండు అర్థచంద్రులు దేదీప్యమానంగా వెలిగిపోతూ కన్పించాయి. ఆ తరువాత వెంటనే రెండు అర్థచంద్రులు కలిసిపోయి పూర్ణ చంద్రుడయి పోవడం జరిగింది.

క్షణంపాటు కన్పించిన ఈ అపూర్వదృశ్యాన్ని అందరూ సంభ్రమాశ్చర్యాలతో చూశారు. అప్పుడు దైవప్రవక్త (స) " దీనికి మీరు సాక్షులుగా ఉండండి" అన్నారు అవిశ్వాసులతో.

కాని సత్యతిరస్కారులు తల అడ్డంగా తిప్పారు.

"ఇదంతా నువ్వు నీ మంత్రబలంతో చూపిన మాయ తప్ప మరేమీ కాదు. నువ్వు మమ్మల్ని కనికట్టుకు గురిచేశావు. మేము నీ మాటలు నమ్మం" అన్నారు అవిశ్వాసులు.

ప్రవక్త అనుచరులు మాత్రం ఈ అపూర్వ దృశ్యం చూసి ఆనందపరవశులయ్యారు. ఇస్లాం పట్ల వారి విశ్వాసం ద్విగుణీకృతం అయింది.

"ప్రళయ ఘడియ సమీపించింది. చంద్రుడు చీలిపోయాడు. కాని వీరు మాత్రం ఎలాంటి మహిమ చూసినా (సత్యాన్ని విశ్వసించకుండా) విముఖులయి పోతున్నారు. పైగా ఇది రోజూ ప్రదర్శిస్తున్న మంత్రజాలమేనని అంటున్నారు. వారు (చంద్ర ఖండన మహిమను కూడా) తిరస్కరించి తమ మనోవాంఛలకు బానిసలయి పోయారు. ప్రతి వ్యవహారం చివరికి ఒక పర్యవసానానికి చేరుకోక తప్పదు." (దివ్యఖుర్ఆన్. 54:1-3)

## సంఘ బహిష్కరణ-(46)

ఇస్లామీయ ఉద్యమాన్ని అరికట్టడానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో ఖురైషీయులు సరికొత్త వ్యూహం గురించి ఆలోచించసాగారు. ముస్లింలలో చీలిక తీసుకు రావాలి, ఎలా? ముహమ్మద్ అనుచరులు తమ నాయకుడ్ని అనుమానించి వదలిపెట్టా లంటే ఏం చెయ్యాలి? ఇలా ఆలోచించి చివరకు ఓ నిర్ణయానికి వచ్చారు.

"ముహమ్మద్‌ని, ఆయన అనుచరుల్ని సంఘబహిష్కరణ చేద్దాం. ఇకనుంచి వాళ్ళ తో ఎలాంటి సంబంధం పెట్టుకోకూడదు. వివాహాది శుభకార్యాలు, ఇచ్చిపుచ్చుకోవడాలు, వ్యాపారలావాదేవీలు నిషేధించాలి. వారికి ఎలాంటి సహాయం అందజేయకూడదు."

ఈ నిర్ణయాన్ని వెంటనే వ్రాతపూర్వకంగా ఓ ప్రకటన తయారుచేసి కాబా గృహంలో వ్రేలాడ కట్టారు. దాని షరతులను అందరూ గౌరవించాలని, ముస్లింలను సంఘం నుంచి పూర్తిగా బహిష్కరించాలని ఆ ప్రకటనలో పేర్కొనబడింది.

ఆ తరువాత ఖురైష్ నాయకులు అబూతాలిబ్ దగ్గరకు పోయి ఇలా అన్నారు:

"అబూతాలిబ్! మన మధ్య సయోధ్య కుదరాలంటే ఇక ఒకేఒక మార్గం ఉంది. ముహమ్మద్‌ని మాకప్పగించండి. అతని జీవితచరిత్రను సమాప్తం చేస్తాం. దాంతో మన ఉభయులకూ మనశ్శాంతి లభిస్తుంది. కావాలంటే ముహమ్మద్ హత్యకు మీరు కోరినంత రక్తపరిహారం ఇచ్చుకుంటాం. దీనికి మీరు అంగీకరిస్తే మనమధ్య ఉన్న స్నేహం, గౌరవం ఇకముందు కూడా కొనసాగుతాయి. అంగీకరించకపోతే మిమ్మల్ని, మీ ముహమ్మద్‌ని సంఘం నుంచి వెలివేస్తాం. ఇకముందు మీతో ఎలాంటి ఇచ్చిపుచ్చుకోవడాలు, వ్యాపార లావాదేవీలు జరగవు. దాని పరిణామాలు ఎలా ఉంటాయో ఊహించుకోండి. ఒక్కొక్క మెతుక్కి మొగంవాచి మాడి చావలసి వస్తుంది. ఆలోచించి నిర్ణయించుకోండి."

అబూతాలిబ్ గాని, ఆయన తెగవాళ్ళుగాని దైవప్రవక్త (సల్లం)ను ఆ కిరాతకులకు అప్పగించడానికి ఏమాత్రం సహించలేదు. ముహమ్మద్ (సల్లం) వారి ఆశాజ్యోతి. రానున్న పరిణామాలను ఎదుర్కొవడానికైనా సిద్ధపడ్డారుగాని, వారి బెదిరింపుల్ని ఏమాత్రం ఖాతరు చేయకుండా నిక్కచ్చిగా జవాబిచ్చారు.



"ఏ షరతులయినా ఒప్పుకుంటాంగాని, ముహమ్మద్‌ను వదలుకోవడానికి మాత్రం మేము సిద్ధంగా లేము."

"అలాగైతే ఈరోజు నుండి మీరు మాకు బద్ధశత్రువులు. ఇక చూడండి మీ గతి ఏమవుతుందో!" అంటూ చురచుర చూసి చరచరా వెళ్ళిపోయారు ఖురైషీయులు.

అది నబవీశకం 7వ సంవత్సరం, ముహర్రం నెల. అబూతాలిబ్, తన సమస్త పరివారంతో 'షోబే అబితాలిబ్' అనే పర్వత లోయలో సాంఘిక నిర్బంధానికి లోనయ్యారు. ఎండనక, వాననక వారంతా ఇక అక్కడే గడపాలి. అలా ఎంతకాలం గడపాలో తెలియదు. అయితే హజ్‌యాత్రకు చెందిన నాలుగు పవిత్ర మాసాలలో మాత్రం వారిని బయటికి రానిచ్చేవారు. ఆ నాలుగు నెలలు అరేబియాలో ఎక్కడా యుద్ధ సూచనలు కన్పించవు. సర్వత్రా ప్రశాంత వాతావరణం నెలకొని ఉంటుంది.

ఆ నాలుగు నెలల కాలంలోనే దైవసందేశహరుని(సల్లం)కి, ఆయన అనుచరులకు ఇస్లాం ప్రచారం చేయడానికి అవకాశం లభిస్తుంది. దేశం నలుమూలల నుంచి అనేక మంది యాత్రికులు, వర్తకులు మక్కా వస్తారు. వింత వింత వస్తువులతో అలంకరించబడే దుకాణాలు, ఆ దుకాణాలకు వచ్చిపోయే జనసందోహంతో మక్కా పట్నం కళకళలాడుతూ కోలాహలంగా ఉంటుంది. దైవప్రవక్త (స) ప్రజల దగ్గరకు పోయి ధర్మప్రచారం చేసేవారు. ఎంతో ప్రేమతో, అమృత పలుకులతో దైవసందేశాన్ని వారికి బోధించేవారు.

ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) ముస్లింగా మారాడని, ఆయన ప్రవేశంతో ముస్లింలకు కొండంత ధైర్యంవచ్చి బాహాటంగా ధర్మప్రచారం చేస్తున్నారని అబిసీనియాకు వలసపోయిన ముస్లింలకు తెలిసింది. పైగా, మక్కాపట్నం వాడవాడలా ఇస్లాం కిరణాలు ప్రసరించాయని, వాటి ప్రభావం చుట్టుపక్కల గ్రామాల మీద పడిందని కూడా విని వారు ఎంతో సంబర పడ్డారు. వెంటనే వారు అబిసీనియా వదలి మక్కా బయలుదేరారు. కాని మక్కా దరిదాపు లకు చేరుకునేటప్పటికి ముస్లింలు షోబె అబితాలిబ్‌లో నిర్బంధించబడి అష్టకష్టాలు అనుభవిస్తున్నారని విషాదవార్త విన్నారు. దాంతో వారు ఢీలా పడిపోయి మళ్ళీ కాళ్ళీడ్చు కుంటూ వచ్చినదారే తిరిగి వెళ్ళిపోయారు.

షోబె అబితాలిబ్‌లో ముస్లింల దుస్థితి నానాటికి తీవ్రమవుతోంది. పరిస్థితి విష మించడంతో మరికొందరు అనుచరుల్ని అబిసీనియాకు వెళ్ళిపొమ్మని దైవప్రవక్త (స) అనుమతించారు. ఇలా చాలామంది అబిసీనియాకు వలసపోగా, కొద్దిమంది మాత్రమే దైవప్రవక్త (స)ను అంటిపెట్టుకొని అవిశ్వాసులు పెట్టే బాధలు భరిస్తూ దుర్భర జీవితం గడుపుతున్నారు. ఇలా నెలా రెండు నెలలా? వరసగా మూడేండ్లు సాంఘిక నిర్బంధానికి గుర్రై అష్టకష్టాలు పడ్డారు. తిండికి-బట్టకూ వారు అనుభవించని బాధలు లేవు.

ఒకరోజు ప్రవక్త అనుచరుడు హజ్రత్ సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) తినడానికి ఏమీ దొరక్క ఎంతో బాధపడసాగారు. అలాంటి పరిస్థితిలో ఓచోట ఎండిన తోలుముక్క దొరికితే అదే భాగ్యమని భావించి, దాన్ని శుభ్రంగా కడిగి, కాల్చి నీళ్ళలో నానబెట్టారు. అలా నీళ్ళలో నానిన ఆ తోలుముక్క తిని ఆయన ఆకలిమంట చల్లార్చుకున్నారు.

ముస్లింల దయనీయ స్థితి చూసి బహుదైవారాధకుల్లోని హకీం బిన్ హిజామ్, హిషాం బిన్ అమ్ర్‌ల హృదయాలు ద్రవించిపోయాయి. వాళ్ళిద్దరు రాత్రివేళ అవిశ్వాసుల కంటబడ కుండా షొబె అబితాలిబ్‌లో మగ్గుతున్న ముస్లింలకు అప్పుడప్పుడు ఆహారం, బట్టలు వగైరా అందజేస్తుండేవారు. ఓరోజు ఎలాగో ఈ రహస్యం ఖురైషీయులకు తెలిసింది. అప్పటి నుంచి వారు హకీంని, హిషామ్‌ని వేధించడం మొదలెట్టారు. అయినా వీరిద్దరూ ధైర్యంతో తమ సహాయాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు.

ఇలా ఎంత కాలం ఈ నిర్బంధం? హిషామ్ ఒక విషయం ఆలోచించాడు. ఒకరోజు అతను జుబైర్ బిన్ ఉమయ్యా దగ్గరకు పోయి ఇలా అన్నాడు:

"జుబైర్! అక్కడ షొబె అబీతాలిబ్‌లో మీ మామయ్య తింటానికి తిండి కూడా సరిగా దొరక్క దుర్భర జీవితం గడుపుతుంటే, ఇక్కడ నీవు మంచి మంచి రుచికరమైన పదార్థాలు తింటూ, ఖరీదైన బట్టలు ధరిస్తూ భోగభాగ్యాలు అనుభవిస్తున్నావా! నీకిది న్యాయమని పిస్తుందా? అదే అబూజహల్ గనక కష్టాలలో ఉంటే అతని మేనల్లుళ్ళు ఇలా చూస్తూ ఏమీ పట్టనట్లు ఉండేవారా?"

"నిజమే. కాని నేనొక్కడ్ని ఏం చేయగలను? ఎవరైనా నాకు తోడు దొరికితే తప్పకుండా ఆ ఒడండబడికను నిర్మూలిస్తాను" అన్నాడు జుబైర్.

"నేనున్నాగదా నీకు తోడుగా!" ధైర్యమిచ్చాడు హిషామ్.

"అయితే మరో వ్యక్తిని కూడా చూడు. ముగ్గురం కలసి దాన్ని నామరూపాల్లేకుండా చేసేద్దాం" అన్నాడు జుబైర్.

ఆ తరువాత వాళ్ళిద్దరు మూడో మనిషి కోసం వెతికారు. అదృష్టవశాత్తు వారికి ఒకడికి బదులు ముగ్గురు దొరికారు. ఈ ఐదుగురు కలసి ఒక పథకం రూపొందించి మరునాడు కాబాలయానికి పోయారు. అక్కడ అంతకుముందే ఖురైష్ నాయకులు వచ్చి సమాలోచనలు జరుపుతున్నారు. జుబైర్ మొదట కాబా ప్రదక్షిణ చేశాడు. ఆ తరువాత ఖురైషీయుల్ని ఉద్దేశించి ఇలా అన్నాడు:

"మిత్రులారా! మనం ఇక్కడ కడుపారా తిని హాయిగా ఉంటున్నాం; కాని షొబె అబీ తాలిబ్‌లో హాషిం సంతతివాళ్ళు ఎవరి సహాయానికి నోచుకోలేక నానా ఇబ్బందులు పడు తున్నారు. ఇది భావ్యమేనా మనకు? మానవత్వం అంటే ఇదేనా? ఇదిగో నేను ప్రమాణం చేసి చెబుతున్నాను. నిర్దాక్షిణ్యమయిన ఈ ఒప్పందాన్ని తుదముట్టించే వరకు నేను విశ్రాంతి తీసుకోను. ఇదే నా నిర్ణయం."

అబూజహల్ ఉరిమిచూస్తూ "పొరబడుతున్నావు జుబైర్! నీవనుకున్నట్లు ఇది ఎన్నటికీ జరగదు" అన్నాడు.

"తప్పకుండా జరుగుతుంది. జరిగి తీరాలి" వెంటనే అందుకున్నారు పక్కనే ఉన్న జుబైర్ మిత్రులు.

అబూజహల్ మెత్తబడ్డాడు. ఇదంతా ముందుగానే వేసుకున్న పథకంలా ఉందని భావించి, నోరు మూసుకున్నాడు. కాని అబూసుఫ్యాన్ ఊరుకోలేదు.



"ఏవిటీ! నీవు ఒప్పందం ఉల్లంఘించి రక్తపాతానికి సిద్ధపడదలిచావా?" అన్నాడతను.

"మీరు ఒప్పుకోకపోతే రక్తపాతం తప్పదు" జుబైర్ తెగేసి చెప్పాడు.

"అంతవరకు వచ్చిందా నీ వ్యవహారం? అయితే నిన్ను మా దారి నుండి శాశ్వతంగా తప్పించవలసి వస్తుంది" అన్నాడు అబూసుఫ్యాన్ కటువుగా.

"నీకంత ధైర్యం వచ్చిందా? అయితే ఖడ్గం తీసుకొని రంగంలోకి దిగు" అన్నాడు జుబైర్ వరలో నుంచి చర్రున కరవాలం లాగితీస్తూ.

అబూసుఫ్యాన్ కూడా కత్తి దూసి ముందుకు వచ్చాడు.

అంతలో.....

"ఆగండి" అన్నారు కొందరు సహచరులతో అప్పుడే అక్కడికి వచ్చిన అబూతాలిబ్.

ఆయన వారిద్దరి మధ్యకు వచ్చి కత్తులు దించమని సైగచేస్తూ ఇలా అన్నారు:

"నేనిక్కడకు ముహమ్మద్ (సల్లం) చెప్పిన మాటను ధృవపరచుకోవడానికి వచ్చాను. ఈరోజు ముహమ్మద్ (సల్లం) ఒడంబడిక పత్రం చెదలు పట్టిపోయిందని తెలియజేశాడు. ఈమాట నిజమయితే మీరు బహిష్కరణ ఆంక్షలు ఎత్తివేయాల్సి ఉంటుంది."

"తప్పకుండా. ఒడంబడిక పత్రం చెదలు పడ్తే ఇక ఆంక్షల్ని కొనసాగించే ప్రశ్నే తలెత్తదు. కాని ముహమ్మద్ మాట అసత్యమని రుజువైతే...?" అన్నాడు అబూసుఫ్యాన్.

"నా తమ్ముడి కొడుకు ముహమ్మద్ (స) ఎన్నటికీ అసత్యమాడడు. ఒకవేళ ఈ మాట అబద్ధమని తేలితే నేను ముహమ్మద్‌ని మీకు అప్పగిస్తాను. మీఇష్టానుసారం అతని పట్ల మీరు ప్రవర్తించవచ్చు. నాకెలాంటి అభ్యంతరం లేదు" అన్నారు అబూతాలిబ్.

"సరే పదండి లోపలికెళ్ళి చూద్దాం ఈ తమాషా కూడా" అన్నాడు అబూసుఫ్యాన్.

అందరూ కాబా గర్భగుడిలోకి ప్రవేశించారు. చూస్తే నిజంగానే ఒడంబడిక పత్రం చెదలు పట్టిపోయింది. ఒక్క అల్లాహ్ పేరు తప్ప మరేమీ లేదక్కడ. ఖురైషీయులు ఆశ్చర్యచకితులై పోయారు. ఒడంబడిక దానంతటదే రద్దయిపోయింది. అబూజహల్, అబూసుఫ్యాన్‌ల నోళ్ళలో పచ్చివెలక్కాయలు పడినట్లయింది.

దైవప్రవక్త (సల్లం), ఆయన అనుచరులు మూడేండ్ల తరువాత స్వేచ్ఛాజీవులై షొబె అబీతాలిబ్ నుంచి బయటికి వచ్చారు. ధర్మప్రచారం మళ్ళీ ప్రారంభించారు. మునుపటికంటే ఇప్పుడు ఇస్లామీయ ఉద్యమాన్ని మరింత ఉధృతంచేశారు.

## అనంత తీరాలకు ఆప్తులు-(47)

అయితే దైవప్రవక్త (స) పెదనాన్న అబూతాలిబ్ వ్యాధిగ్రస్తులై కోలుకోలేకపోయారు. ఖురైష్‌నేతలు ఇక ఆయన ఎంతోకాలం బతకడని గ్రహించి ఇస్లాంను తుదముట్టించ డానికి మరోసారి ప్రయత్నించారు. అబూతాలిబ్‌కు ఎలాగో నచ్చజెప్పి తమను, తమ విగ్రహాలను విమర్శిస్తున్న ముహమ్మద్ బెడదను వదిలించుకోవాలని భావించారు.

అబూతాలిబ్ చనిపోయాక ముహమ్మద్‌ను హింసిస్తే, అబూతాలిబ్ బ్రతికుండగా ఏమి చేయలేక పోయారు; ఇప్పుడు పెత్తండ్రి పోవడంతో పెద్ద మొనగాళ్ళయి పోయారని నల్గురు నాల్గు విధాలుగా తమను విమర్శించవచ్చు. అలాంటి విమర్శలకు తావీయకుండా అబూతాలిబ్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకోవాలని నిర్ణయించుకున్నారు ఖురైష్ నేతలు.

వెంటనే వారు అబూతాలిబ్ ఇంటికి పోయారు. అబూతాలిబ్ ఆరోగ్యాన్ని గురించి పరామర్శించి, తాము వచ్చిన పనేమిటో మెల్లిగా బయటపెట్టారు.

“అబూతాలిబ్! మీరు మా అందరికీ అగ్రనాయకులు. పితామహులు వంటివారు. మీపట్ల మాకున్న గౌరవాభిమానాలు ఎలాంటివో మీకూ తెలుసు. అందువల్ల ముహమ్మద్ విషయంలో మీరు మాకు న్యాయం చేకూర్చుతారని ఆశతో వచ్చాం. అతడు మా మతం జోలికి రావద్దని, మా విగ్రహాలను విమర్శించవద్దని అతనికి ఒక్క మాట చెప్పండి. మేము కూడా ఆయన మతం జోలికి పోము.”

అబూతాలిబ్ ఆలోచనలో పడ్డారు. తన ముహమ్మద్‌ను ఈ దుర్మార్గులు వదలిపెట్టే టట్లు లేరని గ్రహించారు. తన కాలం కూడా సమీపించింది. ఏం చేయాలో తోచలేదు. ముహమ్మద్ (సల్లం)ని పిలిచి ఈ విషయం ఆయన ముందుంచారు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఖురైష్ నాయకుల్ని చూసి “మీరు కేవలం ఒక్క మాట అనండి. ఆ తర్వాత మీనుంచి నేను మరేదీ ఆశించను. ఒక్కమాట చాలు” అన్నారు.

“ఏమిటా మాట?” అడిగారు ఖురైషీయులు కుతూహలంగా.

“లా ఇలాహ ఇల్లల్లాహ్ (అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేడు) అనండి.”

ఈ మాట వినగానే ఖురైషీయులు దిగ్గున లేచారు మండిపడుతూ.

“ఇతనికి మనం లక్ష చెప్పినా వినడు, మొండిఘటం. దీని పర్యవసానం తరువాత అతనికే తెలుస్తుంది, పదండి” అంటూ వారిలో కొందరు విసవిసలాడుతూ వెళ్ళిపోయారు.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) పెదనాన్న వైపు ఆశగా చూశారు, ఈయన అయినా ఈ సద్వచనం స్వీకరించి పరలోక సాఫల్యం పొందుతారేమోనని.

“పెదనాన్నా! మీరయినా అనండి ఈ ఒక్కమాట; అంతిమదినాన మీకు అనుకూలంగా సాక్ష్యం చెప్పడానికి నాకు అవకాశముంటుంది. నామాట కాదనకండి. చెప్పండి ‘లా ఇలాహ ఇల్లల్లాహ్’ ఒక్కమాట చాలు.”

అబూతాలిబ్ ఏదో చెప్పాలనుకున్నారు. కాని ఆయన నోట సమాధానం వెలువడక ముందే అబూజహల్ అందుకున్నాడు:

“నాయకా! మీరు తమ్ముడికొడుకు మాట విని పూర్వం నుంచి వస్తున్న మన తాత ముత్తాతల మతాన్ని వదలిపెడతారా?”

దైవప్రవక్త (సల్లం) పెదనాన్న వైపు మరోసారి ఆశగా చూస్తూ “పెదనాన్నా! మీరీ సద్వచనం ఒక్కసారి పఠించండి, చాలు” అన్నారు.



అబూతాలిబ్ మళ్ళీ ఏదో చెప్పబోయారు. కాని......

“నాయకా! తొందరపడి తరతరాల నుంచి వస్తున్న మతాన్ని వదలి పెట్టకండి” అన్నాడు అబ్దుల్లా బిన్ ఉమయ్యా ఆయనకు అడ్డుతగులుతూ.

“పెదనాన్నా! సద్వచనం పఠించండి. పరలోకంలో మీ గురించి సిఫారసుచేసే అవకాశం ఇవ్వండి నాకు” అన్నారు దైవప్రవక్త (సల్లం) మరోసారి.

“నాయనా ముహమ్మద్! నీవు కోరినట్లు అనడానికి నాకెలాంటి అభ్యంతరం లేదు. కాని అబూతాలిబ్ చావుకు భయపడి ముహమ్మద్ (సల్లం)కు లొంగిపోయాడని జనం నన్ను ఎత్తిపొడుస్తారు. అంచేత నన్ను మన తాతముత్తాతల మతంలోనే ఉండనీ” అన్నారు అబూతాలిబ్.

“ముహమ్మద్ (సల్లం)! నీవు కోరినవాడికి సన్మార్గం చూపలేవు. దేవుడు మాత్రమే తాను కోరినవాడికి సన్మార్గం చూపగలడు. సన్మార్గం అవలంబించే వారెవరో ఆయనకు బాగా తెలుసు.” (దివ్య ఖుర్ఆన్. 28:56)

అబూతాలిబ్ ఇస్లాంస్వీకార భాగ్యానికి నోచుకోలేదు. ఆయన విశ్వప్రభువు అనుగ్రహానికి దూరమయి పోయారు. చిన్ననాటి నుంచి ఎంతో గారాబంగా పెంచి పెద్దచేసి, శత్రువుల నీడ సయితం తనపై పడనీయకుండా కంటికి రెప్పలా కాపాడిన పెదనాన్న ఈరోజు అవిశ్వాస స్థితిలోనే అంతిమయాత్ర చేయవలసి వస్తున్నందుకు మహాప్రవక్త ముహమ్మద్ (స) ఎంతగానో బాధపడ్డారు.

కాని మనిషి హృదయాన్ని మార్చడం ఎవరితరం? పరాత్పరుడు మాత్రమే తాను కోరినవారిపై తన కారుణ్య సుధను చిలికిస్తాడు.

అబూతాలిబ్ దైవప్రవక్త ముహమ్మద్ (స)ను ఏకాకిగా చేసి శాశ్వతంగా ఇహలోకం నుండి వెళ్ళిపోయారు. సత్యధర్మ వైతాళికుడ్ని శత్రువుల రాతిగుండెలకు అప్పగించి మరీ వెళ్ళిపోయారు.

దైవప్రవక్త (సల్లం) హృదయానికి కలిగిన ఈ గాయం పూర్తిగా మాననయినాలేదు, దానిపై మరోగాయం! కష్టసుఖాలలో, ఎగుడు దిగుళ్ళలో తోడుగా నీడగా నిలిచిన అర్ధాంగి హటాన్మరణం! పతిసేవే పరమానందంగా భావించిన హజ్రత్ ఖదీజా (రజి) కూడా దైవప్రవక్త (సల్లం)ను ఒంటరిగా వదలిపెట్టి పోయారు.

హజ్రత్ ఖదీజా (రజి) దైవసందేశహరుని ద్వారా జీవితసత్యాన్ని గ్రహించి ఇస్లాంను విశ్వసించిన తొలి మహిళ మాత్రమే కాదు; తొలి మానవమూర్తి కూడా. బంధువులు రాబందుల్లా పొడుచుకు తింటున్నా ఖాతరు చేయకుండా సత్యధర్మం కోసం తన సర్వ సంపదను వెచ్చించి, అంతులేని కష్టాలలో సైతం అనురాగసుధ చిలికించిన అమృత మూర్తి. కడగండ్ల మండుటెండల్లో స్వాంతన శీతలం అందించిన ఆ నీడను కూడా కోల్పోయారు దైవప్రవక్త (స).

# హద్దుమీరిన దౌర్జన్యాలు-(48)

అలాంటి పరిస్థితుల్లో ఇస్లామీయ ఉద్యమాన్ని అణచడానికి అవిశ్వాసులకు మరింత అవకాశం లభించింది. వారి కిరాతకచర్యలకు అనుకూల వాతావరణం ఏర్పడింది.

హజ్రత్ అబూబకర్ (రజి) కూడా అవిశ్వాసుల దౌర్జన్యాలు భరించలేక హజ్రత్ బిలాల్ (రజి)ని వెంటబెట్టుకొని అబిసీనియాకు ప్రయాణమయ్యారు. దారిలో మక్కా పరిసర ప్రాంతంలో ఉండే ఒక తెగ నాయకుడు ఇబ్నె దుగన్న తారసపడ్డాడు.

“మిత్రమా అబూబకర్! ఎక్కడికీ ప్రయాణం? ఏమిటి ఈ వేషం యోగిలా తయారయ్యావు?” అని అడిగాడు ఇబ్నె దుగన్న.

“నా తెగవాళ్ళు నన్ను ప్రశాంతంగా దైవారాధన చేయనీయకుండా వేధిస్తున్నారు. వారి వేధింపులు పడలేక నేను అబిసీనియా వెళ్ళిపోతున్నాను”అన్నారు అబూబకర్ (రజి).

“వారలా ఎందుకు చేస్తున్నారు. నీవు నీ తెగలో ఎంతో మంచివాడివి. కష్టాలలో ఉన్నవారిని ఆదుకునేవాడివి. ఎంతో నిజాయితీపరుడివి. పద, మక్కా వెళ్దాం. నేను నీకు ఆశ్రయమిస్తున్నాను. నా రక్షణలో వారు నిన్నేమీ చేయలేరు” అన్నాడు ఇబ్నె దుగన్న.

ఈమాట చెప్పి అతను అబూబకర్ (రజి)ని వెనక్కి మక్కాకు పిలుచుకొచ్చాడు. మక్కాలో ఖురైష్ నాయకుల్ని ఉద్దేశించి “ఖురైషీయులారా! నేను అబూబకర్‌కు రక్షణహామీ ఇచ్చాను. కనుక మీరెవరూ ఈరోజు నుండి ఇతడ్ని ఏమాత్రం వేధించకూడదు” అన్నాడు.

“సరే అలాగే మేమితడ్ని వేధించం. అయితే ఇతను తన ఇంట్లోనే ఖుర్ఆన్ పఠిస్తూ దైవారాధన చేయాలి. ఈ మాట ఒప్పుకుంటే మేమితని జోలికి రాము” అన్నారు వారు.

ఇబ్నెదుగన్న అబూబకర్ (రజి)తో మాట్లాడి ఈ షరతు అంగీకరించామని ఖురైషీయులకు తెలియజేశాడు. ఆరోజు నుండి అబూబకర్ తన ఇంట్లోనే దైవారాధన చేయసాగారు.

హింసాదౌర్జన్యాలే ధ్యేయంగా పెట్టుకున్న ఖురైష్ నేతలు ఇప్పుడు ముహమ్మద్ (స) పేరు వింటేనే మండిపడుతున్నారు. మానవత్వం పూర్తిగా విస్మరించి క్రూరమృగాలుగా తయారయ్యారు. నీతినిజాయతీలకు మారుపేరైన ముహమ్మద్ (స)ను ఎవరెంత ఎక్కువ హింసిస్తాడో అతను సిగ్గులేకుండా నలుగురిలో అంతే గర్వంగా చెప్పుకుంటున్నాడు.

ఒక రోజు దైవప్రవక్త (స) ఇంటికి తిరిగొస్తుంటే దారిలో ఓ దుర్మార్గుడు ఆయన మీద మన్ను విసిరాడు. దైవప్రవక్త (స) అదే స్థితిలో ఇంటికి వచ్చారు. ఆయన గారాబాల కూతురు చిన్నారి ఫాతిమా (రజి) తండ్రి తల మీద మన్ను చూసి పరుగెత్తి నీళ్ళు తెచ్చి కడుగుతూ, కారణం అడిగారు. కారణం తెలుసుకున్న ఫాతిమా (రజి) కంట తడిపెట్టారు. ఖురైషీయుల అమానుషచర్యలు ఆమె గుండెను రంపంలా కోశాయి. పొర్లుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక తండ్రిని కావలించుకొని భోరున విలపించారు.

“ఫాతిమా! ఏడ్వకమ్మా, దేవుడు నీ తండ్రికి తప్పకుండా సహాయం చేస్తాడు” అన్నారు దైవప్రవక్త (సల్లం) కూతుర్ని సముదాయిస్తూ.



అబూతాలిబ్ చనిపోయాక కొన్నాళ్ళదాకా అబూజహల్ కిమ్మనకుండా ఉన్నాడు. తర్వాత అతను దైవప్రవక్త (స)ను మునుపటి కంటే ఎక్కువ వేధించడం ప్రారంభించాడు. అబూలహబ్ కూడా దైవప్రవక్త (స)ను బాధించడంలో హద్దుమీరి పోయాడు. అనుక్షణం ఆయన్ని వెన్నాడుతూ గూండాలను, అల్లరి మూకలను ఉసిగొల్పేవాడు.

ఒకసారి అబూబకర్ (రజి) వారి దుశ్చర్యల్ని విమర్శిస్తూ “కేవలం నాప్రభువు అల్లాహ్ అన్నంత మాత్రానికే ఎవరినైనా చంపుతారా? ముహమ్మద్ (స) తన దౌత్యానికి నిదర్శనాలు కూడా తెచ్చారే! అలాంటి సత్పురుషుడ్ని మీరిలా బాధించడం భావ్యమేనా?”

ఈ హితవచనాలు ఆ ముష్కరుల చెవికెక్క లేదు. అసలు వారిలో నీతి, న్యాయం, దయ, జాలి ఏనాడో నశించిపోయాయి. అంచేత వారు అబూబకర్ (రజి) మాటలు వినగానే మరింత రెచ్చిపోయి ఆయన మీద కూడా చేయిచేసుకున్నారు. అప్పుడు కొందరు సహృదయులు ముందుకొచ్చి ఆయన్ని ఆ ముష్కరుల బారినుండి విడిపించారు.

మరోసారి దైవప్రవక్త (సల్లం) కాబా గృహంలో ప్రవేశిస్తుంటే సత్యతిరస్కారులు ఆయన్ని చూసి చతురోక్తులు విసరడం ప్రారంభించారు.

“హాషిం సంతతి ప్రజలారా! అదిగో మీ ప్రవక్తగారు వేంచేస్తున్నారు చూడండి” అన్నాడు అబూజహల్ వెటకారంగా.

“అబుల్‌హకమ్! నువ్వు భలేవాడివయ్యా! ఎవరైనా ప్రవక్త అయి కూర్చుంటే, మరెవరైనా దైవదూత అయిపోతే మనకు అభ్యంతరం ఏమిటీ?” అన్నాడు ఉత్బా.

ఈ మాటలు విని బహుదైవారాధకులంతా విరగబడి నవ్వారు. ఉత్బా విజయ గర్వంతో జనాన్ని చూస్తూ కాలర్ పైకెత్తాడు. దైవప్రవక్త (సల్లం) అతని వైపు ఎగాదిగా చూశారు.

“ఉత్బా! నువ్వు ఏనాడూ దేవుడ్ని, ఆయన ప్రవక్తను సమర్థించిన పాపాన పోలేదు. పైగా సత్యతిరస్కారంలో హద్దుమీరిపోతున్నావు. కాని ఒక విషయం గుర్తుంచుకో. నువ్వు నవ్వే రోజులు అంతమయ్యే సమయం సమీపించింది” అన్నారు దైవప్రవక్త (స).

“అబూజహల్! నువ్వు కూడా బాగా విను. ఆ సమయం ఎంతో దూరం లేదు. అప్పుడు నువ్వు తక్కువగా నవ్వుతావు; ఎక్కువగా ఏడుస్తావు.”

“వలీద్! నువ్వు నీ బలపరాక్రమాలు చూసుకొని విర్రవీగుతున్నావు కదూ? కాని నువ్వు హమ్జా, ఉమర్‌లను మరచిపోతున్నావు. వీరిద్దరు మీతో యుద్ధం చేయడానికి అనుమతి అడుగుతున్నారు. నేను గనక అనుమతినిస్తే మక్కా వీధుల్లో రక్తపుటేరులు ప్రవహిస్తాయి. సంతోషించు నేనింకా వారికి అనుమతి ఇవ్వలేదు.”

“అరబ్బులారా! చెవులురిక్కించి వినండి. ఈనాడు మీరు ఏ ధర్మాన్ని తిరస్కరించి హేళనచేస్తున్నారో ఆ ధర్మంలోనే మీరంతా చేరిపోయే రోజు చాలా దగ్గర్లోనే ఉంది.”

దైవప్రవక్త (స) నోట వెలువడిన ఈ గంభీరవాక్కులు విని సత్యతిరస్కారులకు నోటమాటే పెగల్లేదు. అందరూ నోళ్ళు వెల్లబెట్టి బెల్లంకొట్టిన రాళ్ళలా ఉండిపోయారు.

## సౌదా, ఆయిషా (రజి)లతో వివాహం-(49)

దైవప్రవక్త (సల్లం)కు అవిశ్వాసుల వేధింపులతో పాటు, మరోవైపు ఒంటరిజీవితం కూడా ఆయన అంతరంగంలో అనిర్వచనీయమైన ఆవేదనకు తావిచ్చింది. అమితంగా అభిమానించే అనుచరులు నిత్యం ఆయన చుట్టూ పరిభ్రమిస్తున్నా, కన్నకొడుకు కన్నా మిన్నగా చూసుకున్న పెత్తండ్రి లేని వెలితి తీరుతుందా? కష్టసుఖాలలో చేదోడు వాదోడుగా ఉండి ఇస్లామీయ ఉద్యమంలో పాలుపంచుకుంటూ వచ్చిన అర్ధాంగి కూడా పోయి నప్పుడు మిత్రుల ఊరడింపు తన హృదయానికి ఏమేరకు చల్లదనం ఇస్తుంది?

అయితే దైవప్రవక్త (సల్లం)కు ఆ చల్లదనం కోసం ప్రయత్నించేవారు లేకపోలేదు. ఆయన పరిస్థితి చూసి హజ్రత్ ఖౌలా బిన్ హకీం (రజి) కరిగిపోయారు. ఆమె ఓరోజు దైవప్రవక్త (సల్లం) దగ్గరకు వచ్చి ఇలా అన్నారు:

“దైవప్రవక్తా! ఇలా ఎన్నాళ్ళు ఈ ఒంటరిజీవితం? మళ్ళీ పెళ్ళిచేసుకోరా? ఖదీజా లాంటి స్త్రీ దొరక్కపోవచ్చు. కాని దాంపత్య జీవితంలో కొంతైనా శాంతి లభిస్తుందికదా!”

“ఖౌలా! ఏ స్త్రీ గురించి అంటున్నావు?”

“ఏ స్త్రీ ఏముంది, కన్య కూడా దొరుకుతుంది; కావాలంటే వితంతువు కూడా దొరుకుతుంది.”

“కన్య ఎవరు?”

“ఇంకెవరు! అబూబకర్ (రజి) కూతురు ఆయిషా (రజి). మిమ్మల్ని భర్తగా పొందే హక్కు ఆమెకే ఎక్కువగా ఉంది.”

“మరి వితంతువు ఎవరు?”

“జమ్అ కూతురు సౌదా (రజి). ఆమె ఇస్లాం స్వీకరించింది. దైవాజ్ఞలన్నిటినీ పాటిస్తోంది. అబిసీనియా వలసపోయిన ముస్లింలలో ఆమెభర్త సక్రాన్ బిన్ అమ్ర్ కూడా ఉన్నాడు. కాని అబిసీనియా నుండి తిరిగొచ్చిన తర్వాత ఆయన జబ్బుపడి చనిపోయారు.”

“సరే ఆ ఇద్దరినీ చేసుకుంటాను, పోయి మాట్లాడిరా” అన్నారు దైవప్రవక్త (స).

సౌదా (రజి) లాంటి వయస్సు మళ్ళిన వితంతు మహిళ ఖదీజా (రజి) వదలిపోయిన నలుగురు పిల్లల ఆలనా పాలనా చూడగలుగుతుందని ఆశించి దైవప్రవక్త (స) ఆమెను వివాహమాడటానికి అంగీకరించారు.

హజ్రత్ ఖౌలా (రజి) మొదట సౌదా (రజి) ఇంటికి వెళ్ళారు.

“సౌదా! శుభం, శుభం!! అదృష్టమంటే నీదే. మోడువారిన నీ జీవితం కొంగ్రొత్త ఆశలతో చిగురించే శుభతరుణం వచ్చింది. సౌదా! సంతోషించు” అన్నారు ఆమె హజ్రత్ సౌదా (రజి)ను చిరునవ్వుతో అభినందిస్తూ.

“ఏమంటున్నావు? నాకేమీ అర్థం కాలేదు. కాస్త వివరంగా చెప్పు” ఆశ్చర్యంతో తికమక పడుతూ అడిగారు హజ్రత్ సౌదా (రజి).



“దైవప్రవక్త (స) నిన్ను వివాహమాడదలిచారు. ఆ సంగతి మాట్లాడటానికే వచ్చాను.”

ఈ శుభవార్త వినగానే సౌదా (రజి) ముఖపద్మం ఒక్కసారిగా వికసించింది.

“సుబ్హానల్లా! ఎంత తియ్యటి కబురు విన్పించావు! ఈ శుభవార్త మా నాన్నగారి చెవిలో కూడా పడేయి. ఆయన సలహా కూడ తీసుకోవాలిగా.”

హజ్రత్ ఖౌలా (రజి) సరేనంటూ అక్కడ్నుంచి బయలుదేరి సౌదా (రజి) నాన్నగారి దగ్గరకు వెళ్ళారు. ఆయనకు దైవప్రవక్త (స) ఉద్దేశ్యం, సౌదా (రజి) అంగీకారం తెలియ జేశారు. ఈ శుభవార్త విని ఆయన కూడా సంతోషించారు.

“అంతకంటే మహాభాగ్యం ఇంకేం కావాలమ్మా! ఇక ఆ దంపతుల్ని గురించి చెప్పే దేముంది, అదృష్టమే అదృష్టం” అన్నారు ఆయన.

ఆ తరువాత హజ్రత్ ఖౌలా (రజి) అబూబకర్ (రజి) గారింటికెళ్ళి, ఆయన భార్య ఉమ్మెరూమాన్ (రజి)ను కలుసుకున్నారు.

“మీ ఇంట శుభాల పంట! దైవప్రవక్త (సల్లం) మీ అమ్మాయి ఆయిషా (రజి)ను వివాహం చేసుకోవాలనుకుంటున్నారు.”

“నిజమా! ఎంత మంచివార్త! కొంచెం ఆగు ఖౌలా! అబూబకర్‌గారు వచ్చే వేళయింది” అన్నారు ఉమ్మెరూమాన్ (రజి) పట్టరాని సంతోషంతో.

అంతలో అబూబకర్ (రజి) వచ్చారు. ఖౌలా (రజి) ఈవార్త ఆయనకు విన్పించారు. అబూబకర్ (రజి) ఎంతో సంతోషించారు. వెంటనే ఆయన ఈసంబంధం ఒప్పుకున్నారు.

ఆతర్వాత కొన్నాళ్ళకే దైవప్రవక్త (స) వివాహం సౌదా(రజి), ఆయిషా(రజి)లతో జరిగి పోయింది. హజ్రత్ సౌదా (రజి) నూతన వధువుగా ప్రవక్త ఇంటికొచ్చారు. ఆయిషా (రజి) ఇంకా లేతవయస్సులో ఉండటంతో తల్లిదండ్రుల నీడలోనే కొన్నాళ్ళు ఉండవలసివచ్చింది.

ఈ రెండు వివాహాలు దైవప్రవక్త (సల్లం)కు ఆయన అనుచరుల్ని మరింత సన్నిహితం చేసి ఇస్లామీయ ఉద్యమ పురోగమనానికి దోహద పడ్డాయి.

అయితే ఇస్లామీయ ఉద్యమం విస్తరిస్తున్నకొద్దీ దైవప్రవక్త (సల్లం)పై, ఆయన అనుచరులపై అవిశ్వాసుల ఆగడాలు కూడా అధికం కాసాగాయి. ఇస్లాం ప్రచారం మానే వరకు ముహమ్మద్‌ను, సాంప్రదాయక మతంలోకి తిరిగొచ్చేవరకు ఆయన అనుచరుల్ని బాధిస్తూనే ఉంటామని వారు ఘోరంగా ప్రతిజ్ఞ కూడా చేశారు.

## తాయిఫ్ పర్యటన, జిన్నుల విశ్వాసం-(50)

ఖురైషీయుల దౌర్జన్యాలు నానాటికి అధికమవుతున్నాయి. అదీగాక వారు ఇస్లాం పరిధిలోకి వచ్చే సూచనలు కనుచూపు మేరలో కానరావడం లేదు. అందువల్ల దైవప్రవక్త (సల్లం) హజ్రత్ జైద్ బిన్ హారిస్ (రజి)ని వెంటబెట్టుకొని తాయిఫ్ పట్నానికి ప్రయాణ మయ్యారు, అక్కడి ప్రజలైనా ఇస్లాం స్వీకరిస్తారేమోనన్న ఆశతో.

దారిలో ఆయన బనీబకర్ తెగవాళ్ళకు దైవసందేశం అందజేసి ఇస్లాం స్వీకరించమని చెప్పారు. కాని వాళ్ళు అందుకు నిరాకరించడంతో ఖుహ్తాన్ తెగవాళ్ళ దగ్గరకు పోయి ధర్మబోధ చేశారు. వాళ్ళు కూడా ఖురైషీయులవంటి కఠినాత్ములేనని తెలిసిపోయింది. ఇక అక్కడ్నుంచి సరాసరి తాయిఫ్ చేరుకున్నారు.

తాయిఫ్ మక్కాకు అరవై మైళ్ళ దూరంలో ఉన్న అందమైన పట్టణం. ఆహ్లాదకరమైన వాతావరణం, నయనానందకరమైన పండ్ల తోటలతో నిత్యశోభాయమానంగా అలరారుతూ ఉంటుంది. ప్రఖ్యాత దేవతా విగ్రహం 'లాత్' తాయిఫ్‌లోనే ఉంది. అరేబియా ప్రజలకు కాబా తరువాత ఇదే గొప్ప దేవాలయం. ఇక్కడ సఖీఫ్ తెగవారు ఈ ఆలయానికి ధర్మకర్తలు. పట్టణ పెద్దలు కూడా ఆ తెగవాళ్ళే.

మహాప్రవక్త (సల్లం) పట్టణ పెద్దలను కలుసుకున్నారు. వారిలో అబ్దెయాలైల్, అతని సోదరులిద్దరు పట్టణ నాయకుల్లో ప్రముఖులు. మహాప్రవక్త (సల్లం) వాళ్ళను కూడా కలసి దైవసందేశం అందజేసి ఇస్లాం స్వీకరించమని అన్నారు. కాని ఈ ముగ్గురు మహా గర్విష్టులు. దైవప్రవక్త (సల్లం)తో చాలా దురుసుగా మాట్లాడారు.

"ఏమిటీ, దేవుడు నిన్ను ప్రవక్తగా నియమించాడా! అదే నిజమయితే నీవు ఇలా కాలి నడకన చెప్పులు నేలరాసుకుంటూ తిరిగేవాడివా?" అన్నాడు ఒకడు.

"నువ్వు తప్ప దేవుడికి ఇంకెవరూ దొరకలేదు కాబోలు ప్రవక్తగా నియమించడానికి!" అన్నాడు వేరొకడు వెటకారంగా.

"నాకసలు నీతో మాట్లాడటానికే ఇష్టం లేదు. ఎందుకంటే, నీవు చెప్పేది నిజమయితే నీతో ఇలా మాట్లాడటం సభ్యతకే విరుద్ధం. ఒకవేళ అది అబద్ధమయితే అబద్ధాలరాయుడితో మాట్లాడటమే బుద్ధి తక్కువ పని" అన్నాడు మూడోవాడు అహంకారంతో.

కొండంత ఆశతో వచ్చిన కారుణ్యమూర్తి (స)కి నిరాశే ఎదురయింది. అహంకారంతో కూడిన వీరి దుష్ప్రలాపాలు ఆయన హృదయాన్ని తీవ్రంగా గాయపరిచాయి.

ఔను, వారెందుకు విశ్వసిస్తారు! విశ్వసించి దైవప్రవక్త (స)కు ఆశ్రయమిస్తే మక్కా ఖురైషీయులంతా వీరికి విరోధులు కారూ? అప్పుడు తాయిఫ్‌లో వీరి ప్రతిష్ఠ మంట కలసిపోతుంది. ఈ పిరికితనమే వారిని ఇస్లాం స్వీకరించనీయకుండా నిరోధించింది.

దైవప్రవక్త (సల్లం) ఇక చేసేదిలేక వారితో "మీరు నా హితబోధను నిరాకరించారు. సరే, కనీసం నా విషయాన్ని రహస్యంగానైనా ఉంచండి" అని చెప్పి అక్కడ్నుంచి పట్నం లోని ఇతర ప్రజలకు దైవసందేశం విన్పించడానికి వెళ్ళారు.

అయితే అబ్దెయాలైల్, అతని సోదరులు తమ బానిసలను, తుంటరి పిల్లలను దైవప్రవక్త (సల్లం) పైకి ఉసిగొల్పారు. దైవప్రవక్త (సల్లం) ఎక్కడికి పోతే అక్కడికల్లా ఈ అల్లరిగుంపు వెంటపడి ఆయన్ని దుర్భాషలాడటం, రాళ్ళు రువ్వడం ప్రారంభించారు. హజ్రత్ జైద్ బిన్ హారిస్ (రజి) వీలైనంతవరకు దైవప్రవక్త (సల్లం)పై రాళ్ళు పడకుండా కాపాడేందుకు ప్రయత్నించారు. కాని ఆయన ఎంతవరకు కాపాడగలరు? ఆ కిరాతకులు విసిరిన రాళ్ళతో దైవప్రవక్త (స), జైద్ బిన్ హారిస్ (రజి) ఇద్దరూ గాయపడ్డారు.



దైవప్రవక్త (స) ఇక భరించలేక జైద్ (రజి)ను పిలుచుకొని అక్కడ్నుంచి వడివడిగా వెళ్ళిపోయారు. కాని ఆ దుర్మార్గులు అంతటితో ఆయన్ని వదలిపెట్టలేదు. నోటికొచ్చినట్లు దూషిస్తూ, రాళ్ళు రువ్వుతూ పట్నం నుంచి మూడు మైళ్ళదాకా వెంబండించారు.

దైవప్రవక్త (స) దేహం రక్తసిక్తమై పోయింది. బాధగా, నిస్సత్తువగా నడుస్తూ వెళ్ళి పట్నం వెలుపలున్న ఓ పండ్లతోట నీడలో కూర్చున్నారు ఆయన. తాయిఫ్ పట్టణవాసుల పట్ల ఆయన నిరాశచెందారు. దైవసందేశం అందజేసినందుకు వారిచ్చిన ఆతిథ్యం ఏమిటీ? అల్లరిమూకను ఉసిగొల్పి తనపై రాళ్ళు రువ్వించడమా? అప్రయత్నంగా ఆయన చూపులు నింగి వైపు మరలాయి. చేతులు పైకెత్తారు. పెదవుల్లో చలనం ఏర్పడింది.

"దేవా! శక్తివిహీనత, నిస్సహాయత, నిరాదరణలను గురించి నిన్ను మొరపెట్టు కుంటున్నాను. దయాసాగరా! నీవు బలహీనుల స్వామివి. నా స్వామి కూడా నీవే. ప్రభూ! నన్ను ఎవరికి అప్పగించావు? నన్ను చూసి హేళనచేసేవారికి వశం చేశావా? లేక నన్ను లోబరుచుకునే శత్రువుకు నన్ను అప్పగించావా?

ప్రభూ! నేను నీకు అయిష్టుడ్ని కాకపోతే నాకెలాంటి బాధ లేదు. కాని నీ ప్రసన్నతే నాకు సుఖమైనది. ఏ జ్యోతితో సమస్తచీకట్లు పటాపంచలయ్యాయో, దేనిపై ఉభయ లోకాలవ్యవస్థ నెలకొనిఉందో అలాంటి నీజ్యోతి శరణు కోరుతున్నాను. నీ ఆగ్రహాన్నుండి, నీవు నన్ను నిర్లక్ష్యంచేసే విషయాన్నుండి రక్షణకొరకు కూడా నీ శరణుకోరుతున్నాను.

దేవా! నీవు సంతోషించనంతవరకు నిన్ను కొలవడం తప్ప నాకు వేరేమార్గం లేదు. సర్వశక్తులు, యుక్తులు నీ అధీనంలోనే ఉన్నాయి."

దేవుని దయాసాగరం పొంగిపొరలింది. తాయిఫ్ పట్టణానికి ఇరు వైపులా రెండు కొండలు ఉన్నాయి. ఆ కొండల పర్యవేక్షకుడయిన దైవదూత వెంటనే దైవప్రవక్త (సల్లం) ముందు ప్రత్యక్షమయ్యాడు.

"ముహమ్మద్! దేవుడు మీప్రార్థన ఆలకించాడు. మీకోసం ఆయన నన్ను పంపాడు. మీరాజ్ఞాపిస్తే తాయిఫ్ పట్టణానికి ఇరువైపులున్న రెండు కొండల్ని కలిపేసి పట్టణాన్ని నుగ్గునుగ్గు చేస్తాను; పట్నంవాసులు తృటిలో సర్వనాశనమవుతారు" అన్నాడు ఆయన.

కాని విశ్వకారుణ్యమూర్తిగా ప్రభవించిన దైవప్రవక్త (స) దానికి అంగీకరిస్తారా?

"వద్దు వద్దు. ఆ పని చేయకండి. ఈనాడు వీళ్ళు ఇస్లాం స్వీకరించకపోతే, రేపు వీరి సంతానమయినా స్వీకరించవచ్చని నాకు ఆశఉంది. వారి భావిసంతతి ముస్లింలయి పోవచ్చు. అంచేత వీళ్ళను అంతమొందించడం నాకిష్టం లేదు" అన్నారు ఆయన.

ఈమాట విన్న తరువాత దైవదూత సెలవు తీసుకొని అంతర్ధానమయ్యాడు.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ప్రవేశించిన తోట ఉత్బా, షైబా అనే అన్న దమ్ములది. వీరిద్దరు దైవప్రవక్త (సల్లం)ను తాయిఫ్‌వాసులు రాళ్ళురువ్విన దృశ్యం చూశారు. శరీరమంతా రక్తసిక్తమయి నిస్సహాయంగా కూలబడిన దైవప్రవక్త (స)ను చూసి వారికి జాలి కలిగింది.

అందువల్ల వారు తమ బానిసను పిలిచి "అద్దాస్! తోటలో ద్రాక్షపండ్ల గుత్తి తెంచు. దాన్ని పళ్ళెంలో పెట్టి అదిగో అక్కడ కూర్చున్న మనిషికిచ్చి తినమని చెప్పు" అన్నారు.

యజమానుల ఆదేశం ప్రకారం అద్దాస్ ద్రాక్షపండ్లు కోసి పళ్ళెంలో పెట్టుకొని దైవప్రవక్త (సల్లం) దగ్గరకెళ్ళి "ఇవి తినండి" అన్నాడు.

దైవప్రవక్త (సల్లం) 'బిస్మిల్లా' అని పలికి ద్రాక్షపండ్లు తినడం ప్రారంభించారు.

"అయ్యా! మీరేమిటో కొత్తమాట అన్నారు. ఇక్కడ నేనింతవరకు ఎవరినోటా ఇలాంటి మాట వినలేదే!" అన్నాడు అద్దాస్ ఆశ్చర్యపోతూ.

"మీదే ఊరు? మీ మతం ఏమిటీ? మీ పేరేమిటి?" అడిగారు దైవప్రవక్త (సల్లం).

"నేను నైనవా వాస్తవ్యుడ్ని. నాది క్రైస్తవమతం. నా పేరు అద్దాస్."

"నీది యూనుస్ బిన్ మత్తా ఊరా? యూనుస్ చాలా పుణ్యాత్ముడు."

ఈ విషయం విని అద్దాస్ మరింత ఆశ్చర్యపోయాడు.

"అరె! యూనుస్ బిన్ మత్తా మీకెలా తెలుసా?" అడిగాడు కుతూహలంతో.

"యూనుస్ నా సోదరుడే. ఆయన కూడా దైవప్రవక్తే, నేను కూడా దైవప్రవక్తనే."

అద్దాస్ సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అయిపోయాడు. సంతోషాతిశయంతో గబాలున ముందుకు వంగి కారుణ్యమూర్తి (సల్లం) కాళ్ళు చేతుల్ని, నుదుటిని చుంబించాడు.

ఉత్బా, షైబా ఇదంతా దూరం నుంచి చూస్తూనే ఉన్నారు. వాళ్ళు కూడా ఈ చోద్యం ఏమిటో అర్థంగాక ఆశ్చర్యపోయారు. అద్దాస్ తిరిగి వచ్చాడు.

"ఒరేయ్ అద్దాస్! ఆ మనిషి కాళ్ళు చేతులు అలా చుంబించావేమిట్రా?" అడిగాడు వాళ్ళలో ఒకడు.

"అయ్యా! ఆయనకంటే మహామనీషి ఈ భూమండలంలో ఎక్కడా ఉండడు. ఆయన ఓ కొత్త విషయం తెలిపాడు. అలాంటి విషయాలు దైవప్రవక్తలు తప్ప మరెవరూ తెలియ జేయలేరు" అన్నాడు అద్దాస్.

తోట యజమానులకు ఆ మహామనీషి ఎవరో అర్థమయింది. అయితే అయనంటే వారికి పరమ ద్వేషం. అందుకే వారు సత్యధర్మం పట్ల ఆకర్షించబడుతున్న అద్దాస్‌ను దాన్నుండి నిరోధించడానికి ప్రయత్నించారు.

"అద్దాస్! అతని మాటల గారడిలో పడి నీ మతాన్ని వదలుకునేవు. అతని మతం కంటే నీ మతమే గొప్పమతం" అన్నారు తోటయజమానులు.

దైవప్రవక్త (సల్లం) అక్కడ్నుంచి జైద్ బిన్ హారిస్ (రజి)ని తీసుకొని మక్కా పట్నం తిరుగు ప్రయాణమయ్యారు. కాలినడక ప్రయాణమైనందున చాలా అలసిపోయారు. విశ్రాంతి కోసం ఆ రాత్రి 'నఖ్లా' అనే ప్రదేశంలో ఆగారు.

అది అర్థరాత్రివేళ. ప్రశాంత వాతావరణం. నిశ్శబ్ద పరిసరాలు. దైవప్రవక్త (స) నమాజ్ చేయడం ప్రారంభించారు. మధురమైన కంఠంతో ఖుర్ఆన్ పఠించసాగారు. అప్పుడు



జిన్నుల (భూతాల) సమూహం ఒకటి అటుగా పోవడం జరిగింది. ఖుర్ఆన్ పఠనం వారి చెవిన పడింది. ఆ మధురవాణి వారి చెవులకింపుగా, వింతగా తోచింది.

దాంతో వారు ఠక్కున ఆగి ఆ దివ్యవాణిని శ్రద్ధగా ఆలకించసాగారు. క్రమంగా అది వారి మనోఫలకాలపై ముద్రించుకుపోయింది. జిన్నులు ఖుర్ఆన్ పఠనం పూర్తిగా విన్న తరువాత అక్కడ్నుంచి వెళ్ళిపోయి తమ జాతివారితో ఇలా అన్నారు:

"మేమొక అద్భుతమైన ఖుర్ఆన్ (వాణి) విన్నాం. అది సన్మార్గం వైపు మార్గదర్శనం చేస్తుంది. అందువల్ల మేము దాన్ని విశ్వసించాం. ఇకనుంచి మేము మా ప్రభువుకు ఎవరినీ సాటి కల్పించము. మా ప్రభువు మహోన్నతుడు, మహిమాన్వితుడు. ఆయన ఎవరినీ తనకు భార్యగాగాని, కుమారునిగాగాని చేసుకో లేదు. మన మూర్ఖజనం దేవుని విషయంలో సత్య వ్యతిరేకమయిన మాటలు చెబుతున్నారు. దేవుడ్ని గురించి మానవులు, జిన్నులు ఎన్నడూ అబద్ధాలాడరని మేము భావించాము. కొందరు మానవులు జిన్నులలో కొందరి రక్షణ కోరుతున్నారు. ఈవిధంగా వారు జిన్నుల గర్వాన్ని మరింత అధికం చేశారు. మీరు భావించినట్లే మానవులు కూడా దేవుడు ఎవరినీ ప్రవక్తగా నియమించి పంపడని అనుకున్నారు.

"మేము ఆకాశం వెతికిచూస్తే అది కాపలాదారులతో, ఉల్కలతో నిండిఉన్నట్లు కన్పించింది. ఇదివరకైతే (ఏదైనా) వినడానికి మనకు ఆకాశంలో కూర్చునే చోటు లభించేది. కాని ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. దొంగచాటుగా ఎవరైనా వినడానికి ప్రయత్నిస్తే అతనికి ఒక అగ్నిజ్వాల తన కోసం మాటువేసి ఉండటం కన్పిస్తున్నది. భూవాసులకు ఏదయినా కీడు తలపెట్టే నిర్ణయం జరిగిందో, లేక వారి ప్రభువు వారికి సన్మార్గం చూపగోరుతున్నాడో మాకు అర్థం కావడం లేదు." (ఖుర్ఆన్. 72:1-10)

దైవప్రవక్త (స) ఖుర్ఆన్ పఠిస్తుంటే జిన్నులు వచ్చి ఎంతో ఆసక్తితో వినడం, దాన్ని విశ్వసించి వెళ్ళి తమ జాతివారిలో ప్రచారం చేయడం జరిగిపోయింది. ఇదంతా దేవుడు దివ్యావిష్కృతి ద్వారా తెలిపేవరకు ఆయనకు తెలియదు. "మేము జిన్నుల సమూహం నొకదాన్ని ఖుర్ఆన్ వినేందుకు నీ దగ్గరకు పంపాము. వారు (నీవు ఖుర్ఆన్ పఠిస్తున్న) స్థలానికి చేరుకొని నిశ్శబ్దంగా ఉండండని అన్నారు పరస్పరం. ఖుర్ఆన్ పఠనం ముగిసిన తర్వాత వారు హెచ్చరించేవారుగా తమ జాతివారి దగ్గరకు వెళ్ళారు." (46:29)

## ముత్యిమ్ రక్షణలో ప్రవక్త పునరాగమనం-(51)

మక్కా వారికి తాయిఫ్ వృత్తాంతం తెలిసిపోయింది. ముహమ్మద్ (స) ప్రయత్నాలు విఫలమయ్యాయని, సఖీఫ్ అల్లరిమూక ఆయన్ని బాగా బాధలు పెట్టిందని విని వారు తెగ సంబరపడిపోయారు. ముహమ్మద్ (స) తిరిగొస్తే ఈసారి ఆయన్ని శాశ్వతంగా కడతేర్చి గాని కునుకుతీయమని ప్రతిన బూనారు. ఇప్పుడాయన ధైర్యం సన్నగిల్లి ఉంటుందని, అంచేత ఈసారి ఆయన్ని లొంగదీసుకొని మట్టుపెట్టడం తేలికని భావిస్తున్నారు వారు.

ఖురైషీయుల ఈ దురాలోచనలు, కుతంత్రాలు దైవప్రవక్త (స)కు ఏం తెలుసు? ఆయన మక్కాకే తిరిగొస్తున్నారు. హిరాగుహకు చేరుకునేటప్పటికి, మక్కా నుంచి వస్తున్న బాటసారులు కొందరు కలిశారు. వారిద్వారా ఖురైషీయుల దుష్టపథకాలు తెలిశాయి.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) వారిలో ఒకతనితో "ఖురైషీయుల దగ్గరకు పోయి వారికి నా సందేశం ఒకటి విన్పిస్తావా?" అని అడిగారు.

దానికా బాటసారి సంతోషంతో "తప్పకుండా విన్పిస్తాను, చెప్పండి" అన్నాడు.

"అయితే అఖ్నస్ బిన్ ఖురైష్ దగ్గరికి వెళ్ళిరా. దైవసందేశం ప్రచారం చేసుకోవడానికి ఆయన నాకు ఆశ్రయం ఇవ్వగలడేమో అడుగు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

అతను అఖ్నస్ దగ్గరికెళ్ళి దైవప్రవక్త (సల్లం) కోరిక తెలియజేశాడు.

దానికి అఖ్నస్ "నేను ఖురైషీయుల పక్షానికి చెందినవాడ్ని. వాళ్ళతో నేను సంధి చేసుకొని ఉన్నాను. అలాంటివారికి వ్యతిరేకంగా నేను ముహమ్మద్‌కు ఎలా ఆశ్రయం ఇవ్వ గలుగుతాను?" అని అన్నాడు.

ఆ మనిషి తిరిగొచ్చి అఖ్నస్ చెప్పిన మాటలు దైవప్రవక్త (స)కు విన్పించాడు.

"సరే, మరొకసారి పోయి రాగలవా?" అని అడిగారు దైవప్రవక్త (సల్లం). దానికి అతను పొయ్యొస్తాను అన్నాడు.

"ఈసారి సుహైల్ బిన్ అమ్ర్ దగ్గరకు పోయి, అతను నాకు స్వేచ్ఛగా దైవసందేశం ప్రచారం చేయడానికి రక్షణ కల్పించగలడేమో అడుగు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

అతను సుహైల్ దగ్గరికి పోతే మళ్ళీ నిరాశే ఎదురయింది.

"మేము అమ్ర్ బిన్ లువయ్యా తెగకు చెందినవాళ్ళం. అంచేత మేము తఆబ్ సంతతికి వ్యతిరేకంగా ముహమ్మద్‌కు రక్షణ కల్పించలేము" అన్నాడు సుహైల్ తర అసహాయత వ్యక్తపరుస్తూ.

ఆ వ్యక్తి దైవప్రవక్త (స) దగ్గరకు తిరిగొచ్చి సుహైల్ అన్న మాటలు విన్పించాడు.

"సరే పోనీ. ఏమీ అనుకోకపోతే బాధపడకుండా మరొక్కసారి వెళ్ళివస్తావా?" అన్నారు దైవప్రవక్త (స).

"అలాగే వెళ్లొస్తాలెండి" అన్నాడు బాటసారి విసుక్కోకుండా.

"అయితే ఈసారి ముత్యిమ్ బిన్ అద్దీ దగ్గరికి వెళ్ళిరా. ముత్యిమ్‌కు కూడా ఈ విషయమే చెప్పి అతని అభిప్రాయం కనుక్కొనిరా" అన్నారు దైవప్రవక్త (సల్లం).

అతను ముత్యిమ్ దగ్గరకి వెళ్ళి, విషయం చెప్పి "మీరు ముహమ్మద్ (స)కు ఆశ్రయం ఇవ్వగలరా?" అని అడిగాడు.

"తప్పకుండా ఇస్తాను" అన్నాడు ముత్యిమ్ ఏమాత్రం తటపటాయించకుండా.

అనడమేమిటీ, మరునాడు తెల్లవారగానే తన కొడుకుల్ని, కొందరు బంధువుల్ని వెంటబెట్టుకొని దైవప్రవక్త (స)ను పిలుచుకు రావడానికి బయలుదేరాడు. ఖురైషీయులతో ఏదైనా ఘర్షణ జరిగితే ఎదుర్కోవడానికి అందరూ సైనికదుస్తులు ధరించి, నడుములకు ఖడ్గాలు వ్రేలాడదీశారు. చేతుల్లో చురకత్తులు కూడా తీసుకున్నారు.



హిరాప్రాంతంలో ఎదురుచూస్తున్న దైవప్రవక్త (స) వీళ్ళను చూసి చాలా సంతోషించారు. ముత్యిమ్ దైవప్రవక్త (స)ను తీసుకొని మక్కా దారితీశాడు. పట్నం వెలుపల కొందరు ఖురైషీయులు కన్పించారు. వారిలో అబూజహల్ కూడా ఉన్నాడు.

"ముత్యిమ్! ముహమ్మద్‌కు ఆశ్రయమిచ్చావా లేక ఆయన్ని విశ్వసించావా?" అని అడిగాడు అతను ముందుకెళ్ళి. "ఆశ్రయమిచ్చాను" అన్నాడు ముత్యిమ్ ముక్తసరిగా.

ఈ సమాధానం విని అబూజహల్ మరేమీ మాట్లాడలేదు. ఆ తరువాత ముత్యిమ్ వెంట దైవప్రవక్త (సల్లం) ప్రశాంతంగా పట్టణంలోకి ప్రవేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగలేదు. ఆయన సరాసరి కాబాగృహానికి వెళ్ళారు. ఆ సమయంలో కాబాలో కొందరు ఖురైషీయులు కూర్చొని ఉన్నారు. వారిలో హాషిం సంతతివాళ్ళు కూడా ఉన్నారు. అంతలో అబూజహల్ కూడా అక్కడికి చేరుకున్నాడు.

"మునాఫ్ సంతతి సోదరులారా! ఇదిగో చూడండి, మీ ప్రవక్త గారు వేంచేస్తున్నారు!" అన్నాడు అబూజహల్ వెటకారంగా.

హాషింసంతతికి చెందిన ఉత్బా వెంటనే "మనలోఎవరైనా ప్రవక్తయితే లేదా ఎవరికైనా రాచరికం లభిస్తే అందులో అసూయపడాల్సిన విషయం ఏముంది?"అని అన్నాడు.

ఇదంతా గమనిస్తున్న దైవప్రవక్త (సల్లం) దగ్గరకొచ్చి "ఉత్బా! వింతగా ఉన్నాయి నీ మాటలు. దేవుడు, దైవప్రవక్త అంటే చీమ కుట్టినట్లయినా లేదుగాని, హాషిం సంతతి అంటే మాత్రం నీకు ఎక్కడలేని రోషం వచ్చిందన్న మాట!" అని అన్నారు.

తర్వాత ఆయన అబూజహల్ తదితర ఖురైష్‌నాయకుల వైపు చూస్తూ ఇలాఅన్నారు:

"అబూజహల్! గుర్తుంచుకో ఆ సమయం ఎంతో దూరం లేదు. అప్పుడు నీ నవ్వంతా పటాపంచలైపోతుంది. నువ్వు రక్తకన్నీటితో తీవ్రంగా పశ్చాత్తాప పడతావు. అయినా నీకు నిష్కృతి ఉండదు. ఖురైషీయులారా! మీరు కూడా చెవియొగ్గి వినండి. మీ కోసం ఘోరమైన ఒక దుర్దినం త్వరలోనే రానున్నది. అప్పుడు మీరు ఎలాంటి భయంకర పరిణామాలకు గురికావలసి వస్తుందో ఆలోచించుకోండి."

ఖురైషీయులు దైవప్రవక్త (సల్లం) పలికిన ఈ మాటలు విని కుతకుతలాడి పోయారు. కాని ఏం చేయగలరు? ముత్యిమ్ ఆయనకు ఆశ్రయమిచ్చాడు కదా! అంచేత కోపాన్ని బలవంతంగా దిగమింగి గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయారు.

ఆరోజు దైవప్రవక్త (సల్లం) ఖురైషీయుల నుండి దృష్టి మళ్ళించి ఇతర తెగలలో ధర్మప్రచారం ప్రారంభించారు. మక్కా చుట్టుపక్కల ప్రాంతాలలో నివసిస్తున్న ఆ యా తెగల దగ్గరకు పోయివారికి దైవసందేశం అందజేయసాగారు.

## అంతరిక్షంలో అద్భుత విహారం-(52)

ఓరోజు..... అర్ధరాత్రి సమయం. మక్కా పట్నం గాఢ నిద్రలో జోగుతోంది. ఉమ్మెహాని ఇంట్లో నిద్రపోతున్న దైవప్రవక్త (స) ఏదో అలికిడికి ఉలిక్కిపడి లేచారు. చూస్తే దైవదూత జిబ్రీల్ (అలైహి) ఇంటికప్పు చీల్చుకొని లోపలికి దిగి వస్తున్నారు. ఆ దృశ్యం చూసి దైవ

ప్రవక్త (స) క్షణంపాటు నివ్వెరపోయారు. ఆయన ఆశ్చర్యం నుంచి తేరుకున్నారో లేదో జిబ్రీల్ (అలైహి) వచ్చి చేయి పట్టుకొని కాబాలయానికి తీసికెళ్ళారు.

అక్కడ ఆయన దైవప్రవక్త (సల్లం) రొమ్మును చీల్చి హృదయాన్ని బయటికి తీశారు. దాన్ని జమ్‌జమ్‌జలంతో శుభ్రంగా కడిగారు. తర్వాత దాన్ని విశ్వాసం, ఔదార్యం, వివేచనలతో నింపి యధాస్థానంలో పెట్టేశారు. ఆ తర్వాత చూస్తే అక్కడ దివి నుండి దిగిన 'బురాఖ్' అనే విచిత్ర శ్వేతజంతువు ఒకటి ధగధగ మెరిసిపోతూ నిలబడి ఉంది.

హజ్రత్ జిబ్రీల్ (అలైహి) బురాఖ్ వైపు చూపిస్తూ "ముహమ్మద్! చూశారా ఈ విచిత్ర వాహనాన్ని? దీన్ని మీ కోసమే విశ్వప్రభువు పంపాడు, ఎక్కండి" అని చెప్పారు.

దైవప్రవక్త (స) సంతోషంతో బురాఖ్ ఎక్కారు. జిబ్రీల్ (అలైహి) దాన్ని అదిలించారు. అది ఒక్కసారిగా పైకిలేచి ఆకాశ మార్గాన మెరుపులా దూసుకుపోయింది. అలా పోతుంటే ఖర్జూరచెట్లతో నిండిన ఓ పట్నం వచ్చింది. జిబ్రీల్ (అలైహి) దాని వైపు చూపిస్తూ "ఇది మదీనా. మీరు మక్కానుండి ఇక్కడికే వలసవస్తారు" అన్నారు. తర్వాత ఇద్దరూ అక్కడ దిగి నమాజ్ చేశారు. నమాజ్ కాగానే ఇద్దరూ బురాఖ్ ఎక్కి మళ్ళీ బయలుదేరారు.

అలా ప్రయాణం చేస్తుంటే ఒక చోట ఎవరో ఓ అపరిచిత వ్యక్తి దైవప్రవక్త (సల్లం)ను పేరుపెట్టి పిలుస్తూ, 'ఇటు రా' అన్నాడు. కాని దైవప్రవక్త (స) అటు వైపు దృష్టి సారించ లేదు. అప్పుడు హజ్రత్ జిబ్రీల్ (అలైహి) మాట్లాడుతూ "ఇతను యూద మతబోధకుడు. మిమ్మల్ని యూదమతం వైపు పిలుస్తున్నాడు" అని తెలిపారు. మరి కాస్త ముందుకు సాగిన తరువాత మరో మనిషి తారసపడి దైవప్రవక్త (సల్లం)ను పిలిచాడు. దైవప్రవక్త (సల్లం) అతని వైపు కూడ తిరిగి చూడలేదు. హజ్రత్ జిబ్రీల్ (అలైహి) "ఇతను క్రైస్తవ బోధకుడు, మిమ్మల్ని క్రైస్తవమతం వైపు ఆహ్వానిస్తున్నాడ"ని తెలిపారు.

మరికొంచెం దూరం పోయాక బాగా అలంకరించుకున్న ఒక అందమైన స్త్రీ తారసపడి దైవప్రవక్త (స)ను పిలిచింది. కాని ఆయన ఆ స్త్రీ వైపు కన్నెత్తి కూడా చూడలేదు. అప్పుడు జిబ్రీల్ (అలై) "ఈ స్త్రీ ఇహలోక ప్రతిరూపం" అని తెలిపారు. మరికాస్త దూరం పోగానే ఒక పండు ముసలమ్మ కన్పించింది. జిబ్రీల్ దూత (అలైహి) ఆమె వైపు చూపిస్తూ "ప్రపంచం వయస్సు ఈ ముదుసలి వయస్సుతో పోల్చుకోండి" అని చెప్పారు.

ఇంకొంచెం దూరం పోయిన తరువాత మరొక మనిషి కన్పించి దైవప్రవక్త (సల్లం)ను తనవైపు రమ్మని పిలిచాడు. కాని దైవప్రవక్త (సల్లం) అతని వైపు చూడకుండా ముఖం తిప్పుకొని ముందుకు సాగారు. హజ్రత్ జిబ్రీల్ (అలైహి) అతడ్ని గురించి చెబుతూ "ఇతను షైతాన్. మిమ్మల్ని సన్మార్గం నుండి తప్పించగోరుతున్నాడు" అని చెప్పారు.

కాస్సేపటికి బురాఖ్ సీనాయి కొండల మీదుగా పోతుంటే జిబ్రీల్ (అలైహి) అటువైపు చూపిస్తూ "దేవుడు ఇక్కడే తూర్ కొండ మీద మూసా ప్రవక్త (అలైహి)తో ప్రత్యక్ష సంభాషణ జరిపాడు" అని తెలియజేశారు. మరికొంత దూరం పోయాక బైతిల్లహమ్ (బెత్లహేమ్) వచ్చింది. హజ్రత్ జిబ్రీల్ (అలైహి) దాని వైపు చూపిస్తూ "ఈసా ప్రవక్త (అలైహి) ఈ ప్రదేశంలోనే జన్మించారు" అని చెప్పారు.



ఆ తరువాత బురాఖ్ (జెరూసలేంలోని) బైతుల్‌మఖ్దిస్ మసీదుకు చేరుకుంది. దైవదూత జిబ్రీల్ (అలైహి)తో పాటు దైవప్రవక్త (సల్లం) అక్కడ అఖ్సా మసీదు ముందు దిగారు. అప్పటికే అక్కడకొచ్చి నిరీక్షిస్తున్న లక్షా ఇరవై నాలుగువేల మంది దైవప్రవక్తలు ఆయనకు స్వాగతం పలికారు. హజ్రత్ జిబ్రీల్ (అలైహి) వాళ్ళను ఆయనకు పరిచయం చేశారు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) సంతోషంతో సోదర ప్రవక్తలను ఆలింగనం చేసుకున్నారు.

హజ్రత్ జిబ్రీల్ (అలై) వేదిక ఎక్కి అజాన్ ఇచ్చారు. అజాన్ ఆకాశంలో ప్రతిధ్వనించింది. గగనద్వారాలు తెరుచుకున్నాయి. అక్కడ్నుంచి భూమండలంలోని అఖ్సామసీదుకు కోట్లాది మంది దైవదూతలు దిగిరాసాగారు. చూస్తుండగానే సువిశాలమైన మసీదు దైవ ప్రవక్తలతో, దైవదూతలతో క్రిక్కిరిసిపోయింది. అది చాలక ఆ మసీదు నుంచి నింగివరకు హరివిల్లులా మెరసిపోతూ అసంఖ్యాక దైవదూతలు బారులుతీరి నిలబడ్డారు.

హజ్రత్ జిబ్రీల్ (అలైహి) నమాజ్ ప్రారంభం కోసం ఇఖామత్ చెప్పారు. అందరూ పంక్తులు సరిచేసుకున్నారు. ఇమాం స్థానం ఖాళీగా ఉంది. గొప్పగొప్ప ప్రవక్తలు పాల్గొన్న ఆ ప్రార్థనాబృందానికి నాయకత్వం వహించడానికి ఎవరికీ ధైర్యం లేకపోయింది. అంతలో హజ్రత్ జిబ్రీల్ (అలైహి) పంక్తులు చీల్చుకుంటూ, ఎక్కడో మధ్య వరుసలో నిలబడి ఉన్న అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) దగ్గరకు పోయారు.

"ముహమ్మద్! ఇంకా మీరు ఎవరి కోసం ఎదురుచూస్తున్నారు? ఈ శుభతరుణంలో దైవప్రవక్తలు, దైవదూతలతో కూడిన ఈ ప్రార్థనా బృందానికి నేతృత్వం వహించేందుకు మీకంటే గొప్ప నాయకుడెవరున్నారు? పదండి, నమాజ్ చేయిద్దురుగాని" అన్నారు ఆయన దైవప్రవక్త (సల్లం) చేయి పట్టుకొని.

ఎంత అదృష్టం! మహామహా మహులున్న ఈ ప్రార్థనా బృందానికి నాయకత్వం వహించే భాగ్యం అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం)కు లభించడం నిజానికి యావత్తు దైవప్రవక్తలు, దైవదూతలపై ఆయన ఔన్నత్యం చాటుతోంది.

మహాప్రవక్త ముహమ్మద్ (స) ఇమామత్ స్థానంలో నిలబడి నమాజ్ చేయించారు. ఆ తరువాత ఆయన ఇలా ప్రసంగించారు:

"నన్ను విశ్వకారుణ్యమూర్తిగా ప్రభవింపజేసి సమస్త మానవాళికి మార్గదర్శిగా పంపిన సర్వేశ్వరునికే సకలస్తోత్రాలు. ఆయన నాపై ధర్మాధర్మాలను విచక్షణచేసి రుజుమార్గం చూపే ఖుర్‌ఆన్ అవతరింపజేశాడు. నన్ను అంతిమ దైవప్రవక్తగా చేసి, నా అనుచర సముదాయానికి ఇతర ప్రవక్తల అనుచర సముదాయాలపై ఆధిక్యత ప్రసాదించాడు."

ఉపన్యాసం ముగిసిన తర్వాత అంతిమ దైవప్రవక్త (సల్లం) ముందు మూడు గిన్నెలు ఉంచబడ్డాయి. ఒక గిన్నెలో నీరు, మరొక గిన్నెలో పాలు, వేరొక గిన్నెలో సారా ఉన్నాయి. దైవప్రవక్త (సల్లం) ఆ మూడింటిలో పాలగిన్నె మాత్రమే తీసుకొని పాలుతాగారు. అది చూసి జిబ్రీల్ (అలైహి) ఆయన్ని అభినందిస్తూ "శుభం! మీరు ప్రకృతిమార్గాన్ని ఎన్నుకున్నారు" అని అన్నారు.

# పరమపద సోపానం-(53)

ఆ తరువాత ఆయన దైవప్రవక్త (స) దగ్గరికి ఒక దివ్యసోపానం (మేరాజ్) తెచ్చి పెట్టారు. అది నేల నుండి నింగి దాగా ఉన్న పరమపద సోపానం. హజ్రత్ జిబ్రీల్ (అలై) "దాని వైపు చూపిస్తూ "దీన్ని అధిరోహించండి" అన్నారు. దైవప్రవక్త (స) దాన్ని ఎక్కి పైకి పోసాగారు. ఆయనతో పాటు జిబ్రీల్ (అలై) కూడా ఎక్కి బయలుదేరారు. ఆ విధంగా వారిద్దరు ఆ సోపానం ఎక్కి మొదటి ఆకాశపు ప్రధానద్వారం దగ్గరకు చేరుకున్నారు.

అప్పుడు హజ్రత్ జిబ్రీల్ (అలైహి) తలుపు తట్టారు.

"ఎవరు నీవు?" లోపల నుంచి ద్వారపాలకుడు ప్రశ్నించాడు.

"నేను జిబ్రీల్‌ని, నాతోపాటు అంతిమ దైవసందేశహరుడు ముహమ్మద్ (సల్లం) కూడా ఉన్నారు" అన్నారు జిబ్రీల్ (అలైహి).

ద్వారపాలకుడు తలుపు తెరిచాడు. జిబ్రీల్ (అలైహి), ముహమ్మద్ (సల్లం) లోపలికి ప్రవేశించారు. వారలా లోపల అడుగుపెట్టారో లేదో వారి కోసమే అన్నట్లు అసంఖ్యాకమైన దైవదూతలు బారులుతీరి నిలబడి ఉన్నారు. వారు పట్టరాని సంతోషంతో జయజయ నినాదాలు చేస్తూ దైవప్రవక్త (సల్లం)కు స్వాగతం పలికారు.

జిబ్రీల్ (అలై) దైవప్రవక్త (స)ను తీసుకొని అక్కడ్నుంచి ముందుకుసాగారు. కొంత దూరంపోయాక ఓ విచిత్రదృశ్యం కన్పించింది. ఒక మనిషి కూర్చొని తన కుడివైపు చూసు కొని సంతోషంతో పొంగిపోతూ గలగల నవ్వుతున్నాడు. అంతలోనే ఎడమవైపు చూసుకొని అమిత దుఃఖంతో రోదిస్తున్నాడు. అతడ్ని చూసి దైవప్రవక్త (స) ఆశ్చర్యపోయారు.

"ఎవరీ వ్యక్తీ? ఈ విచిత్ర పరిస్థితికి కారణం ఏమిటీ?" అడిగారు ఆయన.

"ఈయన మీ పితామహుడు. (ప్రప్రథమ దైవప్రవక్త) ఆదం (అలైహి). తన సంతాన మైన మానవులకు ఎదురయ్యే అసాధారణ పరిణామాల గురించిన తలంపే ఈయనగారి ఈ పరిస్థితికి కారణం. కుడివైపు పుణ్యాత్ముల సత్కర్మలు ఉండటం చూసి ఈయన సంతోషిస్తున్నారు. ఎడమవైపు పాపాత్ముల దుష్కర్మలు చూసి దుఃఖిస్తున్నారు" వివరించారు హజ్రత్ జిబ్రీల్ (అలైహి).

హజ్రత్ ఆదం (అలై) అంతిమ దైవప్రవక్త (స)ను చూసి "ప్రియకుమారా! స్వాగతం! సుస్వాగతం!!" అన్నారు అమిత వాత్సల్యంతో. తర్వాత ఆయన్ని కౌగలించుకున్నారు.

హజ్రత్ జిబ్రీల్ (అలైహి) దైవప్రవక్త (సల్లం)ను తీసుకొని ముందుకు సాగారు. ఒకచోట కొందరు పొలంలో పైరు కోస్తున్నారు. అయితే కోసిన వెంటనే ఆ పైరు మళ్ళీ పెరుగుతోంది. దైవప్రవక్త (సల్లం) అది చూసి "ఎవరీ మనుషులు?" అని అడిగారు. దానికి జిబ్రీల్ (అలైహి) "వీరు దైవమార్గంలో పోరాడేవారు" అని చెప్పారు.

మరోచోట కొందరు మనుషుల తలలు పగలగొట్టడం జరుగుతోంది. జిబ్రీల్ (అలై) వాళ్ళను గురించి తెలుపుతూ "వీరు నమాజు చేయడానికి బద్ధకించేవారు" అన్నారు.



మరోచోట కొందరు చింపిరిబట్టలు తొడుక్కొని పశువుల్లా గడ్డి మేస్తున్నారు. వారు జకాత్, ఇతర దానధర్మాలు చేయనివారని చెప్పారు హజ్రత్ జిబ్రీల్ (అలైహి).

వేరొకచోట ఒకతను కట్టెలు పోగుచేసి ఎత్తుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. కాని పైకెత్తుకోలేక పోతాడు. అప్పుడతను మోపులో కట్టెలు తగ్గించడానికి బదులు, మరికొన్ని కట్టెలు చేర్చి ఎత్తుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. హజ్రత్ జిబ్రీల్ (అలైహి) ఆ మనిషిని గురించి తెలుపుతూ "ఇతను మోయలేనన్ని బరువుబాధ్యతలు ఉన్నప్పటికీ, వాటిని తగ్గించుకోవడానికి బదులు మరిన్ని బాధ్యతలు మీదేసుకుంటాడు" అని చెప్పారు.

ఇంకొకచోట దైవదూతలు కొందరు మనుషుల నాలుకలు, పెదవులను కత్తెరలతో కత్తిరిస్తున్నారు. జిబ్రీల్ (అలై) వాళ్ళను గురించి చెబుతూ "వీళ్ళు విశృంఖలంగా ప్రసంగిస్తూ అల్లర్లు, అలజడులు సృష్టించే బాధ్యతారహితులైన ఉపన్యాసకులు" అన్నారు.

ఒకచోట ఓ చట్టుబండలో పగులు ఏర్పడి, అందులో నుంచి బాగాబలిసిన ఒక అంబోతుఎద్దు బయటికి వచ్చింది. తర్వాత అది మళ్ళీ ఆ నెర్రలోకి పోవడానికి ప్రయత్నిం చింది. కాని ఆ చిన్నరంధ్రంలో దూరలేకపోతోంది. హజ్రత్ జిబ్రీల్ ఆ ఎద్దును గురించి చెబుతూ " ఒకతను బాధ్యతారహితంగా సమస్యలు, సంక్షోభాలకు కారణమయ్యే ఓమాట చెప్పి, తరువాత పశ్చాత్తాపంతో దాన్ని దూరంచేయడానికి ప్రయత్నిస్తాడు. కాని అతని ప్రయత్నాలేవీ ఫలించవు. ఈ ఎద్దు అలాంటి బాపతుకు చెందినదే" అన్నారు.

వేరొకచోట కొందరు తమకు కావాల్సిన మాంసాన్ని తమ దేహాల నుండే కోసుకొని తింటున్నారు. వారు ఇతరుల్ని ఎగతాళి, ఎకసక్కెం చేసేవారని జిబ్రీల్ (అలై) తెలిపారు.

వారికి కొంచెం దూరంలో మరికొందరున్నారు. వారు తమ వాడిఅయిన రాగిగోళ్ళతో తమ ముఖాలను, రొమ్ములను రక్కుకుంటున్నారు. దైవప్రవక్త (సల్లం) వీరెవరని అడిగారు. వీరు ప్రజలను పరోక్షంగా నిందిస్తూ, వాళ్ళలో చెడుల్ని తీసి చూపిస్తూ వారి గౌరవప్రతిష్ఠలను దిగజార్చేవారని తెలిపారు హజ్రత్ జిబ్రీల్ (అలైహి).

మరొకచోట బానకడుపులు కలిగినవారు కొందరున్నారు. వారి పొట్టలు పాములతో నిండిపోయి ఉన్నాయి. వారు వడ్డీ తినేవాళ్ళని చెప్పారు హజ్రత్ జిబ్రీల్ (అలైహి).

వేరొకచోట కొందరు స్త్రీలు, పురుషులు ఉన్నారు. వారికి ఒక వైపున రుచికరమైన ఘుమఘుమలాడే మంచి మాంసం ఉంది. మరో వైపున కుళ్ళిపోయి కంపుకొడ్తున్న మాంసం ఉంది. అయితే ఆ మనుషులు మంచి మాంసం వదలి కంపుకొడ్తున్న మాంసాన్ని తింటున్నారు. వీళ్ళెవరని అడిగితే, "వీళ్ళు ధర్మసమ్మతమైన భార్యలను, భర్తలను వదలి నిషేధితాలతో తమ కోరికలు తీర్చుకునే స్త్రీ పురుషులు" అని చెప్పారు జిబ్రీల్ (అలైహి).

అక్కడ్నుంచి కొంచెం ముందుకు పోయిన తరువాత ధుమధుమలాడే ముఖంతో ఉన్న ఒక భయంకరుడు కన్పించాడు. దైవప్రవక్త (సల్లం)కు స్వాగతం చెప్పి కరచాలనం చేసినా, అతని ముఖం ధుమధుమలాడుతూనే ఉంది. ఆ వ్యక్తి ఎవరని అడిగితే ఆయన నరకపాలకుడని చెప్పారు హజ్రత్ జిబ్రీల్ (అలైహి)

ఈవిధంగా ఆయన దైవప్రవక్త (సల్లం)ను తీసుకొని దారిలో అనేక వింతలు, విశేషాలు చూసుకుంటూ రెండవ ఆకాశానికి చేరుకున్నారు. అక్కడ దైవప్రవక్త (సల్లం)కు అనేకమంది దైవదూతలు స్వాగతంచెప్పారు. ఈసా (అలైహి), యహ్యా (అలైహి)లు తారసపడ్డారు. ఆ ప్రవక్తలిద్దరూ అంతిమ దైవసందేశహరునికి చిరునవ్వుతో స్వాగతం చెప్పారు.

ఆ తరువాత వారిద్దరూ మూడవ ఆకాశానికి చేరుకున్నారు. అక్కడ హజ్రత్ యూసుఫ్ ప్రవక్త (అలైహి) కన్పించారు. ఆయన అసాధారణ సౌందర్యం చూసి ముహమ్మద్ (సల్లం) అబ్బురపడ్డారు. హజ్రత్ యూసుఫ్ (అలైహి) చిరునవ్వుతో అంతిమ దైవప్రవక్త (సల్లం)ను స్వాగతించి కౌగలించుకున్నారు.

అక్కడ్నుంచి దైవదూత జిబ్రీల్ (అలైహి) దైవప్రవక్త (సల్లం)ను తీసుకొని నాల్గవ ఆకాశంలోకి ప్రవేశించారు. అక్కడ దైవప్రవక్త హజ్రత్ ఇద్రీస్ (అలైహి) మహనీయ ముహమ్మద్ (సల్లం)ని చూసి సంతోషిస్తూ స్వాగతం చెప్పారు. ఆ తర్వాత ఐదవ ఆకాశంలో హజ్రత్ హారూన్ (అలైహి), ఆరవ ఆకాశంలో హజ్రత్ మూసా (అలైహి)లు కూడా అంతిమ దైవప్రవక్త (సల్లం)కు సాదరంగా స్వాగతం చెప్పారు.

ఆరవ ఆకాశం నుండి బయలుదేరి మార్గంలో ఎన్నోవిశేషాలు చూసుకుంటూ ఏడవ ఆకాశానికి చేరుకున్నారు. ఏడవ ఆకాశంలో ప్రవేశించగానే అక్కడ బ్రహ్మాండమైన మసీదు కన్పించింది. అందులో కోట్లాది దైవదూతలు దైవధ్యానంలో లీనమయి ఉన్నారు. ఇంకా అసంఖ్యాకమైన దైవదూతలు తెంపులేకుండా ఆ మసీదుకు వచ్చిపోతున్నారు. మహాప్రవక్త ముహమ్మద్ (స) అక్కడ హజ్రత్ ఇబ్రాహీం ప్రవక్త (అలైహి)ను కలుసుకున్నారు.

ఈ పర్యటనలో మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) అనూహ్యమయిన అనేక దృశ్యాలు తిలకించారు. హజ్రత్ జిబ్రీల్ (అలై) దైవాజ్ఞతో ఆయనకు స్వర్గ నరకాలు కూడా చూపారు. అక్కడ మానవమేధస్సుకు కూడా అంతుపట్టని అసాధారణమైన దృశ్యాలను చూసి దైవప్రవక్త (సల్లం) విభ్రాంతిచెందారు.

మానవుడు ఆ భీకరనరకాన్ని ఒక్కసారి చూస్తే, ఇహలోకంలోని సమస్త సౌఖ్యాలు వదలి అమిత దైవభీతితో నరకశిక్ష నుంచి తప్పించుకోవడానికి జీవితాంతం దైవధ్యానంలోనే లీనమైఉంటాడు. అలాగే స్వర్గంలోని భోగభాగ్యాలు, మనోహరదృశ్యాల్ని ఒక్కసారి చూస్తే, ఇక ఆ సౌఖ్యాలు పొందడానికి లోకంలో ఎదురయ్యే అతిభయంకర కష్టనష్టాలను సైతం మనిషి పరమసంతోషంగా భరించి, నిరంతరం దైవారాధనలోనే జీవితం గడుపుతాడు.

ఈవిధంగా జరిగితే ప్రపంచవ్యవహారమే మారిపోతుంది. సమాజం మరోలా తయారవుతుంది. అలాంటప్పుడు ప్రపంచం పరీక్షావేదిక అనే విషయం అర్థరహితమవుతుంది. అంచేతనే దేవుడు వీటన్నిటినీ మరుగున ఉంచి మానవులకు వారి బాధ్యతల్ని బోధించాడు. బాధ్యతల నిర్వహణను బట్టి పరలోకంలో ఫలితం దక్కుతుందన్నాడు.

మహాప్రవక్త (సల్లం) దైవమహిమల్ని మననం చేసుకుంటూ జిబ్రీల్ వెంట ముందుకు సాగారు. కాస్సేపటికి వారు ఓ విశిష్ఠ వృక్షం సమీపానికి చేరుకొని ఆగిపోయారు. అదే సిద్రతుల్ మున్తహా అనే మహావృక్షం! చిత్ర విచిత్ర కాంతులు వెదజల్లుతున్న బ్రహ్మాండమైన



వృక్షరాజం అది. దైవప్రవక్త (సల్లం) దాన్ని చూసి తనకు ఇవన్నీ చూసే భాగ్యం లభించినందుకు దైవానికి కృతజ్ఞలు తెలుపుకున్నారు.

ఈ విశ్వవృక్షమే భౌతికపరమైన విశ్వమండలానికి సరిహద్దు. ఈ సరిహద్దు దాటితే కండ్లు మిరుమిట్లు గొలిపే కాంతిపుంజాలతో కూడిన రాజమార్గం కన్పిస్తుంది. దైవ సాన్నిధ్యానికి గొనిపోయే దివ్యమార్గం అది.

అయితే హజ్రత్ జిబ్రీల్ (అలై) ఆ హద్దు సమీపానికి చేరుకోగానే ఠక్కున ఆగిపోయి "ఇక మీరు వెళ్ళండి, నేను రాలేను" అన్నారు. దైవప్రవక్త (స)కు ఆశ్చర్యం వేసింది.

"జిబ్రీల్! ఏమిటి సందేహిస్తున్నారు? ఇంత దూరం నాతో వచ్చి ఇప్పుడు నన్ను ఒంటరిగా వదలిపోవడం మీకు భావ్యమేనా?" అన్నారు ఆయన.

"దేవునికి అతి సన్నిహితులైన మీరే ఈ జ్యోతిర్మయమార్గంలో ప్రయాణం చేయడానికి యోగ్యులు, సమర్థులు. నాకా అర్హత లేదు. ఇక నేను ఒక్కఅడుగు ముందుకు వేసినా నా రెక్కలు కాలి బూడిదయిపోతాయి" అన్నారు హజ్రత్ జిబ్రీల్ (అలైహి).

## విశ్వాసులకు విశ్వప్రభువు కానుక-(54)

ఈ మాటలు విన్న తరువాత దైవప్రవక్త (సల్లం)కు ధైర్యం వచ్చి ముందుకు సాగారు. రఫ్రఫ్ అనే మాధ్యమం ద్వారా కాంతిని మించిన వేగంతో పురోగమించారు. కాస్సేపటికి అటునుంచి "అస్సలాము అలైకుం; ముహమ్మద్! నేనే విశ్వప్రభువును" అనే గంభీరమైన వాణి విన్పించింది. దైవప్రవక్త (స) మనస్సు పరమానందంతో పరవశించి పోయింది.

"నాదైవం, నా స్వామి నాతో సంభాషిస్తున్నాడు. నా ప్రభువు సాన్నిధ్యం నేడు నాకు ప్రాప్తమవుతోంది. మహాప్రసాదం. ఓహ్, నేనెంత అదృష్టవంతుడ్ని!" అనిర్వచనీయమయిన అనుభూతితో ఆయన అప్రయత్నంగా సాష్టాంగప్రణామం చేశారు. అదే స్థితిలో విశ్వ ప్రభువును తనివితీరా స్తుతించారు.

"ముహమ్మద్! మా కోసం ఏం కానుక తెచ్చావు?" అటునుంచి మరోసారి గంభీరమైన వాణి విన్పించింది.

"ప్రభూ! ఈ వినమ్రుడు తన వైపు నుండి, తన అనుచర సముదాయం వైపు నుండి సమస్త విధాల శారీరక, ఆర్థిక ఆరాధనలు విశ్వ ప్రభువుకు సమర్పించుకుంటున్నాడు" అన్నారు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం).

"మేము వాటిని స్వీకరిస్తున్నాం. ఇక నీకేం కావాలో కోరుకో" దైవవాణి.

"ప్రభూ! నీ అపార అనుగ్రహంతో నా ఉమ్మత్ (అనుచర సముదాయం)లోని పాపుల్ని క్షమించు. నీవే అందరికంటే గొప్ప క్షమాశీలివి, అనుగ్రహమూర్తివి" అంటూ దైవప్రవక్త (సల్లం) రెండు చేతులు జోడించారు అత్యంత వినయంగా.

"నీ అనుచరసముదాయంలో చిత్తశుద్ధితో సద్వచనం (కలిమెతయ్యిబా) స్వీకరించిన వారందర్నీ మేము క్షమిస్తాము. అంతేకాదు, అంతిమదినాన నీ అనుచర సముదాయంలోని

అనేకమంది దాసుల విషయంలో కూడా నీ సిఫారసును అంగీకరిస్తాము. బహుదైవారాధనా (షిర్క్) పాపం తప్ప నేను తలచుకుంటే ఇతర పాపాలన్నీ క్షమిస్తాను.

"ఎవరైనా ఒక పుణ్యకార్యం చేయడానికి సంకల్పించుకుంటే, అతని కర్మలచిట్టాలో ఒక పుణ్యం రాయబడుతుంది. అతనా పుణ్యకార్యం క్రియాత్మకంగా చేస్తే పది పుణ్యాలు రాయబడతాయి. దీనికి భిన్నంగా ఎవరైనా ఒక పాపకార్యం చేయసంకల్పిస్తే, అది అతని కర్మలచిట్టాలో రాయడం జరగదు. ఆ పాపకార్యాన్ని అతను క్రియాత్మకంగా చేస్తే, దానికి ఒకపాపం మాత్రమే అతని కర్మలచిట్టాలో రాయబడుతుంది.

"పోతే మరో విషయం విను. ప్రపంచ జీవితంలో, మరణానంతర జీవితంలో కూడా సాఫల్యం పొందడానికి మేము నీకు, నీ అనుచర సముదాయానికి ఒక అపూర్వ కానుక ప్రసాదిస్తున్నాం. భూమ్యాకాశాలను సృష్టించినప్పుడే నీకు, నీ అనుచర సముదాయానికి రోజుకు యాభైసార్లు నమాజు చేయాలని విధిగా చేశాము. కనుక వెళ్ళి నీవు కూడా చేయి; నీ ఉమ్మత్ చేత కూడా చేయించు" అన్నాడు విశ్వప్రభువు.

దైవప్రవక్త (స) మరోసారి దైవాన్ని స్తుతించి, సెలవు తీసుకొని వెనక్కి మరిలారు. ఆరవ ఆకాశంలోకి వచ్చేటప్పటికి మూసా ప్రవక్త (అలై) తారసపడి ఇవా అడిగారు:

"సోదరా! చెప్పు, విశ్వప్రభువు నుండి ఏమేమి ఆజ్ఞలు లభించాయి?"

"రోజుకు యాభైసార్లు నమాజు చేయాలని ఆజ్ఞయింది" చెప్పారు దైవప్రవక్త (స).

"యాభైసార్లే! రోజుకు యాభైసార్లు నమాజ్ చేయడం సాధ్యమేనా? ఇస్రాయీల్ సంతతి వారు రోజుకు రెండుసార్లు కూడా చేయలేకపోయారు. నీ అనుచర సముదాయం యాభై సార్లు ఎలా చేస్తుంది? వెనక్కివెళ్ళి కొన్ని పర్యాయాలు తగ్గించమని దైవాన్ని అడుగు" అన్నారు మూసాప్రవక్త (అలైహి) తనకున్న అనుభవాన్ని తలచుకుంటూ.

అంతిమ దైవప్రవక్త (సల్లం) మళ్ళీ విశ్వప్రభువు దగ్గరకు పోయారు. ఆయన ముందు సాష్టాంగపడి కొన్ని నమాజులు తగ్గించమని వేడుకున్నారు. దేవుడు సగం నమాజులు (అంటే ఇరవై అయిదు పర్యాయాలకు) తగ్గించాడు.

మహనీయ ముహమ్మద్ (సల్లం) సంతోషంతో మూసా ప్రవక్త (అలైహి) దగ్గరకు వచ్చి చెప్పారు. కాని హజ్రత్ మూసా (అలైహి) ఈ సంగతి విని సంతోషించలేదు.

"నీ అనుచరులు అన్ని నమాజులు కూడా చేయలేరు. మళ్ళీ పోయి ఇంకా తగ్గించమని అడుగు" అన్నారు ఆయన.

అంతిమ దైవప్రవక్త (సల్లం) మళ్ళీపోయి అడిగితే, దేవుడు మరికొన్ని నమాజులు తగ్గించాడు. అయితే మూసాప్రవక్త (అలైహి) తృప్తిచెందక "మళ్ళీ పోయిరా. నీ అనుచరులు నమాజ్ అన్ని సార్లు కూడా చేయలేరు" అన్నారు.

ఆయన చెప్పినట్లు మహనీయ ముహమ్మద్ (సల్లం) మరోసారి వెళ్ళి తగ్గించమని విశ్వప్రభువుని అడిగారు. విశ్వప్రభువు ఈసారి మరికొన్ని నమాజులు తగ్గించి, అయిదు (వేళల) నమాజులు మాత్రమే ఖాయపరచి ఇలా అన్నాడు:



"నీకు, నీ అనుచర సముదాయానికి ఈ అయిదు నమాజులు విధిగా చేశాము. "ఎవరైనా ఒక సత్కార్యం చేస్తే దానికి పదిరెట్లు పుణ్యం అతనికి ప్రసాదిస్తాం" అనే ఖుర్ఆన్ ఆదేశం ప్రకారం ఈ అయిదు నమాజుల పుణ్యం యాభై నమాజుల పుణ్యంతో సమానం. మా నిర్ణయంలో ఎలాంటి మార్పు ఉండదు."

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఈ అయిదు నమాజుల ఆదేశంతో తిరిగొచ్చారు. కాని మూసాప్రవక్త (అలై) మాత్రం "అన్ని నమాజులు కూడా నీ ఉమ్మత్ ప్రజలు చేయలేరు. ఇంకొకసారి వెళ్ళి నమాజుల సంఖ్య తగ్గించమని అడిగిరా" అని చెప్పారు.

దానికి ముహమ్మద్ ప్రవక్త (సల్లం) "ఇక నావల్ల కాదు. విశ్వప్రభువును మాటిమాటికి అడగాలంటే నాకు సిగ్గేస్తుంది" అన్నారు.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) దివ్యసోపానం దిగి జిబ్రీల్ (అలైహి) వెంట బైతుల్ మఖ్దిస్ మసీదుకు తిరిగొచ్చారు. అక్కడ మరోసారి నమాజ్ చేశారు. తరువాత బురాఖ్ మీద మక్కా తిరిగొచ్చి ఉమ్మెహానీ ఇంటికి చేరుకున్నారు.

## వివాదంలో పడేసిన వింత ప్రయాణం-(55)

ఇంత సుదీర్ఘ ప్రయాణం చేసి ఎన్నో వింతలు, విశేషాలు చూసి వచ్చినా మక్కాలో ఇంకా తెల్లవార లేదు. ప్రజలు నిద్రపోతూనే ఉన్నారు. కనీసం తూర్పు దిక్కున ఉషోదయ సూచనలు కూడా కానరావడం లేదు. దైవప్రవక్త (సల్లం) ఇంట్లోకెళ్ళి మామూలుగానే పడుకొని నిద్రకు ఉపక్రమించారు.

మరో జాముర్రాత్రి గడిచింది. పురజనులు ఇంకా మేల్కోలేదు. దైవప్రవక్త (సల్లం) ఫజర్ నమాజ్ కోసం లేచారు. చెల్లెలు ఉమ్మెహానీ (రజి) కూడా మేల్కొన్నారు. ఇద్దరూ ఉజూ చేసి నమాజ్ చేశారు. తరువాత దైవప్రవక్త (సల్లం) ఎన్నడూలేనంత ఆనందోత్సాహాలతో ఉమ్మెహానీ (రజి) వైపు తిరిగి చిరునవ్వుతో చూశారు.

"ఉమ్మెహానీ! నేను ఇషా నమాజ్ ఇక్కడే చేశాను; నువ్వు చూశావుకదా?" అన్నారు.

"ఔనూ, ఇషా నమాజ్ ఇక్కడే చేశావు.... అయితే ఏవిటీ?" ఉమ్మెహానీ ప్రశ్నార్థకంగా చూశారు.

"ఆ తరువాత ఏమయిందో తెలుసా? నేను ఇక్కడ్నుంచి సరాసరి బైతిల్‌మఖ్దిస్‌కు పోయాను. అక్కడ రెండు రకాతులు నమాజ్ చేశాను. ఇప్పుడు ఇక్కడకు వచ్చి నీతోపాటు ఫజర్ నమాజ్ చేశాను" అన్నారు దైవప్రవక్త (సల్లం).

"ఏవిటేమిటీ...? నువ్వు బైతిల్‌మఖ్దిస్‌కు పోయి రెండురకాతులు నమాజ్ చేసి, అంతలోనే ఇక్కడకు వచ్చావా? అదెలా సాధ్యం? కాస్త వివరంగా చెప్పన్నయ్యా!"

"నేను ఇషానమాజ్ తర్వాత మామూలుగానే పడుకున్నాను. ఆ తర్వాత కాస్సేపటికి ఎవరో నన్ను పేరుపెట్టి పిలిచినట్లు అన్పించింది. లేచి చూద్దును కదా! హజ్రత్ జిబ్రీల్ (అలైహి) మన ఇంటికప్పు చీల్చి క్రిందికి దిగసాగారు. నేను ఆశ్చర్యంతో కళ్ళప్పగించి

చూస్తుండిపోయా. ఈవిధంగా ఆయన ఇంటికప్పు చీల్చుకొని రావడం ఇదే మొదటిసారి. ఇదివరకెప్పుడూ ఇలా చేయలేదు. ఎప్పుడొచ్చినా ముందునుంచే వచ్చేవారు. సరే, నేను ఆశ్చర్యం నుంచి తేరుకునేలోగా ఆయన నాదగ్గరకొచ్చి చేయి పట్టుకొని నన్ను కాబా మసీద్‌లోని హతీమ్ దగ్గరకు తీసికెళ్ళారు. అక్కడ నన్ను పడుకోబెట్టి నా రొమ్ము చీల్చారు. తర్వాత ఓ స్వర్ణపాత్ర తెచ్చారు. అందులో వివేకం, విశ్వాసం అనే దివ్యపదార్థాలు ఉన్నాయి. వాటిని నా గుండెలో కుమ్మరించి తిరిగి యధాతథంగా గుండెను కుట్టేశారు.

అంతలో ఎంతో తెల్లగా మెరిసే ఓ విచిత్ర జంతువు నా దగ్గరకొచ్చి నిలబడింది. జిబ్రీల్ (అలై) దాని కళ్ళెం పట్టుకున్నారు. తర్వాత మేమిద్దరం దాని మీదెక్కాము. తక్షణమే అది ఆకాశంలోకి ఎగిరింది. మెరుపులా మెరిసి తృటిలో బైతుల్‌మఖ్దిస్‌కు చేరుకుంది. మేమక్కడ దిగాము. నేను అఖ్సా మసీదులో నమాజ్ చేశాను. నా వెనుక యావన్మంది దైవప్రవక్తలు కూడా నమాజ్ చేశారు" దైవప్రవక్త (స) వివరంగా చెప్పారు.

గగనపర్యటన గురించి దైవప్రవక్త (స) చెబుతుంటే, ఉమ్మెహానీ(రజి) కళ్ళు పెద్దవి చేసుకొని ఎంతో ఆసక్తిగా వినసాగారు. విషయం పూర్తిగా వినగానే ఆమె హృదయంలో దైవప్రవక్త (స) పట్ల గౌరవౌన్నత్యాలు ప్రగాఢంగా చోటుచేసుకున్నాయి. కాని అంతలోనే ఈ విషయం తెలిస్తే ప్రజలు ఆయనకు కీడు తలపెడ్తారేమో అనే భయం కూడా కలిగింది.

"అన్నయ్యా! ఈ విషయం నాకు చెబితే చెప్పావు గాని, ఇంకెక్కడా చెప్పకు. ప్రజలకు తెలిస్తే ప్రమాదం ముంచుకొస్తుంది. విశ్వాసులు కూడా సందిగ్ధంలో పడిపోవచ్చు."

"తప్పకుండా చెబుతాను. దీన్ని నేను ఖురైషీయుల ముందు కూడా ప్రస్తావిస్తాను."

"వద్దన్నయ్యా! నాపై ఒట్టు. ఎవరితో చెప్పినా, ఖురైషీయులతో మాత్రం అసలు చెప్పకు. వాళ్ళు నీ మాటలు తిరస్కరించడమే గాకుండా మనకు మరిన్ని కష్టాలు తెచ్చి పెడ్తారు" అన్నారు ఉమ్మెహానీ (రజి) ప్రాధేయపడుతూ.

"కాదు, నేను అందరికీ చెప్పి తీరుతా" అన్నారు దైవప్రవక్త (స) దృఢసంకల్పంతో.

అనడమేమిటీ, వెంటనే లేచి నిలబడ్డారు ఆయన ఖురైషీయుల దగ్గరకు వెళ్ళడానికి. ఉమ్మెహాని (రజి) నచ్చజెప్పడానికి శతవిధాల ప్రయత్నించినా ఆయన వినలేదు.

తెల్లవారింది. పురజనులు తమ దైనందినకార్యకలాపాల్లో లీనమైపోయారు. దైవప్రవక్త (స) సరాసరి కాబాలయానికి వెళ్ళి అక్కడ ఓచోట మౌనంగా కూర్చున్నారు. ఆయనకు కొంచెం దూరంలో కొందరు ఖురైషీయులు కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు.

మహాప్రవక్త (స) హృదయం పరిపరి విధాల పోతోంది. ఆలోచనా కెరటాలు ఎగిసి పడుతున్నాయి. రాత్రి తాను చూసిన సంఘటన ఖురైషీయులకు చెబుతాను అనుకున్నారు. కాని అంతలోనే ఏదో సందేహం.

"ఈ సంఘటన గురించి చెబుతాను. అయితే దీని పర్యవసానం ఏమిటీ? ప్రజలు నా మాటలు నమ్ముతారా లేక తిరస్కరిస్తారా? రాత్రి బైతుల్‌మఖ్దిస్‌కు పోయానని, అక్కడ్నుంచి దివ్యలోకాలన్నీ పర్యటించి వచ్చానని జరిగిన వృత్తాంతమంతా చెప్పనా



లేక ఉమ్మెహానీకి తెలియజేసినంత వరకే చెప్పనా?" ఏమయినాసరే జరిగింది జరిగినట్లు అంతా చెప్పడానికే నిశ్చయించుకున్నారు దైవప్రవక్త (సల్లం).

దూరంగా కూర్చున్న ఖురైషీయులు ఆయన్ని ఓకంట గమనిస్తున్నారు. వాళ్ళలో అబూజహల్ కూడా ఉన్నాడు. ఇదివరకెప్పుడూ లేనిది ఈరోజు మౌనంగా కూర్చున్న దైవప్రవక్త (సల్లం)ను చూసి అతను ఆశ్చర్యపోయాడు.

"ముహమ్మద్! ఏమిటీ ఇలా మౌనంగా కూర్చున్నావు? ఈరోజు ఏమైనా కొత్త విశేషం ఉందా?" అన్నాడు అతను దగ్గరకు వచ్చి.

"ఆ... కొత్త విశేషమే. రాత్రి నేను బైతుల్‌మఖ్దిస్‌కు వెళ్ళొచ్చాను" అన్నారు దైవప్రవక్త.

"ఏమిటీ, ఒక్క రాత్రిలోనే నీవు బైతుల్‌మఖ్దిస్‌కు పొయ్యొచ్చావా! కొంపతీసి ఈ సంగతి ఇంకెవరి ముందయినా చెప్పేవు" అన్నాడు అబుజహల్ పగలబడి నవ్వుతూ.

"చెబుతాను, అందరికీ చెబుతాను" అన్నారు దైవప్రవక్త (సల్లం).

"ఖురైషీయుల్లారా! రండి, రండి. ఈ వింత వినండి" అంటూ అబూజహల్ కేక వేసి అందరినీ పిలిచాడు.

మరుక్షణమే ఖురైషీయులంతా వచ్చి దైవప్రవక్త (సల్లం) చుట్టూ మూగారు.

"ఇదిగో ఈయన చెప్పేది కాస్త వినండి. ముహమ్మద్! ఇప్పుడు నాకు విన్పించిన సంగతి వీళ్ళక్కూడా విన్పించు" అన్నాడు అబూజహల్.

"రాత్రి నేను ఓ విచిత్రజంతువు ఎక్కి రెప్పపాటులో బైతుల్‌మఖ్దిస్‌కు వెళ్ళాను. అక్కడ ఆదం నుండి ఈసా వరకు ప్రభవించిన ప్రవక్తలంతా బారులుతీరి నిల్చున్నారు. నేను వారికి నాయకత్వం వహించి నమాజు చేయించాను" అన్నారు దైవప్రవక్త (స).

ఖురైషీయులు ఈ మాటలు విని పెద్ద పెట్టున విరగబడి నవ్వారు.

"ఆగండి, ఆగండి. కొంచెం మీ నవ్వులు ఆపండి.... ముహమ్మద్! ఇంతకూ దైవ ప్రవక్తలంతా మళ్ళీ బ్రతికించబడి నీ దగ్గరకు వచ్చారంటావు, అంతేగా? అయితే వాళ్ళ వివరాలేమిటో చెప్పు" అన్నాడు అబూజహల్ హేళనగా.

"ఈసా ప్రవక్త (అలైహి) మరీఅంత పొట్టీ కాదు, మరీఅంత పొడుగరీ కాదు. మధ్య రకంగా ఉన్నారు. విశాలమైన వక్షస్థలం, అందమైన ఎర్రటి శిరోజాలతో గంభీరంగా ఉన్నారు. మూసాప్రవక్త (అలైహి) చామనఛాయగా, దృఢమైన దేహంతో నిండుగా ఉన్నారు. అందరి కంటే ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) అన్ని విధాలా నన్ను పోలి ఉన్నారు" వివరించారు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం).

ఈ విషయాలు విని చాలామంది హృదయాలలో దైవప్రవక్త (సల్లం) పట్ల ఒకింత గౌరవభావం చోటుచేసుకుంది. కొందరు సంభ్రమాశ్చర్యాలతో బ్రాన్పడి పోయారు. మరికొందరు అనుమాన రోగానికి గురయ్యారు. మిగిలిన వారంతా ఆయన మాటల్ని తిరస్కరించి హేళన చేశారు.

"అబూబకర్! విన్నావా నీ ప్రియమిత్రుడు ఏమంటున్నాడో? రాత్రి ఆయన బైతుల్ మఖ్దిస్‌కు పోయి ఆ రాత్రికే అంతదూరం నుంచి తిరిగొచ్చాడట!" అన్నారు కొందరు కాబామందిరం వెలుపల మేరాజ్ వార్తను గురించి వింతగా చెబుతూ.

"ఏమిటి ఆయన అలా అన్నారా? నిజంగానా??" అడిగారు హజ్రత్ అబూబకర్ (రజి) కుతూహలంగా వారి వైపు చూస్తూ.

"ఔనయ్యా బాబూ! సాక్షాత్తు నీ ప్రాణస్నేహితుడు ముహమ్మద్ ఈ సంగతి మా అందరి ముందు బహిరంగంగా ప్రకటించాడు" అన్నారు ఖురైషీయులు.

"అయితే ఆయన చెప్పింది ముమ్మాటికి నిజమే. అందులో నాకెలాంటి అనుమానం లేదు" అన్నారు హజ్రత్ అబూబకర్ (రజి).

"నీకేమయినా మతి పోయిందా ఏమిటీ? ఒకేఒక రాత్రి వేలమైళ్ళ దూరంలో ఉన్న బైతుల్‌మఖ్దిస్‌కు పోవడం, అదే రాత్రి తెల్లారక ముందే తిరిగిరావడమా! ఇది నమ్మదగిన విషయమేనా?" అన్నారు ఖురైషీయులు ముఖాలు చిట్లించుకొని.

"నిస్సందేహంగా నమ్మదగినదే. ఇదే కాదు, ఆయన ఇంతకంటే అద్భుత విషయాలు చెప్పినా నేను నమ్ముతాను. ఎలాంటి సమయంలోనయినా ఆకాశం నుంచి తన దగ్గరకు తృటిలో వార్తలు వస్తుంటాయని ఆయన తరచుగా అంటుంటారు. నాకు మాత్రం అందులో ఎలాంటి వింతా, విడ్డూరం కన్పించదు" అన్నారు ఆయన దృఢవిశ్వాసంతో.

కాబాగృహంలో ఖురైషీయులు దైవసందేశహరుని (సల్లం) చుట్టూచేరి ఆయన్ని వింతగా చూడసాగారు. పైగా వారి తలబిరుసు, మంకుతనాలు మరింత పెచ్చరిల్లి ఆ సత్యసంధునిపై దుష్ప్రచారానికి దిగారు.

"ముహమ్మద్ రాత్రి బైతుల్‌మఖ్దిస్‌కు పోయి, తెల్లారక ముందే అంత దూరం నుంచి తిరిగొచ్చాడట? అవ్వ...! ఎక్కడైనా ఉందా ఈ చోద్యం?" అన్నారు కొందరు.

"ముహమ్మద్ (సల్లం)! నిన్నటిదాకా నీ మాటల్లో మాకు కాస్తో కూస్తో నమ్మకం ఉండేది. ఇప్పుడా కాస్త నమ్మకం కూడా లేకుండా పోయింది. ఈరోజు నీ బండారం బయటపడింది. నువ్వట్టి మోసగాడవని, పచ్చి అబద్ధాలరాయుడవని తెలిసిపోయింది" అన్నాడు ఒక అవిశ్వాసి.

"నిజం, నిజం. నువ్వు చెప్పేవన్నీ కట్టుకథలని, వట్టి బూటకాలని ఇప్పుడు రుజువై పోయింది" అన్నాడు మరొకతను.

"కాకపోతే మరేమిటయ్యా! బైతుల్ మఖ్దిస్‌కు పోవాలంటే చలాకీ ఒంటెల మీద ప్రయాణం చేస్తేనే ఒక నెల పడ్తుంది. అలాంటిది నువ్వు ఒక్క రాత్రిలో అంతదూరం వెళ్ళి వచ్చావంటే, నీ కల్లబొల్లి మాటలు నమ్మడానికి మేమంత మూర్ఖులమనుకున్నావా?" అన్నాడు వేరొక అవిశ్వాసి మూతి మూడు వంకర్లు తిప్పుతూ.

"లాత్, ఉజ్జాల సాక్షి! నీ మాటల్ని మేము ఎన్నటికీ నమ్మలేం. ఇదంతా అబద్ధం, పచ్చి అబద్ధం" అంటూ అరిచారు అవిశ్వాసులంతా కాబాగోడలు దద్దరిల్లి పోయేలా.



"కాదు, ఇది నిజం. ముహమ్మద్ (స) ఎప్పుడూ అబద్ధమాడలేదు. ఆయన చెప్పేది ముమ్మాటికీ నిజం" అన్నారు హజ్రత్ అబూబకర్ (రజి) అప్పుడే లోపలికి ప్రవేశిస్తూ.

ఖురైషీయులు ఒక్కసారిగా ఆయన వైపు చూస్తూ "అయితే నిరూపించమను" అన్నారు సవాలు విసురుతూ. హజ్రత్ అబూబకర్ (రజి) దైవప్రవక్త (సల్లం) వైపు చూశారు సమాధానం కోసం. అంతలో ముత్యిమ్ అనే అవిశ్వాసి ఒకతను అందుకున్నాడు:

"ముహమ్మద్! ఏదీ కొంచెం బైతిల్‌మఖ్దిస్‌ని గురించి వివరాలు చెప్పు విందాం."

"దైవప్రవక్తా! చెప్పండి. సందేహించకండి. నేను స్వయంగా బైతిల్ మఖ్దిస్ చూశాను. దాని వివరాలన్నీ నాకు తెలుసు. మీరు చెప్పేది వీరు కాదనడానికి ఆస్కారం ఉండదు" అన్నారు హజ్రత్ అబూబకర్ (రజి).

దైవప్రవక్త (సల్లం) బైతిల్ మఖ్దిస్‌ని గురించి చెప్పడం ప్రారంభించారు. ఆయన ఇది వరకెప్పుడూ దాన్ని చూడలేదు. ఈ సంగతి అవిశ్వాసులకు కూడా తెలుసు. అంచేత దైవప్రవక్త (సల్లం) అక్కడున్న ఒక్కొక్క వస్తువు స్వరూపం, సైజు, రంగు గురించి పూస గుచ్చినట్లు చెబుతుంటే అంతా ఆశ్చర్యంతో చూస్తున్నారు.

కాని మహాప్రవక్త (సల్లం) చెబుతున్న విషయం పూర్తికాక ముందే ఖురైష్ నాయకుల్లో మంకుతనం మళ్ళీ విజృంభించింది. వారు దిగ్గునలేచి తల అడ్డంగా తిప్పుతూ----

"కాదు కాదు. ఈ విషయాలు నీకు ముందుగానే ఎవరో చెప్పారు. ఇదంతా నువ్వు, నీ సహచరులు కలసి పన్నిన పన్నాగం. ఈ నాటకం మా దగ్గర సాగదు. స్పష్టమైన సాక్ష్యం ద్వారా నిరూపిస్తే తప్ప నీ మాటలు నమ్మం" అన్నారు.

దైవప్రవక్త (స) వారి మొండివైఖరికి చలించలేదు. విసుగుచెందనూ లేదు. సహనంతో, సంయమనంతో ఈసారి ఆయన మరింత వివరంగా చెప్పారు. దారిలో తాను ఏమేమి చూసింది, ఏఏ ఊళ్ళు దాటింది, ఏఏ వర్తకబృందాలు తారసపడింది, ఏఏ బిడారాల మీద ఏఏ సామగ్రి ఉంది, అవి మక్కా పట్నానికి ఇంకెంత దూరంలో ఉన్నాయో వివరంగా చెప్పారు. చివరికి వారి ఒంటెల రూపురేఖలు గురించి కూడా వర్ణించారు.

కాని అప్పటికీ అవిశ్వాసులు నమ్మలేదు. ఎలా నమ్ముతారు? వారి ఆత్మాభిమానం దెబ్బతినదూ! దైవప్రవక్త (సల్లం) ఔన్నత్యం ముందు వారి పెద్దరికం అడుగంటి పోదూ!! అందువల్ల ఈసారి వారు మరో సాకు చెప్పారు.

"ఈ వివరాలు చెప్పినంత మాత్రాన నిన్ను అప్పుడే ఎలా నమ్మాలి? నువ్వు చెప్పే ఆ వర్తకుల్ని రానివ్వు. రాత్రి వారెక్కడున్నారో, వారు నిన్ను కళ్ళారా చూశారో లేదో వారినే అడిగి తెలుసుకుంటాం. నీవు వర్ణించిన వర్తక సామగ్రిని, ఒంటెల్ని కూడా మా కంటితో చూసుకుంటేగాని మేము తృప్తిచెందము" అన్నారు వారు.

అప్పటిదాకా దైవప్రవక్త (సల్లం) చెప్పే మాటలు అత్యంతాసక్తితో విన్న అబూబకర్ (రజి) ఆనందం పట్టలేక "దైవప్రవక్తా! మీరు చెప్పినదంతా నిజం. మీరు నిస్సందేహంగా సత్యసంధులు" అన్నారు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) తలవంచుకొని కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయారు. తరువాత తలపైకెత్తి "అబూబకర్! దేవుడు నీకు సిద్దీఖ్ (సత్యసంధుడు) అనే బిరుదు ప్రదానం చేశాడు" అని చెప్పారు.

నిత్యశంకితులు ఏది చెప్పినా, ఎలా చెప్పినా ఓ పట్టాన నమ్మరు. వాళ్ళను ఎల్లప్పుడూ అనుమాన భూతం పట్టి పీడిస్తుంది. ఈ అనుమాన భూతానికి అహంకారం కూడా తోడయితే ఇక చెప్పాల్సిన పనే లేదు. తమకు చిన్నప్పటి నుంచి సత్యసంధుడని, నిజాయితీపరుడని తెలిసిన మనిషి కళ్ళారా చూసివచ్చిన విషయాల్నే వీరు నమ్మకపోతే, ఇక వాణిజ్యబృందాలు చెప్పే సాక్ష్యాన్ని ఒప్పుకుంటారని ఎలా చెప్పగలం?

కొన్నాళ్ళ తరువాత దైవప్రవక్త (సల్లం) చెప్పిన వర్తక బిడారాలు వచ్చాయి. పట్నంలో అందరికీ తెలిసిపోయింది. అవిశ్వాసులు వర్తక బిడారాల దగ్గరకు పరుగు పరుగున వచ్చారు. చూస్తే దైవప్రవక్త (సల్లం) చెప్పిన సామగ్రే ఉంది. ఒంటెల రూపు రేఖలు కూడా ఆయన వర్ణించినట్లే ఉన్నాయి. వర్తకులు కూడా ఆయన చెప్పినవారే. అవిశ్వాసులు నిశ్చేష్టులయి కొన్ని క్షణాలు తికమక పడ్డారు.

పట్నం తిరిగొచ్చిన ఆ వర్తకులు కూడా ప్రవక్త అనుచరుల నోట మేరాజ్ సంఘటన గురించి విన్నారు. వారిలో కొందరు తాము ఫలానా రోజు అర్ధరాత్రి ప్రయాణం చేస్తుంటే తమ మీదుగా ఆకాశంలో బర్‌బర్ అని శబ్దంచేస్తూ ఓ వింతవాహనం మెరుపులా దూసుకు పోయిందని, దాన్ని తాము కళ్ళారా చూశామని చెప్పారు. కాని ఈ అనుమాన రోగిష్టులు తోటిఅవిశ్వాసులు చెప్పిన ఈ సాక్ష్యాన్ని కూడా నమ్మడానికి సిద్ధపడలేదు.

"అంతా మాయ. ముహమ్మద్ పెద్ద మాంత్రికుడు. అతను తన మంత్రబలంతో జనాన్ని పెడదారి పట్టించడానికి ప్రయత్నిస్తున్నాడు, పదండి" అంటూ విసవిసలాడుతూ వెళ్ళిపోయారు వారు.

దైవప్రవక్త (స) అవిశ్వాసుల మొండితనానికి చింతిస్తూ గృహోన్ముఖులయ్యారు.

"దేవుడు ఎంతో పరిశుద్ధుడు. ఆయన తన నిదర్శనాలు చూపడానికి ఒకరోజు రాత్రి వేళ తన దాసుణ్ణి కాబామసీదు నుండి దూరాన ఉన్న అఖ్సామసీదు దగ్గరకు తీసికెళ్ళాడు. ఆ మసీదు పరిసరాలను ఆయన శుభవంతం చేశాడు. నిస్సందేహంగా ఆయన సమస్తం వింటున్నాడు. ప్రత్యక్షంగా ప్రతిదాన్నీ చూస్తున్నాడు." (దివ్యఖుర్‌ఆన్. 17:1)

మేరాజ్ వార్త మక్కా పట్టణంలో కార్చిచ్చులా ప్రాకిపోయింది. ప్రజలు దాన్ని ఎంతో చోద్యంగా చెప్పుకోసాగారు. వారిలో చాలా మంది విచక్షణా జ్ఞానం కూడా కోల్పోయారు. వారి హృదయాలపై చీకటితెరలు పడిపోయాయి. అందువల్ల సత్యసంధుడయిన మనిషి చెప్పిన మాటల్ని అసత్య విషయాలుగా పరిగణించి త్రోసిపుచ్చారు. అంతేకాకుండా సత్యధర్మానికి వ్యతిరేకంగా వారు మరింత పెచ్చరిల్లి పోయారు. మేరాజ్ ఉదంతాన్ని అసాధ్య విషయంగా, పరమ వ్యంగంగా చిత్రించి జనసామాన్యంలో అపార్థాలు, అనుమానాలు రేకెత్తించడం మొదలెట్టారు. ఈ విషయాన్ని వాడుకుంటూ దైవప్రవక్త (సల్లం)పై, ఆయన అనుచరులపై మరిన్ని కష్టాలు తెచ్చిపెట్టారు.



అప్పుడు సత్యధర్మ వైతాళికుడు నిర్వహించవలసిన పాత్రను గురించి దైవసందేశం అవతరించింది. దైవాదేశం ప్రకారం దైవప్రవక్త (సల్లం) తనపై వస్తున్న కష్టాలను సహిస్తూ, విమర్శలను భరిస్తూ ఇస్లాం ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు.

## మదీనావాసుల ఇస్లాం స్వీకరణ-(56)

నూతన ధర్మం వైపు ఆకర్షించబడిన అదృష్టవంతులలో మదీనా పౌరుడు సువైద్ బిన్‌సామిత్ కూడా ఉన్నాడు. అతను మదీనా ప్రజలలో మంచి పలుకుబడి, గౌరవమర్యాదలు కల వ్యక్తి. గొప్ప పరాక్రమశాలి. కవిత్వంలో మంచి ప్రావీణ్యంగల మేధావి. ఒక్క మాటలో చెప్పాలంటే సువైద్ ఉన్నత వంశానికి చెందిన బహుముఖ ప్రజ్ఞాశాలి.

నబవీశకం 11వ సంవత్సరం ప్రారంభమయింది. సువైద్ ఒకసారి హజ్‌యాత్ర చేసే ఉద్దేశ్యంతో మక్కా వచ్చాడు. సువైద్ రాక తెలిసి దైవప్రవక్త (సల్లం) ఆయన దగ్గరకు వెళ్ళారు. ఆయనకు దైవధర్మం గురించి వివరించి ఏకదైవారాధన వైపు పిలిచారు.

సువైద్ ప్రవక్త మాటలు విని "నా దగ్గర ఉన్న బోధనలే బహుశా మీ దగ్గర కూడా ఉన్నాయనుకుంటా, ఔనా?" అని అడిగాడు.

"మీ దగ్గర ఏమున్నాయి?" దైవప్రవక్త (సల్లం) ప్రశ్నించారు.

"లుఖ్మాన్ మహాపురుషుని బోధనలు ఉన్నాయి" సువైద్ చెప్పాడు.

"అయితే అవేమిటో కాస్త నాక్కూడా విన్పించండి" అన్నారు దైవప్రవక్త (సల్లం).

సువైద్ తనకు తెలిసినవన్నీ విన్పించాడు. దైవప్రవక్త (సల్లం) వాటిని శ్రద్ధగా విని--

"ఈ బోధనలు చాలా బాగున్నాయి. కాని అంతకంటే మంచి బోధనలు నా దగ్గర ఉన్నాయి. నా దగ్గర అంతిమ దైవవాణి ఖుర్‌ఆన్ ఉంది. అందులో మానవ శ్రేయస్సుకు కావలసిన అమూల్య ఉపదేశాలున్నాయి" అని చెప్పారు.

తరువాత ఆయన కొన్ని దైవసూక్తులు విన్పించి ఇస్లాం విశ్వసించమని అన్నారు. దైవవాణి సువైద్ హృదయాన్ని కదిలించింది. ఏమాత్రం సంకోచించకుండా వెంటనే ఆయన ఇస్లాంపట్ల తన ప్రగాఢవిశ్వాసం వ్యక్తపరుస్తూ "మహా అద్భుతంగా ఉందీ వాణి" అన్నారు. ఆ తరువాత ఆయన నూతన ఉత్సాహంతో మదీనా తిరిగి వెళ్ళిపోయారు.

కాని ఈ శుభాత్మ పుడమిపై ఎంతోకాలం నిలువలేదు. యూదుల కుట్రతో ఔస్, ఖజ్రజ్ తెగల మధ్య జరిగిన అంతర్యుద్ధంలో హజ్రత్ సువైద్ (రజి) అమరగతి నొందారు.

మదీనా నుండి వచ్చిన అదృష్టవంతులలో అయాస్ బిన్ ముఆజ్ కూడా ఒకరు. మదీనాలో ఔస్, ఖజ్రజ్ తెగల మధ్య యుద్ధజ్వాలలు ప్రజ్వరిల్లుతున్న రోజులవి. రెండు పక్షాలు సాధ్యమయినంత ఎక్కువ సైనిక బలం సమీకరించుకునేందుకు అరేబియాలోని ఇతర తెగలను తమ పక్షంలో కలుపుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. ఔస్ పక్షానికి చెందిన ఓ ప్రతినిధివర్గం ఖురైషీయుల్ని తమ వైపుకు తిప్పుకోవడానికి మక్కా వచ్చింది. అందులో నవయువకుడైన అయాస్ కూడా ఉన్నాడు.

ఈ విషయం తెలిసి దైవప్రవక్త (సల్లం) ఔస్ ప్రతినిధివర్గాన్ని కలుసుకున్నారు. వారికి దైవవాణి విన్పించి ఇస్లాం ధర్మం స్వీకరించమని కోరారు. కాని సత్యధర్మం ఔస్ ప్రతినిధి వర్గంలో ఒక్క అయాస్‌నే వరించింది.

"సోదరులారా! దైవసాక్షిగా చెబుతున్నాను. మనం ఏ కార్యసాధన కోసం ఇక్కడికి వచ్చామో, దానికంటే ఇది ఎంతో శ్రేష్ఠమైనది" అన్నాడా యువకుడు ఖుర్‌ఆన్ సూక్తులు వినగానే ఉరకలు వేస్తున్న ఉత్సాహంతో.

కాని ప్రత్యర్థుల్ని అంతమొందించాలనే ప్రతీకారేచ్ఛతో అనుక్షణం యుద్ధాన్ని గురించే ఆలోచించేవారికి దైవసూక్తులు చెవికెక్కలేదు. ప్రతినిధివర్గం నాయకుడు అబుల్ హైస్ ఉరిమిచూసి నేలమీద కంకర్రాళ్ళు తీసికొని అయాస్ ముఖం మీదికి విసిరాడు.

"నోరు మూసుకో. మనం వచ్చిన పనేమిటి, నువ్వు చెప్పేదేమిటీ?" అన్నాడతను కోపంతో ఊగిపోతూ.

అయాస్ మాత్రం వాళ్ళను ఖాతరుచేయకుండా అప్పటికప్పుడే ఇస్లాం ధర్మం విశ్వసించినట్లు ప్రకటించాడు.

దైవప్రవక్త (సల్లం) వివిధ ప్రాంతాల నుంచి కాబాయాత్ర కోసం వస్తున్న అనేక తెగల్ని కలుసుకొని ఇస్లాం సందేశం విన్పించారు. మరికొన్ని తెగల దగ్గరకు ఆయన స్వయంగా పోయి దైవసందేశం అందజేసి ఇస్లాం స్వీకరించమని అడిగారు. కాని అందరూ ఆయన మాటలు వినీ విననట్లు ఉండిపోయారు.

"ముహమ్మద్‌కు సహాయపడితే మనం ఇతర తెగల క్రోధానికి గురికావలసి వస్తుంది. వాళ్ళు మన ప్రాంతానికి రారు. మనల్ని తమ ప్రాంతాలకు రానివ్వరు. మనకు వాళ్ళకు మధ్య ఉన్న వ్యాపారలావాదేవీలు, సామాజిక సాంస్కృతిక సంబంధాలు అన్నీ తెగిపోతాయి" అని భావించారు అనేకమంది.

అందువల్ల ఇస్లాం సత్యధర్మమని, దేవుడు ఆమోదించిన ఏకైక జీవన మార్గమని తెలిసి కూడా దాన్ని విశ్వసించడానికి వెనుకంజ వేశారు. మరికొన్ని తెగలు పదవీ, అధికారాల వ్యామోహంతో నూతన ధర్మం స్వీకరించడానికి ముందుకు రాలేక పోయాయి. బనూఆమిర్ తెగ పరిస్థితి అలాగే ఉంది.

"మీరు కోరినట్లు మేము ఇస్లాం ధర్మం స్వీకరిస్తాము. కాని మీ తదనంతరం రాజ్యాధికారం మాకు లభించాలి" అన్నారు ఆ తెగవాళ్ళు అధికారానికి, ధర్మావలంబనకు లంకెపెడ్తూ.

"అధికారం, నాయకత్వం దేవుని అధీనంలో ఉన్నాయి. ఆయన తాను తలచుకున్న వారికి మాత్రమే వాటిని ప్రసాదిస్తాడు" అన్నారు దైవప్రవక్త (సల్లం) నిర్ద్వందంగా.

"అలాగానా! మీకోసం మేము ప్రాణాలు సయితం త్యాగం చేయాలి. కాని విజయం లభిస్తే నాయకులు మాత్రం వేరేవాళ్ళు అవ్వాల్నా!? అలాగైతే మీరూ వద్దు, మీ మతమూ వద్దు మాకు" అన్నారు వారు రుసరుసలాడుతూ.



దైవసందేశహరుడు (సల్లం) కిన్దాహ్, కల్బ్, బనూహనీఫా, బనూముజర్, మున్నగు ప్రఖ్యాత తెగలతో పాటు, దేశంలోని అనేక చిన్నచిన్న తెగలను కూడా కలుసుకొని దైవవాణి విన్పించారు. కాని ప్రాపంచిక ప్రయోజనాలనే దృష్టిలో పెట్టుకొని ఇస్లాం స్వీకరించడానికి ఏ ఒక్కరూ ముందుకు రాలేదు. మరికొందరైతే ప్రవక్త మాటలు వింటే ఎక్కడ చెడిపోతామో నన్న భయంతో చెవులు మూసుకొని మరీ దూరంగా తొలగిపోయారు.

"అసలు మనిషి గుణగణాలు ఎలాంటివో అతని ఇంటివాళ్ళకే బాగా తెలుస్తాయి. ఈ మనిషిలో మంచి అన్నది కాస్తయినా ఉంటే అతడ్ని అతని ఇంటి (మక్కా)వాళ్ళు ఎందుకు తిరస్కరిస్తారు?" అంటూ ఇంకొందరు పెద్ద లా పాయెంటు తీశారు.

మక్కాలో దైవప్రవక్త (స) ప్రచారం గురించి మదీనా పరిసర ప్రాంతంలో నివసిస్తున్న గిఫ్ఫార్ తెగవాళ్ళకు కూడా తెలిసింది. ఆ తెగలో దారిదోపిడీని వృత్తిగా చేసుకొని జీవితం గడిపేవారే అత్యధిక మంది ఉన్నారు. అందువల్ల గిఫ్ఫారీ తెగ దారిదోపిడి చేసే తెగ అని పేరుపడింది.

ఆ తెగనాయకుడు అబూజర్ కూడా ప్రముఖ దోపిడీ దొంగే. అయితే విగ్రహాలను పూజించడం అతనికి సుతరామూ నచ్చేదికాదు. విగ్రహపూజకు అతను ఎల్లప్పుడూ దూరంగా ఉండేవాడు. మదీనావాసులు సువైద్ బిన్ సామిత్ (రజి), అయాజ్ బిన్ ముఆజ్ (రజి)ల ద్వారా నూతనధర్మం గురించి సమాచారం అందగానే ఆయన వివరాలు తెలుసుకోవడానికి తన తమ్ముడు అనీస్‌ని మక్కా పంపించాడు.

అనీస్ మక్కా వెళ్ళి దైవప్రవక్త (సల్లం)ను కలుసుకున్నాడు. అనీస్ మంచి కవి కూడా. అంచేత దైవప్రవక్త (స) పఠించిన సూక్తులు నిజంగా దైవవాణేనని ధృవపరచుకొని మదీనా తిరిగొచ్చాడు.

"అన్నయ్యా! ముహమ్మద్ (స) సామాన్య మానవుడు కాదు. ఆయన నోట వెలువడే వాణిలో మానవ వాక్కులోలేని ప్రత్యేకత ఉంది. అదీగాక ఆయన సత్కార్యాలు చేయమని ప్రజలను ఉపదేశిస్తున్నారు. దుష్కార్యాల నుండి వారిస్తున్నారు" చెప్పాడు అనీస్.

కాని అనీస్ మాటల వల్ల అబూజర్‌కు పూర్తిగా తృప్తి కలగలేదు. అందువల్ల ఆయన స్వయంగా మక్కా బయలుదేరాడు. మక్కా చేరుకొని నేరుగా కాబాలయానికి వెళ్ళి దైవప్రవక్త (స)ను వెతకసాగాడు. కాని ఆయన దైవప్రవక్త (స)ను ఎప్పుడూ చూడలేదు. అందువల్ల ఆయన కాబాలో ఉన్న జనంలో ఎవరు దైవప్రవక్తో తెలుసుకోలేక పోయాడు. ప్రజల్ని అడగటం కూడా బాగుండదని భావించాడు.

ఇలా దైవప్రవక్త (సల్లం)ను గుర్తుపట్టడంలోనే చీకటిపడి చాలా పొద్దుపోయింది. అంతలో హజ్రత్ అలి (రజి) వచ్చారు. ఆయన అబూజర్‌ని చూసి ఇతనెవరో కొత్తగా వచ్చిన బాటసారిలా ఉన్నాడనుకున్నారు.

"మీరెవరో బాటసారిలా ఉన్నారు. ఈ రాత్రికి మా ఇంటికి పదండి" అన్నారు ఆయన. అబూజర్ మౌనంగా ఆయన్ని అనుసరించాడు. దారిలో, ఆ తరువాత అలి ఇంటికెళ్ళిన తరువాత కూడా అతను ఏమీ మాట్లాడలేదు.

ఆ రాత్రి హజ్రత్ అలి (రజి) అతనికి భోజనం పెట్టి పడక ఏర్పాటు చేశారు. తెల్లవారిన తరువాత అబూజర్ మూటాముల్లె సర్దుకొని మళ్ళీ కాబాలయానికి వెళ్ళాడు. కాని ఆరోజు కూడా అతను దైవప్రవక్త (సల్లం)ను గుర్తు పట్టలేకపోయాడు.

చివరికి ఆ రాత్రి కాబాలోనే ఓ మూలన పడక పరుచుకొని పడుకున్నాడు. అంతలో హజ్రత్ అలి (రజి) వచ్చి అతడ్ని లేపి ఇంటికి తీసికెళ్ళారు. తెల్లవారగానే అబూజర్ మళ్ళీ కాబాగృహానికి వెళ్ళిపోయారు. ఆరోజు కూడా అతను దైవప్రవక్త (స)ను గుర్తుపట్టలేక పోయాడు. కాస్సేపటికి హజ్రత్ అలి (రజి) వచ్చి చూసి ఆశ్చర్యపోయారు.

“ఏమిటీ మీరింకా మీ గమ్యస్థానానికి వెళ్ళలేదా? ఇంతకూ మీరొచ్చిన పనేమిటో చెప్పలేదు” అన్నారు హజ్రత్ అలి (రజి).

“మీరెవరితో ప్రస్తావించనని మాటిస్తే చెబుతాను” అన్నాడు అబూజర్ (రజి).

“సరే చెప్పండి.”

“ఇక్కడ ఒకాయన్ని జనం దైవప్రవక్తని చెప్పుకుంటున్నారట. నేనాయన్ని కలుసుకోవాలి. ఆయన ఎక్కడున్నారో ఎలా ఉంటారో నాకు తెలియదు. మీరేమయినా నాకు సహాయం చేయగలరా?” అన్నాడు అబూజర్.

“అలాగైతే నా వెంట పదండి” అన్నారు హజ్రత్ అలి (రజి).

ఆ విధంగా అలి (రజి) అబూజర్‌ని తీసుకొని దైవప్రవక్త (స) సన్నిధికి తీసికెళ్ళారు.

అబూజర్ దైవప్రవక్త (స)ను ఉద్దేశించి “మీరు జనంలో ప్రచారం చేస్తున్న విషయాలేమిటో సరైన రీతిలో మంచిస్వరంతో కాస్త నాకు విన్పించండి” అని అడిగాడు.

“అయ్యా! నేను కవిని కాను. నేను చెప్పేమాటలు ఖుర్‌ఆన్‌కు సంబంధించిన సూక్తులు. ఖుర్‌ఆన్ నా సొంతవాణి కాదు, దైవవాణి” అన్నారు దైవప్రవక్త (సల్లం).

“సరే ఆ వాణే పఠించి విన్పించండి నాకు” అన్నాడు అబూజర్ గిప్ఫారీ.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఖుర్‌ఆన్‌లోని కొన్ని సూక్తులు పఠించారు.

అబూజర్ దైవసూక్తులు వినగానే “నేను అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ దైవప్రవక్త అని సాక్ష్యమిస్తున్నాను” అన్నాడు.

“చాలా సంతోషం. ఇంతకూ నీవు ఏ తెగవాడివి?” అడిగారు దైవప్రవక్త (సల్లం).

“నేను గిప్ఫార్ తెగ నాయకుడ్ని.”

పెద్ద గూండాగా, దోపిడీదొంగగా కన్పిస్తున్న అబూజర్ (రజి)ని దైవప్రవక్త (సల్లం) ఒకసారి ఎగాదిగా చూసి “నిజంగా దేవుడు తాను తలచిన వారికి సన్మార్గం చూపుతాడు” అన్నారు.

“దైవప్రవక్తా! నేను కాబా వెళ్ళి నలుగురి ముందు సద్వచనం (కలిమా) ప్రకటిస్తాను” అన్నారు హజ్రత్ అబూజర్ గిప్ఫారీ (రజి).



“అలా చేశావంటే ఖురైషీయులు నిన్ను ప్రాణాలతో వదలిపెట్టరు” అన్నారు దైవప్రవక్త (సల్లం).

“నేను నా ప్రాణం గురించి భయపడను. ఖురైషీయుల ముందు సద్వచనం ప్రకటించి తీరుతాను” అన్నారు అబూజర్ (రజి) దృఢమైన దీక్షతో.

అనడం ఏమిటీ వెంటనే ఆయన కాబాగృహానికి వెళ్ళి “అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ ఆయన ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను” అని ఎలుగెత్తి చాటారు. అంతే, ఖురైషీయులు ఒక్కసారిగా ఆయనపై విరుచుకుపడ్డారు. పిడిగుద్దులతో, తన్నులతో ఆయన్ని తీవ్రంగా కొట్టసాగారు.

అంతలో ప్రవక్త పినతండ్రి అబ్బాస్ జోక్యం చేసుకుంటూ “అరెరె! ఇతడ్ని కొడ్తారేమిటీ! ఇతను గిప్ఫార్ తెగ మనిషయ్యా బాబూ! గిప్ఫార్‌తెగ ఉండే ప్రాంతం గుండానే మీ వర్తక బిడారాలు సిరియా నుంచి వస్తుంటాయి” అన్నారు.

ఈ మాట వినగానే ఖురైషీయులు అబూజర్ గిప్ఫారీ (రజి)ని కొట్టడం ఆపి పక్కకు తప్పుకున్నారు. హజ్రత్ అబూజర్ (రజి) రక్తసిక్త దేహంతో దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళి జరిగిన వృత్తాంతం తెలియజేశారు.

“నేను చెప్పలేదూ ఖురైషీయులు అంతపని చేస్తారని?” అన్నారు దైవప్రవక్త (స).

“పరవాలేదు దైవప్రవక్తా! నేను వారి దెబ్బలకు భయపడేవాడ్ని కాను. రేపు కూడా వెళ్ళి వారి ముందు సద్వచనం ప్రకటిస్తాను” అన్నారు హజ్రత్ అబూజర్ (రజి).

అన్నట్టే ఆయన రెండవరోజు కూడా కాబా వెళ్ళి అందరి ఎదుట సద్వచనం (కలిమా) ప్రకటించారు. అది వినగానే ఖురైషీయులు మళ్ళీ ఆయన మీద విరుచుకుపడి కొట్టారు. అయితే నిన్న అబ్బాస్ అన్న మాటలు గుర్తుకొచ్చి వదిలేశారు.

హజ్రత్ అబూజర్ గిప్ఫారీ (రజి) రక్తసిక్త దేహంతో దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళి జరిగిన సంగతి చెప్పారు. ఆ తరువాత ఆయన సెలవు తీసుకొని తిరిగి మదీనా వెళ్ళి పోయారు.

హజ్రత్ అబూజర్ గిప్ఫారి (రజి) స్వస్థలం చేరుకోగానే తన తెగ ప్రజలను సమావేశపరిచారు. వారికి దైవప్రవక్త (స) గురించి, నూతనధర్మం గురించి తెలియజేసి ఇస్లాం స్వీకరించమని చెప్పారు. గిప్ఫార్ తెగ ప్రజలు నాయకుని ఆజ్ఞ పాటిస్తూ వెంటనే ఇస్లాం స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు.

హజ్రత్ అబూజర్ (రజి), ఆయన అనుచరులు యథాప్రకారం తమ వృత్తిని కొనసాగిస్తూ దారిదోపిడీలు చేస్తునే ఉన్నారు. దైవప్రవక్త (స) అప్పటివరకు అవతరించిన దైవాజ్ఞలు మాత్రమే తెలియజేసి దారిదోపిడి సంగతి ప్రస్తావించలేదు. అందువల్ల గిప్ఫార్ తెగవాళ్ళు బ్రతుకుతెరువు కోసం దారిదోపిడి ఇంకా మానుకోలేకపోయారు. అయితే బాటసారుల సొమ్ము దోచుకున్న తర్వాత ఇస్లాం స్వీకరిస్తే తాము దోచుకున్న సొమ్ము తిరిగిచ్చేస్తామని చెప్పేవారు. ఆ విధంగా వారు కొందరిని ముస్లింలుగా మార్చగలిగారు.

# జిమాద్ ఇస్లాం స్వీకరణ-(57)

హజ్ సీజన్ రావడంతో మక్కా దరిదాపుల్లోని ఉకాజ్, మజన్న, జిల్‌మజాజ్ మైదానాలు వందలాది శిబిరాలు, దుకాణాలు, సాంస్కృతిక కేంద్రాలతో నిండిపోయాయి. అరేబియా నలుమూలల నుండి వచ్చే యాత్రికులు మక్కా పోతూ ముందుగా ఈ దుకాణాలకు, కేంద్రాలకు వస్తుంటారు. అందువల్ల దైవప్రవక్త (స) ఆ సంతకు వెళ్ళి యాత్రికుల్ని కలుసుకొని వారికి దైవధర్మాన్ని పరిచయం చేయడం ప్రారంభించారు. బహుదైవారాధన వల్ల కలిగే దుష్ఫలితాలను గురించి హెచ్చరిస్తూ, ఇస్లాం స్వీకరించమని చెప్పసాగారు.

కాని దైవప్రవక్త (స) ఎక్కడికి పోతే అక్కడికల్లా అబూలహబ్, అతని మిత్రమూక చేరుకొని ఆయనకు వ్యతిరేకంగా జనంలో అపార్థాలు రేకెత్తించడానికి ప్రయత్నిస్తున్నారు. వారి దుష్ప్రచారజాలంలో చిక్కుకున్న ప్రజలు దైవప్రవక్త (స) మాటలు వినడానికి కూడా సిద్ధపడటంలేదు. కొందరు ఆయన్ని దుర్భాషలాడేవారు. మరికొందరు ముఖాలు తిప్పుకొని వెళ్ళిపోయేవారు. అయితే దైవప్రవక్త (స) మాటలు అసలు వినేవారే లేకపోలేదు.

సంత చివరి రోజుకు చేరుకుంది. ప్రజల రాకపోకలు కూడా పెరిగిపోయాయి. ఆరోజు కూడా దైవప్రవక్త (సల్లం) వచ్చి దైవసందేశ ప్రచారం ప్రారంభించారు. ఒక కూడలిలో నిల్చొని జనాన్ని పిలిచి ప్రసంగించసాగారు. ఏకదైవారాధన గురించి, మరణానంతర జీవితాన్ని గురించి చెబుతుంటే ప్రజలు శ్రద్ధగా వింటున్నారు.

కాని అంతలో అబూలహబ్ ఎక్కడ్నుంచో షైతాన్‌లా ఊడిపడ్డాడు.

“ప్రజలారా! ఇతను నా తమ్ముడి కొడుకు ముహమ్మద్. మన తాతముత్తాల మతాన్ని వదిలేసి ఏదో కొత్త మతాన్ని సృష్టించుకున్నాడు. పచ్చి అబద్ధాలాడుతూ సంఘంలో చీలికలు తెస్తున్నాడు. ఇతని మాటలు నమ్మకండి” అన్నాడతను బిగ్గరగా.

అబూలహబ్ ఉన్నతమైన ఖురైష్ వంశస్థుడని, మక్కాప్రజల అగ్రనాయకుల్లో ప్రముఖుడని ప్రజలకు తెలుసు. అంచేత అతనిమాటలు వినగానే అందరూ జారుకున్నారు. దైవప్రవక్త (స) నిరాశచెందకుండా ధర్మప్రచారం కోసం మరోచోటికి బయలుదేరారు.

అబూలహబ్ చంకలు ఎగరేసుకుంటూ అక్కడ్నుంచి తన శిబిరానికి బయలుదేరాడు. కొన్ని అడుగులు నడిచాడో లేదో అతని భుజమ్మీద ఓ బలమైన చేయి పడింది. వెనక్కి తిరిగిచూస్తే, ఎర్రటి కనుగుడ్లతో, గారపట్టిన పళ్ళతో, జడలుకట్టిన శిరోజాలతో, నల్లటి పెదాలతో, మెడలో లావుపాటి పూసలదండతో చిరునవ్వు చిందిస్తూ ఓ భారీకాయం దర్శనమిచ్చింది.

“మీరు ముహమ్మద్ (సల్లం) వ్యవహారంతో బాగా విసిగిపోయినట్లు కన్పిస్తున్నారు” అన్నది ఆ భారీకాయం.

“ఆ... మీరు చెబుతున్నది నిజం. ముహమ్మద్ కొత్త మతాన్ని లేవదీసి మా జాతిలో, మా మతాచారాల్లో గందరగోళం సృష్టించాడు. అతడ్ని వదలించులేక మా ఖురైషీయులు సతమతమవుతున్నారు” అన్నాడు అబూలహబ్.



“బహుశా మీరు నన్ను గుర్తుపట్టలేదనుకుంటాను.”

“మిమ్మల్ని గుర్తుపట్టకపోవడం ఏమిటీ? మిమ్మల్ని గురించి ఎవరికి తెలియదనీ! మీరు యావత్తు అరేబియాలోనే పేరుమోసిన మాంత్రికుడు జిమాద్. యమన్ దేశంలోని సుప్రసిద్ధ అజ్ద్ తెగ నాయకులు కూడా” చెప్పాడు అబూలహబ్.

“మీరు నన్ను బాగా గుర్తుపెట్టుకున్నారు. మీరన్నట్లు నేను నిజంగా అరేబియాలో గొప్ప ఇంద్రజాలికుడ్ని. మీ ముహమ్మద్‌కు ఎవరో చేతబడి చేసిఉంటారు. మీరేమీ విచారించకండి. నేను నా మంత్రబలంతో దాన్ని పోగొడ్తాను” అన్నాడు జిమాద్.

“మీరు నా తమ్ముడి కొడుక్కు పట్టిన దయ్యం వదలగొట్టి, కొత్తమతాన్ని ప్రచారం చేయనీయకుండా అతడ్ని ఆపగలిగితే నేను మీకు వంద ఒంటెలతో పాటు వందవరహాలు బహుమానంగా ఇచ్చుకుంటాను.”

“మీరు నాకు పెద్దఆశే చూపిస్తున్నారు. సరే లాత్, ఉజ్జాల సాక్షి! నేను మీ ముహమ్మద్‌కు పట్టిన భూతం వదలగొడ్తా. తర్వాత మీరు మీ వాగ్దానానికి కట్టుబడిఉండాలి సుమా!”

“నేనొక్కడ్నే కాదు, వలీద్, ఉత్బా, అబూసుఫ్యాన్ వగైరా నాయకులు కూడా మీకు బహుమానాలు ఇస్తారు” అన్నాడు అబూలహబ్.

“కొంచెం ఆగండి, నేను మీకు నా మంత్రప్రతిభ చూపిస్తాను” అన్నాడు జిమాద్.

“ఇక్కడ నేనొక్కడ్ని చూస్తే ఏంలాభం? మా శిబిరానికి పదండి. అక్కడ మా ఖురైష్ నాయకుల్ని కూడా పిలిపిస్తాను. వారందరి ముందు ప్రదర్శిస్తే బాగుంటుంది.”

ఇలా మాట్లాడుకుంటూ వారిద్దరు శబిరానికి చేరుకున్నారు. అబూలహబ్ ఖురైష్ నాయకులందరినీ పిలుచుకు రమ్మని ఇద్దరు బానిసలను పంపించాడు. కాస్సేపటికి ఖురైష్ నాయకులంతా అబూలహబ్ శిబిరానికి చేరుకున్నారు. శిబిరం ముందు తివాచీలు పరచి ఖురైషీయులందరూ కూర్చున్నారు. జిమాద్ వారి మధ్య నిలబడ్డాడు. ఇంద్రజాల ప్రదర్శనం గురించి విన్న ఇతరులు కూడా వందలసంఖ్యలో వచ్చి చేరారు.

“జనులారా! నేను యావత్తు అరేబియాలోనే ప్రసిద్ధి చెందిన ఇంద్రజాలకుడ్ని. దేశంలోని మాంత్రికులంతా గర్వంతో నన్ను తమ గురువుగా చెప్పుకుంటారు. అంచేత మీకందరికీ నా పేరు తెలిసేఉంటుంది” అన్నాడు జిమాద్.

“తెలుసు. తెలుసు. మీ పేరు జిమాద్” అన్నారు జనమంతా ముక్తకంఠంతో.

“నేను మాంత్రికుడ్ని మాత్రమే కాదు, ప్రముఖ కవిని కూడా. మీకు నా పేరు మాత్రమే తెలిసిఉంటుంది. ఈరోజు నా మంత్రవిద్య ప్రదర్శిస్తాను చూడండి. సరే, మీరంతా ఓసారి తలపైకెత్తి చూడండి. ఆకాశం నిర్మలంగా ఉంది. సూర్యుడు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాడు. గాలి స్తంభించిపోయింది. ఎండకు చెమటలు కారుతున్నాయి ఔనా?”

“ఔనౌను” జనం అరిచి చెప్పారు.

“ఇప్పుడు చూడండి. ఆకాశంలో ఓ నల్లటి చుక్క కన్పిస్తోంది” అన్నాడు జిమాద్.

జనం ఆకాశంలో చూస్తే అక్కడ నిజంగానే నల్లటి చుక్క కన్పించింది. జిమాద్ ఆ చుక్క వైపే చూస్తూ ఏవో మంత్రాలు పఠిస్తున్నాడు. దాంతో ఆ చుక్క క్రమంగా విస్తరిస్తూ మబ్బుతునకగా మారింది. ఆ తరువాత మెల్లగా గాలి వీచడం మొదలెట్టింది. ఆ మబ్బు తునక క్రమేణా విస్తరిస్తూ అక్కడి మైదానాన్ని క్షణాల్లో కప్పివేసింది.

ప్రజలు నోరు తెరచి సంభ్రమాశ్చర్యాలతో చూడసాగారు.

ఆ తరువాత సూర్యుడు పూర్తిగా కనుమరుగైపోయాడు. ఆ వెనువెంటనే చల్లటిగాలి రివ్వున వీచింది. "వర్షించు, బాగా వర్షించు. ఒక్కచుక్క కూడా కింద పడనీకుండా వర్షించు" అన్నాడు జిమాద్.

చిటపట చినుకులతో వర్షం మొదలైంది. ఏకధాటిగా వర్షం కురుస్తోంది. జనమంతా శూన్యంలో నీటిధారలు చూస్తున్నారు. కాని ఒక్క చుక్క కూడ క్రింద పడటం లేదు.

"పిశాచ పటాలం అరబ్బుల్ని ఆశ్చర్యపరుస్తూ ఆర్భాటంగా వారి ముందు నుంచి నడవాలి, చకచకా నడవాలి" అన్నాడు జిమాద్.

ప్రదర్శన మైదానం తూర్పు వైపున నల్లతెర చీల్చుకుంటూ చిత్రవిచిత్రమైన భయంకర ఆకారాలు గాలిలో తేలుతూ ఉరిమురిమి చూస్తూ మైదానంలోకి రాసాగాయి. అలా మైదానం రెండవ చివరికి పోయి అదృశ్యమవుతున్నాయి.

జనం సంభ్రమాశ్చర్యాలతో మట్టిబొమ్మల్లా చూస్తున్నారు. స్త్రీలు భయపడి కళ్ళు మూసుకున్నారు.

కాస్సేపటికి ఆ ఆకారాలన్నీ మైదానం రెండవ కొనకు వెళ్ళి అదృశ్యమై పోయాయి. ఆ తర్వాత కారుమబ్బులు ఒక్కసారిగా విడిపోయాయి. సూర్యుడు మళ్ళీ వాడి కిరణాలతో ప్రత్యక్షమయ్యాడు. గాలి స్తంభించిపోయింది. జనానికి చెమటలు కారసాగాయి.

"జిమాద్! నువ్వు నిజంగా గొప్ప మాంత్రికుడవోయ్. నీ మంత్రబలంతో ముహమ్మద్ ని బాగుచేస్తావని నాకిప్పుడు పూర్తిగా నమ్మకం కుదిరింది" అన్నాడు అబూలహబ్.

"అయితే ముహమ్మద్‌ని ఇక్కడకు తీసుకురాగల్గితే తీసుకురండి. నేను వీలైనంత త్వరగా అతని దయ్యాన్ని వదలగొడ్తాను."

"ఇప్పుడే పిలిపిస్తాను" అంటూ అబూలహబ్ ఒక బానిసను పంపాడు. ఆ బానిస వెళ్ళి కాస్సేపటికి మహనీయ ముహమ్మద్ (స)ని పిలుచుకొని వచ్చాడు.

"ముహమ్మద్! ఈ కొత్త వ్యక్తి ఎవరో నీకు తెలుసా?" అని అడిగాడు అబూలహబ్ జిమాద్ వైపు చూపిస్తూ.

"తెలియదు ఈయన ఎవరో" అన్నారు దైవప్రవక్త (సల్లం).

"నే జెప్తాను. ఈయన యమన్ పౌరుడు. పేరు జిమాద్. గొప్ప మాంత్రికుడు. నీకేదో పిశాచం ఆవహించిందని విని దాన్ని వదలగొట్టడానికి వచ్చాడు ఈయన."

ఈ మాటలు విని దైవప్రవక్త (సల్లం) చిరునవ్వు నవ్వారు.



"పెదనాన్నా! నాకెలాంటి పిశాచం ఆవహించలేదు. నువ్వు అనవసరంగా మోస పోతున్నావు. నేను దేవుని సందేశహరుడ్ని. ఆయన దాసుడ్ని" అన్నారు ఆయన.

"మళ్ళీ అదే పాతపాట పాడుతున్నావు. సరేలే ఓసారి ఆయన ముందుకు పోయి నిలబడు."

దైవప్రవక్త (స) ఎలాంటి సంకోచం లేకుండా జిమాద్ ముందుకు పోయి నిల్చున్నారు.

జిమాద్ ఓసారి దైవప్రవక్త (సల్లం)ను ఆపాదమస్తకం పరికించి చూశాడు. కాని అతను ఆ మహనీయుని కళ్ళలోకి సూటిగా చూడలేక ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

"జిమాద్! మహామాంత్రికుడా! ఇంతకూ నా గురించి నువ్వేమి చెప్పదలిచావు?" అన్నారు దైవపవక్త (స) గంభీర స్వరంతో.

"మ్మి...మ్మి....మీ మీద ఓ పెద్ద పిశాచం ఆవహించింది. న్నే....న్నే...నేనొక మంత్రం చదువుతా, మీరు వినండి" అన్నాడు జిమాద్ తడబడుతున్న కంఠంతో.

"జిమాద్! నాకెలాంటి పిశాచం ఆవహించలేదు. నువ్వు నీ మంత్ర విద్యతో ప్రజలను ఆశ్చర్యపరచగలవు. కాని నేను దైవప్రవక్తను. నా నోటి నుండి వెలువడే దైవవాణి ఎలాంటి మనిషినైనా ప్రభావితం చేస్తుంది. ముందుగా నేను దైవవాణి విన్పిస్తాను. తరువాత నీవు నీ మంత్రాన్ని పఠించు" అన్నారు దైవప్రవక్త (సల్లం) చిరునవ్వు నవ్వుతూ.

"ఆ... అలాగే ముందు మీరే విన్పించండి" అన్నాడు జిమాద్ వాడిన ముఖంతో.

"సకల విధాల ప్రశంసలు దేవునికి మాత్రమే శోభిస్తాయి. కనుక మేము ఆయన్నే స్తుతిస్తాం. ఆయన సహాయమే అర్థిస్తాం. దేవుడు ఎవరికి సన్మార్గం చూపదలచుకుంటాడో అతడ్ని ఎవరూ అపమార్గంలో పడవేయలేరు. అలాగే దేవుడు ఎవరిని అపమార్గంలో పడేలా చేయదలచుకుంటాడో అతడ్ని ఎవరూ సన్మార్గంలో పెట్టలేరు. ఏకేశ్వరుడయిన ఆ దేవుడు తప్ప మరేఆరాధ్యుడు లేడని, ఆయనకు ఎవరూ సాటి లేరని నేను సాక్ష్య మిస్తున్నాను. ముహమ్మద్ దేవుని దాసుడని, ఆయన సందేశహరుడని కూడా నేను సాక్ష్యమిస్తున్నాను" అన్నారు దైవప్రవక్త (సల్లం).

జిమాద్ దైవవాణి విని ఆశ్చర్యపోతూ "ఏది మరోసారి విన్పించండి" అన్నాడు.

దైవప్రవక్త (సల్లం) పై మాటలనే పునరుక్తం చేసి విన్పించారు.

"ఎంత మధురమైన వాణి ఇది! దయచేసి ఇంకొక్కసారి విన్పించండి."

దైవప్రవక్త (సల్లం) మూడవసారి కూడా అవే మాటలు విన్పించారు.

"నేను నా జీవితంలో అనేకమంది మాంత్రికుల్ని, జోతిష్కుల్ని, కవుల్ని చూశాను. వారి మాటలు విన్నాను. కాని ఇలాంటి మధురమైన, ప్రభావవంతమైన వాణిని మాత్రం నేను ఎవరినోటా వినలేదు. నిస్సందేహంగా మీరు దేవుని సందేశహరులే. నేను మిమ్మల్ని, మీ దేవుడ్ని విశ్వసిస్తున్నాను. చేయిజాపండి. నేను ఇస్లాం స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాను" అన్నాడు జిమాద్.

జిమాద్ అప్పటికప్పుడు సద్వచనం పఠించి ముస్లిం అయిపోయాడు. తర్వాత ఆయన జనసమూహాన్ని ఉద్దేశించి ఇలా అన్నారు:

"మిథ్యాదేవతల పూజారులలారా! వినండి. బాగా వినండి. మహనీయ ముహమ్మద్ (సల్లం)కు ఎలాంటి భూతపిశాచాలు ఆవహించలేదు. ఈయన దైవసందేశహరుడు. దేవుని తరపున ఆయన దాసులకు రుజుమార్గం చూపడానికి వచ్చిన దైవప్రవక్త (సల్లం). అందువల్ల నేను ముస్లింనయ్యాను. మీరు కూడా ఇస్లాం స్వీకరించి ముస్లింలుగా మారండి. ముస్లింలుగా మారి మానవులుగా మనుగడ సాగించండి."

ఈ మాటలు వినగానే అబూలహబ్ కస్సున లేచాడు.

"మోసం! దగా!! నువ్వు ముహమ్మద్‌ని బాగుచేస్తానని చెప్పి మమ్మల్ని మోసగించావు. నువ్వు ముస్లిం కావడమేగాకుండా ఇతరుల్ని కూడా ముస్లింలయిపొమ్మని చెబుతున్నావా? సామూహిక రక్తపాతం జరుగుతుందన్న భయం గనక లేకపోతే, నేను ఇప్పుడే నిన్ను పట్టుకొని హతమార్చివేసేవాడ్ని" అన్నాడతను జిమాద్ (రజి)పై మండిపడుతూ.

"ఓరీ ద్రోహీ! నువ్వసలు నీ పేరుప్రతిష్ఠలకు, హోదాఅంతస్థులకు భంగం కల్గుతుం దన్న భావనతో ముస్లింకావడానికి భయపడుతున్నావు. నీ నరనరాల్లో ప్రాపంచికవ్యామోహం నిండి పోయిఉంది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. విషయం అర్థంచేసుకొని ముస్లిం అయిపో. లేకుంటే చాలా పశ్చాత్తాపపడతావు" అన్నారు హజ్రత్ జిమాద్ (రజి).

"నీచుడా! నన్నే ఇలా అంటావా! ఉండు నీ నాలుక చీరేస్తాను" అంటూ అబూలహబ్ ఆగ్రహోదగ్రుడయి జిమాద్ (రజి) మీదికి లంఘించబోయాడు.

"ఆగు. మరోఅడుగు ముందుకు వేశావా....... నీకీ రోజుతో నూకలు చెల్లినట్లేనని తెలుసుకో. నేను జిమాద్‌ని, అరేబియా మొత్తంలోనే పేరుమోసిన ఇంద్రజాలికుడ్ని."

జిమాద్ (రజి) మాటలు వినగానే అబూలహబ్ భయపడిపోయాడు. ఠక్కున ఆగి పోయాడు. అతను ఇంతకుముందే జిమాద్ మంత్ర శక్తి చూసి ఉండటంతో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేక దూషిస్తూ నిలబడిపోయాడు. అబూలహబ్, అతని సహచరులు కూడా జిమాద్ (రజి) ప్రదర్శించిన మంత్రవిద్య చూసివున్నందువల్ల దాని ప్రభావం ఇంకా వారి మస్తిష్కాల నుంచి చెరిగిపోలేదు. అంచేత వారాయనకు వ్యతిరేకంగా ఎలాంటి చర్య తీసుకోలేక నిశ్చేష్టులై చూడసాగారు.

హజ్రత్ జిమాద్ (రజి) దైవప్రవక్త (స) అనుమతి తీసుకొని యమన్ వెళ్ళిపోయారు. కాస్సేపటికి దైవప్రవక్త (సల్లం) కూడా అక్కడ్నుంచి కదలి మక్కా వెళ్ళిపోయారు.

## తుఫైల్ దౌసీ పరివర్తన-(58)

అలాంటి అదృష్టవంతుల్లో తుఫైల్ బిన్ అమ్ర్ దౌసి కూడా ఉన్నాడు. ఈయన ఉన్నతవంశానికి చెందిన ప్రముఖ కవి. మంచిచెడుల విచక్షణాజ్ఞానం కలిగిన గొప్పమేధావి. యమన్ ప్రాంతంలో నివసించే దౌస్‌తెగకు నాయకుడు కూడా. ఆ ప్రాంతానికి అతను స్వతంత్ర ప్రతి పత్తిగల చిన్నపాటి రాజు.



అతను ఓసారి కొందరు అనుచరులతో కాబాదర్శనం కోసం మక్కా పట్టణానికి వచ్చాడు. ఈ సంగతి తెలిసిన ఖురైషీయులు వెంటనే బయలుదేరి పట్నం వెలుపలే అతనికి ఘనంగా స్వాగతం చెప్పారు. ఆయన పట్ల తమకు ఎంత గౌరవాభిమానా లున్నాయో చెప్పుకున్నారు. తుఫైల్ కోసం ఖురైష్ నాయకులతో పాటు జనసామాన్యం కూడా వందలసంఖ్యలో వచ్చారు. తర్వాత అందరూ కలసి అతడ్ని ఊరేగింపుగా పట్టణానికి తీసుకొచ్చారు.

పట్నంలో ప్రవేశించగానే ఖురైష్ నాయకులు దైవప్రవక్త (సల్లం) గురించి, ఇస్లాం గురించి అతనికి దుర్బోధ చేశారు. ముహమ్మద్ పెద్ద మాంత్రికుడని, ఒక్కసారి గనక అతని నోట వెలువడే వాణి వింటేచాలు, మనిషి ఇట్టే అతని వలలో పడిపోతాడని, అంచేత అతనికి కాస్త దూరంగా ఉండాలని మరీమరీ హెచ్చరించారు. తుఫైల్ ఈ దుర్బోధకు గురయి నిజమే కాబోలు అనుకున్నాడు.

చివరికి ఈ జనసమూహం కాబాలయానికి చేరుకుంది. తుఫైల్ ఖురైష్‌నాయకులతో కలసి ఆలయంలో ప్రవేశించాడు. అక్కడ దైవప్రవక్త (స) ఓచోట నమాజ్ చేస్తూవుండటం చూశాడు. ఎందుకైనా మంచిదని దూది తెప్పించుకొని రెండు చెవుల్లో పెట్టుకున్నాడు. ఆ తరువాత కాబా ప్రదక్షిణ చేయడం ప్రారంభించాడు. కాబా ప్రదక్షిణ ముగిసిన తరువాత ఖురైషీయులతో కలసి అతిథి గృహానికి వెళ్ళిపోయాడు.

కొన్నాళ్ళ తరువాత తుఫైల్ మళ్ళీ కాబా ప్రదక్షిణ కోసం వచ్చాడు. అప్పుడు అతని వెంట అతని సహచరులు మాత్రమే ఉన్నారు. అతను చెవుల్లో దూది పెట్టుకొని కాబా ప్రదక్షిణ చేయడం ప్రారంభించాడు. అలా ప్రదక్షిణ చేస్తూ దైవప్రవక్త (సల్లం) సమీపంగా పోవలసి వచ్చింది. అప్పుడు యాదృచ్ఛికంగా ఖుర్ఆన్ వాక్యమొకటి చెవిలో పడనే పడింది. కాని అందులో ఖురైషీయులు చెప్పినట్లు ఏ చెడూ ఉన్నట్లు అన్పించలేదు. అంచేత రెండు క్షణాలు అక్కడే నిలబడి జాగ్రత్తగా ఆలకించాడు. దైవవాణి చెవులకు ఇంపుగా సోకింది. దాంతో తుఫైల్ ఆలోచనలో పడ్డాడు.

"అయ్యయ్యో! నేనెంత అమాయకుడ్ని. నేను గొప్పకవిని. మంచీచెడులు, సత్యాసత్యా లను విచక్షణచేసే జ్ఞానం, ఆలోచించే మేధా, విజ్ఞతావివేచనలు కూడా ఉన్నవాడ్ని. మరి ఈయన మాటలు ఎందుకు వినకూడదు? మంచిమాటలైతే సరే, మంచివి కాకపోతే తిప్పికొట్టవచ్చు" అనుకున్నాడు మనసులో తుఫైల్.

దైవప్రవక్త (సల్లం) నమాజు చేసి ఇంటికి బయలుదేరారు. తుఫైల్ ఆయన వెనకాల నడిచి ఆయన ఇంటికి చేరుకున్నాడు. తనను ఖురైషీయులు భయపెట్టి చెప్పిన మాటలన్నీ దైవప్రవక్త (సల్లం)కు విన్పించాడు. దైవప్రవక్త (సల్లం) అతడ్ని ఎంతో ఆదరించి ఖుర్ఆన్ సూక్తులు విన్పించారు.

దాంతో తుఫైల్ మానసాకాశం జ్ఞానజ్యోతితో ప్రకాశవంత మయింది. దైవప్రవక్త (సల్లం) ఖుర్ఆన్ పఠనం ముగించి, ఇస్లాం స్వీకరణ గురించి హితోపదేశం చేశారు. తుఫైల్ దౌసీ ఏమాత్రం సంకోచించకుండా వెంటనే ఇస్లాం స్వీకరించాడు.

“దైవప్రవక్తా! నా తెగలో నాకు మంచి పలుకుబడి ఉంది. అందరూ నన్ను ఎంతగానో గౌరవిస్తారు. నేను ఏది చెప్పినా విని వెంటనే దాన్ని అమలుపరుస్తారు. ఇప్పుడే పోయి నేను వారికి ఇస్లాం వైపు ఆహ్వానిస్తాను” అన్నారు తుఫైల్ (రజి) అమితోత్సాహంతో.

“చాలా సంతోషం” అన్నారు దైవప్రవక్త (సల్లం) పరమానందంతో.

“దైవప్రవక్తా! మీజాతివాళ్ళు మిమ్మల్ని వేధిస్తూ మీజీవితం దుర్భరం చేశారని విన్నాను. అంచేత మీరు, మీ అనుచరులు అందరూ నాదగ్గరకు వచ్చేయండి. మా దేశంలో మీరు ప్రశాంతంగా దైవారాధన చేయవచ్చు. చీకూచింతా లేకుండా హాయిగా గడపవచ్చు.

“మక్కా ఖురైషీయులు మాదేశంలో ఏముస్లింపై కూడా చేయిచేసుకునే దుస్సాహసానికి పాల్పడలేరు. అదీగాక నేను నా కిరీటం మీ శిరస్సుపై ఉంచుతాను. నా దేశం మీ దేశమవుతుంది. నా ప్రజలు ముస్లింలై మీకు విధేయులైఉంటారు. నేను మీకు బానిసనై సేవచేస్తూ ఉంటాను” అన్నారు హజ్రత్ తుఫైల్ బిన్ అమ్ర్ దౌసీ (రజి).

“నీ సానుభూతికి కృతజ్ఞుడ్ని. నాకుగాని, ఇతర ముస్లింలకుగాని ఎలాంటి హోదా, అధికారకాంక్షలు లేవు. నేను దైవాజ్ఞ లేకుండా ఏపనీ చేయలేను. ఆయన ఆజ్ఞ అయినప్పుడు మాత్రమే మేము మక్కా నుండి వలసపోతాం. ఇప్పుడు నీవు చేయవలసిందల్లా ఒక్కటే. నీవు నీదేశానికి వెళ్ళిపో. అక్కడ నీ ప్రజలకు దైవసందేశం అందజేసి వారిని ఇస్లాం స్వీకరించేలా ఒప్పించు. అయితే ఈ విషయంలో వారిని బలవంతం చేయడంగాని, మరెలాంటి వత్తిడి తీసుకురావడంగాని జరగకూడదు” అన్నారు దైవప్రవక్త (స).

“అలాగే మీ ఆదేశానుసారం చేస్తాను. నేనీ రోజే బయలుదేరి వెళ్తాను. పోగానే ఇస్లాం ప్రచారం ప్రారంభిస్తాను” అన్నారు హజ్రత్ తుఫైల్ దౌసి (రజి).

ఆ తర్వాత హజ్రత్ తుఫైల్ బిన్ అమ్ర్ దౌసి (రజి) దైవప్రవక్త (స) దగ్గర సెలవు తీసుకొని యమన్‌కు వెళ్ళిపోయారు. స్వస్థలం చేరుకోగానే ముందుగా ఆయన తన గృహస్థులకు ఇస్లాంసందేశం విన్పించి దాన్ని స్వీకరించమని చెప్పారు. ఆయనంటే అపార గౌరాభిమానాలుగల కుటుంబసభ్యులు తక్షణమే ఇస్లాం స్వీకరించారు. తర్వాత ఆయన చేసిన హితబోధతో ఆయన తెగ ప్రజలంతా కొన్నాళ్ళలోపే ఇస్లాం స్వీకరించారు.

అవిశ్వాసుల ఆశలు అడియాశలయ్యాయి. వారి పన్నాగాలు పటాపంచలైపోయాయి. తుఫైల్ దౌసీ (రజి) వంటి ప్రముఖ నాయకుడు, గొప్పమేధావి నూతనధర్మం స్వీకరించడంతో మక్కా బహుదైవారాధకులు నీరుకారిపోయారు.

## ఔస్, ఖజ్రజ్ తెగల మధ్య చిచ్చు-(59)

మదీనాలో ఔస్, ఖజ్రజ్ తెగల మధ్య చాలాకాలం నుంచి యుద్ధజ్వాలలు ప్రజ్వరిల్లుతున్నాయి. ఈజ్వాలలు ఆ తెగలవరకే పరిమితమై ఉండలేదు. పొరుగున ఉన్న యూదులు కూడా ఆ అగ్నికి ఆజ్యంపోసి, అందులో తమపాత్ర పోషించుకుంటున్నారు. ఒకసారి ఔస్, ఖజ్రజ్‌ల మధ్య యుద్ధం జరిగితే, మరోసారి ఔస్, యూదుల మధ్య జరిగేది. వేరొకసారి యూదులు, ఖజ్రజ్‌ల మధ్య చెలరేగేది. ఈ విధంగా మదీనాలో ఎల్లప్పుడూ



ఎడతెగకుండా సంఘర్షణ సాగుతోంది. ఒక దాని యుద్ధ జ్వాలలు పూర్తిగా ఆరక ముందే మరొకటి విజృంభిస్తోంది.

కుట్రలు, కుయుక్తులు పన్నడంలో సిద్ధహస్తులైన యూదులు తమకు ఎలాంటి నష్టం జరగకుండా, తమ నాయకత్వానికి ఏమాత్రం ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు యుద్ధతంత్రం మార్చివేశారు. ఔస్, ఖజ్రజ్ తెగల మధ్య పరస్పరం అపార్థాలు, అసూయా జ్వాలలు రేకెత్తించి, తమ జోలికి రాకుండా ఎల్లప్పుడూ వారిలోవారే కలహించుకునేలా ఓ పన్నాగం పన్నారు.

తత్ఫలితంగా ఆ రెండు తెగలు పరస్పరం బద్ధశత్రువులయ్యాయి. ప్రతితెగ ప్రత్యర్థి తెగను సమూలంగా తుడిచిపెట్టడానికి ఆరాటపడసాగింది. ప్రతి చిన్న విషయానికి తగవులు పెట్టుకొని ఏండ్ల తరబడి పోరాడుకుంటున్నారు. యూదులు పన్నిన ఈ కుట్ర కారణంగా ఇదివరకటి వారి పరస్పరసోదరభావం, స్నేహసంబంధాలు విచ్ఛిన్నమయిపోయాయి. అపార ధనప్రాణాల నష్టం జరిగింది. అయినా వారికి స్పృహ రాలేదు. రక్తపుటేరులో తమ అహంభావ నావలు నడపడమే ధ్యేయంగా పెట్టుకున్నారు.

యూదులు అప్పటికీ తృప్తి చెందలేదు. ఔస్, ఖజ్రజ్‌లను మరింత బలహీనపరచి ఓడిన తెగతో విరోధం పెట్టుకొని, గెలిచిన తెగను ఉసిగొల్పేవారు. వ్యాపారాది ముఖ్య వ్యవహారాల్లో కీలకమైన పనులు తమ చేతుల్లో ఉంచుకొని, లాభాలు అంతగా ఉండని చిన్నచిన్న పనులు ఔస్, ఖజ్రజ్‌లకు వదలిపెట్టేవారు. ఇలా యూదులు వారిపై పెత్తనం చెలాయించ సాగారు.

ఈ యూదులు మూసా ప్రవక్త (అలైహి) అనుచరులు; తౌరాత్ గ్రంథం కలవారు. ఔస్, ఖజ్రజ్ తెగలు విగ్రహారాధకులు. అందువల్ల యూదులు తమ గొప్పతనాన్ని మహాగర్వంగా చెప్పుకునేవారు. ఔస్, ఖజ్రజ్‌లను నీచంగా చూస్తూ, వారి ఎదుట కర్మల పర్యవసానం గురించి భయంకరంగా చిత్రీకరించేవారు.

అదీగాక అంతిమ దైవప్రవక్త గురించి తమ గ్రంథాల్లో ఉన్న భవిష్యత్ ప్రకటనలు విన్పిస్తూ “త్వరలోనే ఒక దైవప్రవక్త ప్రభవించబోతున్నాడు. మేమంతా ఆయన పక్షం ఉంటాం. అప్పుడు మీకు ఎలాంటి గతి పడ్తుందో ఊహించుకోండి” అని చెప్పేవారు.

ఈవిధంగా అనేక సంవత్సరాలు గడిచాయి. ఔస్ ప్రతినిధివర్గం ఖురైషీయులను తమ పక్షంలోకి కలుపుకోవడానికి మక్కా వచ్చినప్పుడు కూడా ఈ తెగల పరిస్థితి అలాగే ఉంది. ఆ సమయంలోనే దైవప్రవక్త (స) ఔస్ ప్రతినిధివర్గాన్ని కలుసుకొని ఇస్లాం సందేశం అందజేశారు. ప్రతినిధివర్గంలోని ఆయాస్ బిన్ ముఆజ్ (రజి) అప్పటికప్పుడే ఇస్లాం స్వీకరించి ముస్లిం అయ్యారు. కాని మిగతాసభ్యులు దైవప్రవక్త (స)ను విశ్వసించడానికి ముందుకు రాలేదు. అప్పుడు వారికి యుద్ధం తప్ప మరో ధ్యాస లేదు.

“ఔస్ ప్రతినిధివర్గం ఆరోజు దైవప్రవక్త (స) మాటల పట్ల ఆసక్తి కనబరచలేదు. కాని మదీనా తిరిగొచ్చిన తర్వాత ప్రవక్తప్రవచనాలు వారి హృదయాలను ప్రభావితం చేశాయి. ఆ మధురవచనాలే వారి చెవుల్లో మాటిమాటికి ప్రతిధ్వనించసాగాయి.

అయితే అవి ఒక రూపం దాల్చకముందే ఔస్, ఖ్రజ్‌ల మధ్య మళ్ళీ యుద్ధ జ్వాలలు చెలరేగాయి. కొన్నిరోజుల్లోనే రణరంగం భీకరంగా మారింది. ఇక రెండు మూడు రోజుల్లో తమ సర్వస్వం యుద్ధాగ్నికి బలయి, తాము కూడా భస్మీపటలం కాబోతున్న తరుణంలో అదృష్టం కలిసొచ్చి ఔస్‌తెగకు యూదులు తోడ్పడ్డారు. వారి సహాయంతో విజయం సాధించారు. యుద్ధజ్వాలలు చల్లారిపోయాయి.

అప్పుడు రెండు తెగల ప్రజలు తమ తమ పరిస్థితులపై దృష్టి సారించారు. యుద్ధ ప్రభావం గురించి ఆలోచించి లాభనష్టాలు బేరీజు వేసుకున్నారు. లాభం సంగతేమోగాని, అపారమైన నష్టం జరిగింది. జరిగిన నష్టం గ్రహించి ఉభయ తెగలవాళ్ళు వాపోయారు. ఎంతో ప్రాణనష్టం జరిగింది. అంతులేని ఆస్తులు యుద్ధాగ్నికి ఆహుతి అయ్యాయి. శక్తి, శ్రమ, సామర్థ్యం సర్వం వృధాఅయ్యాయి. మదీనాలో వారి పలుకుబడి తగ్గిపోయింది. నాయకత్వం కూడా చేజారిపోయింది. తాము యూదులకు బానిసలైనట్లు భావించారు. చివరికి గెలిచిన తెగ కూడా యూదులకు లోకువ అయింది.

యుద్ధం వల్ల రెండు తెగల్లో ఏ తెగకూ లాభం కలగలేదు. బయట ఉండి తమాషా చూస్తుండిన యూదులు మాత్రం ఈ అవకాశాన్ని తమకు అనుకూలంగా మలచుకున్నారు.

యుద్ధం తెచ్చిన భయంకర దుష్ఫలితాలతో రెండు తెగలకు కనువిప్పు కలిగింది. విడిపోయినందువల్ల జరిగిన నష్టం ఏమిటో అర్థమయింది. ఒకరిపై ఒకరికి జాలి కలిగింది. "ఇకనుంచి మనమంతా కలసికట్టుగా ఉందాం. ఆప్యాయతతో మెలుగుదాం. అవసర మొస్తే పరస్పరం సహాయసహకారాలు అందజేసుకుందాం" అని నిర్ణయించుకున్నారు. ఆ మేరకు రెండు తెగల మధ్య ఒప్పందం జరిగింది. రెండు తెగలకు కలిపి ఒకే నాయకుడు ఉండాలని కూడా నిశ్చయించుకున్నారు.

అప్పుడు వారిదృష్టి అబ్దుల్లా బిన్ ఉబై మీద పడింది. అతను ఖ్రజ్ తెగకు చెందిన వాడు. ప్రజల్లో బాగా పలుకుబడి కలవాడు. జనాన్ని ఆకట్టుకునే నేర్పు కూడా ఉంది. అంచేత అతని నాయకత్వాన్ని అందరూ ఆమోదించారు. పట్టాభిషేకం సమయంలో అత్యంత విలువైన కిరీటం పెట్టి అతడ్ని సత్కరించాలని, బ్రహ్మాండమైన ఊరేగింపు తీసి గౌరవించాలని కూడా అనుకున్నారు.

కాని అంతలో పరిస్థితులు చకచకా మారిపోసాగాయి. దైవనిర్ణయం మరో విధంగా ఉంది కాబోలు! ఔస్, ఖ్రజ్ తెగలకు వారనుకున్న దానికంటే ఎక్కువ గౌరవం, వైభవం వచ్చే ఏర్పాట్లు దైవికంగా ఒనగూడనారంభించాయి. దైవకారుణ్యం అంతిమ దైవప్రవక్త (సల్లం) రూపంలో అవతరించే శుభతరుణం ఆసన్నమయింది.

## మొదటి అఖ్బా శపథం-(60)

నబవీశకం 10వ యేట చివరినెలలో మదీనా నుండి ఖ్రజ్ తెగకు చెందిన ఆర్గురు మనుషులు కాబాయాత్ర నిమిత్తం మక్కాకు బయలుదేరారు. వారికి బనూనజ్జార్ తెగకు చెందిన ఇద్దరు వ్యక్తులు తోడయ్యారు. వీరిద్దరు దైవప్రవక్త తాత గారయిన అబ్దుల్



ముత్తలిబ్ వంశస్థులు. అందరూ మక్కా సమీపంలోని అఖ్బా అనే ప్రదేశానికి చేరుకొని మజిలీ చేశారు. ప్రజలకు దైవసందేశం అందజేసే ఉద్దేశ్యంతో బయలుదేరిన దైవప్రవక్త (స)కు అఖ్బాలో వీరు తారసపడ్డారు. దైవప్రవక్త (స) వాళ్ళను చూడగానే-

"ఎవరు మీరు? ఎక్కడ్నుంచి వస్తున్నారు?" అని అడిగారు.

"మేము ఖ్రజ్ తెగవాళ్ళం. మదీనా నుంచి వస్తున్నాం" అన్నారు వారు.

"మీరు ఖ్రజ్ తెగ మనుషులా? అంటే మీరు యూదుల పొరుగున ఉండే తెగవాళ్ళు కదూ?" అన్నారు దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం).

"ఆ.... ఔనండీ!" అన్నారు ఖ్రజ్ తెగవాళ్ళు తలాడిస్తూ.

"అలాగానా? అయితే కాస్సేపు కూర్చుంటారా మాట్లాడుకుందాం?"

"అలాగే కూర్చుంటాం చెప్పండి" అంటూ అందరూ దైవప్రవక్త (సల్లం)కు దగ్గరగా వచ్చి కూర్చున్నారు.

దైవప్రవక్త (స) వారికి సత్యధర్మం గురించి బోధించి, బహుదైవారాధనవల్ల కలిగే దుష్ఫలితాన్ని గురించి హెచ్చరించారు. ఇహలోకంలో చేసిన కర్మలకు మానవులు పరలోకం లో దేవుని ముందు బాధ్యులవుతారని, ఆ కర్మలను బట్టి పాపపుణ్యాల ఫలం అనుభవించ వలసి ఉంటుందని తెలియజేశారు. దైవసమ్మతమైన ధర్మం, దైవారాధన దైవవిధేయతల మార్గం, శ్రేయస్కరమార్గం ఒక్క ఇస్లాం మాత్రమేనని ఉద్బోధించారు. దేవుడు తనను ప్రవక్తగా నియమించి తనకు ఆయన సందేశం అందజేస్తున్నాడని తెలియజేసి, ఖుర్‌ఆన్ లోని కొన్ని సూక్తులు విన్పించారు.

దైవప్రవక్త (సల్లం) బోధ విని వారు మొదట ఆశ్చర్యపోయారు. తరువాత దైవవాణి మెల్లిగా వారి హృదయవీణను మీటింది.

"యూదులు త్వరలో ఒక ప్రవక్త ప్రభవించబోతున్నాడని, ఆయన సహాయంతో మనల్ని అణచివేస్తామని భయపెడుతూ వచ్చారు. అలా వారు భయపెడ్తున్న ప్రవక్త నిస్సందేహంగా ఈయనే. దైవసాక్షి! ఇక వారు దైవప్రవక్త పట్ల విశ్వాసంలో మనల్ని మించి పోలేరు" అన్నారు వారు అప్రయత్నంగా.

తర్వాత వారు ఇస్లాంని విశ్వసిస్తున్నట్లు ప్రకటించారు. వారిపేర్లు: (1) అబూఉమామా అసద్ బిన్ జెరారా, (2) ఔఫ్ బిన్ హారిస్, (3) రాఫె బిన్ మాలిక్, (4) ఖుతబా బిన్ ఆమిర్ బిన్ హదీదా, (5) ఉఖ్బా బిన్ ఆమిర్ బిన్ నాలీ, (6) జాబిర్ బిన్ అబ్దుల్లా.

"దైవప్రవక్తా! మా జాతిలో ఉన్నంత చెడు, పగ, ద్వేషం ఏ జాతిలో కూడా లేదు. బహుశా దేవుడు విడిపోయిన మా హృదయాలను కలిపి మమ్మల్నందరినీ మీ చుట్టూ సమీకృతం చేయదలచి ఉండవచ్చు. మీకంటే ఉత్తముడు, నిజాయితీపరుడు, హృదయా లను చూరగొనేవాడు మరెవరూ లేరు. ఈ పని మీ ద్వారానే సాధ్యమవుతుంది" అన్నారు మదీనావాసులు విశ్వాసభాగ్యంతో పరవశించిపోతూ.

మదీనా వాసులు ఇస్లాం స్వీకరించినందుకు దైవప్రవక్త (స) పరమానందభరితులయ్యారు. సత్యధర్మం పట్ల వారు కనబరచిన ఆదరాభిమానాలు చూసి వారిని ఆయన ఎంతో కొనియాడారు. తనవారు సత్యాన్ని త్రోసిపుచ్చి తనను వేధిస్తుంటే, పరాయివారు సత్యాన్ని స్వీకరించి తనను గుండెలకు హత్తుకోవడానికి సిద్ధమయ్యారు.

మదీనావాసుల సంతోషం గురించి వేరే చెప్పనవసరం లేదు. సత్యధర్మం స్వీకరించి, సన్మార్గం అవలంబించామన్న ఆనందోత్సాహాలతో వారు మక్కా వెళ్ళి హజ్ చేశారు. ఆ తరువాత దైవప్రవక్త (స) ఆవిర్భావం గురించిన శుభవార్తను తమ జాతి జనానికి కూడా తెలియజేయాలనే నూతనోత్సాహంతో మదీనా తిరుగు ప్రయాణమయ్యారు.

మదీనా తిరిగిరాగానే ఔస్‌తెగవాళ్ళు అంతకుముందే ఈ శుభవార్త విన్నారని తెలిసిపోయింది. అంతేకాదు, ఎన్నో హృదయాలు నూతన ధర్మం కోసం ఆరాటపడుతున్నాయని, మరెన్నో హృదయాలు ఆ ధర్మాన్ని ఆశ్రయించి శాంతి పొందాలని ఉవ్విళ్ళూరుతున్నాయని తెలుసుకొని సంతోషించారు.

ఆ తరువాత నబవీశకం 11వ సంవత్సరం హజ్‌దినాలు సమీపించగానే ఔస్, ఖజ్రజ్ తెగలకు చెందిన పన్నెండు మంది వ్యక్తులు మక్కా బయలుదేరారు. మక్కాకు కొన్ని మైళ్ళ దూరంలోని అఖ్బా ప్రదేశంలో విడిదిచేశారు. ఇక్కడే దైవప్రవక్త (సల్లం) వీళ్ళను కూడా కలుసుకొని ఇస్లాం పరిచయం చేశారు. ఖుర్‌ఆన్‌లోని కొన్ని సూక్తులు విన్పించి, వారిని ఇస్లాంవైపు పిలిచారు. ఎప్పుడెప్పుడా అని చాతకపక్షుల్లా ఎదురుచూస్తున్న వీరు తక్షణమే ఇస్లాం స్వీకరించారు.

ఈ పన్నెండుమందిలో అయిదుగురు గత సంవత్సరం దైవప్రవక్త (సల్లం)ను కలసి ఇస్లాం స్వీకరించినవారే. మిగిలిన ఏడుగురు: (1) ముఆజ్ బిన్ హారిస్ (రజి), (2) జక్వాన్ బిన్ అబ్ద్ ఖైస్ (రజి), (3) ఉబాదా బిన్ సామిత్ (రజి), (4) యజీద్ బిన్ సాలబ (రజి), (5) అబ్బాస్ బిన్ ఉబాదా (రజి), (6) అబుల్ హషీం బిన్ తైహాన్ (రజి), (7) ఊయమ్ బిన్ సాయిదా (రజి).

తరువాత వారంతా ప్రమాణం చేసి ఇకముందు ఎన్నటికీ దైవానికి సాటికల్పించమని, దొంగతనానికి దూరంగా ఉంటామని, వ్యభిచారం చేయమని, సంతానాన్ని చేజేతులా చంపుకోమని, ఇతరుల మీద అపనిందలు మోపమని దైవప్రవక్త (స) ఎదుట శపథం కూడా చేశారు. దీన్ని "అఖ్బా శపథం-1" అంటారు.

ఆ తర్వాత దైవప్రవక్త (స) "ఈ శపథాన్ని కాపాడుకుంటే దేవుడు మీకు స్వర్గసౌఖ్యాలు ప్రసాదిస్తాడు. ఒకవేళ వాటిలో దేన్నయినా అతిక్రమిస్తే దాని పర్యవసానం విశ్వప్రభువు అభీష్టం మీద ఆధారపడిఉంటుంది. ఆయన తలచుకుంటే మిమ్మల్ని క్షమిస్తాడు" అని తెలియజేశారు. ఈ సంఘటన న.శ. పదకొండవ ఏట జరిగింది.

హజ్ చేసిన తర్వాత వారు తిరిగి మదీనా బయలుదేరారు. మదీనా ప్రజలకు ఖుర్‌ఆన్ వాణి విన్పించడానికి, ఇస్లాం గురించి వివరించడానికి, దైవాజ్ఞలను నేర్పడానికి దైవప్రవక్త (సల్లం) వారివెంట ముస్‌అబ్ బిన్ ఉమైర్ (రజి)ని పంపారు.



# మదీనాలో ముస్‌అబ్ (రజి) ప్రచారం-(61)

హజ్రత్ ముస్‌అబ్ బిన్‌ఉమైర్ (రజి) మదీనా చేరుకొని హజ్రత్ అసద్‌బిన్ జిరారా (రజి) ఇంట్లో విడిదిచేశారు. ఆ ఇంటినే ప్రచారకేంద్రంగా చేసుకొని పని ప్రారంభించారు. దాంతో మదీనాలో ఇస్లాం వేగంగా విస్తరించసాగింది. ఎంతోకాలం నుంచి సత్యపిపాసతో అలమటిస్తున్న మదీనావారికి ఇస్లాం శాంతి ప్రసాదించింది. ఇస్లాం శుభాలు చూడగానే, ఖుర్‌ఆన్ సూక్తులు వినగానే పాషాణహృదయాలు సైతం మైనంలా కరిగిపోసాగాయి.

ఔస్‌తెగలో బనీఅబ్దుల్ అష్‌హల్, బనీజఫర్ అనే రెండు ఉప తెగలున్నాయి. ఇవి మిగతా ఉపతెగలన్నిటిలో ఎంతో శక్తిమంతమైనవి. సాద్ బిన్ ముఆజ్ బనీఅబ్దుల్ అష్‌హల్ ఉపతెగ నాయకుడేగాక, ఔస్‌తెగలోని ఉపతెగలన్నిటికీ అగ్రనాయకుడిగా ఉన్నాడు. ఉసయ్యిద్ బిన్ హుజైర్ జఫర్‌తెగకు నాయకుడిగా ఉన్నాడు.

ఒక రోజు ముస్‌అబ్ బిన్ ఉమైర్ (రజి), అసద్ బిన్ జిరారా (రజి)లు బనీ అబ్దుల్ అష్‌హల్ వాడలో ఓబావి దగ్గర కూర్చొని మాట్లాడుకోసాగారు. సాద్ బిన్ ముఆజ్‌కు వారిద్దరు అలా తమ వాడలోకి వచ్చి ఇస్లాం ప్రచారం చేయడం ఏమాత్రం నచ్చలేదు. అందువల్ల ఆయన ఉసయ్యిద్ బిన్ హుజైర్‌ని పిలిచి ఇలా చెప్పాడు:

"అసద్ నా పినతల్లి కొడుకయినందున నేను గట్టిగా చెప్పి ఆ కొత్తమత ప్రచారాన్ని మాన్పించలేను. వీళ్ళు మనప్రజల్ని పెడదారి పట్టించి మతభ్రష్టులుగా చేయడానికి వస్తున్నారు. అంచేత నువ్వెళ్ళి నాలుగ చీవాట్లు పెట్టి ఇకముందు ఎప్పుడూ మన వాడలోకి రావద్దని వాళ్ళకు గట్టిగా చెప్పు."

ఉసయ్యిద్ బిన్ హుజైర్ వెంటనే కరవాలం తీసుకొని బయలుదేరాడు. అసద్ (రజి), ముస్‌అబ్ (రజి)ల దగ్గరకు వెళ్ళి వారిని నానా మాటలు అని బెదిరించాడు.

"అయ్యా! మీరు ఆవేశంలో ఉండి అసలు విషయాన్ని విస్మరిస్తున్నారు" అన్నారు హజ్రత్ ముస్‌అబ్ బిన్ ఉమైర్ (రజి).

"అసలు విషయం! ఏమిటా అసలు విషయం?" అన్నాడు ఉసయ్యిద్ ఉరిమి చూస్తూ.

"మీరు కాస్త ప్రశాంతంగా కూర్చుంటే చెబుతాను. రెండుమూడు మాటలు వింటే మీ కొచ్చే నష్టమేమీ లేదు. ఆ తరువాత మీ ఇష్టం, ఏదైనా చేసుకోవచ్చు."

"సరే చెప్పండి వింటాను" అంటూ ఉసయ్యిద్ వాళ్ళిద్దరికి ఎదురుగా కూర్చున్నాడు.

అప్పుడు ముస్‌అబ్ బిన్ ఉమైర్ (రజి) ఇస్లాం వాస్తవికతను కాస్త వివరించి ఖుర్‌ఆన్ నుంచి కొన్ని సూక్తులు పఠించి విన్పించారు. అంతే ఖుర్‌ఆన్ సూక్తులు వినగానే ఉసయ్యిద్ ఎంతో ప్రభావితుడయి అప్పటికప్పుడు ఇస్లాం స్వీకరించాడు.

"ఇంకొక మనిషి ఉన్నాడు. అతను కూడా ముస్లిం అయిపోతే ఇక మదీనాలో మిమ్మల్ని వ్యతిరేకించేవారే ఉండరు. నేనెళ్ళి అతడ్ని పంపిస్తాను ఉండండి" అని చెప్పి ఉసయ్యిద్ (రజి) అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

"ఆ.. ఏమయింది పోయిన పని? గట్టిగా చెప్పావా?" అడిగాడు సాద్ బిన్ముఆజ్ అతడ్ని చూడగానే.

"చెప్పాను. ముఖం వాచేలా చీవాట్లుపెట్టి మరీ చెప్పాను. మన అభిమతానికి వ్యతిరేకంగా ఎలాంటి పనీ చేయమని వారిద్దరు వాగ్దానం కూడా చేశారు. కాని అంతలో అక్కడ ఓ ప్రమాదం వచ్చిపడింది" అన్నారు హజ్రత్ ఉసయ్యిద్ బిన్ హుజైర్ (రజి).

"ప్రమాదమా! ఏమిటా ప్రమాదం?"

"బనీ హారిస్ తెగకు చెందిన కొందరు యువకులు అసద్ బిన్ జిరారాను చంప జూస్తున్నారు" అన్నారు ఉసయ్యద్ (రజి).

ఈ సంగతి వినగానే సాద్ ఖడ్గం తీసుకొని పరుగెత్తాడు. తీరా అక్కడకెళ్ళి చూస్తే ముస్అబ్, అసద్ (రజి)లు ఆ బావిదగ్గరే కూర్చొని హాయిగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

ఉసయ్యిద్ తనను మోసగించి ఇక్కడకు పంపించాడని సాద్ బిన్ ముఆజ్ వెంటనే గ్రహించాడు. ఈ ఆలోచన రాగానే కోపోద్రేకాలతో ఊగిపోతూ ముస్అబ్, అసద్ (రజి)లను శాపనార్థాలు పెట్టడం మొదలెట్టాడు.

"అయ్యా! మీరు ఆవేశంలో పడి అసలు విషయం విస్మరిస్తున్నారు" అన్నారు హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి).

"అసలు విషయం ఏమిటీ?" అడిగాడు సాద్ బిన్ ముఆజ్ కొంచెం మెత్తబడి.

"మీరు కాస్త ప్రశాంతంగా కూర్చుంటే చెబుతాను" అన్నారు ముస్అబ్ (రజి).

"సరే, చెప్పండి" అంటూ సాద్ కూర్చున్నాడు.

అప్పుడు హజ్రత్ ముస్అబ్ (రజి) ఇస్లాం గురించి ఉసయ్యిద్ (రజి)కు చెప్పినట్లే సాద్‌కు కూడా చెప్పి ఇస్లాం వైపు ఆహ్వానించారు. సాద్ కూడా ఏమాత్రం తటపటాయించకుండా అప్పటికప్పుడు ఇస్లాం స్వీకరించాడు.

ఆ తరువాత హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ (రజి) తన తెగవాళ్ళందరినీ సమావేశపరచి "మీరు నన్ను ఎలాంటివాణ్ణని భావిస్తున్నారు?" అని అడిగారు.

"మీరు మా నాయకులు, విజ్ఞతావివేచనలు కలవారు. మీరిచ్చే ప్రతి సలహా ఆచరణ యోగ్యంగా ఉంటుంది" అన్నారు ప్రజలంతా ముక్తకంఠంతో.

"అయితే వినండి. నేను ముస్లిం అయ్యాను. మీరందరు కూడా ముస్లింలు కానంత వరకు ఇకముందు మీతో నాకెలాంటి సంబంధం ఉండదు" అన్నారు సాద్ (రజి).

నాయకుని మాటలు వినగానే జనమంతా అప్పటికప్పుడు ఇస్లాం స్వీకరించారు.

కొంతకాలం నుంచి దైవప్రవక్త (స) ప్రచారోద్యమంలో సహాయసహకారాలు అందజేసే ఆప్తమిత్రులు కరువయినందుకు ఎంతో విచారంగా ఉండేవారు. ఆ ఆప్తమిత్రులు ఇప్పుడు మదీనాలో దొరికారు.



నిజంగా మదీనా ప్రజల అదృష్టమే అదృష్టం! సొంత ప్రజలే దైవప్రవక్త (సల్లం)ను అంతమొందించడానికి పూనుకున్న క్లిష్టపరిస్థితిలో మదీనా వాసులు ఇస్లాం జ్యోతిని నలుదిశలా ప్రసరింపజేస్తూ ఆయన కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేయసాగారు. ఫలితంగా మక్కాలో ఏండ్ల తరబడి ప్రయత్నించినా జరగనంతటి ధర్మపరివర్తన మదీనాలో ఒక్క ఏడాదిలోనే జరిగిపోయింది.

నబవిశకం 12వ ఏడు. ఓరోజు మదీనా నాయకులు సమావేశమై దైవప్రవక్త (స)కు పూర్తి సహాయసహకారాలు అందజేయాలని, ఆయన్ని శత్రువుల బారినుండి రక్షించడానికి అవసరమైతే ప్రాణాలైనా అర్పించడానికి వెనుకాడరాదని నిశ్చయించుకున్నారు.

"మక్కాలో దైవప్రవక్త (స) ఆపదలో ఉన్నారు. ఎవరూ ఆయన ఉపదేశాన్ని వినేలా కన్పించడం లేదు. ఆ మహనీయుని నిస్సహాయతను మనం ఇలా ఎంతకాలమని చూస్తూ ఊరుకుందాం?" అన్నారు కొందరు.

"నిజమే. మనం ఏదోఒకటి త్వరగా నిర్ణయించుకొని ఆయన్ని రక్షించడానికి పూనుకోవాలి" అంటూ మరికొందరు ఆదుర్దా, ఆతృతలను వ్యక్తపరిచారు.

"వచ్చే ఏడు హజ్ దినాల్లో మనం మక్కా వెళ్ళి ఎలాగైనా సరే దైవప్రవక్త (సల్లం)ను మదీనాకు తీసుకువద్దాం. ఆయన్ని అన్ని విధాలా ఆదరించి కాపాడుకుందాం" నిర్ణయాత్మక సలహా ఇచ్చారు ఇంకొందరు.

ఈ ప్రతిపాదన విని అందరూ సంతోషంతో సరేనంటే సరే అన్నారు.

మదీనా ప్రజలకు ఇస్లాం శిక్షణ ఇవ్వడానికి నియమించబడిన హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి) మక్కాకు తిరిగొచ్చారు. మదీనాలో ప్రజలు ఇస్లాం పట్ల చూపుతున్న అసక్తి, ఆదరాభిమానలు, దైవప్రవక్తను కాపాడడానికి వారు తీసుకున్న నిర్ణయాలు వగైరా విషయాలన్నీ ఆయన దైవప్రవక్త (సల్లం)కు తెలియజేశారు.

## రెండవ అఖ్బా శపథం-(62)

నబవీశకం 12వ సంవత్సరం చివరి నెల. హజ్ దినాలు సమీపించాయి. మదీనా నుంచి ఓ పెద్ద యాత్రిక బృందం మక్కాకు బయలుదేరింది. అందులో ముస్లిమేతరులు కూడా ఉన్నారు. ఈ బృందం మక్కా చేరుకుంది.

అక్కడ ముస్లిం యాత్రికులు కాబాలో దైవప్రవక్త (స)ను కలుసుకున్నారు. శపథం చేయడానికి అనువైన ప్రదేశం కూడా నిర్ణయించుకున్నారు. ధర్మరక్షణ కోసం ప్రాణత్యాగం చేసేందుకు ప్రతిన బూనాలని ముస్లింలు తీసుకున్న నిర్ణయం వారితోపాటు వచ్చిన బహుదైవారాధకులకు తెలియదు.

రాత్రి చాలా పొద్దు పోయింది. మక్కా పట్టణమంతా చీకటి అలుముకున్నది. యాత్రికుల కోలాహలం సద్దు మణిగింది. ఖురైషీయులు అదమరచి గాఢనిద్రలో ఒరిగిపోయారు. బయటనుంచి వచ్చిన యాత్రికులు కూడా నిద్రపోయారు. అప్పుడు మదీనా ముస్లింలు ముందుగా తీసుకున్న నిర్ణయం ప్రకారం మెల్లగా లేచి ఎవరి కంటపడకుండా

మక్కాశివార్లలోని అఖ్బా ప్రదేశానికి చేరుకున్నారు. అక్కడ ఇసుకగుట్టల చాటున ఒదిగి కూర్చొని దైవప్రవక్త (స) కోసం ఎదురుచూడసాగారు.

కాస్సేపటికి దైవప్రవక్త (సల్లం) వచ్చారు. ఆయన వెంట పినతండ్రి అబ్బాస్ కూడా ఉన్నారు. అబ్బాస్ ఇంకా తాను ముస్లిం అని ప్రకటించుకోలేదు. అయితే దైవప్రవక్త (స) పట్ల అపారమైన ప్రేమాభిమానాలు ఉన్నాయి. ఆయన్ని అనుక్షణం కంటికిరెప్పలా కాపాడుతూ వస్తున్నారు. అంచేత అత్యవసర సమయంలో దైవప్రవక్త (సల్లం) వెంట ఉండి, మదీనా ప్రజల అభిప్రాయాలు ఎలా ఉన్నాయో తెలుసుకోవడం ఎందుకైనా మంచిదని భావించారు. ఆయనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ఇలా మాట్లాడారు:

“మదీనా మిత్రులారా! మా దగ్గర ముహమ్మద్‌కున్న గౌరవం, విలువలు ఎలాంటివో మీ కందరికీ తెలుసు. మేము ఎల్లప్పుడూ శత్రువుల్ని ఎదిరించి పోరాడుతూ వారి బారినుంచి ఈయన్ని కాపాడుతున్నాము. ముహమ్మద్ ఇక్కడ మా దగ్గర క్షేమంగానే ఉంటున్నారు. ఈయనకు ఎలాంటి ప్రమాదం లేదు. కాని ఇప్పుడీయన మీ దగ్గరకు రావాలని, మీ మధ్య జీవించాలని ఉత్సాహపడుతున్నారు. అయితే మీ వాగ్దానాలు నెరవేర్చుకోగల ధైర్యం, శత్రువుల నుండి రక్షించుకోగల బలీయమైన కోరిక, ఆసక్తి మీలో ఉన్నాయా? ఉంటే మీరు సంతోషంగా తీసికెళ్ళవచ్చు. మాకెలాంటి అభ్యంతరం లేదు.

“కాని తరువాత ఈయనకేదైనా ఆపద వస్తే మాత్రం మేము దానికి బాధ్యులం కాము. ఒకవేళ విశ్వాసఘాతుకం జరుగుతుందని భయముంటే, ఎందుకొచ్చిన తిప్పలు? ఇక్కడే వదలి వెళ్ళండి. ఈయన ఇక్కడ పరువు మర్యాదలతోనే ఉన్నారు. ఎలాంటి ప్రమాదం లేదు. అంచేత మీరు అన్ని విధాలా ఆలోచించి నిర్ణయానికి రండి.”

అబ్బాస్ ప్రసంగం విని మదీనా ముస్లింలు ఇలా అన్నారు:

“మీ మాటలు శ్రద్ధగా విన్నాం. మేము అన్నిటికీ తెగించే వచ్చాం. దైవప్రవక్తా! ఇక మీరు సెలవీయండి. ఏ విషయాల్ని గురించయినా సరే మాచేత ప్రమాణం చేయించండి. మేము వాటికి కట్టుబడి ఉంటాం.”

దైవప్రవక్త (సల్లం) ఖుర్‌ఆన్‌లోని కొన్ని సూక్తులు పఠించిన తరువాత “ఏవిధంగా మీరు మీ భార్యాపిల్లల్ని కాపాడుకుంటున్నారో, ఆ విధంగా నన్ను కూడా కాపాడుతారా? నాకా మాత్రం అభయమిస్తే చాలు” అన్నారు.

వెంటనే బరా బిన్ మారూర్ (రజి) ముందుకు వచ్చారు. ఆయన మదీనాలో ప్రముఖ నాయకుడు. ప్రజలు ఆయన్ని అమితంగా గౌరవిస్తారు.

“మిమ్మల్ని దైవసందేశహరునిగా, సత్యధర్మ వైతాళికునిగా పంపిన దేవుని సాక్షిగా చెబుతున్నాను. మేము మిమ్మల్ని తప్పకుండా కాపాడుకుంటాము. మీరు కోరిన విధంగా మాచేత ప్రమాణం చేయించండి. మేము యుద్ధంలో ఆరితేరిన యోధులం. మీరు ఎప్పుడు ఆజ్ఞాపిస్తే అప్పుడు యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్నాం. రణరంగానికి వెన్ను చూపడం అనేది మా జాతిలోనే లేదు.”



బరా మాటలు పూర్తయినా కాలేదు, అబుల్ హైసమ్ (రజి) లేచి నిల్చున్నారు.

“దైవప్రవక్తా! యూదులతో మాకు చాలా సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అవి మాయీ శపథం తరువాత తెగిపోతాయి. తరువాత దేవుడు మీకు విజయం ప్రసాదిస్తే మీరు మమ్మల్ని వదలిపెట్టి మీ తెగవాళ్ళ దగ్గరకు మళ్ళీ పోరుకదా?” అన్నారాయన.

ఈయన కూడా మదీనా ప్రముఖుల్లో ఒకరు. ఆయన మాటలు విని దైవప్రవక్త (సల్లం) చిరునవ్వు నవ్వారు. “అలా ఎన్నటికీ జరగదు. నా రక్తం మీ రక్తంతో సమానం. నా గౌరవమే మీ గౌరవం. నా రక్షణే మీ రక్షణ. మీరు నావాళ్ళు, నేను మీవాణ్ణి. మీరు క్షమించే వ్యక్తిని నేను క్షమిస్తాను. మీరు సంధి కుదుర్చుకునే వారితో నేనూ సంధికి రాజీపడతాను” అన్నారు ఆయన.

ఈ మాటలు విని అందరి ముఖాలలో సంతోషం వెల్లివిరిసింది. దైవప్రవక్త (సల్లం)ను తమ పెన్నిధిగా చేసుకోవాలన్న తపన, ఆరాటం అందరిలో గోచరిస్తున్నాయి. అంచేత వెంటనే వారు ప్రమాణం చేయడానికి సిద్ధమయ్యారు.

“సోదరులారా! ఆగండి. మీరు ఏ విషయం గరించి ప్రమాణం చేయబోతున్నారో తెలుసా?” అన్నారు అబ్బాస్.

“తెలుసు. బాగా తెలుసు” అన్నారు మదీనా ముస్లింలంతా ముక్తకంఠంతో.

“మరోసారి ఆలోచించుకోండి. ముహమ్మద్ (సల్లం) చేతిపై ప్రమాణం చేయడం అంటే యావత్తు ప్రపంచంతో కోరి పోరు తెచ్చుకోవడమే. ఈ సంగతి తెలిస్తే సరే. మీ ఆస్తులకు నష్టం వాటిల్లడమో లేక మీ నాయకులు యుద్ధంలో వధించబడటమో జరిగి నప్పుడు మీరు భయపడి ఈయన్ని వదలిపెట్టే అనుమానముంటే ఇప్పుడే వదలేసి వెళ్ళండి. తరువాత వదలి పెడితే ఇటు ప్రపంచంలోనూ, అటు పరలోకంలోనూ ఉభయ భ్రష్టత్వం తప్పదు. ఆస్తినష్టం సంభవిస్తే భరించగల ధైర్యం, నాయకులు చనిపోతే సహించగల శక్తి ఉంటే తప్పకుండా తీసికెళ్ళండి. ఉభయలోకాల్లో విజయం పొందగలుగుతారు” అన్నారు అబ్బాస్ మళ్ళీ.

“ఆస్తి నష్టం ఇష్టమే. నాయకుల మరణం కూడా మాకిష్టమే. కాని దైవప్రవక్త (స)ను వదలుకోవడం మాత్రం మాకిష్టం లేదు” అన్నారు అందరూ ఉత్సాహంతో.

“దైవప్రవక్తా! మేము మా వాగ్దానాలకు కట్టుబడి ఉంటాం. దానివల్ల మాకు లభించే ప్రతిఫలం ఏమిటో చెప్పండి” అన్నారు కొందరు.

“శాశ్వతసౌఖ్యాలు ఉండే స్వర్గసీమ” చెప్పారు దైవప్రవక్త (సల్లం).

“అయితే చేయిజాపండి” అంటూ మదీనా ముస్లింలు అమితోత్సాహంతో ముందుకు వచ్చారు ప్రమాణం చేయడానికి.

తరువాత ఒక్కొక్కరే వచ్చి దైవప్రవక్త (స) చేతిలో చేయివేసి ప్రమాణం చేశారు.

ఈవిధంగా ఓ మహోన్నత దైవకార్యానికి అంకురార్పణ జరిగింది. మహాప్రవక్త ముహమ్మద్ (స) పరమానందభరితులై దైవానికి కృతజ్ఞతలు అర్పించారు.

మదీనా ముస్లింలు కూడా ఎంతో సంతోషించారు. వారి కళ్ళలో విశ్వాసపు కాంతి రేఖలు ద్విగుణీకృతమై తొణికిసలాడుతున్నాయి. అంతలో దూరం నుంచి ఓ పొలికేక!

“ఖురైషీయులారా! ఇక్కడ ఔస్, ఖజ్రజ్ తెగవాళ్ళు మీకు వ్యతిరేకంగా యుద్ధ వ్యూహాలు పన్నుతున్నారు. రండి! వీరంతా ప్రాణాలైనా త్యజించి పోరాడుతామని ముహమ్మద్ ముందు ఎలా ప్రమాణాలు చేస్తున్నారో చూడండి!”

ఎవరిదీ కంఠస్వరం? ఇదేదో ఉపద్రవాన్ని సూచించే హెచ్చరికలా ఉంది. అయినా ముస్లింల పట్టుదల, ధైర్యసాహసాలను ఏ మాత్రం సడలించ లేకపోయింది.

“దైవప్రవక్తా! మిమ్మల్ని సత్యధర్మం ఇచ్చి పంపిన దేవుని సాక్షి! మీరు అనుమతిస్తే మేము రేపే మక్కా ఖురైషీయులపై దాడిచేస్తాం” అన్నారు అబ్బాస్ బిన్‌ఉబాదా (రజి).

“ఓపిక పట్టండి దానికోసం ఇంకా దైవాజ్ఞ కాలేదు. ఇక వెళ్ళండి. మీ మీ గుడారాలకు వెళ్ళి విశ్రాంతి తీసుకోండి” అన్నారు దైవప్రవక్త (సల్లం) వాళ్ళను శాంతింపజేస్తూ.

ఆ తర్వాత ముస్లింలు తమ గుడారాలకు తిరిగొచ్చి ఏమీ ఎరగనట్లు పడుకున్నారు.

తెల్లవారింది. ఖురైషీయులు ఆదరాబాదరాగా మదీనావాసుల గుడారాల దగ్గరికి వచ్చారు. కోపంతో ఊగిపోతూ ఇలా అన్నారు:

“మదీనా వాసులారా! మేము ఏ తెగతోనైనా యుద్ధం చేస్తాం. కాని మీతో యుద్ధం చేయడం మాకిష్టం లేదు. అయితే రాత్రి మీరెక్కడికి వెళ్ళారు? మాకు వ్యతిరేకంగా ఎందుకు కుట్రలు పన్నుతున్నారు? ముహమ్మద్‌ని ఇక్కడ్నుంచి తీసికెళ్ళాలను కుంటు న్నారా? మా ప్రత్యర్థులతో చేతులు కలిపి మాపై కత్తులు ఝుళిపించ దలిచారా?”

మదీనా ముస్లింలతో పాటు మక్కా వచ్చిన బహుదైవారాధకులకు రాత్రి జరిగిన రహస్య సమావేశం గురించి తెలియదు. అంచేత వారు ఖురైషీయుల మాటలు విని విస్తుబోయారు. తాము ఏ పాపం ఎరగమని, ముహమ్మద్ (సల్లం)తో తామింతవరకు మాట్లాడనే లేదని పెద్దపెద్ద ఒట్లు వేసుకుంటూ చెప్పసాగారు. ముస్లింలు మాత్రం మౌనంగా ఉండిపోయారు. పరిస్థితులు ఎలా మరలుతాయోనని ఆలోచిస్తున్నారు.

ఖురైషీయులు ఈ విచిత్ర పరిస్థితి చూసి ఆశ్చర్యపోయారు. ఏమీ బోధపడక తామే దైనా తప్పుడువార్త విన్నామేమో ననుకుంటూ వెళ్ళిపోయారు. అయితే వారి మనసు స్థిమిత పడలేదు. దాన్ని గురించే తీవ్రంగా ఆలోచించడం మొదలుపెట్టారు:

“నిజంగా రాత్రి అలాంటి సంఘటన జరిగిందా? దూత అందించిన సమాచారం నిజమేనా? నిజమేఅయితే వాళ్ళు అబద్ధమాడుతున్నారా? లేక ఇది తప్పుడు సమాచారమా? మదీనావాళ్ళు విషయం దాస్తున్నారా?” ఇలా వారు పరిపరివిధాల ఆలోచించారు. వాస్తవం వెలికితీయడానికి శక్తియుక్తులన్నీ ఉపయోగించి పరిశోధన ప్రారంభించారు.

ఇటు మదీనావాసులు వెంటనే ప్రయాణం కట్టారు. ఖురైషీయులకు ఈ సంగతి తెలిస్తే ప్రమాదం ముంచుకొస్తుందని తలచి మదీనా ముస్లింలు కూడా తక్షణమే మదీనా దారిపట్టి వేగంగా పోసాగారు.



మదీనా ముస్లింలు అనుకున్నట్లు ఖురైషీయులు విషయాన్ని చాలా త్వరగానే తెలుసుకున్నారు. రాత్రి దైవప్రవక్త (స)తో వారు జరిపిన రహస్యసమావేశం సంగతి తెలుసు కొని ఖురైషీయులు చిందులుతొక్కారు. మదీనావాసులు చేజారి పోతారేమోనని వెంటనే వారిని వెంబడించారు. కాని ఫలితం దక్కలేదు. అప్పటికే వారు చాలాదూరం వెళ్ళిపోయారు.

అయితే దురదృష్టవశాత్తు మదీనావాసుల్లో సాద్ బిన్ ఉబాదా (రజి) మాత్రం ప్రయాణంలో వెనుకబడి పోవడంతో ఆయన ఖురైషీయులకు చిక్కిపోయారు. దుర్మార్గులు ఆయన్ని కొడుతూ, తిడుతూ, జుట్టు పట్టుకొని ఈడుస్తూ మక్కా తీసుకొచ్చారు.

మక్కాలో జుబైర్, హారిస్ అనే ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారు. వీరిద్దరు వ్యాపార నిమిత్తం సిరియా పోతుంటారు. సిరియా పోవాలంటే మదీనా మీదుగానే పోవాలి. అంచేత వారు మదీనాలో ఆగినప్పుడల్లా సాద్ బిన్ ఉబాదా (రజి) ఆ ఇద్దరికి ఆతిథ్యమిచ్చి ఆదరించేవారు. ఆ మేలును దృష్టిలో పెట్టుకొని వీరిప్పుడు ఖురైషీయులకు నచ్చజెప్పి సాద్ (రజి)ని వారి బారినుండి కాపాడారు. చివరికి ఈవిధంగా సాద్ (రజి) ప్రాణందక్కింది. ఖురైషీయుల నుంచి విడుదల కాగానే ఆయన మదీనా వెళ్ళిపోయారు.

## అబూసల్మా (రజి) వలస-(63)

అఖ్బా శపథానికి సంబంధించిన సంఘటన తర్వాత మక్కాలో ముస్లింలపై ఖురైషీ యుల హింసాదౌర్జన్యాలు మరింత ఎక్కువైపోయాయి. అప్పుడు దైవప్రవక్త (స) ముస్లింలకు మదీనా వలసపొమ్మని అనుమతి ఇచ్చారు.

ఈ అనుమతి లభించగానే నబవీశకం 13వ ఏట ముస్లింలు రహస్యంగా రాత్రివేళల్లో జట్లుజట్లుగా బయలుదేరి మదీనా దారిపట్టారు. ఈ విధంగా కొందరు ముస్లింలు మక్కాలో తమ ఇండ్లు ఖాళీచేసి వెళ్ళిపోగానే ఖురైషీయులకు మళ్ళీ గుబులు పుట్టింది. ముస్లింలు ఇప్పుడు మదీనాని ధార్మిక కేంద్రంగా చేసుకొని అక్కడ్నుంచి తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తారని వారు గ్రహించారు. అంతేకాదు, మదీనాలో ఇప్పటికే చాలా మంది ముస్లింలయి పోయారని, మక్కా ముస్లింలు కూడా అక్కడకు చేరుకుంటే ఈ ఉద్యమం తమకు పెద్ద ప్రమాదం తెచ్చి పెడ్తుందని భావించారు.

అందువల్ల ఖురైషీయులు మక్కా నుండి వెళ్తున్న ముస్లింలను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ప్రారంభంలో వారు మక్కా నుండి వెళ్ళిపోయిన ముస్లింల ఖాళీ ఇండ్లను తగలబెట్టారు. ఇలా చేస్తే మక్కా నుండి ఇంకా వెళ్ళిపోకుండా ఉన్న ముస్లింలు తమ ఆస్తులు కూడా నష్టపోతాయన్న భయంతో మదీనా వెళ్ళిపోరని భావించారు. కాని ఈ ప్రయత్నం వల్ల ప్రయోజనం కన్పించక పోవడంతో వారు పట్నం వెలుపల అనేక చోట్ల కొందరిని కాపలా పెట్టించారు. రాత్రివేళ రహస్యంగా బయలుదేరే ముస్లింలను వారు అటకాయించి వారి సొమ్ముల్ని, సామగ్రిని లాక్కొని వేధించడం మొదలెట్టారు.

మక్కానుండి వలసపోతున్నవారిలో కొందరు తమ సిరిసంపదలన్నీ వదలిపెట్టి పోతున్నా ఖురైషీయులు అలాంటివారిని కూడా అడ్డుకొని వేధించడం ప్రారంభించారు.

హజ్రత్ అబూసల్మా (రజి) తన భార్య ఉమ్మెసల్మా (రజి)ను, ఒక పిల్లవాడ్ని తీసుకొని మక్కా నుండి బయలుదేరారు. పట్నం నుండి రెండు మూడు మైళ్ళు పోయారో లేదో ఉమ్మెసల్మా (రజి) తరఫు బంధువులు వచ్చి వాళ్ళను అటకాయించారు. వారి చేతుల్లో కత్తులు, ఈటెలు కూడా ఉన్నాయి.

ఒంటె మీద భర్త వెనుక కూర్చున్న హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) వాళ్ళను చూడగానే నిలువునా కంపించిపోయారు. ఆమె ఒడిలో కూర్చున్న చంటి పిల్లవాడు ఏడ్పు లంకించు కున్నాడు. అబూసల్మా (రజి)కు పట్టరాని కోపం వచ్చింది. కాని ఏం చేయగలరు?

"ఏమిటీ దౌర్జన్యం! నేను నా ఇల్లు, ఆస్తిపాస్తులన్నీ అక్కడే వదలిపెట్టి వచ్చాను కదా! నేనిప్పుడు నా భార్యను, పిల్లవాడ్ని మాత్రమే తీసికెళ్తున్నాను. ఇక నా దగ్గర ఏముందని వచ్చారు మీరు?" అన్నారు ఆయన కోపాన్ని బలవంతంగా దిగమింగుతూ.

"నువ్వు వెళ్ళ దలచుకుంటే ఎక్కడికైనా వెళ్ళి ఊరేగు. కాని మా అమ్మాయిని మాత్రం తీసికెళ్ళడానికి వీల్లేదు" అన్నారు ఉమ్మెసల్మా (రజి) బంధువులు.

"ఈమె నాభార్య. మీరు స్వయంగా ఈమెను నాకిచ్చి పెళ్ళిచేశారు. ఇప్పుడు ఈమెను నా నుండి దూరం చేయడానికి మీకెలాంటి అధికారం లేదు" అన్నారు అబూసల్మా.

"ముందు నువ్వు ఒంటె మీద నుంచి దిగుతావా లేదా?" అంటూ వారు కత్తులు ఝళిపించారు.

హజ్రత్ అబూసల్మా (రజి) గత్యంతరంలేక ఒంటె మీద నుంచి కిందికి దిగారు. వెంటనే ఉమ్మెసల్మా (రజి) బంధువులు ఉమ్మెసల్మా (రజి)ను, ఆమె పసిబిడ్డను బలవంతంగా తీసుకొని అక్కడ్నుంచి బయలుదేరారు. ఉమ్మెసల్మా (రజి) మాటిమాటికి వెనక్కి తిరిగి భర్త వైపు చూస్తూ కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు. ఆమె ఒడిలోని పిల్లవాడు కూడా వెక్కివెక్కి ఏడుస్తున్నాడు.

పాపం అబూసల్మా (రజి) నిస్సహాయంగా నిలబడి భార్యాపిల్లల వైపు చూస్తున్నారు. ఆయన కళ్ళు కూడా అశ్రుపూరితాలయ్యాయి. ఆయన భార్యాపిల్లలు కనుమరుగై పోయే దాకా చూశారు. ఆ తరువాత కాళ్ళీడ్చుకుంటూ ఒంటరిగా మదీనా దారిపట్టారు.

ఉమ్మెసల్మా బంధువులు ఉమ్మెసల్మా (రజి)ను సంతోషంగా ఆమెభర్త వెంట మదీనా పంపడానికి బదులు ఇస్లాంపట్ల ఉన్న ద్వేషంతో గుండెల్లో రగులుతున్న కసి తీర్చుకోవడానికి ఈవిధంగా ఆమెను భర్త నుండి విడదీసి లాక్కెళ్తున్నారు.

ఉమ్మెసల్మా బంధువుల వైఖరి అబూసల్మా బంధువులకు సహించరానిదై ఉండాలి. వారు ఉమ్మెసల్మా బంధువుల దుశ్చర్యను గర్హించాలి. కాని వారిగుండెల్లో కూడా ఇస్లాం వ్యతిరేక జ్వాలలు రగులుతున్నాయి. సమాచారం అందిన వెంటనే వారు బయలుదేరి పట్నం వెలుపలే దారిలో ఉమ్మెసల్మా (రజి) బంధువుల్ని కలుసుకున్నారు.

"ఆగండి. మీరు మీ అమ్మాయిని మావాడి నుండి వేరుచేసి తీసికెళ్తున్నారు బాగానే ఉంది. కాని ఈ పిల్లవాడు మావాడు, మా వంశాంకురం. మీరితడ్ని తీసికెళ్ళడానికి ఎంత



మాత్రం వీల్లేదు. మాపిల్లవాడ్ని మాకిచ్చేయండి"అంటూ అబూసల్మా బంధువులు ఉమ్మెసల్మా (రజి) ఒడిలోని పసిబిడ్డను బలవంతంగా లాగి తీసుకున్నారు.

ఈ దుశ్చర్యకు ఉమ్మెసల్మా (రజి) బంధువులు అభ్యంతరం పెట్టలేదు గాని, పిల్లవాడు మాత్రం మరోసారి ఏడ్పు లంకించుకున్నాడు. తల్లి ఉమ్మెసల్మా (రజి) కూడా ఏకధాటిగా రోదించసాగారు. ఆ రాతిగుండెలు మాత్రం కాస్తయినా కరగలేదు.

సత్యతిరస్కారుల ఈ దురభిమానం, దుష్టచర్యలకు పాపం ఉమ్మెసల్మా (రజి) అటు భర్తనూ కోల్పోయారు; ఇటు పసిబిడ్డనూ పోగొట్టుకున్నారు. ఈ విధంగా ఉమ్మెసల్మా (రజి) అటు భర్తవియోగంతో, ఇటు పుత్రవియోగంతో దాదాపు ఏడాది పాటు దిగులుతో బాధ పడ్డారు. చివరికి ఒక దయార్ద్రహృదయుడి జోక్యంతో ఆమె అవిశ్వాసుల బారినుండి బయటపడటమే గాకుండా పిల్లవాడ్ని కూడా దక్కించుకున్నారు. ఆ తరువాత వెంటనే ఆమె మరో దయార్ద్రహృదయుడి సహాయంతో ఒంటె మీద మదీనా వెళ్ళిపోయారు.

అవిశ్వాసులు ఎన్ని అవరోధాలు కలిగించినా అనేకమంది ముస్లింలు మక్కా నుండి మదీనా వెళ్ళిపోవడంలో సఫలమయ్యారు. హజ్రత్ ఉమర్(రజి)) విశ్వాసులైన తన బంధు మిత్రులతో కలసి ఖడ్గాలు తీసుకొని ఇరవై ఒంటెలపై బహిరంగంగానే మక్కా నుండి బయలుదేరి వెళ్ళిపోయారు. అవిశ్వాసులెవరూ ఆయన్ని అడ్డగించలేదు.

ఈవిధంగా దాదాపు ముస్లింలంతా ఇళ్ళూ వాకిళ్ళూ వదలి మదీనా వెళ్ళిపోయారు. ఇక కొందరు ముస్లింలు మాత్రమే మక్కాలో మిగిలిపోయారు.

## హత్యా ప్రయత్నం-(64)

నబవీశకం 14వ సంవత్సరం సఫర్ నెలలో ఓ రోజు ఖురైషీయులు దారున్నద్వాలో సమావేశమయి సమాలోచనలు ప్రారంభించారు.

"ముహమ్మద్ విషయంలో ఏంచెయ్యాలి? అతడ్ని ఎలా లొంగదీసుకోవాలి? అతని ఉద్యమాన్ని అరికట్టే మార్గం ఏమిటీ?" అన్నాడు ఒకడు.

"ఇప్పటిదాకా ముహమ్మద్ మన మధ్య ఒంటరిగా ఉన్నా మనం ఏమీ చేయలేక పోయాం. ఇప్పుడు ఔస్, ఖజ్రజ్ తెగలు అతనికి తోడయ్యాయి. ఇప్పుడేం చేయాలి? మన నుంచి చేజారి పోకుండా ఆపడం ఎలా? ముహమ్మద్ మనల్ని జయిస్తాడా? అతని మతం ఇప్పటికే మదీనాలో చాలావరకు వ్యాపించింది. అది మిగతా తెగలక్కూడా వ్యాపించవచ్చు. ఆ విధంగా ముహమ్మద్ మనల్ని తుదముట్టిస్తాడా? మన సుందర నగరాన్ని, మన విగ్రహాల్ని నాశనం చేస్తాడా? వీటి కోసం మనం ఏండ్ల తరబడి పోరాడు తున్నా ఫలితం దక్కదా?"

ఇలాంటి ఆలోచనలతో ఎన్నో సమావేశాలు జరిపారు ఖురైషీయులు. కాని తరుణో పాయం కనుచూపుమేరలో కూడా కన్పించ లేదు. ఒక్క విషయం కూడా సరిగా తీర్మానించు కోలేకపోయారు. ఫలితం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే. అయితే ఇస్లాంను విశ్వసించిన వారిపై యథాప్రకారం హింసాకాండ మాత్రం సాగిస్తూనే ఉన్నారు.

ఈ హింసాదౌర్జన్యాల వల్ల మక్కాలో ముస్లింల జీవితాలు దుర్భరమై పోయాయి. దైవప్రవక్త (సల్లం) రోజురోజుకు విషమిస్తున్న పరిస్థితి గమనించి, ఈ హింసాకాండ నుంచి బయటపడి ప్రశాంతంగా ధార్మికజీవితం గడిపేందుకు వారికి మదీనా వలస పోయేందుకు అనుమతినిచ్చారు.

ఈ అనుమతితో ముస్లింలు పథకం ప్రకారం ఒక్కొక్కరుగా, జట్లుజట్లుగా మక్కా నుండి బయటపడి రహస్యంగా మదీనా దారిపట్టారు. కాని కొంతమంది ముస్లింలు ఖురైషీయులకు పట్టుబడి పోయారు. ఆ దుర్మార్గులు వారిని నిర్బంధించి మరింత హింసించడం ప్రారంభించారు.

మదీనా వలసపోయిన తరువాత ముస్లింలకు ధర్మప్రచారం చేయడానికి మంచి అవకాశం లభించింది. జనం ఇస్లాంలోని మంచిని గమనించి దాని వైపు వేగంగా ఆకర్షించ బడుతున్నారు. సర్వత్రా ఇస్లాం శంఖారావం ప్రతిధ్వనిస్తోంది. ముస్లింలు ఒక మహోన్నత శక్తిగా రూపొందుతున్నారు.

ఇదంతా గమనించిన ఖురైషీయులు విలవిల్లాడి పోయారు. వారి గుండెల్లో బెదురు పుట్టింది. నలువైపుల నుంచి కష్టాలకారుమేఘాలు ముంచుకొస్తున్నాయని, తమకు ముస్లిం లకు మధ్య భయంకరయుద్ధం సంభవించే సూచనలు కన్పిస్తున్నాయని భావించి హడలి పోయారు. దాంతో వారు 'దారున్నద్వా'లో సమావేశమయి తీవ్రంగా ఆలోచించారు.

ఇస్లాంవ్యాప్తిని అరికట్టడమెలా? ముహమ్మద్ ఆట కట్టించేదెలా? ఇవీ వారి చర్చనీ యాంశాలు. ఉన్నట్లుండి ఒకతనికి మెరుపులాంటి ఆలోచన వచ్చింది.

"ముహమ్మద్‌ని కాళ్ళు చేతులు కట్టి ఒక చోట బంధించి పెడ్దాం" అన్నాడతను.

"అలా బంధించిపెడితే నలుగురికీ తెలిసిపోతుంది. ముస్లింలు కట్టకట్టుకొని వచ్చి మన మీద విరుచుకుపడతారు. ముహమ్మద్‌ని విడిపించుకొని పోయేదాకా నిద్రపోరు. వద్దు. అలా నిర్బంధించడం మనకూ శ్రేయస్కరం కాదు" అన్నాడు మరొకతను.

"అది నిజమే. అయితే ముహమ్మద్‌ని ఇక్కడ ఉంచడం ఏమాత్రం మంచిది కాదు. ఏదో ఒక సుదూర ప్రదేశానికి తీసికెళ్ళి వదలిపెట్టి వద్దాం. ఆ తరువాత అతని ఇష్టం. ఎక్కడ ఉండాలనుకుంటే అక్కడ ఉంటాడు" అంటూ వేరొకడు సలహా ఇచ్చాడు మన సలహా ఎలా ఉందన్నట్లు చూస్తూ.

"నీ మొహంలా ఉంది ఈ సలహా. తలకాయలో కాస్తయినా మెదడు ఉందా నీకసలు? ఇలా చేస్తే ఇంకేమయినా ఉందా! అప్పుడతను మరో తెగలోకి వెళ్ళి అక్కడ కూడా తన వాక్చాతుర్యంతో, గారడీమాటలతో జనాన్ని మంత్రముగ్ధుల్ని చేసి తన వైపుకు తిప్పుకుంటాడు. అక్కడ కాకపోతే మదీనా వెళ్తాడు. మదీనా వెళ్తే మరీ ప్రమాదం. పోగానే శిష్యగణాన్ని పోగుచేసుకొచ్చి మనల్ని చితగ్గొడ్తాడు" అన్నాడు ఇంకొకడు.

"అయితే ఇంతకూ ఏం చేద్దాం?" పరిష్కారం అర్థంగాక అందరూ ప్రశ్నార్థక వైఖరితో ఒకరి ముఖాలు మరొకరు చూసుకోసాగారు.



"భయపడకండి. దీనికో మార్గం ఉంది. మీరెవరూ ఆలోచించని పరిష్కారమార్గం." ఈ మాటలు విని అందరూ అబుజహల్ వైపు దృష్టి సారించారు.

"ఏమిటో ఆ మార్గం త్వరగా చెప్పు. ఆలశ్యం చేసి మమ్మల్ని ఇరకాటంలో పెట్టకు."

"మనం ప్రతితెగ నుండి ధైర్యసాహసాలుగల ఒక్కో యువకుడ్ని ఎన్నుకొని వారందరికీ తలా ఓ ఖడ్గం ఇవ్వాలి. అవకాశం చూసి అందరూ ఒకేసారి ముహమ్మద్‌పై విరుచుకుపడాలి. ఇలా అతని చరిత్ర సమాప్తమవుతుంది. మనకు శాశ్వతంగా మనశ్శాంతి లభిస్తుంది. మన యువకులు అన్ని తెగలకు చెందినవారైనందున హత్యానేరం అందరి మీదా ఉంటుంది. హాషిం సంతతివాళ్ళు సంఘటితమై తెగలన్నిటిని ఎదిరించి పోరాడలేరు. చివరికి రక్తపరిహారం క్రింద వంద ఒంటెలు తీసుకోవడానికి ఒప్పుకుంటారు" చెప్పాడు అబూజహల్.

ఈ అభిప్రాయం అందరికీ నచ్చింది కాబోలు అందరూ తలలూపారు.

"బ్రహ్మాండంగా ఉంది ఈ సలహా. అసలు సలహా అంటే ఇలా ఉండాలి. నీ బుద్ర అమోఘం!" అన్నారు అంతా అబుజహల్‌ని తెగ మెచ్చుకుంటూ.

సమావేశం ముగిసింది. ముహమ్మద్ (సల్లం) కథ సమాప్తమయినట్లు అందరూ మహా సంబరబడిపోతూ ఎగిరి గంతేశారు. తీర్మానానికి కార్యరూపం ఇవ్వడానికి సన్నాహాలు కూడా ప్రారంభించారు.

సూర్యుడు గగనం మధ్యకు వచ్చి పుడమి వైపు ఉరిమి చూడసాగాడు. అతని వాడిచూపులు భరించలేక హజ్రత్ అబూబకర్ (రజి) ఇంట్లోకెళ్ళి తలుపేసుకున్నారు. కాని అంతలోనే బయట తలుపు తట్టిన శబ్దం విన్పిస్తే వెళ్ళి తలుపు తెరిచారు. చూస్తే వాకిలి ముందు మహనీయ ముహమ్మద్ (సల్లం) గంభీర వదనంతో నిల్చున్నారు.

"రండి, రండి. ఇంత తీక్షణమైన ఎండలో ఏదో ప్రత్యేక పనిమీదే వచ్చినట్లున్నారు" అన్నారు అబూబకర్ (రజి) ఆయన్ని చూడగానే.

"ఔను. ఇక్కడ ఇంకెవరైనా ఉన్నారా? ఉంటే అవతలికి పంపు. నీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి" అన్నారు దైవప్రవక్త (స) లోపలికి వచ్చి కూర్చుంటూ.

"ఇక్కడ మీ శ్రీమతి ఆయిషా (రజి) తప్ప ఇంకెవ్వరూ లేరు."

"సరే. నాకు మక్కా నుంచి వలసపోవడానికి అనుమతి లభించింది. అతి త్వరలో నేను ఎస్రిబ్‌కు బయలుదేరాలి" అన్నారు దైవప్రవక్త (సల్లం).

"నిజమా! మరి నాక్కూడా ఈ ప్రయాణంలో మీ సహచర్యభాగ్యం ప్రాప్తమవు తుందా?" అడిగారు హజ్రత్ అబూబకర్ (రజి) ఆదుర్దాగా.

"ఆ..." దైవప్రవక్త (సల్లం) ముక్తసరిగా సమాధానమిచ్చారు.

"మహాభాగ్యం! నేను ముందుగానే వలసపోవడానికి కావలసిన సామగ్రి సిద్ధంచేసి పెట్టాను. రెండుఒంటెల్ని కూడ ఏర్పాటుచేశాను. ప్రయాణసౌలభ్యం కోసం అబ్దుల్లా బిన్ అర్తఖ్‌తో కూడా మాట్లాడాను" త్వరత్వరగా అన్నారు అబూబకర్ (రజి) ఆనందంతో.

“ఒంటెలు ఇప్పుడే అవసరం లేదు. శత్రువులు మనల్ని వెన్నంటి ఉన్నారు. అందువల్ల ముందుగా మనం దక్షిణ దిశగా బయలుదేరి సౌర్‌గుహలో కొన్నాళ్ళు తలదాచుకోవాలి.” అన్నారు దైవప్రవక్త (సల్లం) విషయాన్ని విశదీకరిస్తూ.

సౌర్‌గుహ మక్కాకు దక్షిణదిశగా మూడు మైళ్ళ దూరాన యమన్‌కు పోయే దారిలో ఉంది. మదీనా ఉత్తరం వైపుంది. మక్కా వదలిన ముహమ్మద్ (స) మదీనా దారిపడ్తారని తలచి ప్రతివాడూ ఉత్తరం దిక్కుగా పరుగెడుతాడు. ఇలా దైవప్రవక్త (స) తమను వెంబడించేవారికి తామెటుపోయిందో కూడా అర్థంకాని విధంగా పథకం రూపొందించారు. ఆయన ఈ పథకం గురించి అబూబకర్ (రజి)కు వివరించి వెళ్ళిపోయారు.

ఖురైషీయులు దైవప్రవక్త (స)ను అంతంచేయడానికి ఒక పథకం తయారుచేశారు. తేదీ కూడా నిర్ణయమైపోయింది. నిర్ణయించిన ఆ కాళరాత్రి రానే వచ్చింది.

నలువైపుల నుంచి చీకటి తెరలు అలుముకున్నాయి. నింగిలోని నక్షత్రాలు మిణుకు మిణుకుమంటూ నేల వైపు కళ్ళు చించుకొని చూస్తున్నాయి. గాడాంధకారంలో మక్కా నగరం  మౌనముద్ర దాల్చింది. కారుణ్యమూర్తి (సల్లం) ఇంటి చుట్టూ శత్రువులు ఈటెలు, బాకులు తీసుకొని మాటుకాసి కూర్చున్నారు.

స్త్రీలుండే ఇండ్లలో దౌర్జన్యంగా జొరబడటం బహుదైవారాధకులు కూడా తలవంపుగా భావించేవారు. అందువల్ల శత్రువులు బయటనే మాటుకాసిఉంటూ, ముహమ్మద్ (స) ఎప్పుడు బయటికి వస్తే అప్పుడు మూకుమ్మడిగా మీదపడి ఆయన్ని ముక్కలు ముక్కలుగా నరికివేద్దామని కాచుకొని ఉన్నారు.

దుర్మార్గుల పన్నాగం విశ్వప్రభువు ద్వారా దైవప్రవక్త (సల్లం)కు తెలిసిపోయింది. ఆయన వెంట హజ్రత్ అలి (రజి) కూడా ఉన్నారు. అన్ని విషయాలు అలి (రజి)కి వివరంగా చెబుతూ ఆయన ఇలా అన్నారు:

“అలీ! ఇదీ విషయం. జాగ్రత్తగా మసలుకోవాలి. తెల్లవారగానే మనింట్లో భద్రపరచిన వస్తువులన్నీ ఎవరివి వాళ్ళకు ఇచ్చెయ్యి. ఆ తర్వాత బయలుదేరి మదీనా వచ్చెయ్యి.”

ఏమిటా వస్తువులు? ఇతర ప్రజలతోపాటు బద్ధవిరోధులు సైతం తన వద్ద దాచుకున్న ధన కనక వస్తువులు. ముహమ్మద్ (స)ను దైవప్రవక్తగా అంగీకరించకపోయినా ఆయన విశ్వసనీయుడు, నిజాయితీపరుడు, సత్యసంధుడు అని శత్రువులు కూడా నమ్ముతారు. అంచేత వారు తమ విలువైన వస్తువుల్ని దైవప్రవక్త (స) దగ్గర భద్రపరచుకొని సేఫ్టీలాకర్‌లో దాచుకున్నట్లు గుండెలమీద చేయివేసుకొని మరీ తృప్తిచెందుతారు. ఇలా దాచబడిన వస్తువులు అనేకం ఉండటంవల్ల ఆయన అలి (రజి)ని తనవెంట తీసుకొనిపోకుండా ఎవరి వస్తువులు వారికి అప్పగించేవరకు మక్కాలోనే ఉండమని చెబుతున్నారు.

ఎంత ఔదార్యం! ఒకవైపు రక్తపిపాసులైన గర్భశత్రువులు ఈటెలు బాకులతో ఇంటిని దిగ్బంధంచేసి ఎప్పుడు బయటికొస్తే అప్పుడు చీల్చిచెండాడుదామని మాటువేసి కూర్చున్నారు. మరోవైపు మహాప్రవక్త ముహమ్మద్ (స) కనబరస్తున్న ఈ నిజాయితీ!



ఆయన దగ్గర లక్షల విలువగల వస్తువులున్నాయి. అవి ఎవరియో కాదు. సాక్షాత్తు తన ప్రాణం తోడటానికి కాపుకాస్తున్న శత్రువులవి. కావాలనుకుంటే ఆయన వీటన్నిటినీ వెంట తీసుకుపోవచ్చు. అప్పుడాయన్ని అడిగేవారెవరూ ఉండరు. ఇప్పటి క్లిష్ట పరిస్థితుల్లో ధనం కూడా చాలా అవసరమే. కాని మహాప్రవక్త ముహమ్మద్ (స) అందులో చిల్లిగవ్వ కూడా ముట్టడానికి ఇష్టపడలేదు. పైగా వాటిని తిరిగిచ్చేయడానికి అలి (రజి)ని నియమించి మరీ వెళ్తున్నారు. అలీ (రజి)ని వదలి వెళ్తున్నది ప్రతీకార దాహంతో పెటపెటలాడుతూ, అంతులేని ద్వేషాగ్నిలో పడి కుతకుతలాడే క్రూరమృగాల మధ్య!!

భద్రపరచిన వస్తువులు ప్రజలకు అప్పగించడానికి హజ్రత్ అలి (రజి) సంతోషంగా అంగీకరించారు. చివరిసారిగా దైవప్రవక్త (స) అలి (రజి)ని ఆలింగనం చేసుకొని “దేవుడే నీకు రక్ష. ఆయన తలచుకుంటే వారు నిన్నేమీ చేయలేరు. మనం మళ్ళీ మదీనాలో కలుసుకుందాం. ఇక పోయి పడుకో” అన్నారు.

తరువాత ఆయన బయటికి వచ్చి నేల మీది మన్ను కొంచెం చేతిలోకి తీసుకున్నారు. దాన్ని అవిశ్వాసులపై విసిరేసి ఖుర్‌ఆన్‌లోని యాసీన్ సూరా పఠిస్తూ వారి మధ్య నుంచే వెళ్ళిపోయారు. కాని అవిశ్వాసులెవరూ ఆయన్ని చూడలేకపోయారు.

అవిశ్వాసులు బయట ఊపిరి బిగబట్టి దైవప్రవక్త (స) కోసం ఎదురుచూస్తున్నారు. చాలాసేపు ఎదురుచూసి సహనం కోల్పోయారు. తూర్పుదిక్కున ఆకాశంలో కారుచీకట్లను చీల్చుకుంటూ ఉషఃకాంతులు కూడా ఉబికి వస్తున్నాయి.

అవిశ్వాసుల ఆరాటం ఎక్కువై పోయింది. అసహనంతో కస్సు బుస్సు మంటున్నారు. కొంతమంది ఉండబట్టలేక చిన్నగా తలుపుసందు నుంచి లోపలికి తొంగిచూశారు. పడక మీద పచ్చదుప్పటి కప్పుకొని పడుకున్న ఆకారాన్ని చూసి అసహనంగా నిట్టూర్పు విడిచారు.

“అదుగో చూడండి, ముహమ్మద్ (సల్లం) ఎలా పడుకున్నాడో నిశ్చింతగా దుప్పటి కప్పుకొని. పాపం! ఈ అమాయకుడికి జరగబోయే దారుణం తెలియదేమో అదమర్చి మస్తుగా నిద్రపోతున్నాడు” అని చెప్పుకున్నారు పరస్పరం.

“సరే ఇంకాస్సేపటికైనా బయటికి వస్తాడు కదా? అప్పుడు ఒక్కసారిగా అందరం విరుచుకుపడి పని పూర్తిచేద్దాం” అంటూ ద్విగుణీకృత ఉత్సాహంతో నిరీక్షించసాగారు.

గంటలు దొర్లిపోతున్నాయి. శత్రువుల కళ్ళు మూతలు పడుతున్నాయి. అలా మగత లోనే భళ్ళున తెల్లవారింది. ఇంట్లో అయిన అలికిడికి వారు ఉలిక్కిపడి లేచారు. మరుక్షణం అందరూ కత్తులు సిద్ధంచేసుకొని రక్తదాహంతో తహతహలాడుతూ లేచారు.

దారుణం! మహాదారుణం జరగబోతోంది!! ఇక ఒక్క క్షణం కూడా ఓపిక పట్టలేనట్లు మళ్ళీ తలుపుకన్నం నుంచి తొంగిచూశారు. అంతే! లోపలి దృశ్యం చూసి కొయ్యబారి పోయారు అంతా.

దైవప్రవక్త (స) పడక మీద దుప్పటి తొలగించుకుంటూ కొత్త ఆకారం కన్పించింది. శత్రువులు నిర్ఘాంతబోయి ఒకరి ముఖాలు ఒకరు చూసుకోసాగారు.

"ఎవరీయన? అబూతాలిబ్ కొడుకులా ఉన్నాడే!"

"ఔను. అబూతాలిబ్ కొడుకే. అలి బిన్ అబూతాలిబ్."

"మరి ముహమ్మద్ ఏమయినట్లు? అతని పడక మీద ఇతనెలా వచ్చాడు? మనం రాత్రంతా అలి కోసమే జాగారం చేశామా? ముహమ్మద్ మన కళ్ళుగప్పి పారిపోయాడా?"

"తప్పించుకొని ఎప్పుడో పోయివుంటాడు మన కళ్ళలో కారం చల్లి మరీ."

"అయ్యయ్యో ఎంత పని జరిగింది! నలుగురికి తెలిస్తే ఎంత అవమానం!! మన పథకమంతా తల్లకిందులై పోయిందే!"

పథకం భగ్నం కావడంతో ఖురైషీయులు అలి (రజి) మీద విరుచుకుపడ్డారు.

"ఏడి మీ నాయకుడు? ఎక్కడున్నాడు?" అంటూ గదమాయించారు వారు. "ఏమో, నాకు తెలియదు" అన్నారు హజ్రత్ అలి (రజి).

దాంతో అవిశ్వాసులు రెచ్చిపోయి హజ్రత్ అలి (రజి)ని బరబర బయటికి ఈడ్చుకు పోయారు. ముహమ్మద్ (స) ఎక్కడకి పోయాడో చెప్పమంటూ ఆయన్ని అమానుషంగా కొట్టసాగారు. కాని ఎంత కొట్టినా అలి (రజి) తనకేమీ తెలియదనే చెప్పారు.

దాంతో అవిశ్వాసులు బుసలుకొడ్తూ అలి (రజి)ని కాబాలో నిర్బంధించి హింసించడం మొదలెట్టారు. ఆఖరికి కొందరు బంధువుల జోక్యంవల్ల అలి (రజి) ప్రాణం దక్కింది.

## దైవప్రవక్త (స) కోసం గాలింపు-(65)

ఇస్లామీయఉద్యమ రథసారథి మహాప్రవక్త ముహమ్మద్ (స) పరుల హృదయాల్లో సత్యామృతం చిలికించడానికి నడిరాత్రి చీకటిలో మక్కా నుండి ఎప్పుడో అదృశ్యమయ్యారు.

ముహమ్మద్ (స) పట్నం వదలిపోయారన్న వార్త మక్కాలో దావానలంలా వ్యాపించింది. నగరవాసుల్లో కలకలం బయలుదేరింది. పలువురు పలువిధాలా చెప్పుకోసాగారు.

"పదండి. ఇక ఆలస్యం చేయకండి. వెతకండి" క్రోధావేశాలతో గొంతులు చిరిగి పోయేలా అరిచారు ఖురైష్ నాయకులు.

వారు కాలుకాలిన పిల్లుల్లా నలుగురు నాలుగు వైపులా పరుగెత్తారు. అయితే మదీనా దిక్కుకు పోయినవాళ్ళు ముహమ్మద్ (స) జాడ దొరక్క నిరాశతో తిరిగొచ్చారు.

కొందరు హజ్రత్ అబూబకర్ (రజి) ఇంటికి పరుగుతీశారు. ఎందుకంటే ఆయన దైవప్రవక్త (సల్లం)కు అత్యంత సన్నిహితుడు, ప్రాణస్నేహితుడు. అలా అబూబకర్ (రజి) ఇంటికి పోయినవారిలో కరుడుకట్టిన సత్యతిరస్కారి అబూజహల్ కూడా ఉన్నాడు. పోగానే వారు తలుపులు విరిగిపోతాయా అన్నట్లు దబదబా బాదారు.

ఈ చప్పుడుకు లోపల ఉన్న అబూబకర్ కుమార్తె అస్మా (రజి) గుండెలు దడదడలాడి పోయాయి. ఆమె బిక్కు బిక్కుమంటూ వెళ్ళి తలుపు తెరిచారు.

శత్రువులు ఆగ్రహోదగ్రులయి "ఏడి మీ నాన్న? ఎక్కడున్నాడు?" అని గద్దించారు.



అస్మా (రజి) భయపడుతూనే "ఏమో ఎక్కడికి పోయారో నాకు తెలియదు" అన్నారు.

అబూబకర్ (రజి) కూడా ముహమ్మద్ (సల్లం)తో పాటు వెళ్ళిపోయి ఉంటాడని శత్రువులు గ్రహించారు. దాంతో అబూజహల్ బాగా రెచ్చిపోయి హజ్రత్ అస్మా (రజి) చెంప మీద లాగికొట్టాడు. ఆ దెబ్బకు పాపం అస్మా (రజి) చెవిపోగు తెగి దూరంగా పడి పోయింది. తరువాత శత్రువులు అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

మహాప్రవక్త ముహమ్మద్ (స) శత్రువుల కళ్ళుగప్పి నగరం నుంచి బయటపడ్డారు. కొంత దూరం నడచిన తర్వాత విడనాడని బంధమేదో పెనవేసుకోగా అప్రయత్నంగా నిలబడి వెనక్కి తిరిగిచూశారు. ఆకాశదీపాల క్రింద తన ప్రియనగరం ఎంతో శోభాయమానంగా కన్పించింది. ఒక్కసారిగా గతస్మృతులు గుర్తుకొచ్చాయి.

తానీ నగరంలో పుట్టిపెరిగారు. ఇక్కడే ఓఇంట్లో వివాహం చేసుకున్నారు. ఈ నగరంలోనే తనకు వహీభాగ్యం లభించింది. ఈ నగరం నుంచే తాను దివ్యలోకాలకెళ్ళి దైవసాన్నిధ్యం పొందారు. ఈ పవిత్ర క్షేత్రమే తన ధార్మికోద్యమానికి ప్రథమవేదిక అయ్యింది. ఇలాంటి నగరానికి ఈరోజు తాను మార్గాంతరంలేక వీడ్కోలు చెప్పవలసివస్తోంది.

ఈ ఆలోచనతో దైవప్రవక్త (స) అవ్యక్తమైన బాధతో నిట్టూర్చారు. మనసు కకావికలమై పోయింది. కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. హృదయవీణ మూగగా విలపించింది:

"మక్కా నగరమా! ప్రపంచ నగరాలన్నిటిలో నీవే దేవునికి అత్యంత ప్రియమైన దానవు. నాక్కూడా నీవే నగరాలన్నిటి కంటే ఎక్కువ ప్రియమైన దానవు. బహుదైవారాధకులు బహిష్కరించకపోతే నేను నిన్ను ఎన్నటికీ వీడిపోయేవాడ్ని కాను."

స్వస్థలం ఎడబాటుతో పొరలివచ్చిన ఆవేదనను బలవంతంగా దిగమింగి కర్తవ్యోన్ముఖులయ్యారు దైవప్రవక్త (స). చీకటిలో చరచరా నడవసాగారు. కొంతదూరం పోయిన తర్వాత మరోదారి నుంచి ప్రియసహచరుడు అబూబకర్ (రజి) కూడా వచ్చి కలుసుకున్నారు. ఇద్దరూ వేగంగా అడుగులేస్తూ 'సౌర్' గుహకు చేరుకున్నారు.

ఉదయకాంతులతో చీకటి తెరలు క్రమక్రమంగా విడిపోతున్నాయి. దైవప్రవక్త (సల్లం), ఆయన ఆప్తమిత్రుడు అబూబకర్ (రజి) కలసి నమాజ్ చేశారు.

ఆ తరువాత హజ్రత్ అబూబకర్ (రజి) గుహలో ప్రవేశించి రాళ్ళు, ముళ్ళు తీసేసి నేల శుభ్రం చేశారు. అక్కడక్కడ కన్నాలు ఉంటే గుడ్డపేలికలు చుట్టి వాటిలో పెట్టారు. తరువాత దైవప్రవక్త (స)ని లోపలికి తీసికెళ్ళారు.

దైవప్రవక్త (సల్లం) చాల అలసిపోయారు. అందువల్ల ఆయన అబూబకర్ (రజి) తొడ మీద తలపెట్టి పడుకున్నారు. కాస్సేపటికి ఆయనకు నిద్ర పట్టింది.

హజ్రత్ అబూబకర్ (రజి) గుహలోని కన్నాలన్నీ గుడ్డ పేలికలతో మూసినా ఇంకో కన్నం మిగిలిఉంది. దానిపై ఆయన తనకాలి బొటనవ్రేలు పెట్టారు. అయితే కాస్సేపటికి ఆ కన్నంలో ఏం విషపురుగుందోగాని, అది అబూబకర్ (రజి) కాలికి కాటేసింది. కాని దైవప్రవక్త (స)కు నిద్రాభంగం కలుగుతుందని ఆయన బాధను ఓర్చుకుంటూ అలాగే కదలకుండా కూర్చున్నారు.

కాస్సేపటికి దైవప్రవక్త (స) మేల్కొన్నారు. చూస్తే అబూబకర్ (రజి) లోలోన బాధ పడుతున్నట్లు అన్పించింది. "అబూబకర్! ఏమైంది ఏదో బాధపడుతున్నట్లు ఉన్నావు?"

"దైవప్రవక్తా! ఏమని చెప్పను? ఇదిగో ఈ కన్నం మూసేయడానికి కాలి బొటనవ్రేలు అడ్డం పెడ్తే విషపురుగేదో కరిచింది."

"బాధపడకు. ముందు అక్కడ్నుంచి కాలు తీసెయ్యి" అన్నారు దైవప్రవక్త (స).

అబూబకర్ (రజి) కన్నం పైనుంచి కాలుతీసి దగ్గరకు లాక్కున్నారు. వెంటనే కన్నంలో నుంచి భయంకరమైన ఓ త్రాచుపాము బయటికొచ్చి పడగ విప్పింది.

"సర్పమా! నువ్వు నా ఆప్తమిత్రుడ్ని కాటేసి నా మనస్సు నొప్పించావే!" అన్నారు దైవప్రవక్త (సల్లం)

ఈ మాట వినగానే త్రాచుపాము తలవంచి అక్కడ్నుంచి చరచరా వెళ్ళిపోయింది.

ఆ తర్వాత దైవప్రవక్త (సల్లం) తన లాలాజలం తీసి అబూబకర్ (రజి) కాలిబొటన వ్రేలిపై రాసి రుద్దారు. మరుక్షణమే పాము విషప్రభావం పోయి అబూబకర్ (రజి)కు బాధ తగ్గిపోయింది. తరువాత దైవప్రవక్త (సల్లం) మళ్ళీ నడుంవాల్చి పడుకున్నారు.

కాస్సేపటికి ఓ సాలెపురుగు వచ్చి గుహముఖంపై గూడుఅల్లింది. ఆతర్వాత ఎటు నుంచో రెండు పావురాళ్ళు వచ్చి గుహద్వారం ముందు కిచకిచమంటూ ఎగరసాగాయి.

అటు ఖురైషీయులు ఎలాగైనా దైవప్రవక్త (స)ను పట్టుకోవాలని తీవ్రంగా ప్రయత్ని స్తున్నారు. వారు అడుగుజాడల్ని గుర్తించగలిగే మనిషికోసం వెతికారు. చివరికి కుర్జ్ బిన్ అల్ఖమా అనే వ్యక్తి దొరికాడు. కుర్జ్ అడుగుజాడల్ని గుర్తించడంలో గొప్ప ప్రవీణుడు.

మరునాడు మధ్యాహ్నం సౌర్ పర్వతం నరరూప రాక్షసుల అరుపులతో దద్దరిల్ల సాగింది. ఖురైషీయులు ఈలలు, అరుపులు, వికటాట్టహాసాలతో కర్రలు, కటారులు తిప్పుకుంటూ కుర్జ్ బిన్ అల్ఖమా వెంట వచ్చారు.

ఆ సమయంలో దైవప్రవక్త (స) తనను చెండాటానికి వస్తున్న రాకాసిమూకల పొలికేకలకు ఏమాత్రం చలించకుండా ప్రశాంతంగా దైవధ్యానంలో నిమగ్నులై ఉన్నారు. కాని దుష్టుల అరుపులు దగ్గరయ్యే కొద్దీ అబూబకర్ (రజి)లో ఆందోళన అంతకంతకు ఎక్కువ కాసాగింది. తన ప్రియతమ నాయకుడ్ని కాపాడుకునే మార్గం ఏమిటీ?

"అయ్యో! నేను ముహమ్మద్‌ను నా హృదయంలో దాచుకోగలిగితే ఎంత బాగుండు! శత్రువుల కంటబడకుండా ఆయన్ని నా దేహంతో కప్పగలిగితే నేనెంత అదృష్టవంతుడ్ని!!" ఆయన హృదయం విలపించింది.

కుర్జ్ బిన్ అల్ఖమా ఎంతో జాగ్రత్తగా దారిలో పాదచిహ్నాలు చూసుకుంటూ కొండ మీదికి ఎక్కాడు. ఖురైషీయులు అతని వెనకాలగా నడుస్తున్నారు. కుర్జ్ కొండ మీదికి పోయి హఠాత్తుగా ఒక చోట ఆగాడు. తరువాత ఎటు పోవాలో అర్థంగాక అయోమయంగా చూడసాగాడు. అతని దేహం నుండి చెమటలు కారుతున్నాయి. చివరికి అతను దిక్కుతోచక దిగాలుపడిపోయి నిలబడ్డాడు. అతని వాలకం చూసి ఖురైషీయులకు ఆశ్చర్యం కలిగింది.



"ఏమయింది? అకస్మాత్తుగా ఆగిపోయి అలా దిక్కులు చూస్తున్నావేమిటీ?"

"వాళ్ళిద్దరు ఈ రాయి దాకా వచ్చారు. ఆ తరువాత ఎటు పోయారో తెలియడం లేదు" అన్నాడు కుర్జ్ ఎదురుగా ఉన్న ఓ రాతి వైపు చూపిస్తూ.

"ఇబ్నె అల్ఖమా! ఈరోజు ఏమయింది నీకు? ఇలా ఇదివరకెప్పుడూ పొరబడలేదే నీవు!" అన్నారు ఖురైషీయులు వస్తున్న కోపాన్ని తమాయించుకుంటూ.

కొండ నుండి కొద్దిదూరంలో వారికి ఓ పశువులకాపరి కన్పించాడు. ఖురైషీయులు అతని దగ్గరకు పోయి "కొండ మీదికి ఇద్దరు మనుషులు రావడం చూశావా నువ్వు?" అని అడిగారు.

"నేనెవరినీ చూడలేదు. వారిద్దరు ఆ గుహలో ఉంటారేమో చూడండి" అన్నాడు పశువులకాపరి కొండ ఎగువభాగాన కొద్ది దూరంలో ఉన్న గుహ వైపు చూపిస్తూ.

ఖురైషీయులు వెంటనే పైకెక్కి గుహ వైపు వడివడిగా నడవసాగారు. అందరి చేతుల్లో కత్తులు, ఈటెలు, విల్లంబులు ఉన్నాయి. అందరి హృదయాల్లో ఒకే దీక్ష! ఒకే కాంక్ష!! ముహమ్మద్ (స)ని వధించే అదృష్టం తనకే దక్కాలి. అంచేత గుహ దగ్గరవుతున్న కొద్దీ వారి ఆరాటం, ఆర్భాటాలు ఎక్కువ కాసాగాయి.

వారిలో ఒక యువకుడు అతి వేగంగా గుహ వైపు పరుగెత్తాడు. కాని గుహ ఇంకా కొన్ని గజాల దూరం ఉందేమో, ఠక్కున ఆగిపోయాడు. రెండు క్షణాలు అటూ ఇటూ అయోమయంగా చూసి, నిరుత్సాహంతో వెనక్కి మరిలాడు. వెనకాల వడివడిగా అక్కడికి చేరుకున్న ఖురైషీయులు అతడ్ని చూసి విస్తుబోయారు.

గుహ లోపలున్న అబూబకర్ (రజి)కు గుహ బయట కొద్ది దూరంలో ఉన్న శత్రువుల పాదాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. దాంతో ఆయన దైవప్రవక్త (సల్లం)కు ప్రమాదం ముంచుకొస్తుందేమోనని భావించి కంగారు పడసాగారు. దైవప్రవక్త (సల్లం) ధ్యానం ముగిసింది. ఆయన అబూబకర్ (రజి) ముఖంలోని ఆందోళనను గమనించి "భయపడకు. దేవుడు మనకు తోడున్నాడు" అన్నారు ధైర్యం చెబుతూ.

ఖురైషీయులు ఆ యువకుని వైపు ఆశ్చర్యంగా చూస్తూ "ఏమయింది వెనక్కి తిరిగావు, గుహలోకి తొంగయినా చూడకుండా" అని అడిగారు ఆదుర్దాగా.

"ఏమని చెప్పను? బహుశా అప్పటికి ముహమ్మద్ పుట్టనైనా పుట్టి ఉండడు. అప్పటి నుంచి గుహ మీద ఓ పెద్ద సాలెగూడు అల్లుకొని ఉంది. గుహ బయట రెండు పావురాళ్ళు కూడా గుడ్లు పెట్టి ఎగురుతున్నాయి. దారిలో ఓ పెద్ద చెట్టు కూడా ఉంది. ఇక అలాంటి గుహలో మనుషులు ఉంటారని ఎలా అనుకోను?" అన్నాడా యువకుడు రొప్పుతూ రొజుతూ.

ఆ యువకుని మాటలు విని ఖురైష్ నాయకుల ముఖాలు జావగారి పోయాయి. చివరికి అందరూ నిరాశా నిస్పృహలతో చేతులు నులుపుకుంటూ, కాళ్ళీడ్చుకుంటూ ఇళ్ళకు తిరుగుముఖం పట్టారు.

# సౌర్ గుహలో మూడు రోజులు-(66)

అవిశ్వాసులు తనను ఇంకా వెంటాడుతూ ఉండవచ్చని దైవప్రవక్త (సల్లం) మూడు రోజుల దాకా సౌర్‌గుహలోనే ఉండవలసి వచ్చింది. ఈ మూడు రోజులు అబూబకర్ (రజి) కొడుకు అబ్దుల్లా (రజి) పగలంతా నగరంలో తిరిగి, ఖురైషీయులు దైవప్రవక్త (సల్లం)కు వ్యతిరేకంగా ఏమేమి కుట్రలు పన్నుతున్నారో తెలుసుకొని రాత్రిపూట వచ్చి సమాచారం అందజేసేవారు. ఆయన చెల్లెలు అస్మా (రజి) తండ్రికి, దైవప్రవక్త (సల్లం)కు అన్నం నీళ్ళు తెచ్చిచ్చేవారు. హ్రజత్ అబూబకర్ (రజి) సేవకుడు ఆమిర్ బిన్ ఫుహైరా మేకలను మేపుకుంటూ గుహ దగ్గరకు వచ్చేవాడు.

హ్రజత్ అస్మా (రజి) తెచ్చిన అన్నం దైవప్రవక్త (సల్లం), అబూబకర్ (రజి) తినేవారు. ఆ తరువాత అస్మా (రజి), అబ్దుల్లా (రజి) గుహ దగ్గర్నుంచి తిరిగి వెళ్ళేటప్పుడు శత్రువులు అడుగుజాడల్ని గుర్తించడానికి వీలులేకుండా ఉండేందుకు ముందు వారిద్దరు నడుస్తుంటే వారి వెనుక ఆమిర్ మేకలను తోలుకుంటూ అనుసరించేవాడు.

ఇలా మూడు రోజులు గుహలో గడిపి, అబ్దుల్లా (రజి) సేకరించిన సమాచారాన్ని బట్టి శత్రువులు తమను వెంటాడటం మానేశారని నిర్ధారణ చేసుకున్నారు. అప్పుడు హ్రజత్ అబూబకర్ (రజి) కొడుకుతో “నేను మన ఇంటి దగ్గర రెండు ఒంటెల్ని సిద్ధంచేసి ఉంచాను. నీవు వెంటనే పోయి, ఎవరికీ తెలియకుండా వాటిని తీసుకురా. వచ్చేటప్పుడు ఇబ్నె అర్ఖత్‌ను కూడా పిలుచుకురా” అని చెప్పి పంపించారు.

ఆ సాయంకాలమే అబ్దుల్లా (రజి) గుహ దగ్గరకు తిరిగొచ్చారు. ఆయన వెంట అస్మా (రజి), ఆమిర్ కూడా ఉన్నారు. వారి వెనకాల ఇబ్నె అర్ఖత్ ఒంటెలను తోలుకొని వచ్చాడు. ఇబ్నెఅర్ఖత్ ముస్లిమేతరుడు అయినప్పటికీ అబూబకర్ (రజి)కు ఎంతో నమ్మకస్తుడు. అందువల్ల అబూబకర్ (రజి) అతనికి కొంత పైకం ముట్టజెప్పి తమను నిర్జనప్రాంతం గుండా మదీనా తీసికెళ్ళటానికి మార్గదర్శిగా కుదుర్చుకున్నారు.

హ్రజత్ అస్మా (రజి) ప్రయాణానికి కావలసిన సామానంతా సిద్ధపరిచారు. కాని అన్నం పాత్ర, నీళ్ళతిత్తి బిగించి కట్టడానికి ఏమీ దొరక్క కాస్సేపు కంగారుపడ్డారు. తరువాత మెరుపులాంటి ఆలోచన తట్టింది. వెంటనే ఆమె తన ఓణీ తీసి బరబరా రెండు ముక్కలుగా చింపి వాటికి కట్టారు. ఆమె సమయస్ఫూర్తి చూసి దైవప్రవక్త (సల్లం) చిరునవ్వుతో “జాతున్నితాఖైన్” (రెండు ఓణీల మహిళా” అని పిలిచారు.

దైవప్రవక్త (స) ఒకఒంటె మీద, ఆయన సహచరుడు మరోఒంటె మీద కూర్చున్నారు. ఇబ్నెఅర్ఖత్ తన సొంత ఒంటె మీద కూర్చున్నాడు. హ్రజత్ అబూబకర్ (రజి) తన వెనుక సేవకుడు ఆమిర్‌ని కూర్చోబెట్టుకున్నారు. అలా ఈ నలుగురూ కలసి నబవీ శకం 14వ సంవత్సరం, రబీవుల్ అవ్వల్ ఒకటో తేదీ (క్రీ.శ. 16-9-622)న ఇబ్నెఅర్ఖత్ సారథ్యంలో నిర్మానుష్యంగా ఉన్న తీరప్రాంతం గుండా ప్రయాణమయ్యారు.

హ్రజత్ అబూబకర్ (రజి) వ్యాపారం కోసం అనేక ప్రాంతాలు తిరిగి ఉన్నందున ఆయనకు దారిలో చాలామంది పరిచయస్థులు తారసపడుతున్నారు. దారిలో ఒక మిత్రుడు



అబూబకర్ (రజి) ముందు నడుస్తున్న దైవప్రవక్త (స)ను చూసి “అబూబకర్! ఎవరీయన? నేనిది వరకెప్పుడూ నీ వెంట ఈ మనిషిని చూడలేదే!” అన్నాడు ఆశ్చర్యంగా చూస్తూ.

“ఈయన నాకు దారి చూపడానికి వచ్చిన మార్గదర్శి” అన్నారు అబూబకర్ (రజి).

ఈ బాటసారులు అలా ప్రయాణం చేస్తూ హుజ్ఫా అనే ప్రాంతానికి చేరుకున్నారు.. అక్కడ దైవప్రవక్త (స) ఓసారి వెనక్కి తిరిగి మక్కాదారి వైపు చూడసాగారు. అలా చూస్తుంటే ఆయన మనోవీథిలో కాబాలయం లీలగా మెదిలింది. స్వదేశస్థులు వెళ్ళగొట్టినా స్వదేశాభిమానం వీడని ఆయన మనసు మరోసారి విలపించింది. ముఖంపై ఉదాసీనఛాయలు అలుముకున్నాయి. అప్పుడు దైవదూత జిబ్రీల్ (అలై) వచ్చి ఈ సూక్తులు విన్పించారు:

“ప్రవక్తా! నీపై ఈ ఖుర్‌ఆన్‌ని అవతరింపజేసిన దేవుడు నిన్ను తప్పకుండా అత్యంత శ్రేష్ఠమయిన స్థానానికి చేర్చుతాడు. “ఎవరు సన్మార్గగామి అయివచ్చాడో, ఎవరు స్పష్టమయిన దుర్మార్గంలో పడివున్నాడో నా ప్రభువుకు బాగా తెలుసు’ అని చెప్పు వారికి.” (28:85)

# సురాఖా బిన్ మాలిక్ యత్నం-(67)

మక్కా అవిశ్వాసులు దైవప్రవక్త (స) కోసం వెతికి వెతికి వేసారిపోయారు. చివరికి ఆయన్ని పట్టితెచ్చినవారికి వంద ఒంటెల బహుమానం ఇస్తామని ప్రకటించారు. బహుమానం కోసం చాలామంది ప్రయత్నించారు. కాని వారి ప్రయత్నాలేవీ ఫలించలేదు.

ఖురైష్ నేతలు ఓరోజు సమావేశమై తీవ్రంగా ఆలోచించసాగారు. అందరి ముఖాలలో నిర్లిప్తత అలుముకుంది. అంతలో వాళ్ళదగ్గరికి ఓ ఆగంతకుడు వచ్చాడు. ఖురైషీయులంతా ఒక్కసారిగా అతని వైపు తలెత్తి చూశారు.

“నేను తీరప్రాంతం నుంచి వస్తుంటే ముగ్గురు మనుషులు ఎదురయ్యారు. వారు ముహమ్మద్, ఆయన సహచరులైవుండవచ్చని నా అనుమానం”అన్నాడు ఆగంతకుడు.

ఆ సమయంలో సురాఖా బిన్ మాలిక్ అనే అతను కూడా ఖురైషీయుల సమావేశంలో కూర్చున్నాడు. అతను చాలా దూరదృష్టి కలవాడు. ఆగంతకుడు చెప్పింది నిజమే అయివుంటుందని గ్రహించాడు. ఆ విషయాన్ని పైకి వ్యక్తపరచలేదు. పైగా ముహమ్మద్ (స)ను పట్టుకునే గౌరవం తానే పొందాలని, వంద ఒంటెల బహుమానం తానే కొట్టేయాలని తలచి సురాఖా ఖురైషీయుల్ని పెడదారి పట్టించడానికి పూనుకున్నాడు. “అబ్బే వాళ్ళు ముహమ్మద్, ఆయన అనుచరులు కాదండి. ఆ మనుషులు నా ముందు నుంచే కదా పోయింది. వాళ్ళను నేను బాగా ఎరుగుదును” అన్నాడతను.

సురాఖా చెప్పిందే నిజమని తోచింది ఖురైషీయులకు. అంచేత ఆగంతకుడు చెప్పిన మాటలు ఎవరూ పట్టించుకోలేదు. సురాఖా ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు కాస్సేపు ఖురైషీయులతో ముచ్చటించి, ఆ తర్వాత లేచి ఇంటికెళ్ళాడు.

ఇంటికి పోగానే సేవకునికి చెప్పవలసిన విషయాలు చెప్పి, ఆయుధాలతోపాటు ప్రయాణానికి కావలసిన వస్తువులు సిద్ధం చేసుకున్నాడు. సేవకుడు గుర్రం మీద జీను కట్టి పట్నం వెలుపలికి తీసుకుపోయి యజమాని కోసం ఎదురుచూడసాగాడు. కాస్సేపటికి

సురాఖా అక్కడికి చేరుకున్నాడు. తాను తీరం వెంబడి ప్రయాణం చేస్తున్నట్లు ఎవరికీ తెలియకుండా ఉండటానికి అన్ని జాగ్రత్తలు తీసుకున్నాడు. సేవకుడ్ని హెచ్చరించి గుర్రం ఎక్కి బయలుదేరాడు. గుర్రం దుమ్ము లేపుకుంటూ పరుగెత్తసాగింది.

గుర్రం తీరప్రాంతంలో కొంతదూరం కూడా పరుగెత్తలేదు, అంతలో ఒక్క కుదుపు కుదిపేసింది. ఆ కుదుపుకు సురాఖా నేలకొరిగేవాడే కాని, కళ్ళెంగట్టిగా పట్టుకొని ఎలాగో గుర్రాన్ని అదుపులోకి తెచ్చుకున్నాడు. తర్వాత కళ్ళెం వదలగానే అది గాలిలో దూసుకు పోయింది. కొంతదూరం పరుగెత్తిన తరువాత మళ్ళీ అమాంతం కుదిపేసింది.

కాని సురాఖా అధైర్యం చెందలేదు. గుర్రాన్ని నేర్పుగా అదుపులోకి తెచ్చుకొని అదిలించాడు. ఈసారి అది ఇంకాస్త బలం పుంజుకొని శరవేగంతో పరుగుతీసింది. దాని వేగం చూస్తుంటే సురాఖాకు భయం, తత్తరపాటు కలిగాయి. అయినా పట్టుదలతో ప్రయాణం సాగించాడు.

ప్రవక్త (స) ప్రయాణం ఒక రాత్రి, ఒక పగలు నిరాటంకంగా సాగింది. శత్రువులెవరూ వెంటాడుతున్న సూచనలేమీ లేకపోవడంతో అందరూ నిశ్చింతగా ప్రయాణిస్తున్నారు.

మరుసటిరోజు మధ్యాహ్నంవేళ. ఎండ తీవ్రంగా ఉంది. ప్రయాణ బడలికతో విశ్రాంతి తీసుకుందామని తలచి అందరూ ఓ చెట్టు క్రింద దిగారు. హజ్రత్ అబూబకర్ (రజి) దైవప్రవక్త (స) కోసం ఓ చోట శుభ్రపరచి మేకచర్మం పరిచారు. తరువాత వెంట తెచ్చిన అన్నం మూట విప్పి ముందుంచారు. అందరూ కలసి అన్నం తిన్నారు. భోజనం ముగిసిన తరువాత దైవప్రవక్త (స) కాస్సేపు నిద్రపోవడానికి ఉపక్రమించారు.

సాయంత్రం కావచ్చింది. ఎండ తీక్షణత కూడా తగ్గింది. ప్రవక్త బృందం ప్రయాణం కొనసాగించడానికి సిద్ధమయింది. అంతలో అకస్మాత్తుగా అబూబకర్ (రజి) దృష్టి దక్షిణ దిక్కు వైపుగా మళ్ళింది. ఎవరో ఒక వ్యక్తి గుర్రం మీద వేగంగా ఇటువైపే వస్తున్నాడు. దాంతో అబూబకర్ (రజి) గుండెలు దడదడ లాడిపోయాయి.

"దైవప్రవక్తా! మనం పట్టుబడి పోయాం. అదిగో అటు చూడండి శత్రువు వస్తున్నాడు" అన్నారు కంగారుపడుతూ ఆయన.

కాని దైవప్రవక్త (స) ముఖంలో ఆందోళన మచ్చుకైనా లేదు. "అబూబకర్! కంగారు పడకు. దైవం మనకు తోడున్నాడు" అన్నారు ఆయన ధైర్యం చెబుతూ.

శత్రువు మరికాస్త దగ్గరయ్యాడు. డెక్కల చప్పుడుతో, ధూళి కణాలతో గుర్రం వేగం చాలా భీకరంగా ఉంది. అది మరి కాస్త దగ్గరయింది. అంతే, ఒక్క పల్టీ కొట్టింది. ఆ దెబ్బతో గుర్రం ముందుకాళ్ళు కాస్తా మోకాళ్ళదాకా నేలలో కూరుకుపోయాయి. ఆ ఊపుకు రౌతు కూడా ఇసుకలో బోర్లాపడ్డాడు.

ఇప్పుడు సురాఖా ధైర్యం పూర్తిగా సన్నగిల్లింది. అతనికి కనువిప్పు కలిగింది. ఆలోచిస్తే ఇవన్నీ అపశకునాలే అన్పించాయి. దాంతో అతను తాను చేయబోయే పని దేవునికి ఇష్టం లేదు కాబోలు అనుకున్నాడు. అంచేత సురాఖా అక్కడే ఆగి దైవప్రవక్త (సల్లం)ను, ఆయన సహచరుల్ని కేకవేసి పిలిచాడు.



"నేను మాలిక్ బిన్ జూషమ్ కొడుకు సురాఖాను. కొంచెం ఆగండి, మీతో మాట్లాడాలి. నేను మీకు ఎలాంటి హాని తలపెట్టను. నామాట నమ్మండి."

దైవప్రవక్త (స) ఈమాట విని సురాఖా కోసం దైవాన్ని ప్రార్థించారు. దాంతో ఇసుకలో కూరుకుపోయిన గుర్రం బయటపడింది. అతను దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వచ్చాడు. ఆ మహనీయుడి (స) ముఖవర్చస్సు చూడగానే సురాఖా హృదయంలో ఆయన పట్ల ఎనలేని గౌరవభావం ఏర్పడింది.

"దైవప్రవక్తా! ఖురైషీయులు మిమ్మల్ని పట్టితెచ్చేవారికి వంద ఒంటెలు బహుమానం ఇస్తామని ప్రకటించారు. ఆ బహుమానం కోసం అనేకమంది మిమ్మల్ని పట్టుకోవడానికి పట్నం నలుదిక్కులా పరుగెత్తారు. వంద ఒంటెల పేరాశ నన్ను కూడా వివశుడ్ని చేసింది. దైవప్రవక్తా! నన్ను క్షమించండి. నేనిప్పుడు మిమ్మల్ని వెంటాడేవాళ్ళను ఆపి వెనక్కి పంపిస్తాను. నాకో శాంతిపత్రం రాసివ్వండి చాలు." అన్నాడతను వినయంగా నిలబడి.

ఈమాటలు విని దైవప్రవక్త (స)కు దయ కలిగింది. అతను కోరినట్లు అబూబకర్ (రజి) చేత శాంతిపత్రం రాయించి ఇచ్చారు.

సురాఖా దాన్ని తీసుకొని తిరిగి వెళ్ళిపోవడానికి గుర్రం ఎక్కాడు.

"సురాఖా! నువ్వు కిస్రా (ఈరాన్ చక్రవర్తి) కంకణం ధరించినప్పుడు నీ పరిస్థితి ఎలా ఉంటుందో!" అన్నారు దైవప్రవక్త (స) సురాఖా వైపు చిరునవ్వుతో చూస్తూ.

"ఏమిటీ! నేను కిస్రా కంకణం ధరించడమా!!" సురాఖా నోరు తెరచి సంభ్రమాశ్చర్యాలతో దైవప్రవక్త (స) వైపు చూడసాగాడు.

"ఔను. నువ్వు ఈరాన్ చక్రవర్తి కంకణం ధరిస్తావు" అన్నారు దైవప్రవక్త (స) మళ్ళీ.

"నేను ధరిస్తానా!!" సురాఖా ఆశ్చర్యం నుండి ఇంకా తేరుకోలేకపోయాడు.

"ఔను నువ్వే. నువ్వు కాకపోతే ఇంకెవరు అనుకుంటున్నావు?"✦ అన్నారు దైవప్రవక్త (సల్లం) చిరునవ్వు నవ్వుతూ.

"దైవప్రవక్తా! నాకు నమ్మకం ఉంది. మీమాట ఎన్నటికీ అసత్యం కాదు. ఇక నేను వెళ్తున్నాను" అంటూ సురాఖా గుర్రం అదిలించి మక్కా వైపు బయలుదేరాడు.

## మదీనా దిశగా మహాప్రవక్త(స) ప్రయాణం-(68)

దైవప్రవక్త (సల్లం), ఆయన అనుచరులు తిరిగి ప్రయాణం కొనసాగించారు. ఖుదైద్ ఎడారిలో ప్రయాణంచేస్తూ ఓ చిన్న గ్రామానికి చేరుకున్నారు. అక్కడ శిబిరాల రూపంలో కొన్ని ఇళ్ళు మాత్రమే ఉన్నాయి. ఒక శిబిరం ముందు ఓ నడికారు మహిళ కూర్చొని ఉంది. ఆమె బాటసారులకు ఆతిథ్యమివ్వడంలో చాలా పేరుగాంచింది. ఆ ఏడు కరువచ్చినప్పటికీ ఏ కొంచెం ఉన్నా దాన్ని బాటసారులకు పెట్టి తాను పస్తుండేది.

✦ *ఈ భవిష్యత్‌వాణి రెండవఖలీఫా ఉమర్ (రజి) కాలంలో క్రియారూపం దాల్చింది. ఈరాన్‌ని జయించాక ఖలీఫా స్వయంగా కిస్‌రా కంకణం ఆయన చేతికి తొడిగారు.*

దైవప్రవక్త (సల్లం), ఆయన సహచరులు నేరుగా ఆ స్త్రీ శిబిరానికెళ్ళి ఒంటెలపై నుంచి దిగారు. ఆమె వారిని సాదరంగా ఆహ్వానించింది.

"ఉమ్మెమాబద్! నీ దగ్గర తినడానికి ఏమైనా ఉందా?" అడిగారు దైవప్రవక్త (స).

"ఏమైనా ఉంటే మీరు అడక్కముందే నేను మీ ముందు తెచ్చిపెట్టేదాన్ని."

"సరే, ఈ మేక ఒక్కటే ఇక్కడ ఎందుకు ఉంది?"

"ఇది చాలా బలహీనమైన మేక. తోటి మేకలతో కలసి పోలేని స్థితిలో ఉంది."

"మరి ఇది పాలేమయినా ఇస్తుందా?"

"దాని పొదుగులో పాలుంటే కదా!" అన్నది ఉమ్మెమాబద్.

"నువ్వనుమతిస్తే నేను దానిపొదుగు నుండి పాలుతీస్తాను" అన్నారు దైవప్రవక్త (సల్లం).

"ఏమిటీ! మీరు దాని పొదుగు నుండి పాలుతీస్తారా!! చాలా ఆశ్చర్యంగా ఉందే. మీరు తీస్తానంటే నాకెలాంటి అభ్యంతరం లేదు" అన్నది ఆమె చిత్రంగా చూస్తూ.

అప్పుడు దైవప్రవక్త (స) ఆ మేక దగ్గరకు పోయి దాని వీపును, పొదుగును చేత్తో నిమిరారు. తర్వాత ఓ పెద్దపాత్ర తెప్పించి దేవునిపేరు స్మరించి పాలు పితకడం మొదలు పెట్టారు. పాలు ధారాపాతంగా వస్తున్నాయి. కాస్సేపటికే పాత్ర నిండిపోయింది.

ఉమ్మెమాబద్ సంభ్రమాశ్చర్యాలతో చూడసాగింది. ఆమె ఆశ్చర్యం నుంచి తేరుకోక ముందే దైవప్రవక్త (స) అందరికంటే ముందు ఆమె దగ్గరికే పాలు తెచ్చి తాగమన్నారు.

ఉమ్మెమాబద్ పాలు తాగింది. తరువాత మిగిలినవాళ్ళు తాగారు. చివర్లో దైవప్రవక్త (సల్లం) తాగుతూ "ప్రజలకు తాగించేవాడు చివర్లో తాగుతాడు" అన్నారు.

పాలు అంతమంది తాగినా ఇంకా మిగిలి ఉన్నాయి. దైవప్రవక్త (స) వాటిని అబూమాబద్ రాగానే ఇచ్చేయమని చెప్పి అనుచరులతో అక్కడ్నుంచి బయలుదేరారు.

సూర్యుడు నిప్పులు చెరగుతున్నాడు. దాహంతో నాలుకలు పిడచ కట్టుకొని పోతున్నాయి. కాని దరిదాపుల్లో ఎక్కడా నీటిచుక్కయినా ఉన్నట్లు జాడ లేదు. మరికొన్ని మైళ్ళు ప్రయాణం చేసిన తర్వాత ఆశలు రేకెత్తిస్తూ దూరాన కొన్ని గుడారాలు కన్పించాయి. వెంటనే దైవప్రవక్త (స), ఆయన అనుచరులు ఆ గుడారాల వైపు నడిచారు.

బాటసారుల్లో హజ్రత్ అబూబకర్ (రజి)ని చూడగానే గుడారాల దగ్గర్నుంచి ఒక వ్యక్తి వడివడిగా వచ్చి "రండి, రండి. అబూబకర్! మేమెంతో అదృష్టవంతులం. ఈరోజు మక్కాకు చెందిన ప్రముఖ వ్యాపారి మాకు అతిథి అవుతున్నాడు" అన్నాడు.

అబూబకర్ (రజి) అతనికి కృతజ్ఞతలు చెప్పి మిత్రులతో గుడారాల దగ్గరకు చేరుకున్నారు. ఓ పెద్ద గుడారంలోకి ప్రవేశిస్తూ "బురైదా! దాహం వేస్తోంది. ముందు మాకు నీళ్ళు ఇప్పించు" అన్నారు ఆయన.



"ఏమిటి నీళ్ళా! మేము మీకు కనీసం పాలయినా ఇవ్వలేని దౌర్భాగ్యులమా? ఉండండి, ఇప్పుడే రెండుక్షణాల్లో పాలు తెప్పిస్తాను" అంటూ బురైదా పాలు తీసుకురమ్మని ఒక మనిషిని పంపించాడు.

అతను వెంటనే వెళ్ళి ఓ పాత్రనిండా పాలు తెచ్చాడు. హజ్రత్ అబూబకర్ (రజి) బృందం కడుపునిండా పాలు తాగి ఆకలి, దాహం తీర్చుకున్నారు.

బురైదా దైవప్రవక్త (సల్లం) వైపు మాటిమాటికి చూస్తూ "అబూబకర్! ఈయనగారు ఎవరు? నేనెప్పుడూ చూడలేదే!" అన్నాడు.

"ఈయన నాకు దారి చూపడానికి వచ్చిన మార్గదర్శి. పేరు ముహమ్మద్ (స)."

"ఎవరూ? మన తాతముత్తాతల మతాన్ని మంటగలిపి, మన దేవతలకు అపచారం తలపెడ్తున్న ముహమ్మదా ఈయన!?" అన్నాడు బురైదా దైవప్రవక్తను వింతగా చూస్తూ.

"బురైదా! బుద్ధిమంతులు ప్రతి విషయాన్నీ ప్రశాంతహృదయంతో జాగ్రత్తగా వింటారు. ఆ తర్వాత మంచిచెడుల విచక్షణ చేసి అంతరాత్మ ప్రబోధనం ప్రకారం నడుచుకుంటారు" అన్నారు దైవప్రవక్త (సల్లం) తక్షణమే.

"సరే ఇంతకూ మీరు చెప్పదలచుకున్నదేమిటో చెప్పండి" అన్నాడు బురైదా.

"ఈ విగ్రహాలు మీరు, మీ తాతముత్తాతలు తయారుచేసుకున్నవే కదా! ఇలా మనుషులు తయారుచేసిన విగ్రహాలు దేవుళ్ళు ఎలా అవుతాయి? సర్వసృష్టికర్త, విశ్వప్రభువు, అగోచర జ్ఞానసంపన్నుడు, జీవన్మరణాలకు మూలకారకుడయినవాడే మనకు దేవుడవుతాడు. ఆయన్ని మాత్రమే మనం ఆరాధించాలి......." అంటూ వివరించారు దైవప్రవక్త (సల్లం).

బురైదా ఈ మధురవాక్కులు విని "ఈరోజు నేను ఎంత మంచి విషయాలు విన్నాను! మిమ్మల్ని గురించి ఇదివరకే విని ఉన్నాను. కాని నేనప్పుడు అంతగా పట్టించుకోలేదు. మీరు నిజంగా దైవప్రవక్త (సల్లం) అని నాకిప్పుడు నమ్మకం కలిగింది. అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ (స) ఆయన ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను" అన్నాడు బురైదా.

బురైదా ముస్లిం అయినందుకు దైవప్రవక్త (సల్లం) సంతోషం వ్యక్తపరిచారు.

తమ నాయకుడు ముస్లిం కావడం చూసి బురైదా అనుచరులు కూడా సద్వచనం పఠించి ముస్లింలయి పోయారు. వారంతా డెబ్భయి మంది ఉన్నారు. ఒకేసారి అంతమంది ముస్లింలుగా మారినందుకు హజ్రత్ అబూబకర్ (రజి) కూడా హర్షం వెలిబుచ్చారు.

"దైవప్రవక్తా! మేమిక్కడికి వచ్చి రెండు వారాలకు పైగా అయింది. మరో రెండు వారాల తర్వాత ఇక్కడ్నుంచి మరో చోటికి వెళ్ళాలనుకున్నాం. కాని మీరు అనుమతిస్తే ఇప్పుడు మేమంతా మీవెంట మదీనా రావాలనుకుంటున్నాం" అన్నారు బురైదా (రజి).

"అలాగే రండి" అన్నారు దైవప్రవక్త (స). తర్వాత ఆయన కాస్సేపు విశ్రాంతి తీసుకొని లేచి నమాజు చేశారు.

ఈలోగా బురైదాఅనుచరులు గుడారాలు పీకి ప్రయాణానికి సిద్ధమయ్యారు. దైవప్రవక్త (సల్లం) మక్కా అనుచరులతో పాటు బురైదా తెగవాళ్ళను కూడా తీసుకొని బయలుదేరారు.

ఈ విధంగా ఆయన సుదీర్ఘప్రయాణం తర్వాత నబవీశకం 14వ సంవత్సరం, రబీవుల్ అవ్వల్ 8వ తేదీన ఖుబా అనే గ్రామానికి చేరుకున్నారు. అక్కడ్నుంచి మదీనా మూడు మైళ్ళే ఉంది. ఖుబావాసుల్లో అత్యధికమంది ఇదివరకే ముస్లింలై ఉన్నారు గనక, వారు దైవప్రవక్త (సల్లం)ను స్వాగతకుసుమాల్లో ముంచెత్తారు.

ఆ మహనీయుని రాక సంగతి తెలిసి స్త్రీలు, పిల్లలు కూడా సంతోషాతిశయంతో పరవశించిపోతూ ఇండ్లలో నుంచి వీథుల్లోకి వచ్చి చూడసాగారు. దాదాపు అయిదొందల మందితో కూడిని జనవాహిని "అల్లాహుఅక్బర్" అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేస్తూ ఆయన్ని ఊళ్లోకి తీసుకొచ్చింది. వారిలో ప్రతిఒక్కడూ ఆయన్ని అతిథిగా స్వీకరించ డానికి తానంటే తానని ముందుకు రాసాగాడు. చివరికి దైవప్రవక్త (స)కు ఆతిథ్యమిచ్చే భాగ్యం కుల్సూమ్ బిన్ బదమ్‌కు లభించింది.

దైవప్రవక్త (సల్లం) అమృత పలుకులు వింటేనే జీవితం తరిస్తుందన్న భావనతో అనేకమంది ఎడతెరిపి లేకుండా ఆయన సన్నిధికి రాసాగారు. దైవప్రవక్త (స) మరునాడు ఒక పెద్ద సమావేశంలో ప్రసంగిస్తూ "మసీదును నిర్మించే, నిరంతరం ఖుర్ఆన్ పఠించే, రాత్రివేళ (దైవారాధన కోసం) జాగరణచేసే ప్రతి మనిషికీ (పరలోక) మోక్షం లభిస్తుంది" అని శుభవార్త తెలియజేశారు.

ఈ శుభవార్త వినగానే అనేకమంది మసీదు నిర్మాణం కోసం ముందుకొచ్చారు. వెంటనే పని కూడా మొదలయింది. కొందరు గడ్డపలుగులతో నేల త్రవ్వుతుంటే, మరి కొందరు పారలతో మట్టితీసి పడేస్తున్నారు. ఇంకొందరు రాళ్ళు మోసుకొస్తున్నారు. ఈ పవిత్రకార్యంలో దైవప్రవక్త (స) కూడా పాల్గొన్నారు. అనుచరులు వారించడానికి ప్రయత్నిస్తే ఆయన చిరునవ్వు నవ్వి తన పనిలో మళ్ళీ లీనమైపోయేవారు.

ఇలా రెండు రోజుల్లోనే మసీదు నిర్మాణం పూర్తయింది. దైవప్రవక్త (స) అందులో నమాజ్ చేసిన తర్వాత అనుచరుల్ని ఉద్దేశించి "శుభ్రంగా ఉజూ చేసి ఖుబా మసీదులో నమాజ్ చేసేవారికి ఉమ్రా (కాబాదర్శనం) చేసినంత పుణ్యం లభిస్తుంది" అన్నారు.

ఆ తరువాత ఆయన మసీదు నుండి బయటికి వచ్చి పరిసరాలు చూడసాగారు. ఆయన చుట్టూ అనుచరులు గుమికూడి ఉన్నారు.

అప్పుడు కుల్సూమ్ (రజి) ముందుకొచ్చి "దైవప్రవక్తా! ఇక్కడ మాకు మంచినీళ్ళు పెద్ద సమస్యగా ఉంది. దైవాన్ని ప్రార్థించండి" అన్నారు.

"అక్కడేదో బావి ఉన్నట్లు కన్పిస్తోంది" అన్నారు దైవప్రవక్త (సల్లం) ఎదురుగా యాభై అడుగుల దూరంలో ఉన్న ఓ బావి వైపు చూపిస్తూ.

"అది ఉప్పునీళ్ళ బావి. మీరు దైవాన్ని ప్రార్థిస్తే అవి మంచినీళ్ళుగా మారుతాయేమో చూడండి" అన్నారు మరొకరు.



"చూద్దాం పదండి" అంటూ దైవప్రవక్త (సల్లం) ముందుకు నడిచారు. బావి దగ్గర ఆయన విశ్వప్రభువును ప్రార్థించి తన లాలాజలం కొంత తీసి బావిలో పడవేశారు.

"ఇప్పుడు నీళ్ళుతోడి చూడండి" అన్నారు ఆయన. జనంలో ఒకతను వెంటనే చేద తెచ్చి నీళ్ళు తోడాడు. తరువాత చేత్తో కొంచెం నీళ్ళు తీసుకొని తాగి "అమృతం!" అన్నాడు. ఆ తరువాత మరికొందరు తాగి "మధురం మధురం! ఎంత తియ్యగా ఉన్నాయి నీళ్ళు!!" అన్నారు అమిత సంతోషంతో ఈవార్త ఊళ్ళో అందరికీ తెలియగానే వారు ఆనంద పారవశ్యంతో ఊగిపోయారు. దైవప్రవక్త (సల్లం) పట్ల వారి గౌరవాభిమానాలు మరింత అధికమయ్యాయి. ఎవరి నోట విన్నా ప్రవక్త ప్రస్తావనలే.

# అలి, సుహైబ్‌ల (రజి) ఆర్భాటం-(69)

అటు మక్కాలో హజ్రత్ అలి (రజి) ఎలాగో శత్రువుల బారి నుండి బయటపడి ఎవరి వస్తువులు వారికి అప్పగించి మదీనా దారిపట్టారు. ఎలాంటి వాహనంలేని దయనీయ స్థితిలో కాలినడకన గుట్టలు మిట్టలు దాటుకుంటూ ప్రయాణం చేసి చివరికి ఖుబా గ్రామం చేరుకున్నారు.

అప్పుడే దైవప్రవక్త (సల్లం) నమాజు చేసి మసీదు నుండి బయటికి వచ్చారు. బయట అడుగుపెట్టగానే ఎదురుగా అలి (రజి) కన్పించారు. అంతే, ఆయన సంతోషంతో ఉక్కిరిబిక్కి రవుతూ ఒక్క ఉదుటున ముందుకొచ్చి అలి (రజి)ని ప్రగాఢంగా ఆలింగనం చేసుకున్నారు. ఆయన నుదుటిని అనేక సార్లు చుంబించారు. కాని ఆ తర్వాత వాడిపోయిన ముఖం, దుమ్ముకొట్టుకున్న శరీరం, చినిగిపోయిన బట్టలు, పగిలి రక్తసిక్తమయిన పాదాలు చూసి ఆయన కళ్ళు చెమర్చాయి. ఆ దృశ్యంచూసి మిగిలినవాళ్ళు కూడా కంటతడి పెట్టుకున్నారు. అయితే అలి (రజి) కళ్ళు మాత్రం ఆనంద కిరణాలు వెదజల్లుతున్నాయి. ప్రవక్త దర్శనంతో ఆయన ప్రయాణబడలిక పటాపంచలై పోయింది.

అలాగే సుహైబ్ రోమీ (రజి) కూడా మక్కానుంచి మదీనా వలసపోవడానికి ప్రయ త్నించారు. ఆయన బానిస బంధనాలు త్రెంచుకొని రోమ్‌నుండి పారిపోయి మక్కా వచ్చిన తర్వాత, వ్యాపారంచేసి లక్షలు సంపాదించారు. అంచేత ఈ ధనమంతా వెంట తీసికెళ్తాడే మోనని భావించి ఖురైషీయులు ఆయన్ని మక్కా వీడి పోనివ్వకుండా నిఘా ఉంచారు.

అయినప్పటికీ హజ్రత్ సుహైబ్ (రజి) నిరాశ చెందకుండా అవకాశం కోసం ఎదురు చూడసాగారు. ఓరోజు ఆయనకు మెరుపులాంటి ఆలోచన తట్టింది. మలవిసర్జన సాకుతో ఆయన మాటిమాటికి బహిర్ ప్రదేశానికి వెళ్ళిరావడం మొదలెట్టారు. ఆ విధంగా ఆయన ఆరోజు చీకటి పడేదాకా అనేక సార్లు బయటికి వెళ్ళివచ్చారు. ఆయన పరిస్థితి చూసి నిఘావేసి ఉంచిన ఖురైషీయులకు జాలివేసింది. ఆయనకు ఏదో విరోచన రోగం పట్టుకుందని భావించారు. దాంతో వారు సంతోషంతో చంకలు కొట్టుకున్నారు. పైగా ఆ రాత్రి ఎంతో సంతృప్తితో గురకపెట్టి నిద్రపోవడం ప్రారంభించారు.

హజ్రత్ సుహైబ్ (రజి) ఈ అవకాశాన్ని జారవిడుచుకోకుండా తక్షణమే ధనుర్బాణాలు తీసుకొని నిద్రపోతున్న కాపలా దారుల మధ్య గుండా మెల్లిగా అడుగులు వేసుకుంటూ

బయటికి వెళ్ళారు. పట్నం బయటికి చేరుకోగానే అక్కడ్నుంచి మదీనా దిశగా చకచకా నడుస్తూ చీకటిలో కనుమరుగయి పోయారు.

కాపలాదారులు నిద్రమత్తు వదలిన తరువాత విషయం తెలియగానే ఆదరాబాదరాగా గుర్రాలెక్కి మదీనా దిశగా పరుగెత్తారు.

హజ్రత్ సుహైబ్ రోమి (రజి) కొన్ని మైళ్ళు ప్రయాణం చేశాక తననెవరో వెంటాడుతున్నట్లు గుర్రపు డెక్కల చప్పుడు విన్పించింది. వెంటనే ఆయన పరుగెత్తి ఓ గుట్ట పైకెక్కి నిలబడ్డారు. అంతలో కాపలాదారులు కూడా ఆ గుట్ట దగ్గరికి చేరుకున్నారు. హజ్రత్ సుహైబ్ రోమి (రజి) అంబులపొది నుండి చర్రున ఓ బాణం తీసి ధనస్సుపై ఎక్కుపెడుతూ ఇలా అన్నారు:

"ఖురైషీయులారా! నేను విలువిద్యలో బాగా ఆరితేరినవాణ్ణిని, నా బాణాలు ఎలాంటి పరిస్థితిలో కూడా గురి తప్పవని మీకందరికీ బాగా తెలుసు. బాణాలు అయిపోయిన తరువాత కరవాలంతో నా దేహంలోని చివరి రక్తపు బొట్టు చిందేవరకు పోరాడుతూ మిమ్మల్ని హతమారుస్తాను, జాగ్రత్త!"

ఈ మాటలు విని కాపలాదారుల్లో ఒకతను ముందుకొచ్చి.....

"నువ్వు నీ ధనప్రాణాలు రెంటినీ కాపాడుకొని ఇక్కడ్నుంచి తీసుకుపోలేవు. నువ్వు మా పట్టణానికి చేతిలో చిల్లిగవ్వ కూడా లేని నిష్ట దారిద్ర్యస్థితిలో వచ్చావు. ఇక్కడకు వచ్చి లక్షలు సంపాదించావు. అదంతా తీసుకొని పోనిస్తామనుకుంటున్నావా?" అన్నారు.

"మరి నా ధనమంతా మీకు అప్పగిస్తే నాకు దారి వదులుతారా?"

"తప్పకుండా వదిలేస్తాం."

అప్పుడు హజ్రత్ సుహైబ్ (రజి) తన ఇంట్లో ధనం ఎక్కడ దాచిపెట్టిందీ ఆ ప్రదేశాన్ని గురించి తెలియజేశారు. నూతన ధర్మం స్వీకరించి ముస్లింలయినవారు అబద్ధమాడరని ఖురైషీయులకు తెలుసు. అందువల్ల వారు సుహైబ్ (రజి) మాటలు నమ్మి ఆయన్ని మదీనా వెళ్ళిపోవడానికి వదిలేశారు.

ఆ తర్వాత వారు పట్టణానికి తిరిగొచ్చి నేరుగా సుహైబ్ (రజి) ఇంటికి వెళ్ళారు. అక్కడ ఆయన చెప్పిన చోట వెతికితే నిజంగానే అపార ధనరాసులు కన్పించాయి. ధన కాంక్షాపరులైన ఖురైషీయులు సంతోషంతో పొంగిపోతూ వాటిని తీసేసుకున్నారు.

హజ్రత్ సుహైబ్ (రజి) ఆ తరువాత వేగంగా ప్రయాణం సాగించారు. లక్షల ధనరాసులు కోల్పోయినప్పటికీ విశ్వాస మహాభాగ్యం దక్కినందుకు ఆయన పరమ సంతోషంతో, ద్విగుణీకృత ఉత్సాహంతో ప్రయాణంచేసి మదీనా సమీపంలోని ఖుబా గ్రామానికి చేరుకున్నారు.

ఖుబాలో దైవప్రవక్త (సల్లం) హజ్రత్ సుహైబ్ (రజి)ని చూడగానే "అబూయహ్యా! నీవు చేసిన ఈ వ్యాపారం నీకెంతో ప్రయోజనకారి అవుతుంది" అన్నారు అమిత సంతోషం వెలిబుచ్చుతూ. ఈ మాట ఆయన మూడు సార్లు అన్నారు.



దైవప్రవక్త (సల్లం) నోట ఈ శుభవార్త విని హజ్రత్ సుహైబ్ (రజి) రెండు క్షణాలు ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయ్యారు. ఆ తరువాత "దైవప్రవక్తా! ఈ విషయం చెప్పడానికి నాకంటే ముందు మీ దగ్గరికి ఎవరూ వచ్చి ఉండరు. దైవసాక్షి! ఈ సంగతి మీకు దేవుడు తప్ప మరెవ్వరూ తెలియజేయలేదు" అన్నారు ఆయన.

దైవప్రవక్త (స) ఖుబా గ్రామంలో పద్నాలుగు రోజులు ఉండి, అక్కడి ముస్లింలకు తగిన శిక్షణ గరిపారు. ఆ తరువాత ఆయన ముఖ్య అనుచరులతో కలసి మదీనా నగరానికి బయలుదేరారు.

## తుబ్బవుల్ హుమైరీ దండయాత్ర-(70)

హజ్రత్ అబూ అయ్యూబ్ (రజి) దైవప్రవక్త (సల్లం) రాక సంగతి విని సంతోషంతో తబ్బిబ్బయి పోయారు. వెంటనే ఆయన ఇంట్లో ఏదోవస్తువు కోసం గాలించారు. చివరికి ఒక పెట్టె తెరిచారు. దాన్ని తెరిచి అందులో నుంచి మరో చిన్న పెట్టె తీసి తెరిచారు. ఆ పెట్టెలో నుంచి ఒక లేఖచుట్ట బయటికి తీశారు. దాన్ని చూడగానే ఆయన మెదడులో ఒక్కసారిగా గత చరిత్ర లీలగా మెదిలింది......

...యమన్ నుండి బ్రహ్మాండమైన ఓ సైనికవాహిని నురుగులు కక్కుతూ, పరవళ్ళు తొక్కుతూ ప్రపంచ దండయాత్రకు బయలుదేరింది. సైన్యానికి సారథ్యం వహిస్తున్న యమన్ చక్రవర్తి తుబ్బవుల్ హుమైరీ తన సామ్రాజ్యం చుట్టుపక్కలున్న అనేక ప్రాంతలను ఆక్రమించుకుంటూ అప్రతిహతంగా ముందుకు సాగుతున్నాడు.

లక్షా పదమూడు వేల కాల్బలం, లక్షా ముప్ఫయి మూడు వేల వాహనబలం, అపార ఆయుధ సంపత్తి ఉన్న హుమైరీ చక్రవర్తి అంటే ఆనాటి రాజులకు సింహస్వప్నం. ఎటుపోయినా హుమైరీ చక్రవర్తి దాడికి ఎదురులేదు. అతని విజయ పరంపరకు అంతం లేదు. అతని సైన్యం కాలిడిన ప్రతి ఊరు, వాడా యమన్ రాజ్యంలో అంతర్భాగమయి పోవాల్సిందే.

హుమైరీ ఇలా అనేక ప్రాంతాలను జయిస్తూ మక్కా సమీపానికి చేరుకున్నాడు. అయితే మక్కాపౌరులు అతని సైనిక బలం, మందీమార్బలం చూసి ఏమాత్రం భయ పడలేదు. అసలతని సైనిక పటాలాన్ని, పటాటోపాన్ని ఖాతరే చేయలేదు. పైగా వారిలో ఒక్కరు కూడా అతనికి స్వాగతమివ్వడానికి రాలేదు. మక్కావాసుల ఈ నిర్లక్ష్య ధోరణి చూసి హుమైరీ ఆగ్రహోదగ్రుడై పోయాడు. అతని మంత్రులలో ఒకతను ఈ నిర్లక్ష్య వైఖరికి కారణం ఇలా వివరించాడు:

"ప్రభూ! ఈ అరబ్బులు అనాగరికతను అంటిపెట్టుకొని ఉండటమే తమకు గర్వకారణంగా భావిస్తారు. అదీగాక యావత్తు అరబ్బులకు గొప్ప ఆరాధనా కేంద్రమైన కాబామందిరం ఈ నగరంలోనే ఉంది. దానికి తాము ధర్మకర్తలమన్న అహంకారంతో వారు ఎవరినీ లెక్క చేయరు."

ఈ సంగతి విని చక్రవర్తి మరింత మండిపడ్డాడు.

"అదా వీరి తలబిరుసుకు కారణం! అయితే ఈ పట్టణాన్ని సర్వనాశనం చేసి, పట్టణవాసుల్ని ఊచకోత కోయండి" అంటూ హుకుం జారీ చేశాడు హుమైరీ.

కాని ఈ ఉత్తర్వు జారీచేసిన మరుక్షణమే అతనికి ఒక విధమైన వ్యాధి పట్టుకుంది. చూస్తుండగానే అతని నోరు, ముక్కు, చెవుల్లో నుంచి రక్తం కారడం మొదలయింది. మరోవైపు విపరీతమైన తలనొప్పి కూడా వచ్చింది. దాంతో హుమైరీ తల్లడిల్లి పోసాగాడు.

హఠాత్తుగా వచ్చిన ఈ రోగం చూసి మంత్రులు, సైనికాధికారులు ఆందోళన చెందసాగారు. తక్షణమే రాజవైద్యులు రంగంలోకి దిగి రకరకాల మందులు వాడి చూశారు. కాని ఏమందు కూడా పనిచేయలేదు. పాపం చక్రవర్తి రోజురోజుకు కృశించిపోతూ మృత్యు కుహురానికి సమీపంగా చేరుకున్నాడు. అతని దీనావస్థ విని ఒక స్ఫురద్రూపి వచ్చి ఇలా అన్నాడు:

"నేను మీకు చికిత్స చేస్తాను. కాని ఒక షరతు. నేను అడిగే ప్రతిప్రశ్నకు ఏ మాత్రం దాపరికం లేకుండా ఉన్నవి ఉన్నట్లు సరైన సమాధానాలు ఇవ్వాలి."

చక్రవర్తి హుమైరీ ఈ షరతును ఒప్పుకున్నాడు. స్ఫురద్రూపి అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వసాగాడు. చివరికి కాబా మందిరాన్ని నేలమట్టం చేసి, మక్కా వాసులను ఊచకోత కోయడానికి జారీచేసిన ఉత్తర్వు సంగతి కూడా ప్రస్తావనకు వచ్చింది. ఈ ఉత్తర్వు సంగతి వినగానే స్ఫురద్రూపి ఇలా అన్నాడు:

"మహారాజా! మీ వ్యాధికి అసలు కారణం ఈ ఉత్తరువే. ఈ పవిత్ర ఆలయానికి అసలు యజమాని సృష్టికర్త, విశ్వప్రభువయిన అల్లాహ్. ఆయన స్వయంగా దీన్ని కాపాడే బాధ్యత తీసుకున్నాడు. అందువల్ల మక్కా నగరాన్ని ధ్వంసం చేయాలన్న ఆలోచనను మీ మనసులో నుంచి తీసివేయండి."

ఈ మాటలు వినగానే చక్రవర్తి తుబ్బవుల్ హుమైరీ తన దురాలోచనకు స్వస్తి చెప్పి ఉత్తర్వుని ఉపసంహరించుకున్నాడు. స్ఫురద్రూపి ఈ సలహా ఇచ్చి చక్రవర్తి కొలువు నుంచి బయటికి వెళ్ళాడు. అతనలా వెళ్ళాడో లేదో హుమైరీ రోగం ఒక్కసారిగా తగ్గుముఖం పట్టింది. ఆ తరువాత కొన్ని గంటల్లోనే వ్యాధి పూర్తిగా తగ్గిపోయింది.

హుమైరీ చక్రవర్తి సంతోషంతో పొంగిపోయాడు. అతని మనస్సులో ఇప్పుడు కాబా మందిరం పట్ల అపారమైన గౌరవభావం ఏర్పడింది. ఆ తరువాత అతను తన ముఖ్య అనుచరుల్ని తీసుకొని మక్కా నగరంలో ప్రవేశించాడు.

ముందుగా హుమైరీ అమితమైన భక్తి విశ్వాసాలతో కాబా ప్రదక్షిణ చేశాడు. తరువాత మక్కా పౌరులకు బ్రహ్మాండమైన విందు ఇచ్చాడు. ఆ విందులో ధనికులు-పేదలు, అధికులు-అధములు అన్న తేడా లేకుండా అందరినీ ఆహ్వానించాడు. విందులో మంచి నీళ్ళకు బదులు తేనెను ఏర్పాటు చేశాడు.

ఆ తరువాత చక్రవర్తి కాబా గర్భగుడిని కప్పడానికి ఖరీదైన పట్టు గిలాపు తయారు చేయించాడు. అయితే కాబాకు ఇది సముచితమైన గిలాపు కాదని ఆరాత్రి కలలో ఓ



దివ్య పురుషుడు కన్పించి చెప్పాడు. అప్పుడు చక్రవర్తి దాన్ని మార్చి సుగంధ పరిమళాలతో కూడిన ప్రత్యేక పట్టు గిలాపు తయారు చేయించాడు. కాని అది కూడా సముచితమైనది కాదని కలలో సూచించబడింది.

ఈసారి చక్రవర్తి పట్టు వస్త్రంపై యమన్ శాలువ అంచులతో కూడిన ఏడు పరదాల గిలాపు తయారుచేయించాడు. కలలో ఎలాంటి అభ్యంతరం రాకపోవడంతో దాన్నే కాబా గర్భగుడికి కప్పాడు. తరువాత ఆలయంలోని విగ్రహాలన్నిటిని తొలగించి గోడలను, నేలను బాగా అలంకరింపజేసి, తలుపులకు తాళం వేసి, తాళపుచెవిని ధర్మకర్తలకు స్వాధీనం చేశాడు.

ఈ పనులన్నీ ముగిశాక తుబ్బవుల్ హుమైరీ మళ్ళీ దండయాత్రకు బయలుదేరాడు. అనేక రాజ్యాలు జయిస్తూ యస్రిబ్(మదీనా)కు చేరుకున్నాడు. అక్కడ నగరం వెలుపల యస్రిబ్ వాసులకు, అతని సైన్యానికి మధ్య యుద్ధం మొదలయింది. కాని మదీనా వాసులు హుమైరీ సైనికుల ధాటికి రంగంలో నిలువలేక పోయారు. వారు నగరంలోకి వెళ్ళిపోయి నగర ద్వారాలు మూసేసుకున్నారు. ఆ తర్వాత ప్రాకారం బురుజులపై ఎక్కి యుద్ధం కొనసాగించారు.

హుమైరీ నగరాన్ని దిగ్బంధం చేసి యుద్ధం చేయసాగాడు. ఇలా అనేక వారాలు గడచిపోయాయి. కాని అంత గొప్ప సైన్యం ఉండి కూడా హుమైరీ మదీనాను జయించలేక పోయాడు. చివరికతను మదీనా ప్రజల స్థితిగతులేమిటో తెలుసుకోవడానికి ప్రయత్నిం చాడు. మదీనావాసుల్లో ఏదైనా బలహీనత ఉంటే, దాన్ని వాడుకొని మదీనాపై మెరుపు దాడి చేయవచ్చని అతని ఉద్దేశ్యం.

కాని ఆ ప్రయత్నంలో కూడా హుమైరీ సఫలం కాలేదు. వారాలు, నెలలు గడుస్తున్నా మదీనావాసుల విషయంలో ఒక్క బలహీనత గురించి కూడా ఆరాతీయలేక పోయాడు.

చివరికి ఓరోజు ఉదయం తనిఖీ నిమిత్తం సైనికశిబిరాల మధ్య నడుస్తుంటే శిబిరాల ముందు ఖర్జూరపు విత్తనాలు కన్పించాయి. వాటిని చూసి చక్రవర్తి ఆశ్చర్యపోయాడు. తన సైనికుల కోసం తీసుకురాబడిన ఆహారవస్తువులలో ఖర్జూర పండ్ల ఛాయలు కూడా లేవు. మరి సైనికశిబిరాల ముందు ఈ ఖర్జూరపు విత్తనాలు ఎలా వచ్చిపడ్డాయి!! ఈ విషయాన్ని గురించి చక్రవర్తి సైనికుల్ని నిలదీశాడు.

"మహారాజా! ప్రతిరోజూ తెల్లవారుజామున యస్రిబ్ వాసులు పట్టణ ప్రాకారం పైనుంచి ఇటు మావైపు ఖర్జూరపండ్లు నిండిన గోతాలు విసిరివేస్తారు. ఆ పండ్లు తీసుకొని మేము తింటున్నాము" అంటూ తెలియజేశారు సైనికులు.

ఈ విషయం విని చక్రవర్తి మరింత ఆశ్చర్యపోయాడు.

"ఆశ్చర్యంగా ఉందే! మనం ఎన్నో నెలల నుంచి ఈ నగరాన్ని దిగ్బంధం చేసి ఉంచాం. బయటి నుంచి ఎలాంటి ఆహార పదార్థాలు సరఫరా కాకుండా వాళ్ళను ఆకలితో మాడ్చి చంపడానికి ప్రయత్నిస్తున్నాము. మనం ఈ నగరాన్ని, నగరవాసుల్ని సర్వనాశనం చేయడానికి సిద్ధమయ్యాం. కాని ఈ వింత మనుషులు యుద్ధ సమయంలో

కూడా తమ శత్రువుల పట్ల మిత్ర వైఖరి ప్రదర్శిస్తున్నారే!” చక్రవర్తి నోట అప్రయత్నంగా వెలువడ్డాయియీ మాటలు.

అతను తీవ్రంగా ఆలోచించాడు. కాని ఎంత ఆలోచించినా విషయం అర్థం కాలేదు. అప్పుడు మదీనా నగర ప్రముఖులతో సంబంధం ఏర్పరచుకొని ఈ విషయాన్ని గురించి ఆరా తీయవలసిందిగా తన సైనికాధికారులను ఆదేశించాడు.

వెంటనే సైనికాధికారులు మదీనా నాయకుల్ని కలుసుకొని విషయం ఏమిటని విచారించారు. వారీ విషయాన్ని నగరంలోని తమ మతపెద్దలకు చేరవేశారు. ఆ మతపెద్దలు ఇలా తెలియజేశారు:

“మేము సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిపోయాము. మాలో కొందరు ఖైబర్ నుంచి, కొందరు సిరియా నుంచి, కొందరు ఈజిప్టు నుంచి, మరికొందరు ఇతర ప్రాంతాల నుంచి వచ్చారు. మేము యూదులం. ఈ నగరానికి అంతిమ దైవప్రవక్త (స) వస్తారని తౌరాత్, జబ్బూర్ వంటి మతగ్రంథాల్లో మేము చదివి ఉన్నాము. అందువల్ల మేమిక్కడ నివసిస్తూ ఆయన కోసం నిరీక్షిస్తున్నాము. రానున్న అంతిమ దైవప్రవక్త ప్రేమమూర్తి, కరుణామయుడు, గొప్ప అతిథిసత్కారి అని కూడా మా మతగ్రంథాల్లో ఉంది. అందువల్ల మేము ఆ మహానుభావుని సుగుణాలను కూడా అలవరచుకోవడానికి కృషి చేస్తున్నాము.”

మదీనావాసులు పలికిన ఈ మాటలు, వారి సద్వర్తనం, అతిథి మర్యాదలు హుమైరీని ఎంతగానో ప్రభావితం చేశాయి. దాంతో అతని హృదయం ద్రవించింది. కళ్ళు అప్రయత్నంగా అశ్రుపూరితాలయ్యాయి.

## మదీనాలో మీలాద్ వేడుకలు-(71)

“ఆ దైవప్రవక్త ఇంకా పుడమిపై ప్రభవించనే లేదు. అప్పుడే వీరు ఆయన గుణగణాలు, అలవాట్లను అలవరచుకోవడం మొదలెట్టారే!” ఈ భావన హుమైరీ అంతరాత్మను ఒక్క ఊపు ఊపేసింది.

“అయ్యయ్యో! నేనా కారుణ్యప్రవక్త ప్రభవించే శుభయుగంలో పుట్టిఉంటే ఎంత బాగుండేది!! ఆ మహనీయుడ్ని విశ్వసించి తరించేవాడ్ని. ఆయన తన జాతిప్రజలు పెట్టే బాధలు భరించలేక ఇక్కడకు వలస వస్తే నేనాయన్ని తనివితీరా సేవించేవాడ్ని” అంటూ అతను కన్నీరు మున్నీరుగా దుఃఖించసాగాడు.

అంతిమ దైవప్రవక్త (సల్లం) గురించి మరికొన్ని వివరాలు తెలిసిన తరువాత మదీనా పట్ల హుమైరీ ఆసక్తి మరింత పెరిగింది. అందువల్ల మదీనాలో ప్రవేశించి అక్కడి పవిత్ర వీథులను, ఇళ్ళను దర్శించుకునేందుకు అనుమతించమని అతను నగర పెద్దలను అభ్యర్థించాడు. వారందుకు సంతోషంగా అనుమతించారు.

అనుమతి లభించగానే తుబ్బవుల్ హుమైరీ తన సైన్యాన్ని వెంటబెట్టుకొని నగరంలో ప్రవేశించాడు......



అదొక విచిత్ర సన్నివేశం. వేలాది మందితో కూడిన ప్రజావాహిని అమితమైన భక్తి విశ్వాసాలతో తన్మయత్వం చెందుతూ ఓ ముహమ్మద్! ఓ ముహమ్మద్!! అని నినదిస్తూ మదీనా వీథుల గుండా సాగిపోతోంది. అందరూ ఎంతో వినయవిధేయతలతో తలలు వంచి నడుస్తున్నారు. కొందరి కళ్ళలో నుంచి కన్నీరు ధారాపాతంగా కారిపోతోంది.

వారందరి ముందు చక్రవర్తి తుబ్బవుల్ హుమైరీ చెదరిన జుట్టుతో మాటిమాటికి ముహమ్మద్ మహనీయుని (సల్లం) పేరు ఉచ్చరిస్తూ, చంటి పిల్లవాడిలా విలపిస్తూ, తనను తాను మైమరచి భక్తిపారవశ్యంతో ఊగుతూ నడుస్తున్నాడు. అప్పుడప్పుడు అతను వీథుల ఇరుపక్కల ఉన్న గోడలను, చెట్లను అప్రయత్నంగా ముద్దాడుతున్నాడు.

ఓ యస్రిబ్ నగరమా! యస్రిబ్ నగరవీథులా!! నేను మీ యజమాని సేవకుడ్ని. దీనికి మీరే సాక్షులు. ఓ పవిత్ర యస్రిబ్‌నగర ప్రాకారమా! ప్రాకారం ద్వారాలా!! నేను మీ ప్రభువు యొక్క నమ్మిన బంటుని. దీనికి మీరే సాక్షులు. యస్రిబ్ నగరమా! నేను నీ పవిత్ర గృహాల గోడలను, ఆ గృహాల తలుపులను ముద్దాడుతున్నాను. నీ ధూళిని మహా భాగ్యంగా తలచి కళ్ళకు అద్దుకుంటున్నాను.

ఓ భూమండలమా! ఈ నగరం నా ప్రభువు, ప్రియప్రవక్త అయిన ముహమ్మద్ (సల్లం)కు నిలయం కానున్నది. ఈ నగరం నుంచే సౌభాగ్యభానుడు ఉదయించి తన దివ్య తేజస్సుతో లోకంలోని కారుచీకట్లను పారద్రోలుతాడు. అందుకే ఇక్కడి అణువణువూ, చివరికి ఓ చిన్న ధూళిరేణువు సైతం ఎంతో పవిత్రమైనది.

ముహమ్మద్ (సల్లం) దేవుని ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను. ఆ మహనీయుడు ప్రభవించేదాకా నేను జీవించి ఉంటే నేనాయనకు తప్పకుండా నా సహాయసహకారాలు అందజేస్తాను; ఆయన విరోధులతో పోరాడుతాను; ఆయన విచారాన్ని పోగొడ్తాను.”

చక్రవర్తి హుమైరీ రానున్న అంతిమ దైవప్రవక్త (సల్లం) పట్ల అపార విశ్వాసం, గౌరవ భావాల మైకంలో ఇలా ఆ మహనీయుడ్ని పదేపదే స్మరిస్తూ మదీనా వీథుల్లో పిచ్చివాడిలా నడుస్తున్నాడు. అతని వెనుక వేలాది మంది అతని సైనికులు కూడా తమ భక్తి విశ్వాసాలు చాటుకుంటూ అతడ్ని అనుసరిస్తున్నారు.

ఈ విధంగా హుమైరీ చక్రవర్తి మదీనా వీథులన్నీ తిరగడం ముగిసిన తరువాత నగర వీథులన్నీ పరిశుభ్రం చేయించాడు. యూద పండితులతో పాటు ఇక్కడే నివసిస్తూ అంతిమ దైవప్రవక్త (సల్లం) కోసం నిరీక్షిద్దామనుకున్నాడు. కాని యమన్‌లో అతను లేకపోవడం చూసి విరోధులు తిరుగుబాటు లేవదీశారు. దాంతో హుమైరీ యమన్‌కు తిరిగి వెళ్ళవలసి వచ్చింది. అందువల్ల అతను మదీనాలో నాలుగొందల మంది యూద పండితులకు అందమైన ఇండ్లు కట్టించి, వారు సుఖంగా జీవించడానికి కావలసిన సదుపాయాలన్నీ ఏర్పాటు చేయించాడు.

ఆ తరువాత తన స్వహస్తాలతో ఒక లేఖ రాసి, దానిపై రాజముద్ర వేసి, దాన్ని ఒక పెట్టెలో పెట్టి తాళం వేసి ఆ పెట్టెను, తాళంచెవులను షామూల్ అనే ఓ పండితునికి అప్పగించాడు. అప్పగిస్తూ, ఈ లేఖను అంతిమ దైవప్రవక్త (సల్లం)కు అందజేయాలని,

ఆ అదృష్టం అతనికి లభించకపోతే తన సంతానాకి ఆ లేఖ అందజేయాలని, వారిక్కూడా ఆ భాగ్యం లభించకపోతే వారు తర్వాతి తరం వారికి అప్పగించాలని, ఇలా మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ప్రభవించేవరకు ఈ పరంపర కొనసాగాలని తాకీదు చేశాడు. ఆ తరువాత హుమైరీ స్వదేశానికి తిరిగి వెళ్ళిపోయాడు.

రేయింబవళ్ళు యథాప్రకారం ఒకదాని వెంట ఒకటి సాగిపోతున్నాయి. రోజులు, నెలలు, సంవత్సరాలు గడచిపోతున్నాయి. ఈ కాలచక్రంలో దశాబ్దాలు, శతాబ్దాలు కూడా గడచిపోయాయి. హుమైరీ వెళ్ళిపోయిన దాదాపు వేయి సంవత్సరాల తరువాత ఇప్పుడు అంతిమ దైవప్రవక్త మహనీయ ముహమ్మద్ (సల్లం) మక్కా నుంచి మదీనా వలస వస్తున్నారని తెలిసింది.......

హజ్రత్ అబూ అయ్యూబ్ (రజి) ఆలోచనల నుంచి తేరుకొని, గబగబా ఆ లేఖచుట్ట తీసి అబూలైలా అనే ఓ నమ్మకస్తుడయిన మనిషికి ఇచ్చి దాన్ని దైవప్రవక్త (సల్లం)కు అందజేయమని చెప్పి పంపించారు.

వెంటనే అబూలైలా నగరానికి వస్తున్న మహాప్రవక్త (సల్లం) సన్నిధికి చేరుకున్నాడు. దైవప్రవక్త (సల్లం) అతడ్ని దూరం నుంచే చూసి...

"నువ్వు అబూలైలావా? అయితే నీ దగ్గర తుబ్బవుల్ హుమైరీ రాసిన లేఖ ఉందా?" అని అడిగారు చిరునవ్వుతో.

దైవప్రవక్త (సల్లం) తనను పేరు పెట్టి పిలవడమే కాకుండా, హుమైరీ లేఖ సంగతి కూడా ప్రస్తావించడంతో అబూలైలా ఆశ్చర్యచకితుడై పోయాడు. అదీగాక అతను దైవప్రవక్త (సల్లం)ను ఎప్పుడూ చూడలేదు. అతను క్షణం పాటు మ్రాన్పడిపోయి చూస్తూ....

"మీరెవరండీ! మీ ముఖంలో మాంత్రికుడి ఛాయలు కూడా లేవే!!" అన్నాడు.

"నా పేరు ముహమ్మద్ బిన్ అబ్దుల్లా. దేవుడు నన్ను ప్రవక్తగా నియమించి పంపాడు. దివ్యగ్రంథాన్ని కూడా నాపై అవతరింపజేశాడు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

అప్పుడు అబూలైలా జేబులో నుంచి లేఖ తీసి శ్రీవారికి అందజేశాడు. అందులో ఈ విధంగా రాసి ఉంది:

"అబ్దుల్లా కుమార రత్నం, అంతిమ దైవప్రవక్త, దైవసందేశహరులయిన ముహమ్మద్ (స)కు విర్దా కుమారుడు తుబ్బా వ్రాస్తున్న లేఖ ఇది... ముహమ్మద్ మహానుభావా! నేను మిమ్మల్ని, మీపై దేవుడు అవతరింపజేసే గ్రంథాన్ని నిండు హృదయంతో విశ్వసించాను. మీరు తీసుకొచ్చే ధర్మాన్ని, మీసంప్రదాయాల్ని కూడా విశ్వసించాను. సర్వలోకాల, సమస్త సృష్టిరాసుల స్వామి, సంరక్షకుడయిన మీ ప్రభువుని కూడా విశ్వసించాను. మహాత్మా! నా జీవితకాలంలో మిమ్మల్ని దర్శించగలిగితే నేనెంతో అదృష్టవంతుడ్ని. ఒకవేళ ఇది సాధ్యం కాకపోతే ప్రళయదినాన దేవునికి నా మోక్షం కొరకు సిఫారసు చేయండి. దైవం కొరకు ఆ రోజు నన్ను మరచిపోకండి. మహానుభావా! మీరు ప్రభవించడానికి ముందే నేను మీకు విధేయుణ్ణయి మీ అనుచర సమాజంలో ప్రప్రథమ సభ్యుడిగా చేరిపోయాను."



దైవప్రవక్త (సల్లం) లేఖలోని విషయాలు విని "శభాష్ సోదరా! నా మంచి సోదరా! శభాష్!!" అంటూ మూడుసార్లు తుబ్బవుల్ హుమైరీని అభినందించారు. ఆ తరువాత ఆయన అనుచరులు, అభిమానులు వెంటరాగా ముందుకు సాగారు.

## మదీనా నగర ప్రవేశం-(72)

దైవప్రవక్త (సల్లం) పట్నం వస్తున్నారని మదీనావారందరికీ తెలిసిపోయింది. ఇంకే ముంది! ఆనందభరితమైన ఓ కలకలం బయలుదేరింది. ముస్లింలు, యూదులు, బహు దైవారాధకులు అంతా అమితసంతోషంతో ఎగిరి గంతులేశారు. ఆనంద డోలికల్లో ఊగుతూ గానాలాపనం చేయసాగారు. అంతులేని అనురాగంతో, ఆగలేని ఆత్రంతో ఆడసాగారు. పరమసంతోషంతో పరవశించిపోతూ పాడసాగారు. ప్రతి మనిషి కళ్ళలో దైవసందేశహరుని (సల్లం) కోసం నిరీక్షణా జ్యోతులు వెలిగిపోతున్నాయి.

చిన్నారి పిల్లలు సైతం సంతోషంతో వీధి వీధి తిరుగుతూ "ప్రియప్రవక్త వస్తున్నారు, త్వరలో వస్తున్నారు" అని చెబుతూ అపార సంతోషంతో గంతులేయసాగారు. వారు ప్రతి రోజూ ఉదయాన్నే పట్నం బయటికెళ్ళి, కళ్ళలో వత్తులు వేసుకొని దైవప్రవక్త (సల్లం) వచ్చే దారి వైపు గంటల తరబడి చూసేవారు. అలా మధ్యాహ్నం దాకా చూసి, వచ్చే జాడ కన్పడక పోవడంతో నిరాశపడి ఇళ్ళకు తిరిగి వెళ్ళిపోయేవారు. అలాంటి పరిస్థితిలో ఓరోజు హఠాత్తుగా.....

"మదీనా ప్రజలారా! మీరు ఎవరికోసం ఇన్నాళ్ళ నుంచి ఎదురుచూస్తున్నారో ఆయన వచ్చేశారు" అని ఓ గుట్ట పైనుంచి ఒక యూదుని గొంతు పట్నంలో ప్రతిధ్వనించింది.

అంతే, ఆ కేక విని మదీనా ప్రజావాహిని ఆనందాతిశయంతో పరవళ్ళుతొక్కింది. పెద్దలు, పిల్లలు, స్త్రీలు, పురుషులు ఆబాలగోపాలమంతా బిలబిలమంటూ ఇళ్ళలో నుంచి బయటికి వచ్చారు. ప్రతి ఒక్కడూ పట్టరాని సంతోషంతో వీధుల్లోకి దూసుకు వచ్చాడు. అందరి కళ్ళు పూర్ణశశాంకుడ్ని చూసిన కలువ పువ్వుల్లా ఒక్కసారిగా వికసించాయి. బాలబాలికల ఆనందం అవధులు దాటింది. ప్రతి ఒక్కడూ తనకేదో గొప్ప పెన్నిధి లభించ బోతున్నట్లు మహా సంబరపడిపోతున్నాడు.

ఎక్కడ చూసినా ఒకటే సందడి. ఆఖరికి చంటిపిల్లలు సయితం ఏడ్పులు మానేసి, సంతోషంతో కేరింతలు కొట్టడం ప్రారంభించారు. అంతా ఆనందడోలికల్లో ఉగ్రూతలూగ సాగారు. ముస్లింలు, యూదులు, బహుదైవారాధకులు..... ఒకరేమిటీ? యావన్మంది ప్రజలు కుల మత వర్ణ వర్గ విభేదాలు లేకుండా ఆ విశిష్ట వ్యక్తి దర్శనభాగ్యం కోసం తహతహలాడి పోతున్నారు.

"ఇంకా మీరిక్కడే ఉన్నారా? కదలండి మానవ మహోపకారి (స) వస్తున్నారు. బయలెడండి ఆయన దివ్యమోము తనివితీరా చూసి తరిద్దాము. నడవండి మన ప్రియనగరాన్ని పావనం చేయడానికి విశ్వకారుణ్యమూర్తి (స) వస్తున్నారు. పదండి ఆ మహనీయుడికి స్వాగతగానం చేద్దాం."

"రండి రండి, త్వరగా రండి. ధర్మస్థాపన కోసం దైవసందేశహరుడు వస్తున్నాడు, ఎదురెళ్ళి తీసుకొద్దాము. పగ, ప్రతీకారం, స్వార్థం, ద్వేషం, దుఃఖం, దురాచారాలు ఆవరించిన మన హృదయాల్లో జీవనజ్యోతి వెలిగించడానికి మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) వస్తున్నారు, ఆతిథ్యమిద్దాం పదండి."

"ఎన్నాళ్ళ నుంచో ఎదురుచూస్తున్న మన ఆశాజ్యోతి మహనీయ ముహమ్మద్ (సల్లం) పట్నంలో ప్రవేశిస్తున్నారు పరుగెత్తండి."

ముందుగా పెద్దలు, వృద్ధులు స్వాగతం చెప్పడానికి అంతులేని ఉత్సాహంతో పట్నం బయటికిపోయి నిరీక్షించసాగారు. అలా చూస్తుండగానే వారి కళ్ళు తళుక్కున మెరిశాయి. ఆయన వచ్చేశారు. నిరీక్షణా ఘడియలకు గడిపెట్టి వచ్చేశారు. ప్రియ సహచరులు ఎంతో ఆనందంతో ఆలింగనం చేసుకొని ఆయన్ని తీసుకువస్తున్నారు.

కాని శతకోటి తారల మధ్య భాసిల్లుతున్న పూర్ణ శశాంకునిలా, మందీమార్బలం మధ్య రాజలాంఛలతో, అట్టహాసంగా వస్తున్న రాజాధిరాజులా ప్రత్యేకతలేవీ లేకుండా అతి నిరాడంబరంగా, అందరిలో కలసిపోయి ఎలాంటి ఆర్భాటంలేని అతి సామాన్యుడిలా ఆయన వస్తున్నారు.

అందువల్ల మదీనావాసులకు దైవప్రవక్త (సల్లం)ను గుర్తించడం కష్టమయి పోయింది. అయితేనేం? వారి హృదయచక్షువులు గుర్తిస్తున్నాయి. వారి దేహంలోని అణువణువులో ప్రవక్త ప్రేమాభిమానాలు జీర్ణించుకుపోయాయి.

ఎండ తీక్షణంగా ఉండటంతో ప్రియ సహచరుడు హ॥జత్ అబూబకర్ (రజి) ముందుకొచ్చి దైవప్రవక్త (స) తల మీద దుప్పటి లాగి పట్టుకున్నారు. అప్పుడు గ్రహించారు మదీనావాసులు ఆయనే దైవసందేశహరుడని.

ఎడతెరిపి లేకుండా జనం తండోపతండలుగా వస్తున్నారు. ఖుబా నుంచి మదీనా వరకు మూడు మైళ్ళ పొడవున దైవప్రవక్త (స)కు ఇరువైపులా అనుచరులు బారులుతీరి నిలబడ్డారు. అక్కడక్కడ వారి మధ్య కొందరు పిల్లలు కూడా ముందుకు తోసుకుంటూ ఆ మహనీయుడ్ని చూడటానికి ఆరాటపడిపోతున్నారు.

అది శుక్రవారం. దైవప్రవక్త (సల్లం) తన అనుచరులతో బనీసాలమ్ వాడలోకి వచ్చేటప్పటికి జుమానమాజ్ వేళయింది. అంతా కలిసి అక్కడ నమాజ్ చేశారు. తరువాత ఆయన బయలుదేరి తన మాతృమూర్తి వంశస్థులు నివసిస్తున్న ప్రదేశం మీద కాలు మోపారు. తన రక్తమాంసాల కోసం ఎగబడిన ఖురైషీయులకు వ్యతిరేకంగా తన పట్ల అచంచల విశ్వాసంతో ప్రాణత్యాగమైనా చేయడానికి సిద్ధమైన ధర్మయోధుల పవిత్ర నగరంలో అడుగుపెట్టారు.

అదో అద్భుత సన్నివేశం. మదీనా చరిత్రలో కనీవినీ ఎరగని అపూర్వ సంఘటన. ప్రతి కుటుంబం దైవప్రవక్త (స)ను తన అతిథిగా చేసుకోవాలని ఉవ్విళూరుతోంది. ప్రతిఒక్కరూ దగ్గరికొచ్చి "దైవప్రవక్తా! మా ఇంటికి రండి, మా అతిథిగా ఉండండి. మా ఇల్లు విశాలంగా ఉంది. మా దగ్గర అన్ని సౌకర్యాలున్నాయి "అని ప్రాధేయపడుతున్నారు.



దైవప్రవక్త (సల్లం) చిరునవ్వుతో వారికి కృతజ్ఞతలు చెప్పి ముందుకు సాగిపోతున్నారు. ఒంటె ముకుతాడు కొంచెం వదులుచేసి "ఈ ఒంటె ద్వారా దేవుడు నన్ను ఎక్కడుండమని సూచిస్తాడో అక్కడుంటాను" అన్నారు.

దైవప్రవక్త (సల్లం) కూర్చున్న ఒంటె మదీనా వీథుల్లో నడుస్తోంది. ఒంటెకు కుడి ఎడమలా, వెనుక వైపునా ప్రియశిష్యులు నడుస్తున్నారు. ఒంటె ముందు కొంచెం దూరంలో జనసమూహం చేసే హర్షధ్వానాలు మిన్ను ముట్టున్నాయి. చిన్నారి బాలికలు గెంతులు వేస్తూ, డప్పులు వాయిస్తూ ఆనందాతిశయంతో ఇలా పాడుతున్నారు:

"సీనాయి కొండల నుంచి మాముందు పున్నమిచంద్రుడు ఉదయించాడు. దైవాన్ని వేడుకునే భక్తులారా! దైవానికి కృతజ్ఞులయి ఉండటమే మన కర్తవ్యం. మాలో ప్రవేశించే మహానుభావా! ఇక్కడ నీ అమృత ప్రవచనాలే మాకు వీనులవిందు."

పురుషులు ఎత్తయిన ప్రదేశాలు ఎక్కి చూడసాగారు. స్త్రీలు ఇండ్ల కప్పుల పైకెక్కి తమ ప్రియతమ అతిథిని తిలకించసాగారు.

దైవప్రవక్త (సల్లం) ఒంటె అలా నడచీ నడచి చివరకు విశాలమైన ఓ మైదానంలోకి ప్రవేశించి కూర్చున్నది. అప్పుడు జనం 'అల్లాహుఅక్బర్' అంటూ దిక్కులు పిక్కుటిల్లేలా నినదించారు. మరుక్షణమే ఒంటె లేచి ముందుకు కొంచం దూరం నడిచింది. ఆ తరువాత గిర్రున వెనక్కి తిరిగొచ్చి కూర్చున్నది. కూర్చోగానే మోర కిందికి వాల్చి తోకాడించడం మొదలెట్టింది. జనం మరోసారి అల్లాహుఅక్బర్ నినాదం చేశారు.

ఆ ప్రదేశం నజ్జార్ వంశానికి చెందిన ఇద్దరు అనాథబాలురది. ఆ ప్రదేశానికి దగ్గర్లోనే అబూఅయ్యూబ్ (రజి) గారి రెండస్తుల మేడుంది. అందువల్ల ఆయన వెంటనే దైవప్రవక్త (స) అనుమతితో ఆయన సామగ్రిని తన ఇంటికి చేర్చారు. దైవప్రవక్త (స) ఒంటె దిగి "ఈ చోటు ఎవరిది?" అని అడిగారు మస్జిద్ నిర్మించాలన్న ఉద్దేశ్యంతో.

హ॥జత్ ముఆజ్ బిన్ అఫ్రా (రజి) ముందుకు వచ్చి "ఈ భూమి సహెల్, సుహైల్ అనే అనాథ పిల్లలది. పసితనంలోనే తండ్రిని కోల్పోయారు. ప్రస్తుతం వీరిద్దరు నా సంరక్షణలో ఉన్నారు. మీరు సంతోషంగా ఇక్కడ మస్జిద్ నిర్మించవచ్చు. పిల్లలకు నేను నచ్చజెబుతాను" అని చెప్పారు.

దైవప్రవక్త (సల్లం) ఆ ఇద్దరు పిల్లల్ని పిలిపించి విషయం తెలియజేశారు. పిల్లలు భూమిని ఉచితంగా ఇవ్వడానికి అంగీకరించారు. అయితే దైవప్రవక్త (సల్లం) ఉచితంగా తీసుకోవడానికి ఒప్పుకోలేదు. దానికి తగిన ధర చెల్లించి తీసుకున్నారు.

మరుసటి రోజు దైవప్రవక్త అనుచరులు చెట్లు నరికి ఆ స్థలాన్ని చదును చేశారు. ఆ తరువాత మసీదు నిర్మాణం ప్రారంభమయింది. దైవప్రవక్త (సల్లం) హ॥జత్ అబూ అయ్యూబ్ (రజి)కు అతిథి అయ్యారు. దాంతో అబూఅయ్యూబ్ (రజి) ఆనందం అంతా ఇంతా కాదు. తనకు ప్రపంచంలోని నిక్షేపాలన్నీ లభించినట్లు పరమానందంతో పరవశించి పోయారు.

# అబూఅయ్యూబ్ (రజి) ఆతిథ్యం-(73)

హజ్రత్ అబూఅయ్యూబ్ (రజి) ఇల్లు రెండంతస్తులది. ఆయన పై అంతస్తును దైవప్రవక్త (స) కోసం కేటాయించారు. కాని దైవప్రవక్త (స) క్రింది అంతస్తులో ఉండటానికే ఇష్టపడ్డారు. హజ్రత్ అబూఅయ్యూబ్ (రజి) దైవప్రవక్త (స)కు కావలసిన ఇతర అవసరాలన్నీ సమకూర్చారు. ఆ రాత్రి ఇషానమాజ్ తరువాత దైవప్రవక్త (స) తన పడక గదిలోనికి ప్రవేశించాక ఆయన, ఆయన భార్య పైఅంతస్తులోకి వెళ్ళిపోయారు.

తలుపులు మూసి పడుకోవడానికి ఉపక్రమించగానే హజ్రత్ అబూఅయ్యూబ్ (రజి)కు హఠాత్తుగా ఏదో అనుమానం వచ్చి భార్యను లేపారు.

“అయ్యయ్యో! మనం ఎంత పొరపాటు చేశాం!! దైవప్రవక్త (స) మనకు క్రింద ఉండటమా! ఎంత అపచారం!! ఆయన పైన మనం నడవడం భావ్యమేనా? ఆయనపై దైవవాణి అవతరిస్తుంది కదా! దైవవాణికి, ఆయనకు మధ్య ఉండి మనం అడ్డుతగలడమా!! ఇలా అయితే మనం సర్వనాశనమైనట్లే” అన్నారు అబూఅయ్యూబ్ (రజి) ఆందోళనగా.

“నిజమేనండీ! ఇప్పుడేం చేద్దాం?” అన్నారు ఆయన అర్ధాంగి.

“ఈ రాత్రి మనం గది మధ్యలో పడుకోకుండా ఓ మూలన ఒదిగి కూర్చుందాం” అంటూ లేచి నిలబడ్డారు.

ఈ విధంగా ఆ రాత్రి భార్యాభర్తలిద్దరూ గదిలో ఓ మూలన ఒదిగి కూర్చొని గడిపారు. నడవాల్సి వచ్చినప్పుడు గోడలకు ఆనుకొని మెల్లగా నడిచేవారు.

తెల్లవారింది. హజ్రత్ అబూ అయ్యూబ్ (రజి) క్రిందికి దిగివచ్చి “దైవప్రవక్తా! రాత్రి నేను, నాభార్య ఇద్దరం మేల్కొనే ఉన్నాం” అన్నారు.

“ఎందుకూ? ఏమయింది?” అడిగారు దైవప్రవక్త (సల్లం).

“మీరు క్రింది అంతస్తులో, మేము పై అంతస్తులో ఉండటం నాకు భావ్యం అన్పించ లేదు. మేము పైభాగాన ఉండి నడిచేటప్పుడు దుమ్ము ధూళి మీ మీద పడితే మీకు బాధ కలుగుతుంది. అదీగాక మీకు, దైవవాణికి మధ్య మేము అడ్డుపడినవాళ్ళం అవుతాము. ఈ ఆలోచన మమ్మల్ని రాత్రి నిద్ర పోనివ్వలేదు” అన్నారు హజ్రత్ అబూఅయ్యూబ్ (రజి).

“అబూఅయ్యూబ్! దాన్ని పట్టించుకోకు. ప్రతిరోజూ నా కోసం ఎందరో వస్తూ పోతుంటారు. అంచేత నేను క్రింది అంతస్తులో ఉండటమే మంచిది. మీరు నిశ్చింతగా పై అంతస్తులోనే ఉండండి” అంటూ ధైర్యం చెప్పారు దైవప్రవక్త (సల్లం).

అది జనాన్ని గజగజ వణికించే చలికాలం. ఓ రోజు రాత్రి పై అంతస్తులో నీటికుండ పగిలి నేలంతా తడిసింది. వెంటనే భార్యాభర్తలిద్దరు ఆ నీటిని ఎత్తి పారేయడంలో నిమగ్నులై పోయారు. కాని ఇది సాధ్యమయ్యే పనికాదు. నీరు ఇంకిపోతూ క్రింది అంతస్తు లోకి కారే ప్రమాదం ఏర్పడింది. దానివల్ల దైవప్రవక్త (స)కు బాధ కలగవచ్చు. అంచేత వారు కప్పుకోవడానికున్న ఒకేఒక గొంగళిని ఒలికిన నీటిపై వేసి దాన్ని తీశారు.



తెల్లవారిన తరువాత అబూఅయ్యూబ్ (రజి) దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వచ్చి “దైవప్రవక్తా! మీరు క్రింది అంతస్తులో ఉండి మేము పై అంతస్తులో ఉండటం ఏం బాగాలేదు” అంటూ రాత్రి జరిగిన సంఘటన వివరించారు. మేడ పైఅంతస్తులోకి మారమని పదేపదే ప్రాధేయపడ్డారు. చివరికి దైవప్రవక్త (సల్లం) ఆయన అభ్యర్థనను మన్నించి మేడ పైఅంతస్తులోకి మారారు. ఈ విధంగా ఆయన అబూఅయ్యూబ్ (రజి) ఇంట్లో ఉండసాగారు.

ఈలోగా మసీదునిర్మాణం పూర్తయింది. దాన్ని బంకమన్ను, పచ్చి ఇటుకలతో లేపారు. ఖర్జూరపు చెట్ల మ్రానులను దూలాలుగా ఉపయోగించారు. ఆకులతో కప్పు వేసి దాన్ని బంకమన్నుతో అలికారు. మసీదు నిర్మాణంలో అనుచరులతోపాటు దైవప్రవక్త (స) కూడా పాల్గొన్నారు. మసీదులో నమాజు చేయించే చోట ప్రసంగవేదికగా ఓ ఖర్జూరపు మొద్దు కోసి నిలబెట్టారు. ఇలా కొన్నాళ్ళలోనే మసీదు నిర్మాణం పూర్తయింది.

మసీదు నిర్మాణం పూర్తికాగానే దైవప్రవక్త (సల్లం) అందులో సామూహిక నమాజ్ చేయించడం ప్రారంభించారు. ప్రసంగం చేయవలసివస్తే ప్రసంగవేదికగా నిలబెట్టిన ఖర్జూరపు మ్రాను భాగాన్ని ఊతగా చేసుకొని నిలబడి ప్రసంగించేవారు. ఓరోజు ఆయన నమాజు ముగిసిన తరువాత అనుచరులతో ముచ్చటిస్తుంటే ఒకతను కలపతో చేసిన ప్రసంగ వేదిక తీసుకొని మసీదులో ప్రవేశించాడు.

“దైవప్రవక్తా! మీ కోసం నేను రెండు మెట్లతో కూడిన ఓ ప్రసంగవేదిక (మెంబర్)ను చేయించి తీసుకొచ్చాను. మీరు అనుమతిస్తే దీన్ని నేను ఇక్కడ ప్రతిష్ఠిస్తాను” అన్నాడు ఆ వ్యక్తి ఎంతో వినయంగా.

దైవప్రవక్త (స) కలపతో చేసిన ఆ ప్రసంగ వేదికను పరికించి చూసి “సరే, అలాగే చెయ్యి” అన్నారు. అప్పుడా వ్యక్తి దాన్ని సముచిత స్థానంలో కదలకుండా పెట్టేశాడు.

అప్పుడు దైవప్రవక్త (స) ఆ వేదికపై కూర్చొని ఉపన్యసించడానికి ఉపక్రమించారు. అంతలో మసీదులోనే ఎవరో ఏడుస్తున్న ధ్వని విన్పించసాగింది. ప్రవక్త అనుచరులు నిర్ఘాంతపోయి నలువైపులా కలియజూశారు. కాని మసీదులో ఎక్కడా ఏడుస్తున్న మనిషి ఛాయలు కన్పించలేదు. కాస్త పరికించిచూస్తే ఆ ధ్వని మొదట ప్రసంగ వేదికగా నిలబెట్టిన మ్రాను నుండి వస్తున్నట్లు తెలిసింది. ఈ సంగతి తెలియగానే ప్రవక్త అనుచరులు సంభ్రమాశ్చర్యాలతో దానివైపు తదేకంగా చూడసాగారు. ఆ మ్రాను నుంచి రోదన ఇంకా విన్పిస్తూనే ఉంది.

దైవప్రవక్త (సల్లం) దాని రోదనను భరించలేకపోయారు. నోరులేని మూగజీవాలు, ప్రాణంలేని వస్తువుల దీనావస్థను సయితం భరించలేని విశ్వకారుణ్యమూర్తి ఆయన. వెంటనే ఆయన లేచి ఆ మ్రానును ఆలింగనం చేసుకొని గుండెలకు హత్తుకున్నారు. దాన్ని చేత్తో మృదువుగా నిమిరారు. అప్పుడు అందులో నుంచి రోదన ధ్వని రావడం ఆగిపోయింది. అనుచరులు ఆశ్చర్యచకితులయి చూస్తూ “ప్రాణంలేని ఈ మ్రానుకు దైవప్రవక్త (సల్లం)పై ఎంత ప్రేమ ఉందో!” అనుకున్నారు.

అనుచరులు దైవప్రవక్త (స) కోసం, ఆయన శ్రీమతుల (విశ్వాసుల మాతృ మూర్తుల) కోసం కూడా మసీదు పక్కనే కొన్ని పూరిపాకలు నిర్మించారు. తర్వాత దైవప్రవక్త (సల్లం) మక్కాలో ఉన్న తన కుటుంబసభ్యుల్ని, ఇతర బంధువుల్ని మదీనాకు పిలుచుకొని రావడానికి జైద్ బిన్ హారిసా (రజి)ను, అబూరాఫె (రజి)ను మక్కా పంపించారు.

వారిద్దరు మక్కా వెళ్ళి ప్రవక్త సతీమణులు సౌదా (రజి), ఆయిషా (రజి), ప్రవక్త కుమార్తెలు ఫాతిమా (రజి), ఉమ్మెకుల్సూమ్ (రజి), జైద్ (రజి) భార్య ఉమ్మెఈమన్-బర్కా (రజి), వారి కొడుకు ఉసామా (రజి), అబూబకర్ (రజి) అర్ధాంగి ఉమ్మెరూమాన్ (రజి), ఆయన సంతానం అబ్దుల్లా (రజి), అస్మా (రజి) తదితరులకు విషయం తెలియజేసి ప్రయాణానికి సిద్ధంచేశారు. ప్రవక్త కుమార్తె జైనబ్ (రజి)ని పంపడానికి ఆమె అవిశ్వాసి భర్త అబుల్ఆస్ నిరాకరించినందున ఆమెను వదిలేయవలసి వచ్చింది. ఆమె తప్ప మిగిలినవారంతా సంతోషంతో మదీనా చేరుకొని తమ ఆప్తులను కలుసుకున్నారు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) తన కుటుంబ సభ్యుల్ని తీసుకొని అబూఅయ్యూబ్ (రజి) ఇల్లు వదిలేసి, మసీదుపక్కన నిర్మించిన పాకలకు వచ్చి నివశించసాగారు. ఆయన మదీనా వచ్చిన తర్వాత ఇస్లాంస్వీకార వేగం పుంజుకుంది. అనేక మంది దైవప్రవక్త (స), ఆయన అనుచరుల ప్రచారం, సుగుణాలతో ప్రభావితులై ఇస్లాం స్వీకరిస్తున్నారు.

కాని కొన్నాళ్ళకు ఓ విషాద సంఘటన జరిగింది. బనూనజ్జార్ ఉపతెగకు నాయకుడయిన హజ్రత్ అబూఅమామా (రజి) అకస్మాత్తుగా వ్యాధిగ్రస్తులయి కొన్ని రోజుల్లోనే చనిపోయారు. దైవప్రవక్త (సల్లం) తల్లివైపు బంధువుల పూర్వీకులు బనూనజ్జార్ తెగకు చెందినవారే. అంచేత దైవప్రవక్త (సల్లం) ఈ విషాదవార్త విని ఎంతో చలించిపోయారు. ఆ సందర్భంలో ఆయన మాట్లాడుతూ "ఈ సంఘటన సత్యతిరస్కారులకు 'ఇతనేం ప్రవక్తో! అతని శిష్యుల్లో ఒకడు హఠాత్తుగా చనిపోయాడ'ని నన్ను ఎత్తిపొడిచే అవకాశం కల్పించింది" అని అన్నారు.

ఆ తరువాత బనూనజ్జార్ తెగవాళ్ళు వచ్చి "దైవప్రవక్తా! అబూఅమామా మా నాయకుడిగా ఉండేవారు. ఇప్పుడాయన చనిపోయారు. అందువల్ల దయచేసి ఆయన స్థానంలో మాలో నుంచి ఎవరినయినా మాకు నాయకుడిగా నియమించండి" అని విన్నవించుకున్నారు.

దైవప్రవక్త (సల్లం) ఓ క్షణం ఆలోచించి "బనూనజ్జార్ తెగవాళ్ళు నాకు మామ వరస అవుతారు. అంటే నేను మీలోని వాణ్ణే అయ్యాను. అంచేత నేనే మీకు నాయకుడ్ని ఎందుకు కాకూడదు?" అన్నారు.

బనూనజ్జార్ తెగవాళ్ళు ఈమాట విని అవధులు దాటిన ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ "మహాప్రసాదం. దైవప్రవక్తా! మహాప్రసాదం!! మీరే నాయకులయితే ఇక మాకు కావాల్సిందేముంది!" అని అన్నారు.

విశ్వకారుణ్యమూర్తి (సల్లం) తమ తెగవాళ్ళలో నివాసం ఏర్పరచుకోవడమే గాకుండా తమకు నాయకునిగా కూడా కావడంతో నజ్జార్ తెగవాళ్ళు చాలా సంబరపడ్డారు. ఇక ఆ



తెగలోని బాలబాలికల సంతోషం అంతా ఇంతా కాదు. సర్వత్రా హర్షమే హర్షం! ఎక్కడ చూసినా ఆనంద కుసుమాలే వెల్లివిరిశాయి!!

## అపూర్వ సోదరీకరణ-(74)

ఆరోజు మదీనా పట్టణం అన్సార్‌లు (ఆదుకున్నవారు), ముహాజిర్‌ల (వలసవచ్చిన వారి) కలయికతో కళకళలాడుతోంది. వారి మధ్య దైవప్రవక్త (సల్లం) నిలబడి విశ్వమానవ సౌభాతృత్వాన్ని గురించి బోధిస్తున్నారు. ఆ మహనీయుని నైతికశిక్షణ వల్ల అనుచరుల్లో ఇదివరకే చాలావరకు పరస్పర సోదరభావం పెనవేసుకున్నది. ఇప్పుడీ ప్రత్యేక సమావేశంలో బోధించే ఇస్లాం హితవులతో వారు మరింత ఉత్తేజితులయ్యారు.

ప్రసంగం ముగిసిన తరువాత కట్టుబట్టలతో మాత్రమే వచ్చిన ముహాజిర్‌ల (వలస వచ్చినవారి) వైపు చూపిస్తూ "ఇదిగో వీరు మీ సోదరులు" అని అన్సార్‌ల (ఆదుకున్నవారి)కి గుర్తుచేశారు. ఆ తరువాత వరుసగా ఒక్కొక్క ముహాజిర్‌ను, ఒక్కొక్క అన్సార్‌ని పిలిచి "ఈరోజు నుంచి మీరిద్దరు పరస్పరం అన్నదమ్ములు" అని చెప్పనారంభించారు.

ప్రవక్త అనుచరులకు ప్రవక్త (స) ఆదేశానికి మించిన విషయం మరేదీలేదు. ఆయన ఆజ్ఞాపిస్తే చాలు, తోటిసోదరుని కోసం ప్రాణమైనా అర్పించడానికి సిద్ధం. అన్సారులు పరమసంతోషంతో తమ ముహాజిర్ సోదరుల్ని గుండెలకు హత్తుకున్నారు.

హజ్రత్ అబూబకర్ (రజి)తో హజ్రత్ ఖారిజా బిన్ జుబైర్ (రజి)కు, ఉమర్ ఫారూఖ్ (రజి)తో ఉత్బాన్ బిన్ మాలిక్ (రజి)కు, అబూఉబైదా బిన్ జిరా (రజి)తో సాద్ బిన్ మాజ్ (రజి)కు, అబ్దుర్రహ్మాన్ (రజి)తో సాద్ బిన్ రబీ (రజి)కు, జుబైర్ బిన్ అవ్వామ్ (రజి)తో సలామా బిన్ సలామా (రజి)కు, ఉస్మాన్ బిన్ అప్ఫాన్ (రజి)తో సాబిత్ బిన్ ముంజర్ (రజి)కు, తల్హా బిన్ఉబైదుల్లా (రజి)తో కాబ్ బిన్మాలిక్ (రజి)కు, ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి)తో అబూఅయ్యూబ్ (రజి)కు, అమ్మార్ బిన్ యాసిర్ (రజి)తో హుజైఫా బిన్ యమాన్ (రజి)కు మధ్య సోదరసంబంధాలు ఏర్పాడ్డాయి. ఇలా యావత్తు ముహాజిర్ ముస్లింలకు అన్సార్ ముస్లింలకు మధ్య దృఢమైన సోదరసంబంధాలు నెలకొన్నాయి.

ఆ తరువాత అన్సార్ ముస్లింలు తమతమ ధార్మిక సోదరుల్ని తమ ఇళ్ళకు తీసికెళ్ళి తమతో సమానంగా సకల సౌకర్యాలు కల్పించారు. ఉన్న ఆస్తిలో అర్ధభాగం పంచిచ్చారు. తమకు చెందిన ప్రతివస్తువునీ, ఎంత విలువైనదైనా సరే, రెండు సమానభాగాలుగా విభజించి ఇచ్చారు. ఈ విషయంలో సాద్ బిన్ రబీ అన్సారీ (రజి) అయితే మరింత ముందుకుపోయారు. ఆయన అన్సార్ముస్లింలలో కెల్లా గొప్పధనికుడు. దేవుడు ఆయనకు సిరిసంపదలతో పాటు విశాలహృదయం కూడా ఇచ్చాడు.

హజ్రత్ సాద్ బిన్ రబీ (రజి) తన ముహాజిర్ సోదరుడు హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)ను తీసుకొని ఇంటికి వెళ్ళారు. ఆయన ఇంట్లో ఉన్న ప్రతి వస్తువునీ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)కు చూపించి వీటిలో అర్ధభాగం మీదని చెప్పారు. తరువాత ఆయన్ని మరో గదిలోకి పిలిచికెళ్ళి కూర్చోబెట్టారు.

"సోదరా! నేను నా యావత్తు ఆస్తిపాస్తుల్ని, సమస్త వస్తుసామగ్రిని మీకు చూపెట్టాను. అందులో మీకు సగం ఇచ్చేశాను. మీకిష్టమైనవి నిస్సంకోచంగా మీరు తీసుకోవచ్చు." సాద్ బిన్ రబీ (రజి) తన సహజ ధోరణిలో చెప్పుకుపోతున్నారు.

హ్జ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) ఆయన మాటల్ని మౌనంగా వింటున్నారు.

"సోదరా! నాకు ఇద్దరు భార్యలు ఉన్నారు. వారిలో మీకిష్టమైన ఆమెను ఎన్నుకుంటే నేనామెకు విడాకులిస్తాను. ఇద్దత్ గడువు ముగిసిన తరువాత మీరామెను నిస్సంకోచంగా వివాహం చేసుకోండి. మీరు నా ధార్మిక సోదరులు. నాకున్న ప్రతి వస్తువులో అర్థభాగం మీకు రావలసిన హక్కు. వీటిని నేను సంతోషంగా ఇస్తున్నాను, స్వీకరించండి" అన్నారు హ్జ్రత్ సాద్ బిన్ రబీ (రజి).

"నా ప్రియసోదరా! దైవం మీ వ్యాపారంలో మరింత శుభం, సమృద్ధులు కలిగించుగాక! ఈ అసామాన్య సోదరభావానికి తగిన బహుమానం కూడా ప్రసాదించుగాక! నాకు వీటిలో ఏదీ అవసరం లేదు. నాకు బజారుకు పోయే దారి చూపండి చాలు" అన్నారు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) ఎంతో వినయంతో.

కేవలం కట్టుబట్టలతో వచ్చిన ముహాజిర్ ముస్లింలకు ఎన్నెన్ని వస్తువుల అవసరం ఉంటుందో చెప్పనవసరం లేదు. అంతకంటే ఎక్కువే ఇవ్వడానికి అన్సార్ ముస్లింలు ముందుకొచ్చారు. కాని ఇక్కడ చూస్తే ముహాజిర్ ముస్లిం తనకేమి అవసరం లేదంటున్నాడు. అన్సార్ ముస్లిం 'ఇది మీ హక్కే, తీసుకోండి' అంటున్నాడు.

సోదరుడుకాని సోదరుని పట్ల సొంత అన్నదమ్ముల్లో కూడా ఇలాంటి అనురాగం, ఆప్యాయతలు కానరావు. గత చరిత్రలో కూడా ఎక్కడా కన్పించవు. మహాప్రవక్త (సల్లం) ఇచ్చిన సుశిక్షణ, ఆయన కనబరచిన సమయస్ఫూర్తి అలాంటివి మరి! ఇస్లాంలోని విశ్వ మానవ సౌభ్రాతృత్వం ముహాజిర్‌లు, అన్సార్‌ల మధ్య విడదీయని అనుబంధం ఏర్పరచింది. ఎనలేని వాత్సల్యం జనింపజేసింది. ఒకరికొకరు ప్రేమా, సానుభూతులతో మెలగసాగారు. ప్రతి ఒక్కడూ తనకు ఇష్టమయినదే తన సోదరుని కోసం ఇష్టపడుతున్నాడు. ఆ సోదరునికి చీమకుట్టినా తనకే ఆ చీమ కుట్టినట్లు బాధపడేవాడు.

ముహాజిర్ ముస్లింలు స్వతహాగా కష్టజీవులు. వారికి ఇలా రోజుల తరబడి అన్సార్ ముస్లింల ఆస్తులు హరిస్తూ కూర్చోవడం ఇష్టం లేదు. అందువల్ల కాస్త అవకాశం దొరగ్గానే కష్టపడి పనిచేయ నారంభించారు. కొంతమంది వ్యాపారం చేపట్టారు. మరి కొంతమంది అన్సారుల పొలాల్లో సేద్యం చేయడానికి, ఇంకొందరు ఇతర కాయకష్టం చేయడానికి పూనుకున్నారు. కష్టేఫలే అన్నారు. దైవానుగ్రహం వల్ల వారు అనతికాలంలోనే గణనీయమైన అభివృద్ధి సాధించారు. వారి ఆత్మాభిమానం కూడా వారిని ఇతరుల మీద ఆధార పడకుండా సొంతకాళ్ళ మీద నిలబడటానికి ప్రేరేపించింది.

ముహాజిర్‌లలో కొందరు చాలా నిరుపేదలు కూడా ఉన్నారు. వీరు ఏ వ్యాపారం చేయడానికి వీల్లేకుండా పోయింది. అంచేత వీరు ఒక్కోసారి కడుపునిండా తిండిలేక మూడేసి రోజులు అవస్థపడుతూ ఉండవలసి వచ్చేది. తలదాచుకోవడానికి కనీసం చిన్న



గూడు కూడా లేదు. అందువల్ల దైవప్రవక్త (స) వారిపట్ల ఎంతో సానుభూతి, శ్రద్ధ వహించేవారు. ప్రజా ధనాగారం నుంచి వారికి కనీసవసరాలు సమకూర్చేవారు. మసీదు ఆవరణలో ఒక అరుగు ఉంది. ఆ అరుగు మీదే వీరు రాత్రిళ్ళు గడుపుతుండేవారు.

## జాత్యహంకారంతో సత్యతిరస్కారం-(75)

మదీనాలో యూదులు కూడా చాలామంది ఉన్నారు. సిరియా వరకు వీరికి వర్తక సంబంధాలున్నాయి. మదీనాలో వీరే అందరికంటే ఎక్కువ ధనవంతులు. అందువల్ల వీరి అధికారమే చెలామణి అవుతోంది. ఇలాంటి వాతావరణంలో ప్రశాంతంగా మనుగడ సాగించాలంటే ఒక్కటే మార్గం ఉంది. యూదులతో సత్సంబంధాలు కలిగిఉండాలి. దైవప్రవక్త (సల్లం) వారితో స్నేహఒప్పందం చేసుకోవాలని భావించారు.

మదీనాలో ముస్లింలు, యూదులు స్వేచ్ఛగా ఉండాలి. ఒకరి మతాన్ని ఒకరు అవమాన పరచుకోకూడదు. ఒకరి ఆస్తులు మరొకరు దోచుకోరాదు. బయటి నుంచి ఎవరైనా శత్రువు వచ్చి పట్టణం మీద దాడిచేస్తే అందరూ ఏకమై ఎదుర్కోవాలి. యుద్ధంలో లభించే సమరసొత్తు సమానంగా పంచుకోవాలి. దైవప్రవక్త (సల్లం) ఒప్పందంలో ఈ విషయాల్ని ప్రతిపాదించినప్పుడు యూదులు సంతోషంగా అంగీకరించారు. అందరూ ఒకచోట గుమికూడి ఒప్పందం రాసుకున్నారు.

యూదుల్లో కొందరు నిజమైన దైవభీతి, మంచి నీతినడవడికలు కలవారు కూడా ఉన్నారు. అలాంటివారు దైవప్రవక్త (స) ముఖవర్చస్సు చూడగానే "ఈయన తప్పక దైవ ప్రవక్త అయివుంటాడు. మన గ్రంథాల్లో ఈయన్ని గురించే భవిష్యత్ ప్రకటనలు ఉన్నాయి. అంతిమ దైవసందేశహరుడు ఈయనే. మనం ఏ జీవనవిధానం మరచిపోయామో దాన్నే ఈయన ప్రచారం చేస్తున్నాడు" అని గ్రహించి విశ్వాసులైపోయారు.

అయితే యూదుల్లో అత్యధికమంది తమ మతానికి వ్యతిరేకంగా దైవప్రవక్త (సల్లం) బోధించే విషయాలు వినడానికి ఏమాత్రం సిద్ధంగా లేరు. ప్రారంభంలో వారు దైవప్రవక్త (సల్లం), ఆయన సహచరులు మదీనా వచ్చినందుకు సంతోషించారు. శాంతి ఒప్పందం చేసుకోవడానికి కూడా అంగీకరించారు. అయితే దానికి ఓ కారణం ఉంది. దైవప్రవక్త (సల్లం)ను తమలో కలుపుకోవాలని, తమ ఆచారవ్యవహారాల రంగులో ఆయన్ని రంగరిద్దామని అనుకున్నారు. ఈ విధంగా ముస్లింలను కూడా తమ వైపు సులభంగా తిప్పుకోవచ్చని తలచారు. అలా అయితే తమ మతం అరేబియాలో బాగా ప్రాచుర్యం పొంది మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్థిల్లుతుందని భావించారు. ఇలా దేశమంతా తమ జాతిపేరు మార్మోగుతుందని ఆశించారు.

యూదులు ఎంతో కాలం నుంచి ఒక ప్రవక్త కోసం నిరీక్షిస్తున్నారు. ఆ ప్రవక్త ఏఏ ప్రాంతాల్లో ప్రభవిస్తాడని ఆశిస్తున్నారో ఆయా ప్రాంతాలకెళ్ళి నివశించసాగారు. రాబోయే ఆ ప్రవక్త తమ మతాన్నే అనుసరిస్తాడని ఊహించారు. ఆయన వచ్చిన తరువాత తమ మతం బలం పుంజుకుంటుందని, క్రైస్తవమతం నామరూపాల్లేకుండా పోతుందని కలలుగన్నారు. కాని ఇప్పుడు ముహమ్మద్ ప్రవక్త (సల్లం) వచ్చి తమ మతాన్ని గాకుండా

అసలు ధర్మం ప్రకటిస్తూ, కొత్త విషయాలు బోధించసాగారు. మొదటినుంచీ తమ దగ్గరున్న మతవిషయాలు ప్రజలకు బోధిస్తుండేవారికి ఇవి కర్ణకఠోరంగా తోచాయి. అలాంటివారు దైవప్రవక్త (సల్లం)ను, ఆయన అనుచరుల్ని ఎలా సహిస్తారు? ఈ విధంగా యూదులు కట్టుకున్న పేకమేడలు నిలువునా కుప్పకూలి పోయాయి. దాంతో వారు ముస్లింల మధ్య అనుక్షణం ఆందోళనతో నివసించవలసి వచ్చింది.

మున్ముందు దైవప్రవక్త (స) తమ పాలిట పెన్నిధి అవుతారనుకుంటే, ఇప్పుడాయన వారి పక్కలో బల్లెంలా తయారవుతున్నారు. అందువల్ల యూదులు స్నేహఒప్పందాన్ని గాలికి వదిలేసి ఆయనకు, ఆయన అనుచరులకు బద్ధశత్రువులుగా మారారు.

యూదులు స్వతహాగానే అలజడులు సృష్టించడంలో, జగడాలు పెట్టడంలో ఎంతో సిద్ధహస్తులు. "ఇతరుల మధ్య చిచ్చుపెట్టండి, తమ పని నెరవేర్చుకోండి" అన్నది వారి రాజనీతి. ఆ నీతినే వారు ఇక్కడ కూడా ప్రయోగించారు. వారు ముస్లింలలో విభేదాలు సృష్టించడానికి తీవ్రంగా ప్రయత్నించారు. కాని అది ఫలించకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

ఔస్, ఖజ్రజ్ తెగవాళ్ళు బహుదైవారాధకులుగా ఉన్నప్పుడే యూదులకు వారి వాసన గిట్టేదికాదు. ఇప్పుడు వారు ఇస్లాంస్వీకరించి మరింత సంఘటితమయ్యారు. వారి ఐకమత్యం చూసి యూదులు అసూయాగ్నిలో పడి మలమల మాడసాగారు.

"ఇక తమకు మదీనాలో పుట్టగతులుండవు. తమ అధికారపీఠం కాస్తా పరాధీనమై పోయింది. తమ నాయకత్వానికి నూకలు చెల్లిపోయాయి. ఇకనుంచి మదీనాలో ముహమ్మద్ రాజ్యమే సాగుతుంది. ఆయనకే పట్టం లభిస్తుంది. ఆయన మాటే చలామణి అవుతుంది. ఆయన ఆదేశమే శాసనం అవుతుంది" అనుకున్నారు వారు.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) మదీనా వచ్చిన కొన్నాళ్ళకే యూదుల ముఖాలు మాడిపోయాయి. వారి పరిస్థితి గమనించి ఆయన (సల్లం) వారి నాయకుల్ని, ధర్మవేత్తల్ని చర్చలకు పిలిచారు.

"హసీన్ బిన్ సలాం గురించి మీ అభిప్రాయం ఏమిటీ?" అడిగారు ఆయన.

"ఆయన మా నాయకుడు. మాకు మంచిమార్గదర్శి, గొప్ప జ్ఞానసంపన్నుడు. విజ్ఞుడు, వివేచనాపరుడు" అన్నారు యూదులు ముక్తకంఠంతో.

ఆ సమయంలో హసీన్ బిన్ సలాం (రజి) కూడా అక్కడే వేరేగదిలో వారికి కనపడ కుండా కూర్చున్నారు. తన జాతివాళ్ళ మాటలు వినగానే ఆయన వచ్చి ఇలా అన్నారు:

"యూద సోదరులారా! దైవానికి భయపడండి. ఈయన మాటలు వినండి. ఈయన దైవసందేశహరుడని మీకు తెలిసే ఉంది. తౌరాత్‌లో ఈయన ప్రస్తావన స్పష్టంగా ఉంది. అందులో ఈయన గుణగణాలన్నీ వర్ణించబడ్డాయి. నేను మటుకు ఈయన దైవప్రవక్తని సాక్ష్యమిస్తున్నాను. నేనీయన్ని పూర్తిగా గుర్తించాను. ఈయన అన్నివిధాలా సత్యవంతుడని విశ్వసిస్తున్నాను. ఈయన ఏది చెప్పినా నేను శిరసావహిస్తాను."



అదొక విచిత్ర సన్నివేశం. యూదులు కాస్తయినా ఊహించని సన్నివేశం. వారి ఆశలకు పూర్తిగా భిన్నమైనది. తమ ప్రియతమ నాయకుడు, గొప్ప మతాచార్యుడయిన హసీన్ నోట తాము ఇలాంటి మాటలు వినవలసి వస్తుందని కలలో కూడా ఊహించలేదు. అందువల్ల ఈ హఠాత్పరిణామానికి వారు నిర్ఘాంతపోయారు. వెంటనే తేరుకున్నారు. ఆ మరుక్షణమే వారు రంగుమార్చి హసీన్ (రజి)పై నిప్పులు కురిపించారు.

"ఏమిటీ! మీరు ఇతడ్ని గురించి అడిగారా? మేము మీమాట సరిగా అర్థం చేసుకోలేక మరో హసీన్ గురించేమో అనుకున్నాం. ఇతనయితే వట్టి మందమతి. బుద్ధిలేని చాందసుడు. విజ్ఞతావివేచనలు ఇతనిలో ఏకోశానా లేవు. మేమింతవరకు ఇతని నోట మంచిమాట ఒక్కటీ వినలేదు. ఎల్లప్పుడూ పనికిమాలిన మాటలే పలుకుతుంటాడు" అన్నారు యూదులు.

"దైవప్రవక్తా! చూశారా? నేను ముందే చెప్పలేదూ వీరు చాలాదుర్మార్గులని! అబద్ధ మాడటంలో ఆరితేరినవారు. నిందలు మోపడంలో నిపుణులు" అన్నారు హసీన్ (రజి).

హసీన్ బిన్ సలాం (రజి) గొప్ప పండితులు. యూదమతవేత్తల్లో ప్రముఖ స్థానం కలవారు. ఇతర యూదపండితుల్లాగానే ఈయనక్కూడ అంతిమ దైవప్రవక్త (స) గుణ గణాలు, ఆయన ప్రభవన కాలం గురించి బాగా తెలుసు.

మహాప్రవక్త (స) మదీనా వచ్చినప్పుడు హసీన్ ఓ చెట్టెక్కి దాన్నేదో సరిచేస్తున్నారు. క్రింద మేనత్త ఖాలిదా నిల్చొని ఉంది. దైవప్రవక్త (స) మదీనా వచ్చారని తెలియగానే హసీన్ ఆనందం అవధులు దాటింది. సంతోషం అణచుకోలేక 'అల్లాహుఅక్బర్' అని నినదించారు. కాని ఆయన ధోరణి ఖాలిదాకు ఆశ్చర్యం కలిగించింది.

"దైవం నిన్ను కాపాడుగాక! మెదడు సరిగ్గానే ఉందా? మూసా (అలైహి) వచ్చారన్న శుభవార్త విని కూడా నీవింతగా సంతోషించవేమో!" అన్నది ఆమె.

"అత్తయ్యా! నీకు తెలియదా? ఈయన మూసా ప్రవక్త సోదరుడే. మూసా బోధించిన ధర్మాన్నే తెచ్చారు. ఆయన ప్రకటించిన సందేశాన్నే చాటుతున్నారు. ఇద్దరూ ఒక దారిన నడిచే బాటసారులు. ఒకే ధర్మం వైతాళికులు" అన్నారు హసీన్ (రజి).

"ఏమిటీ! ఈయన మన మతగ్రంథంలో ప్రకటించబడిన దైవప్రవక్తే అయి ఉంటాడని అంటున్నావా నువ్వు?"

"ఔనత్తయ్యా! ఈయనే ఆయన. ఆయనే ఈయన."

"అలాగా, అయితే సంతోషకరమైన విషయమే" అన్నది ఖాలిదా.

ఆ తరువాత హసీన్ (రజి) మహాప్రవక్త (సల్లం) సన్నిధికి పోయి ఇస్లాం స్వీకరించారు. అక్కడ్నుంచి తిరిగొచ్చి తన కుటుంబసభ్యులకు ఇస్లాం ధర్మాన్ని పరిచయం చేశారు. దాంతో ఇంటిల్లిపాదీ ఇస్లాం స్వీకరించింది.

కాని ఈ విషయం హసీన్ (రజి) యూదుల ముందు బహిర్గతం చేయలేదు. ఆయన దైవప్రవక్త (సల్లం) దగ్గరకు వచ్చి ఇలా అన్నారు:

"దైవప్రవక్తా! యూదులు అసత్యవాదులు. వారికి కన్పించకుండా నన్ను మీరొక గదిలో కూర్చోబెట్టండి. తరువాత నేనెలాంటివాడినో, వారి దగ్గర నాకున్న స్థానం ఏమిటో స్వయంగా మీరే వారిని అడగండి. నేను ఇస్లాం స్వీకరించినట్లు వారికింకా చెప్పలేదు. అందువల్ల వారు ఉన్నది ఉన్నట్లు చెప్పి తీరుతారు. ఆ తరువాత నాలోలేని తప్పులన్నీ నాకు అంటగడతారు. ప్రపంచంలోని ప్రతి నిందను నాపై మోపుతారు."

హుసీన్ చెప్పినట్లే దైవప్రవక్త (సల్లం) ఆయన్ని రహస్యంగా ఓ గదిలో కూర్చోబెట్టి యూదుల్ని పిలిపించారు. తరువాత పై సంఘటన జరిగింది.

హుసీన్ బిన్ సలాం (రజి) యూదుల వ్యతిరేకతను ఏమాత్రం ఖాతరు చేయలేదు. ఆయన ఇస్లాంలో స్థిరంగా ఉన్నారు. ఆయన కుటుంబసభ్యులు కూడా స్థిరంగా ఉన్నారు. ధర్మావలంబనలో హుసీన్ కనబరచిన స్థిరత్వం, పట్టుదల చూసి దైవప్రవక్త (స) ఎంతో సంతోషించారు. ఆయనకు అబ్దుల్లా అని పేరు పెట్టారు.

యూదులు మటుకు లోలోన ఉడికిపోసాగారు. తమ జాతిలో గొప్పపండితుడు, ఎంతో ప్రతిభావంతుడైన నాయకుడు అనుకున్న హుసీన్ కాస్తా ముస్లిం అయిపోయాడు. ఇప్పుడేం చేయాలి?

మదీనాలో ముహమ్మద్ గనక నిలదొక్కుకుంటే తమ హోదా, అంతస్తులకు భంగం వాటిల్లుతుందని, తమ నాయకత్వం చాప కింద నీరొస్తుందని యూదులు మొదటే అనుమానపడ్డారు. ఇప్పుడు ఆయన సందేశం విస్తరిస్తే తమ ధర్మానికే గాకుండా తమ ఉనికికే ప్రమాదం ముంచుకొస్తుందని వారు భయపడిపోయారు.

ముహమ్మద్ (స) దైవప్రవక్త అని, ఆయన తెచ్చే దివ్యసందేశం మూసా (అలైహి) సందేశాన్ని పునరుజ్జీవింపజేసి ఆయన దౌత్యాన్ని పరిపూర్తి చేస్తుందని యూదులకు బాగా తెలుసు. ఈయన తౌరాత్‌లోని మార్పులు సంస్కరిస్తారని కూడా వారికి తెలుసు. అయినా యూదులు తలబిరుసుతో అంతిమ దైవప్రవక్త (స)కు వ్యతిరేకంగా ధ్వజమెత్తారు. ఆయన బోధించే విషయాలు ఒక్కటీ వినకూడదని నిశ్చయించుకున్నారు.

యూదుల్లో బనూనజీర్ అనే ఓ తెగఉంది. దానికి హుయ్యీ బిన్ అఖ్తబ్ నాయకుడు. అతనికి అబూయాసిర్ అనే ఒక తమ్ముడు ఉన్నాడు. మహాప్రవక్త (స) మదీనా వచ్చిన తరువాత వీరిద్దరు సోదరులు ఆయన్ని కలుసుకోవడానికి వచ్చారు. సాయంకాలం అక్కడ్నుంచి తిరిగి బయలుదేరితే వారి ముఖంలో కత్తివాటుకు నెత్తుటి చుక్కలేదు. మాడిపోయిన ముఖాలతో ఉసూరుమంటూ గృహోన్ముఖులయ్యారు.

అబూయాసిర్ మెదడు ఆలోచనలతో వేడెక్కిపోయింది. అతను తన అన్నతో "ఇంతకూ నీ అభిప్రాయం ఏమిటీ? ఈయన ఆయనే నంటావా?" అని అడిగాడు.

"ఔను. ఈయన ఆయనే. ఇందులో ఎలాంటి సందేహం లేదు" అన్నాడు హుయ్యీ.

"ఈ విషయం పట్ల నీకు పూర్తిగా నమ్మకం ఉందా?"

"ఆ... నాకు పూర్తిగా నమ్మకం ఉంది."



"అయితే ఇప్పుడు మనం ఏం చేద్దామంటావు?"

"మన బొందిలో ప్రాణమున్నంతవరకూ మనం ఇతడ్ని వ్యతిరేకించాల్సిందే. ప్రతీకారం తీర్చుకోవాల్సిందే. ఇతని మాట మనం ఒక్కటీ వినకూడదు" అన్నాడు హుయ్యీ.

## యూదుల ఆగడాలు-(76)

యూదులు హద్దుమీరిన జాత్యహంకారంతో సత్యాన్ని నిరాకరించడమే గాక దైవప్రవక్త (సల్లం)కు బద్ధ విరోధులైపోయారు. వారు తమ పగ, విరోధ భావాలను ఇంకా బహిర్గతం చేయలేదు. దైవప్రవక్త (సల్లం) మదీనాలో ప్రముఖ వ్యక్తిగా, ప్రజలకు ప్రియతమ నాయకునిగా రూపొందేవరకు యూదులు ప్రతీకారాగ్నిని తమ హృదయాల్లోనే అణచి పెట్టుకున్నారు. ఆ తర్వాత కొన్నాళ్ళకు వారి హృదయాలు అగ్నిపర్వతాల్లా ప్రతీకార సెగలు కక్కనారంభించాయి.

యూదుల్లో కొందరు దైవప్రవక్త (సల్లం) సందేశానికి ప్రభావితులైనవారు కూడా ఉన్నారు. అలాంటివారిలో హుసీన్ (రజి) తరువాత అసద్ ప్రముఖుడు. వారిద్దరు ఇస్లాం స్వీకరించడంతో యూదులు విలవిల్లాడి పోయారు. ఇక ఏమాత్రం సహించకూడదని భావించి దైవప్రవక్త (సల్లం)ను విరోధించడానికి సిద్ధమయ్యారు.

యూదుల్లో అత్యధికమంది దైవప్రవక్త (సల్లం)కు బహిరంగ శత్రువులయ్యారు. అయితే కొందరు మాత్రం ఇంకా తాము ముస్లింలేనని చెప్పుకుంటూ మేకతోలు కప్పుకున్న తోడేళ్ళుగా ఉండిపోయారు. వారి కాపట్యం, దుష్టసంకల్పాలు వారు దైవప్రవక్త (సల్లం)ను అడిగే ప్రశ్నల ద్వారానే బహిర్గతమవుతాయి.

"దైవప్రవక్తా! సకల సృష్టిరాసిని దేవుడు సృష్టించాడు కదా! మరి దేవుడ్ని ఎవరు సృష్టించారు?" అంటారు వారు ఒక్కొక్కప్పుడు.

"దైవప్రవక్తా! దేవునిఆకారం ఎలా ఉంటుంది? ఆయనకు కాళ్ళు చేతులు ఉంటాయా? ఇతర శరీరావయవాలు ఎలా ఉంటాయి?" అంటారు మరొకప్పుడు.

"ముహమ్మద్ గారూ! మీరు నిజంగా దేవుని ప్రవక్తే అయితే కాస్త ఆ దేవుడు ఎలా ఉంటాడో మాకు చూపించండి. ఆయన్ని చూసి మేము ఆయన మాటలు వింటాం" అంటారు ఇంకొక్కప్పుడు.

"ముహమ్మద్ గారూ! మీరు విన్పిస్తున్న ఈ సూక్తులు నిజంగా దేవుని దగ్గర్నుండి వస్తున్నాయా? మరి అవి తౌరాత్ సూక్తులతో పోలివుండటం లేదేమిటీ? ముహమ్మద్‌గారూ! మీరు ఒప్పుకోండి, ఒప్పుకోకపోండి. మొత్తానికి ఏదో భూతం మీకీమాటలు నేర్పుతోంది. లేదా ఎవరైనా మనిషే అయి ఉంటాడతను. మనిషయితే అతను మహా తెలివిగలవాడిలా కన్పిస్తున్నాడండోయ్!!" ఇలా ప్రేలుతుంటారీ దైవవిరోధులు.

"దైవసాక్షిగా చెబుతున్నాను. ఈ సూక్తులన్నీ సాక్షాత్తు దేవుని దగ్గర్నుండే వస్తున్నాయి. నేను దైవప్రవక్తను. ఈ సంగతి మీకు తెలియనిది కాదు. ఇది మీ దగ్గరున్న తౌరాత్‌లో కూడా ఉంది. అలాంటప్పుడు మీరిలా నన్ను వ్యర్థ ప్రశ్నలు అడుగుతారెందుకు? ఈ

విధంగా నన్ను వేధించడం వల్ల మీకు ఒరిగేదేమిటి?'' అంటారు దైవప్రవక్త (సల్లం) వారి మాటలు విని ఎంతో ఆవేదనగా.

''మీరు చెప్పే మాటలపై మాకు నమ్మకం కుదరడం లేదు. అంచేత వ్రాతపూర్వక మైన గ్రంథాన్ని ఏకంగా ఆకాశం నుండి అవతరింపజెయ్యండి. దాన్ని మేము స్వయంగా చదివి విశ్వసిస్తాం'' అంటారు యూదులు.

''సోదరులారా! దైవానికి భయపడండి. ఇస్లాంను విశ్వసించండి. దైవసాక్షి! నేను మీ దగ్గరికి తెచ్చినదంతా సత్యమేనని మీకు బాగా తెలుసు. కాని మీరు తెలిసి కూడా నన్ను వ్యతిరేకించడం శోచనీయం'' అంటూ బాధాతప్త హృదయంతో నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తారు దైవప్రవక్త (సల్లం).

మహనీయ ముహమ్మద్ (స) దైవప్రవక్తని తమ అంతరాత్మలు ఘోషిస్తున్నా వాటిని ఖాతరుచేయకుండా యూదులు ఆయన్ని తిరస్కరించి ఆయనపై కత్తిగట్టారు.

అంతేకాదు, అన్సారులు, ముహాజిర్ల మధ్య విభేదాలు సృష్టించడానికి సయితం ప్రయత్నించారు. అన్సారులు దైవమార్గంలో తమ సిరిసంపదల్ని ఖర్చుపెట్టడం, నిరుపేద ముహాజిర్లకు ఆర్థిక సహాయం అందజేయడం వంటి సత్కార్యాలు చేస్తుంటే వారు ఓర్వలేక పోయేవారు.

''ఎందుకు మీరిలా వృథాగా డబ్బు ఖర్చుపెట్టి జేబులు ఖాళీ చేసుకుంటారు? రేపటి రోజు మీ దగ్గర ఏమీ మిగలకపోతే ఏం చేస్తారు? కాస్త ముందూ వెనుకా ఆలోచించి మరీ ఖర్చుపెట్టండి'' అంటారు వారు.

వారి పగటి వేషాల్ని గురించి దైవప్రవక్త (సల్లం) త్వరలోనే తెలుసుకున్నారు.

మదీనా యూదుల్లో షాస్ బిన్ ఖైస్ అనే వృద్ధుడొకడు ఉన్నాడు. అతనోసారి అన్సార్ ముస్లింలు సమావేశమై ఉన్నప్పుడు వారి పక్కగా పోవడం జరిగింది. సమావేశంలో ఔస్, ఖజ్రజ్ తెగలవాళ్ళున్నారు. అందరూ సంతోషంతో ఇష్టాగోష్టి జరుపుకుంటున్నారు. సభావాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. సర్వత్రా ప్రేమాభిమానాలు వెల్లివిరిస్తున్నాయి. అందరి పెదవులపై దరహాసాలు తొణికిసలాడుతున్నాయి. సంభాషణల్లో మాధుర్యం ఉట్టిపడుతోంది. సమావేశం సద్భావం, సౌభ్రాతృత్వాల వెలుగుకిరణాలు విరజిమ్ముతోంది. కాని షాస్ బిన్ ఖైస్ ఈ దృశ్యం చూసి నఖశిఖ పర్యంతం మండిపడ్డాడు.

''ఈ సమావేశంలో బనీఖీలా నాయకుడు కూడా ఉన్నాడే! పైగా ఇతను వీరితో కలసిమెలసి సన్నిహితంగా మాట్లాడుతున్నాడే!! ఇలా ఇతను ఔస్, ఖజ్రజ్ తెగలతో కలిసిపోతే మనపై పెద్ద విపత్తు వచ్చిపడుతుంది. ఇక ఊరుకుంటే లాభంలేదు. ఏదో ఒకటి చెయ్యాలి'' అనుకున్నాడు మనస్సులో ఆ వృద్ధ యూదుడు.

అనుకోవడమే తడవుగా అతను ఓ యూద యువకుడ్ని కలుసుకొని, విషయం చెప్పి ఇలా ఉసిగొల్పాడు:

''చూడబ్బాయ్! వెంటనే నీవా సమావేశంలోకి వెళ్ళు. అక్కడ కాస్సేపు మౌనంగా కూర్చో. ఆ తరువాత 'బఆస్' యుద్ధ ప్రస్తావన తీసుకురా. ఆ యుద్ధంలో జరిగినదంతా



చాకచక్యంతో వారి ముందు వెల్లడించు. ఆనాడు ఔస్, ఖజ్రజ్ తెగవాళ్ళు పరస్పరం విద్వేష విషం వెదజల్లుకుంటూ పాడుకున్న పాటల్ని కూడా ప్రస్తావించు.''

'బఆస్' యుద్ధం ఔస్, ఖజ్రజ్ తెగల మధ్య జరిగిన భయంకర యుద్ధం. అందులో ఉభయ తెగలవాళ్ళు పచ్చినెత్తురు తాగడానికి సిద్ధమై చివరికి సర్వనాశనం కొని తెచ్చుకున్నారు. ఆనాటి దుష్పరిణామాలు తలచుకుంటేనే ఒళ్ళు జలదరిస్తుంది. అది అజ్ఞాన కాలంలో జరిగిన దుర్ఘటన. అప్పటికి ఆ తెగలకు దైవధర్మం అంటే, జ్ఞానజ్యోతి అంటే ఏమిటో బొత్తిగా తెలియదు.

ఆ యువకుడు అన్సారుల సమావేశంలోకి పోయి ఓచోట నిశ్శబ్దంగా కూర్చున్నాడు. కాస్సేపయ్యాక వారి మధ్య విద్వేషాగ్ని రగుల్కొల్పాడు. సమావేశంలో బఆస్ యుద్ధ ప్రస్తావన వచ్చింది. ఇంకేముంది, చూస్తుండగానే సమావేశం తీరుతెన్నులు మారిపోయాయి.

క్రమేణా ఇరుతెగల మధ్య వేడి పుంజుకుంది. ఆనాటి సంఘటనలు, అప్పటి విద్వేషపూరిత కవితలు బయటపెట్టి ఉభయులు పరస్పరం దూషించుకున్నారు. మాటా మాటా పెరిగింది. ఇద్దరు వ్యక్తుల్లో వివాదం కాస్త ముదిరింది. అందులో ఒకరు ఔస్‌తెగ మనిషి, మరొకరు ఖజ్రజ్ తెగకు చెందిన వ్యక్తి.

''అయితే ఆనాటి రుచి చూడటానికి సిద్ధమేనా?'' అన్నాడు వారిద్దరిలో ఒకడు.

''పద. మేమిందుకు సిద్ధంగానే ఉన్నాం'' అన్నాడు రెండోవాడు రోషంతో.

రక్తపు హోలి ఆడాల్సిన స్థలం కూడా నిర్ణయమైపోయింది. రెండు వర్గాలు లేచి నడుం బిగించాయి. పరస్పరం కాటేసుకోవడానికి బుసలు కొట్టసాగాయి.

''ఖడ్గాలు పట్టండి..! బరిసెలు తెండి..!! రంగంలోకి దూకండి..!!! కత్తులు ఝుళి పించండి..!!!!''

అరుపులు, కేకలతో పట్టణ వీధులు మార్మోగిపోయాయి. ఈ కోలాహలం గురించిన వార్త దైవప్రవక్త (స)కు క్షణాల్లో తెలిసిపోయింది. ఆయన వెంటనే కొందరు ముహాజిర్ అనుచరుల్ని వెంటబెట్టుకొని ఆ ప్రదేశానికి చేరుకున్నారు.

అక్కడ రెండు వర్గాలుగా చీలిపోయి పోరుకు సిద్ధమవుతున్న అన్సార్ ముస్లింల చేతుల్లో కత్తులు ధగధగ మెరిసి పోతున్నాయి. మహాప్రవక్త (సల్లం) తక్షణమే మెరుపు తీగలా వారి మధ్యకు వచ్చి నిలబడ్డారు. అంతే, రెండు వర్గాల్లో గందరగోళం ఒక్కసారిగా సద్దు మణిగింది.

''ముస్లింలారా! దైవానికి భయపడండి. నేను మీ మధ్య జీవించి ఉండగానే ఏమిటీ అజ్ఞానపు అరుపులు, నినాదాలు? ఓసారి దేవుడు చేసిన మేళ్ళను జ్ఞప్తికి తెచ్చుకోండి. ఆయన మిమ్మల్ని ఇస్లాంవరం అనుగ్రహించి సంపన్నుల్ని చేశాడు. విశ్వాసభాగ్యం ఇచ్చి ఉన్నత శిఖరాలకు చేర్చాడు. సత్యతిరస్కారం నుంచి విమోచనం కలిగించాడు. అజ్ఞానపు ఊబి నుండి వెలికితీశాడు. పరస్పర ప్రేమాభిమానాలతో మీ సంబంధబాంధవ్యాలను తీర్చిదిద్దాడు. అలాంటప్పుడు ఈ ప్రేలాపనలు, పరుగిళ్ళేమిటీ?'' అన్నారు దైవప్రవక్త (స).

ఆ మహనీయుని నోట వెలువడిన ఈ అమృత పలుకులతో వారి కళ్ళ ముందున్న చీకటి తెరలు పటాపంచలయి పోయాయి. ఒక్కసారిగా వారు మత్తు నుండి తేరుకున్నారు. తమవల్ల జరిగిన పొరపాటేమిటో తెలుసుకొని సిగ్గుతో తలలొంచుకున్నారు. వెంటనే రెండు తెగలవాళ్ళు పరస్పరం ఆలింగనం చేసుకొని కుమిలి కుమిలి రోదించారు. ఆ తరువాత వారంతా తమ ప్రియతమ నాయకుని వెంట వెళ్ళిపోయారు.

ఈ కుట్రకు కారకుడయిన ఆ వృద్ధ యూదుడు పథకం విఫలమైనందుకు లోలోన కుతకుతలాడి పోయాడు. గుండెల్లో మండుతున్న విద్వేషజ్వాలలతో చిర్రెత్తిపోయాడు. కాని చేసేదేమీలేక ముఖం మాడ్చుకొని మౌనంగా ఉండిపోయాడు.

## రాళ్ళకుప్పలో రత్నం-(77)

అలాంటి రాళ్ళకుప్పలోనే ఓ విశిష్ట రత్నం మెరిసింది. ఒక యూదయువకుని అంతరంగంలో ఓ వినూత్న కిరణం ప్రసరించింది. ఇస్లాం పట్ల అతని హృదయసాగరంలో విశ్వాస కుసుమం వికసించింది. ఆరోజు నుంచి అతను దైవప్రవక్త (స) దర్శనం కోసం ఎంతగానో తపించిపోసాగాడు. లోగడ అతను ఎన్నో సార్లు దైవప్రవక్త (స)ను చూశాడు. కాని ఆ చూపులో విశేషమేమీ లేదు. దృష్టి కాకతాళీయంగా పడింది, మళ్ళీ చెదిరిపోయింది. అంతే. కాని ఈరోజు దృష్టి పడగానే ఆంతర్యంలో అనిర్వచనీయమైన ప్రకంపనాలేవో ఎగిసిపడుతున్నాయి.

ఇంటి నాలుగ్గోడల మధ్య ఏ మహనీయుని పేరు ఉచ్చరించడమే పెద్ద నేరమో ఆ మహాత్ముని పట్ల అభిమానం ఇప్పుడతని హృదయ కుహరంలో తిష్ఠ వేసుకుంది. అది పూర్తిగా వికసించిన అనురాగ కుసుమం. ఉభయలోకాలను ఉత్తేజపరిచే దాని పరిమళాన్ని ఇప్పుడు కప్పిపుచ్చడం అంత సులభం కాదు. ఆశ, భయాల మధ్య చెలరేగిన ఘర్షణతో అతని మెదడు వేడెక్కి పోయింది.

“పద. ఇప్పుడే ఆ దివ్య సమావేశానికి హాజరయి ఆయన బోధామృతాన్ని తనివితీరా ఆస్వాదించు” అని మనస్సు ప్రేరేపిస్తుంటే, “ఔను, సత్వరమే వెళ్ళి ఆ అందాల రేడుని ఆపాద మస్తకం దర్శించుకుందాం. ఇహపర లోకాల శుభాలను మూట గట్టుకుందాం” అని నయనాలు మారాము చేస్తున్నాయి.

కాని ఎలా....? లూసా ఆ సమావేశానికి పోవడం ఎవరైనా చూస్తే ఇంకేమైనా ఉందా! తల్లిదండ్రులు తాట వలుస్తారే! సంఘం వెలివేస్తుందే!! ఉక్కు గోడల మధ్య హృదయం బందీ అవుతుందే!!!

ఆశ, భయాల మధ్య సాగిన సంఘర్షణలో చావు తప్పి కన్ను లొట్టపోయినట్లు ఎలాగో ఆశ పాక్షిక విజయం సాధించింది. శక్తినంతా కూడదీసుకొని ఆసక్తి అడుగుని ముందుకు వేయించింది. కాళ్ళు మసీదు ముఖద్వారం పక్కగా నడుస్తుంటే కళ్ళు లోపలికి తొంగిచూసి కాస్తంత చల్లదనం పొందాయి.

కాని మరోసారి మసీదు వైపు పోవడానికి ధైర్యం చాలడం లేదు. అందువల్ల ఈసారి ఆ యువకుడు మసీదుకు వెళ్ళే దారిలో ఓ పక్కన కూర్చొని నిరీక్షించసాగాడు. కాస్సేపటికి



మానవమహోపకారి (సల్లం) మసీదు నుండి వస్తుంటే ఆయన ముఖవర్చస్సుని కళ్ళ ద్వారా తస్కరించి గుండెల్లో భద్రపరచుకున్నాడు.

ఈ విధంగా రోజులు గడచిపోతున్నాయి. అంతరంగంలో జనించిన ప్రేమాగ్ని కణం ప్రజ్వరిల్లుతూనే ఉంది. చివరికి ఈ అభిమాన జ్వరం తీవ్రమయి కంటికి కునుకు లేకుండా చేసింది. హృదయంలోని భారం తీసివేయడానికి తనివితీరా ఏడుద్దామన్నా స్వేచ్ఛ లేకుండా పోయింది. దాంతో మనోభారం అధికమయి ఆ యువకుడు వ్యాధిగ్రస్తుడయ్యాడు.

వ్యాధినివారణ కోసం అతనితండ్రి ఎన్నెన్నో ప్రయత్నాలు చేశాడు. గొప్పగొప్ప వైద్య నిపుణుల్ని పిలిపించాడు. కాని ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. శరీర సంబంధమైన వ్యాధి అయితే ఏదో రకంగా నయమయ్యే అవకాశం ఉంటుంది. కాని మనోవ్యాధికి మందేముంటుంది? అందులో ఇది ప్రేమ జబ్బాయె!

ఎన్ని మందులు వాడినా, ఎన్ని అంత్రాలు వేసినా వ్యాధి తగ్గుముఖం పట్టలేదు. పైగా అది దినదిన ప్రవర్ధమానమవుతూ ప్రాణసంకటంగా తయారయింది. చివరికి విప్పారిన పువ్వు లాంటి ఆ నవయువకుడు క్రుంగి కృశించిపోయి ఎముకల గూడులా మారిపోయాడు.

కొడుకు పరిస్థితి చూసి తల్లి తల్లడిల్లి పోయింది. తండ్రి నిరాశా నిస్పృహలతో పిచ్చి వాడిలా తయారయ్యాడు. బంధువుల ముఖాలపై కూడా విచారఛాయలు అలుము కున్నాయి. ప్రేమవ్యాధి ఇప్పుడు జీవిత సరిహద్దు వైపుకు వేగంగా పరుగిడుతోంది. నీరసం గంటగంటకు అధికమవుతోంది. నోట మాట వెలువడటం కూడా కష్టమయి పోయింది. అప్పుడప్పుడు వినపడే మూల్గుడు ఇంటి వాతావరణాన్ని కకావికలం చేస్తోంది.

రోగిలాగే సూర్యుడు కూడా నీరసంతో క్షణక్షణానికి తేజోవిహీనుడైపోతున్నాడు. నింగిని నలువైపుల నుంచి కారుమబ్బులు కమ్ముతున్నట్లు పుడమితల్లిని చీకటి తెరలు త్వరత్వరగా కప్పివేయసాగాయి. యువకుడు బలాన్నంతా కూడదీసుకొని ఏదో చెప్పాలని ప్రయత్నిం చాడు. కాని గొంతులోని మాట గొంతులోనే పూడుకుపోయింది. పెదవులు వణుకుతుంటే కాంతివిహీనమైన కళ్ళతో తండ్రి వంక అసహాయంగా చూస్తుండిపోయాడు.

కొడుకు దుస్థితి చూసి తండ్రి తల్లడిల్లి పోయాడు. చెవి దగ్గర ముఖం పెట్టి “బాబూ! ఏదైనా చెప్పాలనుకుంటున్నావా?” అని అడిగాడు అమితమైన వాత్సల్యంతో.

“నాన్నా......” హీనస్వరంతో కాస్తంత పెదవులు విచ్చుకున్నాయి.

“నా జీవితపు చివరి కోరికను మీరు సంతోషంగా నెరవేరుస్తానంటే చె....బు....తా....ను” గొంతు మళ్ళీ పూడుకుపోయింది.

“నా చిట్టి తండ్రీ! నువ్వు కోరితే చాలుగాని ఎంత మూల్యం చెల్లించయినా, చివరికి తలతాకట్టు పెట్టయినా సరే నీకోరిక తీర్చనూ? చెప్పు నాయనా! నీకోరిక ఏమిటో సంకోచం లేకుండా చెప్పు. ఇప్పుడే ఈ క్షణంలోనే తీర్చుతాను” పుత్రప్రేమ పురివిప్పింది.

“నాన్నా! మీరు ఏమనుకోకుంటే........” పెదవులు వణికాయి.

“నాన్నా! కొన్నాళ్ళ నుంచి నేను ముహమ్మద్ మహనీయుని పట్ల కలిగిన భక్తి విశ్వాసాలతో లోలోనే దహించుకు పోతున్నాను. మీకు భయపడి నేనీ రహస్యాన్ని బయట పెట్టలేక పోయాను. కాని ఆయన జ్ఞాపకం నన్ను అనుక్షణం తినేస్తోంది. కళ్ళు మూసినా, తెరిచినా ఆయన రూపమే నా మనస్సులో మెదలుతోంది....

“నాన్నగారూ! ఒక్కసారి..... ఒక్కసారి అంటే ఒక్కసారి ఆ మహాత్ముణ్ణి ఇక్కడికి పిలుచుకు రారూ? ఆయన దివ్యమోమును తనివితీరా తిలకించి తరిస్తాను. ఆయన నోట ముక్తి శుభవార్త విని తృప్తిగా ఊపిరి విడుస్తాను. నాన్నా! ఒక్కసారి.....”

కొడుకు కోరిక విని తండ్రి మండిపడ్డాడు. కాని కోపాన్ని పళ్ళమధ్య బిగబట్టి ఎలాగో తనను తాను తమాయించుకున్నాడు. ఎంతైనా కన్నకొడుకు కదా! అందులో లేకలేక కలిగిన ఏకైక సంతానం!! తనకు ఇష్టమున్నా లేకపోయినా ఈ స్థితిలో కొడుకు కోరిక నెరవేర్చక తప్పదు మరి. ఓ వేడి నిట్టూర్పు విడుస్తూ అన్నాడు:

“సరేలే నాయనా! ఈమాట నాకు తీవ్రమైన అసంతృప్తి కలిగించినా, నువ్వు విచార పడుతూ క్రుంగిన మనస్సుతో ఇహలోకం వీడటం నాకిష్టంలేదు. నీ కోరికను తీర్చడానికి ఇప్పుడే వెళ్తున్నాను. రేపటి నుంచి మన జాతి ప్రజలు నన్ను యూదసమాజం శత్రువుగా పరిగణిస్తారు. అయినా నీకోసం ఈ అపవాదుని కూడా సహిస్తాను.”

ఆంతర్యం అభ్యంతరం పెడ్తున్నా కాళ్ళు బలవంతంగా అతడ్ని మసీదు వైపునకు లాక్కెళ్ళాయి. మసీదు ముఖద్వారం దగ్గరే నిలబడి “నేను ముహమ్మద్ (స)ని కలుసు కోవడానికి వచ్చాను. లోపల ఉంటే కాస్త కబురుచేయండి” అన్నాడు అక్కడున్నవారితో.

కొన్ని క్షణాల తరువాత దైవసందేశహరుని సుమధుర వాక్కు విన్పించింది:

“చెప్పండి, నాతో ఏం పనిపడి వచ్చారు?” ఈ పలుకులు యూదుని కర్ణపుటాలకు తాకి హృదయంలో క్షణంపాటు సంచలనం సృష్టించాయి.

“నా ఏకైక కుమారుడు చావుబ్రతుకుల్లో ఉన్నాడు. మీమీది ప్రేమాభిమానాలతో వాడు పిచ్చివాడయి పోయాడు. మీ విశిష్ఠ వ్యక్తిత్వం యావత్తు అరబ్బుల్ని ఉన్మాదులుగా చేసింది. అది నా కొడుకుని కూడా పిచ్చివాణ్ణి చేసింది. ఆ పిచ్చితోనే మావాడు చిక్కి శల్యమై ఇప్పుడు కాటికి కాళ్ళుజాపి కూర్చున్నాడు. వాడు తన చివరి కోరికగా మీ దర్శన భాగ్యం పొంది, మీనోట ముక్తి శుభవార్త వినాలని ఉబలాటపడుతున్నాడు.”

యూదుడి మాటలు వినగానే దైవప్రవక్త (సల్లం) ముఖపద్మం విప్పారింది.

“పదండి, అదృష్టజాతకుడైన ఆ యువకుడ్ని చూసి వద్దాం. అతడ్ని స్వాగతించడానికి నభోమండలంలో హంగామా మొదలయింది” అన్నారు ఆయన తన అనుచరులతో.

ప్రవక్త కోసం ఎదురుచూసి చూసి యువకుని కళ్ళు మూతలు పడ్డాయి.

తండ్రి తలగడ వైపున నిల్చున్నాడు. మహాప్రవక్త (సల్లం) అనుచరుల మధ్య యువరోగికి ఎదురుగా నిలబడ్డారు. తండ్రి కొడుకు మీద వంగి ఆప్యాయతగా అతని తల నిమురుతూ-



“నాయనా! కళ్ళు తెరు. ఇదిగో నీ విశ్వాస కేంద్రబిందువు నీ ముంగిట వాలింది. నీ అభిమాన నాయకుడు ముహమ్మద్ (స) నీ ముందు నిల్చున్నారు. కళ్ళు తెరు బాబూ!” అన్నాడు.

ముహనీయ ముహమ్మద్ (సల్లం) పేరు వినగానే పోతున్న ప్రాణమల్లా గిర్రున తిరిగొచ్చింది. కాస్సేపటికి యువరోగి కళ్ళు మెల్లిగా తెరచుకున్నాయి. ఎదురుగా అందాలరేడు వరాల పూలహారంతో శోభాయమానంగా వెలుగుతూ నిల్చున్నాడు.

“మహానుభావా! ఎదలో భక్తివిశ్వాసాల సిరిసంపదలు పెట్టుకొని అంతిమ గమ్యం వైపు పయనిస్తున్నాను. మీ సేవకుల జాబితాలో ఈ సేవకుని పేరు కూడా చేర్చుకోండి. సాటిలేని ఏకైక దైవాన్ని విశ్వసించినప్పటికీ జీవితంలో ఒక్క సారయినా ఆయన ప్రసన్నత కోసం సజ్దా (సాష్టాంగ ప్రణామం) చేసే భాగ్యానికి నోచుకోలేకపోయాను. ఇలాంటి స్థితిలో నాకు మోక్షం లభిస్తుందని ఆశించగలనా?” అన్నాడు ఆ యువకుడు దైవప్రవక్త (సల్లం) వైపే తదేకంగా చూస్తూ.

“ఆందోళన పడకు నాయనా! దేవుని ఏకత్వాన్ని అంగీకరిస్తూ ఓసారి ‘సద్వచనం’ పఠించు. నీ మోక్షానికి నేను హామీ ఇస్తాను” అన్నారు దైవప్రవక్త (స) అభయమిస్తూ.

యువకుని తండ్రి ఈ మాటలు వినగానే చెప్పలేని భావావేశాలతో వివశుడయి పోయి కొడుక్కి ఇలా హితవు చేశాడు:

“నా చిట్టితండ్రీ! నువ్వు ఎంతో అదృష్టవంతుడివి. నా మనసులో ఎంత విరోధం ఉన్నా ఈ పలుకులు సత్యవ్రతుడయిన ఒక దైవప్రవక్త నోట వెలువడ్డాయన్న వాస్తవాన్ని నేను అంగీకరించకుండా ఉండలేను. ఒక దాసునికి స్వయంగా దైవప్రవక్తే ఇలాంటి హామీ ఇస్తున్నాడంటే ఇంతకంటే అదృష్టం అతనికి మరేమీ ఉండదు. ఆయన దగ్గర నువ్వు స్పష్టమైన మాటల్లో వాగ్దానం తీసుకొని ఇస్లాం పరిధిలో ప్రవేశించు.”

తండ్రి హితబోధ యువకుడ్ని మరింత ఉత్సాహపరిచింది.

“మహానుభావా! సమాధి మజిలీ మొదలు స్వర్గానికి చేరుకునే దాకా మీరిస్తున్న హామీతో నేను ఇస్లాం స్వీకరిస్తున్నాను. అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ ఆయన ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను.”

యువకుని నోట వెలువడ్డ ఈ సద్వచనం వాతావరణంలో మౌనంగా ప్రతి ధ్వనించింది. ఆ వెనువెంటనే అతను శాశ్వతంగా కన్నుమూశాడు. ఇంట్లో వారంతా ఒక్కసారిగా గొల్లుమన్నారు.

యువకుని తండ్రి దుఃఖం నుండి తేరుకొని “మహాత్మా! ఇప్పుడీ భౌతిక కాయం మాది కాదు. అంత్యక్రియలు జరిపే బాధ్యత మీకే అప్పగిస్తున్నాను” అన్నాడు.

దైవప్రవక్త (సల్లం) అతని అభ్యర్థనను మన్నించారు.

“విశ్వాసాభిమానాల ఈ అమూల్య నిక్షేపాన్ని చేతుల మీదికి ఎత్తుకోండి. పెళ్ళికొడుకు ఊరేగింపులా ఈ జనాజా (శవం) మదీనా వీథుల గుండా సాగుతుంది” అన్నారు ఆయన.

ఈ వార్త క్షణాల్లో మదీనా అంతటా కార్చిచ్చులా వ్యాపించింది. జనాజాలో పాల్గొనడానికి జనం తండోపతండలుగా మసీదుకు వచ్చారు. మదీనా చుట్టుపక్కల ఊళ్ళ నుంచి కూడా ఎంతోమంది జనం వచ్చారు.

అంతిమ సందర్శనార్థం ముఖం మీది వస్త్రం తొలగించారు. ఆశ్చర్యం! ఆ యువకుని ముఖం పున్నమి చంద్రునిలా దేదీప్యమానంగా వెలిగిపోతోంది. పెదవులపై చిరునగవు నాట్యమాడుతోంది.

సందర్శనం తర్వాత అశేషప్రజానీకం వెంటరాగా జనాజా శ్మశానవాటిక వైపు బయలు దేరింది. పోయేవాడు ఒట్టిచేతులతో పోవడం లేదు. అతను దైవప్రవక్త (స) ప్రదానం చేసిన వస్త్రాల కఫన్ పొరల్లో పారలౌకిక ధనరాసుల్ని దాచుకొని మరీ వెళ్తున్నాడు.

అందుకే ఈరోజు పురవీథులు ఇసుక వేస్తే రాలనంత జనంతో క్రిక్కిరిసి పోయాయి. చివరికి దైవప్రవక్త (స) కూడా వీథులు ఇరుకైపోయి కాలిమునివ్రేళ్ళ మీద నడుస్తున్నారు.

ఈరోజు జనాజావెంట ఇంతమంది జనం ఎక్కడ్నుంచి వచ్చారో చాలామంది జనానికి అర్థం కాలేదు. వారిలో కొందరు సంగతేమిటో అడుగుదామని ఉత్కంఠతతో సమయం కోసం ఎదురుచూస్తున్నారు. కాని ఆసక్తి అణచుకోలేక ఒకతను అడగనే అడిగాడు "ఏమిటీ విశేషం దైవప్రవక్తా!" అని.

"ఈ యువకుని జనాజాలో పాల్గొనడానికి ఈరోజు ఊర్ధలోకం నుంచి కారుణ్య దూతలు కాలు తీసి పెట్టలేనంత అసంఖ్యాకంగా వచ్చి చేరారు" అంటూ దైవప్రవక్త (సల్లం) అసలు విషయం చెప్పారు.

ఈమాట విని అనుచరులు సంభ్రమాశ్చర్యాలు వ్యక్తపరిచారు. జనాజా జన్నతుల్‌బఖీ శ్మశానికి చేరుకుంది. భౌతిక కాయాన్ని దించడానికి దైవప్రవక్త (స) సమాధిలోకి దిగారు. ఆయన తన పవిత్రహస్తాలతో జనాజాని అందుకొని సమాధిలో దించారు.

చాలా సేపటి తరువాత ఆయన (స) సమాధి నుండి బయటికి వచ్చారు. ఆయన్ని చూసి అనుచరులు మళ్ళీ ఆశ్చర్యపోయారు. ఆయన బట్టలు తడిసిపోయాయి. లలాటం పై చెమటచుక్కలు తుషారబిందువుల్లా మెరసిపోతున్నాయి. ముఖంలో మాత్రం దరహాసం తొణికిసలాడుతోంది.

ఆంత్యక్రియలు ముగిసిన తరువాత అనుచరులు తమ ప్రియతమ నాయకుని చుట్టూ మూగి అత్యంతాసక్తితో అడిగారు:

"దైవప్రవక్తా! మీ ముఖానికి ఈరోజు ఇంతగా చెమట పట్టిందేమిటీ? బట్టలు కూడా తడిసిపోయాయే! చూస్తే సమాధిలో మీరు చాలా శ్రమపడినట్లు అన్పిస్తోంది."

దైవప్రవక్త (సల్లం) అనుచరుల మాటలు విని చిరునవ్వు చిందించారు.

"సమాధి మొదలు స్వర్గం చేరేదాకా తనపై నా కారుణ్యఛాయలు ఉండాలని ఈ యువకుడు ముందుగానే నా నుండి హామీ తీసుకున్నాడు. అందువల్ల అతని కోసం ఇప్పుడు వందలాది అప్సరసలు వచ్చి గుమిగూడారు. వారు తమ ప్రియుడి ముఖార



విందంలోని సౌందర్య మకరందం జుర్రుకోవడానికి నలువైపుల నుంచి అతనిపై విరుచుకు పడ్డారు. వారు నా పాదాల పైనుంచి పరుగెత్తి నన్ను ఉక్కిరిబిక్కిరి చేశారు. అందుకే నేను చెమటతో తడిసి ముద్దయి పోయాను" అన్నారు ఆయన.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) నోట అమృతం చిందించే ఈ పలుకులు విని ప్రియ అనుచరులు అమితమైన ఆనందంతో పొంగిపోయారు. వారి ఆత్మలు దేహాలలో ఉరకలు వేసే ఉత్సాహంతో ఊగిపోయాయి. వారి విశ్వాసం ద్విగుణీకృతమయి వినూత్న కాంతులతో వెలిగిపోయింది.

## కిరీటం కోల్పోయిన కపటి-(78)

అయితే యూదులు మాత్రం ఈ ఆనంద పరిమళం ఆఘ్రాణించలేక పట్టలేని విద్వేషంతో ఉడికిపోయారు. ఈ కాపట్యరోగం యూదుల్లోనే గాకుండా ఔస్, ఖజ్రజ్ తెగల్లో కూడా తిష్ఠవేసింది. వంచనలో వీరు యూదుల కన్నా మించిపోయారు.

ఔస్, ఖజ్రజ్ తెగల్లో కొందరు చిత్తశుద్ధితో ఇస్లాం స్వీకరించకుండా బహుదైవారాధననే అంటిపెట్టుకొని ఉన్నారు. తమ జాతిప్రజలు ఇస్లాం పట్ల ఆకర్షితులై దాన్ని విశ్వసించారు గనక, వీరు కూడా గత్యంతరంలేక ఇస్లాం స్వీకరించారు. అయితే వీరు ఇస్లాం అన్నా, దైవప్రవక్త (సల్లం) అన్నా లోలోన మండిపడేవారు.

అసలు ఇస్లాం స్వీకరించకుండా బహుదైవారాధకులుగానే ఉండిపోయినవారు కూడా మదీనాలో ఉన్నారు. వీరికి అబూఆమిర్ నాయకుడు. కపటి ముస్లింలకు మాత్రం అబ్దుల్లా బిన్ ఉబై నాయకత్వం వహిస్తున్నాడు.

అబూఆమిర్ ఔస్‌తెగలో అగ్రగణ్యుడు. అతని జాతి ప్రజలంతా అతడ్ని ఎంతో అభిమానిస్తుండేవారు. కాని దైవప్రవక్త (స) మదీనా వచ్చిన తర్వాత ఔస్, ఖజ్రజ్ తెగల్లో అత్యధికమంది ఇస్లాం స్వీకరించడంతో అబూఆమిర్ అనుచరుల సంఖ్య తగ్గిపోయింది.

అనుచరుల సంఖ్య తగ్గిపోవడంతో అతనికి తల తీసేసినట్లన్పించింది. అతని గౌరవ ప్రతిష్ఠలకు భంగం కలిగింది. ఇక మదీనాలో ఉండటం క్షేమకరం కాదనుకున్నాడు. వెంటనే అతను కొందరు అనుచరుల్ని వెంటబెట్టుకొని మక్కా వెళ్ళిపోయాడు. మక్కాలో అంతకు పూర్వం నుంచే ఇస్లాంకు వ్యతిరేకంగా విద్వేషాగ్ని రగులుతూ ఉంది. ఇప్పుడు అబూఆమిర్ వచ్చి ఆ అగ్నిపై ఆజ్యంపోసి దాన్ని మరింత రెచ్చగొట్టాడు.

అదేవిధంగా హోదా అంతస్తులకు భంగం వాటిల్లడంతో అబ్దుల్లా బిన్ ఉబై కూడా లోలోన కుతకుతలాడుతున్నాడు. ఇతను కూడా ఖజ్రజ్ తెగలో పెద్ద పేరు పలుకుబడులు కలిగివుంటూ, గొప్ప నాయకుడిగా రాణిస్తుండేవాడు. ఖజ్రజ్ తెగలో అతనికున్నంత హోదా, అంతస్తులు మరెవరికీ ఉండేవికావు.

గతంలో ఔస్, ఖజ్రజ్ తెగల్లో అంతర్యుద్ధం రేగి అపారనష్టం జరిగింది. ఇలా పరస్పర విరోధం, విద్వేషాలు కొనసాగితే తమకు సర్వనాశనం తప్పదని భయపడి వారు ఎలాగో చివరికి రాజీపడ్డారు. ఉభయతెగలు కలిసి సఖ్యతతో ఉండాలని, అందరికీ ఒకే

నాయకుడు ఉండాలని, అతను తీసుకునే నిర్ణయాన్నే అందరూ గౌరవించాలని ఒప్పందం కూడా చేసుకున్నారు.

ఆ ఒప్పందం ప్రకారం వారు అబ్దుల్లా బిన్ ఉబైని తమ నాయకునిగా ఎన్నుకున్నారు. ఇక అతనికి కిరీటం పెట్టి పట్టాభిషేకం చెయ్యడమే తదుపరి కర్తవ్యం. అంతలో దైవప్రవక్త (స) మదీనాలో అడుగుపెట్టారు. దాంతో ఈ పథకం కాస్తా తారుమారైంది. దీపపు పురుగులన్నీ దైవదౌత్యపు ప్రమిద చుట్టూ గుమిగూడాయి. అబ్దుల్లా శిబిరం బోసిపోయింది.

ఇస్లాం తనజాతి ప్రజలను అమితంగా ఆకట్టుకోవడం చూసి అబ్దుల్లా బిన్ ఉబై బిక్క మొగం వేసుకున్నాడు. చివరికి అతను కూడా ఇస్లాం ముసుగు ధరించక తప్పలేదు. కాని దైవప్రవక్త (స)పై కక్ష పెంచుకొని లోలోన దహించుకుపోయేవాడు. అసలీ మనిషే తన అదృష్టానికి అడ్డు తగిలాడని, ఇతను గనక మదీనా రాకపోయినట్టయితే తాను ఔస్, ఖజ్రజ్ తెగలకు ఏకైక నాయకుడుడైపోయి ఏకఛత్రాధిపత్యం వహించేవాణ్ణని భావించేవాడు. కాని విధి అతని నోట్లో దుమ్ము కొట్టింది.

అబ్దుల్లా బిన్ ఉబై తన గుండెల్లో మండుతున్న విద్వేష లావాను కక్కి వేద్దామని అనుక్షణం ఆరాటపడిపోయేవాడు. తన అనుయాయుల్ని వెంటేసుకొని అవకాశం కోసం పొంచి తిరుగుతున్నాడు. బాహ్య శత్రువుకన్నా అంతర్గత శత్రువే అతి ప్రమాదకరమైనవాడని కుట్రపూరితమైన అతని చేష్టలు నిరూపించాయి. అతను, అతని అనుచర మూకలు పాలుపోసి పెంచిన యజమానికే కాటెయ్యడానికి సిద్ధమయిన విషసర్పాల్లా ప్రవక్త అనుచరుల్లోనే ఉంటూ ప్రవక్త (సల్లం)కే బద్ధవిరోధులయి కూర్చున్నారు.

సాద్ బిన్ ఉబాదా (రజి) వ్యాధిగ్రస్తులయితే దైవప్రవక్త (సల్ల) ఆయన్ని పరామర్శించడానికి బయలుదేరారు. ఆయనవెంట ఉసామా బిన్ జైద్ (రజి) కూడా ఉన్నారు. దారిలో ఓ మేడ పక్కగా పోతుంటే వారికక్కడ అబ్దుల్లా బిన్ ఉబై తన సహచరులతో మంతనాలు జరుపుతూ కన్పించాడు. వారిని పలకరించకుండా పోవడం సభ్యతగా ఉండదని దైవప్రవక్త (సల్లం) ఒంటె దిగి వారి దగ్గరికి పోయారు. వారికి సలాంచేసి కూర్చున్నారు.

ఆ తరువాత ఆయన వారికి కొన్ని ఖుర్ఆన్ సూక్తులు విన్పిస్తూ "దేవుడ్ని చిత్తశుద్ధితో విశ్వసించి ఆయనకు విధేయులై ఉండేవారిని ఆయన సంతోషించి స్వర్గం ప్రసాదిస్తాడు. దానికి భిన్నంగా తిరస్కారం, కాపట్య మార్గాలు అవలంబించినవారిని ఆయన ఆగ్రహించి నరకశిక్ష విధిస్తాడు" అని ఉపదేశించారు.

అబ్దుల్లా బిన్ ఉబై ఈ ఉపదేశాన్ని వినడానికైతే బుద్ధిమంతుడుగా విన్నాడు. కాని...

"మహాశయా! అవి నిజమే అయితే అంతకన్నా మంచిమాటలు మరేం కాగలవు? కాని దయచేసి మీరు మీఇంట్లోనే ఉండి, మీ దగ్గరికి వచ్చేవారికి మాత్రమే ఈ నీతులు బోధించండి. అనవసరంగా ఇతరుల సమావేశాల్లో జోక్యం చేసుకొని ఇలాంటి మాటలతో వారి ప్రాణాలు తోడకండి" అన్నాడు ఆ దైవద్రోహి వెటకారంగా.

అక్కడే కూర్చున్న అబ్దుల్లా బిన్ రివాహ (రజి) అతని మాటలు సహించలేకపోయారు.



"కాదు, దైవప్రవక్తా! మీరు తప్పకుండా వస్తూ ఉండండి. మాటిమాటికి వచ్చేయండి. మా సమావేశాలక్కూడా రండి. మా ఇండ్లకూ రండి. అదే మాకు పరమానందం. మీ రాకతో మా గౌరవం ఇనుమడిస్తుంది. ఇంతకన్నా దైవానుగ్రహం మాకు ఇంకేం కావాలి?" అన్నారు ఆయన.

ఆ తరువాత దైవప్రవక్త (స) లేచి సాద్ (రజి) ఇంటికి వెళ్ళారు. చిన్నబోయిన ఆయన ముఖారవిందం చూడగానే సాద్ (రజి)కు సందేహం కలిగింది.

"దైవప్రవక్తా! ఏమిటీ ఈరోజు మీముఖం వాడిపోయినట్లు కన్పిస్తోంది. మీ మనస్సును కష్టపెట్టిన ఆ దుర్మార్గుడు ఎవరు?" అడిగారు ఆయన.

దైవప్రవక్త (సల్లం) దారిలో జరిగిన వృత్తాంతమంతా వివరించారు.

"దైవప్రవక్తా! వాడి మాటలు పట్టించుకోకండి. మీరీ నగరానికి వచ్చే సమయంలో మేమతనికి కిరీటం పెట్టే సన్నాహాల్లో ఉన్నాము. మీ రాకతో తన నాయకత్వానికి నూకలు చెల్లాయని వాడు తెగబాధ పడుతున్నాడు" అన్నారు సాద్ (రజి).

ఈవిధంగా తనను పరిహసించే కపటులంతా అవకాశవాదులని, స్వలాభాపేక్షాపరులని దైవప్రవక్త (సల్లం)కు స్పష్టంగా తెలిసిపోయింది.

ఈ కపటులు వీలుచిక్కినప్పుడల్లా దైవప్రవక్త (సల్లం) మనస్సును నొప్పిస్తూ, ముస్లింలలో విద్వేషవిషం వెదజల్లుతుండేవారు. అయితే దేవుడు దివ్యావిష్కృతి ద్వారా వారి గుట్టు కాస్తా రట్టుచేసేవాడు. దాంతో వారి కుతంత్రాలన్నీ అందరికీ తెలిసిపోయేవి.

అలాంటి కపట ముస్లింలలో నబ్తల్ ప్రముఖుడు. జుల్లాస్, హారిస్‌లు కూడా వీడికి ఏమాత్రం తీసిపోరు. జుల్లాస్ ఒకసారి ఇంటికి వచ్చి పడకపై పొర్లుతూ "ఈ మనిషి సత్యవంతుడయితే మనకిక కీడు మూడినట్లే. గాడిదల కన్నా హీనంగా పరిగణించబడతాం" అన్నాడు బిగ్గరగా.

ఈ మాటలు ఉమైర్ బిన్ సాద్ (రజి) చెవుల్లో ములుకుల్లా పొడుచుకున్నాయి. ఉమైర్ (రజి) జుల్లాస్ దత్తపుత్రుడు. అతని ఇంట్లోనే పెరిగి పెద్దవాడయ్యాడు.

"నాకు మీరు చేసిన మేలును నేను ఎన్నటికీ మరువలేను. అందుకే మీరంటే నాకెంతో అభిమానం. నాకు మీమీదున్నంత అభిమానం మరెవరిపై లేదు. మీకేదైనా బాధ కలిగితే నేను భరించలేను. కాని ఈరోజు మీరు పలికింది అత్యంత ప్రమాదకరమైన మాట. దీన్ని నేను బయటికెళ్ళి ఆరోపిస్తే మీకు దేహశుద్ధి తప్పదు. దాన్ని సహించి ఊరుకుంటే నేను ఆశ్రయించిన ధర్మం ప్రమాదంలో పడిపోతుంది. నా ధర్మాన్ని నేను చేజేతులా ఎలా ప్రమాదంలో పడవేసుకోను?" అన్నారు ఉమైర్ (రజి).

ఉమైర్ (రజి) అన్నట్లే దైవప్రవక్త (సల్లం)కు ఈ విషయాన్ని గురించి ఫిర్యాదు చేశారు. అతని కుట్రలను ఓకంట కనిపెడుతూ జాగ్రత్తగా మసలుకోమని హెచ్చరించారు. అంతలో జుల్లాస్ కూడా అక్కడికి చేరుకున్నాడు. అతను వస్తూనే సాద్ మాటలు విని వాటిని ఖండిస్తూ తానలా అనలేదు మొర్రో అని మొత్తుకున్నాడు.

దైవప్రవక్త (స) అతని మాటలు విని మౌనం వహించారు. జుల్లాస్‌ని దైవం అనుగ్రహించాడు. ఆయన తప్పు తెలుసుకొని లెంపలు వేసుకున్నాడు.

జుల్లాస్ సోదరుడు హారిస్ కపట ముస్లింగా ఉండి ఆ తరువాత పూర్తిగా భ్రష్టుడయి పోయాడు. కొన్నాళ్ళకు అతను కూడా తన పొరపాటు గ్రహించాడు.

“నేనిప్పుడు సిగ్గుపడుతున్నాను. జరిగిన తప్పుకు పశ్చాత్తాపపడుతున్నాను. చిత్తశుద్ధితో ఇస్లాం వైపు మరలాను. నన్ను క్షమించమని దైవప్రవక్త (స)కు చెప్పండి” అని అతను జుల్లాస్‌కు కబురు పంపించాడు.

## అనుచరులకు అసాధారణ శిక్షణ-(79)

మదీనాకు వలసవచ్చిన తొలి రోజుల్లో దైవప్రవక్త (సల్లం) ఎక్కువ సమయాన్ని మసీదులోనే గడుపుతుండేవారు. అక్కడ ఆయన ముస్లింలకు ఇస్లాం విధులేమిటో, మానవీయ విలువలేమిటో తెలియజేస్తూ వారికి ప్రేమ, సోదరభావాలను గురించి శిక్షణ ఇస్తుండేవారు. దయ, జాలి, సానుభూతుల్ని గురించి ఉద్బోధిస్తుండేవారు. విశ్వాసం అంటే ఏమిటి; విశ్వాసులు నిర్వహించవలసిన బాధ్యలేమిటి; దైవప్రీతి పొందడానికి ఏం చెయ్యాలి మొదలైన విషయాల్ని ఆయన తన అనుచరులకు బోధిస్తుండేవారు.

దైవప్రవక్త (సల్లం) ప్రజలకు ఖుర్‌ఆన్‌వాణి విన్పించాలన్నా, ఉపన్యాసమివ్వాలన్నా లేదా ఏదైనా కొత్త విషయం తెలియజేయాలన్నా మసీదులోనే చేసేవారు. ప్రజలు ఆయన చుట్టూ గుమిగూడేవారు. దైవప్రవక్త (సల్లం) ప్రసంగం చేయవలసివస్తే వేదిక మొదటి మెట్టు ఎక్కి నిలబడేవారు. సంభాషణ కొరకైతే రెండవ మెట్టుపై కూర్చునేవారు.

ముహాజిర్ ముస్లింలకు దైవప్రవక్త (స) సాన్నిహిత్యభాగ్యం ఎప్పుడూ అందుబాటులో ఉండేది. వారు స్వేచ్ఛగా ఆయన దగ్గరకు వస్తూ పోతుండేవారు. అనుక్షణం ఆయన వెన్నంటి ఉంటూ మంచి శిక్షణ పొందేవారు.

ఇక అన్సార్ ముస్లింలయితే దైవప్రవక్త (సల్లం)ను చూసి తమకు అత్యంత దయామయుడయిన నాయకుడు లభించాడని సంబరపడిపోయేవారు. ఆయనే వేరుపడిన వారి హృదయాలను కలిపి, వారి అంతర్గత గాయాలకు ఉపశమనం చేకూర్చారు. ఒకప్పుడు వారు పరస్పరం పచ్చినెత్తురు తాగే ఆగర్భశత్రువుల్లా ఉండేవారు. దైవసందేశహరుని (సల్లం) రాకతో వారిప్పుడు ప్రాణమిత్రులయి పోయారు.

దైవప్రవక్త (స) ముస్లింలకు దయార్ద్ర హృదయుడైన తండ్రి లాంటి వారు; ఎంతో వాత్సల్యం, సానుభూతులుగల సోదరుని వంటివారు; ఆదర్శవంతమైన మంచి నాయకుడు. ఎక్కడైనా ఎవరైనా కలిస్తే ముందుగా దైవప్రవక్త (స) వారికి సలాంచేసి కరచాలనం చేసేవారు. ఎవరైనా ఏదైనా కావాలని వస్తే వారు చెప్పకముందే వారి అవసరమేమిటో విచారించేవారు. ఆయన ముఖం నిత్యవికసిత పద్మం. ఆయన నమ్రత, సౌమ్యతలకు ప్రతీక.

ఓసారి దైవప్రవక్త (స) ఒక సమావేశానికి వెళ్ళారు. ఆయన రావడం చూసి ఆయన అనుచరులంతా గౌరవసూచకంగా లేచి నిలబడ్డారు. కాని ఇది ఆయనకు నచ్చలేదు.



“కూర్చున్నవారు ఏ ఒక్కరి గౌరవసూచకంగా లేచి నిలబడకూడదు. ఇది ఇస్లామేతర పద్ధతి. ముస్లిమేతరులు తమ నాయకుల పట్ల గౌరవమర్యాదలు వ్యక్తపరచుకోవడానికి ఇలా లేచి నిలబడతారు” అన్నారు ఆయన.

ప్రజలు దైవప్రవక్త (సల్లం) పాదపద్మాలను కళ్ళకు అద్దుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. కాని ఆయన అలాంటి పనిని కూడా వ్యతిరేకించారు.

“మీరు నన్ను మరీ పైకెత్తకండి. క్రైస్తవులు ఈసా (అలై)ను దేవుని స్థాయి కన్నా పైకెత్తారు. మీరలా చేయకండి. నేను దేవుని దాసుడ్ని మాత్రమే. కనుక మీరు నన్ను దేవుని దాసుడిగా, ఆయన ప్రవక్తగా మాత్రమే పరిగణించండి” అని చెప్పారు ఆయన.

ఆడంబరాలన్నా, పటాటోపాలన్నా ఆయనకు ఎంతమాత్రం నచ్చవు. ఆయన నిరాడంబరత, నిర్మలత, ఆప్యాయత, అనురాగాలు మూర్తీభవించిన మహానాయకుడు.

ఓసారి ఆయన ప్రజలకు హితోపదేశం చేస్తూ ఇలా అన్నారు:

“నరకాగ్ని నుండి కాపాడుకోవడం గురించి చింతించండి. దాని కోసం ఓ ఖర్జూరపు పండయినా సరే దానం చేయండి. ఇది కూడా లభించకపోతే మంచి మాటలు పలకండి. (ఇదీ సత్కార్యమే.) ప్రతి సత్కార్యానికి పదింతలు పుణ్యం లభిస్తుంది.”

“అన్నిటికంటే మంచిపని ఏమిటి?” అడిగాడు ఒకతను.

“నిరుపేదలకు అన్నదానం చేయండి; తమవారని, పరాయివారని భేదభావం చూపకుండా ప్రతి ఒక్కరికీ సలాం చేయండి” అన్నారు ఆయన సమాధానంగా.

మదీనాలో మొదట నమాజ్ కోసం ప్రజలను పిలవడానికి ఏ పద్ధతీ లేదు. ప్రజలు తమంతట తామే మసీదులో గుమిగూడి సామూహికంగా నమాజ్ చేసేవారు. అప్పుడు ముస్లింలు చాలా తక్కువసంఖ్యలో ఉండటంవల్ల ఎలాగో పని జరిగిపోయింది. ఇప్పుడు ముస్లిం జనసంఖ్య అధికమయింది. నమాజ్ వేళయిందని దూరాన ఉన్నవారికి తెలియజేయడానికి ఒక పద్ధతి అంటూ ఉండాల్సిన అవసరం ఏర్పడింది.

అప్పుడు కొందరు అనుచరులు యూదుల మాదిరిగా బాకా ఊద్దామని సూచించారు. మరికొందరు గంట కొడ్దామన్నారు. కాని దైవప్రవక్త (స)కు ఈ బాకాఊదుడు, గంటకొట్టుడు నచ్చలేదు. మరికొందరు కూడా దీన్ని వ్యతిరేకించారు. అయితే “క్రైస్తవుల మాదిరిగా శంఖం పూరిద్దామని ఇంకొందరు అన్నారు.

ఈ సలహా చాలామందికి నచ్చింది. ఎందుకంటే యూదులకంటే క్రైస్తవులు ముస్లింల పట్ల కాస్త సన్నిహితంగా మసలుకుంటారు. వీరు యూదుల్లా ఇస్లాంను విరోధించే, కుట్రలు పన్నే దుర్మార్గులు కాదు. ఈ విషయంపై ఏకీభావం కుదరగానే శంఖం ఏర్పాటు చేయమని దైవప్రవక్త (సల్లం) హజ్రత్ ఉమర్ (రజి)ని ఆదేశించారు.

సరేనని హజ్రత్ ఉమర్ (రజి) ఇంటికి వెళ్ళిపోయారు. అదే ఆలోచనలతో ఆ రాత్రి నిద్రపోయారు. కాస్సేపటి స్వప్నజగత్తులో విహరించసాగారు.

"గంటేమిటి గంట!! అజాన్ చెప్పండి, అజాన్" అన్నారు ఎవరో కలలో కన్పించి.

ఉషోదయమయింది. హజ్రత్ ఉమర్ (రజి) మేల్కొన్నారు. ఈ విషయం దైవప్రవక్త (సల్లం) తెలియజేద్దామని బయలుదేరారు. అంతలో ఎక్కణ్నుంచో మధురాతి మధురమైన పలుకులు విన్పించసాగాయి:

"అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్. అష్హదుఅన్ లాఇలాహ ఇల్లల్లాహ్...."

ఈ మధుర వచనాలు విని హజ్రత్ ఉమర్ (రజి) గబగబా నడచి మసీదుకు చేరుకున్నారు. హృదయాల్లో అమృతం చిలికించే ఈ సుమధుర ధ్వని మసీదు పక్కనే ఉన్న ఓ ఇంటికప్పు పైనుండి వస్తోంది. చూస్తే ఆ ఇంటి కప్పుపై హజ్రత్ బిలాల్ (రజి) నిలబడి ఉన్నారు. మస్జిద్ దగ్గర అటూఇటూ అనేకమంది ముస్లింలు నిలబడి వింటున్నారా విచిత్ర పలుకులు.

"ఎవరు తెలిపారీ అజాన్ పలుకులు?" అడిగారు ఉమర్ (రజి) ఆశ్చర్యంతో.

"ఇందాక అబ్దుల్లా బిన్ జైద్ (రజి) వచ్చి రాత్రి తన కలలో జరిగిన సంఘటన తెలియజేశారు. ఆయన కలలో ఒక మనిషి ఎదురుగా వచ్చి నిల్చున్నాడట. అతని చేతిలో ఓ శంఖం ఉంది" అంటూ ఒకతను విషయం ఇలా వివరించాడు :

అప్పుడు అబ్దుల్లా "ఏమయ్యా! ఈ శంఖం అమ్ముతావా?" అని అడిగాడు.

దానికా వ్యక్తి "దీన్ని తీసుకొని ఏం చేస్తావు?" అని అడిగాడు.

"నమాజ్ వేళయిందని ప్రకటిస్తాను" అన్నారు అబ్దుల్లా.

"ఇంతకంటే మంచి విషయం చెప్పనా?" అన్నాడా వ్యక్తి మళ్ళీ.

"చెప్పండి, ఏమిటో ఆ విషయం" అన్నారు అబ్దుల్లా.

"నమాజ్ వేళ అయినప్పుడు ఇలా ప్రకటించు....అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్..." అన్నాడా వ్యక్తి విషయం తెలియజేస్తూ.

అబ్దుల్లా తెల్లవారు జామున మేల్కోగానే గబగబా మసీదుకు వెళ్ళారు. అక్కడ దైవప్రవక్త (సల్లం)ని కలుసుకొని ఈ విషయం చెప్పారు. అజాన్ పలుకులు కూడా ఆయనకు తెలియజేశారు.

దైవప్రవక్త (స) ఈమాట విని "అబ్దుల్లా! ఇది నిజమైన కల. ఆ పలుకులు బిలాల్‌కు చెప్పు. అతను వాటిని బిగ్గరగా ప్రకటిస్తాడు. అతని కంఠం చాలాపెద్దది" అన్నారు.

హజ్రత్ ఉమర్ (రజి) ఇదంతా విని దైవప్రవక్త (సల్లం) దగ్గరకు వెళ్ళారు.

"దైవప్రవక్తా! మిమ్మల్ని సత్యాన్నిచ్చి పంపిన దేవుని సాక్షిగా చెబుతున్నాను. రాత్రి నేను కూడా అబ్దుల్లా కన్న కలలాంటిదే కన్నాను" అన్నారు ఆయన.

"ఇదంతా దేవుని అనుగ్రహం ఉమర్! నా దగ్గరక్కూడా దీన్ని గురించి దైవసందేశం వచ్చింది" అన్నారు దైవప్రవక్త (సల్లం) చిరునవ్వుతో.



ఈవిధంగా అజాన్ సంప్రదాయం ఏర్పడింది. బిలాల్ (రజి) కంఠస్వరం చాలా బిగ్గరగా, గంభీరంగా, శ్రావ్యంగా ఉంటుంది. అందువల్ల దైవప్రవక్త (సల్లం) ఆయన్నే ముఅజ్జిన్‌గా నియమించారు. ఆయన ప్రతి నమాజ్ వేళకు వచ్చి మసీదు పక్కనుండే ఇంటి కప్పుపై నిలబడి నమాజ్ కోసం అజాన్ పిలుపు నివ్వడం ప్రారంభించారు.

## ఆత్మరక్షణ దాడులు-(80)

దైవప్రవక్త (స) మక్కా వదలి మదీనాకు వలసపోయిన దగ్గర్నుంచి మక్కా ఖురైషీయులు ఆగ్రహావేశాలతో భావికర్తవ్యం గురించి తీవ్రంగా ఆలోచించసాగారు.

"చూస్తుండగానే ముస్లింలు అనేకమంది మక్కా పట్నం ఖాళీచేసి వెళ్ళిపోయారు. ముహమ్మద్ కూడా మనందరి కళ్ళుగప్పి మదీనా వెళ్ళిపోయాడు. అక్కడ అంతకుముందే చాలామంది ఆయన్ని విశ్వసించి ఉన్నారు. ఆ తరువాత మదీనా చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా ముహమ్మద్ ప్రభావం పడుతోంది. ఇలా దేశమంతా ముస్లింలు వ్యాపించి కొద్ది కాలంలోనే మనల్ని నిలువ నీడ లేకుండా చేసేస్తారు. ఆ పరిస్థితి రాకముందే మనం ముహమ్మద్ ఉద్యమాన్ని మొగ్గలోనే త్రుంచివేయాలి." ఈ ఆలోచనతో బహుదైవారాధకులు తల్లడిల్లిపోయారు.

మక్కా ఖురైషీయుల పోరు పడలేక దైవప్రవక్త (సల్లం) మదీనా వస్తే ఇక్కడ మరో విధమైన శత్రువులు తయారయ్యారు. వారే ముస్లింల రూపాల్లో ఉన్న గోముఖవ్యాఘ్రాలు (మునాఫిఖ్‌లు). వారికి అబ్దుల్లా బిన్ ఉబై నాయకుడు. మదీనా ప్రజలు అతడ్ని రాజుగా చేయబోయే తరుణంలో దైవప్రవక్త (సల్లం) వచ్చి మదీనా పౌరుల హృదయాలను చూరగొని వారికి అగ్రనాయకులయ్యారు. అందుకే ఆయనంటే ఇబ్నె ఉబైకు కసి. పైకి ముస్లింగా మారి లోలోన కుట్రలు పన్నుతూ అవకాశం కోసం చూస్తున్న కపటాగ్రేశ్వరుడు. అతనికి యూదులు కూడా తోడయ్యారు. అమాయక ప్రజల్లో అసత్య ప్రచారం చేసి ఇస్లాం పట్ల అనుమానాలు, అపోహలు రేకెత్తించడమే వారి నిత్యకృత్యాలు.

అటు మక్కా బహుదైవారాధకులు అబ్దుల్లా బిన్ ఉబైని హెచ్చరిస్తూ ఇలా ఒక ఉత్తరం పంపారు: "మా దగ్గర్నుంచి పారిపోయి వచ్చిన మా మనిషిని మీరు అక్రమంగా మదీనాలో ఉంచుకున్నారు. ఇది మీకు శ్రేయస్కరం కాదు. మీరు పోరాడి అతడ్ని మీ నగరం నుంచి వెళ్ళగొట్టండి. మామాట మన్నించి మీరలా చేస్తే సరి. లేకపోతే సమస్త ఆయుధాలతో మేము మదీనాపై దాడిచేస్తాం. మిమ్మల్నందర్నీ వధించి, మీ స్త్రీలను బానిసలుగా చేసి తీసికెళ్తాం."

అవకాశం కోసం చూస్తున్న ఇబ్నె ఉబైకి ఈ హెచ్చరిక కర్తవ్యం బోధించినట్లయింది. వెంటనే అతను బహుదైవారాధకులందర్నీ సమావేశపరచి ఆ లేఖను చదివి విన్పించాడు. తర్వాత వారిని రెచ్చగొడ్తూ ముస్లింలకు వ్యతిరేకంగా యుద్ధానికి పురిగొల్పసాగాడు.

ఇక్కడీ రహస్యసమావేశం జరుగుతుండగానే క్షణాల మీద ఈ విషయం దైవప్రవక్త (సల్లం)కు తెలిసిపోయింది. ఆయన వెంటనే అక్కడకు చేరుకొని ఇలా మాట్లాడారు:

"సోదరులారా! మక్కా ప్రజలు మిమ్మల్ని మోసగింప జూస్తున్నారు. మీరు వారి వలలో పడిపోతే చాలా నష్టపోతారు. అందువల్ల మీరు వారికి నిర్ద్వందంగా సమాధానమిచ్చి మాతో చేసుకున్న ఒప్పందానికి కట్టుబడి ఉండండి. ఇదే మీకు అన్నివిధాల మేలైన పని. ఆలోచించుకోండి. ఖురైషీయులు మదీనాపై దాడిచేస్తే వారిని ఓడించడం మనకే సులువు. ఎందుకంటే ఒడంబడిక ప్రకారం మీరూ, మేము ఏకమై వారికి ఎదురునిలుస్తాం. ఒకవేళ మీరు యుద్ధానికే తలపడితే చేజేతులా వినాశాన్ని కొనితెచ్చుకున్నట్లే అవుతుంది."

బహుదైవారాధకులు దైవప్రవక్త (సల్లం) మాటల్లోని యదార్థం గ్రహించి ఒప్పందానికే కట్టుబడి ఉంటామని చెప్పారు. ఆ తరువాత వారంతా అబ్దుల్లా బిన్ ఉబై వైపు అసహ్యంగా, అనుమానాస్పదంగా చూసి వెళ్ళిపోయారు. ఇబ్నె ఉబయి నిర్ఘాంతబోయి గుడ్లప్పగించి నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయాడు.

మక్కా ఖురైషీయుల యుద్ధదాహం సంగతి ముస్లిం యువకుల్లో రక్తం ఉడికించింది. శత్రువులు తమను చిత్రహింసలు పెట్టి, కట్టుబట్టలతో జన్మభూమిని వీడిపోయేలా చేసిన ఆ దుర్భర రోజులు వారి కళ్ళ ముందు ఇంకా మెదలుతూనే ఉన్నాయి. అందువల్ల ఇక అన్యాయాన్ని ఎంతమాత్రం సహించకూడదు; దౌర్జన్యాన్ని అరికట్టాలి; ఇస్లామీయ ఉద్యమ మార్గంలో అవరోధాలు సృష్టిస్తున్న శత్రువులకు గుణపాఠం నేర్పాలి; కాబాదర్శ నానికి పెట్టిన ఆంక్షల్ని అంతమొందించి దైవభక్తులకు స్వేచ్ఛ కలిగించాలి" అని నిర్ణయించు కున్నారు యువకులు.

ఆ తరువాత వారు దైవప్రవక్త (సల్లం)ను కలుసుకొని, శత్రువులతో యుద్ధం చేయ డానికి అనుమతి అడిగారు. కాని కారుణ్యమూర్తి (సల్లం) యుద్ధానికి బదులు సంధికి, పగసాధింపుకు బదులు క్షమాపణకు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇచ్చేవారు. నిజానికి ఇప్పటి పరిస్థితి చూస్తే ఖడ్గానికి బదులు ఖడ్గంతో జవాబియ్యకపోతే పరిస్థితి విషమించేలా ఉంది. కాని దానికైనా విశ్వప్రభువు నుండి అనుమతి రావాలికదా? అందువల్ల అప్పటిదాకా సహనం వహించమని దైవప్రవక్త (సల్లం) వారికి నచ్చజెప్పారు.

మక్కా అవిశ్వాసుల దౌర్జన్యాలు రోజురోజుకు మితిమీరి పోతున్నాయి. మదీనా ముస్లింలపై కవ్వింపు చర్యలకు పాల్పడసాగారు. అప్పుడు ఆత్మరక్షణ, ధర్మరక్షణల కోసం కత్తిపట్టి శత్రువులతో పోరాడటానికి దేవుని అనుమతి లభించింది.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) శత్రువుల కుట్రలు తెలుసుకోడానికి ముస్లింలను కొన్ని బృందాలుగా చేసి మదీనా పట్నం వెలుపల వివిధ ప్రాంతాలకు పంపించారు. ఈ బృందాలకు శత్రువులతో యుద్ధం చేయడానికి అనుమతి ఇవ్వలేదు. శత్రువుల వర్తక బిడారాలను నిరోధించి తమ సైనికశక్తిని చూపి శత్రువుల గుండెల్లో బెదురు పుట్టించడమే వీరి లక్ష్యం. అందువల్ల వీరా పని నిర్వహిస్తూ మదీనా దరిదాపుల్లోని తెగలతో శాంతి ఒప్పందాలు కూడా చేసుకున్నారు.

అటు మక్కాలో ఖురైష్ నాయకులకు తాము ఇబ్నె ఉబై ద్వారా పన్నిన పథకం విఫలమయినట్లు గూఢచారి వర్గాల ద్వారా తెలిసింది. తక్షణమే వారు దారున్నద్వాలో సమావేశమయ్యారు.



"ఇతరుల్ని నమ్ముకొని బతుకుబండి లాగడం బుద్ధిహీనుల పని. తమ బాహుబలం పట్ల నమ్మకం ఉన్నవారే విజయం సాధించగల్గుతారు." అన్నాడు అబూజహల్.

"నిజమే. మనం ఇతరుల మీద ఆధారపడటానికి బదులు మన దారి మనమే రూపొం దించుకోవాలి" అన్నాడు మరొక నాయకుడు.

"మిత్రులారా! నేను చెప్పేది జాగ్రత్తగా వినండి. మన వాణిజ్య బృందం ఈరోజు సిరియాకు బయలుదేరబోతోంది. మనం మన పెట్టుబడుల్ని దానికిచ్చేయాలి. వ్యాపారంలో వచ్చే లాభం మొత్తాన్ని ఆయుధాలు, వాహనాలు తదితర యుద్ధ సామగ్రి కోసం విని యోగించాలి. ఈ విధంగా యుద్ధఖర్చుల సమస్య పరిష్కారమవుతుంది. అప్పుడు మనం సర్వసన్నద్ధులయి ముస్లింల మీద గట్టి దెబ్బతీయగలం. మరోవైపు అబ్దుల్లా బిన్ ఉబయికు కూడా గుణపాఠం చెప్పవచ్చు" అన్నాడు అబూజహల్.

"భేష్! చాలా బాగుందీ పథకం" అన్నారు మిగిలిన నాయకులంతా ముక్తకంఠంతో.

వెంటనే వారు తమతమ పెట్టుబడుల్ని వాణిజ్య బృందానికి అప్పగించారు. ఆ సమావేశంలో పాల్గొన్న కర్జ్ బిన్ జాబిర్ అనే నాయకుడు ఏదో ఓ ఘనకార్యం వెలగబెట్టి ఇతర నాయకులపై తన ఆధిక్యత చాటుకోవాలని భావించాడు.

మరునాడే అతను మూడొందల మంది యోధుల్ని తీసుకొని మక్కా నుంచి బయలు దేరాడు. మదీనా శివారు ప్రాంతానికి చేరుకొని అక్కడ పశువుల్ని మేపుకుంటున్న కాపర్లపై దాడిచేశాడు. అతను నిరాయుధులైన పశువులకాపర్లను నిర్దాక్షిణ్యంగా చితకబాది అనేక ఒంటెల్ని దోచుకెళ్ళాడు. ఒక కాపరిని హతమార్చడం కూడా జరిగింది.

ఈ సంగతి తెలిసిన ముస్లిం సైనిక బృందాలు వెంటనే శత్రువుల్ని పట్టుకోవడానికి వెంటాడాయి. కాని వారు అప్పటికే చాలా దూరం వెళ్ళిపోయారు. దాంతో ముస్లిం సైనిక బృందాలు వెనక్కి తిరిగొచ్చాయి.

ఇది మక్కా ఖురైషీయుల నుంచి ఓ బహిరంగ హెచ్చరిక, ఒక సవాలు. మూడొందల మైళ్ళ దూరం సయితం ప్రయాణంచేసి మీ ఆస్తుల్ని దోచుకొని పోగల సత్తా తమకుందని ముస్లింలకు తెలియజేయడమే ఈ కవ్వింపు చర్యల ఉద్దేశ్యం.

ఆ తరువాత సాద్ బిన్ ముఆజ్ (రజి) అనే ఓ అన్సార్‌ముస్లిం ప్రముఖుడు ఉమ్రా నిమిత్తం మక్కా వెళ్ళారు. అక్కడ కాబాగృహంలో ప్రవేశించబోతుంటే అబూజహల్ ద్వారం దగ్గర నిలబడి సాద్ (రజి)ను తూలనాడుతూ ఇలా అన్నాడు:

"మీరు మా దగ్గర్నుంచి పారిపోయివచ్చిన మతభ్రష్టులకు ఆశ్రయమిచ్చి వారికి అన్ని విధాల సహాయసహకారాలు అందజేస్తూ ఉండండి. మీరిక్కడకు వచ్చి నిర్భయంగా కాబా ప్రదక్షిణ చేస్తుంటే మేము మాత్రం నోరు మూసుకొని చూస్తూ ఉంటాం. మేమే అంత అసమర్థులం అనుకున్నావా? నీవు ఉమయ్యా బిన్ ఖలఫ్‌కు అతిథి కాకపోయివుంటే ఇక్కడ నుంచి నీవు ప్రాణాలతో బయటపడేవాడివి కావు."

దానికి సాద్ (రజి) కూడా ఘాటుగానే సమాధానమిచ్చారు.

"నీవు నన్ను ఈ పుణ్యకార్యం చేయనీయకుండా ఆటంకపరిస్తే మీకు దీనికంటే విలువయినది, జీవనాధారమైనది, మదీనా గుండా ప్రయాణించే మీ వర్తకబిడారాల దారిని అడ్డగిస్తాము" అన్నారు ఆయన. దాంతో అబూజహల్ నోరు మూసుకున్నాడు.

మరోసారి దైవప్రవక్త (సల్లం) అబ్దుల్లా బిన్ హజష్ (రజి) నాయకత్వాన ఒక సైనిక దళాన్ని పంపించారు. పంపించే ముందు ఆయన అబ్దుల్లా (రజి)కు ఓ లేఖ అందిస్తూ ఇలా ఉపదేశించారు:

"అబ్దుల్లా! ఈ లేఖను రెండు రోజుల తర్వాత విప్పి చూడాలి. ఆ తరువాత అందులో ఏముందో దాని ప్రకారం ఆచరించాలి. అయితే ఏ సహచరుని పైనా ఎలాంటి బలవంతం చేయకూడదు."

అది రజబ్ నెల హిజ్రీ రెండవ సంవత్సరం. అబ్దుల్లా (రజి) సైనికదళం తీసుకొని మదీనా నుండి బయలుదేరారు. రెండ్రోజులు ప్రయాణం చేశాక లేఖ విప్పి చూశారు.

"నీవు నేరుగా 'నఖ్లా' ప్రదేశం చేరుకో. అక్కడ ఖురైషీయుల కోసం పొంచివుండి ఏమైనా సమాచారం ఉంటే తెలుసుకో" అని ఉంది ఆ ఉత్తరంలో.

అబ్దుల్లా (రజి) ఉత్తరాన్ని కళ్ళకద్దుకొని సహచరులతో ఇలా అన్నారు:

"మన ప్రియప్రవక్త (సల్లం) మనల్ని నఖ్లా వెళ్ళమని ఆజ్ఞాపించారు. అక్కడ ఖురైషీల కోసం పొంచివుండి, వారి రహస్యాలను తెలుసుకోవాలన్నారు. ఎవరిపైనా ఎలాంటి బలవంతం చేయవద్దని కూడా చెప్పారు. ఇదీ విషయం. నాతో రాదలచుకున్నవారు రావచ్చు. వెనక్కి వెళ్ళిపోదలచుకున్నవారు నిరభ్యంతరంగా వెళ్ళిపోవచ్చు. నేను మాత్రం దైవప్రవక్త (సల్లం) ఆదేశాన్ని శిరసావహిస్తాను."

ఈ మాటలు విని సహచరులంతా ఉత్సాహంతో నాయకుడ్ని అనుసరించడానికే అంగీకరించారు. అబ్దుల్లా (రజి) వారిని తీసుకొని నఖ్లా బయలుదేరారు. దారిలో 'బహ్రాన్' అనే ప్రదేశానికి చేరుకునేటప్పటికి అక్కడ సాద్ బిన్ అబీ వఖ్కాస్ (రజి), ఉత్బా బిన్ గజ్వాన్ (రజి)ల ఒంటెలు తప్పిపోయాయి. వీరిద్దరు తమ ఒంటెల్ని వెతుక్కోవడానికి బయలుదేరారు. ఇలా వారు వెనకపడి పోయారు. దారిలో కొందరు ఖురైష్ సైనికులు ఎదురయి వారిద్దర్ని బంధించి మక్కా తీసికెళ్ళారు.

అటు అబ్దుల్లా దళం నఖ్లా చేరుకుంది. అక్కడ ఈ యోధులు ఖురైషీయుల కోసం ఎదురుచూస్తూ పొంచి ఉన్నారు. అది రజబ్ నెల చివరి రాత్రి. ఆ మసక వెల్తురులో వారికి ఓ వర్తక బిడారం కన్పించింది. అది మరికాస్త సమీపానికి వచ్చింది. చూస్తే అది ఖురైషీయుల వర్తకబిడారం. దానిపై ద్రాక్ష, జంతుచర్మాలు పుష్కలంగా ఉన్నాయి.

"ఖురైషీయుల వాణిజ్యబృందం దగ్గరికి వచ్చింది. ఇప్పుడేం చేద్దాం?" అబ్దుల్లా (రజి) సహచరులతో సంప్రదించారు.

"ఈరోజు వీరిని విడిచిపెడితే మక్కా (హరం)లో ప్రవేశిస్తారు. హతమారిస్తే పవిత్ర మాసాన్ని అగౌరపరచినట్లవుతుంది" అన్నారు కొందరు. దాంతో అందరూ ఆలోచనలో



పడిపోయారు. యుద్ధం చేయడానికి జంకుతున్నారు. అయితే ఖురైషీయులు తమను దోచుకున్న సంగతి గుర్తుకొచ్చింది. అందువల్ల వారు వాణిజ్యబృందంతో యుద్ధం చేయడానికే నిశ్చయించుకున్నారు.

ముస్లింలు యుద్ధానికి సిద్ధమయ్యారు. వాఖిద్ బిన్ అబ్దుల్లా తమామి విల్లు ఎక్కు పెట్టి బాణం వదిలారు. అది సరాసరి అమ్ర్ బిన్ హజ్రమి శరీరంలోకి దూసుకు పోయింది. అతను అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అతనే వాణిజ్య బృందం నాయకుడు.

ఆ తర్వాత ముస్లింయోధులు ఉస్మాన్ బిన్ అబ్దుల్లా, హకమ్ బిన్ కైసాన్ అనే ఇద్దరు ఖురైషీయుల్ని పట్టుకొని వ్యాపారసామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అలా వీరు విజయోత్సాహంతో మదీనా వెళ్ళి దైవప్రవక్త (స)కు ఈ శుభవార్త తెలియజేశారు.

కాని దైవప్రవక్త (స) వారిని చూడగానే ఆగ్రహోదగ్రులయి "ఏమిటీ మీరు పవిత్ర మాసంలో రక్తపాతం జరిపారా? నేనందుకోసం మిమ్మల్ని పంపలేదే!" అన్నారు.

అంతే, అబ్దుల్లా (రజి), ఆయన సైనిక సహచరుల గుండెలు ఝుల్లుమన్నాయి.

"అయ్యో! ఎంత పని జరిగింది!! దైవప్రవక్త (స) అయిష్టాన్ని కొని తెచ్చుకున్నామే!!! ఇప్పుడేం చెయ్యాలి?" జరిగిన పొరపాటు తెలుసుకొని వారు తీవ్రంగా చింతించారు.

అంతలో మరికొందరు ముస్లింలు కూడా అక్కడకు చేరుకున్నారు. విషయం తెలుసు కొని అందరూ వారిపై మండిపడ్డారు.

"ఈ ఖైదీలను ఎవరూ ముట్టుకోకండి. ఈ సామగ్రిని కూడా ఎవరూ తాక వద్దు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

ఈ దుర్ఘటన ఇస్లాంవ్యతిరేక శక్తుల దుష్ప్రచారానికి మంచి ఊతమిచ్చింది.

"ముస్లింలు పవిత్ర మాసంలో యుద్ధం చేశారట! అవ్వ, ఎంత సిగ్గుచేటు!"

"ఘోరమైన రక్తపాతం జరిపి అనేకమంది ఖైదీలను కూడా పట్టుకున్నారట!!"

ఈ వార్త దావానలంలా మదీనా లోపలా, వెలుపలా అంతటా వ్యాపించిపోయింది. ముస్లింలకు వ్యతిరేకంగా ప్రచారం చేయడానికి శత్రువులకు సువర్ణావకాశం దొరికింది. గోరంతలు కొండంతలు చేస్తూ దేశమంతా టాం టాం చేశారు. మక్కా ఖురైషీయులయితే పనిగట్టుకొని మరీ ముస్లింలకు వ్యతిరేకంగా ప్రచారం ప్రారంభించారు.

ముస్లింలు వారి మాటలు ఖండిస్తూ "అలా జరగలేదు. ఇది పచ్చి దుష్ప్రచారం. నిజానికి ఈ సంఘటన షాబాన్ నెల (ప్రారంభం)లో జరిగింది" అన్నారు.

యూదులయితే అదేదో మహాపాతకం జరిగినట్లు తలచి, ఇక ముస్లింలపై దైవశిక్ష విరుచుకుపడక తప్పదని చెప్పుకుంటూ తెగ సంబరపడసాగారు.

జరిగిన సంఘటన పట్ల దైవప్రవక్త (సల్లం) ఎంతో విచారం వెలిబుచ్చారు. ఆ మాటకు వస్తే ఏ ముస్లిం ముఖంలోనూ సంతోషం లేదు. అందరూ విచారంతో దిక్కు తోచని స్థితిలో పడ్డారు.

అంతలో దైవప్రవక్త (స) ముఖారవిందం వికసించింది. ఆయన పెదవులపై చిరునవ్వు తొణికిసలాడింది. అది చూసి అనుచరుల ముఖాలు కూడా కలువపువ్వుల్లా విప్పారాయి.

"ముహమ్మద్! ప్రజలు నిన్ను పవిత్ర మాసాలలో యుద్ధం చేయడం గురించి అడుగుతున్నారు. వారికి ఇలా తెలియజెయ్యి: "ఆ మాసాలలో యుద్ధం చేయడం ఘోరమైన విషయం. అయితే దైవమార్గంలో అవరోధాలు సృష్టించడం, దేవుడు పంపిన సందేశాన్ని నిరాకరించడం, దైవభక్తుల్ని ప్రతిష్ఠాలయం (కాబాగృహం)లో ప్రవేశించనీయకుండా నిరోధించడం, అక్కడ ఉండేవారిని బయటికి గెంటివేయడం – ఇవన్నీ దేవుని దృష్టిలో అంతకన్నా ఘోరమైన చర్యలు. హింసా పీడనలు హత్యా రక్తపాతాల కన్నా చాలా ఘోరమైనవి. వారికి సాధ్యపడితే మిమ్మల్ని మీ ధర్మం నుండి మరలించేవరకు మీతో పోరాడుతూనే ఉంటారు. అప్పుడు మీలో గనక ఎవరైనా ఈ ధర్మాన్ని వదలి సత్యతిరస్కారిగా మారి, చివరికి అదే స్థితిలో చనిపోతే మాత్రం అతని ఇహపర కర్మలన్నీ వ్యర్థమైపోతాయి. ఇలాంటి ఉభయభ్రష్టులే నరకవాసులు. నరకంలోనే వారు (నానా యాతనలు అనుభవిస్తూ) ఎల్లకాలం పడివుంటారు." (ఖుర్ఆన్. 2:217)

అప్పుడే అవతరించిన ఈ సూక్తిని దైవప్రవక్త (సల్లం) తన సహచరులకు విన్పించారు. దాంతో వారి హృదయాలు కుదుటపడ్డాయి. అసలు ఖురైషీయులే దౌర్జన్యకాండ జరిపారు. అలాంటి దౌర్జన్యకాండ ముందు పవిత్ర మాసంలో రక్తపాతం జరపడం పాపం ఎలా అవుతుంది? మొత్తానికి ఎలాగో ఈ సమస్య పరిష్కారమయింది.

దైవప్రవక్త (సల్లం) సమరసొత్తును యోధులకు పంచారు. ఖైదీల విషయంలో మాత్రం ఖురైషీయులతో సంప్రదించారు. వారు ఖైదీల మార్పిడికి అంగీకరించారు. తక్షణమే ఖురైషీలు తమ అధీనంలో ఉన్న ఇద్దరు ఖైదీలను విడిచిపెట్టారు. ముస్లింలు తాము పట్టితెచ్చిన ఆ ఇద్దరు ఖైదీలకు బంధవిముక్తి కలిగించారు.

ముస్లింలు విడిచిపెట్టిన ఇద్దరు ఖైదీలలో ఒకతను ముస్లింగా మారి మదీనాలోనే ఉండిపోయాడు. రెండవ ఖైదీ మక్కా వెళ్ళిపోయాడు.

ఈ సంఘటనకు కారకులైన అబ్దుల్లా (రజి), ఆయన సహచరులు సమస్య పరిష్కారమైనందుకు ఎంతో ఆనందించారు. ఆ ఆనందంతో దైవమార్గంలో పోరాటం జరపడానికి అనుమతించమని అడిగారు. దైవప్రవక్త (సల్లం) వారి ఉత్సాహాన్ని గౌరవిస్తూ ఈ దైవసూక్తిని విన్పించారు:

"ఎవరు సత్యాన్ని విశ్వసించి, (దేవుని ప్రసన్నత కోసం) ఊరూ, వాడా వదలి వలస పోయి దైవమార్గంలో నిరంతరం పోరాటం సలుపుతారో వారు మాత్రమే దైవానుగ్రహాన్ని ఆశించగలరు. దేవుడు గొప్ప క్షమాశీలి, అపార దయామయుడు." (ఖుర్ఆన్-2:218)

## ఆరాధనా దిశ (ఖిబ్లా) మార్పు-(81)

బషీర్ బిన్ బరా(రజి) ఆహ్వానంపై ఓరోజు దైవప్రవక్త (సల్లం) ఆయన ఇంటికి వెళ్ళారు. వచ్చిన పని పూర్తయ్యేటప్పటికి జుహర్ నమాజ్ వేళయింది. దైవప్రవక్త (సల్లం)



అక్కడున్న అనుచరులకు నాయకత్వం వహించి ప్రార్థన (నమాజ్) చేయించసాగారు. రెండవ రకాతులో అకస్మాత్తుగా దైవసందేశం అవతరించింది:

"ముహమ్మద్! నీవు మాటిమాటికి ముఖం పైకెత్తి ఆకాశం వైపు చూడటాన్ని మేము గమనిస్తూనే ఉన్నాం. కనుక నీకు ప్రియమైన దిశకే (ప్రార్థనకై) మేము నిన్ను మరలిస్తున్నాం. ఇకనుంచి మీరు ప్రతిష్ఠాలయం వైపునకు తిరగండి. మీరు ఎక్కడున్నా దాని వైపునకే తిరిగి ప్రార్థన చేయండి. (ప్రార్థనాదిశ మార్పుకు సంబంధించిన) ఈ ఆదేశం నీ ప్రభువు నుండి వచ్చిన సత్యమని గ్రంథప్రజలకు బాగా తెలుసు. (అయినా వారు తమ పంతం మానలేక పోతున్నారు.) వీరి చర్యలను దేవుడు ఓ కంట గమనిస్తూనే ఉన్నాడు. (ఖుర్ఆన్-2:144)

ఈ సందేశం అవతరించగానే దైవప్రవక్త (సల్లం) నమాజ్ స్థితిలోనే బైతుల్‌మఖ్దిస్ వైపు నుంచి కాబాలయం వైపు మరలారు. వెనుక ఉన్న సహచరులు కూడా ఆయన్ని అనుసరిస్తూ కాబా దిశకు మరలారు.

ఆ తరువాత మదీనా, దాని పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ముస్లిములందరికీ ఖిబ్లా (దిశ) మార్పు గురించి దండోరా వేయించి తెలియజేశారు. ఖిబ్లా మార్పు ప్రకటన విన్పించే సమయంలో కొందరు రుకూలో ఉన్నారు. వెంటనే వారు రుకూ స్థితిలోనే కాబా వైపునకు తమ దిశను మార్చుకున్నారు.

కొత్తగా వచ్చిన ఈ మార్పుకు యూదులు ఆశ్చర్యపోయారు.

"ఏమైంది ఈ ముస్లింలకు, బైతుల్ మఖ్దిస్ ఉన్న దిక్కుకు తిరిగి నమాజ్ చేసేవారల్లా అకస్మాత్తుగా కాబా దిశకు తిరిగారు? గత దైవప్రవక్తలు బైతుల్ మఖ్దిస్‌నే తమ ఆరాధనా కేంద్రంగా చేసుకున్నారు కదా! తరతరాల నుంచి వస్తున్న ఖిబ్లాను ఇప్పుడు ఎందుకు మార్చాడు?" అంటూ ముఖం చిట్లించుకున్నారు, తమ ప్రతిష్ఠేదో దిగజారిపోతున్నట్లు.

నిజమే మరి. తమ జాతిలో ప్రభవించిన దైవప్రవక్తలంతా బైతుల్ మఖ్దిస్‌నే ఖిబ్లాగా చేసుకున్నారు. అలాంటి తమఖిబ్లా వైపుకే ముస్లింలు కూడా మరలి నమాజ్ చేస్తుంటే "అబ్బ! వీరు మా బైతుల్ మఖ్దిస్ వైపుకే తిరిగి నమాజ్ చేస్తున్నారని సంబరపడిపోయారు. తమ జాతి ఔన్నత్యాన్ని గురించి ఎన్నో గొప్పలు చెప్పుకున్నారు. కాని ఇప్పుడు ముస్లింలు తమ ఖిబ్లాను మార్చుకునేటప్పటికి వారిలో అసూయ ఏర్పడింది.

యూదులు దేవుడు ఓ ప్రత్యేక దిశలో ఉంటాడనుకున్నారేమో! లేక ఖిబ్లా మార్పును ఒక దిశ నుంచి మరొక దిశకు చేసిన సాధారణమార్పు మాత్రమేనని భావిస్తున్నారేమో!!

ఖిబ్లా మార్పు గురించి ఈ క్రింది ఖుర్ఆన్ సూక్తులు అవతరించాయి:

"ఏమయింది వీరికి, నిన్నటిదాకా ఒక దిక్కుకు తిరిగి ప్రార్థన చేస్తుండిన వీరు ఈరోజు హఠాత్తుగా మరో దిక్కుకు తిరిగారు?" అంటారు మూఢులు. ప్రవక్తా! వారికి చెప్పు: "తూర్పు పడమరలన్నీ దేవుని దిక్కులే. ఆయన తాను కోరినవారికి సన్మార్గం చూపుతాడు." ఈవిధంగా మేము మిమ్మల్ని మధ్యస్థ సమాజంగా చేశాం. మీరు ప్రపంచ ప్రజలకు సాక్షులుగా, ప్రవక్త మీకు సాక్షిగా ఉండాలని ఇలా చేశాము. (2:142)

“దైవప్రవక్తను ఎవరు అనుసరిస్తారు, ఎవరు విముఖులవుతారని పరీక్షించడానికి మేము మొదట మీరు (ప్రార్థనకై) మరలే దిక్కును ఆరాధనా కేంద్రంగా నిర్ణయించాము. ఇది ప్రజలకు చాలాకష్టం అన్పించింది. కాని దేవుని మార్గదర్శకత్వం లభించిన వారికి ఇది ఏమాత్రం కష్టమన్పించలేదు. దేవుడు మీ విశ్వాసాన్ని అనవసరంగా వృథా చేయడు. మానవుల పాలిట ఆయన అపార కృపాశీలుడు, అమిత దయామయుడు. (2:143)

“గ్రంథ ప్రజలకు నీవు ఎన్ని నిదర్శనాలు చూపినా వారు మీ ప్రార్థనా దిశను అనుసరించరు. మీరూ వారి ప్రార్థనాదిశను అనుసరించలేరు. స్వయంగా వారిలో కూడా ఒక వర్గం వారు అనుసరించే ప్రార్థనాదిశను మరొక వర్గంవారు అనుసరించరు. ఒకవేళ (మా గ్రంథ) జ్ఞానం అందిన తరువాత కూడా వారి కోరికలను అనుసరిస్తే మాత్రం నీవు దుర్మార్గులలో చేరినట్లు పరిగణించబడతావు. (2:145)

“మేము గ్రంథం ప్రసాదించినవారు తమ కన్నకొడుకులను ఎలా గుర్తిస్తున్నారో దీన్ని ఆ విధంగా (ఎలాంటి సంకోచంలేకుండా) గుర్తిస్తున్నారు. కాని వారిలో ఒక వర్గం వాస్తవాన్ని బుద్ధిపూర్వకంగా కప్పిపుచ్చుతోంది. నిస్సందేహంగా ఇది నీ ప్రభువు నుండి వచ్చిన పరమసత్యం. కనుక ఈ విషయంలో నీవు ఎలాంటి అనుమానానికి ఆస్కారమివ్వకు. (2:146,147)

“ప్రతి వర్గానికి ఒక ప్రార్థనాకేంద్రం ఉంది. వారా వైపు తిరుగుతారు. అందువల్ల మీరు (దీన్నిగురించి అట్టే ఆలోచిస్తూ సమయం వృథా చేసుకోకుండా) సత్కార్యాలు చేయటంలో ఒకర్నొకరు మించిపోవడానికి ప్రయత్నించండి. మీరు ఎక్కడున్నా దేవుడు మిమ్మల్నందర్నీ ఒకచోటికి చేరుస్తాడు. ఆయన ప్రతిపనీ చేయగల సమర్థుడు, సర్వశక్తిమంతుడు. (2:148)

“మీరు ఏప్రాంతానికి వెళ్ళినా అక్కడ్నుంచి మీరు ప్రతిష్ఠాలయం (కాబా) వైపుకే తిరిగి ప్రార్థన చేయండి. నిస్సందేహంగా ఇది మీ ప్రభువు నుండి వచ్చిన సత్యం. మీరు చేసే పనులన్నిటినీ దేవుడు గమనిస్తూనే ఉంటాడు. మీరు ఎక్కడున్నా, ఏ ప్రాంతానికి వెళ్ళినా అక్కడ నుంచి మీరు ప్రతిష్ఠాలయం వైపుకే అభిముఖులుకండి. మీకు వ్యతిరేకంగా ఇతరులు ఎలాంటి మాట అనడానికైనా ఆస్కారం ఇవ్వకుండా మీరు దాని వైపుకే తిరిగి ప్రార్థన చేయండి. ఇక దుర్మార్గుల విషయానికొస్తే, వారు ఎల్లప్పుడూ మీకు వ్యతిరేకంగా ఏదో ఒకటి వాగుతూనే ఉంటారు. కనుక మీరు వారికి భయపడకూడదు. నాకే భయపడాలి.” (2:149,150)

వేలాది సంవత్సరాల నుంచి ప్రపంచ నాయకత్వం వహిస్తున్న యూదుల్ని తొలగించి ఆ స్థానంలో సత్యధర్మం ఆశ్రయించిన ముస్లింలను నిలబెట్టడమే ఈ ఖిబ్లా మార్పు అంతరార్థం. కాని జాత్యోన్మాదులైన యూదులకు ఈ విషయం అర్థం కాలేదు. ముస్లింల ద్వారా దేవుని ధరిత్రిపై ధర్మసంస్థాపన గావించి ప్రపంచజాతుల మధ్య నీతి నిజాయతీ లకు, న్యాయం ధర్మాలకు, సమతా సౌభ్రాతృత్వాలకు వారిని ఆదర్శప్రాయులుగా తీర్చిదిద్ద డానికి ఈమార్పు తొలిమెట్టని; దైవధర్మాన్ని తారుమారుచేసి జాత్యహంకారంతో విర్ర వీగుతూ అంతిమ దైవప్రవక్త అందజేసిన ధర్మాన్ని నిరాకరించినందువల్లనే తమకీ అవమాన మని వారు తెలుసుకోలేకపోయారు.



నిజం చెప్పాలంటే ప్రపంచంలో మానవుల కోసం నిర్మించబడిన మొట్టమొదటి ఆరాధనాలయం మక్కాలో ఉన్న కాబాయే. దేవుడు దానికి ఎన్నో శుభాలనిచ్చి దాన్నొక అంతర్జాతీయ ప్రబోధనా కేంద్రంగా నిర్ణయించాడు. అరబ్బు తెగలన్నిటికీ మూలపురుషుడైన ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) నిర్మించిన ఆరాధనాలయం కూడా కాబాయే. అందువల్లనే దేవుడు ఈ పురాతన ఆలయాన్నే మళ్ళీ ఖిబ్లాగా నిర్ణయించాడు.

ఖిబ్లా మార్పు గురించి మక్కా ఖురైషీయులక్కూడా తెలిసిపోయింది. వాళ్ళు కూడా అదేదో తమ పాలిట పెద్ద అపశకునంగా భావించి బెంబేలు పడిపోయారు. మొన్నటివరకు ముస్లింల విశ్వాసాలు, వారిఖిబ్లా, వారిఆరాధనలు అన్నీ తమకు భిన్నమైనవిగా, అపరిచిత మైనవిగా ఉండటంవల్ల తమ ధార్మికసత్తాకు ముప్పులేదనుకున్నారు. కాని ఖిబ్లా మార్పుతో ముస్లింల దృష్టి ఇప్పుడు కాబా మీద పడిందని; అంచేత ఎప్పటికైనా వారు కాబాగృహాన్ని వశపరచుకొని మక్కాలో తమకు నిలువ నీడలేకుండా చేసేలా ఉన్నారని తలచి తల్లడిల్లి పోయారు. అందువల్ల ఇప్పుడు వారి హృదయాల్లో ముస్లింల పట్ల పగ, ద్వేషం మునుపటి కంటే మరింత అధికమయ్యాయి.

## సాయుధ ప్రతిఘటన-(82)

పవిత్ర రమజాన్ మాసం అసంఖ్యాకమైన శుభాలు తెచ్చి ముస్లింల మీద వెదజల్లడం ఆరంభించింది. మదీనాలో నూతనోత్సాహం పెల్లుబికింది. అందరూ తమ ప్రభువు ప్రసన్నత కోసం ఉపవాసాలు ఉండి వివిధ పుణ్యకార్యాలు చేయసాగారు.

ఆ నెలలోనే అబూసుఫ్యాన్ నాయకత్వంలో సిరియా నుంచి ఖురైషీయుల వర్తక బృందం ఒకటి బయలుదేరిందని, అది మదీనా సమీపంగుండా మక్కాపోతుందని దైవప్రవక్త (స)కు సమాచారం అందింది. ఖురైషీయులు ఇదివరకు చేసిన కవ్వింపు చర్యలకు ప్రతిక్రియగా ముస్లింల శక్తిసామర్థ్యాలు ఏమిటో తెలిపి వారిగుండెల్లో దడ పుట్టించడానికి ఆయన తగినఅదను కోసం చూస్తున్నారు. ఇప్పుడా అవకాశం వచ్చింది.

మక్కా నుంచి వస్తున్న వర్తకబిడారాలను అడ్డగించి, ముస్లింలతో విరోధం పెట్టు కుంటే వారి సిరియావ్యాపారం ఆగిపోతుందని వారిని హెచ్చరించే నిమిత్తం దైవప్రవక్త (స) వెంటనే కొంతమంది అనుచరుల్ని ఆ దిశగా పంపారు.

ముస్లింలు బయలుదేరిన సంగతి అబూసుఫ్యాన్‌కు ఎలాగో తెలిసింది. ముస్లిం సైనిక దళాలు రేయింబవళ్ళు గస్తీ తిరుగుతున్నాయని అంతకు ముందే తెలుసు. పైగా ఇప్పుడు బయలుదేరింది మరో ప్రత్యేకదళం. ఒంటెల మీద లక్షల విలువగల సామగ్రి ఉంది. వీటిని కాపాడేవారు చాలా తక్కువమంది ఉన్నారు. ఈ పరిస్థితిలో ముస్లింలకు చిక్కితే, అమ్మో! ఇంకేమైనా ఉందా! పోతే సామగ్రి పోతుంది. కాని దేహంలో ఎముకలు కూడా మిగలవే!

ఈ ఆలోచన రాగానే అబూసుఫ్యాన్ హడలిపోయాడు. తక్షణమే అతను జుమ్‌జామ్ బిన్ అమ్ర్ అనే అతడ్ని పిలిచి, ముస్లింలు మన వర్తక బిడారాలను అడ్డగించడానికి

వస్తున్నారని, వెంటనే మాకు సహాయపడి వ్యాపార సామగ్రిని కాపాడుకోవాలని చెప్పి మక్కాలోని ఖురైషీలకు వార్త పంపించాడు.

ఆ తరువాత అబూసుఫ్యాన్ వర్తక బిడారాలను వేరే వైపుకు దారిమళ్ళించి వెనక్కి తీసుకుపోయాడు. ఈ వర్తక బృందం కొంత దూరం ప్రయాణంచేసి హిజాజ్ ప్రాంతానికి చేరుకుంది. అక్కడ ముస్లిం యోధులు ఉన్నారేమోనని అబూసుఫ్యాన్ ఓసారి చుట్టూ కలియజూశాడు. జుమ్‌జామ్ మక్కా నుంచి ఖురైషీయుల్ని వెంటబెట్టుకొని బయలుదేరి ఈపాటికి చాలా దూరం వచ్చేసి ఉంటాడని భావించి అతని కోసం ఎదురుచూడసాగాడు. కాని ఎంతసేపు చూసినా జుమ్‌జామ్ జాడ లేదు. అంచేత అతను అక్కడ్నుంచి ముందుకు సాగి బదర్ ప్రాంతానికి చేరుకున్నాడు.

అప్పటికి బాగా చీకటి పడింది. ఒంటెలు అక్కడ దగ్గర్లో ఉన్న కొలను వైపు వేగంగా పరుగెత్తాయి. కాని ఒంటెలు క్రితం రోజే తృప్తిగా నీళ్ళు తాగాయి. ఇప్పుడు వీటి విచిత్ర పరిస్థితి చూస్తే ఆశ్చర్యం వేసింది. ఒంటెలు ఇంతకు ముందెన్నడూ ఇలా ప్రవర్తించలేదు. ఈరోజు ఎందుకిలా చేస్తున్నాయి? ఈరోజు చీకటి కూడా చాలా ఘోరంగా ఉంది. కళ్ళు చించుకున్నా కానరావడం లేదు.

వర్తకుల గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. కాని అబూసుఫ్యాన్ చాల దూరదృష్టి కలవాడు. అతను ఆ ప్రాంతంలో ఒక చోట కన్పించిన ఒంటె పేడ తీసుకొని పరీక్షించాడు. అందులో ఖర్జూరపు విత్తనాలు కన్పించాయి. ఇది మదీనాప్రజలు తమ ఒంటెలకు పెట్టే ప్రత్యేకమైన మేత. అంటే ముస్లింసైనికులు ఈ దరిదాపుల్లోనే ఎక్కడో పొంచి ఉండవచ్చని తెలుస్తోంది. ఈ అనుమానం కలగ్గానే అబూసుఫ్యాన్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా దారిమార్చి వర్తకబిడారాలతో తీరప్రాంతం వైపు వేగంగా ప్రయాణం సాగించాడు.

మదీనాలో మహాప్రవక్త (స), ఆయన అనుయాయులు ఇస్లాం విప్లవ కిరణాలను దేశం నలుదిశలా ప్రసరింపజేస్తుంటే మక్కాలోని ఖురైషీయుల గుండెల్లో గుర్రాలు పరుగెత్త సాగాయి. ఇదిలాఉండగా ఓరోజు నెత్తిమీద పిడుగు పడినంత పనయింది. నఖ్లా ప్రాంతంలో ముస్లింలు తమ వ్యాపార బృందాన్ని దోచుకున్నారని, అమ్ర్ బిన్ హజ్రమీ అనే మనిషిని చంపి మిగిలినవారిని ఖైదీలుగా బంధించి తీసికెళ్ళారని గూఢచారి సందేశం వచ్చింది. దాంతో ఖురైషీయులు ఆగ్రహంతో చిందులు తొక్కారు. కసి, పగ తారస్థాయికి చేరాయి. ఇక ఎంతమాత్రం సహించకూడదు. అటోఇటో తేల్చుకోవాలనుకున్నారు.

కాని ఆతర్వాత వారిపై మరో పిడుగు పడింది. జుమ్‌జామ్ బిన్ అమ్ర్ మక్కా చేరు కొని అప్పటి సంప్రదాయం ప్రకారం ఒంటెచెవులు కోసి, తన చొక్కా వెనుకా ముందు చించుకున్నాడు. తర్వాత తన స్వారీదిశ మార్చి నడిబజారులో ఇలా ఓ పొలికేక పెట్టాడు:

“ఖురైషీయులారా! మీ వర్తక బిడారాలు సిరియా నుంచి తిరిగొస్తున్నాయి. లక్షల విలువగల సామగ్రితో వస్తున్న ఈ బిడారాలు ప్రమాదంలో చిక్కుకున్నాయి. ముహమ్మద్ (సల్లం), ఆయన అనుచరులు వాటిని దోచుకోకముందే కాపాడుకోండి. రండి, పరుగెత్తండి. అబూసుఫ్యాన్‌ని ఆదుకోండి, మీ సామగ్రిని కాపాడుకోండి.”



ఇప్పటికే నఖ్లా ఉదంతంతో మండిపోతున్న ఖురైష్ అవిశ్వాసులకు జుమ్‌జామ్ తెచ్చిన ఈ సమాచారం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. వారి గుండెల్లో రగిలిన కోపాగ్ని జ్వాలలు మింటికెగిశాయి. కాలుతీసి పెట్టలేనివాడు కూడా కయ్‌మని లేచి నిలబడ్డాడు.

మరుక్షణమే యుద్ధవీరుల్ని సమావేశపరిచారు. కార్చిచ్చులాంటి ఉపన్యాసాలు ఇచ్చి జనాన్ని తీవ్రంగా రెచ్చగొట్టారు. ఉద్రేకపూరితులైన యువకులు యుద్ధ సన్నాహాలకు ఉరకలు వేశారు. కత్తులు, ఈటెలు, బాకులు, విల్లంబులు ధరించారు. ఒంటెలు, గుర్రాలు సిద్ధం చేశారు. కాని పిరికిపంద అబూలహబ్ మాత్రం ముస్లిం యోధులతో పోరాడటానికి సాహసించ లేకపోయాడు. ఏదో కుంటిసాకు చెప్పి తనకు బదులు మరో వ్యక్తిని నాల్గువేల రూపాయల ప్రతిఫలం మీద కుదుర్చుకొని యుద్ధానికి పంపాడు.

కొంతమంది తమ అసామాన్య వాగ్ధాటితో ప్రజలను రెచ్చగొట్టి యుద్ధానికి ప్రేరేపింప సాగారు. సుహైల్ అనే అతను ఖురైష్ వీరుల్ని ఉద్దేశించి ఇలా అన్నాడు:

“గాలబ్ వీరపుత్రులారా! ముస్లింలు మన వాణిజ్యబిడారాలపై దాడి జరపడాన్ని మీరు సహించగలరా? మనకు ఏ కొరతా లేదు. లేండి, కళ్ళు తెరవండి. పౌరుషంతో శత్రువుని ఎదుర్కోవడానికి నడుం కట్టండి.”

దాదాపు వేయిమంది యోధులు యుద్ధానికి సిద్ధమయ్యారు. వంద గుర్రాలు, ఏడు వందల ఒంటెలు కూడా సమకూరాయి. కాల్బల సైనికులు ధగధగ మెరిసే ఉక్కు కవచాలు ధరించారు. సైనికుల్ని ఉద్రేకపరచడానికి పరుషపదాలతో పాటలుపాడే పడతులు కూడా వెంట ఉన్నారు. ఉత్సాహంతో రొమ్ములు విరుచుకొని సమర వాయిద్యాలతో, దిక్కులు పిక్కటిల్లే నినాదాలతో అట్టహాసంగా బయలుదేరారు మక్కా బహుదైవా రాధకులు. దారిలో ఎక్కడ ఒయాసిస్సు కన్పిస్తే అక్కడ మజిలీ చేసి సేద తీర్చుకుంటు న్నారు. ప్రతీకారంతో ఊగుతూ, పళ్ళు పటపట నూరుతూ ఒక్కొక్క మజిలీ దాటుకుంటూ ముందుకు పయనిస్తున్నారు.

కొంత దూరం పోయిన తరువాత మక్కా నుంచి ఒకతను అశ్వరూఢుడై శరవేగంతో వచ్చి వారితో ఇలా అన్నాడు:

“సోదరులారా! ఏ వర్తక బిడారాలను కాపాడటానికి మీరు వెళ్తున్నారో అవి ముస్లింల బారి పడకుండా సురక్షితంగా మక్కా చేరుకున్నాయి. మీరిక వెనక్కి వెళ్ళండి. వెళ్ళిపోవడమే మనకు శ్రేయస్కరం. ముస్లింలను ఎదుర్కోవాలనే ప్రయత్నం మాని మక్కా వెళ్ళిపోండి.”

కాని యుద్ధోన్మాదంతో బయలుదేరిన ఖురైషీయులకు అతని సలహా రుచించలేదు. చాలామంది అతని మాటలు విని అసహ్యించుకున్నారు. బనీహాషిం తెగ మాత్రం ఆ వ్యక్తి ఇచ్చిన సలహా సమంజసమయిందని గ్రహించి వెనక్కి మరలిపోదామనుకుంది. కాని సైన్యాధిపతి అబూజహల్ కస్సుమని లేచాడు.

“సోదరులారా! అతని వలలో పడకండి. వర్తక బిడారాలు సురక్షితంగా మక్కా చేరుకున్నా, ముస్లింల కవ్వింపు ధోరణి చూస్తూ ఊరుకుంటామా? ముహమ్మద్‌ని, అతని

అనుచరుల్ని అంతమొందించే వరకు మనం విశ్రమించకూడదు. నడవండి" అన్నాడు అబూజహల్ సైనికుల్ని పక్కదారి పట్టిస్తూ.

ఖురైషీయులు తన సలహా పాటించనందుకు ఆ వ్యక్తి విచారిస్తూ వారి మానాన వారిని వదలిపెట్టి మక్కా వెళ్ళిపోయాడు. అబూసుఫ్యాన్‌ని కలుసుకొని తన మాటలు ఎవరూ వినలేదని చెబుతూ జరిగిన వృత్తాంతం వివరించాడు.

అబూసుఫ్యాన్ ఈ సంగతి విని విచారం వెలిబుచ్చుతూ ఇలా అన్నాడు:

"అయ్యో ఖురైష్ ప్రజలారా! ఎంత మైకంలో పడిపోయారు మీరు! ఇంతకూ ఇదంతా అబూజహల్ పని. అతనెందుకు వింటాడు. అతనిప్పుడు సైన్యాధిపతి అయ్యాడు కదా! కాని అతను జనాన్ని పెడదారి పట్టించి చాలా అన్యాయం చేస్తున్నాడు. సొంత నిర్ణయాలు తప్ప ఎదుటివారి సలహాలోని ఉచితానుచితాలు గ్రహించే విచక్షణాజ్ఞానం నశించింది. దాని పర్యవసానం అనుభవిస్తాడులే."

మక్కా అవిశ్వాసులు మదీనాపై దాడిచేయడానికి బయలుదేరారనే వార్త విని ఇస్లాం ఉద్యమ వైతాళికుడు ముహమ్మద్ (స) కర్తవ్యాన్ని గురించి ఆలోచించసాగారు.

"ఉపద్రవం మెరుపు వేగంతో ముంచుకొస్తోంది. ఈ పరిస్థితిలో దుష్టులను ధైర్యంగా ఎదుర్కోకపోతే ఇస్లామీయ ఉద్యమం శాశ్వతంగా నిర్వీర్యమైపోతుంది. మదీనాలో ముహాజిర్ల జీవన పరిస్థితులు మెరుగుపడలేదు. అటు అన్సారులకు ధార్మిక జీవితంలో వచ్చే వడిదుడుకుల్ని తట్టుకొని సుశిక్షితులయ్యే అవకాశం ఇంకా సరిగా లభించలేదు.

మరోవైపు యూదులు హద్దుమీరిన విరోధంతో కత్తులు నూరుతున్నారు. అంతకంటే ప్రమాదకరమైన వాళ్ళు ముస్లింలుగా నటిస్తున్న వంచకులు. వీరు ముస్లింలలో కలసి ఉంటూ క్షణానికో రంగుమారుస్తూ చీడపురుగుల్లా అంతర్గత ప్రమాదాన్ని తెచ్చిపెడ్తున్నారు. ఇలాంటి పరిస్థితిల్లో ఖురైషీయులు మదీనాపై దాడిచేస్తే ప్రస్తుతం ఉన్న కొద్దిమంది ముస్లింలు అంతమయ్యే ప్రమాదం లేకపోలేదు. ఒకవేళ వారు మదీనా మీద దాడి చేయకుండా సైనిక బలప్రదర్శనతో తమ వాణిజ్య బృందాన్ని తప్పించి సురక్షితంగా తీసి కెళ్ళినా, ముస్లింలు తమ ప్రత్యర్థుల్ని ఎదుర్కోలేని పిరికిపందలని దేశంలో అపహాస్యం పాలు కావలసివస్తుంది. వారి ప్రభావం పూర్తిగా అడుగంటి పోతుంది.

అక్కడితో ఆ విషయం ఆగిపోదు. మదీనా దరిదాపుల్లో ఉన్న తెగలన్నీ ఖురైషీయుల అండతో ముస్లింల మీద విజృంభిస్తాయి. మదీనాలో ఉన్న బహుదైవారాధకులు, యూదులు, కపటముస్లింలు స్వైరవిహారం చేస్తారు. అప్పుడు ముస్లింలకు ఊపిరి పీల్చు కోవడం కూడా దుర్భరమవుతుంది. ఈ పరిస్థితిలో అటు వర్తక బృందాన్ని అడ్డుకోవడమో లేదా యుద్ధరంగంలోకి దిగి ఖురైషీయులతో ఢీకొనడమో చెయ్యాలి.

ఈ ఆలోచనతో దైవప్రవక్త (స) వెంటనే అనుచరుల్ని సమావేశపరచారు. పరిస్థితుల స్వరూపం వివరించి "ఒకవైపు ఉత్తరాన ఖురైషీయుల వర్తకబిడారాలు ఉన్నాయి. మరోవైపు దక్షిణాన వారి సైన్యం వస్తోంది. ఈ రెండింటిలో ఏదోఒకటి మనకు లభిస్తుందని దేవుడు వాగ్దానం చేశాడు. కనుక ఎటు పోదామో చెప్పండి" అని అడిగారు.



కొందరు వాణిజ్యబృందం ఉన్న వైపుకెళ్దాం అన్నారు. కాని దైవప్రవక్త (స)కు అందులో ఔచిత్యం ఉన్నట్లు కన్పించలేదు. అంచేత ఆయన మళ్ళీ అదే ప్రశ్న అడిగారు.

వాస్తవ పరిస్థితి అర్థం చేసుకున్న హజ్రత్ అబూబకర్ (రజి) లేచి ఇలా అన్నారు:

"మక్కాలో ఉన్నంతకాలం ఖురైషీయులు మనకు దారుణమయిన చిత్రహింసలు పెట్టారు. వారి దౌర్జన్యకాండ భరించలేక ఇల్లూవాకిలి వదలిపెట్టి వస్తే, ఇక్కడా మనల్ని వదలి పెట్టడంలేదు. అలాంటి దుర్మార్గుల్ని ఇక సహించకూడదు. అందువల్ల మనం ఖురైష్‌సైన్యం వస్తున్న దిశకే వెళ్దాం. దైవప్రసన్నత కోసం, ధర్మరక్షణ కోసం ప్రాణాలైనా త్యజించి పోరాడుదాం."

తరువాత హజ్రత్ ఉమర్ (రజి) అబూబకర్ (రజి) అభిప్రాయంతో ఏకీభవిస్తూ మాట్లాడారు. ఆ తరువాత హజ్రత్ మిఖ్దాద్ (రజి) లేచి నిల్చున్నారు.

"దైవప్రవక్తా! విశ్వప్రభువు మిమ్మల్ని ఎటు పొమ్మని ఆజ్ఞాపిస్తే అటే పదండి. మేమంతా మిమ్మల్ని అనుసరిస్తాం. ఇస్రాయీలీయులు తమ ప్రవక్తతో అన్నట్లు 'నీవు, నీ దేవుడు వెళ్ళి పోరాడండి, మేమిక్కడే కూర్చొని ఉంటాం' అని మేము అనేవాళ్ళం కాము. మేము మాత్రం 'మేము మీవెంట ఉండి చివరి రక్తబిందువు చిందేవరకు యుద్ధం చేస్తాం' అని అంటాము."

మిఖ్దాద్ (రజి) వీరోచిత పలుకులు విని దైవప్రవక్త (స) ముఖపద్మం వికసించింది. తరువాత ఆయన ఇతర అనుచరుల వైపు చూస్తూ "సోదరులారా! మీరు కూడా ఏదైనా మాట్లాడండి" అన్నారు.

అన్సారులు ఒకరి ముఖాలు ఒకరు చూసుకొని దైవప్రవక్త (స) తమను ఉద్దేశించే అడుగుతున్నారని భావించారు. అప్పుడు హజ్రత్ సాద్ (రజి) ఇలా ప్రసంగించారు:

"నేనిప్పుడు అన్సారులందరి తరపున మాట్లాడుతున్నాను. దైవప్రవక్తా! మేము మిమ్మల్ని హృదయపూర్వకంగా విశ్వసించాం. మీ ప్రవచనాలు సత్యం, ధర్మం అని సాక్ష్యమిచ్చాం. మీ అమృతవాక్కులే మాకు శిరోధార్యాలని నమ్మేం. మీ విధేయతా ప్రతిజ్ఞ కూడా చేశాం. దైవప్రవక్తా! మీరిప్పుడు ఏది నిర్ణయిస్తారో దానికోసం నిస్సంకోచంగా ముందడుగు వేయండి. మేమంతా మిమ్మల్ని అనుసరిస్తూ మీవెంటే ఉంటాం.

దైవసాక్షిగా చెబుతున్నాను. మీరు మమ్మల్ని తీసుకొని సముద్రంలోకి దూకినా అందుకు మేము సిద్ధంగా ఉన్నాం. మాలో ఏ ఒక్కడూ వెనుకంజ వేసేవాడు కాడు. మీరు తలచిన వారితో యుద్ధం చేయండి. అన్నిటికీ మేము సిద్ధమే. నేనా దారిన ఎప్పుడూ ప్రయాణించి ఉండలేదు. దాన్ని గురించి నాకు తెలియదు. అయితే మేము శత్రువులకు వెన్నుజూపి పారిపోయే పిరికిపందలం కాము. యుద్ధరంగంలో దిగితే ప్రాణాలైనా బలిపెట్టి నిలుస్తాం. దైవచిత్తమయితే మా బలపరాక్రమాలు మీరే చూస్తారు."

హృదయాంతరాళం నుంచి వెలువడిన ఈ వీరోచిత ప్రసంగం విని సత్యధర్మ వైతాళికుని మనోసాగరం ఆనందాతిశయంతో ఉప్పొంగిపోయింది.

హజ్రత్ సాద్ (రజి) చేసిన ప్రసంగం తరువాత దైవప్రవక్త (సల్లం) చివరి పలుకులుగా "మిత్రులారా! దైవనామం స్మరించి బయలుదేరండి. మనపై దేవుని కరుణాకటాక్షాలు ఎంతగానో ఉన్నాయి. ఆయన నాకు పెద్ద సమూహం (సైనిక సమూహం) గురించే వాగ్దానం చేశాడు. యుద్ధానికి సిద్ధంకండి" అని చెప్పారు.

"రెండు వర్గాలలో ఒక వర్గం మీకు చేజిక్కుతుందని దేవుడు మీకు వాగ్దానం చేశాడు. ఆ సందర్భం కాస్త గుర్తుకు తెచ్చుకోండి. అప్పుడు మీరు (ఆయుధాలు లేని) బలహీన (వ్యాపార) వర్గం మీకు చేజిక్కితే బాగుంటుందని భావించసాగారు. కాని దేవుడు తన ఆదేశాలతో సత్యాన్ని సత్యంగా నిరూపించదలిచాడు. అంతేకాకుండా నేరస్థులకు ఎంత వెగటు అన్పించినా సత్యం సత్యంగా, అసత్యం అసత్యంగా రుజువు కావడానికి ఆయన అవిశ్వాసుల్ని పూర్తిగా తుడిచిపెట్టాలని కూడా సంకల్పించుకున్నాడు." (ఖుర్ఆన్. 8:7-8)

## సత్యాసత్యాల మధ్య సంకుల సమరం-(83)

మదీనాలో ముస్లింలు యుద్ధ సన్నాహాలలో నిమగ్నులైపోయారు. కాని చాలీచాలని వనరులతో ఖురైషీయులతో తలపడటం అంటే సామాన్యమా? సైనికులందరికీ కలిపి మూడు గుర్రాలు, డెబ్భయి ఒంటెలు మాత్రమే ఉన్నాయి. ఒక్కొక్కఒంటె మీద ముగ్గురు నలుగురు చొప్పున కూర్చోవలసి వచ్చింది. దైవప్రవక్త (సల్లం) కూర్చున్న ఒంటె మీద కూడా మరో ఇద్దరు యోధులు కూర్చున్నారు. అప్పటికీ వాహనాలు సరిపడక అనేక మంది కాలినడకన బయలుదేరారు.

ఆయుధాలు కూడా అంతంత మాత్రమే ఉన్నాయి. ఖడ్గం ఉంటే బల్లెం లేదు; బల్లెం ఉంటే ఖడ్గం లేదు. ధనుర్బాణాలు కూడా తగినన్ని లభించ లేదు. అంతేకాదు, అనేకమంది యోధులు కడుపునిండా తిండి లభించని కారణంగా బక్కచిక్కిన శరీరాలతో సన్నగా కూడా ఉన్నారు.

ఇలాంటి విపత్కర సమయంలో యుద్ధరంగంలో దిగడం అంటే మృత్యువుని కొనితెచ్చు కొవడమే. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇస్లాం రక్షణ కోసం ఖడ్గం చేపట్టడం తప్ప గత్యంతరం లేదు. అందువల్ల దైవప్రవక్త (స), ఆయన అనుచరులు దైవం మీద భారం వేసి హిజ్రీశకం 2వ సంవత్సరం రమజాన్ నెలలో రణరంగానికి బయలుదేరారు.

వారంతా మదీనా పొలిమేరలు దాటిన తర్వాత దైవప్రవక్త (స) ఓసారి సైనికులందర్నీ పరిశీలించారు. సైన్యంలో 13, 14 ఏండ్ల బాలయోధులు కూడా ఉన్నారు.

"పిల్లలు యుద్ధంలో పాల్గొనడం మంచిది కాదు. వారంతా పట్నం తిరిగి వెళ్ళి పోవాలి" అన్నారు దైవప్రవక్త (సల్లం).

ఈమాట విని పిల్లలు నిరుత్సాపడ్డారు. అయినా వారు నిరాశ చెందలేదు.

"అయితే మేము జిహాద్ పుణ్యం కోల్పోవలసిందేనా?" అన్నాడు ఒక బాలుడు.

"మీరింకా పిన్న వయసులో ఉన్నారు. యుద్ధజ్వాలలు ఎంత తీవ్రంగా ఉంటాయో మీకింకా తెలియదు. వాటి దగ్గరకు వెళ్ళిన ప్రతివ్యక్తినీ అవి దహించివేస్తాయి."



"మేము దైవప్రసన్నత పొందడానికి మాత్రమే ఈ యుద్ధంలో పాల్గొంటున్నాము. యుద్ధజ్వాలల్లో దూకడానికి మేము సిద్ధంగా ఉన్నాము. వాటికి ఆహుతి అయి అమరగతి నొందితే మాకు స్వర్గం లభించదా?"

"తప్పకుండా లభిస్తుంది బాబూ! కాని ఆ యుద్ధజ్వాలలు చూసి మీరు భయపడి పోతారేమో ఆలోచించుకోండి."

"దైవప్రవక్తా! మీరా విషయం గురించి ఆందోళన చెందకండి. మేమలా భయపడే వాళ్ళం కాము" అన్నాడు మరో పిల్లవాడు.

"ఔను దైవప్రవక్తా! సమరోత్సాహం మా నరనరాల్లో వ్యాపించి ఉంది. మేము యుద్ధ తీవ్రత చూసి భయపడి పారిపోయే పిరికిపందలం కాము. మా ఊపిరి పోయే వరకు పోరాడే వీరయోధులం" అన్నాడు వేరొక పిల్లవాడు.

"నా ప్రియతమ బాలయోధులారా! మీ సమరోత్సాహాన్ని నేను అభినందిస్తున్నాను. ప్రతి ముస్లింలో ధర్మయుద్ధం పట్ల ఇలాంటి ఆసక్తి, ఉత్సాహాలు ఉండవలసిందే. ఆంతర్యాలలో ఉండే ఈ సమరోత్సాహమే ఇస్లాం పట్ల దృఢవిశ్వాసానికి ప్రబల నిదర్శనం. కాని మనం ఇప్పుడు చేయబోతున్న యుద్ధం తొలియుద్ధం. దీని పర్యవసానం ఎలా ఉంటుందో చెప్పలేం. అందుకని మీరు పట్నం తిరిగెళ్ళి పోవడమే మంచిది" అన్నారు దైవప్రవక్త (సల్లం) పరిపరి విధాల నచ్చజెపుతూ.

"దైవప్రవక్తా! మేము మీ ఆజ్ఞ శిరసావహిస్తాం. కాని తిరిగెళ్ళి పోవాలంటే మాకు చాలా బాధగా ఉంది" అన్నారు కొందరు పిల్లలు.

దైవప్రవక్త (స) ధర్మయుద్ధం పట్ల పిల్లల హృదయాల్లో ఉన్న ఆసక్తి చూసి చాలా ఆశ్చర్యపోయారు. కాస్సేపు ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చారు. ఒక ఈటె తీసుకొని దానిపై ఒక గుర్తు పెట్టారు.

"అయితే ఒక పని చేద్దాం. నా చేతిలో ఉన్న బల్లెం మీద ఈ గుర్తు చూశారా? ఈ గుర్తు వరకు పొడుగ్గా ఉన్న పిల్లల్ని మాత్రమే సైన్యంలో భర్తీ చేసుకుంటాం. మిగిలిన పిల్లలు తిరిగి వెళ్ళిపోవాలి" అన్నారు దైవప్రవక్త (సల్లం).

"ఆ... అలాగే చేయండి దైవప్రవక్తా!" అన్నారు పిల్లలు ముక్తకంఠంతో.

"సరే మీరంతా కాస్త ముందుకు రండి."

ఈ ఆదేశం వినగానే దాదాపు 60 మంది పిల్లలు సైనిక పంక్తుల్లో నుంచి బయటికి వచ్చి దైవప్రవక్త (సల్లం) ముందు నిలబడ్డారు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఒక్కొక్క బాలుడి పక్కన ఈటె నిలబెట్టి అతని పొడవు కొలిచి చూడటం మొదలుపెట్టారు. ఈటె మీదున్న గుర్తు వరకు పొడవున్న పిల్లల్ని వదలి, ఆ గుర్తు వరకు పొడవురాని పిల్లల్ని పక్కకు తీస్తున్నారు. అప్పుడు ఒక పిల్లవాడు తన ఎత్తు కొంచెం తక్కువ ఉన్నట్లు భావించి, పాదాల మునివ్రేళ్ళపై నిల్చున్నాడు.

దైవప్రవక్త (స) అది గమనించి చిరునవ్వు నవ్వారు. దైవప్రసన్నత కోసం ధర్మ యుద్ధంలో పాల్గొనే ఉద్దేశ్యంతో ఆ అబ్బాయి చూపిన అతితెలివికి ఆయన అబ్బురపడ్డారు.

"అబ్బాయ్! నీ అతితెలివి ఎంతో ప్రశంసనీయమైనది. నీ హృదయంలో ఎగిసిపడు తున్న సమరోత్సాహమే నిన్నీ అతితెలివికి పురిగొల్పింది. అంచేత నువ్వు సైన్యంలో చేరడా నికి అనుమతిస్తున్నాను" అన్నారు దైవప్రవక్త (సల్లం).

దైవప్రవక్త (సల్లం) నోట ఈమాట వినగానే ఆ పిల్లవాడు గొప్పనిధి ఏదో లభించి నట్లు పట్టరాని సంతోషంతో గంతులేస్తూ సైన్యంలోకి పరుగెత్తాడు.

ఆ తరువాత మరికొందరు పిల్లలు కూడా అతడ్ని అనుసరిస్తూ కాలి మునివ్రేళ్ళ మీద నిలబడ్డారు. కాని వారిలో చాలామంది పిల్లల పొడవు ఈటె మీదున్న గుర్తు దాకా రాలేదు. అందువల్ల అలాంటి పిల్లలు నిరుత్సాంతో పట్నం తిరిగెళ్ళి పోయారు.

అలా పంపగా మొత్తం యోధులు 313 మంది మిగిలారు. వీరిని తీసుకొని దైవప్రవక్త (సల్లం) అక్కడ్నుంచి బయలుదేరారు.

పగలంతా ప్రయాణం చేసి చీకటి పడే సమయానికి 'రౌహా' అనే ప్రదేశం చేరు కున్నారు. ఆ రాత్రికి అక్కడే మజిలీ చేశారు. దైవప్రవక్త (సల్లం) ఉజూ చేసి నమాజ్ చేయడంలో నిమగ్నులయి పోయారు. చివరి రుకూ తరువాత ఆయన అవిశ్వాసుల్ని శపిస్తూ "దేవా! అబూజహల్ ఈనాటి సమాజానికి ఫిరౌన్ లాంటివాడు. అతడ్ని సజీవంగా వదలిపెట్టకు" అని ప్రార్థించారు.

అక్కడ్నుంచి బయలుదేరి 'బదర్' చేరుకున్నారు. అక్కడ ఆగి దైవప్రవక్త (సల్లం) శత్రువుల్ని గురించి సమాచారం సేకరించి తీసుకురమ్మని ముగ్గురు అనుచరుల్ని పంపారు. వారు ముగ్గురు ఒక కొండ వైపుకు పోతే కొందరు ఖురైష్ మనుషులు అక్కడి బావి వద్ద నీళ్ళు త్రాగుతూ కన్పించారు. వారిలో ఇద్దరు బానిసలు కూడా ఉన్నారు. వారు అబూ సుఫ్యాన్ బానిసలని గ్రహించారు. వెంటనే మెరుపు దాడిచేసి వాళ్ళిద్దర్ని పట్టుకున్నారు. మిగిలిన వాళ్ళు పారిపోయారు.

పట్టుబడిన ఖైదీలు వచ్చిన తరువాత దైవప్రవక్త (సల్లం) వారివైపు తిరిగి.....

"అబూసుఫ్యాన్ గురించి ఏమైనా వివరాలు తెలిస్తే చెప్పండి" అని అడిగారు.

"అబూసుఫ్యాన్ని మేము చూడలేదు. ఆయన్ని గురించి మాకు ఎలాంటి వివరాలు తెలియవు" చెప్పారు బానిసలు.

"సరే, ఖురైషీయులు ఇప్పుడు ఎక్కడ ఉన్నారో చెప్పగలరా?"

"ఇక్కడే కొద్ది దూరంలో కొండ ఆవల వైపు ఉన్నారు."

"ఖురైష్ సైన్యంలో ఎంతమంది యోధులున్నారు?"

"అబ్బో! వారు చాలామంది ఉన్నారండీ!"

"పోనీ, రోజుకు ఎన్ని ఒంటెలు కోస్తారు?"



"ఒకరోజు తొమ్మిది, మరొక రోజు పది చొప్పున కోస్తారు."

"అంటే శత్రువులు తొమ్మిది వందలు, వేయి మధ్య ఉన్నారన్న మాట" అన్నారు దైవప్రవక్త (సల్లం) అనుచరుల వైపు తిరిగి.

"మీ కంటే మూడు రెట్లు అధికంగా ఉన్న శత్రువులతో మీరు పోరాడవలసి ఉంది. అధైర్యపడకండి. జయాపజయాలు దైవాధీనం. దేవుని మీద భారం వేసి యుద్ధానికి సిద్ధంగా ఉండండి" అంటూ హెచ్చరించారు ఆయన.

ఖురైష్ నాయకులు ముస్లిం సైనికుల వివరాలు తెలుసుకొని రమ్మని ఉమైర్‌ని పంపారు. ఉమైర్ వెళ్ళి ముస్లింల కంట పడకుండా జాగ్రత్తగా సైనికుల్ని పరిశీలించాడు. తరువాత తన సైనిక స్థావరానికి తిరిగొచ్చి ఇలా చెప్పాడు:

"ముస్లింలు మూడొందలు దాకా ఉన్నారు. వారి దగ్గర డెబ్బయి ఒంటెలు, మూడు గుర్రాలు మాత్రమే ఉన్నాయి. కాని ఖురైష్ సోదరులారా! మన వైపుకు మృత్యువు తరుముకుంటూ వస్తోంది. మదీనా ఒంటెలు మృత్యువాహనాలు. మదీనా సైనికులు పుట్టుకతోనే కరవాలం చేపట్టి రణరంగంలో ఆరితేరిన వీరయోధులు. వారు మీలా పైకి సింహగర్జనలు చేయరు. మౌనంగా ఉండి కాటేస్తారు. నామనసు ఎందుకో కీడు శంకిస్తోంది. వారిలో ఏఒక్కడూ చనిపోయినా మనలో కనీసం ఒక్కరినయినా చంపిగాని చావడు. అంతమంది మనవాళ్ళు చస్తే ఇక మనం సాధించేదేముంది? కాబట్టి ముందూ వెనుకా బాగా ఆలోచించి నిర్ణయానికి రండి."

ఖురైషీయులకు గూఢచారి ఉమైర్ చెప్పిన మాటలపై నమ్మకం కలగలేదు. వారు మరొకడ్ని పంపారు. అతను కూడ రహస్యంగా ముస్లింయోధుల్ని చూసివచ్చి ఇలా అన్నాడు:

"దైవసాక్షి! ముస్లింలు ఉమైర్ చెప్పినంతటి శక్తిమంతులు కారు. సైనికుల సంఖ్య కూడా చెప్పుకోతగినంత లేదు. కాని ఒక విషయం మాత్రం నిజం. వారంతా చావడమో, చంపడమో తేల్చుకోవడానికి వచ్చారు. ఎట్టి పరిస్థితిలోనూ వారు వెనుదిరిగి పోయేలా కన్పించడం లేదు. దాన్నిబట్టి ఇక మీరే ఆలోచించుకోండి."

ఈ మాటలు విని కొంతమంది భయంతో వణికిపోయారు. మరికొందరు వెనక్కి తిరిగి వెళ్ళిపోవడానికి నిశ్చయించుకున్నారు. అయితే సైన్యాధిపతులు ధైర్యం చెప్పి ఎలాగో నచ్చజెప్పడంతో నిలదొక్కుకున్నారు.

బదర్‌లో ఖురైష్‌సైనికులు ముందుగానే ఎత్తయిన కీలక ప్రదేశాలన్నీ ఆక్రమించుకొని ముస్లింల మీద విరుచుకుపడేందుకు సిద్ధమవుతున్నారు. ముస్లిం యోధులు బదర్‌కు చేరుకున్నారుగాని, శిబిరాలు ఇంకా వేసుకోలేదు. దైవప్రవక్త (సల్లం) అనుచరుల్ని ఉద్దేశించి "మనం ఎక్కడ విడిదిచేస్తే బాగుంటుంది?" అని అడిగారు.

"దైవప్రవక్తా! మనం కాస్త ముందుకెళ్ళి నీటి ప్రదేశాలను ఆక్రమించుకుందాం. ఆ ప్రదేశాలను గురించి, అక్కడి బావుల్ని గురించి నాకు బాగా తెలుసు. అక్కడ ఎన్నటికీ ఎండిపోని బావి కూడా ఒకటుంది. అక్కడ మనం శిబిరాలు వేసుకుందాం" అన్నారు హుబాబ్ బిన్ మున్‌జిర్ (రజి).

ఈ సలహా విని దైవప్రవక్త (సల్లం) ఆయన్ని అభినందిస్తూ వెంటనే సహచరుల్ని తీసుకొని వెళ్ళి నీటి వసతులున్న ప్రదేశాన్ని ఆక్రమించారు.

సూర్యుడు అస్తమించాడు. అరుణ రేఖలు మటుమాయమై నక్షత్రాలు ఒక దాంతో ఒకటి పోటీపడుతూ శరవేగంతో ప్రత్యక్షం కాసాగాయి. ముస్లిం యోధులు చేయవలసిన పనులన్నీ చేసిన తరువాత అందరూ నిద్రలోకి ఒరిగిపోయారు. కాస్సేపటికి అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభమయింది.

దాంతో సైనికులంతా మేల్కొన్నారు. చకచకా నేల మీద చిన్న చిన్న మళ్ళు చేసి వర్షపు నీటిని ఆపుకున్నారు. ఇసుకనేల కావడంవల్ల పొడిపొడిగా ఉన్న ఇసుకంతా పేరుకొని నేల గట్టిపడింది. ఇప్పుడు సులభంగా తిరగడానికి నేల అనుకూలంగా మారింది.

అయితే ఖురైషీయులు శిబిరాలు వేసుకున్న మట్టిప్రదేశం బురద బురదగా మారింది. వారు తమకు అనుకూలంగా ఉందనుకున్న గట్టినేల చివరకు ఇలా రోతగా తయారయింది. పైగా అది జారుతూ కాలుతీసి పెట్టాలంటే భయంగా ఉంది. అనుకోని ఈ హఠాత్పరిణామానికి శత్రువులు కంగారుపడసాగారు.

"మీరు నిర్భయంగా, నిశ్చింతగా ఉండేందుకు దేవుడు మీపై ఒకవిధమైన మైకం ఆవహింపజేసినప్పటి సందర్భం: మీ మీద షైతాన్ పడవేసిన మాలిన్యం తొలగించి మిమ్మల్ని పరిశుద్ధపరచడానికి, మీలో ధైర్యసాహసాలు జనింపజేసి మీ కాళ్ళకు స్థిరత్వం కలిగించడానికి ఆయన ఆకాశం నుండి మీమీద వర్షం కురిపించాడు." (ఖుర్ఆన్-8:11)

తెల్లవారు కావచ్చింది. వర్షం కూడా వెలిసింది. ముస్లింలు నిలువచేసుకున్న వర్షపు నీటిలో తనివితీరా స్నానాలు చేసి నూతనోత్సాహాన్ని పుంజుకున్నారు. అజాన్ పిలుపుతో అందరూ ఫజర్ నమాజ్ చేశారు. నమాజ్ ముగిసిన తరువాత కొందరు గుడారాలు వేయడంలో మునిగి పోయారు. మరికొందరు ఇతర పనులు చేయసాగారు. కొందరు దైవప్రవక్త (సల్లం)తో యుద్ధ విషయాలను గురించి ముచ్చటిస్తున్నారు.

"సోదరులారా! మన ప్రియతమ నాయకునికి ఓ ఎత్తయిన గుట్ట మీద గుడారం ఏర్పాటు చేద్దాం. అక్కడ కూర్చుంటే యుద్ధమైదానమంతా ఆయన కనుసన్నల్లో ఉంటుంది. ఎక్కడ ఏదిజరిగినా చూడటానికి, తక్షణమే తగిన ఆదేశాలు జారీచేయడానికి అనుకూలంగా ఉంటుంది. అవసరమైనప్పుడు విశ్రాంతి తీసుకోవచ్చు. ఏకాంతంగా నమాజ్ చేసుకోవడానికి కూడా బాగుంటుంది" అన్నారు సాద్ బిన్ ముఆజ్ (రజి).

సాద్ (రజి) సలహా అందరికీ నచ్చింది. ఆ తరువాత కొన్ని క్షణాల్లో అందమైన ఓ ప్రత్యేక గుడారం వెలిసింది.

దైవసందేశహరుడు (సల్లం) కొందరు అనుచరుల్ని పిలుచుకొని పోయి యుద్ధరంగం చూపిస్తూ, ఇక్కడ ఫలానా శత్రువు వధించబడతాడు; అక్కడ ఫలానా శత్రువు ప్రాణం వదుల్తాడు" అని చెప్పారు. అనుచరులు సంభ్రమాశ్చర్యాలతో చూస్తూ దేవుడు తమకీ విజయం చేకూరుస్తాడన్న అనుభూతితో పొంగిపోయారు. తరువాత దైవప్రవక్త (సల్లం) అందర్నీ సమావేశపరచి ఇలా ప్రసంగించారు:



"సోదరులారా! దేవుడు ఆదేశించిన విషయాలను పాటించమని నేను మిమ్మల్ని ఆదేశిస్తున్నాను. ఆయన నిషేధించిన విషయాలను నేను నిషేధిస్తున్నాను. ఇప్పుడు మీరు సత్యశిఖరం అధిరోహిస్తున్నారు. ఇక్కడ దైవప్రసన్నత కోసం చేసే కార్యాలే సార్థకమవుతాయి. కనుక మీరు ఎంతో నిగ్రహం పాటించాలి. దైవాగ్రహాన్ని కొనితెచ్చే ఎలాంటి పొరపాటయినా ఈరోజు మీవల్ల జరగకూడదు. దేవుడు ప్రసాదించిన గ్రంథాన్ని గట్టిగా పట్టుకోండి. మీకు చూపబడిన సూచనలను జ్ఞప్తికి తెచ్చుకోండి. మార్గభ్రష్టత్వంలో పడివున్న మీకు గౌరవప్రతిష్ఠలు ప్రసాదించిన సత్యధర్మాన్ని మరువకండి. ఈరోజు దేవుడు మీ విశ్వాసాన్ని పరీక్షించదలిచాడు. ఇలాంటి సమయంలో మీ హృదయంలో దైవభీతి తప్ప మరొకరి భీతి లేదని, ప్రాణాలయినా తెగించి పోరాడుతామని నిరూపించండి. మీపై దేవుని కరుణాకటాక్షాలు వర్షిస్తాయి."

దైవప్రవక్త (సల్లం) అమృత హితవులతో ముస్లింలలో నూతనోత్సాహం పెల్లుబికింది. ప్రతి యోధుని హృదయంలోనూ ఒకే కాంక్ష ఒకే దీక్ష, "తాము అశ్రయించిన ధర్మం కోసం చివరి రక్తబిందువు చిందేవరకు పోరాడాలి. దేవుని పుడమిపై దైవధర్మం నెలకొల్పాలి. మార్గవిహీనులు సృష్టించిన అసత్యవిధానాలు నిర్మూలించి ధర్మస్థాపన కోసం సిద్ధం కావాలి." దైవప్రవక్త (స) తన అనుచరుల్లో జనించిన ఈ ఉత్సాహం, ఉద్వేగాలు చూసి తృప్తితో నిట్టూర్చారు. అప్రయత్నంగా చేతులు జోడించి ఇలా ప్రార్థించారు:

"దేవా! ఈ ఖురైష్అవిశ్వాసులు మిడిసిపడుతూ నీదాసుల మీదికి యుద్ధం చేయడానికి వచ్చారు. నీ ధర్మాన్ని తుడిచిపెట్టేందు కంకణం కట్టుకున్నారు. నీ ప్రవక్తను చంపడానికి సిద్ధమయ్యారు. ప్రభూ! నీవు మాకు సహాయం చేస్తానని మాటిచ్చావు. నీ వాగ్దానం నెరవేర్చుకో."

"నీవు నీ ప్రభువుని వేడుకుంటున్నప్పటి సందర్భం- దానికి సమాధానంగా ఆయన "నేను మీకు సహాయంగా ఒకరి తర్వాత మరొకరు చొప్పున వేయిమంది దైవదూతల్ని పంపిస్తున్నాను" అన్నాడు. మీ మనస్సులు కుదుటపడేందుకు దేవుడీ విషయాన్ని మీకు శుభ వార్తగా తెలియజేశాడు. సహాయం ఎప్పుడు లభించినా, ఏరూపంలో లభించినా అది దేవుని దగ్గర్నుండే లభిస్తుంది. దేవుడు మహాశక్తిమంతుడు, వివేకవంతుడు." (ఖురాన్. 8:9-10)

ఎంత విచిత్ర సన్నివేశం! ఒకవైపు దైవధిక్కారులు ప్రపంచమే సర్వస్వం అని, ప్రాపంచిక వనరులే విజయసాధనకు మూలకారణమని తలచి, తమ సైనికసంఖ్య చూసుకొని విర్రవీగిపోతుంటే, మరోవైపు దైవప్రవక్త (స) అసలుజీవితం పరలోక జీవితమని, ఇహలోక వనరులు కేవలం దైవాభీష్టానికి సాధనాలు మాత్రమేనని, జయాపజయాలు దేవుని అధీనంలో ఉంటాయని విశ్వసిస్తూ చేయవలసిన ప్రయత్నాలన్నీ చేసి కూడా దేవుని కటాక్షం కోసం కన్నీటిధారలతో మొరపెట్టుకుంటున్నారు!!

ఎప్పుడు సజ్దాలోకి పోయారో తనకే తెలియదు. సజ్దాలోనే దైవాన్ని మరోసారి దీనంగా అర్థిస్తూ "దేవా! ఈరోజు ఈ కొద్దిమంది దాసులు కూడా అంతమైపోతే ఇక ప్రళయం వరకూ నిన్ను ఆరాధించే నిజమైన దాసులుండరు" అని ప్రార్థించారు.

యుద్ధం ఇంకా ప్రారంభం కాలేదు. శత్రుసైనికులు కొందరు దాహంతో ముస్లింల స్వాధీనంలో ఉన్న బావిలోని నీళ్ళు త్రాగడానికి ప్రయత్నించారు. ముస్లిం యోధులు వారిని పారదోలదలిచారు. కాని కారుణ్యమూర్తి (సల్లం) వారిని వారిస్తూ "త్రాగనివ్వండి. ఈ నీళ్ళు త్రాగిన ఏ శత్రువూ బ్రతికి బట్టకట్టలేడు" అని చెప్పారు.

హిజ్రి 2వ సంవత్సరం, రమజాన్ నెల 17వ తేది, శుక్రవారం ఉదయంవేళ. దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞతో ముస్లింయోధులు బారులు తీరి నిలబడ్డారు. దైవప్రవక్త (సల్లం) చేతిలో బాణం తీసుకొని పంక్తులు సరిచేస్తూ తగిన ఆదేశాలు ఇస్తున్నారు. యోధులు పూర్తిగా సర్దుకొని బారులు తీరి యుద్ధానికి సిద్ధంగా నిలబడ్డారు.

రెండు పక్షాలు ముందుకొచ్చి పరస్పరం ఎదురెదురుగా నిల్చున్నాయి. దాంతో సమరాగ్ని రగులుకొన్నది.

అబూజహల్ వికటాట్టహాసంచేస్తూ "ఆమిర్! అదిగో నీ సోదరుని రక్త పరిహారం నీ ఎదుటకు వచ్చింది. లే, లేచి నీజాతిని ఉద్రేకపరచు" అని ఆజ్ఞాపించాడు.

ఆమిర్ బిన్ హజ్రమి రంగంలోకి దిగి ముస్లింలకు సవాలుచేస్తూ ద్వంద్వ యుద్ధానికి ఆహ్వానించాడు. అతనికి పోటీగా హజ్రత్ ఉమర్ (రజి) బానిస మిహ్జా (రజి) ముందుకు వచ్చారు. ఆమిర్ మెరుపు వేగంతో లంఘించి మిహ్జా (రజి) మీద ఒక్క వ్రేటు వేశాడు. దాంతో ఆయన అల్లాహు అక్బర్ అంటూ నేలకొరిగారు.

ప్రారంభంలోనే తమ యోధుడు ముస్లిం సైనికుడ్ని ఓడించినందున తమ విజయానికి ఇది శుభసూచకమని, శుభారంభమని తలచి మురిసిపోయారు ఖురైషీయులు.

ఆ తరువాత ఉత్బా గుండెలు విరుచుకుంటూ ముందుకు వచ్చాడు. అతనితో పాటు అతని తమ్ముడు షైబా, కొడుకు వలీద్ కూడా రంగంలోకి దిగారు. వారికి పోటీగా ముస్లిం పక్షం నుంచి ముగ్గురు అన్సార్ యువకులు వచ్చారు. అయితే ఉత్బా "మీతో యుద్ధం చేయవలసిన అవసరంలేదు మాకు" అని చెప్పి దైవప్రవక్త (సల్లం) వైపు తిరిగి "ముహమ్మద్! వీరు మాకు సరిజోడులు కాదు. మాకు సమఉజ్జీలుగా మా జాతివారయిన ముహాజిర్లను పంపించు" అన్నాడు గర్వంగా.

దైవప్రవక్త (సల్లం) అన్సారులను చూసి, ఇది ఇస్లాం-కుఫర్‌ల మధ్య జరుగుతున్న మొదటి యుద్ధం కనుక ఈ యుద్ధంలో ముందుగా అన్సారులను బలిచేయడం భావ్యం కాదని అన్నారు. అందువల్ల ఆయన ముహాజిర్లను ఉద్దేశించి ఇలా అన్నారు:

"హాషిం పుత్రులారా! మీరంతా సత్యదీపికను ఆర్పి అధర్మాన్ని అందలమెక్కించడానికి వచ్చారు. ముందుకు రండి. మీ ప్రవక్త తెచ్చిన దైవధర్మం కోసం శత్రువుల్ని ఎదుర్కోండి."

దైవప్రవక్త (సల్లం) ఆదేశం వినగానే హజ్రత్ అలి (రజి), హమ్జా (రజి), ఉబైదా (రజి) కదనరంగంలోకి కాలుపెట్టారు. మొదట ఉత్బా కొడుకు వలీద్ ముందుకొచ్చాడు. అప్పుడు హజ్రత్ అలి(రజి) ఒక్కసారిగా వలీద్ మీదికి లంఘించి క్షణంలో అతడ్ని మట్టు పెట్టారు. తరువాత ఉత్బా రంకెలు వేసుకుంటూ వచ్చాడు. అతని మీదికి హజ్రత్ హమ్జా (రజి) సింహకిషోరంలా దుమికి హతమార్చివేశారు.



ఆ తరువాత షైబా పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ రంగప్రవేశం చేశాడు. అతడ్ని ఎదుర్కోవడానికి హజ్రత్ ఉబైదా(రజి) వచ్చారు. ఇద్దరు కాస్సేపు భీకరంగా పోరాడారు. కాని హజ్రత్ ఉబైదా (రజి)ను శత్రువు తీవ్రంగా గాయపరిచాడు. ఒకకాలు కూడా తెగిపోయింది. ఈ పరిస్థితి చూసి హజ్రత్ హమ్జా (రజి) వెంటనే రంగంలోకి దూకి షైబాను ఒకేఒక వ్రేటుతో కడతేర్చారు.

అటు ఖురైష్ సైన్యం నుంచి ఉబైదా బిన్ సయీద్ గాండ్రిస్తూ రంగంలోకి దూకాడు. అతడ్ని ఎదుర్కోవడానికి ముస్లింల నుంచి హజ్రత్ జుబైర్ (రజి) వచ్చారు. ఉబైదా శరీరమంతా ఇనుప కవచంతో కప్పబడివుంది. ఒక కన్ను మాత్రమే కన్పిస్తోంది. జుబైర్ (రజి) ఉబైదాను ఓసారి ఆపాదమస్తకం పరికించి చూశారు. ఆ వెనువెంటనే కంటికి గురిచూసి చేతిలోని బల్లెం పైకెత్తి బలంగా విసిరికొట్టారు. ఆ దెబ్బకు అతను గిలగిల కొట్టుకొని ఊపిరి వదిలాడు. ఇలా ద్వంద్వయుద్ధం సమాప్తమయింది.

ఆ తర్వాత ఉభయపక్షాల మధ్య యుద్ధం మొదలైంది. ఇరుపక్ష సైనికులు హోరా హోరిగా పోరాడుతున్నారు. దైవప్రవక్త (స) ముస్లింలకు సమయానుకూలంగా తగిన ఆదేశాలిస్తూ సమరదృశ్యం వీక్షిస్తున్నారు. ఆయన తన అనుచరుల్ని ఉద్దేశించి "బహుదైవా రాధకుల వెంటవచ్చిన హాషింసంతతివాళ్ళు మనస్ఫూర్తిగా యుద్ధానికి రాలేదు. గత్యంతరం లేక రావలసివచ్చింది. అంచేత వారితో చూసీచూడనట్లు యుద్ధం చేయండి" అని చెప్పారు.

మదీనా నుండి కొందరు బహుదైవారాధకులు యుద్ధం తీరు చూడటానికి యుద్ధ మైదానికి వచ్చారు. వారు బద్ర్‌కొండ మీద నిలబడి చూడసాగారు. యుద్ధం హోరాహోరిగా జరుగుతోంది. కాస్సేపటికి ఆకాశంలో వారి పైనుండి ఒక మబ్బుతునక గుర్రాల సకి లింపులు, గిట్టలచప్పుళ్ళతో రివ్వున యుద్ధమైదానం వైపు దూసుకుపోయింది. అందులో నుండి "తొందరగా ముందుకు సాగండి" అనే ఓ కంఠస్వరం విన్పించింది.

ఈ విచిత్రధ్వనులు విని బహుదైవారాధకులు తీవ్రమైన భయంతో కంపించిపోయారు. వారిలో ఒకడు ఆ భయంతోనే నిలువుగుడ్లు వేసి అక్కడికక్కడే ఊపిరి విడిచాడు. ఆ తరువాత మిగిలిన వాళ్ళు అక్కడ్నుంచి మదీనా వైపు పరుగెత్తారు.

పగ, కసి, ద్వేషం అంతా కక్కుతూ భయంకరంగా పోరాడుతున్నారు ఖురైష్ వీరులు. ఆశయసాధనే ధ్యేయంగా తలచి ముస్లింవీరులు కొంగ్రొత్త ఉత్సాహంతో, దైవిక బలంతో, అత్యంత ధైర్యసాహసాలతో శత్రువులను ఎదుర్కొంటున్నారు.

యుద్ధం తారస్థాయికి చేరింది. దైవప్రవక్త (సల్లం) అనుచరుల్ని మరింత ఉత్తేజ పరుస్తూ "భూమ్యాకాశాలంతటి విశాలమైన స్వర్గసీమ వైపు పురోగమించండి" అన్నారు బిగ్గరగా. దాంతో అనుచరుల ఉత్సాహం ద్విగుణీకృతమయింది. శక్తినంతటినీ కూడగట్టు కొని రణరంగంలో స్వైరవిహారం చేయసాగారు.

ఉమైర్ బిన్ హుమామ్ (రజి) స్వర్గ శుభవార్త విని సంతోషంతో గంతులేయసాగారు. "ఆహా! అదిగో స్వర్గం సమీపిస్తోంది. ఇంకెంత సేపు స్వర్గంలో ప్రవేశించడానికి? శత్రువులు నన్ను వధించేటంతటి వ్యవధి మాత్రమే ఉంది" అన్నారు స్వగతంలో.

ఆ సమయంలో ఆయన ఖర్జూరం తింటున్నారు. కాని స్వర్గ సౌరభం ఆఘ్రాణించిన తర్వాత ఖర్జూరపండులో ఏం రుచి ఉంటుంది? అంచేత వెంటనే ఆయన చేతిలో మిగిలిన ఖర్జూరపండ్లను విసిరిపారేసి శత్రుసైన్యంలోకి తుఫానులా దూసుకుపోయారు. కాస్సేపు సాహసోపేతంగా పోరాడి చివరికి నేలకొరిగారు.

యుద్ధం భీకరంగా జరుగుతోంది. నఖశిఖ పర్యంతం ఉక్కు కవచం ధరించిన అబూజహల్ గాండ్రిస్తూ పోరాడుతున్నాడు. కాని ఆంతర్యంలో దాగిన ప్రాణభీతి అతడ్ని ముస్లింల ముందు స్థిరంగా నిలబడనీయడంలేదు. దాగుడుమూతలాడుతూ చాటు నుంచి యుద్ధం చేస్తున్నాడు.

ఒక అన్సార్ కిశోరం ముఆజ్ బిన్ అమ్ర్ (రజి) ఎలాగైనా అతడ్ని హతమార్చాలని తలచారు. జాగ్రత్తగా చూస్తే అబూజహల్ కాళ్ళ మీద కవచం లేనట్లు కన్పించింది. ముఆజ్ (రజి) అతడ్ని వెన్నంటి అవకాశం చూసి కాళ్ళ మీద ఒకేఒక వ్రేటు వేశారు. ఆ దెబ్బకు అబూజహల్ కాలు తెగి అవతల పడిపోయింది.

ఈ పరిస్థితి చూసి అతని పుత్రరత్నం ఇక్రమా వెంటనే ముఆజ్ (రజి)ను ఎదుర్కొని ఖడ్గంతో బలమైన దెబ్బవేశాడు. దాంతో ముఆజ్ (రజి) ఎడమచేయి తెగి వ్రేలాడింది. అయినప్పటికీ దాన్ని ఖాతరు చేయకుండా ఇక్రమాతో పోరాడుతున్నారు.

అంతలో మరో యువకుడు మఊజ్ (రజి) ఆయనకు సహాయపడేందుకు వచ్చారు. బాధ అధికం కావడంతో ముఆజ్ (రజి) వ్రేలాడుతున్న చేతిని కాలిక్రింద తొక్కిపట్టి బలంగా లాగి వేరుచేశారు. ఒంటిచేత్తోనే శత్రువుని ఎదుర్కొంటున్నారు ఆయన.

రెండవ యువకుడు మఊజ్ (రజి) వీలుచూసి అబూజహల్ మీద బలమైన దెబ్బ వేశారు. ఆ దెబ్బకు అబూజహల్ తుమ్మమొద్దులా దభేలున నేలమీద పడిపోయాడు. అతని కొడుకు ఇక్రమా భీతావహంతో పిక్కబలంకొద్దీ అక్కడ్నుంచి పారిపోయాడు.

అస్వద్ బిన్ అబుల్అస్వద్ వగరుస్తూ ముస్లిం శిబిరాల వైపు వస్తున్నాడు. "దైవసాక్షి! నేను ముస్లింల ఆక్రమణలోఉన్న బావి నీరు తాగితీరుతా. లేదా దాన్ని పాడైనా చేస్తా. లేకపోతే నా జీవితమే నిరర్థకం" అని ప్రతిజ్ఞ చేసి బావి వైపు పరుగెత్తాడు.

బావి దగ్గర నిలబడివున్న హజ్రత్ హమ్జా (రజి) మెరుపు వేగంతో అతడ్ని ఢీకొని ఒక్క వ్రేటు వేశారు. దాంతో అస్వద్ కాలు తెగిపోయింది. అయినా అతను పట్టు విడువకుండా బరబర ప్రాకుతూ బావి దగ్గరకు చేరుకున్నాడు. అంతేకాదు, గుక్కెడు నీళ్ళు త్రాగడం, ఆ తర్వాత దాన్ని పాడుచేయడం కూడా జరిగిపోయాయి. హజ్రత్ హమ్జా (రజి) ముందుకెళ్ళి మరొకవ్రేటు వేశారు. దాంతో అస్వద్ ఊపిరి విడిచాడు.

పెద్దపెద్ద నాయకులతో సహా ఖురైష్సైనికులు అనేకమంది వధించబడ్డారు. కొంత మంది ఖైదీలుగా పట్టుబడ్డారు. మిగిలినవారు ముస్లింయోధుల ధాటికి నిలువలేక కొనఊపిరితో పడివున్న తమ నాయకుడ్ని సైతం వదిలేసి సత్తువకొద్దీ కాలికి బుద్ధి చెప్పారు.

విజయం ముస్లిం యోధుల్ని వరించింది. మహాప్రవక్త (సల్లం) కృతజ్ఞతా భావంతో దేవుని సన్నిధిలో సాష్టాంగపడ్డారు. ధర్మం గెలిచింది. అధర్మం పలాయనం చిత్తగించింది.



ఆయుధాలు పుష్కలంగాఉన్నా, అత్యధిక సైనికబలమున్నా అవిశ్వాసులు డెబ్భయి మందికి పైగానే వధించబడ్డారు. మరో డెబ్భయి మంది ఖైదీలుగా పట్టుబడ్డారు. కాని సరైన ఆయుధాలు, కావలసినన్ని ఒనరులు, తగిన సదుపాయాలు లేకపోయినా దైవం మీద చెక్కుచెదరని విశ్వాసంతో వచ్చిన ముస్లింయోధుల్లో పధ్నాలుగు మంది మాత్రమే వీరమరణం పొందారు.

అబూజహల్ ఒకచోట కొనఊపిరితో మూలుగుతున్నాడు. అతను తన దగ్గరకు అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి) రావడం చూసి "యుద్ధ పర్యవసానం ఏమిటీ?" అని అడిగాడు హీనస్వరంతో.

"ముస్లింలు విజయం సాధించారు. నీ సైనికులు పారిపోయారు" అన్నారు అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి). తర్వాత ఆయన అబూజహల్ తల నరకడానికి ఖడ్గం పైకెత్తారు.

అబూజహల్ ఆయన్ని వారిస్తూ "ఆగాగు. నరకబడిన మా సైనికుల తలల మధ్య నా తల విశేషంగా కన్పించేలా, చూసేవారికి ఇది వారినాయకుని శిరస్సు అన్నట్లు అగపడే విధంగా నా మెడ క్రిందిభాగంతో కలిపి నరుకు" అన్నాడు ఇంత అవమానం జరిగినా అహంకారాన్ని వదలుకోలేక!

హజ్రత్ అబ్దుల్లా (రజి) అతని మాటలు పట్టించుకోకుండా బరబర శిరస్సు ఖండించి దైవప్రవక్త (సల్లం) దగ్గరకు వచ్చారు. దైవప్రవక్త (సల్లం) మరణించిన ఖురైష్ నాయకుల్లో ప్రతి ఒక్కర్ని పేరెత్తి పిలిచి ఇలా అన్నారు:

> "ఎంత దుర్మార్గపు బంధువులు మీరు! నాకు నా ప్రభువు చేసిన వాగ్దానం నెరవేరింది. మీరు కూడా ఆ ప్రభువు చేసిన వాగ్దానం నెరవేరిందని ఇప్పుడైనా తెలుసుకున్నారా? మీరు నావారై వుండి కూడా నన్ను అసత్యవాదిగా భావించారు. కాని ఇతరులు నన్ను సత్యవాదిగా విశ్వసించారు. మీరు నన్ను స్వస్థలం నుంచి వెడలగొట్టారు. పరులు నాకు ఆశ్రయమిచ్చారు. మీరు నాకు వ్యతిరేకంగా యుద్ధానికి తలపడ్డారు. ఇతరులు నన్ను ఆదుకున్నారు."

దైవప్రవక్త (సల్లం) మృత సైనికుల్ని సంబోధించి మాట్లాడుతుంటే అనుచరులకు ఆశ్చర్యం వేసింది. "దైవప్రవక్తా! మరణించినవారితో మాట్లాడుతున్నారేమిటీ మీరు?" అని అడిగారు వారు కుతూహలంతో.

"ఔను, ఇప్పుడు వారికి తెలిసొచ్చింది దేవుని వాగ్దానం నిజమని" అన్నారు ఆయన.

మృత సైనికుల అంత్యక్రియలు పూర్తి అయ్యాక, విజయవార్త తెలియజేయడానికి దైవప్రవక్త (స) ఇద్దరు యోధులను మదీనా పంపించారు. వీరిద్దరు వేగంగా మదీనా చేరుకున్నారు. కాని అక్కడ ప్రజావాహిని మూగబోయినట్లు కన్పించింది. దైవప్రవక్త (సల్లం) ప్రియకుమార్తె, ఉస్మాన్ (రజి) ధర్మపత్ని రుఖియా (రజి) మరణం మదీనాపై మౌనముద్ర వేసింది. ఆ సాధ్వీమణిని ఖననంచేసే సమయంలో ఈ విజయవార్త అందింది. అప్పుడు విచారంతో ఉన్న ముస్లింల ముఖాలలో కాంతిరేఖలు తొణికిసలాడాయి.

# సమరసొత్తు, ఖైదీల సమస్య-(84)

బదర్ నుంచి ముస్లింయోధులు విజయోత్సాహంతో తిరుగు ప్రయాణమయ్యారు. దారిలో సుఫ్రా అనే చోట మజిలీ చేశారు. అక్కడే దైవప్రవక్త (సల్లం) సమరసొత్తు (మాలె గనీమత్)ని సైనికుల్లో పంచాలని సంకల్పించారు.

కాని సైనికుల్లో విభేదాలు వచ్చాయి. తొలిసారిగా జిహాద్‌లో పాల్గొనడం వల్ల సమరసొత్తు పంపిణీ గురించిన విధానం ఏమిటో వారికింకా తెలియదు. ఇప్పుడిప్పుడే ఇస్లాం పాలనావ్యవస్థ పునాదులు ఏర్పడుతున్నాయి. అనేకవ్యవహారాల్లో ప్రాచీన సాంప్రదాయిక భావాలు ముస్లింల హృదయాల నుంచి ఇంకా సమసిపోలేదు. మూఢకాలంలో ఒక్కోసారి పంపిణీ కుదరక అంతర్యుద్ధాలు కూడా సంభవించేవి. దైవధర్మం ఎంత విస్తృతమైందో ఏఏ రంగాల్లో ఇంకా దైవశాసనాలు అవతరించనున్నాయో ఊహించలేని ముస్లింలు ఎవరికివారు తామంటేతామే నిజమైన హక్కుదారులమని అపోహపడసాగారు.

దైవప్రవక్త (సల్లం) వివాదగ్రస్తమైన వారి మాటలు వింటూ సత్వర పరిష్కార మార్గం ఆలోచించసాగారు. సాద్ బిన్ ముఆజ్ (రజి)కు కూడ ఇదంతా అగమ్యగోచరంగా అన్పించి "దైవప్రవక్తా! బలహీనులకు వచ్చినంత భాగమేనా వీరయోధులక్కూడా వచ్చేది?" అని అడిగారు అమాయకంగా.

"అసలు బలహీనుల మూలంగానే కదా దేవునిసహాయం వచ్చేది!" అన్నారు దైవప్రవక్త (సల్లం) చిరునవ్వు నవ్వుతూ.

అంతలో దైవదూత జిబ్రీల్ (అలైహి) దైవసందేశం మోసుకొచ్చారు:

"ముహమ్మద్! వారు నిన్ను సమరసొత్తు గురించి అడుగుతున్నారు. వారికిలా చెప్పు, ఈ సమరసొత్తు దేవునికి, ఆయన ప్రవక్తకు మాత్రమే చెందుతుంది. కనుక మీరు నిజమైన విశ్వాసులైతే (ముందు) దేవునికి భయపడి మీ పరస్పర సంబంధాలు మెరుగు పరచుకోండి. దేవునికి, ఆయన ప్రవక్తకు పూర్తిగా విధేయులయి మసలుకోండి." (ఖుర్‌ఆన్-8:1)

"మీకు లభించిన సమరసొత్తులో అయిదో వంతు దేవునికి, ఆయన ప్రవక్తకు, బంధువులకు, అనాథబాలలకు, నిరుపేదలకు, బాటసారులకు చెందినదని తెలుసుకోండి. మీరు దేవుణ్ని, (సత్యాసత్యాలను) వేరుచేసిన రోజు, అంటే రెండుసైన్యాలు పరస్పరం ఢీకొన్న రోజు మేము మా దాసునిపై అవతరింపజేసినదాన్ని విశ్వసించిన వారయితే (ఈ అయిదోవంతు సమరసొత్తు సంతోషంగా ఇచ్చేయండి)." (ఖుర్‌ఆన్-8:41)

అప్పుడు దైవప్రవక్త (సల్లం) అందరికీ ఈ సందేశం విన్పించారు. ఆ తరువాత అందరికీ ఆమోదయోగ్యంగా, న్యాయసమ్మతంగా సమరసొత్తును సైనికుల్లో విభజించారు. ఆయన చూపిన న్యాయవైఖరికి అందరూ హర్షించారు.

ఆ తరువాత ముస్లింలు విజయోత్సాహంతో మదీనాలో ప్రవేశించారు. ఈ శుభవార్త తెలిసిన ప్రజావాహిని ఆనందాతిశయంతో పరవళ్ళుతొక్కింది. బాలబాలికలు సంతోషంతో గంతులేస్తూ వీధుల్లోకి వచ్చారు. సర్వత్రా ఆనందకుసుమాలు వెల్లివిరిశాయి.



మరుసటి రోజు దైవప్రవక్త (స) ఆదేశం ప్రకారం యుద్ధ ఖైదీలను మస్జిదెనబవీ స్తంభాలకు కట్టివేశారు. అప్పటికి చీకటి పడటం వల్ల వారి దగ్గర కాపలా కోసం కొందరు సైనికులు ఉండి మిగిలినవారంతా ఇండ్లకు వెళ్ళిపోయారు. దైవప్రవక్త (స) కూడా ఆ రాత్రి ఇషా నమాజ్ ముగించుకొని నిద్రకు ఉపక్రమించారు.

నడిరేయి దాటింది. యుద్ధఖైదీలున్న చోటు నుంచి మూల్గుడు విన్పించడంతో అక్కడ సమీపంలోనే నిద్రపోతున్న దైవప్రవక్త (స) మేల్కొన్నారు. పోయి చూస్తే, బిగువుగా కట్టిన త్రాళ్ళ వల్ల యుద్ధ ఖైదీలు బాధతో మూలుగుతున్నారు. కారుణ్యమూర్తి (సల్లం) హృదయం కరిగిపోయింది. అలా బాధపడుతున్న వారిలో పినతండ్రి అబ్బాస్ కూడా ఉన్నారు. సహజమైన బంధుప్రేమ పెల్లుబికింది. ఆయన పినతండ్రి వైపు జాలిగా చూశారు. దైవప్రవక్త (స) పరిస్థితి అర్థంచేసుకున్న అనుచరులు వెంటనే అబ్బాస్ కట్లు వదులుచేశారు. అప్పుడు దైవప్రవక్త (స) అందరి కట్లు కూడా వదులుచేయమని అన్నారు. అనుచరులు ఖైదీలందరి కట్లు వదులుచేసి ప్రశాంతంగా పడుకోవడానికి వీలుకల్పించారు. దాంతో కారుణ్యమూర్తి (సల్లం) హృదయం కుదుటపడింది.

తెల్లవారింది. దైవప్రవక్త (సల్లం) యోధులను పిలిచి తాత్కాలికంగా ఖైదీలను తమ అధీనంలో ఉంచుకోమని చెప్పారు. యుద్ధఖైదీలు గెలిచిన యోధుల అధీనంలో బానిసలుగా ఉండటం అనేది పూర్వం నుంచీ వస్తున్న ఆచారం. అయితే ఖైదీల పట్ల సద్వర్తనంతో మెలగాలని దైవాదేశం.

దాని ప్రకారం ఇస్లాం వాసన అంటేనే గిట్టని పరమ దుర్మార్గులయినా, ఇంతకు ముందు అష్టకష్టాలు పెట్టి జన్మభూమి నుంచి వెడలగొట్టిన వారైనా గతాన్ని త్రవ్వకుండా యుద్ధఖైదీల పట్ల మృదువుగా వ్యవహరించాలని మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) అనుచరులకు హితవుచేశారు. వారికి ఆహార, వస్త్రాలలోటు రానీయకుండా చూడాలని, జబ్బు పడితే చికిత్స చేయించాలని, ఇతర ముఖ్యావసరాలు కూడా స్తోమతను బట్టి తీర్చాలని నొక్కి చెప్పారు.

దైవప్రవక్త (స) ఆదేశాలు శిరసావహించడం కంటే ముస్లింలకు కావల్సిన పుణ్యం ఏముంటుంది? అందరూ సంతోషంగా తమతమ ఖైదీలను తీసుకొని వెళ్ళిపోయారు.

ఖైదీలలో కొందరు ముస్లింల బంధువులు కూడా ఉన్నారు. కాని వారి బంధుప్రేమ ఇస్లాం మీదున్న అభిమానాన్ని సడలించలేకపోయింది. ఒక యోధునికి అబూఅజీజ్ అనే ఖైదీ స్వాధీనం చేయబడ్డాడు. అతని సోదరుడు ముస్లింగా మారి మదీనాలో ఉంటున్నాడు.

అబూఅజీజ్ అన్న అక్కడికి వచ్చి "ఈ ఖైదీపై గట్టి నిఘావేసి ఉంచండి. అవసరమైతే వత్తిడి కూడా చేయండి. ఇతని తల్లి గొప్ప ధనికురాలు. నష్టపరిహారం రూపంలో మీకు చాలా పైకం లభిస్తుంది" అన్నాడు అన్సార్ యోధునితో.

అబూఅజీజ్ విస్తుబోయాడు. "అన్నయ్యా! నీవు నా సొంత సోదరుడయివుండి కూడా నా పట్ల చూపే ఆపేక్ష ఇదేనా?" అన్నాడు అన్న వైపు కొరకొర చూస్తూ.

కాని ఆ అన్సార్‌యోధుడు అలా చేయలేదు. అబూఅజీజ్‌ని తనకంటే కూడా మిన్నగా చూసుకోసాగాడు. ఒక్కోసారి ఇంట్లో భోజనం సరిపడకపోతే తను ఖర్జూరపండ్లు తిని ఖైదీకి తృప్తిగా భోజనం పెట్టేవాడు. ఖైదీగా వచ్చిన అబూఅజీజ్ తన యజమాని కన్నా ఎక్కువ సుఖం అనుభవిస్తున్నాడు. యజమాని చూపుతున్న అసామాన్య ఔదార్యం, మంచితనాలు చూసి అతను సిగ్గుపడి పోయేవాడు.

ఆ మాటకు వస్తే ఆ ఒక్క అన్సార్‌యోధుడే కాదు, బదర్ యుద్ధవీరులంతా తమ తమ అధీనంలో ఉన్న ఖైదీల పట్ల అదేవిధంగా సద్భావంతో మెలుగుతున్నారు.

ఖైదీలుగా పట్టుబడినవారిలో సుహైల్ బిన్ అహ్ అనే నాయకుడు కూడా ఉన్నాడు. అతను దైవప్రవక్త (సల్లం)కు బద్ధవిరోధి. అతని విషయంలో కొందరు "దైవప్రవక్తా! ఇతను గొప్ప వాగ్ధాటికల వక్త. ఇతను తన వాగ్ధాటితో మీకు వ్యతిరేకంగా ఉద్రేకపూరితమైన ఉపన్యాసాలు చేస్తూ జనాన్ని రెచ్చగొడ్తుండేవాడు. అంచేత ఇతని పళ్ళు రాలగొట్టండి" అని సలహా ఇచ్చారు.

కాని మానవాళిపై కరుణామృతం చిలికించడానికి ప్రభవించిన కారుణ్యమూర్తి (స) అలా చేయగలరా? "తప్పు. నేను దైవసందేశహరుణ్ణయి ఉండికూడా అతని పళ్ళు రాలగొడ్తే దేవుడు నాపళ్ళు రాలగొడ్తాడు" అని సమాధానమిచ్చారు ఆయన.

ఆ తరువాత కొన్నాళ్ళకు దైవప్రవక్త (స) ఖైదీల సమస్యను గురించి చర్చించడానికి అనుచరులను సమావేశపరిచారు. ఖైదీలపై ఎలాంటి చర్య తీసుకోవాలో చెప్పమని వారి అభిప్రాయాలు అడిగారు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) ఇలా అన్నారు:

"వీరు దైవవిరోధులు. దైవధర్మాన్ని అంతమొందించదలచుకున్న పరమదుర్మార్గులు. మిమ్మల్ని అనేకసార్లు చంపడానికి ప్రయత్నించారు ఇలాంటి నీచుల్ని వదలి పెట్టకూడదు. వీరందర్నీ వధించాలి. మనలో ఎవరు ఏ ఖైదీల బంధువులో వారే ఆ ఖైదీలను వధించాలి. దానివల్ల మన హృదయంలో బంధుప్రేమ కంటే దేవుని, దైవప్రవక్తల ప్రేమే అధికమని, దైవధర్మం ముందు సమస్త బాంధవ్యాలు బలదూర్ అని అవిశ్వాసులు తెలుసుకుంటారు."

తరువాత హజ్రత్ అబూబకర్ (రజి) తన అభిప్రాయం ఇలా వ్యక్తపరిచారు:

"దైవప్రవక్తా! నష్టపరిహారం తీసుకొని వదలిపెడ్తే మంచిదని నా అభిప్రాయం. ఇలా చేయడంవల్ల ఒకవైపు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నిరుపేద ముస్లింలకు ధన సహాయం అందించినట్లూ ఉంటుంది. మరోవైపు దైవానుగ్రహమయితే మనసు మారి ఖైదీలు ఇస్లాం స్వీకరించనూవచ్చు."

ఇలా అనేకమంది తమతమ అభిప్రాయాలు వెలిబుచ్చారు. కాని దైవప్రవక్త (సల్లం)కు అబూబకర్ (రజి) అభిప్రాయమే నచ్చింది. దాని ప్రకారమే అమలు జరపడానికి నిశ్చయించారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని ఖైదీల బంధువులకు తెలియజేశారు.

మక్కానుంచి ఖురైషీయులు తమ బంధువుల్ని విడిపించుకోడానికి మదీనా వచ్చారు. దైవప్రవక్త (సల్లం) ఒక్కొక్క ఖైదీ నుంచి వేయి నుంచి నాలుగువేల దిర్హమ్‌లదాకా వారి వారి స్తోమతను బట్టి నష్టపరిహారం వసూలుచేసి బంధవిముక్తుల్ని గావించారు.



"దేశంలో శత్రువుల్ని పూర్తిగా అణచివేయనంత వరకు ఖైదీలను తన అధీనంలో ఉంచుకోవడం ఏ దైవప్రవక్తకూ శోభించదు. మీరు ప్రాపంచిక ప్రయోజనాలు ఆశిస్తున్నారు. కాని దేవుని దృష్టిలో పరలోక ప్రయోజనాలే ఎంతో విలువైనవి. ఆయన అపార శక్తిసంపన్నుడు, అత్యంత వివేకవంతుడు. దేవుడు (మీ అదృష్టంలో) ముందే రాసి ఉండకపోతే, మీరు (ఖైదీల విడుదల కోసం) తీసుకున్నదానికి ఆయన మిమ్మల్ని కఠినంగా శిక్షించేవాడు. సరే, మీరు పొందిన ధనాన్ని (నిస్సంకోచంగా) అనుభవించండి. అది ధర్మసమ్మతమైనది, పరి శుద్ధమయినది. దేవునికి భయపడుతూ ఉండండి. దేవుడు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు." (ఖుర్ఆన్–8:67–69)

అయితే నష్టపరిహారం చెల్లించలేని పేదఖైదీలు కొందరున్నారు. వారిని విడిపించడా నికి ఏబంధువూ లేడు. కాని వారిలో చదవను, వ్రాయను వచ్చినవారు కూడా ఉన్నారు. అలాంటివారి బంధవిముక్తి కోసం దైవప్రవక్త (స) మార్గాన్వేషణ చేశారు. ఒక్కొక్కడు పదేసి ముస్లిం బాలబాలికలకు చదవడం, వ్రాయడం నేర్పి విముక్తి పొందవచ్చని ప్రకటిం చారు. చదువురాని పేద ఖైదీలను నష్టపరిహారం లేకుండానే విడిచిపెట్టారు.

దైవప్రవక్త (స) ఖైదీల పట్ల కనబరచిన ఈ ఔదార్యం, సద్ప్రవర్తనలు చూసి అవిశ్వా సులు ఆశ్చర్యపోయారు. అంతేకాదు, ఆయన ప్రత్యుపకార భావం కూడా ప్రజలను ఎంతో ప్రభావితం చేసింది. గతంతో ఒకసారి ఆయన తాయిఫ్ నుండి మక్కా తిరిగొచ్చి నగరంలో ప్రవేశించబోతుంటే మక్కా ఖురైషీయులు ఆయన్ని అడ్డగించ ప్రయత్నించారు. అప్పుడు ముత్‌యిమ్ బిన్ అదీ దైవప్రవక్త (స)కు ఆశ్రయమిచ్చాడు. దైవప్రవక్త (స) ఆ విషయం గుర్తుచేస్తూ "ఇప్పటిదాకా ముత్‌యిమ్ బ్రతికి ఉండి, ఇక్కడ నిర్బంధించబడిన ఖైదీల విషయమయి అతను నాతో మాట్లాడితే నేను ఖైదీలను నష్టపరిహారం తీసుకో కుండానే వదలిపెట్టేవాడ్ని" అని అన్నారు.

బదర్ ఓటమి తర్వాత ఖురైష్ నాయకుల్లో కొందరు అవమాన భారంతో క్రుంగిపోతే, మరికొందరిలో పగ మరోసారి పడగవిప్పింది. వారిలో సఫ్వాన్ ఒకడు. బద్ర్‌యుద్ధంలో అతని తండ్రి, సోదరుడు చనిపోయారు. అంచేత అతను ఉమైర్ బిన్ వహబ్ అనే స్నేహి తుడికి బాగా నూరిపోసి దైవప్రవక్త (స)ను చంపిరమ్మని మదీనా పంపించాడు.

వెంటనే ఉమైర్ బిన్ వహబ్ ఖడ్గం తీసుకొని మక్కా నుండి బయలుదేరాడు. మదీనా చేరుకొని నేరుగా మస్జిదెనబవి (ప్రవక్త మసీదు)కు వెళ్ళాడు. మసీదులో దైవప్రవక్త (సల్లం), ఆయన అనుచరులు కూర్చొనిఉన్నారు. కొందరు అనుచరులు అటూ ఇటూ తిరుగుతున్నారు. ఉమైర్ మసీదులో ప్రవేశించిన కాస్సేపటికే అతని వాలకం చూసి హజ్రత్ ఉమర్ (రజి)కు అనుమానం వచ్చింది. వెంటనే ఆయన ఉమైర్‌ని ఒడిసి పట్టుకొని అతని దగ్గరున్న ఖడ్గాన్ని లాక్కున్నారు. ఆ తరువాత అతడ్ని లాక్కెళ్ళి దైవప్రవక్త (స) సన్నిధిలో ప్రవేశపెట్టారు.

దైవప్రవక్త (సల్లం) ఓసారి ఆగంతకుడ్ని ఎగాదిగా చూసి "ఉమర్! అతడ్ని వదలిపెట్టు" అని ఆదేశించారు. హజ్రత్ ఉమర్ (రజి) అతడ్ని వదలిపెట్టారు.

“ఉమైర్! నువ్విక్కడికి ఏ ఉద్దేశ్యంతో వచ్చావు?” అడిగారు దైవప్రవక్త (సల్లం).

“నా కొడుకు మీదగ్గర యుద్ధ ఖైదీగా ఉన్నాడు. అతడ్ని విడిపించుకోవడానికి వచ్చాను. మీరు కనికరించి నా కొడుకును విడుదలచేస్తే మీ మేలు ఎన్నటికీ మరచిపోను” అన్నాడు ఉమైర్ బెదురు చూపులతో.

“నువ్వు అసలువిషయం ఎందుకు చెప్పవూ? సఫ్వాన్ నన్ను చంపించడానికి నిన్ను ఒప్పించి పంపాడు. మీరిద్దరు కాబాలో కూర్చొని ఈ పథకం రూపొందించారు. ఎవరైనా నీ అప్పులు తీర్చగల్గితే నువ్వు నన్ను చంపుతానని అన్నావు. అప్పుడు సఫ్వాన్ నన్ను నువ్వు చంపితే నీ అప్పులు తీర్చుతానని వాగ్దానం చేశాడు” అంటూ దైవప్రవక్త (సల్లం) వాళ్ళిద్దరి రహస్యపథకాన్ని బట్టబయలుచేశారు.

ఉమైర్ ఈ మాటలు విని కొయ్యబారిపోయాడు. నోరు తెరచి దైవప్రవక్త (స) వైపు తదేకంగా చూడసాగాడు. రెండు నిమిషాలు తర్వాత ఆశ్చర్యం నుంచి తేరుకున్నాడు.

“ఈ పథకం గురించి నాకు, సఫ్వాన్‌కు తప్ప మూడో మనిషికి తెలియదు. ఇప్పుడు మీకు తెలిసిందంటే మీరు నిజంగా దైవప్రవక్తే. దేవుడే మీకీ విషయం తెలియజేసి ఉంటాడు. అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ (స) దేవుని ప్రవక్త అని నేను సాక్ష్య మిస్తున్నాను” అన్నాడు ఉమైర్.

అనుచరులు ఈమాట వినగానే సతోషంతో “అల్లాహుఅక్బర్” అంటూ నినదించారు. ఉమైర్ (రజి) ముస్లిం అయినందుకు దైవప్రవక్త (సల్లం) కూడా సంతోషించారు.

ఖైదీలలో దైవప్రవక్త (సల్లం) అల్లుడు అబుల్ ఆస్ కూడా ఉన్నాడు. కాని అల్లుడని నష్టపరిహారం వసూలుచేయకుండా విడిచిపెట్టలేదు. ఇతర ఖైదీలకు మాదిరిగానే నష్టపరిహారం తెప్పించి విడుదలకమ్మని చెప్పారు ఆయన.

భర్తను విడిపించుకోవడానికి హజ్రత్ జైనబ్ (రజి) తన తల్లి హజ్రత్ ఖదీజా (రజి) నుంచి తనకు సంక్రమించిన కంఠహారాన్ని మదీనాకు పంపించారు. కంఠహారం చూడగానే దైవప్రవక్త (సల్లం)కు గతస్మృతులు గుర్తుకొచ్చాయి. ఇహలోకం వీడిపోయిన తన అర్ధాంగిని తలచుకొని వ్యథ చెందారు. హృదయం మూగగా విలపించింది.

“కంఠహారం ఒక్కటే ఖదీజా జ్ఞాపకార్థంగా జైనబ్ దగ్గర మిగిలివుంది. మీకెవరికీ అభ్యంతరం లేకపోతే దీన్ని జైనబ్‌కు తిరిగిచ్చివేద్దాం” అన్నారు ఆయన అనుచరులతో.

తమ ప్రియతమ నాయకుడే అలా అన్నప్పుడు ఇక ఎవరికి అభ్యంతరం ఉంటుంది? అదీగాక దైవప్రవక్త ప్రసన్నత కన్నా వారికి కావలసిందేముంది? అంచేత అందరూ సంతోషం గా అంగీకరించారు. దైవప్రవక్త (సల్లం) విచారవదనం వికసించింది. కంఠహారాన్ని తన కుమార్తెకు తిప్పిపంపి అబుల్‌ఆస్‌ను విడుదల చేశారు.

రమజాన్ నెలలో ఉపవాసాలు తప్పకుండా పాటించాలని, పేదలకు ఫిత్రా దానం విధిగా చెల్లించాలని దైవాజ్ఞ వచ్చింది. పండుగ నమాజులు, ఖుర్బానీ (బలి) విధానాలు కూడా నిర్ణయమయిపోయాయి.



“రమజాన్ ఖుర్‌ఆన్ అవతరించిన నెల. ఈగ్రంథం మానవాళికి మార్గదర్శిని. ఇందులో రుజుమార్గం తెలిపే, సత్యాసత్యాలను, మంచీచెడులను వేరుపరచి చూపే స్పష్టమైన బోధనలు ఉన్నాయి, కనుక ఇకనుండి మీలో రమజాన్ నెలను పొందేవారు ఆ నెలంతా విధిగా ఉపవాసం పాటించాలి. అయితే రోగగ్రస్తులు, ప్రయాణీకులు (రమజాన్ నెలలో తప్పిపోయిన) ఉపవాసాలను ఇతర దినాలలో పాటించి (ఆ సంఖ్యను) పూర్తిచేయాలి. దేవుడు మీకు సౌలభ్యం చేకూర్చదలిచాడుగాని, మిమ్మల్ని ఇబ్బంది పాల్జేయాలని భావించడంలేదు. మీరు ఉపవాసాల సంఖ్యను పూర్తిచేసుకోవడానికి, దేవుడు మీకు సన్మార్గం చూపినందుకు ఆయన ఔన్నత్యాన్ని కొనియాడటానికి, ఆయనకు కృతజ్ఞులయి ఉండటానికి గాను ఈ సౌలభ్యం ప్రసాదించాడు. (ఖుర్‌ఆన్–2:185)

## ప్రవక్త కుమార్తె జైనబ్ (రజి) వలస-(85)

ఖురైషీయులు ప్రవక్త కుమార్తె హజ్రత్ జైనబ్ (రజి)ను వదిలేయమని అడిగినప్పుడు “ఆమె నాప్రాణం, నా హృదయేశ్వరి. ఆమెను వదిలి నేనెలా బ్రతగ్గలను? నాప్రాణాన్ని నేనెలా తీసుకోను?” అన్నాడు అబుల్‌ఆస్.

అయితే అబుల్‌ఆస్ ఇంకా ఇస్లాం స్వీకరించక పోవడమే గాకుండా, బదర్ యుద్ధంలో దైవప్రవక్త (స)కు ఎదురు నిలిచినందున ఇప్పుడతను జైనబ్ (రజి)ను వదలి పెట్టక తప్పలేదు. యుద్ధఖైదీగా పట్టుబడినప్పుడు అతడ్ని దైవప్రవక్త (స) విడిచిపెడ్తూ మక్కా వెళ్ళగానే జైనబ్‌ను శాశ్వతంగా మదీనా పంపివేయాలని షరతు విధించారు. ఎందుకంటే ఇప్పుడీ సంబంధం తెగిపోయింది. ఇస్లాం వారిద్దర్నీ వేరుచేసింది.

దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞ ప్రకారం జైనబ్ (రజి)ను మక్కా సమీపంలో ఉన్న ఒకచోట వదలిపెట్టాలని, అక్కడ్నుంచి ఆమెను హజ్రత్ జైద్ (రజి) మదీనా తీసుకొస్తారని ముందే నిర్ణయించబడింది. అబుల్‌ఆస్ ఈ విషయం హజ్రత్ జైనబ్ (రజి)కు వివరించాడు. ఆ తరువాత అతను తన తమ్ముడు కనానాతో జైనబ్ (రజి)ను తీసికెళ్ళి మక్కా వెలుపల నిర్ణీత ప్రదేశంలో దిగబెట్టి రమ్మని చెప్పాడు.

జైనబ్ (రజి) మదీనా వెళ్ళడానికి సిద్ధమయ్యారు. అంతలో అబూసుఫ్యాన్ భార్య హిందా వచ్చి “ఏం చెల్లీ! నువ్వు మీనాన్న దగ్గరికి వెళ్ళిపోతున్నావట, నిజమేనా?” అన్నది.

ఈమాట విని హజ్రత్ జైనబ్ (రజి) నివ్వెరపోయారు. ఇంత రహస్యంగా ఉంచిన సంగతి హిందాకు ఎలా తెలిసిందో ఆమెకు బోధపడలేదు. ఇప్పుడేం చెయ్యాలి? ఒకవేళ ఔనంటే హిందా తనకేదైనా కీడు తలపెడ్తుందేమో! అసలే ఆమెకు దైవప్రవక్త (స) అంటే మంట. ఈ ఆలోచనతో జైనబ్ (రజి) ఎటూ తేల్చుకోలేక మౌనంగా ఉండిపోయారు.

“ఏదైనా అవసరమైతే సంకోచం లేకుండా చెప్పెయ్యి. నేను ప్రతి వస్తువూ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను. మన స్నేహసంబంధాలకు ఎలాంటి లోటు రాకూడదు. మగవాళ్ళ వ్యవహారాలు వేరు; ఆడవాళ్ళ వ్యవహారాలు వేరు. మగవాళ్ళు పరస్పరం ఏదయినా చేసుకోవచ్చు. వాళ్ళతో ఆడవాళ్ళయిన మనకు పనేమిటీ?” అన్నది హిందా.

ఎంత మధురంగా ఉన్నాయీ మాటలు! వాటిలో ఎంత పరోపకారం వ్యక్తమవుతోంది!! అయినా హజ్రత్ జైనబ్ (రజి) మనస్సు కుదుట పడలేదు. ఏమైనా ఆమె హిందా నుంచి ఎలాంటి సహాయం కోరలేదు.

జైనబ్ (రజి) ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అది ప్రభాత సమయం. కనాన ఆమె కోసం ఒక ఒంటె తెచ్చి ఆమెను ఒంటె మీద ఎక్కించి బయలుదేరాడు. దారిలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే దాన్ని ఎదుర్కోవడానికి కావలసిన ధనుర్బాణాలు కూడా వెంట తీసుకున్నాడు.

హజ్రత్ జైనబ్ (రజి) మదీనా వెళ్తున్న సంగతి మక్కాలో అందరికీ తెలిసిపోయింది. దైవప్రవక్త (స) మనస్సు బాధించాలన్న దుర్బుద్ధితో కొందరు ఖురైషీయులు ఆమెను మదీనా పోకుండా అడ్డుకోవాలనుకున్నారు. వారిలో అబూసుఫ్యాన్ కూడా ఉన్నాడు. వారంతా ఆయుధాలు తీసుకొని వెళ్ళి జైనబ్ (రజి)ను, కనానాను వెంబండించారు. వారిని చూడగానే జైనబ్ (రజి) కంగారు పడిపోయారు. ఖురైషీయులు వారిద్దర్ని సమీపించారు.

వారిలో ఒకడు వేగంగా ఒంటె దగ్గరికి వచ్చాడు. అతను ఒంటెపై జైనబ్ (రజి) చుట్టూ కట్టిన పరదా తొలిగించి కత్తి చూపిస్తూ "మర్యాదగా వెనక్కి పద. లేదంటావా....." అని గదమాయించాడు. దాంతో హజ్రత్ జైనబ్ (రజి) నిలువునా కంపించిపోయారు.

ఆమె దయనీయ స్థితి చూసేటప్పటికి కనానాకు పౌరుషం పురివిప్పింది. తక్షణమే అతను విల్లు ఎక్కుపెట్టి చూపిస్తూ "ఎవడైనా సరే అడుగు ముందుకు వేశాడా.... వాడి గుండెల్లో నుంచి ఈ బాణం దూసుకుపోవడం ఖాయం" అన్నాడు ఉరిమిచూస్తూ.

అతని రౌద్రాకారం చూసి ఖురైషీయులు చల్లబడిపోయి పక్కకు తప్పుకున్నారు.

"ఆగవయ్యా బాబూ! బాణం విడవకు, కాస్త మామాట విను" అన్నాడు అబూసుఫ్యాన్.

"సరే ఏమిటో చెప్పు" అన్నాడు కనాన ధనస్సు క్రిందికి దించుతూ.

"ఇలా నువ్వీమెను బహిరంగంగా తీసికెళ్ళడం ఏమంత బాగాలేదు. ముహమ్మద్ (స) వల్ల మనం ఇప్పటికే అనేక కష్టాలతో సతమతమైపోతున్న సంగతి నీకూ తెలుసు. ఇలాంటి పరిస్థితిలో నువ్వు అతని కూతుర్ని ఇలా తీసికెళ్తే జనం చూసి మనల్ని గురించి ఏమనుకుంటారు? మనం ఓడిపోయామని, మన జాతి ఢీలా పడిపోయిందని అనుకోరా? ఈమెను పోకుండా ఆపినందువల్ల మనకు ఒరిగేదేమీ లేదు. అంచేత ఓ పని చెయ్యి. ప్రజల్లో రేగిన చర్చ అణగిపోయి ప్రశాంత పరిస్థితి నెలకొన్న తరువాత ఈమెను తీసి కెళ్ళవచ్చు. అప్పటిదాకా ఈమెను మక్కాలోనే ఉంచుదాం" అన్నాడు అబూసుఫ్యాన్.

అబూసుఫ్యాన్ చెప్పినమాట బాగానేఉంది. కనాన దానికి ఒప్పుకున్నాడు. జైనబ్ (రజి)ను తిరిగి మక్కా తీసుకువచ్చాడు. కొన్నాళ్ళకు జనంలో చర్చ తగ్గిపోయింది. అప్పుడతను ఓరోజు రాత్రివేళ ఆమెను తీసికెళ్ళి నిర్ణీత ప్రదేశానికి చేర్చాడు. అక్కడ జైనబ్ (రజి) కోసం ఎదురుచూస్తున్న హజ్రత్ జైద్ (రజి), ఆయన సహచరులు ఆమెను తీసుకొని పోయి దైవప్రవక్త (సల్లం) సన్నిధికి చేర్చారు.



# వితంతు ఆదరణ (86)

మహాప్రవక్త (సల్లం) జీవితం నిరంతర సంఘర్షణలకు ప్రతీక. దైవసందేశ వ్యాప్తి కోసం ఆయన ఎన్నో త్యాగాలు చేశారు. దుష్టశక్తులతో పోరాటం కూడా జరిపారు. బదర్ యుద్ధం తరువాత ఏదో కాస్తంత విశ్రాంతి లభించిందంటే, యూదుల బెడద ఎక్కువయింది. ఈ పనులన్నింటినీ నెరవేరుస్తూ మధ్యలో ఎప్పుడైనా కాస్త విరామం లభిస్తే ఆ సమయంలో సైతం ఆయన ఇతర ఉద్యమ కార్యకలాపాల్లో నిమగ్నులయ్యేవారు. ముఖ్యంగా ముస్లింలను సంఘటిత పరచడం, వారిని సుశిక్షితుల్ని చేయడం, బలహీనుల బాగోగుల్ని విచారించడం, వారి అవసరాలు తీర్చే ఏర్పాట్లుచెయ్యడం, అనుయాయులతో తన సంబంధాలను మరింత పటిష్ఠపరచుకోవడం పట్ల శ్రద్ధచూపేవారు ఆయన.

హజ్రత్ ఖదీజా (రజి) చనిపోయిన తర్వాత దైవప్రవక్త (సల్లం) యాభై ఏళ్ళ వయసున్న హజ్రత్ సౌదా (రజి)ని మక్కాలో ఉన్నప్పుడే వివాహమాడారు. హజ్రత్ అబూబకర్ (రజి) కుమార్తె ఆయిషా (రజి)ను కూడా మక్కాలో ఉన్నప్పుడే వివాహంచేసుకున్నారు. మదీనాలో కాస్త స్థిమితం లభించిన తరువాత హజ్రత్ అబూబకర్ (రజి) దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి "దైవప్రవక్తా! ఇక ఆయిషాను మీ దగ్గరికి పంపిస్తాను" అన్నారు. దానికి దైవప్రవక్త (సల్లం) "మహర్ ఇంకా మిగిలిఉంది కదా!" అన్నారు. ఆ తరువాత కొన్నాళ్ళకు మహర్ చెల్లింపు జరిగిపోయింది.

హజ్రత్ అబూబకర్ (రజి) కూతుర్ని దైవప్రవక్త (సల్లం) ఇంటికి పంపదలచి తన భార్యతో "మన ఆయిషా దైవప్రవక్త (సల్లం)తో సంసారం చేసే సమయం ఆసన్నమయింది. వెంటనే ఆమెను పంపే ఏర్పాటు చెయ్యి" అన్నారు.

హజ్రత్ ఆయిషా (రజి) అప్పుడు స్నేహితురాండ్రతో కలసి ఉయ్యాలలో ఊగుతున్నారు. తల్లి పిలుపుతో ఆమె ఇంట్లోకి పరుగెత్తుకొచ్చారు. తల్లి ఆమెకు స్నానం చేయించి పరిశుభ్రమయిన బట్టలు తొడిగించారు. తల దువ్వి ముస్తాబు చేశారు. ఆ సమయంలో కొందరు అన్సార్ మహిళలు కూడా వచ్చారు. వారంతా హజ్రత్ ఆయిషా (రజి)ను మరింత అందంగా ముస్తాబు చేశారు. ఆ తరువాత ఆమెను దైవప్రవక్త (సల్లం) ఇంటికి పంపడం జరిగింది.

ఓ రోజు హజ్రత్ అలి (రజి) దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి తలొంచుకొని మౌనంగా కూర్చున్నారు. ఏదో చెప్పాలనుకున్నారు గాని, నోట మాట పెగలడంలేదు. దైవప్రవక్త (సల్లం) కళ్ళలోకి సూటిగా చూడలేకపోతున్నారు. ఆయన ముఖారవిందం ఒక విధమైన బిడియంతో ముడుచుకొని పోతోంది.

దైవప్రవక్త (సల్లం) విషయం పసిగట్టి చిరునవ్వు నవ్వారు.

"అలీ! నువ్వు బహుశా ఫాతిమాను వివాహమాడదలిచానని చెప్పడానికి వచ్చావను కుంటున్నాను, ఔనా?" అన్నారు ఆయన వాత్సల్యంతో చూస్తూ.

"ఆ..... ఔను దైవప్రవక్తా!" అన్నారు హజ్రత్ అలి (రజి) సిగ్గు పడుతూనే.

"సరే, నీ దగ్గర మహర్ కోసం ఏదైనా ఉందా?" అడిగారు దైవప్రవక్త (సల్లం).

"నా దగ్గర ఒక గుర్రం, కవచం మాత్రమే ఉన్నాయి."

"గుర్రం, కవచం యుద్ధ సమయాల్లో పనికొస్తాయి. కాని గుర్రం చాలా అవసరం. అంచేత నువ్వు కవచం అమ్మెయ్యి."

ఈమాట వినగానే అలి (రజి) ముఖం ఒక్కసారిగా తామరపువ్వులా వికసించింది. సిగ్గుదొంతర నుండి ఆనందకుసుమాలు రాలిపడ్డాయి. సంతోష కెరటాలతో హృదయ సాగరం పరవళ్ళుతొక్కింది. వెంటనే ఆయన బయటికెళ్ళారు. కవచాన్ని ఉస్మాన్ (రజి)కు నాల్గొందల దిర్హమ్‌లకు అమ్మి డబ్బు తెచ్చారు మహర్‌సొమ్ము చెల్లించడానికి.

అటు అందంతో పాటు ఆత్మసౌందర్యంలో అందర్నీ మించిపోయి "స్వర్గ మహిళ"గా పేరుపడ్డ హజ్రత్ ఫాతిమా (రజి) ఈ శుభవార్త వినగానే సిగ్గుతో కుంచించుకుపోయారు. ఆమె మానసాకాశంలో కొన్ని క్షణాలపాటు హజ్రత్ అలి (రజి) రెక్కలు కట్టుకొని ఎగురుతూ పొగరుబోతు గోరింకలా విహరించారు.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) దగ్గరుండి హజ్రత్ అలి, ఫాతిమా(రజి)ల వివాహం జరిపించారు. ఆయన తన ముద్దుల కుమార్తె సంసారానికి ఒక మంచం, ఒక తోలు పరుపు, ఖర్జూరపు ఆకులతో నింపిన ఒక తలగడ, ఓ చిన్న తోలుసంచి, రెండు మట్టి కుండలు, రెండు తిరగళ్ళు ఇచ్చారు. అల్లుడి దగ్గర ఒక గొర్రెచర్మం, ఓ చినిగిన దుప్పటి మాత్రమే ఉన్నాయి. ఇవీ ఆ కొత్త దంపతుల కొత్త కాపురానికి సమకూరిన వస్తువులు. ఇవే వారి మొత్తం ఆస్తిపాస్తులు.

అత్తవారింటికి వెళ్ళే సమయం రాగానే హజ్రత్ ఫాతిమా (రజి)కు అప్రయత్నంగా దుఃఖం పెల్లుబికింది. నాన్నగారి ఇంటిని, దాని పరిసరాలను మాటిమాటికి వెనక్కి తిరిగిచూస్తూ ఇకముందు కొత్త ఇంట్లో, కొత్త పరిసరాల మధ్య మనుగడ సాగించవలసి ఉందన్న సంగతి గుర్తుకు తెచ్చుకొని ఆమె పసిపిల్లలా విలపించారు.

కూతురి చెక్కిళ్ళపై కన్నీటి ధార చూడగానే కారుణ్యమూర్తి (స) చలించిపోయారు. కాని అంతలోనే గుండెను రాయిచేసుకొని లాలిస్తూ "ఫాతిమా! ఏడ్వకు తల్లీ! నీ పెళ్ళి సామాన్య వ్యక్తితో కాలేదు. విద్యాజ్ఞానాల్లో, విశ్వాస సహనాల్లో అందరికంటే గొప్పవాడయిన అలీతో నీ వివాహం జరిపించానమ్మా!" అన్నారు ఆయన.

ప్రపంచంలోని భార్యాభర్తలందరికీ అలి, ఫాతిమా (రజి)లు ఆదర్శ దంపతులనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే భార్యభర్తలు అన్నాక ఎప్పుడో ఒకప్పుడు, ఏదో ఒక సందర్భంలో వారి మధ్య కీచులాట రాకుండా ఉండదు. ఒక రోజు ఫాతిమా (రజి) ఏదో విషయంలో భర్త మీద అలిగి తండ్రి ఇంటికి వెళ్ళిపోయారు. కాస్సేపటికి అలి (రజి) కూడా ఆమె వెనకాల దైవప్రవక్త (సల్లం) ఇంటికి వెళ్ళారు.

హజ్రత్ ఫాతిమా (రజి) చేసిన ఆరోపణలన్నీ దైవప్రవక్త (సల్లం) ఓపికగా విన్నారు. కాని అంతమాత్రాన ఆయన కూతుర్ని వెనకేసుకొని రాలేదు. పైగా కూతురికి గుణపాఠం



గరిపే విధంగా మాట్లాడుతూ "లోకంలో ఏ భార్యాభర్తల మధ్య పొరపొచ్చాలు రాకుండా ఉంటాయమ్మా! అయినా ప్రతి విషయంలోనూ భర్త భార్య మాట వినాల్సిసిన అవసరం ఏముంది?" అన్నారు.

తలుపు చాటున నిల్చొని తండ్రీ కూతుళ్ళ సంభాషణ విన్న హజ్రత్ అలి (రజి)ని ఈ మాటలు ఎంతో ప్రభావితం చేశాయి. తానిక ఎన్నటికీ ఫాతిమా మనస్సు నొప్పించనని ఆయన గట్టిగా నిర్ణయించుకున్నారు. హజ్రత్ ఫాతిమా (రజి) కూడా తండ్రిమాటలు విన్న తరువాత ఇకముందు ఏ విషయంలో కూడా భర్తకు ఎదురుచెప్పకుండా మసలుకుంటానని నిశ్చయించుకున్నారు.

బదర్ యుద్ధంలో హజ్రత్ ఉమర్ (రజి) అల్లుడు ఖునైస్ (రజి) తీవ్రంగా గాయపడి ఆ తరువాత చనిపోయారు. అందువల్ల హజ్రత్ ఉమర్ (రజి) కుమార్తె హఫ్సా (రజి) దుస్థితి పట్ల చాలా విచారంగా ఉన్నారు. ఆమెకు పునర్వివాహం చేయడానికి సరయిన సంబంధం ఇంకా లభించలేదు. ఓరోజు ఆయన ఉస్మాన్ (రజి) దగ్గరికి పోయి ఈవిషయం గురించి ప్రస్తావించారు.

హజ్రత్ ఉస్మాన్ (రజి) అర్ధాంగి రుఖియ్యా (రజి) కూడా ఈ మధ్యనే చనిపోయారు. అంచేత హజ్రత్ ఉమర్ (రజి) తన కుమార్తెను ఉస్మాన్ (రజి) చేసుకుంటాడేమోనని భావించి వచ్చారు. కాని ఉస్మాన్ (రజి) తానీ విషయం గురించి ఆలోచించి చెబుతానని విషయం దాటవేయడానికి ప్రయత్నించారు.

హజ్రత్ ఉమర్ (రజి) ఈమాట విని నిరాశతో వెళ్ళిపోయారు. మరొక రోజు ఆయన హజ్రత్ అబూబకర్ (రజి) దగ్గరికెళ్ళి ఈ విషయమే ప్రస్తావించారు. కాని ఆయన దగ్గర నుంచి కూడా ఆశించిన సమాధానం ఏదీ రాలేదు. దాంతో ఆయన మరింత విచారంతో క్రుంగిపోయారు.

ఆ తరువాత హజ్రత్ ఉమర్ (రజి) సలహా కోసం దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళారు. దైవప్రవక్త (సల్లం) ఆయన విచారవదనం చూసి "ఉమర్! ఏమిటీ ఈరోజు నువ్వు చాలా విచారంగా ఉన్నట్లు కన్పిస్తున్నావు?" అని అడిగారు.

"దైవప్రవక్తా! నా కూతురు హఫ్సా పునర్వివాహం విషయం నన్ను క్రుంగదీస్తోంది. నేను ఉస్మాన్ దగ్గరికెళ్ళి అడిగితే ఆయనగారు ఆలోచించి చెబుతానని చెప్పి నన్ను పంపివేశారు. అబూబకర్ దగ్గరికెళ్తే ఆయన దగ్గర్నుంచి కూడా నాకు సరైన సమాధానం రాలేదు" అన్నారు హజ్రత్ ఉమర్ (రజి) విచారంతో.

దైవప్రవక్త (సల్లం) ఈ మాట విని చిరునవ్వు నవ్వుతూ "ఉమర్! దేవుడు ఉస్మాన్‌కు నీ కూతురి కంటే మంచిభార్యను ప్రసాదించాడు. నీ కూతురికి ఉస్మాన్ కంటే మంచి భర్త ప్రసాదించాడు" అన్నారు.

హజ్రత్ ఉమర్ (రజి)కు దైవప్రవక్త (సల్లం) మాటల్లోని గూఢార్థం తెలియక కాస్సేపు తికమకపడుతూ ఆశ్చర్యపోయారు. తరువాత దైవప్రవక్త (సల్లం) విషయం వివరంగా తెలియ జేశారు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు.

దైవప్రవక్త (సల్లం) బదర్‌యుద్ధం నుండి తిరిగిరాగానే తన కుమార్తె రుఖియా (రజి) మరణవార్త వినవలసి వచ్చింది. భార్య మరణం పట్ల హజ్రత్ ఉస్మాన్ (రజి) ఎంతో తల్లడిల్లి పోయారు. "దైవప్రవక్తా! మీతో ఏర్పడిన ఈ ప్రత్యేక సంబంధం కాస్తా ఇప్పుడు లేకుండా పోయింది" అన్నారు ఆయన ఎంతో ఆవేదనతో.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) హజ్రత్ ఉస్మాన్ (రజి)ని అమితంగా అభిమానించే వారు. ఆయన సుగుణసంపత్తి వల్ల కూడా దైవప్రవక్త ఎంతో ప్రభావితులయ్యారు. అంచేత కొన్నాళ్ళకు ఆయన తన రెండోకుమార్తె హజ్రత్ ఉమ్మెకుల్సూమ్ (రజి)ని ఉస్మాన్ (రజి)కిచ్చి వివాహం చేశారు.

ఆ తర్వాత ఆయన హజ్రత్ ఉమర్ (రజి) కుమార్తె హఫ్సా (రజి)ను వివాహమాడారు. అప్పటికి హఫ్సా (రజి) వయస్సు ఇరవయి సంవత్సరాలే. ఇలా ఆయన తన అనుచరులతో సంబంధాలను పటిష్ఠపరచుకున్నారు.

మహాప్రవక్త (సల్లం) వితంతువుల విషయమై తన అనుచరుల్ని ఉపదేశిస్తూ "మీరు వితంతువుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకోండి. వారిపట్ల సానుభూతి చూపండి. అవసర మైతే వితంతు స్త్రీని వివాహమాడి ఆమెను, ఆమె పిల్లలను చేరదీయండి. మీరా విధంగా చేయకపోతే ఆమె దిక్కు లేనిదైపోయి దారిద్ర్యానికి గురవుతుంది. ఆమె పిల్లలు ఆమెకు భారమైపోతారు. ఆవిధంగా ఆమె అనేక కష్టాలకు గురవుతుంది" అని చెప్పారు.

హజ్రత్ ఖుజైమా (రజి) కుమార్తె జైనబ్ (రజి) ఎంతో సుగుణవతి. దానధర్మాలు చెయ్యడమంటే ఆమెకు ఎంతో ఇష్టం. ఈ కారణంగా ఆమె జనంలో "ఉమ్ముల్ మసాకీన్" (పేదల మాతృమూర్తి) అని పేరుపడ్డారు. బదర్‌యుద్ధంలో ఆమెభర్త అబ్దుల్లా బిన్ జహష్ (రజి) అమరగతులయ్యారు. ఆమె దీనావస్థ చూసి దైవప్రవక్త (స) ఎంతో జాలి పడ్డారు. అంచేత ఆయన ఆమెను కూడా వివాహమాడారు. ఇలా ఆయన వింతవుల్ని వివాహమాడి వారికి సమాజంలో తగిన గౌరవప్రదమైన స్థానం కల్పించారు.

## పరాజయ పరాభవం-(87)

బదర్ యుద్ధంలో ఘోర పరాజయం చవిచూసిన మక్కా ఖురైషీయులు అవమాన భారంతో బాగా క్రుంగిపోయారు. వారికి నడుం విరిగినంత పనయింది. అబూలహబ్ అయితే పుట్టెడు దుఃఖంతో వంగిపోయిన గడకర్రలా వ్రేలాడపడిపోయాడు.

బదర్ యుద్ధం నుండి ముగైరా రాగానే అబూలహబ్‌తో పాటు మరికొంత మంది జనం యుద్ధవార్తలు వినడానికి అతని చుట్టూ గుమికూడారు.

"అబ్బాయ్! బదర్‌లో అసలు ఏం జరిగిందో పూర్తిగా చెప్పు" అన్నాడు అబూలహబ్.

"ఏం చెప్పను బాబాయి! శత్రువులు కోరిన విధంగా మమ్మల్ని వధించండన్నట్లు వారికి మేము మా మెడలు అప్పగించి ఊరుకున్నాం అనుకోండి. నిజం బాబాయి! యుద్ధంలో మా పరిస్థితి ఇలాగే ఉండింది. అయితే నేను ఎవరినీ నిందించ దలచుకోలేదు. ఎందుకంటే మాకు ఆకాశంలో తెల్లటి దుస్తుల్లో ధగధగ మెరిసే ఓ సైనికపటాలం



కన్పించింది. ఆ విచిత్ర సైనికులు గుర్రాలపై ఎక్కి వచ్చి మాపై విరుచుకుపడ్డారు. వారి ముందు ఏదీ నిలువలేక పోయింది" అన్నాడు ముగైరా విచార వదనంతో.

హజ్రత్ అబ్బాస్ (రజి) దగ్గర బానిసగా ఉండి విముక్తిపొందిన అబూరాఫె ఈ చివరి మాటలు విని "దైవసాక్షి! ఆ విచిత్ర సైనికులు తప్పకుండా దైవదూతలయి ఉంటారు" అన్నాడు అప్రయత్నంగా.

అబూరాఫె మాటలు వినగానే అబూలహబ్‌కు అరికాలి మంట నెత్తికెక్కింది. పళ్ళు పటపట కొరుకుతూ అతను అబూరాఫె చెంప ఛెళ్ళుమనిపించాడు.

పాపం అబూరాఫె బిత్తరబోయాడు. అబూలహబ్ అంతటితో తృప్తిచెందక అబూ రాఫెను లాగి నేలమీద విసిరేసి పిడికిళ్ళతో ఇష్టమొచ్చినట్లు కొట్టడం మొదలెట్టాడు. అయితే జనం ఈ పరిస్థితి చూడలేక అతనికి అడ్డంపోయి ఆ వృద్ధుడ్ని కాపాడారు.

ఆ తరువాత అబూలహబ్ అక్కడ్నుంచి నేరుగా ఇంటికెళ్ళి పోయాడు. అదేమిటోగాని ఆరోజు రాత్రే అతను తీవ్రమయిన వ్యాధితో మంచానపడ్డాడు. అలా ఆర్రోజులు వ్యాధితో బాధపడి ఏడవ రోజు చనిపోయాడు.

ఖురైషీయులు యుద్ధ పరాభవం నుంచి ఇంకా తేరుకోలేదు. దాదాపు నెల రోజుల పాటు వారు దుఃఖసముద్రంలో మునిగివున్నారు. ఆ తరువాత ఏడ్పులు, పెడబొబ్బలు అన్నీ బందయి పోయాయి. కొత్తగా మళ్ళీ యుద్ధ సన్నాహాలు చెయ్యాలని, ముస్లింలపై ప్రతీకారం తీర్చుకోవాలని నిశ్చయించుకున్నారు మక్కా ఖురైషీయులు. కనుక ఇకనుండి ఎవరూ ఏడ్వకూడదని ప్రజలపై ఆంక్షలు విధించారు.

ఈ ఆంక్షలతో జనం తమ బాధను బయిటికి వ్యక్తపరచుకోలేక లోలోనే మధన పడిపోసాగారు. ఏడ్చి కూడా వారు తమ హృదయాల్లో మండుతున్న ప్రతీకార జ్వాలల్ని చల్లార్చుకోలేక పోయారు. చివరికి ఇలా ఏడ్చి మనస్సులోని దుఃఖాన్ని దూరం చేసుకోవడా నిక్కూడా వారికిప్పుడు అవకాశం లేకుండా పోయింది.

అస్వద్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ కొడుకులు ముగ్గురు బదర్‌లో చనిపోయారు. పుత్రవియోగంతో అతను బాగా క్రుంగిపోయాడు. కొడుకుల మరణం పట్ల ఇంకా కొన్నాళ్ళ పాటు తనివితీరా ఏడ్వడానికి, పెడబొబ్బలు పెట్టడానికి అనుమతిస్తే బాగుండేదని భావించాడు. కాని ఖురైష్ నాయకులు ప్రజల ఏడ్పులను నిషేధించగానే అస్వద్ కూడా బలవంతాన ఏడ్పును దిగమింగాడు. అయితే అతని కళ్ళు మాత్రం చిల్లులు పడిన నీటికుండల్లా కన్నీటిని ఇంకా ఎడతెరిపిలేకుండా కారుస్తూనే ఉన్నాయి.

ఒకరోజు రాత్రి అస్వద్ నిద్ర పట్టక యమయాతన పడ్డాడు. బాగా పొద్దుపోయాక ఎటు నుంచో ఏడుస్తున్న ఓ స్త్రీ కంఠం విన్పించింది. అస్వద్ మనస్సులో ఆశలు చిగురించాయి. అతను తన కొడుకును లేపాడు.

"బాబూ! కాస్త అటుపోయి ఆంక్షలు ఎత్తివేశారేమో చూసిరా. ఖురైషీయులు మళ్ళీ ఏడ్వడం మొదలెడితే నేను కూడా మనసారా ఏడ్చి మండుతున్న నా గుండెల్ని కాస్త చల్లార్చుకుంటాను" అన్నాడు కొడుకును పురమాయిస్తూ.

ఆ బాలుడు బయటికి వెళ్ళి వచ్చి "నాన్నా! ఎవరో స్త్రీ తన ఒంటె తప్పిపోయిందని ఏడుస్తోంది" అని తెలియజేశాడు.

అస్వద్ విషాదం పొంగి కవితా వాహిని రూపంలో జాలువారింది:

"ఒక ఒంటె తప్పిపోయినంత మాత్రాన ఆవిడ ఏడ్వడమా! దానిపై ఆమెకు నిద్ర కూడా పట్టకపోవడమా!!-- ఒంటె తప్పిపోయినందుకు ఏడ్వకు నీవు; బదర్ సంఘటన తలచుకొని తనివితీరా దుఃఖించు--- నిజానికి అక్కడే మన అదృష్టమంతా మంట కలసిపోయింది."

మక్కా ఖురైషీయులు ఎంతకాలం ఈ అవమానభారం మోస్తూ, తమకు పట్టిన దుర్గతికి రోదిస్తూ గడుపుతారు? జరిగిపోయినదాన్ని గురించి ఏడుస్తూ కూర్చుంటే ఒరిగేది మాత్రం ఏముంది? అంచేత అందరూ ఏడ్పులకు స్వస్తి చెప్పారు. జరిగిన కష్టనష్టాలను గురించి నలుగురితో చెప్పుకోవడం కూడా మానేశారు.

కాని ఖురైషీయులు తమకు జరిగిన పరాభవాన్ని అంత తేలిగ్గా మరచిపోయే అభిమానహీనులు కాదు. కష్టనష్టాలు సహించి ప్రతిక్రియ కోసం ప్రయత్నించలేని పిరికిపందలు కూడా కాదు. వారి హృదయాల్లో ప్రతీకారసెగలు మరింత ప్రజ్వరిల్లుతున్నాయి. మరొకసారి ముస్లింలపై దండెత్తి, వారిని అణచి పగ చల్లార్చుకోవాలని నిశ్చయించుకున్నారు.

ఈ లక్ష్యం నెరవేరే వరకు విశ్రాంతి తీసుకోకూడదని, కంటినిండా నిద్ర పోకూడదని నిర్ణయించుకున్నారు పురుషులు. స్త్రీలు శిరోజాలు కత్తిరించుకొని, ముస్లింల మీద కసి తీర్చుకునేదాకా సువాసనల్ని ఉపయోగించమని, అలంకరణ వస్తువులు ధరించమని తమ తమ ఇష్టదేవతల ముందు ప్రమాణం చేశారు. ఖురైషీల అగ్రనాయకుడు అబూసుఫ్యాన్ ఇస్లాంధర్మ సారథిని ఓడించేవరకు స్నానం చేయనని, తల దువ్వుకోనని తీవ్రంగా శపథం చేశాడు.

ఖురైషీలు యుద్ధ సన్నాహాలు ప్రారంభించారు. యుద్ధానికి కావలసిన వస్తువులన్నీ సేకరించడం మొదలెట్టారు. బదర్‌యుద్ధానికి ముందు ముస్లింల బారిన పడకుండా సురక్షితంగా వచ్చిన వర్తకబిడారాలు 'దారున్నద్వా'లో ఆపిఉంచారు. ఒంటెల మీద లక్షల విలువగల వ్యాపారసామగ్రి కిటకిటలాడుతోంది. ఇంకా దాన్ని భాగస్తుల్లో పంచలేదు. ఖురైష్ నాయకులంతా సమావేశమై, భాగస్తులకు వారి పెట్టుబడి సొమ్ము వరకు ఇచ్చేసి లాభాన్ని సైనిక ఖర్చులకు, యుద్ధఏర్పాట్లకు వినియోగిద్దామని తీర్మానించారు.

వెంటనే సరుకుని మార్కెట్‌కు తెచ్చి అమ్మివేశారు. సిరియా నుంచి వచ్చిన అనేక విలువైన, ఆకర్షణీయమైన వస్తువులు ఉండటం వల్ల జనం ఎగబడికొన్నారు. అనుకోకుండా ఆఏడు అపారమైన లాభాలు వచ్చాయి. భాగస్తులకు వారి మదుపుసొమ్ము వాపసుచేశారు. లాభాలను సైనికఖర్చులకు తీసి యుద్ధసన్నాహాలు ఉధృతంచేశారు.

బదర్ యుద్ధంలో ఖురైషీయులు చాలామంది తమ ఆప్తుల్ని పోగొట్టుకున్నారు. అబూసుఫ్యాన్ కొడుకు కూడా వధించబడ్డాడు. ఆ యుద్ధంలో అవిశ్వాసుల అంచనాలన్నీ తారుమారయ్యాయి. అందువల్ల ఈసారి భారీఎత్తున సైనికుల్ని, ఆయుధాల్ని సమీక



రించాలని తహతహలాడిపోతున్నారు. అయితే ఇదంతా ఒక్క రోజులో జరిగే పని కాదు. పథకం ప్రకారం పనులు జరగాలంటే కొంతకాలమైనా పడ్తుంది. కాని అబూసుఫ్యాన్ ఆంతర్యంలో బుసలు కొడ్తున్న ప్రతీకార వాంఛను అదుపులో ఉంచలేక పోయాడు. యుద్ధసన్నాహాలు పూర్తికాకుండానే అతను రెండొందల మంది ప్రతిభావంతులైన సైనికుల్ని తీసుకొని మదీనా బయలుదేరాడు.

మదీనాపట్టణం సమీపంలో ఉరైజ్ అనే ప్రదేశం ఉంది. అబూసుఫ్యాన్ ఆ ప్రదేశానికి చేరుకోగానే ఒక అన్సార్‌ముస్లిం పొలంపనులు చేసుకుంటూ కన్పించాడు. వెంట ఒక కూలీవాడు కూడా ఉన్నాడు. అబూసుఫ్యాన్ వాళ్ళిద్దర్ని నిర్దాక్షిణ్యంగా హతమార్చాడు. అక్కడున్న రెండు ఇళ్ళను, ఖర్జూరపు తోటలను కాల్చి పారిపోయాడు. ఈ విధంగా అతను తన శపథం నెరవేరిందని సంబరపడిపోయాడు.

ఈసంగతి తెలిసి దైవప్రవక్త (స) కొందరు అనుచరుల్ని తీసుకొని అబూసుఫ్యాన్‌ని వెంటాడటానికి హిజ్రీశకం 2వ ఏట జిల్‌హజ్ నెల ప్రారంభంలో బయలుదేరారు. తమ వెనుక శరవేగంతో వస్తున్న ప్రమాదాన్ని అబూసుఫ్యాన్ సైనికులు గమనించారు.

కాని వెనక్కి వెళ్ళి ముస్లిం యోధులతో తలపడటానికి ధైర్యం చాల్లేదు. అదీగాక వీపు మీద బరువుతో నత్తనడక నడిచే ఈ ఒంటెలతో ప్రయాణం సాగిస్తే ముస్లింలకు చిక్కి బుగ్గిపాలయ్యే ప్రమాదం కూడా ఉంది పరిస్థితి. అందువల్ల ఒంటెల మీదున్న పిండిమూటలు జారవిడిచారు. బరువుతగ్గిన ఒంటెలతో వడివడిగా ప్రయాణం చేస్తూ ఎలాగో ముస్లిం సైనికుల నుండి తప్పించుకున్నారు.

ముస్లింలు తమకు భయపడి పిరికిపందలుగా పారిపోయిన శత్రుసైనికుల్ని వెంటాడ లేదు. వారు జారవిడిచిన పిండి మూటల్ని మాత్రం తీసుకొని మదీనా తిరిగొచ్చారు. ఈ దండయాత్రను గజ్వె సవీఖ్ (పిండి దండయాత్ర) అంటారు.

## యూదుల జాత్యాహంకారం-(88)

దైవప్రవక్త (స) మదీనా వచ్చిన తొలిరోజుల్లో యూదులు ఆయన ప్రతిపాదించిన శాంతిఒప్పందంతో ఏకీభవించి సంతోషంగానే ఉన్నారు. కాని ఆయనకు తమ మతరంగు పూసి తమ జాతిప్రాభవాన్ని ద్విగుణీకృతం చేసుకోవాలన్న దుష్ట పథకం ఎంతకూ నెరవేరక పోగా, దైవప్రవక్త (సల్లం) తన సందేశామృతంతో ప్రజాబాహుళ్యాన్ని ఆకట్టుకోవడం చూసి యూదులు మండిపోయారు. అప్పటినుంచి వారు దైవప్రవక్త (సల్లం)కు, సత్యధర్మానికి ఆగర్భశత్రువులుగా మారి అసహ్యంగా ప్రవర్తించసాగారు.

"(ముస్లింలారా!) గ్రంథప్రజలలో (అంటే యూదుల్లో) కొందరు మిమ్మల్ని రుజుమార్గం నుండి తప్పించగోరుతున్నారు. నిజానికి వారు తమను తాము తప్ప మరెవరినీ దారి తప్పించలేరు. కాని ఆ సంగతి వారు గ్రహించలేకపోతున్నారు.

గ్రంథప్రజలారా! మీరు దేవుని సూక్తులను, సూచనలను గుర్తించినప్పటికీ వాటిని ఎందుకు నిరాకరిస్తున్నారు? గ్రంథప్రజలారా! మీరు సత్యాసత్యాలను కలగాపులగం చేసి సత్యాన్ని ఎందుకు అనుమానాస్పదం చేస్తున్నారు? వాస్తవం తెలిసి కూడా సత్యాన్ని ఎందుకు దాస్తున్నారు?

గ్రంథప్రజలలో (యూదులలో) కొందరు పరస్పరం కూడబలుక్కుంటూ "విశ్వాసులపై అవతరించిన దాన్ని మీరు ఉదయం విశ్వసించి (నట్లు నటించి) సాయంత్రానికల్లా తిరస్కరించండి. ఈవిధంగా వారిని మనం మార్గభ్రష్టులయ్యేలా చేయగలం" అని చెప్పుకుంటారు. (72)

అంతేకాదు, "మన మతస్థుల్ని తప్ప మరెవరినీ మనం నమ్మకూడదు" అని కూడా వారు పరస్పరం చెప్పుకుంటారు. (ముహమ్మద్!) వారికి చెప్పు: "మార్గదర్శకత్వమంటే అసలు దేవుని మార్గదర్శకత్వమే. అయన చూపేదే రుజుమార్గం. గతంలో మీకు ఇవ్వబడిన (తౌరాత్, ఇన్జీల్) వంటిదే (ఇప్పుడు) ఇతరులక్కూడా ఇవ్వబడిందంటే అది దేవుని అనుగ్రహం. మీకు వ్యతిరేకంగా మీ ప్రభువు సన్నిధిలో సమర్పించడానికి ఇతరులకు బలమైన సాక్ష్యం (దివ్య ఖుర్ఆన్) లభించిందంటే అదీ దేవుని అనుగ్రహమే." (ఖుర్ఆన్. 3:69-73)

ఒకసారి కొందరు యూదులు దైవప్రక్త (సల్లం) సన్నిధికి వచ్చి "మా జాతిలో ఒక స్త్రీ, ఒక పురుషుడు వ్యభిచారం చేశారు" అని అన్నారు.

దైవప్రవక్త (సల్లం) ఈమాట విని "తౌరాత్‌లో ఈ నేరం గురించి ఎలాంటి ఆదేశం ఉంది?" అని ప్రశ్నించారు.

"మేము వ్యభిచారి ముఖానికి మసిబూసి ఊరేగించి అవమానపరుస్తాము; కొరడా దెబ్బలు విధిస్తాం" అన్నారు యూదులు.

యూదమతం వదలి ముస్లిం అయిన అబ్దుల్లా బిన్ సలాం (రజి) ఈ మాట వినగానే "మీరు అబద్ధమాడుతున్నారు. (ఖుర్ఆన్‌లో ఉన్నట్లే) తౌరాత్‌లో (కూడా) వ్యభిచార నేరానికి రాళ్ళు విసిరి హతమార్చే శిక్షే ఉంది" అన్నారు.

అప్పుడు యూదులు తౌరాత్ తెచ్చి చూపించారు. వారిలో ఒకతను శిలాశిక్ష ఉన్న సూక్తి కన్పడకుండా దానిపై వ్రేలుపెట్టి, దానికి పైనా, క్రింద ఉన్న సూక్తులు పఠించడం మొదలెట్టాడు.

అబ్దుల్లా బిన్ సలాం (రజి) "నీ చెయ్యి తీసెయ్ అక్కడ్నుంచి" అన్నారు.

ఆ యూదుడు వేరే మార్గంలేక చెయ్యి తీశాడు. చూస్తే అక్కడ శిలాశిక్ష గురించిన సూక్తి స్పష్టంగా కన్పించింది.

దాంతో యూదులు వాస్తవాన్ని ఒప్పుకుంటూ "అబ్దుల్లా బిన్ సలాం చెబుతున్నదే నిజం. తౌరాత్‌లో శిలాశిక్ష ఆదేశం ఉంది" అన్నారు.

దాని ప్రకారమే దైవప్రవక్త (సల్లం) తీర్పుచేసి శిక్ష విధించారు.

"వీరు అబద్ధాలు పలికే, నిషిద్ధ వస్తువులు తినే మనుషులు. అందువల్ల వీరు (ఏదైనా వ్యవహార పరిష్కారం కోసం) నీ దగ్గరకు వస్తే వారి వ్యవహారాన్ని నీకిష్టమైతే పరిష్కరించు లేదా తిరస్కరించు. ఆమేరకు నీకు అధికారం ఇవ్వబడుతోంది. వ్యతిరేకిస్తే వారు నీకేమాత్రం నష్టం కలిగించలేరు. ఒకవేళ పరిష్కారం చేయాలనుకుంటే న్యాయంగా, నిష్పక్షపాతంగా పరిష్కరించు. దేవుడు న్యాయంగా వ్యవహరించేవారినే ప్రేమిస్తాడు.



అయినా వారు నిన్ను న్యాయనిర్ణేతగా ఎలా చేసుకుంటారు? స్వయంగా వారి దగ్గర తౌరాత్ గ్రంథం ఉందికదా! అందులో దేవుని ఆజ్ఞలు ఉన్నాయి. వాటికి విముఖులై నీ దగ్గరకు రావలసిన పనేమిటీ? అసలు వారిలో (సత్యంపట్ల) విశ్వాసమే లేదు." (ఖుర్ఆన్. 5:42,43)

తాము ఎంతో భక్తిపరాయణులమని, తాము తప్ప మరెవరూ మోక్షానికి అర్హులు కారని చెప్పుకునే ఈజాతిలోని పెద్దలు, పండితులు సైతం దైవప్రవక్త (స) దగ్గరికి వచ్చినప్పుడల్లా 'అస్సలాము అలైకుం' అనే పదాన్ని దాని అసలుభావం మారి చెడుభావం వచ్చేవిధంగా కొంచెం వత్తి పలికేవారు. అలాగే ఇతర సంభాషణల్లోనూ కొన్నిటి ఉచ్చారణ తారుమారుచేసి సామాన్యజనానికి అర్థంకాని విధంగా తప్పుడుమాటలు పలికేవారు.

"యూదులైనవారిలో కొందరు పదాలను వాటి సందర్భాన్నుండి మార్చివేస్తారు. నిజ ధర్మానికి హాని కలిగించే ఉద్దేశ్యంతో వారు నాలుకలు మెలితిప్పుతూ "మేము విన్నాం-త్రోసి పుచ్చాం, వినండి- విన్పించకండి, మా మాట వినండి" అని అంటారు. వారు "మేము విన్నాం, విధేయులై పోయాము; వినండి, కాస్త మావైపు చూడండి" అని అంటే వారికి శ్రేయస్కరంగా ఉండేది. అది సవ్యంగా కూడా ఉండేది. కాని దేవుడు వారి తలబిరుసు, తిరస్కారాల కారణంగా వారిని శపించాడు. అందువల్ల వారిలో చాలాకొద్ది మంది తప్ప ఎవరూ సత్యాన్ని విశ్వసించరు." (ఖుర్ఆన్-4:46)

అంతేకాదు, దైవమార్గంలో ధనాన్ని వెచ్చించమంటూ "మీలో దేవునికి మంచి అప్పు ఇచ్చేవారు ఎవరైనా ఉన్నారా?" అనే ఖుర్ఆన్ సూక్తి విని "ఓహో! దేవుడు కూడా ఇప్పుడు పేదవాడైపోయి తన దాసుల దగ్గర అప్పు అడుక్కోవడం మొదలుపెట్టాడన్న మాట!!" అని దైవాన్ని కూడా ఎగతాళి చేసేవారు.

ఖుర్ఆన్‌లో దేవుడిచ్చిన ఈగ, దోమల దృష్టాంతాలు విని "ఆహా! ముస్లింల దేవుడు చాలా వింత దేవుడు. దృష్టాంతం ఇవ్వడానికి ఆయనకు ఈగలు, దోమలు వంటి అల్ప ప్రాణులు తప్ప మరేమీ దొరకలేదు కాబోలు!" అని పరిహసించేవారు.

"విశ్వాసులారా! మీ వారిని తప్ప ఇతరుల్ని ఆంతరంగికులుగా చేసుకోకండి. వారు మీకు హాని తలపెట్టడంలో ఎలాంటి అవకాశాన్నీ జారవిడుచుకోరు. ఏ విధంగానయినా మిమ్మల్ని బాధించాలనే వారు కాచుకొని ఉంటారు. వారి మాటల్లో వైరం ఎప్పుడో బయట పడింది. ఇక వారి హృదయాల్లోనయితే అంతకన్నా ఎన్నోరెట్లు ద్వేషం నిండిఉంది. మీరు వివేచనాపరులయితే విషయాన్ని గ్రహించండి; మేము మా సూక్తుల్ని స్పష్టంగా విడమరచి చెబుతున్నాము.

మీరు వారిని ప్రేమిస్తారుగాని, వారికి మీరంటే ఏమాత్రం అభిమానం లేదు. మీరు (దైవ)గ్రంథాలన్నీ విశ్వసిస్తారు. (కాని వారు మీగ్రంథాన్ని విశ్వసించరు.) వారు మిమ్మల్ని కలసినప్పుడు "మేము కూడా (మీగ్రంథాన్ని, మీప్రవక్తను) విశ్వసిస్తున్నాం" అంటారు. అయితే మీ దగ్గర్నుండి వెళ్ళిపోగానే మీ మీద పెంచుకున్న కసితో వారు పళ్ళు పటపట నూరుతారు. (దౌర్భాగ్యులారా!) మీరు పెంచుకున్న కసిలోనే మాడి చావండి. దేవునికి మీ అంతరంగాల్లో దాగివున్న ప్రతి విషయమూ తెలుసు.

మీకేదైనా మేలు జరిగితే వారు విలవిల్లాడి పోతారు. కీడు జరిగితే మాత్రం తెగ సంబరపడి పోతారు. ఏమైనప్పటికీ మీరు సహనం వహించి దేవుని పట్ల భయభక్తులతో మసలుకుంటే, మీ మీద వారి కుట్రలు, కుయుక్తులేవీ పనిచేయవు. వారి చేష్టలన్నీ దేవునికి బాగా తెలుసు." (ఖుర్‌ఆన్. 3:118-120)

## బనీఖైనుఖా యూదుల బహిష్కరణ-(89)

యూదుల పెంకితనం మరింతపెచ్చరిల్లింది. నానాటికి వ్యాపిస్తున్న ఇస్లాంను చూసి వారు ఆశ్చర్యపోతున్నారు. "స్నేహఒప్పందంతో ముహమ్మద్ మనల్ని తన పక్షానికి తిప్పు కున్నాడు. ఆ తర్వాత అనతికాలంలోనే ఇంటింటా ఇస్లాం జ్యోతిని వెలిగించాడు. అంతటితో ఊరుకోక రణరంగంలోకి దిగి బహుదైవారాధకుల్ని కూడా ఎదుర్కోగల్గుతున్నాడు."

ఈ ఆలోచన రాగానే యూదులు హడలిపోయి ఇప్పటిదాకా కప్పుకొని ఉన్న కాపట్యపు ముసుగు పూర్తిగా తీసిపారేశారు. శాంతి ఒప్పందానికి కూడా తిలోదకాలిచ్చి వరలేని ఖడ్గంలా ఎదుటికి వచ్చారు. జనబాహుళ్యంలో దైవప్రవక్త (సల్లం) పట్ల అనేక అనుమానాలు రేకెత్తించసాగారు. ముస్లింలకు వ్యతిరేకంగా బహుదైవారాధకుల్ని రెచ్చ గొట్టడం మొదలెట్టారు. అయినా కారుణ్యమూర్తి (సల్లం) వారి ఆగడాలను క్షమిస్తూనే ఉన్నారు. కాని వారది తెలుసుకోలేక మరింత మిడిసిపడుతున్నారు.

ఒకసారి ఓ ముస్లింమహిళ నగ చేయించుకోవడానికి ఓ యూదస్వర్ణకారుని దుకాణా నికి వెళ్ళింది. అక్కడ మరికొందరు యూదులు కూడా ఉన్నారు. ఈ దుర్మార్గులకు ఏం దుర్బుద్ధి పుట్టిందోగాని వారామెను ముఖం చూపించమని అడిగారు. దానికామె నిరాక రించడంతో ఓ కిరాతకుడు ఆమె వెనక్కిపోయి ఆమె పైవస్త్రానికి ఓ ముల్లు గుచ్చాడు. ఇది గమనించని ఆ మహిళ లేచి నిలబడగానే ఆమె వస్త్రం కాస్తా క్రిందకు జారింది. అది చూసి మిగిలిన యూదులంతా విరగబడి నవ్వారు. పాపం ఆ అమాయకురాలు ఈ అవమానం భరించలేక పెద్ద కేకపెట్టి భోరున ఏడ్వసాగింది.

ఆమె కేక విని సమీపంలోనే ఉన్న ఓ ముస్లిం పరుగెత్తుకొచ్చాడు. జరిగిన సంగతి తెలుసుకొని తోకతొక్కిన త్రాచులా లేచాడు. మరుక్షణమే ఆ యూదుడ్ని అమాంతం పైకెత్తి నేలకేసి విసిరికొట్టాడు. దానికి మిగిలిన యూదులు ఆగ్రహోదగ్రులయి ఒక్కసారిగా ఆ ముస్లింపై విరుచుకుపడి అతడ్ని హతమార్చివేశారు.

అంతలో అక్కడ దరిదాపుల్లో ఉన్న దాదాపు పాతిక మంది ముస్లింలు పరుగెత్తుకొని వచ్చారు. మరో వైపునుంచి ఏడొందల మంది యూదులు ఆయుధాలు ధరించి వచ్చారు. అంతమంది యూదుల్ని చూసి ముస్లింలు భయపడలేదు. వెంటనే వారు వరల్లో నుంచి ఖడ్గాలు లాగి పోరాటానికి ఉపక్రమించారు.

ఈవిధంగా పాతిక మంది ముస్లింలు ఏడొందలు మంది యూదులతో తలపడుతూ వీరోచితంగా పోరాడసాగారు. వారి ధైర్యసాహసాలు చూసి యూదులు ఆశ్చర్యపోయారు. ముస్లింలు చాలా సేపు పోరాడారు. చివరికి వారి సత్తువ క్రమంగా తగ్గి పోసాగింది. అప్పుడు యూదుల వెనుక వైపు నుంచి "అల్లాహుఅక్బర్" అనే నినాదాలు వినవచ్చాయి.



ఆ వెనువెంటనే దైవప్రవక్త (సల్లం) నేతృత్వంలో దాదాపు మూడొందల మంది సాయుధ ముస్లింలు వచ్చిపడ్డారు.

పరిస్థితి ప్రమాదసూచిక దాటిందని గ్రహించిన దైవప్రవక్త (సల్లం) యూదుల్ని సంబో ధిస్తూ ఎంతో ఆవేదనాభరిత హృదయంతో ఇలా అన్నారు:

"యూద సోదరులారా! నేను దైవప్రవక్తనని మీకు బాగా తెలుసు. నామాట విని ఇస్లాం స్వీకరించండి. లేకుంటే చాలా నష్టపోతారు. బదర్ యుద్ధంలో బహుదైవారాధకులకు జరిగిన పర్యవసానం ఏమిటో మీరు చూశారు కదా! బాగా ఆలోచించుకోండి."

కాని యూదులు వైరోన్మాదంతో ఊగిపోతూ "ముహమ్మద్! మోసపోకు. వారు అనుభం లేనివారు. అలాంటివారిని ఓడించడం పెద్ద ఘనకార్యం అనుకుంటున్నావు కాబోలు. మాతో రంగంలోకి దిగు, యుద్ధం అంటే ఏమిటో తెలుస్తుంది" అన్నారు.

ఒప్పందం ఉల్లంఘనకు ఇంతకంటే ప్రబల నిదర్శనం మరేముంది? కయ్యానికి కాలుదువ్వే బహిరంగ ప్రకటన ఇది. దైవప్రవక్త (సల్లం) ఎంత నచ్చజెప్పినా వారు వినలేదు. చివరికి దైవప్రవక్త (సల్లం) వాళ్ళతో యుద్ధం చేయక తప్పలేదు.

దైవప్రవక్త (సల్లం) ఆదేశం లభించగానే ముస్లిం యోధులు యూదుల సైన్యంలోకి దూసుకుపోయి తుఫానులా విరుచుకుపడ్డారు. కాస్సేపటికే యుద్ధం పరాకాష్ఠకు చేరింది. యూదులు ముస్లింల ధాటికి నిలువలేక వెనుకకు జరుగుతూ పోయారు. చివరికి పారిపోయి తమ కోటలోకి దూరి తలుపులు మూసుకున్నారు.

దైవప్రవక్త (సల్లం) వారి కోటను ముట్టడించమని అనుచరుల్ని ఆదేశించారు. తక్షణమే అనుచరులు కోటను ముట్టడించారు. అంతేకాకుండా యూదులకు బయటి నుంచి ఆహార పదార్థాలు కూడా సరఫరా కాకుండా అన్ని వైపుల నుంచి కోటను దిగ్బంధం చేశారు. కాని ముస్లింలు ఎంత ప్రయత్నించినా కోటలోకి ప్రవేశించలేకపోయారు. ఆ విధంగా పదిహేను రోజులు గడచిపోయాయి. అటు కోటలో ఆహారపదార్థాలు నిండు కోవడంతో యూదులు పస్తులతో విలవిల్లాడి పోయారు. చివరికి వారు కోట తలుపులు తెరచి ముస్లింలకు లొంగి పోయారు. దైవప్రవక్త (సల్లం) వారందర్నీ ఖైదీలుగా పట్టుకొని మదీనా తీసికెళ్ళారు.

ఆనాటి అరబ్ యుద్ధనీతి ప్రకారం యుద్ధ ఖైదీలందర్నీ వధించాలి. అందువల్ల యూద ఖైదీలు తమకిక చావు తప్పదని భావించి భయపడ్డారు. వెంటనే వారు కపటుల నాయకుడు అబ్దుల్లా బిన్ ఉబయిని రంగంలోకి దించారు. అయితే దైవప్రవక్త తన ముఖ్య అనుచరులను సంప్రదించిన తరువాత ఆ యూదులను మదీనా నుంచి బహిష్కరించాలని నిర్ణయించారు. ఇబ్నెఉబయి బదర్ యుద్ధఖైదీల పట్ల దైవప్రవక్త (సల్లం) కనబరచిన ఔదార్యం, సౌమ్యతలు చూసి బనూఖైనుఖా యూదుల్ని మదీనా నుంచి బహిష్కరించవద్దని, వారిని క్షమించమని దైవప్రవక్త (స) దగ్గరికి విన్నవించు కుందామని తలచాడు. కాని ముస్లింలు అతని ఉద్దేశ్యం కనిపెట్టి అతడ్ని దైవప్రవక్త (సల్లం) దగ్గరకు పోనీయకుండా నిరోధించారు.

బనూఖైనుఖా యూదులు గత్యంతరంలేక మదీనా విడిచిపెట్టి వెళ్ళిపోయారు. వారు సిరియా సరిహద్దులకు పోయి స్థిరపడ్డారు. యూదులు వదలిపెట్టి పోయిన కోటలు, ఇండ్లు, ఆయుధాలు, వెండి బంగారు రాసులు అన్నీ ముస్లింలకు దక్కాయి.

ఈ సంఘటనతో అరేబియాలో ఇస్లాం ఔన్నత్యం ఇనుమడించింది. అంతపెద్ద యూదతెగ, అందులో ఎంతో ధైర్యసాహసాలకు ప్రసిద్ధిచెందిన తెగకు మదీనాలో నిలువ నీడలేకుండా పోయింది. దీన్ని బట్టి ముస్లింలు ఎంత బలపడ్డారో తెలుస్తోంది. ఇక వారికి ఎదురే లేదు! ఈ ఆలోచనతో మదీనా దరిదాపుల్లో ఉన్న బనీనజీర్, బనీఖురైజా అనే మరో రెండు యూదతెగలు ముస్లింలకు భయపడి మౌనంగా ఉండిపోయాయి.

బనీనజీర్ తెగ యూదుల్లో కాబ్ బిన్ అష్రఫ్ అనే ఓ కర్కోటకుడు ఉన్నాడు. మదీనా వెలుపలున్న ఓ కోటలో నివసిస్తున్నాడు. అక్కడ మరికొందరు యూదులు కూడా ఉన్నారు. దైవప్రవక్త (సల్లం) పేరు వింటేనే కాబ్ ఆపాదమస్తకం మండిపడేవాడు. బదర్ యుద్ధంలో అనేకమంది ఖురైషీయులు చంపబడ్డారని వినగానే అతను ఆగ్రహంతో చిందులు తొక్కాడు.

“ఏమిటీ నిజమేనా! మొత్తం ఖురైష్ నాయకులు వధించబడ్డారా!! అయ్యయ్యో! ఎంత ఘోరం జరిగింది!! వీరంతా అరబ్ ప్రముఖులే! వీరు మా నాయకులు!! నిజంగా వీరు యుద్ధంలో మరణించివుంటే ఇక మనం బ్రతికుండి ప్రయోజనం ఏమిటీ?” అని తెగ వాపోయాడు. ఈ వార్త నిజమేనని నమ్మకం కుదరగానే అతను అసహనంతో అరుస్తూ, గుండెలు బాదుకుంటూ మక్కా పరుగెత్తాడు.

కాబ్ వెళ్ళగానే మక్కా ప్రజల ముందు ముస్లింలను నిందిస్తూ వారిపై దుష్ప్రచారం మొదలెట్టాడు. అవిశ్వాసుల భావోద్రేకాలను రెచ్చగొడ్తూ ప్రసంగాలు చేశాడు. దైవప్రవక్త (సల్లం)కు వ్యతిరేకంగా బహుదైవారాధకుల్ని ఉసిగొల్పాడు. బదర్‌లో మరణించిన ఖురైష్ నాయకుల పేర్లను ప్రస్తావిస్తూ విషాదగీతాలు ఆలపించాడు.

మక్కా ఖురైషీయులు అతడ్ని తెగ పొగిడి ఆకాశానికి ఎత్తారు. అమితమైన గౌరవ మర్యాదలు జరిపారు. ఘనంగా ఆతిథ్యమిచ్చారు. మక్కాలో కాబ్ పలికే ఉద్రేకపూరితమైన మాటలకు వంతపాడే స్వార్థపరులైన కవులు కూడా కొందరు అతని చుట్టూ చేరారు. కాబ్ లాగానే వీరు కూడా తమ గేయాలు, కవితల ద్వారా జనాన్ని రెచ్చగొట్టసాగారు.

ఈవిధంగా కాబ్ ముస్లింల పట్ల ఖురైషీయుల గుండెల్లో అమితమైన ద్వేషాగ్ని జ్వాలలు రేకెత్తించాడు. చివరికి స్త్రీలు కూడా కసి, ద్వేషాలతో కుతకుతలాడి పోయారు. వారు బదర్ యుద్ధంలో హతులైనవారి గురించి హృదయాన్ని కలచివేసే విషాద గీతాలు ఆలపించేవారు. అదీగాక దైవప్రవక్త (స)ను నిందిస్తూ విషం వెదజల్లే పాటలు కూడా పాడి ఖురైషీయుల గుండెల్లో ప్రతీకారాగ్నిని మరింత ప్రజ్వరిల్లజేసేవారు.

అయితే అప్పటికీ కాబ్ గుండెల్లో రగిలిన మంటలు చల్లారలేదు. అతను ద్వేషాగ్నితో మండిపోతూ మక్కా నుంచి మదీనా తిరిగొచ్చి ముస్లిం మహిళలపై బురద చల్లడానికి పాల్పడ్డాడు. వారి పవిత్ర శీలంపై దాడి చేయడానికి పూనుకున్నాడు.



ఆ కర్కోటకుడి కుచేష్టలను ముస్లింలు చాలా కాలం సహించారు. కాని ఎంత కాలమని అలా సహిస్తూ ఊరుకుంటారు? అతని దుష్టచేష్టలు హద్దుమీరిపోయాయి. ముస్లింలలో ఓర్మి నశించింది. చివరికి వారు ఆ దుష్టుడ్ని తుదముట్టించదలిచారు.

ఈ పని కోసం దైవప్రవక్త (స) ముహమ్మద్ బిన్ మస్లమా (రజి)ని నియమించారు. ఇబ్నె మస్లమాకు, కాబ్‌కు మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. కాని ఆయన ముస్లిం అయిన సంగతి కాబ్‌కు తెలియదు. అంచేత ఈబ్నెమస్లమా (రజి) ఓరోజు తన సహచరులతో కలసి వెళ్ళి అతడ్ని శాశ్వతంగా కడతేర్చారు.

## మదీనాలో రెడ్ అలర్ట్-(90)

దైవప్రవక్త (సల్లం) తమకు విజయం లభించిందనే సంతోషంలో పడి ఖురైషీయుల పరిస్థితి విస్మరించలేదు. వారు ఓడిపోయి ప్రశాంతంగా కూర్చునే జాతి కాదని ఆయనకు తెలుసు. అంచేత ఆయన శత్రువుల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ఎప్పుడో ఒకప్పుడు ఖురైషీయుల గుండెల్లో మండుతున్న ప్రతీకార అగ్నిపర్వతం బ్రద్దలయ్యే సమయం ఆసన్నమవుతుందని ఆయన గ్రహించారు.

ఆ సమయం రానేవచ్చింది. మక్కాలో యుద్ధసన్నాహాలు ఊపందుకున్నాయి. దైవప్రవక్త (స) పినతండ్రి అబ్బాస్ (రజి) ఇదివరకే ఇస్లాం స్వీకరించి ఉన్నారు. అయితే ఆయనింకా మదీనాకు వలసపోకుండా మక్కాలోనే ఉన్నారు. బహుదైవారాధకుల యుద్ధ సన్నాహాలు చూసి వెంటనే ఆయన ఖురైషీయులు మదీనాపై దాడిచేయడానికి యుద్ధ సన్నాహాలు చేస్తున్నారని, ఈసారి అనేక ఆయుధాలు, వాహనాలతో భారీఎత్తున సైనిక సమీకరణ జరుగుతోందని రహస్యంగా దైవప్రవక్త (స)కు సమాచారం పంపించారు.

ఈవార్త విని దైవప్రవక్త (స) ఆందోళన చెందలేదు. ఇలా జరుగుతుందని ఆయన ముందే ఊహించారు. కాని ఏడాది తిరక్కముందే బహుదైవారాధకులు అన్ని ఆయుధాలు, అంతపెద్ద సైన్యం సిద్ధం చేస్తున్నారని విన్న తర్వాత ఆయన ఆశ్చర్యపడక తప్పలేదు.

ఖురైషీయులు రాత్రింబవళ్ళు యుద్ధసన్నాహాలలో నిమగ్నులయి పోయారు. ఆయుధాలు, ఆహార పదార్థాలు సేకరిస్తున్నారు. ఎక్కడెక్కడ నుంచో పేరుమోసిన వీరులు, పహిల్వానులు వచ్చి సైన్యంలో భర్తీ అవుతున్నారు. దాని కొసం ఖురైషీయులు మక్కా చుట్టుప్రక్కల ఉన్న ఎన్నో తెగలను ప్రేరేపించి యుద్ధ ఒడంబడికలు చేసుకున్నారు. అనేక మంది కవులు, ఉపన్యాసకుల్ని రప్పించి ముస్లింలకు వ్యతిరేకంగా బాగా నూరి పోశారు. తరువాత వారంతా వివిధ తెగల్లోకి పోయి తమ కవితానైపుణ్యంతో, వాగ్ధాటితో యువకుల పౌరుషాన్ని రెచ్చగొట్టి యుద్ధంలో పాల్గొనేలా చేశారు.

అనుకున్న పనులు చకచకా జరుగుతున్నాయి. కొన్నాళ్ళలోనే ఖురైషీయులు ఓ పెద్ద సైనికపటాలం తయారుచేశారు. ఆయుధాలు, ఆహారపదార్థాలు అపారంగా సేకరించారు.

బదర్ యుద్ధంలో తండ్రులను, కొడుకులను పోగొట్టుకున్న అనేకమంది స్త్రీలున్నారు. అంచేత వారు కూడా ముస్లింల మీద పట్టరాని ఆగ్రహంతో పగబూనిన త్రాచుపాముల్లా

అదను కోసం కాచుకొని కూర్చున్నారు. అలాంటి స్త్రీలకు అబూసుఫ్యాన్ భార్య హిందా నాయకురాలు. బదర్ యుద్ధంలో ఆమె తండ్రి, పినతండ్రి, అన్న ముగ్గురూ వధించ బడటంతో ఆమె కసి తారస్థాయికి చేరింది. ముస్లింల మీద ప్రతీకారం తీర్చుకునేదాకా ఎలాంటి పరిమళద్రవ్యాలు వాడనని భీష్మించింది.

సైనికదళాలు బయలుదేరే సమయానికి హిందా కూడా కొంతమంది స్త్రీలను సిద్ధం చేసుకొని వచ్చేసింది. సైన్యంవెంట రాకుండా ఆమెను ఆపడానికి కొందరు ప్రయత్నించారు. కాని ఆమె ససేమిరా ఒప్పుకోలేదు.

జుబైర్ బిన్ ముత్యిమ్ పినతండ్రి కూడా బదర్ యుద్ధంలో వధించబడ్డాడు. జుబైర్ బానిస వహ్షీ బల్లెం విసరడంలో అందెవేసిన చేయి. జుబైర్ తన బానిసతో "వహ్షీ! ముహమ్మద్‌ను గాని, హమ్జానుగాని, అలీనిగాని వధించి నా పినతండ్రి హత్యకు బదులు తీర్చుకున్నావంటే, నీకు బానిసత్యం నుంచి విముక్తి కలిగిస్తాను" అని చెప్పాడు. హిందా కూడా వహ్షీతో "నేను నా బంధువుల పగతీర్చుకోవాలి, అంచేత నీవు ఈ ముగ్గురిలో ఎవరో ఒకరిని చంపగలిగావంటే నీకు గొప్ప బహుమానం ఇస్తాను" అన్నది.

వహ్షీ ఇద్దరి మాటలు ఒప్పుకొని సైన్యంతో కలసి బయలుదేరాడు.

ధగధగ మెరిసే ఉక్కు కవచాలు ధరించి రకరకాల ఆయుధాలు చేతబూనిన మూడు వేలమంది సిపాయీలు దైవప్రవక్త (సల్లం)ను, ముస్లింలను చీల్చి చెండాటానికి తహతహ లాడుతున్నారు. అబూసుఫ్యాన్ సర్వసేనాని. సైన్యంలో ఇతరత్రా పనుల కోసం పదిహేనుమంది స్త్రీలు కూడా ఉన్నారు. వీరికి అబూసుఫ్యాన్ భార్య హిందా నాయకురాలు. అంతా సిద్ధమైన తర్వాత పెద్ద పెట్టున కోలాహలంతో సైనికవాహిని బయలుదేరింది.

ఖురైషీయుల సైనికులు ఉరకలు వేస్తున్న ఉత్సాహంతో అనేక మజిలీలు దాటుకుంటూ, తింటూ, త్రాగుతూ, ఆవేశంలో విర్రవీగుతూ పోతున్నారు. వారి వెంటవున్న స్త్రీలు దారి పొడుగూతా బదర్‌లో ప్రాణాలు కోల్పోయిన వీరయోధుల విషాద గేయాలు ఉత్తేజంతో పాడుతున్నారు. గత సంఘటనలు గుర్తుచేస్తూ సైనికుల పౌరుషాన్ని రెచ్చగొడ్తున్నారు. గుండెలను పిండే పాటలు పాడుతూ ముస్లింలపై ప్రతీకార చర్య కోసం ఉసిగొల్పుతున్నారు.

సైన్యం 'అబ్వా' అనే ప్రదేశానికి చేరుకుంది. దైవప్రవక్త (సల్లం) మాతృమూర్తి అక్కడే సమాధి చేయబడ్డారు. ఆ సమాధిని చూడగానే అబూసుఫ్యాన్ భార్య హిందాకు ఉక్రోషం పుట్టుకొచ్చింది. "అదిగో చూడండి, అక్కడ ముహమ్మద్ తల్లి సమాధి ఉంది. ఇదే మంచి అవకాశం. పదండి, సమాధిని పాడుచేద్దాం. అంతగా నష్టపరిహారం ప్రశ్నవస్తే మన సైన్యం నుండి ఖైదీ అయినవారి శరీరంలోని ఒక్కొక్క అంగాన్ని ఇచ్చివేద్దాం" అన్నది ఆమె.

సైన్యంలో కొందరు ఆమె మాటలకు అడ్డుతగులుతూ "వద్దువద్దు. అలా పొరపాటున కూడా చేయకూడదు. అలా చేశారా బనీఖుజాఆ, బనీబకర్ తెగవాళ్ళు మన వాళ్ళ సమాధు లన్నిటినీ తవ్విపారేసి శవాల్ని బయటికి లాగేస్తారు" అని హెచ్చరించారు. వారి హెచ్చరికతో మిగిలిన సైనికులెవరూ ఆ సమాధి జోలికి పోవడానికి సాహసించలేదు.



అక్కడ్నుంచి సైన్యం అనేక ప్రదేశాలు దాటుకుంటూ 'అతీఖ్' అనే చోటికి చేరుకొని ఆగిపోయింది. ఇది మదీనాకు దాదాపు అయిదు మైళ్ళ దూరంలో ఉన్న కీలక ప్రాంతం.

ఖురైష్ సైన్యం అతీఖ్ ప్రాంతం చేరే సమయానికి ఖుబాలో ఉన్న దైవప్రవక్త (సల్లం)కు మక్కా నుండి ఆయన పినతండ్రి హజ్రత్ అబ్బాస్ (రజి) పంపిన రహస్య లేఖ అందింది. మక్కా ఖురైషీయులు మదీనాపై దాడిచేయడానికి వస్తున్నారని చేసిన హెచ్చరికే దాని సారాంశం. హజ్రత్ ఉబయి బిన్ కాబ్ (రజి) ఈ లేఖ చదివి విన్పించారు. ఈ వార్త విని దైవప్రవక్త (సల్లం) "అలాగా! సరే ఈ విషయం ఇంకెవరి ముందూ ప్రస్తావించకండి" అన్నారు.

ఆ తరువాత ఆయన మదీనా చేరుకొని నేరుగా సాద్ బిన్ రబీ (రజి) ఇంటికి వెళ్ళారు. అక్కడ సాద్ (రజి)కు ఈ సంగతి తెలిపి "దీన్ని గురించి ముఖ్య అనుచరులతో సంప్రదించ వలసివుంది. కనుక మీరీ విషయం ఎక్కడా పొక్కనీకుండా రహస్యంగా ఉంచండి" అని అన్నారు.

దైవప్రవక్త (సల్లం), సాద్ బిన్ రబీ (రజి)లు మాట్లాడుకున్న విషయాలు అక్కడే ఉన్న సాద్ శ్రీమతి కూడా విన్నారు. కాని ఆమె ఈ వార్తను రహస్యంగా ఉంచలేక పోయారు. మెల్లగా అది కొందరి చెవిన పడింది. ముఖ్య అనుచరులతో ఇంకా సలహా సంప్రదింపులు కూడా జరపలేదు. అప్పుడే ఈ వార్త నగరమంతా వ్యాపించింది.

దైవప్రవక్త (సల్లం) ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా హజ్రత్ అనస్ (రజి)ను, హజ్రత్ మూనిస్ (రజి)ను శత్రుసైన్యాన్ని గురించి సమాచారం తెలుసుకొని రమ్మని పంపారు. వారిద్దరు తక్షణమే పోయి తిరిగొచ్చారు. "ఖురైష్ సైన్యం మదీనాకు అతి సమీపంగా వచ్చేసింది. వారి ఒంటెలు, గుర్రాలు మన పొలాలన్నిటిని మేసి ధ్వంసం చేశాయి. మదీనా పచ్చికబయళ్ళు కూడా పూర్తిగా తుడిచి పెట్టుకుపోయాయి" అనే వార్త విన్పించారు.

దైవప్రవక్త (సల్లం) ఈసారి సైనిక బలం ఎంత ఉందో తెలుసుకొని రమ్మని హజ్రత్ హుబాబ్ బిన్ మున్జిర్ (రజి)ని పంపించారు. ఆయన రహస్యంగా శత్రుశిబిరాలకు సమీపంగా పోయి సైనికులు, వాహనాలు, ఆయుధాలను ఒకసారి జాగ్రత్తగా కలియ జూశారు. తిరిగొచ్చి దైవప్రవక్త (సల్లం)కు పూర్తి సమాచారం అందించారు.

అప్పటికి సూర్యాస్తమయం అయింది. మసీదు నుంచి ముఅజ్జిన్ దేవుని ఔన్నత్యం కొనియాడుతూ దైవదాసుల్ని నమాజ్ కోసం పిలుస్తున్నాడు. ముఅజ్జిన్ పిలుపుతో దైవభక్తులు మసీదులో ప్రవేశించి ప్రార్థనలో లీనమయ్యారు. దైవమే తమ రక్షకుడనే విశ్వాసాన్ని మరొక్కసారి దృఢంగా తమ హృదయాల్లో ధృవపరచుకొని బయటికి వచ్చారు.

చీకటి తెరలు మదీనా నగరాన్ని దట్టంగా కప్పి వేస్తున్నాయి. నగరం బయటి నుంచి ఉప్పెనలా ఉపద్రవం ముంచుకొస్తోంది. భయంకరమైన ఆ రాత్రి శత్రువులు ఏ క్షణాన ఎటువైపు నుంచి దాడిచేస్తారో తెలియకుండా ఉంది. ఒక్కొక్క ఘడియ ఒక్కొక్క యుగంలా గడుస్తోంది. కొందరు ముస్లింలు సైనిక దుస్తులు వేసుకొని ఖడ్గధారులయి

రాత్రంతా నగర సరిహద్దుల్ని కాపలా కాస్తూ జాగరణ చేశారు. అయితే ఆ రాత్రి శత్రువుల నుండి ఎలాంటి కవ్వింపు చర్యలు లేకుండా క్షేమంగా గడచిపోయింది.

తెల్లవారింది. ఉదయభానుడు తన సువర్ణ కాంతులతో మదీనా నగరాన్ని పులకింప జేశాడు. నగరంలో ఏదో హడావిడి కానవస్తోంది. దైవప్రవక్త (సల్లం) అత్యవసర సమావేశం ఏర్పాటుచేశారు. ముఖ్య అనుచరులతో సహా అనేకమంది సమావేశానికి హాజరయ్యారు. దైవప్రవక్త (సల్లం) పరిస్థితిని సభికుల ముందుంచి ఇలా అన్నారు:

"ఖురైష్ సైన్యం నగర శివార్లలో మోహరించి ఉన్న సంగతి మీకందరికీ తెలుసు. ఇక ఏమాత్రం ఆలస్యం చేసినా పరిస్థితి విషమించేలా ఉంది. శత్రువుని ఎలా ఎదుర్కొందామో ఆలోచించండి. నగరం వెలుపలున్న శత్రువు జోలికి పోకుండా మనం మదీనాలో ఉండి పోతేనే మంచిదని నా అభిప్రాయం. శత్రువు మదీనాపై దాడిచేయకుండా అక్కడే ఆగిపోతే మనకు ఎలాంటి చిక్కులేదు. మదీనా వీధులు, సందులు మనకు తెలిసినంత వివరంగా వారికి తెలియవు. అంచేత శత్రువులు మన మీదికి దాడిచేయడానికి వస్తే మనం నగరంలోనే ఉండి వారిని ఎదుర్కోవచ్చు. అనేకమందిని అవలీలగా పట్టి హతమార్చవచ్చు. మరి మీ ఉద్దేశ్యం ఏమిటో తేల్చి చెప్పండి."

దైవప్రవక్త (సల్లం) కంటే ఎక్కువ విజ్ఞతకల అభిప్రాయం ఎవరు వ్యక్తపరచగలరు? ప్రధాన సహచరులంతా సంతోషంతో దైవప్రవక్త (సల్లం) అభిప్రాయంతో ఏకీభవించారు. కపట విశ్వాసి అబ్దుల్లా బిన్ ఉబయి కూడా దైవప్రవక్త (సల్లం) అభిప్రాయాన్ని సమర్థించడం మాత్రం ఆశ్చర్యంగా ఉంది.

"దైవప్రవక్తా! మీ అభిప్రాయం అమోఘంగా ఉంది. మనం కదలకుండా నగరంలోనే ఉందాం. ఈ విషయంలో మాకు చాలా అనుభవం ఉంది. గతంలో నగరం వదలిపెట్టి బయట యుద్ధం చేసినప్పుడల్లా మేము అవమానానికే గురయ్యాం. శత్రువులు నగరం మీద ఎప్పుడు దండెత్తినా ఘోరంగా ఓడిపోవడం జరిగింది. అంచేత శత్రువుల్ని అక్కడే పడి ఉండనివ్వండి. అంతగా నగరంలోకి వస్తే రానివ్వండి. మనం వాళ్ళను చుట్టుముట్టి సంహరిద్దాం. స్త్రీలు, పిల్లలు కూడా ఇంటి కప్పుల నుండి రాళ్ళ వర్షం కురిపించి శత్రువు నడుం విరిచేస్తారు" అన్నాడతను.

అయితే బదర్‌యుద్ధంలో పాల్గోలేక పోయినవారు కొందరున్నారు. బదర్ యుద్ధంలో పాల్గోలేకపోయామే అనే బాధ వాళ్ళను పీడిస్తోంది. బదర్ యుద్ధంలో ముస్లింలకు లభించిన అద్భుత విజయం చూసిన యువకులు కూడా మరికొందరున్నారు. వీరంతా ఆవేశంతో లేచి నగరం నుండి బయలుదేరి యుద్ధం చేయాలని పట్టుబట్టారు.

"దైవప్రవక్తా! శత్రువుల్ని ఎదుర్కోవడానికి నగరం బయటికి వెళదాం. మేమంతా మీవెంట ఉన్నాం. ఇక్కడే ఉంటే మనం భయపడి నగరం నుంచి కదల్లేక పోయామని శత్రువులు అనుకోవచ్చు. దాంతో వారు మరింత బరితెగించి మనపై దాడిచేస్తారు. దైవప్రవక్తా! బదర్‌లో మనం మూడొందలమంది మాత్రమే అయినా దేవుడు మనకు విజయం ప్రసాదించాడు. ఇప్పుడు మనం చాలామంది ఉన్నాము. మేము ఈరోజు



కోసమే ఎదురుచూస్తున్నాం. దీని కోసమే మేము ఆరాటపడుతున్నాం" అన్నాడు వారిలో ఒక యువకుడు ఉద్రేకంతో.

"దైవప్రవక్తా! శత్రువులు మన పట్నం పొలిమేరల్లోకి వచ్చి మన పొలాలను సర్వ నాశనం చేశాడు కదా? ఇంకా మనం ఏ సమయం కోసం వేచివుండాలి?" అన్నాడు మరో యువకుడు.

"నేను ఎంత ప్రయత్నించినా బదర్ యుద్ధంలో పాల్గోలేకపోయాను. నా కొడుకు పాల్గొని అమరగతుడయ్యాడు. ఎంతో అదృష్టవంతుడు. రాత్రి నా కలలోకి వచ్చి 'నాన్నా! మీరు కూడా రండి. స్వర్గంలో మాతోపాటు హాయిగా ఉండవచ్చు. ప్రభువు మనకు చేసిన వాగ్దానాన్ని నేనిక్కడ ప్రత్యక్షంగా చూస్తున్నాను' అని చెప్పాడు. అంచేత దైవప్రవక్తా! నగరం బయటికెళ్ళి శత్రువుల్ని ఢీకొందాం" అన్నాడు వేరొక అనుచరుడు.

"దైవప్రవక్తా! మీపై ఖుర్‌ఆన్ అవతరింపజేసిన దేవుని సాక్షిగా చెబుతున్నాను. నగరం బయటికి పోయి శత్రువులతో తలపడేవరకు నేను అన్నం ముట్టను" అన్నారు హజ్రత్ హమ్జా (రజి) దృఢమైన సంకల్పంతో.

వీరి వాదనలతో మిగిలిన ముస్లింలలో కూడా నూతనోత్సాహం పెల్లుబికింది. అనేక మంది నగరం బయటికెళ్ళే యుద్ధం చేయడానికి తహతహలాడసాగారు. వీళ్ళను బదర్ వీరులు కూడా బలపరిచారు. నిజానికి అందరి హృదయాల్లోనూ ఇస్లాంపై ఏమాత్రం మచ్చ రానీయకూడదనే తపన, దైవమార్గంలో ప్రాణాలు అర్పించాలనే బలమైన కోరిక ఉన్నాయి. ప్రతిఒక్కడూ దేవుని ప్రసన్నతకు పాత్రుడు కావాలనే తాపత్రయపడుతున్నాడు.

ఇక నగరం నుంచి బయటికెళ్ళి యుద్ధం చేయక తప్పదు. దైవప్రవక్త (స) పరిస్థితి అర్థంచేసుకొని సమావేశాన్ని ముగిస్తూ "అధికసంఖ్యాక సభ్యుల అభిప్రాయం ప్రకారమే నగరం బయటికెళ్ళి శత్రువులతో పోరాడుదాం" అని తీర్మానించారు.

ఆరోజు శుక్రవారం. జుమా నమాజ్ కోసం వచ్చిన భక్తులతో మస్జిదె నబవి నిండి పోయింది. ఇస్లామీయ ఉద్యమ సారథి జుమా ప్రసంగం చేయడానికి వేదికనెక్కారు. మదీనా శివార్లలో శత్రువులు మోహరించి ఉండటంవల్ల ఈరోజు జుమాప్రసంగం వినడానికి జనం తహతహలాడుతున్నారు.

దైవప్రవక్త (స) జిహాద్‌ని గురించి ఉపన్యాసం ఇస్తూ "మీరు అత్యంత సహనంతో వ్యవహరిస్తే విజయం మిమ్మల్నే వరిస్తుంది" అని ధైర్యసాహసాలు ప్రేరేపించారు.

ఆ తరువాత ఆయన అసర్ నమాజ్ కూడా ముగించుకొని ఇంటికెళ్ళారు. ఆయన వెంట అబూబకర్, ఉమర్ (రజి)లు కూడా ఉన్నారు. వారాయనకు యుద్ధకవచం తొడిగి తలపై శిరస్త్రాణం పెట్టారు. తరువాత దైవప్రవక్త (సల్లం) తన నడుంకు ఖడ్గం వ్రేలాడదీసుకొని యుద్ధానికి సిద్ధమయ్యారు.

దైవప్రవక్త (సల్లం) ఇంటి ముందు గుమిగూడిన యువకులు నగరం వెలుపలే యుద్ధం జరుగుతుందని భావించి ఆనందంతో గంతులేస్తున్నారు. కాని కొంతమంది మాత్రం నగరం వెలుపల యుద్ధం చేయడంలో నష్టం ఉందనే భావనతో సంతోషంగా

లేరు. అంచేత ఈ రెండువర్గాల వాళ్ళు పరస్పరం వాదించుకోసాగారు. బయటికెళ్ళి యుద్ధం చేయాలని పట్టుబట్టినవారితో హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ (రజి), హజ్రత్ ఉసైద్ బిన్ హుజైర్ (రజి) ఇలా అన్నారు:

"మీరు దైవప్రవక్త (సల్లం) అభిప్రాయంతో ఏకీభవించకుండా బయటికి పోయి యుద్ధం చేయాలని ఆయనపై వత్తిడి తెచ్చారు. ఆయన దగ్గరకు దైవసందేశం వస్తోందని తెలిసి కూడా మీరిలా ప్రవర్తించడం ఏమీ బాగా లేదు. ఈ వ్యవహారాన్ని దైవప్రవక్త (స)కు వదిలేసి ఆయన చెప్పినట్లు నడచుకోండి. ఆయన ఏది తీర్మానిస్తారో దాన్ని అనుసరించడంలోనే మనందరి క్షేమం ఉంది."

లోపలనుంచి ఈ మాటలు వింటున్న దైవప్రవక్త (స) బయటికి వచ్చారు. ఆయన వేషం, వాలకం చూసి బయటికెళ్ళి యుద్ధం చేయాలని పట్టుబట్టినవారంతా సిగ్గుతో తలదించుకున్నారు. "దైవప్రవక్తా! మేము మీమాట వినకుండా చాలా తప్పుచేశాం. మమ్మల్ని క్షమించండి. మీరు ఏది మంచిదని తలిస్తే అదే చేయండి" అన్నారు వారు.

"నేను ముందే చెప్పాను. కాని మీరు నామాట వినలేదు. కాని ఇప్పుడు కరవాలం చేపట్టిన తర్వాత దాన్ని క్రిందపడేయడం దైవప్రవక్తల లక్షణం కాదు. అంచేత ఇక బయలుదేరక తప్పదు. అయితే ఒక విషయం గుర్తుంచుకోండి. దేవుని పేరుతో బయలుదేరండి. ఓర్పు వహిస్తే విజయం మీదే అవుతుంది" అన్నారు దైవప్రవక్త (సల్లం).

అనుచరులంతా మారు మాట్లాడకుండా యుద్ధ సన్నాహాలలో మునిగిపోయారు. త్వరత్వరగా కావలసిన సామగ్రినంతా సేకరించారు. కొన్ని ఒంటెలు, రెండు గుర్రాలు మాత్రమే లభించాయి. అందులో ఒకదాన్ని దైవప్రవక్త (సల్లం)కు కేటాయించారు. మొత్తం వేయిమంది వీరులు తయారయ్యారు.

సైన్యంలో అతి పిన్న వయస్కులైన యువకులు కూడా కొందరు ఉన్నారు. దైవప్రవక్త (సల్లం) సిపాయీలందర్నీ ఓసారి పరిశీలించి యుద్ధానికి అనర్హులని భావించిన బాలయోధులందర్నీ సైన్యం నుంచి తొలగించి ఇళ్ళకు పంపివేశారు. ఇద్దరికి మాత్రం అనుమతి లభించింది. వారిలో రాఫె అనే బాలయోధుడు ధనుర్బాణంలో అందవేసిన చేయి. రెండవ బాలయోధుడు సమ్రహ్ కూడా మంచి పరాక్రమశాలే. అప్పటికి వారిద్దరి వయస్సు పదిహేనేళ్ళు మాత్రమే.

ఆ తరువాత దైవప్రవక్త (స) హిజ్రీశకం 3వ సంవత్సరం, షవ్వాల్ నెలలో మదీనా పాలకునిగా అంధ అనుయాయి హజ్రత్ ఇబ్నె ఉమ్మెమక్తూమ్ (రజి)ని నియమించి వేయిమంది యోధులతో బయలుదేరారు.

సైన్యం వెంట కొందరు మహిళలు కూడా బయలుదేరారు. వారిలో ప్రవక్త సతీమణి ఆయిషా (రజి), ఉమ్మెసలీం (రజి), ఉమ్మె సలీత్ (రజి) కూడా ఉన్నారు.

సైన్యంలో కపట విశ్వాసుల నాయకుడయిన అబ్దుల్లా బిన్ ఉబై కూడా ఉన్నాడు. అతను తన మూడొందల మంది అనుయాయులతో వచ్చాడు. మదీనా నుండి రెండు మైళ్ళు పోయిన తరువాత అతను నాటకం చాలించి తన అనుయాయుల్ని తీసుకొని సైన్యం నుండి వేరయిపోయాడు.



హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజి) అతనికి అనేక విధాలుగా నచ్చజెప్పారు. దైవప్రవక్త (సల్లం)తో చేసుకున్న ఒడంబడికను కూడా గుర్తుచేశారు. అయినా అతను వినలేదు. పైగా "ముహమ్మద్ (సల్లం) మా మాట వినకుండా ఆ కుర్రకుంకలు చెప్పిన మాటలు అనుసరించాడు" అన్నాడు చురచుర చూస్తూ.

చివరికి హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజి) అతని అనుచరులకైనా నచ్చజెబుతామని "సోదరులారా! దైవానికి భయపడండి. శత్రుసైన్యాలు సమీపానికి వచ్చి ఉన్న ఇలాంటి క్లిష్ట సమయంలో మీరు మీ ప్రవక్త (స)ను, మీ సోదర యోధులను వదలిపెట్టి పోవడం భావ్యం కాదు" అన్నారు బాధాజనిత కంఠంతో.

"శత్రువులతో పోరాడవలసి వస్తుందని నమ్మకం ఉంటే మేము మిమ్మల్ని వీడిపోయే వాళ్ళం కాము. అలాంటి పరిస్థితి రాదని మా అభిప్రాయం" అని చెప్పి వెళ్ళిపోయారు ఆ విశ్వాసఘాతకులు.

కపటవిశ్వాసులు వెళ్ళిపోగా ఇక సైన్యంలో ఏడొందల మంది యోధులు మాత్రమే మిగిలారు. ఈ ఏడొందల మంది యోధులతో మూడువేలమంది శత్రుసైనికుల్ని ఎదుర్కోవడానికి ముందుకు సాగారు సత్యధర్మ వైతాళికుడు ముహమ్మద్ (స). చివరికి ఈ సైన్యం మదీనా నుంచి నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న ఉహద్ ప్రాంతానికి చేరుకుంది.

## ఉహద్ కొండల్లో యుద్ధజ్వాలలు-(91)

ఉహద్ మైదానం యుద్ధ వీరులతో నిండిపోయింది. ఒకవైపు దైవాన్నే నమ్ముకొని క్రమశిక్షణతో బారులుతీరి ఉన్న ఇస్లామీయ యోధులు తమ ప్రియతమ నాయకుని అనుజ్ఞ కోసం నిరీక్షిస్తున్నారు. వారికి ఎదురుగా సత్యతిరస్కారులు గాండ్రిస్తూ, గర్జిస్తూ ముస్లింలను చీల్చిచెండాటానికి తహతహలాడి పోతున్నారు.

దైవప్రవక్త (స) తన యోధులను కొండ దిగువభాగాన శత్రుసేనలకు అభిముఖంగా నిలబెట్టి పంక్తులను తీర్చిదిద్దారు. యుద్ధపతాకాన్ని ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి) చేతికిచ్చారు. సైన్యాలకు తూర్పువైపు కొండల్లో ఓచిన్న సందు ఉంది. అటునుంచి శత్రువులు వచ్చి దాడిచేసే ప్రమాదం ఉంది. అంచేత దైవప్రవక్త (సల్లం) కీలకమైన ఆ ప్రదేశంలో ఏభై మంది విలుకాండ్రను ఉంచారు. వారికి ఆదేశాలు ఇస్తూ ఇలా అన్నారు:

"మీరు అక్కడే ఉండి వెనుక వైపు నుంచి శత్రుదాడి జరక్కుండా చూడాలి. మీరు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా శత్రువులు అటు నుంచి మా వెనుక వైపుగా వచ్చి దాడిచేస్తారు కనుక మీరు మీ స్థానంలో స్థిరంగా ఉండండి. ఒక్క అడుగ్గూడా అక్కడ్నుంచి కదలకూడదు. మేము గెలిచినా, శత్రుసైన్యంలో జొరబడినా మీరు మాత్రం ఆ స్థానాన్ని వదలిపెట్టకూడదు. శత్రువులు మమ్మల్ని హతమార్చినా సరే మీరు మా సహాయానికి రావలసిన అవసరంలేదు. మీరు అక్కడే ఉండి శత్రువుల మీద బాణాల విడుస్తూ ఉండండి, చాలు. బాణాలకు గుర్రాలు భయపడి పరుగెత్తుతాయి."

దైవప్రవక్త (సల్లం) ఆదేశాలు స్వీకరించి ఈ యాభైమంది విలుకాండ్రు హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) నాయకత్వంలో ఆ కీలక ప్రదేశానికి వెళ్ళి నిలబడ్డారు.

ఖురైష్ సైనికులు కూడా తమతమ స్థానాల్లో బారులు తీరి యుద్ధం చేయడానికి సిద్ధమయ్యారు. ప్రఖ్యాతవీరుడు ఖాలిద్ బిన్ వలీద్ కుడిపక్షం సైన్యానికి సేనాని అయ్యాడు. ఎడమపక్షం సేనానిగా ఇక్రమా నియమించబడ్డాడు. యుద్ధపతాకం అబ్దుద్దార్ తెగవారి చేతికివచ్చింది. సేనాపతి అబూసుఫ్యాన్ ధ్వజవాహకుల్ని ఉద్రేకపరుస్తూ "జయాపజయాలు ధ్వజం మీదే అధారపడి ఉంటాయి. అందువల్ల ఆ బాధ్యతకు మీరు న్యాయమయినా చేకూర్చండి, లేదా వదిలేసి పక్కకయినా తప్పుకోండి" అన్నాడు.

సర్వసేనాని అబూసుఫ్యాన్ అన్న మాటలకు అబ్దుద్దార్ యువకుల రక్తం ఉడికి పోయింది. పొంగివచ్చిన పౌరుషంతో "యుద్ధం మొదలు కానివ్వండి, మా తడాఖా ఏమిటో చూద్దురుగాని" అన్నారు.

ఇక అబూసుఫ్యాన్ భార్య హిందా నాయకత్వంలో స్త్రీలు అటూ ఇటూ తిరుగుతూ పరుష వచనాలతో సైనికుల్ని ఉద్రేకపరచసాగారు. డప్పులు వాయిస్తూ "వీరసైనికులారా! ముందుకు పురోగమించండి. ధైర్యంగా, అప్రతిహతంగా కత్తులు ఝుళిపించండి" అంటూ వారిలో ఆత్మాభిమానం, పౌరుషాలను రేకెత్తిస్తున్నారు.

హిందా వహ్షీ దగ్గరకెళ్ళి ముహమ్మద్, హమ్జా, అలి- ఈ ముగ్గురిలో ఎవరినైనా ఒకరిని వధిస్తానని అతను తనకు చేసిన వాగ్దానాన్ని గుర్తుచేస్తూ "అబూదస్మా! నాకు చేసిన వాగ్దానం ప్రకారం శత్రువుని హతమార్చి నా గుండెల్లో మండుతున్న ప్రతీకారాగ్నిని చల్లార్చు. స్వయంగా నువ్వు కూడా తృప్తిపడు" అని చెప్పింది.

ఖురైష్ సైన్యంలో మదీనా నివాసి అబూఆమిర్ ఔసీ కూడా ఉన్నాడు. అతని వెంట నూటయాభై మంది అనుచరులు ఉన్నారు. ముస్లింసైన్యంలో ఉన్న తన తెగ వాళ్ళను కూడా కలుపుకొని ముస్లింలతో పోరాడి తన సత్తా చూపిద్దామని ఉవ్విళ్ళూరు తున్నాడు. తనను చూడగానే ఔస్‌తెగవాళ్ళు దైవప్రవక్త (సల్లం)ను వదలి పరుగెత్తుకొచ్చి తన చుట్టూ చేరిపోతారని ఆశించాడు.

ఆ ఆశతో అతను ఔస్‌తెగవారి వైపు తిరిగి "ఔస్ సోదరులారా! నేను అబూఆమిర్‌ని, ఇక్కడున్నాను" అని కేక వేశాడు.

అతని మాటలకు అటు ఔస్‌తెగవాళ్ళకు వళ్ళు మండిపోయింది. "ఓరీ దుర్మార్గుడా! దేవుడు నీ ముఖాన్ని మాడ్చుగాక!" అంటూ అంతా శాపనార్థాలు పెట్టారు. అనుకోకుండా ఔస్‌తెగ నుంచి ఇలాంటి మాటలు వచ్చినందుకు ఆమిర్ విస్తుబోయాడు.

"నేను వెళ్ళిన తరువాత నా జాతివాళ్ళు మారిపోయారు" అని గొణుక్కున్నాడు.

ఆమిర్ మాటలకు, ఔస్‌తెగ ముస్లింల జవాబుకు ఉభయ పక్షాలలో ఉద్రేకం కల్గింది. వెంటనే ఒకరిమీద ఒకరు రాళ్ళు విసురుకున్నారు. అలా కాస్సేపు రాళ్ళ వర్షం కురిసి క్రమంగా వెలసింది.



అలజడి తగ్గిన తరువాత అబూసుఫ్యాన్ ముందుకు వచ్చి ఇలా అన్నాడు:

"మదీనా వాసులారా! ఔస్, ఖజ్రజ్ ప్రజలారా! మీరు మా మధ్య నుంచి తప్పుకోండి. మా సోదరులైన ఖురైషీయులతో మమ్మల్ని యుద్ధం చేయనివ్వండి. మీతో మాకు సంబంధం లేదు. మీతో మాట్లాడవలసిన అవసరం కూడా మాకు లేదు."

అబూసుఫ్యాన్ మాటలు ముస్లింల ఆగ్రహాన్ని మరింత రెచ్చగొట్టాయి. ఔస్, ఖజ్రజ్ ముస్లింలయితే అబూసుఫ్యాన్‌కు ముఖం వాచేలా చీవాట్లు పెట్టారు.

అజ్ఞాన కాలంనాటి జాతీయ, ప్రాంతీయ తత్వాలను ఇస్లాం కూకటి వేళ్ళతో పెళ్ళగించి వేసింది. ఇప్పుడు ముస్లింల యుద్ధాశయం ధర్మపరిరక్షణ మాత్రమే. అందుకే ముస్లింల ఐక్యతపై దెబ్బతీయాలన్న శత్రువుల పన్నాగం పారలేదు.

హి.శ. 3వ ఏట, షవ్వాల్ నెల 15వ తేదీ, ఆదివారం ఉదయం సత్యాసత్యాల మధ్య సమరం మొదలైంది. ముస్లింయోధులు శత్రువులపై విరుచుకుపడ్డారు. అవిశ్వాసుల సైన్యం కూడా భీకరంగా పోరాడుతోంది. దైవప్రవక్త (స) సమయోచితంగా సహచరులకు తగిన ఆదేశాలిస్తున్నారు. ఆయన తన ఖడ్గాన్ని అబూదజానా (రజి)కు ఇచ్చారు.

హజ్రత్ అబూదజానా (రజి) ఆ ఖడ్గం పట్టుకొని ఎంతో ఆనందిస్తూ యుద్ధభూమిలో గుండెలు విరుచుకొని నిక్కుతూ తిరుగుతున్నారు.

దైవప్రవక్త (సల్లం) ఆయన నడక తీరు చూసి "ఇలాంటి నడక దైవానికి నచ్చదు. కాని సత్యతిరస్కారులతో పోరాటం జరుగుతున్నప్పుడు యుద్ధమైదానంలో ఈ విధంగా నడవడం ధర్మసమ్మతమే" అన్నారు తన పక్కనున్న అనుచరులతో.

యుద్ధం ఊపందుకుంది. వీరులందరూ తమతమ పరాక్రమాలు ప్రదర్శిస్తున్నారు. అయితే కాస్సేపటికి ఖురైష్ నాయకుల అంచనాలు తారుమారయ్యాయి. తాము బలహీనులు అనుకున్న ముస్లింలు అమితమైన ధైర్యసాహసాలతో విజృంభిస్తుంటే వారు విస్తుబోయి చూడసాగారు.

నిజానికి ఇంతటి శక్తి ముస్లింలలో ఇస్లాం వల్లనే జనించింది. ముస్లిం సైనికులు వీరోచితంగా పోరాడుతూ అవిశ్వాసుల సైనికపంక్తుల్లోకి అప్రతిహతంగా చొచ్చుకు పోతున్నారు. శత్రువుల మృతదేహాలు వేళ్ళు తెగిన ఖర్జూరపు చెట్లలా పడిపోతున్నాయి.

సైన్యం వెంట వచ్చిన ముస్లిం మహిళలు అమితోత్సాహంతో అటూఇటూ పరుగెత్తుతూ తమ యోధులకు మంచినీళ్ళు సరఫరా చేస్తున్నారు. కొందరు స్త్రీలు క్షతగాత్రు లకు మందువేసి కట్లు కూడా కడుతున్నారు.

ఖురైష్ నాయకులు ప్రతీకార జ్వాలలతో రగిలిపోతూ సైనికులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. వారి స్త్రీలు పరుష వచనాలతో యువసైనికుల్ని రెచ్చగొడుతున్నారు. వహ్షీకి తన కర్తవ్యం గుర్తుకొచ్చి హమ్జా (రజి)ను అనుసరించసాగాడు. హమ్జాను హతమారిస్తే తనను బానిసత్వం నుంచి విముక్తి కలిగించడమే కాకుండా తగిన పారితోషికం కూడా ఇస్తానని అబూసుఫ్యాన్ భార్య హిందా వాగ్దానం చేసింది.

ఈ ఆశతోనే వహ్షీ రంగంలోకి దూకాడు. ఒకచోట హ్జ్రత్ హమ్జా (రజి) శత్రువులతో పోరాడుతుంటే వహ్షీ చెట్టు చాటున నక్కి దొంగచాటుగా బల్లెం విసిరాడు. అది హమ్జా (రజి) పొట్టలో నుంచి దూసుకుపోయింది. దాంతో ఆయన కుప్పకూలిపోయారు. అప్పుడు వహ్షీ తృప్తితో నిట్టూర్పు విడిచాడు.

ఇక్కడ హ్జ్రత్ హమ్జా (రజి) అమరగతి నొందినప్పటికీ రెండో వైపు అవిశ్వాసులు ముస్లింలధాటికి నిలువలేకపోతున్నారు. వారిలో అనేకమంది నేలకొరగగా మిగిలిన సైనికులు భీతావహులై పారిపోసాగారు. కాస్సేపటికి యుద్ధమైదానం ఖాళీ అయిపోయింది. దాంతో ముస్లింల హృదయాల్లో విజయభావం తొంగిచూసింది. వెంటనే వారు శత్రువులు పారిపోతూ వదలిపెట్టిన సమరసొత్తుపై విరుచుకుపడ్డారు.

వారికి కొద్దిదూరంలో కొండ కనుమ దగ్గర కాపుకాస్తున్న ముస్లిం విలుకాండ్రు ఈ దృశ్యం చూశారు. వెంటనే వారిలో కొందరు అటువైపు పరుగెత్తడానికి సిద్ధమయ్యారు.

''అదిగో అటు చూడండి. మన సైనికులు సమరసొత్తును ఎలా పోగుచేస్తున్నారో. అవిశ్వాసులు ఓడిపోయారు కదా! ఇక మనమెందుకు ఇక్కడ అకారణంగా పడివుండటం? పదండి, మనం కూడా సమరసొత్తును సేకరిద్దాం'' అన్నారు వారు.

మరికొందరు దాన్ని వ్యతిరేకిస్తూ ''దైవప్రవక్త చెప్పింది అప్పుడే మరచిపోయారా? వెనుక ఉండి మనవాళ్ళను కాపాడుతూ ఉండాలని, మనం ఈస్థానం నుంచి ఒక్క అంగుళం కూడా కదలకూడదని ఆయన మనకు చెప్పలేదా?'' అన్నారు.

కాని మొదటివర్గం దాన్ని ఖండిస్తూ ''ఆయన చెప్పిన మాటల అంతరార్థం శత్రువులు ఓడిపోయే వరకే వర్తిస్తుంది. శత్రువులు ఓడిపోయాక కూడా మీరిక్కడే ఉంటారా?'' అన్నారు.

వారి నాయకుడు హ్జ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) దైవప్రవక్త (సల్లం) ఆదేశం ప్రకారం ఏ ఒక్కరూ నిర్ణీత స్థానం వదలిపెట్టి పోకూడదని తన అనుచరులను ఆజ్ఞాపించారు. కాని నిర్ణీత స్థానం వదలేసి సమరసొత్తు కోసం పోవాలనేవారే ఎక్కువమంది ఉండటం వల్ల దళనాయకుని మాటలు ఎవరూ పట్టించుకోలేదు. హ్జ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) ఎంత గట్టిగా తాకీదుచేస్తూ చెప్పినా వినలేదు. కొద్దిమంది తప్ప అందరూ ఆ కీలక స్థానం వదలిపెట్టి సమరసొత్తు కోసం పరుగెత్తారు.

## అపజయంగా మారిన విజయం-(92)

యుద్ధ మైదానం వదలి పారిపోయే అవిశ్వాసుల్లో ఖాలిద్ బిన్ వలీద్ కూడా ఉన్నాడు. అలా పారిపోతుంటే కాకతాళీయంగా అతని దృష్టి ఆ కనుమపై పడింది. చూస్తే కొందరు విలుకాండ్రు తప్ప కనుమంతా దాదాపు ఖాళీగా ఉంది. తక్షణమే అతను తన అధీనంలో ఉన్న కొంత సైన్యంతో కొండ చుట్టి కనుమ దగ్గరికి చేరుకున్నాడు. అదే సమయంలో ఎడమ పక్షం నాయకుడు ఇక్రమా కూడా తన సైనికులతో వచ్చి ఖాలిద్‌కు తోడయ్యాడు. వీరంతా కలసి కనుమ దగ్గరున్న కొద్దిమంది ముస్లిం విలుకాండ్రపై మెరుపుదాడి చేశారు. హ్జ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి), ఆయన అనుయాయులు అత్యంత ధైర్య శౌర్యాలతో శత్రువుల్ని ఎదుర్కొని చివరికి అమరగతులయ్యారు.



ఇప్పుడు కనుమ ఖాళీఅయి దారి ఏర్పడింది. అని గమనించిన శత్రుసైన్యం కనుమగుండా ముందుకు పురోగమించింది. ముస్లిం సైనికులు సమరసొత్తు సేకరించు కోవడంలో పూర్తిగా లీనమయి పోయారు. వారు శత్రువులు ఎప్పుడో పారిపోయారన్న భ్రమలోనే ఇంకా పడిఉన్నారు.

అవిశ్వాసులు చాలా దగ్గరగా వచ్చి ఉజ్జాకి జై! హుబల్‌కి జై!! అని పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ ముస్లింల మీద విరుచుకుపడ్డారు. ఈ హఠాత్పరిణామానికి ముస్లిం యోధులు బిత్తరబోయారు. వారు ఆయుధాలు తీసి ఎక్కుపెట్టే లోపుగానే అవిశ్వాసులు విజృంభించి వారిని సునాయాసంగా హతమార్చడం ప్రారంభించారు.

“దేవుడు మీకు చేసిన (సహాయ) వాగ్దానాన్ని నెరవేర్చాడు. ప్రారంభంలో మీరే దేవుని ఆజ్ఞతో అవిశ్వాసుల్ని వధిస్తుండేవారు. కాని ఆ తరువాత మీరు కోరుకున్న దాన్ని (అంటే సమరసొత్తును) దేవుడు చూపగానే మీరు ధైర్యం కోల్పోయారు. (ప్రవక్త) ఆజ్ఞ విషయంలో మీరు పరస్పరం విభేదాలకు లోనయి అవిధేయత చూపారు. మీలో కొందరు ప్రాపంచిక సంపదను ఆశించారు. మరికొందరు పరలోక ప్రతిఫలం కోరుకున్నారు. అప్పుడు దేవుడు మిమ్మల్ని పరీక్షించడానికి శత్రువుల నుండి మీ దృష్టిని (వేరే వైపునకు) మరల్చి పారిపోయేలా చేశాడు. అయితే మీరలా పారిపోయినప్పటికీ దేవుడు మిమ్మల్ని క్షమించాడు. ఆయన విశ్వాసుల పాలిట అత్యంత దయామయుడు.” (దివ్యఖుర్‌ఆన్. 3:152)

ముస్లింలు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. మిత్రులెవరో శత్రువులెవరో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది కొందరు తమ సొంత సైన్యంలోని యోధులతోనే పోరాడసాగారు. ఖురైష్‌సైనికులు మదపుటేనుగుల్లా విజృంభించి ముస్లింలను చుట్టుముట్ట నారంభించారు. ముస్లింలు కూడా ప్రాణాలు తెగించి పోరాడుతున్నారు. సరిగ్గా అదే సమయంలో ఓ అవిశ్వాసి 'ముహమ్మద్ హతమయ్యారు!' అంటూ బిగ్గరగా అరిచాడు.

అంతే, ముస్లిం యోధుల నెత్తి మీద పిడుగు పడినట్లయింది. మరో విపత్తు వచ్చి పడింది. అంతా హతాశులయి పోయారు. మనోస్థయిర్యం సన్నగిల్లింది. వారిలో గొప్పగొప్ప పరాక్రమశాలురైన వీరులు సయితం ఈ వార్త వినగానే పూర్తిగా క్రుంగిపోయారు. వారి హృదయాల్లో అనాసక్తత చోటుచేసుకుంది.

''మన ప్రియతమ నాయకుడే మనల్ని వీడిపోయినప్పుడు ఇక మనం ఎవరి కోసం ఈ యుద్ధం చేయాలి?'' అన్న భావనతో ఆయుధాలు దించేసి యుద్ధరంగం నుంచి పక్కకు తప్పుకున్నారు వారు. మరికొందరు ఎటూ పాలుపోక అయోమయంలో పడి పోయారు. ఇంకొందరు పలాయనం చిత్తగించే ప్రయత్నంలో ఉన్నారు.

అయితే వారిలో కొందరు యువకుల ఉడుకు రక్తం ఇంకా చల్లారలేదు. ప్రస్తుత పరిస్థితి వారి యువరక్తాన్ని మరింత ఉడుకెత్తించింది. వారి విశ్వాస దీపికను మరింత ప్రజ్వరిల్ల జేసింది. వారు అన్నిటికీ తెగించి లేచారు. దెబ్బతిన్న బెబ్బులిలా విజృంభించి హోరాహోరీగా పోరాడసాగారు. దాంతోపాటు అధైర్యం చెందిన తోటిసైనికుల్లో ధైర్యం కూడా కలిగిస్తున్నారు. అనాసక్తితో అణగారిన హృదయాలను ఉత్తేజపరుస్తున్నారు.

మరికొందరు యోధులు అస్త్రసన్యాసం చేసినవారితో ఇలా అన్నారు:

"ఆయుధాలు విసర్జించి ఏం చేద్దామని మీ ఉద్దేశ్యం? ప్రాణప్రదంగా ప్రేమిస్తున్న మన ప్రియప్రవక్తే (స) అమరగతులయిన తరువాత ఇక మనం బ్రతికుండి చేసేదేమిటీ? లేండి, ఆయుధాలు తీసుకోండి, శత్రువుల్ని ఎదుర్కోండి."

కొందరు యోధులు వీరికంటే మరో అడుగు ముందుకు వేసి సమయస్ఫూర్తితో వ్యవహరించారు.

"దైవప్రవక్త (సల్లం) ఏ మహాకార్యం కోసం ప్రభవించారో ఆ మహాకార్యం పూర్తిచేసి తమ బాధ్యత నెరవేర్చుకున్నారు. ఇప్పుడు దైవధర్మాన్ని పరిరక్షించవలసిన బాధ్యత మనందరిపై ఉంది. దాని కోసమైనా మనం శత్రువులతో పోరాడక తప్పదు. పదండి, దైవం కోసం, ధర్మం కోసం పోరాడండి. ధర్మాన్ని తెచ్చిన దైవప్రవక్త (స) ఇప్పుడు మనమధ్య లేకపోవచ్చు. కాని ఆ ధర్మాన్ని పంపిన దేవుడు సజీవంగానే ఉన్నాడు. ఆయన నిత్యజీవుడు, చావుపుట్టుకలు లేనివాడు. అలాంటి దేవుని ప్రసన్నత కోసం యుద్ధం చేయండి" అన్నారు వారు అనాసక్తతతో ఆయుధాలు విసర్జించిన సైనికులతో.

"మీరు ఇట్టే స్వర్గంలో ప్రవేశిస్తామనుకుంటున్నారా? మీలో దైవమార్గంలో పోరాడే వారిని దేవుడింకా పరీక్షించనే లేదు. వారు ఏ మేరకు సహనం వహించి ధ్యేయపథంలో స్థిరంగా ఉంటారో ఆయన చూడదలిచాడు. ఇదివరకు (పోరాడి) మరణించే అవకాశం రాకముందు మీరు దాన్ని కోరుతుండేవారు. ఇప్పుడది మీముందుకు వచ్చింది. మీరు దాన్ని కళ్ళారా చూసుకున్నారు కూడా. (కనుక మీరు ప్రాణాలకు తెగించి పోరాడాలిగాని, ధైర్యం కోల్పోయి ఢీలా పడిపోకూడదు.)

ముహమ్మద్ దైవప్రవక్త మాత్రమే. ఇతనికి పూర్వం కూడా అనేకమంది దైవప్రవక్తలు వచ్చిపోయారు. మరి ఇతనిప్పుడు చనిపోతే లేక చంపబడితే మీరు (ధర్మపథం నుండి) వెను దిరిగిపోతారా? గుర్తుంచుకోండి, అలా వెనుదిరిగిపోయేవాడు దేవునికి ఎలాంటి నష్టం కల్గించ లేడు. దేవుడు తనకు కృతజ్ఞత చూపేవారికే తగిన బహుమానం ఇస్తాడు.

దేవుని అనుజ్ఞ లేనిదే నిర్ణీత సమయానికి ముందు ఏ ప్రాణికీ చావు రాదు. ప్రతి ప్రాణికీ మరణకాలం వ్రాయబడి ఉంది. కేవలం ప్రాపంచిక ప్రతిఫలాపేక్షతో పనిచేసేవారికి మేము ప్రపంచంలోనే వారి ప్రతిఫలం ఇచ్చివేస్తాము. పరలోక ప్రతిఫలాపేక్షతో పనిచేసేవారికి పరలోకంలో వారికి రావలసిన ప్రతిఫలం అనుగ్రహిస్తాము. కృతజ్ఞులై ఉండేవారికి మేము తప్పకుండా తగిన బహుమానం ప్రసాదిస్తాము." (దివ్యఖుర్ఆన్. 3:142-145)

"పరలోక జీవితం కోసం ప్రాపంచిక జీవితం అమ్ముదలచుకున్నవారు దైవమార్గంలో పోరాడాలి. దైవమార్గంలో పోరాడి అమరగతినొందినా లేక విజయం సాధించినా అలాంటి వ్యక్తికి మేము గొప్ప ప్రతిఫలం ప్రసాదిస్తాము. దిక్కులేక పోవడం చూసి అణచి వేయబడ్డ స్త్రీలు, పురుషులు, పిల్లలను రక్షించడానికి మీరు దైవమార్గంలో ఎందుకు పోరాడరు? వారు (బాధలు భరించలేక) "దేవా! దుర్మార్గులు నివసిస్తున్న ఈ నగరం నుండి మమ్మల్ని బయటికి తీసి కాపాడు. మాకు రక్షణ కల్పించి అండగా నిలిచేవారినెవరినైనా నీ వైపు నుండి మా



దగ్గరికి పంపు" అని మొరపెట్టుకుంటున్నారే! అలాంటి పీడితప్రజల రక్షణ కోసం ఎందుకు పోరాడరు మీరు?" (దివ్యఖుర్ఆన్. 4:74-75)

ఎట్టకేలకు ముస్లింలలోని అనాసక్తత దూరమయింది. వారు నూతనుత్తేజం నింపుకొని ద్విగుణీకృత ఉత్సాహంతో మళ్ళీ పోరాటం ప్రారంభించారు.

దైవప్రవక్త (సల్లం)ను అంతమొందించడానికి అవిశ్వాసుల సైన్యాలు విశ్వ ప్రయత్నం చేస్తున్నాయి. "ముందు ఆయన్ని అంతమొందిస్తే ఆ తర్వాత ముస్లింలను ఓడించడం చాలా తేలిక. ఇలా చేస్తే తమకీ నూతనధర్మం బెడద శాశ్వతంగా తప్పిపోతుంది." ఈ ఆలోచనతో అవిశ్వాసులంతా తమ దృష్టిని దైవప్రవక్త (సల్లం)పై కేంద్రీకరించారు.

వారి అదృష్టంకొద్దీ ముస్లిం పంక్తుల్లో క్రమం తప్పింది. ఇదే సువర్ణవకాశంగా భావించి శత్రువులు దైవప్రవక్త (స)ను, ఆయన దగ్గరున్న అనుచరులను చుట్టుముట్టి ఏకధాటిగా బాణాలు కురిపించసాగారు. కొందరు రాళ్ళు కూడా రువ్వడం ప్రారంభించారు.

దైవప్రవక్త (స) మీదికి బాణాలు, రాళ్ళు విపరీతంగా వచ్చిపడటం చూసి దగ్గరున్న అనుచరులు ఆయన చుట్టూచేరి వలయాకారంలో నిలబడ్డారు. మరికొందరు శత్రువులతో ముఖాముఖి పోరాడటంలో నిమగ్నులైపోయారు. నిరాఘాటంగా దూసుకొస్తున్న బాణాలు దైవప్రవక్త (స) మీద పడకుండా హజ్రత్ అబూదుజానా (రజి) వంగి తన వీపును డాలుగా అడ్డుపెట్టారు. అప్పుడు బాణాలు వచ్చి ఆయన వీపును రక్తసిక్తం చేయసాగాయి.

మరొక వైపు శత్రువుల కత్తివేటులు తగలకుండా హజ్రత్ తల్హా (రజి) ఒక చేతిని ఆయనకు అడ్డుపెట్టి, రెండవ చేత్తో కరవాలం తిప్పుతున్నారు. అయితే కాస్సేపటికే అలా అడ్డుపెట్టిన చేతిపై ఒక శత్రువు బలమైన దెబ్బ వేశాడు. ఆ దెబ్బకు హజ్రత్ తల్హా (రజి) చేయి తెగిపోయింది.

ఆ వెనువెంటనే మరోశత్రువు వలయాన్ని ఛేదించి ముందుకు చొచ్చుకొచ్చాడు. అతను దైవప్రవక్త (స)కు దగ్గరగా వచ్చి ఖడ్గంతో ఒక్కవేటు వేశాడు. అది దైవప్రవక్త (స) శిరస్త్రాణంపై పడటంతో శిరస్త్రాణపు రింగులు చెంపలలోకి దిగి రక్తం కారసాగింది.

అదే సమయంలో వేరొక అవిశ్వాసి దూరం నుంచి రాయి విసిరాడు. ఆ రాయి కూడా వచ్చి దైవప్రవక్త (సల్లం) ముఖానికి తగిలింది. దాంతో ఆయన ముందు పళ్ళు రెండూ ఊడి పెదవులు రక్తసిక్త మయ్యాయి.

అప్పుడు దైవప్రవక్త (స) నోట అప్రయత్నంగా ఈ పలుకులు వెలువడ్డాయి:

"దైవప్రవక్త తన జాతివారిని దేవుని (సందేశం) వైపు పిలుస్తున్నాడు. కాని వారు తమ ప్రవక్త ముఖాన్ని రక్తసిక్తం చేస్తున్నారు. అలాంటి జాతి ఎలా సాఫల్యం చెందుతుంది?"

ప్రవక్త (సల్లం) నోట వెలువడిన ఈ పలుకులు విశ్వప్రభువుకు నచ్చలేదు. ఆయన తన గ్రంథం ఖుర్ఆన్‌లో ఇలా పేర్కొన్నాడు:

"(ప్రవక్తా!) దేవుడు వారిని క్షమించనయినా క్షమిస్తాడు. లేదా దుర్మార్గులైనందున వారిని శిక్షించనయినా శిక్షిస్తాడు. ఈ వ్యవహారంలో నిర్ణయం తీసుకోవడానికి నీకెలాంటి అధికారం

లేదు. భూమ్యాకాశాల్లో ఉన్న సమస్తం దేవునిదే. ఆయన తానుతలచిన విధంగా కొందర్ని క్షమిస్తాడు, మరికొందర్ని శిక్షిస్తాడు కూడా. ఆయన గొప్ప క్షమాశీలి, అపార కృపాశీలుడు." (ఖుర్ఆన్-3:128-129)

దైవప్రవక్త (సల్లం) వధించబడ్డారన్న గాలివార్త విన్న అనేక ముస్లిములు శత్రువుల్ని ప్రతిఘటిస్తున్నప్పటికీ వారిలో ఏర్పడిన నిరాశానిస్పృహలు పూర్తిగా తొలగిపోలేదు. శత్రువులు మాత్రం తమ చిరకాల వాంఛ నెరవేరిందని సంబరపడిపోతూ గంతులేస్తున్నారు. కాని అసలు విషయం ఎవరికీ బోధపడలేదు.

ఇబ్నెఖమియా అనే ఓ అవిశ్వాసి హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి)ను వధించాడు. ముస్అబ్ (రజి) రూపురేఖల్లో అచ్చం దైవప్రవక్త (సల్లం)ను పోలివుంటారు. అంచేత ఇబ్నెఖమియా ఆయన్నే దైవప్రవక్త (సల్లం) అనుకున్నాడు. ఈ పొరపాటే ముస్లింల పాలిట గ్రహపాటయి వారి సైన్యాలను అస్తవ్యస్తం చేసింది. నిరాధారమైన ఈవార్త దైవప్రవక్త (సల్లం) దగ్గరున్న అనుచరులకు తెలిసింది. అయితే వారు దీన్ని ఖండిద్దామనంటే దైవప్రవక్త (సల్లం) వారించారు.

అవిశ్వాసులు నిజంగానే ముహమ్మద్ (సల్లం) హతమయ్యారని తలపోస్తున్నారు. అంచేత ఆయన మృతదేహం కోసం ఖురైష్‌సైనికులు నలువైపులా పరుగెత్తారు. మైదానంలో పడివున్న శవాలను వెతకసాగారు. వారిలో ప్రతిఒక్కడూ ఆ మృతదేహాన్ని ముందుగా తానే స్వాధీనంచేసుకోవాలని, దాన్ని ముక్కలు ముక్కలుగా చేసి గుండెల్లో మండుతున్న మంటను చల్లార్చుకోవాలని వెంపర్లాడసాగాడు.

అలా వెతుకుతున్నవారిలో సర్వసేనాని అబూసుఫ్యాన్ కూడా ఉన్నాడు. అతను ఎంతో ఆత్రంతో శవాల దగ్గరికి పరుగెత్తాడు. కాని ఆ శవాలను చూసి "అరె! ముహమ్మద్ మృతదేహం ఎక్కడా కన్పించడం లేదే!! ఏమయి ఉంటుంది?" అని ఆశ్చర్యపోయాడు. అయితే ఒకచోట అతని దృష్టి ఓ మృతదేహంపై పడింది. అది హజ్రత్ హమ్జా (రజి) మృత దేహం. దాన్ని చూడగానే అతను ఉగ్రుడై పోయాడు. చేతిలోని ఈటెతో ఇష్టమొచ్చిన చోటల్లా పొడుస్తూ "విశ్వాసఘాతకుడా! బదర్ యుద్ధంలో నీవు చేసిందానికి ప్రతిఫలం అనుభవించు" అని అన్నాడు.

అక్కడ హులైస్ అనే మరోఅవిశ్వాసి ఉన్నాడు. అతను అబూసుఫ్యాన్ చేస్తున్న ఈ కసాయి పని చూడలేక "సైనికుల్లారా! రండి, ఇటు చూడండి. ఇతను ఖురైష్ నాయకుడట! సోదరుని మృతదేహం పట్ల ఇతని దుశ్చర్య చూడండి" అని అరిచాడు బిగ్గరగా.

ఈ మాటలకు అబూసుఫ్యాన్ బిత్తరబోయాడు. "ఓహ్! ఎంత పొరపాటు జరిగింది నావల్ల!! సరే వదిలేస్తున్నాగాని అల్లరి చేయకు" అన్నాడు బ్రతిమాలుతున్న ధోరణిలో.

ఆ తరువాత అతను ఖాలిద్ బిన్ వలీద్‌ను కలుసుకొని "ముహమ్మద్ నిజంగానే వధించబడ్డాడా? మరయితే అతని మృతదేహం ఎక్కడా కన్పించడం లేదేమిటీ?" అన్నాడు. దానికి ఖాలిద్"వధించబడలేదు. నేనిప్పుడే చూసివస్తున్నా. ఆయన కొందరు అనుచరులతో కలసి కొండపైకి పోతున్నాడు" అని చెప్పాడు.



అయితే ఇటు ముస్లిం యోధులకు దైవప్రవక్త (సల్లం) సజీవంగా ఉన్న సంగతి ఇంకా తెలియదు. వారు కళ్ళల్లో వత్తులు వేసుకొని వెతుకుతూనే ఉన్నారు. అకస్మాత్తుగా కాబ్ బిన్ మాలిక్ (రజి) దృష్టి కొండపైకి వెళ్తున్న దైవప్రవక్త (సల్లం)పై పడింది. దాంతో ఆయన సంతోషంతో ఎగిరి గంతేశారు. ముస్లింవీరులారా! అదిగో మన ప్రియప్రవక్త!!" అని బిగ్గరగా అరుస్తూ తోటి సైనికుల దగ్గరికి పరుగెత్తారు ఆయన.

ఈ వార్త వినగానే ముస్లిం సిపాయాల ఆనందం అవధులు దాటింది. ఒక్కసారిగా అందరి ముఖాలలో నూతనోత్సాహ కెరటాలు ఉవ్వెత్తున లేచాయి. సడలిపోయిన ధైర్యం మళ్ళీ ఎగిసిపడింది. అనాసక్తతతో చచ్చుపడిన దేహాలు తాజాశక్తి పుంజుకున్నాయి. అనుచరులంతా దీపపు పురుగుల్లా దైవజ్యోతి (స) వైపు పరుగెత్తారు. నలువైపుల నుంచి పరుగులుపెడ్తూ వచ్చి క్షణాల్లో దైవప్రవక్త (స) దగ్గరికి చేరుకున్నారు. తృటిలో వారు ఆయన చుట్టూ వలయంగా ఏర్పడి అవిశ్వాసులతో పోరాడుతూనే ఉహుద్ పర్వతం అధిరోహించసాగారు.

దైవప్రవక్త (స) కొండపైకి పోతుంటే మరోప్రమాదం ఎదురైంది. అబూఆమిర్ అనే వాడు ముస్లింలు జారిపడేందుకు ముందుగానే ఆ దారిలో కొన్ని గోతులు త్రవ్వించాడు. యాదృచ్ఛికంగా దైవప్రవక్త (స) అటువైపు నడుస్తుంటే ఒక గోతిలో జారి పడబోయారు.

వెంటనే హజ్రత్ అలి (రజి), తల్హా (రజి) ముందుకు వంగి చేయి పట్టుకొని ఆయన్ని పైకి లేపారు. తరువాత అందరూ కొండ పైకి చేరుకున్నారు.

దైవప్రవక్త (సల్లం) కొండపైకి చేరుకోవడం శత్రుసేనాని అబూసుఫ్యాన్ చూశాడు. తక్షణమే అతను కూడా సైన్యం తీసుకొని కొండెక్కడం ప్రారంభించాడు. దీన్ని గమనించిన ముస్లింయోధులు పైనుండి విపరీతంగా రాళ్ళురువ్వారు. దాంతో అబూసుఫ్యాన్ ముందుకు అడుగు వెయ్యలేకపోయాడు.

దైవప్రవక్త (సల్లం) కొండ పైకి చేరుకున్న కొన్ని క్షణాల్లోనే నలువైపుల నుంచి అనుచరులు వచ్చి ఆయన చుట్టూచేరారు. అంతలో ఉబయి బిన్ ఖల్ఫ్ అనే అవిశ్వాసి గుర్రాన్ని పరుగెత్తిస్తూ దైవప్రవక్త (సల్లం) వైపు దూసుకు రాసాగాడు.

ముస్లింలు అతడ్ని అడ్డుకోవడానికి ప్రయత్నించగా దైవప్రవక్త (సల్లం) వాళ్ళను వారిస్తూ "రానివ్వండి అతడ్ని" అన్నారు. అతను దగ్గరగా వచ్చి దాడి చేయబోయాడు. అంతలో దైవపవక్త (సల్లం) ఒక అనుచరుని చేతిలోని బాణం తీసుకొని వదిలారు.

దాంతో ఆ సత్యతిరస్కారి గాయపడి "వామ్మో! వాయ్యో!! నన్ను ముహమ్మద్ చంపేశాడు" అని గావుకేకలు పెడ్తూ వెనక్కి తిరిగి పరుగు లంకించుకున్నాడు.

అతని సహచరులు అతని శరీరంలో గుచ్చుకున్న బాణం తీసేసి "ఇదేమీ పెద్ద గాయం కాదు. ఎందుకలా పెడబొబ్బలు పెడ్తున్నావు?" అంటూ విరగబడి నవ్వారు.

"మీకు తెలియదు బాబోయ్! లాత్, ఉజ్జాల సాక్షి! ఈ గాయంతో నేను అనుభవిస్తున్న బాధ గనక జుల్‌మజాజ్ సంతకు వచ్చేవారికి కలిగితే వారంతా ఆ ఒక్క బాధతోనే చచ్చి

పోతారు. గతంలో నేను నా గుర్రాన్ని బాగా మేపి దాని మీదెక్కి నిన్ను వధిస్తానని ముహమ్మద్‌తో అంటే దైవచిత్తమయితే తానే నన్ను వధిస్తానని ఆయన అన్నాడు. దైవసాక్షి! ముహమ్మద్ నామీద ఉమ్మేసినా నేను చచ్చిపోతాను బాబోయ్!" అంటూ మరోసారి పెడబొబ్బలు పెట్టాడు.

చివరికి ఆగాయంతోనే అతను మక్కా తిరిగెళ్తూ దారిలో గిలగిల కొట్టుకొని ప్రాణం వదిలాడు. ఈ యుద్ధంలో ఇతనొక్కడే దైవప్రవక్త (స) చేత వధించబడినవాడు.

దైవప్రవక్త (సల్లం) వధించబడ్డారన్న తప్పుడువార్త అటు మదీనాలో కూడా కార్చిచ్చులా వ్యాపించింది. ముస్లింలపై విషాదఛాయలు అలుముకున్నాయి. స్త్రీలు, పిల్లలు, వృద్ధులు ఒకరేమిటి, అంతా దుఃఖసముద్రంలో మునిగిపోయారు. సమస్త కార్యకలాపాలు స్తంభించి పోయాయి. సర్వత్రా నిర్లిప్తత చోటుచేసుకుంది.

ప్రవక్త కుమార్తె హజ్రత్ ఫాతిమా (రజి) చెవికి ఈ వార్త సోకిందో లేదో ఆమె నిలువెల్లా కంపించిపోయారు. చిన్నపిల్లలా భోరున విలపిస్తూ అప్రయత్నంగా యుద్ధ మైదానం వైపు పరుగుతీశారు. దారేదో, డొంకేదో కానరాని స్థితిలో నడచి ఎలాగో తండ్రి దగ్గరకు చేరుకున్నారు. నాన్నను తనవితీరా చూసుకున్నారు.

తాను విన్నది తప్పుడు వార్తని తెలిసినా నాన్న ముఖం నుండి ధారాపాతంగా కారుతున్న రక్తం చూసి ఆమె భరించలేక పోయారు. ఆమెకు దుఃఖం పొర్లుకు వచ్చింది. రోదిస్తూనే ఆమె తండ్రి గాయాలు నీళ్ళతో కడగసాగారు. కాని ఎంత కడిగినా రక్త ప్రవాహం ఆగలేదు. చివరికి శ్రీవారు అలి (రజి) సహకారంతో చాపముక్క కాల్చి దాని బూడిదను గాయం మీద పెట్టారు. అప్పుడుగాని రక్త ప్రవాహం ఆగలేదు.

అటు ఖురైష్ సైనికుడు వహ్షీ తాననుకున్నట్లు హమ్జా (రజి)ను వధించగలిగాననే ఆనందంతో ఎగిరిపడుతున్నాడు. వెంటనే అతను అబూసుఫ్యాన్ భార్య హిందా దగ్గరకెళ్ళి "మీరు చెప్పినట్లు నేను హమ్జాను హతమార్చాను. దానికిప్పుడు మీరేమి బహుమానం ఇస్తారో ఇవ్వండి" అన్నాడు.

"నీకు నా కంఠహారం ఇస్తాగాని, ముందు నువ్వు హమ్జా మృతదేహం ఎక్కడుందో చూపించు" అన్నది హిందా.

అప్పుడు వహ్షీ ఆమెను వెంటబెట్టుకొని హమ్జా మృతదేహం దగ్గరికి తీసికెళ్ళాడు. హమ్జా(రజి) మృతదేహాన్ని చూడగానే ఆమె కోపోద్రేకాలతో ఊగిపోయింది. వెంటనే కత్తితో హమ్జా పొట్ట చీల్చి కాలేయాన్ని బయటికి లాగింది. దాన్ని నిర్దయంగా కసకస నమిలింది. అయితే ఆ పచ్చికాలేయాన్ని నమిలి మింగలేక బయటికి కక్కేసింది.

ఈవిధంగా ఆమె హృదయంలో మండుతున్న ప్రతీకార కొరివిని చల్లార్చుకుంది. వహ్షీ చేసిన ఈ ఘనకార్యానికి పొగుడుతూ అతనికి అప్పటికప్పుడు తన కంఠహారం తీసిచ్చింది. తరువాత ఆమె చెలికత్తెలను వెంటబెట్టుకొని పరుగు పరుగున ముస్లిం వీరుల మృతదేహాల దగ్గరికి పోయింది. తనివి తీరని కసితో ఆ మృతదేహాల ముక్కు చెవుల్ని పరపరా కోసింది. వాటిని పూలమాలలుగా చేసుకొని మెడలో వేసుకుంది.



యుద్ధ వాతావరణం చల్లబడింది. గెలుపు ఖురైషీయుల వైపే మొగ్గు చూపుతున్నా, ఎందుకో వారు ముస్లింలతో యుద్ధం కొనసాగించలేదు. ముస్లింలు కూడా తమ పోరాటాన్ని నిలుపుదల చేసుకున్నారు. దాంతో అబూసుఫ్యాన్ వికటాట్టహాసం చేశాడు.

"ముస్లింలారా! మీలో ముహమ్మద్ ఉన్నారా?"అన్నాడతను బిగ్గరగా కేకవేసి. దానికి సమాధానం ఇవ్వద్దని దైవప్రవక్త (స) అనుచరులకు చెప్పారు.

"మీలో అబూబకర్ ఉన్నాడా?" అరిచాడు మళ్ళీ అబూసుఫ్యాన్ బిగ్గరగా. దానిక్కూడా ముస్లింల నుంచి సమాధానం రాలేదు.

"మీలో ఉమర్ బిన్ ఖత్తాబ్ ఉన్నాడా?" దానికీ సమాధానం రాలేదు.

"ఏమిటీ అంతా నిశ్శబ్దంగా ఉందీ! అంటే వీళ్ళంతా వధించబడ్డారన్న మాట" అన్నాడు అబూసుఫ్యాన్ స్వగతంలో.

హజ్రత్ ఉమర్ (రజి) ఇక ఉద్రేకం పట్టలేక "ఓరీ దైవవిరోధీ వీళ్ళంతా సజీవంగానే ఉన్నారు. నీకు అవమానం తప్పదులే" అన్నారు.

అబూసుఫ్యాన్ క్షణంపాటు నిర్ఘాంతపోయాడు. తరువాత "హుబల్ దేవతకు జై" అన్నాడు గర్వంతో ఘనవిజయం సాధించినట్లు భావిస్తూ.

"అల్లాహ్ అందరికన్నా గొప్పవాడు, మహోన్నతుడు" అన్నారు హజ్రత్ ఉమర్ (రజి) దైవప్రవక్త (సల్లం) సూచించిన విధంగా.

"ఉజ్జా విగ్రహం మాది, మీది కాదు" అన్నాడు అబూసుఫ్యాన్.

"అల్లాహ్ మా రక్షకుడు, మీ రక్షకుడు కాదు" అన్నారు హజ్రత్ ఉమర్ (రజి) దైవ ప్రవక్త (సల్లం) ఇచ్చిన సూచన ప్రకారం.

"ఈ యుద్ధం బదర్‌యుద్ధంతో సమానమైనది. మేము బదర్ ప్రతీకారం తీర్చు కున్నాం" అన్నాడు అబూసుఫ్యాన్ మళ్ళీ.

"ఇది బదర్ యుద్ధంతో సమానం కాదు. ఈ యుద్ధంలో మావాళ్ళు చనిపోయి స్వర్గంలో ప్రవేశించారు. మీవాళ్ళు నరకానికి పోయారు" అన్నారు ఉమర్ (రజి) దైవప్రవక్త (స) సూచించినట్లు.

"సరే, మన ఉభయుల మధ్య వచ్చే ఏడు బదర్‌లో మళ్ళీ పోటీ ఉంటుంది" అన్నాడు అబూసుఫ్యాన్. "ఈ పోటీ మాకు సమ్మతమే" అన్నారు ఉమర్ (రజి) దైవప్రవక్త సూచన ప్రకారం.

అబూసుఫ్యాన్ ఈ మాట విన్న తరువాత సైనికుల్ని తీసుకొని వెళ్ళిపోయాడు.

## అమర వీరులు-(93)

శత్రుసైనికులు యుద్ధరంగం నుంచి వెళ్ళిపోగానే ముస్లిం యోధులు కొండపై నుంచి క్రిందికి దిగారు. అమరగతులయిన తమ డెబ్భయి మంది యోధుల మృతదేహాలకు అంత్య క్రియలు జరపడానికి సిద్ధమయ్యారు.

హజ్రత్ హమ్జా (రజి) మృతదేహం ముక్కలుగా ఖండించబడి ఎంతో భయానకంగా, కడు దయనీయంగా ఉంది. దాన్ని చూడగానే దైవప్రవక్త (సల్లం) కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. ఆవేదనాభరితమయిన ఆయన హృదయం నుంచి సన్నగా (ఈ క్రింది) శబ్ద తరంగిణి జాలువారింది:

"అబ్బా! ఇంతటి బాధాకరమైన దృశ్యం నేనింతవరకు చూడలేదు. (హమ్జా సోదరి) సఫియా బాధపడకుండా ఉంటే, ఈపని నా తదనంతరం ఆచారంగా మారుతుందన్న భయం కూడా లేకుండా వుంటే నేను హమ్జా దేహాన్ని ఇలాగే గద్దలకు, మృగాలకు వదలి పెట్టేవాడ్ని. ఎప్పటికైనా శత్రువులపై ఆధిక్యత పొందగలిగితే వారిలో ముప్ఫయి మంది మనుషులకు ఇదే గతి పట్టిస్తాను."

కాని.....

"మీరు ప్రతీకారం తీర్చుకోదలిస్తే మీపై ఏ మేరకు దౌర్జన్యం జరిగిందో ఆ మేరకే బదులు తీర్చుకోండి. అయితే సహనం వహిస్తే అది సహనం వహించేవారికి ఎంతో మంచిది. కనుక (ముహమ్మద్!) సహనం వహించు. నీకు సహన గుణం దేవుని ద్వారానే అబ్బింది. వారి చర్యలకు బాధపడకు. వారి మోసపు ఎత్తుగడలకు మనస్తాపం చెందకు. దైవఅవిధేయతకు దూరంగా ఉంటూ దేవుని అయిష్టతకు భయపడి సత్పురుషులుగా ఉండేవారికే ఆయన తోడుగా ఉంటాడు" (ఖుర్ఆన్. 16:126-128)

---అనే దైవవాణి మనోవీధిలో మెదులుతుండగా అంతరంగంలోని ఆవేదన అంతరించి శాంతించారు దైవప్రవక్త (సల్లం).

ఆయన దైవాజ్ఞ ముందు తలవొంచి శత్రువుల్ని క్షమించారు.

"(ముహమ్మద్! ఓరోజు) నీవు ఉదయం ఇంటి నుండి బయలుదేరి విశ్వాసుల్ని యుద్ధానికి సమాయత్త పరచడం ప్రారంభించావు. ఆ సందర్భం గుర్తుచేసుకో. దేవుడు సమస్తం వింటాడు, ఆయన సర్వం ఎరిగినవాడు. అప్పుడు మీలో రెండు వర్గాలు ధైర్యం కోల్పోయి (యుద్ధరంగం నుంచి) దాదాపు పారిపోజూశాయి. కాని దేవుడు వారిని ఆదుకున్నాడు. అసలు దేవుడే వారి రక్షకుడు, సహాయకుడు. కనుక విశ్వాసులు ఎల్లప్పుడూ ఆయన్నే నమ్ముకొని ఉండాలి. దేవుడు మిమ్మల్ని బద్ర్ యుద్ధంలో కూడా ఆదుకున్నాడు. అప్పుడు కూడా మీకు సరైన ఆయుధాలు, సరిపడ వనరులు లేవు. (అయినా మీకు మేము విజయం చేకూర్చాం.) అందువల్ల దేవునికి భయపడండి; ఆయనకు కృతజ్ఞులై ఉండండి." (ఖుర్ఆన్. 3:121-123)

"(విశ్వాసులారా!) బాధపడకండి. అధైర్యంతో క్రుంగిపోకండి. మీరు నిజమయిన విశ్వాసులయితే చివరికి మీరే విజయం సాధిస్తారు. (సత్యాసత్యాల సమరంలో) మీరేకాదు, వారు కూడా మీలాగే దెబ్బతిన్నారు. (అంతమాత్రానికే ధైర్యం కోల్పోవడమా!) ఇవన్నీ మేము ప్రజల మధ్య తిప్పే కాలపు మిట్టపల్లాలు మాత్రమే. ఆయన మీలో నిజమైన విశ్వాసులెవరో పరీక్షించడానికి, కొందరిని సత్యానికి సాక్షులు (అమరగతులు)గా చేయడానికి ఈ విధంగా చేశాడు. దేవుడు దుర్మార్గుల్ని ఎన్నటికీ ప్రేమించడు. ఆయన ఇలాంటి పరీక్ష ద్వారా నిజమయిన విశ్వాసులు ఎవరో ఏరివేసి, అవిశ్వాసుల్ని అణచివేయదలిచాడు. (ఖుర్ఆన్-3:139-141)



హజ్రత్ హమ్జా (రజి) మరణవార్త విని చూడటానికి ఆయన చెల్లెలు హజ్రత్ సఫియా (రజి) వచ్చారు. దైవప్రవక్త (సల్లం) ఆమెను దూరం నుంచి చూడగానే "ఆమెను హమ్జా శవం దగ్గరకు పోనివ్వకు" అన్నారు హజ్రత్ జుబైర్ (రజి)తో.

హజ్రత్ జుబైర్ (రజి) తన మాతృమూర్తి హజ్రత్ సఫియా (రజి)ని నిరోధించబోతే "నా సోదరుడి శవాన్ని శత్రువులు కోసి వికృతంగా చేశారని నాకు తెలుసు. నేనిక్కడకు బట్టలు చించుకొని పెడబొబ్బలు పెట్టడానికి రాలేదు. నేను ఓర్పువహించి అతని కోసం దైవాన్ని ప్రార్థిస్తాను" అని అన్నారు ఆమె.

దైవప్రవక్త (స) ఈ మాటలు విని శవాన్ని చూడటానికి ఆమెకు అనుమతి ఇచ్చారు. అప్పుడు హజ్రత్ సఫియా (రజి) దగ్గరకు వచ్చి సోదరుని శవాన్ని చూశారు. ముంచుకొస్తున్న దుఃఖాన్ని బలవంతంగా దిగమింగుతూ "ఇన్నా లిల్లాహి వఇన్నా ఇలైహి రాజివూన్ (మనం దేవుని వాళ్ళం, దేవుని వైపునకే మనం మరలిపోవలసి ఉంది)" అన్నారు. ఆ తరువాత ఆమె సోదరుని పాపమన్నింపు కోసం దైవాన్ని ప్రార్థించి శ్రద్ధాంజలి ఘటించారు.

హజ్రత్ అమ్మారా బిన్ జియాద్ (రజి) తీవ్రమైన గాయాలతో ఒకచోట పడి చరమ ఘడియలు లెక్కపెడ్తున్నారు. దైవప్రవక్త (స) శవాలను చూసుకుంటూ అక్కడికి వచ్చారు. ఆయన్ని చూడగానే అమ్మారా(రజి)కు ప్రాణం లేచివచ్చింది. ఆయన అతికష్టమ్మీద ప్రాకి దైవప్రవక్త (స) పాదాలపై తన చెంపలు ఆనిచ్చిపెట్టి తృప్తిగా తుదిశ్వాస వదిలారు.

దైవప్రవక్త (స) అక్కడ్నుంచి కదలివెళ్తూ సాద్ బిన్ రబీ (రజి) ఎక్కడున్నాడో ఎలా ఉన్నాడో తెలుసుకొని రమ్మని ఒక అనుచరుడ్ని పురమాయించారు. ఆ అనుచరుడు అటూఇటూ తిరిగిచూశాడు. కాని సాద్ బిన్ రబీ (రజి) ఎక్కడా కన్పించలేదు. సాద్! నువ్వెక్కడున్నావు? అని పేరుపెట్టి బిగ్గరగా పిలిచినా సమాధానం లేదు. "సాద్ బిన్ రబీ ఎక్కడున్నాడు? అతడ్ని కలుసుకోమని నన్ను దైవప్రవక్త (సల్లం) పంపించారు" అన్నాడు ఆ అనుచరుడు.

హజ్రత్ సాద్ బిన్ రబీ (రజి) ఒక చోట రక్తపు మడుగులో నిస్తేజంగా పడి ఉన్నారు. కాని దైవప్రవక్త (స) పేరు వినగానే ఆయనలో చలనం కలిగింది. మొత్తం శరీరంలోని బలాన్ని పుంజుకొని "నేనిక్కడున్నాను" అన్నారు హీనస్వరంతో. అప్పుడా అనుచరుడు దగ్గరకి వచ్చి "సాద్! నువ్వెలా ఉన్నావని దైవప్రవక్త (స) అడిగారు" అని అన్నాడు.

"దైవప్రవక్త (సల్లం)కు నా సలాం అందజెయ్యి. ప్రవక్తలందరికీ వారి అనుచరుల చిత్తశుద్ధి, త్యాగనిరతుల వల్ల లభించే యావత్తు పుణ్యఫలం కన్నా ఎక్కువ పుణ్యఫలం ఆయనకు లభించుగాక! అని కూడా నా తరఫున చెప్పు. నాజాతి ప్రజలకు కూడా నా సందేశం అందజెయ్యి. 'మీరు లైలతుల్ ఖదర్ (మహారాత్రి) రోజున దైవప్రవక్త (సల్లం) కోసం ప్రాణత్యాగమైనా చేస్తామని ప్రతిజ్ఞ చేశారు గనక, ఆ మహనీయునికి ఎలాంటి బాధ కలిగినా మీరు దేవునికి ముఖం చూపలేరు' అని వారికి చెప్పెయ్యి" అన్నారు హజ్రత్ సాద్ బిన్ రబీ (రజి).

ఈ చివరి వాక్యం అతికష్టంతో పలికి తుదిశ్వాస వదిలారు ఆయన.

హజ్రత్ ఖతాదా బిన్ నోమాన్ (రజి) దైవప్రవక్త (సల్లం) ముందు నిలబడి శత్రువుల బాణాలు ఆయనమీద పడకుండా నిరోధించారు. అప్పుడొక బాణం వచ్చి ఆయన కంటికి తగిలింది. దాంతో ఆయన కంటిగుడ్డు ఊడి వ్రేలాడసాగింది. అయినప్పటికీ హజ్రత్ ఖతాదా (రజి) ఒక చేత్తో కంటిగుడ్డును పడిపోకుండా పట్టుకొని రెండవ చేత్తో శత్రువులు విడుస్తున్న బాణాలను నిరోధించసాగారు.

యుద్ధంలో ఈ క్లిష్టపరిస్థితి గడచిపోయిన తరువాత దైవప్రవక్త (సల్లం) హజ్రత్ ఖతాదా (రజి) ముఖం మీద వ్రేలాడుతున్న కనుగుడ్డును చేత్తో పట్టుకొని జాగ్రత్తగా దాని స్థానంలో యథాప్రకారం పెట్టేశారు. వెంటనే ఖతాదా (రజి) కంటిబాధ పూర్తిగా తగ్గిపోయి చూపు కూడా వచ్చింది.

తరువాత దైవప్రవక్త (సల్లం), ఆయన అనుచరులు మృతవీరుల్ని ఖననం చేయడం ప్రారంభించారు. ఒక్కొక్క సమాధిలో రెండేసి మూడేసి శవాలను పూడ్చిపెట్టారు. హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి) మృతదేహం కప్పడానికి లభించిన వస్త్రం కురచగా ఉంది. దాంతో ఆయన తల వైపు నుంచి కప్పితే పాదాలు బయటుండి పోతున్నాయి. పాదాల వైపు నుంచి కప్పితే తల బయటుండి పోతోంది. చివరికి వస్త్రాన్ని తల వైపునుంచి కప్పి పాదాలపై గడ్డితో కప్పారు. ఆతర్వాత యుద్ధభూమి నుంచి మదీనా బయలుదేరారు.

## ప్రవక్త క్షేమమే ఆ పడతి ఆకాంక్ష-(94)

దైవప్రవక్త (సల్లం) అమరగతులయ్యారన్న వదంతి మదీనాలో చాలామంది చెవులకు సోకింది. దాంతో అనేకమంది ముస్లింలు తీవ్రఆందోళన చెందుతూ కన్పించిన ప్రతి వ్యక్తినీ "ఈవార్త నిజమేనా?" అని అడుగుతూ తిరుగుతున్నారు. కొందరు ఏకంగా యుద్ధ భూమికి పరుగుతీశారు. అలాంటివారిలో హజ్రత్ హమ్నా బిన్త్‌హజష్ (రజి) కూడా ఉన్నారు.

యుద్ధరంగం నుంచి ముజాహిద్‌లు తిరిగొస్తుంటే దారిలో హజ్రత్ హమ్నా (రజి) ఎదురయ్యారు. వారామెను చూడగానే "హమ్నా! మీమామ హమ్జా (రజి) గారు అమరగతుల య్యారు తల్లీ!" అని చెప్పారు.

ఈ వార్త విని హజ్రత్ హమ్నా "ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్" అన్నారు. తర్వాత ఆ యోధులు, మీ అన్నయ్య అబ్దుల్లా బిన్ హజష్ (రజి) కూడా చనిపోయాడమ్మా! అన్నారు. అప్పుడు కూడా హమ్నా (రజి) సహనం వహించారు.

కాస్సేపటికి సైనికులు "అమ్మా! నీభర్త ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి) కూడా అమర గతుడయ్యాడమ్మా!" అని తెలియజేశారు.

ఈ విషాదవార్త వినగానే హజ్రత్ హమ్నా (రజి) ఒక్కసారిగా తల్లడిల్లిపోయి ఏడ్వడం మొదలెట్టారు. దైవప్రవక్త (సల్లం) ఆమె దీనావస్థ చూసి "స్త్రీకి భర్త మీద అమితమయిన ప్రేమ ఉంటుంది" అన్నారు.

దైవప్రవక్త (సల్లం) గురించిన వదంతి విని ఒక అన్సార్ మహిళ తీవ్ర ఆందోళన చెందుతూ ఆదరా బాదరాగా యుద్ధభూమికి బయలుదేరింది.



"ఏమిటీ..........! నా ప్రియతమ నాయకునికి.... నా అభిమాన ప్రవక్తకు.... నా మహోపకారికి.... మరణప్రాప్తమా!?..... కాదు కాదు. ఇదేదో దుష్టులు లేవదీసిన పుకార్లు; గిట్టనివాళ్ళు వ్యాపింపజేసిన కట్టుకథలు.... ఒకవేళ ఇది నిజమే అయితే....? వద్దు వద్దు. దైవం ఆయన్ని కాపాడుగాక!"

ఇలా ఆమె పరిపరి విధాల ఆలోచిస్తూ వేగంగా ముందుకు సాగిపోతోంది. దారిలో ముళ్ళను, రాళ్ళను కూడా గమనించే స్థితిలో లేదు. కాలి సత్తువ కొద్దీ చరచరా నడచి పోతోంది. యుద్ధంలో ఆమె తండ్రి, భర్త, సోదరుడు తదితర రక్త బంధువులు కూడా పాల్గొన్నారు. కాని వారి పరిస్థితి గురించి ఆలోచించడం లేదామె.

ఇప్పుడామె హృదయంలో ముద్ర వేసుకున్నది మానవమహోపకారి ముహమ్మద్ (సల్లం) చిత్రం మాత్రమే. ఆ మహనీయుడు క్షేమంగా ఉంటే చాలు, ఇక తనకు ఏ దిగులూ ఉండదు. అదే ఆమె ఆకాంక్ష. ఆ ఆకాంక్షతోనే ఆమె అలుపూ సలుపూ లేకుండా ఎడాపెడా నడుస్తూ యుద్ధభూమి వైపు దూసుకుపోతోంది.

అప్పుడే రణరంగం నుంచి యోధులు జట్లు జట్లుగా తిరిగొస్తున్నారు.

"అమ్మా! చెప్పడానికి మాకు నోరు రావడం లేదు. యుద్ధంలో మీ నాన్నగారు చని పోయారమ్మా!" అన్నారు కొందరు ముజాహిద్‌లు ఆమెను చూడగానే.

"నాన్నా....! కని పెంచిన తండ్రి.... బ్రతుకు బండలు చేసుకొని పోషించిన తండ్రి..... ప్రేమామృతం కురిపించి విద్యాబుద్ధులు నేర్పిన తండ్రి....."

అలాంటి తండ్రి చనిపోతే ఆ కూతురి హృదయం ఎంత తల్లడిల్లి పోతుంది! కాని ఆ సహనమూర్తి తండ్రి మరణవార్త విని కించిత్తయినా చలించలేదు. అసలామె దానికి ఏమాత్రం ప్రాముఖ్యం ఇవ్వకుండా ఇలా అడిగింది:

"ముందీ సంగతి చెప్పండి. మన ప్రియప్రవక్త (సల్లం) క్షేమంగా ఉన్నారా?"

"ఆయన క్షేమంగానే ఉన్నారు. కాకపోతే కాస్త గాయపడ్డారు" అన్నారు యోధులు.

కాని వారి మాటలపై ఆమెకు పూర్తిగా నమ్మకం కుదరలేదు. కారుణ్యమూర్తి (స)ని తన కళ్ళతో చూసుకుంటేగాని మనసు కుదుటపడదు.

అంతలో మరికొందరు యోధులు తెలిపారు, నీ సోదరుడు చనిపోయాడని.

తండ్రి మరణవార్తనే ఖాతరుచేయని స్త్రీ సోదరుడు చనిపోతే విచారిస్తుందా? ఆమె విచారమల్లా దైవప్రవక్త (సల్లం)ను గురించే. అదే ఆమె మనశ్శాంతిని దూరంచేసి ఆమెను ఇంత దూరం లాక్కొచ్చింది. మరికొంత దూరం పోయాక మరో విషాదవార్త....

"నీ భర్త కూడా యుద్ధంలో చనిపోయాడమ్మా!"

"ఆ...... నా భర్త? నా హృదయేశ్వరుడు.....? నా అనురాగమూర్తి.....? చనిపోయాడా? నాకు శాశ్వతంగా దూరమయ్యాడా? భరించలేని ఎడబాటు! బ్రతుకుపై నిప్పులు కురిపించిన గ్రహపాటు!!"

కన్నతండ్రి పోతే కాస్తయినా ఓర్చుకోవచ్చు. రక్తం పంచుకొని పుట్టిన సోదరుడు పోయినా పెద్దగా బాధుండదు. కాని కట్టుకున్న భర్తనే కోల్పోతే ఇక సంఘంలో తనకు నీడిచ్చే నాధుడెవరు? పైగా తండ్రి, సోదరుడు, భర్త ముగ్గురూ ఒకేసారి చనిపోతే ఇక ఆ దీనురాలి గతేమిటి?? ఆమె కోమల హృదయం ఎన్ని ముక్కలవుతుంది???

కాని ఆ ధీరవనిత హృదయం లేశమైనా చలించలేదు. అదొక సహనసాగరం. అందులో ఆందోళనా సుడిగుండం ఏదైనా ఉందంటే అది దైవప్రవక్త (సల్లం) సంక్షేమం విషయంలోనే. ఆ తరువాతే మరేదైనా విషయానికి తావుంటుంది.

అందుకే ఆ నారీమణి నయనాలు తీవ్రమయిన ఆందోళనతో దైవసందేశహరుని దివ్యమోము కోసం గాలించసాగాయి.

ఆమె పరిస్థితి గమనించి ఒక యోధుడు "అదిగో దైవప్రవక్త (సల్లం) వస్తున్నారు" అని చెప్పాడు అటువైపు చూపిస్తూ.

అంతే... ఆమె సుడిగాలిలా అటువైపు పరుగెత్తింది. అనుచరుల మధ్య పున్నమి చంద్రునిలా వెలిగిపోతున్న ప్రియతమ నాయకుడ్ని చూసుకోగానే ఆమె అమిత సంతోషంతో పరవశించిపోయింది.

"దైవప్రవక్తా! మీరు క్షేమంగా ఉన్నారు, అదే చాలు నాకు. ఇక నాపై విరుచుకుపడిన ఎలాంటి ఆపదనైనా తేలిగ్గా భరించగల్గుతాను" అన్నది ఆ వీరవనిత కళ్ళ నుంచి ఆనంద భాష్పాలు రాలుతుండగా.

ఇలాంటి అభిమానం గురించే దైవప్రవక్త (సల్లం) అన్నారు: "నేను మీకు మీ తండ్రి, మీ కొడుకులు, యావన్మంది (సన్నిహితుల) కన్నా ఎక్కువ ప్రియమైనవాడ్ని కానంతవరకు మీలో ఏ ఒక్కడూ నిజమైన విశ్వాసి కాలేడు."

## పునర్విజృంభణ-(95)

బదర్ యుద్ధంలో మాదిరిగా ఈసారి ఖురైషీయులు అవమానకరంగా ఓడిపోలేదు. వారిలో ఇంకా పౌరుషం మిగిలేవుంది. ఈ యుద్ధంలో ముస్లింలు బాగా అలసిపోయి ఉంటారు. అందువల్ల వెనక్కి వెళ్ళి మదీనాపై దాడిచేద్దామా అన్న ఆలోచన వచ్చింది వారికి. ఈ ఆలోచన రాగానే ఖురైష్ సైన్యాలు 'రౌహా' అనే చోట ఆగిపోయాయి.

అయితే ఇటు దైవప్రవక్త (సల్లం) ఖురైషీయులు అనుకుంటున్నట్లు అజాగ్రత్తగా లేరు. వారి చర్యలపట్ల ఆయన అనుక్షణం అప్రమత్తంగానే ఉన్నారు. యుద్ధం ముగిసిన మరునాడే ఆయన "ఇంకా మనం ఖురైషీయులను వెంబడించవలసి ఉంది. యోధు లంతా సిద్ధంగా ఉండాలి" అని ప్రకటన చేశారు.

దైవప్రవక్త (సల్లం) ప్రకటన వినగానే యోధులు బయలుదేరడానికి సిద్ధమయ్యారు. వారి శరీరాలు బాగా అలసిపోయాయి. కాని వారి హృదయాల్లో ధైర్యస్థైర్యాలు ఇంకా పరవళ్ళు తొక్కుతున్నాయి.



ముస్లిం యోధులు మదీనా నుండి బయలుదేరి 'హమ్రావుల్ అసద్' అనే చోటికెళ్ళి విడిదిచేశారు. ఖుజాఆ తెగకు చెందిన మాబద్ అనే అతను ఆ ప్రదేశం మీదుగా పోవడం జరిగింది. ఖుజాఅ తెగకు, మాబద్‌కు ముస్లింల పట్ల సానుభూతి ఉంది. ఉహద్‌యుద్ధంలో దైవప్రవక్త (సల్లం) గాయపడ్డారని విని మాబద్ చాలా బాధపడ్డాడు. అదే విషయాన్ని అతను దైవప్రవక్త (సల్లం) దగ్గర ప్రస్తావించి సానుభూతి తెలిపాడు.

ఆ తరువాత మాబద్ ఖురైష్ సైన్యం ఆగిన ప్రదేశానికి చేరుకున్నాడు. ఖురైష్ సైన్యాధ్యక్షుడు అబూసుఫ్యాన్ అతడ్ని చూడగానే "ఏమిటి విశేషాలు?" అని అడిగాడు ఎంతో ఆతురతతో.

"ముహమ్మద్ (సల్లం), ఆయన అనుచరులు మిమ్మల్ని వెంబడిస్తూవస్తున్నారు. ముస్లిం సేనావాహిని నురుగులు కక్కుతూ వస్తోంది. ఆ సైన్యం మీతో మరోసారి పోరాడటా నికి తహతహలాడి పోతోంది. అబ్బో! అంతగొప్ప సైన్యాన్ని నేనిదివరకెప్పుడూ చూడలేదు" అన్నాడు మాబద్.

"అలాగానా! అయితే ఇప్పుడు మీ సలహా ఏమిటీ?" అడిగాడు అబూసుఫ్యాన్.

"నేను మాత్రం మీరు ఇక్కడ్నుంచి వెంటనే పారిపోవడం మంచిదంటాను."

"ఏమిటి మమ్మల్ని పారిపొమ్మంటున్నారా? అయ్యయ్యో! అలాగయితే మా కడుపు మంట ఎలా చల్లారుతుంది? మరోసారి ప్రయత్నిద్దామని అనుకుంటున్నామే మేము. అదృష్టం కలిసొస్తే నిన్న కానిపని ఈరోజు కావచ్చు కదా!" అన్నాడు అబూసుఫ్యాన్.

"చూడండి, నాకు మాత్రం మీరిలా మరోసారి కయ్యానికి కాలుదువ్వడం నచ్చలేదు. బాగా ఆలోచించుకోండి. నేను మీశ్రేయస్సు కోరి చెబుతున్నాను. ఆపై మీఇష్టం. పులితో చెలగాటమాడితే జరిగే పర్యవసానం ఏమిటో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు."

ఈ మాటలు విని అబూసుఫ్యాన్ సందిగ్ధంలో పడిపోయాడు. "ఇప్పుడేం చెయ్యాలి? గౌరవమర్యాదల్ని దక్కించుకొని చక్కా మక్కాపట్నం వెళ్ళిపోవడమా లేక ముహమ్మద్‌తో మరోసారి యుద్ధానికి తలపడటమా?" అబూసుఫ్యాన్ తల దిమ్మెక్కిపోయింది.

అతను తన సైనిక సలహాదారులతో కూడా సంప్రదించాడు. అంతలో ఒక వాణిజ్య బృందం వచ్చింది.

"ఎక్కడిదాకా మీ ప్రయాణం?" అడిగాడు అబూసుఫ్యాన్ వర్తకులతో.

"మేము మదీనా వెళ్తున్నాం. అక్కడ వ్యాపారం చేసి ధాన్యం తెచ్చుకోవాలని వెళ్తున్నాం" అన్నాడు వాణిజ్య బృందం నాయకుడు.

"అయితే మీరు మా తరఫున ముహమ్మద్‌కు ఓ మాట అందజేయగలరా? ఈసారి మీరు ఉకాజ్ సంతకు వస్తే మీకు మేము మోపెడు ద్రాక్ష పండ్లు ఇస్తాం" అన్నాడు అబూసుఫ్యాన్ ఆశపెడుతూ.

"అలాగే అందజేస్తాం, చెప్పండి ఆ మాటేమిటో."

"మీరు ముహమ్మద్‌ని కలిసి ఆయనతో, మేము మళ్ళీ వస్తున్నామని, ఈసారి అందర్నీ అంతంచేసిగాని వదలిపెట్టమని చెప్పండి" అన్నాడు అబూసుఫ్యాన్.

"మంచిది, అలాగే చెప్తాం" అని చెప్పి వాణిజ్యబృందం అక్కడ్నుంచి బయలుదేరింది. ఈ బృందం హమ్రావుల్ అసద్ ప్రాంతానికి చేరుకొని దైవప్రవక్త (సల్లం)ను కలుసుకొని అబూసుఫ్యాన్ చెప్పిన మాటలు విన్పించింది. దానిపై దైవప్రవక్త (సల్లం) "అల్లాహ్ మా రక్షకుడు. ఆయనే మమ్మల్ని కాపాడుతాడు" అన్నారు నిశ్చలంగా.

దైవప్రవక్త (సల్లం) ఆ ప్రదేశంలో అబూసుఫ్యాన్ కోసం మూడు రోజులు దాకా ఎదురుచూశారు. కాని అబూసుఫ్యాన్ రాలేదు. అబూసుఫ్యాన్ మదీనాపై దండెత్తడానికి వస్తున్నానని మాట వరసకు అన్నాడేకాని, ముస్లిం యోధులంటే అతనికి లోపల భయంగానే ఉంది. అతని సైనికులక్కూడా ఈ విషయం బాగా తెలుసు. అందువల్ల వారు ఎంతో కొంత దక్కిన గౌరవాన్నే ఘనవిజయంగా భావిస్తూ మక్కా దారిపట్టారు.

ఖురైష్‌సైన్యాలు మక్కా వెళ్ళిపోయాయని నిర్ధారించుకున్న తరువాత దైవప్రవక్త (సల్లం) కూడా తన అనుయాయుల్ని తీసుకొని మదీనా తిరిగొచ్చారు.

## అంతర్గత శత్రువులు-(96)

మదీనాలో కపటుల బెడద ఇంకా వదల్లేదు. ఉహుద్ యుద్ధ సమయంలో వారి నిజస్వరూపాలు మరింత బయటపడ్డాయి. వారు ముస్లింలతో పాటు యుద్ధానికి పోలేదు.

"యుద్ధం జరగనే జరగదు. యుద్ధం జరిగే అవకాశముంటే మేము తప్పకుండా పాల్గొని శత్రువుల్ని చీల్చిచెండాడుతాం" అంటూ సాకులు చెప్పి వారు తమ ఇండ్లలోనే ఉండిపోయారు.

సరే, యుద్ధం నుంచి ముస్లింలు తిరిగొస్తే, అప్పుడైనా ఈ కపటులు మౌనంగా ఉన్నారా అంటే అదీ లేదు. తాము యుద్ధంలో పాల్గొనకపోవడానికి ఏదో కారణం చూపాలి కదా! అందుకని ఈసారి ప్లేటు మార్చారు.

"వీరు పిచ్చివాళ్ళు కాకపోతే పర్వతాల్లాంటి ఖురైష్ యోధుల్ని ఢీకొనడానికి వెళతారా? అందుకే తగిన శాస్తి జరిగింది. యుద్ధంలో చనిపోయినవాళ్ళు మేము చెప్పినట్లు విని మాతోపాటు మదీనాలోనే ఉండిపోయి ఉంటే వారికీ గతి పట్టేది కాదు" అంటూ యుద్ధ వీరుల్ని హేళన చేయడం ప్రారంభించారు.

"(ఉహుద్) యుద్ధంలో మీకు జరిగిన నష్టం దేవుని అనుజ్ఞతోనే జరిగింది. మీలో నిజమైన ముస్లిములెవరో, కపట ముస్లిములెవరో పరీక్షించడానికే దేవుడిలా చేశాడు. ఆ కపటులతో "రండి, దైవమార్గంలో పోరాడండి. (శత్రు)దాడిని తిప్పికొట్టి (మీనగరాన్ని) కాపాడుకోండి" అని అన్నప్పుడు "యుద్ధంసంగతి మాకు తెలిసివుంటే మేము తప్పకుండా మీతో చేరేవాళ్ళం" అని సమాధానమిచ్చారు. ఈ మాటలు అంటున్నప్పుడు వారు విశ్వాసం కన్నా అవిశ్వాసానికే ఎక్కువ చేరువగా ఉన్నారు. వారు తమ హృదయాల్లోలేని మాటలు పైకి చెబుతున్నారు. వారు తమ హృదయాల్లో దాచినదేమిటో దేవునికి బాగా తెలుసు.



వారు (యుద్ధానికి పోకుండా ఇంట్లో) కూర్చొని (దైవమార్గంలో ప్రాణత్యాగం చేయడానికి వెళ్ళిన) తమ బంధువుల్ని, మిత్రుల్ని గురించి "వారు మామాట వినిఉంటే ఇలా వధించబడి ఉండేవారు కాదు" అని చెప్పారు. ప్రవక్తా! వారినిలా అడుగు: "మీ అభిప్రాయం నిజమయితే మీకు దాపురించే మృత్యువుని అడ్డుకోండి చూద్దాం." (ఖుర్‌ఆన్-3:166-168)

ఇక యూదుల సంగతి ఎవరికి తెలియదు? అవకాశం దొరికితే చాలు, దైవప్రవక్త (సల్లం)పై విమర్శనాస్త్రాలు గుప్పించడానికి సిద్ధంగా ఉంటారు.

"ముహమ్మద్ ఎంతమాతం దైవప్రవక్త కాదు. ఈయనగారు యావత్తు అరేబియాకు చక్రవర్తి కావడానికి ఉవ్విళ్ళూరుతున్నాడు. ఉహుద్ యుద్ధంలో ఏమయిందో చూశారుగా! ఆయన గాయపడ్డాడు; ఆయన సహచరులు కూడా గాయపడ్డారు. దైవప్రవక్త ఏమిటీ, గాయపడటం ఏమిటీ? ఎక్కడైనా విన్నామా ఈ విడ్డూరం??" అని చెబుతూ వారు జనాన్ని పెడదారి పట్టించడానికి ప్రయత్నించసాగారు.

అబ్దుల్లా బిన్ ఉబై కపటవిశ్వాసుల నాయకుడు. కాని అతని కొడుకు అబ్దుల్లా (రజి) హృదయపూర్వకంగా ఇస్లాం స్వీకరించిన నిజమైన ముస్లిం. ఉహుద్ యుద్ధంలో ఆయన కూడా గాయపడ్డారు. దానిపై ఇబ్నెఉబై కొడుకుని దెప్పిపొడుస్తూ "చూసుకున్నావుగా యుద్ధంలో పాల్గొనడంవల్ల జరిగే పర్యవసానం ఏమిటో!" అన్నాడు.

అబ్దుల్లా (రజి) చిరునవ్వుతో "పరవాలేదు నాన్నా! దేవుడు చేసిందేదో మంచి కోసమే చేశాడు" అని సమాధానమిచ్చారు.

నిజమే, దేవుడు చేసినపని మంచిదే అయింది. ఈవిధంగా దేవుడు ముస్లింలలో కలిసివున్న కపటుల బాహ్యవేషాలను లాగివేసి వారి నిజస్వరూపాలను బయటపెట్టాడు.

అబ్దుల్లా బిన్ ఉబై ప్రతి శుక్రవారం ముస్లింలకు హితబోధ చేస్తుంటాడు. దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం)కు పూర్తి సహకారం అందజేయాలని, ఆయన కోసం ధన ప్రాణాలను సైతం త్యజించి పాటుపడాలని మరీ మరీ హెచ్చరిస్తుంటాడు. ఈ విధంగా ఆ వంచకుడు ఇస్లాంపట్ల తనకు అపరిమితమైన అభిమానముందని, ముస్లింలపట్ల ఎనలేని సానుభూతి ఉందని ప్రచారం చేసుకుంటున్నాడు.

అయితే ఉహుద్ యుద్ధం తరువాత ఇలాగే నీతులు బోధించడానికి ముందుకొస్తే ముస్లింలు అతడ్ని విదిలించి వేశారు. "యుద్ధానికి బయలుదేరమంటే బయలుదేరలేదు గాని, పెద్ద నీతులు చెప్పడానికి సిద్ధమయ్యాడు. చాలు చాలు. ఇక నోరు మూసుకో" అంటూ చీవాట్లుపెట్టి అతని నోటిని కట్టివేశారు ముస్లింలు.

దాంతో ఆ దుర్మార్గుడి ఆటలు ముస్లింల ముందు సాగలేదు. ముఖం మాడ్చుకొని "నేనేదో తప్పుడు మాటలు పలికినట్లు నన్ను మందలిస్తున్నారే! నేనేమన్నాను, మంచి మాటలే చెబుతున్నాకదా!!" అని గొణక్కుంటూ వెళ్ళిపోయాడతను.

యూదుల్లో, కపటుల్లో దాగివున్న ఈ దుష్టవైఖరి కాస్తా బయటపడగానే హజ్రత్ ఉమర్ (రజి) సహించలేకపోయారు. "దైవప్రవక్తా! మనం యూదులు, కపటులతో కూడా యుద్ధం చేయాలి" అన్నారు ఆయన ఆవేశంతో.

"యూదులతో మనం స్నేహఒప్పందం చేసుకొని ఉన్నాం కదా! వాళ్ళతో యుద్ధం ఎలా చేస్తాం?" అన్నారు దైవప్రవక్త (సల్లం)

"మరి కపటవిశ్వాసుల సంగతేమిటీ?" అడిగారు ఉమర్ (రజి)

"వారు సద్వచనం (కలిమా) పఠించి ఉన్నారు. అంటే దేవుని ఏకత్వాన్ని, దైవదౌత్యాన్ని అంగీకరించినట్లే కదా!"

"నిజమే అంగీకరించినట్లే. కాని యుద్ధంలో వీరు మనతో సహకరించలేదు. దాన్ని బట్టి వారి ఉద్దేశ్యం ఏమిటో, వారి విశ్వాసం ఎలాంటిదో బహిర్గతమవుతోంది."

"ఈ విషయాల్లో నోటితో సాక్ష్యమిచ్చేవారితో నేనెలా యుద్ధం చేయగలను?" అన్నారు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం).

కపటవిశ్వాసులు మాత్రం వీలు చిక్కినప్పుడల్లా ముస్లింలపై బురద చల్లుతూనే ఉన్నారు. ఉహుద్ యుద్ధంలో ముస్లింలు ఘోరంగా ఓడిపోయారని జనానికి చెబుతూ తిరుగుతున్నారు. నిజానికి ముస్లింలు ఉహుద్ యుద్ధంలో విజయం సాధించే తిరిగొచ్చారు. కాకపోతే కాస్త పొరపాటు జరగటంవల్ల ముస్లిం యోధులు గాయపడవలసి వచ్చింది. వారు అంచనాకు మించి అమరగతులవడం కూడా నిజమే. కాని వెంటనే వారు తమ పొరపాటు గ్రహించి సంఘటితమయి, ప్రాణాలకు తెగించి పోరాడారు. ఈవిధంగా వారు చివరి క్షణంలో విజయం సాధించాకే మదీనా తిరిగొచ్చారు.

## చెదురుమదురు సైనిక చర్యలు-(97)

హిజ్రీ 4వ సంవత్సరం, ముహర్రం నెల వచ్చింది. బనీఉసద్ తెగవాళ్ళు ముస్లింలపై దాడిచేయడానికి యుద్ధసన్నాహాలు చేస్తున్నారని గూఢచారుల ద్వారా దైవప్రవక్త (స)కు సమాచారం అందింది. ఈ తెగవాళ్ళు నజద్ ప్రాంతంలోని ఖతన్ గ్రామంలో నివసిస్తున్నారు. వాళ్ళను అణచివేయడానికి దైవప్రవక్త (స) తక్షణమే అబూసల్మా మఖ్జూమీ (రజి) నాయకత్వంలో నూటయాభై మంది యోధులతో కూడిన ఓ సైనికదళాన్ని పంపించారు.

సైనికులు దండయాత్రకు బయలుదేరే ముందు దైవప్రవక్త (సల్లం) వారికి కొన్ని హితవులు ఉపదేశించారు. ముఖ్యంగా దైవానికి భయపడుతూ మెలగాలని చెప్పారు. ఆ తరువాత సైనికులు ఖతన్‌కు బయలుదేరారు.

అయితే ఖతన్‌లో బనీఉసద్ తెగవాళ్ళ యుద్ధసన్నాహాలు ఇంకా పూర్తికాలేదు. అంతలో వారికి ముస్లిం సేనలు వస్తున్నాయని తెలిసింది. వెంటనే వారు భీతావహులయి అక్కడ్నుంచి పిక్కబలం కొద్దీ పారిపోయారు. ముస్లిం యోధులు ఎలాంటి శ్రమ లేకుండా వారి ఒంటెల్ని, మేకల్ని స్వాధీనం చేసుకొని మదీనా తిరిగొచ్చారు.

రావీఅర్ఫాత్ సమీపంలో ఉర్నా అనే గ్రామం ఉంది. అక్కడ సుఫ్యాన్ బిన్ ఖాలిద్ హజ్లి అనే ఓ దుర్మార్గుడు ఉన్నాడు. అతను బనూలహ్యాన్ తెగ నాయకుడు. ఓరోజు అతను మక్కాలోని ఓ వీధి గుండా నడుస్తుంటే ఒక ఇంటి నుంచి ఏడుస్తున్న ఓ స్త్రీ కంఠం విన్పించింది. అతనసలు ఉహుద్ యుద్ధంలో ఖురైషీయులు విజయం సాధించారని



విని వారిని అభినందించడానికి మక్కా వచ్చాడు. కాని ఇక్కడ పట్నంలో ప్రవేశించగానే ఏడ్పులు, పెడబొబ్బలు విన్పిస్తున్నాయి.

సుఫ్యాన్ ఆశ్చర్యపోతూ ఆ ఇంటికెళ్ళి తలుపు తట్టాడు. అది తల్హా బిన్ అబూతల్హా ఇల్లు. ఉహుద్ యుద్ధంలో అతను చనిపోయాడు. అతనొక్కడే గాకుండా అతని ఇద్దరు సోదరులు, ముగ్గురు కొడుకులు కూడా ఆ యుద్ధంలో చనిపోయారు. అందువల్ల అతని భార్య సులాఫా బిన్త్ సాద్ రేయింబవళ్ళు కన్నీరు మున్నీరుగా ఏడుస్తోంది. ముఖ్యంగా ఆమె కొడుకు ముసాఫా బిన్ తల్హా హజ్రత్ ఆసిమ్ బిన్ సాబిత్ అన్సారీ (రజి) చేతిలో వధించబడ్డాడు. అంచేత తాను ఆసిమ్ (రజి) పుర్రెలో సారా పోసుకొని తాగుతానని ఆమె ప్రమాణం చేసి మరీ శపథం చేసింది. దాని కోసం ఆసిమ్‌ని పట్టి తెచ్చినవానికి వంద ఒంటెలు బహుమానం ఇస్తానని కూడా ప్రకటించింది.

ఈ వివరాలు వినగానే సుఫ్యాన్‌కు నోరూరింది. అతను తన మనసులోని కోరిక పైకి వ్యక్తపరచకుండా ఆమెకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేసి వెళ్ళిపోయాడు. అయితే పోతూపోతూ "నేను నీ కొడుకు హంతకుడ్ని త్వరలోనే పట్టి తెస్తాలే" అన్నాడు.

ఆ తరువాత సుఫ్యాన్ తన ఊరికి చేరుకోగానే అనుచరుల్ని సమావేశపరచి "నేను మీకొక శుభవార్త చెప్పదలిచాను" అన్నాడు.

"ఏమిటా శుభవార్త?" అంటూ ఒక అనుచరుడు కుతూహలంగా అడిగాడు.

"నేనిప్పుడు మక్కా నుండి వచ్చాను. మక్కాలో తల్హా బిన్ అబూతల్హా భార్య సులాఫా ఉహద్‌యుద్ధంలో తన భర్త,కొడుకుల్ని పోగొట్టుకున్నది. అంచేత ఆమె బట్టలు చించుకొని కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ, తన కొడుకు ముసాఫాను వధించిన ఆసిమ్ శిరస్సు ఖండించి తెచ్చేవానికి వందఒంటెలు బహుమానంగా ఇస్తానని ప్రకటించింది. అంచేత మనం గనక ముస్లింలను మోసగించి ఆసిమ్‌తో సహా పదిమంది ముస్లింలను ఇక్కడకు రప్పించుకో గలిగితే, వాళ్ళను సునాయాసంగా బంధించి మనం కోరుకున్న ధరకు ఖురైషీయులకు అమ్మివేయవచ్చు. వందఒంటెల బహుమానం ఎలాగూ సులాఫా నుండి లభిస్తుంది. ఇంతకంటే మంచి అవకాశం లభించదు" అన్నాడు సుఫ్యాన్.

"కాని ముస్లింల దగ్గర్నుండి వాళ్ళ మనుషుల్ని మనం ఎలా రప్పించుకో గల్గుతాం?"

"దాని కోసం నా దగ్గర ఒక పథకం ఉంది. మనలో ఇద్దరు మదీనా వెళ్ళి ముహమ్మద్ (సల్లం)ని కలుసుకొని తాము తమవాళ్ళ ప్రతినిధులమని పరిచయం చేసుకోవాలి. ఆ తర్వాత ఆయనతో వాళ్ళిద్దరు, తమ తెగవాళ్ళు ఇస్లాం వైపు మొగ్గు చూపుతున్నారని, అంచేత ధర్మ ప్రచారం కోసం ఆసిమ్ బిన్ సాబిత్ నాయకత్వంలో మీవాళ్ళను పదిమందిని మా వెంట పంపించమని అడగాలి" అన్నాడు సుఫ్యాన్.

వారిలా మాట్లాడుకుంటుండగానే ఎక్కడి నుండో ఒక అపరిచిత వ్యక్తి అక్కడికి వచ్చాడు. అతని ముఖంలో మంచి దర్పం, గాంభీర్యతలు కన్పిస్తున్నాయి. అతను తనను తాను పరిచయం చేసుకుంటూ మాట్లాడిన తీరులో ప్రత్యేక ఆకర్షణ, కలుపుగోలుతనాలు ఉట్టిపడుతున్నాయి.

సుఫ్యాన్ అతని మాటలకు ఎంతో ప్రభావితుడయి "మీ మాటల్లో ఎంతో ఆత్మీయత గోచరిస్తోంది. చెప్పండి, నా సహాయం ఏదైనా కావాలా?" అన్నాడు.

"ప్రస్తుతం నాకు మీ సహాయమేదీ అవసరం లేదు. నేనే మీకు నా సహాయసహాకారాలు అందజేద్దామని వచ్చాను. మీరు ముహమ్మద్ (సల్లం)కు వ్యతిరేకంగా పథక రచన చేస్తున్నారని విన్నాను. ఆ కార్యకలాపాల్లో నేనూ పాలుపంచుకోవాలని వచ్చాను. ముహమ్మద్ (సల్లం) ఆయన అనుచరులు మనందరికి పెద్ద బెడదగా తయారయ్యారు" అన్నాడు ఆ కొత్త వ్యక్తి.

"చాలా సంతోషం. నేను ముహమ్మద్ (స)కు వ్యతిరేకంగా అనేక తెగలను బాగా రెచ్చగొట్టాను. ఖురైషీయుల మద్దతు ఉన్నా లేకపోయినా, త్వరలోనే నేను ఒక పెద్ద సైన్యాన్ని తయారుచేసి మదీనాపై దాడి చేయబోతున్నాను" అన్నాడు సుఫ్యాన్.

ఈలోగా చీకటి పడి నక్షత్రాలు కూడా నింగి నుండి కళ్ళు మిటకరిస్తూ ధరణి వైపు తొంగిచూడసాగాయి. సుఫ్యాన్ అనుచరుల్ని పంపివేసి కొత్త వ్యక్తిని తీసుకొని తన కుటీరంలో ప్రవేశించాడు. పొద్దు పోయేదాకా ఇద్దరూ లోకాభిరామాయణం మాట్లాడుకున్నారు. ఆ తర్వాత పడుకున్నారు. సుఫ్యాన్ కాస్సేపటికే నిద్రలోకి జారి గురక పెట్టడం ప్రారంభించాడు.

కొత్త వ్యక్తి మెల్లిగా లేచి ఓసారి చుట్టూ కలియజూశాడు. తరువాత వర నుంచి ఖడ్గం లాగి సుఫ్యాన్ గొంతును కసకస కోసి శిరస్సును లోపల చొక్కా జేబులో వేసుకున్నాడు. ఆ తరువాత వెంటనే బయటికి వచ్చి చీకటిలో కలసిపోయాడు.

ఈ కొత్తవ్యక్తి ఎవరో కాదు, సుఫ్యాన్ని హతమార్చడానికి స్వయంగా దైవప్రవక్త (సల్లం) పంపిన మనిషే. ఆయనే హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉనైస్ (రజి). ఆయన పగటి వేళల్లో దాక్కొని రాత్రివేళల్లో ప్రయాణంచేస్తూ పద్దెనిమిది రోజుల తరువాత హి.శ. 4వ సంవత్సరం. ముహర్రం నెల 23వ తేదీన మదీనా చేరుకొని ఆ తలను దైవప్రవక్త (సల్లం) కాళ్ళ దగ్గర పడేశారు.

## మోసపోయిన ముస్లిం బోధకులు-(98)

ఆ తరువాత కొన్నాళ్ళకు హుజైల్ తెగకు సన్నిహితులయిన అజల్, ఖారా తెగల మనుషులు కొందరు మదీనా వచ్చి దైవప్రవక్త (సల్లం)ను కలుసుకున్నారు. ఆయనతో వారు "ముహమ్మద్ గారూ! మా తెగవాళ్ళు ఇస్లాంధర్మం వైపు ఆకర్షితులయ్యారు. వారికి ఇస్లాంధర్మం గురించి వివరించి, దాని ఆదేశాలేమిటో తెలియజేయవలసిన అవసరం ఉంది కదా! అందువల్ల మీరు మా దగ్గరికి కొందరు బోధకులను పంపండి" అని మనవి చేశారు.

ఏ తెగవాళ్ళయినా ఇస్లాం స్వీకరిస్తే వారికి ధర్మవిద్య బోధించేందుకు తన అనుచరులు కొందరిని అక్కడికి పంపడం దైవప్రవక్త సంప్రదాయం. దాని ప్రకారమే ఆయనిప్పుడు ఆరుగురు అనుచరుల్ని ఎంపికచేసి ఆ వ్యక్తుల వెంట పంపించారు.



వారంతా హి.శ. 4వ యేట, ముహర్రం నెల 5వ తేదీన మదీనా నుండి బయలుదేరి 'రజీ' అనే ఒయాసిస్సు దగ్గరికి చేరుకున్నారు. అక్కడికి చేరుకోగానే ఆ కొత్తవ్యక్తులు కేకలేస్తూ హుజైల్ తెగవాళ్ళను పిలువసాగారు. ఈధోరణి గమనించిన ముస్లిం బోధకులకు అనుమానం కలిగింది. వారి అనుమానం నిజమే అన్నట్లు అక్కడ దరిదాపుల్లో ఉన్న హుజల్ తెగ సైనికులు పరుగెత్తుకు రావడం కన్పించింది.

ఈ హఠాత్పరిణామానికి ప్రవక్త అనుచరులు బిత్తరబోయారు. తరువాత వెంటనే తేరుకున్నారు. తమల్ని పిలుచుకొచ్చిన ఈ మనుషులు మోసం చేశారని, హుజైల్ సైనికుల చేత చంపించడానికి కుట్రపన్నారని వారు గ్రహించారు. అలా గ్రహించగానే వారు తమ వరల నుంచి ఖడ్గాలు లాగి శత్రువుల్ని ఎదుర్కోవడానికి సిద్ధమయ్యారు.

"అరె! మేము మిమ్మల్ని హతమార్చడానికి రాలేదే, ఎందుకు మీరిలా కత్తులు బయటికి తీశారు? దైవసాక్షి! మేము మిమ్మల్ని చంపడానికి రాలేదు. మమ్మల్ని నమ్మండి" అన్నారు హుజైల్ సైనికులు.

"వీరు చెబుతున్న మాటలు ఎంతవరకు నిజం? ఒకవేళ వీరి మాటలు నమ్ముకుంటే తాము అనవసరంగా వారికి చిక్కిపోతామేమో!! ఇలా కాకుండా వారితో పోరాడి అమరగతి పొందడమే మంచిది" అని భావించారు ముస్లింలు.

"మీ మాటలపై మాకు నమ్మకం లేదు. మీరు మీ వాగ్దానాలను నిలబెట్టుకుంటారని నమ్మకం ఏమిటీ?" అన్నారు వారు శత్రువులతో.

శత్రువులు చాలామంది ఉన్నారు. వారి ముందు ఈ ముస్లింలు ఏపాటికి వస్తారు? అయినా వారు శత్రువులతో తలపడటానికే సిద్ధమయ్యారు. పర్యవసానం శత్రువులే గెలిచారు. పోరాటంలో ముగ్గురు ముస్లింలు అమరగతులయ్యారు. మిగిలిన ముగ్గురు తీవ్రంగా గాయపడి ఖైదీలుగా పట్టుబడ్డారు.

అమరగతులయినవారిలో హజ్రత్ ఆసిమ్ బిన్ సాబిత్ (రజి) కూడా ఉన్నారు. ఆయన ఉహద్‌యుద్ధంలో ముసాఫా అనే శత్రువుని వధించారు. దాంతో ముసాఫా తల్లి సులాఫా హజ్రత్ ఆసిమ్ (రజి)పై పగబూనింది. ఆసిమ్ తల నరికి తెచ్చినవారికి వంద ఒంటెలు బహుమానంగా ఇస్తానని ఆమె ప్రకటించింది. అంతేకాకుండా ఆయన పుర్రెలో సారాయి పోసుకొని తాగుతానని కూడా ఆమె శపథం చేసింది.

ఈ విషయం హుజైల్ సైనికులందరికీ తెలుసు. ఇప్పుడు ఆసిమ్ (రజి) వధించబడగానే ఆ వందఒంటెల బహుమతి కొట్టేద్దామన్న ఆశతో వారు ఆసిమ్ (రజి) శవం దగ్గరికి పరుగెత్తుకొని వచ్చారు. కాని తీరా చూస్తే శవం చుట్టూ ఓ తోడేళ్ళ గుంపు మూగి ఉండటం కన్పించింది. భయంతో ఎవరూ ముందుకు అడుగు వేయలేకపోయారు.

"సరే, ఉండనివ్వండి ఇప్పటికి. సాయంత్రం వచ్చి తల ఖండించి తీసికెళ్దాం" అని తమలోతాము చెప్పుకొని వెళ్ళిపోయారు. కాని సాయంత్రం వచ్చి చూస్తే ఆ శవం తాలూకు అవశేషాలు కూడా లేవక్కడ. అంతా హతాశులయ్యారు. సులాఫా కోరిక కూడా నెరవేరలేదు.

ఆ తర్వాత హుజైల్ సైనికులు ఖైదీలను మక్కా తీసికెళ్ళి అమ్మివేద్దామని నిర్ణయించు కున్నారు. అందువల్ల వారు ఖైదీల చేతుల్ని వెనక్కి విరిచి కట్టి బయలుదేరారు. మక్కా సమీపంలోనే జహిరాన్ లోయ ఉంది. అక్కడకు చేరుకునేటప్పటికి హజ్రత్ అబ్దుల్లా తారిఖ్ ఎంతో చాకచక్యంతో తాళ్ళు విప్పుకొని మెరుపువేగంతో శత్రువులపై లంఘించారు. అయితే శత్రువులు దూరం పారిపోయి అబ్దుల్లా (రజి) మీదికి రాళ్ళు రువ్వారు. చివరికి అబ్దుల్లా (రజి) ఆ రాళ్ళ దెబ్బలకు తీవ్రంగా గాయపడి అమరగతులయ్యారు.

హుజైల్ సైనికులు మిగిలిన ఇద్దరు ఖైదీలు జైద్ బిన్ దషిన్నా, ఖుబైబ్ బిన్ అద్దీ (రజి)లను మక్కా పట్టణానికి తెచ్చి హారిస్ బిన్ ఆమిర్ ఇంట్లో బంధించి ఉంచారు. ఇలా కొన్నాళ్ళు తిండి పెట్టకుండా ఆకలితో మాడ్చారు.

ఓరోజు హారిస్ చిన్నకొడుకు కత్తి తీసుకొని ఆడుకుంటూ హజ్రత్ ఖుబైబ్ (రజి) దగ్గరకు వచ్చాడు. ఖుబైబ్ (రజి) ఆ పిల్లవాడ్ని ఒడిలో కూర్చోబెట్టుకొని అతని చేతిలోని కత్తి తీసుకొని పక్కన పెట్టారు.

అంతలో పిల్లవాడి తల్లి అక్కడికి వచ్చింది. ఆమె ఖైదీ ఒడిలో పిల్లవాడ్ని, పక్కనే ఉన్న కత్తిని చూసి గగ్గోలు పెట్టింది. హజ్రత్ ఖుబైబ్ (రజి) ఆమెకు ధైర్యం చెబుతూ "భయపడకమ్మా! నేను నీ పిల్లవాడ్ని ఎట్టి పరిస్థితిలోనూ చంపను" అన్నారు.

కొన్నాళ్ళ తర్వాత సఫ్వాన్ బిన్ ఉమయ్యా అనే అతను హజ్రత్ జైద్ (రజి)ని కొన్నాడు. అతను జైద్‌ను వధించి తన తండ్రి ప్రతీకారం తీర్చుకోదలచి జైద్ (రజి)ని తన బానిస నస్తాన్‌కు అప్పగించాడు. నస్తాన్ హజ్రత్ జైద్ (రజి)ని హతమార్చడానికి మక్కా నుంచి ఆరు మైళ్ళ దూరంలో ఉన్న తనీమ్ అనే ప్రదేశానికి తీసికెళ్ళాడు.

తనీమ్‌లో అప్పటికే అనేక మంది జనం గుమిగూడి ఉన్నారు. వారంతా హజ్రత్ జైద్ (రజి)ని వధించే తమాషా చూడటానికి పోగయ్యారు. నస్తాన్ హజ్రత్ జైద్ (రజి)ని వధించడానికి సిద్ధమయ్యాడు. అంతలో అబూసుఫ్యాన్ ముందుకు వచ్చి...

"జైద్! దైవసాక్షిగా అడుగుతున్నాను, నిజం చెప్పు. ఇప్పుడిక్కడ ముహమ్మద్ (సల్లం) గనక ఉంటే, మేము నీకు బదులుగా ఆయన్ని వధించాలని, నువ్వు సంతోషంగా ఇంటికి వెళ్ళవచ్చని కోరుకుంటావు కదూ?" అన్నాడు.

"అపచారం, అపచారం. దైవప్రవక్త (సల్లం) కాలిలో ఓ చిన్న ముల్లు గుచ్చుకున్నా నేను ఏమాత్రం సహించలేను. దైవం అలా జరగనీయకుండుగాక!" అన్నారు హజ్రత్ జైద్ బిన్ దషిన్నా (రజి).

ఈ మాటలు విని అబూసుఫ్యాన్ నిర్ఘాంతపోయాడు. "ఎంత అభిమానం! నాయకుని పట్ల ఇంతటి అభిమానాన్ని నేనింతవరకు చూడలేదు" అన్నాడతను ఆశ్చర్యపోతూ.

ఆ తరువాత నస్తాన్ హజ్రత్ జైద్ (రజి)ని వధించాడు. జైద్ (రజి) దైవమార్గంలో అమరగతులయ్యారు. ఆయన దైవప్రవక్త(సల్లం) పట్ల తనకు అపార విశ్వాసం, అభిమానాలు ఉన్నాయని నిరూపించుకున్నారు.



దుష్టులకు పట్టుబడ్డ మరో యోధుడు హజ్రత్ ఖుబైబ్ (రజి)ని కూడా వధించడానికి దుర్మార్గులు తనీమ్‌కు తీసికెళ్ళారు. తమాషా చూడటానికి జనం కూడా చుట్టూ మూగారు.

"నాదొక కోరిక. నాకు రెండు రకాతులు నమాజ్ చేసుకోనీయండి చాలు" అన్నారు హజ్రత్ ఖుబైబ్ (రజి).

"సరే అలాగే చేసుకో" అన్నారు శత్రువులు.

హజ్రత్ ఖుబైబ్ (రజి) ఉజూ చేసి ప్రశాంతంగా రెండు రకాతులు నమాజ్ చేశారు.

"ఇంకాసేపు నమాజ్ చేయాలనే ఉంది నాకు. కాని నేను ప్రాణభయంతో నమాజ్‌ని సాగదీస్తున్నానని మీరనుకుంటారు. అంచేత నేను ముక్తసరిగా చేశాను" అన్నారాయన.

నమాజ్ పూర్తికాగానే శత్రువులు ఆయన్ని వధ్య స్థలానికి తీసికెళ్ళి నిలబెట్టారు. పైన ఉరితాడు వ్రేలాడుతోంది. హజ్రత్ ఖుబైబ్ (రజి) తల పైకెత్తి నింగి వైపు చూశారు. పెదవులు అప్రయత్నంగా కదిలాయి:

"దేవా! మేము నీ ప్రవక్త (సల్లం) సందేశాన్ని ప్రజలకు అందజేశాం. సందేశం అందజేయడంలో మేమెలాంటి కొరత చేయలేదు. దేవా! నీప్రవక్త (సల్లం)కు మా సలాం అందజేసే వాళ్ళెవరూ ఇక్కడ లేరు. నీవే ఆయనకు మా సలాం అందజెయ్యి...."

ఆ తరువాత ఆయన దృష్టి తన చుట్టూ నిలబడి ఉన్న శత్రువులపై, తమాషా చూస్తున్న ప్రజాగుంపుపై పడింది.

"దేవా! వీరందర్నీ నీవు లెక్కలోకి తీసుకో. వీరిలో ప్రతి ఒక్కడ్నీ హతమార్చివెయ్యి. ఏ ఒక్కడ్నీ విడిచిపెట్టకు" అని ప్రార్థించారు.

హజ్రత్ ఖుబైబ్ (రజి) పలుకులు విని శత్రువులు ఒక్కసారిగా కంపించిపోయారు. ఆయన శాపం తమల్ని ఎక్కడ మట్టుపెడుతుందో నని భయపడిపోయారు.

కాని పాషాణ హృదయాలు ఆ మాత్రానికి కరుగుతాయా? వాళ్ళు హజ్రత్ ఖుబైబ్ (రజి)ని ఉరికంబానికి కట్టి వ్రేలాడదీశారు. తరువాత వారు ఈటెలు తీసుకొని నలువైపుల చుట్టుముట్టి ఖుబైబ్ (రజి) శరీరాన్ని కసితీరా పొడవడం మొదలెట్టారు. ఇలా ఆ దుర్మార్గులు శరీరం మీద అనేక తూట్లు వేసి ఆయన ప్రాణం తోడేశారు. ఈ విధంగా హజ్రత్ ఖుబైబ్ (రజి) కూడా దైవమార్గంలో అమరగతులయి పరలోకంలోని తన మిత్రుల దగ్గరికి చేరుకున్నారు.

శత్రువులు కొందరు ముస్లింలను నమ్మకంగా పిలుచుకెళ్ళి దారిలో హతమార్చిన సంఘటన మదీనాలో సంచలనం సృష్టించింది. దైవప్రవక్త (సల్లం), ఆయన అనుచరుల గుండెలు చెరువులయ్యాయి. సర్వత్రా విషాద ఛాయలు అలుముకున్నాయి.

కాని కపటుల ప్రవృత్తి మారలేదు. ముస్లింల దగ్గర మాత్రం మొసలి కన్నీరు కార్చారు. ఒంటరిగా పరస్పరం కలుసుకున్నప్పుడు "పాపం! ఈ పిచ్చివాళ్ళు ఎలా వధించబడ్డారో చూడండి!! వారు ఇటు తమ ఇండ్లలోనూ ఉండిపోలేదు; అటు ప్రవక్త సందేశాన్నీ అంద జేయలేకపోయారు" అని చెప్పుకున్నారు.

# మరో ప్రమాదంలో బోధకులు-(99)

ఈ సంఘటన జరిగిన కొన్నాళ్ళకు సఫర్ నెలలో నజద్ నుంచి బనీఆమిర్ తెగ నాయకుడు అబూబరా వచ్చాడు. అతను నజద్ తెగలో బాగా పలుకుబడి గల వ్యక్తి. దైవప్రవక్త (సల్లం) అతడ్ని ఇస్లాం వైపు ఆహ్వానించారు. కాని అతను ఇస్లాం స్వీకరించలేదు. ఇస్లాం పట్ల ఏవగింపు కూడా వ్యక్తపరచలేదు. అతను వచ్చిన విషయం చెప్పాడు.

“ముహమ్మద్ గారూ! మా తెగలో ఇస్లాం ప్రచారం చెయ్యడానికి మీవాళ్ళను కొందర్ని పంపండి. వారి ప్రచారం వల్ల ఇస్లాం మరింత విస్తృతమయ్యే అవకాశం ఉంది. ఆ విధంగా మీ కోరిక నెరవేరుతుంది” అన్నాడతను.

“కాని నజద్ విషయంలో నాకు అనుమానంగా ఉంది” అన్నారు దైవప్రవక్త (స).

“అనుమానించకండి. వారు నా రక్షణలో ఉంటారు. మీరు నిస్సంకోచంగా పంపండి” అన్నాడు అబూబరా.

అబూబరా పట్ల అతని తెగవాళ్ళకు ఎంతో గౌరవం ఉంది. నిజంగా అతని రక్షణలో ఉన్న వారెవరికీ ప్రమాదం ఉండదు. ఆ నమ్మకంతోనే దైవప్రవక్త (స) తన అనుచరుల్లో నలభై మందిని ఎంపికచేసి నజద్‌కు పంపారు. వీరంతా ఖుర్ఆన్ కంఠస్థం చేసినవారే.

వీరు మదీనా నుండి బయలుదేరి బిర్‌మవూనా అనే ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ బనీఆమిర్ తెగతోపాటు బనీసులైమ్ అనే మరోతెగ కూడా ఉంది. ముస్లింలు ఒక ప్రతినిధి ద్వారా ఆమిర్ ఇబ్నెతుఫైల్ దగ్గరకు ప్రవక్త సందేశం పంపించారు.

కాని ఇబ్నెతుఫైల్ ప్రవక్త సందేశపత్రాన్ని అగౌరవపరిచాడు. అంతటితో ఆగక సందేశ పత్రం తెచ్చిన ప్రతినిధిని హతమార్చి ముస్లింలతో యుద్ధానికి దిగమని బనీఆమిర్ తెగ వాళ్ళను ఉసిగొల్పాడు. అయితే బనీఆమిర్ తెగవాళ్ళు వ్యతిరేకిస్తూ “మేము అబూబరాతో చేసుకున్న ఒడంబడికను అతిక్రమించలేమ”ని ఖండితంగా చెప్పారు.

ఆ తరువాత ఇబ్నెతుఫైల్ ముస్లింలపై బనీసులైంకు చెందిన ఉసయ్యా, రీల్, జక్వాన్ ఉపతెగలను ఉసిగొల్పాడు. ఆ దుర్మార్గులు పెద్ద గుంపుగా వచ్చి ముస్లింలపై విరుచుకుపడ్డారు. ఈ హఠాత్పరిణామానికి ముస్లింలు నిర్ఘాంతపోయారు. వెంటనే వారు సంబాళించుకొని కత్తులు ఝుళిపించారు. ధైర్యంతో శత్రువుల్ని ఎదుర్కొన్నారు. కాని అంత పెద్ద శత్రుమూకను ఈ కొద్దిమంది ముస్లింలు ఎలా ఎదిరించి బయటపడగలుగుతారు? చివరికి ఇద్దరు తప్ప అందరూ ఆ పోరాటంలో అమరగతులయ్యారు.

ఆ ఇద్దరిలో ఒకతను తీవ్రంగా గాయపడటంతో చనిపోయి ఉంటాడని భావించి శత్రువులు ఆయన్ని వదలిపెట్టి పోయారు. ఆ నిర్భాగ్య ముస్లిం ఆ తరువాత ఎక్కడెక్కడ తిరిగాడో, ఎన్నెన్ని కష్టాలు అనుభవించాడో! చివరికి ఎలాగో మదీనా చేరుకున్నాడు.

రెండవ ముస్లిం హజ్రత్ అమ్ర్ బిన్ ఉమయ్యా (రజి)ని ఇబ్నెతుఫైల్ బంధించి తీసికెళ్ళాడు. తరువాత అతను తన తల్లి ఒక బానిసను విముక్తం చేస్తానని మొక్కుబడి చేసుకొని ఉండటం వల్ల ఆమె కోరికపై ఆయన్ని విడిచిపెట్టాడు.



హజ్రత్ అమ్ర్ బిన్ ఉమయ్యా(రజి) కాలినడకన ఒంటరిగా మదీనా తిరుగు ప్రయాణమయ్యారు. మదీనా నుండి తనతోపాటు వచ్చిన మిత్రులంతా శత్రువుల దౌర్జన్య కాండకు బలైపోయిన సంఘటన తలచుకొని ఆయన భోరున విలపించారు. గుట్టలు మిట్టలు దాటుకుంటూ రేయింబవళ్ళు ప్రయాణం సాగించారు.

ఒకరోజు రాత్రివేళ ఇసుకతిన్నెల మధ్య ప్రయాణం చేస్తుంటే ఆయన ముందు కొద్ది దూరంలో ఇద్దరు వ్యక్తులు దైవప్రవక్త (స)కు, ఇస్లాంకు వ్యతిరేకంగా మాట్లాడుకుంటూ నడుస్తున్నారు. ఆ మాటలు జాగ్రత్తగా వింటున్న అమ్ర్ బిన్ ఉమయ్యా (రజి) వారు శత్రుపక్షానికి చెందినవారయి ఉంటారని భావించారు. కాస్సేపు ఆ మాటలు విన్న తరువాత ఇక సహించలేక ఆయన మెరుపువేగంతో లంఘించి క్షణాల్లో ఆ ఇద్దర్నీ మట్టుబెట్టారు.

ఆ తరువాత ఆయన మరికొన్నాళ్ళు ప్రయాణంచేసి మదీనా చేరుకున్నారు. నేరుగా మసీదుకెళ్ళి దైవప్రవక్త (స)ను కలుసుకొని జరిగిన వృత్తాంతం వివరంగా తెలియజేశారు. ఈ దుర్ఘటన విని దైవప్రవక్త (స) తల్లడిల్లి పోయారు.

“ఇదంతా అబూబరా పని. నేనందుకే ముందు మనవాళ్ళను పంపడానికి జంకాను” అన్నారు ఆయన అనుచరులతో. తరువాత ఆయన తీవ్రమైన మనస్తాపంతో “దేవా! ఈ దుర్మార్గులపై ప్రతీకారం తీర్చుకో” అని ప్రార్థించారు.

ఈ విధంగా ఆయన నెల రోజులదాకా ఆ దుర్మార్గుల్ని శపిస్తూ దైవాన్ని ప్రార్థించారు. సరిగ్గా ఒక నెల తరువాత ఆమిర్ బిన్ తుఫైల్ ప్లేగువ్యాధి సోకి చనిపోయాడు.

హజ్రత్ అమ్ర్ (రజి) తిరుగు ప్రయాణంలో జరిగిన సంఘటనను కూడా వివరిస్తూ, తాను బనీసాద్ తెగకు చెందిన ఇద్దరు మనుషుల్ని హతమార్చానని తెలియజేశారు.

ఈ సంగతి వినగానే దైవప్రవక్త (సల్లం) విచారం వెలిబుచ్చుతూ “అమ్ర్! నువ్వు పెద్ద పొరపాటు చేశావే!” అన్నారు.

“పొరపాటు చేశానా! ఏమిటా పొరపాటు?” అన్నారు అమ్ర్ (రజి) ఆశ్చర్యపోతూ.

“ఆ ఇద్దరు బనీసాద్ తెగ యూదులు. బనీసాద్ తెగవాళ్ళు కూడా మనతో స్నేహ ఒప్పందం చేసుకొనిఉన్నారు” అన్నారు దైవప్రవక్త (సల్లం).

“అయితే నావల్ల పెద్దతప్పే జరిగిపోయింది” అన్నారు హజ్రత్ అమ్ర్ (రజి).

“ఇది తెలియక చేసిన తప్పు. అయినప్పటికీ మనం ఆ తెగవాళ్ళకు రక్తపరిహారం చెల్లించవలసి ఉంటుంది. బనీసాద్ తెగ బనీనజీర్ తెగకు చెందిన ఉపతెగ. అంచేత మనం బనీనజీర్ తెగవాళ్ళతో సంప్రదించి రక్తపరిహారం చెల్లిద్దాం, పదండి” అన్నారు దైవప్రవక్త (సల్లం).

# బనీనజీర్ యూదుల బహిష్కరణ-(100)

దైవప్రవక్త (సల్లం) అమ్ర్ బిన్ ఉమయ్యా (రజి)తోపాటు, మరికొందరు అనుచరుల్ని వెంటబెట్టుకొని బనీనజీర్ తెగ వాడకు వెళ్ళారు.

బనీనజీర్ యూదులు కోట ముఖద్వారం తెరచి దైవప్రవక్త (సల్లం)కు స్వాగతం చెప్పారు. ఆయన్ని ఎంతో గౌరవమర్యాదలతో తమ ఇండ్లకు తీసికెళ్ళారు. మహాప్రవక్త (సల్లం) ఓ ఎత్తయిన గోడపక్క నీడలో కూర్చున్నారు. అనుచరులు ఆయన చుట్టూ కూర్చున్నారు.

“మీరు మాతో స్నేహఒప్పందం చేసుకొని ఉన్నారు గనక, ఒక విషయంలో మేము మీతో సంప్రదించి మీ సహాయం తీసుకోవాలని వచ్చాము” అన్నారు దైవప్రవక్త (స).

“ఆ... తప్పకుండా సంప్రదించండి. ఆ విషయం ఏమిటో సెలవియ్యండి” అన్నారు బనీనజీర్ యూదులు.

“ఒక ముస్లిం పొరపాటున బనీసాద్ తెగకు చెందిన ఇద్దరు మనుషుల్ని శత్రుపక్షం వారనుకొని చంపేశాడు. అందువల్ల మేమిప్పుడు హతుల వారసులకు రక్తపరిహారం చెల్లించవలసి ఉంది” అన్నారు దైవప్రవక్త (సల్లం).

“ఈ విషయంలో మీరు మా సహాయం కోరుతున్నారా, అయితే తప్పకుండా సహాయం చేస్తాం. బనీసాద్ తెగ మా ఉపతెగే కదా! మేము చెబితే వాళ్ళు సంతోషంగా ఒప్పుకుంటారు. మీరు నిశ్చింతగా ఉండండి” అన్నారు యూదులు.

తరువాత వారంతా పక్కకు పోయి కూడబలుక్కున్నారు. వారలా మాట్లాడుకుంటున్న సమయంలోనే వారిలో ఒకడు దైవప్రవక్త (సల్లం) ఆనుకొని కూర్చున్న గోడగల ఇంట్లోకి ప్రవేశించాడు. ఆ ఇంటి పైకెక్కి కప్పు మీద ఓ పెద్ద బండరాయిని ఈడ్వసాగాడు. అంతలో దైవప్రవక్త (స) అక్కడ్నుంచి లేచి వెళ్ళిపోయారు. ఏదో అవసర నిమిత్తం బయటికి వెళ్ళి పోయారనుకున్నారు అనుచరులు. యూదులు కూడా అలాగే భావించారు.

అయితే చాలా సేపయినా దైవప్రవక్త (సల్లం) తిరిగి రాలేదు. అనుచరులకు ఆశ్చర్యం వేసింది. ఆయనలా ఎందుకు వెళ్ళారో వారికి అర్థంకాలేదు. యూదులకు తెలిసిపోయిందేమో తత్తరపాటు చెందారు. వారి ముఖాలు మాడిపోయాయి.

ప్రవక్త అనుచరులు తమ ప్రియతమ నాయకుని కోసం ఎదురుచూసి, ఎంతసేపటికీ ఆయన తిరిగిరాకపోవడంతో విషయం ఏమయి ఉంటుందోనని వెతకడానికి బయలు దేరారు. వారు మదీనా దిశగా నడుస్తుంటే, దారిలో ఒకతను తటస్థపడ్డాడు.

“నువ్వు దైవప్రవక్త (సల్లం)ను ఏమయినా చూశావా?” అడిగారు వారు ఆత్రంగా.

“ఆ... చూశాను. మదీనా వైపే వెళ్ళారు. ఆయన నగరంలో ప్రవేశిస్తుంటే చూశాను” చెప్పాడా వ్యక్తి. ఈ మాట వినగానే ప్రవక్త అనుచరులు వేగంగా మదీనా వైపు నడిచారు.

“అసలు తమను వదలిపెట్టి చెప్పా పెట్టకుండా ఆయన ఎందుకు వెళ్ళినట్లు! పైగా వచ్చిన పని పూర్తికాకుండానే వెళ్ళిపోయారేమిటీ!! అసలేం జరిగిందో!!!” అని కంగారుపడుతూ మదీనా చేరుకున్నారు వారు.

దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చిరాగానే వారు తమ ఆందోళన వ్యక్తపరిచారు.

“దైవప్రవక్తా! మీరిలా ఎందుకు తిరిగొచ్చారు?” అడిగారు ఆతురతతో.



“యూదుల ఉద్దేశ్యాలు బాగా లేవు. నాకు వ్యతిరేకంగా కుట్రపన్నారు. వారి ధోరణి చూసి నాకు ముందే అనుమానం కలిగింది. అది నిజమే అన్నట్లు దైవసందేశం కూడా వచ్చింది. నేను వెంటనే అక్కడ్నుంచి లేచి వచ్చాను” అన్నారు దైవప్రవక్త (సల్లం)

ఈసారి అనుచరులు మరింత ఆశ్చర్యపోయారు.

దైవప్రవక్త (సల్లం) గోడ పక్కన యూదులతో మాట్లాడుతూ కూర్చున్నారు. యూదులు అదే మంచి అవకాశమని తలచి, వెనుక నుంచి ఇంటిపైకెక్కి దైవప్రవక్త (సల్లం) మీద పెద్ద బండరాయి పడవేసి హతమార్చడానికి పథకం వేసుకున్నారు. ఆ పనికోసమే వారిలో ఒకడు ఆ ఇంట్లోకి ప్రవేశించాడు. కాని వారి పథకం కాస్తా బెడిసికొట్టింది.

“ఎంత ఘోరానికి వడిగట్టారీ దుర్మార్గులు! వారి ధోరణి పట్ల మాకు కాస్తా కూడా అనుమానం రాలేదు. దైవప్రవక్తా! మీరు అక్కడ్నుంచి లేచివెళ్ళి చాలా మంచిపని చేశారు” అన్నారు అనుచరులు.

మరునాడు దైవప్రవక్త (సల్లం) బనీనజీర్ యూదులకు అల్టిమేటం ఇచ్చారు...

“మీరు ఒప్పందం ఉల్లంఘించారు. నన్నే అంతమొందించడానికి కుట్ర పన్నారు. ఇకచాలు ఈ మైత్రి. వెంటనే ఈప్రాంతం ఖాళీచేసి వెళ్ళిపొండి. పది రోజులు గడువిస్తున్నాం. ఆ తరువాత కూడా మీరీ ప్రాంతంలో ఉన్నారా.... మీకు వినాశం తప్పదు.”

ఈ అల్టిమేటం విని యూదులు నిలువునా కంపించి పోయారు. ఇక ఈ ప్రాంతంలో ఉండటం తమ ధనప్రాణాలకు క్షేమకరం కాదని గ్రహించారు. అందువల్ల వారిలో అత్యధికులు వెళ్ళిపోవడానికి సిద్ధమయ్యారు.

బనీనజీర్ యూదులు వేరే ప్రాంతానికి వెళ్ళిపోవడానికి తీసుకున్న నిర్ణయం కపట విశ్వాసి ఇబ్నెఉబైకు తెలిసింది. అతను వారికి ధైర్యంచెబుతూ ఇలా వార్త పంపాడు:

“మీరు వెళ్ళిపోకండి. ఇక్కడ మీ తోటలు, పొలాలు ఉన్నాయి. అందమైన మేడలు, కోటలు ఉన్నాయి. వీటన్నిటిని వదలిపెట్టి ఎక్కడికి వెళ్తారు? వద్దు, వెళ్ళనవసరం లేదు. నా దగ్గర రెండువేల మంది సైనికులున్నారు. వారు మీ కోసం ప్రాణాలు తెగించి పోరాడుతారు. మీరు మీ కోటలలో ప్రవేశించి తలుపులు బిగించుకోండి. ఆ తరువాత విషయాలు మేము చూసుకుంటాం. మీకు ఎలాంటి ప్రమాదం లేదు.”

బనీనజీర్ తెగనాయకుడు హుయ్యి బిన్ అఖ్తబ్ ఈ హామీ మాటలు విని సంతోషంతో ఎగిరి గంతేశాడు. తన తెగకు కొండంత అండ దొరికిందని భావించి విర్రవీగాడు. ఆ గర్వంతో దైవప్రవక్త (సల్లం) ఇచ్చిన అల్టిమేటాన్ని ఖాతరు చెయ్యలేదు.

“మేమీ ప్రాంతం ఖాళీచేసి వెళ్ళిపోయే ప్రసక్తే లేదు. మీ ఇష్టమొచ్చినట్లు చేసుకోండి” అని తెగేసి చెప్పాడు ఆ విశ్వాసఘాతకుడు.

దైవప్రవక్త (స) ఇచ్చిన గడువు ముగిసింది. కాని బనీనజీర్ తెగవాళ్ళు ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయలేదు. వారు తమ కోటలలో దాక్కొని తలుపులు మూసేసుకున్నారు. దృఢంగా ఉన్న తమ కోటల్ని, కపటవిశ్వాసుల అండదండల్ని చూసుకొని విర్రవీగారు.

“కపటవైఖరి అవలంబించిన వారిని నీవు గమనించలేదా? వారు గ్రంథప్రజలకు చెందిన తమ సత్యతిరస్కార సోదరులతో (మంతనాలు జరుపుతూ) “మిమ్మల్ని వెళ్ళగొడ్తే మీతోపాటు మేము కూడా బయలుదేరుతాం. మీ విషయంలో మేము ఎవరిమాటా వినము. ఒకవేళ యుద్ధం జరిగితే మేము తప్పకుండా మీకు సహాయం చేస్తాం” అని అంటారు. కాని వీరసలు పచ్చి అబద్ధాలకోరులు. అందుకు దేవుడే సాక్షి.

ఒకవేళ గ్రంథప్రజలు బహిష్కరించబడితే వీరు మాత్రం వారివెంట బయలుదేరరు. అలాగే వారితో యుద్ధం జరిగితే వారికి ఈ కపటులు ఏమాత్రం సహాయం చేయరు. ఒకవేళ సహాయం చేయడానికి యుద్ధరంగంలో దిగినా, (మరుక్షణమే) వీరు వెన్నుజూపి పారిపోతారు. ఇక వారికి ఎటునుంచి కూడా ఎలాంటి సహాయం లభించదు.

అసలు వారి హృదయాల్లో దైవభయం కన్నా మీ భయమే ఎక్కువగా తిష్ఠవేసి ఉంది. దానిక్కారణం వారిలో విజ్ఞతా వివేచనలు నశించి పోవడమే. వారు సంఘటితమై మిమ్మల్ని ఎన్నడూ (బహిరంగంగా) ఎదుర్కోలేరు. ఒకవేళ ఎప్పుడైనా ఎదుర్కోడానికి సిద్ధపడినా వారు కోటద్వారాలు మూయబడిన జనపదాలలో కూర్చొని, లేదా గోడల వెనుక దాక్కొని పోరాడుతారు. వారు తమలో తాము పరస్పరం తీవ్రంగా కలహించుకుంటారు. వారు సంఘటితంగా ఉన్నట్లు మీకు కన్పించవచ్చు. కాని వారి హృదయాలు మాత్రం పరస్పరం ద్వేషంతో నిండి ఉన్నాయి. ఈ పరిస్థితికి కారణం వారిలో బుద్ధివివేచనలు లోపించడమే.” (దివ్యఖుర్ఆన్. 59:11-14)

అది హిజ్రీ 4వ సంవత్సరం రబీవుల్అవ్వల్ మాసం. దైవప్రవక్త (సల్లం) యుద్ధ ప్రకటన చేశారు. ముస్లింలు వెంటనే బయలుదేరి వారి కోటలను ముట్టడించారు. యూదులు కోటగోడలు ఎక్కి ముస్లింలపై బాణాలు వదలసాగారు. మరికొందరు రాళ్ళవర్షం కురిపించడం ప్రారంభించారు. ముస్లింలు వారి దాడిని కోట వెలుపల నుండి ఎదుర్కొంటున్నారు. ఇలా అనేక రోజులు గడిచిపోయాయి.

తరువాత దైవప్రవక్త (స) కోట వెలుపల దారిలో యుద్ధానికి అవరోధంగా ఉన్న ఖర్జూరపు చెట్లను నరికేయమని అనుచరుల్ని ఆదేశించారు. ఈ చెట్ల వల్ల కోటలను ముట్టడించడం ముస్లింలకు చాలా కష్టమయిపోయింది.

“(ఈ దాడి సంద్భంగా) మీరు కొన్ని ఖర్జూరపు చెట్లు నరికి, మరికొన్నిటిని నరక్కుండా వదిలేశారంటే అది దేవునిఆజ్ఞ వల్లనే జరిగింది. దుర్మార్గుల్ని అవమానం పాల్జేయడానికే (ఆయన ఈ ఆజ్ఞ జారీచేశాడు).” (ఖుర్ఆన్. 59:5)

దైవప్రవక్త (సల్లం) ఆదేశం ప్రకారం అనుచరులు చెట్లను నరకడం ప్రారంభించారు. దాంతో ప్రమాదం ముంచుకొస్తోందని తలచి యూదులు బెంబేలెత్తిపోయారు.

“సోదరా ముహమ్మద్! ఏమిటిదీ? మీరు విధ్వంసాన్ని అరికట్టేవారు; విధ్వంస శక్తుల్ని అసహ్యించుకునేవారు కదా! మరి ఈ చెట్లను ఎందుకు నరికిస్తున్నారు? మా ఖర్జూరపు చెట్లను ఎందుకిలా తగలబెట్టిస్తున్నారు?” అంటూ వారు గగ్గోలుపెట్టారు.



ఇప్పుడు ఏడిస్తే ఏం లాభం? సమయం మించిపోయింది? పరిస్థితి ప్రమాద సూచిక దాటింది. వారు ఇబ్నెఉబై మీద ఆశలు పెట్టుకున్నారు. అతను రెండువేల సైన్యంతో వచ్చి తమను అదుకుంటాడని భావించి అతని రాక కోసం కళ్ళలో వత్తులు వేసుకొని మరీ ఎదురుచూడసాగారు.

కాని అతను రాలేదు. అతని రెండువేల సైన్యమూ జాడ లేదు. ఇబ్నెఉబై పట్ల వారి నమ్మకం సన్నగిల్లిపోయింది. అతని రాక కోసం ఎదురుచూసి చూసి హతాశులయ్యారు. నలువైపులా నిరాశా కారుమేఘాలు దట్టంగా కమ్ముకున్నాయి. అయితే దైవప్రవక్త (స) కారుణ్యకడలిపై వారికి పూర్తి నమ్మకం ఉంది. ఆ నమ్మకంతోనే వారు కాళ్ళబేరానికి వచ్చారు.

“సోదరా ముహమ్మద్! మమ్మల్ని కాపాడండి. మేము ఇక్కడ్నుంచి వెళ్ళిపోవడానికి సిద్ధంగా ఉన్నాం” అన్నారు వారు దైవప్రవక్త (సల్లం)ను విన్నవించుకుంటూ.

“సరే, ఖాళీచేసి వెళ్ళిపోండి. ఆయుధాలు మాత్రం ఇక్కడే వదిలేసి వెళ్ళాలి. అలాగే ఇతర సామగ్రి కూడా ఇక్కడే వదలిపెట్టి వెళ్ళాలి. ఒక ఒంటెపై ముగ్గురు మనుషులతో పాటు, ఎంత ఆహారధాన్యం తీసికెళ్ళగలిగితే అంత మేరకు తీసికెళ్ళవచ్చు” అంటూ దైవప్రవక్త (సల్లం) సమాధానమిచ్చారు వారికి.

యూదులు ఈ షరతును ఒప్పుకున్నారు. ఒప్పుకోక ఏం చేస్తారు? ప్రమాదం పీకల మీదికొచ్చి కూర్చుంది! స్నేహ ఒప్పందం ఉల్లంఘించి నమ్మక ద్రోహానికి పాల్పడ్డారు!! ఈ విధంగా తాము తవ్వుకున్న గోతిలో తామే పడ్డారు. కపట విశ్వాసుల్ని నమ్ముకొని ఉన్నదంతా ఊడగొట్టుకున్నారు.

బనీనజీర్ యూదులు బహిష్కృతులయి మదీనా నుండి బయలుదేరారు. వారిలో స్త్రీలు, పిల్లలు కూడా ఉన్నారు. జరిగిన అవమానభారం తగ్గించుకోవడానికన్నట్లు వారి స్త్రీలు మదీనా వీధుల్లో పాటలు పాడుతూ, తప్పెట్లు మోగిస్తూ నడిచారు.

ఈ విధంగా వీరు మదీనా నుండి బయలుదేరి ఖైబర్ ప్రాంతానికి వెళ్ళిపోయారు. అక్కడే స్థిరపడి పోయారు. మరికొందరు సిరియా దిశగా వెళ్ళి దాని పరిసర ప్రాంతాల్లో నివాసాలు ఏర్పరచుకున్నారు.

బనీనజీర్ యూదులు తమ ఆస్తిపాస్తులన్నిటినీ మదీనాలో వదిలేసి వెళ్ళిపోయారు. వాటిలో అనేక ఆయుధాలు కూడా ఉన్నాయి. సారవంతమైన పొలాలు, సస్యశ్యామలమైన తోటలు కూడా ఉన్నాయి. అవన్నీ సమరసొత్తు రూపంలో ముస్లింలకు లభించాయి.

“ఆయనే గ్రంథప్రజలలో (నమ్మకద్రోహానికి పాల్పడి) అవిశ్వాసులయిపోయిన వారిని మొదటి దాడిలోనే వారి ఇండ్ల నుండి బయటికి గెంటివేశాడు. వారు వెళ్ళిపోతారని మీరు కలలో కూడా ఊహించలేదు. వారూ తమను తమ కోటలు దేవుని నుండి కాపాడుతాయని భావించారు. అయితే వారి ఊహ కూడా పోని దిశ నుండి దేవుడు వారిని చుట్టుముట్టాడు. ఆయన వారి హృదయాలలో భయోత్పాతం సృష్టించాడు. తత్ఫలితంగా వారు తమ ఇండ్లను చేజేతులా నాశనం చేసుకున్నారు. మరోవైపు విశ్వాసుల చేతులతో కూడా నాశనం కొని

తెచ్చుకున్నారు. కనుక కళ్ళున్న ప్రజలారా! (కళ్ళు తెరచి) గుణపాఠం నేర్చుకోండి. (దివ్య ఖుర్ఆన్. 59:2)

దైవప్రవక్త (స) అన్సార్‌ముస్లింలను సమావేశపరిచారు. వారు ముహాజిర్ ముస్లింలకు చేసిన మహోపకారాన్ని ప్రశంసించారు. అన్సార్ ముస్లింలు ముహాజిర్ ముస్లింలను సొంత సోదరులకన్నా ఎక్కువ అభిమానంతో చూసుకొని వారికి తమ ఇండ్లలో ఆశ్రయం కల్పించారు. వాడుకోవడానికి కావలసిన సామగ్రి కూడా ఇచ్చారు. అన్నివిధాలా వారికి సౌకర్యాలు కల్పించారు. అన్సార్ ముస్లింలు చేసిన ఈ త్యాగనిరతిని మెచ్చుకుంటూ దైవప్రవక్త (స) వారికి నిండుహృదయంతో కృతజ్ఞతలు చెప్పారు. ఆ తరువాత ఇలా అన్నారు:

“మీరు కోరితే బనీనజీర్ యూదులు వదలిపెట్టిన ఆస్తులు అందరికీ పంచుదాం. లేదా వాటిని ముహాజిర్లకు ఇచ్చివేద్దాం. ముహాజిర్లు మీ ఇండ్లను ఖాళీచేసి వెళ్ళిపోతారు.”

ఖజ్రజ్ తెగ తరఫున సాద్ బిన్ ఉబాదా (రజి) లేచి నిలబడ్డారు. ఔస్ తెగ తరఫున సాద్ బిన్ ముఆజ్ (రజి) లేచారు.

“దైవప్రవక్తా! మరో విషయం కూడా ఉంది. అదే అన్నిటికంటే మంచిదని నా అభిప్రాయం. మీరీ ఆస్తులన్నిటినీ ముహాజిర్‌లకే ఇచ్చివేయండి. వారు మా ఇండ్లు ఖాళీచేసి వెళ్ళి పోనవసరమూ లేదు” అన్నారు వారిద్దరూ.

“బాగుంది. చాలాబాగుంది. దైవప్రవక్తా! ఇలా చేయడం మాకందరికీ ఇష్టమే” అన్నారు అన్సార్ ముస్లింలంతా ముక్తకంఠంతో.

ఈ మాటలు విని దైవప్రవక్త (సల్లం) ముఖారవిందం వికసించింది.

“ప్రభూ! అన్సార్ ముస్లింలను ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో ఉంచు. వారిని నీ అనుగ్రహ ఛాయలోకి తీసుకో. ప్రభూ! వారి కొడుకులు, మనవళ్ళకు కూడా సుఖ సంతోషాలు ప్రసాదించు” అన్నారు ఆయన ఆనందపారవశ్యంతో.

“దేవుడు వారి అధీనం నుండి తీసి తన ప్రవక్తకు హస్తగతం చేసిన సిరిసంపదలు, నిజానికి (యుద్ధరంగంలో) మీరు గుర్రాలు, ఒంటెల్ని పరుగెత్తించి సాధించిన సిరిసంపదలు కావు. దేవుడు తన ప్రవక్తలకు తాను కోరిన వారిపై ఆధిక్యతనిస్తాడు. ఆయన ప్రతి పనీ చేయగల సమర్థుడు, సర్వ శక్తిమంతుడు.

దేవుడు ఈ వాడవాసుల నుండి తన ప్రవక్తకు అధీనం చేసిన ధన (కనక) వస్తు సంపదల్లో దేవునికి, దైవప్రవక్తకు, బంధువులకు, అనాథలకు, పేదలకు, బాటసారులకు హక్కుంది. ధనం (ఎల్లప్పుడూ) మీలోని ధనిక వర్గంలోనే కేంద్రీకృతమయి ఉండరాదన్న లక్ష్యంతో ఈ విధానం నిర్ణయించబడింది. దైవప్రవక్త మీకు దేన్నిస్తాడో దాన్ని తీసుకొని, దేన్నుండి మిమ్మల్ని నిరోధిస్తాడో దాని జోలికి పోకండి. దేవునికి భయపడండి. దేవుని శిక్ష చాలా కఠినంగా ఉంటుంది.

(మక్కాలోని) తమ ఇండ్ల నుండి, తమ ఆస్తిపాస్తుల నుండి వెడలగొట్టబడిన పేద కాందిశీకులకు కూడా (ఆ సంపదలో) హక్కుంది. వారు దేవుని అనుగ్రహాన్ని, ఆయన



ప్రసన్నతను ఆశిస్తూ దేవునికి, ఆయన ప్రవక్తకు అన్ని విధాలా మద్దతు నివ్వడానికి నడుం బిగించారు. వారే సత్యసంధులు, సన్మార్గగాములు.

ఈ కాందిశీకులు రాకపూర్వమే విశ్వసించి (మదీనా) పట్టణంలో నివసిస్తూ ఉన్నవారికి కూడా (ఆ సంపదలో) హక్కుంది. (మక్కా నుండి) తమ దగ్గరకు (మదీనా) వలస వచ్చిన వారిని వీరు అభిమానిస్తున్నారు. వీరికి ఏదిచ్చినా అది తమకు అవసరమని వీరు తమ హృదయాల్లో సైతం ఆకాంక్షించరు. వారు స్వయంగా నిరుపేదలైనప్పటికీ ఇతరుల అవసరాలకే ప్రాధాన్యం ఇస్తారు. పేరాశ, పిసినారితనాల నుండి రక్షించబడినవారే ధన్యులు.

పోతే వీరందరి తర్వాత (ఇస్లాంలోకి) వచ్చినవారికి కూడా (ఆ సంపదలో హక్కుంది). వారిలా ప్రార్థిస్తారు: “ప్రభూ! మమ్మల్ని, మాకు పూర్వం విశ్వసించిన మా సోదరులందర్నీ క్షమించు. (యావత్తు)విశ్వాసుల పట్ల మా హృదయాల్లో ఎలాంటి అసూయాద్వేషాలు ఉంచకు. ప్రభూ! నీవు గొప్ప క్షమాశీలివి, అపార దయామయుడవు”. (ఖుర్ఆన్-59:6-10)

ఆ తరువాత మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) బనీనజీర్ యూదుల పంట భూములు, ఇతర స్థిరచరాస్తులన్నిటినీ ముహాజిర్ ముస్లింలకు పంచిచ్చారు. ఇద్దరు నిరుపేద అన్సార్ ముస్లింలు ఉంటే వారికి కూడా కొంత పంచిపెట్టారు. ఇద్దరు యూదులు ఇస్లాం స్వీకరించినందున వారి ఆస్తుల జోలికిపోకుండా వాటిని వారికే వదలిపెట్టారు. ఈ విధంగా ముహాజిర్ ముస్లింలు అన్సార్ ముస్లింలపై ఆధారపడవలసిన అవసరం లేకుండా సొంత ఇంటివాళ్ళయ్యారు.

## రెండవ బదర్ యుద్ధం?-(101)

కొన్నాళ్ళకు గత్ఫాన్ తెగకు చెందిన ముహారిబ్, బనూసాలబా ఉపతెగలు మదీనాపై దాడిచేయడానికి యుద్ధసన్నాహాలు చేస్తున్నాయని తెలిసింది. అంచేత దైవప్రవక్త (స) మదీనాలో హజ్రత్ ఉస్మాన్ బిన్ అప్ఫాన్ (రజి)ని పాలకునిగా నియమించి నాలుగొందల మంది అనుచరుల్ని తీసుకొని నజద్ ప్రాంతానికి బయలుదేరారు.

యోధులకు వాహనాలు చాలా తక్కువగా ఉండటం వల్ల అనేకమంది కాలి నడకన ప్రయాణం చేయవలసి వచ్చింది. పైగా అది గుట్టలతో, గులకరాళ్ళతో నిండిన కఠిన మార్గం. దాంతో ముజాహిద్‌ల కాళ్లకు పుండ్లుపడ్డాయి. చివరికి కొంతమంది కాళ్ళగోరులు కూడా ఊడిపోయాయి. అనేకమంది పాదాలకు గుడ్డపేలికలు కట్టుకొని ప్రయాణం సాగించారు. అంచేత ఈ దండయాత్రకు “గుడ్డపేలికల దండయాత్ర” (గజ్వె జాతిర్రిఖా) అని పేరుపడింది.

శత్రువులు నజద్ ప్రాంతంలోని ఒయాసిస్సులో చేరి యుద్ధసన్నాహాల్లో మునిగి పోయారు. ముస్లింలు అక్కడికి చేరుకున్నారు. కాని శత్రువులు వాళ్ళను చూడగానే భయపడి పారిపోయారు. యుద్ధం జరగలేదు. దైవప్రవక్త (సల్లం) తమ అనుచరుల్ని తీసుకొని అక్కడ్నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ సంఘటన హిజ్రీశకం 4వ ఏట జమాదిల్ అవ్వల్ నెలలో జరిగింది.

దారిలో ఒకచోట యోధులు విశ్రాంతి కోసం ఆగారు. ఆ ప్రాంతంలో తుమ్మ చెట్లు మాత్రమే అక్కడక్కడ కొన్ని ఉన్నాయి. అది మధ్యాహ్నం వేళ. ఎండ తీవ్రంగా ఉంది. అంచేత యోధులు ప్రయాణ బడలిక వల్ల చెట్ల క్రింద నడుం వాల్చగానే అందరికీ నిద్ర పట్టింది. దైవప్రవక్త (సల్లం) కూడా ఓ చెట్టు కొమ్మకు ఖడ్గం వ్రేలాడదీసి దాని నీడన నడుం వాల్చారు. కాస్సేపటికి ఆయనకు కూడా నిద్ర పట్టింది.

అంతలో ఎక్కడ్నుంచో ఓ ఆగంతకుడు వచ్చి చెట్టుకు వ్రేలాడదీసిన ఖడ్గం తీసుకొని దైవప్రవక్త (స) దగ్గరికి వచ్చాడు. ఈ అలికిడికి దైవప్రవక్త (స) మేల్కొన్నారు.

ఆగంతకుడు కత్తిదూసి "ఇప్పుడు నిన్నెవరు రక్షిస్తారు?" అని అడిగాడు.

"దేవుడే నన్ను రక్షిస్తాడు" అన్నారు దైవప్రవక్త (స).

దైవప్రవక్త (సల్లం) నోట ఈమాట వినగానే ఆగంతకుడు కంపించిపోయాడు. అతని చేతిలోని ఖడ్గం జారి క్రింద పడిపోయింది.

తక్షణమే దైవప్రవక్త (సల్లం) ఆ ఖడ్గం తీసుకొని "ఇప్పుడు నిన్నెవరు రక్షిస్తారు?" అని అడిగారు అతని కళ్ళలోకి సూటిగా చూస్తూ.

"త....త....తమరే నన్ను రక్షించాలి" అన్నాడు ఆగంతకుడు వణికిపోతూ.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) చిరునవ్వు నవ్వుతూ కత్తి దించి వరలో పెట్టుకున్నారు. తరువాత అనుచరుల్ని కేకవేసి పిలిచి జరిగిన వృత్తాంతం వివరించారు. వారు విషయం విని ఆశ్చర్యపోయారు. దైవప్రవక్త (స) ఆగంతకుడ్ని క్షమించి వదలిపెట్టారు. ఆ తరువాత ఆయన అనుచరుల్ని తీసుకొని మదీనా తిరిగొచ్చారు.

ఖురైష్ సేనాపతి అబూసుఫ్యాన్ ఉహద్ యుద్ధం నుండి వెళ్ళిపోతూ "వచ్చే ఏడు మళ్ళీ బదర్‌లో మన ఉభయవర్గాల మధ్య పోటీ ఉంటుంద"ని ముస్లింలను హెచ్చరించి వెళ్ళిపోయాడు. ఇప్పుడా సమయం వచ్చింది.

కాని ముస్లింయోధుల ధైర్యసాహసాలు, ప్రతిభాపరాక్రమాలను తలచుకుంటే అబూసుఫ్యాన్ గుండెలో దడబుట్ట సాగింది. తొందరపడి ముస్లింలకు హెచ్చరిక చేశానే అని పశ్చాత్తాప పడుతున్నాడు.

ఇప్పుడేం చెయ్యాలి? చేతులు ముడుచుకొని కూర్చుందామా? అలాగైతే ఇది కూడా తమకు అవమానకరమే. నలుగురిలో అభాసుపాలు కావలసి వస్తుంది. అందరూ తమను చేతకాని వాజమ్మల క్రింద జమకడ్తారు. అయితే మరేం చెయ్యాలి? ఇలా పరిపరి విధాల ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చారు ఖురైష్ నాయకులు.

దాని ప్రకారం వారు కొందరు గూఢచారుల్ని ఎన్నుకొని మదీనా పంపనారంభించారు. ఈ గూఢచారులు మదీనా వెళ్ళి ముస్లింల దగ్గర మక్కా ఖురైషీయుల సైనిక శక్తిని గురించి, వారి యుద్ధ సామగ్రిని గురించి గోరంతలను కొండంతలు చేసి చెప్పసాగారు. ఇలా చెప్పి ముస్లింల మనోస్థయిర్యాన్ని దెబ్బతీయాలని, యుద్ధం పట్ల వారి ఉత్సాహాన్ని నీరుగార్చాలని ఖురైష్ నాయకులు ఆశించారు.



కొందరు ముస్లింలు వారి దుష్ప్రచారానికి ప్రభావితులయి భయపడసాగారు. హజ్రత్ ఉమర్ (రజి) దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వెళ్ళి పరిస్థితి వివరించారు. ఖురైషీయులు విషవలయం పన్నారని దైవప్రవక్త (సల్లం) ఎప్పుడో గ్రహించారు.

అందువల్ల ఆయన హజ్రత్ ఉమర్ (రజి) మాటలు విని "ఏ ఒక్కడూ రాకపోయినా వాగ్దానం ప్రకారం నేను మాత్రం అవిశ్వాసుల్ని ఎదుర్కోవడానికి తప్పకుండా బదర్‌కు వెళ్తాను" అన్నారు.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) యుద్ధసన్నాహాలు ప్రారంభించారు. ఆయన్ని చూసి అనుచరులు కూడా సిద్ధమయ్యారు.

నిర్ణీత దినం వచ్చేసింది. దైవప్రవక్త (సల్లం) మదీనా పాలకుడిగా హజ్రత్ అబ్దుల్లా బిన్ రవాహ (రజి)ని నియమించి, 1500 మంది అనుయాయుల్ని తీసుకొని బదర్ ప్రాంతానికి బయలుదేరారు. అక్కడ ప్రతి ఏటా పెద్దఎత్తున సంత జరుగుతుంది. అందువల్ల ముస్లిం యోధులు తమ వెంట వ్యాపారసరుకు కూడా తెచ్చుకున్నారు. తీరా అక్కడికి చేరుకుంటే ఖురైష్ సైనికుల జాడేలేదు. ముస్లిం యోధులు మాత్రం అక్కడే విడిదిచేసి వారి కోసం ఎదురుచూడసాగారు.

ఖురైషీయులు తమ మాట నిలబెట్టుకోవడానికైనా యుద్ధరంగానికి బయలుదేరక తప్పలేదు. కాని మరోవైపు యుద్ధంలో దారుణంగా ఓడిపోతామనే భయం కూడా వారిని పట్టి పీడిస్తోంది. ముస్లింలతో పోరాడటానికి ధైర్యం చాలటం లేదు.

అయినప్పటికీ మొండి ధైర్యంతో బయలుదేరారు. రెండురోజులు ప్రయాణం సాగించారు. బదర్ ప్రాంతం దగ్గరయ్యే కొద్దీ మనసులో భయాందోళనలు అంతకంతకు పెరిగిపోతున్నాయి. కాళ్ళు వణుకుతున్నాయి. ముందుకు అడుగు వేయలేక పోతున్నారు.

గూఢచారి సమాచారం వల్ల ముస్లింసైనికుల సంఖ్య 1500 అని తెలిసింది. బదర్, ఉహుద్ యుద్ధాలలో తాము మూడు నాలుగు రెట్లు ఎక్కువ ఉన్నా ముస్లింల చేతిలో ఓడిపోవాల్సి వచ్చింది. ఇప్పుడు తమ సైనికసంఖ్య 2000 మాత్రమే. ఇలా ఆలోచించి వారు మరింత భయపడిపోయారు.

సేనాపతి అబూసుఫ్యాన్ అయితే తాను సరాసరి మృత్యు ముఖంలోకి పోబోతున్నానని తలచుకొని బెంబేలెత్తిపోతున్నాడు. ముస్లింలతో యుద్ధం గురించి ఆలోచిస్తేనే అతనికి ఆపాదమస్తకం వణుకు పుట్టుకొస్తోంది. వద్దు, పరిస్థితి అంతవరకు రానియ్య కూడదు. ఎలాగైనా ఈ ఆపద నుంచి బయటపడదామని నిర్ణయించుకొని అనుచరులకు ఇలా నచ్చజెప్పడానికి ప్రయత్నించాడు:

"సోదరులారా! ఈ ఏడు కరువు సంవత్సరం. సాధారణంగా యుద్ధాల్లాంటివి సంతోష సమయాల్లో జరుగుతాయి. అంచేత మనం ఈ ఏడు వెనక్కి తిరిగి మక్కా వెళ్ళిపోవడమే క్షేమంగా ఉంటుందని నాఅభిప్రాయం. మీరూ ఆలోచించండి. అందరి శ్రేయస్సు కోరి బాగా ఆలోచించిన మీదటనే నేనీ అభిప్రాయానికి వచ్చాను."

సర్వసేనాని అంతటివాడే ఇలా అంటే ఇక సాధారణ సైనికులు ఏం చేయగలుగుతారు? వారందరూ "అలాగే కానివ్వండి" అంటూ సేనాపతి అభిప్రాయంతో ఏకీభవించారు. వారిలో చాలామంది లోలోన సంతోషించారు కూడా. ఈవిధంగా చివరికి ఖురైష్ సైనికులంతా వెనక్కి తిరిగి మక్కా దారిపట్టారు.

ముస్లిం యోధులు బదర్ ప్రాంతంలో ఖురైష్‌సైన్యం కోసం ఎనిమిది రోజులు ఎదురుచూశారు. ఈలోగా వారు సంతలో తమతమ సరుకులు అమ్ముకున్నారు. దేవుని అనుగ్రహం వల్ల విపరీతమైన లాభాలు కూడా వచ్చాయి.

ఈసారి సమరసొత్తుకు బదులు ఇంత దూరం వచ్చినందుకు కనీసం వ్యాపారంలోనయినా మంచి లాభాలు వచ్చినందుకు ముస్లింలు ఎంతో సంతోషించారు. ఖురైష్ సైన్యం ఇక రాదని తలచి దైవం చేసిన మహోపకారాలను కొనియాడుతూ దైవప్రవక్త (సల్లం) అనుచరులను తీసుకొని మదీనా బయలుదేరారు. ఈ సంఘటన హి.శ. 4వ ఏట రజబ్ నెలలో జరిగింది.

## వైరాగ్యం, మద్యం, జూదం-(102)

ఇప్పుడు మదీనాలో కాస్తంత ప్రశాంతవాతావరణం నెలకొన్నది. గతంలో సంభవించిన దుర్ఘటనల మూలంగా కలిగిన బాధలు మరచి సంతృప్త హృదయాలతో గౌరవప్రదంగా జీవితం గడపసాగారు ముస్లింలు.

సాధారణంగా ధార్మికులలో కొందరు ఆత్మవికాసం కోసం ధర్మసమ్మతమైన దాంపత్య సుఖం, కొన్ని ఆహారపదార్థాలు, ఇతర ప్రాపంచికి సౌఖ్యాలు పరిత్యజించి శరీరాలను కృశింప జేసుకుంటారు. దేవుడు ఇలాంటి వైరాగ్య భావనలను ఖండించాడు.

"విశ్వాసులారా! దేవుడు మీ కోసం ధర్మసమ్మతం చేసిన వస్తువుల్ని నిషేధించుకోకండి. హద్దుమీరి వ్యవహరించకండి. హద్దుమీరేవారిని దేవుడు ఎన్నటికీ ప్రేమించడు. దేవుడు మీకు ధర్మసమ్మతంచేసి ప్రసాదించిన పరిశుద్ధ వస్తువులు నిరభ్యంతరంగా తినండి, త్రాగండి (అనుభవించండి). దాంతోపాటు మీరు విశ్వసిస్తున్న దేవుని పట్ల భయభక్తులు కూడా కలిగి ఉండండి." (దివ్యఖుర్ఆన్-5:87,88)

కొందరు ప్రవక్తఅనుచరులు కూడా తాము ఎల్లప్పుడూ ఉపవాసాలు పాటిస్తామని; రాత్రుళ్ళలో నిద్రపోకుండా ఆరాధనలోనే గడుపుతామని; మాంసం, నెయ్యి, నూనెలు వాడమని; స్త్రీలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. దైవప్రవక్త (స)కు ఈ సంగతి తెలియగానే ఆయన ఒక ప్రసంగంలో ఇలా అన్నారు:

"ఇలాంటి పనులు చేయమని నాకు ఆజ్ఞలేదు. మీపై మీఆత్మల హక్కు కూడా ఉంది. కనుక ఉపవాసాలు కూడా ఉండండి, తినడం త్రాగడం కూడా చేయండి. రాత్రుళ్ళలో ఆరాధన కూడా చేయండి, నిద్ర కూడా పోతూ ఉండండి. నన్ను చూడండి, నేను నిద్రపోతాను, జాగరణ చేస్తాను. ఉపవాసాలు పాటిస్తాను, వాటిని విరమిస్తాను కూడా. మాంసం, నెయ్యి కూడా తింటాను. నా విధానం, నా సంప్రదాయాలను ఇష్టపడని (పాటించని) వాడు నావాడు కాదు."



ఆ తరువాత ఆయన మసీదులో ప్రసంగవేదికపై నిలబడి ఇలా అన్నారు:

"వీరికేమయింది స్త్రీలను, మంచి ఆహార పదార్థాలను, సువాసనలను, నిద్రను, (ఇతర) ప్రాపంచిక సౌఖ్యాలను నిషేధించుకున్నారు? నేను మీకు విరాగులుగా, సన్యాసులుగా మారమని బోధించలేదు. నా ధర్మంలో స్త్రీల సాంగత్యాన్ని, మాంసాహారాన్ని త్యజించాలని లేదు. అలాగే బైరాగులయి ఏకాంత కుహురాల్లో తిష్ఠ వేయాలని కూడా లేదు. ఆత్మనిగ్రహం కొరకు నా ధర్మంలో ఉపవాసవ్రతం ఉంది. వైరాగ్య ప్రయోజనాలన్నీ ఇక్కడ జిహాద్ ద్వారా సమకూరుతాయి. (కనుక) అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయనకు మరెవరినీ సాటి కల్పించకండి. హజ్, ఉమ్రా (విధు)లు నిర్వహించండి. నమాజ్ స్థాపించండి. జకాత్ చెల్లించండి. రమజాన్ ఉపవాసాలు పాటించండి. మీకు పూర్వం ప్రజలు తమపై లేనిపోని భారం,కాఠిన్యాలు మోపుకోవడం వల్లనే సర్వనాశనం అయ్యారు. వారు తమ మీద లేనిపోని బరువులు, కాఠిన్యాలు మోపుకున్నప్పుడు దేవుడు కూడా వారిపై బరువులు, కాఠిన్యాలు మోపాడు. మీకు మఠాలలో, ఆశ్రమాల్లో, ఏకాంత కుహరాల్లో కన్పిస్తున్న అవశేషాలు వారు వదలిపెట్టి పోయినవే." (బుఖారి, ముస్లిం)

ఆ తరువాత దేవుడు మద్యం, జూదాలను కూడా నిషేధిస్తూ ఈ క్రింది సూక్తులు అవతరింపజేశాడు:

"విశ్వాసులారా! మద్యం, జూదం, దైవేతరాలయాలు, పాచికల జోస్యం- ఇవన్నీ అసహ్యకరమైన పైశాచిక విషయాలు. వాటికి దూరంగా ఉండండి, మీ జీవితం సార్థకమవుతుంది. మద్యం, జూదాల ద్వారా షైతాన్ మీ మధ్య విరోధం, విద్వేషబీజాలు నాటి మిమ్మల్ని దైవధ్యానం, ప్రార్థనల నుండి నిరోధించగోరుతున్నాడు. మరి ఇకనైనా మీరు వాటిని మానుకుంటారా? దైవాజ్ఞను, ఆయన ప్రవక్త హితవుల్ని పాటించండి. వాటిని పాటించకుండా ముఖం తిప్పుకుంటే మాత్రం (మీకే నష్టం), ఆదేశాన్ని యథాతథంగా అందజేయడమే మా ప్రవక్త బాధ్యత." (ఖుర్ఆన్-5:90-92)

ఈ ఆదేశంతో మద్యం పూర్తిగా నిషేధించబడిందని, ఇక నుండి ఎవరూ మద్యం ముట్టడంగాని, అమ్మడంగాని చేయరాదని దైవప్రవక్త (సల్లం) బహిరంగ ప్రకటన చేయించారు. ఈ ప్రకటన వినగానే ముస్లిములంతా మద్యం మానుకున్నారు. మధు పాత్రలను నోటిదాకా తీసికెళ్ళినవాళ్ళు కూడా నిషేధప్రకటన వినగానే ఆ పాత్రలను దూరంగా విసిరికొట్టారు.

ముస్లింలంతా తమ తమ ఇండ్లలో ఉన్న మద్యాన్నంతటినీ వీధుల్లోకి తెచ్చి పారబోశారు. ఆరోజు మదీనా వీధుల్లో మద్యం ఏరులై ప్రవహించింది. సారా అంగళ్ళు శాశ్వతంగా కనుమరుగయి పోయాయి.

కొందరు మద్యం గురించి దైవప్రవక్త (స) ముందు ప్రస్తావిస్తూ "దీన్ని యూదులకు కానుకగా ఇవ్వచ్చా?" అని అడిగారు.

దానికి దైవప్రవక్త (సల్లం) "మద్యాన్ని నిషేధించినవాడు (దేవుడు) దాన్ని ఇతరులకు కానుకగా ఇవ్వడాన్ని కూడా నిషేధించాడు" అని చెప్పారు.

మరొకతను దీన్ని మందుగా వాడుకోవడానికి అనుమతివ్వమని అడిగాడు.

దైవప్రవక్త (సల్లం) అనుమతి నిరాకరిస్తూ "అది మందు కాదు, వ్యాధి" అన్నారు.

వేరొకతను వచ్చి "దైవప్రవక్తా! మేము తీవ్రమైన చలి ఉండే ప్రాంతంలో ఉంటున్నాం. కాయకష్టం కూడా ఎక్కువగా చేయవలసి వస్తుంది. మద్యసేవనం వల్ల మాకు కాస్త సేద తీరుతుంది. చలికి తట్టుకునే శక్తి కూడా వస్తుంది" అని అన్నాడు.

దైవప్రవక్త (సల్లం) ఈమాట విని "మీరు తాగే ఆ పానీయం వల్ల మత్తు కలుగుతుందా?" అని అడిగారు.

దానికావ్యక్తి "కలుగుతుంది" అన్నాడు.

"అయితే దాన్ని మానుకోవాల్సిందే" అన్నారు దైవప్రవక్త (సల్లం).

"కాని మాప్రాంతం జనం ఒప్పుకోరే ఎలా?" అన్నాడా వ్యక్తి.

"ఒప్పుకోకపోతే వారితో యుద్ధం చేయండి" అన్నారు దైవప్రవక్త (సల్లం).

## ఉమ్మెసల్మా, జైనబ్ (రజి)ల వివాహం-(103)

ఆ కాలంలోనే దైవప్రవక్త (సల్లం) ఉమ్మెసల్మా (రజి)ను వివాహమాడారు. ఉమ్మెసల్మా (రజి) మొదటి భర్త అబూసల్మా (రజి). ఆయన ఉహద్ యుద్ధంలో గాయపడ్డారు. తరువాత కొన్నాళ్ళకే బనీఅసద్ తెగతో జరిగిన యుద్ధంలో పాల్గొనవలసి రావడంతో మానుతున్న గాయాలు పచ్చి పుండ్లయి వాటి నుంచి ధారాపాతంగా రక్తం కారడం మొదలెట్టింది.

గాయపడి మంచాన పడ్డ అబూసల్మా (రజి)ను పరామర్శించడానికి దైవప్రవక్త (సల్లం) తరచుగా ఆయన ఇంటికి వెళ్ళేవారు. ఆయన ఆరోగ్యం కోసం దైవాన్ని ప్రార్థించేవారు. కాని అబూసల్మా (రజి) అనారోగ్యం నుంచి కోలుకోలేక పోయారు. చివరికి ఆ గాయాలతోనే ఆయన శాశ్వతంగా కన్నుమూశారు.

భర్త మరణంతో ఉమ్మెసల్మా (రజి) కృంగిపోయారు. తండ్రి నీడ కోల్పోయిన తన అనాథపిల్లల దుస్థితి చూసి ఆమె భోరున విలపించారు. కొన్నాళ్ళకు ఆమె విషాదాన్ని బలవంతంగా దిగమింగారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఆమెను వివాహమాడదలచి కబురు పంపారు. అప్పటికి ఆమె యవ్వన సరిహద్దులు దాటారు. పిల్లలు కూడా చాలా మంది ఉన్నారు. అంచేత ఆమె దైవప్రవక్త (సల్లం)ను వివాహమాడలేనని చెప్పారు. దైవప్రవక్త (సల్లం) కొన్నాళ్ళు ఆగి మళ్ళీ పెళ్ళి కబురు పంపించారు. చివరికి ఆమె అంగీకరించారు. దైవప్రవక్త (సల్లం) ఆమెను వివాహమాడి ఆమె పిల్లలను తన సంరక్షణలోకి తీసుకున్నారు.

అనాథలన్నా, వితంతువులన్నా ఆయనకు అమితమైన సానుభూతి ఉండేది. ఆపద సమయాల్లో వాళ్ళను తన శక్తివంచన లేకుండా ఆదుకునేవారు. వాళ్ళను ఆదుకోవడం గొప్ప పుణ్యకార్యమని తలచేవారు.



దాదాపు అదే కాలంలో దైవప్రవక్త (సల్లం) హజ్రత్ జైనబ్ (రజి)ను కూడా వివాహం చేసుకున్నారు. ఈమె దైవప్రవక్త (సల్లం)కు స్వయాన మేనత్త కూతురవుతారు.

జైనబ్ (రజి) వివాహం మొదట హజ్రత్ జైద్ (రజి)తో జరిగింది. హజ్రత్ జైద్ (రజి) దైవప్రవక్త (సల్లం) పెంపుడు కొడుకు. అంతకు ముందు జైద్ (రజి) బానిసగా జీవితం గడిపారు. దైవప్రవక్త (సల్లం) ఆయన్ని చేరదీసి పెంచి పెద్దచేశారు. తరువాత ఆయన కులం, గోత్రం, జాతి, తెగ అనే వివక్షల్ని, సాంఘిక అసమానతలను అంతమొందించడానికి జైద్ (రజి) వివాహం జైనబ్ (రజి)తో జరిపించారు.

అయితే జైద్, జైనబ్ (రజి)ల వివాహబంధం ఎంతోకాలం సాగలేదు. కపట ముస్లిం స్త్రీలు హజ్రత్ జైనబ్ (రజి) దగ్గరికెళ్ళి మాటిమాటికి నిమ్నోన్నతా భావాలను ఎత్తిచూపిస్తూ ఆమె లేత హృదయాన్ని గాయపరిచేవారు.

"ఉన్నత వంశానికి చెందిన నువ్వెక్కడా! బానిసగా బ్రతికిన ఈ జైద్ ఎక్కడ!! అసలు నీలాంటి అమ్మాయి, అందులోనూ అసాధారణ సౌందర్యరాసివయిన నువ్వు ఏ గొప్పింటి కోడలో కావాల్సింది. నీ ఖర్మకాలి ఈ బానిస ఇంటికి వచ్చావు. ఏమోనమ్మా! నీ దుస్థితి చూస్తుంటే మా గుండెలు తరుక్కుపోతున్నాయి" అంటూ వారు జైనబ్ (రజి)ను ఆమె భర్త పట్ల వెగటు కల్గించడానికి ప్రయత్నించారు.

ఈ సూటిపోటి మాటల్ని జైనబ్ (రజి) వినీ విననట్లు మౌనంగా ఉండిపోయేవారు. పైగా ఆమె జైద్ (రజి)ని ప్రశంసించేవారు. అలాంటి మంచి భర్త లభించినందుకు ఆమె దైవానికి కృతజ్ఞతలు తెలుపుకునేవారు.

కపటముస్లిం స్త్రీల సంగతి విని జైద్ (రజి) చాలా బాధపడ్డారు. తన మూలంగా జైనబ్ (రజి) ఆ స్త్రీల సూటిపోటి మాటలు వినవలసి వస్తుందే! ఎన్నాళ్ళిలా ఈమె వారి మాటలు వింటూ భరిస్తుంది? ఈ ఆపద నుండి ఆమె విముక్తి పొందాలంటే, తాను ఆమె నుండి విడిపోవడం ఒక్కటే మార్గం- అని భావించారు హజ్రత్ జైద్ (రజి). ఆ విషయాన్నే ఆయన జైనబ్ (రజి) ముందు ప్రస్తావించారు.

ఈమాట వినగానే జైనబ్ (రజి)కు కాళ్ళ క్రింద భూమి బ్రద్దలైనట్లు అన్పించింది.

"నన్ను కనికరించండి. తొందరపడి అలా చేయకండి. అవన్నీ తాత్కాలికమైన ఉద్రేకపు మాటలు. వాటిని పట్టుకొని మీరంతగా బాధపడాల్సిన అవసరం లేదు. కొన్నాళ్ళకు అంతా సర్దుకుపోతుంది" అన్నారు ఆమె భర్తతో.

ఈ విషయం సమంజసంగా ఉన్నా, హజ్రత్ జైద్ (రజి) మానసిక సంక్షోభం నుంచి బయటపడలేకపోయారు. తన కోరికను దైవప్రవక్త (సల్లం)కు కూడా తెలియజేశారు. దానికి దైవప్రవక్త (సల్లం) తీవ్రంగా అభ్యంతరం చెప్పారు.

కాని గాయపడిన జైద్ (రజి) హృదయం అంత తేలిగ్గా ఎలా మానుతుంది? కొన్నాళ్ళు ఎలాగో ఓర్పు వహించారు. ఆ తరువాత ఇక ఈ మానసిక సంక్షోభం భరించలేక ఆయన జైనబ్ (రజి)కు విడాకులు ఇచ్చేశారు.

విడాకుల విషయం తెలియగానే హ్రజత్ జైనబ్ (రజి) తీవ్రంగా ఆవేదనచెందారు. చిన్న పిల్లలా ఘోరంగా విలపించారు.

ఈ విషయం తెలిసి దైవప్రవక్త (సల్లం) చాలా బాధపడ్డారు. కాని చేసేదేముంది? జరగవలసింది జరిగిపోయింది. భర్త ఎడబాటుతో హ్రజత్ జైనబ్ (రజి) పరిస్థితి రోజు రోజుకు దిగజారి పోసాగింది. ఇలాంటి పరిస్థితిలో ఆమె బాధ పోగొట్టి ఆమెకు తోడునీడగా నిలిచేదెవరు?

దైవప్రవక్త (సల్లం) జైనబ్ (రజి) పరిస్థితి అర్థం చేసుకొని ఆమెను కూడా వివాహమాడ దలిచారు. కాని ఎలా? జైద్ (రజి) తన పెంపుడుకొడుకు అయ్యాడే!

అరబ్బులు పెంపుడుకొడుకును కన్నకొడుకుగా భావిస్తారు అందువల్ల వారి దృష్టిలో పెంపుడుకొడుకు భార్యను వివాహమాడటం ఘోరమైన అపచారమవుతుంది. ఒకవేళ ధైర్యం చేసి జైనబ్ (రజి)ను పెళ్ళి చేసుకుంటే.... అమ్మో! ప్రళయం విరుచుకుపడుతుందే! దైవప్రవక్త (సల్లం) ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో పడిపోయారు. అయితే ఈ విషయంలో దైవసందేశం వచ్చేసింది:

"ప్రవక్తా! కాస్త జ్ఞాపకం తెచ్చుకో. దేవుడు, నీవు (ఇద్దరూ కలసి) మేలుచేసిన ఒక వ్యక్తితో నీవు 'దేవునికి భయపడు, నీ భార్యను వదలిపెట్టకు' అని అన్నావు. ఆ సమయంలో నీవు ఒక విషయాన్ని మనసులో దాచి ఉంచావు. దాన్ని దేవుడు బహిర్గతం చేయదలిచాడు. అప్పుడు నీవు లోకులకు భయపడుతూ ఉండేవాడివి. నిజానికి దేవునికి మాత్రమే నీవు భయపడాలి.

జైద్ తన భార్య దగ్గర అవసరం తీర్చుకున్న తరువాత (విడాకులిప్పించి) మేము ఆమెతో నీ వివాహం జరిపించాం. పెంపుడు కొడుకులు తమ భార్యల దగ్గర తమ అవసరం తీర్చుకున్న తరువాత వారి భార్యల(ను వివాహమాడే) విషయంలో ఎలాంటి ఇబ్బంది ఏర్పడకుండా ఉండాలనే మేమిలా చేశాము. దేవుని ఆజ్ఞ అమలుజరిగే తీరవలసి ఉంది. (దివ్యఖుర్ఆన్–33:37)

ఈ దైవాజ్ఞ ప్రకారం దైవప్రవక్త (సల్లం) హ్రజత్ జైనబ్ (రజి)ని వివాహమాడారు. దాంతో జైనబ్ విషాదగాధ సుఖాంతమయింది. ఇతర స్త్రీల వివాహాలకు భిన్నంగా తన వివాహం స్వయంగా దేవుడే జరిపించాడన్న భావనతో ఆమె సంతోషంతో పొంగిపోయారు.

## దూమతుల్ జందల్ దండయాత్ర-(104)

హిజ్రీశకం 5 సంవత్సరం, రబీవుల్అవ్వల్ నెలలో సిరియా సరిహద్దులోని దూమతుల్ జందల్ ప్రాంతపు క్రైస్తవరాజు అకీదర్ బిన్ మలిక్ మదీనా మీద దాడిచేయడానికి సన్నాహాలు చేస్తున్నాడని దైవప్రవక్త (సల్లం)కు తెలిసింది. అదీగాక ఆ రాజు అరబ్బు బాటసారులపై, వాణిజ్య బిడారాలపై దాడులు చేస్తూ దోచుకుంటున్నాడని కూడా తెలిసింది.

అందువల్ల దైవప్రవక్త (సల్లం) అనుచరులతో సంప్రదింపులు జరిపిన తరువాత అతడ్ని ఎదుర్కోవడానికి సిద్ధమయ్యారు. కొన్ని రోజుల్లోనే వేయిమంది ముజాహిద్‌లు



సమకూరారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) సబా బిన్ అర్తఫా గిఫ్ఫారీ (రజి)ని మదీనా గవర్నర్‌గా నియమించి సైన్యాన్ని తీసుకొని దూమతుల్ జందల్‌కు బయలుదేరారు.

ఈ దండయాత్ర గురించి శత్రువుకు తెలియకుండా ఉండేందుకు ఆయన రాత్రి వేళల్లో మాత్రమే ప్రయాణం చేయసాగారు. ఇలా కొన్నాళ్ళు ప్రయాణంచేసి ఓరోజు రాత్రి పండువెన్నెల్లో సువిశాలమైన ఒక పచ్చిక బీడులో ప్రవేశించారు. అక్కడ పశువుల కాపర్లపై దాడిచేసి వారి పశువుల్ని స్వాధీనం చేసుకున్నారు.

ఆ ప్రాంతం నుంచి దూమతుల్ జందల్ పట్టణం చాలా దగ్గర్లోనే ఉంది. అందువల్ల పట్నంలోని క్రైస్తవసైనికులు తమపై దాడిచేయడానికి సిద్ధంగా ఉంటారని ముస్లిం యోధులు భావించారు. కాని తీరా చూస్తే అక్కడ సైనిక కోలాహలం మచ్చుకైనా లేదు. అంతేకాదు, ఆ పట్నం నుంచి జనసామాన్యం కూడా ఎవరూ బయటికి వస్తున్నట్లు సూచనలు కన్పించడం లేదు. పట్నం సమీపిస్తున్న కొద్దీ ఆ ప్రాంతమంతా శ్మశాన వాతావరణాన్ని తలపింపజేస్తోంది.

ముస్లిం యోధులు మధ్యాహ్నం వేళకు దూమతుల్ జందల్ పట్నంలోకి ప్రవేశించారు. కాని అక్కడి పరిస్థితి చూసి వారు ఆశ్చర్యచకితులయ్యారు. పట్నం వీథులన్నీ చాలా నిర్మానుష్యంగా ఉన్నాయి. ఒక్క పురుగూ లేదు. ఇండ్లు, దుకాణాలు కూడా ఖాళీగా పడి ఉన్నాయి. కాకపోతే అక్కడక్కడ కొన్ని కుక్కలు మాత్రం మొరుగుతున్నాయి.

ముస్లిం సైనికులు పట్టణ వీథుల్లో తిరుగుతూ తలుపులు బార్లా తెరచి ఖాళీగా పడి ఉన్న ఇండ్ల వైపు విస్తుబోయి చూస్తున్నారు. పట్నం వదలి ఈజనం ఎక్కడికి పోయారో వారికి అర్థంకాలేదు. ఒకచోట ఒక ఇంటి కిటికీ నుంచి మాత్రం ఓ మనిషి తొంగిచూస్తున్నట్లు కన్పించాడు. వెంటనే ఓ సైనికుడు ఆ ఇంట్లో జొరబడి ఆ మనిషిని బయటికి లాక్కొచ్చాడు. పాపం ఆ మనిషి ముస్లింసైనికుల్ని చూసి గజగజ వణికిపోసాగాడు.

"భయపడకు. చెప్పు మీ రాజు ఎక్కడికి పోయాడు?" అడిగారు దైవప్రవక్త (సల్లం).

"ప్రభూ! మీరు వస్తున్నారని తెలిసి మా రాజు డెమాస్కస్‌కు పారిపోయాడు" అన్నాడా వ్యక్తి కొంచెం భయపడుతూనే.

"అంటే మేం వస్తున్న సంగతి మీ రాజుకు ముందే తెలిసిందన్నమాట!"

"ఆ... తెలిసింది. మీరు వస్తున్నట్లు గూఢచారులు కొన్నాళ్ళకు ముందే మా రాజుకు సమాచారం అందజేశారు. అందువల్ల ఆయన ముందుగా పట్టణాన్ని ఖాళీచేయించి ప్రజల్ని వేరేచోటికి పంపించాడు. పట్నంలో మా రాజు, ఆయన సైనికులు మాత్రమే ఉండిపోయారు. కాని నిన్న రాత్రి ఇద్దరు పశువుల కాపర్లు వచ్చి ముస్లింల చక్రవర్తి వస్తున్నాడని చెప్పగానే మా రాజు కూడా సైన్యాన్ని తీసుకొని నిన్న రాత్రే డెమాస్కస్‌కు పారిపోయాడు."

"మరి నువ్వెందుకు పారిపోలేదు?"

"నాకు పారిపోవడానికి అవకాశం దొరకలేదు" అన్నాడా క్రైస్తవుడు.

“సరే, మేము నిన్ను విడిచిపెడ్తున్నాం. నువ్వు స్వేచ్ఛగా నీ ఇష్టమొచ్చిన చోటికి వెళ్ళవచ్చు” అన్నారు దైవప్రవక్త (సల్లం).

ఈ మాట విని ఆ క్రైస్తవుడు సంతోషిస్తూ దైవప్రవక్త (సల్లం)కు కృతజ్ఞతలు చెప్పి అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

ఆ తరువాత ముస్లిం సైనికులు ఆ ఇండ్లలోని ధాన్యం, పనికొచ్చే ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పట్నంలో ముస్లింలను ఎదిరించడానికి ఒక్క శత్రువు కూడా కన్పించ లేదు. అందరూ ముస్లిం సైనికులకు భయపడి పారిపోయారు. దైవప్రవక్త (సల్లం) ఆ పట్నంలో నాలుగైదు రోజులు ఉండి, శత్రువులు ఎవరూ రాకపోవడంతో సైన్యాన్ని తీసుకొని మదీనా తిరుగుముఖం పట్టారు.

ముస్లిం యోధులు కొన్నాళ్ళు ప్రయాణం చేసిన తరువాత దారిలో ఓ పచ్చిక మైదానంలో విశ్రాంతి కోసం ఆగారు. అప్పుడు ఒక అపరిచిత వ్యక్తి వచ్చి దైవప్రవక్త (సల్లం)కు సలాం చేసి ఓ పక్కన కూర్చున్నాడు.

దైవప్రవక్త (సల్లం) అతడ్ని చూసి “ఎవరు నీవు? నీ పేరేమిటీ?” అని అడిగారు.

“అయ్యా! నా పేరు ఐనియా. నా తండ్రి పేరు హుసైన్. నేను నా తెగకు నాయకుడ్ని. నాదగ్గర వేల సంఖ్యలో పశువులున్నాయి. మేకలు, గొర్రెలు, గుర్రాలు, ఒంటెలు కూడా ఎన్నో ఉన్నాయి. అపారమైన ఈ పశుసంపద కారణంగా నన్నీ ప్రాంతంలో జనం పశువుల రాజని పిలుస్తారు. ప్రతి సంవత్సరం ఇక్కడ పుష్కలంగా వర్షాలు కురుస్తాయి. పశువులకు మేత సమృద్ధిగా లభిస్తుంది. కాని ఈ యేడు వర్షాలు పడలేదు. పచ్చిక బయళ్ళు దాదాపు ఎండిపోయాయి. పశువులకు మేత కరువయిపోయింది” అన్నాడు ఐనియా.

“అయితే ఇప్పుడు మా నుండి నువ్వేం కోరుతున్నావు?” అడిగారు దైవప్రవక్త (స).

“మదీనాలో ఈ సంవత్సరం వర్షాలు బాగా కురిశాయని విన్నాను. పచ్చిక కూడా విస్తారంగా దొరుకుతుందని తెలిసింది. ప్రభువులవారు దయచేసి మదీనా పచ్చికబయళ్లలో నా పశువుల్ని మేపుకోవడానికి అనుమతిస్తే, స్తోమతను బట్టి ప్రతిఫలం కూడా సమర్పించు కుంటానని విన్నవించుకుంటున్నాను” అన్నాడా పశుపతి అతివినయం ఒలకబోస్తూ.

“ప్రతిఫలం ఏమీ అక్కర్లేదు. నీ పశువులన్నిటినీ తెచ్చుకొని మేపుకో. నిన్నెవరూ అభ్యంతరం పెట్టరు” అన్నారు దైవప్రవక్త (సల్లం) చిరునవ్వు నవ్వుతూ.

ఈ మాట వినగానే పశుపతి సంతోషంతో దైవప్రవక్త (సల్లం)కు కృతజ్ఞతలు చెప్పి వెళ్ళిపోయాడు.

కాస్సేపటి తర్వాత దైవప్రవక్త (స) కూడా సైనికులతో సహా మదీనా బయలుదేరారు.

పవుపతి ఐనియా నాలుగైదు రోజుల తరువాత తన పశువుల్ని, పశుకాపర్లను తీసుకొని మదీనా వెళ్ళాడు. పశువుల్ని మదీనా పచ్చిక మైదానాల్లో మేపుకుంటూ అక్కడే స్థిరపడి పోయాడు.



# గోముఖ వ్యాఘ్రుం (బనీ ముస్తలిఖ్)-(105)

యూదులు, ఖురైషీయుల బెడద చాలా వరకు తగ్గిపోయింది. కాని మదీనా చుట్టు పక్కలున్న వివిధ తెగలు మాత్రం ముస్లింలపై కవ్వింపు చర్యలు ఇంకా మానుకోలేదు. దైవప్రవక్త (సల్లం) గూఢచారుల ద్వారా ఆ తెగలను ఓ కంట కనిపెడుతూ ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

హిజ్రీ 5వ సంవత్సరం, షాబాన్ మాసం. బనీముస్తలిఖ్ తెగవాళ్ళు మదీనాపై దాడి చేయడానికి భారీఎత్తున యుద్ధసన్నాహాలు చేస్తున్నారని దైవప్రవక్త (సల్లం)కు సమాచారం అందింది. తక్షణమే ఆయన ముజాహిద్‌లను యుద్ధానికి సమాయత్తపరిచారు.

బనీముస్తలిఖ్ తెగ నివసించే మురసీ ప్రాంతం మదీనా నగరానికి ఏమంత దూరాన లేదు. ఎర్రసముద్రం తీరాన జిద్ద, రాబిగ్‌ల మధ్య ఉంది. ప్రయాణ మార్గం సాఫీగానే ఉంది. ధనప్రాణాలకు కూడా పెద్దగా ప్రమాదం లేదు. పైగా సమరసొత్తు లభిస్తుందన్న గట్టి నమ్మకం ఉంది. అందువల్ల కపటాగ్రేశ్వరుడు అబ్దుల్లా బిన్ ఉబయి కూడా ఎంతో ఆసక్తి కనబరుస్తూ తన శిష్యగణంతో ముజాహిద్‌ల వెంట బయలుదేరాడు.

దైవప్రవక్త (స) ఏదైనా యుద్ధానికి బయలుదేరవలసివస్తే చీటీ వేసి అందులో ఏ భార్య పేరు వస్తే ఆమెను తన వెంట తీసికెళ్ళేవారు. ఈసారి చీటీ వేస్తే హజ్రత్ ఆయిషా (రజి) పేరు వచ్చింది. అంచేత ఆమె దైవప్రవక్త (స) వెంట బయలుదేరారు.

అక్కడ బనీముస్తలిఖ్ తెగవాళ్ళ యుద్ధసన్నాహాలు ఇంకా పూర్తికాలేదు, అంతలో ముస్లిం యోధులు వచ్చిపడ్డారు. వారిని చూడగానే బనీముస్తలిఖ్ తెగకు మద్దతు ఇవ్వడానికి వచ్చిన ఇతర తెగలు ప్రాణభీతితో పారిపోయారు. బనీముస్తలిఖ్ తెగ సైనికులు మాత్రమే ఒంటరిగా ఉండిపోయారు. వారు కాస్సేపు ముస్లింయోధులతో పెనుగులాడి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పలాయనం చిత్తగించారు.

ముస్లిం యోధులు పెద్దగా శ్రమపడకుండానే శత్రువుల్ని చిత్తుగా ఓడించారు. ఈ యుద్ధంలో చావగా మిగిలిన బనీముస్తలిఖ్ తెగవాళ్ళు ఖైదీలుగా పట్టుబడ్డారు. ముస్లింలకు అపారమైన సమరసొత్తు కూడా లభించింది.

ముస్లింలు విజయానందంతో పొంగిపోయారు. స్నానం చేసి యుద్ధ బడలిక తీర్చుకోవడానికి వారు అదే ప్రాంతంలోని ఒక బావి దగ్గర విడిదిచేశారు. అయితే హఠాత్తుగా ఇద్దరు ముస్లింల మధ్య ఏదో కారణంగా తగాదా వచ్చి పరిస్థితి కొట్టుకునేదాకా పోయింది. అందులో ఒకడు సహాయం కోసం పూర్వం నుంచి మదీనాలో ఉంటున్న అన్సారులను ఎలుగెత్తి పిలిచాడు. రెండవ మనిషి మక్కా నుండి మదీనాకు శరణార్థులుగా వచ్చిన ముహాజిర్లను సహాయం కోసం ఎలుగెత్తి పిలిచాడు.

ఇబ్నెఉబై ఈ గొడవ సంగతి తెలియగానే ముహాజిర్ ముస్లింలకు వ్యతిరేకంగా అన్సార్ ముస్లింలను రెచ్చగొట్టడానికి ప్రయత్నించాడు. దాంతో ముహాజిర్‌ల తరపున కొందరు, అన్సార్‌ల తరపున కొందరు తగాదా స్థలానికి పరుగెత్తుకు వచ్చారు.

ఇలా ముస్లింలు రెండువర్గాలుగా చీలిపోయి పరస్పరం ఘర్షించుకుంటూ ఒకర్నొకరు చంపుకోవడానికి సిద్ధమయ్యారు. అంతలో దైవప్రవక్త (స) వచ్చి "ఏమిటీ అజ్ఞానపు పిలుపు? మీరేమిటీ, ఈ అజ్ఞానపు పిలుపు ఇవ్వడమేమిటీ!" అని మందలించారు. అప్పుడు ఇరువర్గాల నుండి కొందరు పెద్దలు కలగజేసుకొని ఈ గొడవను అంతమొందించారు.

ఆ తరువాత కపటవిశ్వాసులు అబ్దుల్లా బిన్ ఉబయి దగ్గరకు చేరుకొని "ఇప్పటిదాకా నువ్వేదో మమ్మల్ని ఉద్ధరిస్తావని ఆశలు పెట్టుకున్నాము. కాని ఈరోజు నువ్వు మాకు వ్యతిరేకంగా ఆ దరిద్రులకే సహకరించావు" అని ఎత్తిపొడిచారు.

దానికి అబ్దుల్లా మండిపడుతూ "అసలు ఇదంతా మీ నిర్వాకమే. మీరే వాళ్ళను మీ దేశంలో ఆశ్రయమిచ్చారు. వారికోసం డబ్బు ఖర్చుపెట్టారు. చివరికి వాళ్ళు బలిసిపోయి మనకే ప్రత్యర్థులై పోయారు...దైవసాక్షి! మదీనా చేరుకున్నాక మనలో గౌరవనీయుడైన ప్రతివ్యక్తీ నీచుడ్ని అక్కడ్నుంచి వెళ్ళగొడ్తాడు" అని అన్నాడు.

ఆ సమావేశంలో జైద్ బిన్ అర్ఖం అనే బాలుడు కూడా ఉన్నాడు. అతనీ మాటలు విని, తన పినతండ్రికి తెలియజేశాడు. ఆయన వెళ్ళి దైవప్రవక్త (స)కు తెలియజేశారు.

దైవప్రవక్త (సల్లం) వెంటనే జైద్‌ని పిలిచి "బాబూ! నీవక్కడ విన్న మాటలేమిటో మరోసారి చెప్పు" అన్నారు.

ఆ అబ్బాయి ఉన్నది ఉన్నట్లు పూసగుచ్చినట్లు చెప్పాడు.

దానికి దైవప్రవక్త (సల్లం) "బహుశా నీవు ఇబ్నెఉబయి పట్ల కోపంగా ఉన్నావు కాబోలు. లేక వినడంలో పొరబడి ఉండవచ్చు" అన్నారు.

ఆ బాలుడు తల అడ్డంగా తిప్పుతూ "లేదండీ! దైవసాక్షిగా చెబుతున్నా నేనీ మాటలన్నీ నా చెవులారా అతని నోట విన్నాను" అన్నాడు.

హజ్రత్ ఉమర్ (రజి) ఇబ్నె ఉబై గురించి విని ఆవేశాన్ని అణచుకోలేక పోయారు.

"దైవప్రవక్తా! ఆ ద్రోహిని హతమార్చడానికి అనుమతించండి. ఒక్కవ్రేటుతో వాడి శిరస్సు ఖండిస్తాను. నాకీ అనుమతినివ్వడం సమంజసం కాదనుకుంటే అన్సారుల్లోనే ముఆజ్‌కు గాని, అబ్బాద్‌కు గాని, సాద్‌కు గాని, ముహమ్మద్ బిన్ మస్లిమాకు గాని, లేదా మరెవరికైనా అనుమతి ఇవ్వండి. వారతడ్ని వధిస్తారు" అన్నారు ఆయన.

"ఉమర్! శాంతించు. అతడ్ని చంపితే లోకం ఏమనుకుంటుంది? ముహమ్మద్ తన సొంత అనుచరుల్నే చంపుతున్నాడని అనుకోదా? అప్పుడు మన పరిస్థితి ఏమిటీ? వద్దు. అలా చేయకూడదు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

ఆ తర్వాత దైవప్రవక్త (సల్లం) ఇబ్నెఉబయిని పిలిచి అడిగితే, అతను దేవుని మీద ప్రమాణం చేస్తూ తానీమాటలు అనలేదని పలికాడు.

అప్పుడు కొందరు అన్సార్ పెద్దలు కల్పించుకొని "ఈ పిల్లవాడు అపార్థం చేసుకొని ఉంటాడు. ఇబ్నెఉబయి మా నాయకుడు, పెద్దమనిషి. అతని ముందు ఈ పిల్లవాడి మాటలు పట్టించుకోకండి" అని సర్దిచెప్పారు.



కొందరు జైద్‌ని మందలించారు. పాపం! ఆ పిల్లోడు బిక్కమొహం వేసుకొని అసహాయంగా చూస్తూ నిలబడ్డాడు. కాని దైవప్రవక్త (స)కు ఇబ్నెఉబై ఎలాంటివాడో, ఆ బాలుడు ఎలాంటివాడో తెలుసు.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) తక్షణమే సైన్యం మదీనాకు బయలుదేరాలని ఆదేశించారు. సైన్యం బయలుదేరింది.

అది మిట్టమధ్యాహ్నం వేళ. సూర్యుడు ఆకాశం మధ్యకు వచ్చి నిప్పుకణాలు చెరుగుతున్నాడు. సాధారణంగా దైవప్రవక్త (సల్లం) ఇలాంటి వేళల్లో ప్రయాణానికి ఆజ్ఞ జారీచెయ్యరు. కాని ఈరోజు ఇంతటి తీవ్రమయిన ఎండలో ఇలా ప్రకటించడం....? ముజాహిద్‌లకు ఆశ్చర్యం వేసింది.

దారిలో హజ్రత్ ఉసైద్ బిన్ హుజైర్ (రజి) దైవప్రవక్త (సల్లం)ను కలుసుకొని "మీరీ రోజు ఎందుకో ప్రయాణానికి అనువుగాని వేళలో సైన్యాన్ని బయలు దేరమని ఆజ్ఞాపించారు?" అని అడిగారు.

దానికి దైవప్రవక్త (సల్లం) "మీ మనిషి ఎంత ప్రయోజనకరమైన మాటన్నాడో విన లేదా?" అన్నారు.

"ఎవరండీ ఆ మనిషి?" ప్రశ్నించారు హజ్రత్ ఉసైద్ (రజి).

"అబ్దుల్లా బిన్ ఉబయి" చెప్పారు దైవప్రవక్త (సల్లం).

"ఏమన్నాడేమిటి?" అడిగారు మళ్ళీ ఉసైద్ (రజి).

"మదీనా వెళ్ళాక గౌరవనీయుడు నీచుడ్ని అక్కడ్నుంచి వెళ్ళగొడ్తాడట!"

"దైవసాక్షి! అసలు గౌరవనీయులు మీరు. వాడే నీచుడు. మీరు ఎప్పుడు తలచుకుంటే అప్పుడు అతడ్ని నగరం నుంచి వెళ్ళగొట్టగలరు" అన్నారు ఉసైద్ (రజి).

ఈ సంగతి క్రమంగా అన్సార్ ముస్లింలలో వ్యాపించింది. ఇబ్నె ఉబయి పట్ల వారిలో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి.

కొందరు అతనితో "వెళ్ళి దైవప్రవక్తకు క్షమాపణ చెప్పుకో" అన్నారు.

దానికి అతను తీవ్రంగా స్పందిస్తూ "మీరు ఆయన్ని విశ్వసించమన్నారు. నేను విశ్వసించాను. మీరు నన్ను జకాత్ ఇవ్వమన్నారు. నేను జకాత్ కూడా ఇచ్చా. ఇక నేను ముహమ్మద్ (సల్లం)కు సాష్టాంగపడటం ఒక్కటే మిగిలింది" అని అన్నాడు.

ఈమాటలు విని అన్సార్‌లు మరింత ఆగ్రహోదగ్రులై పోయారు. అందరూ అతనికి శాపనార్థాలు పెట్టడం ప్రారంభించారు. సైనికులు కాస్తంత అలసట తీర్చుకోవడానికి దారిలో ఒకచోట ఆగిపోయారు.

ఆ సమయంలోనే దైవప్రవక్త (సల్లం) ముఖారవిందం వికసించింది. ఆయన జైద్ బిన్ అర్ఖమ్ (రజి)ని పిలిపించారు. ఆ అబ్బాయి వచ్చిన తరువాత చిరునవ్వు నవ్వుతూ అతని చెవి పట్టుకొని....

“ఒరే అబ్బాయీ! నీ చెవులు నిజాన్నే విన్నాయి. దేవుడు నీమాటల్ని ధృవీకరించాడు” అన్నారు దైవప్రవక్త (సల్లం).

“ఈ కపటవిశ్వాసుల్ని చూస్తే వారి విగ్రహపుష్టి, రూపురేఖలు నీకెంతో హుందాగా కన్పిస్తాయి. వారు మాట్లాడితే వారి మాటలను నీవు ఇట్లే (ఎంతో ఆసక్తిగా) వింటావు. కాని (వారిదంతా పైన బటారమే.) వారసలు గోడకు ఆనిచ్చి నిలబెట్టిన బోలు కర్రల్లాంటివారు. బిగ్గరగా విన్పించే ప్రతిశబ్దాన్నీ తమకు వ్యతిరేకంగా (ముంచుకొస్తున్న ముప్పని) భావిస్తారు. వారసలు తేనెపూసిన కత్తులు. అందువల్ల వారిపట్ల అప్రమత్తంగా ఉండండి. దేవుడు వారిని నాశనం చెయ్య, వారెలా పెడదారి పట్టిపోతున్నారు! (ఖుర్ఆన్–63:4)

వారితో “రండి, దైవప్రవక్త మీకోసం పాపమన్నింపుకై ప్రార్థిస్తాడ”ని చెప్పినప్పుడు వారు తలవిదిలించి వెళ్ళిపోతారు. పైగా విర్రవీగుతో నీ దగ్గరకు రాకుండా ముఖం చాటేస్తారు. ప్రవక్తా! వారికోసం నీవు పాపమన్నింపు ప్రార్థన చేసినా, చేయకపోయినా ఒకటే. దేవుడు వారిని ఎన్నటికీ మన్నించడు. దుర్జనులకు దేవుడు సన్మార్గం చూపడు. (ఖుర్ఆన&–63:5,6)

“ప్రవక్త అనుచరుల కోసం ఖర్చుపెట్టకండి, దాంతో వారు (ఆయన్ని వదిలేసి) వెళ్ళిపోతారు” అని చెప్పేవారు వీరే. కాని భూమ్యాకాశాల్లోని నిక్షేపాలన్నీ దేవునివేనన్న సంగతి ఈ కపటులు గ్రహించడం లేదు. వారు (పరస్పరం మాట్లాడుకుంటూ) “మదీనా తిరిగివెళ్ళిన తరువాత (మనలో) గౌరవనీయులైనవారు నీచులను అక్కడ్నుంచి వెళ్ళగొట్టాలి” అనంటారు. నిజానికి గౌరవప్రతిష్ఠలు దేవునికి, ఆయన ప్రవక్తకు, విశ్వాసులకు (మాత్రమే) ఉన్నాయి. కపటులు ఈ విషయాన్ని అర్థం చేసుకోవడం లేదు.” (ఖుర్ఆన్–63:7,8)

ఇలా దైవసందేశం రావడంతో అబ్దుల్లా బిన్ ఉబై దురుద్దేశ్యం బట్టబయలయింది. ఈ సంగతి తెలిసి అనేకమంది అతడ్ని నానామాటలు అన్నారు. ఇబ్నెఉబై కుమారుడు హజ్రత్ అబ్దుల్లా (రజి) అయితే తండ్రి చేసిన దుర్మార్గపు పనికి మండిపోసాగారు.

ఎండ తీవ్రత కొంచెం తగ్గిన తరువాత సైన్యానికి బయలుదేరాలని ఆజ్ఞయింది. సైనికులంతా బయలుదేరడానికి సిద్ధమవుతున్నారు. ఆ సమయంలో హజ్రత్ ఆయిషా (రజి) అవసర నిమిత్తం ఒయాసిస్సు బయటికి వెళ్ళారు. చాలాసేపు గడచినా ఆమె తిరిగిరాలేదు. ఈలోగా సైన్యం బయలుదేరింది. హజ్రత్ ఆయిషా (రజి) అంబారీలోనే ఉన్నారని భావించి సైనికులు దాన్నిఎత్తి ఒంటెమీద పెట్టి బయలుదేరారు.

హజ్రత్ ఆయిషా(రజి) అవసరం తీరాక సైనికశిబిరాల సమీపానికి వచ్చి చూసుకుంటే ఆమె మెడలో కంఠహారం కనపడలేదు. అది తెగిపోయి దారిలో ఎక్కడో పడి ఉంటుందని తలచి ఆమె దాన్ని వెతకడానికి వెనక్కివెళ్ళారు. చివరికి ఎలాగో కంఠహారం దొరికింది. దాన్ని తీసుకొని శిబిరాల దగ్గరికొచ్చి చూస్తే అంతా నిర్మానుష్యంగా కన్పించింది. దాంతో ఆమె దిక్కుతోచని స్థితిలో పడి అక్కడే ఓ ఇసుకతిన్నె మీద కూలబడ్డారు.

సూర్యుడు పడమటి ఇసుక తిన్నెల వెనక్కి వెళ్ళి కనుమరుగయి పోయాడు. చీకటి పడిపోయి నక్షత్రాలు కూడా ప్రత్యక్షమయ్యాయి. సైనికులు కొంచెందూరం వెళ్ళి అంబారీలో తాను లేకపోవడం గమనించి వెనక్కి తిరిగొస్తార్లే అని భావించారు హజ్రత్ ఆయిషా



(రజి). ఆ భావనతో ఆమె అక్కడే ఒక చోట దుప్పటి కప్పుకొని పడుకున్నారు. పడుకోగానే గాఢంగా నిద్రపట్టింది.

సూర్యోదయమయింది. సైనికులు మరచిపోయి ఏవైనా వస్తువులు వదలిపెట్టారేమోనని దారిపొడుగూతూ గమనిస్తూ వెనుకనుంచి సఫ్వాన్ (రజి) వస్తున్నారు. సైన్యం బసచేసి వెళ్ళిన ఒయాసిస్సు దగ్గరికి వచ్చిచూస్తే అక్కడ హజ్రత్ ఆయిషా (రజి) కన్పించారు.

అప్పుడు ఆమె ముఖం మీది దుప్పటి తొలగివుంది. హజ్రత్ సఫ్వాన్ బిన్ ముఅత్తిల్ (రజి) పరదా ఆజ్ఞలు అవతరించక పూర్వం హజ్రత్ ఆయిషా (రజి)ని చూసి ఉన్నారు గనక, వెంటనే ఆమెను గుర్తుపట్టి “ఇన్నాలిల్లాహి వఇన్నాఇలైహి రాజివూన్. ప్రవక్త సతీమణి (రజి) ఇక్కడే ఉండిపోయారా!” అన్నారు ఆశ్చర్యపోతూ.

ఈ అలికిడికి హజ్రత్ ఆయిషా (రజి) మేల్కొని గబాలున ముఖం మీద వస్త్రం కప్పుకున్నారు. హజ్రత్ సఫ్వాన్ (రజి) తన ఒంటెను ఆమె దగ్గరగా కూర్చోబెట్టి, ఆమెతో ఏమీ మాట్లాడకుండా కొంచెం దూరం వెళ్ళి కూర్చున్నారు. హజ్రత్ ఆయిషా (రజి) కూడా మౌనంగా లేచి ఒంటె మీద ఎక్కి కూర్చుకున్నారు. ఆమె కూర్చోగానే హజ్రత్ సఫ్వానే (రజి) ఒంటెను లేపి దాని పగ్గం పట్టుకొని బయలుదేరారు.

సైన్యం కొన్ని మైళ్ళు ప్రయాణం చేసిన తరువాత విశ్రాంతి కోసం మరో మజిలీ దగ్గర విడిది చేసింది. హజ్రత్ సఫ్వాన్ (రజి) ఒంటె మీద హజ్రత్ ఆయిషా (రజి)ను తీసుకొని నడుస్తూ చివరికి సైన్యం మజిలీ చేసిన చోటికి చేరుకున్నారు.

వీలు చిక్కితే చాలు, ఏదో ఒక ఉపద్రవం లేవనెత్తడానికి అనుక్షణం కాచుకొని ఉండే కపటవిశ్వాసి అబ్దుల్లా బిన్ ఉబైకి ఇప్పుడు మరో అవకాశం లభించింది. వాళ్ళిద్దర్ని ఆ విధంగా చూడగానే “ఇదిగో చూడండి. మీ ప్రవక్తగారి భార్యామణి రాత్రి ఓ పరపురుషునితో గడిపి, ఇప్పుడు బహిరంగంగానే అతనితోనే కలసి వస్తోంది!” అన్నాడతను.

అతని శిష్యులు ఎగిరి గంతేసి తమకు చేతినిండా పని దొరికిందని తెగ సంబరపడిపోయారు. వారీ విషయాన్ని సైనికుల్లో ప్రచారం చేయడం మొదలెట్టారు. వారి ప్రచార జాలంలో మిస్తహ్ బిన్ ఉసాసా, ప్రముఖ కవి హస్సాన్ బిన్ సాబిత్ వంటి కొందరు విశ్వాసులు కూడా చిక్కుకున్నారు. ఈ దుష్ప్రచారం సంగతి తెలిసి దైవప్రవక్త (స) ఎంతో బాధపడ్డారు. ఆయన సైన్యానికి తక్షణమే బయలుదేరాలని ఆదేశించారు.

అయితే దారిలో కూడా ఈదుష్ప్రచారం కొనసాగింది. దాంతో అది క్రమంగా ముస్లింలందరి చెవులకు ప్రాకింది. అనేకమంది ముక్కు మీద వేలేసుకున్నారు. కొందరు సందిగ్ధంలో పడిపోయారు. మరికొందరు ఇది పచ్చి అపనిందని కొట్టిపారేశారు. ఆయిషా (రజి) తండ్రి హజ్రత్ అబూబకర్ (రజి) పరిస్థితి అర్థంగాక లోలోన చాలా బాధపడసాగారు. ఈ గొడవ గురించి హజ్రత్ ఆయిషా (రజి)కు ఏమాత్రం తెలియదు.

అలాంటి పరిస్థితిలో సైన్యం మదీనా సమీపానికి చేరుకుంది. అప్పుడు అబ్దుల్లా బిన్ ఉబయి కొడుకు హజ్రత్ అబ్దుల్లా (రజి) త్వరగా పట్టణ ముఖద్వారం దగ్గరకు చేరుకొని తండ్రిని నగరంలో ప్రవేశించనీయకుండా అడ్డగించారు.

"మీరు మదీనా చేరుకున్నాక గౌరవనీయుడు నీచుడ్ని వెళ్ళగొడ్తాడని అన్నారు. ఇప్పుడు గౌరవనీయుడు మీరో లేక దేవుడు, ఆయన ప్రవక్తో తెలుస్తుంది చూడండి. దైవసాక్షి! మిమ్మల్ని దైవప్రవక్త (సల్లం) అనుమతించనంత వరకు నేను మిమ్మల్ని పట్టణంలోకి అడుగు పెట్టనీయను" అన్నారు కత్తి దూసి చూపిస్తూ.

ఇబ్నెఉబయ్యి బిత్తరబోయి "ప్రజలారా! చూడండి, నా కొడుకే నన్ను పట్నంలో ప్రవేశించ నీయకుండా నిరోధిస్తున్నాడు" అంటూ కేకలు పెట్టాడు.

కొందరు అనుచరులు ఈ విషయాన్ని దైవప్రవక్త (సల్లం) దగ్గరికెళ్ళి చెప్పారు. ఆయన వెంటనే "వెళ్ళి అబ్దుల్లాకు చెప్పండి వాళ్ళ నాన్నను ఇంటికి రానివ్వాలని" అని ఆదేశించారు.

అప్పుడు అబ్దుల్లా (రజి) తన తండ్రికి దారి విడిచిపెడ్తూ "దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞాపించారు గనక, ఇప్పుడు మీరు పట్నంలోకి ప్రవేశించవచ్చు" అన్నారు.

కపటవిశ్వాసుల నాయకుడు అబ్దుల్లా బిన్ ఉబయిని దైవప్రవక్త (సల్లం) క్షమించారు. దీని ప్రభావం అతని కొడుకుపై పెద్దగా పడలేదు గాని, అతని వంశస్థులంతా నిర్ఘాంతపోయారు. దైవప్రవక్త (సల్లం) కనబరచిన ఔదార్యానికి, ఆయన క్షమాగుణానికి వారు ఎంతో ప్రభావితులయ్యారు.

ఇక ఇప్పుడు అబ్దుల్లా బిన్ ఉబయి ఆటలు సాగేలా లేవు. ఆ వంచకుడు దైవప్రవక్త (సల్లం) పట్ల ఎలాంటి దుష్ప్రవర్తనకు పాల్పడినా, ఆయన్ని ఏమాత్రం వ్యతిరేకించినా అతని సొంత తెగవాళ్ళే అతనిపై విరుచుకుపడేవారు. దైవప్రవక్త (సల్లం) చేసిన మేలును గుర్తుచేస్తూ అతని వికృత చేష్టల్ని దుయ్యబట్టేవారు.

దైవప్రవక్త (సల్లం) ఓరోజు హజ్రత్ ఉమర్ (రజి)తో ఇలా అన్నారు:

"చూశావా ఉమర్! ఒకవేళ ఆనాడే నేను అబ్దుల్లా బిన్ ఉబైని వధింపజేస్తే ఎంత మంది మూతులు విరుచుకునేవారో! మరెంతమంది భృకుటులు ముడిపడేవో!! కాని ఈరోజు నేను వారిని సైగచేస్తే చాలు, క్షణాల్లో అతని శిరస్సు ఖండించి తెస్తారు."

నిజమే మరి. ఆరోజు మహాప్రవక్త (సల్లం) అతడ్ని క్షమించబట్టి సరిపోయింది. అలా కాకుండా అతడ్ని వధించేందుకే ఆజ్ఞాపించివుంటే ఏమయ్యేది? అతని వంశస్థులంతా దైవప్రవక్త (సల్లం)కు శత్రువులయ్యేవారేమో! అతని వంశం మాత్రమే కాదు, అతని తెగవాళ్ళు కూడా మండిపడుతూ దైవప్రవక్త (సల్లం)ను తూలనాడేవారేమో!! కాని ఆయన సాధుస్వభావం, సత్ప్రవర్తనలు అందరి హృదయాలనూ చూరగొన్నాయి. అందరిలో ఆయన పట్ల మరింత గౌరవభావం పెరిగింది.

దైవప్రవక్త (సల్లం) మాటలు విని హజ్రత్ ఉమర్ (రజి) సిగ్గుతో తలవంచుకున్నారు.

"దైవప్రవక్తా! నా సలహా కన్నా దైవసందేశహరుని నిర్ణయమే సరైనదని నేను ఆరోజే గ్రహించాను" అన్నారు ఆయన.



# హజ్రత్ ఆయిషా (రజి)పై అపనిందలా!-(106)

ముస్లిం యోధులు విజయోత్సాహంతో మదీనాలో ప్రవేశించారు. ఇద్దరు సైనికులు హజ్రత్ ఆయిషా (రజి) కూర్చున్న ఒంటెను ఆమె పుట్టింటికి తీసికెళ్ళి ఆపారు. హజ్రత్ ఆయిషా (రజి) అంబారీ నుంచి దిగి ఇంట్లోకి వెళ్ళారు.

కాని ఆమె మదీనా తిరిగిరాగానే జబ్బుపడ్డారు. దాదాపు నెలరోజుల దాకా కోలుకోలేక పోయారు. మరోవైపు అబ్దుల్లా బిన్ ఉబయి రగిలించిన దుష్ప్రచారపు చిచ్చు ఇంకా మండుతూనే ఉంది. ఈ సంగతి హజ్రత్ ఆయిషా (రజి)కు ఇంకా తెలియదు.

దైవప్రవక్త (స) అప్పుడప్పుడు వస్తూ ఆమె ఆరోగ్యపరిస్థితి గురించి ఆమె తల్లిదండ్రుల్ని అడిగితెలుసుకొని వెళ్ళిపోయేవారు. అంతేగాని ఆమెను కలుసుకొని మాట్లాడేవారు కాదు. ఇలా ఆయన తనతో ఎందుకు ముభావంగాఉన్నారో ఆమెకు అర్థమయ్యేది కాదు.

ఓరోజు ఆమె మిస్తహ్ తల్లిని వెంటబెట్టుకొని బహిర్భూమికి వెళ్ళారు. దారిలో మిస్తహ్ తల్లికి ఎదుర్రాయి తగిలింది. అప్పుడామె నోట అప్రయత్నంగా "మిస్తహ్ నాశనం గాను!" అన్న మాటలు వెలువడ్డాయి.

ఆయిషా (రజి) ఈ మాటలు విని "భలే తల్లివే నువ్వు! కన్నకొడుకునే శపిస్తున్నావా!!" అన్నారు ఆశ్చర్యపోతూ. "అమ్మాయ్! నీకీ విషయం ఇంకా తెలియదా?" అంటూ మిస్తహ్ తల్లి జరిగిన వృత్తాంతమంతా తెలియజేసింది.

దాంతో హజ్రత్ ఆయిషా (రజి)కు కాళ్ళ క్రింద భూమి బ్రద్దలయినట్లు అన్పించింది. గుండెలు గుభిల్లుమన్నాయి. వెంటనే ఆమె వచ్చిన పని కూడా మరచిపోయి నేరుగా ఇంటికి వెళ్ళిపోయారు. ఆ రోజు రాత్రి భోజనం కూడా చేయకుండా పడుకొని రాత్రంతా కన్నీరు మున్నీరుగా దుఃఖిస్తూ గడిపారు.

ఓరోజు దైవప్రవక్త (సల్లం) హజ్రత్ అలి (రజి)ని, ఉసామా బిన్ జైద్ (రజి)ని పిలిచి వారి అభిప్రాయాలు అడిగారు.

"ఉసామా! ఆయిషా గురించి ప్రచారం జరుగుతున్న విషయాలన్నీ విన్నావు కదా? వాటిని గురించి నీ అభిప్రాయం ఏమిటి?" అని ప్రశ్నించారు ఆయన.

"దైవప్రవక్తా! మీ శ్రీమతిలో నేను మంచితనం తప్ప మరో విషయం చూడలేదు. ఇక ఆమెను గురించి జనం చెప్పుకుంటున్న మాటలంటారా? అవన్నీ అబద్ధం, అపనిందలు తప్ప మరేమీ కాదు" అన్నారు హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజి).

"అలీ! మరి నువ్వేమంటావు?"

"దైవప్రవక్తా! నేను కూడా ఆమెలో అలాంటి విషయమేదీ ఇంతవరకు చూడలేదు. కాని మీరేమో చాలా విచారంతో ఉన్నట్లు కన్పిస్తున్నారు" అన్నారు హజ్రత్ అలి (రజి).

"ఔను. నాకీ విషయంలో చాలా విచారంగానే ఉంది. ఏం చెయ్యాలో పాలుపోవడం లేదు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

“విచారించకండి. మిమ్మల్ని భర్తగా పొంది, ఆ విషయం తమకు గర్వకారణంగా భావించే స్త్రీలు చాలామంది ఉన్నారు” చెప్పారు హజ్రత్ అలి (రజి).

“కాని ఆయిషా సంగతి......?”

“ఆమె ఏపాపం ఎరగని అమాయకురాలని నా అభిప్రాయం. సరే, మీరొక సారి ఆమె సేవకురాలు బరీరాను (రజి) కూడా పిలిపించి విషయం అడిగి తెలుసుకోండి” అన్నారు అలి (రజి).

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) హజ్రత్ అబూబకర్ (రజి) ఇంటికెళ్ళి, బరీరాను పిలిచి అడిగారు. దానికామె ఇలా సమాధానమిచ్చింది:

“మీకు సత్యధర్మం ఇచ్చి పంపిన దేవుని సాక్షిగా చెబుతున్నాను. నేను ఆయిషాలో ఇంతవరకు ఎలాంటి చెడువిషయం చూడలేదు. కాకపోతే నేను పిండి పిసికి మరో పని మీద వెళ్తూ ‘నేనిప్పుడే వస్తా, కాస్త పిండి వైపు చూస్తుండమ్మా!’ అని చెబితే అమె నిద్ర పోతుంది. అంతలో మేక వచ్చి పిండి కాస్తా తినిపోతుంది” అన్నది సేవిక.

అదేరోజు దైవప్రవక్త (స) మసీదులో ఉపన్యాసమిస్తూ- “ప్రజలారా! నా కుటుంబ సభ్యులపై నిందలు మోపి, నా మనస్సుని తీవ్రంగా గాయపరచిన వ్యక్తి చేస్తున్న దుష్ప్రచార దాడుల నుంచి నా గౌరవం కాపాడే వారెవరైనా ఉన్నారా మీలో? దైవసాక్షి! నేనింతవరకు నా అర్ధాంగిలోగాని, నిందితుడిలోగాని ఎలాంటి చెడు చూడలేదు. అసలతను నేను లేనప్పుడు నా ఇంటి ఛాయలకే వచ్చేవాడు కాదు” అన్నారు బాధాతప్త హృదయంతో.

అప్పుడు హజ్రత్ ఉసైద్ బిన్ హుజైర్ (రజి) లేచి “దైవప్రవక్తా! ఆ వ్యక్తి మా తెగ (ఔస్)కు చెందినవాడయితే మేమతని శిరస్సు ఖండిస్తాం. ఒకవేళ అతను మా సోదర తెగ (ఖజ్రజ్)కు చెందినవాడయితే మీరాజ్ఞాపించండి. మీ ఆజ్ఞను శిరసావహించడానికి మేము సిద్ధంగా ఉన్నాం” అని చెప్పారు.

ఈమాటలు వినగానే ఖజ్రజ్‌తెగ నాయకుడు సాద్ బిన్ ఉబాదా (రజి) దిగ్గున లేచి “నువ్వు అబద్ధమాడుతున్నావు. నువ్వతడ్ని వధించలేవు. ఆ మనిషి ఖజ్రజ్ తెగకు చెందినవాడు గనక నువ్వతడ్ని హతమార్చుతానని అంటున్నావు. ఆ వ్యక్తి మీ తెగ వాడయితే నువ్వెన్నటికీ అతని శిరస్సు ఖండిస్తాం అని చెప్పవు” అన్నారు ఆవేశంతో.

“నువ్వు కపటవిశ్వాసివి. అందుకే నువ్వు కపటుల్ని వెనకేసుకొస్తున్నావు” అన్నారు హజ్రత్ ఉసైద్ బిన్ హుజైర్ (రజి).

అలా ఆ ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఔస్, ఖజ్రజ్ తెగల మధ్య పెద్ద రభస జరిగింది. ఇంకాస్తయితే ఉభయ తెగలవారు మసీదులోనే ముష్టియుద్ధాలకు పాల్పడే వారు. కాని అంతలో దైవప్రవక్త (స) కల్పించుకొని సర్దిచెప్పారు. అంతటితో రభస సద్దు మణిగింది. కాస్సేపటి తరువాత అందరూ మసీదు నుండి వెళ్ళిపోయారు.

కాని హజ్రత్ ఆయిషా (రజి)పై వచ్చిన అపనింద వదంతి నగరంలో ఇంకా చెలరేగుతూనే ఉంది. దాంతో ఆమె కన్నీరుమున్నీరుగా దుఃఖిస్తూనే ఉన్నారు. దైవప్రవక్త (సల్లం)



లోలోన కుమిలిపోతున్నారు. హజ్రత్ ఆయిషా (రజి) తల్లి దండ్రులు కూడా ఎవరితోనూ ఏమీ చెప్పుకోలేక పుట్టెడు దుఃఖంతో సతమతమవుతున్నారు.

చివరికి ఒక రోజు దైవప్రవక్త (సల్లం) తన ప్రియమిత్రుడు హజ్రత్ అబూబకర్ (రజి) ఇంటికి వచ్చి దాదాపు నెలరోజుల తరువాత మొదటిసారిగా ఆయిషా (రజి) దగ్గర కూర్చున్నారు. ఆమె తల్లి హజ్రత్ ఉమ్మెరూమాన్ (రజి), తండ్రి అబూబకర్ (రజి) కూడా వచ్చి కూర్చున్నారు.

“ఆయిషా! నీ గురించి ఈ పుకార్లు పుట్టాయి. నువ్వు నిజంగా ఏ తప్పు చేయకపోతే దేవుడు నీసచ్ఛీలం గురించిన విషయం బహిర్గతం చేస్తాడు. ఒకవేళ నీవల్ల ఏదైనా తప్పు జరిగివుంటే పశ్చాత్తాపంతో దేవుడికి క్షమాపణ చెప్పుకో. దాసుడు తన తప్పు అంగీకరించి క్షమాపణ కోరుకుంటే దేవుడు అతడ్ని క్షమిస్తాడు” అన్నారు దైవప్రవక్త (సల్లం).

హజ్రత్ ఆయిషా (రజి) ఈ మాటలు విని మరింత బాధపడ్డారు.

“నాన్నా! దైవప్రవక్త (సల్లం) అడిగిన మాటలకు మీరు సమాధానం చెప్పండి” అన్నారు ఆమె.

“తల్లీ! ఏం సమాధానమివ్వాలో నాకేమీ అర్థం కావడంలేదు” అన్నారు హజ్రత్ అబూబకర్ (రజి) తల వొంచుకుంటూ.

“అమ్మా! నువ్వయినా దీనికి సమాధానం చెప్పు.”

“నేను మాత్రం ఏం చెప్పగలనమ్మా! నాక్కూడా ఏమీ అర్థం కావడంలేదు” అన్నారు హజ్రత్ ఉమ్మెరూమాన్ (రజి).

“అసలు మీ చెవుల్లో ఓ మాట పడిపోయి అది హృదయాల్లో తిష్ఠవేసుకొని కూర్చుంది. ఇప్పుడు నేను గనక ఏపాపం ఎరగనంటే మీరు నమ్మలేరు. ఒకవేళ నేను చేయని తప్పు చేశానని చెబితే మాత్రం మీరు ఒప్పుకుంటారు. ఇలాంటి పరిస్థితిలో యూసుఫ్ (అలై) తండ్రి అన్నట్లు ‘ఫసబ్రున్ జమీల్’ అని పలకటం తప్ప నాకు మార్గాంతరం లేదు” హజ్రత్ ఆయిషా (రజి) ఇలా చెప్పి పడక మీద పక్కకు తిరిగి పడుకున్నారు.

అంతలో దైవప్రవక్త (సల్లం) పరిస్థితి హఠాత్తుగా మారిపోయింది. ఆయన తల వొంచుకొని కళ్ళు మూసుకున్నారు. తీవ్రమైన చలిలో సైతం ఆయన నుదుటి నుంచి చెమట బిందువులు ముత్యాల్లా రాలిపడుతున్నాయి. అంటే, దివ్యావిష్కృతి ద్వారా ఆయన హృదయ ఫలకంపై దైవసూక్తులు అవతరించసాగాయి:

“ఈ అపవాదును మీలోనే ఒకవర్గం లేవదీసింది. (జరిగిందేదో జరిగింది. అయితే) దీన్ని మీరు చెడుగా భావించకండి. ఇది మీకు (ఒకందుకు) మంచిదే. ఇందులో ఎవరెంత పాత్ర వహించారో ఆమేరకు వారు పాపం మూటగట్టుకున్నట్లే. ఈ వ్యవహారంలో అత్యధిక బాధ్యత నెత్తిమీద వేసుకున్న ప్రధాన సూత్రధారికి కఠినాతికఠిన శిక్ష కాచుకొని ఉంది. (11)

ఈ నిందారోపణ వినగానే విశ్వాసులైన స్త్రీ పురుషులు అనుమానానికి గురికాకుండా సహృదయంతో ఎందుకు ఉండలేదు? మీరు అప్పటికప్పుడు ‘ఇది నిరాధారమైన అపనింద’

అని ఎందుకు ఖండించలేదు? వారు (తమ ఆరోపణను నిరూపించుకోవడానికి) నలుగురు సాక్షుల్ని ఎందుకు తీసుకురాలేదు? వారు సాక్ష్యం తీసుకురాలేదు, (తీసుకురాలేరు కూడా.) దేవుని దృష్టిలో వారే పచ్చి అబద్ధాలరాయుళ్ళు.

మీ మీద ఇహపరలోకాల్లో దేవుని అనుగ్రహం, ఆయన కరుణా కటాక్షాలే గనక లేకపోయివుంటే, మీరు ఏ (నిరాధారమైన) మాటల్లో పడిపోయారో వాటి పర్యవసానంగా మీపై ఘోరమైన విపత్తు వచ్చిపడేది. ఈ అసత్యారోపణ (ఎంత చెడ్డ విషయమో మీరే ఆలోచించండి. అది) మీలో ఒకరి నుంచి మరొకరికి (కార్చిచ్చులా) వ్యాపిస్తూ పోయింది. వాస్తవం ఏమిటో తెలియని మాట మీనోట వెలువడింది. మీరు దాన్ని సాధారణ విషయమని భావిస్తుండేవారు. కాని దేవుని దృష్టిలో ఇది చాలా తీవ్రమైన విషయం.

ఈ సంగతి వినగానే "ఇలాంటి మాటలు అనడం మనకు తగదు. దేవుడు పరిశుద్ధుడు. ఇది పచ్చిఅపనింద" అని మీరు ఎందుకు అనలేదు? మీరు (నిజమైన) విశ్వాసులైతే ఇక ముందు ఎన్నటికీ ఇలాంటి చేష్టలకు పాల్పడకూడదని దేవుడు మీకు ఉపదేశిస్తున్నాడు. ఆయన సర్వం తెలిసినవాడు, ఎంతో వివేకవంతుడు.

విశ్వాసులలో అశ్లీల విషయాలు వ్యాపించాలని కోరుకునేవారు ఇటు ప్రపంచంలోనూ, అటు పరలోకంలోనూ వ్యధాభరితమైన శిక్షకు అర్హులవుతారు. (సమాజం మీద అశ్లీలం ఎంత దుష్ప్రభావం వేస్తుందో) దేవునికి తెలుసు, మీకు తెలియదు. మీమీద దేవుని అనుగ్రహం, ఆయన కరుణాకటాక్షాలే గనక లేకపోయివుంటే మీరు దేవుడ్ని వాత్సల్యమూర్తిగా, దయామయునిగా చూడగలిగేవారు కాదు.

విశ్వాసులారా! షైతాన్ అడుగుజాడల్లో నడవకండి. వాడు తనను అనుసరించేవారికి (ఎల్లప్పుడూ) చెడు, అశ్లీలతలను గురించే దుర్బోధ చేస్తాడు. మీమీద దేవుని అనుగ్రహం, ఆయన కరుణా కటాక్షాలే గనక లేకపోతే మీలో ఏ ఒక్కడూ పరిశుద్ధుడు (పవిత్రుడు) కాలేడు. అయితే దేవుడు తాను తలచిన వారిని పరిశుద్ధం చేస్తాడు. ఆయన సర్వం వినేవాడు, సమస్తం ఎరిగినవాడు." (దివ్యఖుర్ఆన్-24:11-21)

దివ్యావిష్కృతి పరిస్థితి తొలిగిపోయిన తర్వాత దైవప్రవక్త (స) ముఖపద్మం విప్పారి దివ్యతేజస్సుతో వెలిగిపోసాగింది. ఆయన పెదవులపై దరహాసం తొణికిసలాడింది.

"ఆయిషా! నీకు శుభం కలుగుగాక! దేవుడు నీ పాతివ్రత్యం గురించిన విషయం అవతరింపజేశాడు" అని తెలియజేశారు. ఆ తరువాత ఆయన ఖుర్ఆన్‌లోని పై సూక్తులు పఠించి విన్పించారు.

ఈ శుభవార్త వినగానే కుటుంబ సభ్యులందరూ సంతోషించారు. దైవసూక్తులు వినగానే హజ్రత్ ఆయిషా (రజి) హృదయం ఎంతో తేలికపడింది. ఆమె మనసులోనే దైవానికి కృతజ్ఞతలు చెప్పుకున్నారు.

హజ్రత్ అబూబకర్ (రజి) అప్పుడు కుమార్తె ఆయిషా (రజి)తో "లేచి దైవప్రవక్త (సల్లం)కు కృతజ్ఞతలు చెప్పుకో" అన్నారు.



"ఏవిటీ కృతజ్ఞతలా! నేను ఆయనకూ కృతజ్ఞతలు చెప్పను; మీ ఇద్దరికీ కృతజ్ఞతలు చెప్పను. నా పాతివ్రత్యాన్ని బహిర్గతంచేసిన (నా ప్రభువు) దేవునికి మాత్రమే నేను కృతజ్ఞతలు సమర్పించుకుంటాను. మీరు ఈ అపనిందను కనీసం ఖండించనయినా ఖండించలేదు" అన్నారు హజ్రత్ ఆయిషా (రజి) చిరుకోపంతో.

ఆ తరువాత పాతివ్రత్యం గురించిన దైవసూక్తులు ఇతర విశ్వాసులకు కూడా తెలియజేయబడ్డాయి. దాంతో ముస్లింలందరూ సంతోషించారు.

అబ్దుల్లా బిన్ ఉబయి, అతని మిత్రమూక మాత్రం తమ దుష్ట పథకం బెడిసికొట్టి నందుకు తలలు వ్రేలాడదీసుకున్నారు. ఆ తరువాత వారు ఎక్కడికి పోయినా ముస్లింల ఛీత్కారానికి గురవుతున్నారు.

## హజ్రత్ జువైరియా (రజి)తో వివాహం-(107)

దైవప్రవక్త (సల్లం) యుద్ధరంగం నుంచి మదీనాకు తిరిగివచ్చాక యుద్ధంలో లభించిన సమరసొత్తును యోధులకు పంచిపెట్టారు. సమరసొత్తులో అపార ధనం, ఆయుధాలతోపాటు స్త్రీ పురుష ఖైదీలు కూడా ఉన్నారు.

యుద్ధఖైదీలలో బనీముస్తలిఖ్ తెగ నాయకుడు హారిస్ కుమార్తె జువైరియా కూడా ఉన్నది. ఈమె హజ్రత్ సాబిత్ బిన్ ఖైస్ (రజి)కు లభించిన వాటాలో వచ్చింది.

నిన్నటిదాకా స్వేచ్ఛావాయువుల్ని పీల్చుతూ కాలం గడిపిన జువైరియాకు ఇప్పుడిలా బానిసగా ఉండాలంటే మనసొప్పడం లేదు. యజమాని సాబిత్ (రజి)కు కొంత డబ్బిచ్చి బానిసబ్రతుకు నుండి బయటపడదామనుకుంది. ఆ విషయాన్ని గురించి ఆమె హజ్రత్ సాబిత్ (రజి) దగ్గర ప్రస్తావించింది. దానికి ఆయన సంతోషంగా అంగీకరించారు.

యజమాని తనకు స్వేచ్ఛనివ్వడానికయితే అంగీకరించాడు. మరి అందుకు ప్రతి ఫలంగా ఆయనకు డబ్బివ్వాలి కదా! అదెలా లభిస్తుంది? ఈ విషయంలో ఆమె దైవప్రవక్త (సల్లం) సహాయం అర్థించడానికి వెళ్ళింది.

"అయ్యా! నేను హారిస్ కూతుర్ని. నా పేరు జువైరియా. మా నాన్న మా తెగకంతటికీ నాయకుడు. నేనిక్కడ ఎలాంటి ఆపదలో చిక్కుకున్నానో మీకు తెలుసు. నేను సాబిత్ (రజి) గారికి లభించిన వాటాలో వచ్చాను. ఆయన నాకు స్వేచ్ఛనివ్వడానికి ఒప్పుకున్నారు. ఈ విషయంలో నేను మీ సహాయం కోరడానికి వచ్చాను" అన్నది ఆమె.

"దానికంటే మంచి మార్గం మరొకటి చెప్పనా?" అన్నారు దైవప్రవక్త (సల్లం).

"చెప్పండి" అన్నది జువైరియా ఉత్సాహంతో.

"సాబిత్‌కు నువ్వు చెల్లించాల్సిన పైకం మొత్తం నేనే చెల్లిస్తాను. నిన్ను అనాథగా వదలిపెట్టకుండా వివాహం కూడా చేసుకుంటాను" అన్నారు దైవప్రవక్త (సల్లం).

"మహాప్రసాదం! దైవప్రవక్తా! మహాప్రసాదం!! అంతకంటే అదృష్టం ఇంకేం కావాలి? నాకు ముమ్మాటికీ ఇష్టమే" అన్నది ఆమె విప్పారిన ముఖంతో.

అంతేకాదు, అప్పటికప్పుడు ఆమె సత్యధర్మాన్ని విశ్వసించి ముస్లింగా మారిపోవడం కూడా జరిగింది. దాంతో ఆమె అదృష్టతార మరింత ప్రకాశించింది.

హజ్రత్ జువైరియా (రజి) ఇప్పుడు సాధారణ ముస్లిం మహిళ కాదు. ఆమె దైవప్రవక్త (సల్లం) అర్ధాంగి. యావత్ ముస్లిం సమాజానికే మాతృమూర్తి. పవిత్ర స్త్రీల జాబితాలో చేరి ప్రథమాంకంలో నిలచిన మహిళాజ్యోతి.

ఈ శుభవార్త తెలిసి ముస్లింలు ఆనందభరితులయ్యారు. వెంటనే వారు తమ దగ్గరున్న బనీముస్తలిఖ్ తెగ బానిసలందర్నీ బానిసత్వం నుండి విముక్తం చేశారు.

"ఇప్పుడు వీరు దైవప్రవక్త (సల్లం)కు సన్నిహితులు. ఆయన శ్రీమతి హజ్రత్ జువైరియా (రజి) తరఫు బంధువులు. అందువల్ల వీరిప్పుడు ఎంతో గౌరవనీయులు" అన్నారు ముస్లింలు బనీముస్తలిఖ్ తెగవారికి అమితమైన గౌరవమిస్తూ.

"జువైరియా ఎంతటి శుభప్రదమైన స్త్రీ! ఆమె మూలాన ఆమె తెగవాళ్ళందరికీ స్వేచ్ఛ లభించింది. ఏ స్త్రీకీ ఇంతటి మహాభాగ్యం లభించలేదు. ఈ ప్రతిష్ఠ ఆమె ఒక్కదానికే లభించింది" అన్నారు హజ్రత్ ఆయిషా (రజి) ఈ శుభవార్త విని.

## బహుదైవారాధకులతో యూదుల కుమ్మక్కు-(108)

మదీనాలో ఇస్లామీయ ఉద్యమం నానాటికి బలం పుంజుకుంటోంది. ఇప్పుడు యావత్తు అరేబియాలో ఇస్లాం పెద్ద చర్చనీయాంశంగా తయారయింది.

మక్కా ఖురైషీయులు ఇస్లామీయ ఉద్యమకారుల శక్తి ముందు తమ ఓటమిని అంగీకరించారు. ముస్లింలతో మళ్ళీ పోరుకు తలపడటానికి వారికి ధైర్యం చాలడం లేదు. అంచేత వారి ప్రసక్తే మానేసి తమ తమ దైనందిన కార్యకలాపాల్లో పూర్తిగా నిమగ్నులైపోయారు.

బనూనజీర్ తెగ తాను సృష్టించిన అలజడుల మూలాన మదీనా నుంచి ఇదివరకే బహిష్కరించబడింది. అప్పుడా తెగవాళ్ళు ఖైబర్‌కు పోయి స్థిరపడ్డారు. అయితే వారు తమకు జరిగిన పరాభవానికి ఉడికిపోతూ పగ తీర్చుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఇప్పుడు వారి నేతలు ఒక పథకం ఆలోచించి ఖురైషీయుల దగ్గరకు పోయారు.

ఆ నాయకుల్లో హుయ్యి బిన్అఖ్తబ్, సలామ్ బిన్ అబిల్‌హుఖైక్ లాంటి ప్రముఖులు కూడా ఉన్నారు. వీరంతా దైవప్రవక్త (స)కు వ్యతిరేకంగా ఖురైషీయులకు బాగా నూరి పోశారు. వాళ్ళను ఉద్రేకపరచి ముస్లింల మీదికి పురిగొల్పారు. అణగారిన వారి ద్వేషాన్ని ఉత్తేజపరుస్తూ "భయమెందుకు? మేము మీకు తోడుగా ఉన్నాం. ఈ సంగతి చెప్పి మీకు వాగ్దానం చేయడానికే మేము ఇంతదూరం వచ్చాం" అని చెప్పారు.

ఈ మాటలు విని ఖురైషీయుల హృదయాలలో నూతన ఉత్తేజం ఉప్పొంగింది. తమకు యూదుల మద్దతు దొరికినందుకు తెగ సంబరపడిపోయారు. ఆ సంబరంలో యూదనాయకులకు ఖరీదైన ఆతిథ్యమిచ్చి సత్కరించారు.



"ఎంత మంచివారు మీరు! అసలు మీలాంటి వారంటేనే మాకిష్టం. ముహమ్మద్‌కు శత్రువులయి అతడ్ని తుదముట్టించడానికి సిద్ధమయినవారిని మేము ప్రాణప్రదంగా ప్రేమిస్తాం" అన్నారు వారు ఆనందసాగరంలో మునిగితేలుతూ.

"సోదరులారా! మీదగ్గర ఇదివరకటి నుంచే దైవగ్రంథం ఉంది. ముహమ్మద్‌తో మాకున్న భేదాభిప్రాయం కూడా మీరెరగనిది కాదు. మీరే చెప్పండి... మామతం గొప్పా లేక ముహమ్మద్ మతం గొప్పా?" అన్నారు ఖురైష్ బహుదైవారాధకులు.

"ఏమిటీ! ముహమ్మద్ మతాన్ని గురించి అడుగుతున్నారా? మీ మతం ఎక్కడా, అతని మతం ఎక్కడా! సత్యం ఎక్కడా, అసత్యం ఎక్కడా!! మీ మతం ముందు ముహమ్మద్ మతం ఏపాటిది?" అదను కనిపెట్టి గురిపెట్టారు యూదులు.

"శభాష్! మీరే మా శ్రేయోభిలాషులు. మత గ్రంథాలన్నీ క్షాళనచేసిన మీరు అసత్యం చెప్పరని మాకు తెలుసు" యూదులు పన్నిన ఉచ్చులో బిగుసుకు పోతున్నామని గ్రహించని ఖురైషీయులు వారి స్తోత్రగానాలకు పూనకం వచ్చినవారిలా ఊగిపోయారు.

"మా కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు ముహమ్మద్ (స)తో మేము పోరాడుతూనే ఉంటాం. అతని ధర్మం ఎంతవరకు వ్యాపిస్తుందో మేము కూడా చూస్తాం. ముహమ్మద్ (స)ని, అతని ధర్మాన్ని సర్వనాశనం చేసిగాని వదలిపెట్టం" తిరుగులేని నిర్ణయం వ్యక్త పరిచారు వారు యూదుల ముందు.

యూదులు విసిరిన ఉచ్చులో ఖురైష్ నాయకులు పూర్తిగా బిగుసుకు పోయారు. యుద్ధానికి పోవలసిన తేదీ కూడా నిశ్చయమైపోయింది.

యూదులు అంతటితో ఊరుకోలేదు. వారు అరేబియాలోని ఇతర తెగల దగ్గరకు కూడా పోయి విషబీజాలు నాటడం ప్రారంభించారు. సభలు జరిపి ఉద్రేక పూరితమైన ఉపన్యాసాలతో ప్రజలను రెచ్చగొట్టారు. గత్ఫాన్ తెగలోకి పోయి వారికి అనేకనేక ఆశలు చూపిస్తూ "మీరీ యుద్ధంలో మాతో సహకరిస్తే, మేము ఖైబర్‌లో పండే పంటలో సగం మీకిస్తాం" అన్నారు.

అదేవిధంగా వారు బనీఅసద్, ఫజారా, ముర్రా తెగల దగ్గరికి కూడా పోయి తమ పథకాన్ని అమలుపరిచారు. వారందరికీ నూతన ధర్మం వల్ల పొంచివున్న ప్రమాదం గురించి తీవ్రంగా హెచ్చరించారు. తమ ధర్మ పరిరక్షణ కోసం ప్రాణాలు సైతం తెగించి పోరాడాలని ఉద్రేకపరిచారు. ఆశల గుర్రాలు ఎక్కించి అదిలించి వదలిపెట్టారు.

ఇప్పుడు దైవప్రవక్త (సల్లం)కు వ్యతిరేకంగా యావత్తు అరేబియా ఒకటై పోయింది. ఒక్క యూదులేమిటీ! బహుదైవారాధకులేమిటీ!! సమస్త దుష్టశక్తులు, మిథ్యావాదులు సత్యజ్యోతిని ఆర్పడానికి సమాయత్తమయ్యారు. కారుణ్యమూర్తి (సల్లం)ని కడతేర్చడానికి కంకణం కట్టుకున్నారు.

తీర్మానాలు అయినాయి. నిర్ణయాలు జరిగాయి. పథకాలు రూపొందాయి. సైనిక సమీకరణ ప్రారంభమయింది. భారీఎత్తు ఆయుధాలు, ఇతర అవసరాలు సమకూరాయి. కొన్ని రోజుల్లోనే బ్రహ్మాండమైన సైనికపటాలం తయారయింది.

బాగా బలిసి కండలు తిరిగిన పదివేల మంది రక్తపిపాసులు సిద్ధమయ్యారు! ఆపాదమస్తకం ఉక్కు కవచాలతో, ధగధగ మెరిసే ధనుర్బాణాలతో, కళ్ళు చెదిరే ఖడ్గాలతో కూడిన ఈ సైనిక మహావాహిని ఆవేశపు కెరటాలను లేపుతూ, ఉద్రేకపు నురుగులు కక్కుతూ మదీనా దిశగా ప్రవహించింది!!

అరబ్ తెగలన్నీ ఏకమై మదీనాపై విరుచుకు పడనున్నాయని దైవప్రవక్త (సల్లం)కు సమాచారం అందింది. ఆయన తన ముఖ్యానుచరులందర్నీ సమావేశపరిచారు. పరిస్థితిని వివరించి కర్తవ్యం గురించి వారిని సంప్రదించారు. అనుచరులంతా ముక్తకంఠంతో "ఈసారి బయటకి పోకుండా మదీనాలోనే ఉండి శత్రువుల్ని ఎదుర్కొందాం" అన్నారు. దానికి దైవప్రవక్త (సల్లం) కూడా అంగీకరించారు.

## కందకంలో భవిష్యత్ సంకేతాలు-(109)

ఈరాన్ జాతీయుడయిన హజ్రత్ సల్మాన్ ఫార్సి (రజి) ఈరాన్ యుద్ధ తంత్రాలను గురించి బాగా ఎరిగినవారు. అనుభవశాలి కూడా. ఆయన ఇలా అన్నారు:

"మనం ఎలాంటి భద్రతలేని బహిరంగ మైదానంలో దిగి యుద్ధం చేయడం మంచిది కాదు. ఏదైనా కీలక ప్రదేశంలో సైన్యాలను సమీకరించి చుట్టూ కందకం తవ్వితే బాగుంటుంది."

ఈ అభిప్రాయం దైవప్రవక్త (స)కు నచ్చింది. "నిజమే. ఇలా చేస్తేనే బాగుంటుంది. లేవండి, సాధ్యమైనంత త్వరగా ఈపని ప్రారంభించాలి" అన్నారాయన సమావేశం ముగిస్తూ.

తక్షణమే ముస్లింలు రంగంలోకి దిగారు. పారలు, పలుగులు సేకరించారు. బనీ ఖురైజాతెగ యూదులు ముస్లింలతో ఇదివరకే స్నేహఒప్పందం చేసుకొనిఉన్నారు. అంచేత కందకం త్రవ్వకానికి కావలసిన పనిముట్లు చాలావరకు వారినుంచే లభించాయి.

మదీనా పట్టణానికి మూడు వైపుల చిన్న చిన్న కొండలు, ఖర్జూరపు తోటలతో నిండిపోయి సందులేకుండా ఉన్నందున పట్టణం సురక్షితంగా ఉంది. ఒకేఒక వైపు మాత్రం ఖాళీగా ఉంది. దైవప్రవక్త (సల్లం) కొంతమంది అనుచరులను వెంటబెట్టుకొని పట్టణం వెలుపలికి పోయి చుట్టూ పరిశీలించారు. ఖాళీగా ఉన్న వైపు అగడ్త త్రవ్వడం అవసరమని భావించారు. తక్షణమే అగడ్తకు సంబంధించిన పథకాన్ని ఆయనే రూపొందించారు. ఆ తరువాత ఆ ప్రదేశాన్ని పదేసి మందికి పది పది గజాల చొప్పున విభజించి ఇచ్చారు. వెంటనే త్రవ్వకం పని మొదలైంది.

దైవప్రవక్త (సల్లం) కూడా త్రవ్వకం పనిలో పాల్గొన్నారు.

స్వయంగా తమ నాయకుడు కూడా పనిలో పాల్గొనడం చూసి అనుచరులు ద్విగుణీకృత ఉత్సాహంతో పనిచేయడం మొదలెట్టారు. పని చకచకా సాగిపోతోంది.

అది శీతాకాలం. రాత్రివేళల్లో విపరీతమైన చలి. పైగా అనేకమంది అనుచరులు తిండిలేక మూడేసి రోజులు పస్తులు కూడా ఉండవలసి వచ్చింది. అలాంటి క్లిష్ట పరిస్థితిలో కూడా ముస్లింలు ఎంతో నిగ్రహంతో పని చురుగ్గా చేయసాగారు.



కాని అనేకమంది ఆకలితో నకనకలాడుతున్నారు. కళ్ళు లోపలికి పీక్కుపోయాయి. ఒక అనుచరుడు ఆకలితో బాధపడుతూ దైవప్రవక్త (సల్లం) దగ్గరకు వచ్చాడు.

"దైవప్రవక్తా! మూడు రోజుల నుంచి తిండి లేదు. ఆకలికి తాళలేక ఇదిగో పొట్ట మీద రాళ్ళు కట్టుకున్నాను" అంటూ అతను చొక్కా పైకెత్తి కడుపు మీద కట్టుకున్న రెండు రాళ్ళు చూపించాడు.

దైవప్రవక్త (సల్లం) అనుచరుని పరిస్థితి చూసి ఎంతో జాలిపడ్డారు. కాని ఏం చేయగలరు? స్వయంగా ఆయన కూడా లోలోన ఆకలితో బాధపడుతున్నారు. అందువల్ల అనుచరుని మాటలకు సమాధానంగా ఆయన తన చొక్కా పైకెత్తి చూపారు.

అది చూసిన తరువాత అనుచరుని కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. తన ప్రియతమ నాయకుని పొట్టపై మూడు రాళ్ళు కట్టబడి ఉన్నాయి.

ఇలా ఎంతోమంది పస్తులతో ఉండి కూడా ఉత్సాహంగా త్రవ్వకం పని చేస్తున్నారు. కొందరు పలుగులతో మట్టి త్రవ్వుతున్నారు. మరికొందరు పారలతో మట్టి తీసి దూరంగా పడవేస్తున్నారు. ఇంకొందరు అవసరమొస్తే శత్రువుల మీద విసరడానికి పనికొస్తాయని బయటి నుంచి రాళ్ళు తెచ్చి అగడ్తకు లోపలి వైపున వేస్తున్నారు.

అయితే అనస్ (రజి) అనే ఓ బాలుడు దైవప్రవక్త (సల్లం) ఆకలితో కడుపు మీద కట్టుకున్న రాళ్ళు చూసి చాలా ప్రభావితుడయ్యాడు. అతను వెంటనే కందకం త్రవ్వుతున్న తన తండ్రి అబూతల్హా (రజి) దగ్గరికెళ్ళి తెలియజేశారు.

హజ్రత్ అబూతల్హా (రజి) కూడా ఈ సంగతి విని చాలా బాధపడ్డారు.

"అయితే బాబూ! నువ్వు వెంటనే దైవప్రవక్త దగ్గరికెళ్ళి, భోజనం చేయడానికి మా నాన్న పిలుస్తున్నారని చెప్పి ఆయన్ని మనింటికి పిలుచురా. ఆయనతో పాటు మరో ఇద్దరు ముగ్గురు వచ్చినా పరవాలేదు. కాని ఒక విషయం గుర్తుపెట్టుకో. మనింట్లో అన్నం కొద్దిగానే ఉంది. అంచేత నువ్వు దైవప్రవక్త (స) ఒంటరిగా ఉన్నప్పుడు మాత్రమే ఈ విషయం తెలియజేసి పిలుచుకురా" అని చెప్పారు హజ్రత్ అబూతల్హా (రజి).

అనస్ (రజి) వెంటనే దైవప్రవక్త (సల్లం) దగ్గరకు పరుగెత్తారు. కాని అక్కడ దైవప్రవక్త (సల్లం) అనేకమంది అనుచరుల మధ్య కూర్చొని ఉన్నారు. అందువల్ల అనస్ (రజి) వచ్చిన పనేమిటో చెప్పకుండా మౌనంగా నిల్చున్నారు.

అయితే దైవప్రవక్త (సల్లం) ఆ అబ్బాయిని చూడగానే "ఏమిటి నిన్ను అబూతల్హా పంపించాడా?" అని అడిగారు.

"అవ్.....ఔనండీ!" అన్నారు అనస్ (రజి) నసుగుతూ.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) అనుచరుల్ని ఉద్దేశించి "సహచరులారా! అబూతల్హా ఇంటికి పదండి. ఆయన మనకు ఈపూట భోజనం ఏర్పాటు చేశాడు" అన్నారు బిగ్గరగా అందరికి వినపడేలా.

దైవప్రవక్త (స) పిలుపు విని దాదాపు ఎనభై మంది అనుచరులు సిద్ధమయ్యారు. దైవప్రవక్త (స) వారందరినీ వెంటబెట్టుకొని అబూతల్హా ఇంటికి బయలుదేరారు.

అనస్ (రజి) ఈ పరిస్థితి చూసి కంగారుపడుతూ ఇంటికి పరుగెత్తారు.

"నాన్నా! నాన్నా!! దైవప్రవక్త (సల్లం) చాలామందిని పిలుచుకొస్తున్నారు" అన్నారు ఆయన రొప్పుతూ, రోజుతూ.

"ఉమ్మెసులైమ్! విన్నావుగా. ఇప్పుడేం చేద్దాం?" అన్నారు హజ్రత్ అబూతల్హా (రజి).

"కానివ్వండి. దేవుడే మనకు సహాయం చేస్తాడు" అన్నారు హజ్రత్ ఉమ్మెసులైమ్ (రజి) ఏమాత్రం కంగారు పడకుండా.

అంతలో దైవప్రవక్త (సల్లం) అనుచరుల్ని తీసుకొని వచ్చారు.

హజ్రత్ అబూతల్హా (రజి) దైవప్రవక్త (సల్లం) చెవి దగ్గరకొచ్చి "దైవప్రవక్తా! ఇంట్లో రెండు రొట్టెలు మాత్రమే ఉన్నాయి" అన్నారు మెల్లిగా.

"మరేం పరవాలేదు. నీవు రొట్టెలతో పాటు నేతిగిన్నె కూడా తెచ్చి నా ముందు పెట్టు" అన్నారు దైవప్రవక్త (సల్లం) చిరునవ్వుతో.

హజ్రత్ అబూతల్హా (రజి) లోపలికెళ్ళి ఒక పాత్రలో రొట్టెలతో పాటు నేతిగిన్నె పెట్టుకొని తీసుకొచ్చారు.

అప్పుడు దైవప్రవక్త (స) నేతిగిన్నెను పైకెత్తి వంచితే అందులోనుంచి రెండు మూడు బొట్లు నెయ్యి రొట్టె మీద పడింది. దాన్ని చూపుడు వ్రేలితో మొత్తం రొట్టె మీద రాశారు. వెంటనే ఆ రొట్టె పైకి ఉబుకుతూ పాత్రఅంచు దాకా వచ్చింది. దాని మీద ఓ గుడ్డ కప్పి "బిస్మిల్లాహి అల్లాహుమ్మ ఆజమ్ ఫీహల్ బర్కత్" అని పఠించారు.

ఆ తరువాత పదేసి మంది చొప్పున అనుచరుల్ని భోంచేయడానికి లోపలికి పిలిచారు. అప్పుడు పదేసి మంది అనుచరులు వచ్చి గుడ్డ క్రింద చేయి దూర్చి ఒక్కొక్క రొట్టె తీసుకొని తినడం ప్రారంభించారు. మొదటి విడత పదిమంది కడుపు నిండా తిని వెళ్ళగానే రెండవ విడత పదిమంది వచ్చేవారు.

ఇలా మొత్తం ఎనభైమంది కడుపునిండా తిని లేచారు. ఆ తర్వాత దైవప్రవక్త (స) కూడా తిన్నారు. అయినా రొట్టెలు ఏమాత్రం తరగకుండా పాత్ర నిండా అలాగే ఉన్నాయి. చివరికి అబూతల్హా (రజి), ఆయన భార్యాపిల్లలు కూడా కడుపునిండా తిన్నారు దైవప్రవక్త (స) ద్వారా బహిర్గతమైన ఈ మహిమను తలచుకుంటూ.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) అనుచరుల్ని తీసుకొని తిరిగి కందకం త్రవ్వకంలో నిమగ్నులయి పోయారు. ఇలా అనుచరులు కందకం త్రవ్వుతుంటే అందులో ఓ పెద్ద బండరాయి అడ్డొచ్చింది. హజ్రత్ సల్మాన్ ఫార్సి (రజి), ఆయన జట్టు సభ్యులు పలుగులతో దాన్ని కొట్టికొట్టి విసిగిపోయారు. ఎంతకొట్టినా ఆ రాయి కాస్త కూడా పగల్లేదు. చుట్టుపక్కల కందకం త్రవ్వుతున్న ఇతర సహచరులు కూడా వచ్చి తమ బలాలను ప్రదర్శించారు. కాని ఆ రాయి మాత్రం చెక్కు చెదరలేదు.



ఈ విశేషం చూసి వారు ఎంతో ఆశ్చర్యపోతూ విషయం దైవప్రవక్త (స) దృష్టికి తీసికెళ్ళారు. అప్పుడు దైవప్రవక్త (స) తాను చేస్తున్న పని వదిలేసి బయలుదేరారు.

దైవప్రవక్త (సల్లం) వచ్చిన తరువాత కొందరు మాట్లాడుతూ "ఈ రాయిని పగల గొట్టడం సాధ్యమయ్యే పనిలా కన్పించడం లేదు. అంచేత ఈ చోటు వదలి పక్కకు జరిపి త్రవ్వుకోవడం మంచిది" అని సలహా ఇచ్చారు.

దైవప్రవక్త (స) చిరునవ్వు నవ్వుతూ పలుగు తీసుకున్నారు. అగడ్తలోకి దిగి 'బిస్మిల్లా' అంటూ బలంగా ఒకేఒక దెబ్బ వేశారు. ఆ దెబ్బకు రాయి మీద సన్నని పగులు ఏర్పడి, అందులో నుంచి తళుక్కున ఓ కాంతిపుంజం వెలువడింది. వెంటనే దైవప్రవక్త (సల్లం) 'అల్లాహుఅక్బర్' అన్నారు. అప్రయత్నంగా అనుచరుల నోట కూడా అల్లాహు అక్బర్ అనే పలుకులు వెలువడి ఆ ప్రదేశమంతా మార్మోగింది.

దైవప్రవక్త (సల్లం) రాతిపై మరోదెబ్బ వేశారు. దాంతో రాయి మరికాస్త పగిలి అందులో నుంచి మళ్ళీ వెలుగు విరజిమ్మింది. దైవప్రవక్త (సల్లం) రాయిమీద ఇంకో దెబ్బవేశారు. దాంతో ఆ బండరాయి ముక్కలుముక్కలుగా పగిలి దేదీప్యమానమైన వెలుగు విరజిమ్మింది. క్షణంపాటు పరిసరాలన్నీ ప్రకాశించాయి. దైవప్రవక్త (సల్లం) 'అల్లాహుఅక్బర్' అన్నారు. అనుచరులు కూడా అదేవిధంగా నినదించారు.

దైవప్రవక్త (స) కందకం నుండి పైకొచ్చిన తర్వాత ఒడ్డు మీద నిల్చున్న అనుచరులు తొంగితొంగి చూడసాగారు. అంతటి బలమైన ఆ చట్టును దైవప్రవక్త (స) మూడే మూడు దెబ్బలకు నుజ్జునుజ్జు చేయడం పట్ల వారు ఆశ్చర్యచకితులయ్యారు.

"ఇందులో ఆశ్చర్యం ఏముంది? ఇది దైవదౌత్య మహిమ" అన్నారు ఒకరు. "ఔను. నిస్సందేహంగా ఇది దైవమహిమే. ఇంతటి శక్తిమంతమైన రాయి పగలడం మానవశక్తికి అతీతమైన పని" అన్నారు మరొకరు.

"దైవప్రవక్తా! మీరా బండరాయి మీద పలుగుతో కొట్టినప్పుడు అందులో నుంచి వెలుగు కిరణాలు ప్రసరించాయేమిటీ?" అని అడిగారు కొందరు అనుచరులు.

"నువ్వు కూడా చూశావా?" దగ్గరే నిలబడివున్న సల్మాన్ ఫార్సి (రజి)ని అడిగారు దైవప్రవక్త (స). "చూశాను దైవప్రవక్తా! నాతో పాటున్న ఇతర సహచరులు కూడా ఆ వెలుగుని చూశారు" అన్నారు సల్మాన్ ఫార్సి (రజి).

"నేను మొట్టమొదట పలుగుతో ఆ రాయి మీద కొట్టినప్పుడు జిబ్రీల్ దూత ప్రత్యక్షమై నాకు యమన్ దేశపు తాళపుచెవులు ఇచ్చారు. రెండవసారి కొట్టినప్పుడు సిరియా దేశపు తాళపుచెవులు అప్పగించారు. మూడవసారి కొట్టినప్పుడు ఈరాన్ దేశపు తాళపుచెవులు ఇచ్చి 'ఈ మూడు దేశాలు✦ మీ అనుచర సముదాయం అధీనంలోకి వస్తాయి' అన్నారు జిబ్రీల్ దూత" వివరించారు దైవప్రవక్త (సల్లం) చిరునవ్వుతో.

✦ *యమన్ దైవప్రవక్త (స) జీవితకాలంలోనే ముస్లిం అధీనంలోకి వచ్చింది. సిరియా వైపు దండయాత్రలు మొదటి ఖలీఫా హజ్రత్ అబూబకర్ (రజి) పాలనాకాలం లోనే ప్రారంభమయ్యాయి. అయితే రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) పాలనా*

ఈ శుభవార్త విని ముస్లింలు పరమానందభరితులయ్యారు. హర్షాతిరేకంతో దిక్కులు పిక్కటిల్లేలా మరోసారి 'అల్లాహుఅక్బర్' అంటూ నినదించారు.

మొత్తంమీద త్రవ్వకం పని ఆరు రోజుల్లోనే పూర్తయింది. కందకం తయారయింది. ఇప్పుడు మదీనా పట్టణానికి పూర్తి భద్రత ఏర్పడింది.

పట్టణం వెలుపల ఓ కొండ ఉంది. అది కందకానికి కేవలం ఆరు మైళ్ళ దూరంలో ఉంది. రెండిటి మధ్య విశాలమైన మైదానం ఉంది. దైవప్రవక్త (సల్లం) సైన్యాన్ని ఆ మైదానంలో మోహరింపజేయాలని నిర్ణయించారు.

మదీనా నుంచి ముస్లిం సైన్యం బయలుదేరింది. పట్టణంలోని పెద్దలు, పిన్నలు ఒకరేమిటి... అందరిలో సమరోత్సాహం ఉరకలు వేస్తోంది.

సైన్యంలో పెద్దవాళ్ళతోపాటు కొందరు బాలురు కూడా ఉత్సాహంతో బయలు దేరారు. సైన్యం యుద్ధమైదానం చేరగానే దైవప్రవక్త (సల్లం) సైనిక పరిశీలన జరిపారు. పదిహేను సంవత్సరాలకు పైబడిన నూనూగు మీసాల నవయువకులకు మాత్రమే యుద్ధంలో పాల్గొనేందుకు అనుమతి లభించింది. పదిహేనేళ్ళ లోపున్న బాలవీరుల సమరోత్సాహాన్ని చూసి దైవప్రవక్త (సల్లం) ఎంతో మెచ్చుకుంటూ వారిని అభినందించారు. అయితే వారిని ఎలాగో నచ్చజెప్పి ఇళ్ళకు పంపివేశారు.

అటు శత్రుసైనికులు అప్పుడే మదీనా పొలిమేరల సమీపానికొచ్చి మోహరించ సాగాయి. సేనాపతి అబూసుఫ్యాన్ ముస్లింలకోసం తెగ ఉత్సాహంతో ఎదురుచూస్తున్నాడు. కాని అక్కడ కన్పించకపోవడంతో అతను మదీనా దారిపట్టాడు. మదీనా సమీపానికి వచ్చి విడిదిచేశాడు. సైన్యంలోని కొన్నితెగలు మాత్రం ఉహద్ దగ్గరే ఆగిపోయాయి.

ముస్లింలు మదీనా నుంచి కదలినట్లు సూచనలేమీ కానరావడం లేదు. అసలు వారి పరిస్థితి ఏమిటో, సైనిక కార్యకలాపాలు ఎలా ఉన్నాయో సమాచారం అందితేగాని తదుపరి చర్య తీసుకోవడానికి వీలుపడదు. అంచేత అబూసుఫ్యాన్ కొన్ని గూఢచార బృందాలను తయారుచేసి మదీనా వైపు పంపించాడు.

ఈ గూఢచార బృందాలు ఒకదాని వెంట మరొకటి చొప్పున రహస్యంగా బయలు దేరాయి. కాని తీరా మదీనా సమీపానికి చేరుకునేటప్పటికి అక్కడ కొత్తగా వెలసిన దృశ్యం చూసి కొయ్యబారి పోయారు. మక్కా బహుదైవారాధకులు ఇదివరకెప్పుడూ ఇలాంటి విశేషం చూడలేదు. అసలు ఇలాంటి అద్భుతం గురించి వారు కనీసం ఊహించ నైనా ఊహించలేదు. నమ్మశక్యంకాని ఆ దృశ్యాన్ని చూసి వారు నోరెల్ల బెట్టారు.

"ఏమిటిదీ! కందకంలా ఉందే!! ఔను కందకమే. ఎంతో లోతుగా, పొడవుగా త్రవ్వు కున్నారు. ఇది మదీనారక్షణ కోసం చేసిన ఏర్పాటు కాబోలు!! అయితే మన సైన్యం ఈ

*కాలంలో సిరియా పూర్తిగా ముస్లింల అధీనంలోకి వచ్చింది. పోతే ఈరాన్ వైపు దండ యాత్రలు రెండవ ఖలీఫా ఉమర్ (రజి) పాలనాకాలంలో ప్రారంభమై, ఆయన పాలనా కాలంలోనే ఈరాన్ పూర్తిగా ముస్లింల అధీనంలోని వచ్చింది. -(గ్రంథకర్త)*



కందకాన్ని దాటగలదా? ఏపని కోసం మనం ఇన్ని వ్యయప్రయాసలకు ఓర్చి ఇంత పెద్ద సైన్యం సమీకరించుకొని వచ్చామో ఆ పని నెరవేరుతుందా, లేదా? కొంపదీసి మనం వేసుకున్న పథకం తల్లక్రిందులు అవదుకదా!" పరిపరి విధాల ఆలోచించి దిక్కుతోచని స్థితిలో ఉసూరుమంటూ తమ స్థావరాలకు తిరిగొచ్చారు ఖురైష్ గూఢచారులు.

ఈ చావుకబురు వినగానే ఖురైషీయులందరికీ నడుములు విరిగినంత పనయింది. దేహమంతా చలిచీమలు ప్రాకినట్లనిపించింది.

"ఇదేదో కొత్త వ్యూహంలా ఉంది. అరేబియాలో ఇదివరకెప్పుడూ ఇలాంటి విడ్డూరం మనం చూడలేదే! ఏమిటీ యుద్ధ తంత్రం!!" ఎంతో ఆశ్చర్యపోయి, నిస్సత్తువతో అంతా హతాశులయ్యారు.

అటు మదీనా వెలుపల ముస్లిం సేనలు అవిశ్వాసులతో పోరాడటానికి తహతహ లాడుతున్నాయి. 'సల్అ' కొండ దిగువ భాగంలోని ఎత్తయిన కీలక ప్రదేశంలో ఓ ప్రత్యేక సైనికశిబిరం వెలసింది. ఇది మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) కోసం నిర్మించబడిన తాత్కాలిక సైనిక స్థావరం. ఇక్కడ కూర్చొని ఆయన జరగబోయే యుద్ధాన్ని గురించి ఓ సమగ్రమైన పథకం రూపొందించారు.

పథకం ప్రకారం ఆయన సైన్యాన్ని అనేక విభాగాలుగా విభజించారు. కొన్ని సైనిక విభాగాలను ముందుగానే కందకం పొడుగూతా పహరాఉంచారు. శత్రువులు దాటివస్తారని అనుమానం ఉన్న అగడ్త భాగాల దగ్గర మాత్రం మరింత పకడ్బందీగా గస్తీ దళాలను కూడా ఏర్పాటు చేశారు. మిగిలిన సేనలు శత్రువులను ఎదుర్కోవడానికి పంక్తులుతీరి నిలబడ్డాయి. కందకం ఆవల శత్రుసైన్యాలు వచ్చి బుసలు కొడ్తున్నాయి.

మధ్యలో పెద్ద కందకం ఉండటం వల్ల ఇరుపక్షాల సైన్యాలు నేరుగా ఢీకొనడానికి వీలులేకుండా పోయింది. శత్రుసైనికులు ఏమీ పాలుపోక కోపంతో చిందులు తొక్కు తున్నారు. అశ్వరూఢులైన కొందరుసైనికులు కందకం దాటడానికి విఫలయత్నం చేశారు.

ఇటు ముస్లింయోధులు ఎడతెరిపి లేకుండా బాణాలు కురిపించసాగారు. వీరి బాణాలధాటికి నిలువలేక శత్రుసైనికులు వెనక్కితగ్గారు. అయినా వారు అధైర్యం చెంద లేదు. అగడ్తకు ఆవల వైపునుంచి వారు కూడా బాణాలు వదలడం మొదలెట్టారు.

అలా సాయంత్రందాకా యుద్ధం చేశారు. చీకటిపడిన తరువాత వారు తమ స్థావరా లకు వెళ్ళిపోయారు. మరునాడు సూర్యోదయం కాగానే మళ్ళీ కందకం దాటి రావడానికి ఎంతో ప్రయత్నించారు. కాని ఆరోజు కూడా వారికది సాధ్యపడలేదు. పట్టరాని కోపంతో పళ్ళు పటపట కొరుక్కుంటూ వెనక్కి వెళ్ళిపోయారు.

వారు అనుకున్నది ఒకటయితే ఇక్కడ జరిగింది మరొకటి. తమ పథకం తారు మారైంద"ని భావించి దిక్కుతోచని స్థితిలో పడ్డారు ఖురైషీయులు.

దానికి తోడు రాత్రి వేళల్లో విపరీతమైన ఈదురు గాలులు కూడా మొదలయ్యాయి. ఆపై ఎముకలు కొరికే చలి! నరాల్లోని రక్తం గడ్డ కట్టుకుపోతోంది. సైనిక పంక్తులు చెల్లాచెదరయి పోతున్నాయి.

ఒక వైపు కందకం దాటడానికి చేస్తున్న ప్రయత్నాలన్నీ విఫలమవుతున్నాయి. మరోవైపు ప్రాణాలు తోడేసే చలిపులి ఆపాదమస్తకం గజగజ వణికిస్తోంది. దైవప్రవక్త (స)ను అంతమొందించి, సత్యధర్మాన్ని సమాధి చేయడానికి వచ్చిన బహుదైవారాధకులు చివరికి ఇలా ఇరకాటంలో పడ్డారు.

పాపం వారి సైనికులు ఢీలాపడి పోయారు. క్రమశిక్షణ సన్నగిల్లి పోయింది. సర్వత్రా నిరాశానిస్పృహలు అలుముకున్నాయి. ఎవరి నోట విన్నా "ఇక ముహమ్మద్‌ని జయించడం మన వల్ల సాధ్యం కాదు" అన్న మాటలే విన్పిస్తున్నాయి.

## యూదుల నమ్మక ద్రోహం-(110)

బనూనజీర్ యూదతెగ నాయకుడు హుయ్యి బిన్ అఖ్తబ్ సైనికుల పరిస్థితి చూసి భయపడ్డాడు. సైనికుల్ని ఒకచోట చేర్చడానికి ఎంతో ప్రయాసపడుతున్నాడు. ప్రత్యామ్నాయ మార్గం కోసం ఆలోచించాడు. "సైనికుల పరిస్థితి ఇలాగే మరికొన్ని రోజులు కొనసాగితే వారి మనోస్థైర్యం సన్నగిల్లి పోతుంది. అందువల్ల తక్షణమే ఏదో ఒకటి చెయ్యాలి" అనుకున్నాడు మనసులో

వెంటనే అతను సర్వసేనాని అబూసుఫ్యాన్ దగ్గరికి పరుగెత్తాడు.

"నాజాతి వాళ్ళయిన బనీఖురైజా యూదులు కూడా మీ పక్షాన ఉన్నారు. వారి శక్తి సామర్థ్యాలు ఎలాంటివో మీకు తెలుసు. రంగంలో దిగితే విజయమో వీరస్వర్గమో అన్నదే వారి ధ్యేయం" అన్నాడతను.

"అయితే ఇక ఆలస్యం ఎందుకూ? త్వరగా పోయి ముహమ్మద్‌తో చేసుకున్న స్నేహఒప్పందం తెంచెయ్యమని చెప్పిరా" అన్నాడు అబూసుఫ్యాన్.

హుయ్యి ఆ తర్వాత బనీఖురైజా తెగవాళ్ళ దగ్గరికి పరుగుపెట్టాడు. "ఎలాగైనా వాళ్ళకు నచ్చజెప్పాలి. మధ్యపెట్టి అయినాసరే ముస్లింలతో చేసుకున్న ఒప్పందం తెంచి వేయించి వారిని ఖురైషీయుల పక్షం వైపు తిప్పాలి" అనుకున్నాడు మనసులో.

కొంచెం దూరం ఉండగానే అతని వాలకం చూసి బనీఖురైజా నాయకుడు కాబ్ బిన్ అసద్ అనుమానించాడు. ఇతనేదో కల్లబొల్లిమాటలు చెప్పి ఒప్పందాన్ని త్రెంచివేయించడానికి వస్తున్నాడని పసిగట్టాడు. వెంటనే కోట సింహద్వారాలు మూయించాడు. అతడ్ని కలుసుకోవడానికి కూడా ఇష్టపడలేదు.

హుయ్యి కోట ద్వారం దగ్గరికి వచ్చాడు. ఎన్నో ప్రమాణాలు చేసి మీ శ్రేయస్సు కోసమే వచ్చాను, తలుపు తీయమని అడిగాడు. కాబ్ తలుపు తెరవలేదు. హుయ్యి తలుపు తెరిపించడానికి చాలా ప్రయత్నించాడు. చివరికి కాబ్‌ని రెచ్చగొడ్తూ "మీరు తలుపులు ఎందుకు మూయించారో నాకు తెలుసు. నేను కూడా మీకున్న దాంట్లో భాగస్వామిని అవుతానేమోనని భయపడ్తున్నారు మీరు" అన్నాడు.

ఈ మాట వినగానే కాబ్ బిన్ అసద్‌కు అభిమానం ముంచుకు వచ్చింది. అందువల్ల వెంటనే అతను తలుపులు తెరిపించాడు.



"చూశారా! మీ కోసం నేను ఎలాంటి పేరుప్రతిష్ఠల మూట పట్టుకొచ్చానో. బ్రహ్మాండమైన సైనికవాహిని! నురుగులు కక్కే సైనికవాహిని!! యావత్తు అరేబియా కదలివచ్చింది. ఖురైష్, గత్ఫాన్... ఒకరేమిటి? సమస్త తెగలు వచ్చిపడ్డాయి. అంతా ముహమ్మద్ రక్తాన్ని కళ్ళ చూడటానికి తహతహలాడి పోతున్నారు. అనుకున్న పని నెరవేరనిదే ఇక్కడ్నుంచి కదలమని గట్టిగా శపథం కూడా చేశారు" అన్నాడు హుయ్యి కోటలోకి ప్రవేశిస్తూ.

హుయ్యి అతిశయోక్తులకు కాబ్ కొంచెం తికమక పడ్డాడు.

"హుయ్యీ! నువ్వు నా పరువు తీయడానికి ప్రయత్నిస్తున్నావు. నేను ముహమ్మద్‌తో ఒడంబడిక చేసుకున్న సంగతి నీకు తెలుసు. ఇప్పుడీ ఒడంబడికను ఉల్లంఘించడం నావల్ల కాదు. ముహమ్మద్ ఎల్లప్పుడూ మా పట్ల నమ్మకంగానే ప్రవర్తించాడు. అలాంటి నిజాయితీపరుడికి వ్యతిరేకంగా నేనీ విశ్వాసఘాతుకానికి పాల్పడలేను" అన్నాడు కాబ్.

కాబ్ మాటలకు హుయ్యి ఏమాత్రం నిరాశపడలేదు. అతని అభిమానాన్ని మరింత రెచ్చగొట్టడానికి ప్రయత్నించాడు.

"కాబ్! ఈరోజు మొత్తం జాతి గౌరవాన్ని కాపాడేపని నీ చేతిలో ఉంది. దాని పరాభవం కూడా నీ చేతిలోనే ఉంది. దాన్నిబట్టి నీవే ఆలోచించుకో. ఇలాంటి అవకాశం చేజారిపోతే మళ్ళీ రాదు. నామాట విని సంకోచించకుండా ఒప్పందాన్ని తెంచి ఖురైష్ సైనికులకు దారివ్వు. వారు ప్రవాహంలా ముందుకు పురోగమిస్తారు. నిమిషాల్లో ముహమ్మద్‌ని, అతని అనుచరుల్ని తుడిచిపెడ్తారు. ఆ తరువాత యావత్ అరేబియాపై మన ప్రభావం పడుతుంది. అంతేకాదు, మన మతవ్యాప్తి కోసం కూడా దారి సుగమం అవుతుంది. మదీనా సిరిసంపదలు కూడా మనకే దక్కుతాయి."

హుయ్యి ఈసారి ప్రయోగించిన రాజనీతి అస్త్రం వృధా పోలేదు. అతని ఇంద్రజాలానికి కాబ్ మంత్రముగ్ధుడయ్యాడు. కాని దాన్ని ఆచరణలో పెట్టడానికి కాబ్ వెనకాడ్తునే ఉన్నాడు. ఒప్పందం ధిక్కరణ వల్ల కలిగే దుష్పరిణామాలు అతని హృదయాన్ని మాటి మాటికి పట్టి కలచివేస్తున్నాయి.

"ఒకవేళ ఖురైష్, గత్ఫాన్ తెగలు ఓడిపోతేనో..? వాళ్లు కాలికి బుద్ధిచెప్పి ఎలాగో బయటపడతారు. కాని నేను ఏకాకినవుతాను. ఆతర్వాత సర్వనాశనమవుతాను. బనీనజీర్, బనీఖైనుఖా తెగల మాదిరిగా నేను, నాతెగవాళ్ళు కూడా ఘోరంగా అప్రతిష్ఠ పాలవుతాము." ఈ ఆలోచన రాగానే వంటిమీద జెర్రులు ప్రాకినట్లన్పించింది కాబ్‌కు.

కాని కాబ్ ముఖకవళికలు కనిపెట్టిన హుయ్యి చాకచక్యంతో మాయమాటల వలపన్ని అతని వంటిమీది జెర్రుల్ని వదలగొట్టాడు, అనుమానభూతాన్ని పారదోలాడు. బలవంతంగా ఓ చిరునవ్వు ఒలకబోస్తూ-

"కాబ్! నీ అనుమానం ఏమిటో నాకు తెలుసు. దురదృష్టవశాత్తు మనం ఓడిపోతే, ఖురైషీయులు కూడా పారిపోతే... అప్పుడు నేను ఖైబర్ వదలి ఇక్కడికే వచ్చి మీ దగ్గర ఉంటాను. ఏ కష్టమొచ్చినా మీతోపాటు నేనూ పాలుపంచుకుంటాను, సరేనా?" అన్నాడు.

ఈ మాటలతో కాబ్ మనస్సు కుదుటపడింది. ఇప్పుడు పూర్తిగా దిగివచ్చి హుయ్యితో రాజీపడ్డాడు. హుయ్యి విజయగర్వంతో అబూసుఫ్యాన్ దగ్గరకు వెళ్ళి ఈ వార్త విన్పించాడు. అబూసుఫ్యాన్ ముఖం చాటంత అయింది.

"నిజమా! అయితే రేపీపాటికి అంతా మాకు లొంగిపోతారు. ముహమ్మద్ మాకు బందీగా దొరికిపోవడం ఖాయం" అని భావించి తెగ సంబరపడి పోయాడతను.

ముస్లిం యోధులు ఎడతెరిపి లేకుండా ధనుర్బాణాలతో పోరాడుతూనే ఉన్నారు. ఆహారపదార్థాలు కొరవడినా ఖాతరు చేయకుండా అత్యంత ఉత్సాహంతో యుద్ధరంగంలో స్థిరంగానే ఉన్నారు.

సరిగ్గా అదే సమయంలో బనీఖురైజా తెగ యూదులు దైవప్రవక్త (సల్లం)తో చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించిన వార్త ముస్లిం సైనికుల్లో దావానలంలా వ్యాపించింది. అందరూ నిర్ఘాంతపోయారు. ఇప్పుడు వీరు కూడా దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది.

ఒక వైపు కందకం అవల శత్రుసైనికులు కాచుకొని ఉన్నారు. మరోవైపు ఒప్పందాన్ని భంగం చేసిన యూదులు ఉన్నారు. అంతర్గత శత్రువులయిన ఈ యూదులు ఎప్పుడు దాడి చేస్తారో తెలియదు. స్త్రీలు, పిల్లల భద్రతకు కూడా ముప్పు ఏర్పడింది. యూదుల నమ్మకద్రోహం వల్ల ఖురైషీయుల దారి సుగమం అయింది. ఈ దారి గుండా వారు మదీనాలోకి ఏ క్షణాన్నయినా ప్రవేశించే ప్రమాదం ఉంది.

బనూఖురైజా యూదులు ఒప్పందం ధిక్కరించిన వార్త విషయంలో నిజానిజాలు తెలుసుకొని రావడానికి దైవప్రవక్త (సల్లం) వెంటనే ఒక మనిషిని పంపించారు. అతను అక్కడికి పోయి చూస్తే యూదులంతా యుద్ధ సన్నాహాలు చేస్తూ ఉద్రేకంతో ఉరకలు వేస్తున్నారు. ఏ ఒక్కడూ అతని మాట ఆలకించేటట్లు కన్పించలేదు. అందరూ ఆయుధాలు, వాహనాలను సమకూర్చుకోవడంలో నిమగ్నులైపోయారు.

దైవప్రవక్త (స) మరో ఇద్దరు సాద్ బిన్ ఉబాదా, సాద్ బిద్ ముఆజ్ (రజి)లను కూడా పంపారు. సాద్ బిన్ ఉబాదా (రజి) ఖజ్రజ్‌తెగ నాయకులు. సాద్ బిన్ ముఆజ్ (రజి) ఔస్‌తెగ నాయకులు. ఈయనకు బనూఖురైజా యూదులతో కూడా సంబంధం ఉంది. అందువల్ల దైవప్రవక్త (స) వీరిద్దరిని పంపిస్తూ "వార్త నిజమే అయితే గప్‌చిప్‌గా వచ్చి నాకు చెప్పండి. బయటికి పొక్కితే ప్రజల్లో నిరుత్సాహం, అనాసక్తత ఏర్పడతాయి. వార్త నిజం కాకపోతే బహిరంగంగా ఎలుగెత్తి చెప్పండి" అని చెప్పారు.

వారిద్దరు బనూఖురైజా వాడలోకి పోతే వారికీ అదే పరిస్థితి ఎదురైంది. యూదులు ఒప్పందం అతిక్రమించి నమ్మకద్రోహానికి పాల్పడ్డారు. వారి నాయకుని వైఖరి మరీ సిగ్గుచేటుగా ఉంది. దైవప్రవక్త (స)ను బహిరంగంగా తూలనాడుతూ "ఎవరా దైవప్రవక్త? మాకూ ముహమ్మద్‌కు మధ్య ఎలాంటి ఒప్పందం లేదు" అని తెగేసి చెప్పాడు.

ప్రవక్త అనుచరులు అతని మాటలు విని రెచ్చిపోయారు. కాని ఏం చేయగలరు? పరిస్థితి చాలాక్లిష్టంగా ఉంది. అప్పటికే ఇద్దరు అనుచరులు బాగా రెచ్చిపోయి యూదులతో



కలబడే స్థితికి వచ్చారు. కాని హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ (రజి) మిత్రులిద్దరికీ నచ్చజెప్పి అదుపులో ఉంచారు. "అంతేకాదు, అంతకంటే ఎక్కువగానే మీతో మా సంబంధాలు తెగిపోయాయి" అంటూ ఈ ముగ్గురూ అక్కడ్నుంచి చరచరా వెళ్ళిపోయారు.

వారు ముగ్గురూ సైనిక స్థావరానికి చేరుకొని దైవప్రవక్త (స)కు పరిస్థితి రహస్యంగా నివేదించారు. కాని ఈ రహస్యం ఎంతో సేపు రహస్యంగా ఉండలేదు. కొన్ని క్షణాల్లోనే సైనికులందరికీ తెలిసిపోయింది. నగరమంతా అట్టుడికి పోయింది. ప్రజల హృదయాల్లో నిరాశాచీకట్లు ఆవరించాయి.

"కందకం అయితే బాగానే తయారుచేసుకున్నాం. కాని ఇప్పుడు దీనివల్ల ప్రయోజనం ఏమిటీ? యూదుల కోట వైపు నుంచి శత్రువులు దాడిచేయడానికి మార్గం ఏర్పడింది. ఇప్పుడేం చెయ్యాలి? మార్గాంతరం ఏమిటీ?" ఎవరినోట విన్నా ఇవే మాటలు.

శత్రువులు కందకం చుట్టూ చేరి కొత్తగా ఏర్పడిన దారిగుండా నగరంలో చొచ్చుకు రావడానికి ప్రయత్నిస్తున్నారు. ముస్లింలు వారిని ప్రతిఘటిస్తూ ప్రాణాలకు తెగించి పోరాడుతున్నారు. అదే స్థితిలో ముస్లింలు అనేక రోజులు పోరాడవలసి వచ్చింది.

అవి ముస్లింలకు కఠినాతి కఠినమైన రోజులు. ఆహారపదార్థాల కొరత తీవ్రంగా ఉంది. దానివల్ల ముస్లిం యోధులు కొందరు రెండేసి మూడేసి రోజులు పస్తులుండవలసి వస్తోంది. ఒక్కొక్క సారి ఆకలి బాధ భరించలేక వ్రేలాడపడి పోయేవారు.

వారి పరిస్థితి చూసి దైవప్రవక్త (సల్లం) ఆలోచనలో పడ్డారు. ఈ పరిస్థితి సైనికుల మనోస్థయిర్యాన్ని దెబ్బతీయవచ్చు. దీన్ని అధికమించాలంటే ఏం చెయ్యాలి? చివరికి ఒక ఉపాయం తట్టింది.

తక్షణమే ఆయన గత్ఫాన్ తెగవారి దగ్గరకు ఒక దూతను పంపిస్తూ "మీరు మాకు వ్యతిరేకంగా యుద్ధం చేయకుండా వెళ్ళిపోతే మదీనాలో పండే పంటలో మీకు మూడో వంతు పంటనిస్తాం" అని చెప్పారు. దానికి గత్ఫాన్ తెగవాళ్ళు ఎంతో సంతోషించారు. సరే, ఎందుకైనా మంచిదని ఆ విషయాన్ని ధృవపరచుకునేందుకు వారు దైవప్రవక్త (సల్లం) దగ్గరకు ఒక ప్రతినిధిని పంపించారు.

అయితే కథ అడ్డం తిరిగింది. వచ్చిన ప్రతినిధి మూడో వంతు పంటకు ఒప్పుకోలేదు. అర్థ పంట కావాలని పట్టుబట్టాడు. దైవప్రవక్త (సల్లం) ఓ క్షణం ఆలోచించి ఇదంతా చూస్తున్న అన్సార్ నాయకులు సాద్ బిన్ ముఆజ్, సాద్ బిన్ ఉబాదా (రజి)లను దగ్గరకు పిలిచి మీ అభిప్రాయం ఏమిటని అడిగారు.

"దైవప్రవక్తా! ఈ వ్యవహారం దైవాజ్ఞే గనక అయితే దీన్ని నిరాకరించడానికి మాకు ఎలాంటి అధికారం లేదు. మీరు ఎలా నిర్ణయించినా దాన్ని ఆమోదించడానికి, అమలు పరచడానికి మేము ఎల్లప్పుడూ సిద్ధమే. ఒకవేళ దైవాజ్ఞ కాకుండా నిర్ణయం తీసుకునే అధికారం మనకు ఉన్నట్లయితే మటుకు కొన్ని విషయాలు మీ ముందు నివేదించుకోవాలని ఉంది" అన్నారు హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ (రజి).

"ఇదంతా మీ శ్రేయస్సు కోసమే చేస్తున్నాను. ఈ విధంగా చేస్తే శత్రువుల బలం కొంతయినా తగ్గుతుందని నా అభిప్రాయం" అన్నారు దైవప్రవక్త (సల్లం).

"దైవప్రవక్తా! మేము అవిశ్వాసులుగా ఉన్నప్పుడే మా దగ్గర్నుంచి ఏ ఒక్కడూ సుంకం రూపేణ వీసమెత్తు వస్తువయినా తీసుకోలేక పోయాడు. ఇప్పుడు మేము మీ సహచర భాగ్యంతో ముస్లింలమై ఎంతో ఔన్నత్యం సంపాదించాము. అందువల్ల వారి కోసం ఇప్పుడు మా దగ్గర ఉన్నది ఖడ్గం ఒక్కటే" అన్నారు అనుచరులు ఆవేశంతో.

ధీర సహచరుల నోట వెలువడిన ఈ పరుష వచనాలు వినగానే దైవప్రవక్త (సల్లం) గత్ఫాన్‌తెగ బహుదైవారాధకులతో ఒప్పందం చేసుకోవడం మానుకున్నారు. తరువాత గత్ఫాన్‌తెగ ప్రతినిధిని వెనక్కి పంపి తృప్తిగా నిట్టూర్చారు.

## ధీరవనిత హజ్రత్ సఫియా (రజి)-(111)

అయితే యుద్ధం మలుపు తిరిగింది. బహుదైవారాధకుల సైన్యం నూతన ఉత్తేజంతో ముస్లింల మీదకు విజృంభించింది. నిన్నటిదాకా భయంతో బిక్కముఖాలు వేసుకున్న ఖురైష్ సైనికులకు ఈరోజు బనూఖురైజా యూదుల మద్దతు లభించడంతో ఎక్కడలేని ధైర్యం పుట్టుకొచ్చింది. కందకం వల్ల ఏర్పడిన భయం కాస్తా పోయింది. రక్తాన్ని గడ్డ కట్టించే చలి ఉన్నా ఖాతరు చేయకుండా పోరాడుతున్నారు. ముస్లింలు ఎటువైపు నుంచి కూడా బయటపడలేనంత పకడ్బందీగా ఖురైష్ సైనికులు వారిపై ఉధృతంగా బాణాలు కురిపిస్తున్నారు.

ముస్లింల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. నలువైపుల నుంచి ప్రమాదం ముంచుకొస్తోంది. భయాందోళనలతో ప్రాణాలు అరిచేతుల్లో పెట్టుకున్నారు. మరో వైపు యూదులు వచ్చిపడతారనే భయం కూడా వారిని రేయింబవళ్ళు పట్టి పీడిస్తోంది. స్త్రీలు, వృద్ధులు, పిల్లలు నగరంలోని కోటలో తలదాచుకున్నారు. అయినా నమ్మకద్రోహు లయిన యూదులు ఎప్పుడు ఏ హాని తలపెడ్తారోనన్న భయాందోళనలతో ముస్లింలు బిక్కుబిక్కు మంటూ గడుపుతున్నారు.

బనుఖురైజా యూదులు దొంగచాటుగా ముస్లింలపై దాడిచేయడానికి అవకాశం కోసం పొంచి చూస్తున్నారు. ఈ ఉద్దేశ్యంతోనే ఒక సైనికదళం రహస్యంగా బయలుదేరింది. వారి విద్రోహచర్యల్ని కనిపెట్టిన ముస్లింయోధులు వెంటాడి వారిని తరిమేశారు.

అయినప్పటికీ యూదులు తమ కుటిలయత్నాలు మానలేదు. మదీనాలో ముస్లిం స్త్రీలు, పిల్లలు, వృద్ధులు తలదాచుకున్న కోట పక్కనే యూదుల కోటలు కూడా ఉన్నాయి. ఈ సంగతి తెలుసుకున్న యూదులు సంతోషంతో ఎగిరి గంతేశారు.

"ముస్లిం సైనికులు ఖురైషీయులతో పోరాడుతున్నారు. అందువల్ల కోటలో వారి స్త్రీలు, పిల్లలు, తప్ప యుద్ధం చేయగలిగే పురుషులెవరూ ఉండకపోవచ్చు. కోటను ఆక్రమించుకోవడానికి ఇదే మంచి అవకాశం." ఈ ఆలోచన రాగానే యూదులు ఒక సైనికుడ్ని ముస్లింల కోట వైపు పంపారు.



ఆ సైనికుడు మెల్లగా కోట దగ్గరకు వెళ్ళాడు. కోట చుట్టూ తిరుగుతూ కోట లోపల పురుషయోధులు ఎవరైనా ఉన్నారా అని పరిశీలించసాగాడు.

కోట పకడ్బందీగా ఉంది. లోపల ఉన్న స్త్రీలకు, పిల్లలకు కాపలా కాయడానికి హజ్రత్ హస్సాన్ (రజి) నియమించబడ్డారు. కోటలో ప్రవక్త మేనత్త హజ్రత్ సఫియా (రజి) కూడా ఉన్నారు. కోట వెలుపల శత్రునీడ కన్పించగానే ఆమె భయపడ్డారు. హజ్రత్ హస్సాన్ (రజి)కు అటువైపు చూపిస్తూ ఇలా అన్నారు:

"చూశారు కదా శత్రువు మన కోట చుట్టూ ఎలా తిరుగుతున్నాడో? తక్షణమే వెళ్ళి అతని శిరస్సు ఖండించి రండి. ఆలస్యం చేస్తే అతను వెళ్ళిపోయి మనల్ని గురించిన సమాచారం శత్రువులకు చేరవేస్తాడు. అటు మన సైనికులు ఖురైషీయులతో యుద్ధంలో నిమగ్నులై ఉన్నారు. ఒకవేళ ఇతను తప్పించుకొనిపోతే మాత్రం మనం ప్రమాదంలో పడిపోతాం. త్వరగా బయలుదేరండి."

హజ్రత్ హస్సాన్ (రజి) సందిగ్ధంలో పడ్డారు. ఆయన ప్రఖ్యాత కవి. తన అసాధారణ కవితా పటిమతో దైవప్రవక్త (స) తరపున సత్యతిరస్కార కవుల నోళ్ళను కట్టిపడవేసేవారు. కాని ఖడ్గం చేపట్టాలంటే కొంచెం భయపడ్డారు. అందువల్ల క్షణంపాటు తటపటాయించి తన పిరికితనాన్ని బయట పెట్టుకోక తప్పలేదు.

"అబ్దుల్ ముత్తలిబ్ కూతురా! నన్ను పరీక్షించకు. నేనీ పనికి తగనని నీకు తెలుసు కదా!" అన్నారు ఆయన.

హజ్రత్ సఫియా (రజి)కు మరోమార్గం కన్పించలేదు. ప్రమాద ఘడియ దగ్గర పడుతోంది. గత్యంతరంలేక తానే ఓ శిబిరం గుంజ పీకి బయటకు వెళ్ళారు. చప్పుడు చేయకుండా శత్రువు వెనకాలగా పోయి గుంజతో అతని తల మీద బలంగా ఒక దెబ్బ వేశారు. ఆ దెబ్బకు తల పుచ్చకాయలా పగిలిపోయి శత్రువు నేలకొరిగాడు.

తరువాత హజ్రత్ సఫియా (రజి) కోటలోకి తిరిగొచ్చి "శత్రువు చచ్చిపోయాడు. ఇప్పుడైనా వెళ్ళిరండి. అతను పురుషుడైనందున నేను తాకడం సమంజసంకాదు. మీరెళ్ళి అతని ఆయుధాలు, దుస్తులు తీసి పట్రండి" అని చెప్పారు.

"పోనివమ్మా! నాకు వాటి అవసరం లేదు" అన్నారు హజ్రత్ హస్సాన్ (రజి) పోవడానికి సాహసించలేక.

"సరే, కనీసం అతని శిరస్సునైనా కోసిపారేయండి. దాన్ని చూసి యూదులు హడలి పోతారు" హజ్రత్ సఫియా (రజి) మళ్ళీ పురమాయించారు.

కాని హజ్రత్ హస్సాన్ (రజి) దానికీ సిద్ధం కాలేకపోయారు. చేసేదిలేక హజ్రత్ సఫియా (రజి)యే మళ్ళీ బయటికి పోవలసి వచ్చింది.

ఆమె వెళ్ళి శత్రువు తల ఖండించి దూరంగా విసిరివచ్చారు. బనూఖురైజా యూదులు తమ సైనికుడి శిరస్సు చూసి కోటలో కూడా సైనికులున్నారని భావించారు. అందువల్ల వారు ముస్లింల కోటపై దాడిచేయడానికి సాహసించలేక పోయారు.

# అవకాశవాదులు-(112)

అయినప్పటికీ ముస్లింల పరిస్థితి రోజులు గడుస్తున్న కొద్దీ విషమిస్తూ పోతోంది. ఆహారపదార్థాలు నిండుకోవడంతో అనేకమంది ఆకలిబాధతో అలమటిస్తున్నారు. కందకం ఆవల శత్రువులు సందు దొరికితే దూకివచ్చి దాడిచేయడానికి కాచుకొని ఉన్నారు. అంచేత యోధులు కళ్ళలో వత్తులు వేసుకొని అహర్నిశలూ కాపలా కాయవలసి వస్తోంది.

వీటన్నిటికి తోడు ముస్లిం సైన్యంలో కపటవిశ్వాసుల రూపంలో మరో ప్రమాదం పొంచిఉంది. ఈ దుర్మార్గులు ఇలాంటి క్లిష్ట పరిస్థితిలో ముస్లింలతో ఎలా సహకరిస్తారు? యుద్ధం నుంచి తప్పుకోవడానికి వాతావరణం ఇప్పుడు వారికి అనుకూలంగా ఉంది. వారు పరస్పరం కూడబలుక్కొని దైవప్రవక్త (సల్లం) దగ్గరకు వచ్చారు.

"అయ్యా! మా ఇళ్ళు భద్రంగా లేవు. మా భార్యాపిల్లలు అపాయకర స్థితిలో ఉన్నారు. నగరం పోవడానికి మాకు అనుమతివ్వండి" అంటూ రకరకాల సాకులు చెప్పసాగారు.

దైవప్రవక్త (స) వారి సాకులను గురించి ఆరాతీయకుండా ఇండ్లకు వెళ్ళిపోవడానికి వారికి అనుమతి ఇచ్చారు.

కాని ఆ దుర్మార్గులు అంతటితో తృప్తిచెందకుండా, తాము యుద్ధం నుంచి తప్పుకోవడమేగాక ముస్లింలను కూడా పురిగొల్పసాగారు. కల్లబొల్లి మాటలతో వారిని భయపెట్టేవారు. దైవప్రవక్త (స)ను గురించి సందేహాస్పదమైన మాటలు పలికేవారు:

"ముహమ్మద్ మనకు బాగా నూరిపోశాడు. అదిగో సిరిసంపదలు వచ్చిపడుతున్నాయి; ఇదిగో రోమ్, ఈరాన్ దేశాల నుంచి మణిమాణిక్యాలు ఊడిపడుతున్నాయి అన్నాడు. కాని ఇక్కడ పరిస్థితి చూస్తే ఏదైనా అవసరమొచ్చి నగరంలోకి పోవాలన్నా ప్రాణాంతకంగా ఉంది" అన్నారు కపటవిశ్వాసులు.

"కపటులు, హృదయాల్లో రోగమున్నవారిని గురించి ఆలోచించండి. వారు (తమ కాపట్య రోగాన్ని బయటపెట్టుకుంటూ) 'దేవుడు, దైవప్రవక్త చేసిన వాగ్దానాలన్నీ బూటకం, మోసం తప్ప మరేమీ లేదు' అని తెగేసి చెప్పారు. వారిలో కొందరు (ఈ అగ్నికి ఆజ్యం పోస్తూ) 'యస్రిబ్ (మదీనా)వాసులారా! ఇక మీరిక్కడుండే అవకాశం సన్నగిల్లి పోయింది. (ఇక్కడుండటం ఏమాత్రం క్షేమం కాదు.) వెనక్కి మరలండి' అని అన్నారు."

"వారిలో ఒక వర్గం 'మాఇళ్ళు ప్రమాదంలో చిక్కుకున్నాయి' అంటూ వెళ్ళిపోవడానికి ప్రవక్తను అనుమతి అడిగింది. నిజానికి వారి ఇళ్ళు ఎలాంటి ప్రమాదంలో చిక్కుకోలేదు. వారసలు (యుద్ధరంగం నుండి) పారిపోదలిచారు."

"ఒకవేళ నగరం నలువైపుల నుండి శత్రువులు లోపలికి చొచ్చుకొనివస్తే, అప్పుడీ కపటులు అరాచకం సృష్టించడానికి పిలిస్తే వెంటనే వీరు ఆ రంగంలోకి దూకుతారు. ఆ సంక్షోభంలో చేరి దాన్ని ఎగదోయడానికి వీరు ఏమాత్రం వెనకాడరు. గతంలో వారు (యుద్ధ రంగం నుండి) పారిపోమని దేవుని సన్నిధిలో ప్రమాణం చేశారు. దేవుని సన్నిధిలో చేసిన ప్రమాణం గురించి (వారిని) తప్పకుండా నిలదీయడం జరుగుతుంది."



"ప్రవక్తా! ఇలా చెప్పెయ్యి: 'మృత్యువు లేక వధ నుండి పారిపోతే, ఈ పారిపోవడం మీకు ఎలాంటి ప్రయోజనం కలిగించదు. ఆ తర్వాత జీవితసౌఖ్యాలు జుర్రుకోవడానికి మీకు కొంచెం మాత్రమే అవకాశం లభిస్తుంది.' వారినిలా అడుగు: 'దేవుడు మీకు నష్టం కలిగించ దలచుకుంటే ఆయన పట్టునుండి మిమ్మల్ని ఎవరు కాపాడగలరు? ఒకవేళ దేవుడే మిమ్మల్ని అనుగ్రహించదలిస్తే ఆయన అనుగ్రహాన్ని ఎవరు అడ్డుకోగలరు?' దేవునికి వ్యతిరేకంగా వీరికి ఎలాంటి సంరక్షకుడూ, సహాయకుడూ లభించడు."

"మీలో ఆటంకాలు సృష్టించేవారెవరో దేవునికి బాగాతెలుసు. వారు తమ సోదరులతో '(ఇక ఆ ప్రవక్తను వదిలేసి) మా దగ్గరకు వచ్చేయండి' అంటారు. ఒకవేళ వారు యుద్ధంలో పాల్గొన్నా నామమాత్రంగా పాల్గొంటారు. పైగా మీకు తోడ్పడటంలో పిసినారితనం వహిస్తారు. ప్రమాదం వచ్చిపడినప్పుడు చచ్చిపోయేవాడు గుడ్లు తేలవేసినట్లు వారు నీవైపు నిలువుగుడ్లు వేసి చూస్తారు. అయితే ఆ ప్రమాదం తప్పిపోగానే లాభాల పేరాశతో రంకెలు వేసుకుంటూ మీదగ్గరకు వస్తారు. వీరసలు (సత్యాన్ని) విశ్వసించనే లేదు. అందుకే దేవుడు వారి కర్మలన్నిటిని వ్యర్థం చేశాడు. ఇలా చేయడం ఆయనకు చాలా తేలిక." (ఖుర్ఆన్-33:13-19)

కపటవిశ్వాసుల పరిస్థితి ఇక్కడ ఈ విధంగా ఉంటే, మరోవైపు బహుదైవారాధకులు తమల్ని ఆదుకోవడానికి యూదులు ఎప్పుడొస్తారా అని తీవ్రంగా ఎదురుచూస్తున్నారు. వారు తమకోటల గుండా దారి ఎప్పుడిస్తారు, ఆ దారిగుండా వెళ్ళి మదీనాపై దాడిచేసి తమ దుష్టకోర్కెలను ఎప్పుడు నెరవేర్చుకుందామా అని అదను కోసం కాచుకొని ఉన్నారు.

# అగడ్తలో పడ్డ అవిశ్వాసులు-(113)

మదీనా చుట్టూ త్రవ్విన కందకం ఒకచోట వెడల్పు కొంచెం తక్కువగా ఉంది. భద్రతాఏర్పాట్లు కూడా ఏమంత కట్టుదిట్టంగా లేవు. ఈ సంగతి గమనించిన అవిశ్వాసులకు రొట్టెవిరిగి నేతిలో పడినట్లయింది. అటు నుండి దాడిచేయడమే అన్నివిధాలా బాగుంటుందని భావించారు. ఇంకేముంది, శత్రుసైనికుల్లో అమితోత్సాహం పెల్లుబికింది.

ముందుగా ఆరితేరిన కొందరు వీరాధివీరులు కత్తులు సిద్ధంచేసుకొని, హుషారైన గుర్రాలు ఎక్కి కందకాన్ని అవలీలగా దాటగలిగారు. దాంతో వారి ఆనందం అవధులు దాటింది. ఇక విజయం తమదేనన్న భావనతో రొమ్ములు విరుచుకుంటూ ముస్లిం సైనికుల్ని సమీపించారు.

వారిలో అబూజహల్ కొడుకు ఇక్రమాతో పాటు, యావత్తు అరేబియాలోనే పేరు మోసిన యోధానయోధుడు అమ్ర్ బిన్ అబ్దెఉన్ కూడా ఉన్నాడు. అతను వేయి అశ్వశక్తి గల బలాఢ్యుడని ప్రతీతి. ముస్లింలను ఎదుర్కోవడానికి మొదట అతనే ముందుకు వచ్చాడు. దైవప్రవక్త (సల్లం), ఆయన అనుచరులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రశాంతంగా శత్రువుల్ని గమనిస్తున్నారు.

అమ్ర్ మదపుటేనుగులా ఘీంకరిస్తూ "ముస్లిం సైనికులారా! నన్నెదుర్కోగల ధీరులు మీలో ఎవరైనా ఉన్నారా?" అని సవాలు విసిరాడు.

తక్షణమే హజ్రత్ అలి (రజి) ముందుకొచ్చి "నేనున్నాను" అన్నారు.

దైవప్రవక్త (సల్లం) అలి (రజి) వైపు తిరిగి "వద్దు కూర్చో" అన్నారు.

అమ్రొతో పోటీకి దిగడానికి ఇంకెవరికీ ధైర్యం చాల్లేదు. అతను మళ్ళీ ముస్లిం యోధులకు సవాలు విసిరాడు. సమాధానంగా హజ్రత్ అలి (రజి) ఈసారి కూడా ముందుకు వచ్చి 'నేనున్నాను' అన్నారు. కాని దైవప్రవక్త (సల్లం) ఆయన్ని వారించారు.

అమ్ర్ తనను ఎదుర్కొనేవారెవరూ ఇక్కడ లేరనే తలంపుతో "నన్ను ఎదుర్కొనే ధీరుడు ఒక్కడూ లేడా మీలో" అన్నాడు రెట్టింపు స్వరంతో.

అలి (రజి) మూడవ సారి కూడా ముందుకొచ్చి "లేకేమి? నేనున్నాను" అన్నారు.

"అలీ! ఇతను అమ్ర్ అన్న సంగతి నీకు తెలుసా?" దైవప్రవక్త (సల్లం) అలి (రజి) వైపు సూటిగా చూస్తూ అడిగారు.

"తెలుసు. ఇతను సుప్రసిద్ధ యోధుడయిన అమ్ర్ అని నాకు బాగా తెలుసు."

"అయితే నీవిప్పుడు అమ్రొతో పోటీకి దిగవచ్చు.' దైవప్రవక్త (స) అనుమతిచ్చారు.

దైవప్రవక్త (సల్లం) తన పవిత్ర హస్తాలతో అలి (రజి) చేతికి ఖడ్గం అందించారు. తలపై పాగా పెట్టారు. అప్పుడు హజ్రత్ అలి (రజి) పోటీకి సిద్ధమయి అమ్ర్ ముందుకు వచ్చారు. అమ్ర్ హజ్రత్ అలీ (రజి)ని చూసి విరగబడి నవ్వాడు.

"కుమారా! నువ్వా నాతో తలపడేది! నిన్ను వధించడానికి నా మనస్సు అంగీకరించడం లేదు" అన్నాడతను నవ్వాపుకుంటూ.

"కాని నిన్ను వధించడానికి నా మనస్సు అంగీకరిస్తోంది" అన్నారు అలి (రజి).

ఈ మాటలు అమ్ర్ హృదయానికి శూలాల్లా గుచ్చుకున్నాయి. అతను దెబ్బతిన్న బెబ్బులిలా చివాలున ముందుకు లంఘించి కత్తితో బలంగా ఒక్క వ్రేటు వేశాడు.

అకస్మాత్తుగా మీద పడిన ఈ దెబ్బను హజ్రత్ అలి (రజి) చాకచక్యంగా డాలుతో నిరోధించి తృటిలో తప్పించుకున్నారు. అలా తప్పించుకుంటూనే రెండో చేతిలో ఉన్న ఖడ్గంతో లాగి ఒక్కవ్రేటు వేశారు. అంతే, ఆ దెబ్బకు అంతలావు పహిల్వాన్ మ్రానులా కూలిపడ్డాడు. రెండుక్షణాలకు ముందు వికటాట్టహాసం చేస్తూ ప్రగల్భాలు పలికిన ఖురైష్ వీరుడు ఒకేఒక దెబ్బతో ఊపిరివిడిచి రక్తపు మడుగులో పడిపోయాడు.

"అల్లాహుఅక్బర్" నినాదాలు మిన్నుముట్టాయి. విజయ ప్రకటన గావిస్తూ ముస్లిం యోధులు హర్షధ్వానాలు చేశారు. ఆ తరువాత అమ్రొతో పాటు వచ్చిన ఖురైష్ సైనికులు కూడా కాస్సేపు పెనుగులాడి ఆ తరువాత వెన్నుజూపి పారిపోయారు.

ఈ దాడిలో శత్రువులు ఓటమి చవిచూసినా అంత పెద్ద కందకం దాటగలిగారంటే పెద్ద విశేషమనే చెప్పాలి. అదే వారి మనోస్థయిర్యాన్ని ద్విగుణీకృతం చేసింది. ఆ ధైర్యమే ఇతర యోధుల్ని ప్రాణాలతో చెలగాటమాడటానికి ప్రేరేపించింది. ఎలాగైనాసరే ఈరోజు కందకం దాటితీరాలని నిశ్చయించుకున్నారు వారంతా.



సూర్యాస్తమయమయింది. చూస్తుండగానే చీకట్లు ఆవరించాయి. బహుదైవారాధకుల సేనల నుంచి ఒక సైనికదళం బయలుదేరింది.

సైనిక దళాధిపతి నౌఫల్ ముందున్నాడు. అశ్వరూఢులైన ఈ సైనికదళం కందకం దగ్గరకు చేరుకుంది. మొదట దళాధిపతి కందకం దాటి అనుచరులకు ఆదర్శప్రాయుడు కావాలని నిర్ణయించుకున్నాడు. అందువల్ల నౌఫల్ గట్టు మీదికెళ్ళి అగడ్త ఎంత వెడల్పు ఉందో ఓసారి చూసుకున్నాడు. తరువాత కొంత వెనక్కి వచ్చి గుర్రాన్ని అదిలించి ఒక్క దూకు దూకించాడు.

అత్యంత ప్రతిభాశాలి అయిన ఈ ధీరుడు ఒక్క కుదుపుకు అశ్వంతో పాటు ఆకాశానికి ఎగిరాడు. కాని అక్కడ్నుంచి అమాంతం అగడ్తలోకి పల్టీకొట్టి బోర్లాపడ్డాడు. దాంతో అతని తల పుచ్చకాయలా బ్రద్దలయి పోయింది.

అనుచరులంతా నిశ్చేష్టులయ్యారు. క్షణంపాటు ఆలోచనలో పడ్డారు. నాయకుడి పర్యవసానం కళ్ళారా చూశారు. దుస్సాహసానికి పాల్పడితే తమక్కూడా అదే గతి పడ్తుందని భావించారు. వెంటనే తోకలు ముడిచి కాళ్ళకు బుద్ధిచెప్పారు.

సైన్యాధ్యక్షుడు అబూసుఫ్యాన్కు ఈ విషయం తెలిసి ఎంతో విచారించాడు. నౌఫల్ మృతదేహం ఇచ్చివేస్తే దానికి బదులు వంద ఒంటెలు ఇస్తామని ముస్లింలకు కబురు చేశాడు. ఈ కబురు అందుకున్న దైవప్రవక్త (సల్లం) ఇలా సమాధానమిచ్చారు:

"తీసికెళ్ళండి. మీ సైనికుడి మృతదేహాన్ని, రక్తపరిహారంగా ఇవ్వజూపుతున్న మీ ఒంటెలు మాకవసరం లేదు. మీ సైనికుడి మృతదేహం కూడా అపవిత్రమైనదే, దాని రక్త పరిహారం కూడా అపవిత్రమైనదే."

అవిశ్వాసులు కందకంలో నుంచి నౌఫల్ మృతదేహం బయటికి తీసి తమ శిబిరానికి మోసుకెళ్ళారు. ఇంత జరిగినా వారు తమ ప్రయత్నాలు మానుకోలేదు. రేయింబవళ్ళూ కందకం దాటడానికి తీవ్రంగా ప్రయత్నిస్తూనే ఉన్నారు. దాని కోసం కొన్ని ప్రత్యేక సైనిక దళాలను కూడా తయారు చేసుకున్నారు. ఈ దళాలు కందకం దాటడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి.

యుద్ధం తీవ్రరూపం దాల్చింది. కదనరంగం భయానకంగా మారింది. ఖురైష్ విలుకాండ్రు కందకం చుట్టూ నిలబడి బీరుపోకుండా బాణాలు వదలుతున్నారు. ముస్లింలు ఎదురుదాడి చేస్తూనే ఉన్నారు. శత్రువుల ధాటిని ఎదుర్కోవడానికి ఎంతో శ్రమ పడవలసి వస్తోంది. అసలే ఆకలితో ఉండటం వల్ల ఎదురుదాడిలో ముస్లింయోధులు చాలా అలసిపోయారు. వారి పరిస్థితి దయనీయంగా ఉంది. కాని మనోస్థయిర్యం సన్నగిల్లలేదు. పర్వతశ్రేణుల్లా తమ స్థానాల్లో స్థిరంగా నిలబడి యుద్ధం చేస్తున్నారు.

రెండు పక్షాల మధ్య దాటలేనంత పెద్ద కందకం ఉండటం వల్ల కత్తి యుద్ధం సాధ్యపడలేదు. అందువల్ల ప్రాణనష్టం కూడా ఎక్కువ సంభవిస్తున్నట్లు కనపడటంలేదు. అయితే అనేకమందికి గాయాలవుతున్నాయి. కాళ్ళు తెగినవారు, చేతులు విరిగినవారు, పళ్ళు ఊడినవారు రక్తసిక్తమయి హాహాకారాలు చేస్తున్నారు.

ఔస్‌తెగ ముస్లింల నాయకుడు హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ (రజి) కూడా విల్లు ఎక్కుపెట్టి బాణాలు కురిపిస్తున్నారు. కాస్సేపటికి కందకం ఆవల ఒక శత్రువు మాటుకాచి సాద్ (రజి) వైపు గురిపెట్టి బాణం వదిలాడు. దాంతో సాద్ (రజి) తీవ్రంగా గాయపడ్డారు. బాధతో మెలికలు తిరుగుతూ అక్కడ్నుంచి పక్కకు తప్పుకున్నారు.

కారుతున్న రక్తధారలతో అప్రయత్నంగా చేతులు జోడించి పైకెత్తారు. సకల చరాచరాల సృష్టికర్త, పరమ కృపాశీలుడయిన విశ్వప్రభువు ముందు అంతరంగం నుండి పొంగిన ఆవేదనా తరంగిణి జాలువారింది....

"నా దైవమా! ఖురైషీయులతో ఇంకా యుద్ధం కొనసాగించవలసి ఉంటే నన్నింకా సజీవంగా ఉంచు. ఏ జాతి జనం నీ ప్రవక్తను తిరస్కరించి దేశబహిష్కరణ చేశారో అలాంటివారితో తప్ప నాకు మరొకరితో యుద్ధం చేయాలన్న కోరిక లేదు. అయితే ఖురైషీయులతో ఇప్పుడు యుద్ధం ముగిసిపోతే, అది జరగకపోతే నాకు ఈ గాయంతోనే అమరగతి భాగ్యం ప్రసాదించు. అలా కాకపోతే బనూఖురైజా తెగ వల్ల నానేత్రాలు చల్లబడనంతవరకూ నాకు చావునివ్వకు."

బనూఖురైజా యూదులు ముస్లిములతో చేసుకున్న స్నేహఒప్పందం భంగం చేసి ఉండకపోతే ముస్లిం ముజాహిద్‌లకు ఇంతటి ప్రమాదకర పరిస్థితి ఎదురయ్యేది కాదు. యూదులు కనీసం ఖురైష్ సైనికులతో చేతులు కలపకపోయినా పరిస్థితి ఇంత దారుణంగా విషమించేది కాదు.

కాని ఇప్పుడీ క్లిష్ట పరిస్థితిని ఎలా అధిగమించడం? ముస్లింలు సంకట స్థితిలో పడి తల్లడిల్లి పోతున్నారు. ఒక్కొక్కఘడియ ఒక్కొక్క యుగంలా గడిచిపోతోంది. అనుక్షణం భయాందోళనలతో గడపవలసి వస్తోంది. రేయింబవళ్ళూ రెప్ప వాల్చకుండా కందకాన్ని కాపలా కాయవలసివస్తోంది. నిద్రలేమికి కళ్ళు తిరుగుతున్నాయి. క్షణక్షణానికి తీవ్రరూపం దాల్చుతున్న కదనరంగం చూసి గుండెలు గొంతుల్లోకి వస్తున్నాయి.

"ఆ సమయంలో మీరు ఏం చేస్తుండేవారో దేవుడు ఓ కంట గమనిస్తుండేవాడు. వారు మీపైకి క్రిందినుంచి, పైనుంచి దాడి చేయడానికి వచ్చారు. (అది అతిక్లిష్ట పరిస్థితి.) అప్పుడు జనం భయంతో కళ్ళు తేలవేశారు. వారి గుండెలు దడదడ కొట్టుకోసాగాయి. దేవుని విషయంలో మీరు రకరకాలుగా అనుమానించసాగారు. అప్పుడు విశ్వాసులు కఠినాతి కఠినమయిన పరీక్షకు గురయిపోయారు; ఘోరాతిఘోరంగా కుదిపివేయబడ్డారు." (దివ్యఖుర్‌ఆన్-33:10,11)

## దేవుని సహాయం-(114)

అలాంటి క్లిష్ట సమయంలో గత్ఫాన్ తెగకు చెందిన నయీమ్ బిన్ మస్‌వూద్ అనే ఓ ఆసామి దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చాడు. ప్రవక్త అనుచరులు ఆశ్చర్యంతో ఆ కొత్త వ్యక్తి వైపు చూడసాగారు.

"దైవప్రవక్తా! అల్లాహ్ దయవల్ల నేను ముస్లిం అయ్యాను. అయితే నేను ఇస్లాం స్వీకరించిన సంగతి ఇంకా ఎవరికీ తెలియదు. అంచేత మీరు తలచుకున్న విధంగా



నన్ను వినియోగించుకోండి. మీ ఆజ్ఞ శిరసావహించడానికి నేను సిద్ధంగా ఉన్నాను" అన్నాడతను ఎంతో ఉత్సాహంతో.

"చాలా సంతోషం, నయీమ్! మీరొక్కరే కదా? ఈ పరిస్థితిలో మీకు తోచినట్లు చేసి ఈ ఆపదను దూరం చేయండి. మీరేం చేయాలనుకున్నా దానికి నేను అనుమతి ఇస్తున్నాను" అన్నారు దైవప్రవక్త (స).

నయీమ్ బిన్ మస్‌వూద్ (రజి) ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) దగ్గర సెలవు తీసుకొని అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

"అయితే ఇప్పుడు ఎక్కడికెళ్ళాలి? ఏం చెయ్యాలి? శత్రువుల దుష్టయత్నాలను ఎలా వమ్ముచేయాలి? వారిని ఓడించడానికి నావంతు ప్రయత్నం ఏమిటి? ఎలాంటి పథకం రూపొందించాలి?" ఇలా అనేకవిధాల ఆలోచించారు నయీమ్ (రజి). చివరికి మెరుపులాంటి ఒక ఉపాయం తట్టింది. మంచి పథకమే! కళ్ళు మెరిశాయి. వెంటనే ఆయన కార్యాచరణకు ఉపక్రమించి బనూఖురైజా యూదులవాడకు దారితీశారు.

హజ్రత్ నయీమ్ (రజి)కు బనూఖురైజా తెగలో మంచి పలుకుబడి ఉంది. ఆ తెగవాళ్ళు నయీమ్ సహచర్యం లభించడమే గొప్ప భాగ్యమని తలుస్తారు. అందువల్ల ఆయన ఆ వాడలో అడుగు పెట్టగానే బనూఖురైజా పెద్దలు ఎదురెళ్ళి చిరునవ్వుతో స్వాగతమిచ్చారు. అతిథి గృహానికి తీసికెళ్ళి రాచమర్యాదలు చేశారు. యోగక్షేమాలు విచారించి ప్రత్యేక ఆసనం మీద కూర్చోబెట్టారు.

హజ్రత్ నయీమ్ (రజి) వారి ఆతిథ్యానికి, గౌరవమర్యాదలకు కృతజ్ఞతలు చెప్పారు. ఆతర్వాత ఆయన దేశ పరిస్థితులను గురించి, వ్యాపారవ్యవహారాలను గురించి ఎంతో ఆసక్తికరమైన కబుర్లు చెప్పనారంభించారు. మరికొందరు పెద్దలు, చిరుపెద్దలు కూడా వచ్చి చుట్టూ గుమికూడారు. మాటామంతీ అయ్యాక ఆయన అసలు విషయానికి వచ్చారు.

"మిత్రులారా! ఈ తెగతో నాకు ఎంత సన్నిహిత సంబంధం ఉందో మీకు తెలుసు కదా! ప్రత్యేకించి మీ పట్ల నాకున్న ప్రేమాభిమానాలు వేరే చెప్పాలా?" మొదటి బాణం సంధించారు ఆయన.

"ఔనౌను. ఆ విషయం మాకెందుకు తెలియదూ? మీరు మొదటి నుంచీ మాకు మంచి శ్రేయోభిలాషులే" ముక్తకంఠంతో అన్నారు యూదనాయకులంతా.

"మీరు ముహమ్మద్ (స)తో చేసుకున్న స్నేహఒప్పందం భంగపరచి ఖురైష్, గత్ఫాన్ తెగలతో చేతులు కలిపారని విన్నాను. కాని ఆ తెగలవాళ్ళు సుదీర్ఘ ముట్టడితో ఇప్పటికే బాగా అలసిపోయినట్లు కన్పిస్తున్నారు. మనం గెలిస్తే అంతకన్నా అదృష్టం మరొకటి ఉండదు. కాని దురదృష్టవశాత్తు ఓడిపోతే? అప్పుడేం చేస్తారు? ఖురైషీయులు మాత్రం చల్లగా జారుకుంటారు. మీరు ఒంటరిగా మిగిలిపోతారు. చివరికి మీరొక్కరే ముస్లింలను ఎదుర్కోవలసి ఉంటుంది. అప్పుడు మీరు ఘోరమైన ప్రమాదంలో పడిపోతారు. ఇదివరకు బనూఖైనుఖా, బనూనజీర్ తెగలకు పట్టిన గతి మీకు తెలుసు. అందుకని బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోండి" రెండవ బాణం సంధించారు హజ్రత్ నయీమ్ (రజి).

"అయితే ఇప్పుడేం చెయ్యమంటారు? మీరే ఏదైనా ఉపాయం చెప్పండి" అన్నారు యూద నాయకులు ఆదుర్దాగా.

"ఇప్పుడీ ప్రమాదం నుండి బయటపడటానికి ఒకేఒక మార్గం ఉంది. మొదట వారి మనుషులు కొందరిని మీదగ్గర తాకట్టు పెట్టమనండి. ఆ తర్వాత వారితో చేరిపోండి. ఆ మనుషులు కూడా ప్రముఖ వ్యక్తులై ఉండాలి. ఇలా అయితే మీకూ తృప్తి ఉంటుంది. వారు కూడా ముహమ్మద్‌ని చంపేవరకు వెనక్కి తిరిగిపోయే మాటెత్తరు."

హజ్రత్ నయీమ్ (రజి) ఇచ్చిన సలహా విని అందరూ సంతోషం వెలిబుచ్చారు.

"చాలా బాగుంది మీ అభిప్రాయం. మీ సలహా తప్పకుండా పాటిస్తాం" అన్నారు అందరూ సంతోషం వెలిబుచ్చుతూ.

"మరి నే వెళ్ళొస్తా. జాగ్రత్త, ఈ విషయం ఎవరికీ తెలియకూడదు సుమా!"

"అబ్బే! ఆమాత్రం మాకు తెలియదటండీ? అదంతా మేము చూసుకుంటాంగా. మీరు నిశ్చింతగా వెళ్ళిరండి" అన్నారు యూదనాయకులు నయీమ్ (రజి)ని సాగనంపుతూ.

"నయీమ్ ఎంత మంచివాడు! మన యోగక్షేమాలంటే ఎంత శ్రద్ధ! మన కోసం పని కట్టుకొని మరీ ఇంతదూరం వచ్చాడు! ఎంత ప్రేమ! ఎంత అభిమానం!!" మరికొందరు తెగ పొగుడుతూ నయీమ్ (రజి)ని వాడ వెలుపలదాకా సాగనంపి వచ్చారు.

హజ్రత్ నయీమ్ (రజి) లోలోన సంతోషిస్తూ ఖురైష్ నాయకుడు అబూసుఫ్యాన్ దగ్గరకి వెళ్ళారు. అక్కడ అబూసుఫ్యాన్‌తో పాటు మరికొందరు నాయకులు కూడా ఉన్నారు. నయీమ్ (రజి)ని చూడగానే వారంతా సాదరంగా ఆహ్వానించారు. కుశల ప్రశ్నలయ్యాక హజ్రత్ నయీమ్ (రజి) విషయాన్ని మెల్లగా బయటపెట్టారు.

"సోదరులారా! మీపట్ల నాకున్న ప్రేమాభిమానాలు గురించి ప్రత్యేకించి చెప్ప నవసరం లేదనుకుంటాను" అన్నారు ఆయన.

"అరెరె ఎంతమాట! మీరు మా శ్రేయోభిలాషులన్న సంగతి మాకు తెలియదటండీ!" అన్నారు అబూసుఫ్యాన్‌తో సహా కొందరు ఉన్నతాధికారులు.

"ఈమధ్యనే నాకో సంగతి తెలిసింది. అది కాస్తా మీ చెవిన పడేస్తే మీ శ్రేయోభిలాషిగా నా బాధ్యత తీర్చుకున్నట్లవుతుందని వచ్చాను" అన్నారు నయీమ్ (రజి).

"అలాగా! ఏమిటా సంగతి?" అడిగారు అంతా ఒక్కసారిగా ఆత్రంతో.

"బనూఖురైజా తెగవాళ్ళు ముహమ్మద్ (సల్లం)తో చేసుకున్న ఒప్పందాన్ని భంగంచేసి పశ్చాత్తాపం చెందుతున్నారని విన్నాను" చెప్పారు హజ్రత్ నయీమ్ (రజి).

"నిజమా!?" అన్నారు ఖురైషీయులు నిర్ఘాంతపోయి చూస్తూ.

"కాని వారంతటితో ఊరుకోలేదు. ముహమ్మద్ (స) తమతో పాత ఒప్పందానికి మళ్ళీ ఇష్టపడితే ఖురైష్, గత్ఫాన్ తెగలకు చెందిన కొందరు మనుషుల్ని అప్పగిస్తాం అని, ఆయన వారిని వధించి పగ తీర్చుకోవచ్చని ఆయన దగ్గరికి రాజీధోరణి విజ్ఞప్తిని



కూడా పంపుకున్నారట. ఆ మనుషులు కూడా సాధారణ మనుషులు కాదట! ప్రముఖ వ్యక్తుల్ని అప్పగిస్తారట!!" అన్నారు హజ్రత్ నయీమ్ (రజి) ఆఖరి బాణం సంధిస్తూ.

"ఎంత దుర్మార్గులు! ఎంత నమ్మక ద్రోహులు!!" కోపంతో చిందులు తొక్కారు ఖురైష్ నాయకులు.

"సోదరులారా! విన్నారు కదా? జాగ్రత్త! మీ శ్రేయస్సు కోరి చెబుతున్నాను. వారెన్ని సాకులు చెప్పినా మీరు మాత్రం వారికి మీ మనుషుల్ని అప్పగించకండి. మరచి కూడా అలా చేయకూడదు సుమా!!" అన్నారు హజ్రత్ నయీమ్ (రజి).

"ఇంకా ఆ దుర్మార్గుల దగ్గరికి మా మనుషుల్ని పంపిస్తామా? నిజంగా మీరు మా శ్రేయోభిలాషులు. మీరే గనక ఈ సమయంలో ఈవార్త తెలియజేసి ఆదుకోకపోతే మేమెంతో ప్రమాదంలో పడేవాళ్ళం" ఖురైషీయుల్లో కృతజ్ఞతా భావం తొంగిచూసింది.

హజ్రత్ నయీమ్ (రజి) అక్కడ్నుంచి బయలుదేరి గత్ఫాన్ తెగవాళ్ళ దగ్గరికి వెళ్ళారు. ఖురైషీయుల దగ్గర ఏ మాటలైతే చెప్పారో ఇక్కడ కూడా ఆయన అవే మాటలు చెప్పారు. ఈ మాటలు విని గత్ఫాన్ తెగ నాయకులు కూడా యూదుల్ని అసహ్యించుకొని తరువాత నయీమ్ (రజి)ని తమ శ్రేయోభిలాషిగా భావించి శ్లాఘించారు.

ఆ తరువాత హజ్రత్ నయీమ్ (రజి) విజయోత్సాహంతో దైవప్రవక్త (స) సన్నిధికి తిరిగొచ్చారు. తాను చేసివచ్చిన పని గురించి ఆయనకు నివేదిక సమర్పించారు.

నయీమ్ (రజి) మాటలకు అటు ఖురైష్ నాయకులు, ఇటు గత్ఫాన్ నాయకులు ఉభయులూ భయపడ్డారు. తక్షణమే ఉభయతెగల నాయకులు సమావేశమయ్యారు.

"ఏమిటీ వింత? మనం ఆశించిందేమిటి, జరిగిందేమిటి? ఇప్పుడే చెయ్యాలి?"

తీవ్రంగా ఆలోచించారు. అందరూ తమతమ అభిప్రాయాలు తెలిపారు. చివరికి రెండుతెగల నాయకులు ఓ నిర్ణయానికి వచ్చారు. వెంటనే ఉభయ తెగలవాళ్ళు తమ నాయకులు కొందర్ని చర్చల కోసం బనూఖురైజా యూదుల దగ్గరికి పంపించారు.

ఈ ఉమ్మడి ప్రతినిధి వర్గం బనూఖురైజా తెగ దగ్గరికి పోయింది. వాళ్ళను చూసి బనూఖురైజా యూదులు ఇదివరకంతటి ఉత్సాహం చూపలేదు.

ఖురైష్-గత్ఫాన్ ప్రతినిధివర్గం సభ్యులు యూదులు తలపెట్టిన విశ్వాసఘాతుకానికి లోలోన కుతకుతలాడి పోతున్నారు.

"సోదరులారా! మేమిక్కడికి వచ్చి చాలా రోజులయింది. ఇంకా ఎక్కువ రోజులు ఉండటం కష్టం. ఈ సుదీర్ఘ ముట్టడితో మేము ఇప్పటికే చాలా విసిగిపోయాము. అంచేత ఇప్పుడు ఏదోఒకటి నిర్ణయం జరగాలి. వీలైనంత త్వరగా మీరు వచ్చి మాతో చేరండి. మనమంతా కలిసి ఒకేసారి పెద్దపెట్టున ముస్లింల మీద దాడిచేద్దాం" అన్నారు వారు.

'రేపు శనివారం కదా! శనివారం రోజు మేము యుద్ధం చేయలేము. మరో రోజు పెట్టుకుందాం. కాని ఒక విషయం. ఒకవేళ ముహమ్మద్ గెలిచేలా ఉంటే మాత్రం మీరు మమ్మల్ని విడనాడి పోమని హామీనివ్వాలి. దాని కోసం మాకు నమ్మకం కలగడానికి

మీ మనుషులు కొందరిని మాదగ్గర తాకట్టుపెట్టండి. ఆ తరువాతే మేము మీతో సహకరించ గలం" అన్నారు యూదులు.

ఈ మాట వినగానే ఖురైష్, గత్ఫాన్ తెగవాళ్ళు నయీమ్ చెప్పిన మాటల్లో ఎలాంటి సందేహంలేదని భావించారు. బనూఖురైజా యూదులు నిజంగా ఏదో మోసం తలపెట్టారని అనుమానిస్తూ "అసాధ్యం. మీ దగ్గరికి మా వాళ్ళను పంపే ప్రసక్తేలేదు" అన్నారు వారు.

వారి మాటలు విని బనూఖురైజా యూదులు కూడా నయీమ్ చెప్పింది ముమ్మాటికి నిజమే అనుకున్నారు.

"అయితే మేము మీతో సహకరించే ప్రసక్తి లేదు" అన్నారు వారు ప్రతినిధివర్గంతో. ప్రతినిధివర్గం మారు మాట్లాడకుండా అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

ఈవిధంగా హజ్రత్ నయీమ్ (రజి) పన్నిన యుద్ధతంత్రం ఫలించి శత్రువుల ఐక్యసంఘటన నిట్టనిలువుగా చీలిపోయింది.

ఈ సమాచారం ముస్లిం శిబిరంలో వెలుగు రవ్వలు వెదజల్లింది. నిరాశా నిస్పృహలు పటాపంచలై పోయాయి. వాడిన ముఖాలన్నీ ఒక్కసారిగా వికసించాయి. దైవానుగ్రహం పొంగిపొరలింది. దైవదూతల దీవెనలు ప్రతిధ్వనించాయి. విజయపతాకం రెపరెప లాడింది! అంతా ఆనందమయం!! సర్వత్రా సంతృప్తికరం!!!

మరునాడు దైవకారుణ్యం ధారాపాతంగా వర్షించింది....చూస్తుండగానే నీలాంబరం లో మిలమిల మెరిసే నక్షత్రాలు చకచకా అంతర్ధానమయ్యాయి.

ఆ తరువాత నలువైపుల నుంచి కారుమేఘాలు గబగబా కమ్ముకున్నాయి. చల్లటి ఈదురుగాలి కూడా ప్రారంభమయింది. యుద్ధ మైదానమంతా అంధకారమయమైంది. ఆ వెనువెంటనే ఉరుములు, మెరుపులతో వాతావరణం భయానకంగా మారింది. ఈదురు గాలి ఉధృతమైంది. కొన్ని క్షణాల్లోనే అది పెనుతుఫానుగా పరిణమించింది.

పెద్ద ప్రళయమే ముంచుకొస్తోంది. కన్ను పొడుచుకున్నా కానరాని కటిక చీకటిలో హఠాత్తుగా దాడిచేసిన ఈ తుఫాను ఎవరికి ఎలాంటి ముప్పు తెచ్చిపెడ్తుందో! వందల మైళ్ళ వేగంతో వీస్తున్న ఈదురుగాలుల హోరుతో మదీనా కొండలు మార్మోగుతున్నాయి. ఖర్జూరపు చెట్లు కూకటివేళ్ళతో సహా లేచి గాలిలో ఎగురుతున్నాయి.

శరవేగంతో వీస్తున్న గాలిహోరుకు కందకం ఆవల ఉన్న శత్రుసైనికులు భయపడి అరుపులు, కేకలు పెడ్తున్నారు. వారు వేసుకున్న గుడారాలు తుఫాను తాకిడికి గాలిపటాల్లా ఎగిరిపోతున్నాయి. సామగ్రి చెల్లాచెదరయి పోయింది. కుంపట్ల మీదున్న పెద్ద పెద్ద వంటపాత్రలు సైతం ఎగిరి తలక్రిందయి పడిపోయాయి.

తుఫాను క్షణక్షణానికి ఉధృతం కాసాగింది. విపరీతమయిన చలితో వీస్తున్న గాలికి సైనికులు గజగజ వణికిపోతున్నారు. నాయకుల వ్యూహం తారుమారయింది. సైనిక వ్యవస్థ అస్తవ్యస్త మయింది. సైనికులు ఆత్మరక్షణ కోసం పడరాని పాట్లు పడుతున్నారు. రానున్న ప్రమాదం మనసులో మెదలగానే వారి గుండెలు దడదడలాడసాగాయి.



అంతా గాఢాంధకారం. రక్తాన్ని గడ్డకట్టించే చలి. కళ్ళు చెదరగొట్టే మెరుపులు. చెవులు చిల్లులు పడే ఉరుములు. ఉధృతంగా వీస్తున్న గాలిజోరు. దేహాలకు తూట్లు వేసే ఇసుకరేణువులు. ప్రకృతి విలయతాండవం చేస్తోంది. మరణరక్కసి తరుముకుంటూ వస్తోంది. సైనికులు భయంతో పెడబొబ్బలు పెడ్తున్నారు.

"అమ్మో! మా ప్రాణాలు పోతున్నాయి. సర్వనాశనమవుతోంది!!"

సైన్యాధ్యక్షుడు అబూసుఫ్యాన్ పరిస్థితి విషమించిందని గ్రహించాడు. ఈ ప్రకృతి బీభత్సంలో ముస్లింలతో పోరి గెలవలేమనుకున్నాడు. ఇక ఇక్కడ మరికొన్ని రోజులుంటే తనకూ, తనసైన్యానికి సర్వనాశనం తప్పదని భావించాడు. సైనికులు పెడ్తున్న భయంకర కేకలు విని అదిరిపోతున్నాడు.

"ఖురైష్ సోదరులారా! ఇక మనమీ ప్రదేశంలో ఒక్కక్షణం కూడా ఉండలేం. చూడండి ప్రకృతి ఎలా భీకరరూపం దాల్చిందో! గుడారాలు ఎగిరిపోతున్నాయి. సామగ్రి చిందర వందరై పోయింది. పశువులు అల్లాడి పోతున్నాయి. యూదులు కూడా మనల్ని మోస గించారు. పదండి, ప్రమాదం ముంచుకొస్తోంది. ఇదిగో నేను వెళ్తున్నాను" అంటూ అబూసుఫ్యాన్ ఓగుట్ట మీద నుంచి పొలికేకలు పెట్టాడు.

ఆ తరువాత అతను గుర్రంపై ఎగిరి కూర్చొని దౌడుతీయించాడు. సేనాపతే యుద్ధ రంగం వదలిపోతే ఇక సైనికులు అక్కడ ఉండగలరా! వారు కూడా వెంటనే ఆ చీకటిలోనే, ఆ తుఫానులోనే చేతికందిన సామాను తీసుకొని మూటాముల్లెలు సర్దుకున్నారు. ఉధృతం గా వీస్తున్న గాలితాకిడికి తడబడుతున్న కాళ్ళతోనే వడివడిగా నడుస్తూ, కటిక చీకటిలో కళ్ళుచించుకొని తచ్చాడుతూనే బ్రతుకుజీవుడా అంటూ మక్కా దారిపట్టారు.

ఖురైష్ సైనికుల్ని చూసి వారి మిత్రపక్షమయిన గత్ఫాన్‌తెగ సైనికులు కూడా గత్యంతరం లేక గబగబా కాలికి బుద్ధిచెప్పారు.

తుఫాను ఉధృతం క్రమంగా తగ్గిపోయింది. మేఘాలు మెల్ల మెల్లగా విడిపోయాయి. ప్రకృతి శాంతించింది. కాస్సేపటికి వాతావరణం యథాస్థితికి వచ్చింది.

"విశ్వాసులారా! మీకు దేవుడు చేసిన మేలు గుర్తుకు తెచ్చుకోండి. మీపైకి (శత్రు)సైన్యాలు దాడిచేయడానికి వచ్చినప్పుడు, మేము వారి మీదికి పెను తుఫాన్ పంపాం. పైగా (మీకంటికి కన్పించని అదృశ్య సైనికుల్ని (దైవదూతల్ని) కూడా పంపాము." (ఖుర్‌ఆన్–33:9)

"దేవుడు సత్యతిరస్కారుల ముఖాలను వెనక్కి తిప్పివేశాడు. వారు మనసులో కసి నింపుకొని ఎలాంటి ప్రయోజనం సాధించకుండానే ఉత్త చేతులతో వచ్చినదారే వెళ్ళిపోయారు. విశ్వాసుల వైపున పోరాడేందుకు ఒక్క దేవుడే సరిపోయాడు. దేవుడు ఎంతో బలాఢ్యుడు, మహా శక్తిమంతుడు." (ఖుర్‌ఆన్–33:25)

తూర్పు దిగ్మండలం నల్లచీర వదిలేసి తెల్లచీర కట్టుకుంటోంది. ఆ తరువాత కాస్సేపటికి సహస్రకోటి కిరణాలతో ఉదయ భానుడు ముసిముసి నవ్వులతో మేల్కొన్నాడు. ప్రకృతి ఆహ్లాదకరంగా ఉంది.

ప్రభాత సమయం ప్రార్థన ముగించుకున్న ముస్లిం యోధులు కందకం కట్ట మీదికి వచ్చి సంభ్రమాశ్చర్యాలతో చూడసాగారు. కందకం ఆవల యుద్ధ మైదానం నిర్మానుష్యంగా పడివుంది. శత్రుశేషం మచ్చుకైనా కన్పించలేదు. దాంతో అంతా సంతోషాతిశయంతో 'అల్లాహుఅక్బర్' అన్నారు. ఆ నినాదంతో పరిసరాలు మార్మోగాయి.

దైవప్రవక్త (సల్లం) ఆ నిర్జనప్రదేశం చూసి "ఇప్పుడిక ఖురైషీయులు మీ మీద ఎన్నటికీ దాడిచేయడానికి రాలేరు. స్వయంగా మీరే వారిపై దాడిచేయడానికి వెళ్తారు" అన్నారు ప్రియఅనుచరులతో.

శత్రుపీడ విరగడై పోయినందుకు విప్పారినముఖాలతో ముస్లింయోధులు నగరానికి తిరుగుముఖం పట్టారు. ఈ సంఘటన హి.శ. 5వ ఏట, జీఖాదా నెలలో జరిగింది.

ఆరోజు మదీనా అంతటా ఆనంద కుసుమాలు వెల్లివిరిశాయి. 25 రోజులకు పైగా జరిగిన ఈ యుద్ధంలో పెద్దగా శ్రమ పడకుండానే ముస్లింలకు విజయం లభించింది. అందువల్ల ఆరోజు వారు విజయోత్సాహంలో మునిగి తేలుతున్నారు. స్త్రీలు సంతోషంతో పొంగిపోతున్నారు. బాలికలు విజయగీతాలు ఆలపిస్తూ ఆడుకుంటున్నారు. వృద్ధుల కనుకొలుకుల నుంచి ఆనందభాష్పాలు తొడికిసలాడుతున్నాయి.

## బనూఖురైజా యూదుల దుర్గతి-(115)

దైవప్రవక్త (సల్లం) యుద్ధరంగం నుండి మధ్యాహ్నం వేళకు ఇంటికి చేరుకున్నారు. ఇంట్లో ప్రవేశించి ఆయుధాలు తీసివేశారు. సరిగ్గా అదే సమయంలో దైవదూత జిబ్రీల్ (అలైహి) ప్రత్యక్షమయ్యారు.

"ఏమిటీ, మీరు అప్పుడే ఆయుధాలు దించారా! మేము మటుకు ఇంకా ఆయుధాలు దించలేదు" అన్నారు ఆయన.

"మరే వ్యవహారమైనా మిగిలి ఉందా?" అడిగారు దైవప్రవక్త (స) ఆశ్చర్యంగా.

"ఆ... బనూఖురైజా వ్యవహారం మిగిలిఉంది. వీళ్ళను కూడా ఇప్పుడే అణచివేయాలి" అన్నారు హజ్రత్ జిబ్రీల్ (అలైహి).

ఈ ఆజ్ఞ వినగానే దైవప్రవక్త (సల్లం) ఒక ఉత్తర్వు జారీచేశారు. "దైవధర్మంలో స్థిరంగా ఉన్న ముస్లిం యోధులంతా బనీఖురైజా వాడకు చేరుకోనంత వరకు ఈరోజు అసర్ నమాజ్ చేయకూడదు" అని ప్రకటన గావించారు. ఆ తరువాత ఆయన హజ్రత్ అలీ (రజి)కి ఒక చిన్న సైనిక దళాన్నిచ్చి పంపారు.

ఈ సైనికదళం యూదుల వాడ సమీపానికి చేరుకుంది. దాన్ని చూడగానే యూదులు కోటగోడలు ఎక్కి, తమను బెదిరించడానికి మాత్రమే ఈ చిన్నదళం వస్తోందని తలచి, దైవప్రవక్త (స)ను, ముస్లింలను నానా దుర్భాషలాడటం మొదలెట్టారు.

ఆ తరువాత కాస్సేపటికే దైవప్రవక్త (సల్లం) సారథ్యంలో భారీ సైన్యం రావడంతో వారి గుండెలు గుభిల్లుమన్నాయి. వెంటనే వారు కోటద్వారాలు మూసుకొని, దుర్భేద్యమైన ఈ కోటలే తమను కాపాడుతాయని భావించారు.



ఈ యూదులు అతిక్లిష్ట పరిస్థితుల్లో స్నేహఒప్పందానికి తిలోదకాలిచ్చి, మదీనాపై దాడిచేయడానికి వచ్చిన విదేశీ శక్తులతో చేతులు కలిపారు. దైవప్రవక్త (సల్లం)ను, ఆయన అనుచరులను శాశ్వతంగా అంతమొందించడానికి కుట్రలు పన్నారు. అలాంటి విశ్వాస ఘాతకులు, దేశద్రోహులను వదలిపెట్టకూడదని భావించారు ముస్లింలు. అందువల్ల వారు కోటను ముట్టడించి యుద్ధం ప్రారంభించారు.

యూదులు కోటబురుజుల నుండి ముస్లింలను ఎదుర్కోవడానికి ప్రయత్నించారు. కాని బయట నుంచి ముస్లింలు విడుస్తున్న బాణాల ధాటికి నిలువలేక ఆ ప్రయత్నం విరమించుకొని కోట లోపల దూరి కూర్చున్నారు. ముస్లింలు కూడా మొండికేసి అక్కడే రోజుల తరబడి యూదుల కోసం కాచుకొని కూర్చున్నారు.

ఇలా ముట్టడి మూడు వారాలు కొనసాగింది. ఆవిధంగా యూదులు ఎన్ని రోజులని కలుగులోని ఎలుకల్లా కోటలోనే పడిఉంటారు? అదీగాక నిల్వచేసుకున్న ఆహారపదార్థాలు కూడా అయిపోవచ్చాయి. ఇంకా కొన్నిరోజులు కోటలోనే ఉంటే మలమల మాడి చస్తారు. పోనీ కోట బయటికి వద్దామంటే ముస్లింయోధులు ఆకలిగొన్న పులుల్లా గాండ్రిస్తూ కోట గుమ్మం దగ్గరే మాటువేసి కూర్చున్నారు. ఇప్పుడు దారేమిటీ?

యూదులు బెంబేలు పడిపోయారు. నాయకులంతా సమావేశమయి ప్రత్యామ్నాయ మార్గం కోసం తీవ్రంగా సమాలోచనలు జరిపారు.

"మనం ముహమ్మద్‌తో చేసుకున్న ఒడంబడికను భంగంచేసి చాలా పొరపాటు చేశాం. పరిస్థితి కూడా చేజారిపోయింది. ఇప్పుడు మన ముందు ఒకేఒక మార్గం ఉంది. మనమంతా ఇస్లాం స్వీకరించి ముహమ్మద్‌కు లొంగిపోదాం. ఇలా చేస్తే మన ధన మాన ప్రాణాలకు ముప్పు రాదు. ముస్లింలతో కలసిమెలసి ప్రశాంత జీవితం గడపవచ్చు" అన్నాడు వారి అగ్రనాయకుడు కాబ్.

ఈ ప్రతిపాదన వినగానే యూదుల్లో పెద్ద కలకలం బయలుదేరింది.

"వీల్లేదు. వీల్లేదు. ముహమ్మద్‌కు లొంగిపోవడంకన్నా మనకు వేరే అవమానం లేదు. తౌరాత్ గ్రంథాన్ని మేము ఎన్నటికీ విడనాడము. ప్రాణాన్నయినా వదులుకుంటాం గాని, తౌరాత్‌ని వదలడం మావల్ల కాదు" తీవ్రంగా నిరాకరించారు అందరూ.

"అయితే మరోపని చేద్దాం. మనం మన భార్యాపిల్లల్ని హతమార్చుదాం. ఖడ్గాలు ధరించి బయటికి వెళ్దాం. ప్రాణాలకు తెగించి ముస్లింలతో పోరాడుదాం. ఒకవేళ మన మంతా వధించబడితే మన కోసం ఏడ్చేవారెవరూ ఉండరు. గెలిస్తే వేరే స్త్రీలను వివాహం చేసుకుందాం. కొన్నాళ్ళలో మళ్ళీ సంతానం కలుగుతుంది" అన్నాడు కాబ్.

ఈ ప్రతిపాదన కూడా ఎవరికీ నచ్చలేదు. "పాపం ఆడవాళ్ళను చంపటం ఏమీ బాగాలేదు. వారు పోతే మనజీవితాల్లో ఇక రుచీపచీ ఏముంటుందని?" అన్నారు కొందరు.

కాబ్ మౌనంగా ఉండిపోయాడు. ఆ తరువాత మరికొన్ని ప్రతిపాదనలు వచ్చాయి. ఒక్కొక్కరు ఒక్కొక్క అభిప్రాయం వెలిబుచ్చారు. అందరి అభిప్రాయాలు క్రోడీకరించి చివరికి ఒక విషయం తీర్మానించారు.

"మనల్ని సిరియా పోవడానికి అనుమతించమని ముహమ్మద్‌ని అడుగుదాం. బనూ ఖైనుఖా, బనూనజీర్ తెగల విషయంలో ఇలాగే జరిగింది" అంటూ కాబ్ బిన్ అఖ్తబ్ తుది నిర్ణయం తెలియపరిచాడు.

ఈ నిర్ణయం అందరికీ నచ్చింది. వెంటనే వారొక ప్రతినిధివర్గాన్ని దైవప్రవక్త (స) తో రాయబారం జరపడానికి పంపించారు. ఆ ప్రతినిధివర్గం చర్చలు జరపడానికి దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళింది.

"అయ్యా! మా వల్ల పొరపాటు జరిగిపోయింది. దయచేసి మమ్మల్ని సిరియా వెళ్ళిపోవడానికి అనుమతించండి" అన్నాడు ప్రతినిధివర్గం నాయకుడు.

"మీకీ అనుమతి లభించదు. ఓ పని చేయండి. ఔస్‌తెగ మీ పాత మిత్రపక్షమే కదా! ఆ తెగలో ఎవరినైనా ఎన్నుకోండి. అతను ఏది నిర్ణయిస్తే దానికి మేము కట్టుబడి ఉంటాం. మీరు కూడా దాన్ని సమ్మతించవలసి ఉంటుంది" అన్నారు దైవప్రవక్త (స).

యూదులు రెండు నిమిషాలు ఆలోచించారు. చివరికి వారిదృష్టి సాద్ బిన్ ముఆజ్ (రజి) వైపుకు పోయింది. ఆయన్ని మధ్యవర్తిగా ఉండి ఈ సమస్యను పరిష్కరించమన్నారు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఔస్‌తెగకు చెందిన కొందరు ముస్లింలను పంపుతూ సాద్ బిన్ ముఆజ్‌ని పిలుచుకొని రమ్మని చెప్పారు. ఆ సమయంలో హజ్రత్ సాద్ (రజి) యుద్ధంలో గాయపడటం వల్ల మసీదుకు ఎదురుగా ఉన్న రఫీదా సల్మా ఇంట్లో ఉండి చికిత్స పొందుతున్నారు. ఔస్‌తెగ మనుషులు అక్కడికెళ్ళి దైవప్రవక్త ఆదేశం విన్పించారు. హజ్రత్ సాన్ బిన్ ముఆజ్ (రజి) అందుకు అంగీకరించగానే ఆయన్ని వారు పల్లకీలో కూర్చోబెట్టి తీసికెళ్ళారు. ఔస్‌తెగవాళ్ళు తమ పాత మిత్రపక్షానికి అనుకూలంగా తీర్పిస్తే బాగుంటుందని భావిస్తున్నారు.

అందువల్ల వారు దారిలో హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ (రజి)తో మాట్లాడుతూ "ఇప్పుడు మీ తీర్పే తుదినిర్ణయం. అంచేత మీరు మన పాతమిత్రులైన బనీఖురైజా యూదులకు సహాయం చేస్తే బాగుంటుంది" అన్నారు.

దానికి హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ (రజి) "నేను న్యాయం ప్రకారమే తీర్పు చెబుతాను. ఎవరి విమర్శలకు భయపడేవాణ్ణి కాను" అని సమాధానమిచ్చారు.

హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ (రజి) పల్లకి సమీపానికి రాగానే దైవప్రవక్త (సల్లం) ఔస్‌తెగ ముస్లింలతో "మీ నాయకుడు వస్తున్నాడు ఎదురెళ్ళి స్వాగతం చెప్పి గౌరవప్రదంగా తీసుకురండి" అని చెప్పారు.

వెంటనే ఔస్‌తెగ ముస్లింలు లేచి హజ్రత్ సాద్ (రజి)కు స్వాగతం చెప్పి గౌరవప్రదంగా పల్లకీ నుంచి దించి తీసుకొచ్చారు.

హజ్రత్ సాద్ (రజి) రాగానే దైవప్రవక్త (సల్లం)కు సలాం చెప్పి కూర్చున్నారు.

"సాద్! మీ పాత మిత్రులు తమ వ్యవహారాన్ని మీకు అప్పగించారు. ఇప్పుడు తుదినిర్ణయం మీ చేతిలో ఉంది" అన్నారు దైవప్రవక్త (సల్లం).



హజ్రత్ సాద్ (రజి) అన్సార్ ముస్లింల వైపు చూస్తూ "మీరు దేవుణ్ణి సర్వోపగతుడిగా భావించి నా తీర్పును సంతోషంగా అంగీకరిస్తామని మాటివ్వండి" అన్నారు.

దానికి అన్సార్ ముస్లింలంతా "మీ తీర్పు మాకిష్టమే" అన్నారు ముక్తకంఠంతో.

తరువాత హజ్రత్ సాద్ (రజి) దైవప్రవక్త (సల్లం)ను, ముహాజిర్ ముస్లింలను ఉద్దేశించి "మీరు కూడా దేవుణ్ణి సర్వోపగతుడిగా భావించి నా తీర్పును సంతోషంగా ఒప్పుకుంటామని మాటివ్వండి" అన్నారు.

దైవప్రవక్త (సల్లం) కూడా సాద్ (రజి) ఇచ్చే తీర్పుని గౌరవిస్తామని చెప్పారు. ముహాజిర్ ముస్లింలు ఆ విషయాన్ని సమర్థిస్తూ తమ ఆమోదాన్ని తెలిపారు.

హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ (రజి) యూదుల స్వభావం మొదటి నుంచీ బాగా ఎరిగినవారు. ఆయన ఓ క్షణం ఆలోచించి పరిస్థితి అర్థం చేసుకున్నారు.

ఈ నీచులు ముస్లింలతో మంచిగా ఉంటూనే దైవమార్గంలో గోతులు త్రవ్వడానికి పూనుకున్నారు. ఖురైష్ సైనికుల వల్ల తనకు గాయమయినప్పుడు, బనూఖురైజా యూదుల నమ్మకద్రోహం పర్యవసానం చూసేవరకు తనను సజీవంగా ఉంచమని ఆయన దైవాన్ని ప్రార్థించారు. ఆ అవకాశం ఇప్పుడు వచ్చింది. కాబట్టి ఆయన వెంటనే తన నిర్ణయాన్ని ఇలా తెలిపారు:

"బనీఖురైజా తెగ యూదులలో ఎవరెవరు యుద్ధం చేయగల శక్తిమంతులో వారంతా తక్షణమే వధించబడాలి. స్త్రీలు, పిల్లలను బందీలుగా చేసుకోవాలి. వారి ఆస్తిపాస్తులన్నీ ముస్లింలకు పంచబడాలి."

ఈ నిర్ణయం వినగానే యూదులకు మిన్ను విరిగి మీద పడినట్లయింది. కాళ్ళ కింద భూమి బద్దలయినట్లు అన్పించింది. ఏ ఒక్కరి నోటా మాట పెగల్లేదు. అందరూ నిలువు గుడ్లు వేసి చూడసాగారు.

తక్షణమే ముస్లింలు పెద్దపెద్ద గోతులు తవ్వారు. పురుషులందర్నీ బంధించి గోతుల దగ్గరికి తీసికెళ్ళారు. అక్కడ వారిని వధించి గోతుల్లోకి త్రోసి పూడ్చిపెట్టారు.

"గ్రంథప్రజలలో శత్రుసేనలకు తోడ్పడినవారిని దేవుడు వారి కోటల నుండి బయటికి తీశాడు. వారి హృదయాల్లో (మీ పట్ల) భయోత్పాతం సృష్టించాడు. ఈ కారణంగానే ఈరోజు మీరు వారిలో కొందరిని హతమార్చి, మరికొందరిని బందీలుగా పట్టుకోగలిగారు. అంతే కాదు, ఆయన వారి భూములు, ఇండ్లు, ఇతర ఆస్తిపాస్తులకు మిమ్మల్ని వారసులుగా చేశాడు. వారి ప్రాంతంలో మీరు ఇదివరకెన్నడూ కాలు కూడా మోపి ఉండలేదు; అలాంటి ప్రాంతాన్ని కూడా ఆయన మీకు స్వాధీనం చేశాడు." (ఖుర్ఆన్-33:26,27)

స్నేహఒప్పందాన్ని భంగపరచి కయ్యానికి కాలుదువ్విన శత్రువులకు ఇలాంటి శిక్షే విధించాలని యూదుల ధర్మశాస్త్రం కూడా ఇలా చెబుతోంది:

"యుద్ధము చేయుటకు మీరొక పురము మీదికి సమీపించునప్పుడు సమాధానము నిమిత్తము రాయబారమును పంపవలెను. సమాధానమని అది నీకు ఉత్తరమిచ్చి గుమ్మములను

తెరచిన యెడల దానిలోనున్న జనులందరు నీకు పన్ను చెల్లించి నీ దాసులగుదురు. అది మీతో సమాధానముపడక యుద్ధమే మంచిదని యెంచినయెడల దాని ముట్టడి చేయుడి. నీ దేవుడైన యెహోవా దాని నీ చేతికప్పగించునప్పుడు దానిలోని మగవారినందరిని కత్తివాత హతము చేయవలెను. అయితే స్త్రీలను, చిన్నవారిని, పశువులను, ఆ పురములోనున్నది యావత్తును దాని కొల్లసొమ్మంతటిని నీవు తీసికొనవచ్చును. నీ దేవుడైన యెహోవా నీకిచ్చిన నీ శత్రువుల కొల్లసొమ్మును నీవు అనుభవించుదువు."

(బైబిల్ పాతనిబంధన, ద్వితీయోపదేశ కాండము, 20వ అధ్యాయము: 10-14)

ఈ విధంగా బనూఖురైజా తెగ యూదుల అధ్యాయం సమాప్తమయింది. హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ (రజి) కోరిక నెరవేరింది. తరువాత ఆయన శత్రువులు కలిగించిన గాయంతోనే శాశ్వతంగా కన్ను మూశారు.

## సుమామా ఇస్లాం స్వీకరణ-(116)

హి.శ. అయిదవ ఏట జిల్‌హజ్ నెలలో తీరప్రాంతంలోని జహ్నియా తెగవాళ్ళు తిరుగుబాటు చర్యలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందింది. అప్పుడు దైవప్రవక్త (సల్లం) హజ్రత్ అబూఉబైదా బిన్ జిరాహ్ (రజి) నాయకత్వంలో 300 మంది యోధుల్ని సైఫుల్ బహర్ (తీరప్రాంతం) వైపు పంపించారు.

ఈ ప్రయాణంలో ఆహారపదార్థాలు తరిగిపోయి యోధులు ఆకలితో చాలా బాధ పడ్డారు. కొన్నాళ్ళపాటు రోజుకు రెండుమూడు ఖర్జూరాలు మాత్రమే తిని గడపవలసి వచ్చింది. చివరికి ఖర్జూరాలు కూడా అయిపోయినప్పుడు చెట్లఆకులు తినవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈవిధంగా యోధులు సముద్రతీరంలో పదిహేనురోజులు గడిపారు. చివరికి ఓరోజు తీరం మీదికి ఓ పెద్దచేప వచ్చిపడింది. అప్పుడు యోధులు పరమసంతోషంతో దాని మాంసం తినడం ప్రారంభించారు. దాని కొవ్వు కూడా కరగబెట్టి వాడుకున్నారు. ఇలా పదిహేను రోజులపాటు ఆ చేపమాంసం, కొవ్వు తిని బలం పుంజుకున్నారు.

ఈ చేప ఎంత పెద్దదో అంచనా వేయడానికి యోధులు దాని వెన్నెముకను నిటారుగా లేపి కొండకు ఆనిచ్చి నిలబెట్టారు. తరువాత వారిలో అందరికంటే పొడుగైన వ్యక్తిని ఒంటె మీద కూర్చోబెట్టి చేప వెన్నెముక క్రింది నుంచి నడిపించారు. అతను చేప ఎముకకు ఏ మాత్రం తగలకుండా దాని క్రింది నుంచి సులభంగా అవతలికి వెళ్ళగలిగాడు.

ఆ సంవత్సరంలోనే దైవప్రవక్త (సల్లం) నజద్ ప్రాంతానికి కూడా ఒక సైనిక దళం పంపారు. ఈ దళం హనీఫాతెగకు చెందిన యమామా ప్రాంతం నాయకుడు సుమామా బిన్ ఉసాల్‌ని ఖైదీగా పట్టుకున్నది. తరువాత మదీనా తిరిగొచ్చి అతడ్ని మసీదులో ఒక స్తంభానికి కట్టివేశారు. కాస్సేపటికి దైవప్రవక్త (సల్లం) వచ్చి అతడ్ని చూశారు.

ఆయన సుమామాని సంబోధిస్తూ "సుమామా! మా గురించి నీ అభిప్రాయం ఏమిటీ?" అని అడిగారు. దానికి సుమామా "మీరు నన్ను హతమార్చితే విలువైన రక్తంగల ఒక మనిషిని హతమార్చిన వారవుతారు. మీరు గనక నాకు మేలు చేస్తే, చేసినమేలును



సదా గుర్తుంచుకునే ఒక వ్యక్తికి మేలుచేసిన వారవుతారు. ఒకవేళ మీరు నాదగ్గర ధనం తీసుకోదలిస్తే నేనివ్వడానికి సిద్ధంగా ఉన్నాను, అడగండి ఎంతకావాలో" అని అన్నాడు.

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా మూడు రోజులు అడిగారు. అడిగిన ప్రతిసారీ అతను ఇలాగే సమాధానమిచ్చేవాడు. చివరికి దైవప్రవక్త (సల్లం) అతడ్ని విడిచిపెట్టమని అనుచరుల్ని ఆదేశించారు. అనుచరులు అతడ్ని తాళ్ళు విప్పి వదలిపెట్టారు.

సుమామా ఖైదు నుండి విడుదల కాగానే మదీనా పట్టణం సమీపంలోని ఒక ఒయాసిస్సుకు వెళ్ళి స్నానం చేసి దైవప్రవక్త (సల్లం) దగ్గరకు తిరిగొచ్చాడు. ఆయన ముందు సద్వచనం (కలిమా) పఠించి ముస్లిం అయిపోయాడు. తరువాత ఆయన దైవప్రవక్త (సల్లం)తో ఇలా అన్నారు:

"దైవప్రవక్తా! దీనికి పూర్వం నేను అందరికంటే ఎక్కువ మిమ్మల్ని, అన్ని ధర్మాలకన్నా ఎక్కువ మీ ధర్మాన్ని ద్వేషించేవాడ్ని. కాని ఈరోజు నేను అందరికంటే ఎక్కువ మిమ్మల్ని, అన్ని ధర్మాలకన్నా ఎక్కువ మీ ధర్మాన్ని అభిమానిస్తున్నాను. దైవప్రవక్తా! నేనసలు ఉమ్రా ఆచారం పాటించే ఉద్దేశ్యంతో మక్కా వెళ్తుంటే దారిలో మీ సైనికులు నన్ను బంధించి తెచ్చారు. ఇప్పుడు నేను మీరనుమతిస్తే ఉమ్రా చేయాలనుకుంటున్నాను."

దైవప్రవక్త (సల్లం) ఈ మాట విని సంతోషంగా సుమామా (రజి)కు ఉమ్రా చేయడానికి అనుమతి ఇచ్చారు. ఆ తరువాత ఆయన ఉమ్రా కోసం మక్కా వెళ్ళి కాబా ప్రదక్షిణ చేస్తుంటే అక్కడి ఖురైష్ నాయకులు ఆయన ధోరణి గమనించి "సుమామా! నువ్వు కూడా మతభ్రష్టుడయి పోయావా?" అన్నారు.

దానికి సుమామా (రజి) సమాధానమిస్తూ "కాలేదు. నేనిప్పుడు ముహమ్మద్ మహనీయు (సల్లం)ని చేతి మీదుగా ఇస్లాం స్వీకరించాను. ఇంకా బాగా వినండి. ఇక నుండి ముహమ్మద్ (సల్లం) గారి అనుమతి లేకుండా మీకు యమామా నుండి ఒక్క గోధుమగింజ కూడా పంపడం జరగదు" అని అన్నారు.

సుమామా (రజి) యమామా తిరిగొచ్చిన తరువత అలా చేసి చూపారు కూడా. దాంతో మక్కా ఖురైషీయులు దైవప్రవక్త (సల్లం) దగ్గరకొచ్చి "దయచేసి యమామా నుండి వచ్చే ధాన్యాన్ని మాకు సరాఫరా కాకుండా నిలుపుదల చేయించకండి" అని విన్నవించుకున్నారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "మక్కా ప్రజలకు యథాప్రకారం ధాన్యం సరఫరా కానివ్వు" అని హజ్రత్ సుమామా (రజి)ను ఆదేశించారు.

## పశుపతి ఐనియా నమ్మక ద్రోహం-(117)

దూమతుల్ జందల్ దండయాత్ర నుంచి తిరిగి వస్తున్నప్పుడు దైవప్రవక్త (సల్లం) ఒక చోట పశుపతి ఐనియాకు మదీనా పచ్చిక బయళ్ళలో పశువుల్ని మేపుకోవడానికి అనుమతి ఇచ్చారు. ఐనియా తన మందీమార్బలంతో మదీనా వచ్చి ఏడాది పాటు తన పశువుల్ని బాగా మేపుకున్నాడు. తరువాత అతనికి దైవప్రవక్త (సల్లం) చేసిన ఉపకారానికి బదులుగా అపకారం తలపెట్టే దుర్బుద్ధి పుట్టింది. అతను ఓరోజు అవకాశం చూసి

దైవప్రవక్త (సల్లం)కు చెందిన ఒంటెలపై దాడిచేశాడు. ఒంటెల కాపరిని హతమార్చి, అతని భార్యను పట్టుకొని ఒంటెలతో సహా పారిపోయాడు.

ఈ దుర్ఘటన సంగతి మొట్టమొదట హజ్రత్ అస్లమా బిన్ అమ్ర్ బిన్ అకూ (రజి)కు తెలిసింది. తక్షణమే ఆయన నగరంలో బిగ్గరగా కేకలేస్తూ ముస్లింలకు ఈ విషయం తెలియజేసి, ద్రోహుల వెంటపడ్డారు. దైవప్రవక్త (స)కు ఈ విషయం తెలియగానే ఆయన ఐనియాను పట్టుకోవడానికి కొందరు సహచరుల్ని తీసుకొని బయలుదేరారు.

కొంత దూరం పోయిన తరువాత దైవప్రవక్త (సల్లం) జీఖురూ సరస్సు దగ్గర ఆగి హజ్రత్ సాద్ బిన్ జైద్ (రజి) నాయకత్వంలో తన అనుచరులలో కొందరిని పంపించారు. ఆయన మాత్రం మిగిలిన అనుచరులతో పాటు ఆ ప్రదేశంలోనే ఆగిపోయారు.

హజ్రత్ అస్లమా బిన్ అమ్ర్ (రజి) గుర్రం మీద వేగంగా వెళ్ళి ఆ విద్రోహుల సమీపానికి చేరుకున్నారు. ఆయన దూరం నుంచే "విద్రోహులారా! ఆగండి, పారిపోకండి" అని బిగ్గరగా కేకవేశారు.

ఐనియా వెనక్కి తిరిగిచూసి "ఆగండి, ఒక్కడే వస్తున్నాడు. ఇతడ్ని కూడా కడతేర్చి వెళ్దాం" అన్నాడు తన సహచరులతో. ఈ మాట విని అందరూ ఆగిపోయారు. వారు వందమందికి పైగా ఉన్నారు. అందరూ కత్తులు దూసి ఆ ముస్లింని ముక్కలు ముక్కలుగా నరికి పారేయడానికి ఉవ్విళ్ళూరుతూ నిలబడ్డారు.

హజ్రత్ అస్లమా (రజి) శత్రువుల సంఖ్యాబలాన్ని ఏమాత్రం ఖాతరుచేయకుండా దగ్గరకు చేరుకోగానే చుర్రున కత్తి దూసి మెరుపు వేగంతో ఐనియా మీద లంఘించి వేటు వేశారు. ఆ దెబ్బకు ఐనియా తీవ్రంగా గాయపడి పెడబొబ్బలు పెడుతూ తన సహచరుల మధ్యకు పరుగెత్తి నిలబడ్డాడు.

అతని సహచరులు అస్లమా (రజి) ధైర్యసాహసాలు చూసి క్షణంపాటు బిత్తర పోయారు. వారా ఆశ్చర్యం నుంచి తేరుకోక ముందే హజ్రత్ అస్లమా (రజి) మరో ఇద్దరిని నేలకూల్చారు. శత్రువులు వెంటనే ఆయన చుట్టూ వలయాకారంగా ఏర్పడి పోరాడ సాగారు. అస్లమా (రజి) వారితో పోరాడుతూనే మరో ఇద్దరిని మట్టుబెట్టారు.

అంతలో హజ్రత్ సాద్ బిన్ జైద్ (రజి) నాయకత్వంలోని సైనికదళం అక్కడకు చేరుకుంది. అటు ఐనియాకు మద్దతుగా అతని మనుషులు కూడా మరికొందరు వచ్చిపడ్డారు. ఆ వెనువెంటనే ఇరుపక్షాలు ఢీకొన్నాయి. హోరాహోరి పోరు జరిగింది. చివరికి విద్రోహులు ముస్లింల ధాటికి నిలువలేక తమలోని అరవై మందిని రక్తపు మడుగుల్లో వదిలేసి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పారిపోయారు.

ముస్లింలకు తమ ఒంటెలతో పాటు ఐనియా ఒంటెలు కూడా చిక్కాయి. వారు పశువులకాపరి భార్యను కూడ విడిపించుకున్నారు. తరువాత ఒంటెలను తీసుకొని జీఖురూ చేరుకున్నారు. అక్కడ ఒక రాత్రి గడిపి దైవప్రవక్త (సల్లం) వెంట మదీనా తిరిగి వచ్చారు. ఈ యుద్ధంలో ఒక ముస్లిం అమరగతి నొందాడు.



హిజ్రీశకం 6వ ఏట దైవప్రవక్త (సల్లం) ధర్మప్రచారం కోసం హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)ని దూమతుల్ జందల్ చుట్టు పక్కలున్న గ్రామాలకు పంపారు. అక్కడి ప్రజలు ఇంకా ఇస్లాం స్వీకరించలేదు. వారి నాయకుల్లో అసీగ్ బిన్ ఉమర్ కల్బీ క్రైస్తవ మతస్థుడు. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) అక్కడకు వెళ్ళి ధర్మప్రచారం చేశారు. తత్ఫలితంగా అసీగ్ బిన్ ఉమర్ కల్బీ ఎంతో ప్రభావితుడయి వెంటనే ఇస్లాం స్వీకరించాడు. దాంతో ఆ గ్రామాల ప్రజలు కూడా అనేకమంది తమ నాయకుడ్ని అనుసరిస్తూ ఇస్లాం స్వీకరించి ముస్లిములయి పోయారు.

కొన్నాళ్ళకు ఇర్నియా అనే ప్రాంతం నుండి అకల్ తెగకు చెందిన కొందరు వ్యక్తులు మదీనా వచ్చి దైవప్రవక్త (సల్లం) ముందు ఇస్లాం స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు. వారి ఇస్లాంస్వీకార ప్రకటన పట్ల దైవప్రవక్త (సల్లం) చాలా సంతోషం వ్యక్తపరిచారు. వారు కొన్నాళ్ళపాటు మదీనాలోనే ఉండిపోయారు.

అయితే ఓ రోజు వారు దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి ఇలా విన్నవించుకున్నారు:

"దైవప్రవక్తా! మేము ప్రధానఆహారంగా పశువుల పాలు తాగి జీవించడానికి అలవాటు పడ్డాము. ఇక్కడ మేము మదీనాలో ఉండి సత్తుపిండి, ఖర్జూరాలు తినలేక పోతున్నాం. వీటివల్ల మా ఆరోగ్యం పాడయిపోతోంది. ముఖ్యంగా చర్మవ్యాధులతో చాలా బాధపడుతున్నాం."

దైవప్రవక్త (సల్లం) ఈ మాటలు విని "అలాగయితే మీరు ఖుబా కొండ ప్రాంతానికి వెళ్ళండి. అక్కడి పచ్చిక బయళ్ళలో నా ఒంటెలు ఉన్నాయి. వాటి పాలు తాగుతూ జీవితం గడపండి" అని చెప్పారు.

అప్పుడు అకల్ తెగకు చెందిన ఆ మనుషులు సంబరపడిపోతూ మదీనా నుంచి ఆరేడు మైళ్ళ దూరంలో ఉన్న ఖుబా కొండ ప్రాంతానికి వెళ్ళారు. అక్కడి పచ్చిక బయళ్ళలో గుడారాలు వేసుకొని ఒంటెల పాలు తాగుతూ గడపసాగారు. కొన్నాళ్ళలోనే వారు ఒంటె పాలు తాగి బలం పుంజుకొని బాగా బలసిపోయారు.

ఇలా కష్టపడకుండా ఉచితంగా బలమైన ఆహారం లభిస్తున్నందుకు దైవానికి, దైవప్రవక్త (స)కు కృతజ్ఞులయి ఉండటానికి బదులు వారు విద్రోహచర్యలకు పాల్పడ్డారు. ఒక రోజు వారు అవకాశం చూసి దైవప్రవక్త (స) ఒంటెలకు కాపరిగా ఉన్న యసార్ అనే వ్యక్తిని నిర్దాక్షిణ్యంగా చంపి, అతని కాళ్ళుచేతులు నరికారు. అంతటితో తృప్తిచెందకుండా ఆ దుర్మార్గులు అతని కళ్ళలో తుమ్మముళ్ళు గుచ్చి, కాళ్ళుచేతులులేని ఆ శవాన్ని ఓ చెట్టుకొమ్మకు వ్రేలాడదీశారు. తర్వాత అక్కడున్న ఒంటెలన్నిటినీ తోలుకుపోయారు.

మరునాడు దైవప్రవక్త (సల్లం)కు ఈ సమాచారం అందగానే ఆయన కజర్ బిన్ ఖాలిద్ (రజి) నాయకత్వంలో ఇరవై మంది రౌతులను పంపించారు. వారు శరవేగంతో వెళ్ళి దారిలోనే ఆ విద్రోహుల్ని పట్టుకున్నారు. వాళ్ళను తాళ్ళతో కట్టి మదీనాకు తీసుకొచ్చారు. దైవప్రవక్త (సల్లం) వాళ్ళకు మరణశిక్ష విధించారు. వెంటనే అనుచరులు దాన్ని అమలుపరిచారు.

# హుదైబియా (హజ్) పయనం-(118)

మక్కా నుండి మదీనా వచ్చి ఆరేండ్లు కావస్తున్నా ముస్లింలు కాబా దర్శన భాగ్యానికి నోచుకోలేక పోయారు. కాబా గృహాన్ని కళ్ళారా తిలకించి, ప్రదక్షిణ చేసి, దాని అపార శుభాలను పొందాలన్న వారి ఆకాంక్ష ఆకాంక్షగానే ఉండిపోయింది.

ఒకరోజు రాత్రి దైవప్రవక్త (సల్లం) మక్కా నగరంలో ప్రవేశిస్తున్నట్లు, ఆయన చుట్టూ ఆయన అనుచరులు మూగివున్నట్లు కలగన్నారు. తెల్లవారుజామున అమితమైన ఉత్సాహంతో లేచారు. ఫజర్ నమాజ్ కోసం మసీదుకు వెళ్ళారు. నమాజ్ అనంతరం కాస్సేపు సహచరులతో ముచ్చటించడం ఆయన నిత్యకృత్యం. అలవాటు ప్రకారం ఆరోజు కూడా కూర్చొని మిత్రులతో ముచ్చటించసాగారు. మాటల సందర్భంలో ఆయన రాత్రి కన్న కలను గురించి ప్రస్తావిస్తూ ఇలా అన్నారు:

"మీరు త్వరలోనే (కాబా) ప్రతిష్ఠాలయంలో ప్రవేశించబోతున్నారు. దైవచిత్తమయితే మీరు తప్పకుండా ప్రతిష్ఠాలయంలో ప్రవేశిస్తారు. ఎలాంటి భయాందోళనలు లేకుండా ప్రశాంతంగా ప్రవేశిస్తారు."

ఈ శుభవార్త విని అనుచరులు ఆనందపరవశులయ్యారు. ఇది దైవనిర్ణయమని, ఈ శుభవార్త విన్పించింది దైవప్రవక్త (స) అని వారికి తెలుసు. అందువల్ల ఇక తాము తప్పకుండా కాబాలయాన్ని సందర్శించగలమని వారు దృఢంగా నమ్మారు.

మక్కా పట్టణం ముస్లింల ప్రియ జన్మభూమి. కాని శత్రువులు వారిని అనేక హింసలు పెట్టి అక్కడ్నుంచి బలవంతంగా వెళ్ళిపోయేలా చేశారు. దైవధర్మం కోసం, దైవప్రీతి కోసం వారు మాతృభూమిపై ఉన్న ప్రేమాభిమానాలను బలవంతంగా చంపుకొని, ఆవేదనాభరిత హృదయాలతో మక్కా వదలి మదీనాకు పోవలసి వచ్చింది. ఆ బాధ వారిని అనుక్షణం వేధిస్తుండేది. పైగా ఇప్పటికీ వారిలో అనేకమంది ముహాజిర్ కుటుంబాలు, వారి పిల్లాజెల్లా మక్కాలోనే ఉన్నారు.

అందువల్లనే దైవప్రవక్త (సల్లం) నోట ఈ శుభవార్త వెలువడగానే వారి ఆనందం అవధులు దాటింది. ముందెన్నడూ లేనంత ఉత్సాహంతో ఇండ్లకు వెళ్ళి తమ కుటుంబ సభ్యులకు, ఇతర బంధుమిత్రులకు ఈ శుభవార్త తెలియజేశారు.

అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ముస్లింలు మక్కాలో ప్రవేశించడం సాధ్యమవుతుందా? కాబాగృహాన్ని ఎలా సందర్శించ గలుగుతారు? అసలే ఖురైషీయులు ముస్లింల పేరు వింటేనే మండిపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మక్కాలో అడుగుపెట్టేందుకు వారితో యుద్ధం చేయవలసి వస్తుందా? లేక వారే మక్కా వీడిపోతారా? పరిస్థితి అర్థంగాక ముస్లింలు తికమక పడుతున్నారు.

ఆ తరువాత కొన్ని రోజులకే దైవప్రవక్త (సల్లం) కాబాయాత్ర ప్రకటన గావించారు. ఈ ప్రకటన వినగానే ముస్లింలు ప్రయాణ సన్నాహాలు ప్రారంభించారు. బలిపశువుల్ని కూడా సిద్ధం చేసుకోసాగారు.



ఈయేడు హజ్ యాత్ర చేయవలసి ఉందని దైవప్రవక్త (సల్లం) ఇతర తెగలలో కూడా ప్రకటన గావించారు. కొన్ని తెగలు దైవప్రవక్త (సల్లం) ఆదేశాన్ని శిరోధార్యంగా భావించి తక్షణమే ప్రయాణ ఏర్పాట్లు చేసుకొని మదీనా చేరుకున్నారు.

అయితే కొన్ని తెగలు మాత్రం మక్కా బయలుదేరడానికి బద్ధకం చేశాయి. మరి కొందరయితే సాకులు చూపారు.

"దైవప్రవక్తా! మేము ఈయేడు అనేక సమస్యల్లో చిక్కుకొని ఉన్నాము. మోయలేని ఆపదలు వచ్చిపడ్డాయి. సంతానం, సిరిసంపదలు మాకాళ్ళకు బంధాలు వేశాయి" అంటూ రకరకాల సాకులు చెప్పారు వారు. అంతటితో వారు మౌనంగా ఉండలేదు.

"చూశారా ఈ పిచ్చివాళ్ళు ఏం చేయబోతున్నారో! మక్కా వెళ్ళి పర్వతాలను ఢీకొనబోతున్నారు, పులులతో చెలగాటమాడ బోతున్నారు!! అసలు అక్కడికి పోయి ఒక్కడయినా ప్రాణాలతో తిరిగివస్తాడా అని?" ఈవిధంగా వారు తమ సమావేశాల్లో ముస్లింలను హేళన చేయడం ప్రారంభించారు.

ఈ మాటలు కొందరు ముస్లిం ప్రముఖుల చెవుల్లో పడ్డాయి. హజ్రత్ ఉమర్ (రజి) వారి మాటలు విని పళ్ళు పటపట నూరారు.

"దైవప్రవక్తా! ఈ దుర్మార్గుల తలల్ని నరికివేయాలి" అన్నారు ఆయన ఆవేశంతో.

కాని విశ్వకారుణ్యమూర్తి (సల్లం) అందుకు ఒప్పుకోలేదు. ప్రయాణానికి సిద్ధం కమ్మని ఆయన అనుచరులను ఆదేశించారు.

ప్రయాణ సన్నాహాలు పూర్తయ్యాయి. దైవప్రవక్త (స) ఇబ్నె ఉమ్మె మఖ్తూమ్ (రజి)ను మదీనా గవర్నర్‌గా నియమించి హిజ్రీశకం 6వ ఏట, జీఖాదా ఒకటో తేదీన అనుచరుల్ని తీసుకొని బయలుదేరారు. దారిలో మరికొన్ని తెగలు వచ్చికలిశాయి. ఇలా యాత్రికుల సంఖ్య 1400కు చేరింది. వీరంతా ఉమ్రా సంకల్పం చేసుకొని మక్కా దారి పట్టారు. దైవప్రవక్త (స) తన ఒంటెపై కూర్చొని యాత్రికులకు నాయకత్వం వహించి ముందు నడుస్తున్నారు. ఆయనవెంట ఆయన సతీమణి ఉమ్మెసల్మా (రజి) కూడా ఉన్నారు.

యాత్రికుల వెంట డెబ్బయి బలిపశువులు ఉన్నాయి. ఖడ్గాలు, ధనుర్బాణాలు తప్ప ఇతరత్రా ఆయుధాలు ఏమీ లేవు. ఖడ్గాలు కూడా వరల్లో ఉన్నాయి.

దైవప్రవక్త (స) నగరం బయటికి వచ్చి దైవాన్ని ఇలా ప్రార్థించారు: "దేవా! నీవే మాప్రయాణ సహచరుడివి. నీవే మా భార్యాపిల్లల రక్షకుడివి. దేవా! ప్రయాణ కాఠిన్యాల బారినుండి, మేము తిరిగొచ్చి మా భార్యాపిల్లల్ని దుస్థితిలో చూడటం అనే ఆపద నుండి నేను నీ శరణు కోరుతున్నాను. దేవా! మాకోసం మా ప్రయాణాన్ని సులభతరం చెయ్యి."

ఆ తర్వాత దైవప్రవక్త (స) అక్కడ్నుంచి బయలుదేరారు. అలా ప్రయాణించి ఉస్ఫాన్ అనే ప్రాంతానికి చేరుకొని ఆగిపోయారు. అనుచరులు కూడా ఆగిపోయి గుడారాలు వేసుకున్నారు. గుంజలుపాతి పశువుల్ని కట్టివేశారు. పొయ్యిలు రాజేసి అన్నం ఉడకబెట్టడం ప్రారంభించారు. కొందరు ప్రయాణ బడలికతో నడుం వాల్చారు.

అటు మక్కాలో ఖురైషీయులకు దైవప్రవక్త (స) వేలాది అనుచరుల్ని వెంటబెట్టు కొని మక్కా వస్తున్నారని తెలిసింది. ఇంకేముంది! వారి గుండెలు పగిలినంత పనయింది. తమతో యుద్ధాలు చేసిన ముహమ్మద్ (స) మళ్ళీ మక్కాముఖం చూస్తారనుకోలేదు వారు. కాని ఇప్పుడెలా?

వారికి సావకాశంగా ఆలోచించి తగిన పథకం రూపొందించుకునేంత వ్యవధి కూడా లేదు. అయితే సైనికుల్ని మాత్రం ఆదరాబాదరాగా సమీకరించుకున్నారు. సైన్యాధి కారులుగా ఖాలిద్, ఇక్రమాలు నియమితులయ్యారు. వీరిద్దరూ మక్కా దారిలో ఓచోట ముస్లింల కోసం మాటుకాచి కూర్చున్నారు.

మక్కాలో ఖురైషీయులు ఏం సన్నాహాలు చేస్తున్నారో ఉస్ఫాన్‌లో విడిది చేసిన ముస్లింలకు తెలియదు. వారు ఉస్ఫాన్‌లో ఉండగానే దూరాన దుమ్మురేగుతూ కన్పిం చింది. ఎవరో వ్యక్తి వేగంగా ఇటువైపే వస్తున్నాడు. అతను మక్కా నుండి వస్తున్నాడు. కనుక అక్కడి వార్తలేమైనా చెబుతాడేమోనని అందరూ అతని వైపే చూడసాగారు.

కాస్సేపటికి ఆ వ్యక్తి ముస్లింల దగ్గరికి వచ్చాడు. అతను బనీఖుజాఅ తెగకు చెందిన మనిషి. పేరు బిషర్ బిన్ సుఫ్యాన్.

బనీఖుజాఅ తెగ ముస్లింల మిత్ర పక్షం. బిషర్ కూడా ముస్లింల సానుభూతిపరుడే. అందువల్ల అతను ఖురైషీయులను గురించి నిజమైన సమాచారమే చెబుతాడని దైవప్రవక్త (సల్లం)కు పూర్తి నమ్మకం ఉంది. ఆ నమ్మకంతోనే ఆయన ఖురైషీయుల విశేషాలను గురించి అడిగారు. దానికి బిషర్ ఇలా అన్నాడు:

"ఖురైషీయులకు మీరు వస్తున్న సంగతి తెలిసిపోయింది. వారు మీపై కారాలు మిరియాలు నూరుతున్నారు. ఖాలిద్ బిన్ వలిద్ ఓ పెద్ద సైనికదళం తీసుకొని, మీపై మెరుపుదాడి చేయడానికి దారిలో మాటుకాచి కూర్చున్నాడు."

నిజమే. ఖురైషీయులు అంత పనికి పాల్పడేవారే.

ఖురైషీయుల మొండివైఖరి, తలబిరుసుతనాల పట్ల దైవప్రవక్త (సల్లం) ఎంతో ఆవేదన చెందారు. అయితే తాను తెచ్చిన నిజధర్మం పూర్తిగా స్థాపించబడే వరకూ దైవమార్గంలో పోరాడుతూనే ఉంటానని ఆయన ప్రతిన బూనారు.

"మిత్రులారా! ఖురైషీయులు మీతో పోరాడటానికి బయలుదేరారు. మన ప్రయాణం ఈ దారినే కొనసాగితే మనం వారితో ఢీకొనక తప్పదు. అప్పుడు ఘోర రక్తపాతం తప్పదు. ఇది నాకిష్టం లేదు. కనుక ఈమార్గం తప్పించి వేరేమార్గాన తీసుకొని పోయేవారు ఎవరైనా ఉన్నారా మీలో?" అడిగారు ఆయన అనుచరుల్ని ఉద్దేశించి.

"దైవప్రవక్తా! నేను తీసికెళ్తాను వేరే మార్గం గుండా" అన్నాడు ఒకతను.

"అయితే నువ్వు ముందు నడు. మేము నీ వెనకాల నడుస్తాం" అన్నారు దైవప్రవక్త.

ఆ వ్యక్తి దైవప్రవక్త (సల్లం) ఒంటె ముకుతాడు పట్టుకొని ముందుకు దారితీశాడు. ఇది కొండలు, పెద్దపెద్ద ఇసుకతిన్నెలతో కూడిన భయంకరమైన దారి. మొత్తానికి ఎలాగో



ప్రయాణం సాగించి ముస్లిములు మక్కా నుండి దాదాపు ఇరవై మైళ్ళ దూరంలో ఉన్న 'హుదైబియా' ప్రాంతానికి చేరుకున్నారు.

హుదైబియా చేరుకోగానే దైవప్రవక్త (స) ఒంటె చతికిలబడింది. దాన్ని లేపడానికి ఎంత ప్రయత్నించినా సాధ్యపడలేదు. ఒంటె ఇలా చతికిలబడి లేవకుండా మొరా యించడంలో ఏదో నిగూఢ రహస్యం ఉండవచ్చని భావించారు దైవప్రవక్త (స). అందువల్ల అక్కడే గుడారాలు వేసి ఆగిపొమ్మని ఆయన అనుచరుల్ని ఆదేశించారు.

ఈ వింత చూసి అనుచరులకు అమితమైన ఆశ్చర్యం వేసింది. పైగా తాము విన్న శుభవార్తేమిటి? ఇప్పుడు దాదాపు మక్కా దరిదాపులకు వచ్చి అర్ధాంతరంగా ఇక్కడ దిగబడి పోవడమేమిటి? అన్న ఆలోచనలతో వారు కాస్త నిరుత్సాహానికి గురయ్యారు. అయితే వారు నిరాశ మాత్రం చెందలేదు.

నమాజు వేళయింది. కాని ఉజూ చేయడానికి ఆ ప్రాంతంలో నీళ్ళే లేవు. తెచ్చుకున్న నీళ్ళు అయిపోయాయి. ఇప్పుడేం చేయాలి? ఆ విషయాన్నే అనుచరులు దైవప్రవక్త (సల్లం)ని అడిగారు. దైవప్రవక్త (సల్లం) దగ్గరున్న కూజాలో కూడా కొంచెం మాత్రమే నీళ్ళున్నాయి. అప్పుడు ఆయన ఆ కూజా మూతిపై చేతివ్రేళ్ళు పెట్టారు. వెంటనే ఆయన వ్రేళ్ళకొనల నుంచి నీటిధారలు పొంగివచ్చాయి. దాంతో అనుచరులు పరమ సంతోషంతో తమకు కావలసినన్ని నీళ్ళు వాడుకోవడమే గాకుండా, తమ తోలుతిత్తుల్ని కూడా నింపు కున్నారు. ఇలా మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) శుభ హస్తాల వ్రేళ్ళకొనల నుండి పొంగివచ్చిన నీటితో పధ్నాలుగు వందలమంది అనుచరులు ప్రయోజనం పొందారు. ఒంటెలు, మేకలు కూడా ఆ నీటిని తనివితీరా త్రాగాయి.

ఇలా కొన్నాళ్ళు గడిచాయి. ఆ తరువాత తోలుతిత్తుల్లో నింపుకున్న నీళ్ళు కూడా అయిపోయి తిరిగి నీటికొరత ఏర్పడింది. అప్పుడు అనుచరులు మళ్ళీ దైవప్రవక్త (సల్లం) దృష్టికి ఈ సమస్యను తీసికెళ్ళారు.

ఆ ప్రదేశంలో హుదైబియా పేరుతో ఒక బావి ఉంది. కాని అందులో నీరు మాత్రం లేదు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఆ బావి దగ్గరికి వెళ్ళారు. ఆయన తన అంబులపొది నుండి ఒక బాణం తీసి, దాన్ని బావిలో పడవేయమని చెప్పి హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజి)కు అందజేశారు. బరా బిన్ ఆజిబ్ (రజి) ఆ బాణం తీసుకొనిపోయి బావిలో పడవేశారు. దాంతో బావిలో ఒక్కసారిగా నీటిఊట పెల్లుబికింది. చూస్తుండగానే ఆ నీటిఊట ఉప్పొంగి కొన్ని క్షణాల్లోనే బావి నీళ్ళతో నిండిపోయింది. ముస్లింలు సంతోషంతో ఆ నీటిని తనివితీరా త్రాగి స్నానాదులు ముగించుకున్నారు.

## అవిశ్వాసుల (హజ్) ఆటంకాలు-(119)

మక్కాలో ఖురైషీయులు ఖాలిద్ రాక కోసం తీవ్రంగా ఎదురుచూస్తున్నారు. ఖాలిద్ విజయవంతంగా తిరిగొస్తేనే తమకు అరేబియాలో గౌరవం దక్కుతుందని, లేకపోతే తాము శాశ్వతంగా అవమానభారంతో క్రుంగిపోక తప్పదని వారు భావించసాగారు.

ఖాలిద్ బిన్ వలీద్ రానేవచ్చాడు. అతను ఏం కబురు విన్పిస్తాడోనని ఖురైషీయులు ఊపిరి బిగబట్టి కూర్చున్నారు.

"మన పథకం తారుమారయింది. ముహమ్మద్, ఆయన అనుచరులు వేరే దారి గుండా హుదైబియాకు వచ్చి విడిదిచేశారు" అన్నాడు ఖాలిద్ రాగానే.

"ఏమిటీ! ముహమ్మద్ హుదైబియాకు వచ్చేశాడా!!" నాయకులంతా దిగ్భ్రాంతి చెందారు. క్షణంపాటు నిశ్శబ్దం రాజ్యమేలింది.

"అయితే ఇప్పుడేం చేద్దాం?"

"పదండి, దారున్నద్వాలో సమావేశమయి ఆలోచిద్దాం."

ఖురైష్ నాయకులంతా దారున్నద్వాలో సమావేశమయ్యారు. అందరి ముఖాలు మాడిపోయి ఉన్నాయి. ఏం చెయ్యాలో ఎవరికీ పాలుపోవడం లేదు.

కొంపదీసి ముస్లింలు మక్కా పట్నంలోకి చొచ్చుకొని వస్తే...? అమ్మ బాబోయ్! ఇంకేమయినా ఉందా!! ఉన్న పరువు, పలుకుబడులు కాస్తా మంట కలిసిపోవూ? సంఘంలో తలెత్తుకొని తిరగ్గలరా?

"కాదు, మనం ఏదో ఒకటి చేసి సంఘంలో గౌరవం దక్కించుకోవాలి" ఖురైషీయుల పౌరుషం పడగలు విప్పింది.

"మన బొందిలో ప్రాణం ఉన్నంత వరకు ముహమ్మద్ మక్కాలో అడుగు పెట్టడం అసంభవం." వారి ఆవేశం బుసలు కొట్టింది.

"ఇక్కడ మక్కాలో కూడా ముహమ్మద్ (సల్లం) అనుచరులు ఉన్నారు మన పక్కలో బల్లెంలా. ముస్లింలతో పేచీ పెట్టుకుంటే మనకు సర్వనాశనం తప్పదు" అంటూ వారిలో ఒకడు సందేహం వెలిబుచ్చాడు.

"ముహమ్మద్ మనతో యుద్ధం చేయడానికి రాలేదంటున్నారు కదా! అలాంటప్పుడు ఆయన మనకు ఎలాంటి హాని తలపెట్టే అవకాశం లేదు. ఒకవేళ అతను మనసు మార్చుకొని మనతో కయ్యానికి దిగుతాడే అనుకుందాం. అప్పుడు మనం వెన్నుజూపి పారిపోయేటంతటి పిరికి పందలమా? వాళ్ళను చీల్చిచెండాడమూ??" అన్నాడు మరొకడు రొమ్ము విరుచుకుంటూ.

"ఇంతకూ ఏం చేద్దామంటారు? వెంటనే ఏదో ఒక పథకం రూపొందించి పనిచేయక పోతే ప్రమాదం ముంచుకొస్తుంది" అన్నాడు అగ్రనాయకుడు అబూసుఫ్యాన్.

"బనీఖుజాఅ తెగ మనుషులు కొందరిని పంపుదాం. వారెళ్ళి ముహమ్మద్ కోరుతున్న దేమిటో తెలుసుకొని వస్తారు. దాన్ని బట్టి మనం నిర్ణయం తీసుకోవచ్చు."

"కాని ఖుజాఅ తెగవాళ్ళను పంపితే లాభం లేదు. వాళ్ళు ముహమ్మద్‌కు అనుకూలురు, ముస్లింల శ్రేయోభిలాషులు. అలాంటివారి వల్ల మనకు ప్రయోజనం కంటే ప్రమాదమే ఎక్కువ ఉంటుంది" అన్నాడు అబూసుఫ్యాన్.



"నువ్వేమీ భయపడకు. వాళ్ళజుట్టు మన చేతిలో ఉంది. మక్కాలోనే వారి పొలాలు, తోటలున్నాయి. వారి భార్యాపిల్లలు కూడా ఇక్కడే ఉన్నారు. ద్రోహం చేస్తే మన పట్టునుండి తప్పించుకొని ఎక్కడికీ పారిపోలేరు" అన్నాడు ఓ తలపండిన నాయకుడు.

ఈ ప్రతిపాదన అందరికీ నచ్చింది. ముస్లింల దగ్గరికి రాయబారం పంపవలసిన ప్రతినిధుల్ని కూడా ఎన్నుకోవడం జరిగింది.

ఖురైష్ ప్రతినిధి వర్గం దైవప్రవక్త (సల్లం) సన్నిధికి పోయింది. దైవప్రవక్త (సల్లం) ప్రతినిధి వర్గానికి ఘనంగా స్వాగతమిచ్చి ఆదరించారు. ప్రతినిధివర్గం నాయకుడు బుదైల్ బిన్ వరఖా తన రాకకు కారణం చెప్పాడు.

"బుదైల్! మీరు ఖురైషీయుల దగ్గరికెళ్ళి, ముస్లింలు కాబా దర్శనం కోసం వచ్చారని, వారి హృదయాల్లో కాబా పట్ల గౌరవభావం ఉందని చెప్పండి. వారు ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడకుండా ఉంటే మేము ప్రశాంతంగా కాబా దర్శనం చేసుకొని వెళ్ళిపోతాం" అన్నారు దైవప్రవక్త (సల్లం).

ప్రతినిధి వర్గం మక్కా తిరిగొచ్చింది. బుదైల్ విషయాన్ని ఖురైషీయులకు వివరిస్తూ కాబాదర్శనం కోసం వస్తున్న ఈ యాత్రికుల్ని అడ్డుకోవడం భావ్యం కాదని సలహా ఇచ్చాడు. ఈమాట విని ఖురైషీయుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

"ముహమ్మద్‌తో సంధి చేసుకోవాలి. ముస్లింలకు కాబాదర్శనం చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలి" అన్నారు కొందరు.

"వీల్లేదు. ముహమ్మద్ మక్కాపట్నంలో అడుగు పెట్టడానికి ఏమాత్రం వీల్లేదు" అన్నారు చాలామంది.

"నిజమే. ముహమ్మద్ మన భూభాగంపై అడుగుపెడితే మన పరువు కాస్తా మంటకలసి పోతుంది" అన్నాడు అబూసుఫ్యాన్.

"అయితే మరేం చేద్దాం?" అడిగారు మరికొందరు.

"హులైస్ బిన్ అల్ఖమాను పంపిద్దాం. అతని నాయకత్వంలోని అహాబీష్ తెగకున్న శౌర్య పరాక్రమాలు అందరికీ తెలుసు. అతని ద్వారా మన పని నెరవేరి, ముహమ్మద్ మదీనా తిరిగి వెళ్ళిపోతే మనకు శాంతీసంతృప్తులు లభిస్తాయి. ఒకవేళ ముహమ్మద్ అతని ప్రతిపాదనను తిరస్కరిస్తే అతనికి ఆవేశం వస్తుంది. అప్పుడతను ముస్లింలకు వ్యతిరేకంగా మనతో కలసి పోరాడుతాడు" అన్నాడు అబూసుఫ్యాన్.

అతని ప్రతిపాదన ప్రకారమే ఖురైషీయులు హులైస్ బిన్ అల్ఖమాను రాయబారిగా చేసి పంపించారు. దైవప్రవక్త (సల్లం) దూరాన్నుంచే హులైస్ రాకను గమనించి అనుచరులతో ఇలా అన్నారు:

"అదిగో హులైస్ వస్తున్నాడు. అతని తెగవాళ్ళు భయంకరమైన యోధులు. ఖుర్బానీ పశువుల్ని అతని ముందుకు తోలండి. వాటిని చూసి, మనం కాబాదర్శనం కోసం మాత్రమే వచ్చామని, వినాశం కోసం రాలేదని తెలుసుకుంటాడు."

ప్రియతమ నాయకుడి ఆదేశం ప్రకారం ముస్లింలు "లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్" అంటూ బలిపశువుల్ని హులైస్ ముందుకు తోలారు.

హులైస్ ఈ దృశ్యం చూశాడు. ఖుర్బానీ కోసం సాంప్రదాయకంగా తీర్చిదిద్దిన పశువుల గుంపు చూసి అతని కళ్ళు చెమర్చాయి. ఖురైషీయులు నిజంగానే ముస్లింలపై అన్యాయానికి పాల్పడుతున్నారని గ్రహించాడు. అందువల్ల అతను దైవప్రవక్త (సల్లం)ను కలుసుకోకుండానే మక్కా వెళ్ళిపోయాడు.

హులైస్ విజయవంతంగా తిరిగొస్తాడని, తమ గుండెల్లో మండుతున్న ప్రతీకార జ్వాలల్ని చల్లార్చే శుభవార్త మోసుకొస్తాడని ఖురైష్ నాయకులు తెగ సంబరపడిపోతూ అతని రాక కోసం వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నారు.

కాస్సేపటికి హులైస్ గంభీరవదనంతో వచ్చాడు. రాగానే ఖురైషీయుల ఆశలను వమ్ముచేస్తూ, వారి గుండెలకు తూట్లువేస్తూ ఇలా అన్నాడు:

"దైవగృహాన్ని దర్శించుకోవడానికి వస్తున్న ఈ భక్తుల్ని మీరు అడ్డగింప జూస్తున్నారా? దైవసాక్షి! ఇలాంటి విషయంపై మేము మీతో ఒప్పందం చేసుకోలేదు. యావత్తు అరబ్ తెగలన్నీ కాబాదర్శనం చేసుకోవచ్చుగాని, ఒక్క అబ్దుల్ ముత్తలిబ్ కొడుకే ఈ భాగ్యానికి నోచుకోలేడా? వంశప్రతిష్ఠ దృష్ట్యా చూసినా అతను మీకేమీ తీసిపోడే!

"ఒకవేళ మీరే గనక ముహమ్మద్‌ను కాబాగృహాన్ని సందర్శించనీయకపోతే నా అధీనంలో ఉన్న తెగలన్నిటినీ తీసుకొని మీ నుంచి వేరైపోతాను. అంతేకాదు, ముహమ్మద్ (సల్లం) పక్షాన నిలబడి మీ అంతు చూస్తాను" అన్నాడు హులైస్.

సింహగర్జనల్లాంటి ఈ మాటలు వినగానే ఖురైష్‌నాయకుల ముఖాన కత్తివాటుకు నెత్తుటి చుక్క లేకుండా పోయింది. అందరూ నిర్ఘాంతపోయి ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. పక్కకు పోయి కూడాబలుక్కున్నారు.

"వీడేదో పిడుగులా ఉన్నాడు. ఘనకార్యం వెలగబెట్టి వస్తాడనుకుంటే చివరికి మన పాలిటే తలకొరివిలా తయారయ్యాడే! మనకు సహాయం చేయకపోతే పోనీ, కనీసం వీణ్ణి వదిలించుకోనయినా వదిలించుకుందాం" అనుకున్నారు వారు.

"చూడు తమ్ముడూ! ఇది మా సొంత వ్యవహారం. దీన్ని మాకే వదిలెయ్. అందరికీ ఆమోదయోగ్యమయిన విషయం ఏదో మేము చూసుకుంటాం" అంటూ వారు హులైస్ కోపాన్ని చల్లార్చారు.

హులైస్ కోపం అంత తొందరగా ఎలా చల్లారిపోయిందోగాని, మొత్తానికి ఖురైష్ నాయకుల మాటలకు కాస్త మెత్తబడ్డాడు. వారి వ్యవహారంలో తాను జోక్యం చేసుకోనని చెప్పి అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

ఖురైషీయులు ఒకరికి కీడు తలపెట్టడానికి ప్రయత్నించి తామే కీడు కొనితెచ్చుకున్నారు. అయితే అది క్రియారూపం దాల్చి కాటేయకముందే దాన్ని చాకచక్యంగా వదలించుకొని 'హమ్మయ్య' అంటూ చల్లగా ఊపిరి పీల్చుకున్నారు.



ఖురైషీయులు ఈసారి ఉర్వా బిన్ మస్‌వూద్‌ని వాడుకోదలిచారు. ముస్లింల దగ్గరికి పోయిన ప్రతి రాయబారీ ఉత్తచేతులతో తిరిగిరావడం చూసిన ఉర్వా మొదట ఖురైషీయుల మాటల్ని త్రోసిపుచ్చాడు. కాని ఖురైషీయులు జిడ్డులా పట్టుకొని వదలిపెట్టక పోవడంతో చివరికి ఎలాగో ఒప్పుకున్నాడు.

ఉర్వా దైవప్రవక్త (సల్లం) దగ్గరికి పోయి ఇలా అన్నాడు:

"ముహమ్మద్! మీరు యుద్ధసన్నాహాలతో మీ స్వస్థలం మక్కాను జయించడానికి వచ్చారా? కాని అక్కడ ఖురైషీయులు మిమ్మల్ని మట్టుపెట్టేందుకు కాచుకొని ఉన్నారు. వారు మిమ్మల్ని ఎలాంటి పరిస్థితిలో కూడా మక్కాలో అడుగు పెట్టనీయమని ప్రతిన బూనారు. వారు తలచుకుంటే మీరు కట్టుకున్న ఆశాసౌధాలన్నీ ఒక్క దెబ్బతో కూలిపోతాయి. కాస్త మీరే ఆలోచించుకోండి."

ఈ మాటల్ని హజ్రత్ అబూబకర్ (రజి) సహించలేకపోయారు.

"ఇక చాలించు నీ మాటలు. దైవం నీ ముఖం మాడ్చ! మేము మా ప్రియతమ నాయకుడ్ని అంత సులభంగా వదలుకుంటా మనుకుంటున్నావా?" అన్నారు ఆయన.

"ఎవరితను?" అడిగాడు ఉర్వా.

"ఇతను ఖహాఫా కొడుకు అబూబకర్" సమాధానమిచ్చారు దైవప్రవక్త (సల్లం).

"ఇతను గతంలో నాకో మేలు చేసివున్నాడు. ఆ రుణాన్ని నేనింతవరకు తీర్చుకోలేదు. అదే గనక లేకపోయిఉంటే ఇతని నోటి దురుసుకు తక్షణమే సమాధానం ఇచ్చేవాణ్ణి" అన్నాడు ఉర్వా బిన్ మస్‌వూద్ లోలోన దహించుకుపోతూ.

ఆ తరువాత ఉర్వా దైవప్రవక్త (సల్లం)తో తన సంభాషణ కొనసాగించాడు. అతను చేతులు తిప్పి తిప్పి మాట్లాడుతూ ఆ చేతుల్ని మాటిమాటికి దైవప్రవక్త (స) నోటి దగ్గరికి పోనిస్తున్నాడు. దైవప్రవక్త (సల్లం) వెనుక ఖడ్గం తీసుకొని ఆయనకు ప్రత్యేక అంగరక్షకుడిగా నిలబడి ఉన్న హజ్రత్ ముగైరా (రజి) దాన్ని సహించలేక పోయారు.

ఆయన కత్తి దూసి చూపిస్తూ "జాగ్రత్త! నీ చేతుల్ని మరోసారి దైవప్రవక్త (సల్లం) నోటి దగ్గరికి పోనిచ్చావో.... అవి మళ్ళీ తిరిగిరావు" అన్నారు ఉరిమిచూస్తూ.

ఉర్వా పరిస్థితి గమనించాడు. ముహమ్మద్ (సల్లం) పట్ల ఆయన అనుచరులకున్న అచంచల విశ్వాసం, అపారమైన అభిమానాలు చూసి ఆశ్చర్యపోయాడు. ఏమయినప్పటికీ ముస్లింలు యుద్ధం చేయడానికి రాలేదని, రక్తపాతం వారి ఉద్దేశ్యం కాదని, కాబాదర్శనం కోసమే వచ్చారని గ్రహించాడు. అందువల్ల అతను ఖురైషీయుల గురించి ఇక పొగడటం మంచిది కాదని భావించి మక్కా తిరిగొచ్చాడు.

ఉర్వా కొంచెం దూరాన ఉండగానే అతని వాలకం చూసిన ఖురైష్ నాయకులకు అనుమానం వచ్చింది. అందువల్ల అతను దగ్గరికి వచ్చినప్పుడు వారు ఢీలా పడిపోయి ఏమాత్రం ఉత్సాహం చూపలేకపోయారు.

"మిత్రులారా! నేను కిస్రా (ఈరాన్) దర్బార్‌నీ చూశాను, ఖైసర్ (రోమ్) ఆస్థానం చూశాను. నజాషీ (అబిసీనియా) కొలువుని కూడా చూశాను. కాని దైవసాక్షి! ముహమ్మద్ (స)పట్ల ఆయన అనుచరుల్లో ఉన్న గౌరవ విశ్వాసాలను నేను ఏ చక్రవర్తి అనుచరుల్లోనూ ఇంతవరకు చూడలేదు. ముహమ్మద్ ఉజూ చేస్తుంటే ఆయన అనుచరులు ఆ ఉజూ నీటిని కూడా కింద పడనీకుండా పట్టుకొని ఎంతో పవిత్రంగా వాడుకుంటున్నారు. చివరికి ముహమ్మద్ తల నుండి ఓ వెంట్రుక ఊడినా దాన్ని కూడా వారు కళ్ళకద్దుకొని భద్రపరచు కుంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఎలాంటి కిష్ట పరిస్థితులు ఎదురయినా సరే వారు తమ నాయకుడ్ని వదలుకోవడానికి ఏమాత్రం సిద్ధంగా లేరు. దీన్నిబట్టి మీరే ఆలోచించుకోండి" అన్నాడు ఉర్వా బిన్ మస్‌వూద్.

కాని ఇంత చెప్పినా ఖురైష్ నాయకులకు తలకెక్కలేదు. ఏమైనా సరే ముస్లింలను మక్కాలో ప్రవేశించనీయకూడదని గట్టిగా నిర్ణయించుకున్నారు వారు.

"మరి ముహమ్మద్ (సల్లం) బెడదను వదిలించుకునేదెలా? దీనికి శాశ్వత పరిష్కారం ఏమిటీ?" తీవ్రంగా ఆలోచించారు.

ఆ తరువాత వారు యాభై మంది ఆరితేరిన విలుకాండ్రను ఎన్నుకున్నారు. రాత్రివేళ పోయి ముహమ్మద్ (స)పై ఆకస్మిక దాడి చెయ్యమని చెప్పి వారిని పంపించారు.

ఈ యాభైమంది విలుకాండ్రు రాత్రివేళలో హుదైబియా ప్రాంతానికి చేరుకున్నారు. కాని పథకం తల్లక్రిందులయింది. పాపం వారు ముస్లింల శిబిరాలపై నాలుగైదు బాణాలు వదిలారో లేదో తక్షణమే ముస్లింలు మేల్కొని వారిని బందీలుగా పట్టుకొని దైవప్రవక్త (సల్లం) ముందు ప్రవేశపెట్టారు.

దైవప్రవక్త (సల్లం)పై దాడి చెయ్యడానికి వచ్చిన ఈ గెరిల్లా వీరులు చివరికి గొర్రెల్లా దైవప్రవక్త (సల్లం) సమక్షంలో తలలొంచి నిలబడవలసి వచ్చింది.

ప్రవక్త అనుచరులు వారి వైపు ఉరిమిచూస్తున్నారు. బందీలు ఇక తమకు చావు తప్పదని తలచి వణికిపోతున్నారు.

"ఇంత ద్రోహానికి పాల్పడిన మీకు నేను ప్రాణభిక్ష ఎలా పెట్టాలి?" దైవప్రవక్త (సల్లం) వారి కళ్ళలో సూటిగా చూస్తూ అడిగారు.

"అయ్యా! మా బుద్ధి గడ్డి తిన్నది. మమ్మల్ని కనికరించండి. మీరు ఎంతో దయార్ద్ర హృదయులు. మీ క్షమాగుణంపై మాకు నమ్మకం ఉంది. దయచేసి మమ్మల్ని నిరాశ పరచకండి" అని పరిపరి విధాల వేడుకున్నారు శత్రుసైనికులు.

"సరే వెళ్ళండి, మిమ్మల్ని క్షమిస్తున్నాను. ముహమ్మద్ ఇక్కడకు రక్తపాతం జరపడా నికి రాలేదని మీ జాతివాళ్ళకు గట్టిగా చెప్పండి ఇప్పుడయినా వారికి స్పృహ వస్తుందేమో" అన్నారు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం).

శత్రుసైనికులు బ్రతుకు జీవుడా అంటూ ముస్లింల పట్టు నుండి బయటపడ్డారు. అయితే ఇంతటి ఘోరమైన నేరాన్ని సయితం ముహమ్మద్ (సల్లం) క్షమించినందుకు



వారు చాలా ఆశ్చర్యపోయారు. ఏమైనా ఇక తమ జాతికి కీడు తప్పదనుకున్నారు. కాస్త అవమానం జరిగినా కనీసం ప్రాణాలైనా దక్కాయని సంతోషిస్తూ వారు మక్కా దారిపట్టారు.

ఇలా కవ్వించి కయ్యం పెట్టుకోవాలన్న ఖురైషీయుల ఎత్తుగడ నీరుగారిపోయింది.

## రిజ్వాన్ శపథం-(120)

దైవప్రవక్త (సల్లం) ఈసారి ఖురైషీయులకు తాము కాబాదర్శనం నిమిత్తమే వచ్చామని తెలియజేయడానికి హజ్రత్ ఖరాష్ బిన్ ఉమయ్యా (రజి)ని పంపారు.

హజ్రత్ ఖరాష్ (రజి) ఒంటె ఎక్కి మక్కా బయలుదేరారు. ఆయన నేరుగా అబూ సుఫ్యాన్ ఇంటికి వెళ్ళారు. ఆ సమయంలో అబూసుఫ్యాన్ ఇంటి ఆవరణలో కూర్చొని ఉన్నాడు. ఆయనతో పాటు ఇక్రమా బిన్ అబూజహల్, ఖాలిద్ బిన్ వలీద్, అమ్ర్ బిన్ ఆస్ వగైరా ప్రముఖులు కూడా ఉన్నారు. వారిలో ముస్లింల దగ్గరికి రాయబారిగా వెళ్ళివచ్చిన హులైస్ బిన్ అల్ఖమా కూడా ఉన్నాడు.

"ఖురైషీయులారా! నేను దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) ప్రత్యేక దూతను. మేము మీతో యుద్ధం చేయడానికి రాలేదని, కాబాదర్శనం కోసం మాత్రమే వచ్చామని తెలియ జేయడానికి నేను మీదగ్గరికి వచ్చాను. కాబట్టి మీరు మమ్మల్ని కాబా దర్శనం చేసుకో నివ్వండి. మమ్మల్ని నిరోధించకండి" అన్నారు హజ్రత్ ఖరాష్ (రజి).

"ఒకవేళ మేము మిమ్మల్ని కాబా దర్శనం చేసుకోనివ్వకుండా నిరోధిస్తే...?" అన్నాడు ఇక్రమా బిన్ అబూజహల్.

"అప్పుడు మేము యుద్ధం చేస్తాం. మిమ్మల్నందర్నీ హతమార్చి కాబాదర్శనం చేసు కుంటాం" అన్నారు హజ్రత్ ఖరాష్ (రజి) ఎలాంటి జంకూ గొంకూ లేకుండా.

"ఓహో! నువ్వు మమ్మల్ని బెదిరించడానికి వచ్చావన్న మాట!! కాని నీ చావుబ్రతుకులు మా చేతిలో ఉన్న సంగతి మరచిపోతున్నావు సుమా!" అన్నాడు ఇక్రమా.

"పొరపడుతున్నావు ఇక్రమా! ప్రతి మనిషి చావుబ్రతుకులు సర్వలోక ప్రభువయిన అల్లాహ్ చేతిలో ఉన్నాయి. ఆయన ఆజ్ఞ లేనిదే నువ్వేమీ చెయ్యలేవు."

అల్లాహ్ పేరు వినగానే అవిశ్వాసులు మండిపడ్డారు. వెంటనే వారిలో కొందరు లేచి ఖరాష్ (రజి) తీసుకొచ్చిన ఒంటెను చంపి, ఖరాష్ (రజి) మీదికి లంఘించారు.

హజ్రత్ ఖరాష్ (రజి) ఆగ్రహోదగ్రులై చర్రున కత్తి దూసి వారిముందు నిలబడ్డారు.

"నీచులారా! మీరు చర్చలకు వచ్చిన రాయబారినే చంపడానికి సిద్ధమయ్యారా!! మీలో అసలు ఆత్మాభిమానం మచ్చుకైనా ఉందా? మీరంతగా యుద్ధజ్వాలల కోసం వెంపర్లాడుతుంటే, రండి మాతో పోరాడండి. కాని ఒక విషయం గుర్తుంచుకోండి. నేను ఏ ప్రజల తరఫున రాయబారిగా పంపబడ్డానో, వారు మీపై విరుచుకుపడి మిమ్మల్ని సమూలంగా మట్టుపెడతారు. నా మరణం మీ అందరిపాలిట మరణమృదంగం అవుతుంది" అన్నారు ఆయన.

ఖడ్గం చేతిలో పట్టుకొని కళ్ళలో నిప్పులు కురిపిస్తున్న ఖరాష్ (రజి)ని చూసి సత్య తిరస్కారులు వెనుకంజ వేశారు. హులైస్‌కు కూడా ఖురైషీయుల వైఖరి నచ్చలేదు.

"ఖురైషీయులారా! ఏమిటి ఈ అన్యాయం? ఎంతటి పిరికిపంద జాతి కూడా రాయబారిని వధించదు. మీరు గనక ఇతడ్ని చంపితే మీజాతి మీద మాయని మచ్చ ఏర్పడుతుంది. మీకు ధైర్యముంటే బయటికెళ్ళి ముస్లింలతో పోరాడండి" అన్నాడతను.

"నిజమే. రాయబారిగా వచ్చిన మనిషిని చంపితే మన జాతికి పెద్ద కళంకం వస్తుంది. ఖరాష్! నీవు వెళ్ళిపోయి, మేము ముస్లింలను ఎట్టి పరిస్థితిలోనూ మక్కాలో ప్రవేశించనీయం అని మీ ప్రవక్తకు చెప్పెయ్యి" అన్నాడు ఇక్రమా.

అప్పుడు హజ్రత్ ఖరాష్ (రజి) ఖడ్గం వరలో పెట్టేసి వెళ్ళిపోయారు. ఆయన కాలినడకన హుదైబియా చేరుకొని దైవప్రవక్త (సల్లం)కు విషయం తెలియజేశారు.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) తన అనుచరులతో ఖురైషీయుల విషయం గురించి సంప్రదించారు. ఖురైషీయులతో చర్చలు జరిపి తగిన పరిష్కారం తెచ్చే సమర్థుడైన ప్రతినిధిని పంపదలచుకున్నారు. ఈ పని కోసం హజ్రత్ ఉస్మాన్ (రజి)ని ఎంపిక చేసి మక్కా నగరానికి పంపించారు.

మక్కాలో హజ్రత్ ఉస్మాన్ (రజి) సోదరుడు ఒకాయన ఉన్నాడు. అతని మద్దతుతో హజ్రత్ ఉస్మాన్ (రజి) మక్కా వెళ్ళారు. అక్కడ ఖురైష్ నాయకుల్ని కలుసుకొని వచ్చిన పని వారికి వివరించారు.

"మేము మీ ముందు రెండే రెండు విషయాలు ఉంచుతున్నాం. మమ్మల్ని కాబా ప్రదక్షిణ చేసుకోనివ్వండి. దానికి మీరు ఒప్పుకోకపోతే యుద్ధానికి సిద్ధంగా ఉండండి" అన్నారు ఆయన.

"అలా కుదరదు. కావాలంటే నువ్వొక్కడివే కాబాప్రదక్షిణ చేసుకో. అంతేగాని ఇతరుల ప్రస్తావన ఎత్తకు. వారు అటు నుంచి అటే వెళ్ళిపోవాలి" అన్నారు ఖురైషీయులు.

ఈ మాటలు వినగానే హజ్రత్ ఉస్మాన్ (రజి)కు వళ్ళు మండిపోయింది.

"ఏమిటీ? ముస్లింలు కాబాదర్శనానికి నోచుకోకుండా వెళ్ళిపోవాలా, నేనొక్కడ్ని మాత్రం కాబాప్రదక్షిణ చేసుకోవచ్చా? కాదు, ముస్లింలందరికీ కాబాప్రదక్షిణ చేసుకునే అవకాశం ఇవ్వాల్సిందే" అన్నారు హజ్రత్ ఉస్మాన్ (రజి) పట్టుదలతో.

ఖురైషీయులు అందుకు ససేమిరా ఒప్పుకోలేదు. హజ్రత్ ఉస్మాన్ (రజి) కూడా పట్టు విడవకుండా కాబాదర్శనం చేసుకునే అవకాశాన్ని ముస్లింలందరికీ ఇవ్వాలని అన్నారు. ఇలా చర్చలు ఎటూ తెగకుండా కొన్నాళ్ళు జరిగిపోయాయి.

చర్చలు ఇంకా ఓ కొలిక్కి రాలేదు. అదీగాక ఖురైషీయులు హజ్రత్ ఉస్మాన్ (రజి)ని మక్కా నుండి వెళ్ళనివ్వకుండా ఆపి ఉంచారు. ఈలోగా ఉస్మాన్ (రజి)ని హత్య చేశారని జనంలో పుకారు పుట్టింది. ఆయన తిరిగి రాకపోవడంతో ముస్లింలు కూడా ఈ వార్త నిజమేనని భావించారు.



ఇంకేముంది! ముస్లింలలో పెద్ద కలకలం చెలరేగింది. వారు ఆగ్రహోదగ్రులయి పోయారు. అందరిలోనూ పౌరుషం పడగ విప్పి నాట్యమాడసాగింది.

"ఎంత ద్రోహానికి వడిగట్టారు వీరు! పైగా పవిత్ర మాసంలో ఈ ఘాతుక చర్య!! వీరికి పవిత్ర మాసం పట్లగాని, యాత్రికుల పట్లగాని ఏ మాత్రం గౌరవం లేదు" అన్నారు దైవప్రవక్త (సల్లం) ఈ మాట విని.

అయితే ఇప్పుడు ముస్లింల తక్షణ కర్తవ్యం ఏమిటీ?

రాజనీతి ఉల్లంఘించి ఒక దౌత్యవేత్తను చంపడమంటే స్పష్టంగా యుద్ధ ప్రకటన చేయడమే. అందువల్ల వెంటనే దైవప్రవక్త (సల్లం) ప్రధాన అనుయాయుల నందరినీ సమావేశపరిచారు.

"ఖురైషీయుల నుండి ఉస్మాన్ (రజి) హత్యకు ప్రతీకారం తీర్చుకోవడం మన విధి. ప్రతీకారం తీర్చుకోకుండా మనం ఇక్కడ్నుంచి ఒక్క అడుగు కూడా వెనక్కి మరల కూడదు" అన్నారు దైవప్రవక్త (సల్లం) గభీర వదనంతో.

ఈమాట చెప్పిన తరువాత ఆయన కొంచెం దూరాన ఉన్న ఓ తుమ్మచెట్టు నీడకు పోయి కూర్చున్నారు. అనుచరులు కూడా అక్కడికెళ్ళి తమ ప్రియతమ నాయకుని చుట్టూ గుమికూడారు.

ఓ మహోన్నత కార్యం కోసం వారు కంకణం కట్టుకున్నారు. దైవప్రీతి కోసం. ధర్మ రక్షణ కోసం ఒక మహోద్యమానికి సిద్ధమయ్యారు. దైవప్రవక్త (సల్లం)కు పూర్తిగా విధేయులయి పోయి దైవధర్మం పరిరక్షణ కోసం ముస్లింలంతా తమ సర్వస్వాన్ని త్యాగం చెయ్యడానికి ముందుకొచ్చారు.

దైవప్రవక్త (సల్లం) చేయి జాపారు. అనుచరులు ఒక్కొక్కరే ముందుకొచ్చి ఆయన చేతిలో చేయి వేసి, శపథం చేశారు. ఘోరమైన శపథం! ఇక విజయమో, వీరమరణమో తేల్చుకోవడమే తరువాయి పని!!

## హుదైబియా శాంతి ఒప్పందం-(121)

మక్కాలో ఖురైష్ నాయకులు మరోసారి సమావేశమయి ఓ నిర్ణయానికి వచ్చారు.

"ఈసారి సుహైల్ బిన్ అమ్ర్‌ని పంపుదాం. అతను ముహమ్మద్ దగ్గరకు వెళ్ళి ఈ సంవత్సరం ముహమ్మద్, ఆయన అనుచరులు వెళ్ళిపోయి వచ్చేయేడు ఉమ్రా చెయ్యమని అయనకు నచ్చజెపుతాడు" అన్నారు ఖురైష్ నాయకులు.

ఈ విధంగా చేస్తే తమ గౌరవప్రతిష్ఠలకు భంగంరాదని వారి ఉద్దేశ్యం.

ఆ తరువాత వారు హజ్రత్ ఉస్మాన్ (రజి)ని పంపివేశారు. ఆయన హుదైబియాకు తిరిగివచ్చారు. ఆయన్ని చూడగానే ముస్లింలంతా తాము విన్న వార్త నిజం కాదని గ్రహించి చల్లగా ఊపిరి పీల్చుకున్నారు. అంతలో ఖురైషీయుల దౌత్యవేత్తగా సుహైల్ బిన్ అమ్ర్ కూడా అక్కడికి చేరుకున్నాడు.

కాని ఇక్కడ చూస్తే ముస్లింలు పెద్దఎత్తున యుద్ధసన్నాహాలు చేయడంలో నిమగ్నులై ఉన్నారు. వారి యుద్ధసన్నాహాలు చూసి సుహైల్ భయపడ్డాడు. ఎలాగైనా ఈ యుద్ధాన్ని నిలుపుదల చేయించాలని తలచి దైవప్రవక్త (సల్లం) దగ్గరకు వెళ్ళాడు.

"మహాశయా! నేను మీదగ్గరకు చర్చలు జరపడానికి వచ్చాను. కాని ఇక్కడ చూస్తే మీ అనుచరులు యుద్ధసన్నాహాలు చేస్తున్నట్లు కన్పిస్తున్నారు. అక్కడేమో ఖురైషీయులు ఈ ఏడు మిమ్మల్ని మక్కాలో ప్రవేశించనీయమని తీవ్రంగా ప్రతిన బూనారు. నేను కొన్ని షరతులు తీసుకొచ్చాను. వీటిలో మన ఉభయపక్షాల శ్రేయస్సు ఉంది. వీటిని మీరు ఒప్పుకుంటే ఓ భయంకర యుద్ధాన్ని నివారించినవారవుతారు. అనేకమంది అమాయకుల ప్రాణాలు దక్కుతాయి. అంతటి మహత్కార్యం సాధించిన ఘనత కూడా మీకు లభిస్తుంది" అన్నాడు సుహైల్.

"సరే, చెప్పండి. ఏమిటా షరతులు?" అడిగారు దైవప్రవక్త (సల్లం).

"(1) ఈ సంవత్సరం ముస్లింలు మదీనా తిరిగివెళ్ళిపోయి వచ్చే సంవత్సరం రావాలి. అయితే అప్పుడు మీరు మక్కాలో మూడురోజులు మాత్రమే ఉండాలి. మీరంతా మీ వెంట ఒక్కొక్క ఖడ్గం మాత్రమే తెచ్చుకోవాలి ఆ ఖడ్గాలు కూడా వరలలో పెట్టుకొని తెచ్చుకోవాలి. అవి తప్ప ఇతర ఆయుధాలేమీ ఉండకూడదు" అన్నాడు సుహైల్.

"ఊ... ఇంకా?"

"(2) మన ఉభయ పక్షాల మధ్య పదేళ్ళ వరకు యుద్ధంగాని, ఒకరికి వ్యతిరేకంగా మరొకరు ఎలాంటి ప్రతీకారచర్యా తీసుకోవడంగాని జరగరాదు."

"ఊ.... ఇంకేమయినా ఉన్నాయా?"

"(3) ఈ పదేళ్ళ కాలంలో ఖురైషీయులకు చెందిన ఏ మనిషి అయినా అతని సంరక్షకుని అనుమతి లేకుండా మీ దగ్గరకు పారిపోయి వస్తే అతడ్ని మా దగ్గరికి తిప్పి పంపాలి. అయితే ముస్లింలలో ఎవరైనా మదీనా నుండి మక్కా వస్తే మటుకు మేమతడ్ని మీ దగ్గరికి తిప్పి పంపడం జరగదు."

దైవప్రవక్త (సల్లం) క్షణంపాటు కళ్ళు మూసుకొని మౌనంగా ఉండిపోయారు. దైవ సందేశం అవతరించే సమయంలో ఆయన పరిస్థితి ఇలాగే మారుతుంది.

ఆయన అనుచరులు మాత్రం క్రూరమైన ఈ షరతులు విని ఆగ్రహంతో ఉడికి పోసాగారు. అయితే దైవప్రవక్త (సల్లం)ను చూసి ఆవేశాన్ని బలవంతంగా అణచుకున్నారు. దైవప్రవక్త (సల్లం) కళ్ళు తెరచి ఇలా అన్నారు:

"సరే, చెప్పండి ఇంకా."

"(4) ఈ పదేళ్ళ కాలంలో ఏ అరబ్బు తెగయినా సరే తన ఇష్టమొచ్చిన పక్షంతో స్నేహఒప్పందం చేసుకోవచ్చు.

"ఇవీ ఖురైషీయుల సంధిషరతులు. ఇక మీరే ఆలోచించి నిర్ణయించుకోండి. మీ వివేచనా నిర్ణయాలపై మాకు పూర్తి నమ్మకం ఉంది" అన్నాడు సుహైల్ బిన్ అమ్ర్.



దైవప్రవక్త (సల్లం) ఈ షరతులన్నిటిని అంగీకరించి సంధి పత్రం రాయమని హజ్రత్ అలి (రజి)ని ఆదేశించారు.

దైవప్రవక్త (స) తమ ఆశలకు భిన్నంగా ఇలాంటి అన్యాయమైన షరతుల్ని ఆమోదిస్తా రని ముస్లింలు ఊహించనైనా ఊహించలేకపోయారు. వారు విస్తుపోయి దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఆ తర్వాత వారిలో ఆవేశం, ఆత్మాభిమానాలు పెల్లుబికాయి.

"దైవప్రవక్త (సల్లం) ఇలాంటి దారుణమైన షరతుల్ని ఎందుకు ఒప్పుకున్నట్లు? ఒకవేళ నచ్చజెప్పినా ఖురైషీయులు వినకుండా మొండికేసి మనల్ని కాబాదర్శనం చేసుకో నీయకుండా నిరోధిస్తే, వారి మత్తు మంకుతనాలను వదలగొట్టగల శక్తియుక్తులు మనకు లేవా? వాళ్ళు మనల్ని మక్కాలో ప్రవేశించనీయకుండా ఎన్నటికీ అడ్డుకోలేరు" అని చెప్పుకున్నారు వారు తమలోతాము.

హజ్రత్ ఉమర్ (రజి) ఆవేశం అణచుకోలేక దైవప్రవక్త (సల్లం) దగ్గరకు వెళ్ళారు.

"ఏమిటీ, మీరు దైవప్రవక్త కాదా?!" అన్నారు ఆయన.

"అందులో సందేహం ఏముంది?"

"మనం ముస్లిములం కామా?!"

"నిస్సందేహంగా మనం ముస్లిములమే."

"వారు బహుదైవారాధకులు కాదా?!"

"అందులో కూడా ఎలాంటి అనుమానం లేదు."

"అయితే మరి మనం ధర్మం విషయంలో ఈ అవమానం భరించవలసిన అగత్యం ఏమిటీ? ఈ విధంగా వారికి లోకువయి సంధి చేసుకోవడం ఎందుకు?"

"ఉమర్! ఆవేశపడకు. నేను దేవుని దాసుడ్ని. ఆయన సందేశహరుడ్ని. ఇది ఆయన నిర్ణయమే. ఆయన మనకు నష్టం వాటిల్లనివ్వడు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

హజ్రత్ ఉమర్ (రజి) కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. ఆయన మనసు కుదుటపడ లేదు. అక్కడ్నుంచి లేచి హజ్రత్ అబూబకర్ (రజి) దగ్గరికెళ్ళి ఇలాగే ప్రశ్నించారు.

"ఉమర్! ఆందోళన చెందకు. ముహమ్మద్ (సల్లం) దేవుని సందేశహరుడు. ఆయన ఏది చేసినా దైవాజ్ఞ ప్రకారమే చేస్తారు. కాస్త ఓపిక పట్టు. దేవుడు మనకే విజయం చేకూర్చుతాడని ఆశించు" అన్నారు హజ్రత్ అబూబకర్ (రజి).

హజ్రత్ ఉమర్ (రజి) కకావికలమైన మనసుతో అక్కడ్నుంచి వెళ్ళారు.

దైవప్రవక్త (స) ఆదేశాన్ని శిరసావహిస్తూ హజ్రత్ అలి (రజి) సంధి పత్రం రాయడానికి సిద్ధమయ్యారు.

"అలి! వ్రాయ్, కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో" అన్నారు దైవప్రవక్త (సల్లం).

“ఆగండి. అలాంటి పదాలు రాయడం మాకు అలవాటు లేదు. కరుణామయు డెవరో, కృపాసాగరుడెవరో మాకు తెలియదు. అల్లాహ్ పేరుతో అని మాత్రమే రాయండి” అన్నాడు సుహైల్ ఆదిలోనే ఆక్షేపిస్తూ.

“సరే అలాగే రాస్తాం.... అలి! వ్రాయ్... ఈ దిగువ విషయాలపై దైవప్రవక్త ముహమ్మద్, సుహైల్ బిన్ అమ్రితో సంధి చేసుకున్నాడు.”

హజ్రత్ అలి (రజి) రాయడం మొదలెట్టారు. కాని సుహైల్ వెంటనే అలి (రజి) చేయి పట్టుకొని “ఇలా కాదు. ఖురైషీయులు మిమ్మల్ని దైవప్రవక్తని ఒప్పుకుంటే ఇక ఈ జగడం, రాజీ ఒప్పందాలు ఎందుకు? మీరు మీ తండ్రి పేరు మాత్రమే రాయించాలి” అన్నాడు కటువుగా.

“మీరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా నేను మాత్రం దైవప్రవక్తనే” అంటూ....

“అలి! వ్రాయ్... ఈ దిగువ షరతులపై అబ్దుల్లా కుమారుడు ముహమ్మద్, అమ్ర్ కొడుకు సుహైల్‌తో సంధి చేసుకున్నాడు అని వ్రాయ్” అన్నారు దైవప్రవక్త (సల్లం).

సంధిపత్రం రాయడం ఇంకా పూర్తికానేలేదు. అంతలో ఒక యువకుడు మక్కా నుంచి పారిపోయి రొప్పుతూ ముస్లింల దగ్గరికి వచ్చాడు. కాళ్ళకు, చేతులకు సంకెళ్ళు ఉన్నాయి. వాడిపోయిన అతని ముఖంలో దైన్యం కొట్టవచ్చినట్లు కన్పిస్తోంది.

ఈ పీడితుడు ఎవరో కాదు, సుహైల్ బిన్ అమ్ర్ కుమారుడే. పేరు అబూజందల్. ఇస్లాం స్వీకరించిన నేరానికి అతని జీవితం మక్కాలో దుర్భరమై పోయింది. ఖురైషీయుల చేతుల్లో ఎన్ని బాధలు పడ్డాడో ఈ అభాగ్యజీవి! వారి నుండి తప్పించుకోడానికి మరెన్ని తిప్పలు పడవలసి వచ్చిందో!!

హజ్రత్ అబూజందల్ (రజి)ని చూడగానే సుహైల్ తోక తొక్కిన పాములా కస్సు మన్నాడు. అతని కళ్ళు అగ్నికణాలయ్యాయి. వెంటనే అతను కొడుకు దగ్గరికి పోయి పళ్ళు పటపట నూరుతూ విసురుగా ఒక్క లెంపకాయ వేశాడు.

“వీడు నాకొడుకు. నేను వీడి సంరక్షకుడ్ని. ఒప్పందం ప్రకారం మాకు చెందిన ఏ ఒక్కరినీ నిరోధించడానికి మీకిప్పుడు ఎలాంటి అధికారం లేదు. కనుక వీడ్ని నాకప్ప గించండి” అన్నాడు సుహైల్.

“సంధిపత్రం రాయడం ఇంకా పూర్తికాలేదు కదా?” అన్నారు దైవప్రవక్త (స).

“సంధిపత్రం రాయడం పూర్తికాకపోయినా సంధిషరతులు మన మధ్య ముందే నిర్ణయమై పోయాయి” అన్నాడు సుహైల్.

“ఆవేశపడకండి. ఇతడ్ని మా దగ్గర వదలి పెట్టండి.”

“వీల్లేదు. అలాగైతే మాకీ ఒప్పందం అవసరమే లేదు” అన్నాడు సుహైల్ కటువుగా.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఎంతో అనునయంగా నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. కాని సుహైల్ మొండికేశాడు. కారుణ్యమూర్తి (స) హృదయం బాధగా



మూల్గింది. కాసేపు తల వంచుకొని మౌనంగా ఉండిపోయారు. ఆ తరువాత ఆయన అబూజందల్ (రజి) వైపు తిరిగారు.

“బాబూ! సహనం వహించు. దేవుడు తప్పకుండా ఏదో ఓ దారిని సుగమం చేస్తాడు. ఇప్పుడు ఒప్పందం జరిగిపోయింది. మనం వాగ్దానభంగం చేయలేము కదా!” అన్నారు ఆయన దయార్ద్ర హృదయంతో.

సంధిపత్రం రాయడం పూర్తయింది. సంతకాలు కూడా అయ్యాయి. తర్వాత సుహైల్ ఆవేశంతో ఊగిపోతూ కొడుకు మెడ పట్టుకొని ఈడ్చుకుంటూ తీసికెళ్ళసాగాడు.

“ముస్లిం సోదరులారా! నేను ఇస్లాం స్వీకరించాను. నన్నీ పరిస్థితిలో చూడదలిచారా మీరు? నన్ను మళ్ళీ అవిశ్వాసుల కబంధహస్తాల్లో పెడుతున్నారా?” అంటూ అబూజందల్ (రజి) చంటిపిల్లాడిలా విలపించారు.

హృదయవిదారకమయిన ఈ దృశ్యం చూసి ముస్లింలు చలించిపోయారు. హజ్రత్ ఉమర్ (రజి) ఉండబట్టలేక వర నుంచి ఖడ్గం తీసి అబూజందల్ (రజి) దగ్గరికి పోయి “ఇదిగో, ఈ కత్తి తీసుకొని ఎదిరించి నిన్ను నీవు కాపాడుకో” అన్నారు.

కాని హజ్రత్ అబూజందల్ (రజి) అందుకు సాహసించలేకపోయారు. సుహైల్ ఆయన్ని బలవంతంగా మక్కా పట్నానికి లాక్కెళ్ళాడు.

ముస్లింలు కోపోద్రేకాలను బలవంతంగా దిగమింగి నిస్సహాయంగా చూస్తూ ఉండి పోయారు. ఒప్పందంలోని నాల్గవ షరతు ప్రకారం ఖుజాఅ తెగవాళ్ళు ముస్లింల పక్షంతో కలిశారు. బకర్ తెగ ఖురైషీయులతో చేతులు కలిపింది.

## దివి నుండి దిగిన విజయవార్త-(122)

ఆ తరువాత దైవప్రవక్త (స) తన అనుచరులకు, అందరూ తలలు గొరిగించుకొని, ఖుర్బానీ పశువుల్ని బలివ్వవలసిందిగా ఆదేశించారు. కాని ప్రవక్త అనుచరులు తాము అవిశ్వాసులకు లొంగిపోయి వారి క్రూర షరతుల్ని అంగీకరించవలసి వచ్చిందన్న విచారం లోనే ఇంకా ఉన్నారు. అంచేత ఎవరూ దైవప్రవక్త (స) ఆజ్ఞ పాటించే స్థితిలో లేరు.

అనుచరులు తన ఆజ్ఞ పాటించకపోవడం చూసి దైవప్రవక్త (స) ఆశ్చర్యపోయారు. బాధపడ్డారు కూడా. ఆయన విచారవదనంతో తన శిబిరంలోకి వచ్చారు.

“ఈరోజు ప్రజలకు ఏమయిందో, నా ఆదేశాన్ని పాటించడానికి సిద్ధంగా లేరు” అన్నారు ఆయన సతీమణి హజ్రత్ ఉమ్మెసల్మా (రజి)తో.

“ఏమయింది? మీరేం ఆదేశించారు?”

“నేను తలలు గొరిగించుకొని బలిపశువుల్ని ఖుర్బానీ ఇవ్వమని ఆదేశించాను.”

“సంధి రాతల వల్ల మీ అనుచరులు విచారగ్రస్తులయి ఉన్నందున మీ ఆజ్ఞను పాటించలేకపోతున్నారు. అందువల్ల ముందుగా మీరు తల గొరిగించుకోండి. మిమ్మల్ని చూసి వారు కూడా అలా చేస్తారు” అని చెప్పారు హజ్రత్ ఉమ్మెసల్మా (రజి).

ఈ అభిప్రాయం సమంజసంగా తోచింది. వెంటనే ఆయన మంగలిని పిలిపించుకొని తల గొరిగించుకున్నారు. ఆయన్ని చూసి అనుచరులు కూడా తలలు గొరిగించుకోవడం ప్రారంభించారు.

ఆ తరువాత అందరూ బలిపశువుల్ని జిబహ్ చేసి మదీనాకు తిరుగు ప్రయాణమయ్యారు. ప్రయాణం చాలా భారంగా సాగుతోంది. మదీనా నుండి బయలుదేరినప్పటి ఉత్సాహం తిరుగుప్రయాణంలో కన్పించడం లేదు.

ఖురైషీయులు విధించిన దారుణ షరతులు దైవప్రవక్త (స) ఎందుకు ఆమోదించారో ఎంత ఆలోచించినా అనుచరులకు అర్థం కాలేదు. ఈ ఒప్పందంలో వారికి అంతా నష్టమే కన్పిస్తోంది. ఎంతో ఉత్సాహంతో కాబాలయాన్ని దర్శించుకుందామని వస్తే, కాబా దర్శనభాగ్యం లభించకపోగా చివరికిలా తమ ఆత్మాభిమానానికి విఘాతం కలిగించే షరతులకు లొంగిపోవలసి వచ్చింది.

ఈ విషయాన్ని గురించి హజ్రత్ ఉమర్ (రజి) ప్రయాణంలో కూడా దైవప్రవక్త (సల్లం)ను అనేకసార్లు అడిగారు. కాని దైవప్రవక్త (సల్లం) ఎలాంటి సమాధానం ఇవ్వకుండా మౌనంగా ఉండిపోయారు. దాంతో ఉమర్ (రజి)కు దుఃఖం పొరలివచ్చింది. దైవప్రవక్త (సల్లం)ను విసిగించానే అని ఆయన లోలోన బాధపడసాగారు. కాస్సేపటికి హఠాత్తుగా వెనుక నుండి ఓ పిలుపు వినవచ్చింది.

"ఉమర్! దైవప్రవక్త (సల్లం) నిన్ను పిలుస్తున్నారు."

దైవప్రవక్త (సల్లం) పిలుస్తున్నారనగానే ఉమర్ (రజి) గుండెలు దడదడలాడాయి. కొంపదీసి తాను చేసిన తప్పుకు దివ్యావిష్కృతి ద్వారా దైవాగ్రహం విరుచుకుపడలేదు కదా అన్న అనుమానం వచ్చి ఆయన ఓ క్షణం పాటు నిలువునా కంపించిపోయారు. అలా భయపడుతూనే ఆయన దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళారు.

కాని అక్కడ చూస్తే దైవప్రవక్త (సల్లం) దివ్యమోము పూర్ణచంద్రుడిలా వెలిగిపోతోంది. పెదవులపై దరహాసం తొణికిసలాడుతోంది.

"ఉమర్! ఇప్పుడిప్పుడే నాపై ఖుర్ఆన్ అధ్యాయం ఒకటి అవతరించింది. సుమధుర వాణి! హృదయాన్ని ఆనందసాగరంలో ఓలలాడించే దివ్యసందేశం!! దాని ముందు ఎంత పెద్ద ప్రాపంచిక సంతోషమైనా బలాదూరే. ఇదిగో విను" అంటూ దివ్యఖుర్ఆన్‌లోని ఈ క్రింది సూక్తులు విన్పించారు:

"ముహమ్మద్ (సల్లం)! మేము నీకు స్పష్టమయిన విజయం ప్రసాదించాం. దేవుడు నీ గత పొరపాట్లు, భావి పొరపాట్లు మన్నించి నీపై తన అనుగ్రహం పరిపూర్తి చేయాలని, నీకు రుజుమార్గం చూపి, పెద్ద సహాయం చేయాలని (ఈ శుభవార్త నీకు విన్పిస్తున్నాడు)."

"ఆయనే ముస్లింల విశ్వాసం ద్విగుణీకృతం కావడానికి వారి హృదయాలలో శాంతీ స్థిమితాలను అవతరింపజేశాడు. భూమ్యాకాశాల సైన్యాలన్నీ దేవుని అధీనంలోనే ఉన్నాయి. ఆయన సర్వం ఎరిగినవాడు, ఎంతో వివేకవంతుడు."



"(ఇలా చేయడానికి కారణం) విశ్వసించిన స్త్రీ పురుషుల్ని శాశ్వతనివాసం కొరకు సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేయాలని, వారి నుండి చెడులను తొలగించాలని-- దేవుని దృష్టిలో ఇది గొప్ప విజయం--" (48:1-6)

"విశ్వాసులు చెట్టు క్రింద నీ చేతిలో చేయి వేసి శపథం చేస్తున్నప్పుడు దేవుడు వారి పట్ల ప్రసన్నుడయ్యాడు. వారి ఆంతర్యాల స్థితి ఆయనకు తెలుసు. అందువల్ల వారిపై ఆయన శాంతీ స్థిమితాలు అవతరింపజేశాడు. బహుమానంగా వారికి సమీప విజయాన్ని, అపార సమరసొత్తును అనుగ్రహించాడు. దాన్ని వారు (త్వరలోనే) సాధిస్తారు. దేవుడు మహా శక్తిమంతుడు, ఎంతో వివేచనాపరుడు."

"దేవుడు మీకు పెద్ద ఎత్తున సమరసొత్తు లభిస్తుందని వాగ్దానం చేస్తున్నాడు. ప్రస్తుతం ఆయన మీకు ఈ విజయం ప్రసాదించి, భవిష్యత్తులో మీకు వ్యతిరేకంగా ఇతరులు తోక జాడించకుండా వారిని నిలువరించాడు. మరోవైపు విశ్వాసులకు ఒక నిదర్శనంగా చేశాడు. మీరు సన్మార్గంలో స్థిరంగా ఉండేందుకు దేవుడు మీకు మరింత సద్బుద్ధి ప్రసాదించాలన్న ఉద్దేశ్యం కూడా దీని వెనక ఉంది. అదీగాక మరికొన్ని సమరసొత్తులు కూడా మీకు లభిస్తాయని దేవుడు వాగ్దానం చేస్తున్నాడు. వాటిని మీరింకా సాధించలేదు. దేవుడు వాటిని చుట్టుముట్టి ఉంచాడు. దేవుడు ప్రతి పనీ చేయగల సమర్థుడు, సర్వ శక్తిమంతుడు."

"ఇప్పుడీ అవిశ్వాసులు గనక మీతో పోరాడితే తప్పకుండా వెన్నుజూపి పారిపోతారు. వారికి ఎలాంటి మద్దతు, సహాయం లభించవు. ఇది పూర్వకాలం నుండీ వస్తున్న దైవ సంప్రదాయం. దైవసంప్రదాయంలో నీవు ఎన్నడూ మార్పు చూడలేవు."

"దేవుడే మక్కా లోయలో వారి చేతుల్ని మీనుండి, మీ చేతుల్ని వారినుండి (యుద్ధం జరగకుండా) నిరోధించాడు. నిజానికి ఆయన వారిపై మీకు ఇంతకు ముందే ఆధిక్యత (విజయం) ప్రసాదించాడు. మీరు చేస్తున్నదంతా దేవుడు గమనిస్తూనే ఉన్నాడు."

"సత్యాన్ని తిరస్కరించినవారు, మిమ్మల్ని ప్రతిష్ఠాలయంకు రానివ్వకుండా నిరోధించినవారు, బలిపశువుల్ని వాటి బలి ప్రదేశానికి చేరనీకుండా అడ్డుకున్నవారు వారేకదా! (మక్కాలో) మీరెరుగని స్త్రీపురుష విశ్వాసులు లేకుండాఉంటే, పొరపాటున మీరు వారిపై కూడా దాడి చేస్తారన్న ప్రమాదం, దానివల్ల మీరు అప్రతిష్ఠ పాలవుతారన్న భయం లేకుండా ఉంటే (ఈ యుద్ధాన్ని మేము నిరోధించేవారం కాము). దేవుడు తానుకోరిన వారిని తన కారుణ్యఛాయలోకి తీసుకోవడానికే (ఈ యుద్ధాన్ని నిరోధించాడు). ఈ విశ్వాసులు వేరే చోటికి పోయివుంటే (మక్కాలో మిగిలివుండే) అవిశ్వాసుల్ని మేము తప్పకుండా కఠినంగా శిక్షించేవాళ్లం."

"ఈ అవిశ్వాసులు మొండి పట్టుదలకు పొయినప్పుడు దేవుడు తన ప్రవక్తకు, విశ్వాసులకు సహనం, సంయమనాలు ప్రసాదించాడు. వారిని భయభక్తుల వైఖరికి కట్టుబడి ఉండేలా చేశాడు. అసలు వారే భయభక్తులు కలిగి ఉండటానికి ఎక్కువ అర్హులు. దేవుడు సర్వం ఎరిగినవాడు."

"దేవుడు తన ప్రవక్తకు స్వప్నం చూపిన సంగతి నిజమే. అది సత్యంతో కూడుకున్న స్వప్నం. (దాని ప్రకారం) దేవుడు తలుచుకుంటే (త్వరలోనే) మీరు తప్పకుండా ప్రతిష్ఠాలయం

(కాబాగృహం)లో నిర్భయంగా, నిశ్చింతగా ప్రవేశిస్తారు. అక్కడ మీ తలలను పూర్తిగా గొరిగించుకుంటారు లేదా కత్తిరించుకుంటారు. మీకు ఎలాంటి భయముండదు. మీకు తెలియని విషయాలు (ఎన్నో) ఆయనకు తెలుసు. అందువల్ల ఈ స్వప్నం నిజం కావడానికి ముందుగా ఆయన ఈ సమీప విజయం మీకు ప్రసాదించాడు." (ఖుర్ఆన్. 48:18-27)

ఈ సూక్తులు విని ముస్లింలు పరమ సంతోషంతో పొంగిపోయారు. ఇక ఉమర్ (రజి) ఆనందమయితే అవధులు దాటింది. ఒక నిమిషానికి ముందున్న ఆయన మనోవ్యధ అంతా ఇప్పుడు పటాపంచలైపోయింది.

"దైవప్రవక్తా! మనం దైవగృహాన్ని సందర్శిస్తామని మీరు వాగ్దానం చేసి ఉన్నారు కదా!. కాని ఆ వాగ్దానం ఇంకా నెరవేరనే లేదు. ఈ విషయమే మాకు చాలా బాధగా ఉంది" అన్నారు అనుచరులు.

"కాని ఈ సంవత్సరమే మనం దైవగృహాన్ని సందర్శిస్తామని నేను మీతో అన్నానా?" అన్నారు దైవప్రవక్త (సల్లం) చిరునవ్వుతో.

"లేదు. అలా అనలేదండీ మీరు."

"అయితే ఓపిక పట్టండి. ఆ వాగ్దానం తప్పక నెరవేరుతుంది. ఆలస్యంగానైనా మనం మక్కా వెళ్ళి కాబాగృహాన్ని దర్శిస్తాం" అన్నారు దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం).

## హుదైబియా ఒడంబడిక పరిణామాలు-(123)

ముస్లింలు మదీనా చేరుకున్నారు. వారు మదీనా తిరిగొచ్చారో లేదో ఖురైషీయులకు చెందిన అబూబసీర్ అనే ఒకతను మక్కా నుండి పారిపోయి వచ్చాడు.

అబూబసీర్ (రజి) మక్కాలో బహుదైవారాధకుల చిత్రహింసలు భరించలేక మదీనా పారిపోయి వచ్చారు. అయితే కాస్సేపటికి మక్కా బహుదైవారాధకులకు చెందిన ఇద్దరు మనుషులు కూడా ఆయన్ని వెంబడిస్తూ మదీనా వచ్చారు. వారిద్దరి దగ్గర అబూబసీర్ (రజి) యజమాని దైవప్రవక్త (సల్లం) పేరిట రాసిన ఓ లేఖ ఉంది. ఆ లేఖలో హుదైబియా ఒడంబడికను ప్రస్తావిస్తూ అబూబసీర్ (రజి)ని అప్పగించమని కోరడం జరిగింది.

ఒకవైపు అసహాయ స్థితిలో ఉన్న అబూబసీర్ (రజి) దీన వదనం! మరోవైపు ఖురైషీయులతో చేసుకున్న శాంతిఒప్పందం!! దైవప్రవక్త (సల్లం) క్షణంపాటు ఆలోచనలో పడ్డారు. తరువాత ఓ నిర్ణయానికి వచ్చారు.

"అబూబసీర్! ఖురైషీయులతో మనం ఒప్పందం చేసుకొనిఉన్నాం. మనం ఒప్పందాన్ని ఉల్లంఘించలేము కదా! ఒప్పందాన్ని ఉల్లంఘించడం అధర్మం. అందువల్ల నీవు నీ తెగవాళ్ళ దగ్గరికి తిరిగివెళ్ళిపో" అన్నారు ఆయన బాధగా.

"దైవప్రవక్తా! మీరు నన్ను మళ్ళీ అవిశ్వాసుల దగ్గరికి పంపి వారి దౌర్జన్యకాండకు బలికమ్మంటున్నారా? దేవుడు నన్ను వారి కబంధహస్తాల నుండి కాపాడాడు. కాని మళ్ళీ నన్ను వారి దగ్గరకు...."



"భయపడకు నాయానా! సహనం వహించు. దేవుడు ఏదోమార్గం చూపించకపోడు. వారి హింసాకాండకు గురవుతున్నవారు ఇంకా కొందరున్నారు. దేవుడు వారిని అలాగే వదలిపెట్టడు. వెళ్ళు బాబూ! వెళ్ళు."

దైవప్రవక్త (స) గుండెను రాయిచేసుకొని ఆ ఆభాగ్యజీవిని ఖురైషీయులకు అప్పగించారు. ఖురైష్ మనుషులు హజ్రత్ అబూబసీర్ (రజి)ని బంధించి తమతోపాటు తీసికెళ్ళారు. ముస్లింలు ఏమీ చేయలేక ఆ దీనుడి వైపు అసహాయంగా చూస్తూ కంటతడి పెట్టుకున్నారు.

"ఖురైష్ మనుషులిద్దరు అబూబసీర్ (రజి)ని తీసుకోని జుల్‌హులీఫా ప్రదేశానికి చేరుకున్నారు. అక్కడ కాస్తంత విశ్రాంతి తీసుకుందామని ఆగిపోయారు.

వారిలో ఒకడితో హజ్రత్ అబూబసీర్ (రజి), "నీ ఖడ్గం చాలా బాగుందే! ఏది చూద్దాం, ఓసారి ఇటివ్వు" అన్నారు. అతను ఖడ్గం ఇచ్చాడు. వెంటనే అబూబసీర్ (రజి) ఆ ఖడ్గంతో అతడ్ని ఒక్క దెబ్బతో కడతేర్చారు.

ఈ హఠాత్పరిణామం చూసి రెండవవాడు పలాయనం చిత్తగించాడు. అతను నేరుగా మదీనా వెళ్ళి మసీదులో ప్రవేశించాడు. అతని ముఖంలో కానవస్తున్న భయాందోళనలను దైవప్రవక్త (సల్లం) గమనించారు.

"ఏమిటి ఇలా వచ్చావు! క్షేమమే కదూ!?" అని అడిగారు ఆయన.

"ఏం చెప్పను మహాశయా! మీ మనిషి నాస్నేహితుడ్ని చంపేశాడు. నేనెలాగో తప్పించుకొని వచ్చాను. లేకుంటే నాకూ అదేగతి పట్టేది" అన్నాడు ఖురైష్ మనిషి.

అంతలో హజ్రత్ అబూబసీర్ (రజి) కూడా అక్కడికి చేరుకున్నారు.

"దైవప్రవక్తా! మీరు నన్ను ఖురైషీయులకు అప్పగించి మీ కర్తవ్యం నెరవేర్చుకున్నారు. ఇక మీపై ఎలాంటి బాధ్యతలేదు. కాని నేను నా ఆత్మరక్షణ కోసం ఈ పని చేశాను" అని చెప్పి ఆయన అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

హుదైబియా ఒప్పందంలో ఒక షరతు ఈవిధంగా ఉంది: "మక్కా నుండి ఎవరైనా పారిపోయి మదీనా వెళ్ళిపోతే అతడ్ని మక్కాకు తిరిగి పంపివేయాలి. కాని మదీనా నుండి ఎవరైనా మక్కాకు వస్తే అతడ్ని మదీనాకు తిరిగి పంపడం జరగదు."

ఈ షరతు ప్రకారం దైవప్రవక్త (సల్లం) మక్కానుండి పారిపోయి వచ్చిన ముస్లిం పురుషుల్ని తిరిగి మక్కాకు తిప్పి పంపుతుండేవారు. ఇలా కొంతమంది ముస్లిం పురుషుల్ని తిప్పిపంపారు. ఆ తరువాత ముస్లిం స్త్రీలు మక్కా నుండి రావడం ప్రారంభించారు. మొట్టమొదట హజ్రత్ ఉమ్మెకుల్సూమ్ బిన్తె ఉఖ్బా (రజి) మక్కా నుండి పారిపోయి మదీనా వచ్చారు. వెంటనే ఆమె సోదరుడు మదీనా వచ్చి ఒప్పందం ప్రకారం ఆమెను తమకు అప్పగించమని అడిగాడు.

"విశ్వాసులారా! విశ్వసించిన స్త్రీలు మీ దగ్గరకు (మదీనా) వలస వచ్చినప్పుడు (వారి విశ్వసనీయతను) మీరు ఓసారి పరీక్షించుకోండి. నిజానికి వారి విశ్వాసస్థితి గురించి దేవునికే బాగా తెలుసు. వారు నిజమైన విశ్వాసులే అని మీరు నిర్ధారించుకుంటే ఇక వారిని అవిశ్వాసుల

దగ్గరికి తిప్పిపంపకండి. వారు అవిశ్వాసులకు (భార్యలుగా) ధర్మసమ్మతం కాలేరు. అవిశ్వాసులు కూడా వారికి (భర్తలుగా) ధర్మసమ్మతం కాలేరు. ఆ స్త్రీలకు ఇవ్వబడిన మహర్ ధనాన్ని వారి (భర్తల)కి తిరిగి ఇచ్చివేయండి. అప్పుడు మీరు ఆ స్త్రీలకు మహర్ ధనం చెల్లించి వారిని వివాహమాడవచ్చు. అందులో ఎలాంటి తప్పు లేదు.” (ఖుర్ఆన్-60:10)

దైవప్రవక్త (స) ఆమెను అవిశ్వాసులకు అప్పగించడానికి నిరాకరిస్తూ “ఒప్పందంలోని షరతు పురుషుల విషయంలో ఉందిగాని, స్త్రీల విషయంలో లేద”ని అన్నారు. అప్పుడు మక్కా బహుదైవారాధకులు సంధి షరుతుల్లోని పదజాలం గమనించి జరిగిన పొరపాటుకు తలలు బాదుకున్నారు.

హజ్రత్ అబూబసీర్ (రజి) మదీనా నుంచి నేరుగా సముద్ర తీరానికి పోయి అమీస్ అనే చోట ఆగిపోయారు. వెంట తెచ్చుకున్న ఖర్జూర పండ్లతో, సముద్రపు చేపలతో క్షుద్బాధ తీర్చుకుంటూ అక్కడే కాలం గడపసాగారు.

మక్కాలో ఖురైషీయుల హింసాదౌర్జన్యాలకు గురయి అష్టకష్టాలు అనుభవిస్తున్న ఇతర ముస్లింలు ఈ విషయం తెలుసుకొని ఒక్కొక్కరే రహస్యంగా అబూబసీర్ (రజి) దగ్గరికి చేరుకోవడం ప్రారంభించారు. సుహైల్ కొడుకు హజ్రత్ అబూజందల్ (రజి) కూడా అక్కడికి చేరుకున్నారు. ఈవిధంగా కొంతకాలానికే మక్కా నుండి డెబ్భయి మందికి పైగా ముస్లింలు పారిపోయి వచ్చి ఇక్కడ స్థిరపడిపోయారు.

మక్కా నుంచి సిరియాకు పోయే, సిరియా నుండి తిరిగొచ్చే వర్తక బిడారాలన్నీ ఈ ప్రాంతం గుండానే వచ్చి పోవలసి ఉంటుంది. హుదైబియా ఒప్పందం ప్రకారం మక్కా నుండి పారిపోయే ముస్లింలు మదీనా వెళ్ళడానికి వీలులేనందున వారంతా ఈ ప్రాంతానికే వచ్చి చేరుకొని, ఇక్కడకు వచ్చే వాణిజ్య బృందాలపై గెరిల్లాదాడులు చేస్తూ వాటిని దోచుకోవడం ప్రారంభించారు.

ఇలా ఈ పీడితముస్లింలే మక్కా ఖురైషీయులకు పెద్ద బెడదగా తయారయ్యారు. ఏ సంధిషరతుల వల్ల తమ ప్రతిష్ఠ పెరుగుతుందని భావించారో ఆ సంధిషరతులే ఇప్పుడు వారి బ్రతుకుతెరువుకు అవరోధాలుగా మారి ఆందోళన కలిగిస్తున్నాయి.

ఈ పోరు పడలేక ఖురైషీయులు మదీనా వెళ్ళి దైవప్రవక్త (సల్లం)కు మొర పెట్టుకున్నారు. ఒప్పందంలో తాము విధించిన షరతుల్ని ఇప్పుడు తామే ఉపసంహరించు కుంటున్నామని, సముద్రతీరాన ఉన్న శరణార్థుల్ని మదీనా పిలిపించుకొని తమను ఇక్కట్ల నుంచి గట్టెక్కించమని వేడుకున్నారు ఖురైష్ నాయకులు.

దైవప్రవక్త (సల్లం) శత్రువుల అభ్యర్థనను మన్నించారు. ఆయన హజ్రత్ అబూబసీర్ (రజి) దగ్గరికి ఒక లేఖ పంపి అమీస్‌లో నిరాశ్రయజీవితం గడుపుతున్న శరణార్థుల్ని తీసుకొని మదీనా వచ్చేయమని ఆజ్ఞాపించారు.

ఈ లేఖ అబూబసీర్ (రజి) దగ్గరకు చేరుకునే సమయంలో ఆయన వ్యాధిగ్రస్తులయి ఉన్నారు. అంచేత ఆయన అబూజందల్ (రజి)ని పిలిచి దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞ విన్పిస్తూ “నీవు వెంటనే మనవాళ్ళను తీసుకొని మదీనా వెళ్ళిపో” అని చెప్పారు.



హజ్రత్ అబూజందల్ (రజి) అనుచరుల్ని తీసుకొని హిజ్రీశకం 7వ ఏట మదీనా చేరుకున్నారు. ఆ తరువాత కొన్నాళ్ళకే హజ్రత్ అబూబసీర్ (రజి) చనిపోయారు.

ఇప్పుడు యావత్తు ముస్లింలు సంతోషంతో గడపసాగారు. మక్కా, మదీనాల మధ్య సురక్షితమయిన రాకపోకలు ప్రారంభమయ్యాయి. దాంతో మక్కా ప్రజలు మదీనా వచ్చి తమ బంధుమిత్రుల్ని కలుసుకుని, వారితో లావాదేవీలు జరుపుకునే అవకాశం లభించింది. వారిలో అనేకమంది బహుదైవారాధకులు ముస్లింల జీవనసరళిని సమీపం నుంచి చూసి ప్రభావితులై ఇస్లాం స్వీకరించడం మొదలెట్టారు. ముస్లింలు మొదట్లో ఏ ఒప్పందాన్ని తమకు అవమాన కరమయినదిగా, ఘోర పరాజయంగా తలచారో, అదే ఇప్పుడు వారి ప్రతిష్ఠను ఈవిధంగా పెంచి అద్భుత విజయంగా పరిణమించింది.

## రోమ్ చక్రవర్తికి ఇస్లాం ఆహ్వాన లేఖ-(124)

హుదైబియా ఒప్పందం జరగడంతో ముస్లింలకు ఖురైషీయుల బెడద తాత్కాలికంగా తొలగిపోయింది. మక్కా, మదీనాల మధ్య శాంతియుత వాతావరణం నెలకొన్నది.

మరోవైపు ముస్లింలకు ధర్మప్రచార కార్యకలాపాల్ని విస్తృతపరిచే అవకాశం లభించింది. దైవప్రవక్త (స) కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకుంటూ అరేబియా వెలుపలున్న అనేక రాజ్యాలకు దైవసందేశం పంపించారు. మానవుల నిజధర్మం ఏమిటో తెలియజేయడానికి ఆయన రాజుల పేరిట లేఖలు రాయించారు. ఆ లేఖల మీద ముద్ర వేయడానికి ప్రత్యేకంగా ఒక వెండిఉంగరం చేయించి, దాని మీద ముహమ్మద్ రసూలుల్లాహ్ (దైవప్రవక్త) అనే పేరు రాయించారు. ఆ తర్వాత లేఖల మీద ఈ ముద్ర వేశారు.

ఈరాన్, రోమ్‌లు ఆనాటి అగ్రరాజ్యాలు. దైవప్రవక్త (స) ఈరాన్ చక్రవర్తి ఖుస్రో పర్వేజ్‌కు, రోమ్ చక్రవర్తి హెరాక్లియస్‌కు లేఖలు రాసి వాటిని ప్రత్యేక దూతల ద్వారా పంపించారు. అలాగే ఈజిప్టు చక్రవర్తి మఖూఖస్, హైరా చక్రవర్తి హారిస్ గస్సానీ, యమన్ రాజు హారిస్‌హుమైరీ, అబిసీనియా రాజు నజాషీ, ఇతర రాజులు, సామంతులు, అధికార్లకు కూడా ప్రత్యేక దూతల ద్వారా దైవసందేశం అందజేస్తూ లేఖలు పంపించారు.

రోమ్ చక్రవర్తి హెరాక్లియస్‌కు రాసిన లేఖను హజ్రత్ దహియా కల్బీ (రజి) తీసి కెళ్ళారు. ఆ లేఖలో ఈ విధంగా ఉంది:

“కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం. దేవుని దాసుడు, ఆయన సందేశహరుడైన ముహమ్మద్ తరపున రోమ్ చక్రవర్తి హిరక్లియస్‌కు వ్రాయునది: సన్మార్గం అనుసరించేవారికి శాంతీశ్రేయాలు కలుగుగాక.

“నేను మిమ్మల్ని ఇస్లాం వైపునకు ఆహ్వానిస్తున్నాను. మీరు ఇస్లాం స్వీకరిస్తే శాంతీశ్రేయాలతో మనుగడ సాగిస్తారు. దేవుడు రెట్టింపు పుణ్యఫలం ప్రసాదిస్తాడు. మీరు గనక ఈ సందేశాన్ని అంగీకరించకపోతే మీ దేశప్రజల పాపభారమంతా మీ మీద పడుతుంది. గ్రంథప్రజలారా! మాకు, మీకు ఒకే విధంగా ఉన్న ఏకేశ్వరారాధనను పాటించండి. మనం ఒక్క దేవుడ్ని తప్ప మరెవరినీ ఆరాధించకూడదు. మనలో ఎవరూ ఆ దేవుడ్ని తప్ప

మరెవరినీ దైవంగా చేసుకోకూడదు. ఈ సందేశాన్ని మీరు అంగీకరించకపోతే, మేము అంగీకరిస్తున్నాం. దీనికి మీరు సాక్షులుగా ఉండండి.''

ఈలేఖ రోమ్‌చక్రవర్తికి జెరుసలేంలో ఉన్నప్పుడు అందింది. అప్పుడాయన దైవప్రవక్త (స) వివరాలు తెలుసుకోవడానికి అరబ్బు వర్తకుల్ని గురించి ఆరాతీశాడు. యాదృచ్ఛింగా ఆ రోజుల్లో మక్కా నుండి అబూసుఫ్యాన్, మరికొందరు ఖురైషీయులు వ్యాపార నిమిత్తం బయలుదేరి జెరుసలేంకు వచ్చి ఉన్నారు. రోమ్ చక్రవర్తి వెంటనే వాళ్ళను తన దర్బారుకు పిలిపించుకున్నాడు. సంభాషణానువాదం కోసం ఒక దుబాసీని కూడా నియమించాడు.

“తనను గురించి దైవప్రవక్తనని ప్రకటించుకున్న వ్యక్తికి మీలో అత్యంత సన్నిహితుడు ఎవరో చెప్పండి'' అన్నాడు రోమ్ చక్రవర్తి.

“నేనతనికి అత్యంత సన్నిహితుడ్ని'' అన్నాడు అబూసుఫ్యాన్.

ఈమాట విని రోమ్ చక్రవర్తి అబూసుఫ్యాన్‌ని తన ముందు దగ్గరగా కూర్చోబెట్టించు కున్నాడు. మిగిలిన అరబ్బుల్ని అబూసుఫ్యాన్ వెనుక కూర్చోబెట్టించి, నా ప్రశ్నలకు సమాధానాలుగా ఇతను అబద్ధాలు చెబితే మీరు వాటిని ఖండించాలి'' అని వారితో అన్నాడు. అప్పుడు వారిద్దరి మధ్య ఇలా సంభాషణ జరిగింది:

రోమ్ చక్రవర్తి :- మీలో దైవప్రవక్తనని ప్రకటించుకున్న వ్యక్తి ఎలాంటి వంశస్థుడు?

అబూసుఫ్యాన్ :- అతను మాలో ఉన్నత వంశానికి చెందినవాడు.

రోమ్ చక్రవర్తి :- ఆ వంశంలో లోగడ మరెవరైనా తనను తాను దైవప్రవక్తనని ప్రకటించు కున్నాడా?

అబూసుఫ్యాన్ :- లేదు.

రోమ్ చక్రవర్తి :- పోని ఆ వంశంలో ఇదివరకు ఎవరైనా రాజయ్యాడా?

అబూసుఫ్యాన్ :- లేదు.

రోమ్ చక్రవర్తి :- ఆయన్ని అనుసరిస్తున్న వారిలో ఎక్కువగా పేరుపలుకుబడులు కల వారున్నరా లేక ఊరూపేరూలేని బలహీనులు ఉన్నారా?

అబూసుఫ్యాన్ :- పేదలు, బలహీనులే ఉన్నారు.

రోమ్ చక్రవర్తి :- ఆయన అనుచరుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుందా లేక తగ్గుతోందా?

అబూసుఫ్యాన్ :- పెరుగుతూనే ఉంది.

రోమ్ చక్రవర్తి :- ఆయన ధర్మానికి విముఖులై ఎవరైనా మతభ్రష్టులైపోతున్నారా?

అబూసుఫ్యాన్ :- అలాంటిదేమీ లేదు.

రోమ్ చక్రవర్తి :- ఆయన ఎప్పుడైనా వాగ్దానభంగం చేశాడా?

అబూసుఫ్యాన్ :- లేదు.

రోమ్ చక్రవర్తి :- ఆయన ఎప్పుడైనా అబద్ధమాడినట్లు మీరు విన్నారా?



అబూసుఫ్యాన్ :- లేదు.

రోమ్ చక్రవర్తి :- మీరెప్పుడైనా ఆయనతో యుద్ధం చేశారా?

అబూసుఫ్యాన్ :- ఆ... చేశాం.

రోమ్ చక్రవర్తి :- వాటి పర్యవసానం ఏమిటీ?

అబూసుఫ్యాన్ :- ఒకప్పుడు ఆయన గెలిస్తే మరొకప్పుడు మేము విజయం సాధించేవాళ్లం.

రోమ్ చక్రవర్తి :- సరే, ఆయన జనానికి ఏం బోధిస్తున్నాడు?

అబూసుఫ్యాన్ :- ఒకే దేవుడ్ని ఆరాధించాలని, ఆ ఏకేశ్వరునికి సాటికల్పిస్తూ మరెవరినీ దైవంగా చేసుకోకూడదని, నమాజ్ (ప్రార్థన) చేయాలని, అశ్లీలం జోలికి పోకుండా పవిత్రంగా ఉండాలని, ఎల్లప్పుడూ సత్యమే పలకాలని, బంధుమిత్రుల పట్ల ప్రేమాభిమానాలతో మెలగాలని ఆయన చెబుతున్నాడు.

రోమ్ చక్రవర్తి ఈ సంభాషణ తరువాత దుబాసీతో “ ఇతనికి ఇలా చెప్పు'' అన్నాడు:-

“మేమాయన వంశాన్ని గురించి అడిగితే, ఆయన ఉన్నత వంశస్థుడని చెప్పావు నువ్వు. దైవప్రవక్తలు ఎల్లప్పుడూ ఉన్నత వంశంలోనే పుడ్తారు. ఆయన వంశంలో ఇదివరకు ఎవరైనా దైవప్రవక్తనని ప్రకటించుకున్నాడా అనడిగితే, నువ్వు లేదన్నావు. గతంలో ఎవరైనా దైవప్రవక్తనని ప్రకటించుకొని ఉంటే ఈయన అతడ్ని అనుసరిస్తున్నాడని నేను అంటాను. నేనతని వంశంలో ఎవరైనా రాజయ్యాడా అనడిగితే, నువ్వు లేదన్నావు. ఎవరైనా రాజయి ఉంటే ఈయన తన వంశంలోని రాజరికాన్ని కాంక్షిస్తున్నాడని నేను చెబుతాను.

“ఆయన ఇదివరకు ఎప్పుడైనా అబద్ధమాడినట్లు మీరు విన్నారా అనడిగితే, నువ్వు లేదన్నావు. ప్రజలతో అబద్ధమాడని వ్యక్తి దేవుని విషయంలో అబద్ధమాడటం అసంభవం.

“ఆయన్ని అనుసరించేవారిలో ఎక్కువగా ధనికులు, ప్రముఖులు ఉన్నారా లేక పేదలు, బలహీనులు ఉన్నారా అని అడిగితే, నువ్వు పేదలు, బలహీనులే ఉన్నారని చెప్పావు. దైవప్రవక్తల (ప్రారంభ దశ) అనుచరులు ఎల్లప్పుడూ పేదలే అయిఉంటారు.

“ఆయన అనుచరుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందా లేక తగ్గుతోందా అని అడిగితే, నువ్వు పెరుగుతోందని చెప్పావు. విశ్వాసం పరిపూర్ణ దశకు చేరుకునే వరకు దాని పరిస్థితి ఇలాగే ఉంటుంది.

“ఆయన ధర్మానికి విముఖులయి ఎవరైనా మతభ్రష్టులై పోతున్నారా అని అడిగితే, నువ్వు అలాంటిదేమీ లేదన్నావు. నిజమే, విశ్వాస మాధుర్యం ఓసారి చవిచూసిన తరువాత ఇక దాన్నుంచి బయటపడటం సాధ్యం కాదు. నేనాయన ఎప్పుడైనా వాగ్దానభంగం చేశాడా అని అడిగాను, నువ్వు లేదన్నావు. దైవప్రవక్తలు ఏనాడూ వాగ్దానభంగం చేయరు.

“ఆయన ప్రజలకు బోధిస్తున్న విషయాలేమిటని అడిగాను. ఆయన ఒక్క దేవుడ్ని తప్ప మరెవరినీ ఆరాధించకూడదని, విగ్రహపూజ చేయరాదని, ప్రార్థన చేయాలని, సత్యం పలకాలని, అశ్లీలానికి దూరంగా ఉండాలని బోధిస్తున్నట్లు నువ్వు తెలియజేశావు.

"నువ్వు చెబుతున్న విషయాలు నిజమే అయితే, త్వరలోనే ఆయన సామ్రాజ్యం ఈ ప్రాంతం (జెరూసలేం) వరకు విస్తరిస్తుంది. ఒక దైవప్రవక్త రానున్నాడని నాకు తెలుసు. కాని ఆ ప్రవక్త అరేబియాలో పుట్టాడన్న సంగతి నాకు తెలియదు. నేను గనక అరేబియా వెళ్ళగలిగితే ఆయన్ని తప్పకుండా కలుసుకుంటాను. ఒకవేళ నేనాయన దగ్గర ఉంటే ఆయన పాదాలు కడుగుతాను."

సంభాషణ ముగిసిన తర్వాత చక్రవర్తి అరబ్బు వర్తకుల్ని బయటికి పంపించాడు.

అబూసుఫ్యాన్ తోటి వర్తకులతో తిరిగొస్తూ "ఓహో! ముహమ్మద్ హోదా ఎంతగా పెరిగిపోయింది!! ఇప్పుడు రోమ్ చక్రవర్తి కూడా అతనికి భయపడుతున్నాడు!!!" అన్నాడు.

ఆ తరువాత రోమ్ చక్రవర్తి తన రాజ్యానికి చెందిన ఉన్నతాధికారుల్ని, ధర్మవేత్తల్ని, ప్రముఖుల్ని, ప్రజాప్రతినిధుల్ని తన దర్బారులో సమావేశపరచాడు. ఎవరూ బయటికి పోకుండా తలుపుల్ని మూయించాడు. తరువాత సభికుల్ని ఉద్దేశించి "మీరు శ్రేయో సాఫల్యాలు కోరుకుంటున్నారా? మీరాజ్యం యధాతథంగా ఉండాలని కాంక్షిస్తున్నారా? అయితే మీరంతా ముహమ్మద్ ప్రవక్తను విశ్వసించండి" అన్నాడు.

సభికులు ఈ చివరి వాక్యం వినగానే ఆగ్రహోదగ్రులై దిగ్గున లేచి తలుపుల వైపు దూసుకుపోయారు. కాని తలుపులు మూసిఉన్నాయి.

చక్రవర్తి హెరాక్లియస్ సభికుల ఆగ్రహాన్ని చూసి నిరాశచెందాడు. వెంటనే అతను వారిని పిలిపించి "నేను మిమ్మల్ని మీ మతం పట్ల మీకెంత దృఢవిశ్వాసం ఉందో పరీక్షించడానికి మాత్రమే ఈ మాటన్నాను. అందులో మీరు నెగ్గారు" అన్నాడు.

అప్పుడు సభికులు శాంతించారు. సంతోషంతో వారతని ముందు మోకరిల్లారు. హెరాక్లియస్ పరలోక సాఫల్యం కాదని ప్రాపంచిక ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చాడు.

## ఈరాన్, ఈజిప్టు తదితర రాజులకు లేఖలు-(125)

ఈరాన్ చక్రవర్తి ఖుస్రో పర్వేజ్‌కు రాసిన లేఖను హజ్రత్ అబ్దుల్లా బిన్ ఖుజాఫా సహ్మీ (రజి) తీసికెళ్ళారు. ఆ లేఖ ఈ విధంగా ఉంది:

"కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం. దైవప్రవక్త ముహమ్మద్ తరఫున పర్షియా రాజ్యాధినేత కిస్రాకు వ్రాయునది. రుజుమార్గం అవలంబించి దేవుణ్ణి, ఆయన ప్రవక్తను విశ్వసించి, దేవుడు ఒక్కడేనని సాక్ష్యమిచ్చేవారికి శాంతిశ్రేయాలు కలుగుగాక. జీవమున్న ప్రతి వ్యక్తికీ దేవుణ్ణి గురించి హెచ్చరించడానికి ఆయన నన్ను యావత్తు మానవాళి కోసం దైవప్రవక్తగా నియమించి పంపాడు. కాబట్టి మీరు ఇస్లాం స్వీకరిస్తే శ్రేయస్కరమైన (శాంతియుతమైన) జీవితం గడుపుతారు. లేకపోతే మొత్తం అగ్నిపూజారుల పాపభారం మీ మీద పడుతుంది."

ఈరాన్ చక్రవర్తి దైవప్రవక్త (సల్లం) లేఖను చూడగానే మండిపడ్డాడు. ఆ లేఖలో ముందుగా తన పేరు ప్రస్తావించకుండా "కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్



పేరుతో" అని రాయబడిన తీరే అతనికి నచ్చలేదు. అందువల్ల అతను కోపం పట్టలేక ఆ లేఖను ప్రవక్త దూత ఎదురుగానే చించి పారేశాడు.

అంతటితో అతని కోపం తగ్గలేదు. ముహమ్మద్ (సల్లం) శిరస్సును ఖండించి తీసుకురమ్మని యమన్ గవర్నర్‌ని ఆదేశించాడు. ఈరాన్‌కు పోయిన ప్రత్యేకదూత తిరిగొచ్చి విషయం దైవప్రవక్త (సల్లం)కు విన్నవించాడు.

దైవప్రవక్త (స) ఈ సంఘటన గురించిన వివరాలు విని "దేవుడు అతని సామ్రాజ్యాన్ని తునాతునకలుగా చేసి అతడ్ని అధికారభ్రష్టుడ్ని చేయుగాక" అని శపించారు. ఇలా శపించిన కొన్నాళ్ళకే ఈరాన్ చక్రవర్తి పర్వేజ్ హతమార్చబడ్డాడు. తరువాత అతని కొడుకు సింహాసనం ఎక్కాడు.

అప్పట్లో యమన్ కూడా ఈరాన్ చక్రవర్తి అధీనంలో ఉండేది. ఈరాన్ సామ్రాజ్యం పతనమయిపోతోందని, ఇక దాన్ని కాపాడటం ఎవరి తరమూ కాదని యమన్ గవర్నర్ గ్రహించాడు. వెంటనే అతను ఇస్లాం స్వీకరించాడు. ఆవిధంగా అతను ఇస్లాం సామ్రాజ్యంలో యమన్ గవర్నర్‌గా కొనసాగాడు.

యమామా రాజు ఇస్లాం స్వీకరించడానికి మాత్రం తన ఆమోదం తెలిపాడు. కాని అధికారం తన చేతిలోనే ఉండాలని షరతు పెట్టాడు. షరతులతో కూడిన అతని ఇస్లాం స్వీకారాన్ని దైవప్రవక్త (సల్లం) తిరస్కరించి శపించారు.

బహ్రైన్ రాజు మనస్ఫూర్తిగా ఇస్లాం స్వీకరించాడు. అతని ప్రజలు కూడా ఇస్లాం స్వీకరించి ముస్లింలుగా మారిపోయారు.

ఈజిప్టు చక్రవర్తి మఖూఖస్ పేర రాసిన లేఖను హజ్రత్ హాతిబ్ బిన్ అబీబలకా (రజి) తీసికెళ్ళారు. ఆ లేఖ ఈ విధంగా ఉంది:

"కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో ప్రారంభం. దైవప్రవక్త ముహమ్మద్ తరఫున ఖబ్తీల నాయకుడు మఖూఖస్‌కు రాయునది. సన్మార్గగాములకు శాంతీ శ్రేయాలు కలుగుగాక. నేను మిమ్మల్ని ఇస్లాం ధర్మం వైపునకు ఆహ్వానిస్తున్నాను. మీరు ఇస్లాం స్వీకరిస్తే శ్రేయస్కరమైన జీవితం గడుపుతారు. దేవుడు మీకు రెట్టింపు పుణ్యఫలం ప్రసాదిస్తాడు. ఇస్లాం స్వీకరించకపోతే దేశప్రజల పాపభారమంతా మీమీద పడుతుంది. గ్రంథప్రజలారా! మీకు, మాకు సమానంగా ఉన్న విషయం వైపు రండి. మనం ఒక్క దేవుణ్ణి తప్ప మరెవరినీ ఆరాధించకూడదు. మనలో ఎవరూ దేవుణ్ణి కాదని మరెవరినీ దైవంగా చేసుకోరాదు. మీరీ విషయాన్ని అంగీకరించకపోతే మేము అంగీక రిస్తున్నాం. దీనికి మీరు సాక్షులుగా ఉండండి."

ఈజిప్టు చక్రవర్తి ఇస్లాం స్వీకరించలేదు. కాని దైవప్రవక్త (స) లేఖను, రాయబారిని ఎంతో గౌరవించాడు. దైవప్రవక్త (స) కోసం విలువైన కానుకలను కూడా ఇచ్చి పంపాడు. ఈ కానుకలలో ఒక తెల్ల కంచరగాడిద, ఈజిప్టుకు చెందిన కొన్ని ప్రత్యేక వస్తువులు, డబ్బుసంచులు ఉన్నాయి. ఇంకా అతను మారియా, షీరీన్ అనే దాసీలను కూడా దైవప్రవక్త (సల్లం)కు బహూకరించాడు.

దైవప్రవక్త (సల్లం) ఈ కానుకల్ని స్వీకరించారు. ఆయన షీరీన్‌ని (ప్రముఖ కవి) హజ్రత్ హస్సాన్ (రజి)కు ప్రదానం చేశారు. మారియా (రజి)ను స్వయంగా తానే స్వీకరించి వివాహం చేసుకున్నారు.

అబిసీనియా (ఇథియోపియా) చక్రవర్తి నీగస్ (నజాషీ) పేరిట రాసిన లేఖను హజ్రత్ అమ్ బిన్ ఉమయ్యా (రజి) తీసికెళ్ళారు. ఆ లేఖ ఈ విధంగా ఉంది:

"కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో. దైవప్రవక్త ముహమ్మద్ తరఫున అబిసీనియా రాజ్యాధినేత నజాషీకు రాయునది. సన్మార్గగాములకు శాంతిశ్రేయాలు కలుగుగాక. నేను మీముందు విశ్వ సామ్రాజ్యాధినేతయిన అల్లాహ్‌ను స్తుతిస్తున్నాను. ఆయన తప్ప మరో ఆరాధ్యదైవం లేడు... మర్యం కుమారుడు ఈసా దేవుని ఆత్మ, ఆయన దివ్యవచనం అని, దాన్ని దేవుడు శీలవతి, పవిత్రురాలైన మర్యం గర్భంలో ఊదగా ఆమె గర్భం దాల్చి ఈసాను కన్నదని నేను సాక్ష్యమిస్తున్నాను. దేవుడు 'ఆదం'ని తన స్వహస్తాలతో సృష్టించినట్లు ఆయన ఈసాను కూడా తన స్వహస్తాలతో సృష్టించాడు. నేను మిమ్మల్ని సాటిలేని ఏకైక దేవుణ్ణి విశ్వసించే విషయం వైపునకు పిలుస్తున్నాను. నాదగ్గరికి వస్తున్న దివ్యావిష్కృతిని విశ్వసించి నన్ను అనుసరించండి. నిస్సందేహంగా నేను దైవప్రవక్తను. నేను మిమ్మల్ని, మీ ప్రజల్ని ఆ దేవుని వైపు పిలుస్తున్నాను. నేను నా సందేశం మీకందజేసి నా విధి నిర్వర్తించాను. నా ఉపదేశాన్ని స్వీకరించండి. సన్మార్గగాములకే శాంతిశ్రేయాలు కలుగుగాక."

అబిసీనియా రాజు నజాషీ సంతోషంతో ఆ లేఖను గౌరవిస్తూ "మీరు నిజంగా దేవుని సందేశహరులే అని నేను సాక్ష్యమిస్తున్నాను" అని జవాబిచ్చాడు. ఆయన అంతకు ముందే అబిసీనియాకు వచ్చివున్న హజ్రత్ జాఫర్ (రజి) చేతిమీదుగా ఇస్లాం స్వీకరించారు.

అబిసీనియాలో మక్కా నుండి వలసవచ్చిన ముస్లిం కాందిశీకులు అనేకమంది ఉన్నారు. ఆ కాందిశీకులలో హజ్రత్ ఉమ్మెహబీబా (రజి) కూడా ఉన్నారు. ఈమె అబూ సుఫ్యాన్ కుమార్తె, అబ్దుల్లా బిన్ హజష్ భార్య. అబ్దుల్లా ఉద్యమం ప్రారంభదశలోనే ఇస్లాం స్వీకరించారు. అయితే వీరిద్దరు అబిసీనియాకు వలస వచ్చిన తరువాత అబ్దుల్లా మతభ్రష్టుడై పోయాడు. క్రైస్తవమతం స్వీకరించి కొన్నాళ్ళకు చనిపోయాడు.

హజ్రత్ ఉమ్మెహబీబా (రజి) మాత్రం ఇస్లాంలో స్థిరంగా ఉన్నారు. మక్కా నుండి అబిసీనియాకు వచ్చిన తరువాత భర్త చేసిన విశ్వాసఘాతుకం వల్ల అతనికి దూరమయి పోవలసి వచ్చింది. ఆ విధంగా ఆమె దిక్కులేని అభాగినై పోయింది. దైవప్రవక్త (సల్లం) ఆమె పరిస్థితి తెలుసుకొని ఎంతో జాలిపడ్డారు. ఆపద సమయంలో సహనం వహించాలని, పరిస్థితుల్ని ధైర్యంతో ఎదుర్కోవాలని ఉపదేశించారు.

అయితే భర్తకు దూరమయిన ఈ దీనురాలు ఎన్ని కష్టాలని ఎదుర్కోగలదు? ఈ కష్టాల నుండి ఆమెను గట్టెక్కించేందుకు స్వయంగా దైవప్రవక్తే ముందుకు వచ్చారు. ఆయన నజాషీ రాజుకు మరో లేఖ రాశారు. తాను ఉమ్మె హబీబాను వివాహమాడ దలిచానని, దీనికి ఆమె అంగీకరిస్తే రాజు నజాషీ స్వయంగా వకీలయి తనతో ఆమె వివాహం జరిపించాలని ఆ లేఖలో రాశారు.



నజాషీ దైవప్రవక్త (స) అభిప్రాయాన్ని తెలియజేస్తూ హజ్రత్ ఉమ్మెహబీబా (రజి)కు వివాహసందేశం అందజేశారు. ఈ శుభవార్త అందుకున్న ఉమ్మెహబీబా (రజి) సంతోషంతో పొంగిపోయారు. మహాప్రవక్త, మానవోత్తముడయిన మహామనీషి తనంతట తానుగా వివాహసందేశం పంపితే ఏ స్త్రీ సంతోషించదు? పైగా భర్తకోల్పోయిన వితంతువు, అభాగిని అయిన సామాన్య స్త్రీని ఇలాంటి మహాపురుషుడు వివాహమాడటానికి ముందుకు వస్తే ఇక ఆమె ఎంత ఆనందోత్సాహాలతో పరవశించిపోతుందో చెప్పనవసరం లేదు.

అందుకే హజ్రత్ ఉమ్మెహబీబా (రజి) ఈ వివాహసందేశాన్ని తక్షణమే అంగీకరించారు. అప్పుడు నజాషీ దైవప్రవక్త (స)తో ఆమె వివాహం జరిపించాడు. దైవప్రవక్త తరఫున ఆయన మహర్‌గా నాలుగొందల దీనార్ల పైకం కూడా ఆమెకు ఇచ్చివేశారు.

దైవప్రవక్త (సల్లం), నజాషీకి రాసిన మొదటి లేఖలో ఇస్లాం సందేశంతో పాటు అబిసీనియాలోని ముస్లిం కాందిశీకుల్ని మదీనా పంపించమని ఆదేశించారు. ఇప్పుడా కాందిశీకులు మదీనా వెళ్ళిపోయే సమయం ఆసన్నమయింది. వారి కోసం దైవప్రవక్త (సల్లం) రెండు ఓడలు పంపించారు.

ఈ శరణార్థులంతా ఆ ఓడలలో అబిసీనియా (ఇథియోపియా) నుండి బయలుదేరి మదీనా చేరుకున్నారు. వారిలో హజ్రత్ ఉమ్మెహబీబా (రజి) కూడా ఉన్నారు. మదీనా చేరుకున్న తరువాత దైవప్రవక్త (సల్లం) యోధుల్ని తీసుకొని ఖైబర్ వెళ్ళారని తెలిసింది. దాంతో ఈ శరణార్థులంతా మదీనా నుంచి మళ్ళీ ఖైబర్‌కు బయలుదేరారు. హజ్రత్ ఉమ్మెహబీబా (రజి) మాత్రం మదీనాలోనే ఉండిపోయారు.

## ఖైబర్ దండయాత్ర-(126)

దైవప్రవక్త (సల్లం) తన అనుచరులతో హుదైబియా నుండి మదీనాకు తిరిగొచ్చిన మూడు నెలలకే 'ఖైబర్'యూదులు ముస్లింలపై తిరుగుబాటుకు పాల్పడి యుద్ధ సన్నాహాలు చేస్తున్నారని పిడుగులాంటి వార్త విన్పించింది.

ఖైబర్ ప్రాంతం మదీనా నుండి ఉత్తర దిక్కున దాదాపు వందమైళ్ళ దూరంలో ఉన్న అత్యంత సారవంతమైన నేల. ఇక్కడ కొండల మధ్య ఉన్న ఏడు లోయల్లో అనేక నదులు, బావులతో పాటు ఖర్జూరం, ద్రాక్ష, నిమ్మ, అంజూరం వగైరా పండ్లతో కూడిన ఎన్నో తోటలు కూడా ఉన్నాయి. యూదులు పాలస్తీనా నుంచి బహిష్కరించబడిన తరువాత మొదటిసారిగా ఇక్కడకు వచ్చి స్థిరపడ్డారు. ఖైబర్ సమీపంలో ఉన్న ఫదక్, ఖురాలోయ, తైమా ప్రాంతాల్లో కూడా యూదులు నివసిస్తున్నారు. ఆ తర్వాత బనీ నజీర్ తెగయూదులు కూడా మదీనా నుండి వచ్చి ఖైబర్‌లో నివాసం ఏర్పరచుకున్నారు.

ఈ యూదులు స్నేహఒప్పందం ఉల్లంఘించి ముస్లింలపై కాలుదువ్వడంతో దైవప్రవక్త (సల్లం) వారిని మదీనా నుండి బహిష్కరించారు. అప్పుడు వారు మదీనా నుండి ఖైబర్‌కు వచ్చి నివశించసాగారు. కాని ఖైబర్‌లో కూడా వారు ముస్లింవ్యతిరేక కార్యకలాపాలు మానుకో లేదు. అందువల్ల దైవప్రవక్త (సల్లం) ఖైబర్ యూదుల్ని ముట్టడించడానికి పూనుకున్నారు.

హిజ్రీశకం 7వ సంవత్సరం, ముహర్రం నెలలో దైవప్రవక్త (సల్లం) మదీనాలో సబా బిన్ అరఫ్తా (రజి)ను గవర్నర్‌గా నియమించి దాదాపు 1600 మంది యోధుల్ని తీసుకొని ఖైబర్‌కు బయలు దేరారు. అప్పుడు కొందరు మహిళలు కూడా ప్రయాణ సామగ్రి తీసుకొని దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చారు.

“మీరెందుకు వచ్చారమ్మా! మేము యుద్ధం చేయడానికి వెళ్తున్నాం. అక్కడకు మీరొచ్చి ఏం చేస్తారు?” అన్నారు దైవప్రవక్త (సల్లం) వాళ్ళను చూసి.

“దైవప్రవక్తా! మేమక్కడ క్షతగాత్రులకు మందేసి కట్లు గడ్తాము. యోధులకు బాణాలు అందిస్తాం. వారికి మంచినీళ్ళు సరఫరా చేస్తాం. అందువల్ల ఈ యుద్ధంలో పాల్గొనడానికి మమ్మల్ని అనుమతించండి” అన్నారు మహిళలు.

దైవప్రవక్త (స) వారి విన్నపాన్ని అంగీకరించి సైన్యంలో చేర్చుకున్నారు. ఆ స్త్రీలలో ప్రవక్త సతీమణి ఉమ్మెసల్మా (రజి) కూడా ఉన్నారు. సైనికుల దగ్గర ఆహారపదార్థాల్లో సత్తుపిండి మాత్రమే ఉంది. దైవప్రవక్త (స)కు కూడా అదే ఆహారపదార్థం.

ముస్లింయోధులు నాలుగు రోజులు ప్రయాణం చేసి ఖైబర్, గత్ఫాన్ పట్టణాల మధ్య ఉన్న ‘అజీ’ లోయాకు చేరుకున్నారు. పొలాల్లో పనిచేసుకుంటున్న కొందరు యూదులు ఇలా ముస్లింయోధులు అకస్మాత్తుగా ఖైబర్ సమీపానికి రావడం చూశారు. వెంటనే వారు ఖైబర్‌కు వెళ్ళి ఈ సంగతి తమ నాయకులకు తెలియజేశారు. అది విని యూదనాయకులు క్షణంపాటు నివ్వెరపోయారు. ఏం చెయ్యాలో అర్థంగాక కాస్సేపు అయోమయంలో పడిపోయారు. తరువాత తేరుకొని ఓ పథకం రూపొందించారు.

ఖైబర్‌లో యూదులకు చెందిన అనేక కోటలు ఉన్నాయి. వాటిలో ఆరు కోటలు దృఢమైనవి. ఈ పథకం ప్రకారం స్త్రీలు, పిల్లలు, నగలు, ధనరాసులు ఒక కోటలో ఉంచారు. ధాన్యాన్ని మరో కోటకు తరలించారు. వేరొక కోటలో సమరయోధులు ప్రవేశించి కోట ముఖద్వారాలు మూసేసుకున్నారు.

గత్ఫాన్ తెగ బహుదైవారాధకులతో యూదులకు స్నేహసంబంధాలున్నందున మదీనాను జయించడం జరిగితే తాము మదీనాలోని తమ వ్యవసాయరాబడిలో అర్ధభాగం ఇస్తామన్న షరతుపై ఇంతకు ముందే వారు గత్ఫాన్ తెగతో యుద్ధఒడంబడిక చేసుకున్నారు. గత్ఫాన్ నాయకులు తమ దగ్గరున్న నాలుగు వేల మంది యుద్ధవీరులు కూడా తోడయితే ముస్లింలను మట్టి కరిపించవచ్చని యూదులకు హామీ ఇచ్చారు. అందువల్ల యూదులు వారి సహాయం కోసం ఎదురుచూడసాగారు.

కాని ముస్లింలు తమ ప్రియతమ నాయకుని ఆదేశం ప్రకారం అజీ లోయలో దిగి గుడారాలు వేసుకున్నారు. గత్ఫాన్ తెగవాళ్ళు తమకు సమీపంలోనే ముస్లింయోధులు విడిది చేయడం చూసి వారు తమ నివాసప్రాంతాలపై దాడిచేస్తారేమోనని భయపడి ఇళ్ళలో నుంచి బయటికే రాకుండా ఉండిపోయారు.

ఆరోజు రాత్రి ముస్లింలు స్నానాదులు ముగించుకొని ప్రశాంతంగా నిద్రపోయారు. తెల్లవారుజామున నమాజ్ చేసి ఆయుధాలు ధరించి ఖైబర్‌కు బయలుదేరారు.



పోగానే ముస్లింలు ఖైబర్ కోటలను చుట్టుముట్టారు. యూదులు భయపడకుండా ముస్లింలను ఢీకొన్నారు. యుద్ధం హోరాహోరీగా జరుగుతోంది. యూదులు ఒకసారి కోట వెలుపలికి వచ్చి ముస్లింలతో తలపడితే, మరోసారి కోటలో ప్రవేశించి కోటబురుజుల నుండి రాళ్ళు, బాణాలు విసరడం చెయ్యసాగారు.

ప్రారంభంలో ముస్లింలు యూదుల ధాటికి నిలవలేక పోయారు. తత్ఫలితంగా యాభైమంది ముజాహిద్‌లు తీవ్రంగా గాయపడ్డారు. ఆ తర్వాత స్థిరంగా నిలబడి తీవ్రంగా విజృంభించారు. దాంతో నాలుగు కోటలు ముస్లింల కైవశం అయ్యాయి. అయితే ఖమూస్ అనే కోటను జయించడానికి చాల ప్రయాసపడవలసి వచ్చింది.

రోజులు గడిచిపోతున్నా యుద్ధం ఓ కొలిక్కి రాలేదు. ఇలా మరి కొన్నాళ్ళు గడిస్తే అటు యూదులే కాదు, ఇటు ముస్లింలు కూడా ఘోరనష్టానికి గురికావలసి వస్తుంది. అందువల్ల దైవప్రవక్త (సల్లం) తాడో పేడో తేల్చుకోవాలని నిశ్చయించుకున్నారు. ఆయన సమరధ్వజాన్ని హజ్రత్ అబూబకర్ (రజి) చేతికి అందించి, వెళ్ళి ఖమూస్ కోటను జయించమని ఆదేశించారు.

హజ్రత్ అబూబకర్ (రజి) ఉదయం నుండి సాయంత్రం దాకా పోరాడినా ఖమూస్ కోటను జయించలేక పోయారు. ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) హజ్రత్ ఉమర్ (రజి)ని పంపించారు. ఉమర్ (రజి) కూడా కోటను జయించలేక పోయారు. చివరికి దైవప్రవక్త (సల్లం) “రేపు ఉదయం నేను ధ్వజం ఒక వీరునికి అప్పగిస్తాను. అతను దేవుడ్ని, దైవప్రవక్తను ఎంతగానో అభిమానిస్తాడు; దేవుడు, ఆయన ప్రవక్త కూడా ఆ వీరుడ్ని బాగా అభిమానిస్తారు” అని ప్రటించారు.

ఈ ప్రకటన వినగానే ఆ మహాభాగ్యం ఎవరికి దక్కుతుందోనని అనేకమంది ఎదురు చూడసాగారు. ఇలా ఆలోచిస్తూ ముస్లింలు ఆరోజు రాత్రి ఎలాగో గడిపారు. మరునాడు ఉదయం నమాజ్ ముగిసిన తరువాత దైవప్రవక్త (సల్లం) “అలి ఏడి, ఎక్కడున్నాడు?” అని అడిగారు సమీపంలో ఉన్న అనుచరుల్ని.

“ఆయన కళ్ళజబ్బుతో బాధపడుతూ గుడారంలోనే ఉండిపోయాడు. నిన్న యుద్ధంలో కూడా పాల్గోలేక పోయాడు” అన్నారు అనుచరులు.

“సరే, అతడ్ని వెంటనే నా గుడారం దగ్గరికి పిలుచుకు రండి.”

దైవప్రవక్త (స) ఆజ్ఞ వినగానే కొందరు వెళ్ళి అలి (రజి)కి ఈ విషయం తెలియజేశారు. అలి (రజి) కళ్ళు నులుపుకుంటూ తక్షణమే వారి వెంట బయలుదేరారు.

హజ్రత్ అలి (రజి) రాగానే దైవప్రవక్త (సల్లం) తన నోటి నుండి కొంత లాలాజలం తీసి ఆయన కళ్ళకు పూశారు. మరుక్షణం అలి (రజి) కళ్ళజబ్బు మటుమాయమైపోయింది. తరువాత దైవప్రవక్త (సల్లం) ధ్వజాన్ని ఆయన చేతికిస్తూ ఇలా అన్నారు:

“అలీ! ముందుగా నీవు యూదుల ముందు ఇస్లాం సందేశం పెట్టు. నీ ఉపదేశంతో వారిలో ఒక్కడయినా సరే ఇస్లాం స్వీకరిస్తే అది నీ కోసం ఎర్ర ఒంటెల కంటే కూడా ఎంతో విలువైనది. ఇక వెళ్ళు. దైవం నీకు తోడ్పడుగాక!”

హజ్రత్ అలి (రజి) సైన్యం తీసుకొని యుద్ధరంగానికి వెళ్ళిపోయారు. అక్కడ ఓ చోట యుద్ధపతాకాన్ని నేలమీద గుచ్చి యూదులకు సవాలు విసిరారు. అది విని హారిస్ అనే మల్లయోధుడు కోట నుండి బయటికి వచ్చాడు. కాని అతను ఒకే ఒక వ్రేటుకు కుప్పలా కూలిపోయి ఊపిరి విడిచాడు.

ఆ తరువాత వెంటనే అతని సోదరుడు మర్హబ్ ముందుకు వచ్చాడు. ఖమూస్ కోట నాయకుడైన మర్హబ్ యావత్ అరేబియాలోనే పేరుమోసిన గొప్ప మల్లయోధుడు. అతను తలకు పాగా ధరించి దానిపై శిరస్త్రాణం పెట్టుకున్నాడు. దేహానికి ఒకదాని మీద మరొకటి చొప్పున రెండు ఉక్కుకవచాలు కూడా తొడుక్కున్నాడు. నడుముకు రెండు ఖడ్గాలు వ్రేలాడ దీసి, చేతిలో తళతళ మెరిసే ఈటె తీసుకొని వచ్చాడు.

మర్హబ్ ఓసారి అలి (రజి) వైపు ఎగాదిగా చూసి ఓ వెకిలి నవ్వు నవ్వాడు. తరువాత ఒక్క ఉదుటున లంఘించి అలి(రజి) మీద వ్రేటు వేశాడు. అలి (రజి) మెరుపు వేగంతో డాలు అడ్డంపెట్టి వ్రేటు నుంచి తప్పించుకున్నారు. మర్హబ్ ఈసారి మరింత చాకచక్యంతో వ్రేటువేశాడు. దాంతో అలి (రజి) చేతిలోని డాలు జారి దూరంగా పడిపోయింది. అయితే వెంటనే ఆయన కోట తలుపు వైపు దూసుకుపోయి దాన్ని బలంగా లాగివేశారు. ఆ తలుపు రెక్కను డాలుగా తీసుకొని మర్హబ్ ముందుకు వచ్చారు.

కోట తలుపును ఊడబెరకడం ఎంత శ్రమతో కూడుకున్న పనో, ఆ తలుపు ఎంత బరువైనదో మర్హబ్‌కు తెలుసు. అంచేత అలి(రజి) కోట తలుపు రెక్క ఊడబెరికి చేతిలోకి తీసుకోవడం చూసి మర్హబ్ నిర్ఘాంతపోయాడు.

అలి (రజి) కళ్ళెర్ర జేసి మర్హబ్ మీద బలంగా ఒకే ఒక వ్రేటు వేశారు. ఆ వ్రేటుకు మర్హబ్ శిరస్త్రాణం తెగి క్రింద పడిపోయింది. కరవాలం అతని తలను కోసివేస్తూ దవడదాకా చేరింది. దాంతో మర్హబ్ తుమ్మమొద్దులా దభేలున నేలకూలాడు.

మర్హబ్ హతమైపోగానే అతని సోదరుల్లో యాసిర్ అనే వాడు రంగంలోకి దిగాడు. అయితే జుబైర్ (రజి) బెబ్బులిలా విజృంభించి ఒకేఒక వ్రేటుతో అతడ్ని కడతేర్చారు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఆయన్ని అభినందిస్తూ "జుబైర్! ప్రతి దైవప్రవక్తకూ ఒక సహాయకారి ఉంటాడు. నా సహాయకారి నువ్వే" అన్నారు.

ఆ తరువాత యూదుల సేనాపతి హారిస్ కూడా కాస్సేపు పెనుగులాడి ప్రాణాలు కోల్పోయాడు. ఆ వెనువెంటనే ముస్లింయోధులు కోట తలుపులు బద్దలు కొట్టి లోపలికి జొరబడ్డారు. కాని ఆ కోటలో ఉన్న యూదులంతా అంతకుముందే అక్కడ్నుంచి పారిపోయి మరో కోటలో దూరి దాక్కున్నారు.

ముస్లింలు ఆ కోటను కూడ ముట్టడించారు. యుద్ధం మళ్ళీ ఊపందుకుంది. కాని ముస్లింల దగ్గరున్న ఆహారపదార్థాలు ఐపోయాయి. ఆకలితో నకనకలాడి పోసాగారు.

అంతలో అటుగా కొన్ని గాడిదలు వచ్చాయి. ముస్లింలు వాటిని కోసి వండటానికి ఉపక్రమించారు. ఈ సంగతి దైవప్రవక్త (స)కు తెలిసి "గాడిద నిషిద్ధం. ఆ మాంసం పార వేయండ"ని చెప్పారు. ముస్లింలు వెంటనే దాన్ని పారవేశారు. కాని ఆకలి తీరేదెలా?



ఆ తరువాత అటుగా రెండు మేకలు వచ్చాయి. అంతమంది యోధులకు ఆ రెండు మేకలు ఏ మూలకు సరిపోతాయి? అయితే దేవుడు అనుగ్రహించాడు. ఆ రెండు మేకల మాంసాన్నే అందరూ తృప్తిగా తిన్నారు.

ఒకరోజు ఓ నీగ్రోబానిస మేకలమందతో దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "దైవప్రవక్తా! దేవుడు నా హృదయకవాటాన్ని తెరిచాడు. నాకు దైవధర్మం నేర్పండి" అన్నాడు.

దైవప్రవక్త (సల్లం) అతనికి ఇస్లాం సందేశం విన్పించారు. మేకల కాపరి ఇస్లాం స్వీకరించాడు. తరువాత ఆయన "దైవప్రవక్తా! ఈ మేకలు ఒక యూదుని సొత్తు. వీటిని నేనేం చెయ్యాలి?" అని అడిగాడు.

దానికి దైవప్రవక్త (సల్లం) "వాటి ముఖాన కంకర్రాళ్ళు విసిరి తోలెయ్యి. దైవం తలిస్తే అవి తమ యజమాని దగ్గరకు చేరుకుంటాయి" అని చెప్పారు.

నీగ్రో బానిస అలాగే చేసి ముస్లింలతో కలసి యుద్ధంలో పాల్గొన్నాడు. అయితే అతను యుద్ధంలో గాయపడి అమరగతుడయ్యాడు.

ముస్లింలు నీగ్రోబానిస భౌతికకాయాన్ని దైవప్రవక్త (సల్లం) సన్నిధికి తెచ్చి "ఇతను యుద్ధంలో చనిపోయాడు. కాని ఇస్లాం స్వీకరించాక ఒక్కసారి కూడా దేవునికి సాష్టాంగపడ లేదు. అలాంటి మనిషి ముస్లిం ఎలా అవుతాడు?" అని అడిగారు.

"ఇతను దైవమార్గంలో ప్రాణాలర్పించిన అమరగతుడు. అసలు సంగతి మీకేం తెలుసు? ఇతనిప్పుడు స్వర్గంలో ఉన్నాడు. ఇతని చుట్టూ స్వర్గకన్యలు మూగి ఉన్నారు" అని చెప్పారు దైవప్రవక్త (స).

ముస్లింయోధులు ఆకలితో బాధపడుతూనే తమ శక్తినంతటినీ కూడదీసుకొని శత్రువులతో పోరాడుతున్నారు. కాస్సేపటికి ఆహారధాన్యాలున్న శత్రుకోట కూడా ముస్లింల కైవసం అయింది. దాంతో ముస్లింలు తనివితీరా తిని కొత్తశక్తి పుంజుకున్నారు.

ఈసారి యుద్ధం మరో మలుపు తిరిగింది. యూదులు ముస్లింల ధాటికి నిలువలేక పోతున్నారు. ముస్లింలు నీటి సరఫరా నిలిపివేశారు. దాంతో యూదులు గత్యంతరంలేక కాళ్ళబేరానికి వచ్చారు. కనాన నాయకత్వాన ప్రతినిధివర్గం సంధికోసం దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చింది. సంప్రదింపుల తరువాత ఈ షరతులపై ఒప్పందం కుదిరింది.

(1) యూదసైనికుల ప్రాణాలకు రక్షణ ఉంటుంది.

(2) వారి భార్యాపిల్లల్ని విడిచి పెట్టడం జరుగుతుంది.

(3) యూదులు తమ స్థిర చరాస్తుల్ని ముస్లింలకు అప్పగిస్తారు.

(4) యూదులు తమ సేద్యభూములను ముస్లింలకు అప్పగించిన తర్వాత వారా భూములలో వ్యవసాయంచేస్తూ పండినపంటలో అర్థభాగం తీసుకుంటారు.

ఈ యుద్ధంలో 93 మంది యూదులు చనిపోయారు. ముస్లింయోధుల్లో 15 మంది మాత్రమే అమరగతులయ్యారు. అదీగాక వారికి పెద్ద ఎత్తున సమరసొత్తు

లభించింది. అనేక మంది ఖైదీలు కూడా పట్టుబడ్డారు. ఈ ఖైదీలలో యూద నాయకుడు హుయ్యి బిన్ అఖ్తబ్ కూతురు సఫియా కూడా ఉంది.

సమరసొత్తులో తౌరాత్ ప్రతులు కూడా అనేకం లభించాయి. కొందరు యూదులు దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి తౌరాత్ ప్రతుల్ని తమకు ఇచ్చేయమని విన్నవించుకున్నారు. దైవప్రవక్త (స) వారి విన్నపం మన్నించి మొత్తం తౌరాత్ ప్రతుల్ని యూదులకు ఇచ్చేశారు.

దైవప్రవక్త (సల్లం) సమరసొత్తును, ఖైదీలను యోధులకు పంచారు. రాకుమారి సఫియా హజ్రత్ వహ్యా (రజి) వాటాకు వచ్చింది. అయితే యూదుల్లో సఫియాకు ఉన్న గౌరవం, హోదా అంతస్తుల దృష్ట్యా ఆమెను దైవప్రవక్త (సల్లం) వహ్యా (రజి) నుండి కొని స్వేచ్ఛ ప్రసాదించారు. దాంతో సఫియా ప్రభావితురాలయి ఇస్లాం స్వీకరించింది.

ఆ సందర్భంలో ఒక యూద స్త్రీ మేకమాంసం వండి దైవప్రవక్త (స)కు, ఆయన అనుచరులకు ఆతిథ్యం ఇచ్చింది. ఈమె మల్లయోధుడు మర్హబ్ చెల్లెలు. దైవప్రవక్త (స) ఓ ముక్క నోట్లో పెట్టుకొని "తినకండి, ఇందులో విషముంది" అన్నారు అనుచరులతో.

కాని అనుచరుల్లో హజ్రత్ బషర్ బిన్ బరా (రజి) ఒక ముక్క నోట్లో పెట్టుకోగానే తీవ్రమైన విషప్రభావంతో కాస్సేపటికే ఊపిరివిడిచారు. తరువాత దైవప్రవక్త (సల్లం) ఈ కుట్ర గురించి ప్రశ్నించడానికి ఆ యూద మహిళను పిలిపించారు.

"జైనబ్! ఏమిటీ ఈ అఘాయిత్యం? ఈ మాంసంలో విషం కలిపావెందుకు?" అని అడిగారు ఆయన ఆగ్రహంతో.

"మీకెవరు చెప్పారు ఇందులో విషం ఉందని?" అన్నది ఆమె తొణక్కుండా.

"ఎవరో ఎందుకు, ఈ మాంసమే చెబుతోంది" అన్నారు దైవప్రవక్త (సల్లం).

"ఔను. నేనే ఇందులో విషం కలిపాను" అన్నది ఆ యూద స్త్రీ.

"ఎందుకు కలిపావు?"

"మా జాతికి పట్టిన దుర్గతి మీకు తెలుసు. ఈ యుద్ధంలో నా తండ్రి, పినతండ్రి, భర్త అందరూ చనిపోయారు. అందువల్ల నేనే ఈ పని చేశాను. నిజంగా మీరు దైవప్రవక్తే అయితే ఆ విషయాన్ని ఈ మాంసమే చెబుతుంది. ఒకవేళ మీరు చక్రవర్తి అయివుంటే (ఈ విషప్రయోగంతో) మాకు సుఖం లభిస్తుంది" అన్నది ఆమె.

ఇంత ఘోరానికి పాల్పడినా ఆ యూద స్త్రీపై దైవప్రవక్త (సల్లం) ఎలాంటి చర్య తీసుకోకుండా క్షమించి వదలిపెట్టారు.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) ఖైబర్‌లో హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి)ని తన ప్రతినిధిగా నియమిస్తూ యూదుల పట్ల సత్ప్రవర్తన కలిగిఉండాలని, వారితో మతపరమైన వివాదాలకు దిగకూడదని ఉపదేశించారు.

ఖైబర్ నుండి తిరిగి వెళ్ళడానికి ప్రయాణసన్నాహాలు ప్రారంభమయ్యాయి. అంతలో హజ్రత్ జాఫర్ బిన్ అబూతాలిబ్ (రజి) నేతృత్వంలో అబిసీనియా ముస్లిం శరణార్థులు,



నజాషీ రాసిన లేఖ, ఆయన పంపిన కానుకలతో ఖైబర్‌కు చేరుకున్నారు. పాత సహచరుల్ని కలుసుకొని ముస్లింలంతా పరమానంద భరితులయ్యారు.

హజ్రత్ జాఫర్ (రజి) అకస్మాత్తుగా తన ముందు కన్పించగానే దైవప్రవక్త (సల్లం) సంతోషంతో తబ్బిబ్బయిపోయారు. ఆయన హజ్రత్ జాఫర్ (రజి)ని గాఢంగా గుండెలకు హత్తుకొని నుదుటిని అనేకసార్లు చుంబించారు.

"మనకు ఖైబర్‌విజయం వల్ల ఎక్కువ సంతోషం కలిగిందో లేక జాఫర్ రాకవల్ల ఎక్కువ సంతోషం కలిగిందో నేను చెప్పలేను" అన్నారు ఆయన ఆ సమయంలో.

ఆ తర్వాత దైవప్రవక్త (స) అనుచరుల్ని తీసుకొని ఖైబర్ నుండి బయలుదేరారు.

ఖైబర్ నుండి ఫదక్ ప్రాంతానికి రాగానే అక్కడి యూదులు సంధి చేసుకోవడానికి దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చారు. తమ ఆస్తిపాస్తులు తీసుకొని తమకు ప్రాణభిక్ష పెడ్తే చాలని వారు విన్నవించుకున్నారు. దైవప్రవక్త (సల్లం) వారి విన్నపాన్ని అంగీకరించారు. ఫదక్ యూదులతో యుద్ధం జరగనందున వారి స్థిరచరాస్తులు యోధులకు పంచకుండా ప్రభుత్వ ఆస్తులుగా పరిగణించబడ్డాయి.

ముస్లిం యోధులు అక్కడ్నుంచి ఖురా లోయకు చేరుకున్నారు. అక్కడి యూదులు ఎదురుతిరిగి ముస్లింలపై బాణాలు ఎక్కుపెట్టారు. అందువల్ల ముస్లింలు వారి కోటలను ముట్టడించారు. చివరికి వారు కూడా ఖైబర్‌యూదుల్లాగా తమ పంటభూములు అప్పగించి వాటిని సాగుబడి చేసినందుకు తమకు అర్ధపంట ఇచ్చే షరతుపై ముస్లింలకు లొంగిపోయారు. ఇక్కడ జరిగిన యుద్ధంలో ఒక ముస్లిం చనిపోయాడు.

దైవప్రవక్త (సల్లం) దగ్గర కానుకగా ఇవ్వబడిన మిద్అమ్ అనే ఒక బానిస ఉన్నాడు. అతను ముస్లిం అయి ఖైబర్‌యుద్ధంలో కూడా పాల్గొన్నాడు. ఖురాలోయకు వచ్చిన తరువాత అతను ప్రవక్తఒంటె పైనుంచి అంబారీని తీసేస్తుంటే ఎక్కడ్నుంచో ఒక బాణం వచ్చి అతనికి తగిలింది. దాంతో అతను ప్రాణం విడిచాడు. ప్రజలు అతడ్ని అభినందిస్తూ "ఇతని అమరగతి (వీరమరణం) ఎంత శుభప్రదమైనది!" అన్నారు.

అయితే దైవప్రవక్త (స) ఈమాట విని ఆ యోధుడ్ని గురించి ఇలా అన్నారు: "బాగానే ఉంది. కాని నాప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్ష్యం! ఖైబర్‌యుద్ధం జరిగిన రోజు సమరసొత్తు పంపిణీ చేయకముందే ఇతను ఒక దుప్పటిని స్వాధీనం చేసుకున్నాడు. ఆ దుప్పటి ఇతని పాలిట అగ్ని జ్వాలగా మారుతుంది" అని చెప్పారు.

ఒక యోధుడు ఈ మాట వినగానే తన దగ్గరున్న ఒకటో రెండో తాళ్ళు తీసుకొచ్చి "ఈ తాళ్ళు నాకు దొరికాయి తీసుకోండి" అన్నాడు.

దైవప్రవక్త (స) వాటిని చూసి "ఒకటైనా, రెండైనా ఈ తాళ్ళు కూడా (పరలోకంలో) నిప్పుగా మారుతాయి" అన్నారు.

ఆ తరువాత ముస్లిం యోధులు అక్కడ్నుంచి బయలుదేరి తైమా అనే ప్రాంతానికి చేరుకున్నారు. తైమా ప్రాంతం యూదులు కూడా ఖురాలోయ యూదుల మాదిరిగానే

రాజీఒప్పందం చేసుకొని ముస్లింలకు లొంగిపోయారు. ఆ తర్వాత ముస్లింలు అక్కడ్నుంచి బయలుదేరి మదీనా దారిపట్టారు.

దారిలో ఒక చోట ప్రయాణ బడలిక వల్ల విడిదిచేసి విశ్రాంతి తీసుకున్నారు. ఆ రాత్రి అందరికీ గాఢంగా నిద్ర పట్టింది. సూర్యోదయమయింది. అందరికంటే ముందు దైవప్రవక్త (సల్లం) మేల్కొన్నారు. లేచి చూస్తే అందరూ ఇంకా నిద్రపోతూనే ఉన్నారు. లేవగానే ఆయన అందరినీ మేల్కొలిపారు. వెంటనే వారంతా త్వరత్వరగా కాలకృత్యాలు, ఉజూ ముగించుకొని ఫజ్ర్ నమాజ్ చేశారు.

నమాజ్ ముగిసిన తరువాత దైవప్రవక్త (సల్లం) మాట్లాడుతూ "ఈవిధంగా నిద్ర నుండి సమయానికి మేల్కోలేకపోతే, మేల్కోగానే నమాజ్ చేయండి" అన్నారు. తరువాత ముస్లింలు అక్కడ్నుంచి ప్రయాణం సాగించి మదీనా చేరుకున్నారు.

దారిలోనే మరొక చోట అంతిమ దైవప్రవక్త (సల్లం) యుద్ధఖైదీ (బానిసత్వం) నుండి విముక్తురాలయి ఇస్లాం స్వీకరించిన హజ్రత్ సఫియా (రజి)ను వివాహమాడారు. సఫియా (రజి) మొదటి వివాహం సలాం బిన్ ముష్కిమ్ (అనే యూదుడి)తో జరిగింది. అతను విడాకులివ్వడంతో ఆమె మళ్ళీ కనానా అనే (మరో యూద)వ్యక్తిని వివాహ మాడారు. కనానా ఖైబర్ యుద్ధంలో చనిపోయాడు.

యూదులు యావత్తు అరేబియాలోనే గొప్ప ధనికులు. వారా కాలంలో అపార సిరిసంపదలతో తులతూగుతుండేవారు. వారి దగ్గర వేలాది ఎకరాలలో సారవంతమైన పంటభూములు, పండ్లతోటలతో పాటు, కోట్లాది రూపాయల విలువగల వెండి బంగారాలు, ఇతర విలువయిన వస్తువులు ఉండేవి. పైగా భారీఎత్తున ఆయుధాలు, యుద్ధకవచాలు, వాహనాలు కూడా ఉండేవి.

అవన్నీ ఇప్పుడు సమరసొత్తుగా ముస్లింల అధీనంలోకి వచ్చాయి. ఈ సిరిసంపదలతో ముస్లింల దారిద్ర్యం సమసిపోయింది. ముహాజిర్ ముస్లింలు తమకు అన్సార్ ముస్లింలు ఇచ్చిన ఆస్తులు వారికి తిరిగి ఇచ్చివేశారు. ఈ విధంగా ఖైబర్ విజయం ముస్లింలను అపార సిరిసంపదలతో ముంచెత్తింది.

## ఖైబర్ వార్తల పట్ల ఖురైషీయుల ఆత్రం-(127)

దైవప్రవక్త (సల్లం) తన అనుచరుల్ని తీసుకొని ఖైబర్‌కు బయలుదేరారన్న సమాచారం వినగానే మక్కా ఖురైషీయుల్లో నూతనోత్సాహం కలిగింది. ఇంకేముంది, ఖైబర్ యూదులు ముహమ్మద్, ఆయన అనుచరుల నడ్డి విరగ్గొడతారని భావించారు వారు.

నిజంగా ఖైబర్ యూదులు యుద్ధరంగంలో ఆరితేరిన మహా యోధులు. బల పరాక్రమాల్లో వారికివారే సాటి. ఎంతటి బలవంతుడైన శత్రువు కూడా వారి కంచుకోటను ఛేదించలేడు. ఈ విషయం మక్కా ఖురైషీయులకు బాగా తెలుసు. పైగా ఖైబర్ యూదుల దగ్గర అపార ధనరాసులు, సస్యశ్యామలమైన తోటలు, పంటపొలాలు ఉన్నందున వారంటే ఖురైషీయులకు ఎంతో గౌరవం, అభిమానం.



సిరిసంపదల విషయంలో ఖైబర్ యూదులకు ఎలాంటి లోటు లేదు. యుద్ధ తంత్రంలోగాని, ధైర్యసాహసాల్లోగాని అరేబియాలో వారికి మించిన జాతి లేదు. అందువల్ల వారితో ఢీకొన్నవారు బ్రతికి బట్టకట్టలేరని ఖురైషీయులకు గట్టి నమ్మకం ఉంది.

"ఈ దెబ్బతో ముస్లింల మత్తు వదలిపోతుంది. మత్తుతో పాటు వారి రక్తం కాలువలై ఖైబర్ వీధుల్లో ప్రవహిస్తుంది. ఖైబర్ యూదులంటే ఏమనుకున్నారో ఈ ముస్లింలు! డొక్కచించి డోలు కడ్తారు. తలలు నరికి కోటగుమ్మాలకు వ్రేలాడదీస్తారు" అని చెప్పు కున్నారు మక్కా బహుదైవారాధకులు.

అందుకే వారు ఖైబర్ వార్తల కోసం తీవ్రంగా నిరీక్షించసాగారు. ఎటూ ముస్లింలు పరాజయం చవిచూడక తప్పదని తలచిన ఖురైషీయులు, ఈ వార్త అందగానే సంతోషంతో గంతులేస్తూ వాయించడానికి కావలసిన మేళతాళాలు కూడా సిద్ధం చేసుకున్నారు.

అయితే ఖైబర్‌లో కూడా ముస్లింలే విజయపతాకం ఎగరేస్తారని మక్కాలోనే మరి కొందరి ధీమా. దానిపై రెండు వర్గాలవారు వందేసి ఒంటెలు పందెం కాశారు.

రోజులు గడిచిన కొద్దీ ఖురైషీయుల ఆరాటం అధికమవుతోంది. కొన్నాళ్ళకు హజ్జాజ్ బిన్ ఇలాత్ మస్లిమా అనే వ్యక్తి మక్కా వచ్చాడు. అతను కొంచెం దూరాన ఉండగానే ఖురైషీయులు చూసి సంతోషంతో పొంగిపోయారు.

హజ్జాజ్ దగ్గరికి రాగానే ఖురైషీయులు అతడ్ని చుట్టుముట్టారు. హజ్జాజ్ ఎప్పుడా శుభవార్త విన్పిస్తాడా అని తహతహలాడుతూ చెవులు రిక్కించి నిలబడ్డారు.

ఆత్రం ఆపుకోలేని కొందరు ఖురైషీయులు అడగనే అడిగారు, "హజ్జాజ్! ఏమిటీ విశేషాలు? ఖైబర్ వార్తలేమిటీ??" అని.

మరికొందరు హజ్జాజ్ ఒంటె ముకుతాడు పట్టుకొని "ముందు ఖైబర్‌వార్తలు విన్పిస్తేనే ముందుకు పోనిస్తాం" అని పట్టుబట్టారు.

హజ్జాజ్ వారి వైపు జాలిగా చూసి తాపీగా ఓ చిరునవ్వు చిందించాడు.

"బాబ్బాబు! మమ్మల్ని ఈవిధంగా సందిగ్ధంలో పడేసి చావగొట్టకు. ఆ ఖైబర్ వార్తలేమిటో త్వరగా మా చెవిలో పడేసి పుణ్యం కట్టుకో" అన్నాడు ఒకతను హజ్జాజ్ మౌనధోరణి భరించలేక అసహనంతో.

"తొందరపెట్టకండి, నన్ను నిదానంగా చెప్పనివ్వండి. మిత్రులారా! జయాపజయాలు జనం మధ్య జరుగుతూనే ఉంటాయి. కాని ముహమ్మద్ పరాజయం కావడం..... అయ్య బాబోయ్! దైవం శత్రువుక్కూడా అలాంటి దినాన్ని చూపించకుండుగాక!" అన్నాడు హజ్జాజ్.

"అంటే....అంటే....? ముహమ్మద్ పరాజయం! శత్రువుక్కూడా....!! అంటే...?" హజ్జాజ్ మాటలు అర్థంగాక ఖురైషీయులు అయోమయంలో పడిపోయారు.

"ఏమిటీ, ముస్లింలను గురించి కదా మీరడుగుతున్నది? ఇంకెక్కడి ముస్లింలండి బాబూ! ఖైబర్‌యూదుల చేతుల్లో ఎప్పుడో ఖైమా అయిపోయారు" అన్నాడు హజ్జాజ్.

"మరి ముహమ్మద్ సంగతేమిటీ?" యమ ఆత్రంతో అడిగారు ఖురైషీయులు.

"ముహమ్మద్ (సల్లం) క్షేమంగానే ఉన్నాడు."

"క్షేమంగా ఉన్నాడా! అంటే తప్పించుకొని పోయాడా?"

"ఛా! క్షేమంగా ఉన్నాడంటే తప్పించుకున్నాడనా? క్షేమంగా ఉన్నాడంటే చనిపోలేదని, వారి బందిఖానాలో భద్రంగా ఉన్నాడని అర్థం." అన్నాడు హజ్జాజ్.

"సరే, ఆ మాత్రమైనా పని జరిగినందుకు చాలా సంతోషం. అయినా బందిఖానాలో పెట్టి ఏం చేస్తారట వాళ్ళు?" అడిగారు ఖురైషీయులు మళ్ళీ.

"యూదులు ఆయన్ని తమ స్వహస్తాలతో చంపరట!"

"మరి ఎవరి హస్తాలు అరువుకు తెచ్చుకొని చంపుతారట?"

"యూదులు పెట్టుబడీదారులు. వారు ఇతరుల నుంచి ఎప్పుడూ అరువులు, ఎరువులు తెచ్చుకోరు. వారే ఇతరులకు అప్పులిస్తారు."

"సరేలేవయ్యా బాబూ! ఇంతకూ వారు ముహమ్మద్‌ని ఏం చేస్తారట?" అంటూ విసుక్కున్నారు ఖురైషీయులు.

"వారాయన్ని ఖురైషీయులు వధించేందుకు మక్కా పంపిస్తున్నామని చెప్పారు."

హజ్జాజ్ నోట ఈ మాటలు వినగానే ఖురైషీయులు సంతోషంతో ఎగిరి గంతేశారు. వారి ముఖాలు దివిటీల్లా వెలిగిపోయాయి. దిక్కులు పిక్కటిల్లేలా వికటాట్ట హాసం చేశారు. అవధులు దాటిన ఆనందంతో ఉక్కిరిబిక్కిరయిపోతూ హజ్జాజ్‌ని గట్టిగా కావలించుకున్నారు.

ఆ తరువాత అందరూ కలసి బయలుదేరారు. ఉరకలువేస్తున్న ఉత్సాహంతో పట్నంలోని ప్రజలందరికీ ఈ శుభవార్త తెలియజేశారు.

"ఈశుభవార్త కోసమే మనం ఇప్పటిదాకా ఎదురుచూశాం. ఇక ముహమ్మద్ కోసం ఎదురుచూడండి. ఖైబర్‌వీరులు అతడ్ని బంధించి మన నగరానికి తీసుకొస్తున్నారు. అతడ్ని మనమే వధించబోతున్నాం" అన్నారు ఖురైష్ నాయకులు మీసాలు మెలేస్తూ.

ఈ వార్త చూచాయిగా విన్న ప్రజలు వివరంగా తెలుసుకోవడానికి నాయకుల దగ్గరికి గుంపులు గుంపులుగా రావడం మొదలెట్టారు. వివరాలు విన్నవారు గుండెల్లో గంపెడు సంతోషం నింపుకొని వెళ్తున్నారు.

ఈ గుంపుల రద్దీ కాస్త తగ్గిన తరువాత హజ్జాజ్ రహస్యంగా ఖురైష్ అగ్రనాయకుల్ని కలుసుకున్నాడు మరే సంగతి చెప్పడానికో!

"మిత్రులారా! మదీనాలో యూదులు ముహమ్మద్ (సల్లం) ఆస్తిపాస్తుల్ని వేలం వేయబోతున్నారు. చాలా విలువైన ఆస్తులట!! వాటిని నేనే ఎక్కువ రేటుతో పాడి స్వాధీనం చేసుకోవాలనుకుంటున్నాను. ఈ విషయంలో నాకు మీ సహాయసహకారాలు ఉంటే ...." అంటూ నసిగాడు హజ్జాజ్.



"ఆ...ఆ...తప్పకుండా ఉంటాయి. ఏం కావాలో చెప్పు" అన్నారు అగ్రనాయకులు.

"ఏమీ లేదు, ఇక్కడున్న నా డబ్బు, సామగ్రి అంతా సమకూర్చిపెట్టాలి. కొంత డబ్బు నా భాగస్వాముల దగ్గర దిగబడి ఉంది. దాన్ని కూడా వసూలు చేయాలి. అంతే. ఈ పని చేసిపెట్టి ఇతర వర్తకులకన్నా ముందు నన్ను మదీనా పంపించే ఏర్పాటుచేస్తే మీ మేలు ఎన్నటికీ మరచిపోలేను" అన్నాడు హజ్జాజ్ ఎంతో వినయంగా.

"ఓస్... అదెంత పని! ఇదిగో ఇప్పుడే చేసిపెడ్తాం" అన్నారు ఖురైష్ నాయకులు.

అనడమేమిటీ, హజ్జాజ్ డబ్బు, ఇతర సామగ్రిని నిమిషాల్లో తెచ్చిచ్చారు. బాకీలు కూడా వసూలు చేసి ఇచ్చారు.

ఖైబర్‌యూదులు ముస్లింలను జయించి వారి ఆస్తుల్ని వేలం వేస్తున్నారని, దైవప్రవక్త ముహమ్మద్ (స)ని బంధించి మక్కా పంపుతున్నారని హజ్జాజ్ చెప్పిన మాట మక్కాలో కార్చిచ్చులా వ్యాపించింది. ప్రవక్త పినతండ్రి అబ్బాస్ ఈ వార్త విని కంగారుపడి హజ్జాజ్ దగ్గరికి పరుగెత్తుకు వచ్చారు. ఆయన్ని ఏకాంతంలో కలుసుకొని మాట్లాడారు.

"ఏవిటీ! ఈ వార్త నిజమేనా?" అన్నారు ఆయన రాగానే.

"మీరేమీ కంగారుపడకండి. నేనే మీ దగ్గరికి వీలు చూసుకొని వచ్చి అసలు విషయం చెబుతాను. అంతవరకు కాస్త ఓపిక పట్టండి" అన్నాడు హజ్జాజ్.

ఈ మాట విని అబ్బాస్ వెళ్ళిపోయారు. హజ్జాజ్ సామానంతా సర్దుకున్నాడు. సతీ, సామగ్రి సమేతంగా మక్కా నుండి బయలుదేరే ముందు అబ్బాస్‌ని కలుసుకున్నాడు.

"అబ్బాస్! మీరు నాకో మాటివ్వాలి. మూడు రోజులదాకా నేను చెప్పే విషయాన్ని చాలా రహస్యంగా ఉంచాలి. ఆ తరువాత మీ ఇష్టం."

"సరే అలాగే ఉంచుతాను, మీరు నిశ్చింతగా ఉండండి" అన్నారు అబ్బాస్.

"నేను ఖైబర్ నుండి బయలుదేరి మదీనా వెళ్తే అక్కడ దైవప్రవక్త (సల్లం) భార్యలలో ఖైబర్ రాకుమారి సఫియా(రజి) ఉన్నట్లు తెలిసింది. దైవప్రవక్త (స) ఖైబర్‌ని జయించారు. ఇప్పుడా ప్రాంతం ఆయన అధీనంలో ఉంది" అన్నాడు హజ్జాజ్.

"ఏమిటీ! నిజమా ఇది!?"

"దైవసాక్షిగా చెబుతున్నాను. ఇందులో ఏమాత్రం అబద్ధం లేదు. కాకపోతే నేను నా ధనాన్ని, సామగ్రిని ఇక్కడ్నుంచి సురక్షితంగా తరలించుకు పోదామని ఇలా నాటకమాడాను. పైగా నేను ముస్లిం అయిన సంగతి కూడా ఇక్కడ ఎవరికీ తెలియజేయలేదు" అన్నారు హజ్రత్ హజ్జాజ్ (రజి) అసలు విషయాన్ని బయటపెడుతూ.

ఈ విషయం చెప్పి ఆయన వెంటనే మక్కా నుండి వెళ్ళిపోయారు.

హజ్జాజ్ వెళ్ళిపోయిన మూడు రోజుల తరువాత అబ్బాస్ కొత్తబట్టలు ధరించి, ఘుమఘుమలాడే అత్తరు పూసుకున్నారు. కాబాలయానికి వెళ్ళి కాబా ప్రదక్షిణ చేయసాగారు. ఆయన ధోరణి చూసిన ఖురైషీయులకు ఆశ్చర్యం వేసింది.

"అబ్బాస్! ఇంతకు ముందునుంచే మనం సంతోషసాగరంలో మునిగితేలుతున్నాం. ఆపై ఈ ఆనందం, కృతజ్ఞతలతో కాబా ప్రదక్షిణ.....! ఓహో! నువ్వోయ్ ఘటికుడంటే!!" అన్నారు ఖురైష్ నాయకులు.

"అదంతా మీ అపోహ మాత్రమే. వినండి, దైవసాక్షిగా చెబుతున్నాను, బాగా వినండి. ముహమ్మద్ (సల్లం) ఖైబర్‌ని జయించారు. ఇప్పుడా ప్రాంతమంతా ఆయన అధీనంలోకి వచ్చింది. అంతేకాదు, ఖైబర్ రాకుమారి సఫియా (రజి) ఆయన ధర్మపత్ని అయ్యింది" అన్నారు హజ్రత్ అబ్బాస్ (రజి).

"ఏవిటేవిటీ! ముహమ్మద్ ఖైబర్‌ని జయించాడా!? ఎవరు చెప్పారు నీకీ సంగతి?" అడిగారు ఖురైష్ నాయకులు ఆశ్చర్యచకితులయిపోతూ.

"మీకు చెప్పినవాడే నాకూ ఈ సంగతి చెప్పాడు. హజ్జాజ్ ముస్లింగా మారాడు. అతను తన ఆస్తిపాస్తులను తీసికెళ్ళడానికే ఇక్కడకు వచ్చాడు. వచ్చిన పని నెరవేరగానే చక్కా మదీనా వెళ్ళిపోయాడు" అన్నారు హజ్రత్ అబ్బాస్ (రజి).

ఈ వార్త వినగానే ఖురైషీయులకు నెత్తి మీద పిడుగు పడినట్లయింది. దివిటీల్లా వెలుగుతున్న వారి ముఖాలు ఒక్కసారిగా మాడి మసికుండల్లా మారిపొయ్యాయి.

"ఎంతమోసం! ఆ విషయం ముందే తెలిసిఉంటే అతని తాట వలిచేవాళ్ళం. కాని పారిపోయాడు. ఏం చేస్తాం?" ఖురైషీయులు చేతులు నులుపుకుంటూ కూలబడ్డారు.

## ప్రప్రథమ కాబా(ఉమ్రా) యాత్ర-(128)

హుదైబియా రిజ్వాన్ శపథంలో పాల్గొన్నవారంతా కాబా యాత్రకు సిద్ధం కావాలి" అంటూ దైవప్రవక్త (సల్లం) ప్రకటన గావించారు.

ఆ శుభఘడియల కోసమే ముస్లింలు అనేక సంవత్సరం నుండి ఎదురుచూస్తున్నారు. గత సంవత్సరం "హజ్‌యాత్ర" చేయడానికి పోతే మక్కా ఖురైషీయులు దారుణమయిన షరతులు విధించి వారిని నగరం వెలుపలి నుంచే వెనక్కి పంపివేశారు. దాంతో ఆ సంవత్సరం ముస్లింలు కాబా దర్శనభాగ్యానికి నోచుకోలేకపోయారు. ఇప్పుడా అదృష్టం సమీపించింది. దైవప్రవక్త (సల్లం) ప్రకటన వినగానే వారు ద్విగుణీకృత ఉత్సాహంతో మక్కా బయలుదేరడానికి సిద్ధమయ్యారు.

గత సంవత్సరం 1400 మంది మాత్రమే అయితే ఈ సంవత్సరం 2000 మంది బయలుదేరారు. వారిలో దైవప్రవక్త (సల్లం) వందమంది అశ్వరూఢులను ఎంపిక చేసి ఆయుధాలతో వారిని సమాయత్తపరిచారు. ఆ యోధులకు ముహమ్మద్ బిన్ మస్లిమా (రజి)ను సేనాపతిగా నియమించారు.

శత్రువులు ఒకవేళ మోసానికి పాల్పడి హఠాత్తుగా దాడిచేస్తే వాళ్ళను ఎదుర్కోవడానికి ముందుజాగ్రత్తగా దైవప్రవక్త (సల్లం) ఈ సాయుధ అశ్వరూఢులను ఒకరోజు ముందుగానే పంపించారు. బయలుదేరే ముందు ఆయన సేనాపతిని మక్కాలో ప్రవేశించకుండా పట్నం దగ్గరలో ఉన్న ఏదైనా లోయలో విడిది చెయ్యవలసిందిగా ఆదేశించారు.



ఈ యోధులు వెళ్ళిపోయాక మరునాడు దైవప్రవక్త (సల్లం) మిగిలిన అనుచరులను తీసుకొని మదీనా నుండి బయలుదేరారు.

వీరందరూ ప్రయాణ ఆయుధాల్ని మాత్రమే దగ్గర ఉంచుకున్నారు. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఒంటెపై ఎక్కి యాత్రిక బృందానికి ముందుండి నాయకత్వం వహించారు. ఆయనకు ముందుగా ప్రవక్త అనుచరుడు హజ్రత్ నాజియా బిన్ జుజుబ్ (రజి) ఖుర్బానీ ఒంటెలతో ప్రయాణంచేస్తున్నారు.

సైనిక దళాధిపతి ముహమ్మద్ బిన్ మస్లిమా (రజి) జహ్రాన్ చేరుకొని అక్కడ కొందరు ఖురైష్ వ్యక్తుల్ని కలుసుకున్నారు. వారాయన వెంటనున్న సాయుధ సైనికుల్ని చూసి కంగారుపడ్డారు. "ఇంతకూ ముహమ్మద్ ఎక్కడున్నారు?" అడిగారు ఖురైషీయులు.

"దైవచిత్తమయితే ఆయన రేపు ఉదయానికల్లా ఇక్కడికి చేరుకుంటారు" అన్నారు హజ్రత్ ఇబ్నె మస్లిమా (రజి).

దైవప్రవక్త (సల్లం) కూడా వస్తున్నారని వినగానే ఖురైషీయులు భయపడిపోయారు. తక్షణమే వారు వేగంగా మక్కా వెళ్ళిపోయారు.

"ఇంకేముంది, ముహమ్మద్ (సల్లం) మక్కా వచ్చేస్తున్నారు. మామూలుగా కాదు. యుద్ధసన్నాహాలతో వచ్చేస్తున్నారు" అన్నారు వారు ఖురైష్ నాయకులతో.

ఈ మాటలు వినగానే ఖురైషీయులకు కంపరమెత్తింది. ఆదరాబాదరగా వారొక ప్రతినిధి వర్గాన్ని తయారుచేసి, దానికి ముక్రజ్‌ని నాయకుడిగా నియమించారు. ముహమ్మద్ (సల్లం) హుదైబియా ఒప్పందం ఉల్లంఘించి ఇలా సాయుధ దళాలతో ఎందుకు వస్తున్నారో తెలుసుకొని రమ్మని అతడ్ని పంపించారు. ఈ ప్రతినిధి వర్గం దైవప్రవక్త (సల్లం)ను కలుసుకున్నది.

"మహాశయా! మీ బాల్యం ఎంతో అద్భుతమయినది. మీ యౌవనపు జీవితం కూడా నిష్కళంకమయినది. ఇప్పటి వరకూ మీరు ఎవరినీ మోసగించలేదు. మరిప్పుడు ఏమైంది మక్కాలోకి ఆయుధాలతో ప్రవేశిస్తున్నారు? మన ఒప్పందం ప్రకారం ప్రయాణ ఆయుధాలు మాత్రమే మీ దగ్గర ఉండాలని, అవి కూడా వరలలో ఉండాలని మీకు తెలుసుకదా!" అన్నాడు ప్రతినిధివర్గం నాయకుడు ముక్రజ్.

"మేము ఆయుధాలను మక్కాలోకి తీసుకొని రాము. మీరు నిశ్చింతగా ఉండండి" అన్నారు దైవప్రవక్త (సల్లం) వారికి అభయమిస్తూ.

"అలాగానా! అయితే పరవాలేదు. మేము ఎప్పుడూ మిమ్మల్ని నిజాయితీపరుడిగా, వాగ్దానపాలకుడిగానే చూశాము" అన్నాడు ముక్రజ్ తృప్తిగా నిట్టూర్పు విడుస్తూ.

ముక్రజ్ తన సహచరులతో మక్కా వెళ్ళిపోయి ఖురైష్ నాయకులకు పరిస్థితి వివరించాడు. ముహమ్మద్ (సల్లం) ఒడంబడికను ఉల్లంఘించబోరని, ఆయన దైవగృహ దర్శనార్థమే వస్తున్నారని, ఇక్కడికి ఆయుధాలను కూడా తీసుకురారని ఆయన ఖురైష్ అగ్రనాయకులకు తెలియజేశాడు.

అయితే ముస్లింలు మక్కాలో ప్రవేశిస్తుండగా వారిని తాము చూడలేమని బహుదైవారాధకులు అన్నారు. అందువల్ల స్త్రీలు, పిల్లలు, వృద్ధులతో సహా అందరూ నగరం విడిచిపెట్టి బయటికి వెళ్ళిపోయారు. పట్నం వెలుపల కొండలపై డేరాలు వేసుకొని ముస్లిం యాత్రికుల కోసం ఎదురుచూడసాగారు.

దైవప్రవక్త (సల్లం) అశ్వరూఢులైన ముస్లింలను మక్కా వెలుపలే ఉండిపొమ్మని ఆదేశించారు. వారి మద్దతు కోసం మరో రెండొందల మంది సమరయోధులను ఉంచారు. బలిపశువుల్ని 'జీతువా' అనే ప్రదేశంలో వదలి, వాటి కాపలాకోసం కొందరు అనుచరుల్ని ఉంచారు. ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) మిగిలిన అనుచరుల్ని తీసుకొని మక్కా నగరానికి బయలుదేరారు.

అనుచరులు దైవప్రవక్త (స)ను తమ మధ్యలోకి తీసుకున్నారు. ఇబ్నెరవాహ (రజి) దైవప్రవక్త (స) కూర్చున్న ఒంటె ముకుతాడు పట్టుకొని ముందు ముందు నడవసాగారు.

అదొక అద్భుత సన్నివేశం! భక్తిపరాయణత ఉట్టిపడేలా దైవగృహం వైపు తరలివస్తున్న విశిష్ఠ యాత్రికా వాహిని!!

ఏ ప్రదేశం నుండయితే ఒక నిశీధి రాత్రిన ఒంటరిగా, రహస్యంగా పారిపోవలసి వచ్చిందో ఆ ప్రదేశానికి ఇప్పుడు పట్టపగలు వేలాది అనుచరులతో కలసి దైవప్రవక్త (సల్లం) వస్తున్నారు. ఒకనాడు బిక్కుబిక్కుమంటూ వందలాది శత్రువులను తప్పించుకొని పోవలసి వచ్చిన మహాప్రవక్త ముహమ్మద్ (స) ఈనాడు ధైర్యంగా, ఠీవిగా, రాజాధిరాజులా అట్టహాసంతో తిరిగివస్తున్నారు.

ఇంతటి మహాభాగ్యం ప్రసాదించిన విశ్వప్రభువుకు ఏ దాసుడు కృతజ్ఞత చెప్పకోడు? అందులో దైవప్రవక్త....??

“లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్......”

మహాప్రవక్త (సల్లం) నోట అప్రయత్నంగా ఈ దివ్యవచనాలు వెలువడ్డాయి.

మరుక్షణమే ఒకేసారి యావన్మంది అనుచరుల నోట కూడా అవే పలుకులు!

ముస్లింలు నోట వెలువడిన ఈ పలుకులు మక్కాకొండల్లో ప్రతిధ్వనించాయి. దాంతో కొండలపై డేరాలలో నుండి తొంగిచూస్తున్న బహుదైవారాధకుల గుండెలు ఝల్లుమన్నాయి. అసూయ, ఆశ్చర్యాలతో అసహాయస్థితిలో చూస్తూ ఉండిపోయారు ఈ సన్నివేశాన్ని వారు.

ముస్లింలు నగరంలోకి ప్రవేశించారు. దైవగృహాన్ని కళ్ళారా తిలకించి ఆనందించారు.

ఆ సందర్భంలో హజ్రత్ ఇబ్నెరవాహ (రజి) ఆనందపారశ్యంతో ఓ గేయం పాడారు. విశ్వాసుల ప్రతిభా ఔన్నత్యాలు చాటే పలుకులవి! బహుదైవారాధకుల పౌరుషాన్ని, ఆత్మాభిమానాన్ని రెచ్చగొడ్తూ విసరిన సవాలది!!

కాని విశ్వకారుణ్యమూర్తిగా ప్రభవించిన అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం)కు ఈ ధోరణి నచ్చలేదు. అలా పలకవద్దని ఆయన్ని వారించారు.



“అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడు లేడు. ఆయన తన దాసునికి సహాయపడి, చేసిన వాగ్దానం నిలబెట్టుకున్నాడు. ఆయనే ఇతర సైన్యాలన్నిటినీ చిత్తుగా ఓడించి తన సైన్యాన్ని గెలిపించాడు” అని పలకమని ఆయన చెప్పారు.

ఇబ్నెరవాహ (రజి) అలాగే వాటిని బిగ్గరగా ఉచ్చరించారు. ఇది చూసి ఇతర అనుచరులు కూడా ప్రవక్త ప్రవచనాన్ని ముక్తకంఠంతో ఉద్ఘాటించారు.

ఆ తరువాత దైవప్రవక్త (స) “హజరెఅస్వద్” (నల్లరాయి)ని ముద్దాడారు. ఏడు సార్లు కాబాప్రదక్షిణ చేశారు. ప్రదక్షిణ తరువాత సఫా, మర్వా కొండల దగ్గరికెళ్ళి వాటి మధ్య ఏడు సార్లు తిరిగారు. మర్వా కొండ చేరువలో నిలబడి ఒక ఒంటెను బలిచ్చారు. ఆ తర్వాత క్షవరం చేయించుకున్నారు. అనుచరులు కూడా అదే విధంగా ఆయన్ని అనుసరిస్తూ 'ఉమ్రా' విధులు నెరవేర్చారు.

ఈ విధంగా దైవప్రవక్త (సల్లం) కన్న కలను దేవుడు నిజపరచి చూపాడు. ముస్లింలు తప్పకుండా కాబాగృహంలో ప్రవేశిస్తారని, వారికక్కడ ఎలాంటి ప్రమాదం లేకుండా ప్రశాంత వాతావరణం లభిస్తుందని దైవం చేసిన వాగ్దానం నెరవేరింది.

దైవప్రవక్త (సల్లం), ఆయన అనుచరులు కృతజ్ఞతా భావంతో విశ్వప్రభువు ముందు వినమ్రులయి మోకరిల్లారు. ఆయన ఔన్నత్యాన్ని ప్రశంసించారు.

ఎన్నాళ్ళ నుంచో కాబా దర్శనభాగ్యానికి నోచుకోకుండా ఉన్న ముస్లింలు ఆ రోజు ఈ మహాభాగ్యాన్ని పొందగలిగారు. దైవగృహంలో ప్రార్థనలు చేశారు. నలువైపులూ తిరిగి చూసి ఆనందానుభూతి పొందారు.

అంతేకాదు, ముస్లింలు మక్కావీధులు కూడా ఓ సారి చుట్టివచ్చారు. ముహాజిర్ ముస్లింలు తాము దైవమార్గంలో వదలిపెట్టి పోయిన సొంత ఇళ్ళను చూసుకున్నారు. వారు ఇదివరకు ఎక్కడెక్కడ సమావేశాలు జరుపుకున్నారో వాటిని తమ అన్సార్ సోదరులకు కూడా చూపెట్టారు.

దైవప్రవక్త (స) ఎవరింట్లోనూ విడిది చెయ్యలేదు. ఆయన 'అబ్తహ్'లో ఓ గుడారం ఏర్పాటు చేసుకొని అందులో విశ్రాంతి తీసుకున్నారు. అలా మొదటిరోజు గడచిపోయింది. రెండవరోజు కాబా వెళ్ళి లోపల ఓచోట కూర్చున్నారు. అనుచరులు ఆయన చుట్టూ కూర్చున్నారు. దేవుని ఔన్నత్యం, ఆయన మహోపకారాల్ని గురించి చెప్పకున్నారు.

అంతలో జుహర్ (మధ్యాహ్నం) నమాజు వేళ అయింది. హజ్రత్ బిలాల్ (రజి) కాబా కప్పుపై ఎక్కారు. ఎలుగెత్తి అజాన్ పిలుపునిచ్చారు. అజాన్ పలుకులతో మక్కా నగరం మరో మారు మార్మోగిపోయింది.

ఆ తరువాత ముస్లింలు బారులు తీరి నిలబడ్డారు. దైవప్రవక్త (సల్లం) దాదాపు రెండు వేలమంది అనుచరులతో కలసి కాబా ప్రతిష్ఠాలయంలో నిర్భయంగా నమాజ్ చేశారు. ఏడేళ్ళ క్రితమయితే కాబాలో ఒంటరిగానైనా నమాజ్ చెయ్యడం ఎంతో కష్టంగా ఉండేది. ఆనాడు దైవప్రవక్త (స) నమాజ్ చేస్తున్నప్పుడు శత్రువులు ఆయన్ని అనేక విధాల వేధించేవారు. ఇప్పుడు అలాంటి భయం మచ్చుకైనా లేదు.

నమాజ్ ముగిసిన తరువాత ఆయన, దైవగృహం ఇంకా దర్శించనివారిని కూడా పిలుచుకొని రమ్మని కొందరు అనుచరుల్ని పంపించారు.

కొండలపై కట్టుకున్న గుడారాల నుండి ఖురైషీయులు ఈ అద్భుత సన్నివేశాన్ని సంభ్రమాశ్చర్యాలతో చూస్తున్నారు.

"ముస్లింలు ఈనాడు ఎంత ఆనందంతో, భక్తిపారవశ్యంతో కాబా ప్రదక్షిణ చేస్తున్నారు! దేవునిపట్ల, ఆయన ప్రవక్తపట్ల ఎంత దృఢవిశ్వాసం ఉంది వీరి హృదయాల్లో!! అనుకున్నది సాధించేవరకు ఎన్ని త్యాగాలకైనా వెనకాడటం లేదంటే వీరు ఎంతటి వజ్ర సంకల్పులు!!" అని చెప్పుకున్నారు వారిలో కొందరు.

"ముస్లింలంటే ఏదో అనుకున్నాంగాని, వీరిలో ఇంతటి దృఢవిశ్వాసం, సాహసం, సమైక్యతలు ఉన్నాయని తెలియదే!" అనుకున్నారు మరికొందరు.

హజ్రత్ బిలాల్ (రజి) కాబా కప్పుపై ఎక్కగానే ఖురైషీయిల దృష్టి అప్రయత్నంగా బిలాల్ (రజి)పై పడింది. ఆయన నోటి నుండి అజాన్ పలుకులు వెలువడగానే వారి గుండెలు దడదడలాడి పోయాయి. దైవవాణిని భరించలేక వారు చెవులు మూసుకున్నారు. కొందరు చెవులు మూసుకోవడమేగాక తమల్ని ఈ ముస్లింలు ఎక్కడ గమనిస్తారోనన్న అనుమానంతో ముఖాలు కూడా దాచుకున్నారు.

ఈరోజు ముస్లింలను ఇలా చూడవలసి వస్తున్నందుకు ఖురైషీయులు ఎంతో విచారం వెలిబుచ్చారు. అబూజహల్ ఎంతో అదృష్టవంతుడని, ముస్లింల నినాదాలు వినే దుస్థితి అతనికి కలగకుండా పోయిందని చెప్పుకున్నారు. ఎందుకంటే ఆ దైవవిరోధి బదర్ యుద్ధంలోనే హతమయి పోయాడు.

ఇలా ఖురైషీయులు ముస్లింలను గురించి రకరకాల వ్యాఖ్యలు చేశారు. అయితే వారందరి భావోద్రేకాలు, అభిప్రాయాలు ఒకే విధంగా లేవు. వారిలో కొందరి ఆలోచనలు ముస్లింల వైపు మొగ్గాయి. దేవుడు వారి హృదయాల్లో విశ్వాస కాంతిని ప్రసరింపజేశాడు. వారు అవకాశం దొరికితే ఇస్లాం స్వీకరించాలని భావిస్తున్నారు.

ప్రవక్త (స) పినతండ్రి అబ్బాస్ ఇస్లాం ఇంకా స్వీకరించకపోయినా ఆయనకు ప్రవక్త (స) పట్ల ఎంతో ప్రేమాభిమానాలున్నాయి. ఆయన ఆరోజు దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి మైమూనా బిన్త్ హారిస్ (రజి)ని వివాహం చేసుకోమని కోరారు. ఈమె మొదటి వివాహం మస్ఊద్ బిన్అమ్ర్‌తో జరిగింది. అతను విడాకులిచ్చినందున ఆమె అబూరహంని చేసుకున్నారు. అయితే కొంతకాలానికి అతను చనిపోవడంతో ఆమె ఏకాకి అయ్యారు.

హజ్రత్ మైమూనా (రజి) అబ్బాస్ మరదలు; ఖాలిద్ బిన్ వలీద్ (రజి)కు పినతల్లి అవుతారు. ఆ సమయానికి ఇస్లాం స్వీకరించి ఉన్నారు. అందువల్ల ఈమెను ఇక్కడే వదలిపెట్టకుండా మదీనా తీసికెళ్ళమని ఆయన దైవప్రవక్త (సల్లం)ను అభ్యర్థించారు. దైవప్రవక్త (సల్లం) పినతండ్రి మాటను గౌరవించి, సరేనని అంగీకరించారు. ఆ తరువాత ఆయన యాభై రెండేళ్ళ మైమూనా (రజి)ని వివాహమాడారు.



హుదైబియా ఒప్పందం ప్రకారం ముస్లింలు మక్కాలో మూడురోజులు మాత్రమే ఉండాలి. ఆ మూడురోజులు ముగిశాయి. కనుక ఖురైష్ నాయకులు ఈ విషయాన్ని గుర్తుచేయడానికి సుహైల్‌ని, శువైతిబ్‌ని దైవప్రవక్త (స) దగ్గరికి పంపారు.

"నిర్ణీత గడువు ముగిసిపోయింది. కాబట్టి ఇక మీరు వెంటనే మక్కా ఖాళీచేసి వెళ్ళిపోవాలి" అన్నారు వారిద్దరు.

"వెళ్ళిపోతాం. కాని నేనిక్కడ వివాహం చేసుకొని, ఆ తరువాత ఏర్పాటు చేసే విందు భోజనానికి మిమ్మల్ని కూడా ఆహ్వానించాలనుకుంటున్నాను. మీకు అభ్యంతరం లేదుకదా?" అన్నారు దైవప్రవక్త (సల్లం).

ఖురైష్ ప్రతినిధులిద్దరూ క్షణంపాటు సందిగ్ధంలో పడిపోయారు.

"ముస్లింలతోపాటు తాము ఈ విందులో పాల్గొంటే పరిస్థితి ఏ రూపం దాల్చుతుంది? ఖురైషీయుల్లో చాలామందిపై ఇప్పటికే ముస్లింల విశ్వాస ప్రభావం పడింది. ఇక ఈవిందులో పాల్గొంటే మరెంత మంది ఖురైషీయులు ముస్లింలుగా మారిపోతారో! అయ్‌బాబాయ్!! ఇక మక్కాలో ఖురైషీయులకు పుట్టగతులుంటాయా?"

ఈ ఆలోచన రాగానే వారిద్దరు భయపడిపోయారు.

"వద్దు, వద్దు. మీ విందు భోజనమూ వద్దు; మీరూ వద్దు. ఒప్పందం ప్రకారం మీకిచ్చిన మూడు రోజుల గడువు ముగిసింది. దయచేసి తక్షణమే ఇక్కడ్నుంచి వెళ్ళిపోండి" అన్నాడు వారిలో ఒకడు.

హజ్రత్ సాద్ బిన్ ఉబాదా (రజి) కూడా అక్కడే ఉన్నారు. ఈ మాటలు వినగానే ఆయన ఆవేశాన్ని అణచుకోలేక పోయారు.

"వ్యర్థ ప్రేలాపనలు కట్టిపెట్టు. ఈ భూభాగం నీది కాదు, నీ అబ్బదీ కాదు. దైవప్రవక్త (స) ఇష్టమొచ్చినప్పుడే వెళ్ళిపోతారు. మీరంతా కట్టకలసి చేసుకునేదేమిటో చేసుకోండి" అన్నారు ఆయన వారిద్దరి వైపు ఉరిమిచూస్తూ.

"సాద్! వీరు మనల్ని కలుసుకోవడానికి వచ్చారు. వారిపై నువ్విలా విరుచుకుపడితే వారికి బాధ కలుగుతుంది. కాస్త శాంతించు" అన్నారు దైవప్రవక్త (స) చిరునవ్వుతో.

"నా ప్రియ అనుచరులారా! ఇక మనం ఇక్కడ నుండి బయలుదేరాలి. ఏ ఒక్క ముస్లిం కూడా ఈరోజు సాయంత్రం మక్కాలో ఉండకూడదు" అని ప్రకటించారు దైవప్రవక్త (సల్లం) ఖురైష్ ప్రతినిధుల ముందే.

దైవసందేశహరుని ప్రకటనతో ముస్లింలు ప్రయాణానికి సిద్ధమయ్యారు. అందరూ మూటాముల్లెలు సర్దుకోవడంలో నిమగ్నులయ్యారు.

అంతలో హజ్రత్ హమ్జా (రజి) కుమార్తె అమ్మారా "బాబాయ్! బాబాయ్!! నన్ను కూడా మీవెంట మదీనా తీసికెళ్ళరూ?" అంటూ హజ్రత్ అలి (రజి) దగ్గరకు పరుగెత్తుకొని వచ్చింది. వెంటనే హజ్రత్ అలి (రజి) ఆ పాపను ఎత్తుకొని ముద్దాడారు. హమ్జా (రజి) కూడా ప్రవక్త పినతండ్రే. ఆయన ఉహుద్ యుద్ధంలో అమరగతినొందారు.

ఆతర్వాత "ఈపాప మాబాబాయి హమ్జా కూతురు. మనం ఈమెను తీసికెళ్ళి పెంచుకుందాం" అంటూ అలి(రజి) ఆమెను అర్ధాంగి హజ్రత్ ఫాతిమా (రజి)కు ఇచ్చారు.

అప్పుడు హజ్రత్ జాఫర్ (రజి) వచ్చి "ఈ అమ్మాయి నా పినతండ్రి కూతురు గనక ఈమెను తీసుకొని పెంచుకునే హక్కు నాకెక్కువ ఉంది" అని చెప్పారు.

"ఈమె తండ్రి నాకూ పినతండ్రి అవుతాడు. అందువల్ల ఈమెను పెంచుకునే హక్కు నాకే ఎక్కువగా ఉంది" అన్నారు హజ్రత్ అలి (రజి).

"ఆగండి. ఈ పాప తండ్రి హమ్జా నా ధార్మిక సోదరుడు. కాబట్టి ఈమెను పెంచుకునే హక్కు నాకే లభించాలి" అన్నారు హజ్రత్ జైద్ (రజి) కూడా అక్కడకు వచ్చి.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) కలగజేసుకుంటూ "ఈ అమ్మాయి పినతల్లి జాఫర్ ఇంట్లో ఉంటోంది. పినతల్లి కన్నతల్లి స్థానం ఆక్రమించుకుంటుంది. కనుక ఈ పాపకు జాఫర్ ఇంట్లోనే ఎక్కువ సుఖంగా ఉంటుంది" అన్నారు.

ఈవిధంగా చిన్నారి అమ్మారా హజ్రత్ జాఫర్ (రజి) సంరక్షణలోకి వచ్చింది. ఆ పాపతో పాటు ఆమె తల్లి సల్మా బిన్తె అమీస్ (రజి)ను కూడా వెంట తీసుకున్నారు.

ఆ సందర్భంలో మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) హజ్రత్ అలి (రజి)తో "నువ్వు నావాడివి, నేను నీవాడ్ని" అని అన్నారు. హజ్రత్ జైద్ (రజి)తో "నువ్వు నా సోదరుడు, స్నేహితుడవు" అన్నారు. హజ్రత్ జాఫర్ (రజి)తో "నడవడిక, రూపురేఖల్లో నువ్వు నాలాంటి వాడివి" అన్నారు ఆయన.

ఆ తరువాత దైవప్రవక్త (స) హజ్రత్ అబూరాఫే (రజి)ని పిలిచి, సాయంత్రందాకా ఇక్కడే ఉండి మైమూనా (రజి)ను వెంటబెట్టుకొని రావలసినదిగా చెప్పారు. దాని ప్రకారం హజ్రత్ అబూరాఫే (రజి) ఆరోజు సాయంత్రందాకా మక్కాలోనే ఉండిపోయారు.

ముస్లింలు మక్కా నుండి బయలుదేరారు. వారంతా వెళ్ళిపోగానే మక్కా వెలవెల పోయింది. నగరం శ్మశాన వాతావరణాన్ని తలపింపజేస్తూ సర్వత్రా నిశ్శబ్దం ఆవరించింది. ఖురైషీయులు మక్కా నుండి వెళ్ళిపోతున్న ముస్లింలను చూసి అసూయతో తల్లడిల్లి పోయారు. కొండలపై గుడారాలు పీకేసి ఉసూరుమంటూ నగరానికి తిరిగొచ్చారు. ఈ మూడు రోజులు వారికి మూడేండ్లుగా గడిచాయి. అయినా వారికి ముస్లింల గండం తప్పినట్లు సూచనలు కానరావడం లేదు.

## మక్కాలో తొలి కాబాయాత్ర ప్రభావం-(129)

హజ్రత్ అబూరాఫా (రజి) ఆ సాయంత్రం హజ్రత్ మైమూనా (రజి)ను వెంటబెట్టుకొని బయలుదేరి దారిలో ఓ చోట మిత్ర బృందాన్ని కలుసుకున్నారు. ముస్లింలు కాబాయాత్ర చేశామన్న భావనతో సంతోషిస్తూ మదీనా తిరిగొచ్చారు.

ఖురైష్ నాయకుల అనుమానం క్రమంగా నిజం కాసాగింది. ముస్లింలు మక్కాలో మూడు రోజులు మాత్రమే ఉండినప్పటికీ వారు వదలిపోయిన ప్రభావం మాత్రం ప్రజల



ఆలోచనలకు పదును పెట్టడం ప్రారంభించింది. అనేక మంది దైవప్రవక్త (సల్లం) ప్రచారం చేస్తున్న నూతన ధర్మం గురించి పదే పదే ఆలోచిస్తున్నారు. మరికొందరు అదే నిజమయిన ధర్మమని భావిస్తున్నారు.

ఖాలిద్ బిన్ వలీద్ ముస్లింలకు ఒకనాటి బద్ధశత్రువు. ఉహుద్ యుద్ధంలో ఖురైష్ ప్రజల హీరోగా వెలిగిపోయాడు. ఇస్లాం పేరెత్తితేనే మండిపడేవాడు. అలాంటి ఖాలిద్ కూడా ఇప్పుడు తీవ్రమయిన ఆలోచనలో పడిపోయాడు. గతంలో ముస్లింలతో చేసిన యుద్ధాలను గురించి ఓసారి తాపీగా సమీక్షించాడు.

"బదర్, ఉహుద్, కందకం యుద్ధాలలో తాము సర్వసాధన సంపత్తితో ఎంతగా పోరాడినా అంతిమ విజయాలు కనీస ఒనరులు కూడా లేని ముస్లింలనే వరించాయి. దీన్నిబట్టి మహత్తరమైన అదృశ్యశక్తి ఏదో వారికి సహాయం చేస్తోందని అర్థమవుతోంది. కనుక ఇస్లామే సత్యం, నిజధర్మం కావచ్చు."

ఖాలిద్ మెదడు వేడెక్కింది. వెంటనే నిర్ణయానికి రాలేకపోయాడు. అంతలో ఒకతను గుర్రం దిగి ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటూ వచ్చాడు.

"నేను మదీనా నుండి వస్తున్నాను. మీ అన్నయ్య వలీద్ బిన్ వలీద్ ఈ ఉత్తరం మీకివ్వమని నన్ను పంపించాడు" అంటూ ఆ మనిషి ఖాలిద్ చేతికి ఒక ఉత్తరం అందించి వెళ్ళిపోయాడు.

ఖాలిద్ గబగబా ఆ ఉత్తరం తెరచి చదవడం ప్రారంభించాడు.....

"ప్రియమైన తమ్ముడు ఖాలిద్‌కు- ఉభయకుశలోపరి. దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఉమ్రా చేయడానికి మక్కా వచ్చినప్పుడు నేను కూడా ఆయన వెంట ఉన్నాను. మక్కా చేరుకున్న తరువాత ఆయన నీ గురించి ప్రస్తావిస్తూ 'ఖాలిద్ ఏడి?' అని అడిగారు. నేను నీ కోసం మక్కాలో చాలా వెతికాను. కాని నీవు కన్పించలేదు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) నాతో ఇలా అన్నారు: 'ఖాలిద్‌లాంటి ఉత్తముడు, వివేచనాపరుడు ఇంకా ఇస్లాంకు దూరంగా ఉన్నాడంటే నాకు చాలా ఆశ్చర్యం కలుగుతోంది. ఇస్లాంగురించి, దాని బాగోగుల గురించి ఖాలిద్‌కు తెలియకుండా ఉండవు. అతని శక్తిసామర్థ్యాలు ఇస్లాం కోసం ఉపయోగ పడితే ఎంత బాగుండు.'

"తమ్ముడూ! నేను నిజం చెబుతున్నాను. ఇస్లాం లాంటి సంపూర్ణ జీవిత విధానం, మహోన్నత ధర్మం మరొకటి లేదు. ముహమ్మద్ (స) లాంటి మానవోత్తముడు, కరుణా సముద్రుడు లోకమంతా గాలించినా ఎవరూ దొరకరు. నీవు ఇంకా ఆలస్యం చేసి ఆయన ప్రేమాభిమానాలకు దూరంకాకు. సాధ్యమయినంత త్వరగా నువ్వు ఇస్లాం స్వీకరించి ఆ మహనీయునికి ప్రీతిపాత్రుడవుతావని ఆశిస్తున్నాను.

ఇట్లు
మీ అన్నయ్య, వలీద్

ఈ ఉత్తరం మండుతున్న గాయానికి మందులా పనిచేసింది. విపరీతమైన దాహంతో ఉన్నప్పుడు గుక్కెడు మంచినీళ్ళు దొరికితే ఎలా ఉంటుందో అలాంటి అనుభూతికి లోనయ్యాడు ఖాలిద్ బిన్ వలీద్.

“ఔను. ముహమ్మద్ (సల్లం) దైవప్రవక్తే. ఇందులో ఇక నాకు ఎలాంటి సందేహం లేదు. ఆయన మాంత్రికుడు కానేకాదు. ఆయన ప్రచారంచేస్తున్న ధర్మమే సత్యధర్మం” అంతరాత్మ ఘోషతో అతని అంతరంగం దేదీప్యమానంగా వెలిగిపోయింది.

ఈ మాటలే అతని నోట కూడా అప్రయత్నంగా వెలువడ్డాయి.

“ఏమిటీ! ఖాలిదేనా ఈ మాటలు అంటున్నది!” మక్కా ప్రజలు ముక్కు మీద వేలేసుకొని మరీ ఆశ్చర్యపోయారు.

“నేనిప్పుడు ముస్లింని. ఇస్లామీయ విప్లవ ధ్వజవాహకుడ్ని. ముహమ్మద్ (సల్లం) బోధిస్తున్నది ముమ్మాటికీ దైవసందేశమే. ఇందులో అనుమానించడానికి ఇక ఎలాంటి ఆస్కారం లేదు. కాబట్టి విజ్ఞత, వివేచనలు ఉన్నవాడు ముహమ్మద్ (స)ని అనుసరించక తప్పదు” అన్నాడు ఖాలిద్ నలుగురిలో నిలబడి నిర్భయంగా.

అతని మాటలు విన్న ఖురైషీయులకు వళ్ళు మండిపోయింది. మండుతున్న కళ్ళతో కొరకొర చూసి నోటికొచ్చినట్లు తిట్టిపోశారు. కొందరు మతభ్రష్టుడయ్యారన్నారు. మరి కొందరు మతిభ్రమించింది అన్నారు.

ఇక ఖురైషీయుల అగ్రనాయకుడు అబూసుఫ్యాన్ అయితే పళ్ళు నూరుతూ, చిందులు తొక్కుతూ ఖాలిద్‌ని హతమార్చడానికి సిద్ధమయ్యాడు.

అతని ఉగ్రవేషం చూసి ఇక్రమా నవ్వాపులేక పోయాడు.

“అబూసుఫ్యాన్! ఆగాగు. ఎందుకంత కోపం? ఇక్కడ ఒక్క ఖాలిద్ మాత్రమే కాదు, ఇంకా చాలామంది ఉన్నారు ఇస్లాం వైపు మొగ్గినవారు. అప్పుడే ఏమయింది? ఈ సంవత్సరం గడవని, తెలుస్తుంది. ఈ నగరంలో బహుశా బహుదైవారాధకుడిగా ఒక్కడూ మిగలడనుకో” అన్నాడతను.

ఇక్రమా మాటలు విన్నాక అబూసుఫ్యాన్‌కు మతి పోయినంత పనయింది. పాపం! అబూసుఫ్యాన్ ఏం చెయ్యాలో దిక్కుతోచక అయోమయంలో పడిపోయాడు.

ప్రస్తుతం ఖాలిద్ ఒంటరివాడయ్యాడు. తన ఆలోచనలను సమర్థించే ఆప్తమిత్రుల కోసం తహతహలాడిపోయాడు. ఏమయితేనేం అనుకొని ముందుగా ఆయన సఫ్వాన్‌ని కదిలించి చూశాడు:

“సఫ్వాన్! ముహమ్మద్ (సల్లం)ని చూస్తున్నావుగా? ఆయన ప్రజల హృదయాల్ని ఎలా సునాయాసంగా చూరగొంటున్నారో. మనం కూడా ఆయన అనుచరవర్గంలో ఎందుకు చేరిపోకూడదు?”

సఫ్వాన్ తండ్రి, సోదరులు బదర్‌యుద్ధంలో హతమార్చబడ్డారు. అప్పటి నుంచి అతను దైవప్రవక్త (సల్లం)పై పగబట్టిన పాములా బుసలుకొడ్తున్నాడు. ఈ స్థితిలో ఖాలిద్ మాటలు అతనికి అగ్నిపై ఆజ్యం పోసినట్లయింది.

“అసాధ్యం. యావత్తు ప్రపంచం ఆయన వెంటపడినా నేను మాత్రం ఆ ధర్మాన్ని విశ్వసించను” అన్నాడు సఫ్వాన్ ప్రతీకారంతో ఉడికిపోతూ.



ఖాలిద్ ఈసారి ఇక్రమాను కదిలించాడు. కాని అక్కడా అతనికి నిరాశే ఎదురయింది. చివరికి అతనొక్కడే మదీనా బయలుదేరాడు. ఈ విషయం ఎవరికీ చెప్పలేదు. అయితే అతను బయలుదేరే సమయానికి ఓ మిత్రుడు ఉస్మాన్ బిన్ తల్హా వచ్చాడు. ఖాలిద్ అతడ్ని చూసి ఓ క్షణం ఆలోచనలో పడిపోయాడు...

“ఒకవేళ ఇతనికి తన ప్రయాణం గురించి చెబితే విని తనకు తోడ్పడుతాడా లేదా? అసలే అతనితండ్రి, పినతండ్రి, నల్గురన్నదమ్ములు ఉహుద్‌యుద్ధంలో చనిపోయారు. దానివల్ల అతని మనస్సులో ముస్లింలంటే గుర్రుండవచ్చు. అయినా అడిగి చూద్దాం ఏమంటాడో” అనుకుంటూ ఖాలిద్ ధైర్యంచేసి మనసులోని మాట బయట పెట్టాడు.

ఉస్మాన్ ఓ నిమిషం ఆలోచించి ఇస్లాంపట్ల తన ఆసక్తి వ్యక్తపరిచాడు. అంతేకాదు, ఖాలిద్‌తో పాటు మదీనా బయలుదేరడానిక్కూడా సిద్ధమయ్యాడు.

“సరే, అలాగే వెళ్దాం. మక్కాలో నాక్కాస్త పని ఉంది. ఆ పని పూర్తికాగానే బయలు దేరుదాం” అన్నాడు ఉస్మాన్.

ఆ పని కూడా పూర్తి కావచ్చింది. ఫలానా రోజు నగరం వెలుపల కలుసుకుందామని ముందే నిర్ణయించుకున్నారు. దాని ప్రకారం మిత్రులిద్దరూ ఓ రోజు నగరం వెలుపల కలుసుకొని చక్కా మదీనా దారిపట్టారు.

ఇస్లామీయ ఉద్యమాన్ని అంతమొందించడానికి మక్కా బహుదైవారాధకులు చేస్తున్న ప్రతి యత్నమూ విఫలమవుతోంది. వారి పథకాలన్నీ ఒక్కొక్కటిగా బెడిసికొడ్తున్నాయి. ముస్లింయోధులతో జరిగిన తొలియుద్ధంలోనే వారు ఘోరపరాజయం చవిచూశారు. ఆ తరువాత ఉహుద్ యుద్ధంలో మొదట విజయపతాకం కాస్తంత ఊగుతున్నట్లు కన్పించినా చివరికి అపజయమే ఎదురయింది. కందకం యుద్ధంలో కూడా ఓటమి పాలయ్యారు. పోనీ హుదైబియా ఒప్పందమైనా ఇస్లాం వ్యాప్తిని అరికడ్తుందేమో అనుకుంటే అదీ లేదు. పైగా దానివల్ల ముస్లింల సంఖ్య ఇంకా పెరుగుతూనే పోయింది. మరికొద్ది కాలంలోనే వారు యావత్తు అరేబియాలో విస్తరించినా ఆశ్చర్యం లేదు.

ఈ ఆలోచనలతో మక్కా ఖురైషీయులు అవమాన భారంతో రోజురోజుకు క్రుంగి పోతున్నారు. కొందరయితే ఈ అవమానభారం మరింత దుర్భరం కాకముందే దాన్నుంచి బయటపడటానికి ప్రత్యామ్నాయ మార్గాలు కూడ వెతకడం ప్రారంభించారు. అలాంటి వారిలో అమ్ర్ బిన్ ఆస్ ఒకడు. అతను అభిమానం, పౌరుషంగల గొప్పసేనాని. ఉహుద్ పరిణామం తరువాత అతనో నిర్ణయానికి వచ్చాడు.

“మిత్రులారా! ముహమ్మద్ ధర్మం రోజురోజుకు వ్యాపిస్తూనే ఉంది. తగ్గే సూచనలు కన్పించడంలేదు. అందుకని నాకో ఆలోచన తట్టింది. చెప్పమంటారా?” అన్నాడు.

“సరే చెప్పు” అన్నారు ఖురైష్ నాయకులు కుతూహలంతో.

“మనం అబిసీనియా వెళ్ళి నజాషీ దగ్గర రాజకీయ ఆశ్రయం పొందాలి. ముహమ్మద్ అరేబియాను జయించినట్లయితే మనం అక్కడే ఉండిపోదాం. నజాషీ రాజ్యంలో మనకు కాస్తయినా గౌరవం ఉంటుంది. ఈ విధంగా మనం ముహమ్మద్ దాస్యం నుండి బయట

పడగలం. ఒకవేళ మన జాతివాళ్ళే గెలిస్తే మనం మన ప్రాంతానికి తిరిగిరావచ్చు. అప్పుడు మనం స్వేచ్ఛగా, గర్వంగా తలెత్తుకొని తిరగ్గలగుతాం. ఏ ప్రమాదం ఉండదు. హాయిగా గౌరవంగా జీవించవచ్చు" అన్నాడు అమ్ర్.

"బాగుంది. అలాగే చేద్దాం" అన్నారు అమ్ర్ అనుచరులు. మరునాడే వారు మక్కా నుండి అబిసీనియాకు బయలుదేరారు. నజాషీకి కానుకలు సమర్పించుకోవడానికి వారు వెండిబంగారాలతో పాటు ఎంతో విలువైన తివాచీలు కూడా వెంట తీసికెళ్ళారు.

నజాషీరాజు ఖురైష్‌నాయకులకు స్వాగతమిచ్చాడు. వారు తెచ్చిన కానుకల్ని సంతోషంగా స్వీకరించాడు. అలా ఖురైషీయులు నజాషీ రాజ్యంలో సుఖంగా గడపసాగారు.

దైవప్రవక్త (సల్లం) నజాషీ పేరిట రెండు లేఖలు వ్రాశారు. వాటిని ఇబ్నె ఉమయ్యా (రజి) తీసుకొని అబిసీనియా చేరుకున్నారు. అమ్ర్ ఆయన్ని చూడగానే ఇతను దైవప్రవక్త (సల్లం) రాయబారిగా వచ్చిఉంటాడని గ్రహించి నజాషీ దగ్గరికి వెళ్ళాడు.

"మహారాజా! మీ దగ్గరికి మదీనా నుండి ఓ రాయబారి వచ్చాడు. అతను మనందరి గర్భశత్రువు తరపున వచ్చిన దౌత్యవేత్త. అతడ్ని నాకప్పగించండి, హతమార్చివేస్తాను" అన్నాడు అమ్ర్ బిన్ ఆస్.

అమ్ర్ ఎవర్ని గురించి ఇలా అంటున్నాడో నజాషీ వెంటనే గ్రహించాడు. అతను అమ్ర్ వైపు ఉరిమి చూశాడు. తరువాత అతని చెయ్యి అప్రయత్నంగా పైకి లేచింది. మరుక్షణమే అమ్ర్ చెంప ఛెళ్ళుమన్నది.

ఒక్కసారిగా అమ్ర్ చుట్టూ గాఢాంధకారం అలుముకున్నది. కాళ్ళక్రింద భూమి చీలిపోయినట్లు అన్పించింది. కాస్సేపటికి అమ్ర్ కళ్ళు తెరిచాడు. చూస్తే నజాషీ కళ్ళు అగ్నికణాలు కురిపిస్తున్నాయి.

"మహాప్రభో! క్షమించండి. బుద్ధి గడ్డితిని ఏదో వాగాను. మీకీ మాటలు నచ్చవని తెలిస్తే నేనసలు నోరు విప్పేవాడ్ని కాను" అన్నాడు అమ్ర్ తడబడుతూ.

"తుచ్ఛుడా! ఎవరనుకున్నావు ఈ రాయబారి? ఒక సత్పురుషుడు, సాధువర్తనుడు, మూసా, ఈసా ప్రవక్తల మాదిరిగానే దైవదూత జిబ్రీల్ ద్వారా దైవసందేశాన్ని గ్రహించే మహాప్రవక్త అయిన ముహమ్మద్ (సల్లం) రాయబారిని నీకు అప్పగించాలా? ఆయన్ని నువ్వు హతమారుస్తావా?"

నజాషీ ఆవేశంతో చెబుతున్నాడు. అతను చెబుతున్న ఒక్కొక్క మాటలో దైవప్రవక్త పట్ల అతనికున్న అచంచలవిశ్వాసం, అపార ప్రేమాభిమానాలు బహిర్గతమవుతున్నాయి. అది చూసి అమ్ర్ ఎంతో ప్రభావితుడయ్యాడు.

"మహారాజా! మీరంటున్నది నిజమేనంటారా?" అన్నాడు అమ్ర్ అనుమానంతో.

"ఓరి పిచ్చివాడా! నామాట నమ్ము. ఆయన సత్యధర్మం తీసుకొచ్చిన అంతిమ దైవప్రవక్త (సల్లం). శత్రువులంతా లొంగిపోయి, ఆయన ధర్మం నలుదిశలా విస్తరిస్తుందని నువ్వు త్వరలోనే తెలుసుకుంటావు" అన్నాడు నజాషీ.



అమ్ర్ కంటిపొరలు ఒక్కసారిగా తొలగిపోయాయి. అతని అంతరంగంలో విశ్వాసకణం రగుల్కొంది. ముఖం అప్పుడే వికసించిన కలువ పువ్వులా కళకళలాడసాగింది. అతనిప్పుడు ఇస్లాం ధర్మానికి చేరువయ్యాడు.

అమ్ర్ బిన్ ఆస్ ఆ తర్వాత నజాషీ దగ్గర సెలవు తీసుకొని అరేబియా వెళ్ళిపోయాడు. అక్కడ ఒక ఒంటెను కొని మదీనా బయలుదేరాడు. దారిలో ఒక చోట ఖాలిద్ బిన్ వలీద్, ఉస్మాన్ బిన్ తల్హా కన్పించారు.

"ఖాలిద్! ఏమిటి విశేషం? ఎక్కడికీ ప్రయాణం?" అడిగాడు అమ్ర్ ఆత్రంగా.

"ముహమ్మద్ (సల్ల) దగ్గరికి వెళ్తున్నాము. మార్గం తేజోవంతంగా ఉంది. మాట సమంజసంగా ఉంది. అలాంటప్పుడు ఇంకెన్నాళ్ళిలా తప్పించుకొని తిరుగుదాం? పదా మాతో పాటు, ఇస్లాం స్వీకరిద్దాం" అన్నాడు ఖాలిద్.

"నేనూ అదే ఉద్దేశ్యంతో బయలుదేరాను, పదండి" అన్నాడు అమ్ర్ బిన్ ఆస్.

ముగ్గురి మార్గం ఒకటే. లక్ష్యం ఒకటే. గమ్యం కూడా ఒకటే. ముగ్గురూ సంతోషంగా మదీనా బయలుదేరారు.

దైవప్రవక్త (సల్లం) మసీదులో అనుచరుల మధ్య కూర్చొని ధర్మబోధ చేస్తున్నారు. కాస్సేపటికి ఆయన ధర్మబోధను హఠాత్తుగా ఆపి ఇలా అన్నారు:

"చూడండి, మక్కా నగరం తనకు ప్రాణప్రదమైన తురుపు ముక్కల్ని మన వైపునకు విసిరింది. ఖాలిద్ బిన్ వలీద్, ఉస్మాన్ బిన్ తల్హా, అమ్ర్ బిన్ ఆస్- ఈ ముగ్గురూ నగరంలో ప్రవేశించారు. వెళ్ళి పిలుచురండి."

ఈ శుభవార్త వినగానే ప్రవక్త అనుచరులు ఆనంద డోలికల్లో ఊగిపోయారు. ఖాలిద్ అన్న వలీద్ బిన్ వలీద్ అయితే చెప్పనవసరం లేదు. సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ వెంటనే లేచి తమ్ముడికి స్వాగతం చెప్పడానికి బయటికి పరుగెత్తారు. దారిలోనే ఆయన ఆ ముగ్గురిని కలిశారు.

"త్వరగా నడవండి. దైవప్రవక్త (సల్లం)కు మీరు ముగ్గురు వస్తున్నారని తెలిసింది. ముస్లింలందరూ మీకోసం ఎంతో ఆతృతతో ఎదురుచూస్తున్నారు." అన్నారాయన.

"ఏమిటీ! దైవప్రవక్త (సల్లం)కు మేమెలాంటి సమాచారం పంపలేదే! మేం వస్తున్న సంగతి వారికెలా తెలిసింది?" ఖాలిద్ ఆశ్చర్యపోతూ అడిగాడు.

"దైవప్రవక్త (సల్లం)కు ఆయన ప్రభువు అవసరమైనప్పుడల్లా అగోచర విషయాలు తెలుపుతుంటాడు" వలీద్ (రజి) సమాధానమిచ్చారు.

ఈ నలుగురూ మసీదులో ప్రవేశించగానే అక్కడున్నవారి ముఖపద్మాలు ఒక్కసారిగా సంతోషంతో విప్పారాయి.

"ఖాలిద్! ఏమిటి సంగతి ఇలా వచ్చావు?" ప్రేమగా అడిగారు దైవప్రవక్త (సల్లం) చిరునవ్వు నవ్వుతూ.

"మేము ముగ్గురం ఇస్లాం స్వీకరించడానికి వచ్చాం" అన్నాడు ఖాలిద్ ముక్తసరిగా.

ఆ తరువాత ఆ ముగ్గురూ సద్వచనం పఠించి ఇస్లాం స్వీకరించినట్లు ప్రకటించారు. దాంతో 'అల్లాహు అక్బర్' అనే నినాదంతో మసీదు మార్మోగింది. వారి ఇస్లాం ప్రకటనతో దైవప్రవక్త (స)తో పాటు ముస్లింలందరూ పరమానంద భరితులయ్యారు.

## "మూతా"లో విజయకేతనం-(130)

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఇస్లామీయ ఉద్యమాన్ని మరింత విస్తృతం చేశారు. మదీనా చుట్టుపట్ల ఉన్న తెగలవారికే గాకుండా సుదూరప్రాంతాల్లో ఉండే తెగలక్కూడా దైవసందేశం అందేజేసే నిమిత్తం ఆయన ధర్మప్రచార బృందాలను పంపించారు. అప్పుడు కొన్ని తెగలు ఇస్లాం స్వీకరించాయి. కాగా మరికొన్ని తెగలు దైవప్రవక్త (సల్లం)కు బద్ధ శత్రువులయ్యాయి.

సిరియాలోని "జాతుత్తలహ్" అనే ప్రాంతానికి ధర్మప్రచారం కోసం ప్రవక్త అనుచర బృందం ఒకటి వెళ్ళింది. అయితే శత్రువులు ప్రచారబృందంలోని వారందరినీ దారుణంగా చంపేశారు. ఒకడు మాత్రమే ఎలాగో తప్పించుకోగలిగాడు. బస్రాగవర్నర్ దగ్గరికి కూడా దైవప్రవక్త (స) తన ప్రతినిధి హజ్రత్ హారిస్ బిన్ ఉమైర్ (రజి)ని పంపించారు.

హజ్రత్ హారిస్ (రజి) బస్రా వైపు ప్రయాణంసాగిస్తూ సిరియా సరిహద్దు సమీపంలోని మూతా ప్రాంతానికి చేరుకున్నారు. మూతా రోమ్ రాజ్యంలోని భూభాగమే. కాని మూతా గవర్నర్ షుర్జిల్ బిన్ అమ్ర్ దౌత్యనీతికి తిలోదకాలిచ్చి హజ్రత్ హారిస్ బిన్ ఉమైర్ (రజి)ని బంధించి, ఆ తరువాత హతమార్చివేశాడు.

ఈ రెండు దుర్ఘటనలు దైవప్రవక్త (స) హృదయాన్ని బాగా కలచివేశాయి. ధర్మ ప్రచారకులుగా, దౌత్యవేత్తలుగా పోయినవారిని ఇలా దౌత్యనీతిని ఉల్లంఘించి అన్యాయం గా హతమార్చడం మానవతకే కళంకం. పౌరుషం, ఆత్మాభిమానం ఉన్నవారు ఎవరూ ఈ అమానుషాన్ని సహించలేరు. ఈ విద్రోహుల్ని అలా వదలిపెడ్తే మరెన్ని ఘాతుకాలకైనా పాల్పడవచ్చు. అంచేత దైవప్రవక్త (స) తక్షణమే మూడు వేల మంది ముజాహిద్‌లతో కూడిన ఓ ప్రత్యేక సైనికదళాన్ని సిద్ధంచేశారు. జైద్ బిన్ హారిసా (రజి)ను దానికి సేనాపతిగా నియమించారు. ఆ తరువాత ముజాహిద్‌లను ఈవిధంగా ఆదేశించారు:

"ఒకవేళ జైద్ అమరగతుడయితే జాఫర్ సేనాపతి అవుతాడు. జాఫర్ అమరగతుడైతే అబ్దుల్లా బిన్ రవాహ సేనాని అవుతాడు. అబ్దుల్లా కూడా అమరగతుడయితే సైనికులు తాము కోరుకున్న వ్యక్తిని సేనాపతిగా ఎన్నుకోవాలి."

యోధులు ఉత్సాహంతో యుద్ధానికి బయలుదేరారు. దైవప్రవక్త (సల్లం) యోధులకు వీడ్కోలు చెప్పడానికి వచ్చారు. ఆయన యుద్ధపతాకాన్ని హజ్రత్ జైద్ (రజి) చేతికి అందించారు. తరువాత సేనలను ఒకచోట ఆపి ఇలా ఉపదేశించారు:

"ముస్లిం యోధులారా! ఎల్లప్పుడూ దైవానికి భయపడుతూ ఉండాలి. ఆయనకు ఆగ్రహం కల్గించే పనులకు దూరంగాఉండాలి. దైవవిరోధులతో యుద్ధం చెయ్యండి.



అయితే మోసం మాత్రం ఎట్టి పరిస్థితిలో కూడా చేయకూడదు. నీతీ నిజాయితీలకు తిలోదకాలివ్వకండి. స్త్రీలను అగౌరవపరచకండి. వృద్ధుల జోలికిపోకండి. అనవసరంగా చెట్లను నరకకండి. ఇళ్ళను పడగొట్టవద్దు."

"వినండి. శత్రువులతో యుద్ధంచేయడానికి ముందుగా వారి ఎదుట మూడు విషయాలు ఉంచండి. మొదట దైవసందేశం విన్పించి ఇస్లాం స్వీకరించమని చెప్పండి. అందుకంగీకరిస్తే వారిని ముస్లింలుగా పరిగణించండి. తరువాత దైవమార్గంలో హిజ్రత్ చేయమని చెప్పండి. హిజ్రత్ చేయడానికి సిద్ధమైతే ముహాజిర్లు అవుతారు. ముహాజిర్లకు లభించే హక్కులన్నీ వారికి లభిస్తాయి. ఇస్లాం స్వీకరించి హిజ్రత్ చేయడానికి సిద్ధంగా లేకపోతే వారి స్థితి బానియావారిలా ఉంటుంది. సమరసొత్తులో వారికి వాటా లభించదు. వారొకవేళ ఇస్లాం స్వీకరించడానికి అంగీకరించక పోతే 'జిజ్యా' చెల్లించమని అడగండి. జిజ్యా ఇవ్వడానికి సిద్ధమైతే స్వీకరించండి. నిరాకరిస్తే వారితో యుద్ధం చేయండి."

ముజాహిద్‌లు హిజ్రీశకం 8వ సంవత్సరం, జమాదిల్ అవ్వల్ నెలలో మదీనా నుండి బయలుదేరారు. దారిలో హజ్రత్ ఇబ్నెరవాహ (రజి) తన కవితాపటిమతో ముజాహిద్ లలో ఉత్తేజం కలిగించేవారు. వారి పౌరుషం పురివిప్పి నాట్యమాడేలా ఉద్రేకపూరితమైన గేయాలు పాడేవారు. యోధులు మరింత ఉత్సాహంతో సాగిపోయారు. సిరియా సరిహద్దులు దాటి రోమ్ సామ్రాజ్యంలో ప్రవేశించారు.

రోమ్ సామ్రాజ్యంలోని "మూతా" ప్రాంతం పాలకుడు షుర్జిల్ బిన్ అమ్ర్ ముస్లింల యుద్ధ సన్నాహాలను గురించి ముందే తెలుసుకొని లక్ష మంది సైనికుల్ని సమీకరించాడు. అదీగాక రోమ్ చక్రవర్తి సహాయం కూడా కోరాడు. రోమ్ చక్రవర్తి తన సోదరుడికి లక్షమంది సైనికుల్ని ఇచ్చి పంపించాడు. ఇలా శత్రుసేనలు అత్యధిక సంఖ్యలో, అపారమైన ఆయుధ సంపత్తితో ముస్లింలను ఢీకొనడానికి సిద్ధమయ్యాయి.

సిరియాలో అడుగుపెట్టే వరకూ ముస్లింలకు ఈ విషయం తెలియదు. వారు లక్ష మంది రోమ్ సైనికుల్ని చూసి నిర్ఘాంతపోయారు. ఇప్పుడేం చేయాలి? పరిస్థితి దైవప్రవక్త (సల్లం)కు తెలియజేయడమా? లేక ఈ భారీ సైన్యానికి ఎదురు నిలిచి పోరాడటమా? ముజాహిద్‌లు సందిగ్ధంలో పడిపోయారు. రెండ్రోజుల దాకా ఎటూ తేల్చుకోలేక పోయారు. హజ్రత్ అబ్దుల్లా బిన్ రవాహ (రజి)లోని పౌరుషం బుసలుకొట్టింది.

"సోదరులారా! మనం ఎప్పుడూ సంఖ్యాధిక్యతను దృష్టిలో పెట్టుకొని యుద్ధం చేయలేదు. అశ్వాలపై, ఆయుధాలపై కూడా మనం ఎన్నడూ ఆధారపడలేదు. మన అసలు ఆయుధం దైవధర్మం. పదండి. విజయమో, వీరమరణమో ఏదో ఓ కోరిక నెరవేరు తుంది. దైవనామం ఉచ్చరించి ముందుకు సాగండి" అన్నారు ఆయన.

ఇబ్నెరవాహ (రజి) ప్రసంగం వినగానే సేనాపతి జైద్ బిన్ హారిస్ (రజి) ఒక చేతిలో పతాకం, మరొక చేతిలో ఈటె తీసుకొని లేచి నిలబడ్డారు. సేనాపతి సమరోత్సాహం చూడగానే మిగిలిన యోధులలో నూతనుత్తేజం జనించింది. ఆ వెనువెంటనే అందరూ రోమ్ సేనలతో ఢీకొనడానికి సిద్ధమయ్యారు.

ఇరుపక్షాలు యుద్ధరంగంలో ప్రవేశించాయి. ఒక వైపు లక్షమంది రోమ్ యోధులతో కూడిన సైనికవాహిని యుద్ధనురుగులు కక్కుతోంది. రెండోవైపు కేవలం మూడువేల మంది ముస్లింయోధులు దైవంపై భారంవేసి నడుం బిగించారు.

హజ్రత్ జైద్ బిన్ హారిసా (రజి) ఒక చేతిలో ధ్వజం, రెండవ చేతిలో ఖడ్గం పట్టుకొని పెనుతుఫానులా శత్రుసైన్యంలోకి దూసుకుపోయారు. చాలా సేపటిదాకా భయంకరంగా పోరాడుతూ అనేకమంది శత్రుసైనికుల్ని కూల్చివేశారు. కాని శత్రుసైనికులు అత్యధిక సంఖ్యలో ఉండటం వల్ల జైద్ (రజి) పైన నలు వైపుల నుంచి బాణాలు ఎడతెరిపిలేకుండా వచ్చిపడుతున్నాయి. అయినప్పటికీ ఆయన ఎంతో ధైర్యంతో పోరాడారు. చివరికి ఆయన శరీరం నిండా గాయాలతో కుప్పకూలిపోయారు.

తక్షణమే హజ్రత్ జాఫర్ బిన్ అబూతాలిబ్ (రజి) సమరధ్వజం ఎత్తుకొని శత్రువులపై విరుచుకుపడ్డారు. ఎదురొచ్చిన శత్రుసైనికుల్ని హతమారుస్తూ అప్రతిహతంగా ముందుకు పురోగమించారు. కాని శత్రువులు చక్రబంధం వేసి జాఫర్ (రజి) కుడిచేతిని తెగ్గొట్టారు. ఆ చేతిలో ఉన్న యుద్ధపతాకం జారిపోయింది. వెంటనే ఆయన దాన్ని ఎడమ చేతిలోకి తీసుకున్నారు. శత్రువులు ఆయన ఎడమ చేతిని కూడా తెగ్గొట్టారు. హజ్రత్ జాఫర్ (రజి) దాన్ని క్రింద పడనీయకుండా మొండిచేతులతో గుండెలకు అదిమి పట్టుకున్నారు. కాని ఆ మరుక్షణమే ఓ రోమ్ సైనికుడు మెరుపుదాడి చెయ్యడంతో హజ్రత్ జాఫర్ (రజి) కూడా అమరగతులయ్యారు.

వెంటనే హజ్రత్ ఇబ్నెరవాహ (రజి) పరుగెత్తి పతాకం చేతిలోకి తీసుకున్నారు. పతాకం తీసుకోగానే రెండవచేతిలో ఉన్న ఖడ్గంతో శత్రువుల మీదికి లంఘించారు. ఆయన కూడా చాలా సేపటివరకు వీరోచితంగా పోరాడారు. చివరికి సత్తువ తగ్గిపోవడంతో కాస్త ఢీలాపడి పోయి వెనుకంజవేశారు. ఇది గమనించిన ఒక ముజాహిద్ వెంటనే కాస్త మాంసం తెచ్చి, తిని బలం పుంజుకోమని అన్నాడు.

ఇబ్నె రవాహ (రజి) ఆ మాంసం తీసుకొని ఓ ముక్క నోట్లో పెట్టుకున్నారు. అంతలో పెద్దపెట్టున యుద్ధ కలకలం విన్పించింది. ఇబ్నె రవాహ (రజి) నోట్లో పెట్టుకున్న మాంసపు ముక్క తీసిపారేసి "అరె ఇబ్నెరవాహా! ఇంకా నువ్వు ప్రపంచంలోనే ఉన్నావా!!" అని కేకలుపెడుతూ కదనరంగంలోకి దూకారు. శత్రువుల్ని చీల్చిచెండాడుతూ వరద ప్రవాహంలా ముందుకు సాగారు. అలా పోరాడుతూ చివరికి ఆయన కూడా తీవ్రంగా గాయపడి అమరగతులయ్యారు.

దైవప్రవక్త (స) నియమించిన ముగ్గురు సేనాపతులు కూడా అమరగతులయ్యారు. ఇప్పుడు ముస్లిం సేనలకు సేనాపతి ఎవరు? హజ్రత్ సాబిత్ బిన్ అర్ఖం (రజి) ముందుకు వచ్చి సమరధ్వజం చేతిలోకి తీసుకున్నారు.

"ముస్లింలారా! తక్షణమే మీరు మీ నాయకుడ్ని ఎన్నుకోండి" అన్నారాయన.

"మీరే ఉండండి మా నాయకుడిగా" అన్నారు ముజాహిద్‌లు.

"కాదు, ఇది నావల్ల జరిగే పని కాదు" అన్నారు సాబిత్ (రజి).



అప్పుడు ముజాహిద్‌ల దృష్టి ఖాలిద్ బిన్ వలీద్ (రజి) మీద పడింది. వెంటనే వారు ఖాలిద్ (రజి)ని సేనాపతిగా ఉండమని చెప్పారు.

హజ్రత్ ఖాలిద్ (రజి) పరిస్థితిని అర్థం చేసుకున్నారు. ఇక ఏమాత్రం ఆలస్యం చేసినా ప్రమాదం ముంచుకొస్తుందని భావించారు. అందువల్ల తక్షణమే ఆయన సమరధ్వజం తీసుకొని సుడిగాలిలా శత్రుపక్షంలోకి దూసుకుపోయారు. ఇదివరకటి సేనాపతులకన్నా భయంకరంగా పోరాడి అనేకమంది శత్రువుల్ని కడతేర్చారు.

చీకటిపడగానే ఆరోజు యుద్ధం ముగిసింది.

శత్రువులు అసంఖ్యాకంగా ఉన్నారు. ఆయుధాలు కూడా వారికి అపారంగా ఉన్నాయి. అలాంటి పరిస్థితిలో వ్యూహాత్మకమైన చర్యలు తీసుకోకపోతే ఉన్న కొద్దిమంది ముజాహిద్‌లు సమరాగ్నికి సమిధలయ్యే ప్రమాదం ఉంది.

ఈ ఆలోచన రాగానే ఖాలిద్ బిన్ వలీద్ (రజి) సైన్యాలను పునర్వ్యవస్థీకరించారు. ఎంతో కట్టుదిట్టంతో ముందు పంక్తులను వెనక్కి, వెనుక పంక్తులను ముందుకు మార్చివేశారు. కొన్ని పంక్తులను వెనుక ఉంచి శత్రుసైనికులు ముందుకు రాగానే గట్టిగా నినాదాలివ్వమని ఆదేశించారు.

మరుసటి రోజు ఉదయం శత్రువులకు కొత్త ముఖాలు కన్పించాయి. మదీనా నుండి కొత్త సైన్యం వచ్చి ఉంటుందని భావించి భయపడ్డారు. అంతలో వెనుక పంక్తుల్లో ఉన్న ముజాహిద్‌లు దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. దాంతో రోమ్ సైన్యం మరింత కంగారుపడిపోయింది. వారి సేనాపతులు యుద్ధం కొనసాగించాలా వద్దా అని వెంటనే తేల్చుకోలేక సందిగ్ధంలో పడిపోయారు.

హజ్రత్ ఖాలిద్ (రజి) ఇదే మంచి అవకాశమని తలచి తక్షణమే మూకుమ్మడి దాడికై అనుచరుల్ని ఆదేశించారు. రోమ్ సైనికులు సందిగ్ధం నుంచి ఇంకా తేరుకోక ముందే ముస్లిం యోధులు ఒక్కసారిగా వారిపై విరుచుకుపడ్డారు. దాంతో రోమ్ సైనికులు మరింత భయపడి చెల్లా చెదరయిపోయారు. కొందరు మాత్రం మొండి ధైర్యంతో ముస్లింలతో పెనుగులాడటం మొదలెట్టారు. కాస్సేపటికి వారు కూడా ముస్లింల ధాటికి నిలువలేక పలాయనం చిత్తగించారు. ముస్లిం యోధులు కొంత దూరం వరకు వారిని వెంబడించి విజయానందంతో వెనుదిరిగారు.

## మదీనాలో మూతా యుద్ధవార్తలు-(131)

మదీనాలో ముస్లింలు యుద్ధవార్తల కోసం ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. రోమ్ సైన్యాలను ఎదుర్కోవడానికి పోయిన ముజాహిద్‌లు విజయంతో తిరిగివస్తారని, యుద్ధ భూమిలో ప్రదర్శించిన సాహసకృత్యాల్ని గురించి చెబుతారని భావిస్తూ వారి రాకకోసం నిరీక్షిస్తున్నారు. కాని వారిని గురించిన సమాచారమేదీ ఇంకా మదీనాముస్లింలకు చేరలేదు.

ఒక రోజు దైవప్రవక్త (సల్లం) మసీదులో కూర్చొని ఆలోచనల్లో మునిగిపోయారు. ముఖంలో గాంభీర్యత చోటుచేసుకుంది. అనుచరులు ఆయన చుట్టూ కూర్చొని ఉన్నారు.

దైవప్రవక్త (సల్లం) నోట ఏ సత్యవాక్కు వెలువడుతుంతో విందామని కుతూహలంతో వారు మరింత దగ్గరకు జరిగి నిశ్శబ్దంగా కూర్చున్నారు.

నిశ్శబ్దాన్ని ఛేదించడానికి సిద్ధంగా ఉన్నట్లు దైవప్రవక్త (స) పెదవుల్లో అప్రయత్నంగా కదలిక ఏర్పడింది.

"అదిగో! జైద్ బిన్ హారిసా. సమరధ్వజం తీసుకొని రంగంలోకి దూకాడు."

అనుచరులు సంభ్రమాశ్చర్యాలతో తమ ప్రియతమ నాయకుని వైపు చూస్తున్నారు.

"అతనిప్పుడు శత్రుసైన్యంలోకి దూసుకుపోయాడు. భీకరంగా పోరాడుతున్నాడు...... పోరాడుతూ పోరాడుతూ చివరికి అమరగతి నొందాడు" అన్నారు దైవప్రవక్త (స).

అమరగతి సంగతి వినగానే అనుచరుల ముఖాలు కళావిహీన మయ్యాయి.

మహాప్రవక్త (సల్లం) దైవమహిమతో ఇక్కడ్నుంచే అక్కడి సమర దృశ్యాన్ని వీక్షిస్తున్నారని వారు గ్రహించారు. ఆ తరువాత ఏం జరగబోతుందోనని కంగారుపడుతూ ఆయన చెబుతున్న విషయాలను చెవులు రిక్కించి వినసాగారు.

"వెంటనే సమరధ్వజాన్ని జాఫర్ అందుకున్నాడు..... ఆయన కూడా శత్రువులతో పోరాడుతూ చివరికి అమరగతినొందాడు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

ఈ సంగతి చెప్పి ఆయన కాస్సేపు మౌనంగా ఉండిపోయారు. అనుచరులు మరింత ఆందోళనచెందారు.

"తర్వాత యుద్ధపతాకం అబ్దుల్లా బిన్ రవాహ (రజి) చేతికొచ్చింది...ఆయన కూడా చాలాసేపు పోరాడి చివరికి దేవుని సన్నిధికి చేరుకున్నాడు" అన్నారు దైవప్రవక్త (స).

యుద్ధవ్యూహం మారిపోయింది. ముజాహిద్‌ల నాయకులు ముగ్గురూ అమరగతులైపోయారు. దీన్నిబట్టి శత్రువులు అసంఖ్యాకంగా ఉంటారని, యుద్ధ పరిస్థితి చాలా క్లిష్టంగానే ఉందని గ్రహించారు అనుచరులు. దాంతో వారిముఖాలు పూర్తిగా వాడిపోయాయి. గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి.

"దైవప్రవక్తా! ఇబ్నె రవాహ అమరగతి వార్త చెప్పక ముందు కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయారు. కారణం ఏమిటో మాకర్థం కాలేదు" అన్నారు కొందరు.

"జైద్ పరుగిడుతూ స్వర్గంలో ప్రవేశిస్తుంటే చూశాను. తర్వాత జాఫర్‌ని చూస్తే, అతను స్వర్గంలో రెక్కలతో ఎగురుతూ తానుకోరిన చోటికల్లా చేరడం కన్పించింది. కాని అబ్దుల్లా కాస్త ఆలస్యంగా స్వర్గంలో ప్రవేశించాడు" చెప్పారు దైవప్రవక్త (స)

"అయితే దైవప్రవక్తా! అబ్దుల్లాకు స్వర్గం చేరుకోవడానికి ఆలస్యం ఎందుకయినట్లు?" అడిగారు వారు ఆందోళనతో.

"గాయపడటం వల్ల ఆయన కాస్త వెనక్కితగ్గాడు. తర్వాత జరిగిన పొరపాటు గ్రహించి మళ్ళీ రంగంలోకి దూకాడు. శత్రువులతో పోరాడి అమరగతినొందాడు. అందువల్ల స్వర్గంలో కాస్త ఆలస్యంగా ప్రవేశించాడు" అన్నారు దైవప్రవక్త (సల్లం).



ఈ మాటలు విని అనుచరుల మనస్సు కాస్త కుదుటపడింది. హజ్రత్ జాఫర్ (రజి) స్వర్గంలో రెక్కలతో ఎగురుతున్నారని వినగానే జనం ఆయన్ని జాఫర్ తయ్యార్ అనే పేరుతో ప్రస్తావించడం ప్రారంభించారు.

అయితే జాఫర్ (రజి) అమరగతి కారణంగా దైవప్రవక్త (సల్లం) ముఖారవిందం వాడిపోయింది. ఆయన విచారవదనంతో అక్కడ్నుంచి బయటికి వెళ్ళిపోయారు. నేరుగా ఆయన హజ్రత్ జాఫర్ (రజి) ఇంటికి వెళ్ళారు. ఇంట్లో జాఫర్ (రజి) సతీమణి అస్మా బిన్తె అమీస్ (రజి) మాత్రమే ఉన్నారు.

"అస్మా! జాఫర్ ముద్దు బిడ్డలేరి?" అడిగారు దైవప్రవక్త (సల్లం).

"దైవప్రవక్తా! ఏమిటీ అలా అడుగుతున్నారు? ఆయన క్షేమంగానే ఉన్నారు కదా? అయ్యయ్యో! ఎందుకా కన్నీళ్ళు? జాఫర్ అమరగతులయ్యారా?" అంటూ హజ్రత్ అస్మా (రజి) కంగారుపడసాగారు.

"ఔనమ్మా! ఆయన్ని ఈరోజు దేవుడు తన దగ్గరికి పిలుచుకున్నాడు" అన్నారు దైవప్రవక్త (సల్లం) గద్గద స్వరంతో, కన్నీళ్ళు పొరలుతుండగా.

భర్త మరణవార్త వినగానే ఆమె గావుకేక పెట్టారు. కన్నీరుమున్నీరుగా విలపిస్తూ గుండెలు బాదుకోసాగారు.

"అస్మా! బాధపడకమ్మా!! అలా గుండెలు బాదుకోకు. అనుచితమైన ఎలాంటి మాటా నీ నోట వెలువడకూడదు. ధైర్యం తెచ్చుకో తల్లీ.... " అంటూ దైవప్రవక్త (సల్లం) ఆమెను ఓదార్చడానికి ప్రయత్నించారు.

హజ్రత్ జాఫర్ (రజి) దైవప్రవక్త (సల్లం)కు పెదనాన్న కొడుకు కూడా అవుతారు. అందువల్ల ఆయన మరణం ఆయన హృదయాన్ని బాగా కలచివేసింది.

శోకతప్త హృదయంతో ఆయన చిన్నారి కూతురు హజ్రత్ ఫాతిమా (రజి) ఇంటికి వెళ్ళారు. ఆమెతో మాట్లాడుతూ "ఎవరైనా దుఃఖించవలసివుంటే వారు జాఫర్ (రజి)ని తలచుకొని దుఃఖించాలి" అన్నారు.

అక్కడ్నుంచి దైవప్రవక్త (సల్లం) తన స్వగృహానికి వెళ్ళి "జాఫర్ కుటుంబసభ్యుల కోసం భోజనం తయారుచేయండి. ఈరోజు వారు స్పృహలో లేరు" అని చెప్పారు తన భార్యలతో.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) హజ్రత్ జైద్ (రజి) ఇంటికి వెళ్ళారు. అక్కడ్నుంచి ఆయన హజ్రత్ అబ్దుల్లా బిన్ రవాహ (రజి) ఇంటికి వెళ్ళారు. వారిరువురి కుటుంబ సభ్యుల్ని కలుసుకొని వారికి ధైర్యసహనాలను గురించి ఉపదేశించారు. వారి పిల్లలను అక్కున చేర్చుకొని ప్రేమగా తలలు నిమిరారు.

యుద్ధంలో జరిగిన సంఘటనలు వినేందుకు ఉవ్విళ్ళూరుతూ మదీనా ప్రజలు ముజాహిద్‌ల రాక కోసం తీవ్రంగా నిరీక్షించసాగారు. ఆ తరువాత కొన్నాళ్ళకే ముజాహిద్‌లు వచ్చేశారు. ప్రజలు అమిత సంతోషంతో వారికి స్వాగతం చెప్పారు. దైవప్రవక్త (సల్లం)

హజ్రత్ ఖాలిద్ (రజి) పన్నిన సమరవ్యూహాన్ని, చూపిన ధైర్యసాహసాలను ప్రశంసిస్తూ ఆయనకు సైపుల్లా (దైవకరవాలం) అని బిరుదు ప్రదానం చేశారు.

# ఒప్పందం ఉల్లంఘనతో పశ్చాత్తాపం-(132)

హుదైబియాఒప్పందం జరిగిన తొలిరోజుల్లో ఖురైషీయులు, వారి మిత్రపక్షాలు సంధిషరతుల్ని గౌరవిస్తుండేవారు. తర్వాత ఆ షరతుల్ని ఉల్లంఘించడం ప్రారంభించారు.

హుదైబియా ఒప్పందం జరిగిన కొన్నాళ్ళకు ఇస్లాం వల్ల తమకు ప్రమాదం తప్పిందని, ఇప్పుడిక తమ పాతశత్రువైన ఖుజాఅ తెగపై ప్రతీకారం తీర్చుకోవాలని బకర్ తెగవాళ్ళు భావించారు. ఈ ఒప్పందం ప్రకారం బహుదైవారాధకులయిన ఖుజాఅ తెగవాళ్ళు ముస్లింల మిత్రపక్షంగా మారిపోయారు. బకర్ తెగ మాత్రం ఖురైషీయులతో చేతులు కలిపింది. ఒకరోజు రాత్రివేళ బకర్ తెగవాళ్ళు ఖురైషీయుల సహకారంతో మక్కా దరిదాపుల్లో నివసించే ఖుజాఅ తెగ ప్రజలపై మెరుపు దాడిచేశారు. ఘోరమైన రక్తపాతం జరుపుతూ వారి ఇళ్ళను దోచుకోవడం ప్రారంభించారు.

ఈ హఠాత్పరిణామానికి ఖుజాఅ తెగవాళ్ళు భీతావహులై రక్షణ కోసం కాబా గృహానికి పారిపోయారు. కాని వారి శత్రువులు కాబా పవిత్రతను కూడా ఖాతరు చేయలేదు. వారు అక్కడికి కూడా వచ్చి ఘోరాతిఘోరంగా రక్తపాతం జరిపి అనేకమందిని ఊచకోత కోశారు. ఖుజాఅ తెగవాళ్ళు అనేకమంది కాబాలోనే ప్రాణాలు కోల్పోయారు. మిగిలినవారు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని వీలున్న వైపునకు పారిపోయారు.

దారుణమైన ఈ హత్యాకాండ జరుగుతున్నప్పుడు కొందరు ఖుజాఅ తెగవాళ్ళు దైవప్రవక్త (సల్లం)ను పేరుపెట్టి పిలుస్తూ "మహానుభావా! దైవసందేశహరుడా!! మమ్మల్ని ఆదుకోండి. బకర్ తెగ మాపై దౌర్జన్యకాండకు పాల్పడింది. మమ్మల్ని కాపాడండి" అని బిగ్గరగా కేక పెట్టారు.

ఈ కేక వందలమైళ్ళ దూరంలోని మదీనానగరంలో ఉన్న దైవప్రవక్త (సల్లం) చెవులకు తాకింది. ఆ సమయంలో ఆయన విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ మైమూనా (రజి) ఇంట్లో ఉజూ చేస్తున్నారు. వెంటనే ఆయన "లబ్బయిక్, లబ్బయిక్" (వస్తున్నాను, వస్తున్నాను) అని సమాధానమిచ్చారు.

హజ్రత్ మైమూనా (రజి) ఆశ్చర్యపోతూ "దైవప్రవక్తా! మీరిలా ఎవరి మాటకు సమాధానమిస్తున్నారు?" అని ప్రశ్నించారు.

"ఖుజాఅ తెగవాళ్ళ మొర నా చెవులకు తాకింది. దానికి జవాబుగా నేనిలా అన్నాను" చెప్పారు దైవప్రవక్త (సల్లం).

సరిగ్గా అదే సమయంలో దౌర్జన్యకాండ జరుగుతున్న కాబాలయంలో దైవప్రవక్త (సల్లం) పలికిన ఈ పలుకులు దిక్కులు పిక్కుటిల్లేలా ప్రతిధ్వనించాయి. దాంతో బకర్ తెగవాళ్ళు భయపడిపోయి హత్యాకాండ ఆపి వెళ్ళిపోయారు. ఈ హత్యాకాండలో ఖుజాఅ తెగ మనుషులు దాదాపు ముప్ఫయి మంది చనిపోయారు.



ఈ సంఘటన జరిగిన రెండుమూడు రోజుల తరువాత ఖుజాఅ తెగ నాయకులు బుదైల్ బిన్ వరఖా, అమ్ర్ బిన్ సాలమ్, వారి అనుచరులు కొందరు మదీనా చేరుకొని దైవప్రవక్త (సల్లం)కు తమ దయనీయ స్థితిని విన్నవించుకున్నారు.

ఖుజాఅ ప్రజలపై జరిగిన హింసాకాండ సంగతి విని దైవప్రవక్త (సల్లం) చలించి పోయారు. దుర్మార్గులు హుదైబియా ఒప్పందాన్ని ఉల్లంఘించడమే కాకుండా కాబా ప్రతిష్ఠను సైతం మంటకలిపి రక్తపుటేరులు ప్రవహింపజేశారు. అలాంటి రాక్షసుల్ని విచ్చలవిడిగా వదలిపెడ్తే మరెన్ని దారుణాలకయినా పాల్పడవచ్చు.

దైవప్రవక్త (సల్లం) ఓ క్షణం ఆలోచించి "అమ్ర్! భయపడకండి. మీకు తప్పకుండా సహాయం లభిస్తుంది" అని అభయమిచ్చారు.

దైవప్రవక్త (సల్లం) ఇచ్చిన అభయంతో ఖుజాఅ తెగనాయకులకు కాస్త ఊరట కలిగింది. తమకు అనుకూలంగా దైవప్రవక్త (సల్లం) గట్టిచర్య తీసుకుంటారని తలచి వారు నిశ్చింతగా మక్కా తిరుగు ప్రయాణమయ్యారు.

హుదైబియా ఒప్పందం ప్రకారం తమ మిత్రపక్షమయిన ఖుజాఅ తెగవాళ్ళను ఆదుకోవడం ముస్లింల విధి. అందువల్ల దైవప్రవక్త (సల్లం) ఖురైష్ నాయకు ముందు మూడు షరతులు పెట్టి, అందులో ఒక దాన్ని అంగీకరింపజేయమని చెప్పి ఒక మనిషిని మక్కా పంపించారు.

దైవప్రవక్త (సల్లం) ప్రతినిధి మక్కా వెళ్ళి ఖురైష్ నాయకుల ముందు ఈ మూడు షరతులు ఉంచారు:

"ఖుజాఅతెగ మనుషులు ఎంతమంది వధించబడ్డారో వారి బంధువులకు రక్త పరిహారం చెల్లించండి. లేదా బకర్ తెగకు మీ సహాయసహకారాలన్నీ నిలిపి వేయండి. లేదా హుదైబియా ఒప్పందం రద్దు చేసుకుంటున్నామని బహిరంగంగా ప్రకటించండి" అన్నాడు దైవప్రవక్త (స) ప్రతినిధి.

ఖురైషీయుల తరఫున ఓ నాయకుడు "మేము మూడో షరతును అంగీకరిస్తున్నాం" అన్నాడు. అయితే వారా సమయంలో మూడో షరతును అంగీకరించామని చెప్పారే గాని, ప్రవక్తప్రతినిధి వెళ్ళిపోయిన తరువాత చాలా పశ్చాత్తాపంచెందారు. వెంటనే వారు అబూసుఫ్యాన్‌ని రాయబారిగా చేసి మదీనా పంపారు.

అబూసుఫ్యాన్ ప్రయాణమయి వెళ్తుంటే దారిలో మదీనా నుంచి వస్తున్న ఖుజాఅ తెగవాళ్ళు తారసపడ్డారు. వారతడ్ని చూసి, ఒప్పందం ఉల్లంఘన వల్ల ఏప్రమాదం వస్తుందో నని భయపడి ఇతను దైవప్రవక్త (స)కు సర్దిచెప్పడానికి మదీనా వెళ్తున్నాడని గ్రహించారు.

అబూసుఫ్యాన్ ఖుజాఅ తెగవాళ్ళు మదీనా నుంచే వస్తున్నారని అనుమానించాడు. అదే విషయం అడిగితే, మదీనా నుంచి గాకుండా మరెక్కడి నుండో వస్తున్నట్లు వారు సమాధానమిచ్చారు. కాని అబూసుఫ్యాన్ వారి మాటలు నమ్మలేదు. ఖుజాఅ తెగపై తాము జరిపిన దాడి ముస్లింలకు చాలా ఆగ్రహం తెప్పించి ఉంటుందని, ఇక తమకు వినాశం తప్పదని ఆందోళనపడుతూ మదీనా చేరుకున్నాడతను.

మదీనాలో అబూసుఫ్యాన్ నేరుగా దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళడానికి ముఖం చెల్లక తన కూతురు హజ్రత్ ఉమ్మెహబీబా (రజి) ఇంటికి వెళ్ళాడు. ఆమెను మధ్యవర్తిగా పెట్టి దైవప్రవక్త (సల్లం)తో చర్చలు జరుపుదామని భావించాడు.

హజ్రత్ ఉమ్మెహబీబా (రజి) దైవప్రవక్త (సల్లం) సతీమణి. తండ్రిని వదలివచ్చి అనేక ఏండ్లు గడిచాయి. అందువల్ల ఆమె తనను చూడగానే సంతోషంతో ఉబ్బిపోయి, అపార ప్రేమతో స్వాగతిస్తుందని తలిచాడు అబూసుఫ్యాన్. కాని ఇంటికి పోతే ఆమె సరిగా మాట్లాడను కూడా లేదు. అబూసుఫ్యాన్ లోపలికి వెళ్ళి పడక మీద కూర్చోబోతే, అతని కుమార్తె హజ్రత్ ఉమ్మెహబీబా (రజి) వెంటనే పడక చుట్టివేశారు. అబూసుఫ్యాన్ కూతురి వైఖరి చూసి నిర్ఘాంతపోయాడు.

"ఏమిటమ్మా నీ ధోరణి! నాకేమీ అర్థంకావడం లేదు. నాకంటే నీకీ పడకంటేనే ఎక్కువ ఇష్టమా?" అని అడిగాడతను.

"నాన్నా! నీవు సత్యతిరస్కారివి. ఇది దైవప్రవక్త (స) పడక. దీనిపై కూర్చోవడానికి నీకు ఏమాత్రం అర్హత లేదు" అన్నారు హజ్రత్ ఉమ్మెహబీబా (రజి).

అబూసుఫ్యాన్ ఈసారి నిజంగానే కొయ్యబారి పోయాడు.

"నువ్వు నా దగ్గర్నుంచి వెళ్ళిపోయిన తరువాత నీ తరహాయే మారిపోయింది" అని గొణుక్కుంటూ అతను అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

అబూసుఫ్యాన్ చివరికి ఎలాగో ధైర్యం చేసి దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళాడు. ఆయనకు ఖురైషీయుల సందేశం విన్పించి ఒప్పందాన్ని పునరుద్ధరించమని మనవి చేశాడు. దైవప్రవక్త (సల్లం) ఈ మాట విని మౌనంగా ఉండిపోయారు. అతను ఎన్ని మాటలు చెప్పినా ఒక్కదానికీ సమాధానం ఇవ్వలేదు.

అబూసుఫ్యాన్ చేసేదిలేక హజ్రత్ అబూబకర్ (రజి) దగ్గరికి వెళ్ళాడు. ఆయన్ని మధ్యవర్తిగా చెయ్యడానికి ప్రయత్నించాడు. కాని అబూబకర్ (రజి) అతని మాటలు వినడానికే ఇష్ట పడలేదు. తరువాత అబూసుఫ్యాన్ హజ్రత్ ఉమర్ (రజి) దగ్గరికి వెళ్ళాడు. అప్పటికే అబూసుఫ్యాన్ సంగతి తెలుసుకున్న హజ్రత్ ఉమర్ (రజి) అతడ్ని చూడగానే ధుమధుమ లాడిపోయారు.

"ఏమిటీ? నేను నీకు దైవప్రవక్త (సల్లం) దగ్గర సిఫారసు చేయాల్నా! నేనసలు నీ కాళ్ళు విరగ్గొట్టి పంపాలనుకుంటున్నాను" అన్నారు ఆయన మండిపడుతూ.

ఉమర్ (రజి) వాలకం చూస్తే అంతపని చేసేలా ఉన్నాడని భావించి అబూసుఫ్యాన్ నోరు మూసుకొని అక్కడ్నుంచి మెల్లగా జారుకున్నాడు.

ఈసారి అతను హజ్రత్ అలి (రజి) ఇంటికి పోయాడు. ఇంట్లో అలి (రజి), ఆయన భార్య ఫాతిమా (రజి), కొడుకు హసన్ (రజి) ఉన్నారు. అబూసుఫ్యాన్ అలి (రజి)కి తన గోడు చెప్పుకొని దైవప్రవక్త (సల్లం)కు సిఫారసు చెయ్యమని అర్థించాడు.



"అబూసుఫ్యాన్! దైవప్రవక్త (స) ఏదైనా నిర్ణయం తీసుకుంటే ఇక అందులో ఎవరూ జోక్యం చేసుకోవడానికి సాహసించలేరు" అన్నారు హజ్రత్ అలి (రజి).

అయినా అబూసుఫ్యాన్‌లో ఇంకా ఆశ చావలేదు.

"ఫాతిమా! నువ్వయినా కాస్త నా కోసం సిఫారసు చెయ్యి తల్లీ!" అని అభ్యర్థించాడు.

"అబూసుఫ్యాన్! ఇలాంటి వ్యవహారాల్లో స్త్రీలు జోక్యం చేసుకోలేరని మీకు తెలుసు కదా!" అన్నారు ఆమె.

"అయితే నీ పిల్లవాడి చేత 'నేను రెండు పక్షాల మధ్య రాజీ కుదిర్చాను' అని ఒక్క మాట చెప్పించు చాలు. ఈ ఒక్క మాట చెప్పిస్తే ఈరోజు నుండి నీ పిల్లవాడు యావత్తు అరబ్బులకు నాయకుడన్పించుకుంటాడు. ఏమంటావ్?" అన్నాడు అబూసుఫ్యాన్.

"అబూసుఫ్యాన్! రాజకీయ వ్యవహారాల్లో పిల్లలు ఏం చెయ్యగలరు? ఈ విషయం మీకూ తెలుసుకదా! అయినా మీ విషయంలో దైవప్రవక్త (స) మౌనం వహించినప్పుడు మరొకరు నోరు మెదపగలరా?" అన్నారు హజ్రత్ ఫాతిమా (రజి).

పాపం! అబూసుఫ్యాన్‌కు తల తిరిగిపోయింది. చుట్టూ అంధకారం అలుముకున్నట్లు అన్పించింది. ఆశాకిరణం కనుచూపు మేరలో కూడా కన్పించడం లేదు. ఏమీ పాలుపోక హజ్రత్ అలి (రజి) వైపు మరొక సారి ఆశగా చూశాడు.

"అబుల్ హసన్! నేను పెద్ద ఆపదలో చిక్కుకున్నాను. ఇందులో నుంచి బయటపడే మార్గం కన్పించడంలేదు. ఇలాంటి స్థితిలో నేనేం చెయ్యాలో కాస్త సలహా అయినా ఇవ్వు" అని దీనంగా అడిగాడతను.

"ఇప్పుడు నేనేం సలహా ఇవ్వగలను? మీరు మాటతప్పారు. పరిస్థితి చేజారిపోయింది. అయితే ఓ పని చెయ్యి. మసీదుకెళ్ళి 'నేను హుదైబియా ఒప్పందం పునరుద్ధరిస్తున్నాను' అని బిగ్గరగా చాటిచెప్పు. తరువాత మక్కా వెళ్ళిపో" అన్నారు అలి (రజి).

"ఇలా చేస్తే ప్రయోజనం ఉంటుందంటావా?" అని అడిగాడు అబూసుఫ్యాన్ ఆశా నిరాశాల మధ్య ఊగిసలాడుతూ.

"ఉంటుందని నేను గట్టిగా చెప్పలేను. కాని అంతకుమించి మరోమార్గం లేదు" అన్నారు హజ్రత్ అలి (రజి).

అబూసుఫ్యాన్ మసీదుకెళ్ళి అలి (రజి) ఇచ్చిన సలహా ప్రకారమే 'నేను హుదైబియా ఒప్పందాన్ని పునరుద్ధరిస్తున్నాన'ని బిగ్గరగా చాటిచెప్పి మక్కా వెళ్ళిపోయాడు.

అబూసుఫ్యాన్ రాక కోసం మక్కాలో ఖురైష్ నాయకులంతా ఎదురుచూడసాగారు. అతను వెళ్ళిన పని తప్పకుండా సాధించి తెస్తాడని అందరికీ గట్టి నమ్మకం ఉంది.

అబూసుఫ్యాన్ విజయోత్సాహంతో మదీనా నుంచి తిరిగి వచ్చాడు. దివిటీలా వెలిగిపోతున్న అతని ముఖం చూసి మిత్రులు సంతోషంతో స్వాగతం పలికారు. కుశల ప్రశ్నలయ్యాక అసలు విషయాన్ని గురించి అడిగారు. అబూసుఫ్యాన్ హజ్రత్ అలి (రజి)

సలహాపై తాను మసీదుకెళ్ళి అక్కడ హుదైబియా ఒప్పందాన్ని పునరుద్ధరిస్తున్నాని చేసిన ప్రకటన గురించి వివరించాడు.

ఖురైష్ నాయకులు ఈ మాట విని క్షణంపాటు ముఖాలు చిట్లించుకున్నారు. ఆ తరువాత అందరూ విరగబడి నవ్వసాగారు. అబూసుఫ్యాన్ బిత్తరపోయి వింతగా చూడ సాగాడు. అంతలో అందరి ముఖాలు గంభీరంగా మారిపోయాయి.

"ఇదా నువ్వు మదీనా పోయి వెలగబెట్టిన ఘనకార్యం! ఇది జరిగే పనేనా? ఈ మాటవింటే జనం నవ్విపోతారు. అలి నిన్ను ఆట పట్టించడానికే ఇలాంటి సలహా ఇచ్చాడు. ఆ మాత్రం కూడా నువ్వు గ్రహించలేక పోయావే!! ఎక్కడైనా ఈవిధంగా ఒడంబడిక పునరుద్ధరించడం జరిగిందా?" అన్నారు ఖురైషీయులు ముక్కు మీద వేలేసుకొని.

పాపం! అబూసుఫ్యాన్ సిగ్గుతో తల వంచుకున్నాడు.

## మదీనా దాటిన యుద్ధ రహస్యం-(133)

మక్కా బహుదైవారాధకులు మళ్ళీ సమావేశమయ్యారు. హుదైబియా సంధిని భంగం చేసి ముస్లింల మిత్రపక్షమైన ఖుజాఅ తెగకు చెందిన అనేకమందిని వధించినందుకు చాలా పశ్చాత్తాపపడ్డారు. ఒప్పందాన్ని ఉల్లంఘించడమంటే ముస్లింలతో యుద్ధాన్ని కొనితెచ్చుకోవడమే. ఒకవేళ ముస్లింలు తమపై దండెత్తితే ఖుజాఅ తెగవాళ్ళు వారికి తప్పకుండా సహాయపడతారు. ఈ ఆలోచన రాగానే ఖురైషీయులు భయపడిపోయారు. అంచేత వారీ వ్యవహారంపై సుదీర్ఘ చర్చలు జరిపి ఒక నిర్ణయానికి వచ్చారు.

"తక్షణమే మనం ఖుజాఅ తెగవాళ్ళతో సంధి చేసుకోవాలి. అంతేకాదు, ఆ తెగలో ఎంతమంది వధించబడ్డారో వారందరి రక్తపరిహారం కూడా వారసులకు చెల్లించాలి"

ఖురైషీయులు ఈ నిర్ణయాన్ని అమలుపరచడానికి మళ్ళీ అబూసుఫ్యాన్‌నే ఎన్ను కున్నారు. అతను సరాసరి బుదైల్ దగ్గరికి వెళ్ళాడు. బుదైల్ ఖుజాఅ తెగలో బాగా పలుకుబడి ఉన్న నాయకుడు, గొప్ప ధనికుడు కూడా. మక్కాలోనే నివశిస్తున్నాడు. అంచేత అబూసుఫ్యాన్ అతనితో మాట్లాడి రాజీ కుదుర్చుకున్నాడు. వధించబడినవారి రక్తపరిహారం కూడా చెల్లించాడు. సంధి పటిష్ఠం కావడానికి వీరిద్దరు కలసి ఖుజాఅ తెగలోని ఇతర నాయకుల దగ్గరికి పోయారు.

ఈలోగా ఒప్పందం ఉల్లంఘించి రక్తపాతం జరిపిన వారిపై తీసుకోవలసిన చర్యలను గురించి విశ్వప్రభువు నుండి ఓ ప్రకటన వెలువడింది. కాబా పవిత్రతను భంగపరచిన బహుదైవారాధకులు ఇక కాబామందిరానికి ధర్మకర్తలుగా కొనసాగడానికి ఎంతమాత్రం అర్హులుకారని కూడా ఆ ప్రకటనలో స్పష్టం చేయబడింది.

"విశ్వాసులారా! బహుదైవారాధకులు అపవిత్రులు గనక ఈ ఏడు వారిని ప్రతిష్ఠాలయం దరిదాపులకు రానివ్వకండి. ఒకవేళ (మీ వ్యాపారం మందగించి) మీరు లేమికి గురవుతారని భయపడితే (అలా భయపడనవసరం లేదు.) దేవుడు తలిస్తే తన ప్రత్యేక అనుగ్రహంతో మిమ్మల్ని ధనికులుగా చేస్తాడు. దేవుడు సర్వజ్ఞాని, మహా వివేకవంతుడు." (ఖుర్ఆన్-9:28)



"ఏ జాతయినా మీరు చేసుకున్న ఒప్పందం ఎప్పుడైనా ఉల్లంఘిస్తుందని మీరు భయపడితే ఆ ఒప్పందాన్ని దాని ముందు విసరేయండి. నమ్మకద్రోహం చేసినవారిని దేవుడు ఎన్నటికీ ప్రేమించడు. సత్యతిరస్కారులు (ఏదో చమత్కారంచేసి) తాము తప్పించుకున్నామని భావించరాదు. వారు మాపట్టు నుండి ఎన్నటికీ తప్పించుకోలేరు." (ఖుర్ఆన్-8:58,59)

దైవప్రవక్త (సల్లం) ఇంటికి వచ్చి "ఆయిషా! వెంటనే ప్రయాణ ఏర్పాట్లు చెయ్యి" అన్నారు. హజ్రత్ ఆయిషా (రజి) ప్రయాణ ఏర్పాట్లు చెయ్యడంలో నిమగ్నులయ్యారు. కాస్సేపటికి హజ్రత్ అబూబకర్ (రజి) వచ్చారు. కూతురు చేస్తున్న ప్రయాణఏర్పాట్లకు కారణం ఏమిటో ఆయనకు అర్థంకాలేదు.

"ఏమిటమ్మా ఈ హడావిడి? ఈ ప్రయాణ ఏర్పాట్లు ఎందుకు? దైవప్రవక్త (సల్లం) ఏదైనా కార్యక్రమం చేపట్టారా?" అడిగారు ఆయన.

"నాకేమీ తెలియదు నాన్నా!" అన్నారు హజ్రత్ ఆయిషా (రజి).

అంతలో దైవప్రవక్త (సల్లం) ఇంటికి వచ్చారు.

"దైవప్రవక్తా! నన్నూ ప్రయాణానికి సిద్ధం కమ్మంటారా?" అని అడిగారు హజ్రత్ అబూబకర్ (రజి) ఆశగా.

"ఆ... మీరు కూడా సిద్ధంకండి."

"ఇంతకూ మన ప్రయాణం ఎక్కడికి?"

"ఖురైషీయుల దగ్గరికి పోవాలి. ఈ విషయాన్ని రహస్యంగా ఉంచాలి. జాగ్రత్త! ఎవరి ముందూ ఈ విషయాన్ని ప్రస్తావించకూడదు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

తరువాత ఆయన ముస్లింలందరూ యుద్ధానికి సిద్ధం కావలసిందిగా ప్రకటన చేశారు. 'దైవాన్ని, పరలోకాన్ని విశ్వసిస్తున్నవారంతా రమజాన్‌కు ముందే మదీనా చేరుకోవాల'ని చుట్టు పక్కలున్న ముస్లిం తెగలక్కూడా సందేశం పంపించారు.

అయితే హాతిబ్ బిన్ అబీబల్తా (రజి) మక్కా ఖురైషీయులకు ఒక మేలు చేసి వారి దౌర్జన్యం నుండి మక్కాలోని తన బంధువుల్ని కాపాడుకోవచ్చని ఈ రహస్య సమాచారాన్ని ఒకలేఖలో రాసి మక్కా వెళ్తున్న ఓ స్త్రీకి ఇచ్చారు. ఆమె ఆలేఖ తీసుకొని బయలుదేరగానే దేవుడు ఈ విషయాన్ని దివ్యావిష్కృతి ద్వారా దైవప్రవక్త (స)కు తెలియజేశాడు.

దైవప్రవక్త (స) వెంటనే, ఆమెను వెంబడించి ఉత్తరం తీసుకురావడానికి కొందరు అనుచరుల్ని మక్కాదిశగా పంపారు. వారు వెళ్ళి ఆమెను కలుసుకొని ఉత్తరం సంగతి అడిగారు. ఆమె తనదగ్గర ఎలాంటి ఉత్తరం లేదని బుకాయించడానికి ప్రయత్నించింది.

అప్పుడు అనుచరులు ఆమెను మందలిస్తూ "మర్యాదగా ఉత్తరం మాకప్పగించు, లేకుంటే బలవంతం చేసయినా సరే మేమూ ఉత్తరం బయటికి తీస్తాం" అన్నారు.

దాంతో ఆమె భయపడి, తన కొప్పులో దాచిన ఉత్తరం తీసి వారికి అప్పగించింది. వారా ఉత్తరం తీసుకొని మదీనా వెళ్ళి దైవప్రవక్త (సల్లం)కు అందజేశారు.

ఈ ఉత్తరం అందిన తరువాత దైవప్రవక్త (సల్లం) హజ్రత్ హాతిబ్ (రజి)ని పిలిపించి "ఏమిటి ఈ నిర్వాకం?" అని అడిగారు.

"దైవప్రవక్తా! నా విషయంలో తొందరపడకండి. నేను మతభ్రష్టుణ్ణయి ఇలా చేయలేదు. ఇస్లాం పట్ల నాకిప్పటికీ దృఢవిశ్వాసం ఉంది. మక్కాలో నా బంధువులు ఉన్నారు. నేను ఖురైష్‌తెగవాణ్ని కాను. ఖురైషీయుల సంరక్షణలో అక్కడ ఉంటున్నవాణ్ని. ఖురైషీయుల బారి నుండి నా బంధువుల్ని కాపాడేవారెవరూ లేరక్కడ. అంచేత నేను ఖురైషీయులకు ఏదైనా సహాయం చేస్తే వారు నా బంధువుల జోలికి రారనే ఉద్దేశ్యంతో మాత్రమే నేనీ లేఖ రాసి పంపాను" అన్నారు హజ్రత్ హాతిబ్ (రజి).

ఈ మాట విని దైవప్రవక్త (స) ఆయన విశ్వాసం, నిజాయితీలను శంకించకుండా వదలిపెట్టారు. అయితే హజ్రత్ ఉమర్ (రజి) ఆవేశంతో లేచి "అనుమతించండి, ఒక్క వ్రేటుతో ఈ గోముఖవ్యాఘ్రం తల నరికిపారేస్తా" అని అన్నారు.

దైవప్రవక్త (స) ఉమర్ (రజి)ని వారిస్తూ "ఇతను బదర్ యుద్ధంలో పాల్గొన్నాడు. నీకేం తెలుసు, దేవుడు బదర్ యుద్ధంలో పాల్గొన్న విశ్వాసుల్ని (పరలోకంలో) కలసి, 'మీరేమి చేసివున్నా సరే, నేను మీ తప్పులు క్షమించాను' అని చెప్పవచ్చు" అని అన్నారు.

ఉమర్ (రజి) ఈమాట విని "నిజం దేవునికి, ఆయన ప్రవక్తకే తెలుసు" అన్నారు.

ఈ సందర్భంగా ఖుర్‌ఆన్‌లో అవతరించిన ఈ సూక్తులు గమనార్హం:

"విశ్వాసులారా! మీరు గనక నామార్గంలో పోరాడేందుకు, నాప్రసన్నత కోసం (స్వస్థలం వదలి) బయలుదేరితే నాకూ, మీకూ (ఉమ్మడి) శత్రువులైన వారితో స్నేహం చేయకండి. మీ దగ్గరకొచ్చిన సత్యాన్ని తిరస్కరించినవారికి మీరెలా స్నేహహస్తం అందిస్తారు? మీరు కేవలం మీ ప్రభువయిన దేవుణ్ని విశ్వసించారన్న కారణంగా వారు మిమ్మల్ని, దైవప్రవక్తను దేశం నుండి వెళ్ళగొట్టారే! అలాంటివారికి మీరు రహస్యంగా స్నేహసందేశం పంపుతారా? మీరు రహస్యంగా గాని, బహిరంగంగా గాని చేసే ప్రతిపనీ నాకు తెలుసు. మీలో ఎవరైనా సరే ఇలాంటి చేష్టలకు పాల్పడితే అతను నిస్సందేహంగా సన్మార్గం తప్పినట్లే.

వారు మీ మీద ఆధిక్యత వహిస్తే, వారు మీ పట్ల శత్రువైఖరి అవలంబించి మిమ్మల్ని తప్పకుండా మాటలతో, చేతలతో (రకరకాలుగా) వేధిస్తారు. మీరు ఏవిధంగానైనా మళ్ళీ అవిశ్వాసులయి పోవాలని వారు కోరుకుంటున్నారు. మీ సంతానం, బంధుత్వాలు ప్రళయ దినాన ఏమాత్రం పనికిరావు. ఆరోజు దేవుడు మీమధ్య (ఈనాడున్న) బాంధవ్యాలన్నీ త్రెంచి వేస్తాడు. ఆయన మీరు చేస్తున్న పనులన్నీ గమనిస్తూనే ఉన్నాడు." (ఖుర్‌ఆన్-60:1-3)

# మక్కా దండయాత్ర-(134)

దైవప్రవక్త (సల్లం) చేసిన ప్రకటన వినగానే ముజాహిద్‌లు ఎంతో ఉత్సాహంతో ప్రయాణ సన్నాహాలు ప్రారంభించారు. మదీనా వెలుపల నివసించే అనేక తెగలు కూడా సమరోత్సాహంతో ఉరకలు వేశాయి. ఒంటెలు, గుర్రాలు, ఆయుధాలు, ఇతర సామగ్రి అన్నీ సిద్ధం చేసుకొని మదీనా వచ్చేశారు ముజాహిద్‌లందరూ.



అది హిజ్రీశకం 8వ సంవత్సరం, రమజాన్ నెల పదకొండవ తేదీ. దైవప్రవక్త (స) పదివేల మంది అనుచరులతో మదీనా నుండి బయలుదేరారు. దారిలో మనం మక్కా వెళ్తున్నామని తెలియజేశారు.

పదివేల మంది అనుచరులే! ముస్లిం సేనలో ఇంతమంది యోధులు ఇదివరకెన్నడూ లేరు. ఇంతమంది యోధులతో, అపార ఆయుధాలతో ఖురైషీయుల మెడల్ని సులభంగా వంచవచ్చు. కాని దైవప్రవక్త (సల్లం) సైనికుల సంఖ్యపైగాని, ఆయుధశక్తిపైగాని ఎన్నడూ ఆధారపడలేదు. ఆయనకు, ఆయన అనుచరులకు ఆధారమల్లా అల్లాహ్ మాత్రమే. దైవవిశ్వాసమే వారి బలం. అదే వారి విజయరహస్యం.

అందుకే మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఇలా ప్రార్థించారు:

"దేవా! ఖురైషీయులను అజాగ్రత్తగా ఉంచు. వారి గూఢచారులను ఏమరుపాటుకు గురిచెయ్యి. వారి సకల సాధనసంపత్తిని నిరుపయోగం చెయ్యి."

ఇస్లామీయ సైనికవాహిని ఉప్పొంగుతూ, ఉరకలు వేస్తూ మక్కా వైపు పురోగమించింది. దైవప్రవక్త (సల్లం) ఈ పథకాన్ని అంత రహస్యంగా ఉంచారంటే కారణం మక్కాపై హఠాత్తుగా మెరుపు దాడిచేసి విజయం సాధించాలన్న కోరిక కాదు. మక్కాను తన అనుచరులు ఎలాగూ జయిస్తారన్న నమ్మకం ఉంది. కాని ఎలాంటి రక్తపాతం జరగకుండా ఉండాలన్నదే ఆయన ఆకాంక్ష.

ఖురైషీయులు యుద్ధసన్నాహాలు ప్రారంభించక ముందే ముస్లింలు అకస్మాత్తుగా మక్కా సమీపిస్తే మక్కా అవిశ్వాసులు లొంగిపోతారు లేదా ప్రాణభయంతో పారిపోతారు. ఈవిధంగా రక్తపాతం జరగకుండా ఉంటుంది. అదే ఆయన కోరిక.

యుద్ధరహస్యాలు తెలుసుకొని వాటిని మక్కా చేరవేయడానికి శత్రువులెవరైనా ఉండవచ్చు. ఆ విషయం పరిశీలించి సమాచారం తీసుకురావడానికి దైవప్రవక్త (సల్లం) కొందరు గూఢచారులను పంపించారు.

ఈ గూఢచారులు గుర్రాలపై సైన్యానికి ముందుగానే చాలా వేగంగా వెళ్ళారు. వారు దారి పొడుగుతూ శత్రువుల జాడలను గమనిస్తూ పోతుంటే ఓచోట ఒక వ్యక్తి తారట్లాడుతూ కన్పించాడు. వెంటనే కొందరు గూఢచారులు అతణ్ని బంధించి దైవప్రవక్త (సల్లం) దగ్గరకు తెచ్చారు.

దైవప్రవక్త (సల్లం) కారణం అడిగినప్పుడు ఆ వ్యక్తి హవాజన్ తెగ గూఢచారి అని, ముస్లిం యోధుల్ని గురించి సమాచారం సేకరిస్తున్నాడని తెలిసింది. గట్టిగా అడిగితే అతనిలా అన్నాడు:

"హవాజన్ తెగవాళ్ళు యుద్ధసన్నాహాలు చేస్తున్నారు. వారు సఖీఫ్ తెగవారి సహాయం కూడా అడిగారు. అయితే డెమాస్కస్ నుండి కొన్ని ఆయుధాలు రావలసి ఉన్నందున మరికొన్నాళ్ళు వ్యవధి కావాలని సఖీఫ్ తెగవాళ్ళు అన్నారు. సఖీఫ్‌తెగ సహాయం కోసమే హవాజన్ తెగ ఎదురుచూస్తోంది."

దైవప్రవక్త (సల్లం) శత్రుగూఢచారి చెప్పిన మాటలు విని అతడ్ని నిర్బంధించి జాగ్రత్తగా కనిపెడుతూ ఉండమని ముజాహిద్‌లకు ఉత్తర్వులిచ్చారు.

సైన్యం ముందుకు సాగింది. దారిలో ప్రవక్త పినతండ్రి హజ్రత్ అబ్బాస్ (రజి) కలుసుకున్నారు. ఆయన ఇస్లాం స్వీకరించి కుటుంబసమేతంగా మక్కా నుండి వస్తున్నారు. దైవప్రవక్త (సల్లం) అమితానందంతో పినతండ్రిని ఆలింగనం చేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యుల్ని ఎంతో ఆదరించి గౌరవప్రదంగా మదీనా పంపివేశారు. హజ్రత్ అబ్బాస్ (రజి) సైన్యంలో చేరి ఉండిపోయారు.

సైన్యం మరికాస్త ముందుకుసాగిన తరువాత అబూసుఫ్యాన్ బిన్ హారిస్, అబ్దుల్లా బిన్ ఉమయ్యా ఎదురయ్యారు. ఇబ్నె హారిస్ దైవప్రవక్త (సల్లం) పినతండ్రి కుమారుడు. అబ్దుల్లా స్వయాన మేనత్త కొడుకు. వీరిద్దరు ఇస్లాం స్వీకరించాలన్న ఉద్దేశ్యంతో తమ భార్యాపిల్లలతో సహా మక్కా నుండి వస్తున్నారు.

కాని మక్కాలో వీరిద్దరు ఇస్లాంకు బద్ధశత్రువులుగా పనిచేసి ఉన్నందున దైవప్రవక్త (సల్లం) వారిని కలుసుకోవడానికి ఇష్టపడలేదు.

హజ్రత్ అబ్బాస్ (రజి), హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) వారిద్దరి తప్పులు క్షమించమని దైవప్రవక్త (సల్లం)కు నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. కాని దైవప్రవక్త (సల్లం) వారి సిఫారసు త్రోసిపుచ్చుతూ ఇలా అన్నారు:

"నాకు వారి అవసరం ఎంతమాత్రం లేదు. ఇబ్నెహారిస్ మమ్మల్ని చాలా బాధ పెట్టాడు. దైవమార్గంలో ఎన్నో అవరోధాలు సృష్టించాడు. ఇబ్నెఉమయ్యా మమ్మల్ని ముప్పతిప్పలు పెట్టడంలో ఇతరులకు ఏమాత్రం తీసిపోలేదు."

ఇబ్నె హారిస్ పాపం దైవప్రవక్త (సల్లం) అన్న మాటలు విని తీవ్రమైన మనస్తాపానికి లోనయ్యాడు.

"అయ్యో దైవమా! నీదారి లేకపోతే ఇక నాకు ఏదారి? నాకిప్పుడు కన్పిస్తున్న దారల్లా ఒక్కటే. నేను నా కొడుకును తీసుకొని ఏ ఎడారి ప్రదేశానో పడిపోతాను. అక్కడే ఆకలి దప్పులతో అలమటిస్తూ ప్రాణం వదులుతాను. నా కొడుకు కూడా అలాగే చస్తాడు" అంటూ విలపించాడు.

ఇబ్నెహారిస్ విలాపం విని కారుణ్యమూర్తి హృదయం కరిగిపోయింది. వెంటనే వారిని అనుమతించారు. అప్పుడు వారిద్దరు దైవప్రవక్త (సల్లం) ముందు ఇస్లాం స్వీకరించి సంతోషంతో పరవశించిపోయారు.

ముస్లిం యోధులు 'ముర్రజ్జిహ్రాన్'లో విడిది చేశారు. ముర్రజ్జిహ్రాన్ మక్కా నగరానికి ఎనిమిది మైళ్ళ దూరంలో ఉన్న ఓ సువిశాలమైన మైదానం. మాజాహిద్‌లు అక్కడే శిబిరాలు వేసుకున్నారు. ఒంటెలను, గుర్రాలను మైదానంలో అక్కడక్కడ కట్టివేశారు. భోజనాలు చేసి విశ్రాంతి తీసుకున్నారు. హజ్రత్ అబ్బాస్ (రజి) ముజాహిద్‌ల ఉత్సాహం, వారి సంఖ్యాబలం చూసి తీవ్రమైన ఆలోచనలో పడ్డారు.



"దైవప్రవక్త (సల్లం) ముజాహిద్‌లతో మక్కాలో ప్రవేశిస్తే ఖురైషీయులు కోపోద్రేకాలతో ఊగిపోతారు. వారి పౌరుషం పడగలు విప్పుతుంది. పర్యవసానంగా ఖురైష్ ప్రజలు సర్వనాశన మవుతారు. దుర్భర అవమానభారంతో క్రుంగిపోతారు. అలాకాకుండా సంధి కోసం వారిని పిలవాలి. దైవవిధేయతలోనే వారి శ్రేయస్సు, గౌరవప్రతిష్ఠలు ఉన్నాయని నచ్చజెప్పాలి."

సూర్యాస్తమయమయింది. చూస్తుండగానే నలువైపుల నుండి చీకటి తెరలు వచ్చి ధరిత్రిని కప్పివేస్తున్నాయి. ప్రతి తెగ వేర్వేరుగా అగ్నిమంటలు రాజేయవలసిందిగా దైవప్రవక్త (సల్లం) ఆదేశించారు. అనుచరులు అలాగే చేశారు. కొన్ని క్షణాల్లోనే ఆ ప్రదేశం నుండి చీకట్లను పారదోలుతూ అనేక అగ్నిమంటలు వెలిశాయి. మైదానమంతా ఒక్కసారిగా కాంతిమంతమైపోయింది.

## అబూసుఫ్యాన్ లొంగుబాటు-(135)

దైవప్రవక్త (సల్లం)కు దుల్దుల్ అనే పేరు గల ఓ కంచరగాడిద ఉంది. హజ్రత్ అబ్బాస్ (రజి) దాని మీద ఎక్కి గస్తీ చెయ్యడానికి బయలుదేరారు. ఆయన ఓ ఎత్తయిన గుట్టపై నిలబడి, ఏ గొర్రెల కాపరో, కట్టెలమ్ముకునేవాడో కన్పిస్తాడేమోనని ఓ మారు చుట్టూ కలియజూశారు. వారి ద్వారా ఖురైషీయులకు పరిస్థితి వివరించి ముస్లిం సైనికులకు లొంగిపొమ్మని చెపుదామని భావించారు ఆయన.

కాస్సేపటికి ఆయన నిలబడిన గుట్టకు దగ్గర్లో రెండు మానవాకారాలు చూచాయిగా కన్పించాయి. ఆ ఇద్దరు వ్యక్తులు పరస్పరం మాట్లాడుకుంటున్నారు. హజ్రత్ అబ్బాస్ (రజి) చప్పుడు చెయ్యకుండా వారి సంభాషణను జాగ్రత్తగా వినసాగారు.

"చూశావా ఆ దృశ్యం? ఇలాంటి అగ్నిమంటల్ని, సైనికుల్ని నేను ఇదివరకెప్పుడూ చూడలేదు" అన్నాడు వారిలో ఒకడు.

"ఇవి ఖుజాఅ తెగ రాజేసిన అగ్నిమంటలు కావచ్చు. వారు మనపై ప్రతీకారంతో యుద్ధానికి సిద్ధమయ్యారు" అన్నాడు రెండోవాడు.

"కాదు, కాదు. ఇది ఖుజాఅ తెగ రాజేసిన మంటలు కాజాలవు. ఒకేసారి ఇన్ని అగ్నిమంటలు! పైగా నురుగులు కక్కుతున్న ఇంత పెద్ద సైనికవాహిని!! కాదు. ఇవి ఖుజాఅ సేనలంటే నేను నమ్మలేను" అన్నాడు మొదటివాడు.

"అబూసుఫ్యాన్!" కేక వేశారు హజ్రత్ అబ్బాస్ (రజి) ఇక ఉండబట్టలేక.

"ఎవరూ? అబ్బాస్! నువ్వా!!" అడిగాడు అబూసుఫ్యాన్ బిత్తరపోతూ.

"ఔను, నేనే అబ్బాస్‌ని. ఇవి ముహమ్మద్ (సల్లం) బిన్ అబ్దుల్లా (రజి) అగ్నిమంటలు" అన్నారు హజ్రత్ అబ్బాస్ (రజి).

"అబ్బాస్! నువ్వు ఇక్కడ.....? చాలా ఆశ్చర్యంగా ఉందే!" అన్నాడు అబూసుఫ్యాన్ హజ్రత్ అబ్బాస్ (రజి) దగ్గరికి వస్తూ.

'ఓరి పిచ్చివాడా! ఇంకా నీకు మత్తు వదలలేదా? ఇది దైవసందేశహరుని సైన్యం. ఈ సైన్యం గనక మక్కాలో ప్రవేశిస్తే ఖురైషీయులు రెచ్చిపోకమానరు. అప్పుడు వారికి సర్వ నాశనం తప్పదు. చివరికి వారి విషాదగాథ వినేవారు కూడా ఎవరూ మిగిలిఉండరు.''

"అబ్బాస్! నువ్వు చెబుతున్నది నిజమే. అయితే ఇప్పుడు నన్నేం చెయ్యమంటావో నువ్వే చెప్పు.''

"నా వెంట నడు. దైవప్రవక్త (స) దగ్గరికి తీసికెళతాను. అక్కడ అన్ని విషయాలు మాట్లాడుకుందాం'' అన్నారు హజ్రత్ అబ్బాస్ (రజి).

అబూసుఫ్యాన్ హజ్రత్ అబ్బాస్ వెనక తెల్లగాడిదపై ఎక్కి కూర్చున్నాడు. అతనితో పాటు వచ్చిన రెండోవాడు మక్కా తిరిగి వెళ్ళిపోయాడు.

హజ్రత్ అబ్బాస్ (రజి) అబూసుఫ్యాన్ని తీసుకొని తెగలవారిగా ఏర్పడిన సైనిక దళాల ప్రక్క నుంచి పోతుంటే ముజాహిద్లు అబూసుఫ్యాన్ని చూసి ఆశ్చర్యపోయారు. కాని వారిద్దరు ఎక్కిన వాహనాన్ని చూసి ఎవరూ నోరు మెదపలేక పోయారు. ఎందుకంటే అది దైవప్రవక్త (సల్లం) వాహనం.

అలా సైనిక దళాలను దాటుకుంటూ పోతుంటే వారి వాహనంపై హజ్రత్ ఉమర్ (రజి) దృష్టి పడింది. అంతే, ఆయన తోకతొక్కిన త్రాచుపాములా కస్సున లేచారు.

"ఓరీ దైవవిరోధీ! అబూసుఫ్యాన్!! దైవసైన్యానికి చిక్కిపోయావులే. ఉండు నీ భరతం పడతా'' అంటూ పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ ప్రవక్త (స) శిబిరం వైపు నడిచారు.

హజ్రత్ అబ్బాస్ (రజి) ఆయన ఉద్దేశ్యం కనిపెట్టి అంతకంటే వేగంగా వెళ్ళి దైవప్రవక్త (సల్లం) సన్నిధికి చేరుకున్నారు. హజ్రత్ అబ్బాస్ (రజి) చేరుకున్న మరుక్షణంలోనే హజ్రత్ ఉమర్ (రజి) దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి-

"దైవప్రవక్తా! నాకు అనుమతి ఇవ్వండి. ఒక్కవ్రేటుతో ఈ దుర్మార్గుడి శిరస్సు ఖండించి వేస్తాను'' అన్నారు ఆవేశంతో.

"దైవప్రవక్తా! నేనితనికి అభయమిచ్చాను'' అన్నారు హజ్రత్ అబ్బాస్ (రజి).

తిరిగి ఆయన ఉమర్ (రజి) వైపు చూస్తూ "ఈరోజు దైవప్రవక్త (సల్లం)తో మరొకరు సంభాషించడానికి వీల్లేదు'' అన్నారు.

ఈ మాట వినగానే హజ్రత్ ఉమర్ (రజి) కోపం ద్విగుణీకృతమయింది. హజ్రత్ అబ్బాస్ (రజి) కూడా ఆవేశంతో ఊగిపోయారు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. అయితే పరిస్థితి విషమించకముందే దైవప్రవక్త (సల్లం) కలగజేసుకున్నారు.

"అబ్బాస్! వెళ్ళండి. అబూసుఫ్యాన్ని తీసుకొని మీ శిబిరానికి వెళ్ళిపోండి. మళ్ళీ రేపు రండి'' అన్నారు ఆయన.

మరునాడు ఉదయం హజ్రత్ అబ్బాస్ (రజి) అబూసుఫ్యాన్ని వెంటబెట్టుకొని దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చారు.



"అబూసుఫ్యాన్! అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్యదైవం లేడని నీకింకా నమ్మకం కలగ లేదా?'' అన్నారు దైవప్రవక్త (సల్లం).

"దైవప్రవక్తా! మీరెంత ఉదారస్వభావులు, ఎంత విశాల హృదయం కలవారు!! నాకిప్పుడు నమ్మకం కలిగింది. అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్యదైవం ఉంటే ఆయన నాకు సహాయపడేవాడు'' అన్నాడు అబూసుఫ్యాన్.

"మరి నా దైవదౌత్యం పట్ల నీకింకా విశ్వాసం కలగలేదా?''

"మీరెంత దయార్ద్రహృదయులు! అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ దైవప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను'' అన్నారు అబూసుఫ్యాన్ (రజి).

"దైవప్రవక్తా! అబూసుఫ్యాన్ నాయకత్వపు హోదా అంటే పడిచస్తాడు. తానూ ఒక నాయకుడనిపించుకునేలా అతనికి ఏదైనా ఇవ్వండి'' అన్నారు అబ్బాస్ (రజి).

"సరే, కాబాగృహంలో ప్రవేశించేవారికి, తమ సొంతఇళ్ళలోనే దాక్కొని తలుపులు మూసుకునేవారికి అభయమిస్తున్నాను. అలాగే అబూసుఫ్యాన్ ఇంట్లో శరణుజొచ్చేవారికి కూడా అభయమిస్తున్నాను'' అన్నారు దైవప్రవక్త (సల్లం).

తరువాత అబ్బాస్ (రజి), అబూసుఫ్యాన్ (రజి)లు అక్కడ్నుంచి వెళ్ళిపోయారు. వెళ్ళిపోయే ముందు దైవప్రవక్త (సల్లం) అబ్బాస్ (రజి)ని పిలిచి "ఇదిగో ఈలోయ ఇరుకు ప్రదేశం దగ్గర అబూసుఫ్యాన్ని ఆపిఉంచండి. అలాచేస్తే ఇస్లాంఔన్నత్య ప్రభావం అతని మనస్సుపై గట్టిగా పడుతుంది'' అని చెప్పారు.

హజ్రత్ అబ్బాస్ (రజి) అబూసుఫ్యాన్ (రజి)ని తీసుకొని దైవప్రవక్త (స) ఆదేశించిన ప్రదేశానికి పోయి నిలిచారు. ముస్లింసైనికులు మక్కా నగరానికి బయలుదేరారు. ఒక్కొక్క తెగ ఒక్కొక్క సైనికదళంగా ఏర్పడి వారిద్దరి ముందునుంచి పోతోంది. అలా తమల్ని దాటిపోతున్న సైనికదళాల్ని చూసి అబూసుఫ్యాన్ ఈ సైనికులు ఏ తెగకు చెందిన వారని అడిగితే వారు ఫలానా తెగవారని అబ్బాస్ (రజి) సమాధానమిస్తున్నారు.

అన్నిటికీ చివర్లో దైవప్రవక్త (సల్లం) నేతృత్వంలోని సైనికదళం వచ్చింది. ఈ సైనికులు ఆపాదమస్తకం ఉక్కు కవచాలు ధరించి ఉన్నారు.

"ఈ సైనికులు ఎవరు?'' అడిగారు హజ్రత్ అబూసుఫ్యాన్ (రజి).

"వీరు ముహాజిర్లు, అన్సార్లు. ఇది దైవప్రవక్త (సల్లం) ఆధ్వర్యంలోని ప్రత్యేక సైనిక దళం'' చెప్పారు హజ్రత్ అబ్బాస్ (రజి).

"ప్రవక్త ప్రత్యేక సైనికదళమే! ఇలాంటి సైనికుల్ని ఎదిరించగల ధైర్యసాహసాలు ఎవరికుంటాయి?''

"మరేమనుకుంటున్నావ్! ఇదే దైవదౌత్యపు ఔన్నత్యమంటే.''

"నిజమే అబ్బాస్! నువ్వు చెబుతున్నది ముమ్మాటికీ నిజమే. అసలు విషయం ఇదే'' అన్నారు హజ్రత్ అబూసుఫ్యాన్ (రజి) ఇస్లాం ఔన్నత్యాన్ని అంగీకరిస్తూ.

# సత్యం రాకతో అసత్యం పలాయనం-(136)

మక్కా నగరం సమీపించింది. సైనికులు 'జీతువా' ప్రదేశానికి చేరి ఆగిపోయారు. అక్కడ దైవప్రవక్త (సల్లం) సైన్యాన్ని పునర్వ్యవస్థీకరించారు. మొత్తం సైన్యాన్ని నాలుగు ప్రధాన దళాలుగా విభజించారు.

ఒక దళానికి ఖాలిద్ బిన్ వలీద్ (రజి)ని సేనాపతిగా నియమించి మక్కాలో దిగువ భాగం ద్వారం గుండా ప్రవేశించమని ఆదేశించారు. మరొక దళానికి జుబైర్ బిన్ అవ్వామ్ (రజి)ని సేనాపతిగా చేసి ఉత్తరం వైపు ద్వారం గుండా ప్రవేశించమని ఆజ్ఞాపించారు. మూడవ దళానికి సాద్ బిన్ ఉబాదా (రజి)ని సేనాపతిగా నియమించి పశ్చిమ ద్వారం గుండా నగరంలో ప్రవేశించమని ఆదేశించారు. నాలుగవ దళానికి దైవప్రవక్తే (స) సైన్యాధిపతి అయ్యారు. ఈదళంలో ముహాజిర్‌లు ఉన్నారు. వీరంతా నగరం ఎగువభాగం ద్వారం గుండా ప్రవేశించవలసి ఉందని దైవప్రవక్త (స) ఆ దళం యోధులకు తెలియజేశారు.

ఆ తర్వాత దైవప్రవక్త (స) యోధులకు తగిన ఆదేశాలిచ్చారు. ముఖ్యంగా తమతో యుద్ధానికి దిగినవారితో మాత్రమే పోరాడాలని, అనివార్యపరిస్థితి వస్తే తప్ప ఒక్కరక్తపు బొట్టు కూడా చిందించకూడదని ఆదేశించారు. అయితే దైవప్రవక్త (స) ప్రత్యేకంగా కొందరి పేర్లు తెలిపి వారిని ఎక్కడ కన్పించినా హతమార్చాలని చెప్పారు.

సాధ్యమైనంతవరకూ ఎలాంటి రక్తపాతం జరగకుండా మక్కాను జయించాలని దైవప్రవక్త (స) భావించారు. దాని కోసం ఆయన సేనాపతుల భావోద్రేకాలను ఓ కంట కనిపెడుతూ జాగ్రత్తగా మసలుకోసాగారు.

ముజాహిద్‌లు నగరంలో ప్రవేశించడానికి సిద్ధమయ్యారు. దైవప్రవక్త (స) దృష్టి అబూసుఫ్యాన్ (రజి)పై పడింది. అబూసుఫ్యాన్ (రజి) తల దించుకొని ఉన్నారు. ఆయన ముఖం కళావిహీనమయి ఉంది.

"అబూసుఫ్యాన్! ఏమిటీ అలా ఉన్నావు? నీవు మన సలహాసంప్రదింపుల్లో పాల్గొన లేదేమిటీ?" అడిగారు దైవప్రవక్త (సల్లం).

"దైవప్రవక్తా! ఖురైషీయులు ఇప్పుడు మీ స్వాధీనంలోకి రాబోతున్నారు. కాని మన సైన్యంలో కొందరు ప్రతీకారంతో వేగిపోతున్నారు. విజయం లభిస్తే దయచేసి శత్రువులు మనల్ని చూసి నవ్వడానికి ఆస్కారం కలిగించవద్దని నేను మనవి చేసుకుంటున్నాను. వారిపట్ల మృదువుగా వ్యవహరించమని అభ్యర్థిస్తున్నాను" అన్నారు అబూసుఫ్యాన్ (రజి).

"లేదు అబూసుఫ్యాన్! నేనలా చేయను. నీవు నిశ్చింతగా ఉండు. మక్కాలో ముస్లింల బంధువులు కూడా ఉన్నారు. దైవప్రవక్తలు ఇబ్రాహీం, ఇస్మాయీల్ (అలై)లు తమ స్వహస్తాలతో నిర్మించిన పవిత్ర కాబా కూడా ఉంది. అబూసుఫ్యాన్! నువ్వేమీ బెంగపెట్టుకోకు. నీ జాతి ప్రజల దగ్గరకెళ్ళి ఇలా ప్రకటించు-

"ముహమ్మద్ ఒక మంచిసోదరుడిలా మక్కాలో ప్రవేశిస్తాడు. ఈరోజు విజేతలుగాని, పరాజితులుగాని ఎవరూ లేరు. ఈరోజు శాంతీసమైక్యతల రోజు. ప్రేమాసౌభ్రాతృత్వాల



రోజు. సొంతఇండ్లలో ఉండి తలుపులు మూసుకునేవారికి, కాబాలో ప్రవేశించేవారికి రక్షణ ఉంది. అలాగే అబూసుఫ్యాన్ ఇంట్లో ఆశ్రయం పొందేవారికి కూడా రక్షణ ఉంది."

దైవప్రవక్త (స) అమృతపలుకులు విని అబూసుఫ్యాన్ (రజి) సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఆయన నగరంలోకి పరుగెత్తి ఈ శుభవార్త ప్రకటించారు. క్షణాల్లో ఈ శాంతిసందేశం నగరపౌరులందరికీ తెలిసిపోయింది. భయంతో దడదడలాడుతున్న గుండెలు కాస్తా కుదుటపడ్డాయి.

దైవప్రవక్త (స), తన పదివేల మంది అనుచరులతో నగరంలో ప్రవేశించారు.

దాదాపు ఎనిమిదేండ్ల క్రితం ఏ ప్రాంతం నుండయితే ఆయన ఒకేఒక అనుచరుడితో నిస్సహాయ స్థితిలో నలువైపుల నుండి బద్ధవిరోధులు వెంటాడుతుండగా పోవలసివచ్చిందో ఆ ప్రాంతానికే ఇప్పుడు పదివేల మంది యోధులతో నిర్భయంగా వచ్చేస్తున్నారు.

ముస్లిం సైనికవాహిని ముందుకు సాగిపోతోంది. అన్సార్ దళం నాయకుడు సాద్ బిన్ ఉబాదా (రజి)లో సమరోత్సాహం ఉప్పొంగింది.

"ఈరోజు సమరజ్వాలలు చెలరేగే దినం. రక్తపాతం జరిగే దినం. ఈరోజు కాబాలో ప్రతి పనీ ధర్మసమ్మతం అవుతుంది. ఈరోజు దేవుడు ఖురైషీయులను అప్రతిష్ఠపాల్జేస్తాడు" అంటూ ఆయన నినాదాలు చేశారు.

అబూసుఫ్యాన్ (రజి) ఈ రక్తపాత నినాదాలు వినగానే దైవప్రవక్త (స) దగ్గరికెళ్ళి "దైవప్రవక్తా! సాద్ అన్న మాటలు విన్నారా?" అన్నారు ఆరోపణా ధోరణిలో.

"ఏమన్నాడేమిటి?" అడిగారు దైవప్రవక్త (సల్లం)

అబూసుఫ్యాన్ (రజి) తాను సాద్ (రజి) నోట విన్న మాటలన్నీ విన్పించారు. వెంటనే దైవప్రవక్త (స) సాద్ బిన్‌ఉబాదా (రజి)ని పిలిపించి ఆయన చేతిలోని పతాకాన్ని తీసుకొని ఆయన కుమారునికి అప్పగించారు. ఇప్పుడు అన్సార్ దళానికి సాద్ కుమారుడు ఖైస్ (రజి) నాయకుడయ్యాడు. ఈమార్పు అబూసుఫ్యాన్ (రజి)కు సంతృప్తి కలిగించింది.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఒంటె మీద కూర్చొని నగర ముఖద్వారం గుండా మక్కానగరంలో ప్రవేశిస్తున్నారు. గొప్ప సమరయోధుడిగా విజయగర్వంతో గుండెలు విరుచుకొని ప్రవేశించడం లేదు. ఒంటె మీద తన వెనుక మాజీ బానిసయిన హజ్రత్ జైద్ బిన్ హారిసా (రజి) కుమారుడు ఉసామా (రజి)ను కూర్చోబెట్టుకొని ఎంతో అణుకువ, వినయవిధేయతలు కలిగిన దైవదాసుడిగా శిరస్సును ఒంటె మూపురం దాకా వంచి మరీ, దైవవాణి (ఫతహ్ సూరా) పఠిస్తూ ప్రవేశిస్తున్నారు!

ఈ అపూర్వ దృశ్యం బహుదైవారాధకులను ఆశ్చర్యచకితుల్ని చేసింది. ఏమైనప్పటికీ అవిశ్వాసులు ముస్లింలకు లొంగిపోయారు. వారు తమతమ ఇండ్లలో దూరి తలుపులు మూసుకున్నారు. కిటికీల గుండా, తలపుసందుల గుండా తొంగిచూడసాగారు.

ఒకతను దైవప్రవక్త (సల్లం)తో ఏదో మాట్లాడటానికి వచ్చాడు. ఒక సాధారణ వ్యక్తి సువిశాల సామ్రాజ్యానికి అధిపతి అయిన చక్రవర్తితో నిర్భయంగా మాట్లాడగలడా? ఆ

మనిషి తడబడుతూ రెండుమూడు మాటలు మాట్లాడి భయంతో వణికిపోసాగాడు.

అప్పుడు దైవప్రవక్త (స) అతనికి ధైర్యం చెబుతూ "భయపడకు. నేను చక్రవర్తిని కాను. ఎండిన మాంసపు ముక్కలు తినే ఓ సామాన్య స్త్రీకి పుట్టినవాడ్ని" అన్నారు.

ముస్లింసేనలు శాంతియుతంగా మక్కాలో ప్రవేశించాయి. కత్తులు, ఈటెలకు పని తగల్లేదు. రక్తం ప్రవహించలేదు. ఒకచోట మాత్రం కాస్తంత అలజడి చెలరేగింది.

హజ్రత్ ఖాలిద్ (రజి) ప్రవేశించిన ముఖద్వారం దగ్గర ఇక్రమా బిన్ అబూజహల్, సఫ్వాన్ బిన్ ఉమయ్యాలతో సహా కొందరు బద్ధశత్రువులు ముజాహిద్‌లను అటకాయించి కయ్యానికి కాలుదువ్వారు. అందువల్ల వారితో పోరాడక తప్పలేదు. దాడి జరిగిన కాస్సేపటికే శత్రువులు ముస్లింల ముందు నిలువలేక పలాయనం చిత్తగించారు. ఈ దాడిలో పదిమంది ఖురైషీయులు, ఇద్దరు ముస్లింలు మరణించారు.

ఈ దుర్ఘటన దైవప్రవక్త (స)కు తెలిసింది. ఆయన ఖాలిద్ (రజి) పట్ల ఆగ్రహం వ్యక్తపరిచారు. అయితే హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (రజి) చివరిక్షణం వరకూ ప్రయత్నించారని, గత్యంతరంలేని పరిస్థితిలో మాత్రమే శత్రువులపై కత్తి దూశారని కొందరు ముజాహిద్‌లు తెలిపారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "సరే, దేవుడు చేసిందేదో మన మంచికే చేశాడు" అని అన్నారు.

మక్కా విజేత నగర ప్రవేశం చేశాడు. "అల్లాహు అక్బర్" నినాదంతో నగరం ప్రతిధ్వనించింది. దాంతో బహుదైవారాధకుల గుండెలు గుభిల్లుమన్నాయి.

ఇప్పుడు దైవప్రవక్త (సల్లం) ఎక్కడ విడిదిచేస్తే బాగుంటుంది?

"దైవప్రవక్తా! మీరు మీ సొంతింట్లో ఎందుకు విడిది చెయ్యకూడదు?" అన్నారు కొందరు అనుచరులు.

"మక్కాలో ఇక నాకు సొంతిల్లు ఎక్కడుందని?" అన్నారు ఆయన.

"ఇక్కడ మీరు కోరుకున్న ఇంట్లో నిరభ్యంతరంగా ఉండవచ్చు" అన్నారు మరికొందరు అనుచరులు.

"వద్దు. నేను ఎవరి ఇంట్లోనూ విడిదిచేయను" అన్నారు దైవప్రవక్త (సల్లం).

అప్పుడు ముస్లింలు తమ ప్రియతమ నాయకుడి కోసం ఎత్తయిన ప్రదేశంలో ఓ ప్రత్యేకమైన కుటీరం నిర్మించారు. అందులో ఆయన బసచేశారు.

నగరంలో పూర్తిగా శాంతియుత వాతావరణం నెలకొన్నది. కాబా ధర్మకర్త ఉస్మాన్ బిన్ తల్హా వచ్చి దైవప్రవక్త (స)కు వినయపూర్వకంగా నమస్కరించాడు.

"రాజాధిరాజా! మక్కా విజేతా!! స్వాగతం! సుస్వాగతం!! ఇదిగో ప్రతిష్ఠాలయం తాళపు చెవులు తీసుకోండి. తరతరాల నుంచి మా వంశంలో ఉంటూ వస్తున్న ఈ తాళపుచెవుల్ని ఈరోజు మీకు హస్తగతం చేస్తున్నాను" అంటూ అతను వణుకుతున్న చేతులతో కాబా మందిరం తాళపుచెవుల్ని దైవప్రవక్త (స) చేతికి అందించాడు.



దైవప్రవక్త (సల్లం) చిరునవ్వు నవ్వుతూ తాళపుచెవులు తీసుకున్నారు.

దైవప్రవక్త (సల్లం) మదీనా వలసపోవడానికి పూర్వం ఒక రోజు కాబాగృహానికి వెళ్ళి ఉస్మాన్ బిన్ తల్హాని తాళపుచెవులు ఇవ్వమని అడిగితే, అతను నిరాకరిస్తూ చాలా దురుసుగా సమాధానమిచ్చాడు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) అతనితో "ఉస్మాన్! గుర్తుంచుకో. నువ్వీ తాళపు చెవుల్ని ఏదో ఒక రోజు నా చేతికి అందిస్తావు. అప్పుడు నేను తలచిన వారికి వాటిని ఇచ్చేస్తాను" అన్నారు.

ఆ మాటకు ఉస్మాన్ తీవ్రంగా స్పందిస్తూ "అలా జరిగితే ఆరోజు ఖురైషీయులకు వినాశం, అవమానం కలిగే దుర్దినం అవుతుంది" అన్నాడు. "కాదు. ఆరోజు వారు శాంతి యుతంగా, గౌరవప్రదంగా ఉంటారు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

ఈ మాటలు ఉస్మాన్ బిన్ తల్హా (రజి) చెవుల్లో ఇప్పటికీ ప్రతిధ్వనిస్తున్నాయి. అతను ఆనాడే అనుకున్నాడు, ఆ మహనీయుడు అన్నట్లే జరుగుతుందని. ఇది ఈరోజు జరగడం కూడా అతను కళ్ళారా చూసుకున్నాడు.

దైవప్రవక్త (సల్లం) కాబాలయం ప్రధాన ద్వారం తెరిపించి లోపలికి ప్రవేశించారు. ఆయన వెంట ఆయన అనుచరులు కూడా ఉన్నారు. దైవప్రవక్త (సల్లం) లోపలికి ప్రవేశించగానే ఒంటె మీద కూర్చొనివుండే ఏడు సార్లు కాబా ప్రదక్షిణ చేశారు. కాబాలో 300 విగ్రహాలు ఉన్నాయి.

దైవప్రవక్త "సత్యం వచ్చింది. అసత్యం తుడిచి పెట్టుకుపోయింది. అసత్యం (ఎప్పటికైనా) తుడిచి పెట్టుకుపోయేదే" (17:81) అన్న ఖుర్‌ఆన్ సూక్తి పఠిస్తూ చేతిలోని బాణం కొనతో ఒక్కొక్క విగ్రహాన్ని పొడవడం ప్రారంభించారు. అలా పొడిచిన ప్రతి విగ్రహం ఒరిగి క్రింద పడిపోసాగింది.

లోపల గోడలపై హజ్రత్ ఇబ్రాహీం (అలై), హజ్రత్ ఇస్మాయీల్ (అలై)ల చిత్రాలు కూడా ఉన్నాయి. వారి చేతుల్లో శకునం చూసే బాణాలు ఉన్నాయి.

"వీరు దైవప్రవక్తలు. జూదం, శకునాల్లాంటి దుష్కార్యాలకు ఆమడ దూరం ఉండిన పావనమూర్తులు. కాని దుర్మార్గులు, స్వార్థపరులు వీరిని ఈవిధంగా వక్రంగా చిత్రించారు" అన్నారు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం).

ఆయన ఆదేశంతో హజ్రత్ ఉమర్ (రజి) ఆ చిత్రాలన్నిటిని తుడిచివేశారు. అలా కాబాగృహం శుద్ధి అయిన తర్వాత దైవప్రవక్త (స) ఇద్దరు అనుచరులతో గర్భగుడిలోకి ప్రవేశించి ప్రార్థన చేశారు. ఆనందాతిశయంతో విశ్వప్రభువుకు కృతజ్ఞతలు సమర్పించారు. ఆ తరువాత బయటికి వచ్చారు.

దైవప్రవక్త (సల్లం) కాబా నుంచి బయటికి వస్తుంటే ఆయన చేతిలో కాబా తాళపు చెవులు ఉండటం చూసి హజ్రత్ అలి (రజి) సంతోషిస్తూ లేచి నిలబడ్డారు.

"దైవప్రవక్తా! దేవుడు మీపై శాంతిశ్రేయాలు వర్షింపజేయుగాక. యాత్రికులకు నీటి సరఫరా పనితో పాటు, కాబానిర్వహణ బాధ్యత మా కప్పగించండి" అన్నారు ఆయన.

కాని దైవప్రవక్త (సల్లం) దానికి సమాధానం ఇవ్వకుండా "ఉస్మాన్ బిన్ తల్హా ఏడి, ఎక్కడికెళ్ళాడు?" అని అడిగారు.

వెంటనే కొందరు అనుచరులు వెళ్ళి ఉస్మాన్ బిన్ తల్హాని పిలుచుకు వచ్చారు.

"ఉస్మాన్! ఇదిగో నీ తాళపుచెవులు. ఈరోజు సద్వర్తనం, నిజాయితీల దినం. ఈ తాళపుచెవులు ఈరోజు నుంచి ఇక ఎల్లప్పుడూ నీ కుటుంబంలోనే ఉంటాయి. దుర్మార్గులు తప్ప మరెవరూ దీన్ని మీ దగ్గర్నుంచి లాక్కోలేరు" అన్నారు దైవప్రవక్త (సల్లం) తాళపు చెవులు అతనికి శాశ్వతంగా అప్పగిస్తూ.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) కనబరచిన ఈ ఔదార్యంతో ఉస్మాన్ బిన్ తల్హా సంతోషాతిశయంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు. అతని కనుగొలుకుల నుండి ఆనందాశ్రువులు జలజల రాలసాగాయి. ఆ తర్వాత వెంటనే అతని నోట అప్రయత్నంగా "అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ ఆయన సందేశహరుడని నేను సాక్ష్యమిస్తున్నాను" అన్న మాటలు వెలువడ్డాయి.

## సాధారణ క్షమాభిక్ష-(137)

కాబా ప్రాంగణంలో వేలాది మంది జనం గుమిగూడి ఉన్నారు. సహృదయుడు, నిజాయితీపరుడయిన దైవప్రవక్త (సల్లం)ను, ఆయన్ని విశ్వసించినవారిని అనేక హింసలకు గురిచేసిన సత్యతిరస్కారులు వీరు. అందువల్ల దైవప్రవక్త (సల్లం) తమ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని లోలోన భయపడుతూ ఊపిరి బిగబట్టి ఎదురు చూస్తున్న మక్కా బహుదైవారాధకులు వీరు.

అలాంటి పరిస్థితిలో దైవప్రవక్త (సల్లం) వారి ఎదుటకు వచ్చి నిలబడ్డారు. జన సమూహంపై నిశ్శబ్దం ఆవరించింది.

"ప్రజలారా! అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడు. ఆయన ఒక్కడే. ఆయనకు (దైవత్వంలోగాని, శక్తిసామర్థ్యాలలోగాని, గుణగణాలలోగాని) ఎవరూ సాటి లేరు. ఆయన తన దాసునికి సహాయంచేసి వాగ్దానం నిలబెట్టుకున్నాడు. ఇతర వర్గాలన్నిటినీ ఏకాకులుగా చేసివేశాడు. బాగా వినండి. గర్వకారణాలయిన సమస్త విషయాలు, పురాతన హత్యలు, హత్యాప్రతీకారాలన్నీ ఇప్పుడు నాకాళ్ళ క్రింద నలిగిపోయాయి. కాబా నిర్వహణ, యాత్రికులకు నీటిసరఫరా పనులు తప్ప అజ్ఞానకాలపు అహంభావాలను, కుల గోత్రాల పట్ల గర్వపడటాన్ని దేవుడు రూపుమాపాడు. మానవులంతా ఆదం సంతతిలోనివారే. ఆదం మన్నుతో సృజించబడ్డారు" అని ప్రసంగించిన తరువాత దైవప్రవక్త (సల్లం) దివ్య ఖుర్ఆన్‌లోని ఈ సూక్తి పఠించారు:

"మానవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీపురుష జంట నుండి పుట్టించాము. తరువాత మీ పరస్పర పరిచయం కోసం మిమ్మల్ని విభిన్న జాతులుగా, తెగలుగా చేశాము. అయితే మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు. నిస్సందేహంగా దేవుడు సర్వజ్ఞాని, సమస్త విషయాలు తెలిసినవాడు." (49:13)



ప్రజలు దైవప్రవక్త (స) ప్రసంగాన్ని ఎంతో ఆసక్తిగా వింటున్నారు. అయితే తమల్ని గురించి ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనన్న ఆదుర్దాయే వారిలో ఎక్కువగా గోచరిస్తోంది. వారు లోలోన బిక్కుబిక్కుమంటూ బిత్తరచూపులు చూస్తున్నారు.

"ఖురైష్ ప్రజలారా! నేనీ రోజు మీ పట్ల ఏవిధంగా ప్రవర్తిస్తానో మీకు తెలుసా?" అడిగారు దైవప్రవక్త (స).

"సద్వర్తనంతోనే ప్రవర్తిస్తారు. మీరు మా ఉత్తమ సోదరులు. ఉత్తమ సోదరుని కుమారులు" అన్నారు ప్రజలు కాస్తంత ధైర్యంచేసి ముక్తకంఠంతో.

"సరే, వెళ్ళండి. ఈరోజు మీ మీద ఎలాంటి ఆరోపణ లేదు. మీరంతా స్వతంత్రులు" అన్నారు కారుణ్యమూర్తి (స).

అంతే..... మక్కా ప్రజలపై పూలవాన కురిసింది. సంతోషాతిశయంతో వారి ముఖాలు ఒక్కసారిగా కలువపువ్వుల్లా వికసించాయి. కృతజ్ఞతా భావంతో కూడిన వారి కళ్ళు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఔదార్యాన్ని ప్రశంసించాయి.

ఎందుకూ? పరమ రక్తపిపాసులయి వెంటపడినా, నానాబాధలు పెట్టి వేధించినా, పెద్దఎత్తున దుష్ప్రచారం చేసినా, మూడేండ్లపాటు సంఘబహిష్కరణ చేసినా, స్వస్థలం వదలిపెట్టి పోయేలా తీవ్రమయిన వత్తిడి తెచ్చినా, హత్యాప్రయత్నాలకు పాల్పడినా, మదీనాపై దాడిచేసినా, దైవగృహాన్ని దర్శించనీయకుండా ఆటంకపరచినా తమల్ని దైవప్రవక్త (స) క్షమించారు. తమపై అపార కరుణామృతం చిలికించారు. ప్రతీకారానికి స్వస్తిచెప్పి అమితమైన ఔదార్యం కనబరిచారు. తమకు శిక్ష విధించకుండా, బానిసలుగా బంధించకుండా స్వేచ్ఛ ప్రసాదించి వదలిపెట్టారు.

మక్కా నగరం ఇప్పుడు దైవప్రవక్త (స) అధీనంలోకి వచ్చింది. అన్సార్ ముస్లింలు ఆలోచనలో పడ్డారు. పరస్పరం గుసగుసలాడుకోసాగారు.

మక్కా దైవప్రవక్త (సల్లం)కు ప్రియమైన స్వస్థలం. అదిప్పుడు ఆయన అధీనంలోకి వచ్చింది. అలాంటప్పుడు దైవప్రవక్త (సల్లం) మదీనా రాకుండా ఇక్కడే స్థిరపడి పోతారా? తాము దైవప్రవక్త (సల్లం) చల్లని నీడను కోల్పోవలసిందేనా?

వారి గుసగుసలు దైవప్రవక్త (సల్లం) చెవిన పడ్డాయి.

"ఏమిటీ మీరు మాట్లాడుకునేది?" అన్నారు ఆయన వారి వైపు చూస్తూ.

వెంటనే గుసగుసలు మానేసి అందరూ మౌనంగా ఉండిపోయారు.

"ఏమిటో చెప్పండి, కాస్త నేనూ వింటాను" అన్నారు దైవప్రవక్త (సల్లం).

ఆయన వారి ఆందోళన గ్రహించారు. అన్సార్ ముస్లింలకు సమాధానం ఇవ్వక తప్ప లేదు. వారు మాట్లాడకముందే దైవప్రవక్త (స) వారి మనసులోని మాట చెప్పారు:

"నేను మీ నుండి వేరైపోయే దినాన్ని దైవం తీసుకు రాకుండుగాక! నేను మీ మధ్యనే జీవించవలసి ఉంది. మీ మధ్యనే మరణించవలసి ఉంది."

ఈ మాటలు వినగానే అన్సార్ ముస్లింలు చల్లగా ఊపిరి పీల్చుకున్నారు.

మరుసటిరోజు ఖుజాఅ తెగవారి చేతికి హుజైల్ తెగ మనిషి ఒకడు చిక్కాడు. అతనితో ఖుజాఅ తెగవాళ్ళకు పాతవైరం ఉంది. అందువల్ల అవకాశాన్ని జారవిడుచుకోకుండా వారా వ్యక్తిని వెంటనే హతమార్చారు.

హుదైబియా ఒప్పందం ప్రకారం ఖుజాఅ తెగవాళ్ళు ముస్లింలకు మిత్రపక్షం అయ్యారు. అందువల్ల ఈ దుర్ఘటన సంగతి తెలియగానే దైవప్రవక్త (సల్లం)కు పట్టరాని కోపం వచ్చింది. తక్షణమే ఆయన ప్రజలను సమావేశపరిచారు. వారి ముందు ఆవేదనా భరిత హృదయంతో ఇలా ప్రసంగించారు:

“ప్రజలారా! శ్రద్ధంగా వినండి. ఏరోజయితే దేవుడు భూమ్యాకాశాల్ని సృజించాడో ఆరోజు నుండే ఆయన మక్కాను పుణ్యక్షేత్రంగా చేశాడు. ఇప్పుడిది ప్రళయం దాకా పుణ్యక్షేత్రంగానే ఉంటుంది. ఇక్కడ ఎలాంటి రక్తపాతం చెయ్యడంగాని, చెట్లు నరకడం గాని ఎవరికీ ధర్మసమ్మతం కాదు. నాకు పూర్వం ఇది ఏ ఒక్కరికీ ధర్మసమ్మతం చెయ్యబడలేదు. నా తరువాత కూడా ఎవరికీ ధర్మసమ్మతం కాబోదు. ఇక్కడి ప్రజలపై దైవాగ్రహం విరుచుకు పడినప్పుడు మాత్రమే నాకయినా ఈపని ధర్మసమ్మతం చేయబడింది. ఇప్పుడీ క్షేత్ర పవిత్రత తిరిగొచ్చింది. ఈ విషయాన్ని మీరు ఈ సభలో పాల్గొనలేకపోయినవారికి కూడా తెలియజేయండి. ఒకవేళ మీతో ఎవరైనా దైవప్రవక్త (సల్లం) ఇక్కడ యుద్ధం చెయ్యలేదా అని అడిగితే ‘దేవుడు దీన్ని తన ప్రవక్త కోసం ధర్మసమ్మతం చేశాడు కాని, మీ కోసం కాద’ని చెప్పేయండి.”

దైవప్రవక్త (సల్లం) ప్రసంగంతో ప్రజల కళ్ళ మీదున్న చీకటితెరలు పటాపంచలై పోయాయి. అజ్ఞానపు కారుమేఘాలన్నీ కనుమరుగైపోయాయి. సత్యతేజస్సుతో వారి అంతర్యాలు ప్రకాశవంతమయ్యాయి. ఈవిధంగా ప్రజలు తమ హృదయాల్లో ఆధ్యాత్మిక మహాభాగ్యం నింపుకొని ఇండ్లకు వెళ్ళిపోయారు. వెళ్ళగానే తమ స్వహస్తాలతో తమ విగ్రహాలను ధ్వంసంచేశారు. ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి సత్యధర్మం స్వీకరించి ముస్లింలయి పోయారు.

## విగ్రహాలు విలపించిన వేళ-(138)

దైవప్రవక్త (సల్లం) నవముస్లింలలో ఒక ప్రకటన చేస్తూ “ముస్లింలయిన వారంతా తమ ఇండ్లలో ఎలాంటి విగ్రహాలు ఉంచకూడద”ని అన్నారు. ఆ తరువాత ఆయన మక్కా చుట్టుపక్కల ఉన్న సుప్రసిద్ధ విగ్రహాలను, విగ్రహాలయాలను తొలగించడానికి చిన్న చిన్న సైనికదళాలను పంపించారు.

నగరానికి కొన్నిమైళ్ళ దూరంలోని ఒయాసిస్సులో ఉన్న ఉజ్జా అనే ప్రముఖ విగ్రహాలయాన్ని ధ్వంసం చేయడానికి ఆయన ఖాలిద్ బిన్ వలీద్ (రజి) నాయకత్వంలో ముప్ఫయి వేలమందితో కూడిన సైనికదళాన్ని పంపారు. హజ్రత్ ఖాలిద్ (రజి) ఈ సైనిక దళంతో వెళ్ళి ఉజ్జా విగ్రహాన్ని ధ్వంసం చేసి, దాని ఆలయాన్ని నేలమట్టం చేశారు.



దైవప్రవక్త (సల్లం) హుజైల్ తెగవారి సువా విగ్రహాలయాన్ని ధ్వంసం చేయడానికి మరో సైనికదళాన్నిచ్చి అమ్ర్ బిన్ ఆస్ (రజి)ని పంపారు. హజ్రత్ అమ్ర్ (రజి) విగ్రహాలయం దగ్గరికి వెళ్తే, దాని ప్రధాన పూజారి ‘సువా దేవత’ గొప్పతనాన్ని ప్రస్తావిస్తూ “అలాంటి సువా విగ్రహాన్ని మీరు ఎలా విరగ్గొట్ట గలుగుతారు?” అన్నాడు.

హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) సమాధానమిస్తూ “మీరు చూస్తూ ఉండండి, ఎలా విరగ్గొడ్తానో” అన్నారు. అనడం ఏమిటీ? తక్షణమే ఆయన మందిరంలోకి ప్రవేశించి సువా విగ్రహాన్ని ముక్కలు ముక్కలుగా విరగ్గొట్టారు. విరగ్గొడ్తే ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడిన పూజారికి ఈ దృశ్యం ఆశ్చర్యం కలిగించింది. అమ్ర్ బిన్ ఆస్ (రజి)కు ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. దాంతో పూజారి ఎంతో ప్రభావితుడయి అప్పటికప్పుడు ఇస్లాం స్వీకరించాడు.

దైవప్రవక్త (సల్లం) ఖుదీమ్ ప్రాంతంలో ఉన్న మనాత్ విగ్రహాలయాన్ని ధ్వంసం చేయడానికి సాద్ బిన్ జైద్ (రజి)ని పంపారు. అక్కడి పూజారులు కూడా మనాత్ విగ్రహాన్ని ఎవరూ విరగ్గొట్టలేరని, ఒకవేళ ఎవరయినా విరగ్గొడ్తే వారికి వెంటనే కీడు మూడుతుందని నమ్మేవారు. కాని సాద్ బిన్ జైద్ (రజి) సైనిక పటాలంతో వచ్చిరాగానే మనాత్ విగ్రహాన్ని విరగ్గొట్టి దాని మందిరాన్ని నేలమట్టం చేశారు.

ఈ విధంగా అనేక విగ్రహాలయాలు నేలమట్టం చేయబడ్డాయి. అలా చేసినవారికి ఎలాంటి కీడు సంభవించలేదు. దాంతో బహుదైవారాధకులు ఆశ్చర్యపోయారు. వారిలో అనేకమంది అప్పటికప్పుడు ఇస్లాం స్వీకరించారు. కొందరు దైవప్రవక్త (సల్లం) పంపిన ప్రచారకుల బోధ విని ఇస్లాం స్వీకరించారు. మరికొందరు దైవప్రవక్త (సల్లం) సన్నిధికి నేరుగా వచ్చి ఇస్లాం స్వీకరించారు. ఇలా కొన్నాళ్ళలోనే వేలాది మంది బహుదైవారాధకులు ఇస్లాం స్వీకరించి ముస్లింలయి పోయారు.

హజ్రత్ అబూబకర్ (రజి) తన తండ్రి అబూ ఖహాఫాని తీసుకొచ్చి దైవప్రవక్త (సల్లం) ముందు ప్రవేశపెట్టారు. అబూఖహాఫా చాలా వృద్ధుడయ్యాడు. చూపు కూడా తగ్గిపోయింది. ఆ వృద్ధుడ్ని చూసి దైవప్రవక్త (సల్లం)కు జాలివేసింది.

“అబూబకర్! నేను స్వయంగా మీ నాన్న దగ్గరకు వచ్చేవాడ్ని కదా! పాపం ఆయనకు ఎందుకు శ్రమిచ్చావు?” అన్నారు ఆయన.

“దైవప్రవక్తా! మీరెందుకు రావాలి? దప్పిగగొన్నది ఈయన. ఈయనే మీ దగ్గరికి రావాలి” అన్నారు అబూబకర్ (రజి).

ఆ తరువాత దైవప్రవక్త (స) అబూఖహాఫాని తన ముందు కూర్చోబెట్టుకొని అతని హృదయాన్ని చేత్తో నిమిరారు. అప్పుడతను సద్వచనం పఠించి ఇస్లాం స్వీకరించాడు.

దైవప్రవక్త (స)కు, నూతన ధర్మానికి బద్ధవిరోధులైనవారు సైతం ఇస్లాం స్వీకరించడానికి ముందుకొచ్చారు. దైవప్రవక్త (స)కు అత్యంత ప్రియమైన పినతండ్రి హజ్రత్ హమ్జా (రజి)ని హతమార్చిన వహ్షీ కూడా ఇస్లాం స్వీకరించాడు. దైవప్రవక్త (స) కుమార్తె హజ్రత్ జైనబ్ (రజి)ని కత్తితో బెదిరించి అనరానిమాటలతో అవమానించిన హబ్బార్ బిన్

అస్వద్ కూడా ఇస్లాం స్వీకరించాడు. హజ్రత్ హమ్జా (రజి) గుండెకాయ తీసి నమిలి మింగడానికి ప్రయత్నించిన హిందా కూడా ఇస్లాం స్వీకరించింది.

ఈవిధంగా ప్రజలు తండోపతండలుగా దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి సంతోషంగా ఇస్లాం స్వీకరించసాగారు. ఈరోజు వారు కక్షలు, కార్పణ్యాలు విడనాడి మనస్ఫూర్తిగా సత్యధర్మానికి చేరువవుతున్నారు.

"(ప్రవక్తా!) దేవుని సహాయం లభించి, విజయం లభించిన తర్వాత ప్రజలు తండోప తండలుగా దైవధర్మంలో చేరుతూ ఉండటం నీవు గమనిస్తూనే ఉన్నావు. కనుక నీ ప్రభువు ఔన్నత్యం స్తుతిస్తూ, ఆయన పవిత్రతను ప్రశంసిస్తూ ఉండు. దాంతోపాటు ఆయన సన్నిధిలో నీ పొరపాట్లకు క్షమాపణ కోరుకో. ఆయన గొప్ప క్షమాశీలి." (ఖుర్ఆన్-110:1-3)

మహాప్రవక్త ముహమ్మద్ (స) ముఖపద్మం ఆనందకిరణాలు విరజిమ్ముతోంది. ఆయన హృదయం విశ్వప్రభువు పట్ల కృతజ్ఞతా భావంతో నిండిపోయింది. పెదవుల నుండి స్తుతి స్తోత్రాలు జాలువారుతున్నాయి. అపార కృపాశీలుడయిన సృష్టికర్త తనకు విజయశ్రీ ప్రసాదించాడు. మక్కా నగరాన్ని తనకు హస్తగతం చేశాడు. ఇక్కడ తన గౌరవప్రతిష్ఠలను ఇనుమడింపజేశాడు. తనకూ, తన అనుచరులకు కాబా దర్శనభాగ్యం కలిగించాడు. శత్రుభయాన్ని దూరంచేశాడు. సర్వత్రా శాంతిసౌరభం వెదజల్లాడు.

దైవప్రవక్త (సల్లం) బద్ధవిరోధుల్లో ఒకడైన సఫ్వాన్ బిన్ ఉమయ్యా మక్కా విజయం తరువాత మక్కా నుండి పారిపోయాడు. సఫ్వాన్ ఎక్కడ కన్పించినా ముస్లింలు అతడ్ని హతమార్చడానికి పొంచివున్నారని కొందరు సఫ్వాన్‌కు తెలియజేశారు. అందువల్ల అతను ముస్లింల కంటబడకుండా ప్రయాణంచేస్తూ జిద్దా దారి పట్టాడు.

అయితే సఫ్వాన్ పినతండ్రి కుమారుడు ఉమైర్ బిన్ వహబ్ (రజి) దైవప్రవక్త (సల్లం) దగ్గరికెళ్ళి ఇలా విన్నవించుకున్నారు: "దైవప్రవక్తా! సఫ్వాన్ తన తెగనాయకుల్లో అగ్రగణ్యుడు. అతను మక్కా నుండి పారిపోయి సముద్రంలో దూకి చావడానికి సిద్ధమయ్యాడు. అతడ్ని కనికరించి రక్షణ హామీ ఇవ్వండి."

దైవప్రవక్త (సల్లం) ఈ మాట విని "సరే, వెళ్ళి అతడ్ని వెతికి పిలుచుకొని రా. నేనతని ప్రాణానికి రక్షణ హామీ ఇస్తున్నాను" అన్నారు.

"అయితే దైవప్రవక్తా! మీరిచ్చిన హామీని అతను నమ్మడానికి వీలుగా నాకేదయినా మీ వస్తువు ఇవ్వండి" అన్నారు ఉమైర్ (రజి) మళ్ళీ.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) తన తలపాగా తీసి ఇచ్చారు. ఉమైర్ (రజి) ఆ తలపాగా తీసుకొని జిద్దా వెళ్ళారు.

సరిగ్గా అదే సమయంలో సఫ్వాన్ జిద్దా రేవులో ఓడ ఎక్కడం కన్పించింది.

వెంటనే ఉమైర్ (రజి) అటుగా పరుగుపెడుతూ "సఫ్వాన్! సఫ్వాన్!! ఆగాగు. దైవప్రవక్త (సల్లం) నిన్ను క్షమించారు. ఆయన దగ్గర్నుంచి నేను నీ ప్రాణరక్షణకు హామీ తెచ్చాను. ఓడ దిగిరా" అన్నారు బిగ్గరగా కేకవేస్తూ.



సఫ్వాన్ ఓడ నుంచి దిగకుండానే "ఆయన హామీ ఇచ్చినట్లు ఆధారం ఏమిటీ?" అని అడిగాడు ఓ పట్టాన నమ్మలేక.

"ఇదిగో! ఆయన తన తలపాగా తీసి ఇచ్చారు" అంటూ ఉమైర్ (రజి) తన దగ్గరున్న ప్రవక్త తలపాగా చూపించారు. అప్పుడు సఫ్వాన్ ఓడ దిగివచ్చాడు. ఉమైర్ (రజి) అతడ్ని తీసుకొని మక్కా చేరుకొని దైవప్రవక్త (స) దగ్గరికి వెళ్ళారు.

"దైవప్రవక్తా! మీరు నన్ను క్షమించారట, నిజమేనా?" అన్నాడు ఒకింత ఆశ్చర్యంతో.

"ఆ.... నిజమే" అన్నారు దైవప్రవక్త (స).

ఈ మాట వినగానే సఫ్వాన్‌కు తాను చేసిన దౌర్జన్యాలు ఓసారి గుర్తుకొచ్చాయి. అయినప్పటికీ తనను క్షమించానని దైవప్రవక్త (సల్లం) స్వయంగా చెబుతున్నారు. అంచేత అతను విస్తుబోయి క్షణం పాటు నోరెల్లబెట్టాడు.

"అయితే నాకు రెణ్ణెల్లు అవకాశం ఇవ్వండి" అన్నాడు సఫ్వాన్ ఆశ్చర్యం నుంచి తేరుకొని. 'రెణ్ణెల్లు ఏమిటి, నాల్గు నెలలు ఇస్తున్నాను, వెళ్ళు" అన్నారు దైవప్రవక్త (స).

దైవప్రవక్త (స) నోట ఈ మాట వినగానే సఫ్వాన్ సంతోషంతో పొంగిపోయాడు. ఆ తరువాత కొన్నాళ్ళకే అతను ఇస్లాం స్వీకరించి ముస్లింలలో చేరిపోయాడు.

అదే విధంగా అబూజహల్ కొడుకు ఇక్రమా కూడా మక్కా విజయం తరువాత ప్రాణభయంతో నగరం నుండి పారిపోయాడు. ఈ సంగతి తెలిసి అతని ముస్లిం భార్య ఉమ్మె హకీం బిన్త్ హారిస్ (రజి) దైవప్రవక్త (సల్లం) దగ్గరకు వచ్చి, తన భర్తను క్షమించి ప్రాణభిక్ష పెట్టమని ప్రాధేయపడ్డారు. అందుకు దైవప్రవక్త (సల్లం) సంతోషంగా అతనికి ప్రాణరక్షణ హామీ ఇచ్చారు. అయితే ఇక్రామా బిన్ అబూజహల్ అప్పటికే జిద్దా రేవు నుంచి బయలుదేరి అబిసీనియా వైపు ప్రయాణమయ్యాడు.

ఇదిలా ఉంటే అటు దైవప్రవక్త (సల్లం) మక్కా చుట్టుపక్కల గ్రామాల్లో నివసించే తెగలకు దైవసందేశం అందజేయడానికి తన ప్రతినిధుల్ని పంపించారు. వారి ద్వారా ప్రజలకు బహుదైవారాధనలోని కీడును తెలుపుతూ ఇహపరలోకాల్లోని శాంతీసౌఖ్యాలను ప్రసాదించే సత్యధర్మం స్వీకరించమని హితవు చేశారు.

మక్కా చుట్టుపక్కల నివసించే తెగలు ముస్లింల విజయాన్ని గురించిన వార్తలు విన్నాయి. ఖురైషీయుల్లో అత్యధికమంది ఇస్లాం స్వీకరించారని కూడా తెలుసుకున్నాయి. దాంతో ఈ తెగల్లో కూడా అనేకమందికి నూతనధర్మం స్వీకరించాలన్న ఉత్సాహం కలిగింది. అందువల్ల ప్రవక్త ప్రతినిధులు రాగానే ఈ తెగల ప్రజలు సంతోషంగా వారికి స్వాగతం చెప్పారు. ఘనంగా గౌరవమర్యాదలు చేసి ఇస్లాం స్వీకరించారు..

దైవప్రవక్త (స) ఖాలిద్ (రజి)ని కూడా ధర్మప్రచారం కోసం పంపారు. ఆయన కొందరు ముజాహిద్‌లను తీసుకొని 'బనీఖుజైమా' తెగ దగ్గరకు పోయారు. అయితే ఆ తెగవారు దైవసందేశాన్ని త్రోసిపుచ్చడమే గాకుండా ఖాలిద్ (రజి)కు వ్యతిరేకంగా యుద్ధానికి సిద్ధమయ్యారు.

అయితే హ్రజత్ ఖాలిద్ (రజి) తొందరపడలేదు. ఆయన బనీఖుజైమా తెగవారికి నచ్చజెప్పడానికి ఎంతగానో ప్రయత్నించారు.

"ఏమిటి మీ ధోరణి? జనమంతా ఇస్లాం స్వీకరించి ఉంటే మీరిప్పుడు యుద్ధం చేయడానికి ఉవ్విళ్ళూరుతున్నారా! బాగా ఆలోచించుకోండి" అన్నారు ఆయన.

"నిజమే ఇప్పుడేం చెయ్యాలి?" బనీఖుజైమా తెగవాళ్ళు సందిగ్ధంలో పడిపోయారు.

కాని వారిలో 'జహ్‌దమ్' అనే వాడొకతను తన తెగవాళ్ళను రెచ్చగొట్టసాగాడు.

"ప్రజలారా! కాస్త స్పృహలోకి రండి. ఇతనెవరో, ఎలాంటివాడో మీకు తెలియదా? ఇతను ఖాలిద్ సుమా! ఆయుధాలు విసర్జించారా... మీరు బందీలుగా పట్టుబడిపోతారు. ఆ తరువాత మనకు వినాశం తప్పదు. నేను మాత్రం నా శరీరం తూట్లుపడినా ఆయుధాలు వదలను" అన్నాడతను.

"అదేమిటయ్యా అలా అంటావు? మమ్మల్నందరినీ హతమార్పించదలిచావా ఏమిటి? మక్కాలో జనమంతా ఇస్లాం స్వీకరించారు కదా! ఇక ఈ యుద్ధమెందుకు అనవసరంగా? ఇప్పుడు మనం చేయవలసిన పని ఇస్లాం స్వీకరించడమే" అన్నాడు జనంలో నుంచి ఒకడు ముందుకు వచ్చి.

కాని జహ్‌దమ్ అతని మాటలు త్రోసిపుచ్చాడు. మరికొందరు కూడా నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. కాని అతను ఎవరీ మాటా వినే స్థితిలో లేడు. యుద్ధం చేసి తీరాల్సిందేనని పట్టుబట్టాడు. అదే మొండివైఖరితో అతను హ్రజత్ ఖాలిద్ (రజి)పై కత్తి ఝుళిపించాడు. అతడ్ని చూసి అతని అనుచరులలో కూడా కొందరు వరలలో నుంచి కత్తులు దూసి ముస్లింలపై దాడికి పాల్పడ్డారు. కాని చివరికి జరిగిందేమిటీ? ఘోరపరాజయం.

జహ్‌దమ్ హ్రజత్ ఖాలిద్ పరాక్రమం ముందు నిలువలేక కాస్సేపటికే చేతులెత్తాడు. అలాగే అతని అనుచరులు కూడా కాస్సేపు పెనుగులాడి చివరికి లొంగిపోయారు.

హ్రజత్ ఖాలిద్ (రజి) వెంటనే వారిని బంధించారు. ఆ తరువాత వారి తలబిరుసు తనానికి శిక్షగా వారిని హతమార్చి వేశారు.

ఈ వార్త వినగానే దైవప్రవక్త (స) గుండెపై సమ్మెటపోటు పడినట్లు ఎంతో బాధ పడ్డారు. ఒకచిన్న విషయానికే మానవరక్తం చిందిందే అన్న భావనతో ఆయన ఎంతో విచారం వెలిబుచ్చారు. అప్రయత్నంగా ఆ మహనీయుని చేతులు పైకి లేచాయి. "దేవా! ఇది ఖాలిద్ చేసిన పని. నాకిందులో ఎలాంటి బాధ్యత లేదు" అన్నారాయన.

ఆ తర్వాత ఆయన అలి (రజి)ని పిలిపించారు. ఆయనకు పెద్దయెత్తున ధనరాసులు అప్పగించి-- "వీటిని తీసుకొని బనీఖుజైమా తెగవాళ్ళ దగ్గరకు వెళ్ళు. మన తరపున రక్త పరిహారంగా మృతుల వారసులకు ఈ పైకం అందజేయి. వారికి హితోపదేశం చేస్తూ అజ్ఞానచీకటి పారదోలిరా" అని చెప్పారు.

హ్రజత్ అలి (రజి) అప్పటికప్పుడు బయలుదేరి వెళ్ళి మృతుల వారసులందరికీ రక్తపరిహారం చెల్లించారు ధననష్టం జరిగినవారికి కూడా కొంత పైకం ముట్టజెప్పారు.



చెల్లించవలసిన వారందరికీ చెల్లించగా పైకం ఇంకా మిగిలిపోయింది. దాన్ని కూడా ఆయన ఆ తెగ నాయకులకు అందిస్తూ ఇలా అన్నారు:

"ఎందుకైనా మంచిది ఈ డబ్బు కూడా మీ దగ్గర ఉంచండి. నష్టపరిహారం పొంద వలసినవారు ఎవరైనా ఇంకా మిగిలివుండవచ్చు. వారికీ పైకం అందజేయండి."

వచ్చిన పని పూర్తికాగానే అలి (రజి) మక్కా వెళ్ళిపోయారు. జరిగిన సంఘటన దైవప్రవక్త (స)కు వివరించారు. అప్పుడు కారుణ్యమూర్తి (స) మనసు కుదుటపడింది.

హ్రజత్ ఖాలిద్ (రజి) వల్ల జరిగిన పొరపాటు సంగతి విన్నవారంతా తలలు బాదు కున్నారు. ఆయన చర్యను గర్హించారు. మరికొందరు ఆయన్ని తీవ్రంగా నిందించారు. అయితే దైవప్రవక్త (స) వారిని వారిస్తూ "ఖాలిద్‌ని నిందించకండి. ఖాలిద్ దైవకరవాలం. దేవుడు ఈ ఖడ్గాన్ని సత్యతిరస్కారుల తలలపై స్రేలాడదీశాడు" అన్నారు.

ఓరోజు దైవప్రవక్త (స) తన అనుచరుల మధ్య కూర్చొనివుంటే తీర్పు కోసం ఒక వ్యవహారం వచ్చింది. మఖ్జూమ్ తెగకు చెందిన ఒక స్త్రీ దొంగతనం చేసింది. ఇస్లామీయ ధర్మశాస్త్రం ప్రకారం ఆమెకు హస్తఖండన శిక్ష పడుతుంది. కాని ఆ స్త్రీ బంధువులు దైవ ప్రవక్త (స)కు ప్రియమైన అనుచరుడయిన ఉసామా బిన్ జైద్ (రజి) ద్వారా సిఫారసు చేయించుకోవడానికి వచ్చారు.

హ్రజత్ ఉసామా బిన్ జైద్ (రజి) విషయం వివరించి హస్తఖండన శిక్ష నుండి ఆమెను తప్పించమని దైవప్రవక్త (స)కు మనవి చేశారు. ఈ మాట వినగానే దైవప్రవక్త (స) ముఖం కోపంతో జేవురించింది. "ఏమిటీ? నువ్వు నా దగ్గర దేవుడు నిర్ణయించిన శిక్షాస్మృతి విషయంలో సిఫారసు చేయడానికి వచ్చావా!" అన్నారాయన ఉరిమిచూస్తూ.

"దైవప్రవక్తా! (తప్పయి పోయింది.) నా పాపక్షమాపణ కోసం దైవాన్ని ప్రార్థించండి" అన్నారు హ్రజత్ ఉసామా (రజి) జరిగిన పొరపాటుకు చింతిస్తూ.

ఆరోజు సాయంత్రం ప్రజలను సమావేశపరచి ప్రసంగిస్తూ "మీకు పూర్వం ఉండిన జాతులు పేరు పలుకుబడులు గల ఉన్నత వంశస్థుడు దొంగతనం చేస్తే శిక్ష విధించ కుండా వదలిపెట్టేవారు; అదే బలహీనవర్గం లేదా పేరు పలుకుబడులులేని మనిషి ఎవరైనా దొంగతనం చేస్తే మాత్రం అతనికి (కఠిన) శిక్ష విధించేవారు. ఈ కారణంగానే ఆనాటి జాతులు నాశనమయ్యాయి. నా ప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్షిగా చెబుతున్నాను. ముహమ్మద్ కూతురు ఫాతిమా దొంగతనం చేసినా సరే నేను ఆమె చేతిని కూడా నరికేస్తాను" అని అన్నారు.

ఆ తరువాత ఆయన దొంగతనం చేసిన ఆ స్త్రీకి హస్తఖండన శిక్ష విధించారు. వెంటనే దాన్ని అమలుపరచడం కూడా జరిగింది. తరువాత ఆ స్త్రీ పశ్చాత్తాపంతో దైవాన్ని క్షమాపణ వేడుకొని తన నడవడికను సరిదిద్దుకున్నది.

ఈ సంఘటనతో నేరప్రవృత్తికల ఇతరులు కూడా అనేకమంది తమ నడవడికను సరిదిద్దుకొని ఇస్లాంకు చేరువైపోయారు. ఇస్లాంస్వీకార పర్వం ఇంకా కొనసాగుతోనే ఉంది.

మొత్తానికి మక్కాపట్నం, దాని పరిసరప్రాంతాలు సత్యధర్మంతో పావనమయ్యాయి. ప్రజలు తాము పూజించిన విగ్రహాలను తమ చేజేతులా ధ్వంసం చేశారు. ఇండ్లల్లో, మందిరాల్లో ప్రతిష్ఠించుకున్న రాతిబొమ్మల్ని బయటికి తీసి పగలగొడ్తూ ఇలా అన్నారు:

"నిన్నటిదాకా మాకు మీమీద ప్రేమాభిమానాలు ఉండేవి. ఈరోజు మేము మిమ్మల్ని అసహ్యించుకుంటున్నాం. నిన్నటివరకు మిమ్మల్ని ధూపదీప నైవేద్యాలతో పూజించాము. ఈరోజు మిమ్మల్ని మాకాళ్ళ కింద పడేసి తొక్కుతున్నాం. ఇంతకుముందు మేము చాలా మోసానికి గురయి ఉండేవాళ్ళము. ఇప్పుడు మా అజ్ఞాన తెరలు తొలగిపోయాయి."

ఇలా మక్కాలో బహుదైవారాధన దాదాపు అంతరించింది. అయితే కొత్తగా ముస్లిం లైన వారికి ఇస్లాంశిక్షణ గరిపి దైవాభీష్టానికి అనుగుణంగా వారి జీవనస్థితిగతులు తీర్చిదిద్ద వలసిఉంది. దీని కోసం దైవప్రవక్త (స) మక్కాలో కొందరు అనుచరుల్ని ఉంచారు.

కాబానిర్వహణ బాధ్యతల్ని ఉస్మాన్ బిన్ తల్హా (రజి)కు, ఆయన కుటుంబానికి అప్పగించారు. కాబా ధర్మకర్తృత్వం ఆ కుటుంబంలోనే ఉండాలని, దాన్ని ఇతరులు చేజిక్కించుకుంటే వారు దౌర్జన్యపరులయి దైవాగ్రహానికి గురవుతారని దైవప్రవక్త (సల్లం) ప్రజలకు తాకీదు చేశారు. అలాగే ఆయన అత్తాబ్ బిన్ ఉసైద్ (రజి) అనే ఇరవై ఏళ్ళ ఓ నవయువకుడ్ని మక్కా గవర్నర్‌గా నియమించారు.

## హవాజిన్, సఖీఫ్ తెగల తిరుగుబాటు-(139)

మక్కాలో నిర్వహించవలసిన పనులన్నీ ముగిసేటప్పటికి పదిహేను రోజులు గడచిపోయాయి. అప్పుడు దైవప్రవక్త (సల్లం) మనస్సు కుదుటపడింది. ఇక మదీనాకు తిరుగుముఖం పట్టవలసి ఉంది.

ఈలోగా హవాజిన్ తెగ గురించిన ఒకవార్త అందింది. ఆ తెగవాళ్ళు ముస్లింలపై దాడి చేయడానికి సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది. రక్తపాతం నివారించాలంటే వారి యుద్ధ సన్నాహాలు పూర్తికాక ముందే అక్కడికి చేరుకోవాలి. ఈ ఆలోచన రాగానే దైవప్రవక్త (సల్లం) హవాజిన్ తెగకు గుణపాఠం చెప్పాలని నిర్ణయించారు.

దైవప్రవక్త (సల్లం) మక్కా నగరాన్ని జయించారని, అత్యధికమంది ఖురైషీయులు ముస్లింలయి పోయారని వినగానే ఖురైషీయుల ప్రత్యర్థి తెగలు ఆందోళన చెందసాగాయి. ఈ తెగలు ముస్లింల మిత్రపక్షంగా కూడా లేవు. అలాంటి తెగలలో మక్కా, తాయిఫ్ పట్టణాల మధ్య నివసిస్తున్న హవాజిన్, సఖీఫ్ తెగలు ముఖ్యమైనవి. ఇప్పుడీ రెండు తెగలు ముస్లింలకు వ్యతిరేకంగా యుద్ధసన్నాహాలు చేయసాగాయి.

అంచేత హిజ్రీశకం 8వ ఏట షవ్వాల్‌నెలలో దైవప్రవక్త (స) 12 వేల మంది యోధుల్ని తీసుకొని మక్కా నుండి బయలుదేరారు. మదీనా నుండి తెచ్చిన పదివేల మంది యోధులేగాక మరో రెండువేల మంది మక్కా నవముస్లింలు అదనంగా చేరిపోయారు.

ముజాహిద్‌లంతా ఆయుధాలు ధరించి ప్రయాణానికి సిద్ధమయ్యారు. కావలసినన్ని ఆహారపదార్థాలు కూడా సమకూర్చుకున్నారు. మక్కా నుండి ముస్లిం సేనావాహిని



నురుగులు కక్కుతూ బయలుదేరింది. ఇంతటి గొప్ప సైన్యం అరబ్బులు దేశంలో ఇది వరకెన్నడూ చూడలేదు. ముజాహిద్‌ల ఆనందోత్సాహాలు అవధులు దాటాయి. వారికీ రోజు విశ్వాసబలంతో పాటు సంఖ్యాబలం కూడా సమృద్ధిగా లభించింది. అన్నిటికి మించి విశ్వప్రభువు కారుణ్య ఛాయలు, ఆయన కటాక్ష వీక్షణలు వారిపై ఉన్నాయి.

ముస్లింలు మక్కా జయించారని వినగానే హవాజిన్ తెగవాళ్ళు కోపంతో చిందులు తొక్కారు. తక్షణమే వారు మాలిక్ బిన్ ఔఫ్‌ని నాయకునిగా ఎన్నుకొని మిత్ర పక్షాలన్నిటిని యుద్ధానికి పురిగొల్పారు. సఖీఫ్ తెగవాళ్ళను కూడా యుద్ధంలో పాల్గొనడానికి పిలిచారు. ఇంకా ఇతర తెగలను కూడా ముస్లింలకు వ్యతిరేకంగా యుద్ధానికి ప్రేరేపించారు. చూస్తుండగానే ఓ పెద్ద సైనికపటాలం తయారయింది.

ఈ సైన్యం ఔతాస్ మైదానంలో గుమిగూడింది. సైనికులు నినాదాలు చేస్తూ ఆవే శంతో ఊగిపోతున్నారు. దానికి స్త్రీల అరుపులు, పిల్లల కేరింతలు, పశువుల రణగొణ ధ్వనులు తోడయ్యాయి. సైన్యం ఉప్పొంగుతూ ఓ పెద్ద జలప్రవాహంలా తయారైంది.

సైన్యంలో దురైద్ అనే ఒక వృద్ధుడు కూడా ఉన్నాడు. అతను ఎన్నో యుద్ధాలలో పాల్గొని అపారఅనుభవం గడించాడు. కాటికి కాళ్ళుజాపిన ఈ వృద్ధుడ్ని సలహాల కోసమే తీసుకొచ్చారు. అతను సైన్యంలోని స్త్రీలను, పిల్లలను, పశువుల్ని చూసి ఆశ్చర్యపోయాడు.

"సైన్యంలో ఈ స్త్రీలు, పిల్లలు ఎందుకు వచ్చినట్లు? వీరిని ఎక్కడికి తీసికెళ్తున్నారు?" అడిగాడు అతను సైన్యాధ్యక్షుడు మాలిక్‌తో.

"యుద్ధంలో సైనికులు స్థిరంగా నిలబడి శత్రువుల్ని గట్టిగా ఎదుర్కోవడానికి వీలుగా వారి స్త్రీలు, పిల్లలు కూడా దగ్గరుంటే బాగుంటుందని తీసుకొచ్చా" అన్నాడు సేనాని.

"ఓడిపోయేవాడ్ని ఏ విషయం నిరోధిస్తుంది? విజయం సాధించాలంటే పురుషులకు ఖడ్గాలు మాత్రమే ఉపయోగపడతాయి. ఈ స్త్రీలు ఎందుకూ పనికిరారు. ఒకవేళ ఓడిపోతే ఈ స్త్రీల గతేమిటీ? ఈ పిల్లలు ఎక్కడికి పోతారు? ఎంత అవమానం జరుగుతుందో, మరెంత నష్టం వాటిల్లుతుందో ఏమైనా ఆలోచించావా?" అన్నాడు దురైద్.

"నీకు తెలియదులే తాతా! నీ బుద్ధి మందగించింది. ఈ వ్యవహారంలో నీ సలహా అంగీకరించలేను" అన్నాడు యువసేనాని మాలిక్ తలబిరుసుతో.

"పతనం సమీపించినప్పుడు మన బుద్ధులు ఇలాంటి మాటల్నే పలికిస్తాయి" అంటూ గొణుక్కున్నాడా వృద్ధుడు.

"హవాజిన్ సమరయోధుల్లారా! నేను చెప్పేది పూర్తిగా వినండి. లేకపోతే ఇదిగో ఈ ఖడ్గం నా శరీరంలో దిగి బయటికి వస్తుంది" అన్నాడు మాలిక్ సైనికుల పౌరుషాన్ని మరింత రెచ్చగొడుతూ. సైనికులంతా మాలిక్ ఆజ్ఞల్ని శిరసావహించడానికి అంగీకరించారు. మాలిక్ సూచనల ప్రకారమే యుద్ధవ్యూహం రూపొందించడం జరిగింది.

మాలిక్ రూపొందించిన వ్యూహం దైవప్రవక్త (స)కు తెలిసిపోయింది. వెంటనే ఆయన సైన్యాన్ని తీసుకొని పోయి హునైన్ లోయలో విడిదిచేశారు.

ముస్లిం యోధులు హునైన్ లోయలో ఒక రాత్రి గడిపి మరునాడు తెల్లవారగానే బయలుదేరారు. సైన్యానికి ముందు హజ్రత్ ఖాలిద్ (రజి) ఉన్నారు. వెనుక దైవప్రవక్త (సల్లం) కంచరగాడిదపై కూర్చొనివున్నారు. సైన్యం హునైన్ లోయ దాటవలసి ఉంది. లోయ చాలా ఇరుకుగా ఉన్నందున సైనికులు లోపలికి ప్రవేశించి చాలా జాగ్రత్తగా నడవసాగారు. ఆవిధంగా లోయలో కొంచెం దూరం నడచిన తర్వాత హఠాత్తుగా సైనికుల్లో కలకలం మొదలయింది. ఆ వెనువెంటనే పంక్తులు చిందర వందరయ్యాయి. సైనికులు భయాందోళనలతో ఎటుపడితే అటు పరుగెత్తసాగారు.

దైవప్రవక్త (సల్లం) లోయ కుడివైపున నిలబడి ఉన్నారు. పర్వతసానువుల నుండి బాణాలు వచ్చి పడుతుంటే సైనికులు ప్రాణభీతితో పారిపోతున్నారు.

“సైనికులారా! ఎటు పరుగెత్తుతున్నారు మీరు? ఇదిగో ఇటు చూడండి. నేను దైవప్రవక్తను; అబ్దుల్లా కుమారుడు ముహమ్మద్‌ని. నావైపు రండి” అంటూ దైవప్రవక్త (సల్లం) సైనికుల్ని బిగ్గరగా పిలుస్తున్నారు.

కాని భయంకరమైన ఆ క్లిష్ట పరిస్థితిలో, ఆ గందరగోళంలో ఆయన పిలుపు ఎవరు వింటారు? పైనుంచి నిరంతరాయంగా బాణాలు వడగండ్లులా వచ్చిపడుతుంటే ముస్లిం యోధులు భీతావహులయి పరుగులు పెడుతున్నారు. పర్వత సానువులపై, కొండగుహల్లో నక్కిన హవాజిన్ తెగ సైనికులు క్రిందికి దిగివచ్చి ముస్లిం సైనికులపై బాణాలతో దాడిచేయడం మొదలెట్టారు.

ఖురైష్ ప్రజల్లో చాలామంది ఈ మధ్యనే ఇస్లాం స్వీకరించడం వల్ల దాని ఔన్నత్యం ఏమిటో వారింకా తెలుసుకోలేకపోయారు. సమరసొత్తు లభిస్తుందన్న ఆశతో మాత్రమే వచ్చారు. అలాంటివారే ఈ హఠాత్పరిణామానికి బిత్తరపోయి పారిపోసాగారు.

ముస్లింలకు అది కఠిన పరీక్షా సమయం. ముహాజిర్, అన్సార్ ముస్లింలు మాత్రం దైవప్రవక్త (స)ను ప్రాణం కన్నా మిన్నగా చూసుకుంటూ, కంటికి రెప్పలా కాపాడుకుంటూ శత్రువులతో వీరోచితంగా పోరాడుతున్నారు.

దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞ ప్రకారం హజ్రత్ అబ్బాస్ (రజి) గట్టిగా కేకలేస్తూ “ప్రవక్త అనుచరులారా! ఎక్కడున్నారు మీరు? ముహమ్మద్ (స) ఇంకా మన మధ్య సజీవంగానే ఉన్నారు, ఇటు వచ్చేయండి” అంటూ పిలిచారు.

హజ్రత్ అబ్బాస్ (రజి) కంఠస్వరం యావత్తు లోయలో ప్రతిధ్వనించింది. దాంతో పారిపోతున్న ముస్లింయోధులు క్షణాల్లో దైవప్రవక్త (సల్లం) వద్దకు చేరుకున్నారు. భయాందోళనలు దూరమయ్యాయి. వారి హృదయాల్లో నూతనుత్తేజం జనించింది. యుద్ధ వ్యూహం కొత్త పుంతలు తొక్కింది. పరిస్థితి స్వరూపం మారిపోయింది.

ముస్లింలు ఇప్పుడు స్థిరంగా నిలబడి ధైర్యంగా శత్రువుల్ని ఎదుర్కొంటూ వారిని చీల్చిచెండాటం ప్రారంభించారు. ఈ పరిణామం చూసి శత్రువులు కొన్ని క్షణాలు నిర్ఘాంతపోయారు. అయితే వారు ఆశ్చర్యం నుంచి తేరుకోక ముందే అనేకమంది తలలు ఎగిరిపోయాయి. హాహాకారాలు మిన్నుముట్టాయి. అనేక మంది శత్రువులు ముజాహిద్‌ల



ధాటికి నిలువలేక కాలికి బుద్ధి చెప్పారు. వారి సేనాపతి మాలిక్ బిన్ ఔఫ్ కూడా కాస్సేపు పెనుగులాడి తాయిఫ్‌కు పారిపోయాడు.

ఈవిధంగా అంతిమవిజయం ముస్లింలకే లభించింది. శత్రుపక్షంలో దాదాపు డెబ్భయి మంది హతమయ్యారు. ముస్లింలలో ఆర్గురు మాత్రమే అమరగతులయ్యారు.

## మహిళా ఖైదీలు-(140)

హునైన్ లోయలో శత్రువులకు చెందిన అనేక వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. ఒంటెలు, మేకలు అటూ ఇటూ విస్తరించి గడ్డిపరకలు మేస్తున్నాయి. యుద్ధ ఖైదీలుగా మారిన మహిళలు, పిల్లలు అక్కడక్కడ గుంపులు గుంపులుగా చేరి నిరాశా నిస్పృహలతో బిక్కుబిక్కుమంటూ కూర్చున్నారు.

కాస్సేపటికి వారిలో ఒక స్త్రీ దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వచ్చి “దైవప్రవక్తా! నేను మీ క్షీరసంబంధ సోదరి షీమా బిన్తె హారిస్‌ని” అన్నది.

దైవప్రవక్త (సల్లం) ఆమె వైపు ఆశ్చర్యంగా చూడసాగారు.

“మీకు గుర్తుందో లేదో, చిన్నప్పుడు మీరు నా వీపు కొరికారు. ఆ మచ్చ ఇప్పటికీ నా వీపు మీద ఉంది, చూడండి” అంటూ ఆ మహిళ బట్ట తొలిగించి కొరుకుడు మచ్చ చూపించింది దైవప్రవక్త (స)కు.

దైవప్రవక్త (సల్లం) ఆ మచ్చ చూసి క్షణంపాటు మ్రాన్పడిపోయారు. ఆయన కళ్ళు అప్రయత్నంగా అశ్రుపూరితాలయ్యాయి. వెంటనే ఆయన తన తువాలు తీసి నేల మీద పరుస్తూ “అక్కయ్యా! రా. కూర్చో” అన్నారు ఎంతో ప్రేమాభిమానాలతో.

ఆ స్త్రీ నిస్సంకోచంగా తువాలు మీద కూర్చున్నది. దైవప్రవక్త (సల్లం)కు చిన్ననాటి స్మృతులు గుర్తుకొచ్చాయి. కాస్సేపు ఆయన షీమాతో ప్రేమగా ముచ్చటించారు.

తరువాత ఆయన ఆమెకు కొన్ని మేకలు ఇస్తున్నట్లు చెప్పి “నీకిష్టమయితే నువ్వు నాతోపాటు మదీనాకు వచ్చి ఉండవచ్చు; లేదా మీ ఊరు వెళ్తానంటే అక్కడికి పంపే ఏర్పాటు చేస్తాను” అన్నారు.

కాని షీమా తన సొంతూరికి తన తెగవాళ్ళ దగ్గరికి వెళ్ళడానికే ఇష్టపడింది. ఆమె ఇష్ట ప్రకారమే దైవప్రవక్త (స) ఆమెను విడుదలచేసి గౌరవప్రదంగా పంపివేశారు.

మరి కాస్సేపటికి ఒక మహిళా ఖైది కంగారుపడుతూ అటూఇటూ తిరగ సాగింది. ఖైదీలలో కొందరు పసిపిల్లలు కూడా ఉన్నారు. ఆ స్త్రీ కన్పించిన ప్రతి పసిపిల్లవాడ్నీ ఎత్తుకొని గుండెలకు హత్తుకొని ముద్దాడటం ప్రారంభించింది. చివరికి ఓ చంటి పిల్లవాడ్ని ఎత్తుకొని నాలుగైదు సార్లు గుండెలకు హత్తుకొని ముద్దాడింది. తరువాత ఆ పిల్లవాడికి స్తన్యమిచ్చి సంతోషాతిశయంతో పరవశించిపోసాగింది.

దైవప్రవక్త (స) తన అనుచరులకు ఆ దృశ్యాన్ని చూపిస్తూ “ఈ స్త్రీ తన పిల్లవాడ్ని తన చేజేతులా అగ్నిమంటలో విసిరేయడానికి సిద్ధమవుతుందా, చెప్పండి” అన్నారు.

“లేదు దైవప్రవక్తా! “అలా ఎన్నటికీ చేయదు. అగ్నిమంటలో విసరేయడం అలాఉంచి, నిప్పులో పడుతుంటే ఆమె తక్షణమే పిల్లవాడ్ని కాపాడుకోవడానికే ప్రయత్నిస్తుంది” అని అన్నారు అనుచరులు.

“దేవుడు తన దాసులపై కనబరిచే దయ, జాలి, ప్రేమాభిమానాలు ఈ స్త్రీ తన బిడ్డపై కరబరిచే దయ, జాలి, ప్రేమాభిమానాల కన్నా ఎంతో ఎక్కువగా ఉంటాయి” అని తెలియజేశారు దైవప్రవక్త (సల్లం).

ఈ యుద్ధంలో ముస్లింలకు అపారమైన సమరసొత్తు లభించింది. ఆరువేల మంది ఖైదీలతో పాటు ఇరవై నాలుగు వేల ఒంటెలు, నలభై వేల మేకలు, పెద్దఎత్తున వెండి వస్తువులు లభించాయి. వీటన్నిటిని జీరాన ప్రదేశానికి తరలించి అక్కడ కొంత మందిని కాపలా ఉండమని దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞాపించారు. ఖైదీల కోసం శిబిరాలు వేయమని, దుప్పట్లులేని ఖైదీలకు దుప్పట్లు సరఫరా చేయమని కూడా ఉత్తర్వు జారీచేశారు.

హవాజిన్ తెగవాళ్ళు ముస్లింల చేతిలో చావుదెబ్బ తినడంతో వారి మిత్రపక్షమైన సఖీఫ్ తెగ ప్రజలు తాయిఫ్‌కు పారిపోయారు. తాయిఫ్ పౌరులు వారి సానుభూతిపరులే.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) ముజాహిద్‌లను తీసుకొని సఖీఫ్ తెగవారుండే తాయెఫ్ నగరానికి బయలుదేరారు. అయితే ఈ సంగతి ముందే తెలుసుకున్న సఖీఫ్ తెగవాళ్ళు పటిష్ఠమైన తమ కోటలలో ప్రవేశించి తలుపులు మూసేసుకున్నారు. దుర్భేద్య మైన పట్టణ ముఖద్వారం కూడా మూసేశారు.

ముస్లిం యోధులు తాయెఫ్ పట్టణాన్ని ముట్టడించారు. ఈ ముట్టడి నెల రోజులు కొనసాగింది. కాని ముస్లింలు ఎంత ప్రయత్నించినా నగరంలోకి ప్రవేశించలేక పోయారు. శత్రువులు కూడా కోట బురుజుల పైనుండి బాణాలు వదలడం తప్ప బయటికి రావడానికి సాహసించలేక పోయారు.

చివరికి దైవప్రవక్త (సల్లం) యుద్ధం విరమించి తాయఫ్ నుండి బయలుదేరమని తన అనుచరుల్ని ఆదేశించారు. కాని యుద్ధం ముగియక ముందే మదీనా వెళ్ళిపోవలసి వస్తున్నందుకు అనేక మంది యోధులు ఎంతో బాధపడ్డారు. కొందరు యోధులు సఖీఫ్ ప్రజలను శపించమని అన్నారు. కాని దైవప్రవక్త (స) శపించకుండా వారిని రుజుమార్గం పైకి తీసుకురమ్మని దైవాన్ని ప్రార్థించారు.

## సమరసొత్తులో నవముస్లింల వాటా-(141)

ఆ తరువాత దైవప్రవక్త (స) తాయెఫ్ నుండి జీరానాకు బయలుదేరారు. హవాజిన్ తెగతో యుద్ధంచేసి గెలుచుకున్న సమరసొత్తు జీరానాలోనే ఉంది. అంచేత దైవప్రవక్త (స) జీరానాకు చేరుకోగానే ఈ సమరసొత్తును యోధులకు పంచడానికి పూనుకున్నారు.

ఈలోగా హవాజిన్ తెగ మనుషులు కొందరు దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి సంతోషంగా ఇస్లాం స్వీకరించారు. తరువాత వారు ఖైదీల విడుదలతో పాటు తమ సామగ్రి తిరిగిచ్చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.



“దైవప్రవక్తా! మమ్మల్ని కనికరించండి. ఖైదీలలో మీ బంధువులు కూడా ఉన్నారు. మాకు మీ ఔదార్యం పట్ల ఎంతో నమ్మకం ఉంది” అన్నారు వారు.

“అయితే మీరు స్త్రీలను, పిల్లలను తీసుకుంటారా లేక సామగ్రిని తీసుకుంటారా?” అని అడిగారు దైవప్రవక్త (సల్లం).

“దైవప్రవక్తా! మీరు మాకు ఈ రెండిటిలో ఏదో ఒకదాన్నే కోరుకొమ్మని చెబుతున్నారా? అయితే మాకు మా భార్యాపిల్లల్ని ఇచ్చేయండి. వాళ్ళను గురించే మాకు దిగులుగా ఉంది” అన్నారు హవాజిన్ తెగవాళ్ళు.

“ముత్తలిబ్ సంతతి భాగాన్ని అయితే నేను మీకు వాపసు చేయగలను. కాని ఇతరుల వాటాల విషయంలో వారిని అడిగి తెలుసుకోవలసి ఉంటుంది. దానికి మీరు ఓపని చెయ్యండి. నేను జుహర్ నమాజ్ ముగించగానే మీరు లేచి నాతో సిఫారసు చేయించుకోండి, నేను మీకు సిఫారసు చేస్తాను” అన్నారు దైవప్రవక్త (సల్లం).

దైవప్రవక్త (స) సూచనప్రకారమే ఆయన జుహర్ నమాజ్ కాగానే హవాజిన్ తెగవాళ్ళు లేచి నిలబడ్డారు. ఖైదీలను విడుదల చేయించమని దైవప్రవక్త (స)ను అభ్యర్థించారు. అప్పుడు దైవప్రవక్త (స) ఓ చిన్నప్రసంగం చేసి, తాను ముత్తలిబ్ సంతతి ప్రజల వాటలో వచ్చే యుద్ధఖైదీలను హవాజిన్ తెగవాళ్ళకు వాపసు చేస్తున్నట్లు ప్రకటించారు.

దైవప్రవక్త (సల్లం) ప్రసంగంతో ఉత్తేజితులయిన ముహాజిర్, అన్సార్ ముస్లింలు తమ తమ వాటాలకు వచ్చే ఖైదీలను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. కొన్ని తెగలు మాత్రం మౌనంగా ఉండిపోయాయి. అప్పుడు దైవప్రవక్త (స), ఈ విషయంలో ఎవరికైనా బాధగా ఉంటే అలాంటివారికి మరెప్పుడైనా ఖైదీలు లభించినప్పుడు ఒక ఖైదీకి బదులు ఆరుగులు ఖైదీలను ఇస్తామని వాగ్దానం చేశారు. ఈ వాగ్దానం విని ఆ తెగలు కూడా తమ ఖైదీలను హవాజిన్ తెగవాళ్ళకు తిరిగిచ్చేయడానికి అంగీకరించారు.

ఇలా ముస్లింలు కాస్సేపట్లోనే దాదాపు ఆరువేల మంది ఖైదీలను విడుదలచేశారు. ఆ తర్వాత హవాజిన్ తెగవాళ్ళు సంతోషంతో దైవప్రవక్త (స) దగ్గర సెలవు తీసుకొని తమ ప్రాంతానికి బయలుదేరారు. అప్పుడు వారితో దైవప్రవక్త (స) ఇలా అన్నారు:

“మాలిక్ దగ్గరకు వెళ్ళి, అతను నాదగ్గరకు వచ్చి ఇస్లాం స్వీకరిస్తే అతని భార్యా పిల్లల్ని వాపసుచేయడమే గాకుండా వంద ఒంటెలను కూడా ఇస్తానని చెప్పండి.”

అలాగే చెబుతామని హవాజిన్ తెగవాళ్ళు అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

ఆ తర్వాత దైవప్రవక్త (స) సమరసొత్తు నుంచి ప్రభుత్వధనాగారం కోసం అయిదో వంతు తీసి మిగిలిన సమరసొత్తును ముజాహిద్‌లకు పంచారు. కొత్తగా ఇస్లాం స్వీకరించిన వారిపట్ల ఆయన కాస్తఉదారంగా ప్రవర్తిస్తూ, వారికి రావలసినదాని కంటే కొంచెం ఎక్కువే ఇచ్చారు. ప్రభుత్వధనాగారం కోసం తీసిన వాటా నుంచి కూడా వారికి కొంత ఇచ్చివేశారు.

అయితే ఈ వైఖరి కొందరు అన్సార్ ముస్లింలకు నచ్చలేదు. సమరసొత్తు పంపిణిలో దైవప్రవక్త (స) ఖురైషీయుల పట్ల ఉదారంగా వ్యవహరించి, తమ పట్ల వివక్ష చూపారని

బాధపడ్డారు. మెల్లగా వారిలో గుసగుసలు ప్రారంభమయ్యాయి. కొందరయితే దైవప్రవక్త (సల్లం) తన తెగవాళ్ళతో కలసిపోయారని బాహాటంగానే అనేశారు.

హజ్రత్ సాద్ బిన్ ఉబాదా (రజి) ఈ విషయాన్ని దైవప్రవక్త (స)కు తెలియజేశారు. ఆయన పరిస్థితి గ్రహించి "అయితే సాద్! నువ్వెళ్ళి నీ తెగవాళ్ళను సమావేశపరచు. నేను వచ్చేస్తున్నాను" అని చెప్పారు.

దైవప్రవక్త (సల్లం) ఆదేశం ప్రకారం హజ్రత్ సాద్ (రజి) అన్సార్ యోధులను ఓ చోట సమావేశపరిచారు. అంతలో దైవప్రవక్త (సల్లం) వచ్చారు.

"అనుచరులారా! ఏమిటీ గుసగుసలు? ఏవిషయం గురించి ఆరోపణలు చేస్తున్నారు మీరు? ఒక్కసారి మీగతం గురించి ఆలోచించుకోండి. నేను మీదగ్గరికి వచ్చే ముందు మీరు మార్గవిహీనులుగా ఉండేవారు. నాద్వారా దేవుడు మీకు సన్మార్గం చూపించాడు. మీరు పేదలుగా ఉన్నప్పుడు దేవుడు నాద్వారా మీకు ఐశ్వర్యం ప్రసాదించాడు. మీరు అంతఃకలహాల్లో ఉన్నప్పుడు నాద్వారా దేవుడు మీలో ప్రేమాభిమానాలు కలిగించాడు. ఇవన్నీ వాస్తవాలు కావా?" అడిగారు ఆయన వారి కళ్ళలోకి సూటిగా చూస్తూ.

"వాస్తవమే దైవప్రవక్తా! వాస్తవమే. దేవుడు, ఆయన ప్రవక్త మాకెంతో మేలు చేశారు. వారి దయాదాక్షిణ్యాలు లేకపోతే మేమీ స్థితికి ఎదిగేవాళ్ళము కాము" అన్నారు అన్సార్ ముస్లింలు సిగ్గుతో తలలు దించుకుంటూ.

"కాదు. మీరావిధంగా అనడానికి బదులు, నీ తెగవాళ్ళు నిన్ను తిరస్కరించినప్పుడు మేము నీకు మద్దతు ఇచ్చామని ఎందుకు అనరు? నీ తెగవాళ్ళు నిన్ను బహిష్కరించి నప్పుడు మేము నిన్ను చేరదీసి ఆశ్రయమిచ్చామని ఎందుకు చెప్పరు మీరు? నువ్వు ఉత్త చేతులతో ఇక్కడికి వచ్చినపుడు మేము నీకు అన్ని విధాలా సౌకర్యాలు కల్పించి ఆదుకున్నామని నాకు మీరెందుకు గుర్తుచేయరు? ఇవన్నీ వాస్తవాలే. ఇందులో ఏమాత్రం అతిశయోక్తి లేదు. వీటిని నేను ఒప్పుకుంటున్నాను."

ఈ మాటలు వినగానగానే అన్సార్ ముస్లింలకు దుఃఖం పొర్లుకొచ్చింది.

"అన్సార్ మిత్రులారా! మీరు దేవుడు చేసిన మహోపకారాలు మరచిపోకండి. నేను కొత్తగా ఇస్లాంధర్మంలో చేరినవారికి అందులో దృఢమైన విశ్వాసంతో స్థిరంగా ఉండేందుకు, వారిని సంతోష పెట్టేందుకు కొన్ని ఒంటెలు, మేకలను అదనంగా ఇచ్చాను. మీ మంచితనం పట్ల నాకు పూర్తిగా నమ్మకం ఉంది. అందుకే మీకా విధంగా సమరసొత్తు ఇవ్వలేదు. ఈమాత్రానికే మీరిలా అయిపోతున్నారా?

"నా ప్రియ అనుచరులారా! ఇతరులు తమ ఇండ్లకు ఒంటెలు, మేకల్ని తీసికెళ్ళారు. కాని మీకు దేవుడు, ఆయన ప్రవక్త దక్కారు. ఇది మీకు సంతోషదాయకం కాదా? దైవసాక్షి! హిజ్రత్ గనక లేకపోయినట్లయితే మదీనాయే నా స్వస్థలమయ్యేది. అన్సారులే నాజాతి వాళ్ళయ్యేవారు. అన్సారులు ఒక వైపు, ఇతరులంతా ఒకవైపు ఉంటే నేను అన్సారుల పక్షానే ఉంటాను. దేవా! నా అనుచరులకు శాంతీసౌభాగ్యాలు ప్రసాదించు. వారిపై, వారి సంతానంపై నీ కరుణామృతం చిలికించు."



అన్సార్ ముస్లింలు ఈ ప్రసంగం విని తీవ్రమైన పశ్చాత్తాపంతో కుమిలి కుమిలి రోదించడం మొదలెట్టారు.

"వద్దు. మాకు దైవప్రవక్త (సల్లం) చాలు. ఇంకేమీ వద్దు. దైవప్రవక్తా! మాకింకేమీ వద్దు" అన్నారు వారు ఏకధాటిగా కన్నీరు కారుస్తూ.

ఈ విధంగా దైవప్రవక్త (సల్లం) ఈ వివాదాన్ని పరిష్కరించారు. కాస్సేపటికి హవాజిన్ తెగనాయకుడు మాలిక్ బిన్ ఔఫ్ వచ్చి ఇస్లాం స్వీకరించాడు. దైవప్రవక్త (సల్లం) అతనికి అతని భార్యాపిల్లల్ని వాపసుచేశారు. వాగ్దానం ప్రకారం వంద ఒంటెల్ని కూడా ఇచ్చారు. మాలిక్ బిన్ ఔఫ్ (రజి) హృదయం కృతజ్ఞతా భావంతో నిండిపోయింది.

"ఇంతకు పూర్వం దేవుడు మీకు అనేక సందర్భాలలో సహాయం చేసిఉన్నాడు. ఇటీవల జరిగిన హునైన్ యుద్ధంలో కూడా చేశాడు. ఆరోజు మీరు మీ సంఖ్యాబలం చూసుకొని విర్రవీగారు. కాని మీ సంఖ్యాబలం మీకు ఎలాంటి ప్రయోజనం కలిగించలేకపోయింది. ఎంతో విశాలమైన భూమి మీకు ఇరుకైపోయింది. మీరు వెన్నుజూపి పారిపోసాగారు.

"అప్పుడు దేవుడు తన ప్రవక్తకు, విశ్వాసులకు మనోనిబ్బరం ప్రసాదించాడు. మరోవైపు మీకు కన్పించని (దైవదూతల) సైన్యాన్ని కూడా దించి సత్యతిరస్కారుల్ని శిక్షించాడు. సత్యాన్ని తిరస్కరించేవారికి తగిన శాస్తి అదే. ఈ విధంగా సత్యతిరస్కారుల్ని శిక్షించిన తరువాత దేవుడు తాను తలచిన వారికి పశ్చాత్తాంచెందే సద్బుద్ధి కూడా ప్రసాదించాడు. దేవుడు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు." (ఖుర్ఆన్–9:25–27)

## కాబ్ బిన్ జహీర్, ఇక్రామాల ఇస్లాంస్వీకరణ-(142)

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) అనుచరుల్ని తీసుకొని మక్కాకు బయలుదేరారు. మక్కా చేరుకున్న తర్వాత అక్కడ ఉమ్రా ఆచారం పాటించారు. మక్కా ప్రజలకు ధర్మబోధ చేయడానికి హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి)ని అక్కడే ఉంచారు. ఆ తరువాత ఆయన ముజాహిద్‌లను తీసుకొని మదీనా బయలుదేరారు.

దైవప్రవక్త (సల్లం) మదీనా చేరుకున్న తరువాత కూడా అనేకమంది ఆయన దగ్గరకు ఇస్లాం స్వీకరించడానికి రాసాగారు. కాబ్ బిన్ జహీర్ అనే ఓ కవిపుంగవుడు దైవప్రవక్త (సల్లం) పేరు వింటేనే నఖశిఖ పర్యంతం మండిపడేవాడు. అతను దైవప్రవక (సల్లం)ను తూలనాడుతూ జనాన్ని రెచ్చగొట్టే గేయాలు రచించి ప్రచారం చేసేవాడు. అతని సోదరుడు బుజైర్ (రజి) కూడా ఒకప్పుడు దైవప్రవక్త (సల్లం)కు బద్ధవిరోధే. కాని అతను ఇస్లాం స్వీకరించడంతో దైవప్రవక్త (సల్లం) అతడ్ని క్షమించారు.

ఆ విషయాన్నే అతను కాబ్ ముందు ప్రస్తావిస్తూ "దైవప్రవక్త (సల్లం) దగ్గరికెళ్ళి క్షమాపణ చెప్పుకో. ఆయన నీ తప్పులన్నీ మన్నిస్తారు" అని సలహా ఇచ్చాడు.

"నిజమే. దైవప్రవక్త (స) విశాల హృదయంగల మనిషి. ఆయన ఎలాంటి తప్పు చేసినవాళ్ళనయినా క్షమిస్తార"ని భావించి కాబ్ వెంటనే మదీనా బయలుదేరాడు.

కాబ్ మదీనాలో ఓ ముస్లిం మిత్రుడ్ని కలుసుకొని తన ఉద్దేశ్యాన్ని తెలియజేశాడు. మరునాడు వారిద్దరూ మసీదుకు వెళ్ళారు. కాబ్ మారువేషంలో దైవప్రవక్త (స) ముందుకు వచ్చి నిలబడ్డాడు. "దైవప్రవక్తా! కాబ్ బిన్ జహీర్ మదీనా వచ్చి ఉన్నాడు. అతనిప్పుడు తన తప్పుల పట్ల పశ్చాత్తాపం చెందాడు. మిమ్మల్ని కలుసుకొని క్షమాపణ చెప్పుకోవాలను కుంటున్నాడు. అతని హృదయం ఇస్లాం వైపుకు మొగ్గింది. మరి నేనతడ్ని తీసుకువస్తే మీరతడ్ని క్షమిస్తారా?" అడిగాడు మారువేషంలో ఉన్న కాబ్.

"ఆ... తప్పకుండా క్షమిస్తాను" అన్నారు దైవప్రవక్త (స). "అయితే దైవప్రవక్తా! నేనే కాబ్ని" అన్నాడు కాబ్ తన వేషం తీసేస్తూ.

దైవప్రవక్త (స) అతడ్ని క్షమించారు. అతను దైవప్రవక్త (స) క్షమాగుణానికి ఎంతో ప్రభావితుడై తక్షణమే ఇస్లాం స్వీకరించాడు. తరువాత ఆయన దైవప్రవక్త (స) ఔన్నత్యాన్ని, ఔదార్యాన్ని కొనియాడుతూ ఓ కవితాగానం కూడా చేశాడు.

మక్కావిజయం తర్వాత అబూజహల్ కొడుకు ఇక్రమా జిద్దా పారిపోయి, అక్కడ్నుంచి ఓడలో అబిసీనియా దారిపట్టాడు. రేవు నుంచి ఓడ బయలుదేరిన తరువాత ముఖానికి పట్టిన చెమట తుడుచుకొని 'అమ్మయ్యా!' అంటూ తృప్తిగా గాలి పీల్చుకున్నాడు.

ప్రయాణీకులతో కిటకిటలాడుతున్న ఆ ఓడ పిల్లగాలికి మెల్లగా ఊగుతో ముందుకు సాగిపోతోంది. నడి సముద్రంలోకి పోయిన తరువాత ఆ పిల్లగాలి కాస్తా పెద్దగాలయి పోయింది. మరి కాస్సేపటికి అది ఉధృతమయి తుఫానులా మారింది. ఓడ తుఫాను తాకిడికి తూగుటుయ్యాలలా ఎడాపెడా ఊగసాగింది.

దాంతో ప్రయాణీకులు భయపడిపోయారు. తుఫాను మరింత ఉధృతం కావడంతో ఓడ మునిగిపోయే ప్రమాదం ఏర్పడింది. ప్రయాణీకులు ఏడ్పులు, పెడబొబ్బలు పెడుతూ తమతమ ఇష్టదేవతల్ని మొరపెట్టుకోవడం మొదలెట్టారు. కాని తుఫాను ఏమాత్రం తగ్గ లేదు. అది మరింత భీకరంగా తయారై ఓడను ఎత్తి కుదేస్తూ ముంచివేసే స్థితికి చేరుకుంది. ప్రయాణీకులు మరింత భయంతో రోదిస్తూ ఇష్టదేవతలను వేడుకుంటున్నారు.

అప్పుడు కొందరు అనుభవశాలురు లేచి "ఇది సృష్టికర్త, సర్వేశ్వరుడయిన దేవుడ్ని తప్ప మరెవరినీ వేడుకునే సమయం కాదు. ఆయన మాత్రమే తలచుకుంటే మనం ఈ ఆపద నుండి బయటపడగలం" అన్నారు.

ఈ మాటలు వినగానే ఇక్రమా కళ్ళపై వున్న అజ్ఞానపొరలు తొలగిపోయాయి.

"ఏమిటీ!? ఇక్కడ దేవుడు తప్ప మరెవరూ సహాయం చేసేవారు లేరా? మరి ఈ విషయాన్నే కదా ఆ పుణ్యాత్ముడు ఇరవయి ఏండ్ల నుంచి చెబుతూ వస్తున్నది. మనం అనవసరంగా ఆయనతో పోరాడుతున్నాం" అని అతను మనసులో అనుకున్నాడు.

ఆ తరువాత వెంటనే అతను "ఈ తుఫాను నుంచి క్షేమంగా బయటపడితే నేను నేరుగా ముహమ్మద్ మహనీయుని (సల్లం) దగ్గరకు పోయి ఆయన చేతిలో చేయి వేసి కలుపుతాను" అని గట్టిగా నిర్ణయించుకున్నాడు.



తుఫాను మెల్లగా తగ్గుముఖం పట్టింది. ఓడ వడిదుడుకులు లేకుండా సవ్యంగా ముందుకు సాగింది. కాస్సేపటికి తుఫాను పూర్తిగా తగ్గిపోయింది. ఓడ అబిసీనియా రేవుకు చేరుకుంది. ప్రయాణీకులు దైవానికి కృతజ్ఞతలు చెప్పి దిగిపోయారు.

ఇక్రమా హృదయం కూడా దేవుని పట్ల కృతజ్ఞతా భావంతో నిండిపోయింది. కొన్నాళ్ళ తరువాత అతను ఓడలో జిద్దాకు తిరిగొచ్చి, అక్కడ్నుంచి నేరుగా మదీనా చేరుకున్నాడు. మదీనా చేరుకొని సరాసరి మసీదుకు వెళ్ళాడు.

మసీదులో దైవప్రవక్త (సల్లం) ఇక్రమాను చూడగానే "ఇక్రమా! స్వాగతం, నీ రాక శుభప్రదం!!" అన్నారు సంతోషం వ్యక్తపరుస్తూ.

ఆ తర్వాత ఇక్రమా బిన్ అబూజహల్ సద్వచనం పఠించి ముస్లింగా మారిపోయాడు. ఆయన ఇస్లాంస్వీకార ప్రకటన చేయగానే తోటి ముస్లింలు పరమ సంతోషంతో 'అల్లాహు అక్బర్" అంటూ నినదించారు బిగ్గరగా.

## అద్దీ బిన్ హాతిం తాయి-(143)

దైవప్రవక్త (సల్లం) ప్రజలకు ధర్మబోధ చెయ్యడంలో నిమగ్నులై ఉన్నప్పటికీ, సత్యతిరస్కారుల చర్యల్ని ఓ కంట కనిపెడుతూనే ఉన్నారు.

ఓసారి ముస్లింలు "తై" తెగవారితో పోరాడవలసి వచ్చింది. ఆ పోరాటంలో తై తెగ ఓడిపోయింది. ఆ తెగనాయకుడు అద్దీ బిన్ హాతింతై ఇస్లాంకు బద్ధవిరోధి. కాని అతను ముస్లింలను ఎదుర్కోలేక భార్యాపిల్లల్ని తీసుకొని సిరియాకు పారిపోయాడు. ముస్లింలు విజయానందంతో సమరసొత్తును, యుద్ధ ఖైదీలను తీసుకొని మదీనా తిరిగొచ్చారు.

ఈ యుద్ధఖైదీలలో అద్దీ బిన్ హాతిం సోదరి సఫ్ఫానా కూడా ఉంది. ఖైదీలను విడిచిపెట్టాలో లేక ముజాహిద్లకు పంచాలో ఇంకా నిర్ణయం తీసుకోలేదు. అలాంటి పరిస్థితిలో అటుగా దైవప్రవక్త (సల్లం) రావడం చూసి సఫ్ఫానా ఇలా అన్నది:

"దైవప్రవక్తా! దయజూపండి. తండ్రి చనిపోయాడు. సోదరుడు పారిపోయాడు. ఈ దీనురాలిని కనికరించండి."

దైవప్రవక్త (స) వెనక్కి తిరిగి చూసి "ఎవరూ నీ సోదరుడు?" అని అడిగారు.

"అద్దీ బిన్ హాతిం" అన్నది ఆమె. "అతనా! అతను దైవవిరోధి, దైవప్రవక్త విద్వేషి!!" అంటూ దైవప్రవక్త (స) ముందుకు సాగారు.

సఫ్ఫానా నిరాశచెందకుండా మళ్ళీ విన్నవించుకుంది. దైవప్రవక్త (సల్లం) ఆమెను మన్నించి విడుదల చేశారు. పైగా ఎంతో పైకాన్ని కూడా ఇచ్చి ఆమెను సిరియా పంపివేశారు.

సఫ్ఫానా సిరియా వెళ్ళి సోదరుడికి తానెలా బయటపడగలిగిందో వివరంగా చెప్పింది. దైవప్రవక్త (సల్లం) నిజాయితి, దాతృత్వాలను గురించి అతని ముందు ప్రశంసించింది. అద్దీ దైవప్రవక్త (సల్లం) సచ్ఛీలం సంగతి విని ఎంతో ఆశ్చర్యపోయాడు.

"అయితే ఆయన్ని గురించి నీ అభిప్రాయం ఏమిటీ?" ప్రశ్నించాడు అద్దీ

“నా అభిప్రాయం- నువ్వు వెంటనే ఆయన దగ్గరికి వెళ్ళిరా. ఆయన నిజంగా దైవ ప్రవక్తే అయితే నీలాంటివాడ్ని ఆదరించడానికి వెనకాడడని నాకు నమ్మకం ఉంది. ఒకవేళ ఆయన చక్రవర్తి అయితే ఆయన దగ్గర నీకు విలువ ఉండక పోదు” అన్నదామె.

ఈ మాటలు విన్న తరువాత అద్దీ మరునాడు మదీనా బయలుదేరాడు. అతను తాను మదీనా వస్తున్నట్లు ముందే దైవప్రవక్త (సల్లం)కు కబురు చేయడంగాని, తనకు రాజకీయ ఆశ్రయం కల్పించమని అడగడంగాని చేయలేదు.

అయితే “దేవుడు అద్దీ బిన్ హాతిం చేతిని నా చేతిలోకి ఇస్తాడు” అని దైవప్రవక్త (స) తన సహచరులతో అన్నట్లు అద్దీకి సమాచారం అందింది. ఈ సంగతి కూడా అతడ్ని ప్రభావితం చేసి ఉండవచ్చు. అద్దీ మదీనా చేరుకున్నాడు. అప్పుడు దైవప్రవక్త (స) అనుచరులతో కలసి మసీదులో కూర్చున్నారు. అద్దీ మసీదులో ప్రవేశించి సలాం చేశాడు.

“ఎవరు నాయనా నువ్వు?” అడిగారు దైవప్రవక్త (స) ప్రశాంత వదనంతో.

“నేను అద్దీ నండీ! హాతిం తై కొడుకుని” చెప్పాడు అద్దీ.

“అద్దీ అంటే నువ్వేనా!” అంటూ దైవప్రవక్త (సల్లం) లేచి అద్దీ చేతిని తన చేతిలోకి తీసుకొని అతడ్ని ఇంటికి పిలుచుకెళ్ళారు.

దారిలో ఓ ముసలమ్మ దైవప్రవక్త (సల్లం)ను ఆపి తన పరిస్థితి గురించి విన్నవించు కోసాగింది. ఆమె వెంట ఓ పసిబాలుడు కూడా ఉన్నాడు. ఆమె చెబుతున్న మాటలు దైవప్రవక్త (సల్లం) ఎంతో ఓపిగ్గా వింటుంటే అద్దీకి చాలా ఆశ్చర్యం వేసింది.

“ఓ సాధారణ స్త్రీ చెబుతున్న మాటలు ఎంతో సేపటి నుంచి అంత ఓపిగ్గా వింటున్నా డంటే ఈయన చక్రవర్తి ఎంతమాత్రం కాలేడు” అద్దీ అంతరాత్మ ఘోషించింది.

దైవప్రవక్త (స) వృద్ధురాలితో మాట్లాడాక అద్దీని వెంటబెట్టుకొని ఇంటికి వెళ్ళారు.

“అద్దీ! ఈదిండు మీద కూర్చో” అన్నారు దైవప్రవక్త (స) ఖర్జూరపుపీచుతో నిండిన ఒక దిండును చూపిస్తూ. తాను మాత్రం మరో దిండు లేనందున నేలపైనే కూర్చున్నారు.

కాని దైవప్రవక్త (సల్లం) నేల మీద కూర్చుంటే తాను దిండు మీద కూర్చోవడం అమర్యాదగా ఉంటుందని తలచి అద్దీ దిండు మీద కూర్చోవడానికి తటపటాయించాడు.

“దిండు మీద మీరే కూర్చోండి” అన్నాడు అద్దీ సిగ్గుపడిపోతూ.

“అదేం కుదరదు. మీరే దిండు మీద కూర్చోవాలి” అన్నారు దైవప్రవక్త (సల్లం)

అప్పుడు అద్దీకి దిండు మీద కూర్చోక తప్పలేదు.

“ఈయన చక్రవర్తి కానే కాడు. చక్రవర్తి అయితే ఇలా ప్రవర్తించడు” అనుకున్నాడు అతను మనసులో దిండు మీద కూర్చొంటూ.

“అద్దీ ఇప్పుడు చెప్పు నీ పరిస్థితి ఏమిటో. నువ్వు ‘రకూసి’వి కదూ? క్రైస్తవానికి, సాబియానికి మధ్య ఉండే మతాన్ని అవలంబించావు కదూ?” అడిగారు దైవప్రవక్త (స).



“ఔను మహాశయా! నేను ‘రకూసి’నే” అన్నాడు అద్దీ.

“నువ్వు నీ జాతిప్రజల నుంచి సమరసొత్తులోని నాల్గవ భాగం వసూలు చేసేవాడివి కదూ? నువ్వు అవలంబించిన మతంలో ధర్మసమ్మతంకాని ధనాన్ని నువ్వు తీసుకునే వాడివి, ఔనా?” ప్రశ్నించారు దైవప్రవక్త (సల్లం) మళ్ళీ.

ఈ మాటలు విన్న తరువాత అద్దీకి ముహమ్మద్ మహనీయులు (సల్లం) తప్పకుండా దైవప్రవక్తే అయిఉంటారని నమ్మకం కుదిరింది. అందువల్ల అతను నిజాన్ని అంగీకరిస్తూ “ఔనండీ! నేనీ విధంగానే చేస్తున్నాను” అన్నాడు.

“అద్దీ! ముస్లింలు ఈరోజు పేదవాళ్ళుగా ఉన్నారనుకొని నువ్ ఇస్లాం స్వీకరించడానికి వెనకాడుతున్నావు. కాని గుర్తుంచుకో, ముస్లింలు సిరిసంపదలతో తులతూగే రోజు ఎంతో దూరంలేదు. ఆనాడు వీరు దానధర్మాలు చేసినా వాటిని తీసుకునేవాళ్ళే ఉండరు.

లేదా ఈరోజు ముస్లింలు తక్కువ సంఖ్యలో ఉన్నారని తలచి నువ్వు ఇస్లాంని ఆశ్రయించడానికి సిద్ధంగా లేవనుకుంటా. కాని హజ్‌యాత్ర కోసం ఖాదిసియా నుండి ఒక స్త్రీ ఒంటరిగా ఒంటె మీద బయలుదేరి, దారిలో దైవభయం తప్ప మరెవరి భయం లేకుండా ప్రయాణం చేస్తోందన్న వార్త నువ్వు త్వరలోనే వింటావు.

లేదా ఈనాడు ముస్లింలకు రాజ్యాధికారం లేనందున నీకీ ధర్మం స్వీకరించడం ఇష్టం లేదు కాబోలు. కాని గుర్తుంచుకో. బాబిల్ శ్వేతవీధులను ముస్లింలు జయించారని, (ఈరాన్ చక్రవర్తి) కిస్రా ధనాగారాలు ముస్లింల స్వాధీనమయ్యాయని నువ్వు త్వరలోనే వింటావు” అన్నారు దైవప్రవక్త (స) భవిష్యత్తులో జరగనున్న సంఘటనల్ని వివరిస్తూ.✦

“ఏమిటీ! కిస్రా ఇబ్నె హర్మ్యాజ్ ధనాగారాలే!!” అన్నాడు అద్దీ ఆశ్చర్యపోయి చూస్తూ.

“ఔనౌను. కిస్రా ఇబ్నెహర్మ్యాజ్ ధనాగారాలే” అన్నారు దైవప్రవక్త (సల్లం).

ఈ మాటలన్నీ విన్న తరువాత అద్దీ కళ్ళ ముందున్న అపోహలు తొలగిపోయాయి; అజ్ఞానపు కారుచీకట్లు మటుమాయమైపోయాయి. ఇక ఉండబట్టలేక అప్పటికప్పుడు అతను ఇస్లాం స్వీకరించి దైవసిపాయీలలో చేరిపోయాడు.

ఒకరోజు హజ్రత్ అద్దీ బిన్ హాతిం (రజి) ఖుర్ఆన్‌లోని ఒక సూక్తి (9:31)ని గురించి దైవప్రవక్త (సల్లం) ముందు ప్రస్తావిస్తూ ఇలా అడిగారు:

“దైవప్రవక్తా! ఈసూక్తిలో మేము మా ధర్మవేత్తలను, సాధువులను దేవుళ్ళుగా చేసు కున్నామనే అభియోగం మామీద మోపబడింది. (దీని గూఢార్థం ఏమిటీ?).”

“వారు నిషేధించినవాటిని మీరు నిషేధితాలుగా, వారు ధర్మసమ్మతం చేసిన వాటిని మీరు ధర్మసమ్మతమైనవిగా అంగీకరించడం లేదా?” అన్నారు దైవప్రవక్త (స).

“నిజమే, మేము అలాగే చేస్తున్నాం” చెప్పారు హజ్రత్ అద్దీ బిన్ హాతిం (రజి).

“వారిని దేవుళ్ళుగా ప్రభువులుగా ఆరాధించడమంటే ఇదే”అన్నారు దైవప్రవక్త (స).

ఆ తరువాత హజ్రత్ అద్దీ (రజి) సెలవు తీసుకొని అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

# కవితా పోటీలో బనీతమీం తెగవాళ్ళు-(144)

దైవప్రవక్త (సల్లం) ప్రతినిధులు దేశమంతటా వ్యాపించి తమతమ విధులు నిర్వహించడంలో నిమగ్నులైపోయారు. కొందరు జకాత్, ఉషర్‌లను వసూలుచేసేవారు. మరికొందరు వాటిని పేదలకు, అగత్యపరులకు పంపిణీ చేసేవారు. అనేక తెగలు ఇస్లాం స్వీకరించినప్పటికీ కొన్ని తెగలు ఇంకా తమ తాతముత్తాతల మతాన్నే అంటి పెట్టుకొని ఉన్నాయి. ముస్లింలు అలాంటి తెగలతో ఒప్పందం చేసుకొని వాటి నుండి జిజియా (భద్రతా రుసుం) వసూలుచేసేవారు.

ప్రవక్త ప్రతినిధులు జిజియా వసూలుచేయడానికి వెళ్ళినప్పుడు ఖుజాఅ తెగవాళ్ళు సంతోషంగా జిజియా ఇచ్చేశారు. కాని బనీ తమీమ్ తెగవాళ్ళు మాత్రం జిజియా ఇవ్వడానికి నిరాకరిస్తూ కత్తులు ఝుళిపించి ముస్లింలను కవ్వించారు. అప్పుడు ముస్లింలు యుద్ధం చెయ్యక తప్పలేదు. ఈ పోరాటంలో బనీతమీమ్ తెగవాళ్ళు దారుణంగా ఓడిపోయారు. ముస్లిం యోధులు ఆ తెగలో అనేకమందిని ఖైదీలుగా పట్టుకొని మదీనా తిరిగొచ్చారు.

కొన్నాళ్ళకు బనీతమీమ్ తెగకు చెందిన ఓ ప్రతినిధిబృందం యుద్ధఖైదీల విషయంలో దైవప్రవక్త (స)తో చర్చలు జరపడానికి మదీనా వచ్చింది. వారు నేరుగా దైవప్రవక్త (స) ఇంటికి వెళ్ళి సభ్యతాసంస్కారాలు లేకుండా బిగ్గరగా కేకలు పెడ్తూ పిలిచారు. దైవప్రవక్త (స) వాళ్ళ అనాగరిక ప్రవర్తనకు విసుక్కోకుండా బయటికి వచ్చారు.

అందరూ ఒక చోట సమావేశమయ్యారు. దైవప్రవక్త (సల్లం)తో పాటు కొందరు అనుచరులు కూడా పాల్గొన్నారు.

బనీతమీమ్ ప్రతినిధి వర్గం నుండి ఉతారిద్ అనే వ్యక్తి లేచి నిలబడ్డాడు. అతను అసాధారణ వాగ్ధాటితో ప్రసంగిస్తూ తమ తాతముత్తాతలు చేసిన ఘనకార్యాలను గురించి గొప్పలు చెప్పుకున్నాడు. వారి వీరగాథలు విన్పించి, అలాంటి తమ జాతికి సరితూగగల వీరులు ఎవరైనా ఉన్నారా మీలో అని ముస్లింలకు సవాలు విసిరాడు.

ఉతారిద్ ఉపన్యాసం జోరుగా సాగిపోతోంది. అతని సహచరుల్లో విజయగర్వం తొంగిచూస్తోంది. ఉతారిద్ ప్రసంగం ముగిసిన తరువాత దైవప్రవక్త (సల్లం) హజ్రత్ సాబిర్ బిన్ ఖైస్ (రజి)కు సైగచేసి తగిన సమాధానం ఇవ్వమని ఆదేశించారు.

హజ్రత్ సాబిర్ (రజి) తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఉరుకులు, పరుగులతో ఉప్పొంగుతూ ప్రవహించే సెలయేరులా సాగిన ఆయన ప్రసంగం కొద్ది క్షణాల్లోనే సభికుల్ని అమితంగా ఆకట్టుకుంది. బనీతమీమ్ తెగవాళ్ళ ముఖాలు మాత్రం వాడిపోయాయి.

ఆ తరువాత వారు తమలోని సుప్రసిద్ధ కవి జబర్ ఖాన్‌ని నిలబెట్టారు. జబర్‌ఖాన్ బనీతమీమ్ గొప్పతనాన్ని, ఆ తెగ పూర్వీకులు చేసిన సాహసకృత్యాలను గురించి వర్ణించాడు. ఆ వర్ణనలో తన కవితా పాండిత్యాన్నంతటినీ జొప్పించాడు.

దైవప్రవక్త (స) అతనికి జవాబివ్వమని హజ్రత్ హస్సాన్ (రజి)ని పురమాయించారు. హజ్రత్ హస్సాన్ (రజి) అరేబియాలో ప్రఖ్యాత కవి. ఆయన లేచి నిలబడ్డారు. ఆయన



కంఠం నుండి కవితా మాధుర్యం జాలువారింది. మధురమైన పదజాలంతో ఆయన ఇస్లాం ఔన్నత్యాన్ని, ముస్లింల త్యాగాలను గురించి ప్రశంసించారు. ఆయన కవితా ప్రతిభతో శ్రోతలు మంత్రముగ్ధులయ్యారు.

సమావేశం ముగిసింది. కవిత్వంలోనూ ముస్లింలే గెలిచారు.

“ఇక కవుల విషయానికొస్తే, వారి వెనుక మార్గభ్రష్టులు మాత్రమే నడుస్తారు. వారు తాము చేయనివాటిని గురించి మాట్లాడుతూ (దారీతెన్నూ లేకుండా) ఊహాలోకంలో తిరగడాన్ని నీవు చూడటం లేదా? అయితే సత్యాన్ని విశ్వసించి సదాచారులైన కవులు మాత్రం అలాంటి వారు కాదు. వారు దేవుణ్ని అత్యధికంగా స్మరిస్తారు. తమపై దౌర్జన్యం జరిగితే వారు ఆ మేరకే బదులు తీర్చుకుంటారు...” (ఖుర్‌ఆన్-26:224-227)

బనీతమీమ్ తెగవాళ్ళు అవమానభారంతో క్రుంగిపోయారు. మరొక సారి వారు పరస్పరం సమాలోచనలు జరుపుకున్నారు. “అరే! వాళ్ళతో మనమెక్కడ పోటీపడగలం! వారి పక్షాన దేవుని సహాయం ఉంది” అన్నాడు వారిలో ఒకడు.

“నిజం, నిజం. లేకపోతే వారి ప్రసంగంలో, కవిత్వంలో అంత గాంభీర్యం, మాధుర్యం ఎలా వస్తాయి?” అన్నాడు మరొకడు. “అది సరేగాని, మీరు ముహమ్మద్ (స)ని గమనించారా? అతని సౌశీల్యం, సద్వర్తనలను పరిశీలించారా?” అడిగాడు వేరొకడు.

“గమనించకేం? అబ్బో! ఆయన సామాన్య మానవుడు కాదు. దైవదూతలా ఉన్నాడు. పదండి, ఆ మహనీయుని దగ్గరికి పోయి ఆయన బోధించే నూతనధర్మం స్వీకరిద్దాం” అన్నాడు ఇంకొకడు.

ఆ విధంగా అందరూ దైవప్రవక్త (సల్లం) సన్నిధికి పోయి ఇస్లాం స్వీకరించారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) పరమసంతోషంతో వారిని మనసారా దీవించి, వారి ఖైదీలను వారికి అప్పగించారు. పగ, విద్వేషాలతో వచ్చిన బనీతమీమ్ తెగవాళ్ళు శాంతీసంతోషాలతో తమ స్వస్థలాలకు తిరిగి వెళ్ళిపోయారు.

# తబూక్ దండయాత్రకు ధనత్యాగం-(145)

దాదాపు యావత్తు అరేబియా ముస్లింల అధీనంలోకి వచ్చింది. ఇస్లాం వ్యతిరేకశక్తుల బలం తగ్గిపోయింది. సర్వత్రా దైవధర్మమే ప్రకాశించసాగింది. అయితే ఇంకా ఇస్లామీయ రాజ్య సరిహద్దుల్ని పటిష్ఠం చేయవలసి ఉంది. అరేబియా ఉత్తర సరిహద్దులో ఉన్న సిరియా రోమన్ల అధీనంలో ఉన్నందున ఆ ప్రాంతపు సరిహద్దుల భద్రత కోసం మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. ఈ సమస్యను గురించి దైవప్రవక్త (సల్లం) నిరంతరం యోచిస్తూ ఉండేవారు. రోమ్ సైన్యాలు ఏ క్షణమయినా ఇస్లామీయ రాజ్యంపై దాడిచేసే ప్రమాదముందని ఆయనకు అనుమానంగా ఉంది.

ఈ అనుమానం కొన్నాళ్ళకే నిజమయ్యే సూచనలు కానవచ్చాయి. రోమన్లు మదీనాపై దాడిచెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారని సమాచారం అందింది. తక్షణమే ఆయన శక్తికల వారంతా యుద్ధానికి సిద్ధం కావలసిందిగా ప్రకటన చేశారు.

ఏదైనా దండయాత్రకు పోవలసివస్తే దైవప్రవక్త (స) సాధారణంగా ముజాహిద్‌లకు యుద్ధం చేయవలసిన ప్రాంతం పేరు ముందుగా చెప్పేవారు కాదు. అలాంటిది ఈసారి ఆయన ఆ ప్రాంతం పేరును, ప్రయాణదిశను ముందుగానే తెలియజేశారు. ఎందుకని?

ఈసారి ముజాహిద్‌లు సుదీర్ఘ ప్రయాణం చేయవలసి ఉంది. పైగా అది తీవ్రమైన ఎండాకాలం. పకడ్బందీగా భారీఎత్తున సన్నాహాలు చేయవలసిన అవసరముంది. అత్యధిక సైనికులు, ఆయుధాలు, వాహనాలను సమీకరించవలసి ఉంది. ఇన్ని కారణాల వల్ల దైవప్రవక్త (సల్లం) ఈసారి యుద్ధ పథకాన్ని రహస్యంగా ఉంచలేదు.

దైవప్రవక్త (సల్లం) ప్రకటన వినగానే ముస్లింలు యుద్ధసన్నాహాలు ప్రారంభించారు. ఈ భారీదండయాత్ర కోసం అపారమైన ఆయుధాలు, ఆహారపదార్థాలు కావాలి కనుక దైవప్రవక్త (సల్లం) ధన,కనక,వస్తు త్యాగాల కోసం ప్రజలను ప్రేరేపించారు.

దైవప్రవక్త (సల్లం) బోధతో ఉత్తేజితులైన ప్రజలు విశాలహృదయంతో భూరి విరాళాలు అందజెయ్యడం ప్రారంభించారు. కొందరు ధర్మసంస్థాపనా మార్గంలో తమ సర్వస్వం త్యాగం చెయ్యాలన్న వీరావేశంతో తమ శక్తికి మించిన విరాళాలు కూడా ఇచ్చారు.

హ్‌జ్రత్ ఉస్మాన్ (రజి) వేయి దీనార్‌ల విలువగల వస్తువుల్ని దైవప్రవక్త (సల్లం)కు అందజేశారు. ఆయన ధనికులైనప్పటికీ ఈ విరాళం ఆ కాలంలో అత్యధికమైనదే.

హ్‌జ్రత్ ఉమర్ (రజి) ధనత్యాగం విషయంలో అబూబకర్ (రజి)ని మించిపోవాలని నిర్ణయించుకొని తన యావదాస్తిలో అర్ధభాగం తీసుకొని వచ్చారు. దైవప్రవక్త (సల్లం) అది చూసి "భార్యాపిల్లల కోసం ఏమైనా మిగిల్చి పెట్టావా లేదా?" అని అడిగారు. దానికి హ్‌జ్రత్ ఉమర్ "వాళ్ళ కోసం సగం వదలిపెట్టాను" అన్నారు.

ఆ తరువాత హ్‌జ్రత్ అబూబకర్ (రజి) ఇంట్లో ఉన్నదంతా ఊడ్చి తెచ్చి ప్రవక్త (స) పాదాల చెంత పోశారు. ఈ అసాధారణ దాతృత్వం చూసి ఆయన అబ్బురపడ్డారు.

"అబూబకర్! ఉన్నదంతా తెచ్చినట్లుంది. మరి ఇంట్లో భార్యాపిల్లల కోసం ఏం వదలి పెట్టావు?" అని అడిగారు ఆయన.

"భార్యాపిల్లల కోసం దేవుడు, దైవప్రవక్త చాలు" అన్నారు అబూబకర్ (రజి).

ఇది ధనికుల పరిస్థితి. మరి మధ్యతరగతి ప్రజల పరిస్థితి ? వాళ్ళూ ఈ మహాకార్యం కోసం శక్తివంచనలేకుండా తమకున్న దాంట్లోనే అత్యధికంగా విరాళాలు అందజేశారు. పేదవాళ్ళు కూడా తమ సంపాదనలో అంతోఇంతో తెచ్చి విరాళాలగుట్టలో పెట్టేశారు.

పాపం అబూఖలీల్ (రజి) దగ్గర విరాళం ఇవ్వడానికి ఏమీ లేదు. ఆయన కూలినాలి చేసి బ్రతికే నిరుపేద శ్రమజీవి. ఒక్కోరోజు ఆ కూలిపని కూడా దొరికేదికాదు. అప్పుడాయన కుటుంబం పస్తులుండవలసి వచ్చేది.

అయితే దైవప్రవక్త (సల్లం) ప్రకటన వినగానే అబూఖలీల్ (రజి) ఓ తోట యజమాని దగ్గరికెళ్ళి చెట్లకు నీళ్ళు తోడిపోస్తానని చెబితే అతను ఒప్పుకున్నాడు. ఆరోజు అబూఖలీల్ (రజి) ఇషానమాజ్ తర్వాత తోటకెళ్ళి రాత్రి తెల్లవారేదాకా బావి నుంచి నీళ్ళు తోడారు.



ఇంత కష్టపడితే తోటయజమాని కూలి క్రింద ఆయనకు నాలుగు సేర్లు ఖర్జూర పండ్లు మాత్రమే ఇచ్చాడు. హ్‌జ్రత్ అబూఖలీల్ (రజి) వాటిని తీసుకొని సంతోషంగా ఇంటికి వచ్చారు.

ఆ ఖర్జూర పండ్లలో సగం భార్యాపిల్లల కోసం వదలిపెట్టి మిగతా సగం పండ్లు మూట కట్టుకొని ఆయన దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళారు. కాని జనం పెద్దపెద్ద విరాళాలు ఇస్తుంటే తాను ఈ చిన్న విరాళం ఇవ్వాల్సి వస్తున్నదే అని భావించి సిగ్గుపడి పోతున్నారు. అందువల్ల ఆయన ఓ క్షణం అటూ ఇటూ చూసి ఆ పండ్ల మూటను విరాళాల కుప్పలో ఎక్కడో అడుగు భాగాన పెట్టేశారు సిగ్గుపడుతూనే.

కాని దైవప్రవక్త (సల్లం) అది గమనించారు. వెంటనే ఆయన ఆ పండ్ల మూటను అక్కడ్నుంచి తీసి విరాళాల కుప్పలో అన్నిటికన్నా పైభాగాన పెట్టేశారు. అబూఖలీల్ (రజి) అది చూసి ఎంతో సంతోషించారు.

అపహాస్యం, కువిమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్న కపట విశ్వాసులు చిన్నచిన్న విరాళాలు ఇచ్చిన పేద ముస్లింలను ఎగతాళి చేయసాగారు.

"వీరు మనస్ఫూర్తిగా విశ్వాసులు చేస్తున్న ధన త్యాగాల్ని గురించి ఎత్తిపొడుస్తూ మాట్లాడుతున్నారు. కష్టపడి చెమటోడ్చి ఎంతోకొంత దైవమార్గంలో దానమిస్తున్న (నిరుపేద) విశ్వాసుల్ని ఎగతాళిచేస్తున్నారు. (అలా ఎకసక్కెం, ఎగతాళి చేస్తున్న ఈ పిసినారుల సంగతి దేవునికి బాగా తెలుసు.) అసలు దేవుడే వారిని ఎగతాళి చేస్తున్నాడు. వారికోసం దుర్భరమైన యాతన కాచుకొని ఉంది." (ఖుర్ఆన్–9:79)

కొందరు ముస్లింలు ఈ దండయాత్రకు కావలసిన ఏర్పాట్లన్నీ స్వయంగానే సిద్ధం చేసుకున్నారు. ఇంకాస్త శక్తి కల్గినవారు స్వంత ఏర్పాట్లు చేసుకోవడమేగాక, ఇతరుల కోసమని కొన్ని వస్తువుల్ని కూడా దైవప్రవక్త (సల్లం) ముందు ప్రవేశపెట్టారు.

పోతే పేదవాళ్ళు మాత్రం తమకు కావలసిన యుద్ధావసరాలను సమకూర్చుకోలేక పోయారు. వారు దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి తమ కోసం ఏదైనా ఏర్పాట్లు చేయమని మనవి చేసుకున్నారు. దైవప్రవక్త (సల్లం) అలా సాధ్యమైనంతవరకు అనేకమందికి ఏర్పాట్లు చేశారు. మిగిలినవారికి ఆయన తన అసహాయత వ్యక్తపరిచారు. ధర్మయుద్ధంలో పాల్గొనాలని ఎంతో ఉత్సాహంతో వచ్చిన వీరు, దైవప్రవక్త (సల్లం) తన అసహాయత వెలిబుచ్చడంతో ఢీలాపడి పోయారు. ధర్మయుద్ధం చేసే భాగ్యానికి తాము నోచుకోలేక పోతున్నామేనని కంటతడి పెట్టుకున్నారు. చివరికి క్రుంగిన హృదయాలతో, వాడిన ముఖాలతో వెనుదిరిగి పోయారు.

"అలాగే నీ దగ్గరకు వచ్చి వాహన సౌకర్యం కల్పించమని మనవి చేసుకున్నవారి విషయంలో కూడా ఎలాంటి ఆక్షేపణ లేదు. వారి విజ్ఞప్తికి సమాధానంగా "మీకు నేను వాహన సౌకర్యాలు కల్పించలేను" అన్నావు నీవు. అప్పుడు వారు గత్యంతరంలేక అశ్రుపూరిత నయనాలతో వెళ్ళి పోయారు. సొంత ఒనరులతో ధర్మపోరాటంలో పాల్గొనే భాగ్యం తమకు లేకపోయిందే అని వారు ఎంతగానో బాధపడ్డారు." (ఖుర్ఆన్–9:92)

ఇదీ దేవుడు, దైవప్రవక్త (సల్లం) పట్ల అపార ప్రేమాభిమానాలున్న అనుచరుల పరిస్థితి. కాని కపటుల వైఖరి దీనికి భిన్నంగా ఉంది. వీరు యుద్ధప్రకటన వినగానే నెత్తిమీద పిడుగు పడినట్లు నిలువుగుడ్లు వేశారు. వీరు స్వయంగా యుద్ధానికి బయలు దేరకపోగా బయలుదేరే వారిని కూడా ఆటంకపరచడానికి ప్రయత్నించారు.

## కపటుల యుద్ధ సాకులు-(146)

ఏమిటీ! ఇంత తీవ్రమయిన ఎండాకాలంలో యుద్ధానికి బయలుదేరుతున్నారా!! కాస్త ఆలోచించండి. పైన నిప్పులు కురిపించే సూర్యుడు; క్రింద చుర్రున కాలే ఇసుక నేల; ఆపై సుదీర్ఘప్రయాణం!! అమ్మోయ్! ఇలాంటి పరిస్థితిలో బయలుదేరితే ఇంకేమయినా ఉందా!! చీమల్లా మలమల మాడి చావరూ!!! అయినా ఒక వైపు పొలాల్లో పంటలు, తోటల్లో పండ్లు పండి కోతకు సిద్ధంగా ఉంటే ఈ ప్రయాణ సన్నాహాలు ఏమిటీ?'' అంటూ కపటవిశ్వాసులు ముజాహిద్‌లను అధైర్య పరచసాగారు.

"(తబూక్ యుద్ధానికి బయలుదేరకుండా) వెనకుండిపోయినవారు దైవప్రవక్తకు సహకరించకుండా ఇంట్లో కూర్చుండి పోయామనుకుంటూ తెగ సంబరపడ్డారు. దైవమార్గంలో ధనప్రాణాలొడ్డి పోరాడటం వారికి ఇష్టం లేకపోయింది. పైగా వారు ప్రజలతో "ఇంత తీవ్రమయిన వేసవి వేడిలో బయలుదేరకండి" అన్నారు. "నరకాగ్ని వేడి ఇంతకంటే తీవ్రంగా ఉంటుంద"ని చెప్పు. వారీ విషయం గ్రహిస్తే ఎంత బాగుంటుంది! ఇప్పుడు వారు (తమ నిర్వాకం పట్ల) నవ్వుకుంటే నవ్వుకోని. చివరకు వారు తమ దుష్కార్యాల ఫలితంగా పరలోకంలో హృదయ విదారకంగా రోదిస్తారు." (ఖుర్ఆన్-9:81,82)

పైకి ముస్లింలని చెప్పుకుంటున్న ఈ దుర్మార్గులు దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞను బహిరంగంగా త్రోసిపుచ్చలేక తప్పించుకునే మార్గాలు వెతికారు. దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి రకరకాల సాకులు చెప్పసాగారు.

"దైవప్రవక్తా! మాఇళ్ళు భద్రంగా లేవు. మమ్మల్ని యుద్ధం నుండి మినహాయించండి."; "మేము యుద్ధం చేయలేని స్థితిలో ఉన్నాం. మమ్మల్ని విడిచిపెట్టండి."; "మా భార్యాపిల్లలకు దిక్కెవరూ లేరు. మమ్మల్ని మదీనాలోనే ఉండనివ్వండి."

జుద్దా బిన్ ఖైస్ అనే కపటవిశ్వాసి వచ్చి "మహాశయా! నన్నిక్కడే ఉండి పోవడానికి అనుమతివ్వండి. రోమ్‌స్త్రీలు చాలా అందంగా ఉంటారు. వాళ్ళను చూస్తే నేను నిగ్రహించు కోలేను. అక్కడకు పంపి నన్ను అనవసరంగా మనోవికారానికి గురిచేయకండి" అన్నాడు.

"వారికి నిజంగా (యుద్ధానికి) బయలుదేరాలన్న ఉద్దేశ్యముంటే దానికోసం వారు తగిన సన్నాహాలు చేసుకునేవారు. కాని వారు బయలుదేరడం దేవునికి ఇష్టం లేదు. అందుకే ఆయన వారిని బద్ధకస్తులుగా చేశాడు. "(ఇంట్లో) కూర్చుండి పోయేవారితో పాటు మీరూ కూర్చోండి" అని వారికి చెప్పడం జరిగింది." (ఖుర్ఆన్-9:46)

"వారిలో ఒకడు "నాకు (ఇంట్లో ఉండిపోవడానికి) అనుమతివ్వండి. (అనవసరంగా) నన్ను మనోవికారానికి గురిచేయకండి" అంటాడు. విను, వారు మనోవికారంలోనే పడి వున్నారు. ఇలాంటి అవిశ్వాసులకు నరకం చుట్టిముట్టి ఉంది." (ఖుర్ఆన్-9:49)



ఇలా ఈ కపటులు లేనిపోని కారణాలు చూపించి యుద్ధానికి బయలుదేరకుండా మదీనాలోనే ఉండిపోయారు. అయితే వారిలో కొందరు తమ దుష్టపన్నాగాల ద్వారా ముజాహిద్‌ల ఐక్యతను దెబ్బతీయడానికి ఈ దండయాత్రలో పాల్గొన్నారు.

సువైలిం అనే ఓ యూదుని ఇల్లు కపటుల కార్యకలాపాలకు నిలయమయింది. ఇక్కడ కపటవిశ్వాసులు తరచుగా సమావేశమవుతూ రహస్య సమాలోచనలు జరుపుతారు. ముస్లింలకు వ్యతిరేకంగా పథకాలు రూపొందిస్తారు. దైవప్రవక్త (సల్లం)కు ఈ విషయం తెలిసింది. కపటులు విషం వెదజల్లుతూ ముస్లింలను యుద్ధానికి బయలుదేరనీకుండా నిరోధిస్తున్నారని కూడా ఆయనకు సమాచారం అందింది.

ఈ సమాచారం అందిన వెంటనే దైవప్రవక్త (స) సువైలిం ఇంటిని తగలబెట్టమని కొందరు అనుచరుల్ని పంపారు. వారు వెళ్ళి ఆ ఇంటికి నిప్పెట్టారు. క్షణాల్లో అగ్నిజ్వాలలు మింటికెగిశాయి. లోపల రహస్యంగా సమావేశమై చర్చలు జరుపుకుంటున్న కపటులంతా గుండెలు బాదుకుంటూ బయటికి పరుగెత్తారు. ఈ సంఘటనతో వారి కార్యకలాపాలు తాత్కాలికంగా ఆగిపోయాయి.

దైవప్రవక్త (సల్లం) ప్రకటన విని సుదూరప్రాంతాల నుండి కూడా ముజాహిద్‌లు మదీనా వచ్చారు. కొన్ని రోజుల్లోనే బ్రహ్మాండమైన సైన్యం తయారైంది. యుద్ధ సన్నాహాలు పూర్తయ్యాయి. హజ్రత్ అబూబకర్ (రజి) సర్వసేనానిగా నియమించబడ్డారు.

దాదాపు పురుషులంతా యుద్ధానికి వెళ్తున్నందున మదీనా పరిరక్షణ కోసం దైవప్రవక్త (సల్లం) హజ్రత్ ముహమ్మద్ బిన్ మస్లిమా (రజి)ని గవర్నర్‌గా నియమించారు. ఆయనకు సహాయంగా హజ్రత్ అలి (రజి)ని కూడా నియమించారు.

అబూఆమిర్ అనే ఒక క్రైస్తవ సాధువు ముస్లింలకు, బహుదైవారాధకులకు మధ్య జరిగిన అనేక యుద్ధాలలో ప్రముఖ పాత్ర వహించి దైవప్రవక్త (సల్లం)పై ప్రతీకారం తీర్చుకోవడానికి ప్రయత్నించాడు. కాని అరబ్ తెగలన్నీ ఏకమయినా ఇస్లాం అంతం కాకపోవడంతో అతను రోమ్ రాజ్యానికి వెళ్ళి రోమ్ చక్రవర్తి ముందు ఇస్లాం వల్ల కలిగే ప్రమాదం గురించి హెచ్చరించాడు.

అబూఆమిర్ సాగిస్తున్న ఇస్లాం వ్యతిరేక కార్యకలాపాలలో మదీనా కపటులు కూడా చేరిపోయారు. అతను ఇస్లాంకు వ్యతిరేకంగా రోమ్‌సైన్యాలను, ఉత్తర అరేబియా లోని క్రైస్తవరాజ్యాల సైన్యాలను కూడగట్టేందుకు రోమ్‌కు బయలుదేరాడు. ఆ సమయంలో కపటులు అబూఆమిర్‌తో మంతనాలు జరిపి తమ రహస్య కార్యకలాపాలు సాగించడానికి మదీనాలో ఒక మసీదు నిర్మించాలని నిర్ణయించారు.

ఇస్లాం తెరచాటున ఇస్లాం వ్యతిరేక కార్యకలాపాలు సాగించడానికి మసీదు ఎంతో అనువైన కేంద్రం. అందుకే కపటవిశ్వాసులు ఈ నిర్ణయం తీసుకొని మసీదు నిర్మించారు. ఇక్కడ రోమ్ గూఢచారులు, అబూఆమిర్ ఏజెంట్లు కూడా కపటుల్ని నిస్సంకోచంగా కలుసుకొని తగిన పన్నాగాలు పన్నవచ్చని కూడా వారుభయుల మధ్య ఒక అంగీకారం కుదిరింది.

మదీనాలో ఇంతకుముందే రెండు మసీదులు ఉన్నాయి. ఇప్పుడు మూడవ మసీదు నిర్మించాల్సిన అవసరమే లేదు. కాని కపటవిశ్వాసులు వర్షాకాలంలో, చలికాలంలో వృద్ధులు, బలహీనులు నమాజు కోసం అంతదూరం పోలేరన్న సాకు చెప్పి ఈ మూడవ మసీదు నిర్మించుకున్నారు.

అంతటితో ఆగక వారు తమ మత ముసుగును మరింత పటిష్ఠపరచుకోవడానికి దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "తమరు ఓసారి ఈ (జిరార్) మసీదులో నమాజు చేయించి దీనికి ప్రారంభోత్సవం చేయండి" అన్నారు అతివినయం ఒలకబోస్తూ.

కాని దైవప్రవక్త (స) దాన్ని దాటవేస్తూ "నేనిప్పుడు యుద్ధసన్నాహాలలో నిమగ్నమై ఉన్నాను. తబూక్ దండయాత్రకు వెళ్తున్నాను. తిరిగొచ్చాక దాని సంగతి చూస్తాను" అన్నారు.

## దైవమార్గంలో ప్రతి అడుగూ పుణ్యకార్యమే-(147)

హిజ్రీ 9వ సంవత్సరం, రజబ్ నెలలో ముప్ఫయివేల మంది ముజాహిద్‌లతో కూడిన భారీ సైనికవాహిని అమితోత్సాహంతో మదీనా నుండి కదిలింది. ఉప్పొంగుతూ, ఉరకలు వేస్తూ గలగలపారే సెలయేరులా సిరియా దిశగా ప్రయాణమయింది.

అది నడి ఎండాకాలం. సూర్యుడు తీవ్రమయిన వేడి కిరణాలతో తన ప్రతాపాన్ని ప్రదర్శిస్తున్నాడు. చెంపలు పగిలేలా తీక్షణమయిన వడగాల్పులు వీస్తున్నాయి. దానికి తోడు అనేక మైళ్ళ విస్తీర్ణంలో కొండల మాదిరి ఎత్తయిన ఇసుక తిన్నెలతో కూడిన భయంకరమైన ఎడారి ప్రాంతం. ఆ ఎడారిలో దైవప్రవక్త (సల్లం) ముప్ఫయివేల మంది యోధులతో తబూక్ దిశగా ప్రయాణం సాగిస్తున్నారు.

ఈ పవిత్ర ప్రస్థానంలో పాల్గొననివారు కూడా కొందరున్నారు. వారు మదీనాలోనే ఉండిపోయారు. దట్టమైన వృక్షచ్ఛాయల్లో, చల్లని నీడ పట్టున, తియ్యటి సెలయేరుల మధ్య సుఖభోగాలు అనుభవిస్తున్నారు. వారిలో అనేకమంది ఈ ప్రయాణం తప్పినందుకు ఎంతో సంతోషిస్తున్నారు.

అయితే కొందరు విశ్వాసులు మాత్రం దైవప్రవక్త (సల్లం) బయలుదేరి వెళ్ళిన తరువాత ఆలోచనల్లో పడ్డారు. తామీ పవిత్రమైన మహాకార్యంలో పాల్గోలేకపోయామేనని సిగ్గుతో పశ్చాత్తాపం పడసాగారు.

హజ్రత్ అబూఖైసిమా (రజి) తన తోటలోకి ప్రవేశించారు. ఆయనకు ఇద్దరు భార్యలు ఉన్నారు. అబూఖైసిమా (రజి) తన భార్యలతో కలసి తోటలోనే నివసిస్తున్నారు. అక్కడ ఒక అందమైన కుటీరం ఉంది. దాని ద్వారాలకు, కిటికీలకు వట్టివేరు తడికలు వ్రేలాడు తున్నాయి. వాటిపై ఆయన భార్యలు నీళ్లుచల్లి కుటీరాన్ని చల్లబరిచారు. అబూఖైసిమా (రజి) కుటీరంలోకి ప్రవేశించగానే లోపల చల్లగా, హాయిగా, ఆహ్లాదకరంగా ఉంది.

భర్త రాగానే భార్యలిద్దరూ ఆయనకు ఒకవిధమైన పదార్థంతో ఘుమఘుమలాడే అన్నం వడ్డించారు. ఒక కూజాలో చల్లనినీళ్ళు తెచ్చిపెట్టారు. అబూఖైసిమా (రజి) భోజనం చేయడానికి ఉపక్రమించారు. ఎంతో ఉల్లాసం గొలిపే వాతావరణం అది.



కాని అబూఖైసిమా (రజి)కు అకస్మాత్తుగా దైవప్రవక్త (సల్లం) తబూక్ దండయాత్రకు పోయిన సంగతి గుర్తుకొచ్చింది. దాంతో ఆయన హృదయం తల్లడిల్లి పోయింది. చివాలున లేచి నిలబడ్డారాయన.

"అక్కడ మన ప్రియప్రవక్త (సల్లం) ఎండలో వాడి మాడిపోతుంటే, నేనిక్కడ స్త్రీల మధ్య చల్లని నీడపట్టున భోగభాగ్యాలు అనుభవించడమా! కాదు, కాదు. తక్షణమే నా ప్రయాణ సామగ్రి సిద్ధం చేయండి. నేను కూడా వెళ్ళి ఆ యుద్ధంలో పాల్గొంటాను" అన్నారు ఆయన.

ప్రియపత్నులు ప్రయాణసామగ్రి సిద్ధం చేశారు. హజ్రత్ అబూఖైసిమా (రజి) ఒంటెపై ఎక్కి వేగంగా ప్రయాణిస్తూ ముజాహిద్‌ల దగ్గరకు చేరుకున్నారు. ఆయన రాక దైవప్రవక్త (సల్లం)కు ఎంతో ఉల్లాసం కలిగించింది.

ఆవిధంగా అనేకమంది సహచరులు ఆలస్యంగా చేరుకున్నారు. వారిలో హజ్రత్ అబూజర్ గిప్ఫారీ (రజి) కూడా ఉన్నారు. అయితే ఆయన ఆలస్యంగా చేరుకోవడానికి కారణం అశ్రద్ధ, అలక్ష్యం కాదు. దారిలో ఆయన ఒంటె నడవలేక పోయింది. అందువల్ల ఆయన దాన్ని దారిలోనే వదలిపెట్టి నడచి రావలసివచ్చింది.

సైన్యం ఒక చోట విడిది చేసింది. అప్పుడు దైవప్రవక్త (సల్లం) హజ్రత్ అబూజర్ గిప్ఫారీ (రజి) రావడం చూసి "అబూజర్! వచ్చావా, చాలా సంతోషం. ఇప్పటిదాకా ఎక్కడున్నావయ్యా?" అన్నారు ఎంతో వాత్సల్యంతో.

హజ్రత్ అబూజర్ (రజి) జరిగిన వృత్తాంతం విన్పించారు.

"అబూజర్! నీవు రాలేదన్న విషయం గురించే నాకు అన్నిటికంటే ఎక్కువ విచారంగా ఉండింది. సరే మొత్తానికి వచ్చేశావు. చాలాసంతోషం. ఈ మార్గంలో నీవు వేసే ప్రతిఅడుగూ పాపశమనం అవుతుంది, సంతోషించు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

"అలాగే (దైవమార్గంలో) కొద్దో గొప్పో ఏదయినా ఖర్చుచేస్తే లేదా ధర్మసంస్థాపనా కృషిలో ఏవయినా గుట్టలు మిట్టలు దాటి పురోగమిస్తే ఆ సత్కార్యాలు కూడా (వారి కర్మపత్రంలో) వ్రాయకుండా ఉండటమనేది జరగదు. వారు చేసిన సత్కార్యాలకు దేవుడు వారికి తగిన ప్రతిఫలం తప్పకుండా ప్రసాదిస్తాడు." (ఖుర్‌ఆన్–9:121)

సైన్యం ముందుకు సాగింది. కొంతదూరం ప్రయాణం చేసి "హిజ్ర్" అనే ప్రాంతంలో ప్రవేశించింది. అది గతించిన సమూద్ తెగవారి ప్రాంతం. అక్కడ వారి వైభవాన్ని తెలియ జేసే శిథిలాలు ఇంకా మిగిలి ఉన్నాయి. ఇవి కొండలను తొలచి నిర్మించబడిన గొప్ప భవనాల శిథిలాలు, వాటి అవశేషాలు.

ఆనాడు సమూద్ తెగవారికి దైవసందేశం అందజేయడానికి హజ్రత్ సాలిహ్ (అలై) అనే దైవప్రవక్త ప్రభవించారు. కాని సమూద్ తెగవాళ్ళు తమ అధికారం, సిరిసంపదలు చూసుకొని విర్రవీగుతూ హజ్రత్ సాలిహ్ (అలై)ను తిరస్కరించారు. చివరికి వారిపై దైవాగ్రహం విరుచుకుపడింది. దాంతో వారు సర్వనాశనమయ్యారు.

అందువల్ల దైవప్రవక్త (సల్లం) ఆ ప్రాంతంలో అడుగుపెట్టగానే అనుచరులతో మాట్లాడుతూ "మీరంతా దైవాన్ని క్షమాపణ వేడుకుంటూ వడివడిగా నడచి ఇక్కడ్నుంచి త్వరగా బయటపడండి" అని చెప్పారు.

దైవప్రవక్త (సల్లం) సమూద్ శిథిలాల సమీపం నుంచి పోతున్నప్పుడు ముఖం మీద వస్త్రం కప్పుకొని, ఒంటె ముకుతాడు వదులుచేసి వేగంగా ముందుకు సాగారు.

అప్పుడు ఆయన (సల్లం) అనుచరుల్ని ఉద్దేశించి "దుర్మార్గులు, పాపాత్ముల నివాస ప్రాంతాల గుండా పోవలసి వచ్చినప్పుడు, వారిపై వచ్చిపడిన ఉపద్రవం మనపై కూడా వచ్చి పడుతుందేమోనని తలచి భయపడుతూ, దైవాన్ని క్షమాపణ వేడుకుంటూ (త్వరగా అక్కడ్నుంచి) త్వరగా దాటిపోవాలి" అన్నారు.

అయితే సైన్యం కొన్ని అనివార్య కారణాల వల్ల సమూద్ ప్రాంతం సరిహద్దుల్లో ఒక రాత్రి గడపవలసి వచ్చింది.

అక్కడ ఒక బావి కూడా ఉంది. కొందరు సైనికులు ఆ బావి నీటితో తనివితీరా స్నానాదులు చేసుకొని సేద తీర్చుకున్నారు. ఒంటెలక్కూడా నీరు పెట్టారు. తరువాత రొట్టెలు తయారు చేసుకోవడంలో నిమగ్నులయ్యారు.

అనుచరులు ఆ బావి నీరు వాడుతున్న సంగతి తెలిసి దైవప్రవక్త (సల్లం) ఇలా వారిని ఆదేశించారు:

"ఈ బావిలోని నీళ్ళు ఎవరూ త్రాగకూడదు. దాంతో ఉజూ కూడా చేయకూడదు. ఆ నీరు ఉపయోగించి చేసిన రొట్టెలు ఎవరూ తినకూడదు. వాటిని ఒంటెలకు పెట్టండి."

దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞ వినగానే అనుచరులంతా ఆ బావినీరు వాడటం మానేశారు. ఆ నీటితో నింపుకున్న నీటి తిత్తులను కూడా ఖాళీ చేశారు.

ఆ ప్రదేశంలో రాత్రివేళ ఒంటరిగా తిరగకూడదని, ఎక్కడికైనా పోవాల్సివస్తే ఎవరినైనా తోడు తీసుకొని పోవాలని కూడా దైవప్రవక్త (సల్లం) గట్టిగా తాకీదు చేశారు. అనుచరులు తమ ప్రియతమ నాయకుని ఆదేశం ప్రకారమే నడుచుకున్నారు.

అయితే ఇద్దరు ముజాహిద్‌ల వల్ల కాస్త పొరపాటు జరిగింది. వారిలో ఒక ముజాహిద్ ఏదో అవసర నిమిత్తం బయటికి వెళ్ళాడు. అంతే, ఆయన మళ్ళీ తిరిగి రాలేదు. ఓ భయంకరమైన సుడిగాలి వచ్చి ఆయన్ని అమాంతం ఎగరేసుకొని పోయి ఎక్కడో ఇసుక పొరల్లో సమాధి చేసింది.

పోతే రెండవ వ్యక్తి తప్పిపోయిన తన ఒంటెను వెతుక్కోవడానికి బయలుదేరాడు. ఆయన్ని కూడా సుడిగాలి ఎగరేసుకొని పోయి ఎక్కడో విసిరివేసింది.

దేవుడు సమూద్‌జాతికి పెట్టిన శాపం ఏమిటోగాని, వారి నివాస ప్రదేశం ఇద్దరు ముజాహిద్‌లను పొట్టన పెట్టుకుంది. మిగిలిన ముజాహిద్‌లు ఎవరూ ఎలాంటి ప్రమాదానికి లోనుకాలేదు.



## ప్రవక్త మహిమల పట్ల కపటుల పరిహాసం-(148)

సైన్యం అక్కడ నుంచి ముందుకుసాగింది. ఆకాశం నుండి అగ్నికణాలు కురుస్తున్నాయి. క్రింద ఇసుక నేల పాదాలను పెనంలా మాడ్చివేస్తోంది. వడగాల్పులు గొంతు తడిని ఆర్పి వేస్తున్నాయి. పశువులు కూడా నీటి కోసం తపించి పోతున్నాయి. కాని కనుచూపు మేరలో ఎక్కడా నీటి సూచనలే లేవు.

క్షణక్షణానికి దప్పిక అధికమవుతోంది. నాలుకలు పిడచలు కట్టుకొని పోతున్నాయి. ముఖాలు వాడి మాడిపోతున్నాయి. ప్రయాణ వేగం తగ్గిపోయింది.

కొందరు సహచరులు దైవప్రవక్త (సల్లం) దగ్గరికి పోయి తమ బాధ గురించి చెప్పుకున్నారు. నీటి కోసం దైవాన్ని ప్రార్థించమని విన్నవించుకున్నారు. దైవప్రవక్త (సల్లం) అలాగేనని నీటి కోసం దైవాన్ని ప్రార్థించారు.

ఇంకేముంది! దైవానుగ్రహం పొంగిపొరలింది. చూస్తుండగానే నిర్మలాకాశంలో మబ్బు తునకలు ప్రత్యక్షమయ్యాయి. క్షణాల్లో ఆకాశమంతా మేఘావృతమయింది. ఆ వెనువెంటనే చిటపట చినుకులతో వర్షం ప్రారంభమయింది. అది కాస్సేపటికి ఉధృతమై కుండపోత వర్షం కురిసింది.

ముజాహిద్‌ల ఆనందం అవధులు దాటింది. ఎక్కడ చూసినా నీరే నీరు! జనం తనివితీరా తాగారు. కావలసినంత నీటితో స్నానాలు చేశారు. నీటి తిత్తులన్నీ నింపుకొని భద్రపరచుకున్నారు. రొట్టెలు తయారుచేసుకొని కడుపారా తిన్నారు. పశువులు కూడా బాగా నీళ్ళు తాగి దప్పిక తీర్చుకున్నాయి.

వర్షం వెలసింది. ముజాహిద్‌ల అలసట తీరింది. అందరూ పరమసంతోషంతో దైవానికి కృతజ్ఞతలు అర్పించుకున్నారు.

నడి ఎండాకాలంలో, కటిక ఎడారి ప్రదేశంలో ఈ వర్షం నిజంగా దైవానుగ్రహం కాకపోతే మరేమిటి? నిస్సందేహంగా ఇది విశ్వప్రభువు అనుగ్రహమే! ఆయన ప్రవక్త (సల్లం) చేసిన ప్రార్థనా ఫలితం!!

అందరూ ఈ విషయాన్ని గురించే వింతగా చెప్పుకోసాగారు. కాని కేవలం సమరసొత్తు ఆశించి వచ్చిన కపటవిశ్వాసులు మాత్రం ఈ మాటలను సహించలేకపోయారు.

"అరె! ఏం మహత్యాన్ని గురించి చెప్పుకుంటున్నారయ్యా మీరు? ఇవి ఏదో ఎండవల్ల ఏర్పడిన మేఘాలు మాత్రమే. వచ్చాయి, వర్షించాయి. ఇందులో మహత్యం ఏముందని మీరు మహా వింతగా చెప్పుకుంటున్నారు?" అన్నారు వారు.

అయితే మనస్ఫూర్తిగా దేవుడ్ని, ఆయన ప్రవక్త (స)ను విశ్వసించినవారు కపటుల కువిమర్శలను గురించి పట్టించుకోలేదు. కాని కపటులు అంతటితో ఊరుకోలేదు.

"రోమన్లు అంటే ఏమనుకుంటున్నారు మీరు? అరబ్బులతో పోరాడి గెలిచాం కదా, ఇక రోమన్ల సంగతి మాత్రం ఏముందిలే అని తలుస్తున్నారా? అసలు మీకు రోమన్ల

శౌర్య పరాక్రమాలను గురించి పూర్తిగా తెలియదు. అందుకే మీరు తొందరపడ్డారు. ఇప్పుడు ప్రమాదం కొనితెచ్చుకోబోతున్నారు. మిమ్మల్ని చూస్తుంటే మాకెంతో జాలివేస్తోంది. రోమ్ సైనికులు మిమ్మల్ని తాళ్ళతో బంధించి ఈడ్చుకెళ్తున్న దృశ్యాలే మా కళ్ళ ముందు అనుక్షణం మెదలుతున్నాయి'' అన్నారు వారు ముజాహిద్‌లతో.

కపట ముస్లింల పలుకులు దైవప్రవక్త (సల్లం) చెవిన పడ్డాయి. ఆయన ముఖం ఎర్రబారింది. వెంటనే ఆయన హజ్రత్ అమ్మార్ (రజి)ని పిలిచి "అమ్మార్! అక్కడ కూర్చున్న వాళ్ళేదో గందరగోళం సృష్టించేలా ఉన్నారుగాని, కాస్త వాళ్ళను ఇలా పిలుచుకురా, సంగతేమిటో కనుక్కుందాం'' అని చెప్పారు.

హజ్రత్ అమ్మార్ (రజి) కపటుల దగ్గరికెళ్ళి "పదండి, దైవప్రవక్త (సల్లం) మిమ్మల్ని పిలుస్తున్నారు'' అని అన్నారు.

దైవప్రవక్త (సల్లం) పిలుస్తున్నారనగానే కపటుల గుండెలు గుభేలుమన్నాయి. తమల్ని గురించి ఆయనకు అంతా తెలిసిపోయిందని భయపడ్డారు. ఎలాగో వారు దైవప్రవక్త (సల్లం) దగ్గరకు వచ్చారు. కాని ఇక్కడా వారు నాటకం ఆడారు.

"దైవప్రవక్తా! మేమేదో తమాషాగా అలా అన్నాం. అంతేగాని, ఈ విషయం గురించి మేము గంభీరంగా ఏదీ మాట్లాడలేదు'' అంటూ పచ్చి అబద్ధం కక్కేశారు.

"మీరు మాట్లాడుతున్నదేమిటని అడిగితే "మేమేదో పరిహాసంగా అంటున్నాం" అంటారు వారు. వారికి చెప్పు: "మీరు దేవునితో, ఆయన సూచనలతో, ఆయన ప్రవక్తతోనా పరిహాస మాడేది? ఇకనైనా సాకులు చెప్పడం మానుకోండి. మీరు సత్యాన్ని విశ్వసించిన తరువాత తిరస్కారవైఖరి అవలంబించారు. మేము మీలో కొందరిని క్షమించి వేసినా మిగిలినవారిని తప్పకుండా శిక్షిస్తాము. వారు పరమదుర్మార్గులు." (ఖుర్ఆన్-9:65,66)

కపట విశ్వాసులు అప్పటికీ తమ దుష్టచర్యలు మానుకోలేదు. వారు దొరికే ప్రతి అవకాశాన్ని వాడుకోవడానికి ప్రయత్నించారు. ఒక రోజు దైవప్రవక్త (సల్లం) ఒంటె తప్పి పోయింది. దాన్ని వెతకడానికి కొందరు అనుచరులు బయలుదేరారు. దరిదాపుల్లో ఉన్న కొండలు, ఇసుకతిన్నెలు అన్నీ గాలించారు. కాని ఎక్కడా ఒంటె జాడ కన్పించలేదు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) పట్ల జనంలో అనుమాన బీజాలు నాటేందుకు జైద్ బిన్ అసీత్ అనే కపటముస్లింకు మంచి అవకాశం లభించింది.

జైద్ తరచుగా అమ్మార్ బిన్ హజమ్ (రజి) ఉండే శిబిరానికి వస్తుండేవాడు. అక్కడే అతను గోష్ఠులు, సమావేశాలు నిర్వహిస్తుండేవాడు. ఆ రోజు దైవప్రవక్త ఒంటె కన్పించలేదని తెలియగానే అతను సమావేశంలో జనాన్ని ఉద్దేశించి "ముహమ్మద్ తనకు ఆకాశం నుండి దైవసందేశం వస్తున్నట్లు చెబుతున్నాడుగాని, ఆయనకు తన ఒంటె ఎక్కడికి పోయిందో మాత్రం తెలియదు!'' అంటూ దెప్పిపొడిచాడు.

ఈ సంగతి కూడా దైవప్రవక్త (సల్లం)కు తెలిసింది. ఆయన అనుచరులతో ముచ్చ టిస్తున్న సమయమది. హజ్రత్ అమ్మార్ (రజి) కూడా అక్కడే ఉన్నారు.



"ఒకతను ఇలా అంటున్నాడు. కాని నేను అగోచర విషయాలు తెలిసినవాడ్ని కానని మీకందరికీ తెలుసు. దేవుడు తెలిపిన విషయాలే నాకు తెలుస్తాయి. అంతకుమించి ఒక్క వియయమూ నాకు తెలియదు'' అన్నారు దైవప్రవక్త ఆవేదనాపూరిత మనసుతో.

ఆ తరువాత కొద్ది క్షణాలకే దేవుడు దివ్యావిష్కృతి (వహీ) ద్వారా తన ప్రవక్తకు ఒంటె జాడ తెలిపాడు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) తన అనుచరులకు ఒంటె ఉన్న ప్రదేశం తెలియజేసి వెళ్ళి దాన్ని తోలుకు రమ్మని చెప్పారు. అనుచరులు పోయిచూస్తే అక్కడ నిజంగానే ఒంటె కన్పించింది. వారు సంతోషంతో ఒంటెను తోలుకొచ్చి దైవప్రవక్త (సల్లం)కు అప్పగించారు.

హజ్రత్ అమ్మార్ (రజి) తప్పిపోయిన ఒంటెను చూసిన తరువాత నేరుగా తన శిబిరానికి వెళ్ళిపోయారు. అక్కడున్న వారికి జరిగిన వృత్తాంతం విన్పించారు. జైద్ నిర్వాకం గురించి అమ్మార్ (రజి)కు ఇంకా తెలియదు. అయితే ఆయన చెప్పిన వృత్తాంతం విన్న తరువాత ఒక మిత్రుడు ఈ విషయాన్ని బయటపెట్టాడు.

"అమ్మార్! మీరు ఏ మనిషి గురించయితే ఇలా చెబుతున్నారో అతను జైద్. అతనే దైవప్రవక్త (సల్లం)కు వ్యతిరేకంగా ఈ కారుకూతలు కూశాడు.''

ఈ సంగతి తెలియగానే హజ్రత్ అమ్మార్ (రజి) పట్టరాని కోపంతో పళ్ళు నూరుతూ జైద్ మీదికి లంఘించారు. అతని గుండెపై ఎక్కి ఎడా పెడా కొట్టసాగారు.

"సోదరులారా! వీడు మనల్ని కాటెయ్యడానికి మన దగ్గర దాక్కున్న త్రాచుపాము..... దుర్మార్గుడా! మాతో కలసిఉంటూ నీవు చేస్తున్న నిర్వాకం ఇదా! పో బయటికి. నీ ముఖం చూపించకు ఇక నుంచి'' అంటూ ఆయన జైద్‌ని చితగ్గొట్టి బయటికి గెంటివేశారు.

## తబూక్‌లో సైనిక కార్యకలాపాలు-(149)

సైన్యం అక్కడ్నుంచి బయలుదేరి ముందుకు సాగింది. సుదీర్ఘ ప్రయాణం చేసిన తరువాత ఎలాగో ముజాహిద్‌లు "తబూక్" సమీపానికి చేరుకున్నారు. ఆ ప్రాంతం సిరియా, అరేబియాల సరిహద్దుపై ఉంది. అయితే అక్కడకు చేరుకోగానే రోమన్లు కోట ద్వారాలు మూసేసుకున్నారని తెలిసింది.

ఇప్పుడేం చెయ్యాలి? నగరంలోకి జొరబడి పోరాడటమా లేక ఇక్కడ్నుంచే తిరిగి వెళ్ళిపోవడమా? దైవప్రవక్త (సల్లం) ఆలోచనలో పడ్డారు. ఈ విషయమయి ఆయన అనుచరుల్ని సమావేశపరచి వారి సలహాలు అడిగారు.

"దైవప్రవక్తా! దైవాజ్ఞ అయితే ముందుకు పదండి'' అన్నారు హజ్రత్ ఉమర్ (రజి).

"దైవాజ్ఞ వస్తే నేను మీతో ఎందుకు సంప్రదిస్తాను?'' అన్నారు దైవప్రవక్త (స).

ఆ తరువాత ప్రవక్త అనుయాయులు కూడా పరస్పరం సంప్రదించుకున్నారు. చివరికి నగరంలో ప్రవేశించకుండా బయటే ఉండిపోవాలని నిర్ణయం జరిగింది. నిర్ణయం ప్రకారం ముజాహిద్‌లు నగరం వెలుపలే శిబిరాలు వేసుకున్నారు.

రోమన్లు ముస్లిం సైన్యాలను చూసి కంగారు పడిపోయారు. వారు కోట బయటికి రావడానికే భయపడ్డారు. అలాంటివారు ఇక ముస్లిం యోధుల్ని ఎలా ఎదిరించగల్గుతారు? ఇప్పుడు వారికి ముస్లింల శక్తిగురించి పూర్తిగా తెలిసింది. ముస్లింలు గొప్పశక్తిగా రూపొందారని రోమ్‌కు చుట్టుపక్కలున్న దేశాలు కూడా గ్రహించాయి.

దైవప్రవక్త (సల్లం) తబూక్‌లోనే అనేక రోజులున్నారు. అయినా ఎలాంటి యుద్ధ సూచనలు కానరాలేదు. రోమన్‌లు ఏమాత్రం కవ్వింపు చర్యలకు పాల్పడలేదు. అంత మాత్రాన ఇక వారి నుండి ప్రమాదం పూర్తిగా తొలగిపోయినట్లేనా? లేదు.

రోమన్‌లు ఇక ముస్లింలకు లొంగిపోయారని తలచి దైవప్రవక్త (సల్లం) నిశ్చింతగా ఉండిపోలేదు. సరిహద్దుల్లో రక్షణ ఏర్పాట్లు చేసి ఇరుగుపొరుగు శత్రు ప్రమాదాన్ని కూడా నివారించవలసి ఉంది. దాన్ని గురించి కూడ దైవప్రవక్త (సల్లం) ఆలోచించారు. ఇరుగు పొరుగు రాజ్యాలతో, తెగలతో శాంతి ఒప్పందాలు చేసుకుందామని భావించారు. ఈ ఆలోచనతో ఆయన తబూక్ నుండే అనేక రాజ్యాలకు లేఖలు రాశారు. ఆ రాజులు వచ్చి దైవప్రవక్త (సల్లం)తో శాంతి ఒప్పందాలు చేసుకొని వెళ్ళిపోయారు.

అయితే తబూక్ సమీపంలోని దూమతుల్ జందల్ ప్రాంతం రాజు అకీదర్ బిన్ అబ్దుల్ మలిక్ ముస్లిం పట్ల తిరుగుబాటు వైఖరి ప్రదర్శిస్తూ ఒప్పందం చేసుకోవడానికి రాలేదు. అందువల్ల దైవప్రవక్త (సల్లం) ఖాలిద్ బిన్ వలీద్ (రజి)కు ఓ సైనికదళం ఇచ్చి దూమతుల్ జందల్‌కు పంపారు.

ఆ సందర్భంలో ఆయన హజ్రత్ ఖాలిద్ (రజి)కు ఇలా చెప్పారు: "అకీదర్ నీకు అడవిగోవును వేటాడుతూ కన్పిస్తాడు. వెంటనే నీవు అతడ్ని బంధించి తీసుకొనిరా."

హజ్రత్ ఖాలిద్ (రజి) అలాగేనని బయలుదేరారు. రాత్రంతా ప్రయాణంచేసి తెల్లవారే టప్పటికి అకీదర్ ఉండే రాజమందిరం సమీపానికి చేరుకున్నారు.

అది వేసవికాలం, వెన్నెల రాత్రి. అకీదర్ రాజమందిరం కప్పు మీద భార్య దగ్గర రంగుల కలలుకంటూ హాయిగా పడుకొని ఉన్నాడు. కాస్సేపటికి ఎక్కడ్నుంచో ఓ అడవిగోవు వచ్చి కొమ్ములతో రాజమందిరం తలుపులను కుమ్మడం మొదలెట్టింది.

అకీదర్ భార్య సంభ్రమాశ్చర్యాలతో చూస్తూ భర్తను లేపి ఆ దృశ్యాన్ని చూపింది. వెంటనే అకీదర్ తన తమ్ముడు హసాన్‌ని పిలుచుకొని గుర్రం మీదెక్కి ఆ అడవి గోవును వేటాడటానికి బయలుదేరాడు.

అడవిగోవు వాళ్ళను చూసి పరుగెత్తింది. అకీదర్, అతని తమ్ముడు దాని వెంటపడి కొంచెం దూరం వెళ్ళారో లేదో ఖాలిద్ (రజి) సైనికులు వచ్చి వాళ్ళను చుట్టుముట్టారు. అకీదర్ కాస్సేపు పెనుగులాడి పట్టుబడ్డాడు. అతని తమ్ముడు హతమార్చబడ్డాడు.

ఖాలిద్ బిన్ వలీద్ (రజి) అకీదర్‌ని బంధించి తెచ్చి దైవప్రవక్త (సల్లం) ముందు ప్రవేశపెట్టారు. అయితే దైవప్రవక్త (సల్లం) అతడ్ని క్షమించి ప్రాణభిక్ష పెట్టారు. అకీదర్ సంతోషంతో తన విధేయత ప్రకటించి జిజ్యా చెల్లించడానికి అంగీకరించాడు.



ఆ తరువాత అతను తన కోటకు తిరిగివెళ్ళి రాజీ ఒడంబడిక పత్రంతో పాటు రెండు వేల ఒంటెలు, ఎనిమిది వందల గుర్రాలు, నాలుగు వందల ఈటెలు, నాలుగు వందల యుద్ధకవచాలు కానుకలుగా దైవప్రవక్త (సల్లం)కు పంపాడు.

ఈ వ్యవహారాలన్నీ ముగిసిన తరువాత దైవప్రవక్త (సల్లం) కాస్తంత ఊపిరి పీల్చుకున్నారు. ఇక తబూక్‌లో ఉండవలసిన అవసరం లేదు. ఆహారపదార్థాలు కూడా చాలా మటుకు తగ్గి పోయాయి. సైన్యం తిరిగి వెళ్ళిపోవడానికి మాత్రమే సరిపడ్డ ఆహార పదార్థాలు మిగిలి ఉన్నాయి. అందువల్ల మదీనా బయలుదేరవలసిందిగా దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞాపించారు. ప్రవక్త ఆజ్ఞ కాగానే ముజాహిద్‌లు మూటాముల్లెలు సర్దుకున్నారు. సంతోషంతో మదీనా తిరుగుముఖం పట్టారు.

## జిరార్ మసీదు ధ్వంసం-(150)

దైవప్రవక్త (స) సైన్యం తీసుకొని మదీనా సమీపంలోని ఓ చోటికి రాగానే దేవుడు ఖుర్ఆన్‌లోని "తౌబా సూరా" (9వ అధ్యాయం) అవతరింపజేశాడు.

"ఇంకా కొందరున్నారు. వారు(ఇస్లాంకు) విఘాతం కలిగించే ఉద్దేశ్యంతో ఒక మసీదు నిర్మించారు. వారక్కడ సత్యవ్యతిరేక కార్యకలాపాలు సాగించడానికి, విశ్వాసుల ఐక్యతను చెడగొట్టి వారిలో చీలికలు సృష్టించడానికి నిర్ణయించుకున్నారు. అంతేకాదు, ఇంతకుముందు దేవునితో, ఆయనప్రవక్తతో యుద్ధంచేసి (పరాజయంపాలై) ఉన్నవారికి ఆశ్రయంగా (రహస్య స్థావరంగా) ఉంటుందన్న ఉద్దేశ్యంతో కూడా ఈ మసీదు నిర్మించారు.

వారు (నీ దగ్గరకొచ్చి) మంచి తప్ప తమకు మరో ఉద్దేశ్యం లేదని ప్రమాణంచేసి మరీ చెబుతారు. కాని వారు పచ్చిఅబద్ధాలకోరులని దేవుడు సాక్ష్యమిస్తున్నాడు. కనుక నీవు ఎన్నటికీ ఆ మసీదులో అడుగుపెట్టకు. మొదటినుండీ దైవభీతి పునాదిపై నిర్మించిన మసీదు మాత్రమే ప్రార్థన చేయడానికి నీకు యోగ్యమైనది. అక్కడ పరిశుద్ధంగా (పవిత్రంగా) ఉండగోరే వారు కూడా ఉన్నారు. దేవుడు పరిశుద్ధత పాటించేవారినే ప్రేమిస్తాడు. (107-108)

ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. వారిలో ఒకడు తన కట్టడాన్ని దైవభీతి, దైవప్రసన్నతలనే పునాదులపై నిర్మించాడు. రెండోవాడు తన కట్టడాన్ని నీటి ప్రవాహానికి లోతట్టు భాగం మట్టి కొట్టుకుపోయి డొల్లగా మారిన నదీతీరంపై నిర్మించాడు. ఆ తరువాత అది కాస్తా అతడ్ని తీసుకొని నేరుగా నరకాగ్నిలో పడిపోయింది. మరి ఈ ఇద్దరిలో ఎవరు శ్రేష్ఠులు? మీరే కాస్త ఆలోచించండి. అలాంటి దుర్మార్గులకు దేవుడు ఎన్నటికీ సన్మార్గం చూపడు. వారు నిర్మించిన ఈ (పునాదులులేని) కట్టడం వారిహృదయాల్లో ఎల్లప్పుడూ అపనమ్మకాన్నే పెంచిపోషిస్తుంది; వారి హృదయాలు ముక్కలు ముక్కలుగా పగిలిపోతే తప్ప (ఈ అపనమ్మకపు జాడ్యం వారిని వదలిపెట్టదు). దేవుడు సర్వం తెలిసినవాడు, మహా వివేకవంతుడు." (9:109,110)

ఈ ఆదేశం అందగానే దైవప్రవక్త (స) కపటులు నిర్మించిన (జిరార్) మసీదును పడగొట్టండని చెప్పి కొందరు అనుచరుల్ని ముందుగా మదీనా పంపారు. వారు గుర్రాల మీద వేగంగా వెళ్ళి ఆ మసీదును నామరూపాల్లేకుండా నేలమట్టం చేశారు.

దైవప్రవక్త (సల్లం) తన అనుచరులతో తబూక్ దండయాత్ర నుంచి మదీనా తిరిగి వచ్చారు. నగరంలో ప్రవేశించగానే ఆయన మసీదులో రెండు రకాతులు నమాజ్ చేశారు. తరువాత అనుచరులతో సమావేశమయ్యారు.

అతిముఖ్యమైన తబూక్ దండయాత్రలో పాల్గొనని ముస్లింలు కూడా కొందరున్నారు. వారిలో చాలామంది కపటులే ఉన్నారు. ముగ్గురు మాత్రం సహృదయులైన ముస్లింలు ఉన్నారు. కాబ్ బిన్‌మాలిక్ (రజి), మరాన్ బిన్‌రబీ (రజి), హిలాల్ బిన్‌ఉమయ్యా (రజి) అనే ఈముగ్గురు కేవలం బద్ధకం వల్లనే ఈ దండయాత్రలో పాల్గోలేక పోయారు. దైవప్రవక్త (స) వారందరినీ పిలిపించి దండయాత్రలో పాల్గొనకపోవడానికి కారణం అడిగారు.

ముందుగా దైవప్రవక్త (స) సన్నిధికి కపటులు వచ్చారు. వారు రకరకాల కారణాలు చెప్పారు. దైవప్రవక్త (స) వారి కారణాలు విని మౌనంవహించారు. అవి నిజమైన కారణాలా లేక కట్టుకథలా అని వారిని ప్రశ్నించలేదు. వారి వ్యవహారాన్ని దైవానికి వదిలేశారు.

## తబూక్ దండయాత్రలో పాల్గొననివారు-(151)

ఆ తరువాత హజ్రత్ కాబ్ బిన్ మాలిక్ (రజి) వంతు వచ్చింది. దైవప్రవక్త (సల్లం) పిలుపు వినగానే ఆయన ఎంతో వినయవిధేయతలతో వచ్చి నిల్చున్నారు.

“కాబ్! నువ్వెందుకు పాల్గోలేదీ దండయాత్రలో? ఏ విషయం నిన్ను నిరోధించింది?” అడిగారు దైవప్రవక్త (సల్లం) చిరునవ్వుతో.

“దైవప్రవక్తా! మరొకరి ముందయితే నేను ఏదో ఒకమాట చెప్పి తప్పించుకో గలుగుతాను. సాకులు చెప్పడం, కట్టుకథలు అల్లడం నాకూ వచ్చు. కాని మీ విషయం గురించి నాకు తెలుసు. ఒకవేళ నేనిప్పుడు ఏదో ఒక సాకు చెప్పి మిమ్మల్ని మెప్పించగల్గినా, తర్వాత దేవుడు తప్పకుండా నా గుట్టు కాస్తా బయటపెడతాడు.

“అప్పుడు నేను ఎటూ మీ ఆగ్రహానికి గురికాక తప్పదు. దైవసాక్షి! నాపై మీకు కోపం వచ్చినా సరే, నేను నిజమే చెబుతాను. ఏదో ఓ రూపంలో దేవుడు నన్ను క్షమిస్తాడని నాకు నమ్మకం ఉంది. దైవప్రవక్తా! దండయాత్రలో పాల్గొనక పోవడానికి నా దగ్గర ఎలాంటి కారణం లేదు. నేను అన్ని విధాలా శక్తి ఒనరులు కలిగి ఉన్నాను” అన్నారు హజ్రత్ కాబ్ (రజి) సిగ్గుతో తలవంచుకొని.

“ఇతను నిజాన్ని ఒప్పుకున్నాడు... సరే వెళ్ళు. నీ విషయంలో దైవం ఏదైనా నిర్ణయం చేసే వరకు వేచివుండు” అన్నారు దైవప్రవక్త (సల్లం).

హజ్రత్ కాబ్ (రజి) లేచి సమావేశంలో తన తెగవాళ్ళ మధ్యకెళ్ళి కూర్చున్నారు. కాబ్ (రజి) ప్రవర్తన ఆయన తెగవాళ్ళలో కొందరికి నచ్చలేదు. అందరిలాగే నువ్వూ ఏదో ఒక సాకు ఎందుకు చెప్పలేదని విమర్శించారు. వారి మాటలు విని ఆయన మండిపడ్డారు.

కాస్సేపటికి మరాన్ బిన్ రబీ (రజి), హిలాల్ బిన్ ఉమయ్యా (రజి) కూడా దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి నిజం ఒప్పుకున్నారు. దాంతో కాబ్ (రజి) మనస్సు కాస్త కుదుటపడింది. ఆయన తన నిజాయితీపై స్థిరంగా ఉన్నారు.



సమావేశం ముగిసింది. నిజాన్ని ఒప్పుకున్న ఈ ముగ్గురితో ఎవరూ మాట్లాడకూడదని దైవప్రవక్త (సల్లం) ముస్లింలందరినీ ఆదేశించారు. అప్పటి నుండి వారితో అందరూ మాట్లాడటం మానేశారు. చివరికి సలాంకు జవాబు కూడా ఇవ్వడం లేదు. ఆ విధంగా వారు ముగ్గురు ఒక విధమైన సంఘబహిష్కారానికి గురయ్యారు.

హిలాల్ (రజి), మరాన్ (రజి)లు దిక్కుతోచని స్థితిలో పడి ఇంట్లోనే ఉండిపోయారు. కాబ్ (రజి) మాత్రం బయటికి వెళ్ళేవారు. బజార్లలో తిరిగేవారు. మసీదుకు కూడా వెళ్ళివచ్చే వారు. కాని ఎవరూ ఆయన్ని పలకరించేవారు కాదు. పాపం! ఆయనకు ప్రపంచమే అంధకారమైనట్లు అన్పించింది. యావత్తు మదీనాలో అపరిచిత వ్యక్తిగా మారిపోయారు.

మసీదులో అందరూ పరస్పరం సలాం చేసుకుంటూ, యోగక్షేమాలు తెలుపుకుంటూ సంతోషంగా ఉంటే, హజ్రత్ కాబ్ (రజి) ఏకాకిగా విచారవదనంతో ఉండవలసి వచ్చేది. నమాజ్‌లో నిమగ్నులై ఉన్నప్పుడు మాత్రం ఆయన్ని దైవప్రవక్త (స) ఓరగా చూస్తుండేవారు. ఆయన నమాజ్ చేయడం పూర్తికాగానే దైవప్రవక్త (స) తన దృష్టిని మరో వైపు తిప్పుకునే వారు. దాంతో కాబ్ (రజి) మరింత బాధపడిపోయేవారు.

ఓరోజు ఆయన తన చిన్ననాటి స్నేహితుడు అబూఖతాతా (రజి) ఇంటికి వెళ్ళారు. ఆ ఇల్లు తోటమధ్య ఉంది. తోట చుట్టూ ప్రహరీగోడ ఉంది. హజ్రత్ కాబ్ (రజి) ప్రహరీ గోడఎక్కి సలాం చెప్పారు. కాని అబూఖతాదా (రజి) ఆయన వైపు చూసి కూడా సలాంకు జవాబివ్వకుండా మౌనంగా ఉండిపోయారు.

అప్పుడు హజ్రత్ కాబ్ (రజి) దేవుడ్ని సాక్షిగా చేస్తూ “అబూఖతాదా! నాకు దైవం పట్ల, దైవప్రవక్త (సల్లం) పట్ల ప్రేమాభిమానాలు లేవా?” అని అడిగారు.

దానికీ అతను సమాధానమివ్వలేదు. కాబ్ అలా రెండుసార్లు అడిగారు.

మూడోసారి అడిగిన మీదట “ఆ సంగతి దేవునికి, దైవప్రవక్త (సల్లం)కు మాత్రమే తెలుసు”అని ముక్తసరిగా జవాబిచ్చాడు.

ఈమాట విని హజ్రత్ కాబ్ (రజి)కు దుఃఖం పొర్లుకు వచ్చింది. భారమైన అడుగులతో ఆయన అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

ఆ రోజుల్లోనే హజ్రత్ కాబ్ (రజి) బజారున నడిచిపోతుంటే సిరియా నుండి ఒకతను వచ్చి గస్సాన్ రాజు రాసిన ఒక లేఖను ఆయనకు అందించాడు. అందులో ఆ రాజు హజ్రత్ కాబ్‌ని సంబోధిస్తూ ఇలా రాశాడు:

“మీ మనిషి మీ మీద దుర్భర దౌర్జన్యం చేస్తున్నట్లు విన్నాము. మీరు ఆ అవమానం సహించేటంత అధములు కారు. అప్రయోజకునిగా భావించి వదిలెయ్యాల్సిన వ్యక్తి కూడా కాదు. కనుక మీరు మా దగ్గరకు వచ్చేయండి. మేము మిమ్మల్ని గౌరవిస్తాం.”

ఆ లేఖ చూడగానే కాబ్ (రజి) ముఖం కందగడ్డలా మారిపోయింది.

ఆయన దాన్ని చదివి మరో విపత్తు వచ్చిపడిందే! అనుకుంటూ అప్పటికప్పుడు దాన్ని పొయ్యిలోకి విసిరి కాల్చివేశారు.

ఆ విధంగా నలభై రోజులు గడచిపోయాయి. నలభై ఒకటో రోజున దైవప్రవక్త (సల్లం) తరఫున ఒకతను వచ్చి "ఇక నుండి మీరు మీ శ్రీమతికి కూడా దూరంగా ఉండాలని దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞాపించారు" అని చెప్పాడు.

"అంటే విడాకులివ్వాల్నా?" అడిగారు హజ్రత్ కాబ్ (రజి).

"కాదు. ఆమెకు దూరంగా ఉండాలి" అన్నాడా వచ్చిన వ్యక్తి.

ఆరోజు నుండి కాబ్ (రజి), మరార్ (రజి), హిలాల్ (రజి) ముగ్గురూ తమ తమ భార్యలకు దూరంగా ఉండవలసి వచ్చింది. కాబ్ (రజి) తన అర్ధాంగిని పుట్టింటికి పంపివేసి ఒంటరి జీవితం గడపసాగారు. ఆ విధంగా తొమ్మిది రోజులు గడచిపోయాయి. పదోరోజున ఫజ్ర్ నమాజ్ తరువాత ఆయన తన ఇంటి కప్పుపై విచార వదనంతో కూర్చొని ఉన్నారు. జరిగిన విషయాన్ని తలచుకొని పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నారు.

ఆ సమయంలో "కాబ్! నీకు శుభం కలుగుగాక!" అనే మాటలు విన్పించాయి.

అంతే, హజ్రత్ కాబ్ (రజి) అప్రయత్నంగా సాష్టాంగపడ్డారు. తన పాపక్షమాపణకు సంబంధించిన ఆజ్ఞ వెలువడిందని ఆయన గ్రహించారు.

ఆ తర్వాత వెంటనే అనేకమంది మిత్రులు, బంధువులు తండోపతండలుగా వచ్చి కాబ్ (రజి)ని అభినందించడం ప్రారంభించారు. తర్వాత కాబ్ (రజి) లేచి నేరుగా మసీదుకు వెళ్ళారు. అక్కడ దైవప్రవక్త (స) ముఖం ఆనందకిరణాలు విరజిమ్ముతోంది.

"కాబ్! శుభం, శుభం!! నీ జీవితంలో ఈరోజు సుదినం" అన్నారు దైవప్రవక్త (స) ఆయన్ని చూడగానే అభినందిస్తూ.

"దైవప్రవక్తా! ఈ క్షమాపణ మీ తరఫు నుండా లేక దేవుని తరఫు నుండా?" అని అడిగారు హజ్రత్ కాబ్ (రజి).

"దేవుని తరఫు నుండే" అంటూ దైవప్రవక్త (సల్లం) అప్పుడే అవతరించిన ఖుర్ఆన్ సూక్తులు పఠించారు.

"ఇక వ్యవహారం వాయిదా వేయబడిన ఆ ముగ్గురిని కూడా దేవుడు కరుణించాడు. భూమి ఎంతో విశాలంగా ఉన్నప్పటికీ అది వారికి చాలా ఇరుకై పోయింది. చివరికి వారి ప్రాణాలే వారికి భారమై పోయాయి. దేవుని పట్టు నుండి తప్పించుకోవడానికి స్వయంగా ఆయన కరుణాశ్రయం తప్ప మరెలాంటి ఆశ్రయం లేదని వారు తెలుసుకున్నారు. అప్పుడు దేవుడు దయతో వారి వైపు మరలాడు, వారు తన వైపు మరలి వచ్చేందుకు. నిస్సందేహంగా దేవుడు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు." (ఖుర్ఆన్-9:118)

## తాయిఫ్ వాసుల ధర్మపరివర్తన-(152)

ఉర్వా బిన్ మస్ఊద్ స్వస్థలానికి తిరిగిరాగానే ఓ విచిత్ర వార్త విన్నాడు. దైవప్రవక్త (సల్లం) తాయిఫ్ నగరాన్ని ముట్టడించడానికి వచ్చారని, కొన్నాళ్ళు ముట్టడిచేసి వెళ్ళి పోయారని, మళ్ళీ ఎప్పుడైనా రావచ్చని ఆయనకు తెలిసింది.



ఉర్వా సఖీఫ్ తెగ అగ్రనాయకుల్లో ఒకడు. దైవప్రవక్త (సల్లం) తాయిఫ్ ముట్టడి కోసం వచ్చినప్పుడు ఉర్వా నగరంలో లేడు. ఇప్పుడతను తాయిఫ్‌కు తిరిగి రాగానే దైవప్రవక్త (సల్లం) వచ్చిపోయారని తెలిసింది. వెంటనే అతను మదీనా వెళ్ళాడు. మదీనాలో దైవప్రవక్త (సల్లం)ను కలుసుకొని ఇస్లాం స్వీకరించాడు. ఆ తరువాత ఉర్వా (రజి) దైవప్రవక్త (సల్లం) దగ్గర అనుమతి తీసుకుంటూ ఇలా అన్నారు:

"దైవప్రవక్తా! నేనిప్పుడు మాపట్నానికి వెళ్ళి మాతెగకు ఇస్లాం సందేశం అందజేస్తాను. వారికి దైవధర్మంలోని శుభాల్ని గురించి వివరించి ఇస్లాం స్వీకరించమని నచ్చజెబుతాను."

తాయిఫ్ ప్రజలకు ఇస్లాం గురించి చెప్పడం అంత తేలిక కాదు. వాళ్ళు ఎంత గర్విష్ఠులో దైవప్రవక్త (స)కు బాగా తెలుసు. అందుకే ఆయన ఉర్వా (రజి)ని వారిస్తూ-

"ఉర్వా! అలా చేశావంటే వారు నీకు బద్ధ విరోధులైపోతారు. నిన్ను వధించడానికైనా వెనుకాడరు" అని హెచ్చరిస్తూ తన ఆందోళన వెలిబుచ్చారు.

"దైవప్రవక్తా! ఆందోళన చెందకండి. అలా జరగదు. వారు నన్ను ఎంతో గౌరవిస్తారు. తమ కొడుకుల కంటే కూడా ఎక్కువ అభిమానిస్తారు. తమ ప్రాణాల కన్నా మిన్నగా చూసుకుంటారు" అన్నారు హజ్రత్ ఉర్వా (రజి).

ఆ తరువాత హజ్రత్ ఉర్వా (రజి) మదీనా నుండి బయలుదేరి చీకటి పడే సమయానికి తాయిఫ్‌కు చేరుకున్నారు. సాధారణంగా ఆయన నగరంలో ప్రవేశించగానే ముందుగా "లాత్" మందిరానికి వెళ్ళేవారు. ఆ మందిరం చుట్టూ ప్రదక్షిణ చేసి, పూజ చేసిన తరువాతనే ఆయన ఇంటికి వెళ్ళేవారు. అయితే ఈసారి ఉర్వా (రజి) అలా చేయకుండా నేరుగా ఇంటికి వెళ్ళారు.

ఆయనలో కొత్తగా వచ్చిన ఈ మార్పు చూసి సఖీఫ్ తెగ ప్రజలు ఆశ్చర్యపోయారు. అందరూ ఆయన్ని వింతగా చూడసాగారు. కొందరు అసలు విషయం ఏమిటో తెలుసు కుందామని ఆయన ఇంటికెళ్ళారు.

"ఉర్వా! ఈరోజు నీ ప్రవర్తన కొత్తగా ఉందే! ఏమిటీ విశేషం?" అడిగాడు ఒకడు.

"నేను ఇస్లాం స్వీకరించాను. మిత్రులారా! మీరు కూడా ఇస్లాం స్వీకరించాలని నేను ఆకాంక్షిస్తున్నాను" అన్నారు హజ్రత్ ఉర్వా (రజి).

"ఏమిటీ! ఇస్లాం స్వీకరించావా? మన తాతముత్తాతల మతానికి ద్రోహం తలపెడ తావా!? పరిస్థితి అంతవరకు వచ్చిందన్నమాట. పదండి. ఇక మనం ఏదో ఒకటి చేసి తీరాలి" అంటూ వారు చిందులు తొక్కుతూ అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

తెల్లవారింది. హజ్రత్ ఉర్వా (రజి) స్మృతిపథంలో రాత్రి జరిగిన సంఘటనే మాటి మాటికి మెదలుతూ ఉంది.

"ఏం చెయ్యాలి? నేను నా తెగవాళ్ళను సమావేశపరచి వారికి దైవసందేశం ఎందుకు అందజేయకూడదు? ఆ... ఈ పని చెయ్యాలి. వారికి ఇస్లాం ఔన్నత్యం ఏమిటో వివరించాలి. తాతముత్తాతల మతంలో ఉన్న చెడుల్ని గురించి హెచ్చరించాలి."

ఇలా ఆలోచించి హజ్రత్ ఉర్వా (రజి) ఓ నిర్ణయానికి వచ్చారు. ఇదొక సత్కార్యం. సత్కార్యం చేయడంలో ఆలస్యం చేయకూడదు కదా! వెంటనే ఆయన తన ఇంటి దగ్గరే ఎత్తయిన ఓ గోడ పైకెక్కి ప్రజలను బిగ్గరగా పిలిచారు.

హజ్రత్ ఉర్వా (రజి) పిలుపు విని వందలాది ప్రజలు ఆయన ఇంటి ముందు గుమిగూడారు. ఆయన ఏదో కొత్త విషయం చెప్పబోతున్నారని తలచి వారు ఎంతో ఆసక్తిగా ఎదురుచూడసాగారు.

హజ్రత్ ఉర్వా (రజి) ప్రజలకు దైవసందేశం వినిపించారు. ఏకదైవారాధనను వదలి అవిశ్వాసం, బహుదైవారాధనలో పడిఉండటం వల్ల కలిగే నష్టం గురించి హెచ్చరించారు. మానవులందరి సృష్టికర్త, యజమాని, పరిపోషకుడయిన దేవుడ్ని విశ్వసించి నమాజ్ చేయవలసిందిగా ఆయన ఉపదేశించారు.

కాని ఈ ఉపదేశం సఖీఫ్ తెగావాళ్ళ బుర్రలకు ఎక్కలేదు. తాతముత్తాతల మతాన్ని అంటిపెట్టుకొని ఉండటంలోనే వారికి ఆనందం ఉంది. అది ఎన్ని అంధవిశ్వాసాలకు, మూఢాచారాలకు ఆలవాలమైవున్నా, దాని పట్లే వారికి ఎనలేని మక్కువ. అలాంటప్పుడు వారు ఉర్వా (రజి) బోధను చల్లని గుండెలతో ఎలా సహిస్తారు?

వ్యక్తిగతంగా ఉర్వా (రజి)ను సఖీఫ్ ప్రజలు అమితంగా గౌరవిస్తారు. ఆయన గీచిన గీత దాటరు. కాని మతవ్యవహారం వచ్చేటప్పటికి మంచీ చెడు, ఉచితానుచితాలను గురించి ఆలోచించే శక్తి కోల్పోయారు. అనేకమంది ఆవేశంతో ఊగిపోతూ నిండు సభలోనే హజ్రత్ ఉర్వా (రజి)ని దుర్భాషలాడారు. మరికొందరు ఆయన్ని హేళనచేసి అవమానించారు. అనరాని మాటలతో కాకుల్లా పొడుచుకు తినసాగారు. గ్రద్దల్లా ఆయనపై విజృంభించారు. ఈ గందరగోళంలో ఎక్కడ్నుంచో ఓ దుర్మార్గుడు బాణం వదిలాడు. మరుక్షణమే హజ్రత్ ఉర్వా (రజి) రక్తపు మడుగులో పడి గిలగిల కొట్టుకోసాగారు.

ఇలా జరుగుతుందని దైవప్రవక్త (స) ముందే హెచ్చరించారు. అయినా దైవధర్మం పట్ల హజ్రత్ ఉర్వా (రజి)కున్న విశ్వాసం అలాంటిది. ఆయన ఎలాంటి జంకూ గొంకూ లేకుండా అమితాసక్తితో ధర్మప్రచార కర్తవ్యాన్ని నిర్వహించారు. చివరికి ఆ మార్గంలోనే నేలకొరిగారు. అంతటి బాధలోనూ ఆయన దైవానికి కృతజ్ఞతలు అర్పించారు.

“ఇది దేవుడు నాకు ప్రసాదించిన గౌరవం. ఆయన నాకు అమరగతి లాంటి ఉన్నత స్థానం ప్రసాదించాడు. దైవప్రవక్త (స) వచ్చినపుడు ఇక్కడ ఆయన ప్రియ అనుచరులు కొందరు అమరగతులయ్యారు. వారిది, నాది ఒకటే గమ్యస్థానం. కనుక నన్ను వారి సమాధుల పక్కనే ఖననం చేయండి” అన్నారు ఆయన తన తెగవాళ్ళతో.

ఆ తరువాత హజ్రత్ ఉర్వా (రజి) శాశ్వతంగా కన్నుమూశారు. ఆయన చెప్పిన ప్రకారమే సహచరులు కొందరు ఆయన భౌతిక కాయాన్ని ప్రవక్త సహచరుల సమాధుల పక్కన ఖననం చేశారు.

సఖీఫ్ తెగవాళ్ళు ఇస్లాంను పెద్ద విపత్తుగా తలిచారు. అందుకే వారు ఉర్వా (రజి)ను తమ శ్రేయోభిలాషి, జాతీయనాయకుడన్న గౌరవం కూడా లేకుండా దారుణంగా



హతమార్చారు. మరి అంతటితో ఈ ప్రమాదం తప్పిందా? వారు కేవలం ఇస్లాం వ్యాప్తిని అరికట్టేందుకు తమ ప్రియతమనాయకుడ్ని బలితీసుకున్నారు. మరి వారి కోరిక నెరవేరిందా?

లేదు. వారనుకున్నట్లు ఇస్లాంజ్యోతి క్షీణించలేదు. అది మరింత దేదీప్యమానంగా వెలిగిపోతూ నేల నాలుగు చెరగులా కాంతి విరజిమ్మసాగింది. ఉర్వా (రజి) కొడుకు, పినతండ్రి కొడుకు హృదయాల్ని కూడా అది జ్యోతిర్మయం చేసింది. తక్షణమే వారు దైవప్రవక్త (సల్లం) సన్నిధికి పోయి సంతోషంగా ఇస్లాం స్వీకరించారు. ఆ తరువాత కొంత కాలనికే అనేక తెగల్లో ఇస్లాం ప్రభంజనం వీచసాగింది. ఇక సఖీఫ్ తెగ ఒక్కటే బహుదైవారాధనను అంటిపెట్టుకొని ఉంది.

సఖీఫ్ నాయకులు పరిస్థితి స్వరూపాన్ని గమనించారు. ఇస్లాంని ఆశ్రయించడం తప్ప మార్గాంతరం లేదని భావించారు. అసలు ఇస్లామే నిజమైన దైవధర్మమని, సత్య ధర్మమని కూడా వారి అంతరాత్మలు ఉద్ఘాటించాయి. మరి వారిలో అంతరాత్మ ప్రబోధనను అనుసరించేవారు ఎందరో!

ఏమైనప్పటికీ తాయిఫ్ నగరంలో, దాని చుట్టుపక్కల గ్రామాల్లో కూడా అనేక తెగలు నూతన ధర్మం స్వీకరించాయి. తత్ఫలితంగా సఖీఫ్ తెగ చుట్టూ ఇస్లాం వలయం రోజురోజుకు బిగుసుకు పోసాగింది. అప్పుడు కింకర్తవ్యం అంటూ ఆ తెగనాయకులు తీవ్రంగా ఆలోచనల్లో పడిపోయారు. చివరికి చర్చల కోసం దైవప్రవక్త (సల్లం) దగ్గరికి అబ్ద్‌యాలైల్‌ని పంపడానికి నిర్ణయించుకున్నారు.

అయితే అబ్ద్‌యాలైల్ అంతకుముందు ఉర్వా (రజి)కు జరిగిన ఘోరం చూసి ఉన్నాడు. అందువల్ల అతనీ పని ఒంటరిగా చేయడానికి సాహసించలేక పోయాడు. అప్పుడు కొందరు నాయకులు ప్రతినిధివర్గం రూపంలో మదీనా వెళ్ళాలని తీర్మానం జరిగింది. ఆ ప్రతినిధి వర్గానికి వారు అబ్ద్‌యాలైల్‌నే నాయకునిగా నిర్ణయించారు. ఆ తరువాత అబ్ద్‌యాలైల్ నేతృత్వంలో ఈ ప్రతినిధి వర్గం మదీనా బయలుదేరింది.

మదీనాలో ప్రవేశించగానే, హజ్రత్ ముగైరా బిన్ షొబ (రజి) దూరాన్నుంచే చూసి వాళ్ళు సఖీఫ్ తెగనాయకులని గుర్తించారు.

“వీళ్ళు సఖీఫ్ తెగవాళ్ళు. దైవప్రవక్త (సల్లం)తో చర్చలు జరపడానికి వస్తున్నారు కాబోలు. బహుశా వీళ్ళు ఇస్లాం స్వీకరించి దైవప్రవక్త (సల్లం)కు మద్దతు ప్రకటించ వచ్చు” అనుకున్నారు ఆయన మనసులో.

“అయితే త్వరగా వెళ్ళి ఈ శుభవార్తను దైవప్రవక్త (సల్లం)కు వినిపించాలి” అంటూ హజ్రత్ ముగైరా (రజి) వెనక్కి తిరిగి వడివడిగా నడవసాగారు.

దారిలో ఆయనకు హజ్రత్ అబూబకర్ (సల్లం) తారసపడి “ముగైరా! ఏమిటీ విశేషం, హడావిడిగా వెళ్తున్నావు?” అని అడిగారు.

“ఔను విశేషమే. సఖీఫ్ తెగ ప్రతినిధివర్గం వస్తోంది. త్వరగా వెళ్ళి ఈ సంగతి దైవప్రవక్త (సల్లం)కు తెలియజేస్తాను” అన్నారు హజ్రత్ ముగైరా (రజి).

ఈ విషయం వినగానే హ॥జత్ అబూబకర్ (రజి) సంతోషంతో ఎగిరి గంతేశారు.

"ఏమిటీ! సఖీఫ్ తెగవాళ్ళా!! అయితే ముగైరా! ఈ శుభవార్తను మన ప్రియప్రవక్తకు నేనెళ్ళి విన్నవిస్తాను. ముందుగా నన్ను పోనివ్వు" అంటూ ఆయన దైవప్రవక్త (స) సన్నిధికి దౌడు తీశారు. "దైవప్రవక్తా! సఖీఫ్ తెగ ప్రతినిధి వర్గం వస్తోంది" అన్నారు ఆయన సంతోషంతో పొంగిపోతూ.

అక్కడ హ॥జత్ ముగైరా (రజి) సఖీఫ్ నాయకుల్ని కలుసుకున్నారు. దైవప్రవక్త (స) సన్నిధిలో ఎలా ప్రవేశించాలి, ఆయనకు ఎలా సలాం చెయ్యాలి, ఇస్లాంలో సలాం చేసే పద్ధతి ఏమిటి మొదలైన విషయాల్ని ఆయన ప్రతినిధి వర్గానికి తెలియజేశారు.

సఖీఫ్తెగ ప్రతినిధులు దైవప్రవక్త (స)ను కలుసుకున్నారు. అయితే వారు ముగైరా (రజి) చెప్పినట్లు గాక, తమ అలవాటు ప్రకారం అనాగరిక పద్ధతితోనే సలాం చేశారు. వారి కోసం ముస్లింలు మసీదు పక్కనే ఓచోట శిబిరాలు వేశారు. చర్చలు జరిపించడానికి హ॥జత్ ఖాలిద్ బిన్ సయీద్ (రజి) మధ్యవర్తిగా నియమించబడ్డారు.

సఖీఫ్ తెగ ప్రతినిధులు శిబిరాల్లో ఉండసాగారు. మసీదులో దైవప్రవక్త (సల్లం) నమాజ్ చేయిస్తున్నప్పుడు వీరు ఆయన ఖుర్ఆన్ పఠనాన్ని ఎంతో జాగ్రత్తగా వినేవారు. ప్రవక్త అనుచరులు నమాజ్ చేస్తున్నప్పుడు, తక్బీర్ పలుకుతున్నప్పుడు కూడా వారు శిబిరాల నుండి తొంగిచూస్తూ జాగ్రత్తగా గమనించేవారు.

చర్చలు ప్రారంభమయ్యాయి. సఖీఫ్ తెగవాళ్ళ అభిప్రాయాలేమిటో తెలుసుకోవ డానికి హ॥జత్ ఖాలిద్ బిన్ సయీద్ (రజి) వచ్చారు.

"మేము ఇస్లాం స్వీకరిస్తాం. మా తెగ ప్రజలు కూడా స్వీకరిస్తారు. అలా మేము మీతో రాజీ కుదుర్చుకుంటాం. అయితే కొన్ని షరతులు...." అన్నాడు ప్రతినిధివర్గం నాయకుడు అబ్దెయాలైల్.

"ఏమిటా షరతులు?" అడిగారు హ॥జత్ ఖాలిద్ బిన్ సయీద్ (రజి).

"మూడేండ్ల వరకు మీరు మా దేవుళ్ళ జోలికి రాకూడదు. అప్పటిదాకా మేము నమాజ్ చెయ్యకపోయినా మమ్మల్ని విడిచిపెట్టాలి" అన్నాడు అబ్దెయాలైల్.

హ॥జత్ ఖాలిద్ బిన్ సయీద్ (రజి) ఈ షరతుల్ని దైవప్రవక్త (సల్లం)కు చెబితే, ఆయన వాటిని తిరస్కరించారు. అప్పుడు సఖీఫ్ తెగవాళ్ళు ఒక సంవత్సరమైనా గడువు ఇవ్వమని అడిగారు. దానికీ దైవప్రవక్త (స) ఒప్పుకోలేదు. కనీసం ఒక నెలయినా గడువు ఇవ్వమని మనవిచేశారు వారు. దైవప్రవక్త (స) ఆ షరతును కూడా తిరస్కరించారు.

"అయితే నమాజ్ చెయ్యకుండా ఉండేందుకు మమ్మల్ని అనుమతించండి" అంటూ వారు తమ రెండవ షరతును పునరుక్తం చేశారు.

"ఏ ధర్మంలో నమాజ్ ఉండదో ఆ ధర్మం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు" అంటూ దైవప్రవక్త (స) ఈ షరతును కూడా వ్యతిరేకించారు.



ప్రతినిధి వర్గం చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఒక్క షరతు కూడా నెరవేర లేదు. దైవప్రవక్త (సల్లం) తన వైఖరిని ఎలాంటి పరిస్థితిలోనూ మార్చుకోబోరని, ఆయన చెప్పిందానికి తిరుగులేదని వారు గ్రహించారు.

అంచేత గత్యంతరంలేక వారు తమ షరతుల్ని ఉపసంహరించుకున్నారు. ఇస్లాం విధులన్నిటినీ అంగీకరించడం తప్పలేదు. అయితే తమ విగ్రహాలను మాత్రం తమ చేతులతో విరగొట్టేలా వత్తిడి చేయవద్దని విజ్ఞప్తి చేసుకున్నారు. దైవప్రవక్త (సల్లం) ఈ షరతును అంగీకరించారు.

ఆ విధంగా సఖీఫ్ తెగ ప్రతినిధులు ఇస్లాం స్వీకరించారు. అది రమజాన్ నెల. కనుక చర్చలు ముగిసి వారు ఇస్లాం సీకరించేనాటికి ఆ నెలలో ఇంకా ఎన్నిరోజులు మిగిలి ఉన్నాయో, అన్ని రోజులు ఉపవాసవ్రతాలు పాటించవలసి వచ్చింది. హ॥జత్ బిలాల్ (రజి) వారి కోసం ప్రతిరోజూ సహ్రీ, ఇఫ్తార్ల ఏర్పాటు చేసేవారు.

సఖీఫ్ ప్రతినిధులు ఇప్పుడు ముస్లింలయి పోయారు. అందువల్ల వారు తమ దగ్గరికి ఏ ఆహారపదార్థాలు తేబడినా వాటిని సంకోచించకుండా తినేవారు. అంతకు ముందైతే వారు ప్రతిదాన్నీ అనుమానంతో చూసేవారు. మధ్యవర్తి ఖాలిద్ (రజి) కాస్తో కూస్తో తిననంత వరకు వారు భోజనాన్ని చేత్తో తాకనైనా తాకేవారు కాదు. ఇప్పుడు ఇస్లాం వారిని సన్నిహితం చేసి ద్వేషం, అనుమానాలను తరిమేసింది.

చర్చలు ముగిసిన తరువాత కూడా వారు మదీనాలోనే కొన్నాళ్ళపాటు అతిథులుగా ఉండిపోయారు. తరువాత తాయిఫ్ తిరిగి వెళ్ళిపోవడానికి నిశ్చయించుకున్నారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఓ ఒప్పందం రాయించారు.

పోతే కొత్తగా ఇస్లాం స్వీకరించినవారికి దైవాజ్ఞలను బోధించవలసిన అవసరముంది. అందువల్ల దైవప్రవక్త (స) సఖీఫ్ తెగ ప్రజలకు బోధకుడిగా ఉస్మాన్ బిన్ ఆస్ (రజి)ని నియమించారు. ఈయన వయసులో చిన్నవారయినా ఖుర్ఆన్ విద్యలో మిన్న.

సఖీఫ్తెగ ప్రతినిధులు తాయిఫ్కు తిరిగి వెళ్ళిపోయారు. అక్కడ వీరు తమ తెగవాళ్ళకు చర్చల వివరాలు, ఒప్పందంలోని అంశాలు వివరంగా తెలియజేశారు. అప్పుడు సఖీఫ్ తెగ ప్రజలు ఆ ఒప్పందంలోని షరతులన్నీ సంతోషంగా అంగీకరించారు. ఆ తరువాత పురుషులు, స్త్రీలు, పిల్లలు అందరూ మూకుమ్మడిగా ఇస్లాం స్వీకరించి సరికొత్త జీవితం ప్రారంభించారు.

మరి నిన్నటివరకు ధూపదీప నైవేద్యాలతో అట్టహాసంగా పూజలందుకున్న 'లాత్' గారి సంగతేమిటి? ఇతర చిల్లరమల్లర దేవుళ్ళ విషయం ఏమిటీ?

పాపం! అవి ఏ నైవేద్యానికీ నోచుకోలేక విలపించసాగాయి! వైభవం అంతా కోల్పోయి దుమ్ముతో కొట్టుమిట్టాడసాగాయి!! నిత్యం అసంఖ్యాక భక్తులకు వరాలిచ్చే ఈ దేవుళ్ళు ఈరోజు తమపై ఈగాలు వాలుతున్నా పారదోలలేని నిస్సహాయ స్థితిలో, పరమదయనీయ స్థితిలో ఉండిపోయాయి!!! కొన్నాళ్ళకు ఆ మిథ్యాదైవాలు శతాబ్దాల తరబడిగా తిష్ఠవేసి ఉన్న మందిరాల నుంచి కూడా తీసిపారేయబడ్డాయి.

# ప్రప్రథమ హజ్ (కాబా) యాత్ర-(153)

హిజ్రీశకం 9వ సంవత్సరంలో హజ్ యాత్ర విధిగా చేయబడింది. హజ్ నెలలు కూడా సమీపించాయి. అయితే ఇస్లాం స్వీకరించడానికి అనేక తెగల ప్రతినిధి బృందాలు ఎడతెరిపి లేకుండా మదీనా వస్తుండటం వల్ల దైవప్రవక్త (సల్లం) ఆ యేడు హజ్‌యాత్రకు బయలుదేరలేక హజ్రత్ అబూబకర్ (రజి)ని పంపడానికి నిర్ణయించారు.

హజ్‌యాత్ర ప్రకటన వినగానే మదీనాలో అనేకమంది ముస్లింలు అమితోత్సాహంతో మక్కా బయలుదేరడానికి సిద్ధమయ్యారు. దైవప్రవక్త (సల్లం) వారందరికీ హజ్రత్ అబూబకర్ (రజి)ని నాయకునిగా నియమించి పంపారు.

హజ్రత్ అబూబకర్ (రజి) నాయకత్వంలో యాత్రికులు మక్కా వెళ్ళిపోయిన తరువాత తౌబా సూరాలోని మొదటి నలభై సూక్తులు అవతరించాయి. ఇవి మక్కా బహుదైవారాధకులకు, హజ్ ఆచారాలకు సంబంధించిన సూక్తులు అయినందున వీటిని మక్కా ప్రజలకు అందజేయవలసి ఉంది. అందువల్ల దైవప్రవక్త (సల్లం) వెంటనే హజ్రత్ అలీ (రజి)ని పిలిపించి విషయం వివరించారు.

‘‘అలీ! ఈ దైవసూక్తులు తీసుకొని వెంటనే మక్కా వెళ్ళిపో. ఖుర్బానీ రోజు యాత్రికులంతా ‘మినా’లో గుమికూడిన తరువాత వారికి ఈ సూక్తులు చదివి విన్పించు. అవిశ్వాసులు ఎవరూ స్వర్గ ప్రవేశం చేయలేరని (బహుదైవారాధకులకు, గ్రంథప్రజలకు) స్పష్టంగా చెప్పెయ్యి. ఈ సంవత్సరం బహుదైవారాధకులు (ప్రతిష్ఠాలయం పరిధిలో ప్రవేశించి) హజ్ ఆచారాలు చేయడానికి వీల్లేదని, ఏ ఒక్కరూ నగ్నంగా కాబా ప్రదక్షిణ చేయకూడదని ప్రకటన చెయ్యి’’ అని చెప్పారు ఆయన.

ఆ తరువాత హజ్రత్ అలి (రజి) మదీనా నుండి బయలుదేరి వేగంగా ప్రయాణం సాగించారు. మక్కా చేరుకోక ముందే దారిలో ఆయన హజ్రత్ అబూబకర్ (రజి)ని కలుసుకున్నారు. హజ్రత్ అబూబకర్ (రజి) హజ్రత్ అలి (రజి)ని చూసి ఆశ్చర్యపోతూ ‘‘ఏమిటీ, నాయకునిగా వచ్చావా లేక అనుచరునిగా వచ్చావా?’’ అని అడిగారు.

దానికి హజ్రత్ అలి (రజి) తాను యాత్రికబృందానికి నాయకునిగా రాలేదని చెప్పారు. ఆ తరువాత ఆయన దైవప్రవక్త (స) తనకు పురమాయించిన పని గురించి తెలియజేశారు. హజ్ యాత్రికులు మక్కా పట్టణం చేరుకున్నారు. హజ్రత్ అబూబకర్ (రజి) నాయకత్వంలో ఖుర్‌ఆన్ వెలుగులో ఆయన చెప్పిన పద్ధతుల ప్రకారం అందరూ హజ్ విధులు నిర్వహించారు.

హజ్ ఆచారాలలో పశువుల్ని బలి (ఖుర్బానీ) ఇవ్వడం కూడా ఉంది. ఆ బలి దినం కూడా వచ్చింది. యాత్రికులందరూ ఆరోజు ‘మినా’ ప్రదేశానికి చేరుకున్నారు. అందరూ చేరిన తరువాత హజ్రత్ అలి (రజి) దైవప్రవక్త (సల్లం) ఆదేశం ప్రకారం ఖుర్‌ఆన్‌లోని తౌబా సూరాకు చెందిన ఈ సూక్తులు పఠించి విన్పించారు:

“మీరు ఒడంబడిక చేసుకున్న బహుదైవారాధకులకు దేవుని తరఫున, ఆయనప్రవక్త తరఫున ఒప్పందం నుండి (ఇలా) విముక్తి ప్రకటన (విన్పించు): “మీరిక దేశంలో నాలుగు



నెలలు మాత్రమే (మీ ఇష్టానుసారం) సంచరించగలరు. గుర్తుంచుకోండి, మీరు దేవుని పట్టు నుండి ఏమాత్రం తప్పించుకోలేరు. సత్యతిరస్కారుల్ని దేవుడు తప్పని సరిగా పరాభవం పాల్జేస్తాడు”. (9:1,2)

“దేవుని వైపున, ఆయనప్రవక్త వైపున మహాహజ్ దినాన ప్రజలందరికీ ఓ బహిరంగ ప్రకటన (ఇలా విన్పించు): “దేవుడు, ఆయనప్రవక్త (స) బహుదైవారాధకుల పట్ల విసుగెత్తి పోయారు. ఇప్పుడైనా మీరు పశ్చాత్తాపపడి క్షమాపణ కోరితే మీకే మంచిది. ఒకవేళ ముఖం తిప్పుకుంటే గుర్తుంచుకోండి, మీరు దేవుని పట్టునుండి ఏమాత్రం తప్పించుకోలేరు.”

“ప్రవక్తా! సత్యతిరస్కారులకు అత్యంత కఠిన శిక్ష పడుతుందని శుభవార్త విన్పించు! అయితే మీతో ఒడంబడిక చేసుకొని దాన్ని పాటించడంలో ఎలాంటి కొరత చేయకపోవడమే గాకుండా, మీకు వ్యతిరేకంగా మరెవరికీ ఎలాంటి సహాయ సహకారాలు అందజేయని బహుదైవారాధకులకు ఈ హెచ్చరిక వర్తించదు. అలాంటివారి పట్ల మీరు కూడా ఒప్పందం గడువు ముగిసేదాకా నిజాయితీగా వ్యవహరించండి. దేవుడు (నిజాయితీతో మసలుకునే) దైవభీతిపరాయణులనే ప్రేమిస్తాడు.” (9:3,4)

“పవిత్రమాసాలు (అంటే ప్రకటనలో పేర్కొనబడిన నాలుగు నెలల గడువుకాలం) ముగిసిపోగానే బహుదైవారాధకులను (యుద్ధంలో) ఎక్కడ ఎదురైతే అక్కడ వధించండి. వారిని పట్టుకోండి. చుట్టుముట్టండి. వారికోసం అనువైన ప్రతి చోటా మాటువేసి కూర్చోండి. ఒకవేళ వారు క్షమాపణ చెప్పుకొని నమాజ్, జకాత్ విధులు పాటించడం ప్రారంభిస్తే వారిని వదలిపెట్టండి. దేవుడు గొప్పక్షమాశీలి, అపార దయామయుడు. బహుదైవారాధకుల్లో ఎవరైనా (దైవవాణి వినేందుకు) మీ దగ్గరికి రాదలచుకుంటే దైవవాణి వినేవరకు అతనికి ఆశ్రయం ఇవ్వండి. ఆ తరువాత అతడ్ని అతని భద్రతా స్థలానికి సురక్షితంగా చేర్చండి. వారు (సత్యం ఎరగని) జ్ఞానశూన్యులు. అందువల్ల మీరిలా చేయవలసి ఉంటుంది.” (9:5,6)

“ఈ బహుదైవారాధకుల ఒడంబడిక దేవుని దగ్గర, ఆయన ప్రవక్త దగ్గర ఎలా నిలుస్తుంది? కాని మీరు ప్రతిష్ఠాలయం (కాబాగృహం) వద్ద (శాంతి) ఒప్పందం చేసుకున్న బహుదైవారాధకుల సంగతి వేరు. వారు మీ పట్ల సవ్యంగా ఉన్నంత వరకు మీరు కూడా వారి పట్ల సవ్యంగానే ఉండండి. దేవుడు (అలాంటి) భయభక్తులు కలవారినే ప్రేమిస్తాడు. వారు తప్ప ఇతర బహుదైవారాధకులతో ఒప్పందం ఎలా సాధ్యమవుతుంది? మీ మీద వారు పైచేయిగా ఉంటే మీ విషయంలో ఎలాంటి బంధుత్వాన్ని కూడా ఖాతరుచేయరు. ఒప్పందాన్ని కూడా ఖాతరుచేయరు. వారు కేవలం మాటలతో మిమ్మల్ని తృప్తిపరచడానికి ప్రయత్నిస్తారు. కాని వారి హృదయాలు మాత్రం వాటిని నిరాకరిస్తాయి. వారిలో చాలామంది దుర్జనులే ఉన్నారు.” (9:7,8)

“వారు దేవుని సూక్తులు స్వల్పమూల్యానికి అమ్ముకొని, ప్రజలను దైవమార్గం వైపు రాకుండా నిరోధిస్తూ చాలా చెడ్డపని చేస్తున్నారు. వారు విశ్వాసుల విషయంలో ఎలాంటి బంధుత్వాన్నిగాని, ఒప్పందం షరతులుగాని ఖాతరు చేయరు. అన్యాయం, అతిక్రమణలు ఎల్లప్పుడూ వారివైపు నుండే మొదలవుతాయి. ఇప్పటికైనా వారు పశ్చాత్తాపం చెంది నమాజ్, జకాత్ విధులు పాటించడం ప్రారంభిస్తే వారు మీ ధార్మిక సోదరులవుతారు.

వాస్తవికతను అర్థం చేసుకునే వారి కోసం మేము మా ఆజ్ఞలను (ఈవిధంగా) వివరిస్తున్నాము." (9:9-11)

"ఒకవేళ వారు (దైవాజ్ఞల పాటింపు విషయంలో) ప్రమాణం చేసిన తరువాత, తమ ప్రమాణాలు భంగపరచి మీ ధర్మంపై దాడిచేయడానికి పూనుకుంటే, అలాంటి అధర్మ ధ్వజ వాహకులతో యుద్ధం చేయండి. వారి ప్రమాణాలు ఇక ఎంతమాత్రం నమ్మదగినవి కావు. వారు బహుశా (ఖడ్గశక్తి ద్వారానే) దారికి వస్తారు." (9:12)

"అవిశ్వాసులు (తమ చేష్టల ద్వారా) సత్యతిరస్కారానికి వ్యతిరేకంగా తమకు తామే సాక్ష్యం ఇచ్చుకున్నారు. వారు (గతంలో) చేసుకున్న సత్కార్యాలన్నీ వ్యర్థమయి పోయాయి. వారిక నరకంలోనే శాశ్వతంగా పడిఉంటారు. అలాంటివారు దైవగృహాలకు ధర్మకర్తలయి కూర్చోవడం ఎంతమాత్రం తగదు.

దేవుడ్ని, పరలోకాన్ని విశ్వసించినవారే దైవగృహాలకు సేవ చేయడానికి అర్హులవుతారు. వారు నమాజ్ స్థాపిస్తారు; జకాత్ చెల్లిస్తారు; దేవునికి తప్ప మరెవరికీ భయపడరు. అలాంటివారే సన్మార్గంలో నడుస్తారని ఆశ ఉంటుంది." (9:17,18)

"విశ్వాసులారా! బహుదైవారాధకులు అపవిత్రులు గనక ఈ సంవత్సరం తర్వాత వారిని ప్రతిష్ఠాలయం(కాబాగృహం) దరిదాపులకు రానివ్వకండి. ఒకవేళ (మీ వ్యాపారం మందగించి) మీరు లేమికి గురవుతారని భయపడితే (అలా భయపడనవసరం లేదు.) దేవుడు తలిస్తే తన ప్రత్యేక అనుగ్రహంతో మిమ్మల్ని ధనికులుగా చేస్తాడు. దేవుడు సర్వజ్ఞాని, మహా వివేకవంతుడు." (9:28)

"వారు తమ నోటితో దేవుని జ్యోతి (సత్యధర్మం) ఆర్పివేయ గోరుతున్నారు. కాని సత్యతిరస్కారులకు ఎంత వెగటు కలిగినా దేవుడు మాత్రం తన జ్యోతిని నేల నాలుగు చెరగులా ప్రసరింపజేయనిదే వదలిపెట్టడు. సత్యధర్మం బహుదైవారాధకులకు ఏమాత్రం నచ్చక పోయినాసరే ఇది యావత్తు జీవనవ్యవస్థలపై ఆధిక్యత పొందడానికి ఆ దేవుడే తన (అంతిమ) ప్రవక్తకు సత్యాన్ని, హితబోధను ఇచ్చి పంపాడు." (9:32,33)

"మాసమార్పిడి పద్ధతి అవిశ్వాసానికి అదనంగా మరొక అవిశ్వాస చేష్ట అవుతుంది. దాని ద్వారా బహుదైవారాధకులు (మరింత) మార్గభ్రష్టత్వంలో పడిపోతున్నారు. ఒక సంవత్సరం వారు ఒక నెలను ధర్మసమ్మతం చేసుకొని మరొక సంవత్సరం దాన్ని నిషేధించు కుంటారు. దేవుడు నిషేధించిన నెలల సంఖ్యను పూర్తిచేయడానికి, ఆ నెలలు ధర్మసమ్మతం కావడానిక్కూడా ఈవిధంగా చేస్తారు.

(ఇలా) వారి దుష్కృత్యాలు వారికి పుణ్యకార్యాలుగా తోచేటట్లు చేయ బడ్డాయి. దేవుడు (అలాంటి) సత్యతిరస్కారులకు ఎన్నటికీ సన్మార్గం చూపడు." (9:37)

## అసత్య ప్రవక్తలు-(154)

హిజ్రీశకం 10వ సంవత్సరం ప్రారంభమయింది. సత్యధర్మస్వీకార పర్వం వేగం పుంజుకుంది. ప్రజలు ఇస్లాం పట్ల ఆకర్షితులయి, దాని వివరాలు తెలుసుకోవడానికి



తండోపతండాలుగా మదీనా వస్తున్నారు. దైవప్రవక్త (సల్లం) అందరికీ స్వాగతం చెబుతూ దైవసందేశం ఉపదేశిస్తున్నారు. మొన్నటి వరకు ముస్లింలు అంటే మండిపడుతూ వారికి బద్ధశత్రువులుగా ఉండినవాళ్ళు సయితం నేడు తమంతట తాము మదీనా వచ్చి ముస్లింలకు ప్రాణమిత్రులయి పోసాగారు.

ఆ సంవత్సరం రమజాన్ నెలలో గస్సాన్ ప్రాంతం నుండి ముగ్గురు సభ్యులతో కూడిన ఒక ప్రతినిధి బృందం మదీనా వచ్చింది. దైవప్రవక్త (సల్లం) వారికి హితోపదేశం చేయగానే వారు ముగ్గురూ ఏమాత్రం తటపటాయించకుండా ఇస్లాం స్వీకరించారు. తరువాత వారు తమ ప్రాంతానికి తిరిగివెళ్ళి తమ జాతిప్రజలకు ఇస్లాం ధర్మం గురించి బోధించారు. కాని ఆ ప్రజలు ఇస్లాం స్వీకరించలేదు.

ఆజద్ ప్రాంతం నుండి కూడా పది మంది సభ్యులతో కూడిన ఒక ప్రతినిధి బృందం వచ్చి ఇస్లాం ధర్మం స్వీకరించింది. అంతేకాదు, ఆ పదిమంది సభ్యులు చేసిన ధర్మ ప్రచారంతో వారి (ఆజద్) తెగ ప్రజలంతా మూకుమ్మడిగా ఇస్లాం స్వీకరించారు. అయితే ఈ కారణంగా జర్ష్ తెగకు, ఆజద్ తెగకు మధ్య యుద్ధం జరిగింది. యుద్ధం జరగడానికి ముందు జర్ష్‌తెగ నాయకులు దైవప్రవక్త (సల్లం)ను గురించి వివరాలు తెలుసుకోవడానికి ఇద్దరు ప్రతినిధులను మదీనా పంపారు.

ఆ ఇద్దరు ప్రతినిధులు మదీనా చేరుకున్నారు. వారు దైవప్రవక్త (సల్లం)ను కలుసుకొని చర్చలు ప్రారంభించారు. ఆ సందర్భంలో దైవప్రవక్త (సల్లం) వారితో మాట్లాడుతూ "ఇప్పుడు జర్ష్ తెగకు, ఆజద్ తెగకు మధ్య యుద్ధం జరుగుతోంది. ఆ యుద్ధంలో జర్ష్‌తెగ పరాజయం చవిచూస్తుంది" అని తెలియజేశారు.

ఆ తరువాత జర్ష్ తెగ ప్రతినిధులు తమ ప్రాంతానికి తిరిగి వెళ్ళిపోయారు. విచారిస్తే అదే రోజు తమ తెగవాళ్ళు చిత్తుగా ఓడిపోయి పలాయనం చిత్తగించారు. జర్ష్ ఓటమి గురించి దైవప్రవక్త (సల్లం) చెప్పిన భవిష్యత్ వాణిని వారు తమ తెగవాళ్ళకు విన్పించారు. అప్పుడు జర్ష్ తెగప్రజలు ఎంతో ప్రభావితులయి ఇస్లాం స్వీకరించారు.

అలాగే జారూద్ బిన్ అమ్ర్ నాయకత్వంలో అబ్దె ఖైస్ తెగకు చెందిన కొందరు క్రైస్తవ ప్రతినిధులు కూడా మదీనా వచ్చి ఇస్లాం స్వీకరించారు. ఆ తరువాత వారు తమ ప్రాంతానికి వెళ్ళి ధర్మోపదేశం చేయగానే ఆ తెగప్రజలందరూ పరమ సంతోషంతో ఇస్లాం స్వీకరించి ముస్లింలయి పోయారు.

దైవప్రవక్త (సల్లం)ను కలుసుకోవడానికి యమామా నుండి బనీ హనీఫా తెగ ప్రతి నిధులు కూడ వచ్చారు. వారు తమ సామగ్రి ఒకచోట దించి అక్కడ తమలోని ముసైలమా అనే వ్యక్తిని కాపలా ఉంచారు. ఆ తర్వాత వారు నేరుగా దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళి ఇస్లాం స్వీకరించారు.

దైవప్రవక్త (సల్లం) బనీహనీఫా తెగవాళ్ళ ప్రతినిధుల్ని ఎంతగానో గౌరవించారు. సంతోషంతో ఆయన వారికి కొన్ని కానుకల్ని కూడా బహూకరించారు. ఆ సందర్భంలో వారు దైవప్రవక్త (సల్లం) ముందు ముసైలమా విషయాన్ని ప్రస్తావిస్తూ-

"దైవప్రవక్తా! మా బృందంలో మరో మనిషి కూడా ఉన్నాడు. అతను మేము విడిది చేసిన చోట మా సామానుకు కాపలా కాస్తున్నాడు" అని చెప్పారు.

"అయితే అతను మీ సామానుకు కాపలా కాస్తున్నందున అతని స్థానం మీలో ఏ ఒక్కరి కన్నా తక్కువ కాదు" అంటూ దైవప్రవక్త (సల్లం) ముసైలమా వంతు కానుక కూడా వారికి ఇచ్చారు.

బనీహనీఫా ప్రతినిధులు సంతోషంతో యమామా తిరుగు ప్రయాణమయ్యారు. దారిలో వారు ముసైలమాతో అతడ్ని గురించి దైవప్రవక్త (సల్లం) అన్న మాటలను ప్రస్తావించారు. మదీనాలో ఉన్నప్పుడే ముసైలమా ప్రతినిధివర్గం సభ్యులతో పాటు ఇస్లాం స్వీకరించాడు. అయితే యమామా తిరిగొచ్చిన కొన్నాళ్ళకే అతను మతభ్రష్టుడయ్యాడు. అంతేగాకుండా తాను కూడా ఓ దైవప్రవక్తనని ప్రకటించుకున్నాడు.

ముసైలమా తన విషయంలో దైవప్రవక్త (సల్లం) చెప్పిన మాటలను ఆధారంగా చేసుకొని తనను గురించి ప్రచారం చేసుకోవడం ప్రారంభించాడు. అతను ఓ ఖుర్ఆన్ని కూడా కల్పించుకొని దాన్ని దైవగ్రంథంగా, తనను దైవప్రవక్తగా విశ్వసించమని ప్రజలకు చెప్పసాగాడు. ఆ విధంగా తన తెగలో అనేకమంది ప్రజలను ఆకట్టుకున్నాడు. అతను వారి కోసం అధర్మ విషయాల్ని కూడా ధర్మసమ్మతం చేశాడు.

ఒక రోజు అతను మహాప్రవక్త ముహమ్మద్కు (సల్లం)కు ఒక లేఖ రాసి పంపించాడు. అతని శిష్యులు ఈ లేఖ తీసుకొని మదీనా వెళ్ళి మహాప్రవక్త (సల్లం)కు అందజేశారు. అందులో ఈవిధంగా ఉంది:

"దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) పేరిట దైవప్రవక్త ముసైలమా రాసిన లేఖ- మీపై శాంతి వర్షించుగాక! మొదట మీరు ఒంటరిగా ఉండేవారు. ఈ దైవదౌత్య మహా కార్యంలో మీకు తోడు ఎవరూ లేకపోయారు. అయితే ఇప్పుడు నేను మీకు తోడుగా ఈ మహాకార్యంలో భాగస్వామిగా నియమించబడ్డాను. కనుక అర్థ భూమికి మేము వారసులం, మిగతా అర్థభూమికి ఖురైషీయులు వారసులు. కాని ఖురైషీయులు మాపై దౌర్జన్యం చేస్తున్నారు. (వారికి మీరు కాస్త నచ్చజెప్పండి.)"

ఈ లేఖలోని విషయాలు వినగానే దైవప్రవక్త (సల్లం) ముఖం జేవురించింది.

"మరి ఈలేఖ గురించి మీ అభిప్రాయం ఏమిటీ?" అని అడిగారు ఆయన ఉత్తరం తెచ్చిన వాళ్ళతో. "ఆయన మా యజమాని. మేము ఆయన బానిసలం"అన్నారు ముసైలమా శిష్యులు.

"దౌత్యవేత్తలను హతమార్చకూడదు. లేకపోతే మీ ఇద్దరి తలలు ఎగిరిపోయేవి" అన్నారు దైవప్రవక్త (సల్లం).

ఆ తరువాత ఆయన ముసైలమాకు ఇలా సమాధానం రాసి పంపించారు:

"భూమి దేవునిది. (ఆయనే దాని అసలు యజమాని.) ఆయన తన దాసుల్లో తాను తలచిన వారిని దానికి వారసులుగా చేస్తాడు."



అసత్య దైవదౌత్యం గురించిన ఈ ఉపద్రవం అంతటితో ఆగలేదు. 'సనా' ప్రాంతంలో అసూద్ అనేవాడు, 'నజద్' ప్రాంతంలో తులైహ అనేవాడు కూడా తాము దైవప్రవక్తలం అని చాటుకొని ప్రచారం చేయసాగారు. ఇలా ఈ దుర్మార్గులు అమాయక ప్రజలను వంచించి తమ సామ్రాజ్య దాహం తీర్చుకోవడానికి పన్నాగాలు పన్నారు. ఆ ముగ్గురిలో అసూద్, తులైహా అనేవాళ్ళు మాత్రం దైవప్రవక్త (సల్లం) జీవితకాలంలో బహిరంగంగా ముందుకు రావడానికి సాహసించలేక పోయారు.

ఇస్లాంధర్మం ఎంత వేగంగా వ్యాపిస్తున్నదో స్వార్థపర శక్తులు, సత్యవ్యతిరేక శక్తులు కూడా అంతే వేగంతో పనిచేస్తూ బాహాటంగా విజృంభించసాగాయి. ఆమిర్ బిన్ తుఫైల్ కూడా ఆ కోవకు చెందినవాడే.

నజద్ ప్రాంతంలో ఇస్లాం స్వీకరించిన ప్రజలకు ఇస్లాం ఆదేశాలను, దాని ధర్మాలను బోధించి వారిని సుశిక్షితుల్ని చేయవలసి ఉంది. ఈ పని కోసం దైవప్రవక్త (సల్లం) కొందరు అనుచరుల్ని నజద్ పట్టణానికి పంపించారు. అయితే దారిలో ఆమిర్ కొందరు దుండగుల్ని వారిపైకి ఉసిగొల్పాడు. ఆ దుండగులు దైవప్రవక్త (సల్లం) అనుచరుల్ని మోసగించి దారుణంగా హతమార్చారు.

ఆమిర్ అంతటితో తృప్తి చెందలేదు. ముస్లింలను మోసగించి, ఇస్లాంపై మరోసారి దెబ్బతీయడానికి అవకాశం కొసం ఎదురుచూడసాగాడు. ఒకసారి ఆమిర్ తెగ ప్రజలు కొందరు ఇస్లాం స్వీకరించడానికి మదీనా బయలుదేరారు. ఆ బృందంలో ఆమిర్, అతని స్నేహితుడు అర్బద్ కూడా ఉన్నారు.

మదీనా చేరిన తరువాత ఈ దుష్టద్వయం తప్ప అందరూ దైవప్రవక్త (సల్లం) ఉపదేశానికి ప్రభావితులై ఆయన సన్నిధిలో ఇస్లాం స్వీకరించారు. అయితే అక్కసు వెళ్ళబోసుకోవడానికి వచ్చిన ఈదుర్మార్గుల పన్నాగం పారలేదు. చివరికి ఆమిర్ చేసేదిలేక "ఈ లోయను సైనికులతో నింపుతాను. కడుపుమంట చల్లార్చుకొని గాని నేను విశ్రాంతి తీసుకోను" అని గొణుగుకుంటూ వెళ్ళిపోయాడు.

దైవప్రవక్త (స) అతను పలికిన ఈమాటలు విని కూడా అతనికి వ్యతిరేకంగా ఎలాంటి చర్య తీసుకోలేదు. "దేవా! ఆమిర్ కీడు నుండి కాపాడు" అని మాత్రమే ఆయన అన్నారు.

ఆమిర్ స్వస్థలానికి ఇంకా చేరుకునే లేదు. దారిలో అతనికి ప్లేగు వ్యాధి సోకింది. చూస్తుండగానే అతని పరిస్థితి చాలా భయానకంగా మారిపోయింది. అతని కంఠనాళాలు ఉబికి బయటికి వచ్చేశాయి. నిలబడటానిక్కూడా శక్తిలేకుండా పోయింది. అతని సహచరులు అతడ్ని సలూల్ తెగకు చెందిన ఓ స్త్రీ ఇంటికి చేర్చారు. ఇప్పుడు ఆమిర్ తలపై మృత్యువు తాండవిస్తోంది.

"అబ్బా! అమ్మా! నా పరిస్థితి చూడండి. నా కంఠనాళాలు ఉబికి ఎలా బయటికి వచ్చాయో చూడండి. మృత్యువు సమీపించింది. అదిగో నాముందు కరాళనృత్యం చేస్తోంది. అయ్యో నాకు చావు మూడింది! అదీ పరదేశంలో ఒక స్త్రీ ఇంట!! అయ్యయ్యో!" అంటూ ఆమిర్ బాధతో మెలికలు తిరిగిపోసాగాడు.

ప్లేగువ్యాధి ఆమిర్ రక్తాన్ని పూర్తిగా పీల్చివేసింది. అతని జీవనజ్యోతి ఆరిపోయింది. చలనం కోల్పోయిన అతని భౌతికకాయం దిక్కూమొక్కూ లేకుండా పడిపోయింది.

దుష్టద్వయంలోని అర్బద్ ఈ భయంకర దృశ్యం చూసి కూడా గుణపాఠం నేర్చుకో లేదు. అతనింకా కడుపు మంటతో చిందులేస్తునే ఉన్నాడు. స్వస్థలానికి చేరుకోగానే అతని తెగవాళ్ళు వచ్చి "అర్బద్! ఏమిటి విశేషాలు? ముహమ్మద్ (సల్లం) సంగతి ఏమయింది?" అని అడిగారు.

"ఏమీ కాలేదు. నా గుండెలు మండిపోతున్నాయి. అతను గనక నా చేతికి చిక్కితే మాత్రం అతని రక్తాన్ని పూర్తిగా పీల్చిగాని వదలిపెట్టను. అప్పుడే నాకు మనశ్శాంతి" అన్నాడు అర్బద్ చేతకాని రోషంతో కుతకుతలాడుతూ.

కాని దైవనిర్ణయం గురించి ఆ ప్రబుద్ధుడికేం తెలుసు? రెండు మూడు రోజుల్లోనే అతని చరిత్ర కూడా కాలగర్భంలో కలసిపోతుందని, ఇక తన ఊసెత్తేవారే లోకంలో ఉండరని ఆ దైవద్రోహి ఎలా గ్రహిస్తాడు?

అర్బద్‌కు కొన్ని ఒంటెలున్నాయి. వాటిలో ఒకదాన్ని అమ్మడానికి ఓరోజు ఎక్కడికో తీసికెళ్తున్నాడు. దారిలో ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభమయింది. ఆ మరుక్షణమే పెళపెళ మంటూ పిడుగు పడింది అతని మీద. అంతే... ఆ దైవద్రోహి అక్కడికక్కడే కుప్పకూలి పోయాడు. శత్రువుల కుట్రలు వమ్మయిపోయాయి. దాంతో షైతాన్ తలబాదుకుంటూ దిగంతాలకు పారిపోయాడు.

## నజ్రాన్ క్రైస్తవులతో చర్చలు-(155)

మదీనా నుండి అరేబియా అంతటా ఇస్లాం శరవేగంతో విస్తరిస్తోందని నజ్రాన్ క్రైస్తవులకు తెలిసింది. అప్పుడు వారు దైవప్రవక్త (స)ను కలుసుకొని ఆయన బోధించే ధర్మంగురించి తెలుసుకురమ్మని ఓ ప్రతినిధి బృందాన్ని మదీనా పంపించారు. ఆ బృందం లో అరవైమంది క్రైస్తవులు ఉన్నారు. వారిలో అబ్దుల్ మసీహ్, ఐహమ్, అబూహారిసా అనే ముగ్గురు ప్రముఖులున్నారు. వారు తమజాతిలో మంచి పలుకుబడి కలిగినవారు. అందరూ వారిని ఎంతో గౌరవిస్తారు. వారి అభిప్రాయాల్ని శిరోధార్యాలుగా భావిస్తారు.

ఈ ప్రతినిధి బృందానికి అబ్దుల్ మసీహ్ నాయకుడు. ఐహమ్ అతని సలహాదారుడు. అబూహారిసా వారి మతగురువు. ఇతను క్రైస్తవ సాహిత్యాన్ని కూలంకషంగా అధ్యయనం చేసిఉన్నాడు. మతజ్ఞానంలో లోతుపాతులు తెలిసినవాడు. ఈ కారణం వల్లనే రోమ్ చక్రవర్తులు అతడ్ని అమితంగా గౌరవించేవారు. అతని కోరికపై వారు అనేక చర్చీలు నిర్మించి ఇచ్చారు. పారితోషికాలు కూడా బాగా ముట్టజెప్పేవారు. అతని మతసేవను క్రైస్తవులందరూ ఎంతో మెచ్చుకునేవారు.

ఈ ప్రతినిధులు మదీనా చేరుకొని దైవప్రవక్త (స)ను కలుసుకున్నారు. దైవప్రవక్త (సల్లం) వారికి స్వాగతం చెప్పి సత్కరించారు. ఆ తరువాత ఆయన ఖుర్ఆన్ సూక్తులు విన్పించి వారిని ఇస్లాం వైపు ఆహ్వానించారు. వారడిగిన ప్రశ్నలకు తగిన సమాధానాలు



కూడా ఇచ్చారు. కాని వారు ఇస్లాం స్వీకరించడానికి ఏమాత్రం సుముఖంగా లేరు. ఉభయ పక్షాల మధ్య వేడివేడి చర్చలు జరిగాయి. వాదోపవాదాలు కూడా జరిగాయి. కాని క్రైస్తవ ప్రతినిధులు ప్రవక్త సందేశాన్ని త్రోసిపుచ్చి వితండవాదానికి దిగారు.

"ముహమ్మద్‌గారూ! ఇంతకూ మీరు కోరుతున్నదేమిటీ? మేము మిమ్మల్ని దేవుడిగా చేసుకోమంటున్నారా?" అన్నారు వారు.

"దేవుడు మన్నించుగాక! ఇలాంటి మాటల కీడు నుండి నేను దైవాన్ని శరణుకోరు తున్నాను. దేవుడ్నిగాక ఇతరుల్ని ఆరాధించడంగాని, అలాంటి బోధ చేయడంగాని నాకు తగదు. దైవం నన్నలా బోధించడానికి పంపలేదు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

"అయితే మీరు ఏ దైవప్రవక్తల్ని విశ్వసిస్తున్నారు?" అడిగారు క్రైస్తవులు.

"మేము అల్లాహ్‌ను, ఆయన పంపిన ప్రతి విషయాన్నీ విశ్వసిస్తున్నాము. ఇబ్రాహీం, ఇస్మాయీల్, యాఖూబ్‌లను విశ్వసిస్తున్నాము. యాఖూబ్‌పై, ఆయన సంతానంపై అవతరించిన దైవాజ్ఞలను కూడా విశ్వసిస్తున్నాము. అలాగే మూసా, ఈసా ప్రవక్తలపై అవతరించిన సమస్త విషయాలను మేము విశ్వసిస్తున్నాము. మేము దైవప్రవక్తలందర్నీ విశ్వసిస్తున్నాము. వారి మధ్య మేము ఎలాంటి తారతమ్యాలు చూపము. ప్రతి దైవాజ్ఞ ఎదుట మేము శిరస్సు వంచుతాము" అన్నారు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స).

"అంటే మేము ఏ విషయాలనైతే విశ్వసిస్తున్నామో వాటిని మీరు కూడా విశ్వసిస్తున్నా రన్నమాట. మరైతే మాదగ్గర మీకు నచ్చని విషయం ఏమిటీ?" అడిగారు వారు.

"మీరు దైవగ్రంథాల్లో మార్పులు చేశారు. అనేక మాటలు మీరు స్వయంగా కల్పించి వాటిలో చేర్చారు" అన్నారు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం).

"మేము మా దగ్గరున్న గ్రంథాన్నే విశ్వసిస్తాం. ఈసా (అలైహి) దేవుని కుమారుడని మేము విశ్వసిస్తున్నాం" అన్నారు క్రైస్తవులు.

"మా దేవుడు మటుకు ఒక్క అల్లాహ్ మాత్రమే. ఆయన దైవత్వంలో (గుణగణాల్లో, శక్తిసామర్థ్యాల్లో మరెవరూ భాగస్వాములు లేరు. గ్రంథప్రజలారా! నామాట వినండి. దేవుడు పంపిన ఇస్లాం ధర్మం స్వీకరించండి. నేను కొత్త విషయాలేమీ చెప్పడం లేదు. మూసా, ఈసా ప్రవక్తలు; వారికి పూర్వం వచ్చిపోయిన ప్రవక్తలు బోధించిన విషయాలే నేను మీకు బోధిస్తున్నాను" అన్నారు విశ్వకారుణ్యమూర్తి ముహమ్మద్ (సల్లం) ఎంతో ఆవేదనాభరిత హృదయంతో.

"మేము మీకు పూర్వమే ఇస్లాం (దైవవిధేయతా విధానం) స్వీకరించి ఉన్నాము" అన్నారు క్రైస్తవ ప్రతినిధులు.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) వారికి తగిన సమాధానాలు ఇస్తున్నారు. పాదరీలు, పండితుల వాదనలను తిప్పికొడుతున్నారు. తప్పుడు విషయాలను, అంధవిశ్వాసాలను ఖండిస్తూ వారికి నిజధర్మం ఏమిటో వివరిస్తున్నారు. ఈసా ప్రవక్త (అలైహి) స్థానమేమిటో, ఆయన తెచ్చిన అసలు బోధనలేమిటో తెలియజేశారు. అంతగా చెప్పినా క్రైస్తవనాయకు

లకు తలకెక్కలేదు. తమ మొండివైఖరి విడనాడలేదు. తమ విశ్వాసాలే సరయినవని, ఆయనవన్నీ తప్పుడు మాటలని అన్నారు.

చివరికి అంతిమ దైవప్రవక్త (సల్లం) వారికి ఒక సవాలు విసిరారు:

“సరే, మీ విశ్వాసాలే నిజమైనవి అనుకుంటే, ప్రమాణం చేద్దాం రంగంలోకి దిగండి. నాతోపాటు నా కుటుంబసభ్యులు కూడా ఉంటారు. మీరు కూడా మీ భార్యాపిల్లల్ని పిలుచుకోండి. ఉభయపక్షాలు కూర్చొని అసత్యవాదులపై దేవుని అభిశాపం (శిక్ష) పడుగాక అని చెబుదాం'' అన్నారు దైవప్రవక్త (సల్లం).

క్రైస్తవులు ఈ మాట విని మౌనంగా ఉండిపోయారు.

మరుసటి రోజు దైవప్రవక్త (సల్లం) తన కుటుంబం నుంచి అలి (రజి), ఫాతిమా (రజి), హసన్ (రజి), హుసైన్ (రజి)లను తీసుకొని వచ్చారు.

“రండి ప్రమాణం చేద్దాం. మనలో ఎవరు అసత్యవాదులయితే వారిపై దైవశిక్ష విరుచుకు పడుగాక అని నేను పలుకుతాను. అప్పుడు మీరు తథాస్తు అని చెప్పాలి'' అన్నారు దైవప్రవక్త (సల్లం).

“రండి! (ప్రమాణం చేద్దాం.) మేము మా భార్యాపిల్లల్ని పిలుస్తాం. మీరు కూడా మీ భార్యాపిల్లల్ని పిలుచుకోండి. ఆ తరువాత మనమందరం కలసి, అసత్యం పలికేవారిపై దేవుని అభిశాపం (ఆగ్రహం) పడుగాక అని ప్రార్థిద్దాం.” (ఖుర్ఆన్-3:61)

క్రైస్తవులు దైవశాపం మాట విని కంపించిపోయారు. ఈ సవాలును ఎదుర్కోవడానికి సాహసిస్తే ఇక తాము దేవుని పట్టు నుండి బ్రతికి బయటపడలేమని భావించారు.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) వారితో ఇలా అన్నారు:

“గ్రంథ ప్రజలారా! మీకూ, మాకూ మధ్య ఉమ్మడిగా ఉన్న ఒక మంచి విషయాన్ని అంగీకరిద్దాం రండి. మనం అల్లాహ్‌ను తప్ప మరెవరినీ ఆరాధించకూడదు. ఆయనకు సాటి కల్పించకూడదు.” (ఖుర్ఆన్-3:64)

దీంతో వారికిక వాదించడానికి అవకాశమే లేకుండా పోయింది.

“ముహమ్మద్‌గారూ! మాక్కాస్త ఆలోచించుకోనివ్వండి. ఆ తరువాత మా నిర్ణయం మీకు తెలియజేస్తాం'' అన్నారు క్రైస్తవ పండితులు.

అలా చెప్పి వారు అక్కడ్నుంచి లేచి దూరంపోయి సమాలోచనలు జరుపుకున్నారు.

“ఇప్పుడు మనం ఏం చేద్దాం చెప్పండి'' అన్నారు క్రైస్తవులు తమ నాయకులతో.

“సోదరులారా! ముహమ్మద్ సత్యప్రవక్త అని తెలుస్తూనే ఉంది. ఈసా (అలైహి)ని గురించి ఆయన చెప్పింది కూడా వాస్తవమే. అయితే గతంలో ఏ ప్రవక్తయినా తన జాతిని శపించినప్పుడల్లా జరిగిన దుష్పరిణామాలు మీకు తెలియనివి కావు. ఆనాడు పిల్లలు, వృద్ధులు అందరూ సర్వనాశనమయ్యారు. దైవశిక్ష నుండి ఒక్కరూ తప్పించుకోలేక పోయారు. అదీ మీకు తెలిసిన విషయమే.



ఒకవేళ ముహమ్మద్ (సల్లం) విసిరిన సవాలును ఎదుర్కోవడానికి సాహసించామా, మనకిక కీడు మూడినట్లే. మనం నామరూపాల్లేకుండా పోతాం. అలాగాకుండా మనం మన ధర్మంలోనే స్థిరంగా ఉండి, మన దైవప్రవక్త విషయంలో మన విశ్వాసాలను కాపాడుకో దలచుకుంటే పదండి, ఆయనతో రాజీ కుదుర్చుకొని మన దారిన మనం వెళ్ళిపోదాం'' అన్నాడు వారి నాయకుడు.

నాయకుని అభిప్రాయంతో అందరూ ఏకీభవించారు.

ఆ తరువాత క్రైస్తవ ప్రతినిధులు తమ నిర్ణయం తెలియజేయడానికి వచ్చారు.

“మేము ఎట్టి పరిస్థితిలోనూ ప్రమాణం చేయడానికి సిద్ధంగా లేము'' అన్నారు వారు దైవప్రవక్త (సల్లం)తో.

“ప్రమాణం చేయకపోతే అందరిలా మీరూ ఇస్లాం స్వీకరించి ముస్లింలయి పొండి'' అన్నారు దైవప్రవక్త (సల్లం).

“ఇది కూడా మాకు ఇష్టంలేదు'' అన్నారు క్రైస్తవ ప్రతినిధులు.

“అయితే మాకు జిజ్యా (భద్రతా రుసుము) చెల్లించండి, లేదా మాతో యుద్ధం చేయండి'' అన్నారు దైవప్రవక్త (సల్లం).

“ముహమ్మద్ గారూ! మనం పరస్పరం రాజీపడదాం. మేము మీకు జిజ్యా (రక్షణ రుసుం) చెల్లిస్తూ ఉంటాము. మీరు మీ ధర్మంలో ఉండండి. మేము మా ధర్మంలోనే ఉంటాము'' అన్నారు వారు.

అంతటితో చర్చలు ముగిశాయి. క్రైస్తవులు తమ అతిథిగృహానికి వెళ్ళిపోయారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) తన అనుచరులతో మాట్లాడుతూ...

“వీరు గనక ప్రమాణం చేసివుంటే, ఇక ప్రళయం దాకా ప్రపంచంలో ఒక్క క్రైస్తవుడు కూడా జీవించి ఉండేవాడు కాదు'' అని అన్నారు.

క్రైస్తవ ప్రతినిధులు తమ సామాను సర్దుకొని బయలుదేరుతూ “మాదొక చిన్న విన్నపం. మాలో కొన్ని ఆస్తి వివాదాలున్నాయి. మీమనుషుల్లో ఎవరినైనా మావెంట పంపండి. ఆయన చెప్పిన తీర్పు ప్రకారం మేము నడుచుకుంటాం'' అన్నారు

వారి కోరిక ప్రకారం దైవప్రవక్త (సల్లం) అబూఉబైదా (రజి)ను పంపించారు. ఆ తరువాత క్రైస్తవ ప్రతినిధివర్గం మదీనా నుండి వెళ్ళిపోయింది.

“ఔను, మనకు ఏ ప్రవక్త విషయంలో భవిష్యత్ ప్రకటన ఇవ్వబడిందో, ఆ ప్రవక్త ఈయనే. ఇందులో ఏమాత్రం అనుమానం లేదు'' అన్నాడు అబూహారిసా దారిలో.

“నీకలాంటి నమ్మకం ఉన్నప్పుడు మనం ఇస్లాం స్వీకరించడంలో వెనుకాడటం ఎందుకు?'' అన్నాడు అతని స్నేహితుడు ఆశ్చర్యం వెలిబుచ్చుతూ.

“ఇలా చేస్తే మనజాతి మనల్ని ఎంత గౌరవిస్తుందో తెలియదా? ఒకవేళ మనం ఇస్లాంను విశ్వసిస్తే దాని పర్యవసానం ఏమిటీ? ఈ గౌరవమర్యాదలు, సిరిసంపదలు

సమస్తం మన నుండి చేజారి పోతాయి. అదీగాక మనమింకా ఏఏ చిక్కుల్లో పడాల్సి వస్తుందో!" అన్నాడు ప్రఖ్యాత క్రైస్తవ మతగురువు అబూహారిసా.

"స్త్రీలు, సంతానం, వెండి బంగారం రాశులు, మేలుజాతి గుర్రాలు, పశుసంపద, సేద్య భూములు (వగైరా) వ్యామోహవస్తువులు మానవులకు మనోహరమైనవిగా చేయబడ్డాయి కాని ఇదంతా ఇహలోకంలో మూన్నాళ్ళ ముచ్చటగా ఇవ్వబడిన జీవనసామగ్రి మాత్రమే. (శాశ్వత సౌఖ్యాలతో కూడిన) శ్రేష్ఠమైన నివాసం దేవుని దగ్గరే లభిస్తుంది." (ఖుర్ఆన్-3:14)

దురదృష్టం అంటే దీన్నే అంటారు. ముహమ్మద్ (స) అంతిమ దైవప్రవక్త అని తెలిసి కూడా వారు ఇస్లాం స్వీకరించలేదు. అశాశ్వతమైన ఈ ప్రాపంచిక సిరిసంపదలు, గౌరవప్రతిష్ఠలు వారిని సత్యంచూడలేని అంధులుగా, సత్యంవినలేని బధిరులుగా చేశాయి.

అయితే అబూహారిసా సోదరుని చెవుల్లో మాత్రం అబూహారిసా అన్న మాటలే మాటి మాటికి ప్రతిధ్వనిస్తున్నాయి. క్షణభంగురమయిన ఈ హోదా అంతస్తులు అతడ్ని ఏమాత్రం ప్రభావితం చేయలేకపోయాయి. చివరికతను ఇస్లాం స్వీకరించి దైవప్రవక్త (సల్లం) అనుచరవర్గంలో చేరిపోయాడు.

కొన్నాళ్ళకు క్రైస్తవుల్లో ఒకతను ఇస్లాం స్వీకరించి ముస్లింగా మారాడు. తరువాత అతను బఖరా, ఆలిఇమ్రాన్ సూరాలు నేర్చుకున్నాడు. దైవప్రవక్త (సల్లం) అతడ్ని ఖుర్ఆన్ సూక్తుల్ని గ్రంథస్థం చేసే పని కోసం నియమించారు. అయితే కొన్నాళ్ళ తరువాత అతను భ్రష్టుడయి మళ్ళీ క్రైస్తవుల్లో చేరిపోయాడు.

ఆ తరువాత అతను అదే స్థితిలో చనిపోయాడు. క్రైస్తవులు అతని భౌతిక కాయాన్ని సమాధి చేశారు. మరునాడుదయం చూస్తే అతని శవం సమాధి బయట పడి ఉండటం కన్పించింది. "ఇతను ముస్లింల దగ్గర్నుంచి పారిపోయి వచ్చాడు గనక, ముస్లింలే ఈ సమాధి తవ్వి శవాన్ని బయట పడేసిఉంటార"ని చెప్పుకున్నారు వారు.

అందువల్ల వారు మరోచోట మరింత లోతుగా సమాధి తవ్వి ఆ శవాన్ని మళ్ళీ పూడ్చిపెట్టారు. కాని మరునాడు ఉదయం వచ్చిచూస్తే శవం మళ్ళీ సమాధి బయటపడి ఉండటం కనపడింది. దాంతో వారు ఇది మానవుల పనికాదని (దేవుడే ఇలా చేసిఉంటా డని) భావించి ఆ శవాన్ని అలాగే కాకులకు, గద్దలకు వదిలేసి వెళ్ళిపోయారు.

కొన్నాళ్ళకు దాదాపు నజ్రాన్ క్రైస్తవులంతా ఇస్లాం స్వీకరించి ముస్లింలయి పోయారు. ఆ తర్వాత యమన్‌రాజు బాజన్‌తో సహా యమన్‌లోని తెగలన్నీ ఇస్లాం స్వీకరించాయి.

## వీడ్కోలు కాబా(హజ్)యాత్ర-(156)

హిజ్రీశకం పదో సంవత్సరం నడుస్తోంది. నీలాకాశంలో జీఖాదా నెలవంక వినూత్న కాంతులు వెదజల్లుతూ వెలసింది. దైవదాసులకు శుభాకాంక్షలు అందజేసి అంతలోనే అదృశ్యమయిపోయింది.

ఆ మరునాడే మహాప్రవక్త ముహమ్మద్ (స) హజ్ (కాబాయాత్ర) ఏర్పాట్లు చేసుకో వలసిందిగా అనుచరుల్ని ఆదేశించారు. మదీనాలో, దాని చుట్టుపక్కల గ్రామాల్లో



ముస్లింలు సంతోషంతో హజ్ సన్నాహాలు చేసుకోవడంలో నిమగ్నులయ్యారు. ఆ నెల 25వ తేదీన దైవప్రవక్త (సల్లం) హజ్‌యాత్ర కోసం మదీనా నుండి బయలుదేరారు. ఆయన వెంట దాదాపు లక్ష మందికి పైగా ముస్లింలు బయలుదేరారు. ఖుర్బానీ కోసం ఒంటెల్ని కూడా వెంట బెట్టుకున్నారు.

యాత్రికావాహిని అవధులు దాటిన ఆనందంతో పరుగులు పెడుతూ మక్కా దిశగా పయనిస్తోంది. ఇప్పుడు యాత్రికుల హృదయాల్లో దైవభయం తప్ప ఎవరి భయం లేదు. అందుకే వారు ఎంతో ఉత్సాహంతో కాబాదర్శనం చేసుకోవడానికి చకచకా ప్రయాణం సాగిస్తున్నారు. జుల్‌హులీఫా చేరుకోగానే దైవప్రవక్త (స) ఒక లుంగీ, ఒంటిపై మరో అంగవస్త్రం ధరించి హజ్‌దీక్ష బూనారు. అనుచరులు కూడా అలాగే చేశారు.

"లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్.....(హాజరయ్యాను ప్రభూ! నేను హాజరయ్యాను....)" అని నినాదాలు చేస్తూ అక్కడ్నుంచి ముందుకు సాగారు యాత్రికులు.

నమాజ్ వేళ అయినప్పుడల్లా మధ్యలో ఆగి నమాజ్ చేస్తూ ప్రయాణం సాగించారు. యాత్రికులు సుర్ఫ్ అనే ప్రాంతానికి చేరుకున్నాక అక్కడ దైవప్రవక్త (సల్లం) "బలిపశువులు లేనివారు ఉమ్రా సంకల్పం మాత్రమే చెయ్యాల"ని ప్రకటన చేశారు. అక్కడ్నుంచి వారంతా జిల్‌హజ్ నెల నాల్గవ తేదీకల్లా మక్కా చేరుకున్నారు.

మక్కాలో ప్రవేశించగానే దైవప్రవక్త (సల్లం) సహచరులతో నేరుగా కాబాలయానికి వెళ్ళారు. అక్కడ ఆయన "హజ్రె అస్వద్" (నల్లరాయి)ని ముద్దాడి కాబా చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణ చేశారు. తరువాత "మఖామె ఇబ్రాహీం"లో నమాజ్ చేశారు.

యాత్రికులు అసంఖ్యాకంగా ఉన్నారు. హజ్రత్ ఉమర్ (రజి) హజ్రె అస్వద్ (నల్లరాయి)ని ముద్దాడే ఉద్దేశ్యంతో దాన్ని సమీపించడానికి జనాన్ని త్రోసుకుంటూ వెళ్ళ బోయారు. దైవప్రవక్త (సల్లం) ఆయన్ని చూసి-

"ఉమర్! నువ్వు అసలే చాలా బలాఢ్యుడివి. మరీఅంత బలం చూపితే బలహీనులకు కష్టం కలగదూ! కాస్త నెమ్మదిగా వెళ్ళు. హజ్రెఅస్వద్ దగ్గరికి వెళ్ళడానికి దారి ఇరుకుగా ఉంటే నువ్వు దూరాన నిలబడే తక్బీర్ చెప్పవచ్చు" అని అన్నారు.

ఆ తర్వాత దైవప్రవక్త (స) సఫా, మర్వా కొండల మధ్య తిరిగి 'సయీ' విధి నెర వేర్చారు. సహచరులంతా ఆయన్ని అనుసరిస్తున్నారు. 'సయీ' తర్వాత ఖుర్బానీ పశువులు లేనివారు దీక్ష (ఇహ్రాం) విరమించాలని ఆజ్ఞయింది. కాని దైవప్రవక్త (స) తాను దీక్ష విర మించకుండా ఇతరులను దీక్ష విరమించమనడం అనుచరులకు ఆశ్చర్యం కలిగించింది. బలిపశువులు లేకపోయినా సరే, వారికి దీక్ష విరమించడానికి మనసొప్పలేదు.

మూఢకాలంలో ప్రజలు ఖుర్బానీ పశువు ఉన్నా లేకపోయినా ఒకే దీక్షతో హజ్, ఉమ్రా రెండూ చేసేవారు. ఆ భావనతోనే ప్రవక్త అనుచరులు కూడా కేవలం ఉమ్రా చేసి దీక్ష విరమించడం ఏమిటని తలచి మౌనంగా ఉండిపోయారు. ఈ పరిస్థితి చూసి దైవప్రవక్త (సల్లం) ఆందోళన చెందారు. ఏం చెయ్యాలో పాలుపోలేదు. ఆయన విచార వదనం చూసి హజ్రత్ ఆయిషా (రజి) కూడా ఆందోళన చెందారు.

“దైవప్రవక్తా! అలా ఉన్నారేమిటీ? మీ మనసును బాధపెట్టిన వారెవరు?” అని అడిగారు విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఆయిషా (రజి).

“నేనొక పని చెయ్యమన్నాను. కాని జనం నామాట వినడంలేదు. ఆ పని చెయ్యాలా వద్దా అని సందిగ్ధంలో పడ్డారు....” అన్నారు దైవప్రవక్త (సల్లం).

చివరికి ఎలాగో ఖుర్బానీ పశువులు తీసుకురాని ముస్లింలు దీక్ష విరమించారు. దీక్ష విరమించినవారిలో ప్రవక్త కుమార్తె ఫాతిమా (రజి), ఆయన భార్యలు కూడా ఉన్నారు.

సరిగ్గా ఆ సమయంలోనే హజ్రత్ అలి (రజి) కాబాలో ప్రవేశించారు. దైవప్రవక్త (సల్లం) ఆయన్ని యమన్ దండయాత్రకు పంపించారు. అక్కడ హజ్రత్ అలి (రజి)కి యుద్ధం చేయక తప్పలేదు. యుద్ధంలో యమన్ సేనలు ఓడిపోయాయి. యమన్ ప్రజలంతా ఇస్లాం స్వీకరించారు. ఈపని ముగిసిన తరువాత ఆయన తన స్థానంలో మరొకర్ని సేనాపతిగా నియమించి నేరుగా మక్కా వచ్చారు.

అలి (రజి) ముందుగా తన అర్ధాంగి ఫాతిమా (రజి) దగ్గరకు వెళ్ళారు. అప్పుడు ఫాతిమా (రజి) సాధారణ దుస్తుల్లో ఉండటం చూసి “ఏమిటిది... ఈ బట్టలు?” అడిగారు ఆయన ఆశ్చర్యంతో. “నాన్నగారి ఆదేశం” చెప్పారు హజ్రత్ ఫాతిమా (రజి).

అలి (రజి) అక్కడ్నుంచి దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళారు. ఆయనకు యమన్ విశేషాలు విన్పించారు. దానిపై దైవప్రవక్త (స) దైవానికి కృతజ్ఞతలు చెప్పారు.

“అలి! ఇక వెళ్ళి కాబా ప్రదక్షిణ చెయ్యి. తరువాత ఇహ్రాం (దీక్ష) విరమించు” అని చెప్పారు దైవప్రవక్త (స). “దైవప్రవక్తా! నేను దీక్ష పూనేటప్పుడు- ‘దేవా! నీప్రవక్త పూనినటు వంటి దీక్షనే నేను పూనుతున్నాన’ని పలికి ఉన్నానే!” అన్నారు అలి (రజి).

“అయితే మరి నీ దగ్గర ఖుర్బానీ పశువు ఉందా?” అడిగారు దైవప్రవక్త (స). లేదన్నారు అలి (రజి).

అప్పుడు దైవప్రవక్త (సల్లం) తన దగ్గరున్న బలిపశువుల్లో అలి (రజి)ని భాగస్తుడ్ని చేసుకున్నారు. ఆ విధంగా హజ్రత్ అలి (రజి)కి దీక్ష విరమించడం తప్పింది. హజ్ ముగిసిన తరువాత అందరితోపాటు ఆయన కూడా దీక్ష విరమించారు.

జిల్‌హజ్ తొమ్మిదో తేది సూర్యోదయమైంది. యాత్రికులంతా అర్ఫాత్ మైదానంలో చేరారు. అక్కడ ‘అల్లాహుఅక్బర్’ నినాదాలు మార్మోగాయి. అర్ఫాత్ సమీపంలో నిర్మించ బడిన ఒక కుటీరంలో దైవప్రవక్త (స) మధ్యాహ్నందాకా విశ్రాంతి తీసుకున్నారు. తరువాత ఆయన అర్ఫాత్‌లో యాత్రికులందర్నీ సమావేశపరిచారు.

అది అరబ్‌చరిత్రలోనే అపూర్వ సమావేశం. దైవప్రవక్త (సల్లం) ఒంటె ఎక్కి యాత్రికుల ముందు ప్రసంగించడం ప్రారంభించారు. అందరికీ వినపడేందుకు వీలుగా హజ్రత్ రబియా (రజి) జనం మధ్య నిలబడి దైవప్రవక్త (స) పలుకుల్ని పునరుద్ఘాటించ సాగారు. దైవప్రవక్త (స) నోట అమృతవాహిని పారసాగింది:

“నా ప్రియమైన సోదరులారా!



“నేను చెప్పేదంతా శ్రద్ధగా ఆలకించండి. వచ్చే ఏడు నేనిక్కడ మిమ్మల్ని కలుసు కుంటానో లేదో తెలియదు. దైవగ్రంథాన్ని, నా సంప్రదాయాల్ని దృఢంగా పట్టుకోండి.

“ప్రజల ధనమానప్రాణాల్ని గౌరవించాలి. దగా, మోసాలాకు పాల్పడకూడదు. రక్త పాతానికి, వడ్డీ వ్యవహారాలకు దూరంగా ఉండాలి.

“ప్రజలారా! మీ ప్రభువు ఒక్కడే. తండ్రి ఒక్కడే. మీరంతా ఆదం (అలైహి) సంతానం. ఆదం (అలైహి) మట్టితో సృజించబడ్డారు. మీ అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే దేవుని దృష్టిలో అందరికంటే ఉత్తముడు. వినండి. అరబ్బీయుడిపై అరబ్బేతరునికి, అరబ్బే తరునిపై అరబ్బీయుడికి ఎలాంటి ఆధిక్యత లేదు. ఆధిక్యతకు గీటురాయి దేవుని పట్ల భయభక్తులు కలిగి ఉండటమే....”

ఇలా అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) ప్రజలకు హితబోధ చేస్తూ ముస్లింలు పరస్పరం ఎలా మసలుకోవాలి; తోటి మానవులతో ఎలా వ్యవహరించాలి; వారి హక్కులు ఏమిటి మొదలయిన విషయాలు వివరంగా తెలియజేశారు. ముఖ్యంగా ఆయన జాతి, తెగ, వర్ణ, వర్గ వివక్షలను, నిమ్నోన్నతా భేదభావాలను నిరసిస్తూ సమానత్వం, సౌభ్రాతృత్వా లను గురించి నొక్కిచెప్పారు.

చివర్లో ఆయన “ప్రజలారా! నేను దైవసందేశాన్ని మీకు అందజేశానా?” అని పలికి నప్పుడు “అందజేశారు మీరు” అని లక్షమంది ప్రజలు ముక్తకంఠంతో అన్నారు. ఇది విని దైవప్రవక్త (సల్లం) “దేవా! దీనికి నీవే సాక్షివి” అని మూడుసార్లు అన్నారు.

ప్రసంగం ముగిసింది. బిలాల్ (రజి) అజాన్ చెప్పారు. దాంతో ప్రజలు నమాజ్ కోసం బారులుతీరి నిలబడ్డారు. చరిత్రలో ఇదివరకు ఎన్నడూ కనీ వినీ ఎరగనంతటి రీతిలో ఒకేసారి లక్షమందికి పైగా దైవదాసులు విశ్వప్రభువు సన్నిధిలో మోకరిల్లారు. అందరూ అంతిమ దైవప్రవక్త (సల్లం) నాయకత్వాన నమాజ్‌లో లీనమయ్యారు.

యాత్రికులతో అర్ఫాత్ మైదానం నిండిపోయింది. దైవప్రవక్త (సల్లం) నేతృత్వంలో ముస్లింలు హజ్‌ధర్మాలు నిర్వహించడంలో నిమగ్నులయిపోయారు. ఆకాశ ద్వారం తెరచుకుంది. విశ్వప్రభువు కరుణామృతపు కడపటి బిందువులు జాలువారాయి:

“నేనీ రోజు మీకోసం మీ ధర్మాన్ని (సమగ్ర జీవన వ్యవస్థగా) పరిపూర్ణం చేశాను. మీ కోసం నా అనుగ్రహాన్ని పూర్తిగా నెరవేర్చాను. మీ శ్రేయస్సు కోసం ఇస్లాంను మీ జీవనధర్మంగా ఆమోదించాను.” (ఖుర్‌ఆన్-5:4)

ఇది ఇస్లాం సౌధ నిర్మాణానికి సమకూర్చబడిన చివరి ఇటుక! మానవాళి జీవిత నౌక సాఫీగా సాగడానికి అందజెయ్యబడిన అంతిమ తెరచాప!! ఖుర్‌ఆన్ వాణి రూపంలో అంతిమ దైవప్రవక్త (సల్లం) నోట వెలువడిన దివ్యసూక్తి!!!

ఈసూక్తి వినగానే హజ్రత్ అబూబకర్ (రజి) కళ్ళ నుండి అశ్రువులు జలజల రాలాయి. దైవప్రవక్త (సల్లం) ఇహలోకానికి వచ్చిన పని ముగిసిందని, ఇక ఆయన తనువు చాలించే తరుణం ఆసన్నమయిందని గ్రహించి ఆయన భోరున విలపించారు.

అర్ఫాత్‌లోని కార్యకలాపాలు పూర్తయిన తర్వాత దైవప్రవక్త (స) 'ముజ్దలఫా'కు బయలుదేరారు. ఆయన వెంట అనుచరవాహిని కూడా అర్ఫాత్ నుండి కదిలింది.

అందరూ ఆ రాత్రి ముజ్దలిఫాలో గడిపారు. మరునాడుదయం 'మినా'కు పోయే దారిలో 'రమి' విధి నిర్వహించారు. ఆ తర్వాత మినాలో ఒంటెలను ఖుర్బానీ చేసి శిరో ముండనం చేయించుకున్నారు. దాంతో హజ్‌విధులు సమాప్తమయ్యాయి. హజ్ అనంతరం దైవప్రవక్త (సల్లం) అనుచరుల్ని తీసుకొని మదీనా తిరిగి వెళ్ళిపోయారు.

ఇప్పుడు దైవగృహం పూర్తిగా ఇస్లాం కేంద్రమయింది. ఏకేశ్వరోపాసనాలయం అయింది. ప్రపంచ మానవాళికి శాంతి నిలయమయింది.

యావత్తు అరేబియా ఇస్లాం జ్యోతితో ప్రకాశవంతమయింది. మొత్తం అరబ్బులు దైవ విధేయులైపోయారు. సర్వత్రా సమానత్వం, సౌభ్రాతృత్వాలు వెల్లివిరిశాయి. సమస్త ప్రజల్లో సుగుణసంపత్తి, శాంతీసౌభాగ్యాలు అలరారసాగాయి.

అప్పటికి ఇరవై మూడు సంవత్సరాల క్రితం అరబ్బుల పరిస్థితి ఏమిటీ? వారి ఆచార వ్యవహారాలు, ఆరాధనారీతులు ఎలా ఉండేవి? వారి నీతినడవడికలు, పరస్పర సంబంధాల పరిస్థితి ఏమిటీ?

ఆనాడు అరబ్బులు విగ్రహారాధనలో కూరుకొనిపోయి ఉండేవారు. దైవగృహంలో డప్పులు వాయిస్తూ, ఈలలు వేస్తూ, పొలికేకలుపెడ్తూ విగ్రహాలను పూజించేవారు. స్త్రీలు సైతం నగ్నంగా కాబా ప్రదక్షిణ చేసేవారు. ఎల్లప్పుడూ పీకలదాకా తాగుతూ, తాతముత్తాలను గురించి డాంబికాలు పలుకుతూ, చీటికిమాటికి కలహించుకుంటూ, ఏళ్ళతరబడి రక్తపు టేరులు ప్రవహింపజేస్తూ విశృంఖలజీవితం గడుపుతుండేవారు. దారిద్ర్యభయంతో తమ కన్నబిడ్డల్నే సజీవసమాధి చేసేవారు. బానిసల పట్ల పరమ నికృష్టంగా ప్రవర్తించేవారు.

అలాంటి అరబ్బులను అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) కేవలం ఇరవయి మూడేండ్ల అతిస్వల్ప కాలంలో పరిపూర్ణ మానవులుగా తీర్చిదిద్దారు. వారి చీకటి బ్రతుకుల్లో జ్ఞానదీపికలు వెలిగించారు. వారిని పాపపంకిలం నుండి తీసి పుణ్యవనంలోకి చేర్చారు. నరకం అంచున నిల్చున్నవారిని స్వర్గం సమీపానికి తీసికెళ్ళారు.

## అనారోగ్య పరిస్థితి-(157)

దైవప్రవక్త (సల్లం) కాబాయాత్ర నుండి తిరిగొచ్చి మూణ్ణెల్లయినా కాలేదు, హఠాత్తుగా వ్యాధిగ్రస్తులయ్యారు. తీవ్రమైన జ్వరం, తలనొప్పి దాడిచేసి ఆయన్ని బాధపెట్టసాగాయి. అదేమి జబ్బోగాని రాత్రిపూట ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టేదికాదు.

ఓరోజు రాత్రి దైవప్రవక్త (స) పడక మీద నుండి లేచి నగరం వెలుపలున్న "బఖీవుల్ పిర్ఖద్" శ్మశానం దగ్గరికి వెళ్ళారు. ఆయన వెంట హజ్రత్ అబూమవీహబా (రజి) మాత్రమే ఉన్నారు. అక్కడ దైవప్రవక్త (సల్లం) సమాధుల మధ్య నిలబడి ఇలా అన్నారు:

"సమాధివారలారా! మీకు శాంతి కలుగుగాక! ఎంత అదృష్టవంతులు మీరు! ఈ ప్రశాంత ప్రదేశానికి వచ్చి స్థిరపడ్డారు!!"



దైవప్రవక్త (స) సమాధుల్లోని మృతుల మన్నింపు కోసం కూడా ప్రార్థించారు. ఆ తర్వాత ఇంటికి తిరుగుముఖం పట్టారు. వెంట అబూమవీహబా (రజి) కూడా ఉన్నారు.

"అబూమవీహబా! నాకిలా చెప్పబడింది- 'ఇదిగో తీసుకో ప్రపంచ నిక్షేపాల తాళపు చెవులు. ప్రపంచం ఉన్నంతవరకు నీవు ప్రపంచంలోని భోగభాగ్యాలు అనుభవించు. తర్వాత స్వర్గానికి రా. లేదా నీకిష్టమయితే ఇప్పుడే స్వర్గానికి వచ్చెయ్యి. (వచ్చి ఇక్కడ) నీ ప్రభువు సామిప్యంలో ఉండు" అన్నారు దైవప్రవక్త (సల్లం) దారిలో నడుస్తూ.

"దైవప్రవక్తా! అలాగైతే మీరు ప్రపంచ నిక్షేపాల తాళపు చెవులు తీసుకోండి. ప్రపంచం ఉన్నంతవరకు జీవించండి. ఆ తర్వాతే స్వర్గానికి వెళ్ళండి"అన్నారు అబూమవీహబ (రజి).

"వద్దు అబూమవీహబా! వద్దు. నేను నా ప్రభువు దగ్గరికి వెళ్ళడానికే నిర్ణయించు కున్నాను" అన్నారు దైవప్రవక్త (సల్లం).

మరుసటి రోజు ఉదయం దైవప్రవక్త (స) ఏదో పని మీద ఇంటి నుండి బయలు దేరారు. దారిలో అర్ధాంగి ఆయిషా (రజి) ఇంటి దగ్గర ఆగారు. అప్పుడామె తలనొప్పితో బాధ పడుతున్నారు. "అబ్బా! నా తల పగిలిపోతోంది" అన్నారామె తల పట్టుకొని.

"ఆయిషా! నాతలలో అంతకంటే ఎక్కువ బాధగా ఉంది. అబ్బబ్బా! నాతల పగిలి పోతోంది" అన్నారు దైవప్రవక్త (స). అప్పుడామెకు ఏం జవాబివ్వాలో బోధపడలేదు.

"ఆయిషా! ఒకవేళ నాకంటే ముందు నువ్వే చనిపోతే ఎంత బాగుంటుందో! ఎంచక్కా నేను నా స్వహస్తాలతో నీకు వస్త్రసంస్కారం చేస్తాను. స్వయంగా నేనే నిన్ను సమాధి చేస్తాను" అన్నారు దైవప్రవక్త (స) ఆమెను మరింత ఉడికించే ఉద్దేశ్యంతో.

"నేనే ఎందుకు? మీ శ్రీమతులు ఇంకా ఉన్నారుగా. నాకన్నా వారైతేనే బాగుంటుంది" అన్నారు హజ్రత్ ఆయిషా (రజి) చిరుకోపంతో.

ఆమె మాటలు విని దైవప్రవక్త (సల్లం) నవ్వారు. కాని తలనొప్పి తీవ్రంగా ఉన్నందున ఆయన అర్ధాంగితో అంతకంటే ఎక్కువ పరాచికాలాడలేక పోయారు.

ఆ రోజుల్లోనే సిరియా, పాలస్తీనాల్లో రోమన్లు అరేబియాపై దాడి చేయడానికి యుద్ధ సన్నాహాలు చేస్తున్నారని సమాచారం అందింది. అందువల్ల దైవప్రవక్త (సల్లం) రోమన్లను ఎదుర్కోవడానికి సఫర్ నెల 28వ తేదీన పదిహేడేళ్ళ హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజి) నాయకత్వంలో ఓ పెద్ద సైనికదళాన్ని పంపారు.

ఈ సైనిక దళంలో అబూబకర్ (రజి), ఉమర్ (రజి)లతో సహా ప్రముఖ సహాబీలంతా ఉన్నారు. అయితే కొందరు ఉసామా బిన్ జైద్ (రజి) నాయకత్వంలో యుద్ధానికి పోవడానికి సుముఖంగా లేరు. ఉసామా (రజి) తండ్రి జైద్ (రజి) స్వేచ్ఛపొందిన బానిస. అంచేత ఉసామా (రజి) బానిస యువకుడన్న భావన వారిలో ఉంది. అదీగాక ఆయన చాలా పిన్న వయస్కుడు. ఈ రెండు విషయాలు మానవ సమానత్వానికి వ్యతిరేకం.

అయినప్పటికీ వారు బానిస కొడుకు, పైగా నూనూగు మీసాల యువకుడ్ని ఎంతో అనుభవం ఉన్న యోధానయోధులకు నాయకునిగా నియమించడమా అని ఉసామా

(రజి) నాయకత్వాన్ని అంగీకరించలేక పోతున్నారు. ఈ సంగతి తెలిసి దైవప్రవక్త (సల్లం) వ్యాధిగ్రస్త స్థితిలోనే మసీదుకెళ్ళి ప్రసంగిస్తూ ఇలా అన్నారు:

“కొందరు ఉసామా (రజి) నాయకత్వాన్ని అంగీకరించకుండా ఏవేవో మాటలు అంటున్నారు. ఈరోజు వారు ఉసామా నాయకత్వం పట్ల అభ్యంతరం లేవదీస్తుంటే ఇందులో ఆశ్చర్యం ఏమీ లేదు. వారు లోగడ అతని తండ్రి నాయకత్వం పట్ల కూడా అభ్యంతరం లేవదీశారు. కాని ఉసామా (రజి)లో సైన్యాధ్యక్ష హోదాకు కావలసిన యోగ్యతా అర్హతలు ఉన్నాయి. ఇందులో ఎలాంటి సందేహం లేదు.”

ఈ ప్రసంగం వినగానే ఉసామా (రజి) నాయకత్వాన్ని ఆక్షేపిస్తూ ఆరోపణలు చేసిన వారు పశ్చాత్తాపం చెంది ఆయన నాయకత్వంలో యుద్ధానికి పోవడానికి సిద్ధమయ్యారు.

హ్రజత్ ఉసామా (రజి) సైన్యాన్ని తీసుకొని మదీనాకు మూడు మైళ్ళ దూరంలో ఉన్న జురుఫ్ అనే ప్రదేశానికి చేరుకొని విడిదిచేశారు. సైన్యంలో ఇంకా చేరవలసినవారు ఉండటం వల్ల ఆయన అక్కడ ఆగిపోయారు. అదీగాక దైవప్రవక్త (స) ఆరోగ్యం ఇంకా కుదుట పడలేదు. ఈ కారణంగానే హ్రజత్ అబూబకర్ (రజి), హ్రజత్ ఉమర్ (రజి)లు సేనాపతి అనుమతి తీసుకొని నగరానికి తిరిగొచ్చారు.

దైవప్రవక్త (సల్లం) సాధారణంగా ఒక్కోరోజు ఒక్కో భార్య దగ్గర గడుపుతుంటారు. ఇప్పుడు కూడా అలా వంతులవారిగా అయిదు రోజులు గడిపిన తరువాత వ్యాధి ఎక్కువ కావడంతో ఆయన హ్రజత్ మైమూనా(రజి) ఇంట్లో ఉండి, ఇతర భార్యాలందర్నీ పిలిపించుకున్నారు. ఇక నుండి తాను ఆయిషా దగ్గరే ఉండిపోవడానికి అనుమతివ్వమని అడిగారు. దానికి వారంతా సంతోషంగా ఒప్పుకున్నారు.

ఇప్పుడు దైవప్రవక్త (సల్లం) హ్రజత్ ఆయిషా (రజి) ఇంటికి వెళ్ళాలి. కాని అప్పటికే ఆయన జబ్బుతో చాలా బలహీనమై పోయారు. లేచి నిల్చోవడం కూడా కష్టమయి పోయింది. అప్పుడు అలి (రజి), అబ్బాస్ (రజి)లు వచ్చి దైవప్రవక్త (సల్లం)ను రెండు వైపుల నిల్చి పట్టుకొని మెల్లిగా హ్రజత్ ఆయిషా (రజి) ఇంటికి చేర్చారు.

దైవప్రవక్త (సల్లం) అనారోగ్యం సంగతి నగరమంతటా తెలిసిపోయింది. దాంతో ముస్లింలు ఆందోళన చెందారు. దైవప్రవక్త (సల్లం) ఇదివరకెప్పుడూ ఇంత తీవ్రంగా జబ్బున పడలేదు. హిజ్రీ ఆరవ ఏట కాస్తంత జ్వరం వచ్చింది. రెండుమూడు లంకణాలు చేశారు. తరువాత తగ్గిపోయింది.

ఆ తరువాత హిజ్రీశకం ఏడవ సంవత్సరం ఆయనకు ఓ యూద స్త్రీ విషం కలిపిన మాంసం పెట్టింది. ఆ మాంసం తిని దైవప్రవక్త (సల్లం) చాలా రోజులదాకా కొంచెం అస్వస్థతో ఉన్నారు. మందు వాడిని తరువాత విషప్రభావం తగ్గిపోయింది. ఈ రెండు సందర్భాల్లో తప్ప ఆయన ఎల్లప్పుడూ ఆరోగ్యంగానే ఉండేవారు.

కాని ఈసారి ఆయన ఆరోగ్యం కుదుటపడే సూచన కానరావడం లేదు. మందులు వాడినా ప్రయోజనంలేదు. పైగా జబ్బు రోజురోజుకు మరింత ముదిరిపోతూనే ఉంది.



దైవప్రవక్త (స) ఓరోజు మగ్రిబ్ నమాజ్ చేయించడానికి అతి కష్టం మీద మసీదుకు వెళ్ళారు. మసీదు నుంచి ఇంటికొచ్చిన తరువాత జ్వరం తీవ్రమయింది. లేచి నిలబడలేనంత బలహీనులయ్యారు.

ఇషా నమాజ్ వేళ అయింది. ఆయన మసీదులో కూర్చున్న సహచరుల్ని ఉద్దేశించి “నమాజ్ అయిందా?” అని అడిగారు. “కాలేదు మీ కోసమే మేము ఎదురుచూస్తున్నాం” అన్నారు సహచరులు. ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) నీళ్ళు తెప్పించి స్నానం చేశారు. లేచి నిలబడబోతే సొమ్మసిల్లి పడిపోయారు.

కాస్సేపటికి స్పృహ వచ్చింది. స్పృహ రాగానే “నమాజ్ అయిందా?” అని అడిగారు ఆయన. “కాలేదు, మీ కోసమే ఎదురుచూస్తున్నాం” అన్నారు అనుచరులు.

దైవప్రవక్త (స) మళ్ళీ స్నానంచేసి లేవడానికి ప్రయత్నించారు. కాని ఈసారి కూడా ఆయన స్పృహతప్పారు. స్పృహ రాగానే “నమాజ్ అయిందా?” అని ప్రశ్నించారు. “లేదు, మీ కోసమే ఎదురుచూస్తున్నాం” అని సమాధానమిచ్చారు అనుచరులు.

దైవప్రవక్త (స) మళ్ళీ స్నానం చేసి లేవడానికి ప్రయత్నిస్తే తిరిగి సొమ్మసిల్లి పడి పోయారు. కాస్సేపటికి స్పృహ వచ్చింది. స్పృహ రాగానే ఆయన మసీదుకు వస్తారేమోనని అనుచరులు భావించారు. కాని అలా జరగలేదు.

“అబూబకర్‌తో నమాజ్ చేయించమని చెప్పండి” అని ఆదేశించారు దైవప్రవక్త (స) తన అనుచరులను. “కాని, దైవప్రవక్తా! ఆయన కంఠస్వరం చాలా చిన్నది. ఖుర్ఆన్ పఠిస్తూ ఆయన దుఃఖిస్తారు. ప్రజలు ఆయన కంఠస్వరం సరిగా వినలేరు” అన్నారు ప్రవక్త సతీమణి ఆయిషా (రజి).

“నమాజ్ చేయించమని అబూబకర్‌కు చెప్పండి” అన్నారు ఆయన తిరిగి.

హ్రజత్ ఆయిషా (రజి) ప్రాధేయపడుతూ తిరిగి అవే మాటలు పలికారు.

“అబూబకర్‌కు చెప్పండి నమాజ్ చేయించమని” అన్నారు మళ్ళీ దైవప్రవక్త (స) చిరుకోపంతో.

అప్పుడు ఆయన ఆదేశానుసారమే హ్రజత్ అబూబకర్ (రజి) నమాజ్ చేయించారు. ఆరోజు నుంచి ఆయనే నమాజ్ చేయించడం ప్రారంభించారు.

అలా కొన్ని రోజులు గడిచాయి. దైవప్రవక్త (స) ఆరోగ్యం కాస్త కుదుటపడినట్లు అన్పించింది. అప్పుడాయన నమాజ్ కోసం మసీదుకు వెళ్ళాలని సంకల్పించుకున్నారు.

అది జుహర్ వేళ. దైవప్రవక్త (స) స్నానం చేశారు. బట్టలు తొడుక్కున్నారు. తలపాగ పెట్టుకున్నారు. అలి (రజి), ఫజల్ బిన్ అబ్బాస్ (రజి)ల భుజాలపై చేతులు వేసి, నేల మీద కాళ్ళు ఈడుస్తూ అతి కష్టం మీద మసీదుకు వెళ్ళారు.

సరిగ్గా అదే సమయంలో హ్రజత్ అబూబకర్ (రజి) నమాజ్ చేయించడానికి ఇమాం స్థానం మీదికెళ్ళి నిల్చున్నారు. దైవప్రవక్త (స) వస్తున్నట్లు అలికిడి వినగానే ఆయన ఇమాం స్థానం నుండి తప్పుకోబోయారు. కాని దైవప్రవక్త (స) వారిస్తూ ఆయన పక్కన

పోయి కూర్చున్నారు. నమాజ్ ముగిసింది. ఆ తర్వాత దైవప్రవక్త (సల్లం) శ్రోతలను ఉద్దేశించి ఓ చిన్న ప్రసంగం చేశారు:

"సోదరులారా! నేను చనిపోతానేమోనని మీరు ఆందోళనపడుతున్నట్లు నాకు తెలిసింది. కాని నాకు పూర్వం వచ్చిపోయిన దైవప్రవక్తలందరికీ మరణం తప్పలేదు. నేను కూడా వారిలో ఒక దైవప్రవక్తనే కదా! దేవుడు తన దాసుల్లో ఒకనికి, ఈ ప్రపంచలోనైనా ఉండవచ్చని లేదా తన అనుగ్రహఛాయలోకయినా రావచ్చని అధికారం ఇచ్చాడు. అప్పుడా దాసుడు దేవుని అనుగ్రహఛాయలోకి వెళ్ళే విషయానికే ప్రాధాన్యం ఇచ్చాడు."

ఈ మాటలు వినగానే హజ్రత్ అబూబకర్ (రజి)కు దుఃఖం పొర్లుకు వచ్చింది. ఇక దైవప్రవక్త (స) త్వరలోనే ఇహలోకం వీడనున్నారని గ్రహించి ఆయన పసిపిల్లవాడిలా విలపించారు. దైవప్రవక్త (స) ఆయన్ని ఓదార్చారు. ఆయన మైత్రిని, ఔన్నత్యాన్ని గురించి అందరి ముందు ప్రశంసించారు. తరువాత ప్రసంగం కొనసాగిస్తూ ఇలా అన్నారు:

"వినండి మొట్టమొదట హిజ్రత్ (వలస) చేసినవారి పట్ల ఎల్లప్పుడూ మంచిగా మసలుకోవాలి. ముహాజిర్లు పరస్పరం సద్వర్తనం కలిగివుండాలి. అన్సార్‌లలో మంచిపని చేసేవారి పట్ల మంచిగా వ్యవహరించండి. వారిలో తప్పు చేసేవారిని క్షమించండి.

"సామాన్య ముస్లింల సంఖ్య పెరుగుతూ పోతుంది. కాని అన్సార్ ముస్లింల సంఖ్య తగ్గిపోతుంది. తగ్గిపోతూ చివరికి వారు అన్నంలో ఉప్పుగల్లంత మిగిలిపోతారు. ముస్లింలారా! వారు తమ కర్తవ్యం నిర్వహించారు. ఇక మీరు మీ కర్తవ్యం నిర్వహించాలి. నా తరువాత కాబోయే ముస్లింల ఖలీఫా అన్సార్‌ల పట్ల ఉదారంగా వ్యవహరించాలి.

"ముస్లింలారా! దేవుడు ధర్మసమ్మతం చేసినదాన్నే నేను ధర్మసమ్మతం చేశాను. సమాధులకు సాష్టాంగపడే జాతులపై దైవాగ్రహం విరుచుకుపడుగాక!

"ముస్లింలారా! నేనెవరినైనా కొడితే వారు నన్ను తిరిగి కొట్టి బదులు తీర్చుకోవచ్చు. ఇదిగో! నావీపు సిద్ధంగా ఉంది. నేనెవరినైనా ఏదైనా అంటే వారు కూడా నన్ను అదే మాట అనవచ్చు. నేనెవరి దగ్గరైనా ఏదైనా తీసుకుంటే వారిప్పుడు దాన్ని నన్నడిగి తీసుకోవచ్చు."

ఈ చివరి మాట వినగానే ఒకతను లేచి "దైవప్రవక్తా! మీరు నాకు మూడు దిర్హంలు బాకీ ఇవ్వాల్సి ఉంది" అన్నాడు. దైవప్రవక్త (సల్లం) అప్పటికప్పుడు మూడు దిర్హంలు తెప్పించి అతనికి ఇప్పించారు. తరువాత ఆయన ఇలా అన్నారు:

"ప్రవక్త కూతురు ఫాతిమా! ప్రవక్త మేనత్త సఫియా! మీరు దైవప్రసన్నత కోసం (పరలోక)సామగ్రి సిద్ధం చేసుకోండి. నేను (మీ బంధువుగా) దేవుని దగ్గర మీకు ఏ విధంగానూ ఉపయోగపడలేను."

ప్రసంగం ముగిసింది. దైవప్రవక్త (సల్లం) దగ్గర బైతుల్‌మాల్ (ప్రజాధనాగారం)లో ఏడు దీనార్లు ఉన్నాయి. అవి గుర్తుకువచ్చి తాను చనిపోతే ఈ డబ్బు తన దగ్గరే ఉండిపోతుందేమోనని ఆయన భయపడ్డారు. తక్షణమే ఆయన ఆ డబ్బు నిరుపేదలకు దానం చెయ్యమని అర్ధాంగి ఆయిషా (రజి)ను ఆదేశించారు.



హజ్రత్ ఫాతిమా (రజి) దైవసందేశహరుని (సల్లం) ముద్దుల కూతురు. తండ్రి అస్వస్థులయిన దగ్గర్నుంచి ఆమె రోజూ ఆయన్ని చూడటానికి వస్తుండేవారు. కూతుర్ని చూడగానే దైవప్రవక్త (స) లేచి ఆమెకు ఎదురుపోయి ఆమెపై ప్రేమామృతం కురిపించేవారు. ఆ తరువాత పడకపై తన పక్కన కూర్చోబెట్టుకొని కబుర్లు చెప్పేవారు.

యథాప్రకారం ఆరోజు కూడా హజ్రత్ ఫాతిమా (రజి) పరామర్శించడానికి తన తండ్రి ఇంటికి వచ్చారు. దైవప్రవక్త (సల్లం) కూతుర్ని చూసి లేవలేక పోయారు. అప్పుడు స్వయంగా ఫాతిమా (రజి)యే తండ్రి దగ్గరికెళ్ళి, ఆయన నుదుటిపై ముద్దాడి పక్కన కూర్చున్నారు.

ఆరోజు తండ్రీకూతుళ్ళు ఎనెన్నో కబుర్లు చెప్పుకున్నారు. మాటల సందర్భంలో దైవప్రవక్త (సల్లం) కూతురి చెవిలో ఏదో చెప్పారు. అది విని హజ్రత్ ఫాతిమా (రజి) భోరున విలపించారు. దైవప్రవక్త (స) కూతురి చెవిలో రహస్యంగా మళ్ళీ ఏదో చెప్పారు. ఆ మాట విని ఆమె చిరునవ్వు నవ్వారు.

ఈ సన్నివేశం చూసిన హజ్రత్ ఆయిషా (రజి)కు విషయం ఏమిటో అర్థం కాలేదు.

"ఫాతిమా! ఏమిటీ విశేషం? మొదట ఏడ్చావు, అంతలోనే మళ్ళీ నవ్వావు. నాన్నగారు ఏం చెప్పారేమిటి?" అడిగారు ఆమె కుతూహలంతో.

"దైవప్రవక్త (సల్లం) నాకో రహస్యం చెప్పారు. ఈ రహస్యాన్ని నేనెలా (అప్పుడే) బయటపెట్టనూ?" అన్నారు హజ్రత్ ఫాతిమా (రజి).

తరువాత కొన్నాళ్ళకు హజ్రత్ ఫాతిమా (రజి) ఈ రహస్యాన్ని హజ్రత్ ఆయిషా (రజి)కు ఇలా తెలియజేశారు:

ఆరోజు దైవప్రవక్త (సల్లం) ఆమెతో "అమ్మా! నేనిక ఎంతోకాలం బ్రతకను. నన్ను ప్రభాతవేళ (ఆరిపోయే) దీపంగా మాత్రమే భావించమ్మా!" అన్నారు.

అది విని హజ్రత్ ఫాతిమా (రజి)కు దుఃఖం పొర్లుకొచ్చింది. ఆ వెనువెంటనే దైవప్రవక్త (సల్ల) కూతురి చెవిలో "నేను వెళ్ళాక నా దగ్గరికి అందరికంటే ముందు నువ్వే వస్తావమ్మా!" అని చెప్పారు. అప్పుడు ఆమె ముఖం మందారపువ్వులా విచ్చుకుంది......

అది రాత్రివేళ. చంద్రకిరణాలు పడిన కలువపువ్వులా దైవప్రవక్త (సల్లం) మోము వికసించసాగింది. జ్వరం క్రమంగా తగ్గిపోతోంది. తలనొప్పి కూడా తగ్గుముఖం పట్టింది. కాస్సేపటికల్లా అంతా సర్దుకుపోయింది. దైవప్రవక్త (సల్లం)ను చూసిన ప్రతి మనిషీ ఇక ఆయన కోలుకున్నట్లేనని తలచి సంబరపడిపోతున్నాడు.

ఆ రాత్రి హాయిగా గడచిపోయింది. తెల్లవారు జామున దైవప్రవక్త (సల్లం) మరింత ఉత్తేజంగా కన్పించారు. ఇంటిని ఆనుకునే మసీదు ఉంది. ఆయన పడక మీద నుండి లేవకుండానే కిటికీ తెర పైకెత్తి మసీదులోకి తొంగిచూశారు.

మసీదులో అనుచరులంతా ఫజర్ నమాజ్‌లో లీనమయిఉన్నారు. చివరికి తాను ఆశించిన సమాజం దేవుని పుడమిపై ఆవిర్భవించిందని తలచి ఆయన తృప్తిగా నిట్టూర్పు

విడిచారు. తన బోధనలకు సజీవ ఉదాహరణగా రూపొందిన దైవదాసుల్ని చూసి ఆయన హృదయం ఆనందంతో పరవశించిపోయింది.

ఆ సమయంలో హజ్రత్ అబూబకర్ (రజి) ముందు నిల్చొని నమాజ్ చేయించడానికి ఉపక్రమించారు. అయితే ఆయన కిటికీ దగ్గర అలికిడి విని దైవప్రవక్త (సల్లం) మసీదులోకి వస్తారేమోనని భావించారు. అంచేత ఆయన నమాజ్ ఆపి వెనక్కి రాబోయారు. అంతలో దైవప్రవక్త (సల్లం) నమాజ్ ఆపవద్దని సైగచేసి కిటికీ తెర దించివేశారు.

ఇప్పుడు దైవప్రవక్త (సల్లం) మనస్సు శాంతీ సంతృప్తులతో నిండిపోయింది. తనపై విశ్వప్రభువు మోపిన బరువు బాధ్యతలు తీరిపోయినందుకు ఆయన పరమానంద భరితు లయ్యారు. అయితే మరో బాధ్యత మిగిలి ఉంది.

"ఆయిషా! మీ నాన్నను, అన్నయ్యను పిలిపించు. ఖిలాఫత్ పదవి కోసం మీ నాన్న (అబూబకర్)ను నా వారసునిగా చేస్తూ వీలునామా వ్రాయిస్తాను" అన్నారాయన.

"వీలునామా రాయవలసిన అవసరమేముంది? ప్రజలు ఆయన్ని తప్ప మరొకరిని నాయకునిగా ఎన్నుకోరు" అన్నారు హజ్రత్ ఆయిషా (రజి).

ఈమాట విని దైవప్రవక్త (సల్లం) మౌనంగా ఉండిపోయారు. ఆయన ఆరోగ్యం ఇంకా కుదుట పడలేదు. పైగా అది మరింత క్షీణిస్తూ పోతోంది. అందువల్ల మరునాడు ఆయన వీలునామా రాయించడానికి కలం, సిరా, కాగితాలు తెప్పించారు.

అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి)తో పాటు మరికొందరు సహాబీలు (అనుచరులు) కూడా అక్కడ ఉన్నారు. దైవప్రవక్త (సల్లం) పడుకొని బాధపడుతూనే వీలునామా రాయించడానికి ప్రయత్నించారు.

కాని హజ్రత్ ఉమర్ (రజి) "ఈ స్థితిలో దైవప్రవక్త (సల్లం)కు బాధ పెట్టడం మంచిది కాదు. మనకు ఖుర్ఆన్ చాలు" అన్నారు.

"ఆయన అసలు ఏం రాయించ దలచుకున్నారో అడిగితే బాగుంటుంది" అన్నారు మరికొందరు అనుచరులు.

ఈ మాటలు విని దైవప్రవక్త (సల్లం) ఎంతో నొచ్చుకున్నారు. అందువల్ల ఆయన మరేమీ మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయారు.

అప్పుడు కొందరు ముందుకు వచ్చి "దైవప్రవక్తా! ఇంతకూ మీరేమి రాయించ దలచుకున్నారో చెప్పండి" అని అడిగారు.

"మీరంతా బయటికి వెళ్ళండి. నన్నిప్పుడున్న స్థితిలో వదలి వెళ్ళిపొండి" అన్నారు దైవప్రవక్త (సల్లం) విసుగుచెంది.

బాధ కొంచెం తగ్గినట్లు అన్పించగానే ఆయన ముఖ్య అనుచరులను పిలిపించుకొని వారికి పరోపకారం, ప్రజల పట్ల సద్వర్తనం, నమాజ్ ప్రాముఖ్యం మొదలైన విషయాలను గురించి హితోపదేశం చేశారు.



# పరలోక ప్రస్థానం-(158)

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) అర్ధాంగి హజ్రత్ ఆయిషా (రజి) వడిలో శిరస్సు పెట్టి పడుకున్నారు. ఆయన ఆరోగ్యం కాస్త కుదుట పడినట్లు అన్పించడంతో హజ్రత్ అబూబకర్ (రజి) అక్కడ్నుంచి లేచి తమ ఇంటికి వెళ్ళిపోయారు. నిజంగా అప్పుడు దైవప్రవక్త (సల్లం) ముఖం పూర్ణచంద్రుడిలా వెలిగిపోసాగింది.

కాని ఈ చంద్రకాంతి ఎంతోసేపు నిలువ లేదు. చూస్తుండగానే నలువైపుల నుండి కారుమబ్బులు కమ్ముకొచ్చాయి. దైవప్రవక్త (సల్లం) ముఖారవిందం కాంతి విహీనమయి పోయింది. క్షణక్షణానికి శక్తి క్షీణించి పోతోంది.

కాస్సేపటికి ఆయిషా (రజి) సోదరుడు అబ్దుర్రహ్మాన్ (రజి) వచ్చారు. ఆయనచేతిలో మిస్వాక్ (పలుదోము పుల్ల) ఉంది. దైవప్రవక్త (స) దానివైపే తదేకంగా చూడసాగారు.

హజ్రత్ ఆయిషా (రజి) అది గమనించి "మీకు మిస్వాక్ కావాలా?" అని అడిగారు. దానికి ఆయన "ఆ..." అన్నారు హీనస్వరంతో.

అప్పుడామె సోదరుని దగ్గర్నుంచి మిస్వాక్ అడిగి తీసుకున్నారు. దాని కొనను మెత్తగా నమలి దైవప్రవక్త (సల్లం) నోటికి అందించారు. ఆయన మిస్వాక్‌తో కాస్సేపు పళ్ళు తోముకొని తరువాత దాన్ని పక్కన పడేశారు.

శరీరం కాలిపోతోంది. అవయవాలు ఎక్కడికక్కడ బలహీనమైపోయాయి. దైవప్రవక్త (స) పక్కనున్న చన్నీళ్ళపాత్రలో చేయి ముంచి, ఆ తడిచేతిని ముఖం మీద రుద్దుకోవడం ప్రారంభించారు. ఇలా అనేకసార్లు చేశారు. తర్వాత ఆయన దుప్పటిని కాస్సేపు ముఖమ్మీద కప్పుకోవడం, కాస్సేపు తీసివేయడం చేయసాగారు. అలాచేస్తూ-

"దేవా! ప్రాణంతోడే ఈ బాధను సులభతరం చెయ్యి" అన్నారు. ఫాతిమా (రజి) తండ్రి అనుభవిస్తున్న బాధ చూసి తల్లడిల్లిపోయారు.

"అయ్యయ్యో! మా నాన్న ఎంత బాధపడుతున్నారు!!" అంటూ ఆమె తీవ్రమైన ఆందోళన, ఆవేదన వెలిబుచ్చారు.

"ఫాతిమా! బాధపడకమ్మా! ఈరోజు తరువాత మీ నాన్నకు ఇక ఎన్నటికీ ఎలాంటి బాధ ఉండదు" అన్నారు దైవప్రవక్త (సల్లం) కూతుర్ని ఓదార్చుతూ.

మధ్యాహ్నం దాటింది. దైవప్రవక్త (సల్లం) పరిస్థితి మరింత విషమించింది. ఆయాసం ఎక్కువయింది. ఊపిరి పీల్చుకోవడం కష్టమైపోయింది. పెదవులు మెల్లిగా కదిలాయి:

"నమాజ్, నమాజ్.... బానిసలతో మంచిగా వ్యవహరించండి."

ఆ తరువాత ఆయన చేయి పైకి లేచింది. చూపుడువ్రేలితో సైగచేస్తూ-

"ఆ మహామిత్రుడు తప్ప ఇప్పుడిక ఎవరూలేరు" అన్నారు.

దైవప్రవక్త (సల్లం) నోట ఈ అమృత పలుకులు వెలువడిన మరుక్షణమే ఆయన చేయి వ్రేలాడిపోయింది. కనుగుడ్లు అలాగే నిలిచి పోయాయి. శరీరం చల్లబడిపోయింది.

అశాశ్వతమైన మట్టిముద్దలో అరవయి మూడేండ్లు కాపురముండిన ఓ దివ్యతేజం నేడు దైవ సన్నిధికేగింది. (ఇన్నాలిల్లాహి వఇన్నా ఇలైహి రాజివూన్.)

దాంతో అనుచరుల గుండెలు పగిలిపోయాయి. మొత్తం ప్రపంచమే వారికి అంధకార మయినట్లు అనిపించింది. ఈ విషాదవార్త విన్న ప్రతి ముస్లిం ఎక్కడ నిల్చున్న వాడక్కడ నోరు తెరచి కొయ్యబారిపోయాడు.

హిజ్రీశకం 11వ సంవత్సరం, రబీవుల్ అవ్వల్ మాసం 12వ తేది, సోమవారం విశ్వ కారుణ్యమూర్తి (స) యావత్తు ముస్లింజగత్తును శోకసముద్రంలో ముంచిపోయారు.

"ఏమిటీ! దైవప్రవక్త (సల్లం) దివంగతులయ్యారా!! నిజమా!!!" కొంతమంది ఆశ్చర్యపోయారు.

"ఎలా చనిపోయారు? నిన్ననే కదా నేను ఆయన్ని చూశాను! ఆయన అమృత పలుకులు ఇప్పటికీ నా చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయే!! ఇంతలోనే ఈ విషాదవార్త...?"

మరికొంతమంది ఆశ్చర్యంతోపాటు అనుమానంలో పడిపోయారు.

"ఏమిటి, దైవప్రవక్త (సల్లం) నిజంగా చనిపోయారా!?"

ఇంకా కొందరయితే ఈ వార్తను ఓ పట్టాన నమ్మలేక పోయారు.

"అదెలా సాధ్యం? ఆయన దైవప్రవక్త, దైవశక్తికి ప్రతిరూపం. ఆయన యావత్తు ప్రపంచాన్ని కదిలించారు. మానవాళి ఇదివరకు ఎరగని అద్భుతమైన విప్లవాన్ని లేవదీసిన అసాధారణ శక్తిస్వరూపుడు. అలాంటి మహనీయునికి మరణమా!"

"ఆయన మానవాళిని అజ్ఞానాంధకారం నుండి తీసి రుజుమార్గాన వేసిన మహోన్నత మార్గదర్శి. అలాంటి మహనీయునికి కాలం చెల్లడమంటే దివ్యావిష్కృతి (వహీ) ఆగిపోయి నట్లే. ముహమ్మద్ (సల్లం) అంతిమ దైవప్రవక్త అయినప్పుడు దివ్యావిష్కృతి ఎలా ఆగి పోతుంది? ఈ వార్త నమ్మశక్యం కాకుండా ఉంది" అన్నారు మరికొందరు.

ఏమైనప్పటికి దైవప్రవక్త ముహమ్ముద్ (స) ఇకలేరు. ఆయన ఆత్మ ఎప్పుడో దివ్య లోకానికి చేరుకుంది. ఈవార్త విన్న అనేకమంది ప్రజలు గుండెలు బాదుకున్నారు.

హజ్రత్ ఉమర్ (రజి) ఈ వార్త వినగానే ఆయనకు కాళ్ళ క్రింద భూమి బ్రద్దలైనట్లు అన్పించింది. ఒక్కసారి నిలువునా కంపించిపోయారు. అయితే ఆయన కూడా ఈ విషయాన్ని ఓ పట్టాన నమ్మలేకపోయారు. పరుగువేగంతో హజ్రత్ ఆయిషా (రజి) ఇంటికి పోయారు. అక్కడ జనం శోకమూర్తులయి కన్పించారు.

ఉమర్ (రజి) లోపలికి ప్రవేశించిచూస్తే ప్రవక్త (స) భౌతికకాయంపై వస్త్రం కప్పబడి ఉంది. ఆయన దైవప్రవక్త (స) ముఖం మీది వస్త్రం తొలగించి చూశారు. ఆ ముఖం ఎలాంటి మార్పులేకుండా ఎప్పటిలాగానే విప్పారిన పువ్వులా ఉంది. బహుశా వ్యాధి తీవ్రత వల్ల స్పృహతప్పి ఉంటారని, కాస్సేపటికి స్పృహ రావచ్చని భావించారు ఆయన అయోమయంగా చూస్తూ.



ఆ తరువాత ఆయన మసీదుకు వెళ్ళారు. అక్కడ కూడా విషాద ఛాయలు అలుము కొని ఉన్నాయి. మసీదు ఏడ్పులు, ఎక్కిళ్ళతో ప్రతిధ్వనిస్తోంది. ప్రవక్త అనుచరులు తమ ప్రియతమ నాయకుణ్ణి తలచుకొని కన్నీరు మున్నీరుగా దుఃఖిస్తున్నారు. ఈరోజు ఈ అనాథల్ని ఓదార్చేవారు, ఓదార్చగలవారు ఒక్క అల్లాహ్ తప్ప మరెవరూ లేరు. దైవప్రవక్త (సల్లం) మరణం వారి గుండెల్ని పిండివేస్తోంది.

హజ్రత్ ఉమర్ (రజి) వర నుంచి ఖడ్గం లాగి "ఖబర్దార్! ఎవరైనా దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) చనిపోయారని అంటే అతని తల ఎగిరిపోతుంది" అన్నారు కోపోద్రేకాలతో అటూ ఇటూ తిరుగుతూ.

తరువాత ఆయన అదే పరిస్థితిలో ఖడ్గం చేతపట్టుకొని మసీదులోకి ప్రవేశించారు. మసీదులో జనం కన్నీరు మున్నీరుగా దుఃఖిస్తున్నారు.

"ప్రజలారా! కొంతమంది దైవప్రవక్త (సల్లం) చనిపోయారని చెబుతున్నారు. లేదు, లేదు. ఆయన చనిపోలేదు, స్పృహ తప్పారు. కాస్సేపటికి స్పృహలోకి రావచ్చు. మూసా ప్రవక్త (అలైహి)లా ముహమ్మద్ ప్రవక్త (సల్లం) కూడా నలభై రోజుల పాటు అదృశ్యమయి ఉంటారు. ఆ తరువాత తిరిగొస్తారు......" అంటూ హజ్రత్ ఉమర్ (రజి) వేదిక ఎక్కి ఉపన్యాసం మొదలెట్టారు.

ఈ విషాదవార్త హజ్రత్ అబూబకర్ (రజి) చెవిన పడగానే క్షణంపాటు ఆయన నోట మాట పెగల్లేదు. ఆ తరువాత కాస్త తేరుకొని ఆయన ఆదరాబాదరాగా హజ్రత్ ఆయిషా (రజి) ఇంటికి పరుగెత్తారు.

అప్పటికే అక్కడ వేలాదిమంది ప్రజలు గుంపులు గుంపులుగా గుమిగూడారు. వారి కళ్లు కుండపోతలా కన్నీళ్ళు వర్షిస్తున్నాయి. హజ్రత్ అబూబకర్ (రజి) లోపలికి ప్రవేశించడానికి అనుమతి అడిగారు.

"ఈరోజు అందరికీ అనుమతి ఉంది. ఏ ఒక్కరూ ప్రత్యేక అనుమతి తీసుకోవాల్సిన అవసరంలేదు" లోపలి నుండి సమాధానం వచ్చింది.

హజ్రత్ అబూబకర్ (రజి) మౌనంగా లోపలికి వెళ్ళారు. దుప్పటి తొలగించి దైవప్రవక్త (సల్లం) ముఖపద్మాన్ని తనివితీరా దర్శించారు. కళ్ళ నుండి అశృధారలు కారుతుండగా ఆయన దైవసందేశహరుని (స) నుదుటిపై ముద్దాడారు.

"దైవప్రవక్తా! జీవించి ఉన్నప్పుడు కూడా మీరు బాగున్నారు. మరణించిన తరువాత కూడా మీరు బాగుంటారు. నిస్సందేహంగా ఇది మీ కోసం దైవం లిఖించిన మరణం తప్ప మరేమీ కాదు. దీని తరువాత మీకు మరెన్నటికీ మరణం సంభవించదు" అన్నారు ఆయన పొంగివస్తున్న దుఃఖాన్ని బలవంతంగా దిగమింగుతూ.

దైవప్రవక్త (సల్లం) సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ఇల్లు విషాదనిలయమయి పోయింది. దైవప్రవక్త (సల్లం) భౌతికకాయం పడక మీద చలనరహితంగా పడిఉంది. హజ్రత్ అబూబకర్ (రజి) కన్నీటితో దైవప్రవక్త (సల్లం)కు శ్రద్ధాంజలి ఘటించారు. ఆ తరువాత ఆయన బయటికొచ్చి మసీదుకు వెళ్ళారు.

మసీదులో ప్రవక్త అనుచరులు తమ ప్రియతమ నాయకుడ్ని తలచుకొని ఇంకా కన్నీరుమున్నీరుగా దుఃఖిస్తూనే ఉన్నారు. హజ్రత్ ఉమర్ (రజి) మాత్రం దైవప్రవక్త (సల్లం) బ్రతికే ఉన్నారని చెబుతూ ఇంకా ప్రసంగిస్తూనే ఉన్నారు.

"ఉమర్! కాస్త ఆగు. నన్ను మాట్లాడ నివ్వు" అన్నారు హజ్రత్ అబూబకర్ (రజి).

కాని హజ్రత్ ఉమర్ (రజి) ఆయన మాటలు పట్టించుకోకుండా ఉద్రేకంతో తన ప్రసంగాన్ని కొనసాగిస్తున్నారు.

హజ్రత్ అబూబకర్ (రజి) ఆయన్ని ఈ పరిస్థితిలో ఆపడం కష్టమని భావించి నిల బడిన చోటు నుంచే సోదరులారా! అని సంబోధిస్తూ మాట్లాడటం ప్రారంభించారు. హజ్రత్ అబూబకర్ (రజి) సంబోధనా పలుకులు వినగానే జనమంతా ఒక్కసారిగా ఆయన వైపు దృష్టి మళ్ళించారు. దాంతో హజ్రత్ ఉమర్ (రజి) తన ప్రసంగాన్ని ఆపేయక తప్ప లేదు. హజ్రత్ అబూబకర్ (రజి) కట్టలు తెంచుకొని వస్తున్న దుఃఖాన్ని బలవంతంగా దిగమింగి ఎంతో నిబ్బరంగా ఇలా ప్రసంగించారు:

"సోదరులారా! వినండి. ఒకవేళ ఎవరైనా ముహమ్మద్ (సల్లం)ని ఆరాధిస్తుంటే ముహమ్మద్ (స) ఇహలోకం వీడిపోయారని తెలుసుకోవాలి. అల్లాహ్‌ని మాత్రమే ఆరాధించే వారికి అల్లాహ్ సజీవంగా ఉన్నసంగతి తెలిసిందే. నిత్యజీవుడు అల్లాహ్ మాత్రమే. ఆయనకు మరణమన్నదే లేదు. ఆయన మనకు ఇదివరకే దైవప్రవక్తను గురించి ఇలా వివరించాడు:

"ముహమ్మద్ (మానవమాత్రుడయిన) దైవప్రవక్త మాత్రమే. అతనికి పూర్వం కూడా అనేకమంది దైవప్రవక్తలు వచ్చిపోయారు. మరి ఇతనిప్పుడు చనిపోతే లేక చంపబడితే మీరు (ధర్మపథం నుండి) వెనుదిరిగి పోతారా? గుర్తుంచుకోండి. అలా వెనుదిరిగి పోయేవాడు దేవునికి ఎలాంటి నష్టం కలిగించలేడు. దేవుడు తనకు కృతజ్ఞత చూపేవారికే తగిన బహుమానం ప్రసాదిస్తాడు" (ఖుర్‌ఆన్-3:144)

"(ముహమ్మద్!) నిస్సందేహంగా నీవూ చావవలసిందే, వారు చావవలసిందే...." "ఆయన (అల్లాహ్) తప్ప ప్రతి వస్తువూ అంతమయ్యేదే. సార్వభౌమాధికారం ఆయనకే ఉంది. ఆయన వైపుకే మీరంతా మరలిపోవలసి ఉంది..." (ఖుర్‌ఆన్)

"నా ప్రియ సోదరులారా! దైవప్రవక్త (సల్లం) దైవధర్మాన్ని స్థాపించారు. దైవమార్గంలో తన శక్తిసామర్థ్యాలన్నీ ధారపోసి దైవసందేశాన్ని నలుమూలలా వ్యాపింపజేశారు. అప్పటి దాకా ఆయన్ని దేవుడు సజీవంగా ఉంచాడు.

"దైవప్రవక్త (స) మనకు రుజుమార్గం చూపించారు. అజ్ఞానాంధకారం పటాపంచలు చేసి జ్ఞానజ్యోతి ప్రసాదించారు. ఇలాంటి పరిస్థితిలో ఎవరయితే దైవధర్మాన్ని విడనాడి దుర్మార్గంలో పడిపోతారో వారే దానికి బాధ్యులవుతారు.

"ఎవరైతే అల్లాహ్‌ను తమ ప్రభువని భావిస్తున్నారో వారు అల్లాహ్ నిత్యజీవుడని, ఆయనకు అంతంలేదని గ్రహించాలి. మరెవరు ముహమ్మద్ (స)కు పూజారులై, ఆయన్ని దేవుడని తలుస్తున్నారో వారు తమ దైవాన్ని మృత్యువు కబళించిందని తెలుసుకోవాలి.



"సోదరులారా! దేవునికి భయపడండి. ఆయన్నే నమ్ముకోండి. ఆయన ధర్మాన్ని ఎవరూ తుడిచిపెట్టలేరు. దైవధర్మానికి సహాయపడుతూ, దాని వృద్ధివికాసాల కోసం పోరాడేవారికి దేవుడు తప్పకుండా సహాయం చేస్తాడు.

"దైవగ్రంథం మన మధ్య ఉంది. అదే మన పాలిట జ్యోతిర్మండలం. మన కోసం దేవుడు ధర్మసమ్మతం చేసినవి, నిషేధించినవి అన్నీ అందులోనే ఉన్నాయి."

హజ్రత్ అబూబకర్ (రజి) ప్రసంగంతో ముస్లింలకు కాస్తంత ధైర్యం వచ్చింది. దుః ఖంతో క్రుంగిపోయినవారి హృదయాలకు కాస్త ఊరట చేకూరింది. విషాద మేఘాలు మెల్లమెల్లగా విడిపోసాగాయి.

హజ్రత్ అబూబకర్ (రజి) ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తులు పేర్కొన్నప్పుడు అవి ఇప్పుడే అవతరించాయా అన్పించింది ముస్లింలకు. దాంతో వారు పుట్టిన ప్రతిజీవీ గిట్టక తప్పదన్న యదార్థంతో పాటు, దైవప్రవక్త (సల్లం) దివంగతులైనప్పటికీ నిత్యజీవుడయిన దేవుని ఆరాధన మాత్రం నిరంతరం కొనసాగాలన్న వాస్తవాన్ని గ్రహించారు. ఈ భావనే వారికి సహనాన్ని, స్థయిర్యాన్ని ఇచ్చింది.

హజ్రత్ ఉమర్ (రజి) ఈ ప్రసంగం వినగానే కళ్ళుతిరిగి క్రింద పడిపోయారు. తర్వాత వెంటనే స్పృహలోకి వచ్చి "దైవప్రవక్త (సల్లం) దివంగతులయ్యారనడంలో ఇక నాకెలాంటి సందేహం లేదు" అని భావించారు మనసులో.

ఇదిలా ఉండగా మరొక చోట ఓ చిన్న కలకలం బయలుదేరింది. అది చిలికి చిలికి గాలివానలా మారే పరిస్థితి ఏర్పడింది. హజ్రత్ సాద్ బిన్ ఉబాదా (రజి) ఇంటి దగ్గర అన్సార్ ముస్లింలు అనేకమంది గుమిగూడి దైవప్రవక్త (సల్లం)కు వారసుడెవరనే విషయంపై తర్జనభర్జనలు చేయసాగారు. పరిస్థితి విషమిస్తూ ఉండటం గమనించిన ఒక ముహాజిర్ ముస్లిం పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"అబూబకర్! ఉమర్!! పదండి, పదండి. సాద్ బిన్ ఉబాదా (రజి) ఇంటి దగ్గర అన్సారులంతా గుమిగూడి తమలో ఒకడ్ని ఖలీఫాగా ఎన్నుకోబోతున్నారు. త్వరగా పదండి. లేకపోతే పెద్ద ఉపద్రవం వచ్చి పడుతుంది" అన్నాడతను రొప్పుతూ.

తక్షణమే అబూబకర్ (రజి), ఉమర్ (రజి)లు ఆ ప్రదేశానికి పరుగెత్తారు. వారితో పాటు మరికొందరు ముస్లింలు కూడా పరుగెత్తారు.

పోయిచూస్తే అక్కడ అన్సార్‌లు గుమిగూడిఉన్నారు. కొందరు ముహాజిర్‌లు కూడా ఉన్నారు. ఉభయవర్గాల మధ్య విభేదంవచ్చింది కాబోలు, వాగ్వివాదం జోరుగా సాగు తోంది. అబూబకర్ (రజి) వారికి సర్దిచెప్పి ఎలాగో పరిస్థితిని అదుపులో ఉంచగలిగారు.

చివరికి అందరూ ఒక అభిప్రాయానికి వచ్చారు. అందరూ ఏకగ్రీవంగా హజ్రత్ అబూబకర్ (రజి)ని ఖలీఫాగా ఎన్నుకున్నారు. కొన్ని క్షణాల్లో విభేదాలన్నీ తొలగిపోయాయి. పెద్ద ప్రమాదం తప్పిపోయింది. మరుసటి రోజు మసీదులో ప్రజలు హజ్రత్ అబూబకర్ (రజి) చేతిలో చేయివేసి ఆయన్ని తమ ఖలీఫాగా ఆమోదించారు.

ఈపని కాగానే ప్రజల దృష్టి మళ్ళీ దైవప్రవక్త (సల్లం) భౌతికకాయంపై పడింది. అంత్యక్రియల కోసం సన్నాహాలు ప్రారంభించారు. అయితే దైవప్రవక్త (సల్లం) విశ్రాంతి నిలయాన్ని ఎక్కడ స్థాపించాలన్న ప్రశ్న ఉదయించింది.

"దైవప్రవక్త (సల్లం) సమాధిని మసీదులో నిర్మిద్దాం" అన్నారు కొందరు.

"సామాన్య ముస్లింల శ్మశానవాటికలోనే ఆయన భౌతికకాయాన్ని ఖననం చేద్దాం" అన్నారు మరికొందరు.

"అలాకాదు. 'ప్రతి దైవప్రవక్త విశ్రాంతి నిలయం అతని ఆత్మ తీయబడిన చోటే అవుతుంద'ని స్వయంగా మన ప్రియప్రవక్తే చెప్పారు. అంచేత ఈయన భౌతికకాయాన్ని ఇక్కడే ఖననం చేయాలి" అన్నారు హజ్రత్ అబూబకర్ (రజి).

తరువాత హజ్రత్ అలి (రజి), హజ్రత్ ఉసామా (రజి) కలసి దైవప్రవక్త (సల్లం) భౌతికకాయానికి స్నానం చేయించారు. మూడు వస్త్రాల్లో కఫన్ చుట్టబెట్టి వస్త్రసంస్కారం చేశారు. అంతిమ దర్శనం కోసం అందరికీ అవకాశం ఇచ్చారు. జనాజా నమాజ్ ప్రారంభించారు. ఎవరి నేతృత్వం లేకుండానే ఎవరికి వారే జనాజా నమాజ్ చేశారు. స్త్రీలకు, పిల్లలకు కూడా అవకాశం లభించింది.

ఈ విధంగా జనాజా నమాజ్ కోసం దైవప్రవక్త (సల్లం) భౌతికకాయాన్ని రెండురోజుల దాకా ఖననం చేయకుండా ఉంచారు. ఆ తరువాత సమాధిచేశారు. అంతిమ దైవప్రవక్త (సల్లం) అనేకమంది అనుచరులకు దర్శనభాగ్యం కలిగించి అశాశ్వతమైన ఈ ప్రపంచం నుండి శాశ్వతంగా తెరమరుగయ్యారు. అయితే............

ఆ మానవ మహోపకారి (స) చరిత్రలో చిరస్థాయిగా నిలచి తన పవిత్ర జీవిత విశేషాలతో, పరమోన్నత బోధనలతో ప్రజల హృదయాల్లో జ్ఞాన కాంతులు నింపుతున్నారు. తన 63 ఏండ్ల జీవిత కాలంలోని అద్భుతమైన, అసాధారణ ఘట్టాలను ప్రపంచమానవాళి ముందుంచి, ఈ లోకంలో మానవుడు ఎండాకాలంలో ప్రయాణంచేస్తూ ప్రయాణ బడలిక తీర్చుకోవడానికి మార్గమధ్యలో చెట్లనీడన కూర్చుంటూ ప్రయాణం సాగించే బాటసారి లాంటి వాడని ఆయన స్పష్టం చేశారు.

ఆ మహనీయుని (సల్లం) జీవితం యావత్ మానవాళికే ఆదర్శవంతమైన, ఆచరణ యుక్తమైన జీవితం. కనుక సృష్టికర్త ఆయన జీవితవిశేషాలను 1400 ఏండ్లు గడచినా ఎలాంటి మార్పులు, చేర్పులు లేకుండా పకడ్బందీగా హదీస్ రూపంలో నేటికీ సురక్షితంగా ఉంచాడు. వాటిని అనుసరించినవారే నిజానికి ధన్యజీవులు, దేవునికి ప్రీతిపాత్రులు.

**(సమాప్తం)**

సల్లల్లాహు
అలైహివసల్లం



# ఆ జీవితమే అందరికీ ఆదర్శనీయం-159

సాధారణంగా ప్రజలు ఒక్కొక్క విషయంలో ఒక్కొక్క వ్యక్తిని ఆదర్శంగా తీసుకుంటారు. కాని సమస్త విషయాల్లో, సకల రంగాల్లో ఆదర్శంగా తీసుకోవడానికి యోగ్యుడైన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే ఆయన అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) మాత్రమే. అందుకే ముహమ్మద్ (సల్లం) అనుయాయులయిన ముస్లింలు ఆ మహనీయుని పవిత్ర జీవనానికి సంబంధించిన ప్రతి అంశాన్ని, ఆయన నడవడికను, గుణగణాలను, చివరికి ఆయన అలవాట్లను, రూపురేఖలను సైతం తెలుసుకోవడానికి ఎంతగానో తహతహ లాడుతారు.

మహాప్రవక్త ముహమ్మద్ (స)కు దేవుడు ఆత్మ సౌందర్యమే కాదు, దేహ సౌందర్యం కూడా ప్రసాదించాడు. "దైవప్రవక్త లాంటి అందమైన మనిషిని నేను ఆయనకు ముందు గాని, ఆ తర్వాతగాని చూడలేద"ని హజ్రత్ అలి (రజి) ఒక సందర్భంలో అన్నారు. దైవప్రవక్త (స) రూపురేఖల్ని గురించిన విషయాలు హదీస్ గ్రంథాల్లో వివరంగా ఉన్నాయి.

దైవప్రవక్త (సల్లం) మరీఅంత పొడుగూ కాదు, పొట్టీకాదు. మధ్యరకమైన ఎత్తు కలిగి ఉండేవారు. ఆయన శరీర సౌష్ఠవంలో ఓ ప్రత్యేక ఠీవి ఉట్టిపడుతుంటుంది. తెలుపు, ఎరుపు రంగులు కలసివున్న ఆయన శరీరచ్ఛాయ పసిడికాంతులు వెదజల్లుతుంది. శిరోజాలు వంకీలు తిరిగి ఉంటాయి. ఎత్తయిన ఫాలఫలకం, ఎడంగా ఉండే సన్నటి కనుబొమలు, నల్లటి కళ్ళు, కోటేరులాంటి చక్కని ముక్కు, గుబురయిన గడ్డం ఆయన కోల ముఖానికి నిండుదనం ఇచ్చాయి. పళ్ళు చిన్నవిగా, తెల్లగా మిలమిల మెరుస్తుంటాయి. మాట్లాడేటప్పుడు ముందుభాగం పళ్ళ నుంచి తళుక్కున కాంతికిరణం వెలువడినట్లు అన్పిస్తుంది.

అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) పొడవయిన మెడతో, బలమైన బాహువులతో ఠీవిగా, గంభీరంగా కన్పిస్తారు. ఆయన వక్షస్థలం విశాలంగా ఉంటుంది. దాని మధ్య సన్నటి వెంట్రుకల వరుస కూడా ఉండేది. రెండు భుజాల మధ్య మెడ క్రింది భాగంలో పావురాయి గ్రుడ్డంత పరిమాణంలో శరీరం ఉబికి ఉంటుంది. అది ఎర్రగా ఉంటుంది. దాని మీద బంగారువన్నె కలిగిన వెంట్రుకలు కూడా ఉంటాయి. దీన్ని "ముహరె నబువ్వత్" (దైవదౌత్య చిహ్నం) అంటారు.

దైవప్రవక్త (సల్లం)కు తల వెంట్రుకలు పెంచటం అంటే ఎంతో ఇష్టం. సాధారణంగా ఆయన శిరోజాలు చెవుల క్రిందిదాకా ఉంటాయి. అయితే ఒక్కొక్కసారి కాస్త పైకి, మరొక్కసారి భుజాలదాకా ఉండేలా కూడా పెంచడం జరిగింది. ప్రతిరోజూ తలకు నూనె రాసుకుని దువ్వుకునేవారు. ఆయన మొదట్లో పాపట తీసేవారు కాదు. కాని చివరిరోజుల్లో పాపట కూడా తీసి తల దువ్వుకునేవారు. జీవితపు చివరిదశలో ఆయన శిరోజాలు కొంచెం తెల్లబడ సాగాయి. అయితే ఆయన ఏనాడూ తలకు రంగు వేసుకోలేదు. కాకపోతే గోరింటాకు, పువ్వులనూనె వల్ల వచ్చే రంగుల్ని మాత్రం ఆయన ఇష్టపడేవారు.

దైవప్రవక్త (సల్లం) తరచుగా కళ్ళకు సుర్మా పెట్టుకునేవారు. పళ్ళ పరిశుభ్రత కోసం మిస్వాక్ (పలుదోము పుల్ల)ను తప్పకుండా ఉపయోగించేవారు. శరీర శుభ్రత, సువాసనలు అంటే ఆయనకు ఎంతో ఇష్టం. అందువల్ల ఆయన ఎల్లప్పుడూ ఉజూతో ఉండేవారు. మూత్రవిసర్జన తరువాత ఇస్తింజా (నీటితో శుభ్రం) చేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పేవారు.

అత్తరు, సుగంధ పరిమళాలు ఎక్కువగా ఉపయోగించేవారు. సువాసన వస్తువుల్ని ఎవరైనా పారితోషికంగా ఇస్తే వాటిని తిరస్కరించకూడదని ఆయన చెప్పేవారు.

దైవప్రవక్త (సల్లం) పరిసరాల పారిశుద్ధ్యం పట్ల కూడా ఎంతో ఆసక్తి కనబరిచేవారు. మస్జిద్ గోడలమీద ఏవైనా మరకలుంటే వాటిని గీకి శుభ్రం చేసేవారు. అప్పటికీ గోడలపై ఏదైన దుర్వాసన ఉండిపోతే సువాసన పూసేవారు. శుక్రవారం ప్రత్యేకంగా మసీదుల్లో అగర్‌వత్తులు వాడవలసిందిగా ఆయన తన అనుచరులకు తాకీదుచేశారు.

దైవప్రవక్త (స) వస్త్రధారణ చాలా నిరాడంబరంగా ఉంటుంది. ఆయన సాధారణంగా చొక్కా, లుంగీ, ఉత్తరీయం ధరిస్తారు. ఆయనకు తెల్లబట్టలంటే ఎక్కువ ఇష్టం. తెలుపు తరువాత పచ్చరంగు వస్త్రాలకు ప్రాధాన్యం ఇస్తారు. ఎరుపురంగు బట్టలు ఆయనకు నచ్చేవి కావు. లుంగీ చీలమండలకు పైకి ఉంటుంది. చీలమండలకు పైభాగాన ఉండేలా కట్టుకోవడం వల్ల బట్టకు దుమ్ము, ధూళి వగైరా మలినాలు అంటకుండా ఉంటాయని, పైగా మనిషిలో అహంకారం కూడా జనించదని దైవప్రవక్త (సల్లం) చెప్పారు.

ఆయన తలకు టోపీ పెట్టుకొని దానిపై పాగా చుట్టుకుంటారు. ఈ తలపాగా నలుపు రంగుదై ఉంటుంది. దాని కొనభాగం మెడనుంచి నడుందాకా వ్రేలాడి ఉంటుంది. సాధారణంగా ఆయన సాదా దుస్తులే ధరిస్తారు. ఓసారి మాత్రం రోమ్‌లో తయారైన ఖరీదైన చొక్కా ధరించారు. పురుషులు పట్టువస్త్రాలు ధరించడాన్ని ఆయన నిషేధించారు. అలాగే శరీరచ్ఛాయను బహిర్గతం చేసే సన్నటి, పల్చటి దుస్తుల్ని కూడా నిషేధించారు. ఇలాంటి ఉల్లిపొరలను పోలిన దుస్తులు స్త్రీలు అసలు ధరించకూడదని ఆయన గట్టిగా తాకీదు చేశారు.

పురుషులు బంగారు ఆభరణాలు ధరించడాన్ని కూడా దైవప్రవక్త (సల్లం) నిషేధించారు. అయితే వెండి నగలు వాడటంలో మాత్రం తప్పులేదని అన్నారు. ఆయన తన కుడిచేతి వ్రేలికి ఎల్లప్పుడూ ఒక వెండి ఉంగరం ధరించేవారు. దాని మీద "ముహమ్మద్ రసూలుల్లాహ్" అనే అక్షరాలు ఉండేవి. దీన్ని ఉత్తరాలు, దస్తావేజులపై స్టాంపు (ముద్ర)గా ఉపయోగించేవారు.

దైవప్రవక్త (సల్లం) రెండు వారులుండే చెప్పులు తొడుక్కునేవారు. ఆయన చెప్పులు తొడుక్కున్నా, బట్టలు ధరించినా ఆ పనిని కుడి వైపు నుంచి ప్రారంభించేవారు. ఆయన నడకలో ఓ ప్రత్యేకత ఉండేది. కాస్త ముందుకు వంగి అడుగులు వేస్తూ వేగంగా నడుస్తారు. చూసేవారికి ఆయన మెరక నుంచి పల్లం వైపుకు నడుస్తున్నట్లు అన్పిస్తుంది.

దైవప్రవక్త (సల్లం) పరుపు చాలా విచిత్రంగా ఉండేది. పరుపు అనగానే సాధారణంగా మనకు మెత్తటి దూదితోనో, స్పాంజితోనో తయారుచేసిన బెడ్ గుర్తుకు వస్తుంది. కాని దైవప్రవక్త (సల్లం) పరుపు ఒక గోనెపట్టా మాత్రమే. ఒకటి, రెండుసార్లు మాత్రం ఖర్జూరపు ఆకులతో నింపిన చర్మపు పరుపును వాడారు.

ఓరోజు ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) మెత్తగా ఉండేందుకు గోనెపట్టాను మడతవేసి పరిచారు. కాని ఆరోజు రాత్రి దైవప్రవక్త (సల్లం)కు మామూలుకన్నా ఎక్కువ నిద్ర పట్టింది. దాంతో ఆరోజు తహజ్జుద్ నమాజ్ (అర్ధరాత్రి ప్రార్థన) చేయలేక పోయారు. అప్పటి నుంచి ఆయన మెత్తటి పరుపులంటే ఇష్టపడేవారు కాదు. ఇదీ అంతిమ దైవప్రవక్త అయిన ముహమ్మద్ మహనీయుని (సల్లం) నిరాడంబర జీవితం.



# అనుక్రమణి


| | | |
|---|---|---|
| 1. | మూల విరాట్టు | 05 |
| 2. | మదీనా నుండి మక్కాకు | 07 |
| 3. | జమ్‌జమ్ జలనిధి | 09 |
| 4. | బలి దానం | 12 |
| 5. | ఆనంద కుసుమాలు | 17 |
| 6. | గజరాజు గారడి | 19 |
| 7. | శుభోదయం | 24 |
| 8. | విషాద సాగరం | 27 |
| 9. | హలీమా ఇంట శుభాల పంట | 31 |
| 10. | శస్త్రచికిత్సతో చిత్తశుద్ధి | 35 |
| 11. | అమ్మ కూడా పోయిందా! | 36 |
| 12. | తాతయ్యా! చివరికి నువ్వు కూడా.... | 40 |
| 13. | మండుటెండలో కుండపోత వర్షం | 42 |
| 14. | మేకలకాపరికి తీరికలేని చింతన | 43 |
| 15. | వింత ప్రవర్తన, విచిత్ర మాటలు | 46 |
| 16. | విదేశీ పర్యటనలో వింతానుభవాలు | 47 |
| 17. | ఫుజ్జార్‌లో పడగ విప్పిన ప్రతీకారం | 51 |
| 18. | రక్షణ ఒప్పందం (హిల్ఫుల్ ఫుజూల్) | 54 |
| 19. | ఉకాజ్ మార్కెట్‌లో నిజాయితీ పరిమళం | 58 |
| 20. | సిరియా పర్యటన...శ్రీమంతురాలితో వివాహం | 61 |
| 21. | కుమారుడిగా మారిన బానిసబాలుడు | 66 |
| 22. | అందరికీ ఆమోదయోగ్యమైన అమీన్ తీర్పు | 68 |
| 23. | కరువు కాలంలో కుటుంబం | 72 |
| 24. | మిథ్యాదైవాలకు దుశ్శకునం | 73 |
| 25. | తొలి దివ్యావిష్కృతి | 78 |
| 26. | దౌత్యభారంతో దైవప్రవక్త (సల్లం) | 81 |
| 27. | ముహమ్మద్ (సల్లం) ముందు బైబిల్ | 83 |
| 28. | ప్రప్రథమ విశ్వాసులు | 85 |
| 29. | బంధువర్గంలో ప్రచారభేరి | 90 |

30. సఫాకొండ పైనుండి ప్రవక్త పిలుపు 095
31. అవిశ్వాసుల ఆగడాలు 097
32. దైవమార్గంలో తొలి ప్రాణత్యాగం 101
33. ఉత్‌బా ప్రతిపాదన 103
34. భయ ప్రలోభాలు 107
35. అవిశ్వాసుల అల్టిమేటం 111
36. పురి విప్పిన పౌరుషం 113
37. బంధువులు కాదు, రాబందులు 115
38. విశ్వాసులపై విరుచుకుపడిన కష్టాలు 119
39. అబిసీనియాకు వలస (హిజ్రత్) 122
40. క్రైస్తవుల ఇస్లాం స్వీకరణ 127
41. హమ్జా ఇస్లాం వడిలో 128
42. స్నేహితుడయిన శత్రువు 131
43. కటిక చీకటిలో మూడు మానవాకారాలు 136
44. నజ్ర్ బిన్ హారిస్ అకృత్యాలు 138
45. యాత్రికుల్లో దుష్ప్రచారం, చంద్రఖండన 140
46. సంఘ బహిష్కరణ 143
47. అనంత తీరాలకు ఆప్తులు 146
48. హద్దుమీరిన దౌర్జన్యాలు 149
49. సౌదా, ఆయిషా (రజి)లతో వివాహం 151
50. తాయిఫ్ పర్యటన, జిన్నుల విశ్వాసం 152
51. ముత్యిమ్ రక్షణలో ప్రవక్త పునరాగమనం 156
52. అంతరిక్షంలో అద్భుత విహారం 158
53. పరమపద సోపానం 161
54. విశ్వాసులకు విశ్వప్రభువు కానుక 164
55. వివాదంలో పడేసిన వింత ప్రయాణం 166
56. మదీనావాసుల ఇస్లాం స్వీకరణ 172
57. జిమాద్ ఇస్లాం స్వీకరణ 177
58. తుఫైల్ దౌసీ పరివర్తన 181
59. ఔస్, ఖజ్రజ్ తెగల మధ్య చిచ్చు 183



60. మొదటి అఖ్బా శపథం 185
61. మదీనాలో ముస్అబ్ (రజి) ప్రచారం 188
62. రెండవ అఖ్బా శపథం 190
63. అబూసల్మా (రజి) వలస 194
64. హత్యా ప్రయత్నం 196
65. ప్రవక్త కోసం గాలింపు 201
66. సౌర్ గుహలో మూడు రోజులు 205
67. సురాఖా బిన్ మాలిక్ యత్నం 206
68. మదీనా దిశగా మహాప్రవక్త ప్రయాణం 208
69. అలి, సుహైబ్ (రజి)ల ఆర్భాటం 212
70. తుబ్బవుల్ హుమైరీ దండయాత్ర 214
71. మదీనాలో మీలాద్ వేడుకలు 217
72. మదీనా నగర ప్రవేశం 220
73. అయ్యూబ్ (రజి) ఆతిథ్యం 223
74. అపూర్వ సోదరీకరణ 226
75. జాత్యహంకారంతో సత్యతిరస్కారం 228
76. యూదుల ఆగడాలు 232
77. రాళ్ళకుప్పలో రత్నం 235
78. కిరీటం కోల్పోయిన కపటి 240
79. అనుచరులకు అసాధారణ శిక్షణ 243
80. ఆత్మరక్షణ దాడులు 246
81. ఆరాధనా దిశ (ఖిబ్లా) మార్పు 251
82. సాయుధ ప్రతిఘటన 254
83. సత్యాసత్యాల మధ్య సంకుల సమరం 259
84. సమరసొత్తు, ఖైదీల సమస్య 269
85. ప్రవక్త కుమార్తె జైనబ్ (రజి) వలస 274
86. వితంతు ఆదరణ 276
87. పరాజయ పరాభవం 279
88. యూదుల జాత్యహంకారం 282
89. బనీఖైనుఖా యూదుల బహిష్కరణ 285

90. మదీనాలో రెడ్ అలర్ట్ 288
91. ఉహద్ కొండల్లో యుద్ధజ్వాలలు 294
92. అపజయంగా మారిన విజయం 297
93. అమర వీరులు 304
94. ప్రవక్త క్షేమమే ఆ పడతి ఆకాంక్ష 307
95. పునర్విజృంభణ 309
96. అంతర్గత శత్రువులు 311
97. చెదురు మదురు సైనిక చర్యలు 313
98. మోసపోయిన ముస్లిం బోధకులు 315
99. మరో ప్రమాదంలో బోధకులు 319
100. బనీనజీర్ యూదుల బహిష్కరణ 320
101. రెండవ బదర్ యుద్ధం....? 326
102. వైరాగ్యం, మద్యం, జూదం 329
103. ఉమ్మెసల్మా, జైనబ్ (రజి)ల వివాహం 331
104. దూమతుల్ జందల్ దండయాత్ర 333
105. గోముఖ వ్యాగ్రం (బనీ ముస్తలిఖ్) 336
106. హజ్రత్ ఆయిషా (రజి)పై అపనిందలా! 342
107. హజ్రత్ జువైరియా (రజి)తో వివాహం 346
108. బహుదైవారాధకులకు యూదుల కుమ్మక్కు 347
109. కందకంలో భవిష్యత్ సంకేతాలు 349
110. యూదుల నమ్మక ద్రోహం 355
111. ధీర వనిత హజ్రత్ సఫియా (రజి) 359
112. అవకాశవాదులు 361
113. అగడ్తలో పడ్డ అవిశ్వాసులు 362
114. దేవుని సహాయం 365
115. బనూఖురైజా యూదుల దుర్గతి 371
116. సుమామా ఇస్లాం స్వీకరణ 375
117. పశుపతి ఐనియా నమ్మక ద్రోహం 376
118. హుదైబియా (హజ్) పయనం 379
119. అవిశ్వాసుల (హజ్)ఆటంకాలు 382





120. రిజ్వాన్ శపథం 388
121. హుదైబియా శాంతి ఒప్పందం 390
122. దివి నుండి దిగిన విజయవార్త 394
123. హుదైబియా ఒడంబడిక పరిణామాలు 397
124. రోమ్ చక్రవర్తికి ఇస్లాం ఆహ్వాన లేఖ 400
125. ఈరాన్, ఈజిప్టు, తదితర రాజులకు లేఖలు 403
126. ఖైబర్ దండయాత్ర 406
127. ఖైబర్ వార్తల పట్ల ఖురైషీయుల ఆత్రం 413
128. ప్రప్రథమ కాబా (ఉమ్రా) యాత్ర 417
129. మక్కాలో తొలి కాబాయాత్ర ప్రభావం 423
130. "మూతా"లో విజయకేతనం 429
131. మదీనాలో మూతా యుద్ధవార్తలు 432
132. ఒప్పందం ఉల్లంఘనతో పశ్చాత్తాపం 435
133. మదీనా దాటిన యుద్ధ రహస్యం 439
134. మక్కా దండయాత్ర 441
135. అబూసుఫ్యాన్ లొంగుబాటు 444
136. సత్యం రాకతో అసత్యం పలాయనం 447
137. సాధారణ క్షమాభిక్ష 451
138. విగ్రహాలు విలపించిన వేళ 453
139. హవాజిన్, సఖీఫ్ తెగల తిరుగుబాటు 459
140. మహిళా ఖైదీలు 462
141. సమరసొత్తులో నవముస్లింల వాటా 463
142. కాబ్ బిన్ జహీర్, ఇక్రమాల ఇస్లాంస్వీకరణ 466
143. అద్దీ బిన్ హాతిం తాయి 468
144. కవితా పోటీలో బనీతమీం తెగవాళ్ళు 471
145. తబూక్ దండయాత్రకు ధనత్యాగం 472
146. కపటుల యుద్ధ సాకులు 475
147. దైవమార్గంలో ప్రతిఅడుగూ పుణ్యకార్యమే 477
148. ప్రవక్త మహిమల పట్ల కపటుల పరిహాసం 480
149. తబూక్‌లో సైనిక కార్యకలాపాలు 482


150. జిరార్ మసీదు ధ్వంసం 484
151. తబూక్ దండయాత్రలో పాల్గొననివారు 485
152. తాయిఫ్ వాసుల ధర్మపరివర్తన 487
153. ప్రప్రథమ హజ్ (కాబా)యాత్ర 493
154. అసత్య ప్రవక్తలు 496
155. నజ్రాన్ క్రైస్తవులతో చర్చలు 499
156. వీడ్కోలు కాబా (హజ్)యాత్ర 503
157. అనారోగ్య పరిస్థితి 507
158. పరలోక ప్రస్థానం 514
159. ఆ జీవితమే అందరికీ ఆదర్శనీయం 520



**ప్రవక్త అనుచరులకు శుభవార్త**

మహాప్రవక్త ముహమ్మద్ (స)ను అభిమానిస్తూ ఆ మహనీయుని అడుగుజాడల్లో నడచుకునే ముస్లింలకు ఆయన చెప్పిన హితోక్తి ఏమిటో తెలుసా? ఆయన ఇలా ప్రవచించారు: "నేను మీదగ్గర రెండు వస్తువులు వదలి పెట్టి పోతున్నాను, ఈ రెండిటిని ధృఢంగా పట్టుకొని ఆచరించేవారు ఎన్నటికీ దారితప్పరు. వాటిలో ఒకటి, దైవగ్రంథం (ఖుర్ఆన్): రెండు, నాప్రవచనాలు, సంప్రదాయాలు (హదీస్)." ఆ హదీసులున్న పుస్తకమే అత్యాధుని కూర్పుతో కూడిన ఈ క్రింది గ్రంథరాజం.

**హదీస్ హితోక్తులు**




**సంక్షిప్తంలో సమగ్ర స్వరూపం**

వివిధ ఉర్దూగ్రంథాల నుండి ఎంపిక చేసి అత్యాధునిక విషయ సూచికతో వెలువడిన గ్రంథం ఇది. లోగడ తెలుగులో వెలువడిన గ్రంథాలలోని దాదాపు హదీసులన్నీ ఇందులో చూడవచ్చు. అంటే విషయ పరిజ్ఞానం రీత్యా సంక్షిప్తంలో సమగ్రం అన్నట్లు వేలాది పేజీలలోని సమాచారమంతా దాదాపు 2125 హదీసులతో కేవలం 624 పేజీలలో, కాంప్యాక్ట్ డిస్క్‌లా ఈ గ్రంథంలో ఇమిడి పోయిందన్న మాట.

రచన : అబుల్ఇర్ఫాన్, పేజీలు: 624, వెల: రూ. 240/-

**ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, సహారా కాంప్లెక్స్, ఫ్లాట్ నెం.106, పత్తర్‌గట్టి, హైదరాబాద్-50002, ఇండియా ✆ 9441515414**




# దైవప్రవక్త(స) దివ్యసూక్తులు

✦ ఆత్మపరిశీలన చేసుకొని మరణానంతర జీవితం కోసం సత్కర్మలు ఆచరించేవాడే బుద్ధిమంతుడు. దానికిబదులు కోర్కెలకు బానిసై దైవానుగ్రహం పట్ల నిరాధారమైన ఆశలు పెంచుకునేవాడు బుద్ధిహీనుడవుతాడు. (తిర్మిజి)

✦ ఏ జాతిలో వ్యభిచారం సర్వసామాన్యమయిపోతుందో ఆ జాతి కరువు కాటకాలకు గురవకుండా ఉండదు. అదేవిధంగా ఏ జాతిలో అవినీతి పెరిగిపోతుందో ఆ జాతి ఎల్లప్పుడూ భయభ్రాంతులకు లోనయి ఉంటుంది. (మిష్కాత్)

✦ దేవుడు మీ రూపురేఖలను, సిరిసంపదలను చూడడు. ఆయన మీ హృదయాన్ని, కర్మలను మాత్రమే చూస్తాడు. (ముస్లిం)

✦ శ్రామికుని వేతనం అతని చెమట ఆరకముందే చెల్లించండి. (ఇబ్నెమాజ)

✦ అక్రమ సంపాదనతో పోషించబడిన శరీరం స్వర్గంలో ప్రవేశించదు. (మిష్కాత్)

✦ ఇహలోకం విశ్వాసికి జైలులాంటిది, అవిశ్వాసికి స్వర్గంలాంటిది. (ముస్లిం)

✦ నీ మనసులో ఎవరి పట్లా దురాలోచనలు లేకుండా రేయింబవళ్ళు గడపగలిగితే అలాంటి జీవితం గడుపు. నా విధానం ఇదే. నా విధానాన్ని ప్రేమించేవాడు నన్ను ప్రేమిస్తున్నట్లే. నన్ను ప్రేమించేవాడు నాతోపాటు స్వర్గంలో ఉంటాడు. (ముస్లిం)

✦ తండ్రి తన సంతానానికి బహూకరించే కానుకలలో శ్రేష్ఠమయిన కానుక మంచి చదువు సంస్కారాలే. (మిష్కాత్)

✦ తాను కడుపునిండా తిని, తన పక్కనుండే పొరుగువాడు పస్తుండటాన్ని సహించేవాడు నిజమైన విశ్వాసి (ముస్లిం) కాలేడు. (మిష్కాత్)

✦ ఎవరైనా ముస్లిమేతర పౌరునిపై దౌర్జన్యం చేసినా లేదా అతని హక్కు కొల్లగొట్టినా లేదా అతనిపై శక్తికి మించిన భారం వేసినా లేదా అతని వస్తువేదైనా బలవంతంగా తీసుకున్నా ప్రళయ దినాన దైవ న్యాయస్థానంలో ఆ ముస్లిమేతరుని తరపున నేను న్యాయవాదిగా నిలబడతాను. (అబూదావూద్)

✦ మల్ల యుద్ధంలో తన ప్రత్యర్థిని చిత్తు చేసేవాడు నిజమయిన పరాక్రమశాలి కాదు. ఆగ్రహం కలిగినప్పుడు నిగ్రహించుకునేవాడే అసలైన పరాక్రమశాలి. (బుఖారి)

✦ నిప్పు కట్టెలను భస్మీపటలం చేసినట్లు అసూయ సత్కార్యాలను స్వాహాచేస్తుంది. అందువల్ల మీరు అసూయా, ఈర్ష్యలకు దూరంగా ఉండండి. (అబూదావూద్)

✦ నీవు అయిదు విషయాలను మరో అయిదు విషయాలకంటే శ్రేష్ఠమయినవని తెలుసుకో. వృద్ధాప్యం రాకముందే యవ్వనం, వ్యాధి రాకముందే ఆరోగ్యం, లేమి దాపురించక ముందే కలిమి, పనుల వత్తిడికి ముందే తీరిక, మృత్యువుకు ముందే జీవితం ఎంతో శ్రేష్ఠమయిన విషయాలు. (మిష్కాత్)

✦ ఎంత చిన్న సత్కార్యాన్నైయినా హీనంగా చూడకు. నీవు నీ సోదరుడ్ని చిరునవ్వుతో పలకరించడం కూడా సత్కార్యమే. నీరు తోడి అతని కడవలో పోయడం కూడా సత్కార్యమే. (తిర్మిజి)